# సమాజశాస్త్రం

## సమాజశాస్త్ర సూత్రాలు

BRAOU

డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2003

# రచయితల బృందం

115073
27-4-05

**సంపాదకులు**

ప్రొఫెసర్. వై.సి.సింహాద్రి

ప్రొఫెసర్.జి.సత్యనారాయణ

**సహసంపాదకుడు**

డా.ఘంటా చక్రపాణి

**రచయితలు**

డా.ఘంటా చక్రపాణి

ప్రొ. ఎస్.భాస్కర్

ప్రొ. పి.కమలా రావు

డా. సి.గణేష్

డా. పుష్పమేరి రాణి

డా. టి. శ్రీనివాస్

ఎ.ఉష

**ముఖచిత్రం**

'చంద్ర'

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115073
Date 27-4-2005
Call No

B R A O U

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
హైదరాబాద్.
ప్రథమ ముద్రణ 2003

డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2002.

(C) అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏభాగం అయినా ఉపయోగించదలచుకొంటే డా.బి.ఆర్ అంబేద్కర్ సార్వాత్రిక విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో భాగం.

ఇతర వివరాలకు:
డైరెక్టర్, అకాడమిక్
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,
జూబిలీహిల్స్, హైదరాబాద్-500 033.

LR No. 616 / Dr. BRAOU / DMP / PTG / F.No. 45 / J.O. : 05 (2004) Date : 28-04-04, Copies : 500

**Printed by : Graphica Art Printers, Shivam Road, Hyderabad.**

# పాఠ్యాంశ పరిచయం

మనం నివసిస్తోన్న సమాజం గురించి విశ్లేషించే శాస్త్రమే సమాజశాస్త్రం. మనం, మనల్ని మలిచే సమూహాలు, సముదాయాలు, సాంఘికనియమాలు, కట్టుబాట్లు, నియంత్రించి దిశా నిర్దేశం చేసే సంస్థలు వ్యవస్థల గురించి సమాజశాస్త్రం వివరిస్తుంది. అందుకే సమాజ శాస్త్రాన్ని పెద్దలు సామాజిక శాస్త్రాలన్నింటికీ 'మాతృక'గా పేర్కొన్నారు. ప్రపంచంలో అనేక దేశాల్లో సమాజశాస్త్రం ఒక అగ్రశ్రేణి శాస్త్రంగా ఎంతో ఆదరణను పొందింది. మన దేశంలో కూడా ఇటీవలి కాలంలో సమాజశాస్త్రం ఒక ప్రధాన అధ్యయనాంశంగా ముందుకు వస్తోంది. దేశంలోని ప్రధాన విశ్వవిద్యాలయాలన్నీ సోషియాలజీని స్నాతకోత్తర స్థాయిలో అందిస్తున్నాయి.

సమాజశాస్త్రానికి ఉన్న ఈ ప్రాధాన్యతను అభివృద్ధి వికాస క్రమంలో విస్తృతమవుతున్న ప్రాముఖ్యతను ఇటీవలి కాలంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల కార్యకలాపాల్లో సమాజశాస్త్ర నిపుణుల పెరుగుతోన్న అవకాశాలను దృష్టిలో వుంచుకుని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వాత్రిక విశ్వవిద్యాలయం స్నాతకోత్తర విద్యాకార్యక్రమాల్లో ఎం.ఎ సోషియాలజీని కూడా చేర్చడం జరిగింది.

ఎం.ఎ సోషియాలజీ విద్యార్థుల కోసం విశ్వవిద్యాలయం అందిస్తోన్న కోర్సుల్లో సమాజశాస్త్రం-సూత్రాలు మొదటిది. ఈ కోర్సులో సమాజశాస్త్ర మౌలికాంశాలను ప్రాథమిక సూత్రాలను పరిచయం చేయడం జరిగింది. అంటే సమాజశాస్త్రం ఏమిటి? అందలి అధ్యయనాంశాలు ఏమిటి, ఏయే వ్యవస్థలు, సంస్థలు, ప్రక్రియలు ఎలా మారుతూ వస్తున్నాయి అనే అంశాలు ఈ కోర్సులో వున్నాయి.

అధ్యయన అంశాలను బట్టి ఈ కోర్సులోని 26 భాగాలను ఏడు ప్రధాన ఖండాలుగా విభజించడం జరిగింది. మొదటి ఖండంలో సమాజశాస్త్ర నిర్వచనాలు, స్వభావం, పరిధితోపాటు ఇతర శాస్త్రాలతో సమాజశాస్త్రానికున్న సంబంధాన్ని చర్చించడం జరిగింది. రెండవ ఖండంలో సమాజశాస్త్ర అధ్యయనంలో ఎదురయ్యే ప్రధాన భావనలు, మూడవ ఖండంలో సామాజికాంశాలను వివరించడం జరిగింది. సామాజిక ప్రక్రియను గురించి నాలుగవ ఖండంలో, సామాజిక నిర్మితి ఐదవ ఖండంలో వుంటుంది. ఆరవ ఖండంలో సామాజిక నిర్మితిలో, మానవసంబంధాల్లో కీలకపాత్ర పోషించే వ్యవస్థలు, సంస్థల వివరణ ఇవ్వడం జరిగింది. ఏడవ ఖండం సామాజిక మార్పును ప్రేరేపించేకారకాలు, కారణాలను విశ్లేషిస్తుంది.

విశ్వవిద్యాలయం ఈ పాఠ్యాంశాలన్నింటినీ సమాజశాస్త్ర బోధనలో అనుభవం వున్న అధ్యాపకులు, సామాజిక కార్యరంగంలో ఉన్న పరిశోధకులతో రూపొందించింది. కోర్సు సమగ్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని భాగాలను వివరంగా ఇచ్చే ప్రయత్నం జరిగింది. సమాజశాస్త్ర మౌలిక అంశాలపట్ల సమగ్ర అవగాహన కలిగించేందుకు ఈ కోర్సు ఉపయోగపడుతుందని విశ్వవిద్యాలయం భావిస్తోంది.

BRAOU

BRAOU

# సమాజశాస్త్రం (ఎం.ఎ)

## కోర్సు - I : సమాజశాస్త్ర సూత్రాలు

## విషయసూచిక


| | | పుటసంఖ్య |
|---|---|---|
| **ఖండం - I** | **సమాజ శాస్త్రం అంటే ఏమిటి?** | **1-20** |
| భాగం-1: | సమాజశాస్త్ర సూత్రాలు | |
| భాగం-2: | సమాజశాస్త్రం- ఇతర సామాజిక శాస్త్రాలతో సంబంధం | |
| **ఖండం - II** | **ప్రధాన భావనలు** | **21-74** |
| భాగం-3 | మానవుడు-సమాజం | |
| భాగం-4 | సామాజిక సమూహాలు | |
| భాగం-5 | సముదాయం, సంఘం, గుంపు | |
| భాగం-6 | అంతస్తు, పాత్ర | |
| **ఖండం - III** | **మౌలికాంశాలు** | **75-116** |
| భాగం-7 | వ్యక్తి - సమాజం | |
| భాగం-8 | అనువంశికత, పరిసరం | |
| భాగం-9 | సంస్కృతి | |
| భాగం-10 | సంస్కృతి: మూర్తిమత్వం | |
| **ఖండం - IV** | **సామాజిక ప్రక్రియ** | **117-152** |
| భాగం-11 | సాంఘికీకరణ-సాధనాలు | |
| భాగం-12 | సాంఘికీకరణ సిద్ధాంతాలు | |
| భాగం-13 | సామాజిక పరస్పర చర్య | |
| **ఖండం - V** | **సామాజిక నిర్మితి** | **153-188** |
| భాగం-14 | సామాజిక నిర్మితి | |
| భాగం-15 | సామాజిక స్తరీకరణ-సామాజిక విభేదీకరణ | |
| భాగం-16 | సామాజిక స్తరీకరణ-ప్రమాణికతలు | |
| **ఖండం - VI** | **సామాజిక సంస్థలు** | **189-280** |
| భాగం-17 | కుటుంబం | |


BRAOU

| | | |
|---|---|---|
| భాగం-18 | వివాహం | |
| భాగం-19 | బంధుత్వం | |
| భాగం-20 | మతం, రాజ్యం | |
| భాగం-21 | విద్య-ఆర్థిక వ్యవస్థ | |
| భాగం-22 | సామాజిక నియంత్రణ | |
| భాగం-23 | సామాజిక నియంత్రణ సాధనోపకరణాలు | |
| **ఖండం - VII** | **సామాజిక మార్పు** | **281-322** |
| భాగం-24 | సామాజిక పరివర్తన | |
| భాగం-25 | సామాజిక పరివర్తన కారకాలు | |
| భాగం-26 | సాంస్కృతిక భిన్నత్వం, సాంస్కృతిక మార్పు, సాంస్కృతిక విలంబన | |

| | |
|---|---|
| **మాదిరి పరీక్షా పత్రం** | **323** |
| **రచయితల వివరాలు** | **325** |

BRAOU

# ఖండం- I

## సమాజశాస్త్రం అంటే ఏమిటి?

సమాజాల అధ్యయనం అత్యంత కీలకమైందే అయినా ఆలస్యంగా ఒక ప్రత్యేకశాఖగా అవతరించింది. సమాజశాస్త్ర ఆవిర్భావానికి అనేక చారిత్రక కారణాలున్నాయి. ఫ్రెంచి విప్లవం, పారిశ్రామిక విప్లవం మొదలుకుని ప్రపంచ యుద్ధాలు, పరిణామాలు, సమాజంలో ఎదురైన సంక్షోభాలు, సమస్యలు సమాజశాస్త్ర ఆవిర్భావానికి దోహదం చేసాయి.

అసలు సమాజశాస్త్రం అంటే ఏమి? శాస్త్ర వికాసంలో సమాజశాస్త్రం ఎలా ఆవిర్భవించింది. ఎలా ఎదిగింది. సమాజశాస్త్రం అధ్యయన విషయం ఏమిటి. ఆశాస్త్ర స్వభావం ఎలా వుంటుంది అనే విషయాలను ఈ భాగం వివరిస్తుంది. అలాగే మొత్తం సామాజిక శాస్త్ర విజ్ఞానంలో సమాజశాస్త్ర ప్రాధాన్యత ఇతర శాస్త్రాలతో సమాజశాస్త్రానికున్న సంబంధాన్ని విశ్లేషిస్తుంది.

ఈ ఖండంలో రెండు భాగాలున్నాయి. అవి:

- సమాజశాస్త్రం: నిర్వచనం, పరిధి
- సమాజశాస్త్రానికి ఇతర సామాజిక శాస్త్రాలతో సంబంధం

BRAOU

BRAOU

# భాగం 1: సమాజశాస్త్రం నిర్వచనం, ఆవిర్భావం, స్వభావం, పరిధి

విషయ క్రమం


1.0 ఉద్దేశాలు

1.1 పరిచయం

1.2 వివిధ శాస్త్రాలతో సామాజికాంశాల ప్రస్తావన

1.3 ఐరోపా సమాజంలో మార్పులు - సామాజశాస్త్ర ఆవిర్భావం

1.3.1 పారిశ్రామిక విప్లవం - సామాజిక మార్పులు

1.3.2 ఫ్రెంచి విప్లవం - సామాజిక మార్పులు

1.4 సమాజశాస్త్రం - నిర్వచనాలు

1.5 సామాజిక స్వభావం

1.5.1 ఇది అనుభవేద్యమైనది

1.5.2 ఇది సిద్ధాంత పరమైనది

1.5.3 ఇది నిష్పాక్షికమైనది

1.5.4 ఇది నైతికమైంది కాదు

1.6 సమాజశాస్త్రపరిధి

1.6.1 సంపూర్ణ ఏకదృష్టితో సమాజ అధ్యయనం

1.6.2 ఇతర సాంఘీకశాస్త్రాల సహకారంతో సమాజ అధ్యయనం

1.7 సమాజశాస్త్రాభివృద్ధి

1.8 సారాంశం

1.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

1.10 చదవదగిన పుస్తకాలు


B R A O U

## 1.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సమాజశాస్త్రాన్ని నిర్వచించగలుగుతారు.
- సమాజశాస్త్ర స్వభావాన్ని తెలుసుకుంటారు.
- సమాజశాస్త్ర పరిధిని వివరించగలుగుతారు.
- సమాజశాస్త్రాభివృద్ధిని గుర్తిస్తారు.

## 1.1 పరిచయం

మానవావిర్భావంతోనే సామాజిక సంబంధాలు ప్రారంభమయ్యాయి. అయితే మానవుడు సంచార జీవితానికి

స్థావరానికి స్థిర నివాసం ఏర్పరచుకోవడంతో సహజీవనం తప్పనిసరి అయింది. మానవ సహజీవనం ద్వారా సమాజం ఆవిర్భవించింది. కేవలం ఆహార సముపార్జనకే సర్వ శక్తులు కేంద్రీకరించాల్సిన రోజులు పోయాయి. సమాజంలో మానవుని కార్యకలాపాలు బహుముఖంగా విస్తరించాయి. మానవుని కార్యకలాపాలను వివిధ కోణాలనుంచి అధ్యయనం చేయడానికి అనేక సాంఘిక శాస్త్రాలు (Social Sciences) ఆవిర్భవించాయి. ఈ సాంఘిక శాస్త్రాలన్నీ మొదట తత్వశాస్త్రం (Philosophy)లో భాగంగా ఉండేవి. మానవ కార్యకలాపాలను వివిధ దృక్పథాలనుంచి అధ్యయనం చేయడానికి వీలుగా ఈ సాంఘిక శాస్త్రాలు చరిత్ర, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం మొదలైన శాస్త్రాలుగా విడిపోయాయి. అయితే మానవుల మధ్య సాంఘిక సంబంధాలే కేంద్రబింధువుగా ఈ శాస్త్రాలన్నీ రూపుదిద్దుకున్నప్పటికీ వీటికున్నది పాక్షిక దృష్టే. ఉదహారణకు చరిత్ర (History) గతించిన కాలంలో మానవుని కార్యకలాపాలను మాత్రమే అధ్యయనం చేస్తుంది. రాజనీతి శాస్త్రం (Political Science) సమాజంలో మానవుని రాజకీయ కార్యకలాపాలను మాత్రమే అధ్యయనం చేస్తుంది. అదేవిధంగా అర్థశాస్త్రం (Economics) మానవుని ఆర్థిక జీవన విధానానికి మాత్రమే ప్రాముఖ్యత ఇస్తుంది. అయితే మానవ సామాజిక జీవనాన్ని సమగ్రంగా అధ్యయనం చేసే శాస్త్రం కరువైంది.

దానికి తోడు మానవ సమాజంలో జరిగే మార్పులు 19వ శతాబ్దంలో చాలా అధికమైనవి. శాస్త్ర విజ్ఞాన రంగంలోనూ, సాంకేతిక రంగంలోనూ అతసంఖ్యాకమైన మార్పులు ఏర్పడ్డాయి. దీనితో మానవుల ఆలోచనా రీతులలో కూడా అనేక మార్పులు వచ్చాయి. అంతేకాకుండా 19వ శతాబ్దంలో అనేక సాంఘిక సమస్యలు, సంస్కరణోద్యమాలు కూడా ఆరంభమయ్యాయి. పెరుగుతున్న మానవుల సామాజిక కార్యకలాపాలు, సామాజిక ప్రక్రియలు, విస్తృతమవుతున్న సాంఘిక సంబంధాలు సాంఘిక శాస్త్రవేత్తలకు సవాళ్ళుగా పరిణమించాయి. ఇటువంటి పరిస్థితులలో సమస్యలను సామాజిక జీవనాన్ని, సామాజిక వ్యవస్థలు స్వరూపాన్ని, వీటిలో జరుగుతున్న మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడినది. ఇట్లాంటి అవసరాన్ని గుర్తించిన తర్వాత 'సమాజశాస్త్రం' (Sociology) ఒక ప్రత్యేక శాస్త్రంగా ఆవిర్భవించింది. మొట్టమొదటిసారిగా 1837వ సంవత్సరంలో ఆగస్టకోమ్టె (Augustcomd) అనే ఫ్రెంచి తత్వవేత్త సమాజశాస్త్రాన్ని పరిచయం చేశాడు.

## 1.2 వివిధ శాస్త్రాలలో సామాజిక అంశాల ప్రస్తావన

సామాజిక అంశాల అధ్యయనం ఒక ప్రత్యేక శాస్త్రంగా రూపుదిద్దుకోవడం ఆలస్యమైనప్పటికీ, వీటి ప్రస్తావన ప్లేటో, అరిస్టాటిల్ వంటి తత్వవేత్తల గ్రంథాలలోనే ఉంది. ప్లేటో (క్రీ.పూ. 427 - 347) 'రిపబ్లిక్' (Republic) అనే గ్రంథంలో మానవుని నగర జీవనాన్ని గురించి వివరించాడు. అరిస్టాటిల్ (క్రీ.పూ. 384 - 322) 'ఏథిక్స్ మరియు పాలిటిక్స్' (Ethics and Politics) అనే గ్రంథంలో సమాజం, చట్టం, రాజ్యం గురించి వివరించాడు. రోమ్‌కి చెందిన సిసిరో తన 'డి అఫీషియస్' (De Officius) అతనే గ్రంథంలో రాజకీయ, న్యాయ సంబంధ, మాజిక సంబంధమైన అనేక విషయాలను చర్చించడం జరిగింది.

ఇక తూర్పు దేశాలలో కూడా ముఖ్యంగా భారత దేశంలో అతి ప్రాచీన కాలం నుంచే మానవుని సామాజిక జీవనానికి సంబంధించిన అనేక గ్రంథాలు వెలుగులోకి వచ్చాయి. భారత దేశంలోని చతుర్వేదాలలో అలనాటి మానవ సామాజిక జీవనం ప్రతిబింబిస్తుంది. కౌటిల్యుని అర్థశాస్త్రం, పాణిని, పతంజలి, వాత్సాయనుడు మొదలైన పండితులను, ప్రవర్తనా రీతులను చర్చించాయి. రామాయణ, మహాభారతాలు కూడా ఆనాటి కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థ, బంధువర్గ వ్యవస్థల్ని, ఆస్తిపాస్తుల సంక్రమణ విధానాన్ని, సామాజిక సంబంధాలను, సామాజిక వ్యవస్థల ప్రమాణాలను, ఆచార వ్యవహారాలను తెలియజేస్తాయి.

ఆధునిక కాలంలో 16వ శతాబ్దానికి చెందిన మాకియవెల్లి 'ప్రిన్స్'(Prince) అనే గ్రంథంలో సమాజం రాజకీయాలు మొదలైన విషయాలను చర్చించాడు. థామస్ మోర్ 'ఉటోపియా' (Utopia) అనే గ్రంథంలో సామాజిక సమస్యలు ఉధృతరూపం దాలిస్తే సామాజిక వ్యవస్థాపన దెబ్బతింటుందని హెచ్చరించాడు. ఫ్రాన్స్ దేశానికి చెందిన మాంటెస్క్యూ 'దిస్పిరిట్ ఆఫ్ది లాస్' (The Spirit of the Laws) అనే గ్రంథంలో మానవుల సామాజిక జీవనంపై ప్రభావం చూపే బాహ్యకారకాల పాత్రను విశ్లేషించాడు. అయితే వీరంతా సామాజిక విషయాలను రేఖామాత్రంగా చర్చించారేతప్ప క్షుణ్ణంగా అధ్యయనం చేయలేదు. వారు చర్చించిన ప్రధాన విషయంలో

BRAOU

అంతర్భాగంగా మాత్రమే సందర్భానుసారంగా సామాజికాంశాలను స్పృశించారు. అయితే 18, 19 శతాబ్దాలలో యూరోపా సమాజంలో సంభవించిన మార్పులు ప్రత్యేక సమాజశాస్త్ర ఆవిష్కారానికి ప్రేరణగా నిలిచాయి.

## 1.3 యూరోపా సమాజంలో మార్పులు - సమాజశాస్త్ర ఆవిర్భావం

మధ్యయుగాలలో యూరోపా ఖండంలో ఫ్యూడల్ వ్యవస్థ బలంగా వేళ్ళూనుకొని ఉంది. మతం ఒక ప్రత్యేక వ్యవస్థగా మనగలుగుతూ, సమాజం మొత్తాన్ని చర్చి తన అదేపాజ్ఞలలో ఉంచేది. ప్రజలలో స్వేచ్ఛ, సమానత్వాలు కొరవడినాయి. ఇటువంటి పరిస్థితులలో 18వ శతాబ్దిలో సంభవించిన రెండు విప్లవాలు యూరోపా చారిత్రక, సామాజిక గతినే మార్చివేశాయి. వీటిలో మొదటిది పారిశ్రామిక విప్లవం కాగా రెండోది ఫ్రెంచి విప్లవం.

---

## 1.3 యూరోపా

---

### 1.3.1 పారిశ్రామిక విప్లవం - సామాజిక మార్పులు

పారిశ్రామిక విప్లవం క్రీ.శ. 1760 ప్రాంతంలో ఇంగ్లండులో ప్రారంభమై తదుపరి యూరోపా ఖండమంతా వ్యాపించింది. దీని ఫలితంగా నగరాలలో పెద్దపెద్ద కేంద్రాలు వెలిశాయి. ఉత్పత్తి రంగాలలో మానవశక్తి వినియోగ స్థానంలో యాంత్రిక శక్తి ప్రవేశపెట్టబడింది. కొత్త పారిశ్రామిక కేంద్రాల వల్ల నగరాలలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. పెద్ద గ్రామాలు పట్టణాలుగా, పెద్ద పట్టణాలు నగరాలుగా విస్తరించాయి.

గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయ కుటుంబాలు నగరాలకు వచ్చి పరిశ్రమలలో పనిచేయనారంభించాయి. నగర జీవనంలో వేగంగా పెరిగింది. విద్యకు, సాంకేతిక నైపుణ్యానికి ప్రాధాన్యం ఏర్పడింది. విద్యావంతులు సాంకేతిక నిపుణులు సమాజంలో ఉన్నత హోదాలను అందుకోసాగారు. వీటితోపాటు మానవసంబంధాలు సంక్లిష్టమయ్యాయి. వ్యక్తిగతమైన పోటీ పెరిగింది. పారిశ్రామిక విప్లవ ఫలితంగా కుటుంబాలు, మత వ్యవస్థలలో కూడా మార్పులొచ్చాయి. ఈ మార్పులు సమాజాన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఈ మార్పులేమిటో, ఎందుకు వచ్చాయో, భవిష్యత్తులో ఇంకా ఎట్లాంటి మార్పులు రానున్నాయో తెలియని అగమ్యగోచర స్థితిలో సమాజం పడింది. మార్పులు అప్పటికి మాత్రమే పరిమితం కావని, సమాజం నిరంతరం పరివర్తన చెందుతూ ఉంటుందని ప్రజలు గ్రహించారు. అయితే ఈ మార్పులను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించగల సాంఘిక శాస్త్రమేదీ అందుబాటులో లేదు.

### 1.3.2 ఫ్రెంచి విప్లవం - సామాజిక మార్పులు

18వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో జరిగిన ఫ్రెంచ్ విప్లవం ఫ్రాన్స్‌లోనే కాక యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. 14వ లూయీ కాలం నుంచి ఫ్రాన్స్‌లో సామాన్య ప్రజానీకం దుర్భర జీవితాన్ని గడిపారు. కులీనులు, మతాధికారులు తిరుగులేని అధికారాన్ని చెలాయించారు. రాజులు ప్రజల శ్రేయస్సుని పట్టించుకోలేదు. అణగారిన ప్రజల అసంతృప్తి 1789వ సంవత్సరంలో 16వ లూయీ కాలంలో విస్ఫోటనం చెంది విప్లవంగా మారింది. [illegible] మట్టుపెట్టి సామాన్య ప్రజానీకం విజయం సాధించింది.

ఫ్రెంచి విప్లవం ఎన్నో సామాజిక మార్పులకు కారణభూతమైంది. ప్రత్యేక సామాజిక వ్యవస్థగా చర్చి [illegible] ఫాదరీలను పౌరులు అధికారుల్లాగా ఎన్నుకొన్నారు. చర్చికి సంబంధించిన మఠాలు, పాఠశాలలు, వృత్తి [illegible] ప్రాముఖ్యాన్ని కోల్పోయాయి. విద్యను ప్రజల అవసరంగా గుర్తించారు ప్రజలకు విద్యను అందించే బాధ్యత రాజ్యానిదేనని ప్రకటించారు. ఆస్తి హక్కులలోకూడా మార్పులొచ్చాయి. ఆస్తి కుటుంబానికి కాక వ్యక్తికి సంక్రమించేటట్టుగా మార్పులు చేశారు. తన పిల్లల మధ్య ఆస్తిని పంచడానికి తండ్రికి హక్కు సంక్రమించింది. ఫ్రెంచి విప్లవకారణంగా కుటుంబంకూడా ఎన్నో మార్పులకు గురైంది. పాత బంధుత్వ సంబంధాలు పోయి కుటుంబ సంబంధాలల్లో పటిష్టత సన్నగిల్లింది. విప్లవ నినాదాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కుటుంబ వ్యవస్థకు కూడా విస్తరించాయి. అంతకు ముందు రాజ్యానికి, కుటుంబానికి మధ్య సంబంధాలు ఉండగా విప్లవానంతరం వ్యక్తికి, రాజ్యానికి నేరుగా సంబంధాలు ఏర్పడ్డాయి

B R A O U

పై విధంగా ఐరోపా ఖండంలోని సమాజంలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. సమాజం ఎందుకు పరివర్తన చెందింది? ఈ మార్పుల వెనుక నియమాలేమైనా ఉన్నాయా? మార్పుల ఫలితాలు ఎలా ఉంటాయి? వంటి ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు అప్పటికి మరే ఇతర సాంఘిక శాస్త్రం అందుబాటులో లేదు. ఉన్న సాంఘిక శాస్త్రాలన్నీ వాటి ప్రత్యేక దృక్పథంతో పాక్షిక పరిశీలన చేసేవే తప్ప సామాజిక సంబంధాలపై దృష్టినిలిపేవి కావు. ఇలాంటి తరుణంలో కేవలం సామాజిక సంబంధాలను అధ్యయనం చేయగల శాస్త్ర ఆవశ్యకతను గుర్తించారు. ఈ విధంగా సమాజంలో మానవ సంబంధాలను అధ్యయనం చేయాలన్న ప్రధాన ధ్యేయంతో 'సమాజశాస్త్రం' ఆవిర్భవించింది.

## 1.4 సమాజ శాస్త్రం - నిర్వచనాలు

మొట్టమొదట క్రీ.శ. 1837వ సంవత్సరంలో ఆగస్ట్ కోమ్టే అనే ఫ్రెంచి తత్వవేత్త 'సోషియాలజి' (Socialogy) అనే పదాన్ని సృష్టించాడు. 'సోషియాలజి' పదం లాటిన్ భాషలోని 'సోషియస్' (Socious), గ్రీకు భాషలోని 'లొగాస్' అనే రెండు పదాల కలయిక. లాటిన్ భాషలో సోషియస్ అనగా కలిసి జీవించడం లేదా తోటివారు అని అర్థము. గ్రీకు భాషలో లొగాస్ అనగా శాస్త్రము. శాస్త్రము అనగా 'వ్యవస్థీకృతమైన విజ్ఞానరాశి' అని అర్థం.

ఆ తర్వాత ఈ శాస్త్రానికి తగిన రూపాన్ని, స్వభావాన్ని, పరిధిని, దాని అభివృద్ధికి తోడ్పడిన వ్యక్తి అగస్ట్‌కోమ్టే. అందువలనే ఇతనిని సమాజశాస్త్ర పితామహుడిగా (Father of Sociology) వ్యవహరిస్తారు. ఆగస్ట్‌కోమ్టే మొట్టమొదటిగా సమాజశాస్త్రంపై 'పాజిటివ్ ఫిలాసఫీ' (Possitive Philosophy) అనే గ్రంథాన్ని రచించాడు. ఆ గ్రంథంలో "భౌతిక శాస్త్రాలలో లాగే శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి సమాజాన్ని, సమాజంలో మానవుని చర్యలను అధ్యయనం చేయడమే సమాజశాస్త్ర పరమావధి" అని ఆగస్ట్‌కోమ్టే సమాజ శాస్త్రాన్ని నిర్వచించాడు. కోమ్టే ముందుగల సాంఘిక శాస్త్రవేత్తలెవరూ సమాజాన్ని గానీ, సమాజ శాస్త్రాన్నిగానీ, సమాజంలో వ్యక్తుల్లో ప్రవర్తనను, మానవవ సంబంధాలను గానీ శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించనందువల్ల ఆయన ఈ విషయాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు.

"సమాజశాస్త్రం అంటే సామాజిక చర్యలను వ్యాఖ్యాన సహితంగా అవగాహన కలిగించే శాస్త్రం" అని మాక్స్ వెబర్ (Max Weber) పేర్కొన్నాడు. అంటే సామాజిక ప్రవర్తను వివరణ పూర్వకంగా అర్థం చేసుకోవడానికి సమాజ శాస్త్రం దోహదం చేస్తుందని వెబర్ భావన.

సామాజిక సంస్థలు, సామాజిక పరస్పర చర్యల గురించి అధ్యయనం చేయడమే సమాజశాస్త్రం ప్రధాన ధ్యేయంగా పెట్టుకోవాలని దుర్క్ హైమ్ (Durkheim) వివరించాడు. ఏదో ఒక సమాజంలోని సామాజిక సంస్థలను మాత్రమే పరిశీలిస్తే సంపూర్ణ అవగాహన రాదని, అందువల్ల విభిన్న సమాజాలను ప్రాతిపాదికగా తీసుకొని అధ్యనం జరపాలని దుర్క్ హైమ్ అభిప్రాయం.

"సమాజం ఏవిధంగా వ్యవస్థీకృతమైంది. ఎట్లా మార్పులకు గురవుతోంది అన్న అంశాలను సమాజశాస్త్రం అధ్యయనం చేయాలి" అని కారల్ మార్క్స్ (Karal Marx) అభిప్రాయపడ్డాడు. అంటే సమాజంలో త్వరితగతిన సంభవిస్తున్న మార్పులను అధ్యయనం చేయడానికి సమాశాస్త్రంలో ప్రాధాన్యత ఇవ్వాలని మార్క్స్ ఉద్దేశ్యం.

"సమాజంలో విభిన్న సామాజిక నిర్మితుల మధ్య సమైఖ్యత, క్రమ విభజనానికి దోహదం చేసే మూల సూత్రాలను అన్వేషించేందుకు సమాజశాస్త్రం ప్రయత్నిస్తుంది" అని మెకైవర్ (Mac Iver) అభిప్రాయపడినాడు. అంటే సమాజశాస్త్రం పరిసరాలతో ఏర్పడే మార్పులు, వ్యక్తులు - సమూహాల మధ్య సమైక్యత, సంఘర్షణలు, సర్దుబాట్లను మానవ విలువల దృష్టితో పరిశీలిస్తుంది. ఫలితంగా సామాజిక జీవి అయిన మానవుడి సృజనాత్మక జీవన కార్యకలాపాలలో లక్ష్య సిద్ధికి ఉపకరించే సాధనాలను ఈ శాస్త్రం కనుగొంటుందని మెకైవర్ వివరించాడు.

"సమాజ నిర్మితి గురించి కాక సమాజ క్రార్యాలను అధ్యయనం చేయడం సమాజశాస్త్ర లక్ష్యం" అని ఎల్.ఎఫ్.వార్డ్ (L.F.Ward) వివరించాడు. సమాజశాస్త్రజ్ఞుడు సమాజ నిర్మితిని విశ్లేషిస్తూ కూర్చోకూడదు, మానవుని సామాజిక జీవనాన్ని మెరుగుపర్చడం కోసం సమాజశాస్త్రాన్ని ఎంత వరకు వాస్తవంగా అమలు చయవచ్చునో

పరిశీలించాలని వార్డ్ అభిప్రాయం.

గిల్లిన్ మరియు గిల్లిన్ (Gillin & Gillin) ప్రకారం "సామాజిక సమూహంతో వ్యవహరిస్తున్న శాస్త్రమే సామాజిక శాస్త్రం" అంటే సమాజ అంతర్గత వ్యవస్థాపన తీరులు, వీటిని నిర్వహించే లేదా మార్చే విధానము, సమూహాల మధ్యగల సంబంధాలను గురించి అధ్యయనం చేసే శాస్త్రమే సామాజిక శాస్త్రము.

టి.బి. బోటమూర్ (T.B.Bottomore) "సంపూర్ణ సామాజిక జీవనాన్ని సమాజంలో ఉండే క్లిష్టమైన సామాజిక సంస్థలను, సామాజిక సమూహాలను పరిశీలించే శాస్త్రమే సమాజశాస్త్రము" అని నిర్వచించాడు. ఒకే శాస్త్రం గురించి సామాజిక శాస్త్రవేత్తలు ఇన్నిరకాల నిర్వచనాలు చెప్పడానికి కారణం ఒక్కొక్కరు ఒక్కో ప్రత్యేక కోణం నుంచి సమాజాన్ని అధ్యయనం చేయాలని భావించడమే. అందరి నిర్వచనాలను పరిశీలించిన తర్వాత కొన్ని అంశాలలో వీరందరి మధ్య సారూప్యత కనిపిస్తుంది. అవి: సమాజశాస్త్రం అంటే సమాజాన్ని అధ్యయనం చేస్తుంది. మానవుల మధ్య ఉండే సామాజిక సంబంధాలను సమాజశాస్త్రం పరిశీలిస్తుంది.

సమాజశాస్త్రం సమూహాలలో మానవుని ప్రవర్తనను పరిగణలోకి తీసుకుంటుంది.

సమాజశాస్త్రం సామాజిక పరస్పర చర్యలకు ప్రాధాన్యత ఇస్తూ, వివిధ రకాల సామాజిక సంబంధాలపై ఆసక్తి కనబరుస్తుంది. ఈవిధంగా మానవ సంబంధాలలో సామాజికత (Socialness) పైనే సమాజశాస్త్రం దృష్టి కేంద్రీకరిస్తుంది.

## 1.5 సమాజశాస్త్ర స్వభావం

BRAOU

ప్రతి వ్యక్తి ఏదో సమయంలో మరొక వ్యక్తిపై ఆధారపడవలసి వస్తుంది. అదే విధంగా సమూహము లేదా సంస్థ కూడా తప్పక ఇతర సమూహాలపై, సంస్థలపై ఆధారపడవలసి వస్తుంది. ఈవిధమైన వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య సంస్థల మధ్యగల సంబంధాలను తెలియజేయునది సమాజశాస్త్రము.

ప్రతి శాస్త్రానికి ప్రధానంగా మూడు లక్షణాలు ఉండవలెను. అవి 1. కార్యకరణసంబంధాన్ని అవగాహన చేసుకోవడము 2. ఈ సంబంధాలతో భవిషత్తును ఊహించగలగడము 3. సాధారణీకరణము చేయడము. ఈ మూడు అక్షణాలు సమాజశాస్త్రంలో ఉండుట వలన ఈ శాస్త్ర స్వభావం అర్థం చేసుకోవడం సులభతరమవుతోంది.

సమాజశాస్త్ర స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి జాన్సన్ (Johnson) అనే సామాజిక శాస్త్రవేత్త కొన్ని లక్షణాలను వివరించాడు. క్రింద పేర్కొన్న లక్షణాల రూపంలో సమాజశాస్త్ర స్వభావాన్ని గ్రహించవచ్చు.

### 1.5.1 "ఇది అనుభవేద్యమైనది, సామాజిక విజ్ఞానం సాక్ష్యాధారమైనది"

సమాజశాస్త్ర నివేదికలు, అనుభవైక ప్రపంచ పరిశీలనలు, వివరణల మీద ఆధారపడతాయి. సామాజిక సామాన్యీకరణాలు ఊహాకల్పనలేదా ఊహించడం మీద ఆధారపడి ఉండవు. అవి నిర్దిష్టమైన దత్తాంశాల మీద ఆధారపడి ఉంటాయి. శాస్త్రీయ ఆవిష్కరణలుగా ప్రకటించే ముందు వాటిని పరీక్షించడం జరుగుతుంది.

విశ్వసనీయమైన దత్తాంశాలను సేకరించే క్రమంలో సమాజశాస్త్రంకూడా ప్రకృతి శాస్త్రాల మాదిరిగా కొన్ని ప్రత్యేమైన సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తుంది. ఖగోళశాస్త్రజ్ఞుడు దూరదర్శినిని, జీవశాస్త్రజ్ఞుడు సూక్ష్మదర్శినిని, వైద్యుడు స్టెతస్కోపును వాడుతున్నట్లుగా సమాజ శాస్త్రజ్ఞుడు కూడా సహభాగ పరిశీల (Participant Observation), ఇంటర్వ్యూ (Interview), ప్రశ్నావళి (Questionair), నమూనా (Sample) మొదలైన దత్తాంశ సేకరణవిధానాలను ఉపయోగిస్తారు.

### 1.5.2 సమాజశాస్త్రము సిద్ధాంతపరమైనది

పరిశీలించదగిన చర్యల మధ్య గల కార్యకారణ, యాదృచ్ఛిక సంబంధాలను వివరించడానికి సిద్ధాంతం ప్రయత్నిస్తుంది. ప్రకృతి శాస్త్రజ్ఞుల మాదిరిగానే దత్తాంశాల సహాయంతో సామాజిక దృష్టికి గోచరించిన విషయాలను సిద్ధాంతీకరించడానికి సమాజ శాస్త్రజ్ఞులు ప్రయత్నిసారు. దృష్టికి గోచరించిన విషయాలు అన్వేషణకు ప్రయోజనకారిగా

ఉన్నంత వరకు మాత్రమే వాటిని అంగీకరిస్తారు. ఒక కొత్త సాక్ష్యం అప్పటివరకు అమలులో ఉన్న సిద్ధాంతాన్ని తప్పుగా రుజువు పరిస్తే దానిని త్రోసిరాజని నూతన సిద్ధాంతాన్ని చెయ్యడానికి సమాజశాస్త్రజ్ఞులు వెనుకాడరు. ఈ విధంగా సామాజిక సిద్ధాంతాలు ఒకదాని మీద ఒకటి ఆధారపడి నిర్మితమవుతాయి. కొత్త సిద్ధాంతాలు పాత సిద్ధాంతాలను సవరిస్తాయి, విస్తరింపచేస్తాయి, సంస్కరిస్తాయి.

### 1.5.3 సమాజము నిష్పాక్షికమైనది

మానవులను గురించి, వారి మధ్యగల పరస్పర సంబంధాల గురించి అధ్యయనం చేస్తున్నపుడు సమాజశాస్త్రజ్ఞులు విషయ సరంగానూ, శాస్త్రీయంగానూ నిష్పాక్షికంగా ఉండడానికి ప్రయత్నిస్తారు. ఒక వ్యక్తిగా లేదా సమాజ పౌరునిగా సమాజశాస్త్రజ్ఞునికి సొంత అభిప్రాయాలు ఉన్నప్పటికీ అవి సామాజిక అధ్యయనాలను ఏమాత్రం ప్రభావితం చేయవు. ఉదహారణకు చిన్న సమాజాలలో సమాజ శాస్త్రజ్ఞుడు సహభాగ పరిశీలకునిగా (Participant Observer) ప్రజల సాంస్కృతిక రీతులను అధ్యయనం చేస్తున్నప్పుడు ఏ విధమైన వ్యక్తిగత అభిమానాలుగానీ, పాక్షికతలు గానీ బయటి వ్యక్తిగా, నిష్పాక్షికంగా ఆయా సమాజాలను విశ్లేషించడానికి ప్రయత్నిస్తారు.

### 1.5.4 సమాజ శాస్త్రము నైతికమైంది కాదు

సమాజ శాస్త్రజ్ఞులు మానవ ప్రవర్తనను వివరించడంలో, మానవ సమాజాన్ని గురించిన విజ్ఞానాన్ని అందించడంలో పాటు పడతారు. అయితే మానవ ప్రవర్తనకు చెందిన ఒక తీరు మంచిదా? చెడ్డదా? అనే విషయాన్ని వారు నిర్ణయించరు. ఏదైనా ఒక సందర్భంలో వ్యక్తుల ప్రవర్తన ఎలా ఉంటుంది? ఎందుకుంటుంది? అని మాత్రమే వివరిస్తారు. ఉదాహరణకు ఒక పరిశీలనలో అధిక సంఖ్యాక ప్రజలు విడాకులకు వ్యతిరేకమని సమాజశాస్త్రజ్ఞులు కనుగొంటే, అటువంటి దృక్పథం సరైనదా, కాదా అనేది నిర్ణయించరు. ఈ విధంగా సమాజశాస్త్రం సామాజిక చర్యలు మంచివా? చెడ్డవా? అని విచారించక, వాటిని వివరించడం మాత్రం చేస్తుంది.

## 1.6 సమాజశాస్త్ర పరిధి

ఇతర సాంఘిక శాస్త్రాలు దృష్టి సారించని సామాజిక సమస్యలను సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. సమాజశాస్త్రం తీసుకొన్న అంశాన్ని సామాజిక దృక్పథంతో అధ్యయనం చేస్తుంది. ఉదహారణకు నిరుద్యోగ సమస్యకు ఆర్థిక కారకాలు, రాజకీయ కారకాలు, శారీరక కారకాలు అనేకం ఉంటాయి. అయితే సమాజశాస్త్ర పరిధి నిరుద్యోగ సమస్యకు గల సామాజిక కారణాలను పరిశీలించడం వరకే ఉంటుంది. ఈ విధంగా ఏ అంశాన్నైనా సమాజశాస్త్రం తన దృక్పథంతో అధ్యయనం చేస్తుంది. సమాజశాస్త్ర పరిధిపై దృష్టి సారించిన శాస్త్రవేత్తలు రెండు వేర్వేరు పంథాలను అనుసరించారు. కొందరు సామాజిక శాస్త్రవేత్తలు సమాజశాస్త్ర కర్తవ్యం కేవలం సామాజిక సంబంధాలను అధ్యయనం చేయడమేనని, ఈ పరిధిని మించి పోరాదని అభిప్రాయపడగా, మరికొందరు సామాజిక శాస్త్రవేత్తలు సమాజశాస్త్రం ఒక పక్క సామాజిక సంబంధాలను, మరో పక్క మిగతా సాంఘిక శాస్త్రాల నుండి అవసరమైన సమాచారం గ్రహిస్తూ ఒక సాధారణ శాస్త్రంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

### 1.6.1 సంపూర్ణ ఏకదృష్టితో సమాజ అధ్యయనం

జిమ్మెల్, స్మాల్ వీరకండ్, మార్క్స్ వెబర్ వంటి సమాజశాస్త్రవేత్తలు సమాజశాస్త్రాన్ని మిగతా సంఘికశాస్త్రాలనుంచి వేరు చేసి స్పష్టంగా దీని అధ్యనాంశాలను నిర్ధారించడానికి ప్రయత్నించారు. వీరి వాదన ప్రకారం సమాజశాస్త్రం మానవ సామాజిక సంబంధాలను మాత్రం అధ్యయనం చేస్తుంది. ఇది మరే ఇతర సాంఘిక శాస్త్ర శాఖలతో సంబంధంలేని స్వతంత్ర శాస్త్రం.

జిమ్మెల్ (Zimmel) అనే సమాజశాస్త్రవేత్త అధ్యయనం ప్రకారం మిగతా అన్ని సాంఘిక శాస్త్రాలు ఏమి చర్చిస్తాయో వాటినే సమాజశాస్త్రం కూడా అధ్యయనం చేస్తుంది. అయితే సామాజిక సంబంధాలు అనే ప్రత్యేక కోణం నుంచి వీటిని పరిశీలించడం సమాజశాస్త్ర ప్రత్యేకత. సామాజిక జీవనంలో అంతర్భాగాలైన మత, రాజకీయ, నైతిక, ఆర్థిక కార్యకలాపాలను సమాజశాస్త్రం చర్చిస్తుంది, కానీ వీటిని సామాజిక సంబంధాల స్ఫూర్తితో అధ్యయనం చేస్తుంది.

స్మాల్ (Small) అనే సమాజశాస్త్రవేత్త ప్రకారం ప్రతి శాస్త్రానికీ పరిధి ఉంటుంది. ఆ పరిధికి లోబడి శాస్త్ర అధ్యయనం జరిగినపుడు మాత్రమే శాస్త్రీయ ఫలితాలు వెలువడతాయి. సామజశాస్త్రానికి కూడా ఇలాంటి పరిధి ఉంది. సామాజిక సంబంధాలు, ప్రవర్తనా విధానం, వ్యక్తి కార్యకలాపాలను సమాజశాస్త్రం పరిశీలిస్తుందని స్మాల్ వివరించాడు.

సమాజంలో ఒక వ్యక్తికి మరో వ్యక్తికి మధ్య ఉండే మానసిక బంధం గురించి సమాజశాస్త్రం తెలియజేస్తుందని వీర్‌కండ్ (Vierkandt) అభిప్రాయపడ్డాడు. వర్తమాన సమాజాలనైనా గత కాలపు సమాజాలనైనా సమాజశాస్త్రం ఈ దృష్టితోనే పరిశీలిస్తుంది. 18వ శతాబ్దంలో ఫ్రెంచి విప్లవ సమాజాన్ని పరిశీలించినా, వర్తమాన అమెరికా సమాజకుటుంబ వ్యవస్థపై దృష్టి సారించినా ఆయా సమాజాలలో సామాజిక సంబంధాలెలా ఉన్నాయనే విషయాన్నే సమాజశాస్త్రం పరిశీలిస్తుందని వీర్‌కండ్ అభిప్రాయం.

మాక్స్‌వెబర్ (Max Weber) దృష్టిలో సమాజశాస్త్రానికి ప్రత్యేక అస్తిత్వం ఉంది. సామాజిక ప్రవర్తనపై అవగాహన ఏర్పడడం ఈ శాస్త్ర లక్ష్యం. కాబట్టి సమాజశాస్త్రం ఎక్కువగా సామాజిక ప్రవర్తనపైనే దృష్టి కేంద్రీకరిస్తుంది. ఆవిధంగా సామాజిక సంబంధాలకు అవకాశం లేని అంశాలు సమాజశాస్త్ర పరిధిలోకి రావని వెబర్ ప్రతిపాదన.

ఈ విధంగా జిమ్మెల్, స్మాల్, వీర్‌కండ్, వెబర్ మొదలైన వారంతా సామాజిక సంబంధాలను అధ్యనం చేయడమే సమాజశాస్త్ర లక్ష్యమని, వాటి వరకే సమాజశాస్త్ర పరిధి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

### 1.6.2 ఇతర సాంఘిక శాస్త్రాల సహకారంతో సమాజ అధ్యయనం

దుర్క్‌హైమ్, హాబ్‌హౌస్, సోరోకిన్ వంటి సమాజశాస్త్రవేత్తలు కేవలం సామాజిక సంబంధాల దృష్టితోకాక మిగతా సాంఘిక శాస్త్రాల సహకారంతో సమాజశాస్త్ర అధ్యయనం సాగాలని అభిప్రాయపడ్డారు.

దుర్క్‌హైమ్ (Durkheim) విశ్లేషణను అనుసరించి సమాజశాస్త్రాన్ని మూడు విభాగాలుగా విభజించవచ్చు. మొదటిది సామాజిక నిర్మాణ ధర్మశాస్త్రం (Social Morphology). ఈ విభాగంలో ప్రజలకు, ప్రాదేశిక పరిస్థితులకు గల సన్నిహిత సంబంధాన్ని అధ్యయనం చేస్తారు. జనసాంద్రత, ఒక ప్రాంతంలో ప్రజలు విస్తరించి ఉన్న విధానాల వంటి అంశాలను, వివిధ సామాజిక సంస్థల తీరుతెన్నులను సామాజిక నిర్మాణ ధర్మశాస్త్రం పరిశీలిస్తుంది. రెండో విభాగం సామాజిక శరీర ప్రకార్య శాస్త్రం (Social Physiology). మతం, నైతిక సూత్రాలు, న్యాయసూత్రావళి, భాష, ఆర్థిక జీవనం వంటి అంశాలను సామాజిక శరీర ప్రకార్య శాస్త్రం అధ్యయనం చేస్తుంది. ఇక మూడో విభాగం సాధారణ సమాజశాస్త్రం (General Sociology). ఈ విభాగంలో సామాన్య మానవ సామాజిక సంబంధాలను అధ్యయనం చేయాలని దుర్క్‌హైమ్ వివరించాడు.

హబ్ హౌస్ (Hob house) అనే సామాజిక శాస్త్రవేత్త కూడా సమాజశాస్త్రానికి మూడు విధులున్నాయని తెలిపాడు. మొదటిది సామాజికాంశాలపైనే దృష్టి కేంద్రీకరించడం, రెండోది వివిధ సాంఘిక శాస్త్రా సారాంశాలను గ్రహించి సమాజశాస్త్రంలో కలిపి అధ్యయనం చేయడం, మూడోది సామాజిక జీవనానికి ప్రాధాన్యం ఇచ్చి అందులోని వివిధ అంశాలను పరిశీలించడం.

సోరోకిన్ (Sorokin) అభిప్రాయం ప్రకారం కూడా సమాజశాస్త్రం మూడు విషయాలను ప్రధానంగా పరిశీలించాలి. వివిధ సామాజిక దృగ్విషయాల మధ్యగల సంబంధాలను వివరించడం, సామాజిక-సామాజికేతర అంశాల మధ్య ఉన్న సంబంధాలన పరిశీలించడం, సామాజిక దృగ్విషయస్వరూపాలను వివరించడం అనేవి సమాజశాస్త్రం నిర్వర్తించాల్సిన విధులుగా సోరోకిన్ తెలియజేశాడు.

పై అభిప్రాయాలను పరిశీలించిన తర్వాత మన దృష్టికి కొన్ని అంశాలు వస్తాయి. సమాజంలో మానవుని కార్యకాలాలను వివిధ సాంఘిక శాస్త్రాలు అధ్యయనం చేస్తున్నాయి. అయితే ఒక్కో సాంఘిక శాస్త్రం ఒక్కో దృక్పథంతో పరిశీలన జరుపుతుంది. ఆర్థిక కార్యకలాపాల దృష్టితో అర్థశాస్త్రం అధ్యయనం చేస్తుంది. రాజకీయ దృక్పథంతో రాజనీతిశాస్త్రం పరిశీలిస్తుంది. చారిత్రక అంశాలపై చరిత్ర దృష్టి కేంద్రీకరిస్తుంది. ఈ దృష్ట్యా సమాజంలో మానవుల మధ్య నిరంతరం కొనసాగే సామాజిక సంబంధాలను సమాజశాస్త్రం అధ్యనం చెయ్యాలి. సామాజిక సంబంధాలకు మూలమైన సామాజిక ప్రక్రియలు, సామాజిక నియంత్రణ, సామాజిక కట్టుబాట్లు, సామాజిక



BRAOU

వ్యవస్థాపన, కుటుంబ వ్యవస్థ వంటి అంశాలను సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. వీటిని అధ్యయనం చేసే ప్రక్రియలో ఇతర సాంఘిక శాస్త్రాల అవసరం తీసుకోవడానికి సమాజశాస్త్రం సంశయించాల్సిన పనిలేదు.

## 1.7 సమాజశాస్త్రాభివృద్ధి

19వ శతాబ్దంలో ఆవిర్భవించిన సమాజశాస్త్రం 20వ శతాబ్దంలో బాగా అభివృద్ధి చెంది ప్రాచుర్యంలోకి వచ్చింది. సాంఘిక శాస్త్రాల్లో ప్రత్యే బోధనాశాస్త్రంగా స్థిరపడి, శాఖోపశాఖలుగా విస్తరించింది. అమెరికాలో 1876, ఫ్రాన్స్‌లో 1889, బ్రిటన్‌లో 1907, ఈజిప్ట్, మెక్సికోలలో 1925, స్వీడన్‌లో 1947లో ప్రత్యేక బోధనాశాస్త్రంగా సమాజశాస్త్రం పరిచయం చేయడబడింది. సామాజికాంశాలతో కొన్ని ప్రత్యేక శాఖలుగా సమాజశాస్త్రం విస్తరించింది. వాటిలో పారిశ్రామిక సమాజశాస్త్రం (Industrial Sociology), నేరశాస్త్రం (Criminology), జనాభాశాస్త్రం (Demography), విద్యాసమాజశాస్త్రం (Educational Sociology), సాంస్కృతిక సమాజశాస్త్రం (Cultural Sociology) వంటి విభాగాలను ప్రముఖంగా పేర్కొనవచ్చు.

భారత దేశంలో ప్రప్రథమంగా 1919వ సంవత్సరంలో బొంబాయి విశ్వవిద్యాలయంలో సమాజశాస్త్రం ప్రవేశపెట్టారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం అనేక విప్లవాత్మకమైన మార్పులు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ ప్రక్రియలో అనేక సమస్యల పరిష్కారానికి సామాజిక అన్వేషణ ప్రారంభమైంది. దీనికి తోడు భారతదేశంలో కులం, మతం ప్రభావం ఎక్కువగా ఉంది. సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వీటిప్రభావం గుర్తించవలెనంటే సామాజిక పరిశోధన తప్పనిసరి అయినది. అంతేకాక సామాజిక సంస్థలైన కుటుంబము, పార్టీ, విద్య, వివాహము మొదలైన వాటి గురించి అవగాహన ఏర్పరచుకోవడంలో సమాజశాస్త్రం ఉపయోగపడుతున్నది. నేటి సామాజిక సమస్యలై నిరుద్యోగము, బిక్షాటనము, వ్యభిచారము, వరకట్నము,నేరము, బాలనేరాలు, అంటరానితనము మొదలగు సమస్యలపై శాస్త్రీయ పరిశోధన చేసి సమస్యల శాశ్వత పరిష్కారానికి సమాజశాస్త్రము కృషి చేయుచున్నది.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సమాజశాస్త్ర ప్రాముఖ్యం పెరుగుతుంది. సమాజం సంక్లిష్టమవుతున్న కొద్దీ మానవ సంబంధాలలో సంక్లిష్టత ఏర్పడుతున్న కొద్దీ, సామాజిక సంస్థల ప్రాధాన్యత పెరుగుతున్నకొద్దీ సమాజశాస్త్ర వసరం పెరుగుతూనే ఉంటుంది.

BRAOU

## 1.8 సారంశం

ప్రతి సాంఘిక శాస్త్రం కూడా మానవ సామాజిక జీవనంలో ఏదో ఒక కోణాన్ని మాత్రమే స్పృశించగలదు. అయితే మానవ సామాజిక జీవనాన్ని సమగ్రంగా, పరిపూర్ణంగా అధ్యనం చేస్తేతప్ప సమాజగమనం అర్థంకాదు. ఇలాంటి అవసరాన్ని గుర్తించిన తర్వాత సమాజశాస్త్రం ఆవిర్భవించింది. ఈ అవసరాన్ని గుర్తించడానికి ముఖ్యంగా యూరోపు ఖండంలో సంభవించిన పారిశ్రామిక, ఫ్రెంచి విప్లవా లు దోహదం చేశాయి. పారిశ్రామిక విప్లవం యూరోపులోని ప్రజల సామాజిక ప్రపంచంలో ఎన్నో మార్పులను తీసుకొని వచ్చింది. అదే విధంగా ఫ్రెంచి విప్లవం ఫ్రాన్స్‌లోని సాంప్రదాయక సమాజవిచ్ఛిత్తికి, నూతన జీవన విధానాలు ఏర్పడడానికి దారితీసింది.

గ్రీకుల కాలం నుంచే వివిధ సాంఘిక శాస్త్రాలలో సామాజిక అశాల ప్రస్తావన ఉన్నప్పటికీ, పారిశ్రామిక, ఫ్రెంచి విప్లవాల తర్వాత 1837వ సంవత్సరంలో అగస్ట్‌కోమ్టే సమాజశాస్త్రానికి రూపకల్పన చేశాడు. సమాజశాస్త్రం సామాజిక సంబంధాల గురించి అధ్యయనం చేస్తున్నందువల్ల ప్రధానంగా మానవుల పరస్పర చర్యలలో కనిపించే వివిధ సామాజిక సంబంధలలో అభిరుచి కలిగి ఉంది. సామాజిక సంబంధాల సముదాయం ఉన్న సామాజిక స్వరూప అధ్యయనం మీద సమాజశాస్త్రజ్ఞులు దృష్టి కేంద్రీకరిస్తారు కనుక కుటుంబం, రాజకీయ, విద్యా, ఆర్థిక, మత సంస్థల సామాజిక అధ్యయనంగా సమాజశాస్త్రాన్ని నిర్వచించవచ్చు.

మిగతా సాంఘిక శాస్త్రాలతో పోల్చి చూస్తే సమాజశాస్త్రం ఆవిర్భవించి ఎక్కువ కాలం కాలేదు. కేవలం నూట అరవై సంవత్సరాల కిందట రూపుదిద్దుకొన్న సమాజశాస్త్ర స్వభావాన్ని, పరిధిని అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు అనేక రకాలుగా అర్థంచేసుకున్నారు. కొందరు కేవలం సామాజిక సంబంధాలను మాత్రమే అధ్యయనం చేయడం

సమాజశాస్త్ర కర్తవ్యమని, మరికొందరు సామాజిక శాస్త్రవేత్తలు ఒక పక్క సామాజిక సంబంధాలను అధ్యయనం చేస్తూ మరొకపక్క మిగతా సాంఘిక శాస్త్రాల నుంచి అవసరమైన సమాచారం గ్రహించాలని అభిప్రాయపడ్డారు. మొత్తంమీద సమాజాన్ని శాస్త్రీయంగా మరే ఇతర శాస్త్రమూ అధ్యయనం చేయడంలేదు కాబట్టి ముఖ్యంగా మానవుని సంపూర్ణ జీవనాన్ని ఏ శాస్త్రమూ పరిశీలించడంలేదు కాబట్టి సమాజశాస్త్రం సమాజాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

20వ శతాబ్ది వచ్చేసరికి ఈశాస్త్రం తనదైన ప్రత్యేకతను సంతరించుకొని, ప్రత్యేకశాస్త్రంగా విశ్వవిద్యాలయాలలో బోధనాంశమైంది. భారతదేశంలో 1919వ సంవత్సరంలో బొంబాయి విశ్వవిద్యాలయంలో మొదటిసారిగా సమాజశాస్త్రం ప్రవేశపెట్టబడింది. స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి చెంది అనేక ప్రత్యేక శాఖలుగా ప్రత్యేక అధ్యనాలు చేస్తుంది. రాజకీయ సమాజశాస్త్రం, నేరశాస్త్రం, నగరసమాజశాస్త్రం, గ్రామీణసమాజశాస్త్రం మొదలైనవి సమాజశాస్త్రంలోని కొన్ని ప్రత్యేక క్షేత్రాలు.

## 1.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. సమాజ శాస్త్ర ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులను వివరించండి.

2. సమాజశాస్త్రం అంటే ఏమిటి? ఈ శాస్త్ర స్వభావాన్ని పరిధిని వివరించండి.

**II. ఈ కింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1.సమాజశాస్త్ర ఆవిర్భావంలో ఫ్రెంచి విప్లవ పాత్రను గురించి వ్రాయుము.

2. సమాజశాస్త్ర ఆవిర్భావానికి పారిశ్రామిక విప్లవం ఏవిధంగా దోహదం చేసింది?

## 1.10 చదవదగిన గ్రంథాలు


Alex Inkles :What is Sociology
Bottomore, T.B :Sociology- a guide to problems and literature
Gisbert :Fundamentals of Sociology
Haralambos :Sociology - Themes and Perspectives
Harry M. Johnson Sociology - A systematic Introduction
Ian Robertson :Sociology
Kingsley Davis :Haman Society
MacIver and Page :Society - An Introductory Analysis
Neil J. Smelser :Sociology - An Introduction
Paul B. Horton& Chester L.Hunt : Sociology
Peter L. Berger :Invitation to sociology
P.Lowry and Robert P. Rankin :Sociology - The Science of Society
Robert L. Suutherland & Woodward :Introductory Sociology
Sharma R.N. :Principles of Sociology


BRAOU

# భాగం-2: సమాజశాస్త్రం - ఇతర సామాజిక శాస్త్రాలతో సంబంధం

విషయ క్రమం


2.0 ఉద్దేశాలు

2.1 పరిచయం

2.2 సాంఘిక శాస్త్రాలన్నీ పరస్పర ఆధారితాలు

2.3 సమాజశాస్త్రం - మానవశాస్త్రం

2.4 సమాజశాస్త్రం - మనోవిజ్ఞానశాస్త్రం

2.5 సమాజశాస్త్రం - రాజనీతి శాస్త్రం

2.6 సమాజశాస్త్రం - ఆర్థికశాస్త్రం

2.7 సమాజశాస్త్రం - చరిత్ర

2.8 సమాజశాస్త్రం - తత్వశాస్త్రం

2.9 సారాంశం

2.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

2.11 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 2.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- వివిధ సాంఘిక శాస్త్రాలు ఏవిధంగా పరస్పర ఆధారితాలో గుర్తించగలరు.
- సమాజశాస్త్రానికి మానవ శాస్త్రానికి, మనోవిజ్ఞానశాస్త్రానికి, చరిత్రకి, రాజనీతిశాస్త్రానికి, ఆర్థికశాస్త్రానికి మధ్యనున్న సంబంధాన్ని వివరించగలరు.

## 2.1 పరిచయం

ప్రముఖ తత్వవేత్త అరిస్టాటిల్ అభిప్రాయంలో 'మానవుడు సంఘజీవి' (Man is Social Animal). మొదట్లో మానవుని యొక్క ఈ సాంఘిక జీవితాన్ని తత్వశాస్త్రం అధ్యయనం చేసేది. ఈ శాస్త్రం వ్యక్తి జీవన విధానం, నైతిక ప్రవర్తన, సామాజిక జీవితం, రాజకీయ కార్యకలాపాలను పరిశీలించేది. ఆతర్వాత మానవ జీవితం సంక్లిష్టమైంది. సామాజిక దృగ్విషయాలకు సంబందించిన విజ్ఞానం బాగా పెరిగిపోయింది. దాన్నంతటినీ ఉపయోగించుకోవడం ఒక్క తత్వశాస్త్రానికి సాధ్యం కాలేదు. పర్యవసానంగా అసంఖ్యాక శాస్త్రాలు ఉద్భవించాయి. తర్వాత ఆ శాస్త్రాలు తమతమ క్షేత్రాలలో పరిశోధనకు సంబంధించిన శాస్త్రీయ పద్ధతులను అవలంభించి మాతృశాస్త్రం నుంచి వేరైనాయి. బియర్‌స్టెడ్ (Bierstedt) మాటలలో "సౌలభ్యం కోసం శాస్త్రాలను రెండు పెద్ద వర్గాలుగా విభజించవచ్చు. అవి 1. భౌతిక ప్రపంచాన్ని పరిశీలించే శాస్త్రాలు. ఖగోల శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం మొదలైనవి ఇందులో ఉంటాయి. 2. సామాజిక ప్రపంచాన్ని పరిశీలించే శాస్త్రాలు. ఈవర్గంలో చరిత్ర, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రం ఉంటాయి." మానవ సాంఘిక జీవితం గురించిన చర్చ కాబట్టి ప్రస్తుతం మానవుని సామాజిక ప్రపంచాన్ని పరిశీలించే శాస్త్రాల గురించే పరిశీలిద్దాం.

## 2.2 సాంఘిక శాస్త్రాలన్నీ పరస్పరాధారితాలు

మానవ జీవనం బహుముఖమైంది. ఒక వ్యక్తి ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటుంటాడు, రాజకీయ కార్యక్రమాలలో తిరుగుతుంటాడు, మత పరమైన విధులు నిర్వర్తిస్తుంటాడు. ఈ విధమైన బహుముఖ కార్యకలాపాలని అధ్యయనం చేయడానికి వేరువేరు సాంఘిక శాస్త్రాలున్నాయి. అవి వాటి వాటి ప్రత్యేక దృక్పధాలతోమానవ జీవితాన్ని పరిశీలిస్తాయి. అర్థశాస్త్రం మానవుడిని సంపద సముపార్జకుడుగానో లేదా సంపదను ఖర్చుపెట్టేవాడిగానో పరిగణించి అతని ఆర్థిక కార్యకలాపాలగురించి చర్చిస్తుంది. రాజనీతి శాస్త్రం మానవుడిని ఒక పౌరునిగా పరిగణించి ప్రభుత్వానికి, పౌరునికి మధ్యగల సంబంధాలను పరిశీలిస్తుంది. అదే చరిత్ర గతించిన కాలంలో ప్రాముఖ్యం సంతరించుకొన్న సంఘటనలను గురించి అధ్యయనం చేస్తుంది.

ఈ సాంఘిక శాస్త్రాలన్నీ మానవుని వివిధ కార్యకలాపాలను అధ్యయనం చేస్తున్నప్పటికీ రెండు లోపాలు ఉన్నాయి. మొదటిది మానవుని సామాజిక జీవనాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేసే శాస్త్రం లేదు. రెండోది ఇతర సాంఘిక శాస్త్రాల పరిశీలన సారాంశాలను సమన్వయం చేస్తూ మానవుని సంపూర్ణ సామాజిక జీవనాన్ని ఆవిష్కరించే శాస్త్రం కొరవడింది. ఈ లోపాలను అధిగమించేందుకు 19వ శతాబ్దంలో సమాజశాస్త్రం ఆవిర్భవించింది. అనగా సమాజశాస్త్రం మానవ సంబంధాలు, సామాజిక సంస్థలు, వ్యక్తుల మధ్య పరస్పర చర్యలు, సమాజంలో మానవుని ప్రవర్తన వంటి అంశాలను అధ్యయనం చేస్తుంది. గిన్స్‌బర్గ్ (Ginsberg) "సమాజశాస్త్రం మానవ జీవితంలోని సమస్యలు, వాటి ప్రభావం, వాటి ఫలితాలు, మానవ అంతఃక్రియలు, అంత: సంబంధాలు, వాటి స్థితిగతులను అధ్యయనం చేస్తుంది." అని వివరించాడు.

ఆవిధంగా అన్ని సాంఘికశాస్త్రాలు మానవుని ప్రధానాంశంగా తీసుకొని, అతడ్ని సమాజసభ్యునిగా భావించి, అతడు జీవించే జగత్తు గురించి చర్చిస్తూ, అతని ప్రవర్తనారీతులను విభిన్న దృక్కోణాలనుంచి పరిశీలిస్తాయి. కానీ సమాజంలో వివిధ రంగాలలో మానవుని ప్రవర్తన ఒకదాని నుండి వేరొకదాన్ని విడదీయటమనేది కుదరదు. ఒక రంగానికి మరొక రంగానికి అవినాభావ సంబంధం ఉంటుంది. అందుచేత ఒక సాంఘిక శాస్త్రానికి ఇతర సాంఘిక శాస్త్రాలతో సన్నిహితమైన సంబంధం ఉంటుంది. ఇదే విషయాన్ని సింప్సన్ (Simpson) ఇలా పేర్కొంటాడు. "సాంఘిక శాస్త్రాల మధ్య సమైఖ్యత ఉంది. అది కాల్పనిక సమైక్యత కాదు,చైతన్యపూరితమైన సమైక్యత. వాస్తవంగా ఒక సాంఘిక శాస్త్రం మరొక సాంఘిక శాస్త్రంపై ఆధారపడిన సమైక్యత". ఇదే పద్ధతిలో సమాజశాస్త్రం ఇతర సాంఘిక శాస్త్రాలతో పరస్పర సంబంధం కలిగి ఉంటుంది. కానీ ప్రతి సాంఘిక శాస్త్రంతో సమాజశాస్త్రం కల్గియున్న సంబంధాలను విడివిడిగా తెలుసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

## 2.3 సమాజశాస్త్రం - మానవశాస్త్రం

ఆంత్రోపాలజీ (Anthropology) అనేది మానవ శాస్త్రానికి ఆంగ్లపదం. ఇది ఏంత్రోపోస్ (Anthropos), లాగోస్ (Logos), అనే రెండు గ్రీకు పదాల కలయికతో ఏర్పడినది. 'ఏత్రోపోస్' అంటే మానవుడు, 'లోగోస్' అంటే శాస్త్రం అని అర్థం. మానవ అధ్యయనం ఈ శాస్త్ర లక్ష్యం. అనాదినుండి నాగరిక కాలం వరకు జరిగిన మానవజాతి పరిణామాన్ని మానవశాస్త్రం క్షుణ్ణంగా అధ్యయనం చేస్తుంది. మానవ శాస్త్రంలో అయిదు విభాగాలున్నాయి. అవి 1. శారీరక మానవశాస్త్రం (Physical Anthropology), 2. పురావస్తు శాస్త్రం (Archeology), 3. భాషామానవ శాస్త్రం (Linguistics), 4. సామాజిక - సాంస్కృతిక మానవ శాస్త్రం (Socio-Cultural Anthropology), 5.అనుప్రయుక్త మానవశాస్త్రం (Applied Anthropology), . అరిస్టాటిల్ క్రీ.పూ. 384లో 'ఆంత్రొపోలజిస్ట్ (Anthropologist) అనే పదాన్ని మొట్టమొదటిసారిగా సృష్టించాడు. ప్రఖ్యాత జర్మన్ భావవాది అయిన ఇమాన్యుయేల్ కాంట్ 1979వ సంవత్సరంలో ఆంత్రోపాలజీ (Anthropology) అనే గ్రంథాన్ని రాసి అందులో మానవుడు జంతువునుండి పుట్టాడని వివరించాడు. ఈ ఆంత్రోపాలజీ అనే పదాన్ని 1822వ సంవత్సరంలో బ్రిటిష్ విజ్ఞాన సర్వస్వం (Encyclopaedia)లో చేర్చడం జరిగింది. మరుగున పడిన చరిత్రలో మానవుని సంస్కృతి, తరతరాలుగా అది పరిణామం చెందిన వివిధ దశలను ప్రత్యేక ఆసక్తితో మానవశాస్త్రం అధ్యయనం చేస్తుంది.

BRAOU

మానవ శాస్త్రంలో ఒక భాగమైన సామాజిక మానవశాస్త్రం ఆదిమ మానవుని సామాజిక సంస్థలతో ఉన్న సంబంధాలను అధ్యయనం చేస్తుంది. సమాజశాస్త్రం కూడా ఇవే అంశాలను వర్తమాన సమాజానికి పరిమితమై అధ్యయనం చేస్తుంది. మానవుడి సంస్కృతితో పాటు సామాజిక సంబంధాలను, సామాజిక సంస్థలతో వ్యక్తికి గల అనుబంధాన్ని ఈ శాస్త్రం పరిశీలిస్తుంది. అంటే మానవశాస్త్రం, సమాజ శాస్త్రం అధ్యయనాంశాలు ఒక్కటే. అందువల్లనే కొందరు సమాజశాస్త్రం, మానవ శాస్త్రం అనేవి ఒకే అధ్యయనాంశానికి గల రెండు పేర్లుగా పరిగణిస్తారు. క్లక్‌హామ్ (Kluckholm) మాటల్లో "సమాజశాస్త్రం కార్యాచరణ, వర్తమానం వైపు మొగ్గుచూపుతుండగా మానవశాస్త్రం అవగాహన, గతం వైపు మొగ్గుచూపుతుంది."

సమాజశాస్త్రానికి, మానవ శాస్త్రానికి అవినాభావ సంబంధముంది. రెండు శాస్త్రాల అధ్యయనాంశాలు ఒక దానిపై మరొకటి ఆధారపడతాయి. సమాజశాస్త్రానికి కావలసిన సమాచారాన్ని మానవశాస్త్రం అందిస్తుంది. ప్రస్తుత సమాజంలో మానవుని ప్రవర్తన, అతడికి సమాజంతోనూ, సంస్కృతితోనూ, సామాజిక సంస్థలతోనూ

గల సంబంధ బాంధవ్యాలను అర్థం చేసుకోవాలంటే మానవశాస్త్రం అందించే గతకాలపు మానవ సంస్కృతిపై అవగాహన అవసరం. మానవశాస్త్రవేత్తలైన లింటన్ (Linton), కార్డినర్ (Kardiner), మాలినోవిస్కీ (Malinowski), పరిశోధనలు చేసి అందించిన సమాచారం నేటికీ సమాజశాస్త్రానికి అవసరమవుతుంది. అదే విధంగా సమాజశాస్త్రవేత్తల పరిశోధనలు కూడా మానవశాస్త్ర అధ్యయనానికి తోడ్పడతాయి. ఉదాహరణకు వర్తమాన సమాజంలో ప్రయివేటు ఆస్తిచెలామణిలో ఉన్నందువల్ల ఆదిమ సమాజాలలో కూడా ఈ తరహా విధానం ఉందనేది మొర్గాన్ అనే మానవశాస్త్రవేత్త నిర్ధారించాడు. ఈ విధంగా మానవశాస్త్రం, సమాజశాస్త్రం ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ వీటి అధ్యయనాంశాలు ఒకే విధంగా ఉండటం వలన వీటిని కవలపిల్లలు (Twins)గా ఎ.ఎల్.క్రోబర్ (A.L.Kroeber) వర్ణించాడు.

అయితే సమాజశాస్త్రం, మనో విజ్ఞానశాస్త్ర అధ్యయనాంశాలు ఒకటే అయినప్పటికీ ఈ రెండు శాస్త్రాల మధ్య వ్యత్యాసం కూడా ఉంది మానవశాస్త్రం గత కాలంలో మానవునికి సంబంధించిన రాజకీయ, కుటుంబ, మత, పారిశ్రామిక, సాంస్కృతిక రంగాల వంటి సకల అంశాలపై దృష్టి సారించి, వీటిని కూలంకషంగా పరిశీలిస్తుంది. సమాజశాస్త్రం మాత్రం మానవుడి సామాజిక సంబంధాలపైనే దృష్టిని కేంద్రీకరిస్తుంది. వ్యక్తుల మధ్య సామాజిక సంబంధాలకు ఆస్కారం ఉన్న విషయాలనే అధ్యయనం చేస్తుంది. సామాజిక శాస్త్రవేత్తల అధ్యయనాలు ఎక్కువగా శాస్త్రీయ పద్ధతిలో సేకరించిన అనేక విషయాలపై ఆధారపడి, గణాంకాల ఆధారంగా ఉంటాయి. కానీ మానవ శాస్త్ర అధ్యయనాలు ఎక్కువగా ఆయా గిరిజన సమాజ ప్రజలతో నివశిస్తూ చేసే సహభాగ పరిశీలన (Participant Observation) మీద ఆధారపడి ఉంటాయి. చివరగా సమాజశాస్త్రం వర్తమాన సమాజాన్ని అధ్యయనం చేయడంతోపాటు భవిష్యత్ ప్రణాళికా రూపకల్పనకు దోహదం చేస్తుంది. మానవ శాస్త్రం గతాన్ని అధ్యయనం చేయడం తప్ప భవిష్యత్ మానవాళికి సంబంధించిన సూచనలేవీ ఇవ్వదు.

## 2.4 సమాజశాస్త్రం - మనోవిజ్ఞానశాస్త్రం

ఇంగ్లీషులో 'సైకాలజి'గా పిలవబడే మనోవిజ్ఞానశాస్త్రం 'సైకె' (Psyche) మరియు లోగస్ (Logos) అనే రెండు గ్రీకు పదాల కలయికతో పుట్టింది. సైకె అనగా ఆత్మ లేదా మనస్సు, లోగస్ అనగా శాస్త్రం. ఈవిధంగా మనోవిజ్ఞాన శాస్త్రం మానవుని మనస్సుని, మానసిక ప్రవర్తనను పరిశీలిస్తుంది. డబ్ల్యూ.ఊంట్ (W.Wundt) అనే జర్మన్ శాస్త్రవేత్త 1879వ సంవత్సరంలో లీప్‌జిగ్ అనే చోట మొట్టమొదటి మనోవిజ్ఞానశాస్త్ర ప్రయోగశాలను స్థాపించి ప్రయోగాత్మక మనోవిజ్ఞానశాస్త్ర పితామహునిగా పేరొందాడు. మనో విజ్ఞానశాస్త్రాంశాలలో కొన్నింటిని జంతువులపై పరిశోధనలు జరిపి వాటి ఫలితాలను మానవులపై అన్వయించడం ద్వారా దీనిని జీవశాస్త్రంలో ఒక భాగంగానూ, మానవ ప్రవర్తన సమాజంలో ఇతరుల ప్రవర్తన వల్ల ప్రభావితం కావడం వల్ల దీనిని సాంఘిక శాస్త్రంగానూ పరిగణిస్తున్నారు. ఆవిధంగా మనోవిజ్ఞానశాస్త్రం "జీవసాంఘిక శాస్త్రం"గా పరిగణింపబడుతుంది. మనో విజ్ఞానశాస్త్రంలో రెండు ప్రధాన భాగాలున్నాయి. అవి. 1. శాస్త్రీయ మనోవిజ్ఞానశాస్త్రం (Scientific Psychology) 2. అనుప్రయుక్త మనో విజ్ఞానశాస్త్రం (Applied Psychology) వ్యక్తియొక్క మానసిక స్వభావ స్వరూపాలు, ప్రజ్ఞ (Intelligence),

మూర్తిమత్వం (Personality), ప్రవర్తన (Behaviour), అభ్యసన (Learning), చింతన (Thinking) వంటి విషయాలను శాస్త్రీయంగా అధ్యయనం చేస్తుంది.

సమాజశాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం పరస్పర ఆధారితాలు. సమాజశాస్త్రానికి వివిధ అంశాలు అధ్యయనం కోసం మనో విజ్ఞానశాస్త్ర సహకారం అవసరం. సమాజంలోని వ్యక్తుల, సమూహాల ప్రవర్తనను అర్థం చేసుకోవాలంటే వారి మానసిక పరిస్థితి గురించిన అవగాహన కావాలి. వ్యక్తుల మధ్య పరస్పర విరుద్ధ మనస్తత్వాలు, వివిధ సందర్భాలలో వారిలో ఏర్పడే స్పందనలను సమాజశాస్త్రజ్ఞులు మనో విజ్ఞాన శాస్త్ర సహకారంతో అర్థం చేసుకోగలిగితే సమాజంలో వారి ప్రవర్తనను, సామాజిక సంబంధాల స్వరూపాన్ని అర్థం చేసుకోవడం సులభతరమవుతుంది. సమాజంలో ప్రతి అంశానికీ మానసిక శక్తులే ప్రేరణ. వ్యక్తి కుటుంబ జీవనంలో పాల్గొన్నా, సమాజ జీవనంలో పాలుపంచుకున్నా భాగస్వామి అయినా అంతా అతని మానసిక శక్తుల ప్రేరణతో జరుగుతుంది. అదే విధంగా ఒక సమాజంలో పరివర్తన రావాలంటే ముందుగా ఆ సమాజ సభ్యుల్లో మానసికంగా మార్పు రావాలి. వీటన్నింటిని అర్థం చేసుకోవడానికి సమాజశాస్త్రం మనోవిజ్ఞానశాస్త్ర సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. అదే విధంగా మనో విజ్ఞాన శాస్త్రజ్ఞుడు కూడా వ్యక్తి ప్రవర్తనను అద్యయనం చేయడంలో సామాజికాంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి వస్తుంది. ఉదహారణకు బాలనేర ప్రవర్తనకు సంబంధించిన కారణాలను అధ్యయనం చేస్తున్నప్పుడు మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుడు నేరస్తుడు ఉన్న సమూహం యొక్క సామాజిక వాతావరణాన్ని పరిశీలించాలి. అప్పుడు మనోవిజ్ఞానశాస్త్రం సమాజశాస్త్రంపై ఆధారపడక తప్పదు. ఈ విధంగా ఈ రెండు శాస్త్రాలు పరస్పర ఆధారితాలు.

అయితే సమాజశాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రాల మధ్య వ్యత్యాసం కూడా ఎంతో ఉంది. ఈ రెండు శాస్త్రాల దృక్పథాలలో వైరుధ్యం ఉంటుంది. సమాజశాస్త్ర అధ్యయనంలో సామాజిక దృష్టికి ప్రాధాన్యతనిస్తే మనోవిజ్ఞానశాస్త్రంలో మానసిక అంశాలకే ప్రాధాన్యత అభిస్తుంది. సమాజశాస్త్రం మొత్తం సమాజాన్ని అధ్యనం చేస్తుంది. అవసరాన్ని బట్టి వ్యక్తి లేదా సమూహాలను యూనిట్లుగా తీసుకొంటుంది. ఆవిధంగా సమాజశాస్త్ర పరిధి విస్తృతమైనది. కానీ మనోవిజ్ఞానశాస్త్రం సమూహ సభ్యులుగా వ్యక్తుల భావోద్రేకాలను, పరస్పర చర్యలను మాత్రమే అధ్యయనం చేయడం వల్ల దీని పరిధి పరిమితంగా ఉంటుంది. చివరిగా మానసిక ప్రతిస్పందనలు ఎల్లపుడు బహిర్గతం కావు. కొన్ని సందర్భాలలో సమాజంలోని కట్టుబాట్లకు, సంప్రదాయాలకు భయపడి వ్యక్తులు తమలోని ప్రతిస్పందనలను వెల్లడించలేరు. ఇలాంటి సందర్భాలలో అధ్యయనానికి అవకాశం ఉండదు. అయితే వ్యక్తులు తమ అవసరార్థం సామాజిక సంబంధాలను ఏర్పరచుకొంటారు. కాబట్టి, ఇవి ఎల్లప్పుడూ బహిర్గతమవుతాయి. అందువల్ల వాటిని అధ్యయనం చేయడం తేలిక.

BRAOU

## 2.5 సమాజశాస్త్రం - రాజనీతి శాస్త్రం

సాంఘిక శాస్త్రాలన్నింటిలో రాజనీతి శాస్త్రం ప్రాచీనమైనది. గ్రీకు తత్త్వవేత్తలైన ప్లేటో (క్రీ.పూ. 427 - 347) రాసిన 'రిపబ్లిక్'లోనూ అరిస్టాటిల్ (క్రీ.పూ.384 - 322) రచించిన 'పాలిటిక్స్'లోనూ, భారతీయుల రామాయణ, మహాభారతాల వంటి ఇతిహాసాలలోనూ, కౌటిల్యుని అర్థశాస్త్రం వంటి గ్రంథాలలో కూడా రాజ్యం, రాజ్యాధినేతల గురించి, పౌరుల గురించి విశేషంగా ప్రస్తావించడం జరిగింది. రాజనీతి శాస్త్రం మానవునికి ప్రభుత్వానికి గల సంబంధ బాంధవ్యాల గురించి తెలియపరస్తుంది. ఈ శాస్త్రం ప్రభుత్వానికి, రాజకీయాలకు సంబంధించిన కార్యకలాపాలను, మానవులు తమను తాము పాలించుకొనే లేదా పాలితమయ్యే విధానాన్ని, ప్రభుత్వ వ్యవస్థలను, ఆ వ్యవస్థల నిర్వహణ విధానాన్ని, ప్రభుత్వ పరమైన ఏజెన్సీల విధులను, అధికార వినియోగాలను అధ్యయనం చేస్తుంది.

రాజనీతి శాస్త్రానికి, సమాజశాస్త్రానికి అవినాభావ సంబంధం ఉంది. రెండు శాస్త్రాలకు మూలం వ్యక్తి, అతని కార్యకలాపాలు. సమాజాన్ని రాజనీతి శాస్త్రజ్ఞులు రాజ్యంగా పరిగణిస్తారు. సమాజసభ్యులు రాజనీతి శాస్త్ర పరిజ్ఞానంలో పౌరులు. అందువల్ల సమాజశాస్త్రానికి, రాజనీతి శాస్త్రానికి సన్నిహిత సంబంధం ఉన్నది. చారిత్రాత్మకంగా పరిశోధిస్తే సమాజశాస్త్రం వేళ్లు రాజనీతి శాస్త్రంలో ఉన్నాయని మోరిస్ గిన్స్‌బర్గ్ (Morris Ginsberg) పేర్కొన్నాడు. ఇందువల్లనే ప్లేటో రాసిన 'రిపబ్లిక్', అరిస్టాటిల్ రాసిన 'పాలిటిక్స్' గ్రంథాలు రాజనీతి



Dr. BRAOU LIBRARY Acc. No. 115073 Class No.

శాస్త్రానికి, సమాజశాస్త్రానికి కూడ ఉపయోగపడుతున్నాయి. వీటిలో రాజకీయ అంశాలనేకం విపులంగా చర్చించబడ్డాయి.

రాజనీతి శాస్త్రంలో అధ్యయనం చేసే ప్రభుత్వాంగాలు, వాటి పనితీరు, చట్టాలు, వివిధ రాజకీయ కార్యకలాపాలను నియంత్రించేవి సామాజిక ప్రక్రియలే. అందువల్ల రాజనీతి శాస్త్రంలోని వివిధ అంశాలను, అవి పనిచేసే విధానాన్ని, వాటి స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడానికి సమాజశాస్త్ర అవసరం ఉంది. గిడ్డింగ్స్ (Giddings ) అభిప్రాయం ప్రకారం రాజ్యానికి సంబంధించిన సిద్ధాంతాలను బోధించాలంటే ముందు సమాజశాస్త్రంలోని ప్రాథమిక విషయాలు బోధించాలి. లేకపోతేన్యూటన్ సిద్ధాంతాలు తెలియని వ్యక్తికి ఖగోళశాస్త్రం భోదించినట్టు ఉంటుంది. వివిధ రాజకీయ సమస్యలను అర్థం చేసుకోవడానికి, వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించడానికి సమాజశాస్త్ర అవసరం తప్పనిసరి. ఉదాహరణకు దేశంలో గల మతతత్వ సమస్యను పరిష్కరించాలంటే మతం, దానిలో ఇమిడియున్న సామాజికాంశాలను అర్థం చేసుకొని మాత్రమే సరైన పరిష్కార మార్గాలు చేపట్టగలం. ఈ విధంగా రాజనీతిశాస్త్రం సమాజశాస్త్రంపై ఆధారపడి ఉన్నది.

అదేవిధంగా సమాజశాస్త్రం కూడా రాజనీతిశాస్త్రంపై ఆధారపడి ఉన్నది. ప్రభుత్వాన్ని బట్టి, చట్టాలను బట్టే సమాజంలో స్థితిగతులుంటాయి. ఉదాహరణకు భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం చేపట్టిన అంటరానితనం నిర్మూలనా కార్యక్రమాలు, చేసిన చట్టాల వలన సమాజంలో అస్పృశ్యత విషయంలో చెప్పుకోదగ్గ తేడాలే సంభవించాయి. సామాజిక మార్పు సంభవించాలంటే ఆ అవకాశం, ప్రేరణ ప్రభుత్వాలు ఇవ్వాలి. ఈ విధంగా సమాజానికి, రాజ్యానికి విడదీయరాని సంబంధం ఉన్నది.

రాజనీతి శాస్త్రానికి, సమాజశాస్త్రానికి తేడాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. దృక్పథాల రీత్యా ఈరెండు విభేదిస్తున్నాయి. సమాజాన్ని అధ్యయనం చేసే శాస్త్రం సమాజశాస్త్రమైతే, రాజ్యాన్ని అధ్యయనం చేసేది రాజనీతి శాస్త్రం. వ్యక్తిని సామాజిక జీవిగా పరిగణిస్తుండగా, రాజనీతి శాస్త్రం రాజకీయ సంస్థను అధ్యయనం చేస్తుంది. రాజనీతిశాస్త్ర పరిధికంటే సమాజశాస్త్ర పరిధి విస్తృతమైనది. పౌరునిగా వ్యక్తి యొక్క కార్యకలాపాలను మాత్రమే రాజనీతి శాస్త్రం అధ్యయనం చేస్తుంది. కానీ శిశువు జన్మించినప్పటినుంచి మరణించేంతవరకు గల సామాజిక సంబంధాలను సమాజశాస్త్రం పరిశీలిస్తుంది. ఈ విధంగా సమాజశాస్త్రం ఒక విస్తృత శాస్త్రం. సాధారణంగా రాజనీతి శాస్త్రం వ్యవస్థీకృత సమాజాలను మాత్రమే అధ్యయనం చేస్తుంది. కానీ సమాజశాస్త్రం వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత సమాజాలను రెండింటినీ అధ్యయనం చేస్తుంది. నేటి వ్యవస్థీకృత ఆధునిక సమాజాలకు ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో అంతే ప్రాధాన్యంతో అవ్యవస్థీకృత ఆదిమ సమాజాలను కూడా సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. చివరిగా రాజనీతి శాస్త్రం సామాజిక నియంత్రణ సాధనంగా ఒక్క ప్రభుత్వాన్ని మాత్రమే గుర్తిస్తుంది. కానీ సమాజశాస్త్రం విద్య, మతం, కుటుంబం, చట్టం వంటి అన్ని రకాల సామాజిక నియంత్రణలకు ప్రాధాన్యతనిస్తుంది.

## 2.6 సమాజశాస్త్రం - అర్థశాస్త్రం

మానవుడు సమాజంలో సుఖమయజీవనాన్ని గడపాలంటే అతడికి కొన్ని సౌకర్యాలు కావాలి. అపరిమితమైన మానవుని కోరికలతో పోల్చినపుడు వనరులెప్పుడూ కొరతగానే ఉంటాయి. ఈ పరిమితమైన వనరులతో అపరిమితమైన కోరికలను తీర్చుకోవడంలో వస్తువుల ఉత్పత్తి, వినిమయం, పంపిణీలు జరుగుతాయి. అర్థశాస్త్రం సంపదయొక్క ఈ మూడు అంశాలను అధ్యయనం చేస్తుంది. ఇంతేకాక ద్రవ్యం, ధరల మీద డిమాండ్, సప్లయ్‌ల ప్రభావం, ద్రవ్యచలామణి వేగం, పెట్టుబడికి పొదుపు మొత్తాల నిష్పత్తి, ఆర్థిక చాంకాల పరస్పర సంబంధాన్ని కూడా అర్థశాస్త్రం అధ్యయనం చేస్తుంది.

సమాజంలోని వ్యక్తుల, సమూహాల సామాజిక సంబంధాలకి, ఆర్థిక కార్యకలాపాలకి పరస్పర సంబంధం ఉంటుంది. సమాజంలో గల నిరుద్యోగం, పేదరికం వంటి ఆర్థిక సమస్యల నిర్మూలనకు కేవలం ఆర్థిక విధానాలు, ఆర్థిక సంస్కరణలు పరిష్కారం చూపజాలవు. ఆసమాజంలోని మానవుల సామాజిక స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి, ఆర్థిక సమస్యల పరిష్కారానికి మార్గాలను వెతకాలి. సామ్యవాదం, కమ్యూనిజం, సంక్షేమరాజ్యం వంటి



BRAOU

ఆర్థిక సిద్ధాంతాలన్నీ సమాజ పునర్వ్యవస్థీకరణ విధానాలే. అందువల్లనే థామస్ లే అనే సాంఘిక శాస్త్రవేత్త అర్థశాస్త్రాన్ని ఒక ప్రత్యేక సాంఘిక శాస్త్రంగా కాక, సమాజశాస్త్రంలో ఒక ప్రత్యేక విభాగంగా పరిగణించాలని అభిప్రాయపడ్డాడు.

అదేవిధంగా సమాజంలోని ప్రతి అంశాన్ని ఆర్థిక దృగ్విషయం నియంత్రిస్తుంది. ఆర్థిక అంశాన్ని వదిలిపెట్టి సమాజంలోని ఏవిషయాన్ని అధ్యయనం చేసినా అది పాక్షికమే అవుతుంది. కాబట్టి సమాజశాస్త్ర అధ్యయనానికి అర్థశాస్త్ర సహకారం కావాలి. కార్ల్‌మార్క్స్ ప్రకారం సమాజంలోని ఏ సమస్యకైనా ఆర్థిక స్వరూపాలే కీలకమైనవి, సమాజంలో కనిపించే సామాజిక వర్గాలలో ఆర్థిక స్వరూపం నిగూఢంగా ఉంటుంది. హెర్బర్ట్ స్పెన్సర్ సామాజిక సంబంధాల విశ్లేషణలో ఆర్థిక కార్యకలాపాలను చేర్చి తీరాలని అభిప్రాయం వ్యక్తం చేశాడు. అలాగే సమ్నర్, దుర్క్‌హైమ్, మార్క్స్ వెబర్ వంటి సామాజిక శాస్త్రవేత్తలు సమాజాన్ని ఆర్థిక సంస్థల ద్వారా అధ్యయనం చేయడానికి ప్రయత్నం చేశారు. ఉదాహరణకు దుర్క్‌హైమ్ తన 'శ్రమవిభజన' ( Division of Labour) అనే గ్రంథంలో అర్థశాస్త్ర అంశమైన శ్రమవిభజనకు సంబంధించిన సామాజిక విధులను వివరంగా విశ్లేషించాడు. అదే విధంగా యాచన, వ్యభిచారం, నేరం వంటి పలు సామాజిక సమస్యల పరిష్కారానికి సమాజంలోని ఆర్థిక జీవన పరిస్థితులను అధ్యయనం చేయడం తప్పనిసరి అవుతుంది. ఈ విధంగా అర్థశాస్త్రము, సమాజశాస్త్రము ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి.

అయితే ఈ రెండు శాస్త్రాల మధ్య తేడాలు కూడా లేకపోలేదు. సమాజంలో సామాజిక సంబంధాలకు అవకాశం ఉన్న ప్రతి విషయాన్ని సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. కాబట్టి దీని పరిధి విస్తృతమైనది. అర్థశాస్త్రం కేవలం సమాజంలో మానవుని ఆర్థిక కార్యకలాపాల అధ్యయనానికి పరిమితమైనది. అర్థశాస్త్రం వస్తూత్పత్తి, వినిమయం, పంపిణీలను మాత్రమే అధ్యయనం చేస్తూ సమాజంలో మానవుడి భౌతిక వస్తుపర సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తుంది. కానీ సమాజశాస్త్రం మానవుని జీవితంలో గల అన్ని సామాజిక సంబంధాలను వివరంగా, శాస్త్రీయంగా పరిశీలిస్తుంది. చివరిగా సమాజశాస్త్రం మానవ సమూహాల ప్రాతిపదికగా అధ్యయనం సాగిస్తుండగా అర్థశాస్త్రం ప్రధానంగా వ్యక్తి ప్రాతిపదికగా ఆర్థిక కార్యకలాపాల అధ్యయనం సాగిస్తుంది.

## 2.7 సమాజశాస్త్రం - చరిత్ర

చరిత్ర అనేది గడచిన కాలంలో మానవజాతి కార్యకలాపాలకు చెందిన అధ్యయనం రాజ్యాల ఆవిర్భావ పతనాలు, సామాన్య ప్రజల ఉచ్ఛహీన స్థితులు, నాగరికతల గమనం, విభిన్న సంస్కృతుల పరిణామం మొదలైన విషయాలను చరిత్ర పరిశీలిస్తుంది. అంటే స్థూలంగా సామాజిక పరివర్తనకు సంబంధించిన సంఘటనలను, పరిణామాలను ఒక క్రమాన్ని అనుసరించి రాసిన విషయ సంగ్రహం చరిత్ర. చరిత్ర, సమాజశాస్త్రం రెండూ పరస్పర ఆధారితాలు. చరిత్ర సరఫరా చేసే సారాంశాన్ని తీసుకొని సమాజశాస్త్రవేత్తలు సమాజశాస్త్రంతో అన్వయిస్తూ వివరణలు రూపొందిస్తారు. ఉదహారణకు చైనాలో 1989వ సంవత్సరంలో జరిగిన విద్యార్థుల ప్రజాస్వామ్య ఆందోళనను చరిత్ర ఒక ముఖ్యఘట్టంగా పేర్కొంటుంటే, సమాజశాస్త్రం విద్యార్థులలో ప్రజాస్వామ్య ఉద్యమ విస్ఫోటనానికి గల సామాజిక, ఆర్థిక కారణాలను పరిశీలిస్తుంది. ఈ వివరణలు చరిత్రకు అవసరమవుతాయి. కాబట్టి చరిత్రలోని వివిధ ముఖ్యఘట్టాలను అర్థం చేసుకోవాలంటే సమాజశాస్త్ర సహకారం చరిత్రకు అవసరం.

అదేవిధంగా చారిత్రక ఆధారాలు లేకుండా సమాజశాస్త్ర అధ్యయనం చుక్కాని లేని నావ అవుతుంది. సమాజశాస్త్ర దృష్టి ఎక్కువగా వర్తమాన సమాజాలపై ఉన్నప్పటికీ పూర్వ సమాజాల తీరు తెన్నులను అనేక సందర్భాలలో ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఆవిధంగా భవిష్యత్ సమాజస్వభావ దర్శనిగా సమాజశాస్త్రం ఉపయోగపడుతుంది. నిజానికి సమాజాలు ఎలా పరివర్తనకు గురయ్యాయి, సమాజ నిమ్నోన్నత దశలకు కారణాలేమిటి? అనే అంశాలను చరిత్ర పరిశీలిస్తుంది. అంటే ఘటనల వివరాలను సమాజశాస్త్రం చరిత్ర నుంచి స్వీకరిస్తుంటే, ఘటలన నేపథ్యాన్ని, విశ్లేషణను చరిత్ర సమాజశాస్త్రం నుంచిగ్రహిస్తుంది. అందువల్లే జి.ఇ. హోవర్డ్ (G.E.Howard) అనే సమాజశాస్త్రవేత్త 'చరిత్ర అంటే గతకాలపు సమాజశాస్త్రమని, సమాజశాస్త్రమంటే నేటి చరిత్ర' అని వ్యాఖ్యానించాడు.

BRAOU

అయితే చరిత్ర, సమాజశాస్త్రాల మధ్య సంబంధమున్నప్పటికీ వీటి మధ్య వ్యత్యాసాలు కూడా బాగానే ఉన్నాయి. చరిత్ర పరిధి గత కాలపు సమాజాల మీద కాగా సమాజశాస్త్రం వర్తమాన సమాజాలపై దృష్టి కేంద్రీకరిస్తుంది. చరిత్ర యొక్క ఆసక్తి అంతా పూర్వకాల రాజరిక వ్యవస్థలు, కాలగర్భంలో కలిసిపోయిన రాజ్యాలు, వాటి పాలకులు, ప్రజల జీవన పరిస్థితులు, రాజ్యాల పతన కారణాలు మొదలైన వాటిపై ఉంటుంది. సమాజశాస్త్రం గతకాల సామాజిక వ్యవస్థల ప్రాతిపాదికగా సమకాలీన పరిస్థితులను అధ్యయనం చేస్తూ, అవసరమైతే భవిష్యత్తులో సంతరించుకోబోయే మార్పులను కూడా సూచించగలదు. అదేవిధంగా చరిత్ర, సామాజిక శాస్త్ర దృక్పథాల్లో కూడా తేడా ఉంది. సంఘటనల క్రమం, తేదీలకే ప్రాధాన్యతనిచ్చే చరిత్ర సంఘటనలను అన్ని కోణాల నుంచి అధ్యయనం చేయదు. ఉదాహరణకు ఫ్రెంచి, అమెరికా, సోవియట్ విప్లవాలను చరిత్ర నమోదు చేస్తుంది. కానీ ఈ విప్లవ కాలాలలో ప్రజల సామాజిక జీవనంపై దృష్టి పెట్టదు. కానీ సమాజశాస్త్ర పూర్తిదృష్టి సామాజికమే. పైన పేర్కొన్న విప్లవ కాలలలోని సామాజిక జీవనం, స్థితిగతులపై సమాజశాస్త్రం ఆసక్తి చూపుతుంది. ఆవిధంగా ఈ రెండు శాస్త్రాల దృక్పథాలలో స్పష్టమైన వ్యత్యాసం ఉంది. అలాగే చరిత్రకారుడు చారిత్రక కాలంలో జరిగిన సంఘటనల మధ్య గల తేడాలపై ఎక్కువ ఆసక్తి చూపుతాడు. కానీ సమాజశాస్త్రజ్ఞుడు సంఘటనల మధ్య ఉండే సారూప్యతల మీద దృష్టిని కేంద్రీకరిస్తాడు. ఉదహారణకు సాధారణ జీవనానికి తేడాగా, వ్యతిరేఖంగా జరిగిన ఫ్రెంచి, అమెరికా, రష్యా విప్లవాలపై చరిత్రకారుడు ప్రత్యేక ఆసక్తిని చూపుతాడు. కానీ సమాజశాస్త్రజ్ఞుడు ఈవిప్లవాలలో దేనిమీదా ప్రత్యేక ఆసక్తిని చూపక, వీటిని సామాజిక దృగ్విషయాలుగా, సామాజిక సమూహాల మధ్య ఏర్పడిన వైరుధ్యంగా పేర్కొంటాడు. విప్లవాలు సాగిన వివిధ దశలను, విప్లవాల కారణాలను, వివరణలను, ఫలితాలను సిద్ధాంతీకరిస్తాడు. చివరిగా చరిత్రకారుడు తన అధ్యయన విషయం కోసం లిఖిత, అలిఖిత ఆధారల మీద మాత్రమే ఆధారపడతాడు. కానీ, సమాజశాస్త్రజ్ఞుడు అధ్యయన విషయానికి సంబంధించిన దత్తాంశ సేకరణలో పరిశీలన, నమూనా, ఇంటర్వ్యూ, ప్రశ్నావళి వంటి పద్ధతులను ఆశ్రయిస్తాడు.

## 2.8 సమాజశాస్త్రం - తత్వశాస్త్రం

ఆంగ్లంలో ఫిలాసఫిగా పిలవబడే తత్వశాస్త్రము అన్ని శాస్త్రాల కంటే పురాతన మైనది. మొదట్లో అన్ని సాంఘిక శాస్త్రాలు తత్వశాస్త్రంలో కలిసి ఉండేవి. తర్వాత విజ్ఞానాభివృద్ధి జరగడం, శాస్త్రీయ పద్ధతుల ఆచరణలో స్వీయ పద్ధతులను ఉపయోగించుట వలన మిగతా సాంఘిక శాస్త్రాలు మాతృశాస్త్రం నుండి వేరైనాయి. మానవుని సాంఘిక జీవనంలో ఉన్నతప్రమాణాలని, నైతిక విలువలని సృష్టించి మానవుని మనుగడను ఉన్నత స్థితికి తీసుకెళ్లేదే తత్వశాస్త్రం. సమాజశాస్త్రం, తత్వశాస్త్రం కూడా పరస్పర ఆధారితాలు. సమాజశాస్త్రం సాంఘిక సంబంధాలను, సాంఘిక ప్రక్రియలను, సాంఘిక సంస్థలను, సాంఘిక నిర్మితిని పరిశీలిస్తే తత్వశాస్త్రం సాంఘిక విలువలను, వాటి ప్రమాణాలను అధ్యనం చేస్తుంది. సమాజంలోని వ్యక్తుల క్రమబద్ధమైన సామూహిక జీవనానికి తత్వశాస్త్రం తప్పనిసరి అయింది. వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడానికి, ప్రమాణాలు, కట్టుబాట్లు,వాచార సంప్రదాయాలను అమలు పర్చడానికి, సమాజంలో సమస్యలు రాకుండా ఉండటానికి, వచ్చిన సామాజిక సమస్యలకు వెంటనే పరిష్కారం పొందటానికి సమాజశాస్త్రవేత్తలు తప్పనిసరిగా తత్వశాస్త్ర సహాయం తీసుకోవలసి వస్తుంది. పురాతన కాలం నుండికూడా తత్వశాస్త్రం లనేక రచనల ద్వారా, గ్రంథాల ద్వారా సామాజిక జీవనాన్ని తెలియజేస్తూనే ఉంది.

అయితే తత్వశాస్త్రము ఊహ, ఆలోచన, తర్కము ఆధారంగా శాస్త్ర విజ్ఞానాన్ని సమకూర్చుకుంటుంటే సమాజశాస్త్రం తన స్వంత దత్తాంశ సేకరణ పద్ధతుల ద్వారా అధ్యనాలు కొనసాగిస్తాడు. ఇందులో ఊహ, తర్కము మొదలైన వాటికి స్థానమే లేదు. ఆవిధంగా సమాజ శాస్త్రం, తత్వశాస్త్రం ఒకదానితో ఒకటి విభేదిస్తాయి కూడా.

ఈవిధంగా సమాజశాస్త్రం దాదాపు అన్ని సాంఘిక శాస్త్రాలతో సన్నిహిత సంబంధం కల్గి ఉంది. అందువల్లనే సమాజశాస్త్రాన్ని బహుముఖ విషయశాస్త్రంగా పిలుస్తున్నారు. వాస్తవానికి ఈశాస్త్రాన్ని అతి ఉపయుక్తమైన శాస్త్రంగా మార్చిన ఘనత అన్ని సాంఘిక శాస్త్రాలకు చెందుతుంది. 19వ శతాబ్దిలోనే ఆవిర్భవించినా సమాజశాస్త్రం ఇటీవల కాలంలో బాగా అభివృద్ధి చెంది, పరిపక్వతను పొంది ఒక ప్రత్యేక విషయంగా కొనసాగుతోంది. సమాజశాస్త్రానికి, ఇతర సాంఘిక శాస్త్రాలకు మధ్య దృక్పథం, పరిధి, విషయ సేకరణలో అంతరం ఉన్నప్పటికీ ఒక శాస్త్ర అధ్యయనానికి మరొక శాస్త్ర సహకారం అవసరం.

## 2.9 సారాంశం

మొదట్లో సాంఘిక శాస్త్రాలన్నీ తత్వశాస్త్రంలో భాగంగా ఉండేవి. తర్వాతి కాలంలో తమ క్షేత్రాలలో పరిశోధనకు సంబంధించిన శాస్త్రీయ పద్ధతులను అవలంబించి, ఆయా శాస్త్రాలు మాతృశాస్త్రం నుంచి వేరైనాయి. ఈ సాంఘిక శాస్త్రాలన్నీ మానవ అధ్యయనానికి సంబంధించిన భిన్న పరిణామాలను చర్చిస్తాయి. ఒక్కొక్క సాంఘికశాస్త్రానికి ఒక్కో ప్రత్యేక దృక్పథం ఉంది. ఉదాహరణకు చరిత్ర గతించిన కాలంలో సంభవించిన పరిణామాలనే పరిశీలిస్తుంది. రాజనీతిశాస్త్రం సమాజంలో మానవుని రాజకీయ కార్యక్రమాలను అధ్యయనం చేస్తుంది. అర్థికశాస్త్రం మానవుని అర్థిక కార్యకలాపాలపైనే దృష్టి సారిస్తుంది.

మిగతా సాంఘిక శాస్త్రాల వలెనే సమాజశాస్త్రానికి కూడా ప్రత్యేక దృక్పథం ఉంది. ఇది సంఘటనలను పూర్తిగా సామాజిక దృక్పథంతో పరిశీలన జరపడంతో పాటు ఇతర సాంఘిక శాస్త్రాల సారాంశాలను కూడా స్వీకరించి సంపూర్ణ మానవ జీవనాన్ని ఆవిష్కరించేందుకు కృషి చేస్తుంది. అదువల్ల చరిత్ర, అర్థికశాస్త్రం, రాజనీతిశాస్త్రం, మానవశాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రం, తత్వశాస్త్రం వంటి సాంఘిక శాస్త్రాలతో సమాజశాస్త్రానికి అవినాభావ సంబంధం ఉంది. ఈ సాంఘికశాస్త్రాలు సమాజ శాస్త్రం నుంచి కొన్ని అంశాలను గ్రహిస్తుండగా, సమాజశాస్త్రం వాటినుంచి తనకు అవసరమైన విషయాలను స్వీకరిస్తుంది.

## 2.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈకింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.**

1. సమాజశాస్త్రం, ఇతర సాంఘిక శాస్త్రాలు ఏవిధంగా పరస్పరాధారితాలు?

2. ఏవైనా మూడు సాంఘిక శాస్త్రాలతో సమాజ శాస్త్రానికి గల సంబంధాన్ని వివరించండి.

**II ఈకింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.**

1. "సమాజశాస్త్రం, మానవశాస్త్రం కవలపిల్లలవంటివి" వివరించండి.

2. అర్థికశాస్త్రానికి, సమాజశాస్త్రానికి మధ్యగల సంబంధాన్ని వ్రాయండి.

## 2.11 చదవదగిన పుస్తకాలు


Alex Inkles - What is Sociology?

Bottomore, T.B. - sociology - a guide to problems and literature.

Gisbert - Fundamentals of Sociology.

Haralabos - Sociology - Themes and perspectives.

Harry M. Johnson - Sociology - A Systematic Introduction.

Mac Iver and Page - Society.

Sharma, R.N. - Principles of Sociology.

Paul B. Horton and Chester L. Hunt - Sociology.


BRAOU

BRAOU

# ఖండం- II

## ప్రధాన భావనలు

సమాజశాస్త్ర అధ్యయనంలో అనేక భావనలు ప్రాధాన్యతను కలిగి వున్నాయి. అసలు సమాజభావనకు మూలమైన వ్యక్తులు, సమూహాలు, సముదాయాలు అయా వ్యక్తులకు సమాజంలో ఉన్న హోదాలు, గౌరవ ప్రవృత్తులు అంతస్తులు ఇలా అనేక భావనల సమాహారమే సమాజశాస్త్రం. ఇవన్నీ పరస్పరం ఆధారపడడం వల్లే సమాజమనుగడ సాధ్యమవుతుంది.

ఈఖండంలో సామాజిక భావనలను వివరించడం జరిగింది. అయా భావనలు ఎలా ఏర్పడ్డాయి. ఎలాంటి పాత్రను పోషిస్తున్నాయి. సామాజిక వ్యవస్థలో వాటి ప్రాధాన్యత ఏమిటి అనే అంశాలను నాలుగు భాగాల్లో వివరించడం జరిగింది. అవి:

- మానవుడు, సమాజం
- సామాజిక సమూహాలు
- సముదాయం, సంఘం, గుంపు
- అంతస్తు, పాత్ర

BRAOU

BRAOU

# భాగం- 3: మానవుడు - సమాజం

విషయ క్రమం


3.0 ఉద్దేశాలు
3.1 పరిచయం
3.2 సమాజం - అర్థం, నిర్వచనం
3.3 సమాజం పుట్టుక - సిద్ధాంతాలు
3.3.1 దైవదత్త సిద్ధాంతం
3.3.2 ఫోర్సు సిద్ధాంతం
3.3.3 పరిణామ సిద్ధాంతం
3.3.4 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం
3.3.5 జైవిక సిద్ధాంతం
3.4 సమాజాలు - రకాలు
3.5 సమాజశాస్త్రలక్షణాలు
3.6 సహజ ప్రకార్యాలు
3.7 సమాజశాస్త్రం - మానవ సమాజం
3.8 సారాంశం
3.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు
3.10 చదవదగిన పుస్తకాలు


## 3.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సమాజావిర్భావ సిద్ధాంతములను తెలుసుకుంటారు.
- మానవుడికి - సమాజానికి మధ్య గల సంబంధాన్ని చర్చిస్తారు.
- సమాజ లక్షణాలను - ప్రకార్యాలను,
- జంతు సమాజానికి - మానవ సమాజానికి మధ్యగల వ్యత్యాసాలను అధ్యయనం చేస్తాము.

## 3.1 పరిచయం

మానవుడిని మిగతా జీవకోటి నుండి వేరుచేస్తూ అమరిన మేధోసంపత్తి వంటి భౌతిక లక్షణాలే మానవ జాతి వికాసానికి శ్రీకారం చుట్టాయి. జీవకోటిలో ఎక్కువ చతుష్పాదజీవులే. కాని మానవుడు మాత్రం ద్విపాదజీవి. మానవుడి మస్తిష్కం మానవజాతి ప్రాభవ మార్గం. వీటితోపాటు భావవ్యక్తీకరణ శక్తిని సముపార్జించుకొన్న మానవుడు అపూర్వ విజయాలు సాధించగలుగుతున్నాడు.

ప్రాణికోటి ఆవిర్భావం ఎలా జరిగిందో ఇదమిద్ధంగా తెలియదు. కానీ భూమి సూర్యునికి మరొక కోటిమైళ్ల దగ్గరగా ఉండి వుంటే ఆ అత్యుష్ణానికి మరో జీవం నశించి ఉండేది. అయితే సరైన దూరంలో ఉండడం వల్ల భూమి మీద జీవజాతుల ఆవిర్భావం, మనుగడ సాధ్యమైనాయి. భూమి ఇంతకంటే అధిక ద్రవ్యరాశిని కలిగినదైతే ప్రాణికోటికోటికి హాని కలిగించే వాయువులతో జీవనం సాధ్యమయ్యేదికాదు. మరీ తక్కువ ద్రవ్యరాశి కలిగినదైతే ప్రాణవాయువు భూమి నుంచి నిష్క్రమించడం వల్ల జీవనం సంభవమయ్యేదికాదు. అన్ని లక్షణాలు అన్ని నిష్పత్తులలో అమరి ఉండడంవల్ల భూమి జీవ చైతన్యంతో అలరారుతున్నది. భూమిపై జీవం ఉద్భవించి జీవనదిలా తరతరాలనుండి అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తూనే ఉన్నది. కానీ జీవరాశిలో ఎంతటి వైవిధ్యం? ఎంతటి వైచిత్రం? 

BRAOU

మానవజాతి ఇతర జంతుకోటి మధ్య ఎంతటి వ్యత్యాసమున్నది?

సుమారు 3 బిలియన్ల సంవత్సరాల క్రితం ఈ భూమి మీద ప్రాణి జన్మించినది. తొలి జంతువులు సూక్ష్మజీవరాసులు. ఈ సూక్ష్మజీవరాసులే లేకుంటే 225 మిలియన్ల సంవత్సరాలకు పూర్వం తొలి క్షీరజాలతో సహా మరే ఇతర జీవరాసులు ఉండేవి కావు. 70 మిలియన్ల సంవత్సరాలకు పూర్వం తొలి క్షీరద జీవాలు ఉండేవికావు. 13 మిలియన్ల సంవత్సరాల క్రితం వచ్చిన తొలి మానవ కూటస్థుడు గానీ 5 మిలియన్ల సంవత్సరాల క్రితం జన్మించిన తొలి మానవ పోలికలు గల జీవికానీ ఉండేదికాదు. 2 మిలియన్ల సంవత్సరాల క్రితం మానవుని పోలికలున్న జీవాలనుంచి పెద్ద పెద్ద మెదడులున్న తొలి మానవులు వచ్చారు. ఈ తొలి మానవుడే మన మొట్టమొదటి నిజమైన కూటస్థుడు. ఈ తొలి మానవుల్ని మానవుడిగా చేసింది చక్కగా ఎదిగిన వారి మెదడుకాదు. బ్రతకడానికి వారు చేసిన ప్రయత్నం. బ్రతుకు తెరువుకోసం, మొక్కలు, పండ్లు, కాయలు, మృగాలు, నీటి వనరుల వంటి వివిధమైన వాటి గురించి పరిజ్ఞానం కావలసి వచ్చింది. వారు తొలి రాతి పనిముట్లను తయారు చేసుకుని, వినియోగించుకుని అనేక రకాలైన ఆహార పదార్థాలను సేకరించుకొన్నారు. వారి పనిముట్లు, వేట విధానాలు, సామూహిక జీవనం మరింత విస్తృతమయ్యాయి. వారు అగ్నిని వినియోగించారు. నివాస వసతులు నిర్మించుకున్నారు. దిమ్మరితనం తగ్గింది. ఇంచుమించు 40,000 సంవత్సరాల క్రితం తొలి మానవుల నుంచి ఆధునిక మానవులు పుట్టుకొచ్చారు. 10,000 సంవత్సరాలకు పూర్వం గతంలో ఎన్నడూ లేనిదొకటి జరిగింది. ఆ సమయంలో ఆధునిక మానవులు తమ జీవన సరళిని విప్లవాత్మకం చేసుకున్నారు. అప్పుడు 5000 సంవత్సరాలకు పూర్వం కొన్ని వ్యవసాయ సంఘాలు, నగరాలను, రాష్ట్రాలను స్థాపించి, నగర సంస్కృతిని ప్రారంభించాయి. మానవుడు ఇతర ప్రాణికోటి నుండి వేరుపడి తన ప్రత్యేకతను సంతరించుకోవడానికి కారణం అతడికి భౌతికంగా అమరిన విలక్షణాలేనని చెప్పవచ్చు. ప్రకృతిలోని జీవజాలాలలో ఎక్కువ భాగం చతుష్పాద జీవులే.మానవుడు మాత్రమే ద్విపాద జీవి. అందుకే మనిషి ఇతర జీవకోటి చేయలేని అనేక వ్యాపారాలను ప్రకృతిలో నెరపి నాగరికతను సృష్టించుకొన్నాడు. మరో విశేషం కూడా ఉంది. ఏజీవికీలేని బొటనవ్రేలు, మిగతా నాలుగు వేళ్ళకు వ్యతిరేక స్థానంలో ఉండడం వల్ల వస్తుగ్రహణంలో మనిషికి పట్టు దొరుకుతోంది. అందుకే నాగరికత బొటనవ్రేలు ఫలితమంటారు. దీనితో బాటు మానవుని స్వరపేటిక, నాలుక, నాడీమండలం మొదలైన నిర్మితులు కూడా జంతువులలోకంటే భిన్నాలే. మనిషి ప్రతీ కలకు ప్రతిస్పందిస్తాడు. మేధస్సుతో ఆలోచనలు చేసి వాటిని ఆచరణ రంగంలోకి తీసుకెళ్ళడానికి చేతులను వారధిగా చేసుకొంటాడు. మానవుడి విజ్ఞతకు ఇది నిదర్శనము.

మానవుడు జంతుకోటినుంచి విడివడి జ్ఞానవంతుడవడానికి వెనక ఉన్న ప్రేరణ మస్తిష్కమే. అసలు మానవుడి మెదడు పరిమాణం, బరువులే మిగతా జీవుల కంటె ఎక్కువ. సామాన్య మానవుడి మస్తిష్కం 49ఔన్సులు (0.13 కిలోగ్రాములు) బరువుంటుంది. మానవుడికి మాట్లాడేశక్తి, జ్ఞాపకశక్తి, ఊహాశక్తి, వాదనాపటిమ, సృజనాత్మకశక్తిని మస్తిష్కం ప్రసాదించింది. మిగతా జీవులకులేని ఈ అపురూపశక్తులతో మానవుడు అద్వితీయ విజయాలు సాధించగలిగాడు. మానవుడే మహనీయుని నిరూపించుకొన్నాడు. కానీ నేటి మానవుడు అనేక అసాధ్యాలను సుసాధ్యాలు చేశాడు. తన విజ్ఞానాన్ని ఉపయోగించి ప్రకృతి రూపాలను కనుగొన్నాడు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో అద్భుత విజయాలు సాధించాడు. ఆదిలో నిప్పుతయారుచేయడానికి ప్రాసపడిన మానవుడు ఆధునిక యుగంలో విశ్వరహస్యాలు కనుగొంటున్నాడు. ఈశక్తి మానవుడికి తన మేధస్సు వల్లే వచ్చింది. క్రోధం, ఆనందం, ఈర్ష్య, ద్వేషం, ప్రేమానురాగాలు మొదలైనటువంటి గుణగణాలు మెదడుకు సంబంధించినవే. మానవుడికి లభించిన మరో వరం భావవ్యక్తీకరణ. మానవుడు తన మెదడుతో ఆలోచించగలుగుతున్నాడు. వాటిని తోటి మానవుడితో వ్యక్తీకరించగలుగుతున్నాడు. దానికి కారణం మానవుడకి భావవ్యక్తీకరణశక్తి ఉంది. అందుచేతనే తన భావాలను ఇతరులతో పంచుకోగలుగుతున్నాడు. భౌతికంగా తనకు ఏర్పడిన సదుపాయాలతో మానవుడు చక్కటి సహజీవనానికి అనువైన సామాజిక పరిసరాలను సృష్టించుకొన్నాడు. ఇప్పుడు సకల జీవరాసులలో మానవుడే ఉన్నతుడు. కొన్ని సందర్భాలలో అపజయాలు ఎదురయినా వాటిని విజయాలకు సోపానాలుగా మలుచుకొంటూ అవిచ్ఛిన్నంగా ముందుకు సాగుతున్నాడు.

## 3.2 సమాజం అర్థం, నిర్వచనం



నిత్యవ్యవహారంలో 'సమాజం', 'సముదాయం' వంటి పదాలు మనం తరచుగా పర్యాయపదాలుగా

B R A O U

వాడుతుంటాం. కానీ శాస్త్ర వ్యవహారంలో వీటి అర్థం నిర్దిష్టంగాను, విస్తృతంగానూ ఉంటుంది. సమాజశాస్త్ర దృష్టిలో వ్యక్తుల మధ్య సాంఘిక సంబంధాలున్నప్పుడుగానీ పరస్పర చర్యలు జరుగుతున్నప్పుడు కానీ అటువంటి సమూహాన్ని సమాజం అని పిలుస్తాం. కేవలం వ్యక్తుల సమూహాన్ని సమాజంగా వ్యవహరించలేం. సమాజసభ్యులైన మానవుల మధ్య ఏర్పడే సాంఘిక సంబంధాలు, పరస్పర చర్యలు నిరంతరం చైతన్యవంతాలై ఉంటాయి. అందుకే సమాజం ఒక ప్రక్రియ, అది ఒక వస్తువు కాదు. సమాజానికి ఒక నిర్మితి ఉన్నప్పటికీ అది కదలిక లేనిది కాదు. అయినా సమాజం అంటే ఒక ప్రక్రియ అనికానీ, ఒక నిర్మితి అనిగానీ చెప్పడం సమంజసం కాదు. సమాజాన్ని సంపూర్ణంగా తెలుసుకోవాలంటే ముఖ్యంగా రెండు అంశాలను దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. అవి 1. నిర్మితి, 2. ప్రకార్యం. నిర్మాణం దృష్ట్యా సమాజం కొన్ని సమూహాలు, సంఘాలు, సంస్థల, వ్యవస్థల కలయిక. వీటికన్నింటికీ నిర్మాణ స్వరూపమున్నది. దేనికి తగిన ప్రకార్యాలు దానికి ఉన్నాయి. అదేవిధంగా ప్రకార్యాంశం దృష్ట్యా సమాజం అంటే సామాజిక దృగ్విషయం. అది ఒక సామాజిక ప్రక్రియ. అది సాంఘిక సంబంధాలతో ఏర్పడిన సాలెగూడు వంటిది. కాబట్టి సమాజం అంటే నిర్మితి, ప్రకార్యం రెండింటి కలయికేకాక వాటికంటె ఉన్నతమైంది, చైతన్యవంతమైంది. ఒక ప్రయోగశాలలో మానవునిలో ఉండే అన్ని రక్త మాంసాలతో విగ్రహాన్ని తయారుచేసి గుండెను అమర్చినంత మాత్రాన ఆ రూపం మానవుడు కాడు. సృష్టించిన విగ్రహం కన్న మానవుడు ఉన్నతుడు. అతనికి ప్రత్యేకంగా కొన్ని శక్తులున్నాయి. అతనికి చరిత్ర, సంస్కృతి, వారసత్వం ఉన్నాయి. సమాజాన్ని సభ్యులుగా అనుభవించగలమేకానీ దానిని మన నుంచి విడదీసి "ఇదిగో సమాజం" అని చూపలేము.

సమాజం అన్న పదాన్ని వినగానే మనకు స్ఫురించేది ఒక సమూహం. కానీ ఎటువంటి వ్యక్తుల సమూహాన్ని సమాజం అంటామనేది మనం తెలుసుకోవలసిన విషయం. మానవుడు సాంఘిక స్వభావమున్నజీవి. అతనిలో సాంఘిక స్వభావం అన్నది లేకపోతే సమాజమే లేదు. మెకైవర్ భావనలో సమాజం అంటే సాంఘిక స్వభావం ఉన్న మానవులు. అది ఎప్పటికప్పుడు పునర్నిర్మించుకొనే సాంఘిక బాంధవ్యాల వ్యవస్థ. ఇతడు సమాజనిర్మాణ, ప్రకార్యాలను దృష్టిలో ఉంచుకొని సమాజాన్ని నిర్వచించాడు. సమాజం మానవ ప్రవర్తనను, స్వేచ్ఛను అదుపులో ఉంచుతుంది. నిరంతరం పరివర్తన చెందడం దీని స్వభావం. అటువంటి వ్యవస్థను సమాజమని అంటాము.

## సమాజం నిర్వచనాలు

B R A O U

సమాజశాస్త్రజ్ఞులు సమాజాన్ని క్రింది విధంగా నిర్వచించారు. గిడ్డింగ్స్ అభిప్రాయం ప్రకారం "సాముదాయక ప్రయోజనాలకోసం, అభిప్రాయ సామరస్యమున్న వ్యక్తులు ఒకరినొకరు గుర్తించి, కలిసి మెలిసి పనిచేయడాన్ని సమాజమంటారు."

మెకైవర్ ప్రకారం సమాజమంటే ప్రమాణాలు, ఆచారాలు, ధర్మాలు, విధానాలు ఉన్న సామాజిక వ్యవస్థ.

టాల్‌కాట్ పార్సన్స్ సమాజం క్లిష్టమైన వ్యవస్థ అని అందలి సభ్యుల మధ్య ఇచ్చిపుచ్చుకునే సంబంధాలుంటాయని కలిసి మెలసి జీవించడం ద్వారా, కర్తవ్యాన్ని నిర్వహించడం ద్వారా సమాజపు ఐక్యత వర్ధిల్లుతుందని అన్నారు.

## 3.3 సమాజం పుట్టుకసిద్ధాంతాలు

సమాజము యొక్క ఆవిర్భావాన్ని గురించి భిన్నమైన సిద్ధాంతాలు ప్రతిపాదింపబడ్డాయి.

### 3.3.1 దైవదత్త సిద్ధాంతం

ఆస్తికులు మానవ సమాజాన్ని దైవమే సృష్టించిందని భావిస్తారు. సృష్టిలో అనేక జీవులు, నిర్జీవులు ఉన్నాయి. దీని పుట్టుకకు కారణమైన సర్వేశ్వరుడే మానవ ఆవిర్భావానికి కూడా కారకుడని ఆస్తికులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

### 3.3.2 పోర్సు సిద్ధాంతం

ఈ సిద్ధాంత కర్తలు సమాజంలో బలవంతులు దుర్జనులందరినీ ఒకటిగా కూర్చి తాము వారికి నాయకత్వము వహిస్తారని వారిచే తమ ప్రయోజనాలకనుగుణంగా పనులు చేయించుకుంటారని భావిస్తారు. వాల్టర్ సియాగ్ హాట్, లుండ్ వింగ్, గంప్లోవిజ్ మరియు రాట్జర్ హోఫర్ ఈ సిద్ధాంతాన్ని ప్రగాఢంగా విశ్వసించారు.

### 3.3.3 పరిణామ సిద్ధాంతం

ఈ సిద్ధాంతం ప్రకారం సమాజం హఠాత్తుగా ఏర్పడలేదు. అసంఘటిత వ్యవస్థగా ఉన్న మానవ సమాజం కాలక్రమేణ సుసంఘటిత వ్యవస్థగా పరిణామం చెందింది. బంధుత్వం కుటుంబం మానవ సమూహాలు ఏర్పడడానికి కారణమయ్యాయి. మెకైవర్ రక్త సంబంధాలే సమాజాల ఆవిర్భావానికి కారణమని భావించారు. సమాజాలు ఏర్పడడానికి మరో కారణం మతం.

మానవునికి ప్రాథమిక దశలో ఆహారాన్ని ఉత్పత్తి చేయడం తెలియదు. ఆహారాన్ని సేకరించి, భక్షించి జీవించేవాడు. ఆదశలో అతడు సంచార జీవియై యుండేవాడు. క్రమేపీ నదీతీరాలలో, మండలి భూములలో ఆహారం పండించడం నేర్చుకున్నాడు. సమాజాలు ఏర్పడడానికి వ్యవసాయం కారణమైనది.

### 3.3.4 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

BRAOU

మానవులు తమ స్వప్రయోజనాల కోసం ఇచ్ఛాపూర్వకంగా సమాజాన్ని ఏర్పరచుకొన్నారని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. దీని ప్రకారం తొలుత మానవులందరూ స్వేచ్ఛాజీవులు. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మానవులు బుద్ధి పూర్వకంగా సమాజాన్ని సృష్టించుకొన్నారు. ఈ సిద్ధాంతాన్ని థామస్ హాబ్స్, జె.జె.రూసో, జాన్‌లాక్‌లు ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతాలన్ను పరిశీలిద్దాము. ఈ ముగ్గురూ మానవుల ప్రాకృతికావస్తే సమాజిక ఒడంబడికకు దారితీసిందని అంగీకరించారు. ఈ అభిప్రాయం సుమారు క్రీస్తుపూర్వం ఐదవ శతాబ్ది నుంచి చాలా మంది తత్వవేత్తలకు కలిగింది. 17వ శతాబ్దిలో థామస్ హాబ్స్ వంటివారు సమాజం మానవుల రక్షణకోసం ఏర్పడిందని భావించారు. సమాజం ఏర్పడకముందు మానవులందరూ స్వేచ్ఛాజీవులని అటువంటి స్వేచ్ఛవల్ల కలిగే ప్రమాదాలనుంచి తమ్ముతాము కాపాడువోవడానికి సమాజాన్ని ఏర్పరచుకొన్నారని వీరి అభిప్రాయం. ఆడమ్ స్మిత్ మొదలైన ఆర్థిక శాస్త్రవేత్తలు సమాజం ఆర్థికమైన ఏర్పాటుకోసం ఏర్పడిన కల్పిత సాధనమని భావించినారు. పద్ధెనిమిదో శతాబ్ధిలో మరికొంతమది వైయుక్తిక వాదులు మానవులు సహజసిద్ధిలో స్వేఛ్ఛగా సమానమైన హోదాతో జీవించారని, కానీ ఇచ్ఛాపూర్వకంగా వారు తమ స్వేచ్ఛను వదిలి ఆత్మ రక్షణకోసం సామాజిక ఒప్పందం ఏర్పరచుకున్నారని అభిప్రాయపడినారు. థామస్ హాబ్స్ ప్రాకృతికావస్థను అతి దుర్భరమైనదిగా తన "లెవియథన్" గ్రంథంలో అభివర్ణించాడు. మానవుడు తొలుత నాగరికత లేకపోవడం వల్ల పశుప్రాయంగా జీవిస్తూ బలహీనులను పీడిస్తూ ఉండేవాడని అందువల్ల తన కుటుంబాన్ని , ఆస్తిపాస్తులనూ రక్షించుకోవడానికి తన స్వేఛ్ఛను వదులుకొని ఒప్పందనాకి అంగీకరించాడని హాబ్స్ అభిప్రాయం. చట్టం, న్యాయం, ధర్మం, ధన, మాన ప్రాణాలకు భద్రత ఇవ్వగలదన్న ఆశాభావంతో సమాజ అవతరణకు మార్గం సుగమం చేస్తూ "సామాజిక ఒడంబడిక" కుదుర్చుకున్నారు.

'రూసో' అనే ఫ్రెంచి రాజకీయ తత్వవేత్త "సామాజిక ఒడంబడిక" అనే జగద్విఖ్యాతమైన గ్రంథాన్ని రచించాడు. వీరి సిద్ధాంతం ప్రకారం మానవుడు సమాజం కంటె ప్రాచీనుడనీ, ఆకాలంలో మానవుల మధ్య ఎటువంటి సంబంధం ఉండేది కాదనీ, ఎవరికివారే సహజస్థితిలో జీవిస్తూ ఉండేవారని అభిప్రాయపడినారు. ఇతని వాదం ప్రకారం మానవునికి మొట్టమొదట ఎటువంటి దుర్గుణాలు లేవనీ, క్రమేణా అతని స్వభావంలో క్షీణత ఏర్పడి తోటివారితో స్పర్థలు, కలహాలు బయలుదేరి శాంతిని రక్షించడానికి మానవ హక్కులను కాపాడుకోవడానికి మానవులు సామాజిక ఒప్పందన్నా అంగీకరించారని రూసో వివరించాడు. మానవులు ఒక అంగీకారానికి రావడం వల్ల సమాజ మెర్పడిందన్న విషయంలో మాత్రం వీరిద్దరూ ఏకీభవిచినా అట్లా ఏర్పడడానికి మూలమయిన హేతువులలో ఏకాభిప్రాయానికి రాలేదు. అప్పటిలో ఈ సిద్ధాంతం ఫ్రాన్స్ దేశమునందు తీవ్ర సంచలనాన్ని

కలిగించడమే గాక తరువాత కూడా తీవ్ర విమర్శలకు గురి అయింది.

జాన్‌లాక్ కూడా తన "Two Treatists of Civil Government" గ్రంథంలో సామాజిక ఒడంబడిక ఒప్పందం గురించి వివరించాడు. జాన్ లాక్ కూడా ప్రాకృతికావస్థపై దృష్టి సారించినప్పటికీ హాబ్స్ మాదిరిగా అది ఒక దుర్భర జీవితంగా భావించలేదు. ఆదశలో మానవులు కలసిమెలసి జీవనం సాగించేవారు. ఏదైనా చిన్న చిన్న పొరపొచ్చలు తప్ప సంఘర్షణలు లేవు. నిజానికి అది "సుఖశాంతులు, పరస్పర సహకారం, భద్రత" వెల్లివిరిసిన దశ అని జాన్‌లాక్ అభిప్రాయపడినాడు. అయితే ఇట్లాంటి సుఖప్రదమైన ప్రాకృతికావస్థలో ఉన్న లోపమేమిటంటే గుర్తింపు పొందిన న్యాయసూత్రాలు లేవు. అందువల్లనే మానవుందరూ భవిష్యత్తులో కూడా తమ మధ్య ఏవిధమైన ఘర్షణలు తలెత్తకుండా ఉండేందుకు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుని సమాజావిర్భావానికి నాంది పలికారని జాన్ లాక్ వివరించాడు. మొత్తం మీద ప్రాకృతికావస్థను అధిగమించేందుకు మానవులందరూ ఉమ్మడిగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుఉకున్నారనేది స్పష్టమౌతున్నది. నూతనంగా సామాజిక జీవనాన్ని ప్రారంభించడానికి ఇటువంటి సామాజిక జీవనం కల్గించే భద్రత కోసం వ్యక్తులు తమకు సహజ సిద్ధంగా లభించిన కొన్ని హక్కులను సైతం వదులుకోవడానికి సిద్ధపడ్డారు. దీని పర్యవసానంగా సామాజిక ఒడంబడిక, ఎదిరించి నూతనంగా అవతరించిన సామాజిక జీవనం, రాజ్యం, వ్యక్తి ఆస్థికి స్వేచ్ఛకు భద్రత చేకూర్చాయి. మునుపటి ప్రాకృతికావస్థలోని అభద్రతాభావాన్ని వదిలిపెట్టి సమాజ కవచంలో సుఖశాంతులతో జీవించారని హాబ్స్, రూసో, జాన్‌లాక్‌లు వివరించారు.

సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని సర్ హెన్స్‌మెయిన్, హ్యూమ్, బెంథామ్, ఆస్టిన్, లైబర్, ఫ్రెడరిక్, సొలాగ్ మొదలైనవారు విమర్శించారు. కొంతమంది సామాజిక ఒడంబడిక అనేది ఒక అందమైన కల్పిత గాథలా కనిపిస్తోందని తిరస్కరించారు. ఎందువల్లననగా ప్రజలందరూ ఒక చోట చేరి ప్రాకృతికావస్థను అధిగమించేందుకు సామాజిక ఒప్పందాన్ని చేసుకొన్నారనడానికి చారిత్రక ఆధారాలంటూ ఏమీలేవు. థామస్ హాబ్స్, రూసో, జాన్‌లాక్ గ్రంథాలలో తప్ప మరి ఎక్కడా ఈ ప్రస్తావన కనిపించదు.

థామస్ హాబ్స్ వివరించిన దుర్భర జీవితాన్ని ఆదిమ మానవులు అనుభవిచారనడం సరికాదు. ఆదిమ మానవులలో కూడా సంప్రదాయాల మూలంగా ఏర్పడిన నిబంధనలుండేవి.

ప్రాకృతికావస్థలో విషమ జీవితాన్ని అనుభవించిన మానవుడు ఒక దశలో తన ప్రవృత్తిని వదిలిపెట్టి సామాజిక ఒడంబడికను ఏర్పరచుకొనడం నమ్మశక్యంగా లేదు. అంతటి మృగప్రాయమైన జీవితం గడిపి మానవుడు ఒక్కసారిగా సమాజ జీవనానికి సిద్ధపడటం వెనుక బలమైన ప్రేరణ అంటూ ఒకటి ఉండాలి. అయితే అట్లాంటి ప్రేరణ ఏదీ ఉన్నట్లు హబ్స్, రూసో లాక్‌లు తెలుపలేదు.

హబ్స్, రూసో, జాన్‌లాక్‌ల ప్రకారం ఒడంబడిక పర్యవసానంగా ఏర్పడిన సమూహం ఐచ్ఛికం, ఒడంబడికను గౌరవించిన వ్యక్తి మాత్రమే ఇందులో సభ్యుడవుతాడు. అయితే ఈనాటి సమాజ స్వరూపం ఇదికాదు. సమాజ సభ్యుడు కావడానికి వ్యక్తి ఇష్టాఇష్టాలతో పనిలేదు. వ్యక్తి ఏసమాజంలో జన్మిస్తాడో ఆసమాజం నందు వెంటనే సభ్యుడవుతాడు. ఇందులో మరో ఆలోచనకు అవకాశంలేదు. ఇటువంటి విమర్శలు సామాజిక ఒడంబడిక సిద్ధాంతంపై ఉన్నప్పటికీ ఒక విధంగా దీనికి విలువ ఉన్నది. సమాజం దైవసృష్టివల్ల ఏర్పడిందన్న వాదనలను ఈ సిద్ధాంతం త్రోసిపుచ్చింది. థామస్ హాబ్స్, రూసో, జాన్‌లాక్‌లు మానవ జాతి పరిణామదశల ఆధారంగా సమాజ ఆవిర్భావాన్ని వివరించేందుకు ప్రయత్నించారు.

### 3.3.5 జైవిక సిద్ధాంతం

సామాజిక జీవసిద్ధాంతాన్ని హెర్బర్ట్ స్పెన్సర్ ప్రతిపాదించాడు. ఇతడు సమాజాన్ని జీవ జంతువులతో పోల్చాడు. జీవికి జననం, పెరుగుదల, మరణాలు ఉన్నట్లే సమాజ నికి కూడా పుట్టుక, అభివృద్ధి, పరిణతి, పతనం మొదలైన దశలున్నాయని చెప్పినాడు. ఏ సమాజాన్ని చూసినా దాని నిర్మాణం, పనిచేసే విధానం, అంత్యావస్థ దాపురిస్తే నశించడాన్ని చూస్తుంటే జీవి జనన మరణాలు స్ఫురణకు వస్తాయని స్పెన్సర్ వాదన. జీవి శారీరకంగా అభివృద్ధి చెందుతూ సంపూర్ణత్వాన్ని సంతరించుకొంటుంది. అయితే ఏదైనా విపత్తు సంభవిస్తే అంతరిస్తుంది. ఇదే విధంగా సమాజం కూడా ఆవిర్భవించి, పరిణతి చెందుతుంది. జీవికి విపత్తులాగానే సమాజంలోని సమస్యలు దాని

పతనావస్థకు దారితీస్తాయి. ఈవిధంగా జీవికి, సమాజానికి సారూప్యం ఉండడంవల్ల హెర్బర్ట్‌స్పెన్సర్ సమాజాన్ని జీవితో పోల్చాడు.

సమాజం, జీవి రెండింటిలోనూ ప్రాభవ, పతనాల రీత్యా సారూప్యం ఉన్నట్లే అమరికలోను పోలికలున్నాయని స్పెన్సర్ భావించాడు. సమాజానికి వ్యక్తులు జీవకణాల వంటి వారని భావించాడు. జీవికి బలం చేకూరడానికి వివిధ అంగాలు తోడ్పడతాయి. శరీరంలోని వివిధ అవయవాలు సామాజిక సంస్థలు, నాడీ మండలం, నరాల వ్యవస్థను సమాజంలోని రవాణా సౌకర్యాలతోనూ, రక్త ప్రసారాన్ని భావ&రపసారంతోనూ స్పెన్సర్ పోల్చినాడు. సమాజంలో వ్యవసాయం, పరిశ్రమలు పుష్టికి తోడ్పడతాయి. ఊపిరితిత్తులు, జీర్ణకోశం, రక్తనాళాలు మొదలైన శారీరక భాగాన్నట్లుగానే దేశానికి రవాణా ప్రసారాలు, ప్రభుత్వం ఉన్నాయని ఇతడు వర్ణించాడు. స్పెన్సర్ జైవిక సిద్ధాంతానికి చార్లెస్ డార్విన్ పరిణామసిద్ధాంతం ప్రేరణనిచ్చింది. జీవికి వివిధ దశలు ఉన్నట్లే సమాజం కూడా సాధారణ దశనుంచి సంక్లిష్ట దశకు పయనిస్తుంది. అనగా ఆటవికదశనుండి నాగరిక దశకు చేరిందని స్పెన్సర్ భావించినాడు. ఆటవిక దశలో తీవ్రవమైన అశాంతి నెలకొని ఉండేది. మానవులు నిరంతరం ఒకరితో నొకరు కలహించుకొనేవారు. అయితే సమాజం నాగరికతకు చేరిన తర్వాత సుస్థిరత, శాంతియుత జీవనం ఏర్పడింది. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ పరిణామ క్రమంలో సమాజ ప్రగతి సాధ్యపడి సంపూర్ణత ఏర్పడిందని ఆయన అభిప్రాయపడినాడు.

హెర్బర్ట్ స్పెన్సర్ సమాజంలోని వ్యక్తులను జీవకణాలతో పోల్చాడు. కానీ ఇది సరియైన భావనకాదు. సమాజంలోని వ్యక్తులకు ఆలోచనా విధానం ఉంది. అతడి ఆలోచనలకు అనుగుణంగా ప్రవర్తన గోచరిస్తుంది. కానీ జీవకణానికి ఈ శక్తిలేదు. స్పెన్సర్ సమాజాన్ని ఒక జీవితో పోల్చాడు. జీవికి భౌతిక స్వరూపముంది. అయితే జీవితో పోల్చిన సమాజానికి ఏవిధమైన భౌతిక స్వరూపమూ లేదు. మరొక ముఖ్యవిషయం ప్రతీ ప్రాణి మరొక ప్రాణిని ప్రత్యుత్పత్తి చేయగలగడం. ఆవిధంగా సమాజం పునఃసృష్టి చేయలేదు. జీవిలో జ్ఞానేంద్రియమండలం ఉన్నది. అది సమాజంలో లేదని స్పెన్సర్ అంగీకరించాడు. ఆశక్తి సమాజసభ్యులైన మానవులలో ఉంది. పైన పేర్కొన్న లోపాలను మినహాయిస్తే స్పెన్సర్ ప్రతిపాదించిన జీవ సిద్ధాంతం అధునిక నిర్మాణ, ప్రకార్య సిద్ధాంతానిఇక మూలమని చెప్పవచ్చు.

## 3.4 సమాజాలు - రకాలు

ప్రధానంగా సమాజాలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చును. 1. ఆదిమ సమాజం, 2. వ్యవసాయగ్రామీణ సమాజం, 3. పారిశ్రామిక సమాజం.

### 3.4.1 ఆదిమ సమాజం

ఆదిమ జాతులలో కొన్ని కుటుంబాలు కలిసి ఒక సమాజంగా ఏర్పడేది. వీరంతా ఒక ప్రదేశాన్ని ఉనికిగా చేసుకొని జీవించేవారు. ఒకే భాషను మాట్లాడేవారు. వివాహాలు, వృత్తి, ఆచారాలలో ఒకేవిధమైన నియమనిబంధనలు పాటించేవారు. ఈనాడు భారతదేశంలో అనేక ప్రాంతాలలో ఈ ఆదిమ జాతుల వారు తరతరాలుగా తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. తోడాలు, ఎరుకలు, యానాదులు, భిల్లులు, గోండాలు, నాగులు, కొద్దారులు, కౌమారులు, లండీలు, ఇట్లాది ఆదిమ తెగలు వేలాదిగా ఉన్నారు. వీరికి తమదైన విశిష్టమైన సంస్కృతి ఉన్నది. వీరు అరణ్యాలలో లోతట్టు ప్రాంతాలలో నగరాలకు దూరంగా పర్వత ప్రాంతాలో జీవనాన్ని సాగిస్తున్నారు. వీరి జీవన విధానం అతి నిరాడంబరంగా ఉంటుంది. వీరి ఆహారం, వస్త్రధారణ, ప్రకృతికి సన్నిహితంగా ఉంటాయి. వీరు మన దేవతలని పూజిస్తారు. విద్యాగంధములేకపోవుట వలన అనేక మూఢ నమ్మకాలు, అధవిశ్వాసాలు ఈ సమాజంలో పాతుకుపోయి ఉన్నాయి. వీరి వ్యవసాయ విధానం ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నది. ఈ ఆటవిక సమాజాలలో మంత్రాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. బలి వలన రోగనివారణ కలుగుతుందని వీరి నమ్మకం వీరి మతం అనిమిజమ్, అనగా ప్రతి వస్తువులోనూ ఆత్మ ఉన్నదని వీరి భావన. అందుచేతనే వీరు చెట్లను, జంతువులను ఆరాధిస్తారు. ఒక ఆదిమ తెగలో చాలా బంధుత్వ సమూహాలుంటాయి. ఎమ్లైల్ దుర్క్‌హైమ్ మతాన్ని ఆరాధించడమంటే తమను తాము అరాధించుకోవడంతో దాదాపు సమానమని భావిచారు. ఈ ఆటవిక తెగల అంధవిశ్వాసాలే వారి ఐక్యతకు కారణమయ్యాయి.

### 3.4.2 వ్యవసాయ గ్రామీణ సమాజం

ఒకానొక ప్రదేశంలో వ్యవసాయం ప్రధాన వృత్తిగా కలిగి సామూహికంగా జీవనాన్ని గడుపుతున్న వ్యక్తుల సమూహమే వ్యవసాయ సమాజం లేదా గ్రామీణ సమాజం. భారతదేశం అనాదిగా వ్యవసాయ దేశం. మన గ్రామాలలో భిన్న వృత్తులవారు ఒక సమాజంగా ఏర్పడి శాంతియుత సహజీవనం కొనసాగిస్తున్నారు. గ్రామీణ సమాజాలకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి.

గ్రామీణ సమాజంలో వాతావరణం ఆరోగ్యకరంగా ఉంటుంది. ప్రజలు ప్రకృతి ప్రసాదించే స్వచ్ఛమైన గాలిని, సూర్యరశ్మిని అనుభవిస్తారు. భౌగోళిక పరిసరాల ప్రభావం గ్రామీణ జీవితంపై విశేషంగా ఉంటుంది. వేసవి కాలంలో భూమిని చదునుచేస్తూ మెరుగుపరుస్తూ ఉంటారు. రైతులు వాతావరణాన్ని బట్టి పొలాలు దున్ని విత్తనాలు వేసి నారు పోస్తుంటారు. సవత్సరానికి సామాన్యంగా రెండు పంటకాలాలు ఉంటాయి.

గ్రామీణ సముదాయములోని ప్రజలలో సాధర్మ్యత ఎక్కువగా ఉంటుంది. గ్రామములోని ప్రజలు మానసికంగానూ, సామాజికంగానూ ఎక్కువ సామ్యాలను కలిగి ఉంటారు. వీరు వేషభాషలలో, జీవన విధానాలలో, నమ్మకాలలో, వృత్తి నమూనాలలో అనేక సాదృశ్యాలుంటాయి. సాధర్మ్యం కనిపిస్తుంది. భావాలలో సిద్ధాంతాలలో ఏకరూపతా వాదం కనిపిస్తుంది. సాంప్రదాయకంగా వస్తున్న ఆచారాలను ప్రశ్నించకుండా పాటిస్తూ ఉంటారు. గ్రామీణులందరూ కలిసికట్టుగా జీవిస్తారు. పండుగలు, పబ్బాలు కలిసి జరుపుకుంటారు.

గ్రామాలలో సమిష్టి కుటుంబ వ్యవస్థ కనిస్తుంది. వ్యవసాయ వృత్తికి పదిచేతులు అవసరం ఆకారణంగా సమిష్టి కుటుంబ వ్యవస్థ గ్రామాలలో అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది.

గ్రామాలలో అనుసరిస్తున్న మతాన్ని వర్ణించడం అంత సులభసాధ్యం కాదు. గ్రామీణులలో మతపరమైన నమ్మకాలు, మేథోశక్తిలోనూ, ఉద్రేకాలలోనూ, నిత్యజీవితంలోనూ, నిర్ణయకారకంగా పనిచేస్తూ ఆధిపత్యం వహిస్తాయి. గ్రామీణ జీవితంలో మతం వ్యక్తియొక్క వ్యాకులతలను, సంతృప్తి పరుస్తుంది. మతం గ్రామస్తులలో ఏకత్వాన్ని, సమైక్యతను కలుగజేస్తుంది.

### 3.4.3 పారిశ్రామిక సమాజం లేదా నగర సమాజం

పారిశ్రామిక సమాజంలో శాస్త్ర విజ్ఞానానికి సాంకేతిక పరిజ్ఞానానికి ఈరెండింటి తోడ్పాటుతో వస్తూత్పత్తికి ప్రాధాన్యముంటుంది. ఈ సమాజంలో కొద్ది మంది పారిశ్రామిక రంగంలో పనిచేస్తూ సమాజంలోని అందరి అవసరాలను తీరుస్తారు. సాంఘిక మార్పులకు అనుగుణంగా సాంకేతిక విషయాలలో నూతనాంశాలు ప్రవేశపెట్టబడుతాయాయి. పరిశోధనల ఫలితంగా కొత్త సిద్ధాంతాలు ఆవిష్కరింపబడతాయి. తత్ఫలితంగా వస్తు ఉత్పత్తి పెరిగి మానవ జీవితం మరింత సుఖవంతమౌతుంది. విజ్ఞానశాస్త్ర పురోగతివల్ల, పారిశ్రామికీకరణ వలన సమాజంపై మతం తనకున్న పట్టును కోల్పోతుంది. పారిశ్రామిక సమాజాలలో కార్పోరేషన్లు, ట్రేడ్ యూనియన్లు, రాజకీయపక్షాలు, బ్యూరోక్రసీ ప్రాముఖ్యతను పొందుతాయి. జీవన సరళి మారుతుంది. ఇటువంటి కొన్ని సత్పరిణామాలతోబాటు వాతావరణ కాలుష్యం, జలకాలుష్యం, ప్రకృతి వనరుల తరుగుదల, మితిమీరిన జనాభా, క్షీణిస్తున్న మానవతావిలువలు వంటి దుష్పరిణామాలు కూడా చోటు చేసుకుంటాయి.

## 3.5 సమాజ లక్షణాలు

విస్తృత దృక్పథంతో జీవకోటినంతా పరిగణలోకి తీసుకొన్నప్పుడు మానవులందరిదీ ఒక సమాజంగా భావించినప్పటికీ వివిధ అంశాలలో వ్యత్యాసాల కారణంగా అనేక సమాజాలున్నాయి. ఒక్కొక్క ప్రాతిపదికపై ఒక్కో సమాజంగా పరిగణిస్తుంటారు. ఆదిమ సమాజం, గ్రామీణ సమాజం, నగర సమాజం, పాశ్చాత్య సమాజం వివిధ సమాజాలను గురించి సమాజ శాస్త్రంలో అధ్యయనం చేస్తాం. ఏదైనా ఒక సమాజం. నిరంతరం సాగాలంటే కొన్ని ప్రధాన లక్షణాలుండాలి. వాటిని గురించి తెలుసుకుందాం.

B R A O U

**భౌగోళిక ప్రాంతాన్ని ఆక్రమించిన జనాభా:** ప్రజలు జీవించడానికి ఒక భౌగోళిక ప్రదేశాన్ని ఆక్రమించుకొని ఉండాలి. ఎందుకనగా ఆదిమ యుగంలోనూ మానవ సమూహాలుండేవి. అయితే వారు సంచార జీవులుగా కాలం గడిపేవారు. క్రూర మృగాలు, ప్రకృతివైపరీత్యాల కారణంగా తరచూ ఒక ప్రాంతాన్ని వదిలి మరొక ప్రాంతానికి తరలి వెళ్లేవారు. ఈ కారణంగా ఆనాడు సమాజాలు ఏర్పడలేదు. సుస్థిరమైన జీవనమే సమాజ భావనకు పునాది అయింది. మానవ సమూహాలు ఒకచోట స్థిర జీవనం సాగించాలంటే నిర్ణీత పరిధి ఉన్న భూభాగం అవసరం. సాధారణంగా ప్రతి సమాజానికి నిర్ణీత భూభాగం, సరిహద్దులు ఉంటాయి. కొండలు, నదులు, అడవులు, సరిహద్దులుగా ఉండంచ్చు. నిర్ణీతమయిన ప్రాతాన్ని దేశంగానూ, రాజకీయ ధికారమున్న ప్రదేశంగానూ వ్యవహరిస్తారు. సమాజ సభ్యులు ఒక ప్రాంతాన్ని ఆక్రమించి ఉండడంవల్ల ప్రాదేశిక సామీప్యం పొంది ఉంటారు. సమాజం నిలకడగా ఉండడానికి అభివృద్ధి చెందడానికి ఒక నిర్ణీతమైన భౌగోళిక ప్రాంతం ఉండడం అవసరం.

విభిన్నమైన పరస్పర చర్యలు: సమాజమునందలి సభ్యులమధ్య భిన్నమైన పరస్పర చర్యలు జరుగుతుంటాయి. దీని కారణంగా వారు పరస్పర ఆశ్రయులై ఉండడమే కాక ఒకరికొకరు సహకరించుకుంటారు. విభిన్న పరస్పర చర్యల వల్ల సమాజంలో సాంఘిక సంబంధాలు అనేక రూపాలలో గోచరిస్తుంటాయి. వ్యక్తు మధ్యగల పరస్పర సంబంధాలు, ప్రకార్యాలు నెరవేర్చుకొనడం ఒకరినొకరు ఆశ్రయించడం సమాజంలో ముఖ్యమైన అంశాలు.

సామాజిక సంస్థలు: సమాజంలో వ్యక్తుల అవసరాలను తీర్చడానికి, విభిన్న కార్యకలాపాలు కొనసాగించడానికి సామాజిక సంస్థలు అవసరం. సామాజిక సంస్థలలో రెండు రకాలుంటాయి. కొన్ని అధికారపరమైనవి, మరికొన్ని అనధికారపరమైనవి. ప్రభుత్వం, విద్యాలయాలు అధికార యుతమైన సంస్థలకు ఉదాహరణలు. కుటుంబం, మతం, అనధికా సంస్థలకు ఉదాహరణలు. అధికారయుతమైన సంస్థలకు నిర్దిష్ట నియమ నిబంధనలుంటాయి. వ్యక్తులు వీటిని ఉల్లంఘించరాదు. అతిక్రమించిన వారిని శిక్షించే అధికారం ఈ సంస్థలకు ఉంటుంది. కుటుంబం, మత సంస్థలలో లిఖిత పూర్వకనిబంధనలుండవు. కానీ ఇవి వ్యక్తి శ్రేయస్సును మరితం సన్నిహితంగాపర్యవేక్షించేవి. ఈ సామాజిక సంస్థలకు దండనాధికారం ఉన్నప్పటికీ శిక్షించడం ద్వారా కాక ప్రేమానురాగాలతో వ్యక్తులను నియంత్రించేందుకు కృషి చేస్తాయి. దాదాపు అన్ని సమాజాలలోనూ అధికార, అనధికార సంస్థలుంటాయి. సంస్థలు కొన్ని నిర్దిష్టమైన కార్యాలను సాధించడానికి పనిచేస్తాయి. ఇవి కొన్ని సూత్రాల మీద, సంప్రదాయాలమీద ఆధారపడి ఏర్పడినాయి. ఇవి సమాజం మనుగడకు ఆవశ్యకమైనవి.

సామాజిక వ్యవస్థాపన : సమాజములోని సభ్యులు వ్యవస్థీకృతులై ఉంటారు. వారు వివిధ సమూహాలకు చెంది ఉంటారు. వీరిని స్థానిక సమూహాలుగా, బంధుసమూహాలుగా, వర్గసమూహాలుగా, వృత్తి సమూహాలుగా విభజించవచ్చు. ఈ సమూహాలలో కొన్ని తాత్కాలికమైనవి. మరికొన్ని తరాలపాటు నిలిచిఉండేవి. సామాజిక వ్యవస అనేక సమూహాల సహకారమే. ఈ సమూహాలు వివిధ కార్యకలాపాలతో ప్రకార్యాలను నెరవేరుస్తూ వివిధ స్థాయిలలో పని చేస్తూ ఉంటాయి.

ఐక్య ప్రకార్య విభేదీకరణం: సమాజములోని సభ్యుల మధ్య ఎడతెగని సంసర్గాలుంటాయి. వీటితోపాటు వారిలో ఐక్యత ప్రబలంగా ఉంటుంది. ఈ కారణంగా వారు కలిసిమెలసి జీవించడానికి, ఒకే రకమైన అనుభవాన్ని పొందడానికి వీలు కలుగుతుంది. అయినంత మాత్రాన వీరిలో సాధర్మ్యం ఉంటుందని భావించడానికి వీలులేదు. వారందరూ ఒకే ప్రాంతంలో నివసించడం చేత, వారి చారిత్రకానుభవం ఒకటే కావడంవల్ల, ఒకే రకమైన నమ్మకాలు ఉండడం వల్ల, ఒకే కాలంలో నివసించడం వల్ల వీరందరూ ఒక విశిష్టమైన యూనిట్‌గా భావించుకుంటారు. నిజానికి ప్రకార్యాలలో భేదాలు, వైవిధ్యాలు మానవ సమాజలక్షణం. అవసరంకూడా. మానవ సమాజంలో అంగభేదాలున్నాయి. ఇన్ని అంతరాలున్నప్పుడు ఒకే విధమైన ప్రకార్యాలను ఊహించలేము. శ్రమ విభజన, స్తరీకరణ వల్ల విభజనలున్నప్పటికీ సమాజం ప్రకార్యంగా ఐక్యమున్న యూనిట్‌గా గోచరిస్తుంది.

సంస్కృతి: సంస్కృతి మానవ సమాజాల కృషి ఫలితము. ఇది అనేక తరాల వారసత్వము. సంస్కృతి వ్యక్తుల అవసరాలను బట్టి, పరిసరాలను బట్టి పెంపొందుతుంది. అందుచేతనే భిన్న సమాజాలలో భిన్న సంస్కృతులు గోచరిస్తాయి. మానవ సమాజాలన్నీ ఒకే తీరుగా నుండవు. ఒక సమాజం నుంచి మరొక దానిని వేరు పరచేది ఆ సమాజ సంస్కృతి. ఒక సమాజ సంస్కృతి లక్షణాలను మరొక సమాజం అనుసరించవచ్చు. "సంస్కృతి" అనే పదం సమాజశాస్త్రంలో విశిష్టమైనది. సమాజ భౌగోళిక పరిసరాలు, జైవిక భౌతిక వనరులు. వివిధ జాతుల అనుభవాలు.



BRAOU

శాస్త్రీయ సాంకేతిక స్థాయిలు, మత విశ్వాసాలు, కళలు, నీతినియమాలు, ఆచార వ్యవహారాలు, శాసనాలు మొదలైనవన్నీ సంస్కృతిలో చేరి ఉన్నాయి. ఒక విధంగా చెప్పాలంటే మానవుడు సమాజ సభ్యుడుగా సముపార్జించుకొన్న శక్తి సామర్థ్యాలు, అలవాట్లు వీటన్నింటి సంశ్లిష్టమైన మొత్తమే సంస్కృతి. ఇవి సంస్కృతికి విశిష్టతను చేకూరుస్తాయి. ఈ లక్షణాలు సమాజంలో ప్రతి అంగంలోనూ, వ్యకుల మధ్య, సాంఘీక సంబంధాలలోనూ వారి భావనలోనూ గోచరిస్తాయి.

**సమాజాలలో వైవిధ్యం:** ఒక సమాజంలోని సభ్యులకు మరొక సమాజంలోని సబ్యులకు తేడా ఉంటుంది. ఒకొక్కప్పుడు ఈ నైఖరి సమాజాల మధ్య ఏర్పడే సంబంధాలకు, అవగాహనకు ప్రతిబంధకమౌతుంది.

సమాజ కార్యకలాపాలు, వ్యవస్థీకృతమైన విధానాలు ప్రకార్యమైన ఐక్య భావమనే చట్రంలో ఇమిడి ఉంటాయి. అందువలన నిత్యమూగల ఈ పనులు, సంఘటనలు ఊహించినవే. సమాజం స్వయంగా పునరావృతం, అవిశ్చిన్నం, దీర్ఘకాలికం అని భావించవచ్చు

## 3.6 సమాజప్రకార్యాలు

సమాజం నిర్వర్తించే ప్రకార్యాల ద్వారా సమాజంలోని వ్యక్తుల అవసరాలు తీరుతాయి. వాటిని పరిశీలిద్దాము.

**1. భౌతిక అవసరాల తృప్తి:** సమాజమేర్పడడంలోగల ముఖ్యోద్ధేశము మానవుని కనీస అవసరాలు తీర్చడమే. కనీస అవసరాలైన ఆహారం, దుస్తులు, గృహవసతితోపాటు వ్యక్తిగత భద్రతను కూడా సమాజమే కల్పించాల్సి ఉంటుంది. వీటితో పాటు సమాజంలో ఉత్పత్తి, పంపిణి క్రమంగా జరగగా వాటిని స్వంతం చేసుకుని మారకం చేసుకోవడానికి న్యాయమైన పద్ధతులు ఉండడం అవసరం. అట్లాగే సమాజం ప్రమాదాలనుంచి , జైవ, భౌతిక, సహజ తాకిడుల నుంచి, తోటి సభ్యుల వల్ల కలిగే అన్యాయాల నుంచీ తప్పించుకోవడానికి రక్షణ ఏర్పాట్లు ఉండడం అవసరం. ఇటువంటి పరిస్థితులు కల్పించడం వల్ల సమాజం మనుగడ ఏర్పడుతుంది.

**2. ప్రత్యుత్పత్తి:** సమాజంలో నూతన సభ్యులు చేరనిదే సమాజం ముందుకు వెళ్ళదు. కొత్త సభ్యులను నిపడం సమాజం మనుగడకు దోహదం చేస్తుంది. ఒక సమాజ జన సంఖ్య కేవలం వలస వచ్చి వారి మీద, దేశ విజయాల మీదే ఆధారపడి ఉండదు. సమాజం ప్రత్యుత్పత్తికి అకవాశం కల్పించాలి. జనాభాను పరిరక్షించవలెనంటే మాతృత్వపరిపోషణకు, భౌతిక, సమాజసంక్షోభాలనుండి పిల్లలకు తగిన రక్షణ వారి క్షేమాభివృద్ధులకు కావలసిన ఏర్పాట్లు కల్పించాలి.

**3. సాంఘీకరణ:** సమాజంలో జన్మించిన శిశువు కేవలం ఒక జీవి మాత్రమే. ఆజీవిని సామాజిక జీవిగా సమాజమే మారుస్తుంది. అతడిని సామాజిక జీవిగా మార్చేంగుకు సాంఘికీకరణ తోడ్పడుతుంది. సమాజం నందు వారు తమ పాత్రలను నిర్వహించడానికి కావలసిన శక్తి సామర్థ్యాలను పెంపొందిస్తుంది. సాంఘీకరణ ప్రక్రియలో సమాజంలోని ముఖ్య సామాజిక సంస్థలయిన కుటుంబం, విద్యాలయాలు, మత సంస్థలు శిశువుకు వివిధ దశలలో చేయూతనిస్తుంది. సాంఘికీకరణ ప్రక్రియ బాల్యదశలో ప్రారంభమై వ్యక్తి మరణించేంతవరకూ కొనసాగుతుంది.

**4. సంస్కృతి-అభివృద్ధి:** సమాజం అభివృద్ధి చెందడానికి తోడ్పడదేఇ వారి సంస్కృతి. సమాజం సాంస్కృతిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తుంది. సంప్రదాయ సిద్ధాంతంగా వచ్చే పద్ధతులే కాక నూతన పద్ధతులను అవసరం ప్రకారం ప్రోత్సహించడం సమాజం ముఖ్యవిధి. ఇట్లా చేయడం వల్ల సమాజంలో మారుతున్న పరిస్థితుల కనుగుణంగా సర్దుబాటు జరుగుతోంది.

## 3.7 జంతుసమాజం - మానవ సమాజం

మానవ సమాజాలకు, మానవేతర సమాజాలకు మధ్యగల బేధాలను క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

| జంతు సమాజాలు | మానవ సమాజాలు |
|---|---|
| 1. జంతువులలో ప్రవర్తనచాలా వరకు సహజాతుల మీద ఆధారపడి ఉంటుంది. చేర్చుకోవడం వల్ల వచ్చిన ప్రవర్తన అత స్వల్పంగా ఉంటుంది. | 1. మానవ ప్రవర్తన ఎక్కువగా నేర్చుకోవడం వల్ల వచ్చింది. |
| 2. జంతువులలో సాంఘిక జీవనం కేవలం ప్రాథమిక అవసరాలకు మాత్రమే పరిమితమై ఉంటుంది. | 2.మానవుల సాంఘిక జీవనంప్రాథమిక అవసరాలకు మాత్రమే పరిమితం కాక అనుషంగిక అవసరాలకు కూడా సంబంధించి ఉంటుంది. |
| 3. జంతుసమాజలంఓ సాంఘిక సంబంధమైన ప్రకార్యంగానీ, శ్రమ విభజన కానీ కనబడదు. | 3. మానవ సమాజం ప్రకార్యాల వ్యవస్థ. సంఘపరమైన శ్రమ విభజన ఉండడం వల్ల ప్రతి వ్యక్తి ప్రత్యేకమైన పాత్రలను వహించవలసి ఉంటుంది. |
| 4. ఈసమాజంలో అభ్యాసంతో కూడిన ప్రవర్తన లేకపోవడం వల్ల వాటిలో సంస్కృతి కనిపించదు. | 4. మానవ సమాజం పూర్తిగా సంస్కృతి మీద ఆధారపడి ఉంటుంది. |
| 5. వీటిలో భావ వ్యక్తీకరణ కొన్ని ధ్వనుల ద్వారా లేదా సంకేతాల ద్వారా కొనసాగుతుంది. వ్యవస్థీకృతమైన భాష జంతువులకు లేదు. | 5. మానవ సమాజానికి భాష విశిష్టమైన లక్షణం. భాషద్వారా మానవుడు అనేక విషయాలను సాధించినాడు. |
| 6. ఒకజాతికి సంబంధించిన జంతు సమాజాలు అన్ని ప్రాంతాలలోనూ ఒకేరీతిగా ఉంటాయి. సంస్కృతిక సంబంధమైన వ్యత్యాసాలు లేనందువల్ల ఒక జాతి జంతువుల సంఘజీవనం ఒకే స్థాయిలో కనబడుతుంది. | 6. సంస్కృతి కారణంగా ఒక సమాజం మరొక సమాజం కంటే భిన్నమై ఉంటుంది. కొన్ని సమాజాలు సామాన్యస్థాయిలో నుండగా మరికొన్ని సంశ్లిష్టతను కలిగి ఉంటాయి. |

BRAOU

## 3.8 సారాంశం

సమాజాన్ని శాస్త్రజ్ఞులు పలువిధాలుగా నిర్వచించారు. సమాజము వ్యక్తుల కలయిక. ఒకరిమీద ఒకరు ఆధారపడి సంబంధ బాంధవ్యాలు కలిగి ఉందురు. సమాజ పుట్టుక సిద్ధాంతాలు పలు రకములు - దైవదత్త, పౌర్సు పరిణామ, సామాజిక ఒడంబడిక, జైవిక సిద్ధాంతాలు, సమాజాలను ఆదిమ సమాజంగానూ, వ్యవసాయ సమాజంగానూ, పారిశ్రామిక సమాజంగానూ వర్గీకరించిరి. సమాజం కొన్ని నిర్దిష్ట లక్షణాలను కలిగి ఉంటుంది. అది ఒక భౌగోళిక ప్రాంతాన్ని ఆక్రమించుకొని ఉండుట, విభిన్నమైన పరస్పర చర్యలు, సామాజిక సంస్థలు, సామాజిక వ్యవస్థాపన, ఐక్య క్రకార్య విభేదీకరణ, సంస్కృతి, సమాజ వైవిధ్యం కలిగి ఉంటాయి. సమాజ క్రార్యాలు: భౌతిక అవసరాల తృప్తి, ప్రత్యుత్పత్తి, సాంఘికీకరణ, సంస్కృతి అభివృద్ధి.

## 3.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈక్రింది వానికి 30 పంక్తులలో సమాధానములనిమ్ము.

1. సమాజాన్ని నిర్వచించి, సమాజ ఆవిర్భావ సిద్ధాంతములను వివరింపుము.

2. సమాజ లక్షణాలను పేర్కొనుము.

II. ఈ క్రింది వాని 15 పంక్తులలో సమాధానములనిమ్ము.

1. సమాజము యొక్క లక్షణాలను, ప్రకార్యాలను వివరింపుము.

2. మానవ సమాజానికి జంతు సమాజానికి మధ్య భేదమును వ్రాయుము.

## 3.10 చదవదగిన రచనలు


Leacock : Elements of Political Science.

Maciver : Society.

Gettell : Readings in Politica Science.

Gibbert : Fundamentals of Sociology.

K.Padmaja and C.R. Prasaarao : సమాజశాస్త్రము - ప్రాథమిక సూత్రాలు: తెలుగు అకాడెమీ, హైదరాబాదు - 1985.

7. M.A.Sarma & C.D.Gupta : గ్రామీణ - నగర సమాజశాస్త్రం- School of Correspondence Courses, A.V.Waltair.


BRAOU

# భాగం- 4: సామాజిక సమూహాలు

విషయ క్రమం


4.0 ఉద్దేశాలు
4.1 పరిచయం
4.2 సామాజిక సమూహాల అధ్యయన ఆవశ్యకత
4.3 సమూహ లక్షణాలు
4.4 సమూహపు ప్రకార్యాలు
4.5 సామాజిక సమూహాల వర్గీకరణ
4.6 సామాజిక సమూహాలు
 4.6.1 ప్రాథమిక సమూహ లక్షణాలు
 4.6.2 ప్రాథమిక సంబంధాల లక్షణాలు
 4.6.3 ప్రాథమిక సమూహాల ప్రాముఖ్యము
4.7 గౌణసమూహము
 4.7.1 గౌణసమూహ లక్షణాలు
4.8 ప్రాథమిక సమూహ భావన - విమర్శ
4.9 సారాంశము
4.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు
4.11 చదవదగిన పుస్తకాలు


## 4.0 ఉద్దేశాలు

BRAOU

ఈ పాఠ్యాంశం చదివిన తర్వాత మీరు

- సామాజిక సమూహాల ప్రాముఖ్యతను తెలుసుకుంటారు.
- సామాజిక సమూహాలను వర్గీకరిస్తారు.
- ప్రాథమిక సంబంధాల లక్షణాలను చర్చిస్తారు.
- ప్రాథమిక సమూహాల ప్రాధాన్యతను తెలుసుకుంటారు.

## 4.1 పరిచయం

సాధారణంగా సమూహాలంటే వ్యక్తుల కలయిక అని చాలా మంది భావిస్తారు. సమూహాన్ని ఈవిధంగా పేర్కొనడం వల్ల ప్రయోజనం లేదని అనేకమంది సమాజశాస్త్రజ్ఞులు భావిస్తారు. సమూహాలు మానవ సమాజంలోనే కాక పశుపక్ష్యాదులు కూడా కలిసి మెలసి జీవిస్తూ సమూహాలుగా ఏర్పడతాయి. కానీ మానవ సమూహాలకు పశుపక్షి సమూహాలకు చాలా తేడా ఉంది. దీనికి కారణం మానవ సమాజంనందు సమూహాలలో సామాజిక సంబంధాలు, సామాజిక భావన ఉన్నత స్థాయిలో కనబడతాయి. మానవ సమూహాలలో ఉమ్మడి లక్ష్యసాధన ప్రధానమైనది. మానవ సంబంధాలు సామాజిక ప్రమాణాలకు, విలువలకు లోబడి ఉంటాయి.

## 4.2 సామాజిక సమూహాల అధ్యయన ఆవశ్యకత

సమూహాలలో తీసుకునే నిర్ణయాలు సామాజిక చరిత్ర పైననే అత్యంత గొప్ప ప్రభావాన్ని కలిగి ఉంటాయి.

సామూహిక గతిశీలత ఆ సమూహాలలో నివసించే వ్యక్తుల దైనందిన జీవిత విధానాలపై కూడా ప్రభావాన్ని చూపుతుంది. సమూహంలో కొద్ది మంది ప్రముఖ వ్యక్తులు తీసుకొనే నిర్ణయాలు జాతినంతటినీ ప్రభావితం చేస్తాయి. అదే విధంగా భార్య - భర్తలు ఇద్దరే సభ్యులుగా ఉన్నసమూహంలో వారు ఎంతమంది బిడ్డల్ని కనాలనే విషయంలో తీసుకునే నిర్ణయాలు ప్రపంచ జనాభా పెరుగుదలపై కలుగజేసే ప్రభావాన్ని మనం ఊహించుకోవచ్చు. వ్యక్తి సమూహాలలో పుట్టి, సమూహాలలో పెరిగి ఎల్లప్పుడూ తన తోటి వారితో కలిసి నూతన సమూహాలను సృష్టిస్తుంటాడు. సామాజిక వ్యవస్థాపనలోని అనేక సమూహాలు విభిన్న ప్రకార్యాలను నెరవేరుస్తుంటాయి. సమాజంలోని వ్యక్తి ఏదో ఒక సమూహంలో సభ్యుడుగా ఉండవలసిందే. అందుచేతనే సమాజశాస్త్రం వ్యక్తికన్నా సమూహంపైననే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తుంది. సామాజిక సమూహాలు సమాజం యొక్క పటిష్టతను దోహదం చేస్తాయి.

'సమూహం' అనే భావనకు సమాజశాస్త్రంలో ప్రత్యేకమైన అర్థముంది. కానీ సమాజశాస్త్రవేత్తలు సమూహాలను వివిధ దృక్కోణాలతో పరిశీలించి అనేక అర్థాలను ఇచ్చారు. థియోడార్.యమ్.మిల్స్ సమూహాన్ని ఇలా నిర్వచించాడు. "సాధారణంగా సమూహమంటే ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తుల ప్రయోజనపూర్వమైన, అన్యోన్యమైన, అర్థవంతమైన కలయిక".

పరస్పర సంబంధాల ద్వారా ఒకరినొకరు ఆకర్శిస్తూ అందరూ ఒకే విధంగా ఆలోచనలు కలిగి ఒకే సమూహానికి చెందినామని భావించే వ్యక్తుల కలయికను సమూహంగా ఎ.డబ్ల్యు. స్మాల్ నిర్వచించాడు.

ఉమ్మడి ఆశయాలను ఉద్దేశించి చైతన్యంతోగానీ, చైతన్యరహితంగాగానీ నిలకడగల చర్యను ప్రదర్శించే వ్యక్తుల కలయికను సమాజిక సమూహంగా పార్క్, బర్జెస్‌లు పేర్కొన్నారు. వ్యక్తుల ఉమ్మడి అభిరుచులే సామాజిక సమూహానికి మూలం అని ఎడ్వర్డ్ షాఫిల్ భావించాడు.

ఉమ్మడి లక్ష్యాల సిద్ధికై పరస్పర సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తుల కలయికనే సామాజిక సమూహంగా సమాజశాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. అంతేకానీ కేవలం వ్యక్తుల కలయికను సమూహంగా భావించకూడదు. ఉదాహరణకు బహిరంగ సభకు హాజరైన శ్రోతలు లేదా బస్సులో ప్రయాణం చేస్తున్న వ్యక్తుల కలయికను సమూహంగా పరిగణింపరాదు. శ్రోతలలోను, ప్రయాణీకులలోనూ భౌతిక సాన్నిహిత్యం ఉండవచ్చు. అయితే ఈ సాన్నిహిత్యం వారిలో పరస్పర చర్యలు ఏర్పడటానికి గానీ, సాంఘిక సంబంధాలు పెంపొందించడానికి గానీ ఉపయోగపడదు. అందుచేతనే శ్రోతలు ఎవరికి వారు చెప్పకుండా ఎవరి ఇష్టానుసారం ఇంటి ముఖంపడతారు. అదేవిధంగా ప్రయాణీకులు గమ్యస్థానం రాగానే ఎవరికి వారు దులుపుకొని పోతారు. కావున సామాజిక సమూహాల ముఖ్యలక్షణం వ్యక్తుల కలయిక మాత్రమే కాక వారి మధ్య ఏర్పడే పరస్పర చర్య సంబంధాలు అని చెప్పవలె. ముఖాముఖి పరిచయంగల బస్సు ప్రయాణీకులు ఒక నెల రోజులు కలిసి మెలసి విహార యాత్ర సాగిస్తే వారి మధ్య పరస్పర చర్య ప్రారంభమై పటిష్టమైన సాంఘిక సంబంధాలు ఏర్పడి ఒక సమూహంగా రూపొందవచ్చును. సమూహ వ్యక్తులు పరస్పర చర్యలను, సామాజిక సంబంధాలను పెంపొందిచుకొని ఉమ్మడి లక్ష్యాల సిద్ధికై పాటుపడాలి. ఒక్కొక్కప్పుడు సమూహ సభ్యుల మధ్య భౌతిక సంబంధాలు లేకపోవచ్చును. ఉదాహరణకు దేశానికి చెందిన పౌరుల మధ్య భౌతిక సంబంధాలు లేకపోవచ్చు. అదే విధంగా రెండు దేశాలకు చెందిన శాస్త్రజ్ఞులు వారి వారి రచనల ద్వారా తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకొంటూ పరోక్ష సంబంధాలను కలిగి ఒక సమూహంగా ఏర్పడవచ్చును. వీరిలో భౌతిక సంబంధాలు లేకున్నా ఉమ్మడి లక్ష్యం కనబడుతుంది. వారి పరస్పర చర్య భౌతిక స్థాయిలో కాక మానసిక స్థాయిలో ఉంటుంది.

## 4.3 సమూహ లక్షణాలు

సామాజిక సమూహ లక్షణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

1. భావప్రసారము: ఏ సమాజాన్ని అయినా, దాని విస్తృత పరిధిలో పరికించినట్టయితే ఆజాతి జీవన వ్యవస్థలో విలసిల్లే వివిధ సాహిత్య రూపాలలోనూ, కళలలోనూ, సామాజిక వ్యవస్థలలోనూ ఒకే విధమైన సారూప్యము,

సమైక్యము, భావ ప్రసారము ద్యోతకమవుతాయి. భావప్రసారమంటే సామాజిక ఆలోచన విధానానికి చెందిన బాహ్యా నిర్మాణమే. ప్రజల జీవితంలో భావ ప్రసారము ప్రధాన పాత్ర వహిస్తుంది. ఒక విధంగా అది సామాజిక వ్యవస్థలు రూపొందించడానికి కూడా కారణమవుతుంది. సమాజ మను గడకు సమాజంలోని వివిధ వ్యక్తుల మధ్య పరస్పర అవగాహనకు భావ ప్రసారము మూలాధారము. సమాజంలోని వ్యక్తుల జీవన విధానాలలోనూ, వారి అనుభవాలలోనూ కనిపించే సారూప్యానికి పరస్పరిక భావ ప్రసారమే కారణము. ఈ విషయాన్నే రాబర్ట్ ఇ. పార్క్ ఇలా పేర్కొన్నాడు. "భాషద్వారా లేక ఇతర సాధనాల ద్వారా సమూహ సభ్యులు తమ భావాలను, అనుభవాలను ఉమ్మడిగా పంచుకోవలె. సమూహానికి వ్యక్తి ఏవిధంగా తోడ్పడేది వ్యక్తి సమూహం నుండి ఏమి ఆశించేది అందరూ తెలుసుకోవలె. సమూహ సభ్యుల మధ్య సరియైన అవగాహన లేకున్నా ఉమ్మడి లక్ష్యాలను, ప్రయోజనాలను సాధించడానికి సాధ్యపడదు. అందుచేత భావ ప్రసారం వల్లనే వ్యక్తులు సమూహలక్ష్యాలను తెలుసుకోవడానికి వీలవుతుంది.

2. సహకారము:- సమూహమునందలి సభ్యులంతా కలిసి మెలసి పనిచేస్తారు. కలిసి మెలసి అనేక కార్యక్రమాలలో పాల్గొంటారు. సామాజిక ప్రకార్యాలను నెరవేరుస్తారు. వీరందరి మధ్య సమైక్యత వారి సమిష్టి అవసరాలు నెరవేరేవరకు ఉంటుంది. సమూహ నిర్మితి వ్యక్తుల మధ్యగల సహకారయుత సంబంధాలపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. సహకారంలోపించిన ఎడల సమూహము చితికి పోతుంది. ఉదాహరణకు కళాశాల మనుగడ దానికి చెందినటువంటి సభ్యుల సహకారంపైనే ఆధారపడి ఉంటుంది. వ్యక్తుల మధ్య సహకారం లోపించిన సంఘర్షణలు ఎక్కువై కళాశాల మనుగడ దెబ్బతింటుంది. ఆటల జట్టు, వ్యాపార, కార్మిక సమూహాలు సహకారం ద్వారా వాటి లక్ష్యాలను సాధిస్తాయి.

3. ఉమ్మడి అభిరుచులు, లక్ష్యాలు:- ప్రతి సమూహంలోను ఉమ్మడి అభిరుచులు, లక్ష్యాలు ఉంటాయి. ప్రతి సమూహం దానిలక్ష్యాల యను సమూహ సభ్యులకు విపులంగా తెలియపరచినప్పుడే వ్యక్తులు వాటి సాధనకై కృషి చేయగలరు. ఉమ్మడి అభిరుచులు, లక్ష్యాల ద్వారానే వ్యక్తులు సన్నిహితులౌతారు. దీని ద్వారా కార్యాచరణ ప్రారంభమవుతుంది. ఉదాహరణకు పోటీలో గెలుపొందవలెననే ఉమ్మడి లక్ష్యమే ఆటల జట్టులోని సభ్యుల మధ్యగల సహకారానికి కారణంగా చెప్పవచ్చు. సమూహ లక్ష్యసాదనకు సభ్యులు వృషి చేయవలెనన్న సభ్యులు ఎవరు ఏయే పనులు ఏవిధంగా చేయవలసిన పనిని వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే సమూహం లక్ష్యం నెరవేరుతుంది. ఉదాహరణకు ఒక పరిశ్రమలో ఉత్పత్తిని సాధిచవలెనంటే పరిశ్రమ పరిశ్రమ యాజమాన్యానికి కార్మికులకు మధ్య సరియైన సహకారం ఉండవలె. ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే వాటి లక్ష్యాన్ని సాధించగలుగుతారు.

4. సభ్యులమధ్య ఐక్యత:- ఒక సమూహంలో లింగం, వయస్సు, జాతి, మతం,కులం, భాష మొదలైన వాటితో నిమిత్తం లేకుండా ఎవరైనా సభ్యులుగా ఏర్పడవచ్చును. వారంతా ఒకే సమూహానికి చెంది ఉండుట చేత వారిలో చైతన్యం, ఐక్యత గోచరిస్తాయి. సమూహంలోని ఐక్యతను అందరూ గుర్తిస్తారు. సభ్యులందూ తమ సమూహానికి కట్టుబడి ఉండటమే గాక దానితో తాదాత్యం చెంది వాటి ప్రకార్యాలలో ప్రదర్శిస్తారు. వ్యక్తులలో సామూహిక చైతన్యం ఉన్నపుడే వ్యక్తులందరూ "మేము", "మనము" అనే భావాలను కలిగి ఉంటారు. సభ్యులందరూ ఒకే విధమైన లక్ష్యాలను, అభిరుచులను కలిగి ఉండుటవలన వాటి సాధనకై అందరూ కలిసి సమైక్యంగా కృషి చేస్తారు. సభ్యులు సమూహము ఎడల విశ్వాసంతో ఉంటారు. ప్రతి సభ్యుడు సమూహాన్ని తనదిగా భావించి సమూహ శ్రేయస్సుకొరకు పాటుపడతాడు. ప్రతి సమూహము సామూహిక మనస్తత్వాన్ని పెంపొందించుకుంటుంది. సభ్యులంతా ఒకేవిధంగా ఆలోచిస్తారు. ఒకేరకమైన సిద్ధాంతాలను కలిగి సమూహ రక్షణకు, పటిష్టతకు తోడ్పడతారు.

5. సమూహ ప్రమాణాల నిర్ణయం:- వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడానికి ప్రతి సమూహం కొన్ని ప్రమాణాలను రూపొందించి అమలు పరుస్తుంది. వ్యక్తులు సమూహ ప్రమాణాలకు కట్టుబడి ఉన్నపుడే సమూహంలో క్రమం ఏర్పడి సమూహ పటిష్టతకు దోహదం చేస్తుంది. సమూహం మనుగడను సాగించవలెనంటే సభ్యులు సమహ ప్రమాణాలకు కట్టుబడి ఉండవలె. అప్పుడే సమూహ లక్ష్యాలు నెరవేరుతాయి. ఉదాహరణకు

క్రీడాకారులు తమ జట్టు నాయకుడు చెప్పినట్లు నడుచుకోవడం, నిర్ణీత సమయంలో శిక్షణాతరగతులకు హాజరుకావటం మొదలైన నియమాలను పాటించినప్పుడే వారు పోటీలో గెలుపొందే అవకాశం ఉంటుంది. భిన్న సమూహాలలో భిన్న ప్రమాణాలు, కట్టుబాట్లు, చిన్న తరహా కుటుంబాలలో లేకపోవచ్చు. యువతీ యువకులు కలిసి చదివే కళాశాల ప్రమాణాలకు వ్యత్యాసం ఉండవచ్చు. సమూహ ప్రమాణాలు సభ్యులందరూ కలిసి వీరి మనుగడ కోసం రూపొందించుకొన్నవే. వ్యక్తులు సమూహ ప్రమాణాలకు కట్టుబడి ఉన్నప్పుడే వారి ఆశయాలు నెరవేరుతాయి.

6. వేరుచేసిన అస్తిత్వం:- ఒక సమూహంలోని వ్యక్తులు వారి సమూహాన్ని సమాజమునందు వేరు చేసిన అస్తిత్వంగా భావిసాతరు. సమాజంలోని ఇతర సమూహ సభ్యులు కూడా అదే విధంగా ఈ సమూహాన్ని వేరు చేసిన అస్తిత్వంగా పరిగణిస్తారు.

7. సమూహాల కాలపరిమితి నిర్ణయం:- సమూహాల కాల పరిమితి, సమూహ ప్రకార్యాలు, వాటని చేయవలసిన విధానం ఆ సమూహం యొక్క నైఖరి దాని లక్ష్యాలపై ఆధారపడి ఉంటాయి. సభ్యుల లక్ష్యాలు నెవేరనప్పుడు సమూహం నుండి తమ సభ్యత్వాన్ని ఉపసంహరించుకొంటారు.

8. వ్యక్తిగత ప్రమాణాలు:- ప్రతి సమూహం కొన్ని ప్రమాణాలను కలిగి ఉంటుంది. ఈ ప్రమాణా వ్యక్తుల ప్రవర్తనను అదుపులో ఉంచి సమూహాన్ని కొనసాగిస్తాయి. ఈ ప్రమాణాలు లిఖిత పూర్వకంగా ఉండవచ్చ లేదా ఉండకపోవచ్చు. సమూహ ప్రమాణాలు వ్యక్తుల విధులను, హక్కులను సూచిస్తాయి.

9. సమూహ సభ్యులకు పాత్రలు:- సమూహంలోని ప్రకార్యాలు కొనసాగవలెంటే ప్రతీ సభ్యుడు తన పాత్రను సక్రమంగా నిర్వర్తించాలి. వ్యక్తియొక్క పాత్ర సమూహ ప్రమాణాలకు లోబడి ఉండాలి.

10. సభ్యుల మధ్య ఉమ్మడి మనస్తత్వం:- సమూహంలోని సభ్యులకు గల ఉమ్మడి అభిరుచులు, ఉమ్మడి లక్ష్యాలు, సమైక్యత వలన వీరిలో ఒకే రకమైన మనస్తత్వం, దృక్పథాలు, అలవాట్లు, సిద్ధాంతాలు, అభివృద్ధులు పెంపొందుతాయి.

11. ఉమ్మడి నమ్మకాలు, విలువలు:- సభ్యుల మధ్య ఉమ్మడి నమ్మకాలు, విలువలు కలిగి ఉండడం సమూహపు ముఖ్యలక్షణం. భావాలలోను, అభిప్రాయాలలోను, సమూహ సభ్యుల మధ్య సారుప్యము ఉంటుంది.

12. సజాతి చేతనత:- సామాజిక సమూహాలలో వ్యక్తులు సామూహిక చైతన్యాన్ని కలిగి ఉండడం చాలా అవసరము. వ్యక్తులు తమ అవసరాలకన్నా సమూహ అవసరాలకే అధిక ప్రాధాన్యతనిస్తారు. సమూహ అభిరుచులు తనదిగా భావిస్తారు. ఈవిధమైన సజాతి చేతనతోనే దుర్క్ హైమ్ సౌభ్రాతృత్వమని, సి.హెచ్. గిడ్డింగ్స్ సజాతి చేతనత అని డబ్ల్యు.జి.సమ్మర్ స్వర్గవాదం అని పేర్కొన్నారు.

## 4.4 సమూహపు ప్రకార్యాలు

సమాజంలోని ప్రతివ్యక్తి ఏదోఒక సమూహంలో సభ్యుడుగా ఉండి తీరవలసి ఉంటే వ్యక్తి జీవించలేడు. సమూహ ప్రభావం వల్లనే వ్యక్తి మానసికంగానూ, సాంఘికంగానూ అభివృద్ధి చెందుతాడు. వ్యక్తి యొక్క మనుగడ సమాష్ట్ర సభ్యత్వంపైనే హెచ్చుగా ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు యజమాని, కార్మికుడు, అమ్మేవాడు, కొనేవాడు మధ్యగల సంబంధాలు తాత్కాలికంగానే ఉంటాయి. మరికొన్ని సమూహాలలో సభ్యత్వం శాశ్వతంగా ఉంటుంది. ఉదాహరణకు కుటుంబం, మతము, కులము మొదలైనటువంటివి. పి.ఎ. సోరోకిన్ అభిప్రాయంలో వ్యక్తి కంటే సమూహమే ముందు ప్రధానమైంది. ఆధిక్యత కలిగింది. అంటే సమాజానికి ప్రధానమైనది సమూహమే కాని వ్యక్తి కాదని చెప్పవచ్చు. అందుచేతనే సమాజశాస్త్ర అధ్యయనంలో వ్యక్తి ప్రవర్తనకంటే సమూహ ప్రవర్తనకే అధిక ప్రాధాన్యము ఉన్నది.

సమూహ ప్రకార్యాలను క్రింది విధంగా పేర్కొనవచ్చు.

BRAOU

1. సమాజమునందలి సమూహాల ద్వారానే వ్యక్తి మూర్తిమత్వం ప్రభావితమౌతుంది. దుస్తులు వేసుకోవడం, అక్షరాలు నేర్చుకోవడం, కుడిచేతితో ఆహారం తీసుకోవడం, పెద్దలను గౌరవించడం మొదలైన విషయాలు సమూహం ద్వారా నేర్చుకుంటాడు.

2. వ్యక్తులకు గల అవసరాలను తీర్చడం సమూహాల ముఖ్యవిధిగా చెప్పవచ్చు. సంతానోత్పత్తి, శిశు పోషణ, శిశు సంరక్షణ, ఆహారం,నివాసం మొదలైన ప్రాథమిక అవసరాలను సమూహాలు తీరుస్తాయి. కుటుంబం, శిశుపోషణ ప్రకార్యాలను నెరవేర్చకపోతే పుట్టిన శిశువు జీవించలేదు.

3. సామాజిక ప్రమాణాలు విలువలకు అనుగుణంగా ప్రతి సమూహం తన సభ్యులకు అంతస్తును ప్రసాదిస్తుంది. అంతస్తుకు అనుగుణంగా వ్యక్తులు పాత్రలను పోషిస్తారు.

4. వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేస్తూ సామాజిక నియంత్రణకు తోడ్పడతాయి. సామాజిక ప్రమాణాలకు అనుగుణంగా వ్యక్తుల ప్రవర్తనను అదుపులోపెట్టి సామాజిక క్రమాన్ని పెంపొందిస్తుంది. సమూహాలు పని చేసే తీరును బట్టి సామాజిక వ్యవస్థ లేదా అవ్యవస్థ ఆధారపడి ఉంటుంది.

5. సమూహాలు వ్యక్తికి రక్షణ, భద్రత కల్పిస్తాయి. సైనిక బలం ద్వారా ప్రభుత్వము పౌరులను శత్రువుల బారినుండి రక్షిస్తుంది. పోలీసు సిబ్బంది, కోర్టుల ద్వారా, రాజ్యము పౌరులను దొంగతనము, హత్యలు మొదలైన వాటినుండి కాపాడుతుంది.

6. సామాజిక పరివర్తనకు, ప్రగతికి సమూహాలు తోడ్పడతాయి. సమూహాలు సామాజిక పరివర్తనకు అవరోధం కలిగిస్తే మరికొన్ని సామాజిక ప్రగతికి తోడ్పడతాయి. మొదట అవరోధాలుగా పనిచేసే సమూహాలు కాలక్రమేణా పరివర్తనను అంగీకరించి దానికి దోహదం చేయవచ్చు. ఉదాహరణకు అనేక సమూహాలు తొలుత కుటుంబ నియంత్రణను అంగీకరించలేదు. అవే సమూహాలు ఈనాడు కుటుంబ నియంత్రణను ప్రోత్సహించి జనాభా పెరుగుదలను అరికట్టడానికి దోహదం చేస్తున్నాయి.

## 4.5 సామాజిక సమూహాల వర్గీకరణ

BRAOU

సమూహాలను సమాజ శాస్త్రజ్ఞులు అనేక రకాలుగా వర్గీకరించినారు. వాటి వర్గీకరణలో వ్యత్యాసాలకు కారణం సమూహాలు పరిమాణంలోనూ, కాలపరిమితిలోనూ, వాటి ప్రయోజనాలలోనూ వత్యాసాలు ఉండడమే. సమూహాల వర్గీకరణలను కొన్నింటిని ఈ క్రింది పరిశీలిద్దాం.

### 4.5.1. సి.హెచ్.కూలె వర్గీకరణ

ఎ. ప్రాథమిక సమూహాలు. ఉదా:- కుటుంబం, ఇరుగుపొరుగు, ఆటల జట్టు, స్నేహితులు, దొంగల ముఠా, చిన్న గ్రామము మొదలైనవి.

బి. గౌణ సమూహాలు. ఉదా:- సముదాయం, కులం, జాతి, దేశం, వ్యాపార కార్మిక సంఘాలు, మొదలైనవి.

సమూహాల వర్గీకరణలన్నింటిలో సి.హెచ్.కూలె వర్గీకరణ సమాజ శాస్త్రవేత్తలను అధికంగా ఆకర్షించింది. సమూహాలలో ప్రాథమిక సంబంధాలు ముఖాముఖిగానూ, సహజంగానూ ఉంటాయి. వారిలో సామూహిక చైతన్యము హెచ్చుగా ఉంటుంది. అందుచేతనే వారు "మేము, మాది" అనే భావాన్ని కలిగి ఉంటారు. గౌణ సమూహాలలో వ్యక్తుల సంబంధాలు పరోక్షంగాను, కృత్రిమంగానూ ఉంటాయి. వారి మధ్య సన్నిహితత్వం తక్కువగా ఉంటుంది. వారి మధ్య సామూహిక చైతన్యం తక్కువ స్థాయిలో ఉంటుంది.

### 4.5.2. డబ్ల్యు.జి.సమ్నర్ వర్గీకరణ

ఎ. అంతస్సమూహాలు

బి. బాహ్యసమూహాలు

వ్యక్తి ఏ సమూహంలో సభ్యత్వాన్ని కలిగి ఉంటాడో ఆసమూహాన్ని అంతస్సమూహంగానూ, సభ్యత్వంలేని సమూహాలను బాహ్యసమూహాలుగానూ పరిగణిస్తారు. ఒక సమూహం వ్యక్తికి అంతస్సమూహమైతే అదే సమూహం మరొక వ్యక్తికి బాహ్యసమూహం కావచ్చు. ఉదాహరణకు వ్యక్తికి కుటుంబము, కులము, మతము, జాతి అంతస్సమూహాలు. హిందువులకు హిందూ మతం అంతస్సమూహంగా, ముస్లింలకు ఇస్లాం మతం అంతస్సమూహం అవుతుంది. ముస్లింలకు హిందూ మతం బాహ్య సమూహం.

సమ్నర్ వర్గీకరణలో గమనించవలసిన ముఖ్యవిషయం ఒకటి ఉన్నది. వ్యక్తులు సమూహాలను అంతస్సమూహాలుగానూ కొన్నింటిని బహిస్సమూహాలుగానూ భావించడం ద్వారా వారిలో "నాది, నాది కాదు, మాది, మాది కాదు" అనే భావన ఏర్పడుతుంది. ఈ భావన వారిలో సంకుచిత భావాన్ని రేకెత్తిస్తుంది. దీని కారణంగా సమూహాల మధ్య ద్వేషాలను, పక్షపాత వైఖరిని పెంపొందించి సంఘర్షణలకు దారి తీయవచ్చు. ఉదాహరణకు కులతత్వం, జాతి విచక్షణ, మత కల్లోలాలు రాజకీయపార్టీల మధ్య విషపూరిత వాతావరణము, ప్రాంతీయ దురభిమానము, మొదలైనవిగా పేర్కొనవచ్చు. వ్యక్తుల భావాలలో అన్ని సమూహాలు ఒకటేనని భావించినప్పుడు ఆధునిక సమాజంలో గల సమస్యలను పరిష్కరించడానికి వీలౌతుందని అతడు భావించినాడు. ప్రతి వ్యక్తి ఇతర సమూహాలను గౌరవించవలె. అప్పుడే సామాజిక ప్రగతి సాధించడం సాధ్యమౌతుంది. అన్ని సమూహాలు ఒకటే అని వాటిమధ్య వ్యత్యాసాలకు సంఘర్షణలకు తావులేదని వ్యక్తులకు తెలియజేయడమే సమాజశాస్త్ర ప్రయోజనాలలో ముఖ్యవిషయంగా భావించినాడు.

### 4.5.3. పి.వి.సోరోకిన్ వర్గీకరణ

ఎ. సమస్తరియ సమూహాలు: ఉదాహరణకు దేశము, మతము, జాతి, రాజకీయ పార్టీలు.

బి. విషమస్తరియ సమూహములు: ఉదాహరణకు కులము, వృత్తి, సంఘాలు, క్రీడా సమూహాలు, కళాశాలలు.

సమస్తరియ సమూహాలు పెద్దవిగా, విశాలమైనవిగా ఉంటాయి. అవి హెచ్చు మంది వ్యక్తుల అవసరాలను తీరుస్తాయి. విషమస్తరియ సమూహాలు చిన్నవిగా ఉంటాయి. పరిమిత స్థాయిలో అవి వ్యక్తులకు అంతస్తును ప్రసాదిస్తాయి. ఒకే వ్యక్తి సమస్తరియ సమూహంలోనూ, విషమస్తరియ సమూహంలోనూ సభ్యత్వం కలిగి ఉండవచ్చు.

### 4.5.4. డ్వైట్ షాండర్‌సన్ వర్గీకరణ

ఎ. అనైచ్ఛిక సమూహాలు: ఉదాహరణకు కుటుంబం, కులము, దేశము, జాతి.

బి. స్వచ్ఛంద సమూహాలు: ఉదాహరణకు ఆటల జట్టు, వ్యాపార సమూహాలు, రాజకీయపార్టీలు.

సి. ప్రాతినిధ్య సమూహాలు: ఉదాహరణకు విధాన సభ, పార్లమెంటు, ఐక్యరాజ్యసమితి, కార్మిక సంఘాలు.

సమూహాలలో వ్యక్తుల సభ్యత్వం, ఇచ్ఛపై ఆధారపడినప్పుడు వాటిని అనైచ్ఛిక సమూహాలంటారు. వ్యక్తి తన అవసరాలకు అనుగుణంగా ఇష్టపడి సభ్యత్వం పొందిన సమూహాలను స్వచ్ఛంద సమూహాలంటారు. దీనిలో వ్యక్తి తనకు ఇష్టమున్నంత కాలం సభ్యత్వాన్ని కలిగి ఉంటాడు. ఇష్టం లేనప్పుడు సభ్యత్వానికి రాజీనామా చేస్తాడు. ఒక ప్రత్యేక వర్గానికి ప్రాతినిధ్యం వహించే ఉద్దేశ్యంతో ఏర్పడిన సమూహాన్ని ప్రాతినిధ్య సమూహమంటారు. ఈ ప్రాతినిధ్య సమూహాలలో వర్గంలోని సభ్యుల ఆకాంక్షలను, భావాలను, సమస్యలను వ్యక్తపరచడమే ఈ సమూహాల ప్రత్యేకత.

### 4.5.5. జార్జి హాసన్, ఎఫ్.హెచ్.గిడ్డింగ్స్ వర్గీకరణ

ఎ. సమాజానికి దూరంగా ఉండే సమూహాలు. ఉదాహరణకు మారుమూల ఉన్న గ్రామాలు, జూద గృహాలు.

బి. స్వార్థపర సమూహాలు. ఉదాహరణకు మోసగించే పెద్దమనుష్యులు, వ్యాపారస్తులు.

సి. సమాజ విద్రోహ సమూహాలు. ఉదాహరణకు ముఠాలు, సైనిక కుట్ర దారులు, చట్ట వ్యతిరేక సమ్మెకు దారితీసే కార్మిక సంఘాలు.

డి. సమాజ హిత సమూహాలు. ఉదాహరణకు సాంఘికసేవలో నిమగ్నమైన స్వచ్ఛంద సేవా సంస్థలు.

1. సమాజానికి దూరంగా ఉంటూ సమాజ కార్యకలాపాల యెడల అయిష్టత ప్రదర్శించే సమూహాలను సమాజరహిత సమూహాలుగా చెప్పవచ్చును. కొంతమంది కేవలం తమ సమూహమే ప్రపంచమని భావిస్తారు.

ఉదా: మారుమూల ఉన్న గ్రామస్థులు బాహ్య ప్రపంచంతో సంబంధాలను కలిగి ఉండరు.

2. స్వలాభం కోసం పనిచేసే సమూహాలను స్వలాభ సమూహాలంటారు. ఈ సమూహాలు బాహ్యంగా మాత్రమే దేశభక్తిని, నిజాయితీని ప్రదర్శించి ప్రజలను మోసగించి వాటి సభ్యుల అభివృద్ధి కోసమే కృషి చేస్తాయి. రాజకీయ పార్టీలు ఇటువంటి సమూహాలకు ఉదాహరణముగా చెప్పవచ్చు.

3. సమాజసంక్షేమానికి వ్యతిరేకంగా పనిచేస్తూ సమాజంలోని నైతిక విలువలను మంటకలుపుతూ విద్రోహ చర్యలకు పాల్పడే సమూహాలను సమాజ విద్రోహ చర్యలకు పాల్పడే సమూహాలను సమాజ విద్రోహ సమూహాలుగా పేర్కొనవచ్చు. ఉదాహరణకు కల్తీ పదార్థాలను ఉత్పత్తిచేసే సంస్థలు, వాటిని అమ్మే వ్యాపార సంస్థలు, అక్రమ నిల్వలు చేసి ధరల పెరుగుదలకు దారితీసే వ్యాపార సంస్థలు మొదలైనవి సమాజ విద్రోహ సమూహాలు.

4. సామాజిక సేవయే ఉద్దేశ్యంగా కలిగి సామాజిక సంక్షేమ కార్యకలాపాలను నిర్వహిస్తూ ప్రజా శ్రేయస్సుకు తోడ్పడే సమూహాలను సమాజహిత సమూహాలుగా పేర్కొనవచ్చును. ఉదాహరణకు రెడ్ క్రాస్ సంస్థ, రోటరీ, అలయన్స్ క్లబ్బులు, అనాథ శరణాలయాలు మొదలైనవి సమాజహిత సమూహాలు.

### 4.5.6 గెమిన్‌షాఫ్ట్, గెజిల్ షాఫ్ట్

ఈ సమూహాలు కొంతవరకు ప్రాథమిక, గౌణ సమూహాలను పోలి ఉంటాయి. గెమిన్ షాఫ్ట్, గెజిల్‌షాఫ్ట్ వర్గీకరణను జర్మనీకి చెందిన సమాజశాస్త్రవేత్త ఫెర్డినాండ్.టిటోనీస్ రూపొందించాడు. గెమిన్‌షాఫ్ట్‌లో సభ్యుల మధ్య సంబంధాలు ఎక్కువగా వ్యక్తిగతంగానూ సంప్రదాయబద్ధంగానూ ఉంటాయి. ఉదాహరణకు కుటుంబమునందుగానీ, బంధువులలోగానీ ఒక ప్రాంతంలోని, ప్రజలలోగానీ ప్రాథమిక సంబంధాలు సన్నిహితంగానూ, పటిష్టంగానూ కనిపిస్తాయి. ఈ సమూహము నందలి వ్యక్తులు ఒకరిపట్ల ఒకరు సంప్రదాయబద్ధమైన ప్రవర్తనను కలిగి ఉంటారు. ఈ సమూహాలలోని వ్యక్తులు తమ సామాజిక స్థితిని మెరుగుపరచుకోవడానికి అవకాశంలేకున్నా సమూహంలోని సభ్యులు ఐకమత్యాన్ని కలిగి ఉంటారు.

గెజిల్‌షాఫ్ట్ నందు వ్యక్తుల మధ్య సంబంధాలు వారి స్వప్రయోజనాలపై ఆధారపడి రూపొందుతాయి. ఈ సమూహాలలోని సభ్యులు ఒకచోట స్థిర నివాసాన్ని కలిగి ఉండకుండా కొత్తవారి మధ్య జీవించడానికి అలవాటు పడతారు. సభ్యుల మధ్య నియత, వ్యక్తిగతం కాని సంబంధాలు కనిపిస్తాయి.

### 4.5.7 నియత, అనియత సమూహాలు

సామాజిక సమూహాలు కొన్ని నియత పద్ధతిలో రూపొందుతాయి. అనగా ఆ సమూహాల సభ్యుల పనితీరు లిఖిత పూర్వకమైన ప్రమాణాలతోనూ, లేదా చట్టం చేతగానీ క్రమబద్ధం చేయబడి అవి ఒక నిర్దిష్ట లక్ష్యసాధనకు కృషిచేస్తాయి. వీటికి ఉదాహరణలుగా రాజకీయపక్షాలను, వ్యాపార సంస్థలను, ప్రభుత్వ ఏజెన్సీలను, సైన్యాలను, విశ్వవిద్యాలయాలను పేర్కొనవచ్చు. నియతమైన సమూహాలలో పాల్గొనే సభ్యులు కొన్ని నియమనిబంధనలకు క్రోడీకరింపబడిన హక్కులు, విధులకు బద్ధులై ఉండాలి. దీనిలో సభ్యులు ప్రత్యేక శిక్షణను పొంది ఉంటారు. నైపుణ్యంగల వ్యక్తులే ఉన్నత స్థానాలను పొందుతారు. కొందరు వ్యక్తుల కార్యకలాపాలను వారిపై అధికారం గల మరికొందరు ఏదో ఒక లక్ష్యసాధన కోసం అదుపు చేస్తారు. సభ్యుల మధ్య సంబంధాలు క్రమబద్ధమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయి. సమూహంలోని సభ్యులు సంస్కృతి విషయంలో వేర్వేరు రకాలకు చెంది ఉన్నా సమూహాల లక్ష్యాలను చాలా ప్రముఖమైనవిగా భావిస్తారు. అనేక రకాలైన అనియత సమూహాలు కూడా



BRAOU

సమాజంలో కనిపిస్తాయి. ఇవి ఇష్టాపూర్వకంగా ఏర్పడినవి కావు. వీటికి ప్రత్యేకమైన లక్ష్యాలు ఉండవు. అంతేకాక ఈ సమూహాలు కొన్ని ప్రమాణాలకు నియమనిబంధనలకు అనుగుణంగా కాక లిఖితమైన నియమాలకు లోబడిపనిచేస్తాయి. కుటుంబము, స్నేహితుల సమూహాలు అనియత సమూహాలకు ఉదాహరణలు.

### 4.5.8 ఆదర్శ సమూహం

సమాజంలోని కొన్ని సమూహాలు మనకు ఆదర్శవంతమైనవిగా కనిపిస్తాయి. ఆ సమూహాలలో మనం సభ్యులుకాకపోయినా వాటిని మనం ఆదర్శంగా తీసుకోవచ్చు. ఇటువంటి సమూహాలను ఆదర్శ సమూహాలంటారు. వీటిలో సభ్యులు తమ ప్రవర్తనను, లక్ష్యాలను, భావాలను ఇతరులతో పోల్చుకుంటారు. దీని ఫలితంగా వ్యక్తుల వ్యక్తిత్త్వం అభివృద్ధి చెందుతుంది. కొన్ని సమయాలలో సమాజంలో తన స్థాయిని పెంపొందించుకొనడానికి ఒక వ్యక్తి ఉన్నత వర్గం ఆమోదం పొందడానికి ప్రయత్నిస్తాడు. కొన్ని సమయాలలో ఆదర్శ సమూహం అంతర్ సమూహం ఒకటి కావచ్చు. అటువంటి సందర్భాలలో యువకులు తమ ఉపాధ్యాయుల అభిప్రాయాలకన్నా తమ స్నేహితుల అభిప్రాయాలకు ఎక్కువ విలువనిస్తారు. ఏదైనా ఒక సమూహం విలువలను, ప్రమాణాలను మనం అనుకరిస్తే అది మనకు ఆదర్శ సమూహమవుతుంది. ఒక వ్యక్తి కొన్ని సమూహాల ఆమోదం కోసం వాటిని తనకు ఆదర్శ సమూహాలుగా ఎంచుకోవచ్చు.

పైవిధంగా సామాజిక సమూహాలను వర్గీకరించడానికి అనేకరకాలైన కొలబద్ధలను ఉపయోగించవచ్చును. వ్యక్తుల లక్షణాలను బట్టి సమూహాలు ఏర్పడతాయి. సమూహంలోని సభ్యుల మధ్య సంబంధాలు వ్యక్తిగతమైనవా లేక వ్యక్తిగతం కానివా, సమూహం ప్రమాణం, దానికి కాలపరిమితి, దానిలోని సభ్యుల లక్షణాలపై ఆధారపడి ఉంటాయి. సిమ్మెల్ సమూహంలోని సభ్యుల సంఖ్య సమాజం సైజు మధ్య సంబంధాన్ని పరిశీలించాడు. నగరాలలో జనాభా అధికంగా పెరగడం వల్ల సమూహాలలోని సంబంధాలు మార్పు చెందుతాయని అతను రుజువు చేసినాడు. ఆధునిక సమాజాలలో వ్యక్తులు కొన్ని కొన్ని పనులలో ప్రత్యేకతను సాధించడం ఆధారంగా శ్రమ విభజన ఏవిధంగా పెంపొందుతుందో దుర్క్‌హైమ్ తెలియజేశాడు. పెద్ద సమూహాలలో సామాజిక సమగ్రతను ఏర్పాటు చేసి నిర్వహించే సామాజిక మార్పులను హోజ్‌హౌజ్ వివరించాడు. చిన్న సమూహాల పరిశీలన సమాజం పరిశీలనకు అత్యవసరమని ప్రాథమిక సమూహాల గూర్చి పరిశోధించిన జి.సి.హోమన్ అభిప్రాయం ప్రకటించాడు.

## 4.6 ప్రాథమిక సమూహాలు

సమాజంలోని సమూహాలు రెండు రకాలుగా ఉంటాయని కూలే చెప్పాడు. అవి 1. ప్రాథమిక సమూహాలు. 2. గౌణ సమూహాలు.

వ్యక్తుల పరస్పర చర్యలో సన్నిహితమైన ముఖాముఖి సంపర్కం, సహకారం కనిపిస్తాయి. ఇవి అన్నీ మానవ సమాజాలకు మౌలికమైనవి కాబట్టి అతడు వాటిని ప్రాథమిక సంబంధాలు అన్నాడు. సభ్యులలో ఏదో ఒక సందర్భంలో ప్రాథమిక సంపర్కంలేని సమాజముండదు. ఉదాహరణకు కుటుంబంలో సన్నిహితమైన సహకారంతో కూడిన సంబంధాలు వ్యక్తుల మధ్య కనిపిస్తాయి. కుటుంబంలో పసిపాప జన్మించినప్పుడు ఆ పసిబిడ్డ సామాజిక అభివృద్ధికి ఇతర కుటుంబ సభ్యులు ప్రధానమైన, మౌలికమైన పాత్రను వహిస్తారు. కాబట్టి వీటిని ప్రాథమిక సంబంధాలు అంటారు. కుటుంబంలోని వ్యక్తుల వ్యక్తిత్వాలు సమ్మిళితమైన సమాజంలోని నమ్మకాలు, విలువలు ఆశయాలతో ఆ వ్యక్తులు తాదాత్మ్యం పొందుతారు. వ్యక్తులు తోటివారిపట్ల జాలిని, పరస్పర గుర్తింపును ప్రదర్శిస్తారు. అందువల్ల ప్రాథమిక సమూహంలో "మనము' అనే మాట సభ్యుల మధ్య సంబంధాన్ని తెలియజేస్తుంది.

### 4.6.1 ప్రాథమిక సమూహ లక్షణాలు

ప్రాథమిక సమూహాలు సమాజానికి జీవం వంటివి. ప్రాథమిక సమూహాల ద్వారానే వ్యక్తి తొలుత సమాజానికి పరిచితుడవుతాడు. ప్రాథమిక సమూహాలు పరిమాణంలో చిన్నవిగా ఉంటాయి. వ్యక్తుల మధ్య భౌతిక సామీప్యం హెచ్చు. అందుచేతనే వారి సంబంధాలు ప్రత్యక్షంగానూ, ముఖాముఖిగాను ఉంటాయి. వారిలో ప్రేమ, అనురాగం,



BRAOU

సహనము, త్యాగము, పరస్పర అవగాహన హెచ్చుగా ఉంటాయి. వారి మధ్య సంబంధాలు సహజంగానూ, సన్నిహితంగాను ఉంటాయి ప్రాథమిక సమూహంలోని వ్యక్తులు ఒకరినొకరు ఆత్మీయులుగా భావిస్తారు. కష్టసుఖాలు సమంగా పంచుకుంటారు. ప్రాథమిక సమూహ సభ్యుల అంతస్సుల్లో సారూప్యం కనబడుతుంది. వ్యక్తి అభిరుచులు, అవసరాలు, తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు, మంచి చెడులను ప్రాథమిక సమూహంలోనే పూర్తిగా అర్థం చేసుకోవడం జరుగుతుంది.

ప్రాథమిక సమూహ లక్షణాలను కింగ్స్ లేడేవిస్ ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు.

ఎ. భౌతిక సామీప్యం: ప్రాథమిక సమూహ సభ్యులు భౌతికంగా చాలా దగ్గరలో ఉంటారు. అందుచేతనే వారిలో సాన్నిహిత్యం అధికంగా ఉంటుంది. ముఖాముఖి సంబంధాల ద్వారా వ్యక్తుల అభిరుచులను, భావాలను, అభిప్రాయాలను, మూర్తిమత్వాన్ని హెచ్చుగా అర్థం చేసుకోగలము. సహపంక్తి భోజనము, ఒకే ఇంటిలో నివసించడం, కలిసిమెలసి ఆటపాటలలో పాల్గొనడం వంటి సంజ్ఞలు, ప్రాథమిక సమూహ సభ్యుల్లో సౌభాతృతను, సాన్నిహిత్యాన్ని పెంపొందిస్తాయి.

బి. తక్కువ సంఖ్య: ఈ సమూహాలలో వ్యక్తులు తక్కువ సంఖ్యలో ఉంటారు. సభ్యుల సంఖ్య పరిమితంగానున్నప్పుడే వ్యక్తులు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోపడానికి వీలు కలుగుతుంది. బహిరంగ సభల్లో ఒక వ్యక్తి వేల సంఖ్యలోనున్న ప్రేక్షకులకు మధ్య సన్నిహిత సంబంధాలు పెంపొందే అవకాశం ఉండదు. దీనికి కారణం సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడే వారి మధ్య సాన్నిహిత్యం పెంపొందుతుంది.

సి. శాశ్వత సంబంధాలు: ప్రాథమిక సమూహ సంబంధాలు సాధారణంగా శాశ్వతంగా ఉంటాయి. వీరు ఒక లక్ష్యం నెరేరగానే విడిపోక మరొక లక్ష్య సాధన కోసం కలిసి కృషి చేస్తారు. వ్యక్తులు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం జరుగుతుంది. ఉదాహరణకు భార్యా భర్తల మధ్య గల సంబంధాలు శాశ్వతమైనవి కావడం వల్లనే వారిలో అవగాహన హెచ్చుగా ఉంటుంది.

పైన ఉదహరించిన మూడు భౌతిక లక్షణాలు ఉంటే సమూహాలనే ప్రాథమిక సమూహాలుగా భావిస్తాము. వీటిలో ఏ ఒక్క లక్షణం లోపించినా అవి ప్రాథిక సమూహాలు కావని చెప్పవలె.

BRAOU

## 4.6.2 ప్రాథమిక సంబంధాల లక్షణాలు

ఎ. లక్ష్యాలలో తాదాత్మ్యము:- ఈ సమూహ సభ్యులు ఒకే విధమైన ఆదర్శాలు, ఉద్దేశాలు, లక్ష్యాలు కలిగి ఉంటారు. ప్రాథమిక సమూహసభ్యుల్లో సామూహిక చైతన్యం హెచ్చుగా ఉంటుంది. అంతేగాక ప్రతి వ్యక్తి మిగతా వారికష్టసుఖాలుగానూ, సుఖసంతోషాలుగానూ భావిస్తాడు. ఉదాహరణకు తల్లి తన పిల్లవాడి ఆనందం తన ఆనందంగానూ, వాడి విచారం తనదిగానూ భావిస్తుంది. సమూహ లక్ష్యమే వ్యక్తుల సంబంధాలకు మూలమని ప్రాథమిక సమూహ సభ్యులు భావిస్తారు. ప్రాథమిక సమూహాలలో వ్యక్తి లక్ష్యమే సమూహ లక్ష్యంగాను, సమూహ లక్ష్యమే వ్యక్తి లక్ష్యంగానూ ఉంటుంది.

బి. సమగ్రమైన సాంఘిక సంబంధాలు:- సభ్యుల సంబంధాలు సమగ్రంగాను, పూర్తిగానే ఉంటాయి. ప్రతి సభ్యుని మూర్తిత్వము సంపూర్ణంగా తెలుస్తుంది. ప్రతి వ్యక్తి అభిరుచులు, తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు, మంచి చెడులను మిగతా సభ్యులు అర్థం చేసుకుంటారు.

సి. సహజమైన సాంఘిక సంబంధాలు:- వ్యక్తుల మధ్యగల సంబంధాలు సహజంగా ఉంటాయి. సభ్యుల సంబంధాలు భావపూరితంగాను, మనస్ఫూర్తిగానూ ఉంటాయి.

## 4.6.3 ప్రాథమిక సమూహాల ప్రాముఖ్యము

వ్యక్తి శ్రేయస్సుకు సామాజిక ఆదర్శాలకు నిలయంగా ఉండేవే ప్రాథమిక సమూహాలు. వ్యక్తి రక్షణను, సమాజపు మనుగడను అవి కాపాడుతాయి. ఈ సమూహాల ద్వారానే వ్యక్తి న్యాయం, ధర్మం, సమానత్వం, నిజాయితీ, ప్రేమ, త్యాగము మొదలైన సామాజిక ఆదర్శాలు ఉదయిస్తాయి.

1. వ్యక్తి మూర్తిమత్వాన్ని తీర్చి దిద్దడంలో ప్రాథమిక సమూహాల పాత్ర గణనీయమైంది. వ్యక్తి మూర్తిమత్వం సంపూర్ణంగా ఈ సమూహాలలోనే పెంపొందుతుంది. సామాజిక విలువలను, ఆచార వ్యవహారాలను, మంచి చెడులను తెలుసుకోవడానికి ప్రాథమిక సమూహ వ్యక్తులకు పెక్కు అవకాశాలను కల్పిస్తాయి.

2. వ్యక్తులలో సామాజిక ఆదర్శాలను, విలువలను పెంపొందించడంలోనూ వాటిని కాపాడటంలోనూ ప్రాథమిక సమూహాల పాత్ర మరుపరానట్టిది. సాంఘికీకరణ ప్రక్రియ ప్రాథమిక సమూహాలలోనే హెచ్చుగా జరుగుతుంది. సమాజమునందు ధర్మము, అహింస, నైతిక ప్రవర్తన, నిజాయితీ మొదలైన ఆదర్శాలు కొనసాగుతున్నవంటే వాటికి ప్రాథమిక సమూహాలే కారణంగా చెప్పవలె.

3. ప్రాథమిక సమూహాలు అన్ని కాలాలలోనూ, అన్ని సమాజాలకు అయువుపట్టుగా ఉంటాయి. ప్రాథమిక సమూహాలు లేనిదే సమాజానికి మనుగడేలేదు. ఈ సమూహాల ద్వారానే సంస్కృతి ఒకతరం వారినుంచి ఇంకోతరం వారికి అందించడం సంభవిస్తుంది.

4. మానవ ఉత్పత్తికి ప్రాథమిక సమూహాలు శిక్షణాలయాలు. మానవునిలోని నిరంకుశత్వాన్ని, పశుత్వాన్ని పారద్రోలి ప్రేమానురాగాలను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయి. సమాజంలోగల ప్రేమ, న్యాయము, స్వేచ్ఛకు ప్రాథమిక సమూహాలే మూలమని కూలే చెప్పినాడు.

5. సామాజిక వ్యవస్థాపనకు కుటుంబం వంటి ప్రాథమిక సమూహాలు అధికంగా తోడ్పడతాయి.

6. వ్యక్తి రక్షణకు ప్రాథమిక సమూహాలు అధికంగా తోడ్పడతాయి. వ్యక్తికి గల అనేక అవసరాలు ఈ సమూహాలద్వారానే తీర్చుకోగలుగుతారు. వారే వీటిని అర్థం చేసుకుని తగిన సహాయాన్ని అందజేయగలుగుతారు. ఆత్మీయులుకాని గౌణ సమూహ వ్యక్తులతో కష్టసుఖాలను మొరపెట్టుకోవడం చెవిటివాని ముందు శంఖం ఊదినట్లే అవుతుంది.

7. ప్రాథమిక సమూహాలు సమాజానికి, వ్యక్తికి మధ్యవర్తిగా పనిచేస్తాయి. సమాజం ఎడల వ్యక్తి బాధ్యతలను వ్యక్తి ఎడల సమాజం బాధ్యతలను గుర్తు చేస్తాయి. సామాజిక ప్రమాణాలకు అనుగుణంగా వ్యక్తుల ప్రవర్తనను తీర్చిదిద్దుతాయి. వ్యక్తి అవసరాలను తీర్చి, వారి స్వేచ్ఛను కాపాడుతూ అవి వ్యక్తి ఆనందానికి తోడ్పడతాయి.

8. సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా ప్రాథమిక సమూహాలు ప్రజాస్వామ్య బీజాలను వ్యక్తుల మనస్సుల్లో నాటుతాయి. గౌరవించడం, నిజాయితీ, స్వేచ్ఛ, సమానత్వం మొదలైన ప్రజాస్వామ్య విలువలు నిత్యం ప్రాథమిక సమూహ సభ్యుల సంబంధాల్లో మనం చూస్తుంటాము.

## 4.7 గౌణ సమూహాలు

గౌణ సమూహాలు అతి పెద్దవిగా ఉండి కొన్ని ఉమ్మడి లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తారు. సమూహం సభ్యుల మధ్య ఆశిస్తున్న సంబంధాలను నిర్దేశిస్తుంది. గౌణ సమూహాలకు వృత్తి సమూహాలకు, కార్మిక సమూహాలను ఉదాహరణగా పేర్కొనవచ్చు.

ఆధునిక సంశ్లిష్ట సమాజంలో గౌణ సమూహాల ప్రభావం హెచ్చుగా ఉంది. అది మన సమాజాలలోను, చిన్న చిన్న సముదాయాలలోను ప్రాథమిక సమూహాలు అధికంగా ఉంటాయి. రోజురోజుకూ పెరిగిపోతున్న ఆధునిక సమాజాలలో వ్యక్తులు ప్రాథమిక సంబంధాలను కలిగి ఉండే అవకాశం తక్కువ. ఉదాహరణకు కలకత్తా నగరంలో పనిచేసే ఉద్యోగస్తులు చాలామంది దూర ప్రాంతాల నుండి ప్రతి దినం వస్తూ పోతూంటారు. అటువంటి సందర్భంలో వ్యక్తులు సన్నిహిత సంబంధాలను పెంపొందించుకునే అవకాశం తక్కువ. అందుచేతనే గౌణసమూహంలోని సభ్యులు ఒకరినొకరు వ్యక్తిగతంగా తెలిసి ఉండడం సాధ్యం కాదు. ఒక గౌణ సమూహం చాలా కాలం కొనసాగవచ్చు. కానీ దానిలోని వ్యక్తుల మధ్య వ్యక్తిగత సంబంధాలు కొద్దికాలమే కొనసాగవచ్చు. సభ్యులు ఒకరినొకరు వ్యక్తిగా కాకుండా ఒక పాత్రను నిర్వహిస్తున్న వానిగా భావిస్తారు. గౌణ సమూహంలోని సభ్యులు కొన్ని నిర్దిష్ట లక్ష్యాలకోసం పరస్పర చర్య కలిగి ఉంటారు. సభ్యులు నిర్వహించే పాత్రలకేగాని విరి మధ్య



BRAOU

వ్యక్తిగత లక్షణాలకు ప్రాధాన్యత ఇవ్వరు. సభ్యుల మధ్య సన్నిహిత సంబంధాలుండవు. అంతేగాక సభ్యులు వేర్వేరు పాత్రలు, ప్రయోజనాలు వారి మధ్య సంబంధాలలో ఎటువంటి పాత్రను వహించవు. ఉదాహరణకు ఒక కారుడ్రైవరు అతని కారునందు ప్రయాణం చేస్తున్న వ్యక్తి మధ్య గౌణ సంబంధం ఏర్పడుతుంది. వారి వారి వ్యక్తిగత పాత్రలుగానీ, ప్రయోజనాలుగానీ ఈ సంబంధంలో కనిపించవు. గౌణ సంబంధాలు సాధారణంగా ఏదోఒక ఆశయాన్ని సాధించడానికి లేదా తమ పనులను చేసుకోవడానికి ప్రజల మధ్య ఏర్పడతాయి. ఒక పోలీసు అధికారి ఒక పౌరుడి మధ్య గౌణ సంబంధాలు మాత్రమే ఉంటాయి. వారిరువురు ఏదో ఒక లక్ష్యసాధనకు మాత్రమే పరస్పర చర్య జరుపుకుంటారు.

### 4.7.1 గౌణసమూహ లక్షణాలు

1. ఈ సమూహాలలో సభ్యులు వివిధ ప్రాంతాలకు చెంది ఉండవచ్చు. అందుచేత వారి మధ్య ప్రాదేశిక అంతరం హెచ్చు.

2. గౌణ సమూహాలు చాలా పెద్దవిగా ఉంటాయి. ఈ సమూహాలకు చెందిన వ్యక్తులు ఒకరికొకరు తెలియకుండా ఉండవచ్చు.

3. ఈ సమూహంలోని సభ్యులు తాత్కాలిక సంబంధాలనే హెచ్చుగా కలిగి ఉంటారు. ఉదాహరణకు వ్యాపారస్తులు తమ వ్యాపారంలో నష్టం పొందినంతనే భాగస్వులు విడిపోతారు.

4. గౌణ సమూహములో సభ్యుల మధ్యగల సంబంధాలు కృత్రిమంగాను, పరోక్షంగాను ఉంటాయి. వారి సంబంధాలు సామాన్యంగా ఒడంబడికలపై ఆధారపడి పరిమితంగా ఉంటాయి. వారి వ్యక్తిగత సమస్యల ప్రసక్తి వారి సంబంధాల్లో రానేరాదు. అదే విధంగా పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల మధ్యగల సంబంధాలు యాంత్రికంగా ఉంటాయి.

5. వ్యక్తుల సామూహిక ప్రయోజనాల కంటే తన స్వప్రయోజనానికే వ్యక్తి ప్రాధాన్యతనిస్తాడు. తమ సమూహానికి ఇచ్చేదానికంటే సమూహంనుండి ఎక్కువ ప్రతిఫలాన్ని ఆశిస్తాడు. లక్ష్యాలలో వ్యక్తులు వైవిధ్యాన్ని ప్రదర్శిస్తారు.

6. గౌణ సమూహ సభ్యులు తమ మూర్తిమత్వాలను పూర్తిగా ప్రదర్శించరు. వారికి సంబంధించిన కొన్ని విషయాలను మాత్రమే తెలుసుకోవడం జరుగుతుంది. ఉదాహరణకు ఒక పరిశ్రమలోని భాగస్థులు ఒకరినొకరు వ్యాపారంలో వారి తెలివితేటలను, అభిరుచులను తెలుసుకోవడం వరకే ప్రయత్నిస్తారు. వారు వ్యాపారేతర విషయాలపై ఆసక్తిని కనబరచరు.

BRAOU

## 4.8 ప్రాథమిక సమూహ భావన - విమర్శ

కూలే రూపొందించిన ప్రాథమిక సమూహ భావన సమాజ శాస్త్రజ్ఞులలో చాలా అనుమానాలకు, విమర్శలకు దారి తీసింది. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాము:-

1. "మేము" అనే భావన కేవలం ప్రాథమిక సమూహసభ్యులకే పరిమితమై ఉంటుందని చెప్పడం సరికాదు. ఈ భావన గౌణ సమూహ సభ్యుల్లో కూడా కనిపిస్తుంది. ఉదాహరణకు దేశపౌరులలో "మేము" అనే భావంలేనిదే దేశం ఉండదు. విధేయత, సానుభూతి, సహనము మొదలైన ప్రాథమిక సమూహ ఆదర్శాలను గౌణ సమూహాల్లో కూడా ప్రవేశపెట్టవచ్చునని కూలేభావించాడు.

2. కూలే పేర్కొన్న ముఖాముఖి సంబంధాలు ప్రాథమిక సమూహాలకే పరిమితమై ఉండలేదు. పరోక్ష సంబంధాల్లో కూడా స్నేహ భావము, సాన్నిహిత్యము ఉండవచ్చు. ఉదాహరణకు ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా దూర దేశాలకు చెందిన ఇద్దరు శాస్త్రవేత్తలు దూర ప్రాంతాల్లో ఉంటున్న స్నేహితులు, ఎడబాటును భరిస్తున్న ఇద్దరు ప్రేమికుల మధ్య ముఖాముఖి, ప్రత్యక్ష సంబంధాలు లేనప్పటికీ వారు సన్నిహితులుగా ఉంటారు. అనగా ముఖాముఖి సంబంధాలు లేనంత మాత్రాన ప్రాథమిక సంబంధాలు ఏర్పడే అవకాశం లేదని చెప్పడం పొరబాటే

అవుతుంది.

3. అన్ని సందర్భాలలోనూ ముఖాముఖి సంబంధాలు వ్యక్తుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించలేవు. కొందరు వ్యక్తుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందించలేవు. కొందరు వ్యక్తుల మధ్య ముఖాముఖీ సంబంధాలు ఉన్నప్పటికీ వారి మధ్యగల సంబంధాలు అనురాగరహితంగా ఉండవచ్చు. ఉదాహరణకు అమ్మేవాడు - కొనేవాడి మధ్యన ఉన్న సంబంధాన్ని చెప్పుకోవచ్చు.

4. ప్రాథమిక సమూహాలలో స్వల్ప భేదాభిప్రాయాలు పెద్ద సంఘర్షణలకు దారి తీయవచ్చు. ఉదాహరణకు రెండు కుటుంబాల మధ్య లేదా రెండు కులాల మధ్య ఏర్పడిన తగవు శాశ్వతంగా కొనసాగడానికి అవకాశం ఉంది.

5. ప్రాథమిక సమూహాలలో వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడానికి కఠిన నియమాలను పాటించడమౌతుంది. స్వేచ్ఛాజీవనానికి

వ్యక్తులు అటువంటి ఆంక్షలకు గురికావడానికి ఇష్టపడరు. కొన్ని సందర్భాలలో వారు సమస్యలకు లోనౌతారు. ఉదాహరణకు కుటుంబం విధించే ఆంక్షలకు తట్టుకోలేని పిల్లలు బాల నేరస్తులుగా రూపొందుతారు.

6. ఈ సమూహాలలో ప్రతి వ్యక్తి ఏదో ఒక ప్రధాన పాత్రను నిర్వహిస్తాడు. కావున దానిలో ఒక వ్యక్తి లేని ఎడల మొత్తం సమూహమంతా కూలిపోతుంది. కానీ గౌణ సమూహాలలో ఒక సభ్యుడు లేకున్నా ఆ ఖాళీని సులభంగా భర్తీ చేయవచ్చు.

## 4.9 సారాంశం

సమూహమంటే పరస్పర సంబంధాలను ఏర్పరచుకొనడానికి, అవసరాలను తీర్చుకొనడానికి, పనులను నెరవేర్చుకోవడానికి రూపొందించుకున్న కొంత మంది వ్యక్తుల కలయిక సమూహాలలో సాధారణ స్నేహసమూహాలనుండి అతి పెద్ద సంక్లిష్టమైన సమాజం వరకు ఉంటాయి. సమూహంలోని సభ్యుల మధ్య చైతన్యవంతమైన ఐక్యత, పరస్పర సహకారాలు, ఉమ్మడి మనస్తత్వము కలిగి ఉంటారు. ప్రతి వ్యక్తికి నిర్దిష్టమైన ఒకటిగానీ, అంతకన్నా ఎక్కు పాత్రలుగానీ కలిగి ఉంటారు. అలాగే వ్యక్తి ఒక సమూహంలోగానీ పలు సమూహాలలోగానీ సభ్యులుగా ఉంటారు. సమూహాలను పలురకాలుగా వర్గీకరించారు. అవి అంతస్సమూహము, బాహ్య సమూహము, గౌణ సమూహము, ప్రాథమిక సమూహము, గెమైన్‌షాఫ్ట్, గెజెల్‌షాఫ్ట్, నియత, అనియత సమూహాలు, సమస్తరియ సమూహము, విషమస్తరియ సమూహము, ప్రాతినిధ్య సమూహము, సమాజానికి దూరంగా ఉండే సమూహము, స్వార్థ పర సమూహము, సమాజహిత సమూహము, ఆదర్శ సమూహము. సమూహాలు విభిన్న ప్రకార్యాలను నెరవేరుస్తుంటాయి.

BRAOU

## 4.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రిందివాటికి 30 పంక్తులలో జవాబు వ్రాయండి.**

1. సమూహాన్ని నిర్వచించి, దాని లక్షణాలను, ప్రాకార్యాలను వివరించండి.

2. వివిధ రకాల సమూహాల వర్గీకరణ గురించి విపులంగా వ్రాయండి.

**II. ఈ క్రింది వాటికి 15 పంక్తులలో జవాబు వ్రాయండి.**

1. ప్రాథమిక, గౌణ సమూహాలకు గల తేడాలను వివరించడండి.

2. గెమెన్‌షాఫ్ట్, గెజెల్ షాఫ్ట్ గురించి వ్రాయండి.

## 4.11 చదవవలసిన రచనలు


1. Bogardus, E.S. :Sociology.

2. Eldredge & Merrill :Culture and Society.

3. Gillin & Gillin :Cultural Sociology

4. Mac Iver :Society

5. Giddings, F.H :Principles of Sociology

6. Cooley, C.H. :Social Organisation


BRAOU

# భాగం-5: సముదాయం, సంఘం, గుంపు

విషయక్రమం


5.0 ఉద్దేశాలు

5.1 పరిచయం

5.2 సముదాయం అంటే ఏమిటి?

5.3 సముదాయాల చరిత్ర, నిర్వచనం

5.4. సామాజిక ప్రవర్తన - సాముదాయిక జీవనం

5.5. సముదాయం - లక్షణాలు

5.6. సంఘాలు / సమితులు - అర్థం, నిర్వచనం

5.7. ఆధునిక సమాజానికి సంఘాలే ప్రాతిపదిక

5.8 సంఘాల వర్గీకరణ

5.9 సంఘాలు - సామాజిక బాధ్యతలు

5.10 బృహత్ సంఘాలు

5.11 గుంపు - అర్థం, నిర్వచనం

5.12 గుంపు లక్షణాలు

5.13 గుంపు ప్రవర్తన

5.14 గుంపులోని రకాలు

5.15 సారాంశం

5.16 మాదిరిపరీక్షా ప్రశ్నలు

5.17 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 5.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు కింది విషయాలను గురించి తెలుసుకోగలరు:

- సముదాయ భావన అర్థం, సముదాయాలకు సామాజిక ప్రవర్తనకు మధ్య వున్న సంబంధం.
- సముదాయాల చరిత్ర, వాటి లక్షణాలు
- సంఘాలు సమజాంలో ఎలాంటి పాత్ర వహిస్తాయి, సంఘాలు ఎన్ని రకాలుగా ఉంటాయి, అవి ఎలాంటి బాధ్యత నిర్వహిస్తాయి.
- గుంపు అంటే ఏమిటి, గుంపు లక్షణాలు, గుంపు ప్రవర్తన ఎట్లా ఉంటుంది? గుంపులో ఎన్నిరకాలు ఉన్నాయి.

## 5.1 పరిచయం

వ్యక్తి సమాజాల మధ్య వున్న సంబంధాన్ని గురించి ఇదివరకటి పాఠంలో విపులంగా చర్చించడం జరిగింది. ఈ రెండింటి మధ్య సంబంధం వివిధ మాధ్యమాల - సముదాయం, సంఘం, సమూహం, గుంపు వంటి వాటి - ద్వారా ఏర్పడుతూ సమాజ సుస్థిరతకు, మానవ అవసరాలను తీర్చడానికి తోడ్పడుతూ ఉంటుంది. మానవ సముదాయాలు - అవి మురికి వాడలకు సంబంధించినవి గానీ, మహానగరాలకు సంబంధించినవి గానీ - అయి ఉండవచ్చు. ప్రతి సమాజంలోనూ సముదాయాలు, సంఘాలు, తప్పనిసరిగా ఉంటాయి. సామాజికీకరణ సాధనాలుగా సమూదాయాలు సంఘాలు ప్రముఖ పాత్ర వహిస్తూనే ఉంటాయి. ఇరవైయవ శతాబ్దంలో కనిపించే నగరీకరణ అనేక సామాజిక సమస్యలకు దారితీసింది. ముఖ్యంగా పరాయీకరణ లేదా వైమనస్యం (alienation), అనియత ప్రవర్తన (anamie) లాంటి ధోరణుల స్వభావాన్ని కారణాలను గురించి సమాజ శాస్త్రవేత్తలు లోతుగా పరిశీలించి సముదాయ జీవన విధానాన్ని గురించి అనేక సూచనలు చేస్తూ వచ్చారు. ఇలాంటి వ్యవస్థలను గురించి

సామాజికీకరణ, సామాజిక సుస్థిరతలకు సంబంధించి వీటి పాత్ర విశిష్టతను గురించి కొంత విపులంగా చర్చిద్దాం.

## 5.2 సముదాయం అంటే ఏమిటి?

ఒక భౌగోళిక ప్రాంతంలో కొందరు ప్రజలు నివశించినంతమాత్రాన వారందరినీ కలిపి సముదాయం అనడానికి వీలులేదు. అక్కడి ప్రజల మధ్య పరస్పర సంబంధాలు, పరస్పర చర్యలు కొనసాగుతున్నప్పుడే ఆ సమూహాలను సముదాయాలు అనవచ్చు. ఆ సముదాయాల సభ్యుల ప్రవర్తన తీరు, ప్రతిస్పందనలు ఒకే రీతిలో ఉండటం అనేది సముదాయాల ప్రముఖ లక్షణంగా సమాజశాస్త్రవేత్తలు భావిస్తారు. అంటే ఒకనొక ప్రాంతంలో నివశించే ప్రజలందరినీ కలిపి సముదాయం అనడానికి వీలులేదన్నమాట. ఈ విధమైన పరిస్థితులకు విఘాతం కలిగినప్పుడు సముదాయం అస్తవ్యస్తం అవుతుంది. చివరకు అంతరిస్తుంది కూడా.

సముదాయం అనే భావనను వివిధ రకాలుగా వివరించడం జరుగుతూ ఉంటుంది. ఇందులో ముఖ్యంగా కుగ్రామాలలో, గ్రామాలలో, పట్టణాలలో, నగరాలలో, మహానగరాలలో, నివశించే జనావళిని ఒకసముదాయంగా పేర్కొనడం జరుగుతూ ఉంటుంది. ఇలా నివశిస్తున్న ప్రజల సామాజిక, సాంస్కృతిక ప్రక్రియలు ఆయా సముదాయలను మానవ సముదాయాలుగా మారుస్తాయి. ఈ సముదాయాలలోని వారందరి మధ్య పరస్పర సంబంధం, సాన్నిహిత్యం ఉండడమే కాక ఒక గుర్తింపు, మమత్వం (sense of belonging) అనేవి చోటుచేసుకొంటాయి. ఉదాహరణకు ఒక పట్టణంలోని ప్రజల వివిధ కార్యకలాపాలు, ప్రవర్తనా రీతులు పరస్పరం ఆధారపడడానికి తోడ్పడి సమూహ చైతన్యాన్ని కల్పించినప్పుడు అది ఒక పట్టణ సముదాయం (town community)గా ఏర్పడుతుంది. అంటే సముదాయం అనే భావనలో రెండు అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఒకటి స్థలం (locality), రెండు పరస్పర సాన్నిహిత్యం, పరస్పర చర్య (intimacy and interaction). ఈ రెండూ పరస్పర సంబంధం కలవి. ఒకదాని నుంచి మరొదానిని వేరుచేయడానికి అన్ని సమయాలలో వీలుకాదు.

సముదాయ భావనకు ఒక నిర్దిష్ట నిర్వచనాన్ని ఇవ్వడానికి అనేకమంది సమాజశాస్త్రవేత్తలు ప్రయత్నించారు. నిర్వచనం విషయంలో శాస్త్రవేత్తల కృషిని సమీక్షించే ముందు వివిధ సముదాయాల చరిత్రను క్లుప్తంగానైనా తెలుసుకోవడం అవసరం.

B R A O U

## 5.3 సముదాయాల చరిత్ర, నిర్వచనం

మానవజాతి చరిత్రలో సముదాయాల ఆవిర్భావం ఒకేరీతిలో జరిగినట్లు కనిపించదు. అంటే ప్రపంచ వ్యాప్తంగా ఆదిమ సమాజాల దశనుంచీ నగర సముదాయాలు ఏర్పడినట్లు, ఇందులో ఏకరూపత ఉన్నట్లు కనిపించదు. పురాతన కాలంలో కూడా పెద్ద పెద్ద నగరాలు వెలసినట్లు చరిత్ర చెబుతోంది. కానీ ప్రపంచ దేశాల ప్రజలలో అధిక భాగం ఈనాటికీ గ్రామీణ జీవిత ప్రభావానికి లోనయినట్లే స్పష్టంగా తెలుస్తుంది. అంటే నగరాల అభివృద్ధిలో ఏకరూపత కనిపించదు. అయితే ఆధునిక సముదాయాలు బృహత్ నగర సముదాయాలుగాను, విభిన్న లక్షణాలున్నవిగాను మారే దిశలో పయనిస్తున్న ధోరణులు కనిపిస్తున్నాయి.

తొలిదశలో మానవ సముదాయాలు సంచార జాతులు తాత్కాలిక ఆవాసాలుగా - ముఖ్యంగా శిలాయుగం (8-12 వేల సంవత్సరాలు) - ఉండేవి. ఆనాటి ప్రజలు పరిసరాలలోని జంతువులను, వృక్షాలను తమ అవసరాలకు అనుగుణంగా మచ్చిక చేసుకొని ఒక ఆర్థిక ప్రాతిపదికను ఏర్పరచుకోవడంతో స్థిరనివాసాలు కల్పించుకొన్నారు. ఇవే క్రమంగా పెద్ద పెద్ద ఆవాసాలుగా (settlements) ఏర్పడి సాధారణ శ్రమవిభజన పద్ధతిని పాటిస్తూ సభ్యులలో కొందరు అనుత్పాదక కార్యకపాలలో - మతం, పాలన, వర్తక వ్యాపారాలు, సేవా కార్యకలాపాలు - నిమగ్నులై ఉండేవారు. కింగ్స్లే డేవిస్ (Kingsley Davis) ఈ ప్రక్రియ కొనసాగిన తీరుతెన్నులను లోతుగా పరిశీలించి వివరించాడు. మానవ జాతి చరిత్రలో కలిగిన సాంకేతిక, సామాజిక అభివృద్ధుల వల్ల నగర సముదాయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ధోరణి 19వ శతాబ్దం నుంచి ప్రారంభమైనట్లు అనేక నగరాలు విభిన్న జీవన విధానాలతో, వివిధ పరిమాణాలున్న ఆవాసాలతో వెలిసి సమకాలీన జీవితంలో ఒక ప్రముఖ ఘట్టంగా కనిపించడం మొదలైంది. పారిశ్రామిక విప్లవం ఫలితంగా నగర సముదాయాలుఏర్పడడటం, గ్రామీణులు నగరాలకు వలసవెళ్ళడం,

పెరుగుతున్న నగరా జనాభా అనేక సమస్యలు ఎదుర్కోవడం, ఒక నూతన నగర సముదాయ సంస్కృతి ప్రారంభం కావడం గమనించదగ్గ పరిణామాలు. ఆధునిక సమాదాయల చరిత్రను, అవి ఎదుర్కొంటున్న సమస్యలను సమాజశాస్త్రవేత్తలు నిశితంగా పరిశీలించి పరిశోధించడం జరుగుతోంది. ఈ పరిశోధన మూడు అంశాలను దృష్టిలో ఉంచుకొని సాగుతోంది: 1) భౌగోళిక పరిస్థితుల ప్రభావాన్ని విశ్లేషించడం 2) సముదాయ సంస్కృతి నిర్వహించే పాత్ర 3) సముదాయం ఒక పరిమిత సామాజిక వ్యవస్థగా లేదా ఒక బృహత్ సామాజిక వ్యవస్థలో భాగంగా ఉండడం.

సముదాయాల చరిత్రను పరిశీలించిన తరువాత శాస్త్రవేత్తలు ఈ భావనకు ఇచ్చిన నిర్వచనాలను ఇప్పుడు చర్చిద్దాం. సముదాయ భావనకు వివిధ శాస్త్రవేత్తలు ఇచ్చిన నిర్వచనాలు దాదాపు 94 ఉన్నట్టు జార్జ్ ఏ. హిల్లరీ (జూనియర్) గుర్తించాడు. నిర్వచనాలు వివిధ రకాలుగా ఉన్నా అన్నింటిలో సాధారణంగా కనిపించే అంశాలు సామాజిక పరస్పర చర్య (social interaction) ప్రాంతం (area), పరస్పర అనుబంధం (common tie or ties). సముదాయం భావనలో సాధారణంగా కనిపించే అంశాలను క్రిస్టెన్ టి జొనాస్సెన్ (Christen Jonassen) గుర్తించాడు. అవి : జనాభా, ప్రాంతీయ ఆధారం, ప్రత్యేకత గల విడిభాగాల మధ్య పరస్పర ఆధారత (రిదీశిలిజీ dependency), శ్రమవిభజన, సంఘటిత పరిచే సాధారణ సంస్కృతి, సామాజిక వ్యవస్థ, ఏకతాభావానికి సంబంధించిన చైతన్యం లేదా అందరం ఒకే సముదాయానికి చెందిన వారమనే భావం, సమస్యలను పరిష్కరించడంలో సమైక్యంగా కృషి చేయగల శక్తి వంటివి.

పైన తెలిపిన వివరాలున్న సముదాయానికి నిర్దిష్టమైన సమగ్రమైన నిర్వచనం ఇవ్వడం అనుభవికంగా వివరించడం సమాజశాస్త్రవేత్తలకు ఎదురవుతున్న ముఖ్యమైన సమస్యగానే ఉంటోంది. ఈనాటి చిన్న చిన్న సముదాయాలు సమీప పట్టణాలు, నగరాలపై ఆధారపడకుండా మనగలగడం దాదాపు అసాధ్యమే అవుతోంది. మానవ జీవితం వివిధ సంస్థలతో ముడిపడి ఉంటోంది. అందువల్లనే పరిశోధకులు ఈనాడు సముదాయాన్ని ఒక వ్యాపర ప్రాంతంగా భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో వివిధ తరహాల సంస్థలు, సంఘాలు ఉంటాయి - పరిశ్రమ, స్టోర్స్, చర్చ్‌లు, సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వం మొదలైనవి.

సముదాయానికి నిర్దిష్టమైన నిర్వచనం ఇవ్వడం కష్టమే అయినా సముదాయమనే ఒక సామాజిక వాస్తవం (social reality), సభ్యుల ప్రవర్తనను ప్రభావితం చేసేటువంటిది. అందుకే రోనాల్డ్ వారెన్ (Warren Ronald) సముదాయాన్ని ఈ విధంగా నిర్వచించడానికి ప్రయత్నించాడు. ఒక ప్రాంతానికి సంబంధించి ముఖ్యమైన సామాజిక విధులు నిర్వహించే సామాజిక యూనిట్లు, ఒక సామాజిక వ్యవస్థఉన్నదే సముదాయం. (A combination of social units and social system which perform the major social functions having locality relevence)

ఒక నిర్దిష్ట ప్రాంతంలో నివశిస్తున్న వ్యక్తుల మధ్య ఉన్న సామాజిక వ్యవస్థాపరమైన విబేదాలను గురించి ప్రస్తావించిన మొదటి సమాజ శాస్త్రవేత్త జర్మనీకి చెందిన ఫర్డినాండ్ టోనిస్ (Ferdinand Tonnies) ఇతడు మానవ సమూహాలను గెమైన్ షాఫ్ట్ (Gemeinschaft), గెసెల్‌షాఫ్ట్ (Geselleschaft) అనే రెండు రకాలుగా విభజించాడు. ఇందులో మొదటి దానికి సముదాయమని, రెండో దానిని సమాజమని గుర్తించవచ్చు. సముదాయ పరిమాణం, విస్తృతి పరిమితంగా ఉండటం వల్ల సభ్యుల మధ్య పరస్పర చర్య అనుబంధాలకు అవకాశం ఎక్కువగా ఉంటుంది. సముదాయాలలో ఏకతా భావం సంఘటితతత్వాలు ప్రముఖ లక్షణాలుగా ఉంటాయి. వివిధ సమూహాల మధ్య రకరకాల అనుబంధాలు ఏర్పరచడానికి అనువైన మార్గాలుంటాయి. వీటి ద్వారానే సభ్యుల మధ్య ఆదాన ప్రదానాలు, ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు సాధ్యమవుతాయి. సముదాయ సభ్యులందరికీ ఒకే రకమైన విలువలు, వ్యవహరించేతీరు, పరస్పర చర్యలు ఉంటాయి. సముదాయాలలో 'మనం' అనే భావన స్పష్టంగా గోచరిస్తుంది. చిన్న పట్టణాలు మతపరమైన సముదాయాలను గెమైన్‌షాఫ్ట్ సముదాయాలకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

టోనిస్ పేర్కొన్న మరో తరహా సమూహం ఒక నిర్దిష్ట ఉద్దేశంతో హేతుబద్ధంగా ఏర్పడినటువంటిది. ఇందులో వ్యక్తుల మధ్య ఉన్న పరస్పర సంబంధాలు అప్రధానమైనవి, గౌణమైనవి (secondary). ఈ రకం సముదాయాలకు

ఉదాహరణలుగా అనేక స్వచ్ఛంద సంస్థలు, నగరాలు, పాలన, విద్య, వ్యాపార రంగాలలోని సంస్థలను చెప్పవచ్చు. పారిశ్రామికీకరణ చెందిన సమాజాలను గెసెల్ షాఫ్ట్ తరహాగాను, కార్మిక, కర్షక సముదాయాలను గెమైన్‌షాఫ్ట్‌గాను సమాజశాస్త్రవేత్తలు పరిగణిస్తారు. రాబర్ట్ రెడ్‌ఫీల్డ్ (Robert Redfield, 1941) కూడా సమాజాలను జానపద (folk), నగర సముదాయాలు(town communities)గా వర్గీకరించాడు. సమాజ సమైక్యతను, వ్యక్తుల మధ్య సమన్వయాన్ని సమాజంలోని వివిధ రకాల యంత్రాంగాల ద్వారా సాధించడం జరుగుతుందని రెడ్‌ఫీల్డ్ భావించాడు. సామాజిక ప్రవర్తనకు సముదాయ జీవనానికి దగ్గరి సబంధం ఉంది. ఆ సంబంధాన్ని గురించి ఇప్పుడు కొంత విపులంగా చర్చిద్దాం.

## 5.4 సామాజిక పరివర్తన - సాముదాయిక జీవనం

సముదాయ కల్పనకు అది సక్రమంగా పనిచేయకపోవడానికి సంబంధించిన సామాజిక ప్రక్రియను గురించి జేమ్స్ ఎస్ కోల్‌మన్ (James S. Coleman) ప్రత్యేకంగా ప్రస్తావించాడు. సాధారణంగా ఒక ప్రాంతాన్ని ఒక సముదాయంగా చెబుతూ ఉంటారు. కారణం ఒకే ప్రాంతంలో దీర్ఘకాలం ఉంటూ, ఒకే రకమైన వృత్తులు గానీ, ఇతర వృత్తులకు పూరకమైన (complementary) వృత్తులు చేపడుతున్నప్పుడు ఒక సముదాయం సహజంగానే ఏర్పడుతుంది. ఒకే రకమైన కార్యకలాపాలు- పని, విద్య, మతపరమైన కార్యకలాపాలు వంటివి - వ్యక్తులలో ఒకే రకమైన విలువలు, దృక్పథాలు విశ్వాసాలు ఏర్పడడానికి దోహదం చేస్తాయి. ఒకే రకమైన కార్యకలాపాలతోపాటు అదరి ప్రయోజనాలు అనేవి కూడా సముదాయ భావనను పెంపొందిస్తాయి. దోపిడీలు, దురాక్రమణలు వంటి వాటి నుంచీ రక్షణ అవసరమైనప్పుడు ఒక ప్రాంతంలోని ప్రజలు సంఘటితమై సామూహిక ప్రయోజనాల సాధనకు కృషి చేస్తారు. ఇదే సముదాయ భావన. అట్లాగే మెరుగైన వసతుల కల్పన విషయంలో కూడా - నీటి సరఫరా - ఒక ప్రాంత వాసులందరూ కలిసి కట్టుగా ప్రయత్నించి మెరుగైన సౌకర్యాలను పొందడం జరుగుతూ ఉంటుంది. ఈ విధమైన సంఘటిత కృషి సముదాయ భావనకు దోహదం చేస్తుంది. కానీ ఈ మధ్య కాలంలో సాముదాయిక చర్యలకు స్వస్తి చెప్పి ప్రభుత్వం పైనే ఎక్కువగా ఆధారపడడం జరుగుతోంది. దీని వల్ల స్థానిక సమస్యల విషయంలో సామూదాయిక కృషికి కొంత దెబ్బ తగిలి సమైక్యతా భావం కొరవడడానికి కారణమవుతోంది.

విభిన్న తరహాల వ్యవహారాలు నిర్వహిస్తున్న సమూహాల మధ్య సమన్వయం లోపించి సంఘర్షణకు దారితీయవచ్చు. ఇలా ఏర్పడిన సంఘర్షణ సామాజిక మార్పులకు దారితీసి సముదాయ జీవన విధానానికి ఊతమివ్వవచ్చు. అయితే అపరిష్కృతంగా మిగిలిపోయే సంఘర్షణ సముదాయ భావనను దెబ్బతీయవచ్చు. ఈ సందర్భంలో నీగ్రోలు ఇతర సమూహాల మధ్య నెలకొన్న వైరి భావాన్ని, దాని ఫలితంగా ఏర్పడిన అనేక సామాజిక సంఘర్షణలను ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

కోల్మన్ (Coleman) సాముదాయిక చర్య ఏర్పడడానికి మరో రెండు కారణాలను చూపాడు.అవి: 1) తమ, ఇతరుల దృక్పథాలు ఒకటేనని భావించడం (తాదాత్మ్యం చెందడం) 2) స్వప్రయోజనం. ఈ రెండు ప్రక్రియలను టోనిస్ ప్రతిపాదించిన గెమైన్‌షాఫ్ట్, గెసెల్ షాఫ్ట్ భావనల ద్వారా వివరించాడు.

ఆధునిక కాలంలో జనాభాలో అధిక భాగం పెద్ద పెద్ద నగరాలలో నివశిస్తూ ఉండడం, వివిధ సమూహాల మధ్య సన్నిహిత సంబంధాలు సాధ్యం కాకపోవడం, సంప్రదాయిక సముదాయ భావనలోపించడం వంటి పరిణామాల వల్ల ఆధునిక సమాజాలలో సముదాయన్వేషణ (quest for community) జరుగుతూనే ఉంది.

రాబర్ట్ ఎ. నిస్‌బెట్ (Robert A. Nisbet) వివిధ సముదాయాలను చారిత్రక దృష్టితో పరిశీలించి పురాతన, మధ్యయుగంనాటి సముదాయ భావనకు ఆధునిక సముదాయాలకు ఉన్న తారతమ్యాన్ని గురించి ప్రస్తావించాడు. ఆధునిక సముదాయానికి ఎదురవుతున్న అభద్రతా స్థితి గత కాలంలో కనిపించకపోవడం ముఖ్యంగా గుర్తించవలసిన అంశమని ఈ లక్షణమే సముదాయాన్వేషణకు ముఖ్యకారణమని నిస్‌బెట్ భావించాడు. వ్యక్తివాదం ప్రబలడం వల్ల అనియత (anamie) అనామకత (anonimity) అనివార్యమయ్యాయి. ఈ భావాలు సముదాయ విస్తృతిని బట్టి అధికంగాను, అల్పంగాను ఉండడం గమనించవచ్చు.

సముదాయాన్వేషణ ఈనాటిది కాదు. గతంలో కూడా ఆదర్శ సముదాయ జీవనాన్ని గురించి మేధావులు, పాలకులు, ఎంతో కృషి చేశారు. ఆనాటి దేశకాల పరిస్థితుల కారణంగా సాముదాయిక జీవనం అంతపెద్ద సమస్యగా ఉండేది కాదు. కానీ ఈనాటి పరిస్థితుల - సామాజిక అవ్యవస్థ, విచలనం (deviance) వ్యక్తిగత అనామకత, వైమనస్యాలు (deviance) - కారణంగా సముదాయ భావం అవశ్యకత ఎంతో పెరిగింది.

## 5.5 సముదాయం - లక్షణాలు

### జనసాంద్రత, ప్రత్యేకీకరణ

సహజవనరులు పుష్కలంగా లభిస్తున్న ప్రాంతాలలో జనసముదాయాలు అధికంగాను, అవి కొరవడిన ప్రాంతాలలో జనసాంద్రత అల్పంగాను ఉంటుంది. ఆధునిక కాలంలో శాస్త్రసాంకేతిక అభివృద్ధి పారిశ్రామికీకరణాల ఫలితంగా నగరీకరణ అధికమై కొన్ని ప్రాంతాలలోనే జనం కేంద్రీకృతమై నగర సముదాయాలుగా ఏర్పడ్డాయి. వీటిని భిన్నంగా వ్యవసాయం పైనే ఆధారపడిన గ్రామీణ సముదాయాలు కొనసాగుతూ సంప్రదాయ సాముదాయిక కార్యకలాపాలలో నిమగ్నులై ఉండడం కూడా కనిపిస్తుంది. ఇలాంటి దృశ్యం అభివృద్ధి చెందుతున్న దేశాలలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. కొన్ని ప్రాంతాలలో అల్పజన సాంద్రత ఉంటూ సాముదాయిక శ్రమవిభజన అంటూ ఏదీ ఉండదు. అందువల్ల అలాంటి చోట్ల ఆర్థిక, పాలనా సంబంధమైన విధుల అవశ్యకత ఉండదు. అయితే ప్రతి సముదాయానికి వివిధ సామాజిక కార్యకలాపాలకు ఒక కేంద్ర అవసరమవుతుంది. ముఖ్యంగా జన సమ్మర్థం అధికంగా ఉన్న ప్రాంతాలలో - మౌలిక అవసరాలకు సరిపడేంత స్థలం లేనిచోట్ల - సాముదాయిక కేంద్రం అవసరం అధికంగా వుంటుంది. ఇలాంటి కేంద్రం బాగా అభివృద్ధి చెందైనా ఉండవచ్చు లేదా ప్రాథమిక దశలోనిదైనా కావచ్చు. ఇలాంటి కేంద్ర సముదాయ సభ్యులు అందరూ కలుసుకొనే వీలు కల్పిస్తుంది - మార్కెట్ ప్రాంతం వంటిది. సముదాయం చిన్నదిగా ఉన్నప్పుడు ఈ కేంద్రాన్ని స్పష్టంగా గుర్తించడానికి వీలు కాకపోవచ్చు. అదే పెద్ద సముదాయమైతే వివిధ విధులు నిర్వహించే ప్రత్యేక కేంద్రాలు - విత్త సదుపాయాలు కల్పించే కేంద్రాలు, టోకు, చిల్లర వ్యాపార కేంద్రాలు, మార్కెట్‌లు, వినోద కేంద్రాల వంటివి - విడివిడిగా ఉంటాయి. అయితే ఇలాంటి కేంద్రాలు సముదాయాన్ని బట్టి మారుతూ ఉండవచ్చు. ఒక చిన్న పట్టణంలోని సముదాయం ఒక పరిమిత సముదాయానికి కేంద్రమైనట్లే, పట్టణం, నగరానికి, నగరం ఒక ప్రాంతానికి, ఒక ప్రాంతం ఒక దేశానికి కేంద్రంగా ఉంటూ వుంటాయి.

కమ్యూనికేషన్ సదుపాయాల కేంద్రీకరణే కేంద్రానికి సరిహద్దు ప్రాంతానికి మధ్య వున్న తేడా. ఇలాంటి సదుపాయాలు అధికంగా వున్నప్పుడే అది ఒక ప్రధాన కేంద్రమవుతుంది. సముదాయాల మధ్య వార్తా ప్రసరణ ముఖ్యం. అందువల్లనే జనవాసాలు ప్రధానంగా రవాణా సదుపాయాలు పుష్కలంగా వున్నచోట్ల, నదీతీరాలలో, నౌకా కేంద్రాల దగ్గర అనేక నగర సముదాయాలు వెలిశాయి. మనదేశంలో సహజ వనరులు అధికంగా లభిస్తున్న ప్రాంతాలలో, నదీ పరీవాహక ప్రాంతాలలో, రహదారులు కూడలి ప్రాంతాలలో సముదాయాలు ఏర్పడడమే కాక బాగా విస్తరించాయి కూడా.

### సముదాయము - బాహ్య నిర్మితి

ప్రతి సముదాయమూ కొన్ని బాహ్యలక్షణాలను కలిగి వుంటుంది. ఒక దేశమంటే కేవలం ఒక పరిమిత భౌగోళిక ప్రాంతానికి చెందినది మాత్రమే కాదు, అందులో మహానగరాలు, రాజధాని నగరం, వివిధ రంగాలలో ప్రత్యేకీకరణ సాధించిన ప్రాంతాలు, రవాణా కమ్యూనికేషన్ కూడళ్ళు అనేకం ఉంటాయి. అట్లాగే ఒక నగరం అంటే కేవలం కొన్ని గృహాల, పరిశ్రమల సముదాయం మాత్రమే కాదు. నగరానికి ఒక నిర్దిష్టమైన వ్యవస్థ లేదా నిర్మాణ సంబంధమైన తీరు వుంటుంది. ఈ వ్యవస్థలో కుటుంబాలు, వివిధ వృత్తులవారు ఉంటారు. నగర విస్తీర్ణం పెరిగే కొద్దీ వ్యవస్థ సంక్లిష్టం అవుతూ ఉంటుంది. అలాగే గ్రామాలు కూడా.

పారిశ్రామికీకరణ, నగరీకరణల ఫలితంగా గ్రామసీమల నుంచీ నగరాలకు వలసవచ్చిన వారు ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఆవాసం ఏర్పరచుకొని ఒక ప్రత్యేక సముదాయంగా ఏర్పడడం కూడా సహజపరిణామమే. వివిధ

BRAOU

సమూహాల మధ్య నిరంతరం సాగే పరస్పర చర్యల ఫలితంగా సముదాయాలలో మార్పు చోటు చేసుకోవడమే కాక సముదాయాల స్వరూపమే మారిపోయే అవకాశం ఉంది.

### సముదాయ భౌతిక నిర్మితికి ప్రణాళికా రచన

ప్రణాళికాబద్ధంగా రూపొందని ఆధునిక సముదాయాలు అనేక సమస్యలకు మూలమయ్యాయి - ముఖ్యంగా పారిశుధ్యం, మౌలిక అవసరాల కొరత, గృహవసతి సమస్య, జనసమ్మర్ధం వంటివి ఎదుర్కోవలసి వస్తోంది. ఈ సమస్యల పరిష్కార ఆవశ్యకతను అనేక దేశాలు గుర్తించినా కొన్ని దేశాలు మాత్రమే - స్కాన్డినేవియా, గ్రేట్ బ్రిటన్, రష్యా, కొంతవరకు అమెరికా - ప్రణాళికా బద్ధంగా సముదాయాలను అభివృద్ధి చేయడానికి పూనుకొన్నాయి. సముదాయం తాలూకు ప్రణాళిక బద్ధ కృషి వివిధ రకాలుగా ఉండవచ్చును. అందులో సముదాయ పునరావాసం (rehabilitaion), అట్టడుగునుంచీ సముదాయాభివృద్ధికి సంబంధించి ప్రాంతీయ ప్రణాళికను రూపొందించడం, స్థూల ప్రాంతీయ ప్రణాళికను రూపొందించడం.

సముదాయాభివృద్ధి దృష్ట్యా ఒక ప్రణాళికను సిద్ధం చేయడంలో ఎన్నో సమస్యలు ఎదురుకావచ్చు. సముదాయ భవిష్యత్ అవసరాలను సరిగా అంచనావేసి అభివృద్ధి పథకంలోని వివిధ అంశాల ప్రభావం సముదాయంపై ఎలా ఉంటుందో వాటి పట్ల కుటుంబాల స్పందన ఎలా ఉంటుందో ముందుగానే ఊహించగలిగినప్పుడే ఏ అభివృద్ధి పథకమైనా సత్ఫలితాలను ఇవ్వగలుగుతుంది. సమస్యలు ఎదురవుతాయి కాబట్టి అసలు ప్రణాళికను తయారుచేయడం మానుకోవడం అభిలషణీయం కాదు. ప్రణాళిక రూపొందించేవారికి స్థానిక అవసరాల గురించి, స్థానికంగా లభ్యమయ్యే వనరులను గురించి ప్రజల పరస్పర చర్య, స్పందనల గురించి సరైన అవగాహన అలవర్చుకొన్నప్పుడే ఆశించిన రీతిలో పథకాల రూపకల్పన, వాటి అమలు సాధ్యమవుతాయి.

### దేశం ఒకరకమైన సముదాయమే

వర్తమాన నాగరకతలో దేశం ఒక బృహత్ సముదాయం. సమైక్యత, సంఘటితత్వం అనే భావనలతో ఏర్పడిన ఒకానొక సముదాయాన్నే దేశం అంటున్నాము. దేశాభిమానం, దేశ గౌరవం అనే భావాలు బలంగా వుండి అనేక తెగలు, వర్గాల ప్రజలను సమైక్య పరిచేదే దేశం. ఇందులో అనేక వర్గాల వారు - పేద, ధనిక, విద్య, అవిద్యావంతులు, భిన్న మతాల వారు - ఒకటిగా వుంటూ ఒక దేశంగా - ఒక భౌగోళిక ప్రాంతంగా - గుర్తింపు పొందుతారు. జాతీయతా భావం (Nationalism) పెరగడంతో ఈనాడు అనేక దేశాలు చిన్న చిన్న జాతి రాజ్యాలుగా (National States) ఏర్పడడానికి తీవ్రంగా కృషిచేసి ప్రత్యేక ప్రతిపత్తిని సాధించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఉదాహరణకు క్రొయేషియా, స్లోవాక్, చెక్, పూర్వపు సోవియట్ యూనియన్‌లోని వివిధ సమూహాలు విడివడి సముదాయాలుగా ఏర్పడడం జరిగింది, జరుగుతోంది. సముదాయ భావనే ఇలాంటి ఉద్యమాలకు, ప్రత్యేక ప్రతిపత్తికి ముఖ్యమైన ఆధారంగా గుర్తించవచ్చు. సముదాయ భావన ఎంతబలంగా వుంటుందో ఈనాటి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. మన దేశ విభజన కూడా సముదాయ భావన ఆధారంగానే జరిగింది. సమైక్యతా భావానికి సముదాయ భావనే ప్రధానమైన ఆధారం. ప్రపంచాన్నంతటినీ ఒక మానవ సముదాయంగా తీర్చి దిద్దాలని అనేక అంతర్జాతీయ సంస్థలు- ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి - తీవ్రంగా కృషి చేస్తున్నాయి. మనిషి ఎక్కడ ఉన్నా అతని భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న సంస్థలు అనేకం ఉన్నాయి. మానవ సముదాయాన్ని అణు విధ్వంసం నుంచి కాపాడడానికి అంతర్జాతీయ సంస్థలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. దీనికంతటికీ కారణం సముదాయ భావనే అని స్పష్టమవుతుంది.

అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ మానవ జాతి మొత్తం ప్రయోజనాల దృష్ట్యా పనిచేస్తుంటే వివిధ దేశాలలో ఆయా దేశాల ప్రజల ప్రత్యేక అవసరాలు, ఆశయాల సాధన కోసం ప్రత్యేక సంఘాలుగా లేదా సమితులుగా (Associations) ఏర్పడడం కనిపిస్తుంది. ఇప్పుడు ఇలాంటి సంఘాలను లేదా సమితులను గురించి వాటి ఆవశ్యకతను గురించి చర్చిద్దాం.

## 5.6 సంఘాలు / సమితులు - అర్థం, నిర్వచనం

ఉమ్మడి లక్ష్యాన్ని గానీ, సామూహిక లక్ష్యాలను గానీ సాధించడానికి ఏర్పడిన సంఘటిత సమూహాన్ని సమితి



BRAOU

అని మెకైవర్ నిర్వచించాడు. సమితిని ఏర్పాటు చేయడానికి వ్యక్తుల సమూహం ఆచరించడానికి కొన్ని నిబంధనలు, ఒక నిర్దిష్ట వ్యవస్థ, లక్ష్యాలు అవసరం. సమాజనిర్మితిలో సంఘం ఒక ముఖ్యమైన విభాగం. కొంత మంది కలిసి ఉమ్మడిగా పనిచేస్తూ రూపబద్ధమైన, నియమబద్ధమైన, క్రమబద్ధమైన వ్యవస్థాపనను నెలకొల్పుకొంటారు. సభ్యులు తమలో ఒకరిని నాయకుడిగా ఎన్నుకొని కొన్ని సూత్రాలను ప్రమాణాలను ఏర్పరచుకొని వాటి ద్వారా అందరికీ కావలసిన, ముందుగా నిర్ణయించుకొన్న ప్రయోజనాలను సాధించడానికి ఏర్పరచుకొన్నదే సంఘం.

'ఒక నిర్దిష్ట లక్ష్య సాధనకోసం గానీ, పరిమిత లక్ష్యాల సాధన కోసం గానీ, సంఘటితమైన సభ్యుల సమూహమే సంఘం,' అని గిస్బర్ట్ (P. Gisbert) నిర్వచించాడు. సముదాయం అనేది విస్తృతమైనది ఇందులో అనేక సంఘాలు, సమితులు ఏర్పడి కొన్ని ఉమ్మడి లక్ష్యాల సాధనకు కృషి చేస్తాయి.

ఆదిమ సమాజాలలో సముదాయాలకు, సంఘాలకు మధ్య తేడా స్పష్టంగా ఉంటుంది. ఆదిమ సమాజాలలో సముదాయాలు స్పష్టంగా కనిపిస్తాయి కానీ, నాగరకత పెరిగే కొద్దీ సంఘాల ఆవరణ పెరుగుతుంది. ఆధునిక కాలంలో రవాణా, కమ్యూనికేషన్ సౌకర్యాలు అధికం కావడం మనవుల అవసరాలు పెరగడంతో వివిధ సామాజిక సమూహాలకు ఇతరుల సహాయ సహకారాలు అవసరమయ్యాయి. దీనితో సముదాయం స్థానంలో సంఘాల ప్రాముఖ్యం అధికమవుతూ వస్తున్నది. అంటే సముదాయ దశ నుంచీ సంఘం దశకు మారడం ఈనాడు శీఘ్రంగా జరుగుతున్నట్లు గుర్తించవచ్చు. సంఘానికి, సముదాయానికి తేడా ఏమిటంటే సముదాయం ఒక ఐచ్ఛికమైన, క్రమబద్ధంకాని వ్యవస్థాపన. సంఘం అలా కాదు. అది క్రమబద్ధమైన వ్యవస్థాపన.

'సంఘాలు సముదాయాల కంటే నియమితమైనవి. ఇవి వాటి సభ్యుల ప్రయోజనాలకోసం ప్రత్యేక విధులు నిర్వహించేటటువంటి వ్యవస్థలు' అని రాబర్ట్ పి రాంకిన్, రిచీ పి. లౌరీ (Robert P. Rankin, Ritchie P. Lowry)లు నిర్వచించారు. సంఘాల పరిమాణం వివిధ రకాలుగా ఉండవచ్చు. ఉదాహరణకు వినోద సంబంధ సమూహాలు (recreational groups), సేవా సమూహాలు (service groups), రాజకీయ సంస్థలు (political organisations) వ్యాపార సంస్థలు (business organisations), కార్మిక సంఘాలు మొదలైనవన్నీ వివిధ ప్రయోజనాల కోసం ఏర్పడిన సంఘాలే.

## 5.7 ఆధునిక సమాజానికి సంఘాలే ప్రాతిపదిక

సంఘాల ఆవిర్భావం ఈ మధ్య కాలంలోనే జరిగినట్లు అనేకమంది పరిశోధకులు తమ రచనలలో పేర్కొన్నారు. అలెక్సిస్ డి టాక్వెవిల్ (Alexis de Tocqueville) 1838లోనే అమెరికా దేశంలోని వివిధ సంఘాల చరిత్రను పరిశీలించి అమెరికన్‌లు సంఘాలుగా ఏర్పడే స్వభావం కలవారని, ప్రజాస్వామ్య వ్యవస్థకు సంఘా విర్భావమే కారణమని పేర్కొన్నాడు. అయితే దేశ వ్యాప్తంగా ఉన్న సంఘాలు గతి శతాబ్దం నుంచే అవతరించాయని తెలిపాడు. కెనెత్ ఇ బౌల్డింగ్ (Kenneth E Boulding) కూడా సంఘాల చరిత్రను పరిశీలించి ఆధునిక సమజంలో సంఘాలు నిర్వహించే పాత్ర ప్రముఖమైందని, దీనినే 'వ్యవస్థాపరమైన విప్లవం' (organisational revolution) అన్నాడు. ఇలాంటి విప్లవం ఏర్పడడానికి గల కారణాలను బౌల్డింగ్ విశ్లేషించాడు. మనిషికి ఒక హోదా అవసరమని, దానిని సాధించడానికి ఒక సంఘం అవసరమని ఈనాటి మానవుడు భావిస్తాడు. గతంలో మనిషి ఒక కుటుంబ సభ్యుడిగా మాత్రమే ఉంటూ వచ్చాడు. కానీ ఆధునిక యుగంలో మానవుడి అవసరాలు, ఆశలు, ఆకాంక్షలు అధికం కావడంతో వాటిని తృప్తి పరుచుకోవడానికి, సాధించడానికి వివిధ తరహాల సంఘాల ఆవశ్యకతను గుర్తించి తన ఆశయాల సాధనకు వాటిని సాధనాలుగా ఉపయోగించుకోవడం మొదలుపెట్టాడు. ఈనాడు సామాజిక గతి శీలత (social mobility) పెరగడంతో కుటుంబ వ్యవస్థ బలహీనమైంది. కుటుంబం పేరు చెప్పుకొనే సమజంలో సరియైన స్థానం సంపాదించడం కష్టమైంది. తనకొక గుర్తింపు, హోదా లభించాలంటే ఇతరులతో కలసి ఒక సంఘంగా ఏర్పడినప్పుడే సాధ్యమనే వాస్తవాన్ని గుర్తించ వివిధ సంఘాల సభ్యత్వం ఆశించడం మొదలైంది. సంఘాల సాంగత్యంతో సమాజంలో తన స్థానం పదిలం కావడమే కాక తనలో భద్రతా భావం కూడా బలపడింది.

పారిశ్రామిక విప్లవం తర్వాత కార్మిక వర్గాలలో నూతన చైతన్యం ఏర్పడి వారి కోరికల సాధనకు సంఘటిత కృషి ఒక్కటే మార్గమని భావించారు. దీనితో కార్మిక సంఘాలు ఏర్పడి శక్తివంతమైన సాధనాలుగా మారాయి. వృత్తి

పరమైన సంఘాలు, సాంస్కృతిక సంఘాలు ప్రారంభమయ్యాయి. కమ్యూనికేషన్ సదుపాయాలు పెరగడంతో ప్రపంచంలోని వివిధ సంఘాల పనితీరు, సంఘటిత కృషి ద్వారా సాధించగలిగే ఫలితాలను గురించి అందరూ తెలుసుకొనే అవకాశం కలిగింది. దీనవల్ల మారుమూల ప్రాంతాలలోని వారు కూడా సంఘటిత కృషి అవసరాన్ని, ప్రయోజనాన్ని గుర్తించగలిగారు. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా వివిధ తరహాల సంఘాలు విభిన్న ఆశయాలతో ఏర్పడ్డాయి. వ్యవస్థీకృతమైన జీవన విధానం ఆధునిక సమాజంలో ప్రముఖంగా కనిపించే అంశం. ఇదే ఒక ప్రత్యేక సామాజిక రూపంగా అవతరించడానికి ఎంతో దోహదం చేసింది. ఈనాటి వ్యక్తిని విలియమ్ వైట్ అన్నట్లు " organization man"గా గుర్తించవచ్చు.

## 5.8 సంఘాల వర్గీకరణ

ఆధునిక సంక్లిష్ట సమాజంలో సంఘాలు ఒక ప్రత్యేక ప్రయోజనం కోసం ఏర్పడినటువంటివి కాగా అత్యల్ప శ్రమ విభజన ఉన్న ఆదిమ సమాజాలలో సంఘాల అవసరం అంతగా ఉండదు. ఈ సమాజాలలో సామాజిక మార్పు ఎంతో మందకొడిగా ఉంటుంది. ఆదిమ సమాజాలలోని సంఘాలు మతపరమైనవి, వయో,లింగ, భేదాలను బట్టి ఏర్పడినటువంటివే. ఈనాటి వృత్తిపరసంఘాలు అనాడు కనిపించవు. విభిన్న వృత్తుల వల్ల ఏర్పడిన వివిధ తరహాల సంఘాల ప్రయోజనాలను బట్టి వాటిని వివిధ వర్గాలుగా వర్గీకరించవచ్చు. ప్రయోజనాలను బట్టి సంఘాల వర్గీకరణ చేసేటప్పుడు అనేక సమస్యలు ఎదురు కావచ్చు. వివిధ ప్రయోజనాలను బట్టి సంఘాలను మెకైవర్ కింది విధంగా వర్గీకరించాడు.

కొన్ని సంఘాలు ప్రత్యేక ప్రయోజనాలకు ఏర్పడితే మరికొన్ని సాధారణ ప్రయోజనాల సాధనకు ఏర్పడినటువంటివి. ప్రత్యేక ప్రయోజనాల ఉద్దేశంతో ఏర్పడిన సంఘాలకు ఉదాహరణగా రాజ్యాన్ని (State) పేర్కోవడం జరిగింది. రాజ్యం న్యాయవ్యవస్థ, పరిపాలనా వ్యవస్థల ద్వారా ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తుంది. ఆధునిక సమాజంలో సాధారణ ప్రయోజనాలకు పనిచేసే సంఘాలు అరుదుగా కనిపిస్తాయి. ఇలాంటి సంఘాలను ప్రాథమిక, గౌణ ప్రయోజనాల ఆధరంగా పునర్ వర్గీకరించడం జరుగుతుంది. ప్రాథమిక ప్రయోజనాలు మనిషికి ఎంతో అవసరం. రెండో తరహా ప్రయోజనాలు ఇతర ప్రయోజనాల సాధనకు మార్గాలు మాత్రమే. ప్రాథమిక ప్రయోజనాలు సామాజిక జీవితానికి అత్యావశ్యక మైనవి కాగా గౌణ ప్రయోజనాలు వ్యక్తి ప్రయోజనాలకు ప్రాతినిథ్యం వహిస్తాయి. ప్రాథమిక ప్రయోజనాలు సంస్కృతికి ప్రతీకలైతే గౌణ ప్రయోజనాలు నాగరకతకు చిహ్నాలు అని మెకైవర్ వివరించాడు.

అట్లాగే సంఘాలను వాటి కాలపరిమితిని బట్టి కూడా వర్గీకరించవచ్చు. కొన్ని సంఘాలు తాత్కాలికమైనవి, మరికొన్ని అతి త్వరగా మార్పులు చెందేవి, ఇంకొన్ని శాశ్వతమైనవి. శాశ్వతమైన సంఘాలు కుటుంబం మాదిరి సామాజిక వ్యవస్థ రూపాలుగా కొనసాగుతాయి.

## 5.9 సంఘాలు - సామాజిక బాధ్యతలు

దేశంలో నెలకొని వున్న అనేక సంఘాలు స్వచ్ఛందమైనవి. అవి పరిమిత ప్రాంతంలో కానీ దేశవ్యాప్తంగాగానీ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉంటాయి. సామాజిక, రాజకీయ లక్ష్యాల సాధన కోసం కృషి చేస్తుంటాయి. ప్రభుత్వం నిర్వహించే వివిధ పునరావాస, సహాయ కార్యక్రమాలకు తోడుగా ఈ సంఘాలు కూడా ప్రజలకు సేవలందిస్తూ ఉంటాయి. ఉదాహరణకు తుఫాను బాధితుల పునరావాసం కోసం రామకృష్ణ మిషన్, భారత్ సేవక్ సమాజ్ వంటివి బాధితులకు ఎంతో సేవ చేశాయి. గృహ నిర్మాణ పథకాలను చేపట్టాయి. లోక్‌సత్తా వంటి సంస్థలు ఎన్నికల సంస్కరణలకు సంబంధించి ప్రజల అవగాహనను పెంచడానికి అనేక విధాలుగా కృషి చేస్తున్నాయి. అవినీతి నిర్మూలనకు, రాజకీయాలలో నేరస్తులు ప్రవేశించడాన్ని ప్రతిఘటించడం వంటి రాజకీయ, సామాజిక సమస్యల పట్ల అవగాహనను పెంచడానికి ప్రయత్నిస్తోంది. అట్లాగే స్వయం సహాయక సంఘాలు (self-help groups) మద్యపానం, మత్తు పదార్థాల సేవనం వల్ల కలిగే ప్రమాదాలను గురించి వివరించడం, వాటికి గురియైన వారికి సహాయం చేయడం వంటి సామాజిక సేవలను అందిస్తుంటాయి. డ్వాక్రా గ్రూపులు మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచుకోవడానికి అనేక మార్గాలను చూపడమే కాక అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం

కూడా చేస్తున్నాయి.

ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను కేవలం ప్రభుత్వం ఒక్కటే పరిష్కరించలేదు. వాటి పరిష్కారానికి అపారమైన ధనం, కాలం అవసరమవుతాయి. ప్రభుత్వ కృషికి తోడు ప్రజా సంస్థలు సంఘాలు కృషిచేస్తే కానీ సమస్యలు పరిష్కారం కావు. సామాజిక సమస్యలను చేపట్టి, కృషి చేస్తే తప్ప వాటి పరిష్కారం సాధ్యం కాదు. ఈ సందర్భంలోనే ప్రపంచంలోని అన్ని దేశాలలోను అనేక స్వచ్ఛంద సంస్థలు నడుం బిగించాయి. ప్రకృతి ఉపద్రవాలు - భూకంపం, వరదలు, కరువు కాటకాలు, తుఫాను వంటివి- సంభవించినప్పుడు బాధితులను ఆదుకొనే బాధ్యత ప్రధానంగా ప్రభుత్వంపైనే ఉన్నా అది ఒక్కటే ఈ సమస్యలను పరిష్కరించలేదు. ఇలాంటి విపత్కాలంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్తులకు సహాయం అందించి అవసరమైన సందర్భాలలో పునరావాసం కల్పించి ఆదుకొంటున్నాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సంఘటిత కృషి ఫలితంగా బాధిత ప్రజానీకానికి కొంతలో కొంత ఊరట కలుగుతోంది.

## 5.10 బృహత్ సంఘాలు

సంక్లిష్ట ఆధునిక సమాజంలో వివిధ సంఘాలు నిర్వహించే పాత్ర ఏమిటో చర్చించాం. ఒక సామాజిక వ్యవస్థలో విభిన్న బాధ్యతలు నిర్వహిస్తున్న సంఘాలు అనేకం ఉంటాయి. ఏ ఒక్క సంఘం అన్ని సామాజిక అంశాలనూ సమగ్రంగా పరిశీలించడం కానీ, సామాజిక సమస్యలను పరిష్కరించడం కానీ చేయలేదు. ఈ సందర్భంలోనే మెకైవర్ బృహత్ సంఘాలను గుర్తించి ప్రస్తావించాడు. ప్రజల గౌణ ప్రయోజనాల దృష్ట్యా ఏర్పడినవే ఈ బృహత్ సంఘాలు అని గుర్తించాలి. ప్రాథమిక అవసరాలకు సంబంధించిన సంఘాలు ఈ బృహత్ సంఘంలో అంతర్భాగాలుగానే పని చేస్తుంటాయి. మెకైవర్ ప్రకారం బృహత్ సంఘాలు స్థూలంగా మూడు రకాలు: 1) రాజ్యం 2) ఆర్థిక వ్యవస్థ 3) సంస్కృతి. ఈ బృహత్ సంఘాలు సామాజికుల ప్రత్యేక ప్రయోజనాల సాధన కోసం కృషి చేస్తుంటాయి. ఈ మూడింటిని గురించి క్లుప్తంగా చర్చిద్దాం.

### 1) రాజ్యం

బృహత్ సంఘాలలో మొదటిదైన రాజ్యం ప్రధానంగా ప్రయోజనకరమైన (utilitarian) సాంస్కృతిక లక్షణాలు కలిగి వుంటుంది. రాజ్యం సామాజిక వ్యవస్థకు సంబందించిన ఒక నిర్దిష్ట సంఘం. రాజ్యం దేశ శాంతి భద్రతలను కాపాడడం, ప్రజల సార్వభౌమాధికారాన్ని పరిరక్షించడం, ప్రజల శ్రేయస్సుకు పాటుపడడం వంటి ప్రయోజనాల కోసం కృషి చేస్తుంది. రాజ్యం అనే బృహత్ సంఘంలో ఇతర బాధ్యతలు నిర్వర్తించే ఇతర బృహత్ సంఘాలు - సాంస్కృతిక, ఆర్థిక - కూడా చేరి ఉంటాయి. ఇలా అనంత మాత్రాన సాంస్కృతిక ప్రయోజనాలను కాపాడే బాధ్యత రాజ్యానికి లేదని భావించకూడదు. సాంస్కృతిక సంఘాలు వాటి కృషిలో విఫలమైనప్పుడు రాజ్యమే ఈ బాధ్యతను చేపట్టి సాంస్కృతిక ఏకతను కాపాడడానికి ప్రయత్నిస్తుంది.

సమాజంలోని రాజకీయ వ్యవస్థ కార్యక్షేత్రం (field of activity) దేశ సరిహద్దులను దాటి ఉంటుంది. ఇతర దేశాలతో మైత్రీ సంబంధాలు నెలకొల్పుకోవడం, ఆర్థిక, సాంస్కృతిక విషయాలకు సంబంధించి ఇరుగుపొరుగు దేశాలతో ఒడంబడికలు చేసుకోవడం వంటి అనేక బాధ్యతలను కూడా రాజ్యం నిర్వర్తిస్తుంది. అంతర్జాతీయ వ్యవస్థ లక్ష్యంతో కృషి చేస్తుంది. వివిధ అంతర్జాతీయ సంస్థలలో భాగస్వామి అయి వసుధైక రాజ్య స్థాపనకు పాటుపడుతుంది.

### 2) ఆర్థిక వ్యవస్థ

సామాజికుల వ్యవహారాలు పలురకాలుగా ఉంటాయి. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ఆర్థిక వ్యవహారాల నిర్వహణ రెండు విధాలుగా సాగుతుంది. (1) రాజకీయ వ్యవస్థ తీసుకొనే నిర్ణయాలు సామాజిక, ఆర్థిక స్వరూపాన్ని మారుస్తాయి. (2) దీనికి భిన్నంగా రాజకీయ వ్యవస్థ ప్రమేయం లేకుండా స్వతంత్ర వ్యవస్థల-కార్మిక సంఘాలు, సహకార సంఘాలు వంటి వాటి-ద్వారా ఆర్థికసమస్యలు పరిష్కృతమవుతూ ఉంటాయి. ఉదాహరణకు కార్మిక సంఘాలు, యాజమాన్య సంఘాల మధ్య కార్మిక వేతనాల ఒప్పందాలు ఏర్పడి ఒక వేతన వ్యవస్థను నెలకొల్పడం

జరుగుతుంది. కొన్ని సందర్భాలలో ప్రభుత్వమే కార్మిక నిర్ణయానికి సంబంధించి ప్రత్యేక శాసనాలను రూపొందించవచ్చు. ఉదాహరణకు కనీస వేతన చట్టం, పంటల బీమా పథకం, బాల కార్మిక నిషేధ చట్టం మొదలైనవి.

సంస్కృతి సంఘాలను ఉపయోగిత సంఘాలు (utilitarian associations), సాంస్కృతిక సంఘాలని విభజించడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న ఎదురవుతోంది. ప్రయోజన సాధనకు అనుసరించే మార్గాల దృష్ట్యా చూస్తే సంఘాలన్నీ ఉపయోగితా సంఘాలుగానే భావించవలసి ఉంటుంది. లక్ష్యాల దృష్ట్యా చూస్తే సంఘాలన్నీ సాంస్కృతిక సంఘాలేఅని భావించాల్సి ఉంటుంది. సాంస్కృతిక సంఘం అనేది ఒక ప్రాథమిక సమూహం కానీ లేదా కొన్ని ప్రాథమిక సమూహాల సమాహారమై గానీ ఉంటుంది. సభ్యులందరూ ఒక ప్రాథమిక సమూహంగా సమావేశమైనప్పుడే సాంస్కృతిక సంఘ ప్రయోజనాలను సాధించడం సాధ్యమవుతుంది. ఇలాంటి సమావేశం ఆర్థిక సంఘాల విషయంలో అవసరం ఉండదు. సభ్యులు సమావేశం కాకుండానే సంఘం సాధించిన ఫలితాలను అనుభవించడానికి వీలుంటుంది. ఉదాహరణకు రాజ్యంలో సభ్యుడైన ప్రతివ్యక్తీ రాజకీయ కార్యకలాపాలలో పాల్గొననవసరం లేదు. అట్లాగే ఒక కంపెనీలోని షేర్ హోల్డర్ కంపెనీ వ్యవహారాలలో పాల్గొనకుండానే కంపెనీ ఇచ్చే డివిడెండ్లను అనుభవించవచ్చు. కానీ ఒక సంస్కృతికి చెందిన వ్యక్తి సాంస్కృతిక కార్యకలాపాలలో పాల్గొనక పోతే అతను పొందే ప్రయోజనం ఏమీ ఉండదు.

సాంస్కృతిక సంఘాల విషయంలో ప్రత్యామ్నాయ సదుపాయం ఉంటుంది. అదే రాజకీయ సంఘాలలో - ముఖ్యంగా రాజ్యం - ఇలాంటి అవకాశం ఉండదు. ఉదాహరణకు అనేక దేవాలయ సంస్థలు లేదా సాంస్కృతిక సంఘాలు ఉండవచ్చు. వ్యక్తి తనకు నచ్చిన దానిలో సభ్యత్వం తీసుకోవచ్చు. రాజ్యం విషయంలో ఇలాంటి అవకాశం ఉండదు. ఎందుకంటే దేశానికంతటికీ రాజకీయ వ్యవస్థ ఒక్కటే ఉంటుంది. ప్రత్యామ్నాయాలకు తావుండదు. సామాజిక మార్పులు ప్రజల సంఘటిత ప్రవర్తన (collective behaviour) ద్వారా ఏర్పడుతూ ఉంటాయి. ఉదాహరణకు సంఘాలు, ఆకస్మికంగా ఏర్పడే జనసమూహాలు (crowd) వంటి వాటి ద్వారా ఏర్పడే మార్పులు తాత్కాలికమైనవి గానీ శాశ్వతమైనవి కానీ కావచ్చు. సామాజిక మార్పులకు దోహదం చేసే సామూహిక ప్రవర్తన. ఇలాంటి ప్రవర్తనను గురించి సమాజ శాస్త్రవేత్తలు సమగ్రంగా పరిశీలించి సిద్ధాంత ప్రతిపాదనలు చేశారు. గుంపు ప్రవర్తన అంటే ఏమిటో అది ఏర్పడటానికి దోహదం చేసే పరిస్థితులేమిటో, అవి ఎన్ని రకాలుగా ఉంటాయో ఇప్పుడు తెలుసుకొందాం.

BRAOU

## 5.11 గుంపు-అర్థం, నిర్వచనం

సామాజిక మార్పులకు చేపట్టే ఉద్యమాలు సమాజంలో శాశ్వతమైన మార్పులు ఆశించి నిర్వహించడం జరుగుతుంది. అందువల్ల వీటికి ప్రజా సమూహాలు తాత్కాలిక ప్రాతిపదికపై ఏర్పడి ఆందోళన చేసి తాత్కాలిక ప్రయోజనం సాధించడానికి ఎంతో తేడా ఉంది. ఒకటి దీర్ఘకాలం నడిచి శాశ్వత ప్రయోజనాల కోసం నడిపే స్వల్పకాలిక లేదా ఆకస్మిక ఆందోళన రెండింటిలో కూడా ప్రజల సంఘటిత ప్రవర్తన కనిపిస్తుంది. ప్రతి ఉద్యమానికీ ప్రజాసమూహం సంఘటిత కృషి తప్పనిసరి. సమాజ శాస్త్రవేత్తలు సంఘటిత కృషిలో ఒకటైన గుంపు ప్రవర్తన పట్ల ఎంతో ఆసక్తి కనబరిచి ఈ అంశాన్ని లోతుగా పరిశీలించారు. సవివరమైన చర్చకు పూనుకొనేముందు 'గుంపు' (crowd) అంటే ఏమిటో తెలుసుకోవడం ముఖ్యం.

### గుంపు అంటే ఏమిటి?

అన్ని సామాజిక సమూహాలలో అతి తాత్కాలికమైన, అస్థిరమైన సమూహమే గుంపు అని షెకైపర్ నిర్వచించాడు. 'ఒక ప్రాంతంలోని వారు వారందరికీ సంబంధించిన అంశాలు సంఘటనల దృష్ట్యా తాత్కాలికంగా సంఘటితమై చర్య తీసుకొన్నప్పుడు ఆ సమూహాన్నే గుంపు అంటారు,' అని థామస్ ఎ. సలివాన్ (Thomas A. Sullivan), కేంద్రిక్ ఎస్. థాంప్సన్ నిర్వచించారు. గతంలో ఏ విధమైన పరస్పర చర్య జరగనటువంటి ప్రజల సమూహం సంఘటితంగా ప్రవర్తించినప్పుడు ఆ ప్రవర్తనను గుంపు ప్రవర్తన అంటారు.

గుంపు అనేది ఒక సమష్టి (Aggregate) గుంపులకు జనసామాన్యానికి (Public) స్పష్టమైన తేడా ఉంది. జన సామాన్యం అన్నప్పుడు భౌగోళిక సామీప్యం ఉంటుంది. బస్సు కోసం ఎదురుచూస్తూ ఒక చోట నిలబడిన వ్యక్తులందరినీ కలిపి గుంపు అనవచ్చు. గుంపుకు ప్రేక్షకులకు తేడా వుంది. ప్రేక్షకుల విషయంలో భావోద్వేగం (emotion), గుంపులో కంటే తక్కువగా ఉంటుంది. యథేచ్ఛగా సంచరించే అల్లరి మూకలు, ప్రపంచ కప్ సాధించి తిరిగివచ్చిన ఆటగాళ్లకు స్వాగతం పలికే జనసమూహం వంటివన్నీ గుంపులే.

## 5.12 గుంపు లక్షణాలు

గుంపులో పలురకాలున్నప్పటికీ వీటన్నింటిలో కొన్ని సామాన్య లక్షణాలను గుర్తించవచ్చు. ఈ లక్షణాలను బ్లూమర్ (Blumer), టర్నర్, కిల్లియన్ (Turnbr and Killion) కింది విధంగా గుర్తించారు.

### 1) అనిశ్చితత్వం

అస్పష్టత, అనిశ్చితత్వాలు గుంపులకుండే ప్రముఖ లక్షణాలు గుంపులోని ఇతరులు ఏ విధంగా ప్రవర్తిస్తారో తాము ఏ విధంగా ప్రవర్తించాలో స్పష్టంగా తెలియని సందిగ్ధ పరిస్థితిని వ్యక్తులు ఎదుర్కొంటారు. ఉదాహరణకు క్రికెట్ మ్యాచ్ చూస్తున్న ప్రేక్షకులలో కొందరు హుందాగా ప్రవర్తించినా మరికొందరు అసభ్యంగా ప్రవర్తించడం మైదానంలో ఆటగాళ్లపై గుడ్లు, బాటిల్స్ విసరడం చేస్తూ ఉంటారు. ప్రేక్షకులలోనే ఒకరితో ఒకరు ఘర్షణ పడడం కూడా మామూలుగా జరుగుతూ ఉంటుంది. అంటే ఏ సమయంలో ఎవరు ఎట్లా ప్రతిస్పందిస్తారో, ప్రవర్తిస్తారో తెలియని అయోమయ స్థితి ఎదురవుతూ ఉంటుందన్నమాట.

### 2) సూచనీయత

గుంపులో స్పష్టమైన, నిర్దిష్టమైన వ్యవస్థ అంటూ ఏదీ ఉండనందువల్ల వ్యక్తుల ప్రవర్తనకు సంబంధించి ఇతరుల నుంచీ సూచనల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఈ కారణంగానే సూచ్యత గుంపు లక్షణాలలో ఒకటిగా ఉంటుంది. ఇతరుల సూచనలు, మార్గదర్శకత్వాన్ని బట్టి ప్రవర్తించడం జరుగుతూ ఉంటుంది. సూచన స్వభావాన్ని బట్టి గుంపులోని సభ్యుల ప్రవర్తన మారుతూ ఉంటుంది.

### 3) అనామకత

గుంపులో సభ్యులు అధిక సంఖ్యలో ఉన్నందువల్ల ఒక వ్యక్తికి సరియైన గుర్తింపు లభించక అనామకుడుగానే ఉండాల్సి వస్తుంది. ఎవరూ తమను గుర్తించరు కాబట్టి ఏ సంఘటనకూ తన ప్రవర్తనే కారణం అని తెలుసుకోలేడు. కాబట్టి అనామకత ఉంటుంది. అనామకతే రక్షణ కవచంగా ఉండడం వల్ల ఎటువంటి చర్యకైనా పాల్పడవచ్చు.

### 4) అనుజ్ఞానాత్మకత

సాధారణంగా సమాజం సామాజికుల ప్రవర్తనపై విధించే పరిమితులు గుంపులో తగ్గి పోతాయి. పరిమితులు తగ్గినప్పుడు గుంపు సభ్యుల ప్రవర్తన మరింత స్వేచ్ఛగా ఉంటుంది. వారి సామాజిక ప్రవర్తనకు అది భిన్నంగా కూడా ఉండవచ్చు. మిగతా సమయాలలో ప్రవర్తించ వీలులేని విధంగా, ప్రవర్తించ కూడని విధంగా గుంపులో సభ్యులు ప్రవర్తించవచ్చు. అయితే గుంపులో ప్రవర్తనపై పరిమితులు అసలు ఉండవు అని మాత్రం భావించకూడదు.

### 5) భావోద్వేగం పెరుగుదల

గుంపు సభ్యుల మధ్య భావప్రసారం వేగంగా జరగడం వల్ల భావోద్వేగానికి తొందరగా గురి అయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయి. గుంపులో ఉత్ప్రేరకాలు - శబ్దాలు, అరుపులు, జనం- ఎక్కువగా ఉండడం వ్యక్తి అతి త్వరగా వీటికి స్పందించి ప్రవర్తించడం జరుగుతుంది.

## 5.13 గుంపు ప్రవర్తన

గుంపుల అధ్యయనానికి సంబంధించి జరిగిన సమాజశాస్త్ర పరిశీలన గుంపులోని వారి ప్రవర్తనకు గల

కారణాలను, ప్రవర్తన తీరు తెన్నులను పరిశీలించడం పైనే ప్రధానంగా కేంద్రీకృతమైనట్లు కనిపిస్తుంది. ఈ ప్రవర్తనకు సంబంధించి గతంలో ఉన్న అభిప్రాయాలలో కొంత మార్పు కనిపిస్తున్నదని సమాజశాస్త్రవేత్తలు భావిస్తున్నారు. గతంలో భావించినట్లు గుంపులోని వారు హేతవిరుద్ధంగా ప్రవరిస్తారని, గుంపులోని వారందరూ ఒకే విధగా ప్రవర్తిస్తారనే అభిప్రాయాలు పూర్తిగా మారిపోయాయి. గుంపు ప్రవర్తనకు సంబంధించి ఈ నాటి శాస్త్రవేత్తలు గుర్తించిన నాలుగు ప్రధాన ప్రక్రియలను పరిశీలిస్తే గుంపు ప్రవర్తన ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడం సులభమవుతుంది. ఈ ప్రకియలను సమాజశాస్త్రవేత్తలు ఈ విధంగా గుర్తించారు: 1) సంసర్గ లేదా సంక్రమణం (contagian), 2) అభిసరణం (convergence), 3) ఉత్పన్నమయ్యే ప్రమాణాలు 4) నిర్ణయాలు తీసుకోవడం (decision making).

## 1) సంసర్గం లేదా సంక్రమణం

ఆవేశకావేశాలు, మనోభావాలు, ఉద్వేగాలు గుంపులోని సభ్యులకు ఒకరినుంచి మరొకరికి వ్యాపించడం లేదా సంక్రమించడంతో గుంపు ప్రవర్తనకు ఒక రూపం ఏర్పడుతుంది. ఈ తరహా ప్రక్రియలో చక్రీయ ప్రతిస్పందన (circular reaction) ప్రముఖ పాత్ర వహిస్తుంది. చక్రీయ ప్రతిస్పందన అంటే ఒకరి ఆలోచనలతో ప్రేరితులై ఇతరులు ప్రతి స్పందించడం. ఉదాహరణకు 'ఎ' అనే వ్యక్తి భావాల ద్వారా ప్రేరితుడైన 'బి' అనే వ్యక్తి ప్రతిస్పందన తీవ్ర రూపంలో ఉండవచ్చు. దీని ప్రభావ ఫలితంగా 'సి', 'డి', 'ఇ'లు కూడా ప్రేరేపితులై గుంపు అంతటికీ వ్యాపించి ఒక నిర్దిష్ట రూపం దాలుస్తుంది. ఉదాహరణకు 'పోలీసులపై దాడిచేద్దాం' అని ఒక వ్యక్తి అన్నప్పుడు గుంపులోని కొందరు స్పందించి పోలీసులపై రాళ్ళు రువ్వడం మొదలు పెట్టవచ్చు. కొన్ని కొన్ని సందర్భాలలో అలజడి ఏర్పడిన ప్రాంతంలో జనం గుమికూడి ప్రతిస్పందనకు గురి కావచ్చు. అప్పటి వీరి ప్రవర్తన యాదృచ్ఛికంగాను నియమరహితంగాను ఉండచవ్చు. ఇలా గుమికూడినవారిలో కొందరు అటు ఇటు పరుగెత్తడం, కేకలు వేయడం, నినాదాలు చేయడంతో అక్కడున్నఇతరులు కూడా అదే విధంగా స్పందించడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

## 2) అభిసరణం

గుంపు ప్రవర్తనను ప్రభావితం చేసే మరో అంశం అభిసరణం లేదా ఒక చోట ఎక్కువ మంది గుమికూడటం. ఒకే రకమైన స్వభావాలు, అభిప్రాయాలు, ఆకాంక్షలు ఉన్నవ్యక్తులు ఒక చోట చేరడాన్నే అభిసరణం (convergence) అంటారు: (Milgram and Toch). అభిసరణ సిద్ధాంత కర్తలు ఈ రకమైన గుంపు ప్రవర్తనకు గుంపు సభ్యులలోని పూర్వాభిమానాల (predispositions)కు నిరాశా నిస్పృహలు, మానసిక ప్రయాస (mental strain) కారణమని పేర్కొంటారు. నిరాశ, నిస్పృహలు అధికమయినప్పుడు దూకుడుగా ప్రవర్తించడం, దౌర్జన్యానికి పాల్పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయని మనో వైజ్ఞానికులు (John Dollard, 1939, Leonard Berkovitz, 1971) భావిస్తారు. సంక్షోభసమయంలో గుంపులోని అందరూ ఒకే విధంగా ప్రతిస్పందించక పోవచ్చు. అలజడి నెలకొన్నప్పుడు స్వప్రయోజనపరులు కొందరు ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని తమ ప్రయోజనాలు సాధించుకొనే ప్రయత్నం చేయవచ్చు. కొన్ని సందార్భాలలో అసాంఘిక శక్తులు దీనిని అదనుగా తీసుకొని అలజడిని మరింత పెంచే అవకాశం కూడా ఉంది. మరికొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాల దృష్ట్యా లేదా మానసిక ఉత్తేజం (excitement) కోసం అలజడిలో పాల్గొనవచ్చు.

## 3) ఉత్పన్నమయ్యే నూతన ప్రమాణాలు

సాధారణంగా సమాజం నిర్ణయించిన విధులు, నిషేధాలననుసరించి సామాజికులు ప్రవర్తిస్తూ ఉంటారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో గుంపు ప్రవర్తన నిర్ధారించే ప్రమాణాలు కొత్తగా ఏర్పడినవే. అలజడి సందర్భంలో నూతన ప్రమాణాలతో ఒక నూతన సామాజిక నిర్మితి (social structure) నెలకొంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్పన్నమైన విలువలు, ప్రమాణాలు పరిస్థితులు మారగానే అదృశ్యమవుతాయి. సామాజిక ఒత్తిడిలనూ తన ప్రమాణాలకు అనుగుణంగా గుంపులోని వారు ప్రవర్తించడానికి గుంపు ప్రోత్సహిస్తుంది. ఒకరిని చూసి మరొకరు వారి ప్రవర్తనను ప్రామాణికంగా భావించి మరొకరు ప్రవర్తించడం జరుగుతుంది. ఉదాహరణకు అలజడి

సందర్భంలో లూటీ చేస్తున్న వ్యక్తులను - ముఖ్యంగా లూటీదారులు సమాజంలో గౌరవప్రదమైన వారైనప్పుడు - చూసి వారి ప్రవర్తనే ప్రమాణంగా తీసుకొని ప్రవర్తించడం జరుగుతుంది. అస్పష్టమైన, ఉద్రేకపూరితమైన పరిస్థితులలో ఉన్న వ్యక్తులు ఇతరుల ప్రవర్తననే ప్రమాణంగా తీసుకోవడం వారి నిర్ణయమే సరియైనదిగా భావించడం, తదనుగుణంగా ప్రవర్తించడం జరుగుతూ ఉంటుందని సమాజశాస్త్రవేత్తలు భావిస్తారు. నూతనంగా ఏర్పడిన ప్రమాణాలు సభ్యుల ప్రవర్తనను అధికాధికంగా ప్రభావితం చేస్తాయి.

## 4) నిర్ణయాలు తీసుకోవడం

గుంపులోని సభ్యులు అలజడి వల్ల కలగబోయే లాభనష్టాలను బేరీజువేసుకొని పాల్గొనడం లాభసాటిగా ఉందని భావించడాన్నే నిశ్చయానికి రావడం లేదా నిర్ణయం తీసుకోవడం అవుతుందని బర్క్ (Berk, 1974) అభిప్రాయం. పాల్గొనడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి వ్యక్తులు ఆలోచించి నిర్ణయం చేయడం జరుగుతుంది. ఈ నిర్ణయం తీసుకొనే ముందు అలజడిలో ఎంతమంది చేరుతున్నారో గమనించిడం వారి సంఖ్య ఒక మోస్తరుగా ఉన్నప్పుడే పాల్గొనడానికి పూనుకోవడం జరుగుతుందని గ్రానోవెటర్ (Granovetter) పేర్కొన్నాడు. అంటే అల్లర్లలో పాల్గొనే ముందు వివిధ ప్రత్యామ్నాయ ఫలితాలను గురించి ముందుగా ఆలోచించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. అయితే ఉద్వేగపూరితమైన, హఠాత్తుగా ఏర్పడే సంఘటనలలో నిర్ణయం తీసుకోవడం మామూలు కంటే చాలా స్వల్పకాలంలో జరుగుతుంది.

గుంపు ప్రవర్తనను సరిగ్గ అర్థం చేసుకోవడానికి ఇంతవరకూ చర్చించిన నాలుగు ప్రక్రియలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. నాలుగు ప్రక్రియలే కాక స్మెల్సర్ (Smelser) మరికొన్ని అంశాలు కూడా ప్రవర్తనను ప్రభావితం చేస్తాయని భావించాడు. వాటిని గురించి ఇప్పుడు చర్చిద్దాం.

నైల్ స్మెల్సర్ (Neil Smelser) గుంపు ప్రవర్తనకు కారణమైన ఆరు తరహాల పూర్వ అనుకూల పరిస్థితులు (Pre conditions) ఉండడాన్ని గుర్తించాడు. అవి :

1) నిర్మాణపరమైన అనుకూలతలు

2) నిర్మాణపరమైన ప్రయస

3) సాధారణీకరించిన విశ్వాసం పెరుగుదల, వ్యాప్తి

4) వేగిరపరిచే కారకాలు

5) చర్య నిమిత్తం సమీకరణ

6) సాంప్రదాయ సామాజిక నియంత్రణలు ప్రభావశూన్యం కావడం

## 1)నిర్మాణ పరమైన అనుకూలతలు

జన సాంద్రత అధికంగా ఉన్న పెద్ద పెద్ద నగరాలు ప్రజల జీవితాలను వ్యక్తి నిరపేక్షము (impersonal), అనామకము (anonymous) చేస్తాయి. నగరాలలోని కొన్ని ప్రాంతాలలోనే భిన్న జాతులకు, సంస్కృతులకు చెందినవారు ఆవాసాలు ఏర్పరచుకొని ఉండడం జరుగుంది. ఇలాంటి పరిస్థితులలో అక్కడి ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడానికి అనుకూలంగా ఉండవు. ఇతర ప్రాంతాలను వివిధ జాతులకు, వివిధ దేశాల వారికీ ప్రత్యేకించడం వల్ల ఆయా ప్రజల మధ్య సాన్నిహిత్యం లోపించడమే కాక అవగాహన కొరవడడం, జాతి వివక్ష, పేదరికం వంటి సర్వసాధారణంగా కనిపిస్తాయి. 1960లో అమెరికాలో జరిగిన జాతిపరమైన అల్లర్లు ముఖ్యంగా గెట్టోల (Ghettos)లోనే జరిగియని స్మెల్సర్ ఉదహరించాడు.



B R A O U

### 2) నిర్మాణపరమైన ప్రయాస

ధనికులు, పేదలు ఒకే చోట నివశిస్తున్న మహానగరాలలో పేదలు తమ పేదరికాన్ని గురించి మరింత ఎక్కువగా ఆవేదన చెందే అవకాశం ఉంది. అలాకాక ధనికులకు దూరంగా నివసిస్తే మానసిక ఒత్తిడులకు, న్యూనతాభావానికి గురి అయ్యే అవకాశాలు తక్కువ. అట్లాగే సమజంలోని అల్ప సంఖ్యాకులు, దళితులు తమకు సామాజికంగా అన్యాయం జరుగుతోందని భావించడం కూడా సహజమే. సమాజపరంగా అన్యాయానికి గురి అవుతున్నట్లు కలిగే భావం సంఘటిత ప్రవర్తనకు (Collective behaviour)కు అనుకూల పరిస్థితులను ఏర్పరుస్తుంది.

### 3) సాధారణీకరించిన విశ్వాసం పెరుగుదల, వ్యాప్తి

జాతి వివక్ష పేదరికాన్ని ఎన్నో ఏళ్ళుగా అమోదించినా లేదా అహింసాయుతంగానే సామాజిక మార్పులకు ప్రయత్నించినా అమెరికాలోని నల్లజాతివారు తమ పరిస్థితి ఏమాత్రం మెరుగుపడటేదని భావించడం కద్దు. తరతరాలుగా నల్లజాతివారు తెల్లవారి వివక్షకు దురన్యాయాలకు గురి అవుతున్నా, తమ పరిస్తితి మెరుగవుతుందని ఎంతో కాలంగా నిరీక్షిస్తున్నా పరిస్థితులలో వీసమెత్తుకూడా మార్పు కనిపించనప్పుడు హింసాయుత మార్గాల ద్వారా అయినా విముక్తి పొందాలని భావించడం జరుగుతోంది.

### 4) వేగిరపరిచే కారకాలు

1960 దశకంలో గెట్టోలలో చెలరేగిన అల్లర్లు, దౌర్జన్యకాండకు పోలీసుల వేధింపు, దమనకాండలే కారణం అని ప్రజలు భావిస్తారు. తమ తోటి వారు పోలీసుల దురాగతాలకు వేధింపులకు గురికావడానికి స్పందించి వారు కూడా క్రియాశీలమైన పాత్ర నిర్వహించడానికి సంసిద్ధులవుతారు. బాధితులతో కలసి దురన్యాయాలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి ఉద్యుక్తులవుతారు.

### 5) చర్య నిమిత్తం సమీకరణ

ఉద్యమానికి ప్రేరేపించే పరిస్థితులలోని ప్రజలు సాధారణ ప్రవర్తనా ప్రమాణాలను లెక్కచేయకుండా చర్యకు పూనుకోవడానికి సిద్ధపడతారు. సాధారణ పరిస్థితులలో సామాజిక ప్రమాణాలకు తల ఒగ్గి ప్రవర్తించేవారే ఇలాంటి పరిస్థితులలో వాటిని లెక్కచేయకుండా ఇతరులను బాధించడం, ఆస్తిపాస్తులను ధ్వంసం చేయడానికి వెనుకాడరు.

### 6) సాంప్రదాయిక సామాజిక నియంత్రణలు ప్రభావ శూన్యం కావడం

బాహిరమైన సామాజిక నియంత్రణలు ప్రభావ శూన్యం అయినప్పుడు గుంపులోని సభ్యుల ప్రమాణాలదే పై చేయిగా ఉంటుంది. అలజడి లేవనెత్తిన గుంపులను అదుపు చేయడానికి తగినంత పోలీసు బలగం లేనప్పుడు ఆత్మ రక్షణకే అధిక ప్రాధాన్యం ఇవ్వడం చూస్తూ వుంటాము. అదనపు బలగాలు వచ్చేంత వరకూ వారు ప్రమాణ శూన్య పరిస్థితిని (normless vacuum) ఎదుర్కోవలసి వస్తుంది. ఈ దశలో గుంపు సభ్యులు ప్రామాణిక ప్రవర్తనా నియమాలను గాలికి వదిలి ఉద్రిక్త స్థితిలో ఉంటారు. ఈ పరిస్థితులలో సాంప్రదాయిక సామాజిక నియంత్రణలు నిరుపయోగము, నిరర్థకము అవుతాయి.

---

## 5.14 గుంపులలోని రకాలు

గుంపుల మధ్య అనేక విషయాలలో సారూప్యమున్నా కొన్ని స్పష్టమైన విభేదాలు కూడా కనిపిస్తాయి. ఈ విభేదాలు ముఖ్యంగా గుంపు లక్ష్యాలను, గుంపు సభ్యుల మధ్య సమన్వయానికి సంబంధించినవిగా గుర్తించవచ్చు. ఈ విభేదాల ప్రాతిపదికన గుంపులను నాలుగు రకాలుగా బ్లూమర్ (Blumer, 1951), టర్నర్, కిలియన్ (Turner and Killian, 1972)లు వర్గీకరించారు. అవి: 1) ఆకస్మికంగా ఏర్పడే గుంపులు (Casual or elemental crowds) 2) సాంప్రదాయికమైన గుంపులు 3) సక్రియమైన గుంపులు (Acting crowds) 4) భావ ప్రకాశకమైన గుంపులు (Expressive crowds)



BRAOU

### 1) ఆకస్మికంగా ఏర్పడే గుంపు

ఈ రకాన్ని ప్రాథమిక లేదా మౌలికమైన గుంపు అని కూడా అంటారు. ఇది తాత్కాలికంగా ఏర్పడినటువంటిది. దీనికి ఏ విధమైన నిర్మితి ఉండదు. సభ్యుల మధ్య సమన్వయం కూడా ఉండదు. ఇందులోని సభ్యుల నిష్క్రియ (passive) గా ఉండడమే కాక సమైక్యతాభావం లోపించి ఉంటుంది. అగ్నిప్రమాదం జరుగుతున్నప్పుడు గుమికూడిన జనం ఇటువంటిదే. అగ్నిమాపక దళం పనిచేస్తున్న సమయంలో ప్రేక్షకులుగా కొంత సేపు ఉండి కొందరు వెళ్ళిపోవడం, మరికొందరు చూడడానికి రావడం జరుగుతూ ఉంటాయి. అందువల్లనే ఈ గుంపు స్థిరత ఉండదని భావించడం జరుగుతుంది. ఈ విధమైన గుంపులు తాత్కాలికము, అస్థిరము అయినప్పటికీ ఇతర రకాల గుంపులకు ఇది కేంద్రకాలు (nuclei) గా పనిచేస్తాయి.

### 2) సాంప్రదాయికమైన గుంపులు

ఈ తరహా గుంపు సువ్యవస్థితమైన లేదా క్రమబద్ధీకరించినవి. వీటి నిర్మాణానికి సామాజిక సమ్మతి ఉండటమే కాక ఇవి ప్రణాళికా బద్ధంగా ఏర్పడిన నిర్దిష్ట నిర్మితి గలవి. క్రికెట్ మ్యాచ్ చూడడానికి వచ్చిన జనం, మతపరమైన సమావేశాలలో పాల్గొనే ప్రజలు, సంగీత కచేరీలకు వెళ్ళే శ్రోతలు అందరూ ఈ రకం గుంపులోని వారే. ఇలాంటి గుంపులు విషయంలో ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం ప్రవర్తన ఉన్నప్పటికీ అనిశ్చితత్వం (uncertianity) సూచనీయత, అనుజ్ఞాత్మకత (suggestibility) భావోద్వేగం పెరుగుదల (emotional arousa) వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఉదాహరణకు క్రికెట్ మాచ్ చూడడానికి వచ్చిన ప్రేక్షకులలో కొందరు అదుపుతప్పి ప్రవర్తించడం వల్ల గుంపులోని ఇతరులు కూడా అదే రకంగా ప్రవర్తించవచ్చు, పరిస్థితి చేయి జారిపోయే అవకాశముంది.

### 3) సక్రియమైన గుంపు

ఈ గుంపు చేపట్టే చర్యలన్నీ ఒక లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని చేసేవే. దోపిడీకి దిగిన వారు నిరసన వ్యక్తం చేసే ప్రదర్శకులు, లూటీలకు పాల్పడే జనం ఈ రకమైన గుంపులకు చక్కటి ఉదాహరణలు. సక్రియమైన గుంపులు హింసాయుత చర్యలకు, ఆస్తిపాస్తుల విధ్వంసానికి పాల్పడేటటువంటివి. అయితే సామాజిక మార్పునకు సంబంధించి ఇలాంటి గుంపు ప్రాముఖ్యం గలవేనని చెప్పవచ్చు.

### 4)భావ ప్రకాశమైన గుంపు

భావోద్వేగాలను వ్యక్తిగత ఆకాంక్షల పరితృప్తి పైనే ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించే గుంపులు అవి. ఇందులోని సభ్యుల మానసికావస్థ (mood) అనుభూతుల (feeling)ను ప్రవర్తనగా మార్చడమే వీటి ప్రధాన ఆశయం. ఈ గుంపులోని సభ్యుల భావోద్వేగాలు అత్యున్నత స్థాయికి చేరుకొంటాయి. ప్రవర్తన కూడా విపరీత ధోరణిలో ఉంటుంది. ఉదాహరణకు ఒక ప్రముఖ రాజకీయ నాయకుడిని నిర్బంధంలోకి తీసుకొంటారనే వార్త వచ్చినప్పుడు నగరంలోని జనంలో కనిపించే సంచలనం, పర్యవసానంగా ఏర్పడే సంక్షోభం. ఒక పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆ పార్టీ కార్యకర్తలలో పెల్లుబికే ఉత్సాహం కూడా ఇక్కడ ప్రస్తావించవచ్చు.

లాఫ్‌లాండ్ చేసిన వర్గీకరణ విభిన్న తరహాల గుంపు సమష్టి ప్రవర్తనను వివరిస్తుంది. ఇతని ప్రకారం ఒక గుంపు ఒకటికి మించిన భావోద్వేగాలను కలిగి వుండవచ్చు. ఉదాహరణకు భయం, ప్రాతికూల్యం రెండూ ఒకే గుంపులో కనిపించవచ్చు.

## 5.15 సారాంశం

సామాజిక మార్పు ప్రక్రియ ప్రతి సమాజంలోనూ అనివార్యం. సామాజిక పరివర్తనకు ప్రయత్నించే వివిధ వ్యవస్థలలో సముదాయం, సంఘం, గుంపు వంటివి అతిముఖ్యమైన ఏజెన్సీలు. ప్రతి సమాజంలోనూ ఈ మూడింటి పాత్ర ఎంత విశిష్టమైందో ఈ యూనిట్‌లో అధ్యయనం చేయడం జరిగింది. దేశకాల పరిస్థితులను బట్టి ఆయా సమాజాలలో ఉత్పన్నమయ్యే అనేక రకాల సామాజిక సమస్యలకు ఈ ఏజెన్సీలు ఏ విధంగా స్పందించి



BRAOU

ఉద్యమిస్తాయో తెలుసుకొన్నాం. ఈ ఏజెన్సీలన్నీ చైతన్య వంతమైన సమాజ శ్రేయస్సుకు కృషి చేసినప్పుడే ఏ సమాజమైనా పురోగమించగలదు. వివిధ సముదాయాల మధ్య చక్కటి సమన్వయము ఉన్నప్పుడు సమాజం నిలకడగా ప్రగతి పథంలో పయనించగలదు. సామాజికులు సౌభాగ్యానికి, సంరక్షణకు ఇతోధికంగా కృషి చేయగలరు.

అంటే ఈ యూనిట్‌లో చర్చించిన అంశాలలో మొదటిది - అంటే సముదాయం - స్థలానికి సంబంధించినది. మిగతా రెండూ స్థలం ఆధారంగా కాక ఇతర అంశాలపై - ప్రయోజనాలు, ఆసక్తి వంటి వాటిపై - ఆధారపడి ఏర్పడేవి. అయితే ఈ మూడు భావనలూ జన సమూహానికి (collectivity) సంబంధించినవే కావడం వల్ల వీటిని ఒకే సారి ప్రస్తావించడం జరిగింది. ఈ మూడింటికి పరస్పర సబంధం ఉంటూనే ఉంటుంది. ఒక సముదాయం ఒక స్థలంలోని జనుల అవసరాలకు ఏర్పడినదైతే, వారి ప్రయోజనాల కోసం వారు ఏర్పరచుకొనేవే సంఘాలు, లక్ష్య సాధనకు ఈ సంఘాలు తమ వంతు కృషి చేస్తాయి. సముదాయంలో జరిగే అనేక సంఘటనలలో గుంపులు తమ పాత్ర నిర్వహిస్తాయి. కొన్ని సందర్భాలలో గుంపులో మార్పులకు కారణం కావడం కూడా జరుగుతూ ఉంటుంది.

## 5.16 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. సముదాయం అంటే ఏమిటి? సముదాయాల చరిత్రను గురించి క్లుప్తంగా రాయండి.

2. సాముదాయిక ప్రవర్తనను గురించి వివరించండి.

II. కింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి

1. గెమైన్‌షాఫ్ట్, గెసెల్‌షాఫ్ట్ లక్షణాలను తెలియజేయండి.

2. దేశం ఒకరకమైన సముదాయమే చర్చించండి.

## 5.17 చదవదగిన పుస్తకాలు


Thomas J. Sullivan and
Kedndrick S. Thompson: Sociology Concepts, Issues and Applications, John Wiley &Sons, New York, 1984

William F. Kenkel Society in Action : Introduction to Sociology, Harpen & Row Publihers, New York, 1980.

Ritchie P. Lowry and Robert P. Pamkin: Sociology, The Science of Society, Charles Scriber's Sons, New York, 1969

R.M.Mac Iver and Charles H. Page: Society, the MacMillan Co. of India Ltd., Delhi, 1977

M. V. Lakshmi Devi and A. Usha: Degree Level Text Book, Published by Telugu Akademi, Hyderabad.


BRAOU

# భాగం- 6: అంతస్తు, పాత్ర

విషయ క్రమం


6.0 ఉద్దేశాలు

6.1 పరిచయం

6.2 అంతస్తు - నిర్వచణం

6.3 అంతస్తు - రకాలు

  6.3.1 ఆరోపించిన, సాధించిన అంతస్థు - తులనాత్మక పరిశీలన

  6.3.2 అంతస్థు - ప్రకారయ ప్రాధాన్యం

6.4 పాత్ర -నిర్వచనం, అర్థం

  6.4.1 పాత్రలు ఎలా మారతాయి

6.5 పాత్ర సమితి

6.6 పాత్ర సంఘర్షణ

6.7 సారాంశం

6.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

6.9 చదవదగిన పుస్తకాలు


## 6.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- అంతస్థును నిర్వచించగలుగుతారు.
- అంతస్తులలోని రకాలను గురించి చర్చించగలరు.
- అంతస్థు ప్రకార్య ప్రాధాన్యాన్ని గుర్తించగలరు.
- పాత్రలను నిర్వచించి అవి ఎలా మారతాయో తెలుసుకోగలరు.
- పాత్ర సమితి అంటే ఏమిటో తెలుసుకోగలరు.
- పాత్ర సంఘర్షణను దానిని అధిగమించే మార్గాలను వివరించగలరు.

BRAOU

## 6.1 పరిచయం

వివిధ వ్యక్తులు, సమూహాల మధ్య సువ్యవస్థీకృతమైన సంబంధాలు నెలకొన్న వ్యవస్థనే సామాజిక నిర్మితి అంటారు. ఈ సామాజిక నిర్మితకి ఆధారభూతమైనవి అంతస్తు, పాత్రలే. సమాజం వివిధ సమూహాలు వ్యక్తులున్న ఒక సంక్లిష్టమైన వ్యవస్థ. సామాజిక సంబంధాలే పడుగు, పేకలుగా పనిచేస్తూ సమాజంలో సుస్థిరతకు తోడ్పడుతూ ఉంటాయి. సమాజంలోని వ్యక్తులకు, సమూహాలకు వివిధ ప్రకార్యాలు ఉంటాయి. ఏ సమాజంలో అయినా సామాజిక విభేధీకరణ సహజం. మనుషులందరూ ఒక్కటే, ఒక ఆదర్శమే కానీ వాస్తవ సమాజంలో అది అసలూ కనిపించదు. సాంఘిక సమానత్వానికి సమాజం యావత్తూ నిరంతరం కృషి చేస్తూ ఒక ఆదర్శ సమాజాన్ని స్థాపించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. సామాజిక విభేదీకరణకు దోహదం చేసే అంశాలను సమాజశాస్త్రవేత్తలు మూడుగా గుర్తించారు: 1. జైవిక కారణాలు. ఉదా: లింగం, వయస్సు, జాతి, 2. సాంఘిక కారణాలు, ఉదా : ధనం. ఆస్తి, ఆదాయం, వృత్తి, విద్య, క్రీడ, సముదాయం. 3. జైవిక - సాంఘిక కారణాలు, ఉదా: కుటుంబము, కులం. వీటి ఆధారంగానే సమాజంలో విభిన్న స్తరాలు ఏర్పడతాయి. సామాజిక స్తరీకరణ అన్ని సమాజాలలో - ఆదిమ మొదలుకొని ఆధునిక పాశ్చాత్య సమాజాల వరకూ అనివార్యం. సామాజిక స్తరీకరణలో అంతస్తు, పాత్ర అనేవి ప్రధానాంశాలు. స్తరీకరణను సరిగా అర్థం చేసుకోవడంలో ఈ రెండు అంశాలు కొంతవరకూ ఉపయోగపడతాయి

విభేదీకరణ వల్ల ఏర్పడిన వివిధ స్తరాలకు ఆపాదించిన ప్రమాణాలు, విలువలనే అంతస్తు అనవచ్చు. వివిధ అంతస్తులకు చెందిన సామాజికులు నిర్వహించే పాత్ర భిన్నరీతులలో కనిపించడం సర్వసామాన్యమైన విషయం. ఈరెండు అంశాలకున్న ప్రాధాన్యం దృష్ట్యా అంతస్తు వివిధ రూపాలను, ప్రకార్య తీరుతెన్నులను గురించి కొంత విపులంగా చర్చిద్దాం.

## 6.2 అంతస్తు - నిర్వచనం

అంతస్తు ఒక సామాజిక స్థితిని తెలియజేస్తుంది. దీనిని గురించి అనేక శాస్త్రవేత్తలు వివిధ కోణాలలో పరిశీలనలు జరిపి వివిధ రకాలుగా వివరించడానికి ప్రయత్నించారు. సమాజ శాస్త్రవేత్తల అధ్యనాలలో ఈ అంశం బహుకాలంగా చర్చనీయాంశంగానే ఉంటూ వస్తున్నది. ఈనాడు ఈ భావనకు అపాదించిన అర్థాన్ని స్పష్టంగా పేర్కొన్న తొలి సమాజశాస్త్రవేత్త లింటన్. ఈ భావనను అనేకమంది అనేక విధాలుగా నిర్వచించడానికి ప్రయత్నించారు. ఇప్పుడు అంతస్తు తాలూకు కొన్ని నిర్వచనాలను పరిశీలిద్దాం.

ముందుగా ఆద్యుడైన లింటన్ ఇచ్చిన నిర్వచనం ఈ విధంగా ఉంది: 'ఒక వ్యవస్థలో, ఒకానొక కాలంలో ఒక వ్యక్తి ఆక్రమించిన స్థానమే ఆ వ్యక్తి అంతస్తు అవుతుంది.' అగ్బర్న్, నిమ్కాఫ్‌లు అంతస్తుకు ఇచ్చిన నిర్వచనం : 'ఒకానొక సమూహంలో ఒక వ్యకి&త ఆక్రమించిన స్థానమే అతని అంతస్తు'. 'ఒక వ్యక్తి వయస్సు, లింగం, కుటుంబ, వర్ణం, నిర్వహిస్తున్న వృత్తి, వివాహస్థితి, సాధించిన విజయాల ఆధారంగా అతను ఆ సమాజంలో పొందే స్థానమే అతని అంతస్తు అవుతుంది'. అని ఎలియట్, మెరిల్‌లు అంటారు. 'అంతస్తును బట్టి నిర్వహించే ప్రకార్యాన్ని అతని పాత్రగా గుర్తించాలి'. లాపియర్ దృష్టిలో ఒక వ్యక్తి తానుంటున్న సమాజంలో ఆక్రమించిన స్థానమే అతని అంతస్తు.

పైన తెలిపిన నిర్వచనాలను బట్టి సమాజంలో వ్యక్తికున్న స్థానాన్నే అంతస్తుగా వ్యవహరించడం జరుగుతుందని స్పష్టమవుతుంది. అతని స్థానాన్ని నిర్ధేశించే కారకాలు అనేకం ఉండవచ్చు. అందులో ముఖ్యమైనవి జైవిక, సామాజిక, జైవిక-సామాజిక కారకాలు. అయితే దేశకాల పరిస్థితులను బట్టి పైన తెలిపిన కారకాల (జైవిక, సామాజిక) ప్రాధాన్యతలలో స్పష్టమైన మార్పులు చోటు చేసుకొంటున్నాయి. ఒకనాటి రాచరిక వ్యవస్థ కాలదోషం పట్టి కనుమరుగొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో సర్వమానవ సవ్పత్వానికి పెద్దపీట వేయడం జరుగుతోంది. జాతి దురహంకారము, కుల, వర్ణ, వర్గ విక్షకు కాలం చెల్లింది. ఆర్థిక, రాజకీయ అంశాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వడం. వీటి ఆధారంగానే దేశాల, సమాజాల వర్గీకరణ ప్రారంభమైంది.

BRAOU

## 6.3 అంతస్తు - రకాలు

సామాజిక స్తరీకరణ వల్ల ఏర్పడిన సమూహాలకు వివిధ అంతస్తులుంటాయి. వీటిలో కన్నిఉన్నతమైనవిగానూ, కొన్ని తక్కువైనవిగానూ భావించడం పరిపాటి. స్తరీకరణవల్ల ఏర్పడిన వివిధ అంతస్తు సమూహాలను స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. 1. ఆరోపించిన లేదా ఆపాదించిన అంతస్తు (ascribed status), 2. సాధించిన అంతస్తు (achieved status). ఈరెండు రకాల అంతస్తులను గురించి కొంత విపులంగా చర్చించి ఆధునిక సమాజాలలో వాటి తులనాత్మక ప్రాధాన్యాన్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

### 6.3.1 ఆరోపిత అంతస్తు

వ్యక్తులు, సమూహాలు అనువంశికంగా పొందే అంతస్తునే అపాదిత లేదా ఆరోపిత అంతస్తు అనవచ్చు. వ్యక్తులు, సమూహాల సభ్యుల వయస్సు, లింగబేధం, జాతి, కులం మొదలైన వాటినిబట్టి వ్యక్తులకు నిర్దిష్టమైన అంతస్తును ఆపాదించడం జరుగుతుంది.దీనికి చక్కటి ఉదాహరణ హిందూ సమాజం. హిందూ సమాజంలో కులాన్ని బట్టే వ్యక్తులకు అంతస్తు ఏర్పడుతుంది. జన్మతః సంప్రాప్తమై అంతస్తు జీవితాంతం కొనసాగుతుంది. ఆదిమ సమాజాలలోనూ, సంప్రదాయక సమాజాలలోనూ ఆరోపిత అంతస్తు అధికంగా కనిపిస్తుంది.

### 6.3.2 సాధించిన అంతస్తు



వ్యక్తులు, సమూహాలు తమ శకి&త సామర్థ్యాలను బట్టి అర్హతలను బట్టి సాధించిన అంతస్తే ఇది. ఇటువంటి

అంతస్తు వ్యక్తుల పుట్టుకనుబట్టి కాక వారి స్వయంకృషి మీద, వారి తెలివితేటలమీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు వర్ణవ్యవస్థలో వ్యక్తులు తమ శక్తి సామర్థ్యాలనుబట్టి, కృషినిబట్టి వివిధ అంతస్తులను పొందుతారు. సంక్లిష్టమైన ఆధునిక పారిశ్రామిక సమాజాలలో వ్యక్తుల అంతస్తులు ప్రధానంగా సాధించిన అంతస్తులే అనేది నిర్వివాదాంశం. స్వయం కృషితో అత్యున్నత గౌరవహోదాలు పొందిన వ్యక్తులు అనేకమంది మన దేశ చరిత్రలో కనిపిస్తారు. ఇలాంటి వారిలో కాళిదాసు, వాల్మీకులను ఆద్యులుగా పేర్కొనవచ్చు. ఆధునిక కాలంలో అత్యున్నత గౌరవపురస్కారాలు పొందిన వ్యక్తిగాకూడా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను విధిగా గుర్తుంచుకోవాలి.

### 6.3.2 ఆరోపించిన, సాధించిన అంతస్తులకు ఆధారం

ఆరోపించిన అంతస్తు వయసు, లింగభేదం, బంధుత్వం, జాతి, కులం, కుటుంబం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. ప్రపంచంలోని ప్రతి సమాజంలోనూ, ముఖ్యంగా పితృస్వామ్య సమాజాలలో వయోవృద్ధులైన పురుషులకు ఇతరులకంటే ఉన్నతమైన స్థాయిని ఇవ్వడం కనిపిస్తుంది. ఇలాగే మాతృస్వామ్య సమాజాలలో వయోవృధలైన స్త్రీలకు అత్యున్నత స్థానం కల్పించడం జరుగుతుంది. ఆపాదించిన అంతస్తు జన్మసిద్ధమైంది కాబట్టే భారతీయ సమాజంలో బ్రాహ్మణులకు అత్యున్నత స్థానం, శూద్రులకు అట్టడుగు స్థానం ఇవ్వడం కనిపిస్తుంది. అదే సాధించిన అంతస్తు అయితే వ్యక్తిగత లేదా సమూహం సామర్థ్యం, విద్యార్హత, ఆర్జించిన సంపద మొదలైన అంశాలను బట్టి ఏర్పడుతుంది. ఉదాహరణకు సమాజసేవ, క్రీడలు, విద్యారంగం మొదలైన వాటిలో ప్రతిభను కనబరచినవారిని ప్రత్యేకంగా గుర్తించి సత్కరించడం జరుగుతుంది.

పైరెండు రకాల అంతస్తులను నిర్ణయించే అంశాలను ఒక సమాజం తాలూకు సాంస్కృతిక విలువలు, నియమ నిబంధనలు నిర్ధారిస్తాయి. వర్తమాన కాలంలో ప్రపంచంలోని వివిధ సమాజాలు సాంస్కృతిక విలువలలో మార్పులు నిరంతరం చోటుచేసుకొంటూ ఉండటం వల్ల ప్రమాణాలలో కూడా మార్పులు అనివార్యమయ్యాయి. అందువల్ల అంతస్తు, పాత్రలకు సంబంధించిన ఒక సమాజపు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వ్యవస్థలపైనే ప్రధానంగా ఆధారపడి ఉంటున్నాయని స్పష్టంగా తెలుస్తుంది.

### 6.3.3 ఆరోపించిన, సాధించిన అంతస్తు

తులనాత్మక పరిశీలన: ఆరోపించిన, సాధించిన అంతస్తులు అంతస్తు తాలూకు రెండు రూపాలే అయినా వాటి మధ్య పోలికలతో పాటు భేదాల కూడా ఉన్నాయి. అవి ఏరకంగా భిన్నంగా ఉంటాయో ఇప్పుడు చూద్దాం. ఆరోపిత అంతస్తు అనేది వ్యక్తికి సామాజం అందించే ఒక గుర్తింపు. ఈ గుర్తింపు పొందటానికి వ్యక్తికి అర్హతలేమీ లేకపోయినా వ్యక్తికి అది లభిస్తుంది. అయితే లభించిన అంతసు&తకు తగిన విధంగా వ్యక్తి తన ప్రవర్తనను మలుచుకోవలసిన అవసరం మాత్రం ఉంటుంది. ఇక సాధించిన అంతస్తు విషయానికొస్తే వ్యక్తి సార్థ్యం, శక్తినిబట్టి అతని అంతస్తులభిస్తుంది. ఉదాహరణకు కష్టపడి చదివినప్పుడే విద్యార్థి మొదటి తరగతిలో ఉత్తీర్ణుడవుతాడు. ఈ విజయం కేవలం విద్యార్థి శక్తి సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుందన్నమాట. ఒక అంతస్తును పొందాలంటే వ్యక్తికి కొన్ని అర్హతలు ఉండి తీరాలి. ఇలా అవసరమైన అర్హతులున్నప్పుడే అతడు ఒకానొక అంతస్తుకు పాత్రుడవుతాడు. ఉదాహరణకు విద్యార్థి పట్టభద్రుడు కావాలంటే తగిన వయసు, విద్యార్హత, సామర్థ్యం అవసరం అవుతాయి.

ఆపాదిత అంతస్తు వ్యక్తి కులం, పుట్టుక, జాతి, బంధుత్వాలపై ఆధారపడి నిర్ధారితమవుతుంది. అందువల్ల అది స్థిరంగా అంటే మార్పులకు లోనుకాకుండా ఉంటుంది. సాధించిన అంతస్తు ఆరోపిత అంతస్తుతో పోలిస్తే స్థిరంగా ఉండదు. ఎందుకంటే దాని ప్రతిపాదికలు - నైపుణ్యం, శక్తి సామర్థ్యాలు, సమాజంలో మారుతున్న విలువలు - నిరంతరం మార్పు చెందుతూ ఉంటాయి కాబట్టి.

ఆపాదిత అంతస్తు  సాధారణంగా సాంప్రదాయిక సమాజాలలోనే కనిపిస్తుంది. ఇటువంటి సమాజాలలోనే ఆరోపిత అంతస్తులకు గుర్తింపు, గౌరవం ఉంటాయి. ఇటువంటి సమాజాలలో వ్యక్తులు తమ అంతస్తును మెరుగుపరచుకొనే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి. అదే సాధించిన అంతస్తులు వివృత, ఆధునిక సమాజాల(open and modern societies)లో ప్రాధాన్యం పొంది ఉంటాయి. ఇటువంటి సమాజాలలో వ్యక్తుల వ్యక్తిగత లక్షణాలకే ప్రాదాన్యం, గౌరవం ఉంటాయి. సమాజాలలో వ్యక్తుల వ్యక్తిగత లక్షణాలకే ప్రాధాన్యం, గౌరవం

ఉంటాయి. సమాజం కూడా వ్యక్తులకు తమ స్థితిగతులను మెరుపరచుకొనే అవకాశాలను మెండుగా సమకూరుస్తుంది. ఉదాహరణకు గ్రామీణ సమాజంలో కంటే పారిశ్రామిక, నగర సమాజంలోనే ఉపాధి అవకాశాలు మెరుగుగా ఉంటాయి. ఇవి వ్యక్తులపురోభివృద్ధికి దోహదం చేస్తాయి.

ఆపాదిత అంతస్తులోని వ్యక్తి అధికారం అపరిమితమే కానీ దానికి అవధులు ఎవరూ నిర్ణయించి ఉండరు. అపరిమితులను గుర్తింపడం కూడా కష్టం. సాధించిన అంతస్తులోని అధికారి అధికార పరిధి, విస్తృతి స్పష్టంగా ఉండటమే కాక సామాజికులందరికీ సులభగ్రాహ్యంగా ఉంటాయి.

కొన్ని సందర్భాలలో ఆపాదిత అంతస్తు ద్వారా కొన్ని లక్ష్యాలను సాధించడానికి, నూతన విషయాలను తెలుసుకోవడానికి వీలుకలుగుతుంది. అలాగే కొన్ని సందర్భాలలో సాధించిన అంతస్థు ఆపాదిత అంతస్తు వల్ల కలిగే కొన్ని అశక్తతలను అధిగమించేందుకు వీలు కల్పిస్తుంది. ఉదాహరణకు అట్టడుగు కులానికి చెందిన వ్యక్తి ఎదుర్కొనే అశక్తతలను ఉన్నతవిద్య ఉన్నత అధికార హోదాలను సాధించడం ద్వారా అధిగమించే వీలుంది.

## 6.3.4 అంతస్తుప్రకార్య ప్రాధాన్యం

ప్రపంచంలో ఎక్కడా అంతస్తులు లేని సమాజం కనిపించదు. వర్గ,కుల రహిత సమాజాన్ని స్థాపించిన కమ్యూనిస్ట్ దేశాలలో కూడా అంతస్తులేని సమాజం లేదు. సమాజాలన్నింటిన్ని అంతస్తులలోని తారతమ్యాలను బట్టీ ఆయా సమాజాల శ్రేణుల ను నిర్ణయించడం జరుగుతూ ఉంటుంది. ఒక సామాజిక వ్యవస్థకు సంబంధించిన భిన్న రకాల విధుల నిర్వహణకు-స్తరీకరణ అత్యంత కీలకమైనది. అందుకే ఈలక్షణాన్ని సార్వజనీన లక్షణంగా నిపుణులు గుర్తిస్తారు. ప్రతి సమాజానికి తన సామాజిక నిర్మితిలోని వివిధ తరహాల వృత్తి పరమైన స్థానాలను భర్తీ చేయవలసిన బాధ్యత ఉంది. కొన్ని వృత్తులకు అత్యున్నత విద్యార్హతలుగానీ , నైపుణ్యంకానీ ఉన్న వ్యక్తులను ఎంపిక చేసుకోవలసిన అవసరం ఉంది. అందుకుగాను ప్రత్యేక పారితోషికాలు, హోదా కల్పించి ఆయా స్థానాలను భర్తీచేయడం సర్వసామన్యంగా జరిగే విషయం. వివిధ వృత్తుల తాలూకు అంతస్తులకు సమాజం రెండు విధాలుగా వ్యక్తులను ఎంపిక చేసే అవకాశం ఉంది. 1 అనువంశిక లక్షణాలకు ప్రాధాన్యమిచ్చి ఎంపిక చేయడం 2. వ్యక్తి సాధించిన ఫలితాలను బట్టి ఎంపిక చేయడం. ఈరెండు పద్ధతులూ దాదాపు అన్ని రకాల సమాజాలలో కనిపిస్తాయి. అయితే ఆధునిక యుగానికి పూర్వం ఉన్న సమాజాలూ అనువంశికత, ఆపాదిత అంతస్తులకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవి. ఆధునిక సమాజాలు సాధించిన అంతస్తుకే అధిక ప్రాధాన్యం ఇస్తుండటం గమనించదగ్గ విషయం.

BRAOU

అంతస్తులోని అస్థిరతలు(status in consistancies) సాధించిన, ఆరోపించిన అంతస్తులకిచ్చే ప్రాధాన్యం విషయంలో తలెత్తే సమస్యలను మరింత జటిలం చేస్తాయి. సామాజిక అంతస్తును సూచించే ఏకైక అంశం ఏది అనే ప్రశ్నకు సరియైన సమాధానం దొరకదు. కొన్ని సందర్భాలలో ధనం ఆధారం కావచ్చు. ఇలా చెబితే జీవన శైలి, వేషభాషలు, వంశగౌరవం వంటి అనేక అంశాలు అంతస్తుకు ఆధారాలవుతాయి. పరివర్తనకు గురి అవుతున్న వివృత సమాజాల(open societics)లో అంతస్తు అస్థిరత ప్రముఖ లక్షణంగా కనిపిస్తుంది. ఉదాహరణకు అధ్యాపక వృత్తి చేపట్టే వారికి సమాజంలో అత్యున్నత స్థానం, గౌరవ మర్యాదలు ఉంటాయి. కానీ అతనికిచ్చే జీవన భృతి మాత్రం పరిమితమే. ఇటువంటి అస్థిరత సామాజిక, వ్యక్తి గత ఉద్రిక్తతలకు మూల్యమయ్యే అవకాశం ఉంది.

పైన చర్చించిన రెండు రకాల అంతస్తులు సామాజిక ప్రక్రియలో ప్రముఖపాత్ర వహిస్తుంటాయి. దేశకాల పరిస్థితులను బట్టి వాటి ప్రాధాన్యతలలో మార్పులు చోటుచేసుకుంటూఉంటాయి. సమాజంల నిర్ధేశించిన లక్ష్యాలను సాధించడానికి ఈ రెండు ఉపకరణాలుగా పనిచేస్తాయి.

## 6.4 పాత్ర - నిర్వచనం, అర్థం

సమాజంలోని వివిధ స్తరాలకు చెందిన వివిధ అంతస్తులలోని వ్యక్తుల ప్రవర్తన ఆ సమాజపు ప్రమాణాలను విలువలను అనుసరించే ఉంటాయి. విలువలకు లోబడే సమాజ నిర్మితికి, ప్రకార్యాలకు సంబంధించిన వ్యక్తి ప్రవర్తననే పాత్ర అంటున్నాము. ఒక వ్యక్తి వివిధ రకాల పాత్రలను పోషించవలసి ఉంటుంది. ఒకస్థాయి వ్యక్తి నుంచి ఇతరులు ఆశించే ప్రవర్తనను ఆ అంతస్తు వ్యక్తికి నిర్ధేశించిన పాత్ర అంటారు. ఉదాహరణకు

గృహయజమానిగా, తండ్రిగా కొన్ని బాధ్యలను నిర్వహించవలసి ఉంటుంది. అంటే వ్యక్తి అంతస్తుకు అతను నిర్వహించవలసిన, అతనినుంచి ఆశించిన ప్రవర్తన తీరుతెన్నులకు సన్నిహిత సంబంధం ఉంటుందన్నమాట. ఒకే వ్యక్తి అనేకపాత్రలను ఏకకాలంలో పోషిస్తూ ఉండవచ్చు. భర్తగా, తండ్రిగా, ఉద్యోగిగా, ఒకరాజకీయపార్టీ సభ్యుడిగా, ఒక సమాజ సేవకుడిగా విభిన్న పాత్రలను ఒకే వ్యక్తి ఏకకాలంలో పోషించడం సర్వసాధారణంగా కనిపించే విషయం. సాంఘిక ప్రమాణాలను అనుసరించి పాత్రలు పోషిస్తున్న వ్యక్తులను ఆ సమాజం వారిని ధర్మానువర్తనులుగా పరిగణిస్తుంది. ప్రమాణాలకు భిన్నంగా ప్రవర్తించేవారి ప్రవర్తనను విచలిత ప్రవర్తనగా సమాజం ముద్రవేస్తుంది. వ్యక్తులు సమూహాలు వారి వారి అంతస్తులకు తగిన విధంగా ప్రవర్తించినప్పుడే సమాజం సక్రమంగా నడువగలుగుతుంది. లేదంటే అవ్యవస్థ చోటుచేసుకుంటుంది. అంతస్తు పాత్రల పరస్పర సంబంధాల దృష్ట్యా పాత్ర భావాలను వివిధ శాస్త్రవేత్తలు ఏవిధంగా నిర్వచించారో చూద్దాం.

'సామాజిక పాత్ర అనేది పరస్పర సంబంధమున్న ఆకాంక్షలు, చర్యల సమాహారం. ఇలాంటి సమాహారం ప్రతి సామాజికవ్యవస్థలోనూ అంతర్భాగంగా ఉంటుంది' అని ప్రొఫెసర్ ఓల్సన్ (Proffessor Olson ) నిర్వచించాడు. రాల్ఫ్ లింటన్ (Ralph Linton) ప్రకారం ఒక వ్యక్తికి నిర్దేశించిన పాత్ర అంటే ఒకానొక అంతస్తుకు సంబంధించి సాంస్కృతిక ప్రవర్తనాతీరు. 'ఒకానొక పరిస్థితుల్లో ఒక వ్యక్తి తాలూకు సంగతమైన సామాజిక ప్రవర్తనను ఆవ్యక్తి నిర్వహించే పాత్ర'గా సార్జంట్ (sargent) నిర్వచించాడు. 'ఒక నిర్దిష్ట అంతస్తుకు సంబంధించిన వ్యక్తికి నిర్దేశించిన అతని నుంచి ఆకాంక్షించిన సాంస్కృతిక బాధ్యతలు, లక్షణాలు, హక్కుల సమాహారం ఆవ్యక్తి పాత్ర అవుతుంద'ని బిడిల్, థామస్ (biddle and thomas)లు అంటారు.

పైనిర్వచనాలను పరిశీలిస్తే కొన్ని విషయాలు స్పష్టమవుతాయి. మనిషితాలూకు ప్రతిచర్యకు ఒక పాత్రతో సంబంధం ఉంటుంది. ఈ పాత్రకు అనేక చర్యలతో సంబంధం ఉంటుంది. ఉదాహరణకు తండ్రి స్థానంలోని వ్యక్తి అతని కుటుంబ సభ్యులకు సంబంధించి అనేక విధులు నిర్వహించవలసి ఉంటుంది. ఈ విధులన్నీ కలిస్తే అతని పాత్ర అవుతుంది.

పాత్ర అనేది అంతస్తుకు సంబంధించిన అంశం ఒక సమాజం ఆకాంక్షల దృష్ట్యా వ్యక్తి అనేక చర్యలు జరుపవలసి వస్తుంది. ఒక అంతస్తుకు చెందిన వ్యక్తి అనుసరించే చర్యల సమాహారమే ఆవ్యక్తి నిర్వహించే పాత్ర అని ఇదివరకే తెలుసుకొన్నాము. ఈ చర్యలన్నీ కేవలం ఆ వ్యక్తి మీద ఆధారపడి ఉండవు. వ్యక్తి చర్యలు సమాజం అంగీకారం పొందినప్పుడే అవి ఆమోదయోగ్యం అవుతాయి. అంటే ప్రతి సామాజికపాత్రకు సాంస్కృతిక పాదిక అత్యవసరమని అర్థమవుతుంది. అందుకే సామాజిక విలువలకు ఆదర్శాలకు భిన్నమైన ప్రవర్తనను సమాజం సహించదు. వీరినే విచలిత ప్రవర్తనగలవారిగా సమాజం ముద్రవేస్తుంది.

ఒక వ్యక్తి నిర్వహించే పాత్రకు, ఆ వ్యక్తి వ్యక్తి వ్యక్తిగత లక్షణాలకు సంబంధం అతి తక్కువగా ఉంటుంది. ఒకే పాత్రను వివిధ వ్యక్తులు నిర్వహించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు భారత రాష్ట్రపతిగా ఎందరో వ్యక్తులు వ్యవహరించి మన్ననలు పొందారు. అయినా రాజకీయ వ్యవస్థలో, రాజ్యాంగ బాధ్యతల నిర్వహణలో ఆ పాత్ర ప్రాముఖ్యం ఏమాత్రం తరలేదు. అంటే పాత్రలు సామాజిక స్థిరత్వానికి దోహదం చేయడమేకాక మానవ ప్రవర్తన తీరును ముందుగానే ఊహించడానికి వీలు కల్పిస్తాయి. ఈ అంశాన్ని జింబార్డో (zimbardo-1972) జైలుగార్డ్సు, ఖైదీల పాత్రలపై సాగించిన పరిశోధన ఫలితాలు స్పష్టంగా చేస్తాయి.

పాత్ర ప్రవర్తన(role behaviour), పాత్రల మధ్య ఉన్న తేడాను గుర్తించడం చాలా అవసరం. పాత్ర 'ప్రవర్తన అంటే ఒక వ్యక్తి వాస్తవంగా ప్రవర్తించే తీరును సూచించగా, పాత్ర అతనినుంచి సమాజం ఆకాంక్షించే ప్రవర్తన అవుతుంది. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాకు వర్తమాన రాజకీయ, సామాజిక, చరిత్రలోని ఎన్నో ఉదంతాలను పేర్కొనవచ్చు. ఉదాహరణకు కుటుంబ సభ్యులందరి సంక్షేమం కోసం పాటుపడడం, కుటుంబ యజమాని బాధ్యత. ఈ బాధ్యత అతని పాత్రలో ఇమిడి ఉంటుంది. అయితే అందుకు భిన్నంగా ప్రవర్తించేవారు ఎందరో సమాజంలో మనకు కనిపిస్తూ ఉంటారు.

వ్యక్తులు నిర్వహించే పాత్ర సామాజిక విలువలు, ఆదర్శాలపై ఆధారపడి ఉంటుందని ఇదివరకే చెప్పడం జరిగింది. ఈ ఆదర్శాలు, విలువలు దేశకాల పరిస్థితులను బట్టి అనేక మార్పులకు, చేర్పులకు గురి అవుతూ

BRAOU

ఉంటాయి. ఇలాంటి మార్పులను అనుసరించి పాత్ర భావనలో కూడా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకానొక కాలంలో సమాజ ఆమోదం పొందిన ఆదర్శం, విలువలు తరువాతి కాలంలో ప్రజాదరణకు నోచుకోకపోవచ్చు. బాల్యవివాహాలను ఒకప్పుడు సమాజం అంగీకరించేది. కానీ ఈనాడు వాటికి చట్టపరమైన ఆంక్షలెన్నో విధించడం జరిగింది. కులాంతర వివాహాలు సమాజం ఆమోదించేది ఒకనాడు. అయితే ఈనాడు కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నారు. సమాజంలో వస్తున్న ఇలాంటి మార్పుల కారణంగా వ్యక్తులు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం సర్వసాధారణమైంది. దీనివల్ల కుటుంబ పెద్దగా తండ్రిపాత్ర పరిమితమవుతుంది.

ప్రతి పాత్ర నిర్వహణాక్షేత్రం పరిమితం. ఉదాహరణకు ఒక అధికారి అధికారం కార్యాలయానికే పరిమితమవుతుంది. అట్లాగే కుటుంబ యజమానికగా తండ్రి పాత్ర అతని కుటుంబ సభ్యులకే వర్తిస్తుంది తప్ప సమాజానికంతటికీ వర్తించదు. అలాగే ఒక అంతస్తుకు చెందిన వ్యక్తికి నిర్దేశించిన బాధ్యతలను అన్నింటిని సంపూర్ణంగా నిర్వహించకపోవచ్చు.

పాత్రల ప్రాముఖ్యంలో వ్యత్యాసం ఉంటుంది. సమాజంలోని కొన్ని పాత్రలు కీలకమైనవి, మరికొన్ని సాధారణమైనవి. కీలకమైన పాత్రలు సామాజిక వ్యవస్థ సక్రమంగా నడవడానికి ఆధారం. కాగా, సామాన్యమైనవి దైనందిన వ్యవహారాల నిర్వహణకు తోడ్పడుతాయి. అందుకే కీలకమైన పాత్రలు పోషించేవారికి సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు, గౌరవం ఉంటాయి. అలాగే ఒక వ్యక్తి ఏకకాలంలో ఎన్ని పాత్రలు పోషించినా అతనికి గుర్తింపు లభించేది మాత్రము ప్రాముఖ్యమున్న ఒక పాత్ర ద్వారానే. ఉదాహరణకు క్యాబినెట్ తరహా ప్రభుత్వంలో ప్రధానమంత్రి స్థానం అత్యంత కీలకమైంది. ప్రధానమంత్రిగా ఉన్న వ్యక్తి ఒక రాజకీయపార్టీ నాయకుడిగా, ఒక రాజకీయ నాయకుడి తండ్రిగా, ఒక కుటుంబ పెద్దగా ఇలా ఎన్నో పాత్రలు నిర్వహించినప్పటికీ దేశవ్యాప్తంగానూ, అంతర్జాతీయంగానూ ఒక దేశ ప్రధాన మంత్రిగానే అతనికి గుర్తింపు లభిస్తుంది.

### 6.4.1 పాత్రలు ఎలా తయారవుతాయి

వివిధ సామాజిక వ్యవస్థలలో వ్యక్తులు భిన్నమైన, వివిధ రకాల పాత్రలు నిర్వహిస్తుండటం మామూలుగా కనిపిస్తుంది. సమాజంలోని వ్యక్తుల అంతస్తులలో మార్పుతోపాటు వారు నిర్వహించే పాత్రల్లో కూడా మార్పులు వస్తూ ఉంటాయి. ప్రతి అంతస్తుకు సంబంధించిన ఒక నిర్దిష్టమైన పాత్ర ఉండటం వల్ల పాత్రలలో మార్పు అనివార్యం. సభ్యులకు నిర్దేశించిన పాత్రలలో మార్పులు నాలుగురకాలుగా జరగవచ్చు: 1. ఇదివరకు ఉన్న పాత్రలకు నూతన పాత్రలు తోడవవచ్చు. 2. పాత్రలకు స్వచ్ఛందంగాకానీ, ఇతర పరిస్థితులవల్ల గానీ వదులుకోవలసి రావచ్చు. 3. ఒక పాత్ర స్థానంలో మరోపాత్ర నిర్వహించవలసి రావచ్చు. 4. కాలక్రమంలో ఒక పాత్ర లేదా పాత్ర స్వభావ స్వరూపాలు మారవచ్చు.

పిల్లలు పెద్దవారయ్యేకొద్ది అనేక పాత్రలు - విద్యార్థి, క్లబ్ సభ్యుడు - నిర్వహిస్తారు. యుక్తవయసు వచ్చిన వ్యక్తి నిర్వహించే పాత్ర ఇంతకు ముందు దశకంటే భిన్నంగా ఉంటాయి - టాక్సీడ్రైవర్, కంప్యూటర్ ప్రోగ్రామర్, ఓటర్, భర్త, పేరెంట్. అలాగే ఉన్న పాత్రలకు మరెన్నో పాత్రలను జతచేర్చడంగానీ, కొన్నింటిని వదిలిపెట్టి కొత్తవాటిని స్వీకరించవచ్చు. ఉదాహరణకు ఉద్యోగాన్ని మార్చడం, విడాకులు తీసుకోవడం అనేవి ఇటువంటి మార్పులకు దారితీస్తాయి. అలాగే వ్యక్తి నిర్వహిస్తున్న పాత్రను కోల్పోయే సందర్భాలు కూడా ఉంటాయి. ఉదాహరణకు ఒక ఉద్యోగి పదవీవిరమణలో అధికారం కోల్పోవడం, యూనియన్ సభ్యత్వం, గతంలోని ఉద్యోగానికి సంబంధించిన అన్ని సంస్థలలో సభ్యత్వం కోల్పోవడం. ఈ స్థితినే గాఫ్‌మన్ (erving goffman -1952) ఒక వ్యక్తి తన ఒకానొక సామాజిక జీవితానిన కోల్పోవడంగా అభివర్ణించాడు.

సమాజంలో ఒక కాలంలో ఉన్నపారతలు, వాటి తాలూకు విలువలు మరో కాలంలో ఉండక మార్పులకు లోనవుతూ ఉండటం సహజం. ఒకానొక సమాజంలో ఒకానొక కాలంలో ఉన్న ఆచారాలు, వ్యక్తుల ప్రవర్తన తరవాతి కాలంలో ఆమోదయోగ్యం కాకపోవచ్చు. తరాల అతరం అన్ని సమాజాలలోనూ కనిపిస్తుంది. భారతీయ సమాజానికి సంబంధిచి స్త్రీ పాత్రలో స్పష్టమై మార్పు కనిపిస్తుఉంది. స్త్రీ కేవలం గృహిణిగానే ఉంటూ ఉన్న పాత కాలానికే ఆధునిక స్త్రీ నిర్వహించే పాత్రలు - ఉద్యోగినిగా, సంఘసేవకురాలిగా, రాజకీయ నాయకురాలిగా,



BRAOU

పారిశ్రామిక వేత్తలుగా, వైమానికులుగా, సైనికులుగా, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఫ్యాషన్ నిపుణులుగా, డిజైనర్లుగా అనేక ఇతర రంగాలలో పురుషులతో పాటు - అనేకం ఉన్నాయి.

వివిధ సంస్కృతులలో ఒకే పాత్రకు భిన్నమైన ప్రవర్తనారీతులను చూడవచ్చు. పాశ్చాత్య సమాజ సంస్కృతులలో స్త్రీ పురుషుల ప్రవర్తనలలో తేడాలు కనిపిస్తాయి. ఉదాహరణకు భారతీయ సమాజంలో బహిరంగంగా ఆలింగనం, చుంబనం గర్హనీయమైనవి కాగా పాశ్చాత్య సమాజాలల్లో అవే ఆమోదయం పొందిన అతి సామాన్యమైన ప్రవర్తనారీతులుగా ఉన్నాయి. దేశకాల పరిస్థితులను బట్టి సామాజిక విలువలు, దృక్పథాలలో అనేక మార్పులు వస్తుండటం గుర్తించవచ్చు. వీటిననుసరించే సామాజికుల పాత్ర పోషణలో కూడా మార్పులు చోటుచేసుకుంటూన్నాయి. ఏవిలువా త్రికాల బాధితం కాదు. కాల ప్రవాహంతోపాటు సమాజ నడతలో, నడకలో మార్పులు అతి సహజంగా ప్రవేశిస్తాయి.

## 6.5 పాత్ర సమితి

సామాజిక వ్యవస్థలో అనేక అంతస్తులుంటాయి. వివిధ అంతస్తులకు చెందిన సభ్యుల పాత్రలను గురించి రాబర్ట్.కె.మెర్టన్ (Robert, K. merton) పాత్ర సమితి అనే భావనను ప్రవేశపెట్టాడు. అతడిచ్చిన నిర్వచనాన్ని స్థూలంగా ఈ విధంగా చెప్పవచ్చు. 'ఒక వ్యక్తి ఒక అంతస్తులో ఉండి దానికి అనుబంధంగా ఉన్న పాత్రలను నిర్వహిస్తున్న సందర్భంలో ఇతర పాత్రలు నిర్వహించే వారితో ఏర్పరచుకొనే మొత్తం సంబంధాలనే పాత్ర సమితిగా' చెప్పవచ్చు. పాత్ర సమితి అనేది వ్యక్తి ఇతర అంతస్తులోని పాత్రలు నిర్వహించే వారితో జరిపే పరస్పర చర్యలను తెలియజేస్తుంది. ఉదాహరణకు ఒక యూనివర్శిటీ ప్రొఫెసర్ నిర్వహించే వివిధ రకాల పాత్రలలో అధ్యాపకుడు, పరిశోధకుడు, విద్యార్థుల సలహాదారు, పరిశ్రమల సలహాదారు, ప్రభుత్వ సలహాదారు, రచయిత లాంటి అనేక విభిన్న పాత్రలను పోషించవలసి ఉండటం అందరి అనుభవంలోని విషయమే. ఇలా ఒక అంతస్తుకు చెందిన వ్యక్తి నిర్వహించంప విభిన్న పాత్రలలో అతివ్యాప్తి (overlaping) కనిపించినప్పటికీ భిన్న అంతస్తులకు చెందిన వ్యక్తులు తరచూ కలుసుకోవడం వల్ల, వారి మధ్య పరస్పర చర్య నెలకొనడం వల్ల సామాజిక సమైక్యతకు ఊతం లభిస్తుంది. సామాజిక సంఘటితత్వం వ్యక్తి శ్రేయోభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుంది.

ఒక వ్యక్తి మొత్తం సమాజంలోనే కాక పరిమిత పరిధి ఉన్న కుటుంబంలో కూడా వివిధ పాత్రలు పోషించవలసి ఉంటుంది. కుటుంబ పెద్దగా, తండ్రి, భర్తగా ఒకే వ్యక్తి ఇన్ని పాత్రలు నిర్వహిస్తున్నా వాటిని చక్కగా సమన్వయించి కుటుంబ సంక్షేమమనే అంతిమ లక్ష్యంతో వ్యవహరిస్తాడు. అలాగే ఒక సమాజంలోని విభిన్న పాత్రలు నిర్వహించే వ్యక్తుల సంఘటిత కృషి ఫలితంగానే సామాజిక స్థిరత వ్యక్తి పురోగతి సాధ్యమవుతుంటాయి. విభిన్న పాత్రల మధ్య సమన్వయంలోపించినప్పుడు సమాజం అవ్యవస్థ పాలవుతుంది. ఇది వ్యక్తి శ్రేయస్సుకు భంగకరంగా పరిణమిస్తుంది.

ఒక అంతస్తుకు అనుబంధంగా అనేక పాత్రలుంటాయని ఇదివరకే తెలుసుకొన్నారు. వ్యక్తి నిర్వహించే విభిన్న పాత్రల చిత్రణ కింది విధంగా ఉంటుంది.




BRAOU

సమాజంలోని వ్యక్తులు రకరకాల పాత్రలు నిర్వహించవలసి రావడం సహజమని మనకు తెలుసు. వివిధ పాత్రల నిర్వహణలో ఒక వ్యక్తికి ఎదురయ్యే అనేక ఇబ్బందులు, కలిగే అసంతృప్తినే ఆ వ్యక్తి నిర్వహించే పాత్ర ప్రయాస (role strain) లేదా క్లేశంగా విలియమ్ జె. గుడ్ (William, J.Goode)నిర్వచించాడు. వివిధ పాత్రలు పోషిస్తున్నప్పుడు వ్యక్తులు అనుభవించే మనఃక్లేశానికి సంబంధించి ఎఫ్.ఇవాన్ నై (F.Ivanye) 1976లో కొన్ని అమెరికన్ కుటుంబాలను లోతుగా పరిశీలించాడు. ఒక జంట నిర్వహించవలసిన వివిధ పాత్రలకు సంబంధించి వారి మనోభిప్రాయాలను తెలుసుకోవడానికి ప్రయత్నించడంద్వారా మనఃక్లేశ తీవ్రతను అంచనా వేయడానికి ప్రయత్నించాడు. ముఖ్యంగా వృత్తిపరమైన పాత్ర నిర్వహించడం, చిన్నపిల్లలకు చదువుచెప్పడం, పసిపిల్లల సంరక్షణ, భాగస్వామి అవసరాలను తీర్చడం, ఇంటిపనులలో సహాయపడడం వంటి అంశాల విషయంలో కుటుంబాలనుంచి సమాచారం సేకరించి క్లేశ నివారణ లేదా ఉపశమనం అనేవి కేవలం వ్యక్తిగతమైనవని తెల్పాడు. కొన్ని కొన్ని సందర్భాలలో తన పాత్ర నిర్వహణ పట్ల ఏర్పడిన లోటుపాట్లను సరిదిద్దుకోవడం నిపుణుల సలహా సంప్రదింపులను ఒక మార్గంగా ఎంచుకొంటారు. ఒక వ్యక్తి నూతన పాత్రను స్వీకరించవలసి వచ్చినప్పుడు ప్రారంభంలో కొంత ప్రయాసకు గురిఅయినప్పటికీ క్రమంగా తన పాత్రను సంతృప్తి కరంగా నిర్వహించే సామర్థ్యం సంపాదించి సంపూర్ణ సంతృప్తి పొందుతాడు. ఒక పాత్ర తాలూకు సమర్థ నిర్వహణలోని మెలుకువలను తెలుసుకోవడంలో తరతమ బేధాలుండవచ్చునే కానీ అసాధ్యం మాత్రం కాదు. సంపూర్ణ సంతృప్తి పొందడానికి పట్టే సమయంలో వివిధ ఇతర పాత్రలు నిర్వహించడంలో కృతకృత్యులు కాలేకపోయినప్పుడు వ్యక్తి మానసిక సంఘర్షణకు గురికావలసి ఉంటుంది. దీనినే సమాజ శాస్త్రవేత్తలు పాత్ర సంఘర్షణ అంటారు. పాత్ర సంఘర్షణ గురించి ఇప్పుడు కొంత వివరంగా చర్చిద్దాం.

## 6.6 పాత్ర సంఘర్షణ

ప్రతి సామాజికుడు తన అంతస్తును బట్టి అనేక పాత్రలను పోషిస్తూ ఉంటాడని తెలుసుకున్నాం. ఒక పాత్రకంటే ఎక్కువ పాత్రలను నిర్వహిస్తున్నప్పుడు ఆయా పాత్రల నిర్వహణలో తరతమ బేధాలు ఏర్పడి కొంత సంఘర్షణ చోటుచేసుకుంటూ ఉండటం సర్వసాధారణ విషయం. ఇలాంటి సంఘర్షణనే పాత్ర సంఘర్షణ (role conflict)గా భావించవచ్చు. ఆయా పాత్రలు నిర్వహించడంలో సమతూకంలో తేడా వచ్చినప్పుడు పాత్ర సంఘర్షణ ఏర్పడుతుందన్నమాట. జి.హెచ్.మీడ్(G.H.Mead), ఆర్.లింటన్(R.Linton), ఇ.గాఫ్‌మాన్‌లు పాత్ర సంఘర్షణ గురించి వారి వారి సిద్ధాంతాలను ప్రతిపాదించారు. వివిధ స్థాయిలలోని సామాజికులు కొన్ని హక్కులతో బాధ్యతలతో కూడిఉన్న అంతస్తులలో ఉంటారు. సామాజిక వ్యవస్థ సజావుగా పనిచేయడానికి పాత్రల పంపకం, నిర్వహణలు రెండూ ముఖ్యమే. ఆదిమ, ఫ్యూడల్ సమాజాలలోకంటే ఆధునిక సమాజాలలో పాత్రల మధ్య సంఘర్షణ అనివార్యము, అధికము అయి ఉంటుంది. స్వకీయ నిర్వచనం ఆధారంగా ఏర్పరచుకొన్న పాత్రకు వాస్తవంగా నిర్వహిస్తున్న పాత్రకు మధ్య పొందిక లేనప్పుడు వివిధ సందర్భాలలో నిర్వహించే పాత్రలు పరస్పర విరుద్ధమైనప్పుడు పాత్ర సంఘర్షణ సహజంగా తలెత్తుతుంది. పాత్ర సంఘర్షణ గురించి సవివరమైన చర్చ కాంప్‌బెల్, పెట్టిగ్రూల రచనలలో చూడవచ్చు.

సమాజంలోని వ్యక్తి తన అంతస్తునుబట్టి విభిన్న పాత్రలు నిర్వహిస్తుంటాడు. ఇలాంటి సందర్భంలో ఆయా పాత్రల మధ్య సంఘర్షణ చోటు చేసుకొంటూ ఉంటుంది. అంటే సంఘర్షణ అనేది ఆయా పాత్రల అంతర్గత సమస్య అన్నమాట. దీనిని వ్యక్తే నివారించడమో, ప్రభావ తీవ్రతను తగ్గించడమో చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని కొన్ని సందర్భాలలో వ్యక్తి తాలూకు సామాజిక వ్యవస్థ వివిధ అంతస్తులకు నిర్దేశించిన పాత్రల బాధ్యతలవల్ల కూడా సంఘర్షణలు ఏర్పడుతూ ఉంటాయని కాంప్‌బెల్, పెట్టిగ్రూల అభిప్రాయం. వీరు వ్యాపార రంగంలో ఉన్న వ్యక్తులలో కనిపించే పాత్ర సంఘర్షణలను అధ్యయనం చేశారు.

పాత్రల సంఘర్షణ వివిధ రూపాలలో ఉండవచ్చు. పాత్ర సంఘర్షణలను ఇంటర్ - సెండర్ సంఘర్షణ అని, ఇంట్రా - సెండర్ సంఘర్షణ అని, ఇంటర్ -రోల్ సంఘర్షణ అని వర్గీకరించారు. ఒక ఫ్యాక్టరీలోని ఫోర్‌మన్ పాత్రను ఉదాహరణగా తీసుకొని పై మూడురకాల సంఘర్షణలను వివరించారు.

BRAOU

ఇంటర్-సెంటర్ సంఘర్షణ: ఫోర్‌మన్ అటు సూపర్‌వైజర్లకు, ఇటు కార్మికులకు మధ్య బాధ్యతలు నిర్వహించే వ్యక్తి కంపెనీ నిబంధనల ప్రకారం కార్మికులు పనిచేసే ఉత్పత్తి స్థాయిని పెంచేట్లు చూడమని ఫోర్‌మన్‌కు ఆదేశాలు పైఅధికారులనుంచి అందుతాయి. కానీ కార్మికులు పర్యవేక్షణ తీవ్రతనుతగ్గించాలని, లేదా ఉత్పత్తి స్థాయి పెరగదని ఫోర్మన్‌ను హెచ్చరిస్తారు. ఈ విధంగా ఫోర్మన్‌కు రెండు పరస్పర విరుద్ధమైన సందేశాలు అందుతుంటాయి. దీనివల్ల ఫోర్‌మన్ పాత్ర సంఘర్షణకు గురి అవుతుంది. ఇలాంటి సంఘర్షణలనే ఇంటర్ - సెండర్స్ సంఘర్షణ అంటారు. ఈ సమస్య లాంటిదే ఇంట్రా - సెండర్ సంఘర్షణకూడా.

ఇంట్రా -సెండర్ సంఘర్షణ: ఒక ఫ్యాక్టరీ సూపర్ వైజర్ కంపెనీ నియమనిబంధనలకు విరుద్ధంగా పనిచేయమని ఆదేశిస్తూనే నిబంధనలను పాటించమని ఫోర్‌మన్‌కు గుర్తు చేయవచ్చు. ఈ పరిస్థితులలో ఉత్పన్నమయ్యే సంఘర్షనే ఇంట్రాసెండర్ సంఘర్షణ.

ఇంటర్ -రోల్ సంఘర్షణ: ఫోర్‌మన్‌కు ఎదురయ్యే మరో సమస్య ఇది. ఫోర్‌మన్ నిర్వహిస్తున్న విభిన్న పాత్రల మధ్య ఏర్పడే సంఘర్షణ ఈకోవకు చెందినదే. ఉదాహరణకు ఫోర్మన్ ఓవర్‌టైమ్ పనిచేయడం వల్ల భర్తగా, తండ్రిగా నిర్వహించవలసిన పాత్రలు కొంతవరకు నిర్లక్ష్యం చేయవలసి రావచ్చు.

పైన పేర్కొన్న మూడు తరహాల సంఘర్షణలే కాక విలువల మధ్యకూడా సంఘర్షణ ఏర్పడవచ్చు. పైన ఉదాహరణలే తీసుకుంటే ఫోర్‌మన్‌కు సమ్మె చేయడంపట్ల విముఖత ఉన్నతోటి కార్మికుల నిర్ణయానికి వ్యతిరేకంగా అతడు ప్రవర్తించలేడు. అలా ప్రవర్తిస్తే కార్మిక సంఘాల వెలివేతకు గురికావలసి వస్తుంది.

సమాజంలో కొన్ని పాత్రలు నిర్వహించడం సులభమయితే మరికొన్ని సంఘర్షణకు గురికావడం సులభం. ఈ అంశానికి సంబంధించి మిచిగన్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ రీసర్చ్‌కు చెందిన పరిశోధకుడు కోన్ (Kohn) కొన్ని పాత్రలు పేర్కొన్నాడు. కంపెనీకి దూరంగా పనిచేయవలసిన సేల్స్‌మెన్, ఇతరులు తమ పనికి సంబంధించి ఎంతో సంఘర్షణ ఎదుర్కోవలసి వస్తుంది. వారి పనితీరును కంపెనీలో పనిచేసే వారినుంచి, బయటివారినుంచి, విమర్శిస్తూ ఉంటారు. అట్లాగే మధ్యస్థాయి నిర్వహణ స్థానాలలో(middle management)ని వ్యక్తులు పై అధికారుల కింద ఉద్యోగుల ఒత్తిడులకు గురవుతూ ఉంటారు. సృజనాత్మకత ఉన్న వ్యక్తుల విషయంలో కూడా పాత్ర సంఘర్షణ సమస్య తలెత్తుతూ ఉంటుంది.

ప్రతీవ్యక్తి ఏదో ఒక సమయంలో పాత్ర సంఘర్షణను ఎదుర్కోవలసి వస్తుంది. యువకులు తమ తల్లిదండ్రుల ఆకాంక్షలకు తగినట్టుగా ప్రవర్తించడంలోనూ, సమవయస్కుల(peers) ఆమోదం పొందిన విధంగా ప్రవర్తించడంలోనూ సంఘర్షణకు గురిఅవుతూ ఉంటారు. అలాగే ఒక స్త్రీ తల్లిగా, భార్యగా, ఉద్యోగినిగా వివిధ పాత్రలు నిర్వహించవలసి వచ్చినప్పుడు సంఘర్షణ అనివార్యమవుతుంది. తల్లిగా పిల్లలపట్ల, వారి చదువు సంధ్యలపట్ల శ్రద్ధ చూపవలసి రావడం, భర్త అవసరాలకు అనుగుణంగా ప్రవర్తించవలసి రావడం, ఉద్యోగినిగా సామర్థ్యంతో పనిచేయవలసి రావడం ఇవన్నీ పాత్ర సంఘర్షణకు దారితీస్తాయి.

పాత్ర సంఘర్షణ అనివార్యం అయినా దానిని అధిగమించడం అంత సులభం కాదు. అయితే సంఘర్షణ తీవ్రతను కొంతలో కొంత తగ్గించడం సాధ్యమవుతుంది. శాస్త్రవేత్తల ప్రకారం సంఘర్షణ ఉపశమనానికి స్థూలంగా మూడు మార్గాలున్నాయి. అవి 1. తప్పించుకోవడానికి ప్రయత్నించడం (avoid), 2. రాజీపడడం (compromise), 3. యుక్తి, యుక్తత (rationalise). ఒక వ్యక్తి శాంతియుత జీవితం గడపదలచుకున్నప్పుడు యుద్ధరంగంలో పోరాడవలసిన సైనిక పదవులకు దూరంగా ఉంటాడు. దీనివల్ల అతని విలువలకు, వృత్తిపరమైన బాధ్యతల మధ్య సంఘర్షణకు తప్పించుకోవచ్చు. పాత్ర సంఘర్షణ నివారణలో మరోమార్గం రాజీ పడటం. తండ్రిగా, కుటుంబ పోషకుడిగా బాధ్యతలు నిర్వహించే వ్యక్తి పరిస్థితులకు అనుకూలంగా రాజీపడి సంఘర్షణను కొంతవరకు తగ్గించడానికి ప్రయత్నిస్తాడు. ఈవిధమైన సర్దుబాటు అసంతృప్తికి మూలం కావడమేకాక రెండు బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తున్నాడనే అపరాధభావం కలుగుతుంది. సంఘర్షణ నివారణోపాయాలలో మరో ముఖ్యమైన మార్గం యుక్తియుక్తత. పర్యావరణ కాలుష్యాన్ని వ్యతిరేకించే వ్యక్తి పర్యావరణ కాలుష్యానికి తోడ్పడే పరిశ్రమలో పనిచేయడాన్ని ఒక ఉదాహరణగా చూపవచ్చు. పర్యావరణ కాలుష్యానికి వ్యతిరేకంగా తాను పనిచేస్తున్న పరిశ్రమను విమర్శించినంత మాత్రన పరిస్థితిలో చెప్పుకోదగ్గ మార్పు రాకపోగా పరిశ్రమలో తన ఉనికికే ప్రమాదం ఏర్పడే



BRAOU

పరిస్థితి ఎదురవుతుందని గ్రహించి కేవలం ఒక వ్యక్తి అభిప్రాయాలవల్లే మార్పులు రావని ఏరకమైన చర్యకు పూనుకోకపోవచ్చు.

సమాజంలోని వ్యక్తులు విభిన్నమైన పాత్రలు నిర్వహించడం ఎంత తప్పనిసరో పాత్రల మధ్య సంఘర్షణకూడా అంతే తప్పనిసరి, అనివార్యం కూడా. అయినా సంఘర్షణ తీవ్రతను తగ్గించడానికి కొన్ని ఉపాయాలుకూడా లేకపోలేదు. పాత్ర నిర్వహణ లక్ష్యం సామాజిక స్థిరతగా ఉన్నంతవరకు సామాజికులు తాము నిర్వహించే పాత్రలలో ఆటుపోట్లను ఎదుర్కొని, సమర్థంగా ముందుకు సాగాలి.

## 6.7 సారాంశం

సమాజ నిర్మితి ఆధారభూతంగా ఉండే అంశాలు అంతస్తు, పాత్రలే. అంతస్తు, పాత్ర అనేవి ఒకే నాణేనికి ఉన్న ముఖాల వంటివి. అవి ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. అంతస్తు సమాజంలోని ఒకానొక స్థానాన్ని సూచిస్తే పాత్ర ఆ అంతస్తు తాలూకు విధులను, బాధ్యతలను, గౌరవ మర్యాదలను సూచిస్తుంది. మొత్తంమీద ఈ రెండు అంశాలు సమాజంలో సుస్థిరతకు దోహదం చేస్తూ ఉంటాయి. వీటి కారణంగానే సమాజంలో ఒకానొక సందర్భంలో ఒకానొక పాత్రలో ఏ వ్యక్తి అయినా ఒకే విధంగా ప్రవర్తిస్తూ ఉంటాడు.

సామాజిక అంతస్తులు రెండు రకాలు. 1. ఆపాదించిన అంతస్తు, 2. సాధించిన అంతస్తు. ఆపాదిత అంతస్తులు సాధారణంగా సంప్రదాయ సమాజాలలో దర్శనమిస్తాయి. ఇటువంటి అంతస్తులే అలాంటి సమాజాలలో ప్రాముఖ్యత వహిస్తాయి. సాధించిన అంతస్తులు ఆధునిక సమాజాల ప్రముఖ లక్షణం. ఆధునిక సమాజం శక్తి సామర్థ్యాలనుబట్టి, అర్హతలనుబట్టి వ్యక్తులు అంతస్తులను ఆక్రమించే అవకాశం కల్పిస్తుంది.

దేశకాల పరిస్థితులను బట్టి సామాజిక విలువలు దృక్పథాలలో మార్పులు వస్తుంటాయి. ఆమార్పులను అనుసరించి పాత్ర పోషణలోకూడా మార్పులు చోటుచేసుకుంటూ ఉంటాయి. ఒక వ్యక్తి అనేక పాత్రలను పోషించడం సర్వసాధారణం. ఒక వ్యక్తి పోషించే అనేకానే పాత్రల సమూహాన్నే పాత్ర సమితి అంటారు. ఈ పాత్ర సమితిలోని పాత్రల మధ్య పొంతన కుదరనప్పుడు పాత్ర సంఘర్షణ ఏర్పడుతుంది. ఇలాంటి పాత్ర సంఘర్షణ కొన్ని వర్గాలకు చెందిన వ్యక్తులలో అత్యధికంగా ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే ఆ సంఘర్షణను అధిగమించే మార్గాలులేకపోలేదు. ఆ మార్గాలను అనుసరించడంద్వారా పాత్ర సంఘర్షణ తీవ్రతను తగ్గించవచ్చునని శాస్త్రవేత్తల అభిప్రాయం.

BRAOU

## 6.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి

1. అంతస్తును నిర్వచించి, అంతస్తు తాలూకు ప్రకార్యా ప్రాధాన్యాన్ని వివరించండి.

2. అంతస్తులోని రకాలను తులనాత్మకంగా పరిశీలించండి.

II. కింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. పాత్ర సంఘర్షణ అంటే ఏమిటి.

2. అంతస్తు రకాలను తెలియజేయండి.

## 6.9 చదవదగిన పుస్తకాలు

William F. Kenkel : Society in Action, Introduction to Sociology, Harper & Row, Publishers, New York, 1980.

Thomas J. Sullivan &
Kendrick S. Thampson : sociology - Concepts, Issues and Applications, John Wiley & Sons, New York, 1984.

Ritchie P. Lowry &
Robert P. Ramkin : Sociology, The Science of Society, Charles Scribner's Sons, New York, 1969.

BRAOU

BRAOU

# ఖండం- III

## మౌలికాంశాలు

సమాజాన్ని రూపుదిద్దడంలో అనేక అంశాలు కీలకపాత్ర పోషిస్తాయి. ఏ సమాజ స్వరూపమైనా ఆ సమాజంలో ఇమిడి ఉన్న మౌలికాంశాలను బట్టే వుంటుంది. సమాజానికి మూలస్థంభమైన వ్యక్తి, అతన్ని ఆవరించి ఉన్న పరిసరాలు, పరిస్థితులు, అతని జీవనశైలి, వ్యక్తిత్వం, మూర్తిమత్వం సంస్కృతి ఇవన్నీ అతన్నేకాక అతని చుట్టూ వున్న సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుంటాయి.

ఈ ప్రభావాలు పరస్పరం వ్యక్తిని- సమాజాన్ని- సంస్కృతిని ఎలా ప్రభావితం చేస్తాయి. వీటి మనుగడ అవిచ్ఛిన్నంగా ఎలా సాగుతోంది అనే అంశాలను ఈ ఖండం వివరిస్తుంది.

ఇందులో నాలుగు ప్రధాన అంశాలున్నాయి. అవి:

- సమాజం
- అనువంశికత, పరిసరం
- సంస్కృతి
- సంస్కృతి: మూర్తిమత్వం

B R A O U

Dr. BRAOU LIBRARY Acc. No: 115073
Class No. 301 SAM

BRAOU

# భాగం-7: వ్యక్తి సమాజం

విషయక్రమం


7.0 ఉద్దేశాలు
7.1 పరిచయం
7.2 సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలు
7.3 జైవిక నమూనా సిద్ధాంతాలు
7.4 వ్యక్తి, సమాజాల మధ్య సామరస్యం
7.5 సారాంశం
7.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
7.7 చదవదగిన పుస్తకాలు


## 7.0. ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు కింది అంశాలను గురించి తెలుసుకుంటారు.

- వ్యక్తి, సమాజాల మధ్య సంబంధం ఎటువంటిది?
- వ్యక్తికి, సమాజానికి ఉన్న సంబంధానికి సంబంధించిన సిద్ధాంతాలు
- వ్యక్తి, సమాజాల మధ్య సామరస్యం, దాని ఆవశ్యకత

## 7.1 పరిచయం

ఈ భూతలంపై మానవుడెంత పురాతనమో మానవ సమాజం కూడా అంతే పురాతనం. మానవుడికి, సమాజానికీ ఉన్న సంబంధం విషయం శాస్త్రవేత్తల మధ్య వివాదగ్రస్తమైన అంశంగా ఎనాటి నుంచో కొనసాగుతోంది. ఒక వ్యక్తిని గురించి అధ్యయనం చేస్తున్నమంటే అవ్యక్తి సభ్యుడుగా ఉన్న సమాజాన్ని కూడా అధ్యయనం చేస్తున్నట్లే. అంటే మానవుడికి, అతడంటున్న సమాజానికి అతి సన్నిహితము, అభిన్నము అయిన సంబంధం ఉంటుందన్నమాట. ఈరెండు అంశాల మధ్య ఉన్న సంబంధానికి సంబంధించి సమాజ శాస్త్రవేత్తలు వివిధ సిద్ధాంతాలకు, ఆటమిజమ్, హోలిజమ్, ఆంగిక నమూనా సిద్ధాంతం. ఈసిద్ధాంతాలన్నింటి లక్ష్యం సమాజం, మానవుని మధ్య ఉన్న విడదీయలేని సంబంధాన్ని గురించి వివరించడమే. వ్యక్తి, సమాజం అనేవి భిన్న దృగ్విషయాలు కావు. అవి ఒకే దృగ్విషాయానికి సంబంధించిన సమగ్ర స్వరూపాన్ని సూచిస్తాయి.

మానవుడికున్న సామాజిక స్వభావమే అతని విశిష్ట లక్షణంగా సమాజ శాస్త్రవేత్తలు పేర్కొంటారు. సమాజ శాస్త్ర అధ్యయనంలో మనకు ఎదురు అయ్యే ముఖ్యమైన సమస్య మానవుడి సహవాస లక్షణం లేదా స్నేహశీలత(sociability) దీన్నే కొందరు సామాజికత(sociality)అని అంటారు. మానవుడిలో సామాజిక జీవితానికి అవ సరమైన శక్తి సామర్థ్యాలు అంతర్గతంగా ఉండటమే కాక వాటి అవసరం కూడా అంతర్‌నిహితమయ్యే ఉంటుంది. అయితే మనిషిని సామాజిక జీవి అని ఏఅర్థంలో వాడటం జరుగుతోంది సమాజం మనకు చెందిందనడంలో అర్థం ఏమిటి సమాజంపై వ్యక్తులు ఆధారపడటం ఎంత వరకు వాస్తవం అలాంటి ఆధారత(dependence) స్వభావమేమిటి సమాజంతో వక్తులకున్న సంబంధాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అన్వయించుకోవాలి ఇవన్ని మౌలికమైన ప్రశ్నలే. వీటికి సమాధానం దొరికితేగానీ వ్యక్తికి సమాజానికి ఉన్న విడదీయనంతటి దృఢమైన, ప్రగాఢమైన సంబంధాన్ని అర్థం చేసుకోవడం ,విడమరిచి చెప్పడం సాధ్యం కాదు. ఒక్కటి మాత్రం సత్యం. వ్యక్తి భావోద్వేగాలు, బుద్ధివికాసం ,పరిపక్వతలు, సుఖమయ జీవనాని కి అవసరమైన వస్తుసేవలను సమాజమనే వ్యవస్థ లేని పరిస్థితుల్లో సమకూర్చుకోవడాన్ని ఊహించడానికి కూడా సాధ్యం కాదు. సమాజశాస్త్రం పుట్టక ముందే పై ప్రశ్నలకు జవాబులు ఇవ్వడానికి మానవులు ప్రయత్నించారు. పాశ్చాత్య సామాజిక



BRAOU

ఆలోచనలలో రెండు విరుద్ధ సిద్ధాంతాలు రూపుదిద్దుకొన్నాయి. ఈ సిద్ధాంతాలు పాశ్చాత్య చింతనాపరులను ఎంతగానో ప్రభావితం చేశాయి, ఆలోచింపజేశాయి. ఆ సిద్ధాంతాలే "సామాజిక ఒడంబడిక సిద్ధాంతం" (social contract theory) "జైవిక సిద్ధాంతం" లేదా "ఆంగిక నమూనా సిద్ధాంతం" (organismic theory).

17వ శతాబ్దం, ఆతరువాత రెండు శతాబ్దాలలో ఐరోపాదేశాల తత్త్వవేత్తలు సమాజాన్ని గురించి చేసిన ఆలోచనల తటిలో హేతువాదం(rationalism), టోటెమిజమ్‌ల ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి. వీటి ప్రభావం దృష్ట్యానే మానవుడిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం జరిగింది. ఏ ఇతర వాస్తవంతో సంబంధంలేకుండా మానవుడిని ఒక అమూర్త భావనగా (abstract concept) భావవించినట్లు కనిపిస్తుంది. మానవుడి హేతువాదతత్వం, వ్యక్తిత్వాలను పరిగణలోకి తీసుకొన్నా అతని చుట్టూ ఉన్న సమాజాన్ని, అతడి అభివృద్ధికి కారణమైన సమాజాన్ని కూడా ప్రాధాన్యతగల అంశంగా పరిగణలోకి తీసుకొన్నా అతని చుట్టూ ఉన్న సమాజాన్ని, అతడి అభివృద్ధికి కారణమైన సమాజాన్ని కూడా ప్రాధాన్యతగల అంశంగా పరిగణించి సిద్ధాంతాల ప్రతిపాదనకు పూనుకొన్నారు. ఈ ఆలోచనాపరంపరకు ప్రతినిధులుగా పేర్కొదగ్గ వారిలో థామస్ హాబ్స్(Thomas Hobbes, 1588-1679), జాన్‌లాక్(John Locke, 1632-1704), జె.జె.రూసో(J.J.Rousseall, 1712-1778), వున్నారు. ఈ ముగ్గురూ సివిల్ సొసైటీ ఏర్పడకముందు మనుషులంతా సామాజిక పూర్వస్థితిలో (pre-social state) అంటే ప్రాకృతిక స్థితిలో (state of nature) ఉండేవారని, వారి మధ్య కుదిరిన ఒడంబడికలను అనుసరించే సమాజం ఏర్పడిందని ప్రతిపాదించారు. ఈ ముగ్గురి సిద్ధాంతాలను వివరంగా పరిశీలించడంతోపాటు ఆయా సిద్ధాంతాల గుణదోశాలను కొంత విపులంగా తెలుసుకుందాం.

## 7.2. సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలు

**హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం:** ప్రాకృతిక స్థితిలో మానవుడు తన చుట్టూ ఉన్నవారితో నిరంతర సంఘర్షణకు గురిఅయ్యేవాడు. తోటివారితో అతడు తోడేలంతటి క్రూరుడుగా ప్రవర్తించేవాడు. అతడు ఏకాకిగా ఉంటూ అసహ్యకరంగా, అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఇలాంటి అవాంఛనీయ పరిస్థితిలో బతుకుతున్న మానవుడు సుఖసంతోషాలు, శాంతి భద్రతలతో జీవితం గడపడానికి తోటివారితో ఒక ఒప్పందం చేసుకున్నాడు. ఈ ఒప్పందం ఫలితంగా ఏర్పడిన వ్యవస్థే సమాజం. అంటే భయం ఆధారంగానే సమాజ సృష్టి జరిగిందని అర్థం చేసుకోవాలి. ఈ ఒప్పందాన్ని అనుసరించి సార్వభౌమాధికారమున్న(sovereign), నిరపేక్షమైన రాజ్యం ఏర్పడింది. ఈ రాజ్యంలో ప్రజాభిప్రాయం ఒక ముఖ్యమైన అంతర్భాగం అయ్యింది. సార్వభౌమాధికారి చర్యలన్నింటికీ ప్రజాభిప్రాయమే ప్రాతిపధిక. ఇలా భావించడం వల్లనే హాబ్స్ ఇదివరకూ ప్రతిపాదించిన వ్యక్తివాదం స్థానంలో నిరపేక్షతావాదం వచ్చింది. నిజానికి క్రామ్‌వెల్ నియంతృత్వాన్ని సమర్థించడానికే హాబ్స్ 'లెవిథాన్' (1951), అనే మహా గ్రంథాన్ని రచించాడని చెప్పవచ్చు. తొలి మానవుడి గురించి హాబ్స్ ఆలోచనలకు భిన్నంగా లాక్ ఆలోచించినట్లు కనబడుతుంది. ఇప్పుడు లాక్ ప్రతిపాదించిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని తెలుసుకుందాం.

**జాన్‌లాక్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం (1632-1704):** ప్రాకృతిక స్థితిలోని మానవుడిని గురించిన హాబ్స్ భావించిన దానికి భిన్నంగా లాక్ ఆస్థితిలో మానవుడు సంపూర్ణ స్వేచ్ఛను - సామాజిక ఆంక్షలు, నిబంధనలు లేని స్థితి - అనుభవించేవాడని భావించాడు. అయితే తన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను నిరాఘాటంగా కొనసాగించడానికి, పరిరక్షించడానికి తోటివారితో ఒడంబడిక అధికారాలను హాబ్స్ భావించినట్లు రాజ్యానికి కాక సముదాయానికి ధారాదత్తం చేశాడు. ఈ అధికారం నిరపేక్షమైంది కాదు. జీవించే హక్కు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, ఆస్తిహక్కువంటివి మానవుడికి సొంతం. అంటే సమాజంలోని ప్రతి హక్కు రాజ్యం నుంచి వచ్చింది కాదు. సామాజిక ఒడంబడికను గురించి సిద్ధాంత ప్రతపాదన చేసిన మూడోవ్యక్తి జె.జె.రూసో.

రూసో ప్రతిపాదించిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతం: ప్రాకృతిక స్థితిలో మానవుడు ఒక ఉన్నత అనాగరికుడు (noble savage) అని శాంతియుత జీవనం గడుపుతూ ఉండేవాడని, నిరాడంబరుడని(un sophisticated) జె.జె.రూసో తన 'కాంట్రాక్ట్ సోషియల్' (contract social, 1762) లో వివరించాడు. కానీ జనాభా పెరుగుదలతో మనుషులు పరస్పరం కలహించుకోవడం మొదలైంది. ఈ పరిస్థితిలో తోటివారితో శాంతి ఒప్పందం చేసుకోవలసి వచ్చింది. ఈ ఒప్పందాన్ననుసరించి ఇతరులతో కలిసిమెలసి ఉండటానికి అంగీకరించినా తన వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు భంగం కలగనివ్వలేదు. ఈ ఒడంబడిక వల్ల జనేచ్ఛ (general will) అనేది ఉత్పన్నమవుతుంది.

ఈ జనేచ్ఛ సార్వభౌమాధికారం కలది. ఇందులో ప్రజల వైయుక్తిక ఇచ్ఛ (individual will) కూడా కలిసి ఉంటుంది. వ్యక్తి స్వాతంత్ర్యం ఏవిధంగానూ దెబ్బతినదు. జనేచ్ఛకే అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల, దానికి సర్వుల సమ్మతి ఉండటంవల్ల జనేచ్ఛకు, వైయుక్తిక ఇచ్ఛకు మధ్య సంఘర్షణకు తావుండదు. అయితే ఈ సిద్ధాంతం ప్రజాస్వామ్య స్వేచ్ఛావాదం (democratic liberation), నియంతృత్వ ఆదర్శవాదం (totalitarian idealism) వెలువడ్డాయి.

పైన వివరించిన మూడు సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలు కొంత విమర్శకు గురయ్యాయి. ముఖ్యంగా ప్రాకృతిక స్థితిలోని మనిషి మానవుడుగా ఎదగడం సమాజంలోనే సాధ్యమవుతుందని ఊహించడం సరిఅయినది కాదని విమర్శకుల వాదం. తమ ఆస్తిపాస్తులను, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పరిరక్షించుకోవడానికో లేదా ఇతర లక్ష్యాలు సాధించడానికో మానవుడు సామాజిక వ్యవస్థనొక దానిని ఏర్పరచుకొన్నాడు. కానీ ఇది సరిఅయిన వాదం కాదని విమర్శకుల అభిప్రాయం. ఎందుకంటే మనిషిని, సమాజాన్ని విడదీయడానికి వీలులేనటువంటివి. కారణం మానవ జాతి చరిత్ర అంతటిలోనూ ఈ రెండింటిలో ఏ ఒకదానికో ప్రాధాన్యం లేదు. అనేది విమర్శకుల వాదం. పై సిద్ధాంత కర్తలు ప్రతిపాదించినట్లు ప్రాకృతిక స్థితి అనేది ఏనాడూ లేదని, ఉంటే అవకాశాలుకూడా లేవనే వాదం ఒకటుంది. ఇన్ని విమర్శలున్నా వ్యక్తి సమాజాలకు సంబంధించి ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన ఘనత ఈ ముగ్గురికే దక్కుతుందనడంలో అతిశయోక్తిలేదు.

సమాజం, వ్యక్తి సంబంధాలకు సంబంధించి వెలువడిన సిద్ధాంతాల పరంపరలో మరో ముఖ్యమైన సిద్ధాంతం జైవిమ నమూనా సిద్ధాంతం.

## 7.3 జైవిక నమూనా సిద్ధాంతం

సమాజాన్ని ఒక జీవి(organism)తో తుల్యమైనదిగా భావించి సమాజానికి, వ్యక్తికి ఉన్న సంబంధాన్ని వివరించడం సమకాలీన రచనలలో కనిపిస్తుంది. ముఖ్యమంగా బ్లంట్ షెల్లీ, స్పెంగ్లర్, నొవికవ్, హెర్బర్ట్ స్పెన్సర్‌లు. వీరిలో హెర్బర్ట్ స్పెన్సర్ సామాజిక నిర్మితిని ఒక జంతుశరీర నిర్మితితో సరిపోల్చి, జంతు శరీరంలోని వివిధ అవయవాలు పనిచేసే తీరులోనే సామాజిక వ్యవస్థకూడా పనిచేస్తుందని ప్రతిపాదించాడు. దీనిని మరింత వివరిస్తూ జంతుజాలం పరిపక్వదశ చేరుకొన్నట్లుగానే సమాజంలో పారిశ్రామిక, వ్యవసాయిక వ్యవస్థలు పనిచేస్తుంటాయని, రక్తప్రసరణకు తోడ్పడే గుండె, సిరలు (arteries), ధమను(veins)లను పోలినవి మనము నిత్యం చూసే రవాణా వ్యవస్థలాంటివి. అట్లాగే నాడీ వ్యవస్థను ప్రభుత్వ యంత్రాంగంగా భావించాడు. అయితే ఈ రెండింటి మధ్య సామ్యాన్ని ఉపమ (పోలిక)గా తీసుకోవాలేగానీ అంతకుమించి కాదు.

ఈ సిద్ధాంతాన్నే కొందరు మరింత విస్తరించి సమాజంలోని వ్యక్తి శరీరంలోని కణాల వలె పనిచేస్తాడని, అంటే శరీరస్వస్థత కాపాడటమే కణాల ప్రధాన కర్తవ్యంగా అభివర్ణించారు. అంటే సమాజశ్రేయస్సు కోసమే వ్యక్తి పనిచేస్తాడుకానీ వ్యక్తిశ్రేయస్సు కోసం సమాజం పనిచేయదు అనే వాదాన్ని లేవనెత్తారు. ఈవాదం బలంతోనే ప్రపంచంలో తలెత్తిన నాజిజమ్, ఫాసిజమ్‌లను సమర్థించడానికి ప్రయత్నించారు. ఈ రకమైన సిద్ధాంత ప్రతిపాదన నియంతృత్వానికి బాసటగా నిలిచింది. సమాజమనే సమిష్టి వ్యవస్థను రక్షించడానికి వ్యక్తిని త్యాగం చేయడాన్నికూడా సమర్థించినట్లయింది. ఈ సిద్ధాంత ప్రతిపాదకులలో స్పెన్సర్ ముఖ్యుడని ఇదివరకే పేర్కొన్నాం. ఇతడు వ్యకి&త వాద వ్యవస్థను సమర్థించినవాడు. జైవిక సిద్ధాంతానికి, వ్యక్తి వాద సిద్ధాంతానికి పొసగదు. ఈ రెండింటిని సమన్వయపరచడానికి చేసే ప్రయత్నం వృథా ప్రయత్నమే అవుతుంది.

జైవిక సిద్ధాంతాలలో భాగంగా సమష్టి మేధస్సు సిద్ధాంతాలు (groupmind theories) కూడా 17వ శతాబ్దంలో వెలువడ్డాయి. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారిలో ఆధునిక ఆదర్శవాది అయిన హెగెల్, వాగ్నర్, ష్మోలర్, షెఫెల్‌లు, ఇంగ్లాండుకు చెందిన టి.హెచ్.గ్రీన్, ఎఫ్.హెచ్.బ్రాడ్లీ, బి. బొసాంకే, అమెరికాకు చెందిన జె.జాయిస్, ఆర్.డబ్ల్యూ.ఎమర్సన్‌లు. సమిష్టి మేధస్సు సిద్ధాంతం ప్రకారం సమాజం అనేది ఒక మేధస్సు. ఇందులోని సభ్యులందరికీ ఈ మేధస్సు సామాన్యంగా ఉంటుంది. అంటే సమాజాన్ని ఒక జీవితో పోల్చినట్లుగానే దానిని ఒక మేధస్సుతో పోల్చడం జరిగిందన్నమాట. సమాజం ఏదిశలో ఆలోచిస్తే వ్యక్తికూడా అదే దిశలో ఆలోచిస్తాడు. అని భావించడం జరిగిందన్నమాట. అందుకే దేశాలకు మానవరూపారోపణ జరిపి(personification) 'అమెరికా



BRAOU

పరిపక్వదశ చేరుకొంటోంది.', 'ఇంగ్లాండ్ వామపక్షం వైపు మొగ్గుతోంది' అనడం జరుగుతూ ఉంటుంది.

ఈ సిద్ధాతాలను ప్రతిపాదించిన వారు నాజిజమ్, ఫాసిజమ్‌లను సమర్థించేందుకే ప్రయత్నించారు. నాజీలు దేశాన్ని ఫాదర్‌లాండ్ అని అభివర్ణిస్తూ దేశం కోసమే వ్యక్తి తన జీవితాన్ని అంకితం చేయాలంటారు. ఇటువంటి అభిప్రాయాలను సిద్ధాంత ప్రతిపాదకులూ బలపరిచారు- Oswald Splender తన 'Decline of the West' లో ఈ వాదానికి విరుద్ధంగా తరవాతి కాలంలో ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రతిపాదించడం జరిగింది.

వ్యక్తుల స్వాతంత్ర్యాన్ని అణిచివేయడానికి ఈ సిద్ధాంతాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకొన్నారు. నియంతృత్వ సమాజాలలో దీనికి అధికార గుర్తింపు లభించిందని వీటిని తీవ్రంగా విమర్శించడం జరిగింది. ఈ సిద్ధాంతాలను అనుసరించి మానవ మేధస్సును సార్వజనీన మేధస్సు (general mind) లేదా జనేచ్ఛ భావం లేదా నిరపేక్షలతో సంలీనం చేయడం వల్ల మానవులకున్న స్వయంప్రతిపత్తిని కాలరాయడమనే వాదం బయలుదేరింది. దీనితో సాంఘిక శాస్త్రాలు, సమాజం మూలతత్వానికే విఘాతం కలిగినట్లు పరిగణించడం జరిగింది.

వ్యక్తి, సమాజాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాన్ని వివరించడానికి మేధావులు చేసిన ప్రయత్నాలు ఎన్నో విమర్శకులు ఎదురైనా సమాజ వికాస చరిత్రలో ఈ సిద్ధాంతాల ప్రతిపాదన తరువాత ప్రముఖంగా పేర్కొనదగిన మరో శాస్త్రీయ దృక్పథం ఆటమిజమ్(atomism), హోలిజమ్(holism)లు.

ఆటమిజమ్ అనేది వైయుక్తిక దృక్పథాన్ని వివరిస్తే హోలిజమ్ సమజ సమగ్ర రూపం దృష్ట్యా వివరించడానికి ప్రయత్నిస్తుంది. స్థూలంగా చూస్తే ఈ రెండూ పరస్పర సంబంధం కలిగినవేనని స్పష్టమవుతుంది. సోషియల్ ఆటమ్(social atom) సమాజంలోని అవిభాజ్య భాగం (indivisible part), సమాజం సజీవయూనిట్లు లేదా వ్యక్తుల సమ్మేళనమే. ఈ సమ్మేళనం వల్ల ప్రకృతి శాస్త్రాలలోని ఆటమ్‌ల మాదిరిగా కాక - రెండు అణువుల కలయిక జరిగినప్పుడు అవి వాటి ప్రత్యేక గుణాలను కోల్పోతాయి - సామాజికులు ఒక సమాజంలో సభ్యులై ఉండి కూడా వారి వైయుక్తిక లక్షణాలను కోల్పోవడం జరుగదు.

రెండు రకాల అణువుల వల్ల సమాజం కొనసాగుతూ ఉంటుంది. అవి మూర్త, అమూర్త అణువులు(concrete abstract automs) సమాజంలోని జీవులను మూర్త అణువులుగా గుర్తించడం జరిగింది. దీనిని బట్టి మానవుడు కేవలం వివిధ అంగాలున్న కాయమేకాక అతనిలో అర్థవంతమైన సంబంధాలు చోటుచేసుకొని ఉంటాయని నిపుణులు గుర్తించారు.

సామాజిక వ్యవస్థలో సజాతీయ(homogeneous), విషమజాతీయ (heterogeneous)లక్షణాలు రెండూ కనిపిస్తాయి. సామాజిక దృష్టితో పరిశీలించినప్పుడు సామాజిక యూనిట్ల మధ్య విషమజాతీయత అత్యంత ఆవశ్యకమవుతుంది. సామాజికుల ఆశ, ఆశయాలు, ఆలోచనాతీరులలో విభేదాలున్నందువల్లనే నాగరికత, సంస్కృతులు వెల్లివిరియడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. వివిధ సామాజిక యూనిట్ల మధ్య నూటికి నూరుపాళ్లు ఏకరూపత ఉన్నట్లయితే నాగరికత, సంస్కృతులలో మనకు కనిపిస్తున్నవైవిధ్యం, విశిష్టతలు ఉండేవి కావు. ఇలాంటి రెండు విరుద్ధ లక్షణాలవల్లనే సమాజంలో శ్రమ విభజన సాధ్యమైంది. ఒక్కమాటలో చెప్పాలంటే వివిధ రకాల అణువుల సంయోజనంతోనే సమాజం ఏర్పడింది. సమాజ నిర్మాణానికి వ్యక్తులు అవసరం. అట్లాగే వ్యక్తుల అస్తిత్వం సమాజంపై ఆధారపడి ఉంటుంది. దీనినిబట్టి చూస్తే వ్యక్తి, సమాజం పరస్పరం ఆధారపడి ఉంటుంది. దీనిని బట్టి చూస్తే వ్యక్తి సమాజం పరస్పరం ఆధారపడి ఉంటాయని ఒకదాని అస్తిత్వాన్ని మరొకటి నిర్ధారిస్తుందని అర్థమవుతుంది. ఇలాంటి సంబంధం వల్లనే మానవుణ్ణి సామాజిక జీవి అని అతనని వికాసం, పురోగతి సమాజంలేనిదే సాధ్యం కాదని చెప్పవచ్చు. వ్యక్తులు లేని సమాజంకానీ, సమాజంలో సభ్యుడుకాని, వ్యక్తికనీ ఉండటాన్ని ఊహించనుకూడా ఊహించలేము.

వ్యక్తి, సమాజాల మధ్యఉన్న సంబంధం గురించి వెలువడిన సిద్ధాంతాల వాస్తవిక ప్రయోజనాన్ని తెలియజేయడానికి శాస్త్రవేత్తలు కొన్ని నిజజీవితంలోని సంఘటనలను పేర్కొనడం జరిగింది. వాటిలో ముఖ్యమైనది కాస్పర్ హాజర్ ఉదంతం. రాజ్యాధిపతుల మూలంగా కాస్పర్ సమాజానికి దూరంగా, పశుపక్ష్యాదులమధ్య పదిహేడు సంవత్సరాల దీర్ఘకాలం జీవించవలసి వచ్చింది. అలాంటి వ్యక్తి 1828లో తొలిసారిగా న్యూరెమ్‌బర్గ్ నగరం ప్రవేశించినప్పుడు అతని ప్రవర్తన ఇతరులకు ఎంతో ఆశ్చర్యం కలిగించింది. అతనికి సరిగా నడవటం, మాట్లాడటం తెలియదు. కొన్ని అస్పష్టమైన మాటలను మాత్రమే పలకగలిగేవాడు.

B R A O U

జడపదార్థాలను సచేతనమైనవిగా భావించేవాడు. ఇతన్ని ఐదు సంవత్సరాల తర్వాత చంపివేశారు. తరువాత జరిపిన పోస్ట్ మార్టమ్‌లో అతని మెదడు పెరుగుదల ఉపసామాన్యం(subnormal)గా ఉన్నట్లు గుర్తించారు. సమాజానికి దూరంగా ఉంచడం అంటే మానవ స్వభావానికే దూరమైనట్లు భావించవచ్చునన్నమాట. సమాజంతో సంపర్కం కోల్పోయినందువల్లనే కాస్పర్ మానవ ప్రకృతిని అలవరుచుకోలేక పోయాడు. ఇటువంటి ఉదంతాలను అనువంశికత, పరిసరం అనే యూనిట్లో ప్రస్తావించడం జరిగింది.

## 7.4 వ్యక్తి, సమాజల మధ్య సామరస్యం

వ్యక్తి సమాజంలో సభ్యుడైనా తన వ్యక్తిత్వాన్ని- వ్యక్తిగత విశిష్ట లక్షణాలను -కోల్పోడు. ఆదిమ సమాజలలో వ్యక్తిత్వ వికాసం అంతగా జరగ లేదనేది అందరు సమాజశాస్త్రజ్ఞులు అంగీకరించిన విషయమే. దీనికి ప్రధాన కారణం కఠినమైన ఆచార వ్యవహారాలు, నిషిద్ధాలే. సంక్లిష్ట, అధునిక , సువ్యవస్థిత సమాజలలో వ్యక్తిత్వ అవసరం ఉండటమే కాక దానిని ప్రదర్శించడానికి అవకాశాలు కూడా మెండుగా ఉంటాయి. వ్యక్తిత్వ లక్షణాలకు ఒక వాగ్రూపం ఇవ్వడానికి భాష అనేది ఒక శక్తిమంతమైన సాధనంగా పనిచేస్తుంది. ఈభాష మూలంగానే వ్యక్తిత్వ వికాసం కూడా జరుగుతుంది. భాషకు తోడు సువ్యవస్థిత సమాజం అనేక ఇతర సాధనాలను కూడా సమకూరుస్తుంది. ఉదాహరణకు వివిధ రకాలైన సంపర్కాలు, వృత్తులు, ప్రయోజనాలు(interests) అవకాశాలు కల్పిస్తుంది. వీటి ద్వారా ఒక వ్యక్తి తాలూకు వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించడానికి వీలవుతుంది. ఈభావన ఆధారంగానే ప్రముఖ సమాజ శాస్త్రవేత్త దుర్‌ఖైమ్ తన రచన 'The Social Divisions of Labour' లో తన సిద్ధాంతాన్ని విపులీకరించాడు.

ఆదిమ సమాజలలో కనిపించే అతిసామాన్యమైన శ్రమ విభజన ఆయా సమాజలలోని బంధువర్గం, ప్రత్యేక ఆచార వ్యవహారాలు అనేవే సమాజం సుసంఘటితం కావడానికి తోడ్పడతాయని దుర్‌ఖైమ్ ప్రతిపాదించాడు. సంక్లిష్ట, సువ్యవస్థిత, అధునిక సమాజాలలో సూక్ష్మశ్రమ విభజజన కనిపిస్తుంది. సామాజిక వ్యవస్థ వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య ఉన్న ఏకరూపతపైనే కాక వాటి మధ్య ఉన్న విభేదాలపైన కూడా ఆధారపడి ఉంటుందని, ఈవిధమైన పరిస్థితులు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తాయని దుర్‌ఖైమ్ అభిప్రాయం. ఇతని అభిప్రాయాలనే అననేక ఇతర సమాజ శాస్త్రవేత్తలు బలపరిచారు. సామాజికుల మధ్య కేవలం సామ్యం ఒక్కటే ఉంటే, ఒకే రకమమైన ఆచారవ్యవహారాలనే అందరూ పాటిస్తూ వస్తే ప్రత్యేకీకరణ సాధ్యమయ్యేది కాదు. అంతేకాక సమాజాలలోని వైవిధ్యం వల్లనే నూతన నాగరిక సంస్కృతులు ఏర్పడటానికి అవకాశం ఉంది. విసుగు పుట్టించే ఏకరూపత, ప్రామాణీకరించిన సంకోచాలు(standardised inhibitions) అల్డస్ హక్స్‌లీ రచించిన (The Brane New World' లో మాదిరిగా సామాజిక దృశ్యం ఉండేది.

**పరిమితులు:** సమాజంలోని వివిధ వ్యక్తుల మధ్య సమూహాల మధ్య స్థూలంగా సామరస్యం నెలకొని ఉన్నా సంపూర్ణ సామరస్యం కష్ట సాధ్యమే అనాలి. వివిధ వ్యక్తులు, సమూభాల మధ్య ఆశ, ఆశాయాలు, ఆకాంక్షలను సంబంధించిన వైరుధ్యం సర్వ సాధారణంగా కనిపించే అంశం. చిన్న చిన్న సంఘర్షణలు, విషయయోజన (Maladjustment), స్పర్థ(competiotion), అసూయ, అణచివేత, దోపిడీ లాంటివి సమాజంలో అతి సామాన్యంగా కనిపించే అసామరస్య ధోరణులు. ఇలాంటి వాటిని ఎన్నింటినైనా పేర్కొనవచ్చు. ఇలాంటి అవగుణాల వల్ల సమాజం నిర్దేశించిన క్రమాన్ని అతిక్రమించడం నిరాకరించడం జరుగుతూ వ్యక్తులు, సమూహాలు, సమాజం మధ్య అశాంతి నెలకొని, సామాజిక క్రమం (social order) దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి.

సామాజిక సమైక్యత ఎప్పుడూ సంపూర్ణం కాదు , సమరసమైంది కాదు. నియంతృత్వ పాలనతో ముసోలిని, హిట్లర్ నియంతలు సామాజిక సమైక్యత సాధించామని ప్రకటించుకోవచ్చు కాని వీరి దుష్ట పాలన ఫలితంగా నాగరాక సమాజాలు తిరిగి అనాగరిక ,ఆదిమ సమాజాల స్థాయికి దిగజారే పరిస్థితులు ఆనాడు నెలకొన్నాయి. సామాజిక క్రమం తప్పి ఆటవిక పరిస్థితులు చోటు చేసుకొంటాయనే భయం సర్వత్రా కనిపించి ఇలాంటి సామాజిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించిన నూతన వ్యవస్థ నిర్మాణానికి ప్రపంచ ప్రజలు నడుంబిగించారు.

ఆధునిక సమాజంలో పెద్ద పెద్ద సంస్థలు, అనేక ఆర్థిక, రాజకీయ సంఘాలు నెలకొని ఉంటాయి. ఈసమాజంలో ప్రత్యేకీకరణ ప్రముఖ లక్షణంగా కనిపిస్తుంది. దీనివల్ల ఒక వ్యక్తి గానీ ఒక సమూహం గానీ పాలనా



BRAOU

యంత్రాంగంలో కేవలం ఒకానొక భాగంగానే మనగలుగుతాయి. ఒక యంత్రం సక్రమంగా పనిచేయటం ఎంతో అవసరము. సమాజం విషయంలో కూడా ఇది వాస్తవం. ఆధునిక, సంక్లిష్ట సమాజంలో వ్యక్తిత్వ ప్రదర్శనకు, సృజనాత్మక శక్తికి అనేక అవరోధాలు ఏర్పడతాయి. దీనికి ముఖ్యంగా అతి ప్రత్యేకీకరణే (overspecialization) కారణం. వ్యవస్థీకృతమైన ఈపరిమితులు వ్యక్తి వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తాయి. ఇది అనివార్యమైన పరిస్థితి. ఎలాంటి మార్పు లేని దినచర్య, వైవిధ్యరాహిత్యం, ప్రామాణీకరణ, లు ఆదిమ సమాజాల లక్షణాలుగా సమాజశాస్త్రవేత్తలు గుర్తించారు. ఈలక్షణాలే సంక్లిష్ట, ఆధునిక సమాజాలలో కూడా కనిపిస్తున్నాయని చెప్పక తప్పదు.

ఇంతవరకు చెప్పిన వ్యక్తి, సమాజాల మధ్య సంఘర్షణ, సామరస్యాలు ఉన్నా సమాజమంతా సంఘటితంగా కృషి చేస్తూ సమాజశ్రేయస్సును పరిక్షిస్తూ ముందుకు సాగుతూండటం గమనించవచ్చు. వ్యక్తి, సమాజాలు గాడి తప్పి ప్రవర్తించినప్పుడు సమాజపు బృహద్రూపమైన రాజ్యం జోక్యం చేసుకొని సర్దుబాటు చేసి సామరస్యం నెలకొల్పడానికి ప్రయత్నిస్తుంది.

ఇంతవరకూ జరిగిన చర్చఅంతా మానవుడి వ్యక్తిత్వానికి, సమాజానికి మధ్య ఉన్న సంబధాన్ని వివరించడం పైనే దృష్టి కేంద్రీకరించింది. ఈచర్చ సందర్భంలో వ్యక్తి వాదాన్ని గురించి ఎక్కడా ప్రస్తావించడం జరగలేదు. గత 3 శతాబ్దాల కాలంలో పాశ్చాత్య సమాజం నియంతృత్వ వ్యవస్థకు వ్యతిరేకంగాను వ్యక్తి వాదానికి అనుకూలంగాను అనేక మత, రాజకీయ, ఆర్థిక ఉద్యమాలు చవిచూసింది. ఈ ఉద్యమాలు వ్యక్తిత్వప్రాధాన్యతలని మరింత ఎక్కువ చేసి సామాజిక జీవితంలో వ్యక్తిత్వం అతి కీలకమైన అంశమని చాటాయి. ఈనాడు వ్యక్తివాదాన్ని శిరసబోధించేవారు వ్యక్తిత్వ వికాసానికి సమాజం ఏమేరకు దోహదం చేస్తుందో నే అంశాన్ని విస్మరిస్తున్నారు. వ్యక్తి విశృంఖల ప్రవర్తనకు పగ్గాలు వేయకపోతే సమాజం అస్థవ్యస్థమవుతుంది. ఈ పరిస్థితుల్లో సమాజమే కొన్ని మార్గాల ద్వారా వ్యక్తుల ప్రవర్తనను నియంత్రించి క్రమశిక్షణ పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది.

మానవుని ప్రవర్తనకు సంబంధించి సామాజిక నియంత్రణ నేది అతిపురాతనమైన సాధనం. ఆదిమసమాజాలలో కూడా సామాజిక సాంస్కృతిక ప్రవర్తనలకు నియంత్రణలు ఉండేవి. మానవుడిని వాతావరణం ఆవరించినట్లు మానవుని జీవితం కూడా పుట్టింది మొదలు గిట్టేవరకు అనేక నియంత్రణలకు లోబడే ప్రవర్తించాల్సి వస్తుంది. ప్లేటో రచనలలోనూ, కామ్టె పాజిటివ్ ఫిలాసఫీలోనూ సామజిక నియంత్రణ ప్రస్తావన కనిపిస్తుంది. సభ్యుల ప్రవర్తన ప్రమాణాలకనుగుణంగా ఉండేలా చేయడానికి సమాజం అనుసరించే వివిధ పద్ధతుల సమ్మేళనమే ఇది. సామాజిక సమాజం నియంత్రణ లక్ష్యం సమాజంలో నియమబద్ధత(conformity), ఏకీభావం(solidarity), అవిచ్ఛిన్నతలు ఏర్పడేట్లు చేయడమేనని కింబల్ యంగ్ అంటాడు. సామాజిక నియంత్రణ లేకుంటే సామజిక ఏకీభావం ఒక కలగా మిగిలిపోతుంది. సమాజంలోని వ్యక్తులందరి ఆలోచనాధోరణి, దృక్పథం, ఆశయాలు, ఆశలు ఒకే విధంగాఅ ఉండటం అసంభవం. మానవుడు స్వతహాగా స్వార్థపరుడు. సమాజం అందరి శ్రేయస్సుకోసం కృషి చేసే వ్యవస్థ. భిన్న దృక్పథాలు, ఆశయాలు, అభిరుచులు ఉన్న రకరకాల వ్యక్తుల ప్రవర్తన సామాజిక ప్రమాణాలకు అనుగుణంగా ఉండేట్లు సమాజం నియంత్రిస్తుంది. ఇలాంటి నియంత్రే లేకపోతే సామాజిక జీవితం అల్లకల్లోలం, ఆవేశకావేశాలకు నిలయమై సామాజిక వ్యవస్థ అతలాకుతలమై అగమ్య గోచర స్థితి ఏర్పడుతుంది. అతి సామాన్యమైన ఆదిమ సమాజాలలోనే విశృంఖల ప్రవర్తనను, సమాజానికి హాని కలిగించే ప్రవర్తనను అదుపుచేయడానికి మతం, ఆచారవ్యవహారాలు, సంప్రదాయ జీవన విధానంలాంటి నియమాలను సామాజికులు అనుసరించేట్లు చేయడం ద్వారా సమాజంలో ఏకత్వ భావం, సంప్రదాయాల కొనసాగింపు జరిగేది.

ఈ నాటి సంక్లిష్ట సమాజాలలో అవధులు లేని ఆశ, ఆకర్షణీయమైన జీవన విధానం కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి. ఇలాంటి పిరిస్థతుల్లో వ్యక్తుల ప్రవర్తనకు సంకెళ్లు వేయకపోతే విచ్చలవిడితనం ప్రకోపించి సమాజవినాశనానికి, దోపిడీ దౌర్జన్యాలకు, వైషమ్యాలకు నిలయమై మానవ జాతి మనుగడే సమస్యల వలయంలో చిక్కి అనైతిక, అక్రమమార్గాలకు పెద్ద పీట వేసినట్లవుతుంది. ఈ భయానక పరిస్థితులు తప్పించాలంటే సామాజిక నియంత్రణ ఆయుధాన్ని సంధించాల్సిన ఆవశ్యకత ఆనాటికంటే ఈనాడే అధికంగా ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ సమాజానికి అగ్రస్థానమిచ్చినా సామాజిక సమాజాల మధ్య సిరమైన సమన్వయం ఉన్నపుడే శాంతి సౌభాగ్యాలకు అనువైన వాతావరణం ఏర్పడుతుంది.

## 7.5 సారాంశం

మానవుడెంత పురాతనజీవో మానవుడు జీవిస్తున్న సమాజం కూడా అంతే పురాతమైనది. వ్యక్తి, సమాజం అనే రెండు అంశాలు అతి సన్నిహితమైన అభిన్న అంశాలు. ఈరెండు అంశాల మధ్య ఉన్న సంబంధాన్ని గురించి అనేక సాంఘిక శాస్త్రవేత్తలు సమాజ శాస్త్రవేత్తలు విభిన్న అభిప్రాయాలను వెలిబుచ్చారు. అయితే ఈ సందర్భంలో కొన్ని సిద్ధాంతాలను మాత్రం ఎన్నుకొని చర్చించడం జరిగింది. ఈ యూనిట్లో చర్చించిన సిద్ధాంతాలు స్థూలంగా రెండు రకాలు: 1. సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలు, 2. జైవిక నమూనా సిద్ధాంతాలు. ఇవి రెండూ వ్యక్తి, సమాజానికి మధ్య ఉన్న సంబంధాన్ని వివరించడానికి ప్రయత్నిస్తాయి.

వ్యక్తి, సమాజం అనే రెండు అంశాలు అభిన్నాలైనా వాటి విఅటి ప్రయోజనాల దృష్ట్యా చూస్తే మాత్రం వేరుగా కనబడతాయి. వ్యక్తి విశిష్ట లక్షణాలను ప్రదర్శించే అవకాశం సమాజంలో తక్కువగా ఉంటుంది. అలాగే సమాజం నిర్దేశించిన అన్ని ప్రవర్తనారీతులూ వ్యక్తికి అన్ని సమయాలలో అనుకూలంగా ఉండకపోవచ్చు. ఇటువంటి సందర్భంలో ఈ రెండు అంశాల మధ్య సామరస్యలోపం ఏర్పడవచ్చు. ఈ రెండింటి మధ్యా సమన్వయం కుదిరినప్పుడే వ్యక్తి, సమాజం రెండూ మనగలగడానికి వీలుకలుగుతుంది.

## 7.6. మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.**

1. సామాజిక ఒడంబడిక సిద్ధాంతాల గురించి ఒక వ్యాసం రాయండి.
2. జైవిక నమూనా అంటే ఏమిటి? ఈ సిద్ధాంతాలను గురించి స్థూలంగా వివరించండి.

**II. కింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. ఆటమిజమ్
2. హోలిజమ్

## 7.7 చదవదగిన పుస్తకాలు


1. R.M.Mac Iver & Charles H. Page :Society, an Introductory analysis. The Mac Millan Co. of India Ltd., Delhi, 1974.

2. S.J.Pascual Gisbert :Fundamentals of Sociology. Orient Longman, Mumbai, 1973.

3. విచలిత ప్రవర్తన : వి.లక్ష్మీదేవి, ఎ. ఉషా: తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2000.


BRAOU

# భాగం-8: అనువంశికత, పరిసరం

విషయక్రమం

8.0. ఉద్దేశాలు

8.1. పరిచయం

8.2 అనువంశికత - అర్థం

8.3 పరిసరం - అర్థం

8.4 అనువంశికత - పరిసరం: తులనాత్మక ప్రాధాన్యం

8.5 సారాంశం

8.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

8.7 చదవదగిన పుస్తకాలు

## 8.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు మీరు కింది విషయాలను అర్థం చేసుకోగలుగుతారు.

- అనువంశికత, మానవ ప్రవర్తనపై అనువంవికత ప్రభావం.
- పరిసరం - మానవ ప్రవర్తనను పరిసరం ఎలా ప్రభావితం చేస్తుంది.
- అనువంశికత, పరిసరాల తులనాత్మక ప్రాధాన్యం

BRAOU

## 8.1 పరిచయం

సామాజీకీకరణ ప్రక్రియలో అత్యంత కీలకమమైన పాత్ర వహించే అంశలు అనువంశికత, పరిసరాలు. వీటి తులనాత్మ ప్రాధాన్యాన్ని పరిశీలించే ముందు అనువంశికత, పరిసరాలను గురించి క్లుప్తంగానైనా తెలుసుకోవడం అవసరం. ఈ రెండు శక్తులూ మానవ ప్రవర్తన తీరు తెన్నులను ప్రభావితం చేస్తాయి. ఈ శక్తుల తులనాత్మక ప్రాధాన్యానికి సంబంధించి 'ప్రకృతి V/s ప్రకృతి'(nature versus nature)అనే చర్చ కొనసాగుతూనే ఉంది. వ్యక్తి అనువంశికత అవ్యక్తి ప్రవర్తనను నిర్ధారిస్తుందని, ఇది అనవ నియంత్రణకు అతీతమైందనీ, జన్మత: సిద్ధించేదని శాస్త్రజ్ఞుల ప్రతిపాదన. ఒక వ్యక్తి లక్షణాలు, శక్తి సామర్థ్యాలు, మూర్తిమత్వ లక్షణాలు, బుద్ధికుశలత, హార్మోన్ల స్థితివంటివి తల్లిదండ్రుల నుంచి సంక్రమించే లక్షణాలుగా భావిస్తారు. జైవికంగా సంక్రమించిన లక్షణాలతో పాటు మానవుడు తన పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తనను మలుచుకొంటూ ఉండటం సహజం. పరిపక్వత సాధించిన కొద్దీ, సామాజికులతో సంపర్కంవల్ల కూడా మానవ ప్రవర్తనలో మార్పులు చోటు చేసుకొంటాయి. జాన్‌లాక్ (John locke) అన్నట్లు జైవిక పరిమితులున్నా మానవుడి శక్తి సామర్థ్యాలు, ప్రవర్తనాతీరు పరిసరాలనుంచీ నేర్చుకోవడం వల్ల, సామజీకీకరణ ప్రక్రియ వల్ల మానవ ప్రకృతి (human nature)లో అనేక మార్పులు కలుగుతూ ఉంటాయి. ఇప్పుడు అనువంశికత, పరిసరాలను గురించి కొంత వివరంగా తెలుసుకుందాం.

## 8.2 అనువంశికత - అర్థం

అనువంశికత లేదా వారసత్వం జైవికమైంది కానీ, సాంస్కృతికమైందికానీ అవుతుంది. తల్లిదండ్రుల లైంగిక కణాలు ఫలదీకరణం చెంది శిశువు జన్మిడం ద్వారా తల్లిదండ్రుల గుణాలు, లక్షణాలు శిశువుకు సంక్రమించడం జైవిక వారసత్వం అవుతుంది. సాంస్కృతిక వారసత్వం అప్పటివరకూ సమకూర్చుకొన్న సాంస్కృతిక లక్షణాలను ఒక తరం నుంచి మరో తరానికి బోధించడం, నేర్చకోవడం ద్వారా సంక్రమించేది.

తల్లిదండ్రుల నుంచి సంక్రమించే జైవిక లక్షణాలను హెచ్.ఎస్.జెన్నింగ్స్ వివరంగా పేర్కొన్నారు: లింగం, కళ్లరంగు, వెంట్రుకల రంగు, శరీరఛాయ, కనుముక్కుతీరు, శరీరంపై రోమాల విస్తృతి, వేలిముద్రలు, అరచేయి, అరికాలి స్వరూపం, చేతుల కాళ్ల నిర్మాణం, శరీర ఆకారం (లావు, సన్నం, పొడవు, పొట్టి వంటి లక్షణాలు), రక్తం తాలూకు రసాయన ధర్మాలు, రక్తం గ్రూపు, గ్రంథుల స్థితి, ఇంద్రియజ్ఞానం, ఇంద్రియాల పనితీరు, మెదడు, దాని చురుకుదనం, శారీర దారుఢ్యం, దౌర్బల్యాలు, వివిధ రుగ్మతలను తట్టుకోగల శక్తి అటువంటి శక్తిలోపం, భౌతిక, శారీరక, ప్రత్యేక లక్షణాలు. ఈ లక్షణాలన్నీ జన్మతః మానవుడికి సంక్రమించేవే.

అనువంశిక లక్షణాల ప్రాధాన్యాన్ని గురించి ప్రముఖంగా ప్రచారం చేసిన వారిలో సామాజిక జైవిక శాస్త్రజ్ఞులు (sociobiologists) ముఖ్యులు. వీరి ప్రకారం మానవుల జన్యు నిర్మాణ క్రమం (genetic mackup) మానవ ప్రవర్తనపై అధికంగా ప్రభావం చూపుతుందని, దాని స్వరూప స్వభావాలను నిర్ణయిస్తుంది. సామాజిక జైవిక శాస్త్రం ప్రకారం జంతు ప్రవర్తనకు, మానవ ప్రవర్తనకు ఎంతో సామ్యం ఉంటుంది. పరహితత్వం (altruism) , త్యాగం, కలహశీలత (aggressiveness), ప్రాంతీయాభిమానం(territoriolity) వంటి లక్షణాలు ఇటు జంతువులలో, అటు మానవులలో కూడా కనిపిస్తాయి. పిల్లలను కాపాడుకోవడానికి తమ ప్రాణాలుసైతం ఒడ్డడానికి తల్లి దండ్రులు సిద్ధపడడం, తేనెపట్టును కాపాడటానికి తేనెటీగలు చేసే ప్రయత్నం విషయంలో మానవులకు, జంతువులకు మధ్య సామ్యం ఉందని వీరి ప్రతిపాదన.

అయితే సమాజశాస్త్రజ్ఞులలో చాలా మంది మాత్రం సామాజిక జైవిక వాదాన్ని అంగీకరించరు. సమాజశాస్త్రవేత్తల ప్రకారం జన్యువులకు, మానవ ప్రవర్తనకు నిర్దిష్టమైన సంబంధం ఉన్నట్టు ఖచ్చితమైన ఆధారాలు చూపలేమంటారు. అందువల్లనే పై వాదాన్ని తోసిపుచ్చి సామాజిక నిర్మితి, సామాజిక పరస్పర చర్యను అతర్థం చేసుకోవడం ద్వారావే మనావ ప్రవర్తనను వివరించవచ్చు అని ప్రతిపాదించారు. దీనికి ప్రధానమైన కారణం ఈ రెండింటి మధ్య సంబంధాన్ని ప్రత్యక్షంగా చూడటానికి వీలుండటమేనని వీరి అభిప్రాయం అంతేకాక మానవ లక్షణాలలో కొన్ని సార్వజనీనమైనవి(universal). ఉదాహరణకు పరహితత్వ లక్షణం వ్యక్తికి - వ్యక్తికి, సమాజానికి - సమాజానికి మధ్య మారుతూ ఉంటుంది. తేనె టీగలు తెనెపట్టును రక్షించుకునేందుకు చేసే ప్రయత్నం మానవుడు తాన సంతతిని కాపాడుకోవడానికి చేసే ప్రయత్నంలో ఎంతో తేడా కనిపిస్తుంది. మనిషి తన సంతతిని అలక్ష్యం చేయడం, సాధారణమై విషయంగా కనిపిస్తుంది. అట్లాగే శిశు హత్య కొన్ని తెగలలో - ముఖ్యంగా ప్రాచీన, గ్రీకు, చైనా దేశాలలో - సామాజిక ఆమోదం పొందిన ఆచారం. ప్రస్తుత కాలంలో భ్రూణహత్య(foeticide)అనేది సాధారణంగా కనిపించే విషయం.

BRAOU

## 8.2.1 పరిశోధనలు

అనువంశికత ప్రాధాన్యాన్ని తెలిపే పరిశోధన 1900 శతాబ్దం మొదటిలో అమెరికాలో జరిగింది. రెండు కుటుంబాల - ఎడ్వర్డ్లు, జ్యూక్‌లకు చెందిన సభ్యులపై ఈ పరిశోధన జరిగింది. ఎడ్వర్డ్ కుటుంబానికి చెందిన 1,394 సంతతిని గుర్తించి వారిలో 295మందికి పైగా పట్టభద్రులు ఉన్నారని, వారిలో 13 మంది కాలేజీ ప్రిన్సిపాల్లుగా పనిచేశారని, వారిలో ఒకరు అమెరికా దేశ ఉపాధ్యక్షుడు ఉన్నాడని గుర్తించారు. ఇంత మందిలోనూ నేరం చేసి పట్టుబడినవారు మాత్రం లేరు. ఇక జ్యూక్స్ విషయానికి వస్తే మొత్తం 1200 మందిని ఈ కుటుంబ సంతతిగా గుర్తించారు. గుర్తించిన వారిలో 440 మంది శారీరక లోపంతో, రుగ్మతలతో బాధపడుతున్నవారిగా గుర్తించారు. 310 మంది దరిద్రులుగానే, 130 మంది నేరస్థులు, 7 మంది హంతకులుగానూ మారారని వెల్లడైంది. 30 సంవత్సరాల తరవాత - అంటే 1915లో - 2,820 మందిని వీరి సంతతి పరిగా గుర్తించారు. వారలో 600 మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ పరిశోధన అనువంశికత పరిసరం కంటే ఎంతో శక్తిమంతమైనదో తెలియజేసింది. పై రెండు కుటుంబాల వారి ప్రవర్తనాతీరు కేవలం వారి అనువంశికత ఆధారంగా రూపుదిద్దుకొంది. కానీ పరిసర ప్రభావం వారిపై ఎంతమాత్రం లేదని శాస్త్రజ్ఞులు గట్టిగా వాదించారు.

జీవశాస్త్రంలోని అనువంశికత ప్రాముఖ్యం పెరిగిన తరువాత, ఉత్తమ సంతాన ప్రాప్తికారకాల(eugenics)కు సంబంధించిన శాస్త్రం విస్తరించడంతో మానవ ప్రవర్తనలో అనువంశికత పాత్ర సామాజిక సమస్యలకు సంబంధించి

అనువంశికత ప్రాముఖ్యత గురించి ప్రత్యేక అధ్యయనాలు ప్రారంభమయ్యాయి. డాక్టర్ గోరింగ్( Dr.Goring) తోపాటు మరికొందరు నేరశాస్త్రజ్ఞులు నేర స్వభావం వంశపారంపర్యంగా లభించిన లక్షణమని భావించారు. కొన్ని కుటుంబాలలో వ్యక్తుల జీవితాలను పరిశీలించి ఆ కుటుంబంలోని వారు వంశపారంపర్యంగా నేరస్తులుగా ఉంటూ వచ్చారని పేర్కొన్నారు. దీనికి చక్కటి ఉదాహరణ జూక్స్ కుటుంబ చరిత్ర. గోరింగ్ మాదిరి పరిశోధన చేసిన వారిలో లాంగ్(lange James)ఒకరు. ఇతడు 13 జతల పోలికలున్న కవలల(identical twins)ను, 17 జతల భ్రాతృకవలల(fraternal twins) ను పరిశీలించి 'నేరస్వభావం ఈనువంశిక లక్షణమని పేర్కొన్నాడు.

జైవిక లక్షణాలు అనువంశికమైనవని, ఇవే మానవ ప్రవర్త తీరుతెన్నును నిర్ధారిస్తాయని అనేక శాస్త్రజ్ఞులు నిశితమైన పరిశీలన ఆధారంగా వివిధ సిద్ధాంతాలను ప్రతిపాదించారు. వీరిలో ముఖ్యంగా పేర్కొదగినవారు లోంబ్రోసో (lombroso), క్రెష్మర్ (Keshmar), జైవిక సిద్ధాంతాన్ని రెండు ప్రధానాంశాల దృష్ట్యా వివరించవచ్చు. ఒకటి శరీరధర్మశాస్త్రం (physiology), రెండు మనో వైజ్ఞానిక లక్షణాలు (psychology traits)లోంబ్రోసో దృష్టిలో వ్యక్తులు కొన్ని శారీరక లక్షణాల కారణంగా నేరస్థులు అవుతారు. ఈ లక్షణాలలో ముఖ్యమైనవి చిన్న కపాలంలోనైన నుదురు (retreating forehead), ముందుకు పొడచుకొని ఉండే చెవులు, విపరీతమైన రోమాలు, చిన్న గడ్డం, సన్ననిపై పెదవి మొదలైనవి. అయితే లోంబ్రోసో ప్రతిపాదనను గోరింగ్, బోస్(Boas)లు 1912లో నిర్వహించిన పరిశోధనల తరువాత తిరస్కరించారు.

లోంబ్రోసో సిద్ధాంతం సిద్ధాంతం లాంటిదే క్రెష్మర్ సిద్ధాంతం కూడా. ఇతని ప్రకారం దేహనిర్మాణానికి, స్వభావానికి అవినాభావ సంబంధముంటుంది. 1. లంబకాయులు, 2. స్థూలకాయులు, 3. సౌష్టవకాయులు, 4. విషకాయులు అని నాలుగు రకాలుగా మానవులను వర్గీకరించి వారి శరీరనిర్మాణాన్ని అనుసరించి స్వభావాలు వేరువేరుగా ఉంటాయని తెలిపాడు. కానీ శరీర నిర్మాణలక్షణాలను బట్టి వ్యక్తుల స్వభావాలను అంచనావేయడం దాదాపు అసాధ్యమేనని పలువురి అభిప్రాయం

అనేక మంది సమాజశాస్త్రవేత్తలు జంతువులకున్న సహజాతాలు (instincts)మానవులలో కనిపించవనే అభిప్రాయంతో ఏకీభవిస్తారు. అయితే మానవులలో కూడా స్పష్టంగా కొన్ని జైవిక ఉత్సుకతలు (biological drives) - ఆకలి దప్పులు లాంటివి కనిపిస్తాయి. కానీ ఈ ఉత్సుకతలు జీవులన్నింటిలో కనిపించే సామాన్య లక్షణాలు. ఇవి ప్రవర్తనను ప్రేరేపించే సహజాతాలు. అయితే మానవ ప్రవర్తనతీరు ఫలానా విధంగా ఉండాలని నిర్దేశించే జైవిక లక్షణాలను గుర్తించడం సాధ్యమం కాదు. ఈ సహజాతాలను తృప్తి పరచుకోవడం ఎలా అనే దానిని అభ్యాసనం, అనుభవం ద్వారానే సాధించడం జరుగుతుంది. ఆకలి సంబంధించినంత వరకు దానిని ఎలా తీర్చుకోవాలో, ఎప్పుడు ఆహారం తీసుకోవాలో, ఎలాతీసుకోవాలో అభ్యసనం, అనుభవం ద్వారానే మనిషి తెలుసుకొంటాడు. ఈ కారణాలవల్లే జైవిక లక్షణాలకు, మానవ ప్రవర్తనకు స్పష్టమైన, నిర్దిష్టమైన సంబంధం ఉందని దృఢంగా చెప్పడం సాధ్యం కాదు.

మానవుడి జైవిక లక్షణాలు అతని శక్తి సామర్థ్యాలను, ప్రవర్తనను, కొంతవరకు నిర్ధారించవచ్చు. ఉదాహరణకు జన్యులోపమున్న డౌన్స్‌సిన్డ్రోమ్ (downs syndrome) -దీనినే మంగోలిజమ్ (mangolism) అంటారు. ఉన్న పిల్లలకు అభ్యసన శక్తి సామర్థ్యాలు పరిమితంగా ఉంటాయని శాస్త్రజ్ఞులు అంటారు. వ్యక్తుల ఎత్తు, లావు, శారీరక బలం, ఛాయరోమాల విస్తృతి మొదలైన భౌతిక తేడాలుండచ్చు. కానీ ఇవేవీ ప్రవర్తనను నిర్ధారిస్తాయని చెప్పలేము. ఆయా సామాజిక, సాంస్కృతిక పరిస్థితులలోనే వీటి ప్రాధాన్యం ఎక్కువ, తక్కువ ఉండటం జరుగుతుంది.

సమాజ శాస్త్రవేత్తలలో చాలా మంది సామాజిక జైవిక వాదాన్ని అంగీకరించరు. వీరి వాదాన్నే సంపూర్ణంగా అంగీకరించినా మానవ ప్రవర్తనపై అభ్యసనము (learning), సామాజిక పరస్పర చర్యల ప్రభావ ప్రాధాన్యాన్ని విస్మరించరు. జన్యుసంబంధమైన అక్షణాలు కేవలం ప్రవర్తన తీరుతెన్నులను కొంతవరకే సూచించగలవు. కానీ పూర్తిగా నిర్ధారించలేవు. అభ్యసనము, సామాజిక పరస్పర చర్యల ప్రాముఖ్యాన్ని తక్కువ చేసి చెప్పడానికి వీలుంటుందనే వాస్తవాన్ని విస్మరించకూడదు. ఇప్పుడు మానవ ప్రవర్తనను ప్రభావితం చేసే మరో శక్తి - పరిసరం, అభ్యసనం గురించి కొంత తెలుసుకోవలసిన అవసరం ఉంది.

## 8.3 పరిసరం - అర్థం

మన చుట్టూ ఉండి మనపై ప్రత్యక్ష ప్రభావం చూపే దానినే పరిసరం అనవచ్చు. అని గిస్బర్ట్ (gisbert) అభిప్రాయం. ప్రభావాన్ని ప్రసరింపజేసే బాహిర్గమైన శక్తే పరిసరమని ఇ.జె.రోస్ (E.J.Rose) భావించారు. ఈ రెండు నిర్వచనాలనూ పరిశీలిస్తే పరిసరమంటే మానవుడు నిర్మించిన, నిర్మించని పరిసరాలు వీటి ప్రభావం మానవ జీవితంపై గాఢంగా ఉంటుంది.

పరిసరాలను వివిధ రకాలుగా శాస్త్రజ్ఞులు గుర్తిస్తారు. 1. భౌగోళిక పరిసరం(geographical environment), 2. సామాజిక పరిసరం(social environment). భౌగోళిక పరిసరం ప్రకృతి సిద్ధమైనది. దీనిపై మానవుడికి ఏవిధమైన నియంత్రణాధికారం లేదు. అందువల్లనే దీనిని అనియంత్రితమైన (uncontrolled) పరిసరం అంటారు. సామాజిక వాతావరణం మానవ కల్పితం. అందుకే దీనిని సామాజిక వాతావరణం అంటారు. మానవ సంస్కృతిని ఉదాహరణగా చెప్పవచ్చు. సామాజిక సాంస్కృతిని సాంస్కృతిక పరిసరం అనికూడా అనవచ్చు. సామాజిక అనువంశికత రూపంలో సాంస్కృతిక పరిసరాలను ఒక తరం నుంచి మరో తరానికి వ్యాప్తి చెందడం జరుగుతుంది.

మానవ కల్పితమైన సామాజిక వాతావరణాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. 1. బాహిరమైన పరిసరం, 2. అంతర్గతమైన పరిసరం. బాహిరమైన పరిసరాలలో గృహాలు, వస్తువులు, మోటార్లు, వైర్‌లెస్, టీవీలు వంటివి చేరతాయి. ఇవన్నీ భౌతిక సంస్కృతికి ప్రతీకలు. అంతర్గత పరిసరంలో మానవుడు వివిధ రకాల సంస్థలను ఏర్పరచుకొంటాడు. జీవనశైలిని రూపొందించుకొంటాడు. వివిధ రకాల ఆచార వ్యవహారాలను, విశ్వాసాలను, సంప్రదాయాలను స్థిరపరచుకొంటాడు. బాహిర, అంతర పరిసరాలనే నాగరికత, సంస్కృతులుగా వ్యవహరిస్తారు.

మానవ సమాజ అధ్యయనానికి ఆ సమాజముంటున్న పరిసరాల అధ్యయనం ముఖ్యం. ఒక సమాజం తాలూకు నాగరికత, సంస్కృతులు ఆ సమాజం చుట్టూ ఉన్న వాతావరణం ఆధారంగానే ఏర్పడి అభివృద్ధి చెందుతూ ఉంటాయి. మాటెస్క్యూ, లీప్లే, డెమోలిన్స్, బ్రన్‌హెస్ వంటి పరిశోధకులు పురుగుపుట్ర, చెట్టు చేమటు భౌతిక పరిసరాలను అనుసరించే ఏర్పడతాయని పేర్కొంటారు. బకల్, రాట్‌జెల్‌ల అభిప్రాయంలో ఇతర జీవరాశులను ప్రభావితం చేసే పరిస్థితులే మానవ సమాజంలపై కూడా అదే విధమైన ప్రభావం చూపుతాయి. మానవుడి శరీరక, బౌద్ధిక స్వరూపస్వభావాలు, నాగరికత, సంస్కృలు, వాతావరణ ప్రభావానికి లోనవుతాయి అని సమాజశాస్త్రవేత్తల అభిప్రాయం.

పరిసరాల ప్రభావం మానవ ప్రవర్తన, అభివృద్ధులపై ఎంత ప్రగాఢంగా ఉంటుందో తెలుసుకోవడానికి పరిశోధకులు తీవ్రంగా ప్రయత్నించారు. ఇలాంటి ప్రయత్నాలకు ఉదాహరణగా కింది సంఘటనలను పేర్కొనవచ్చు. విభిన్న పరిస్థితులు వ్యక్తి వికాసంలో కనిపించే తేడాలను కింద తెలియజేసే సంఘటనలు చక్కటి ఉదాహరణలుగా పరిగణిస్తాయి.

### 8.3.1 పరిశోధనలు

అమెరికాలో 1938లో అనా అనే ఆరేళ్ల బాలిక ఒక ఫార్మ్‌హౌస్‌లోని అటకలో జీవిస్తుండడం కనుగొన్నారు. ఈ బాలిక అక్రమ సంతానం కావడం వల్ల ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు కట్టుదిట్టం చేయడం జరిగింది. అనాను ఒక కుర్చీకి కట్టి ఉంచి, అవసరమైనంత ఆహారం, నీరు అందించేవారు. కుటుంబంతో సంబంధాలు అతి స్వల్పంగా ఉండేట్లు జాగ్రత్త వహించారు. ఇట్లా ఇతర మానవులతో అతి స్వల్ప సంపర్కంతో మొదటి ఆరేళ్లు గడపడం వల్ల అనాను కనుగొనే నాటికి ఆమెకు నడవడం, మాట్లాడడం, ఆహారం భుజించడం పరిశుభ్రంగా ఉండడం వంటివేవీ అలవడలేదు. ఇరుతల పట్ల ఉదాసీనత, నిరాసక్తత, నిర్వికారం వంటివి తప్ప అనాకు ఎటువంటి భావాలు వ్యక్తం చేయడం చేతకాలేదు.

అనాకేసును పోలినకేసే మరొకటి అదే సమయంలో వెలుగులోకి వచ్చింది. ఐసబెల్ అనే ఆరేళ్ల బాలిక అక్రమ సంతానం కావడం చేత ఒక చిన్న చీకటి గదిలో మగ్గవలసి వచ్చింది. చెవుడు ఉన్న ఆమె తల్లితో ఆమె తన



BRAOU

జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలు గడపవలసి రావడంవల్ల కనుగొనే నాటికి ఆరు నెలల శిశువుకుండే తెలివితేటలు మాత్రమే ఉన్నట్టు తేలింది. చిన్న చిన్న శబ్దాలు చేయడం వచ్చినా మాటలు మాత్రం మాట్లాడడం రాలేదు. సైగల సహాయంతో తల్లికి తన భావాలను వ్యక్తం చేయడగలిగింది. ఐసబెల్‌కు కొత్తవారన్నా, పురుషులన్నా భయం, వారిని చూస్తే ఒక జంతువు ప్రవర్తించినట్లు ప్రవర్తించేది.

పైరెండు కేసులూ ఒకే రకమైన పరిస్థితులలో పెరిగిన ఇద్దరు పిల్లలను గురించి తెలియజేస్తాయి. వీరిని కనుగొన్న తరువాత, బాహిర ప్రపంచంలోకి అడుగుపెట్టిన తరువాత వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పులు వచ్చాయో చూద్దాం. అనా బయటి ప్రపంచంలోకి వచ్చిన తరువాత ఆమె ప్రవర్తనలో కొంత మార్పు వచ్చినా అది పరిమితంగానే ఉండింది. ఆమె వయసుకు తగ్గ అభివృద్ధి మాత్రం సాధించలేకపోయింది. కొన్ని పదాలు పలకడం, కొన్ని వాక్యాలు మాట్లాడడం వచ్చినా స్వంతంగా ఒక్క వాక్యం కూడా మాట్లాడలేకపోయింది. తోటి వారి సమూహంలో పాల్గొనడం, ఆటలు ఆడటం వచ్చినా నాయకత్వ లక్షణాలు మాత్రం ఆమెలో కనబడలేదు. ఇలా ఆమె కొంత అభివృద్ధి సాధించినా కనుగొన్న నాలుగు సంవత్సరాలకే చనిపోయింది. ఇక ఐసబెల్ విషయానికొస్తే ఐసబెల్‌నుఒక శరణాలయంలో చేర్చి నిపుణులతో శిక్షణ ఇప్పించడం జరిగింది. అతి త్వరగా మాట్లాడడం, నడవడం, పరిగెత్తడం వంటివే కాక పాటలు పాడటం కూడా నేర్చుకోగలిగింది. ఎనిమిన్నర ఏళ్లకు ఆమె తన వయసు వారితో సరిసమానంమైన తెలివితేటలు, అభివృద్ధిని సాధించగలిగింది.

భౌతిక ప్రకృతి మానవ సమాజంపై బాగా ఉంటుందని చరిత్రకారులు, సమాజ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇలాంటి వారలో ముఖ్యంగా పేర్కొనదగినవారు హంటింగ్‌టన్. ఇతడు భౌగోళిక నేరవాదాన్ని ప్రతిపాదించాడు. అట్లాగే లోంబ్రోసోకూడా నేర ప్రవృత్తికి, భౌగోళిక పరిస్థితులకు, వాతావరణ పరిస్థితులకు, రుతువులకు సంబంధం ఉందని 'crime its causes and remedies (1918) అనే గ్రంథంలో పేర్కొన్నాడు. కానీ డాక్టర్ గిల్లిన్ భౌగోళిక, శీతోష్ణస్థితి పరిస్థితులకు నేర ప్రవృత్తిపై ఉన్న ప్రభావం పరోక్షమైందేకానీ ప్రత్యక్షమైంది కాదని పదించాడు.

మానవ వికాసాన్ని ప్రభావితం చేసే పర్యావరణ పరిస్థితులలో ముఖ్యంగా పేర్కొదగినవి కుటుంబ పరిస్థితులు, విచ్ఛిన్న కుటుంబాలు, కుటుంబ పరిమాణం, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు, నైతికంగా పతనమైన కుటుంబాలు, పిల్లలపై తల్లిదండ్రుల అజమాయిషీ లేకపోవడం, స్నేహితుల సాహచర్యం, సాముదాయిక అవ్యవస్థ, జనసాంద్రత, జనసమ్మర్థం మొదలైనవి.

సాంస్కృతిక పర్యావరణ ప్రభావం ఆధారంగా సదర్లాండ్ అనే సమాజశాస్త్రవేత్త భేదాత్మక సంసర్గ సిద్ధాంతం అనే దానిని ప్రతిపాదించాడు. చికాగో సాంస్కృతిక పర్యావరణ వాదులు(chicago school - cultural ecologists) ఏర్పరచిన సంప్రదాయాన్ననుసరించి నేరాలకు పర్యావరణ పరిస్థితులతోడ్పాటు స్పష్టంగా ఉంటుందని, సామాజిక సువ్యవస్థ, అవ్యవస్థలు దానిపైన ఆధారపడి ఉంటాయనే దానిపై దృష్టి కేంద్రీకరించి పరిశీలన కొనసాగించారు. గతంలో శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాలకు భిన్నంగా వ్యక్తి చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావం ఆవ్యక్తి ప్రవర్తన, ఆలోచనాధోరణులపై ఉంటుందని, సహచరుల ప్రభావం గణనీయంగా ఉంటుందనేవాదాన్ని లేవనెత్తాడు సదర్లాండ్. ఈ విధంగా మానవ ప్రవర్తన తీరుతెన్నులపైన సమాజం, వ్యక్తి వికాసాలు పరిసర పరిస్థితుల ప్రభావానికి లోనై ఉంటాయనే వాదానికే ఈనాడు ఎక్కువ ప్రాచుర్యం ఉంది.

## 8.4 అనువంశికత -పరిసరం : తులనాత్మక ప్రాధాన్యం

అనువంశికత, పర్యావరణ ప్రభావాలు మానవ ప్రవర్తనపై చెరగని ముద్రవేసాయనే అంశాన్ని అనేకమంది శాస్త్రవేత్తలు తీవ్రంగా చర్చిస్తూనే ఉన్నారు. ఇందులో ఏది మానవ ప్రవర్తపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోందో ఇదమిద్ధంగా తెలపడంలో నిపుణులు పూర్తిగా విజయాన్ని సాధించలేదనే వాస్తవాన్ని వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రెండింటి తులనాత్మక ప్రాధాన్యం నిర్దిష్టంగా తెలపడానికి అనేక మంది ప్రయత్నిస్తూనే ఉన్నారు. వర్తమాన, సామాజిక, రాజకీయ పరిస్థితులలో ఈ సమస్యకు ఖచ్చితమైన పరిష్కారాన్ని సూచించడం అంత సులభసాధ్యమైంది కాదని నిపుణులు గుర్తిస్తున్నారు. నిపుణుల దృష్టిలో అనువంశిక లక్షణాలనేవి జన్మసిద్ధమైనవి. ఇవి ఒక వ్యక్తి వికాసానికి ఉన్న అవకాశాలను, సాధ్యాసాధ్యాలను మాత్రమే సూచిస్తాయి. ఈ సంభావ్యతలకు ఒక

నిర్దిష్ట రూపం ఇవ్వడంలో పర్యావరణ పరిస్థితుల పాత్ర అత్యంత కీలకమైనది. దీని ప్రాధాన్యాన్ని తక్కువ చేసి చెప్పడమంటే వర్తమాన సామాజిక వాస్తవాలను విస్మరించడమే అవుతుంది. అదువల్ల అనువంశికత, పరిసరాల ప్రభావాల తులనాత్మక ప్రాధాన్య నిర్ధారణ వివాదగ్రస్తమైన అంశంగానే ఈనాటికీ మిగిలిపోయింది. వివిధ నిపుణుల అధ్యయనాలను పరిశీలిస్తే ఈ విషయంలో ఎంతటి అభిప్రాయ బేధాలున్నాయో స్పష్టంగా తెలుస్తుంది.

అనువంశికత సిద్ధాంతాన్ని బలపరిచిన రచయితలలో ముఖ్యంగా గుర్తుంచుకోవలసినవారు గాల్టన్, కార్ల్ పీయర్‌సన్, డబ్ల్యూ.మాక్‌డగల్‌లు కాగా పర్యావరణ ప్రభావానికి ప్రాధాన్యమిచ్చిన వారు అమెరికాకు చెందిన జె.బి.వాట్సన్, ఇతర ప్రవర్తనావాదులు (behaviourists).

### 8.4.1 పరిశోధనలు

అనువంశికత ప్రాధాన్యాన్ని ప్రచారం చేసినవారు ప్రధానంగా వ్యక్తుల ప్రజ్ఞాపాటవాల(intelligence)లోని తారతమ్యాలపైన ఆధారపడి తమ వాదాన్ని కొనసాగించారు. వీరు వివిధ వృత్తి సమూహాలకు చెందిన వారి సంతతి కనబరచిన ప్రజ్ఞాలబ్ధి (I.Q)లో తేడాలను గుర్తించి తమ వాదాన్ని బలపరుచుకొన్నారు. వీరి అధ్యయనం ప్రకారం వివిధ వృత్తులలోని తల్లి దండ్రుల సంతతి I.Q లోని తేడాలను ఈ విధంగా పేర్కొన్నారు.

| క్రమ సంఖ్య | వర్గం | సగటు I.Q |
|---|---|---|
| 1 | ప్రొఫెషనల్ పేరెంట్స్ | 116 |
| 2 | సెమి ప్రొఫెషనల్, మానజీరియల్ క్లాస్ | 112 |
| 3 | క్లరికల్, స్కిల్డ్ ట్రేడ్స్, బిజినెస్ | 107.5 |
| 4 | సెమి స్కిల్డ్ మైనర్ క్లరికల్ అక్యుపేషన్, బిజినెస్ | 105 |
| 5 | స్లైటలీ స్కిల్డ్ | 98 |
| 6 | లేబరర్స్- అర్బన్, రూరల్ ఫార్మర్స్ | 96 |

source: J.B.Watson, Psychology, frome the stand point of A Behiourist, second ed., (Philadelphia: J.P. Lippincott, 1924)

ఈ పరిశీలనంతా అనువంశికత ప్రాధాన్యందృష్ట్యానే సాగిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ అధ్యయనంలో వివిధ వర్గాలకు చెందిన పిల్లలకు లభించిన ఇతర సౌకర్యాలను గురించి - విద్యావకాశాలు, గృహవాతావరణం, అభ్యసన సదుపాయాలు, అభ్యసనకాలం వంటి కీకలమైన అంశాలను విస్మరించడం జరిగింది.

పై పరిశోధన మాదిరిగానే బి.ఎస్.బర్క్స్ తన పరిశోధనలో అనువంశికతకు 80 పాయింట్లు, పర్యావరణ ప్రభావానికి 17 నుంచి 20 పాయింట్లు ఇవ్వవచ్చని పేర్కొంది. కానీ ఈ పరిశోధనా ఫలితాలు ఇతర నిపుణుల ఆమోదం పొందలేదు. దీనికి విరుద్ధంగా ఎఫ్. ఎమ్. ఫ్రీమన్ చికాగోలోని ఒక శరణాలయంలోని 671 మంది పిల్లల I.Q ను అంచనావేయడానికి ప్రయత్నించాడు. శరణాలయంలోని సదుపాయాలను బట్టి పిల్లల I.Qలో తేడాలుండవచ్చునని భావించాడు. (The twentieth century Year book of the National Society for the study of Education- Bloomington III, 1928)

హెచ్.హెచ్.న్యూమన్(H.H.Newman) కవల పిల్లల - మేరీ, మేబల్ -పై నిర్వహించిన పరిశోధనలో అనువంశికతపై పర్యావరణ ప్రభావం ఏమేరకు ఉంటుందో తెలియజేస్తుంది. విభిన్న పర్యావరణ పరిస్థితులలో పెరిగిన ఈ పిల్లల I.Q లో తేడాలు స్పష్టంగా కనిపిస్తాయి. అనువంశిక లక్షణాల ప్రభావం కంటే పర్యావరణ పరిస్థితుల ప్రభావమే మిన్నగా ఉంటుందని న్యూమన్ భావించాడు.

మానవ ప్రవర్తనను ప్రభావితం చేసే రెండు ముఖ్యమైన శక్తుల - అనువంశికత, పరస్పరం - పాత్రను గురించి నిపుణుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం సహజమే. జీవులన్నింటిలో మానవుడే అతి ప్రజ్ఞాశాలి.



BRAOU

చాలా తేడా ఉంటుంది. సామాన్యంగా సంస్కృతి, విద్యలను సమానార్థాలుగా భావిస్తుండడం కనిపిస్తుంది. ఈ భావంతోనే ఒక్కొక్కప్పుడు 'సంస్కృతి కల వాడు' అనే విశేషణాన్ని విద్యావంతునికి ఆపాదిస్తుంటారు. మరికొన్ని సందర్భాలలో సత్ప్రవర్తన, మంచి అలవాట్లు ఉన్న వారిని 'సంస్కృతి ఉన్న వ్యక్తి' అని అంటుండడం గమనించవచ్చు. ఒక వ్యక్తి తాలూకు మంచి లక్షణాలను బట్టి అతడు సంస్కృతి కలవాడు అనడం కద్దు. ఈ రకమైన లక్షణాలు, గుణగణాలు ఉన్న వ్యక్తి అన్ని రకాల పరిస్థితుల్లో ఎలా ప్రవర్తించాలో తెలిసిఉంటుందని సూచిస్తున్నట్టు అనుకుంటారు. కానీ సమాజశాస్త్రంలో సంస్కృతి అంటే కేవలం వ్యక్తిగతమైన నాజూకుతనం మాత్రమే కాదు.

సమాజ శాస్త్రం దృష్టిలో సంస్కృతి వే సమీజ సభ్యుడుగా ఒక వ్యక్తి నేర్చుకొన్న సమస్త విజ్ఞానం అని అర్థం. అది ఒక జీవన విధానం, ఆలోచనా తీరు, ప్రవర్తన, భావావేశం. సంస్కృతి ఒక సమూహం భావించే జీవనం రూపురేఖలు.

సంస్కృతి అనే పదం చాలా విస్తృత అర్థం ఉన్న పదం. ఈ పదం మానవ జీవితానికి సంబంధించిన అన్ని రంగాలకు సంబంధించిన విషయాలను తెలుపుతుంది. మానవ ప్రవర్తన తీరును, తత్వాన్ని, నైతికత, గుణ గణాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, మతం, రాజకీయ, ఆర్థిక, అనేక ఇతర కార్యకలాపాలను గురించిన సంపూర్ణ స్వరూపాన్ని సూచిస్తుంది. మెకైవర్, పేజ్‌ల మాటల్లో చెప్పాలంటే 'సంస్కృతి జీవన శైలికి, విలువలకు, భావోద్వేగాలకు, బౌద్ధిక సాహసకార్యాలకు సంబంధించినది.

## 9.3 నిర్వచనాలు-లక్షణాలు

సంస్కృతి అనే భావనను సరిగా అవగాహన చేసుకోవడానికి వివిధ సమాజశాస్త్రవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు ఇచ్చిన నిర్వచనాలను విపులంగా చర్చిద్దాం.

1. "సమాజంలో ఒక సభ్యుడిగా మనిషి పరిజ్ఞానం, విశ్వాసం, కళ, నీతి సూత్రాలు, న్యాయం, ఆచారవ్యవహారాలతో సహా ఇతర శక్తి యుక్తులను సంతరించుకొన్న అలవాట్లను మొత్తం 'సంక్లిష్ట' సంస్కృతి ఎడ్వర్డ్.బి.టైలర్ నిర్వచించాడు. 2. రాబర్ట్‌రెడ్ ఫీల్డ్ (1941) సంస్కృతికి ఇచ్చిన నిర్వచనం ఇలా ఉంది. "సంప్రదాయంగా వస్తున్న కళలో, కళాత్మక విషయాల్లో అభివ్యక్తమైన ప్రాచీన సంప్రదాయక అవగాహనల, ఒక మానవ సమూహం పాత్ర చిత్రణ యొక్క వ్యవస్థ". 3. మెలినోస్కీ ఇచ్చిన నిర్వచనం సాధనాత్మక దృక్పథం కల్పించే నిర్వచనం. "సంస్కృతి అంటే ఒక వ్యక్తి అతడి లేదా ఆమె జైవిక, మానసిక, సామాజిక ఆవశ్యకతలను సాధించుకొనే పరిపూర్ణ జీవిత విధానం". 4. ప్రసిద్ధ సమాజ శాస్త్రవేత్త గ్రాహం వాలెస్ (Graham Wallce) నిర్వచనం ఇలా ఉంది. "సంస్కృతి అనేది భావాలు, విలువలు, వస్తువుల సంచయం, గత తరంనుంచి మనకు విజ్ఞానం ద్వారా సంక్రమించిన సామాజిక వారసత్వం. ఇది జన్యువుల మూలంగా సంక్రమించిన జైవిక వారసత్వానికి భిన్నమైంది." 5. రాబర్ట్ బయర్ స్టాడ్ (Robart Bierstadt) అభిప్రాయంలో సంస్కృతి అంటే "ఒక సభ్యుడిగా మనం ఆలోచించే తీరు, వ్యవహరించే పద్ధతుల సంక్లిష్ట సమగ్రరూపం". 6. ఇ.వి.డి.రాబర్ట్ అభిప్రాయాన్ననుసరించి "కేవలం మానవుడే పొందగల ఆలోచన, విజ్ఞానాలు - సైద్ధాంతికమైన, వ్యవహారికమైన స్వరూపమే సంస్కృతి.

ఎడ్వర్ టైలర్, రెడ్‌ఫీల్డ్‌లు ప్రతిపాదించిన నిర్వచనాలలో రెండు అంశాలను ప్రధానమైనవిగా ప్రస్తావించడం జరిగింది. "మానవుడు ఆర్జించిన (Acquired by man) సంప్రదాయంగా నిరంతరాయంగా సాగుతున్న (Persisting through tradition) లక్షణాలు అన్న రెడ్‌ఫీల్డ్ పదబంధాలను గమనిస్తే అవి సంస్కృతి తాలూకు రెండు ప్రధానమైన అంశాలను నొక్కి చెబుతున్నట్లు స్పష్టమవుతుంది. ఒక మానవశిశువు తాను పెరిగి పెద్దవాడయ్యే ప్రక్రియలో సక్రమంగా జ్ఞానం పొందుతాడు. మానవుడు సమాజంతో నిమిత్తం లేకుండా జ్ఞాన సముపార్జన చేయడం జరగదనే వాస్తవం తేటతెల్లమవుతుంది. మరో మాటలో చెప్పాలంటే సమాజంతో ప్రమేయం లేకుండా సంస్కృతిని ఊహించలేము. రెడ్‌ఫీల్డ్ వాడిన సంప్రదాయపు నిరవధిక కొనసాగింపు భావన ఒక తరంలో ఆర్జించిన జ్ఞాన సంపద తరవాతి తరాల వారికి వారసత్వంగా సంక్రమిస్తుందనే విషయాన్ని సూచిస్తుంది. ఇదే మానవ సంస్కృతి తాలూకు అపూర్వమైన లక్షణం. సంప్రదాయం నుంచి జీవన విధానాన్ని తెలుసుకోవడం, సముదాయం నుంచి నేర్చుకోగల, అలవరచుకోగల శక్తి యుక్తులు మానవులకుండడం వల్లే సాధ్యం.

ఈ లక్షణాలు ఇతర జంతుజాలానికి పరిమితంగా ఉండటంవల్లే మానవుడు ఇతర జీవుల కన్నా శ్రేష్ఠము.

ఉదాత్తము అయిన జీవి అని నిరూపితమవుతుందని గుర్తుంచుకోవాలి. ప్రమాణీకరించిన మానవ ప్రవర్తన నమూనాలను వంశానుగతంగా సంక్రమించినవనిగానీ, సహజంగా ఏర్పడినవనిగానీ వివరించడం సాధ్యంకాదు. జంతువుల్లో చాలా వాటికి ప్రత్యేకమైన, నిపుణతగలశక్తి సామర్థ్యాలు జన్మతః అనువంశికంగా సంక్రమించినవే అయి ఉంటాయి. కొన్ని సహజాతాలు (Instincts), సంక్రమించిన శక్తి యుక్తుల సహాయంతో మౌలిక అవసరాలు తీర్చుకోవడం, పరిసరాలకు అనుగుణంగాతమ ప్రవర్తనను మలుచుకోవడం జరుగుతూ ఉంటుంది. కొన్ని రకాల చేపలు సముద్ర జలాలు వదిలి మంచినీటి సరస్సులలో, నదులలో జీవించడం, కొన్ని రకాల పక్షులు చలికాలంలో వేడివాతావరణమున్న ప్రాంతాలకు వలసపోవడం జరుగుతూ ఉండడం మనకు తెలిసిందే. వీటిలో ఒక ప్రవర్తన నమూనా జన్మతః సిద్ధించినది. దాన్ని అనుసరించే వివిధ పరిస్థితులకు అనుగుణంగా ప్రవర్తించడం జరుగుతూ ఉంటుందేకానీ వాటిని వ్యక్తిగతంగా నేర్చుకొని అనుసరించడం జరగదు. అయితే మానవుని విషయంలో అలాకాదు. సహజాతమైన నైపుణ్యం, జ్ఞానం అనేవి మానవునిలో అతి స్వల్పంగా ఉంటాయికానీ మానవుడు తన మనుగడ కోసం కొత్త కొత్త పద్ధతులను కనుక్కోవడం, కొత్త భాషలు తెలుసుకోవడంలో అతనికున్న శక్తి సామర్థ్యాలే సహాయపడతాయి. అవే ఒక సంస్కృతిని సృష్టించుకోవడానికి, సమాజాన్ని ఏర్పరుచుకోవడానికి దోహదపడతాయి. ఈ రకమైన సంజ్ఞాన భావ వ్యక్తీకరణ ఒక తరంనుంచి మరో తరానికి నిరంతరం సంక్రమిస్తూ ఉంటుంది. ఆర్జించిన ఏవిజ్ఞానం అయినా లుప్తం కాదు. ఎందుకంటే భాషామాధ్యమం ద్వారా ఒక తరంనుంచి మరో తరానికి అందివ్వడం సాధ్యమవుతుంది. ఈ ప్రయత్నం మరింత సులభతరం చేసుకోవడంలో మానవుడు అనేక సాంస్కృతిక ఉపకరణాలు రూపొందించుకొని తన అవసరాలు తీర్చుకోగలిగాడు. వేసవి వేడిమినుంచి తనను తాను రక్షించుకోవడానికి, జంతుజాలం మాదిరి నీటమునిగి ఉండాల్సిన అవసరం లేకుండా విద్యుత్తు పంకాలు సృష్టించుకొన్నాడు. మానవుడు ఉన్నిని సృషించలేడుగానీ చలినుంచి రక్షించుకోవడానికి ఉన్ని దుస్తులు తయారు చేసుకొని వాడుకోగలడు. అంటే మానవ ప్రవర్తన చాలా మట్టుకు పరిసరాలనుంచి నేర్చుకొని, అనుభవం ద్వారా ఆర్జించిన పరిజ్ఞానం ప్రభావమే. ఈలక్షణాల మూలంగానే కొందరు రచయితలు "సంస్కృతి మానవుని సామాజిక వారసత్వం" అని నిర్వచించారు.

## సంస్కృతి లక్షణాలు

పైన పేర్కొన్న సంస్కృతి నిర్వచనాలను తెలుపుతాయి. సంస్కృతి భావనను సరిగా అర్థం చేసుకోవడానికి దాని లక్షణాలను గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం. సంస్కృతి ముఖ్యలక్షణాలను కింద పేర్కొనడం జరిగింది.

1. సంస్కృతి నేర్చుకోదగినది: జైవికంగా సంక్రమించిన వారసత్వం కాదు సంస్కృతి. దాన్ని మనిషి సామాజికంగా నేర్చుకొంటాడు. అది మానవునిలో అంతర్నిహితంగా (Innate)ఉండేది కాదు. సాంస్కృతిక సహజాతం (Cultural Instinct) అంటూ ఏదీ ఉండదు. సాధారణంగా నేర్చుకొన్న ప్రవర్తనాతీరునే సంస్కృతి అని అంటూంటారు. అలా నేర్చుకొని ప్రవర్తన - నిద్రపోయేప్పుడు కళ్ళుమూసుకోవడం, కళ్ళు ఆర్పడం మొదలైనవి శారీరక లక్షణాలే కానీ, సాంస్కృతిక లక్షణాలు ఎంతమాత్రమూ కాదు. కరచాలనం చేయడం, నమస్తే, ధన్యవాదం అనడం, బట్టలు వేసుకోవడమనేవి సాంస్కృతిక లక్షణాలని చెప్పవచ్చు. అట్లాగే నీళ్లు తాగడం, కంచంలో అన్నం తినడం, ఒక నాటకంలో ఒక పాత్ర పోషించడం, పాట పాడడం, దైవారాధన మొదలైనవన్నీ సాంస్కృతికంగా మనిషి నేర్చుకొన్న ప్రవర్తనా రీతులే అనాలి.

2. సాంస్కృతి సామాజికమైంది: సంస్కృతి దేనితో సంబంధం లేకుండా ఏకాకిగా ఉండదు. మనజాలదు. అంతేకాక అది కేవలం ఒక వైయుక్తిక దృగ్విషయం కూడా కాదు. దీనికి మూలం సమాజం. సామాజిక పరస్పర చర్యల ఫలితంగా పుట్టి పెరుగుతుంది. దీన్ని సామాజికులందరూ పంచుకొంటారు. మనిషితోటి సామాజికులతో సంపర్కం లేనిదే ఒక సంస్కృతిని అలవరుచుకోలేడు. మనుషులందరిలో ఉన్నప్పుడే మనిషి మనిషిగా గుర్తిపబడతాడు. ఒక మానవ పర్యావరణంలోనే మానవ గుణాలను అలవరుచుకోగలడు. మనిషికి తోటి మానవ సంఘాలతో సంబంధంలేనట్లయితే మానవ లక్షణాలు అబ్బడం జరగదు.

3. సంస్కృతి ఇతరులతో పంచుకోనేది: సమాజ శాస్త్రం దృష్ట్యా సంస్కృతి అనేది నలుగురితో పంచుకొనేటటువంటిది. దీన్ని కేవలం ఒక వ్యక్తే పొందడం జరుగదు. ఉదాహరణకు, ఆచారాలు, సంప్రదాయాలు,

విశ్వాసాలు, భావాలు, విలువలు, నీతి సూత్రాలు మొదలైనవాటిని ఒక మానవ సమూహం లేదా సమాజం ఉమ్మడిగా అనుసరించేవే గానీ వ్యక్తి గతమైనవి కాదనేది స్పష్టం. రాబర్ట్ బయర్‌స్టాట్ (Robert Bierstadt) అభిప్రాయంలో సంస్కృతి అలవరుచుకొన్నది, ఉపయోగించింది, విశ్వసించింది, వ్యవహరించింది, అనేకులు పొందినది. సంస్కృతి మనుగడ సమూహజీవనంపై ఆధారపడి ఉంటుంది.

4. సంస్కృతి ప్రసారితమవుతుంది: సంస్కృతిని ఒక తరం నుంచి మరో తరానికి ప్రసారం చేయడానికి వీలవుతుంది. తల్లిదండ్రులు వారి సంతానానికి తమ సంస్కృతి లక్షణాలను ప్రసారం చేయడం, ఆ పిల్లలు వారి సంతతికి వారసత్వంగా అందించడం జరుగుతుంది. ఒక ప్రవంతిగా తరతరాలలో అనంతంగా సాగుతూనే ఉంటుంది. సంస్కృతిని జన్యువుల ద్వారా కాక భాషా మాధ్యమం ద్వారా ఒక తరంనే ఉంచి మరో తరానికి అందించడం జరుగుతుంది. వివిధ భాషా రూపాలు - చదవడం, రాయడం, మాట్లాడటం ద్వారా గత కాలపు వారి అనుభవాలు, అలవాట్లు, ఆచారవ్యవహారాలు, విధి విధానాలు, జయాపజయాలను గురించిన సమాచారం వాగ్రూపంలోను, లిఖితరూపంలోను తరవాతి తరాలవారు తెలుసుకోవడం సాధ్యమవుతుంది. భాష నేర్చుకోవడంతో అవగాహన పరిధి విస్తృతమవుతుంది. సంస్కృతి ప్రసరణ ఒక భాష ద్వారానే కాక ఇతరులను అనుకరించడం వల్ల కూడా సాధ్యమవుతుంది.

5. సంస్కృతి నిరంతరాయము, సంచితము(Continious and Cumilative): సంస్కృతి ఒక నిరవధికంగా సాగే ప్రక్రియ. దాన్ని చారిత్రక పురోగతిని పరిశీలిస్తే అది సంచితమైందనే వాస్తవం స్పష్టంగా తెలుస్తుంది. సంస్కృతి పరిణామ చరిత్రలో గత కాలపు జయాపజయాలు, వర్తమాన అనుభవాలు, భవిష్యత్ అవకాశాలకు వెలుసుబాటు కూడా చోటు చేసుకొంటాయి. అంటే సంస్కృతిని ఒక తరం నుంచి ఇంకో తరానికి సాగే ఒక ప్రవంతిగా పేర్కొనవచ్చు. అందువల్లనే లింటన్ వంటి సమాజశాస్త్రవేత్త సంస్కృతిని 'సామాజిక వారసత్వం'గా భావించాడు. అట్లాగే రాబర్ట్ బయర్‌స్టాట్ సంస్కృతి 'మానవజాతి స్మృతి (Memory of human race) అన్నాడు. సంచిత సంస్కృతి లేని సమాజాన్ని ఊహించడమే కష్టం. అదే లేకపోతే మానవజీవిత స్వరూప స్వభావాలు ఎలా ఉంటాయో అనేది ఊహాకందని విషయం.

6. సంస్కృతి సంగతము, సమైక్యకారకము (Culture is Consistent and Intigrative): సంస్కృతిలో వివిధ అభివృద్ధి దశలలో ఒకే విధంగా - అంటే సంగతంగా ఉంటూండే - ధోరణి కనిపిస్తుంది. అయితే ఈ సంగతత్వ లక్షణం ఉన్న దానిలో భిన్న భాగాల మధ్య పరస్పర సంబంధం ఉంటుంది. సంస్కృతిలోని అన్ని లక్షణాలు, సంక్లిష్టతలు కలిసి ఇమిడేందుకు దోహదం చేస్తాయి. లక్షణాలు, సంక్లిష్టతలతో అంతర్లీనమై ఉన్న విలువలు నిర్దిష్టంగా ఉండేందుకు దోహదం చేస్తాయి. ఉదాహరణకు, ఒక సమాజం తాలూకు విలువలు, ఆసమాజ సంస్కృతి ఇతర భాగాలైన నైతికత, మతం, ఆచార వ్యవహారాలు, సంప్రదాయం, విశ్వాసాలు మొదలైన వాటితో ముడిపడి ఉంటుంది.

7. సంస్కృతి చైతన్యవంతమైంది, అనుకూలశీలి: సంస్కృతి మిగతా విషయాలతో పోలిస్తే నికడైంది. అయినప్పటికీ అది స్తబ్దమైనది మాత్రం కాదు. దానిలో మార్పులు నెమ్మదిగా జరుగుతూ ఉండవచ్చు. అయితే ఆ మార్పులు నిరంతరం జరుగుతూనే ఉంటాయి. మార్పు, పెరుగుదల అనే లక్షణాలు సంస్కృతిలో నిగూఢంగా ఉంటాయి. వేదకాలంనాటి భారతీయ సంస్కృతితో పోలిస్తే ఈనాటి భారతీయ సంస్కృతిలో ఆశ్చర్యకరమైన మార్పులు, చేర్పులు ఎన్నో కనిపిస్తాయి.

భౌతిక ప్రపంచంలో నిత్యం జరిగే పరిణామాలకు సంస్కృతి స్పందిస్తూనే ఉంటుంది. కొత్త లక్షణాలు సంతరించుకొంటూనే మహాప్రవాహంలా అనంతంగా సాగుతూనే ఉంటుంది. ఇది ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో మానవుడు సర్దుబాటు చేసుకొంటూ ముందుకు సాగడానికి అనుకూలిస్తూ ఉంటుంది. తుఫాను తాకిడి నుంచి మన గృహాలు ఎలా మనకు రక్షణ కల్పిస్తాయో అలాగే మన సంస్కృతి కూడా మనకు ఎదురయ్యే ప్రకృతి వైపరీత్యాల, ప్రమాదాలనుంచి రక్షించి, మనకు అండగా నిలుస్తుంది, బతికి బట్టకట్టడానికి అవసరమైన ఊతమిస్తుంది.



8. సంస్కృతి సంతృప్తి దాయకమైంది: మానవుని అభిలాషలు, ఆకాంక్షలను తీర్చుకొనే అవకాశాలను,

B R A O U

అనుసరించాల్సిన మార్గాలను సూచిస్తుంది. సంస్కృతి ఈ అభిలాషలు జైవికం కావచ్చు లేదా సామాజికమైనవి కావచ్చు. మన అవసరాలైన ఆహారం, నీడ, గుడ్డలు, సమాజంలో ఒకస్థాయి, గౌరవ ప్రతిష్టలు, ధనం, హోదా మొదలైన వాటిని పొందడం కూడా సంస్కృతి నిర్దేశించిన మార్గాలలోనే జరుగుతూంది. అంటే మానవ కార్యకలాపాలను నిర్దేశించి, మార్గదర్శకమవుతుందని అర్థం. నిజానికి మానవుని కోరికలను సంతృప్తి పరచుకోవడానికి అనువైన సాధనంగా ఉన్నదే సంస్కృతి అనవచ్చు.

9. సంస్కృతి సమాజానికి సమాజానికి మారుతూ ఉంటుంది: ప్రతి సమాజానికి దానికంటూ ఒక సంస్కృతి ఉంటుంది. ఈ సంస్కృతి సమాజాన్నిబట్టి మారుతూ ఉంటుంది. ప్రతి సమాజానికి దాని సంస్కృతి విశిష్టమైనదే అవుతుంది. ఆచారాలలో ఏకరూపత కనిపించదు. ఆచారాలు, సంప్రదాయాలు, నీతి నియమాలు, ఆదర్శాలు, విలువలు, సిద్ధాంతాలు, విశ్వాసాలు, వ్యవహారాలు, తత్వచింతనలు, సంస్థలు మొదలైన సాంస్కృతిక అంశాలు అన్నిచోట్లా ఒకే విధంగా ఉండవు. ఇద్దరు కలుసుకొన్నప్పుడు మర్యాదపూర్వకండా పలకరించడం, మాట్లాడే విధానం, వేషభాషలు వినోదం అందించే అంశాలు, పద్ధతులు, జీవనశైలి మొదలైనవి భిన్న సమాజాలలో భిన్న రీతుల్లో ఉండవచ్చు. సంస్కృతి దేశకాల పరిస్థితులను అనుసరించి పరిణామం చెందుతూ ఉంటుంది. మార్పు సహజం. అది నిరంతరాయంగా కొనసాగుతూ కొత్త రూపం ధరిస్తూ ఉంటుంది.

10. సంస్కృతి జైవిక లక్షణాలకు అతీతమైనది, భావస్ఫోరకమైంది (Culture is Super organic and ideational): సంస్కృతిని కొన్ని సందర్భాలలో "సూపర్ ఆర్గానిక్" అంటారు. హెర్బర్ట్ స్పెన్సర్ సంస్కృతి అనేది జైవికమైంది కాదు. రసాయనిక లేదా కృత్రిమమైంది కాదు. అది ఈ రెండింటిని అధిగమించినటువంటిది - అన్నాడు. భౌతిక, శారీరక చర్యల సామాజిక అర్థం ఇందులో ఇమిడి ఉంది. ఈ రకమైన సామాజిక అర్థం భౌతిక, శారీరక లక్షణాలనుంచి విడిగా, స్వతంత్రంగా ఉండవచ్చు. ఉదాహరణకు, జాతీయ పతాకానికి సమాజ పరమైన అర్థం కేవలం ఒక రంగుల బట్ట అని మాత్రమే కాదు. అట్లాగే, పురోహితులు, నేరస్థులు, ఆచార్యులు, వృత్తిపరమైన నిపుణులు, ఆటగాళ్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, రైతులు, సైనికులు మొదలైనవారు కేవలం సాధారణ జీవులు మాత్రమేకాదు. వారి సామాజిక స్థాయి, హోదాలను వారి సాంస్కృతి ద్వారానే అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. అట్లాగే జీవశాస్త్రవేత్త దృష్టిలో గోవు అన్ని జంతువుల మాదిరిగానే ఒక జంతువు. ఒక సమాజం సంస్కృతి దృష్ట్యా చూస్తే హిందువులకు ఆ గోవు ఒక పవిత్ర జంతువుగాను, పూజనీయమైనదిగాను కనిపిస్తుంది 'సూపర్ ఆర్గానిక్' అనే పదం - అది భౌతిక లక్షణాలను పక్కనపెట్టి చూస్తే - భౌతిక వస్తువులకు, చర్యలకు సామాజిక అర్థచ్ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయి.

11. సంస్కృతి జీవన చిత్రం: ప్రతి మానవ సముదాయానికి ఒక విలక్షణము, ప్రత్యేకము, ప్రమాణీకృతము అయిన ప్రవర్తన నమూనా అంటూ ఉంటుంది. దీని వేళ్లు ఆ సముదాయపు సంప్రదాయంలో లోతుగా నాటుకొని ఉంటాయి. ఈ సంస్కృతి ఆ సముదాయంలోని వారంతా అనుసరిస్తూ ఉంటారు. అంటే ప్రతి సముదాయానికి తనకంటూ ఒక ప్రత్యేక జీవనశైలి అనేది ఉంటుందన్నమాట. వివిధ సమాజాల మధ్య తారతమ్యాన్ని నిరూపించడానికి సంస్కృతి ఒక మంచి సాధనం. మన భారతీయ సమాజాన్నే తీసుకోండి మన సమాజానికి చైనీయుల సమాజానికి జీవన శైలిలోని వైవిధ్యాన్ని తెలుసుకోవడానికి సంస్కృతిని ఒక చక్కటి ఉదాహరణంగా వాడుకోవచ్చు.

సంస్కృతి భావన అర్థాన్ని సరిగా అవగాహన చేసుకోవడానికి ఇదివరకు పేర్కొన్న నాలుగు రూపాలను అంటే 1. సంస్కృతి నేర్చదగినది, 2. సామాజిక వారసత్వం. జైవిక లక్షణాలకు అతీతమైంది. 4. సంస్కృతి జీవన చిత్రం అనే వాటిని ముఖ్యంగా దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది. వాటిలో ప్రతి ఒక్కటి సంక్లిష్టమైన దృగ్విషయాలనికి సంబంధించిన ఒక లక్షణాన్ని నొక్కి చెబుతుంది. మొదటిది సంస్కృతి నేర్చుకోవడానికి వీలున్నటువంటిదని, ఇతరులతో దీన్ని పంచుకోవచ్చని దీన్ని సమాజంతో నిమిత్తం లేకుండా ఒక వ్యక్తి సంపాదించడానికి వీలులేదనే అంశం ప్రత్యేకంగా ప్రస్తావిస్తే, రెండోది వారసత్వంగా అది సంక్రమిస్తుందన్న విషయాన్ని వివరపరుస్తుంది. మూడోది భౌతిక, శారీరక లక్షణాలతో దీనికి సంబంధం లేకుండా, దీనికంటూ ఒక స్వతంత్రమైన అర్థం ఉంటుందని తెలియజేస్తుంది. నాలుగోది సంస్కృతి వివిధ సమాజాలలో వివిధ రకాలుగా ఉంటుందని తెలుపుతుంది. దేశకాల



BRAOU

పరిస్థితులను బట్టి సంస్కృతిలో మార్పులు చేర్పులు సహజంగా జరుగుతూ ఉంటాయనే వాస్తవాన్ని వెలికి తీస్తుంది. ఈ నాలుగింటి ద్వారా సంస్కృతి భావనను స్పష్టంగా, సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి వీలవుతుంది.

## 9.5 సంస్కృతి ప్రకార్యాలు

మనిషి సంఘజీవేకాక సాంస్కృతిక జీవికూడా. మనిషి సామాజిక జీవితం సాధ్యమయ్యిందంటే అది సంస్కృతి వల్లనేనని చెప్పవచ్చు. సంస్కృతి మానవుణ్ణి పశుస్థాయి నుంచి ఉన్నతమైన మానవుని స్థాయికి ఉద్ధరించింది. సంస్కృతి లేకుండా మనిషి మనిషిగా మనలేడు. సంస్కృతి మానవజాతి సాధించిన విజయాలకు అధిరోహించిన ఉన్నత శిఖరాలకు అద్దంపడుతుంది. సంస్కృతి అనేక ప్రకార్యాలు నిర్వహిస్తూ ఉంటుంది. వాటిలో ముఖ్యమన వటిని కింద పేర్కొనడం జరిగింది.

**1. సంస్కృతి విజ్ఞాన భాండాగారం (ఖజానా):** సంస్కృతి మనిషి భౌతిక, సామాజిక, బౌద్ధిక జీవితానికి అత్యంత ప్రధానమైన విజ్ఞానాన్ని అందిస్తుంది. పశుపక్ష్యాదులు సహజాతాలను అనుసరించి ప్రవర్తిస్తాయి. వాటి సహాయంతోనే పరిసరాలకు అనువైన విధంగా సర్దుబాటు చేసుకుంటాయి. ఎక్కువ తెలివితేటలున్న మనిషయితే పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తిండమో, తనకు అనుకూలంగా పరిసరాలను సవరించుకోవడమో చేస్తాడు. పరిసరాలకు అనువైన విధంగా మసలుకోవడం, అవసరమైతే వాటిని తనకు అనుకూలంగా సరిదిద్దుకోవడం అనేది అతనికున్న విజ్ఞానం, నైపుణ్యాలవల్ల వీలవుతుంది. తన అనుభవాలను, విజ్ఞాన సంపదను భావితరాలవారికి అందివ్వడానికే కాక ఆసంపదను పరిరక్షించి, నిలబెట్టడానికి కూడా తోడ్పడుతుంది. అదే పశుపక్ష్యాదులకు ఈ సౌకర్యం ఉండదు. కారణం, వాటికి ఒక సంస్కృతి అంటూ ఉండక పోవడం. అవి ఉపమానవ (Sub-Human) స్థాయిలోనే ఉండటం.

**2. సంస్కృతి పరిస్థితిని నిర్వచిస్తుంది:** సంస్కృతి మన కోసం సామాజిక పరిస్థితిని నిర్వచిస్తుంది. ఇది కేవలం నిర్వచించడం మాత్రమేకాక మనం ఏమి తినాలి, ఏమి తాగాలి, ఏదుస్తులు ధరించాలి, ఏసమయంలో నవ్వాలి, ఏసమయంలో ఏడ్వాలి, నిద్రించాలి, స్నేహం చెయ్యాలి, ఏపని చెయ్యాలి, ఏదేవుడిని పూజించాలి, ఎలాంటి విజ్ఞానంపై ఆధారపడాలి, ఎలాంటి కవిత్వాన్ని చదవాలి వంటి వాటిని నియంత్రించడం, నిర్ధారించడం చేస్తుంది.

**3. సంస్కృతి మన దృష్టికోణాలను, విలువలను, లక్ష్యాలను నిర్వచిస్తుంది:** కొన్ని నిర్దిష్టమైన మార్గాలలో మన భావావేశాలు ఎలా ఉంటాయో తెలిపేదే దృక్కోణం. విలువలు అంటే ఏది మంచిదో, ఏది వాంఛనియమో తెలిపేవి. సాధించదగ్గ లక్ష్యాలను, విలువలు నిర్ణయించే వాటిని లక్ష్యాలంటారు. మతం, నైతికత, వివాహం, శాస్త్రం, కుటుంబనియంత్రణ, వ్యభిచారం వంటి అనేక సమస్యల విషయంలో మన దృక్పథాన్ని నిర్ణయించేది సంస్కృతే. ప్రయివేటు ఆస్తి, ప్రాథమిక హక్కులు, ప్రాతినిధ్య ప్రభుత్వం, ప్రేమ మొదలైనవి మన సంస్కృతి ప్రభావానికిలోనవుతాయి. పందెంలో గెలవడం, మోక్షం సాధించడం, పెద్దలు ఉపాధ్యాఉలపట్ల వినయవిధేయతలు చూపడం, దేశాభిమానం ప్రకటించడం వంటి వాటిని నిర్ణయించేది మన సంస్కృతే. అంటే పైన పేర్కొన్న ఆదర్శాల విషయంలో మన సామాజికీకరణ జరిగేది సంస్కృతి ద్వారానే అనవచ్చు.

**4. సంస్కృతి మన జీవనోపాధి మార్గాన్ని నిర్ణయిస్తుంది:** మనం డాక్టర్ అవ్వాలా, ఇంజనీరా, పొలందున్నే రైతా, సామాజిక శాస్త్రవేత్తా, సంఘసేవకుడా, రాజకీయ నాయకుడా, ఆచార్యుడా, మత ప్రచారకుడా అనేది నిర్ణయించేది మన సంస్కృతే. జీవనోపాధి మార్గాలకు పరిమితులను నిర్ణయించడంలో సంస్కృతి పాత్ర ఎంతో ఉంటుంది. వ్యక్తులు సంస్కృతి ధోరణులను పెంచడంగానీ, సవరించడంగానీ చేయవచ్చు. అయితే అతని ప్రవర్తన చివరికి సంస్కృతి గీచిన గీటు దాటి ఉండటానికి వీలులేదు. మనలో చాలా కొద్దిమందే సంస్కృతి ఏర్పరిచిన హద్దులు అతిక్రమించడానికి మార్గాలు ఏర్పరచుకోగలరు.

**5. సంస్కృతి ప్రవర్తన నమూనాలను అందిస్తుంది:** ఒక వ్యక్తి ప్రవర్తనను నిరేధశించిన హద్దుల్లో ఉండేట్లు నియంత్రించేది సంస్కృతే. అది మనిషికి కొన్ని లక్ష్యాలను ఏర్పరచి, వాటిని సాధించడానికి అనువైన మార్గాలను సూచిస్తుంది. మనిషి చేసే మంచి పనులకు అతన్ని సన్మానిస్తుంది. తప్పులకు శిక్ష విధిస్తుంది. అది మన అంతస్తును,



BRAOU

మనం నిర్వహించాల్సిన పాత్రను నిర్ణయిస్తుంది. సాంస్కృతిక అభిలాషలననుసరించే మన ఆశలు కృషి, మొదలైనవి ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషి తన సంస్కృతి చేతుల్లో బందీ అయి ఉంటాడు.

**6. సంస్కృతి మూర్తిమత్వాన్ని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది:** మనిషి మూర్తిమత్వం అభివృద్ధిపై సంస్కృతి ప్రభావం ఎంతో ఉంటుంది. సాంస్కృతిక వాతావరణం లేకుంటే ఏ శిశువులోనూ మానవ గుణాలు పెరిగి పెద్దవయ్యేవీలులేదు. మానవుడు సంఘజీవిగా బతకడానికి అవసరమైన శిక్షణావకాశాలు కల్పిస్తుంది. సామాజిక జీవనానికి అతన్ని సిద్ధం చేస్తుంది. జీవన మార్గాన్ని చూపుతుంది. తన వ్యక్తిత్వాన్ని పెంచుకోవడానికి అవకాశాలు కల్పిస్తుంది. రూత్‌బెనడిక్ట్ తన 'Patterns of Culture - and analysis' లో అన్నట్టు "ప్రతీ సంస్కృతి దాని ప్రత్యేకమైన కొన్ని తరహాల మూర్తిమత్వాన్ని కల్పిస్తుంది." మార్గరెట్ మీడ్ "సంస్కృతి మానవుని గుణగణాలను, ప్రవర్తన తీరును తీర్చిదిద్దుతుంది." అన్నారు. ఈ విషయాన్ని న్యూగినీ గిరిజనులకు సంబంధించి వారు జరిపిన పరిశోధనల ఆధారంగా నిరూపించి తన గ్రంథం Termparment in three primitive societies - A study of New Guinea Tribal life లో పొందుపరిచారు.

సంస్కృతి మనిషి వ్యక్తిత్వాన్ని, మూర్తిమత్వాన్ని మలచడమే కాకుండా సర్వజనీనమైన అంశాలను అందివ్వడమే కాకుండా ప్రత్యమ్నాయాలను కూడా సూచిస్తుంది. అంటే సంస్కృతిలో నిబంధనలకు కట్టుబడి ఉండడమే కాకుండా వైవిధ్యానికి కూడా అవకాశముంటుందన్న మాట. ఒక్క విషయం ఇక్కడ గుర్తుంచుకోవాలి. ఏ వ్యక్తీ సంపూర్ణంగా సాంస్కృతిక ప్రభావం వల్లనే ఎదుగుతాడనుకోవడానికి వీలులేదు. ప్రతీ మనిషిలో కొన్ని ప్రత్యేకమైన, విశిష్టమైన లక్షణాలుంటాయి. ఈ విశిష్టత అతని శక్తి సామర్థ్యాలు, అభిరుచి, జ్ఞాన సముపార్జనలపై ఆధారపడి ఉంటుంది. అంటే మనిషిపై సంస్కృతి ప్రసరించే ప్రభావం అందరిపైనా ఒకే విధంగా ఉండదని అర్థంచేసుకోవాలి. ఒకరి సంస్కృతి నిర్ధారించిన పరిమితులను మించిన ప్రభావాలకు లోనయ్యే అవకాశముంది. ఇది ముఖ్యంగా ఇతర సంస్కృతి నిర్ధారించిన పరిమితులను మించిన ప్రభావాలకు లోనయ్యే అవకాశముంది. ఇది ముఖ్యంగా ఇతర సంస్కృతి వ్యక్తులతో కలిసినప్పుడు అధికమవుతుంది. ఉదాహరణకు ప్రయాణాలు చేయడం, పుస్తకాలు చదవడం, సినిమాలు చూడడం, వార్తా పత్రికలు చదవడం, టెలివిజన్ చూడడం వంటి వాటిద్వారా తన సంస్కృతికి భిన్నమైన పరసంస్కృతి విశేషరూపాలను, ప్రవర్తన వతీరు ప్రభావానికి లోనయ్యే అవకాశముంది. ఏ సంస్కృతిలోనైనా జైవిక, సామాజిక పరిస్థితులు, వ్యక్తుల మూర్తిమత్వంలో విశిష్ట లక్షణాలు ఏర్పడటానికి దోహదం చేస్తాయి.

BRAOU

## 9.6 సంస్కృతిలో భిన్న అంశాలు

సంస్కృతిలో ప్రతీకాత్మక (Symbalic) అంశాలు (భౌతిక), ప్రతీకాత్మకం కాని అంశాలు (Non Symbolic aspects) అంటే భౌతిక (Material) అంశాలు రెండూ కలిసే ఉంటాయి. అందుకే సంస్కృతిని భౌతిక, అభౌతిక సంస్కృతులని రెండు భాగాలుగా విభజించడం జరుగుతూ ఉంటుంది. మనం ఆలోచించేవి, మనం చేసేవి, మనకు వాస్తవంగా ఉన్న లక్షణాల సంక్లిష్ట రూపమే సంస్కృతి అని ఇదివరకే తెలుసుకున్నాం. మరో విధంగా చెప్పాలంటే మనం ఆలోచించేది, చేసేది, మనకున్నది అనేవి మన సంస్కృతిలోని మూడు భిన్న అంశాలన్నమాట. అందుకే సంస్కృతి అంశాలను కింది విధంగా వర్గీకరించడం జరుగుతుంది.

సంస్కృతి
- ఆలోచించడం (ఇందులో విలువలు, విశ్వాసాలు, సిద్ధాంతాలు మొదలైనవి ఉంటాయి.)
- చేయడం (ప్రమాణాలు కలిసి ఉంటాయి.)
- మనకున్నవి. (భౌతిక వస్తు సముదాయం)

ప్రతీకాత్మక లక్షణాలు లేదా సంస్కృతి తాలూకు అభౌతిక లక్షణాలు ప్రతి సంస్కృతిలోనూ అధిక భాగం ఆక్రమించి ఉంటాయి. మన భాషలోని ప్రతి మాట ప్రతీకాత్మక లక్షణమే. ప్రతి భావం లేదా విశ్వాసం కూడా ఆ లక్షణాల సంక్లిష్ట స్వరూపమే. ఈ లక్షణాల మాధ్యమంగానే శతాబ్దాల తరబడి సాగిన మానవ అనుభవాల సారాన్ని గ్రంథాల్లో, గ్రంథాలయాలలో నిక్షిప్తం చేయబడ్డాయి. భావితరాల వారికి అందిస్తుండడం గమనించవచ్చు. ఈ రకంగా భద్రపరచిన తరతరాల అనుభవసారం గడిచిన రోజుల నాటి వారిజయాపజయాలను, గుణదోషాలను, ఆవేశకావేశాలను అర్థం చేసుకోవడానికి వాటినుంచి సరయిన పాఠాలు నేర్చుకొని తన ప్రవర్తనను మలుచుకోవడానికి వీలవుతుంది. అభౌతిక సంస్కృతి విలువలు, విశ్వాసాలు, సిద్ధాంతాలు, ప్రమాణాలు, జానపదరీతులు, సంప్రదాయాలు, శిష్టాచారాలు, సామాజిక రీతులు ఆచారాలను కలగలిపే సంస్కృతి.

ప్రతీకాత్మక లక్షణాలతో పాటు సంస్కృతిలో ప్రతీకాత్మకం కాని లక్షణాలు కూడా ఉంటాయి. ఇవి ప్రవర్తన నమూనాకు సంబంధించినవి. ప్రతీకాత్మకం కాని లక్షణాలకు ఉదాహరణలుగా భవనాలు, వంతెనలు, పుస్తకాలు, వాహకాలు మొదలైన వాటిని పేర్కొనవచ్చు.

ఈరకమైన ప్రతీకాత్మేతర లక్షణాలు స్వతంత్రమైనవి, మనుషుల ప్రవర్తనల ఫలితంగా ఏర్పడిన వీటికి మానవ ప్రవర్తనకు సంబంధంలేదు. వాటిని సృష్టించినవారు గతించాక కూడా ఎంతో కాలం మనగలుగుతాయి. ఉదాహరణకు ప్రాచీన సమాజాల శిథిలాల నుంచి ఆనాటి జీవన విధానాలకు సంబంధించిన సమాచారం సేకరించి ఆనాటి జీవిత చిత్రాలను రూపొందించవచ్చు - అంటే ఆనాటి సంస్కృతిక ప్రవర్తన రీతులను కన్నులకు కట్టినట్లు చూపడం సాధ్యమవుతుంది. ప్రతీకాత్మక, ప్రతీకాత్మేతర లక్షణాలు సునంఘటితమై ఉంటూ, సమగ్రము, సంగతము అయిన సామాజిక వ్యవస్థలో అంతర్భాగాలైన ప్రమాణీకృత నమూనాలుగా ఉంటాయి.

ఇంతవరకు జరిగిన చర్చలో ప్రతీకాత్మక లక్షణాలు ప్రతి సంస్కృతిలో అధికభాగం ఆక్రమించి ఉంటాయనే విషయం స్పష్టమైంది. అందువల్ల ఈ అంశాన్ని మరింత విపులంగా విలువలు, సామాజిక ప్రమాణాలు, విశ్వాసాలు, సిద్ధాంతాలు, జానపదరీతులు, సామాజిక రీతులు, ఆచారాలు, సంప్రదాయాలు మొదలైనవాటి గురించి తెలుసుకుందాం.

## 9.6.1. విలువలు

భావావేశాలు, అభిప్రాయాలు, చర్యలు, గుణాలు, వస్తువులు, వ్యక్తులు, సముదాయాలు, లక్ష్యాలు, సాధనాలు మొదలైన వాటిని వాంఛనీయాలో అవాంఛనీయాలో మదింపు చేయడానికి అనువైన ప్రమాణం లేదా భావనను విలువ అని నిర్వచించవచ్చు. ఒక సమాజ సంస్కృతిలో సామాజిక విలువలు అతి ప్రధానభాగంగా ఉంటాయి. సామాజిక వ్యవస్థ స్థిరత్వానికి, భద్రతకు విలువలు ఎంతో ప్రధానమైనవి. నడవడికి అవసరమైన మార్గదర్శకాలుగా ఇవి పనిచేస్తాయి. దైనందిన జీవితాన్ని, ప్రాధాన్యక్రమాలను, సుఖసంతోషాలు, బాధలను, ప్రత్యమ్నాయ మార్గాలను మదింపు చేయడానికి విలువలు ప్రధాన ఆధారాలవుతాయి. ఒక సామాజిక సమూహం ఆ సమాజంపు విలువలతో సమైక్యమై ఉంటుంది. వాటిని ప్రశ్నించడం ఎన్నడూ జరుగదు. వీటిని మౌనంగా అంగీకరించడం జరుగుతుంది. ఈ విలువలు ఒక సమాజపు తాత్విక చింతనల నుంచి గానీ, వాస్తవానుభవం నుంచిగానీ పుడతాయి. తాత్విక చింతన వాస్తవానుభవాలు, భౌతిక, సామాజిక పర్యావరణానికి సంబంధించి మనిషికున్న పరిజ్ఞానాన్ని బట్టి ఉంటాయి. భారతీయ సంస్కృతి లేదా భారతీయ జీవన విధానం అని అంటున్నప్పుడు భారతీయ సమాజం అంతటా వ్యాపించి, ఆదరిస్తున్న విలువల గురించే ప్రస్తావించామన్నమాట.

సామాజిక విలువలు రెండు రకాలు- 1. సాధారణ విలువలు, 2. నిర్దిష్ట విలువలు. ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం, అసమ్మతిని తెలిచజేసే హక్కు, ప్రాథమిక హక్కుల పట్ల గౌరవం, చేసే పనిపట్ల గౌరం వంటి విలువలు సాధారణమైనవి. ఈ తరహా విలువలు అమూర్తమైనటువంటివి, జీవితంలో సంపూర్ణంగా విస్తరించినవి, విలువల్లో అధికశాతం సర్వసాధారణమైనవై ఉంటాయి. సమాజం దృష్ట్యా చూస్తే వీటికి అధిక ప్రాధాన్యముంటుందని స్పష్టమవుతుంది.

కొన్ని కొన్ని విలువలను నిర్దిష్టంగా పేర్కొనడం జరుగుతూ ఉంటుంది. ఉదాహరణకు మనం శారీరక ఆరోగ్యానికి,

సంపన్నతలకు విలువ ఇస్తూ ఉండవచ్చు ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే నైలాన్ బట్టలకంటే పట్టు వస్త్రాలనే ఎక్కువగా అభిమానించవచ్చు. అట్లాగే ఒక నవలాకారునికంటే వేరొక నవలాకారుణ్నే ఎక్కువ అభిమానిస్తూ ఉండవచ్చు. విలువలు సాధారణంగా అమూర్తమైనవిగానీ, ఎంతో నిర్దిష్టమైనవిగా గానీ ఉంటూ ఉండవచ్చు.

అన్ని విలువలకు సమాజ ప్రాధాన్యం ఉండదు. విలువలను సాధారణంగా ఒక క్రమానుగతిలో అధిక ప్రాభల్యం కలవి, తక్కువ ప్రాభల్యం కలవి, మరికొన్ని అసలు ఏ ప్రాభల్యం లేనివి అనే తరతమ భేదాలను అనుసరించి ఒక క్రమంలో పేర్చబడి ఉంటాయి.

## 9.6.2 సామాజిక ప్రమాణాలు

ఒక సమాజంలో జీవిస్తున్నవారి జీవన విధానమే సంస్కృతి అని ఇదివరకే తెలుసుకున్నాం. సమాజ సభ్యుల మధ్య గాఢమైన బంధాన్ని కూర్చేది సంస్కృతి. ఆరోగ్యకరమైన సామాజిక జీవితానికి ఏది అభిలషణీయమో, ఏది కాదో సభ్యుల అనుభవం ద్వారా తెలుసుకొంటారు. ఈ రకమైన ప్రమాణాలు ఆ సమాజ సంస్కృతిలో ఒక భాగంగా ఉంటూ సభ్యులకు మార్గదర్శకాలవుతాయి. ప్రమాణీకరించిన సామాన్య సత్యాలే ఈ సామాజిక ప్రమాణాలు. అవి సామాజిక విలువలపై ఆధారపడి ఉంటాయి. వ్యక్తి ప్రవర్తన నిర్ధారణలో ప్రమాణాలు నమూనాలుగా కొన్ని పరిమితులను కల్పిస్తాయి. ప్రవర్తనకు ఈ ప్రమాణాలు బ్లూ ప్రింట్స్‌గా ఉంటాయి. అవి ప్రవర్తనను నిర్ణయిస్తాయి. దారి చూపుతాయి. నియంత్రిస్తాయి. అంతేకాక భవిషత్ ప్రవర్తనను సూచిస్తాయి.

ప్రమాణాలను గురించి సమాజశాస్త్రవేత్తలు ప్రస్తావిస్తునపడు వారి దృష్టిలోఉన్నది వ్యక్తుల (సమాజ సభ్యుల)ఆలోచనా విధానం కాదు వారుపనులు చేసే విధానవిధానమే. మనం చేసే అనేక పనులు మనం చెయ్యాకుండా ఉండే పనుల లక్షణం సాంస్కృతికమైనది. సాంస్కృతిక నమూనాను నిశితంగా పరిశీలించి చూసినప్పుడు అవి ప్రస్తుత భవిషత్ పోకడలను స్పష్టంగా తెలియజేస్తాయి. అంతేకాక ఆ ప్రమాణాలు మనిషి అనుసరించాల్సిన ప్రవర్తన నమూనాలను నిర్ధేశిస్తాయి. ఏ ప్రవర్తనా పద్ధతిని విడనాడాలో స్పష్టంగా తెలుపుతాయి.

సంస్కృతి తాలూకు చిరకాలానుభవ సిద్ధమైనవి (Prescriptive) నిషేధింపబడిన (Proscriptive) అంశాలకు సమాజంపై ఉన్న పట్టులో భేదాలుండవచ్చు.

కొన్ని సమాజాలు నిర్ణయించిన ప్రమాణాలకు సభ్యులు కట్టుబడి ఉండాలని వారిపై తీవ్రమైన ఒత్తిడి తెస్తే మరికొన్ని సమాజాలు అంత తీవ్రమైన ఒత్తిడి తేకపోవచ్చు. మరికొన్ని సమాజాలలతో ఏవిధమైన ఒత్తిడి ఉండకపోవచ్చు.

ప్రమాణాలు సమాజ నిర్మితికి అతి ప్రధానమైన అంశాలు నిజానికి ప్రమాణాలు, నిర్మతి రెండూపెనవేసుకొనే ఉంటాయి. ప్రమాణాలు లేని సందర్భంలో సామాజిక పరస్పర చర్యలుప్రమాదకరమైనవి, అతికష్టసాధ్యమైనవి,అస్తవ్యస్తత కల్పించేవి అయి ఉంటాయి.సమాజం యొక్క నిర్దేశాత్మక క్రమం వాస్తవక్రమాన్నిసాధ్యం చేస్తుంది.సామాజిక ప్రమాణాల ద్వారానేవృద్ధిచెందుతుంది.నిర్దేశాత్మక వ్యవస్థ సమాజ సమైక్యతను పెంపొందిస్తుంది. ఈసమైక్యతగనక లోపిస్తే సామాజిక జీవితం కష్ట సాధ్యమవుతుంది. ఇది సహకారానికి,పరస్పర సహాయానికి దారి తీస్తుంది.మనిషి సమాజం లేకుండా ఏకాకిగా బతకలేడు. అతని మనుగడ సమాజంపైనే ఆధారపడి ఉంటుంది. కలిసి బతకడమనేది ప్రమాణాల వల్లన సాధ్యమవుతుంది.ఒకమాటలో చెప్పాలంటే మనిషి సమాజంపై ఆధారపడటం అంటే నిర్ధేశాత్మక క్రమంపై ఆధారపడడమే.

## 9.6.3 విశ్వాసాలు

విలువలు ప్రధానంగా సామాజికమైనవి కాగా విశ్వాసాలు వ్యక్తిగతమైనవి. విలువల మాదిరి విశ్వాసాలు ఇది మంచి, చెడు, ఇది ఉచితం, ఇది అనుచితం అని నిర్ణయించడానికి ఏవిధమైన ప్రమాణాలను ఏర్పరచవు. విశ్వాసాలు వాస్తవమైనవి కావచ్చు. అవాస్తవమైనవి కావచ్చు. విశ్వాసాల ప్రామాణికతను, ఖచ్చితత్వాన్ని భౌతిక,సామాజిక పరిస్థితుల ద్వారా ఆర్జించిన అనుభవాల ఆధారంగా నిరూపించడం సాధ్యం కాదు.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదిమ జాతులు భూతప్రేత పిశాచాల పట్ల ప్రగాఢ విశ్వాసాన్ని ప్రకటిస్తాయి, వా టిని

తృప్తిపరచడం,నియంత్రించడాని ప్రయత్నిస్తాయి.ప్రపంచంలోని అన్ని ప్రాంతాలవారికి ఈనాటికీ ఇలాంటి విశ్వాసాలుంటాయి.ఎంతో అభివృద్ధి సాధించిన దేశాలవారిలో కూడా ఈ రకమైన విశ్వాసాలు కనిపిస్తాయి.విశ్వాసాలు కేవలం మతానికి సంబంధించినవి మాత్రమే అయి ఉండవు. ఈనాటి ఆధునిక సమాజాలలోముఖ్యంగా సామాజిక,ఆర్థిక,రాజకీయ రంగాలలో విశ్వాసాల ప్రాముఖ్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే ఉంది.

కొన్ని ప్రత్యేక విశ్వాసాలకు సామాజిక మూలం ఉంటుంది. ఈవిశ్వాసాలను అలవాట్లు,భావోద్వేక ప్రతిక్రియలు నిర్ణయిస్తాయి.ఒకే రకమైన జీవన విధానాన్ని అనుసరిస్తున్న ప్రజలలో విశ్వాసాల విషయంలో కూడా సామ్యం కనిపిస్తుంది.

విశ్వాసాలు సంస్థాపరమైనవిగా కూడా ఉంటాయి.ఉదాహరణకు అంధ విశ్వాసం (Dogma) అనే ఒక మతపరమైన విశ్వాసాన్ని ఆమత అనుయాయులంతా అంగీకరించాల్సి ఉంటుంది.అట్లాగే రాజకీయ అంధవిశ్వాసాలను ఆరాజకీయ పార్టీవారు అంగీకరించలే గానీ సవాలు చేయకూడదు.

అదర్శాలు. విలువలు,విశ్వాసాలతో పాటు ప్రతి సమాజంలోను కొన్ని ఆదర్శాలుంటాయి. ఆసమాజ సభ్యులందరు వాటిని గౌరవించాలని ఆసమాజం అభిలషిస్తుంది. ఆ ఆదర్శాలు కేవలం సత్యాలనే కాదు అవి ఆసమాజానికి మంచివని,ఆదరణీయమైనవనే ఉద్దేశంతోనే సభ్యులు వాటిని సమర్థించాలని ఆశించడం జరుగుతుంది.వాస్తవానికి ఒక సభ్యుడు తన సమాజంలో మంచిస్థానం, గౌరవమర్యాదలు పొందాలంటే వాటిని గౌరవించడం అతని నైతిక బాధ్యత అవుతుంది.ప్రతి సమాజానికి కొన్ని ఆదర్శాలుంటాయి. సమకాలీన, భారతీయ సమాజ సంస్కృతికి చెందిన భారతీయులందరూ సత్యమేవజయతి (Truth shall prevail)అన్న ఆదర్శాన్ని విశ్వసిస్తారు,గౌరవిస్తారు. ఈఆదర్శం స్వతస్సిద్ధసత్యంగా అందరూ భావిస్తారు. ఈఆదర్శం యదార్థతను నిరూపించాల్సినఅవసరం లేదు. ఒక్కొక్కప్పుడు అసత్యమే సత్యంపై విజయం సాధించవచ్చుననే దాన్ని కూడా లెక్కలోకి తీసుకోవడం జరుగుతుంది. అయితే ఇలాంటి పరిగణనకేవలం అసంగతమైందే అవుతుంది. సత్యమేవ జయతి అన్నది ఆదర్శమే కాని శాస్త్రీయమైన అంశం కాదనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. ఈఆదర్శాలకు కొంత పవిత్రతను ఆపాదించడం జరుగుతూ ఉంటుంది. ఈఆదర్శాన్ని గౌరవించేవారందరూ అది చూపే మార్గంలోనే నడుస్తూ ఉండకపోవచ్చు,తరచు వారి ప్రవర్తన అసత్యాలపైనే ఆధారపడి ఉండవచ్చు. అయితే ఎవరూ అసత్యమే అనుసరణీయమైన ఆదర్శమని బాహాటంగా ప్రకటించరు. అసత్యాన్నిఅనుసరించవచ్చునేమొ గానీ, ఆచరించడమని ప్రబోధించడం జరుగదు. అట్లాగే భారతీయులందరు పరిత్యాగం (renuciation) చక్కటి ఆదర్శమనే భావిస్తారు. ప్రాపంచిక సౌఖ్యాలను పరిత్యజించి ఆముష్మిక ఆనందానికి ప్రయత్నించే తాపసులను, మౌనులను భారతీయ సమాజం ఎంతో గౌరవిస్తుంది,ఆరాదిస్తుంది. కానీ ఏతల్లీ తన కొడుకు సర్వసంగపరిత్యాగి కావాలని కోరుకోదు. వీలైనంతవరకు ఆమార్గాన్ని అనుసరించకుండా అతడిని నిరోధిస్తుంది, నిరుత్సాహపరుస్తుంది. ఇలా చేసినంతమాత్రాన భారతీయ సమాజానికి ఈఆదర్శంపట్ల గౌరవం, ఆదరణలు లేవనిగానీ దాన్నిసమర్థించరనిగాని అర్థంకాదు. ఆదర్శం నిరుపమానమైంది. దాన్ని అనుసరించే వారికి ఆసమాజం శిరస్సువంచి పాదాభివందనం చేస్తుంది.ప్రతి సమాజానికి కొన్ని ఆదర్శలుంటాయి,ఆఆదర్శాలు ఆసమాజ సంస్కృతిలో విడదీయరాని భాగాలని అర్థం చేసుకోవాలి.

### 9.6.4 జానపద రీతులు

జానపద రీతులు అన్న మాటను సమాజ శాస్త్రంలో ప్రవేశపెట్టిన వారు డబ్ల్యూ.జి.సమ్నర్ (Folk ways published in 1906). జానపదులు అనుసరించే మార్గాలు అంటే ప్రవర్తన తాలూకు అలవాట్లను అన్నమాట. జానపద రీతులు ప్రమాణాల్లాంటివి. వాటికి వ్యక్తులు బద్ధులై ప్రవర్తించాల్సి ఉంటుంది. వీటిని ఆదరించి, ఆచరించడం సమాజలో తరతరాలుగా వస్తున్న ఆచారం అయినందువల్ల వాటిని మన్నించడం, అనుసరించడం సభ్యులందరి కర్తవ్యం.

జానపద రీతులు సమాజ సభ్యులందరూ ఆమోదించిన ప్రవర్తనారీతులు, పరిసరాలకు అనువుగా తమను తాము సర్దుబాటు చేసుకోవడానికి వీలుకల్పించే మార్గాలే ఈ జానపద రీతులని సమ్నర్ అభిప్రాయం.

జానపదరీతుల్లో ఆచారాలు సంప్రదాయాలు, అలవాట్లు, శిష్టాచారాలు మొదలైనవన్నీ కలిసే ఉంటాయి. సామాజిక జీవితావసరాలు తీర్చుకోవడానికి తోడ్పడే అనేక మార్గాలు ఇందులో సూచితమవుతాయి.

జానపదరీతులు సంప్రదాయసిద్ధంగా అనుసరిస్తూ వస్తున్న మార్గాలు. అయితే వీటిని విధిగా ఆచరించాలనే నిబంధన ఏదీ ఉండదు. అన్ని రకాల శిష్టాచారాలు, సామాజిక ప్రవర్తనా సరళులు జానపదరీతులుగానే భావించడం జరుగుతుంది. ఈ రకమైన సంప్రదాయాలు వివిధ సమాజాల్లో భిన్న రీతులలో ఉండవచ్చు. భోజనం చేసే విధానం, సంభాషణ తీరు, అభివాదం చేసే పద్ధతి, ప్రేమాభిమానాలు ప్రదర్శించే తీరు - ఇవన్నీ జానపద రీతుల ప్రతీకలే. ఒక్కొక్క సమాజంలో క్కొక్క రకమైన జానపదరీతులు ఉంటాయని ఇదివరకే తెలుసుకొన్నాం కదా! రాజపుత్‌లనే ఉదాహరణగా తీసుకోండి తలపాగా ధరించకుండా ఉంటే ఆ సమాజం నిర్దేశించే జానపద రీతులను ఉపేక్షించినట్టే అవుతుంది. అలాగే శుభ, అశుభ సందర్భాలలో ధరించాల్సిన వస్త్రాల విషయంలో కూడా కొన్ని సంప్రదాయాలున్నాయి. సామాజిక జీవితం ఏవిధమైన ఒడుదుడుకులు లేకుండా సాగడానికి కొన్ని శిష్టాచారాలను ప్రతి సమాజం ఏర్పరుస్తుంది. ఉదాహరణకు అతిథి అభ్యాగతుల విషయంలో పాటించవలసిన మర్యాదా, మన్ననలు. ప్రతి సమాజంలో ఇటువంటి సంప్రదాయాలుంటాయి. వాటిని సభ్యులందరూ పాటించాలని ఆ సమాజం ఆకాంక్షిస్తుంది.

జానపదరీతులను అనుసరించే తీరాలనిగానీ, వాటిని అతిక్రమించిన వారు శిక్షార్హులవుతారనిగానీ శిక్షలు అమలు చేయడానికి ఒక ప్రత్యేక చట్టబద్ధమైన యంత్రాంగం ఒకటుంటుందని గానీ అనుకోకూడదు. ఇవి సమాజం గౌరవించే సత్సంప్రదాయాలు. జానపద రీతులు రెండు ప్రధాన విధులు నిర్వహిస్తాయి. సమాజ నిర్మితిలో ప్రధానమైన అంశాలను అవి సమకూరుస్తాయి. జానపదరీతులను అనుసరించి ప్రవర్తించడంవల్ల వ్యక్తిలో భద్రతాభావం ఏర్పడుతుంది.

### 9.6.5 సామాజిక రీతులు

సమాజశాస్త్రంలో 'మోరిస్' (Moris) అనే పదాన్నికూడా సమ్నరే ప్రవేశపెట్టాడు. సామాజిక రీతులు లేదా 'మోరిస్' అనేవి ఆమోదించిన, విహితం చేసిన (Prescribed) ప్రవర్తన నమూనాలను (behaviour pattern) సూచిస్తాయి.

అన్ని జానపద రీతులకు సమాన ప్రాధాన్యముండదు. కొన్ని విధిగా పాటించాల్సినవి, నడవడికను క్రమబద్ధం చేసేవిగా ఉంటాయి. ఈ ప్రవర్తనను క్రమబద్ధం చేసే జానపదరీతులనే సాధారణంగా సామాజిక రీతులంటారు. సామాజిక సంక్షేమానికి అస్థిత్వానికి అత్యావశ్యకమైన జానపదరీతులనే సామాజిక రీతులని సమ్నర్ పేర్కొన్నాడు. సమ్నర్ సామాజిక రీతులను ఇలా నిర్వచించినాడు. "సర్వసామాన్య జనాదరణ పొందిన అభ్యాసాలు (usages), సంప్రదాయాలు అనేవి వాటికి బద్ధులై ప్రవర్తించాలని నిర్బంధం చేసినప్పుడు - వాటిని అనుసరించేట్లు చేయడానికి ఏ అధికార యంత్రంగం లేక పోయినా - వాటిని సామాజిక రీతులంటారు.

సామాజిక రీతులనేవి ప్రమాణాలు (norms) ఒక సమాజ సభ్యుడిగా వాటిని అనుసరించడం ఉచితమని భావించడం జరుగుతుంది. నైతిక ప్రవర్తనకు, సంి&రపదాయసిద్ధంగా ఉన్న ప్రవర్తనకు తేడా ఉన్నట్లే జానపదరీతులకు, సామాజిక రీతుకు కూడా తేడా ఉంటుంది. సామాజిక రీతుల అనుసరణ విధిగా జరిపించడానికి ఏ అధికార యంత్రాంగం లేకపోయినా సభ్యులందరూ వాటిని పాటించేట్లు వివిధ తరహాల మార్గాలు అనుసరించడం జరుగుతుంది. సమాజం ఆమోదం పొందిన రీతులను అతిక్రమించిన వారిపై నైతికమైన ఒత్తిడి తెచ్చి అనుసరించేట్లు చేస్తుంది. క్యూపద్ధతిని పాటించకుండా బస్సు ఎక్కడం సామాజిక రీతిని అతిక్రమించడానికి ఉదాహరణగా చెప్పవచ్చు. అలా ప్రయత్నించిన వాడిని బస్సు ఎక్కకుండా నిరోధించడం జరుగుతుంది. పురుషుడుగానీ, స్త్రీగానీ ఇతరులతో అక్రమసంబంధం ఏర్పరచుకొన్నప్పుడు, నీతిబాహ్యమైన పని చసినప్పుడు సమాజంలోని ఇతర సభ్యులు ఆ ప్రవర్తనను నిరశిస్తారు. ఈ నిరసన వ్యంగ్యరూపంలోనూ, సమాజ బహిష్కరణ రూపంలోనూ ఉండవచ్చు. ఈ రకంగా ఒత్తిడి తెచ్చి సామాజిక రీతులకు అనుగుణంగా ప్రవర్తించేటట్లు చేయడం జరుగుతూ ఉంటుంది.



BRAOU

సామాజిక రీతులు ఎప్పుడూ ఒకేలా ఉండకపోవచ్చు. ఒక సముదాయం పాటించే రీతులు మరో సముదాయంలో కనిపించకపోవచ్చు. అంటే ఒక సముదాయం అనుసరించే ప్రమాణాలు, విలువలు, సంప్రదాయాలకు భిన్నంగా ఉండటం వల్ల సామాజిక రీతుల్లో కూడా తేడాలు కనిపిస్తాయి. ఉదాహరణకు ఒక సముదాయం స్త్రీ పుర్వివాహాన్ని నిషేధిస్తే మరో సముదాయం దాన్ని ఆమోదించవచ్చు. అభ్యంతరం చెప్పకపోవచ్చు. మరో ఉదాహరణ తీసుకొండి. ఉత్తర భారతదేశంలో వివాహితులైన హిందూ స్త్రీలు తమ తలపై చారకొంగు కప్పుకోవాలనేది ఆచారం. కానీ అదే దక్షిణభారతంలో హిందూస్త్రీలలో ఇలాంటి ఆచారం కనిపించదు. ఈ ప్రాంతంలో భర్త చనిపోయిన వారే అలా చేస్తారు.

సామాజిక రీతలు మూడు ముఖ్యమైన విధులు నిర్వహిస్తాయి. అవి: 1. వీటిని ఖచ్చితంగా పాటించేట్లు సమాజంలోని కొందరు తీవ్రంగా ప్రయత్నిస్తారు. వాటిని పాటించని వారిపై నైతికంగా ఒత్తిడి తెస్తారు. అంటే సమాజసభ్యుల ప్రవర్తనను నిర్ణయించే సమూహం ఒకటి ఎప్పుడూ ఉంటుంది. 2. సమూహం నిర్ణయించిన సంప్రదాయాలను, సామాజిక రీతులను పాటించడం ద్వారా సభ్యులు ఆ సముదాయంలో మమేకమవుతారు. ఇలాంటిది సామాజిక జీవనంలో సంతృప్తిని కలిగించడానికి ఎంతో అవసరమవుతుంది. 3. ఇలాంటి ప్రవర్తన సామాజిక సంఘీభావానికి (group solidarity) బలం చేకూరుస్తుంది. సంఘీభావాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నించే సమూహం నిర్ణయించిన సామాజిక రీతులకు అనుకూలంగా సభ్యులందరూ ప్రవర్తించేట్లు చూస్తుంది.

సామాజిక రీతులు సామాజిక జీవితాన్ని కాపాడటానికి ఉపకరించే ముఖ్యసాధనాలు. సామాజికుల జీవితానుభవాల సారమే సామాజిక రీతులుగా, సంప్రదాయాలుగా రూపాంతరం చెందుతుంది. అందువల్లనే సభ్యులు సహజంగా ఇవి సరియైనవని భావిస్తూ ఉంటారు. ఆయాసమూహాలు ఏర్పరచుకొన్న సామాజిక రీతులను అతిక్రమించి ఏ సభ్యుడూ ప్రవర్తించడానికి ప్రయత్నించడు. దీనికి ఒక్కొక్కప్పుడు భయం కారణం కావచ్చు. లేదా ప్రత్యమ్నాయాలలో అంతర్గతంగా ఉన్న అనిశ్చితి కావచ్చు.

### 9.6.6 ఆచారాలు

జానపదరీతులు, సామాజిక రీతులు రెండూ కలిపితే ఏర్పడేవే ఆచారాలు. ఒక వ్యక్తి కొన్ని సమయాల్లో కొన్ని నిర్దిష్టమైన పనులు చేయడానికి అలవాటు పడి ఉన్నట్లే సమాజం కూడా జానపదరీతులు, సామాజిక రీతులను అలవాటు ప్రకారం ఆచరిస్తూ ఉంటుంది. వీటినే సామాజిక ఆచారాలు లేదా ఆచారాలు అంటారు.

మెకైవర్, పేజ్‌లు తెలిపినట్టు సమూహాలు, సంస్థలు, సంఘాలు వాటి వాటి నియమ నిబంధనలను కొన్ని సంక్లిష్టమైన అలవాట్లు, ఆచరణల ద్వారా కాపాడుకొంటూ, కొనసాగిస్తూ ఉంటాయి. తినడం, సంబాషించడం, మనుషులను కలుసుకోవడం, చిన్నవారికి శిక్షణనివ్వడం, వయోవృద్ధులను ఆదరించడం, ఆడటం, పనిచేయడం మొదలైన వాటికి సంబంధించి సమాజ సభ్యులందరూ ఆమోదించిన కొన్ని అలవాట్లు, ఆచారాలు ఉంటాయి. మెకైవర్, పేజ్‌ల అభిప్రాయంలో "సమాజం ఆమోదించిన ఆచరణ పద్ధతులే సమాజంలో ఆచారాలుగా పరిగణింపడతాయి."

ఆచారాలంటే తరతరాలవారు ఆచరిస్తూ వస్తున్న ఆచరణపద్ధతులని. భావితరాలవారు గతంలో మన్నన పొందినవి కాబట్టి పాటించడం జరుగుతుందని కింగ్‌స్లే డేవిడ్ అభిప్రాయం. ఒక్క మాటలో చెప్పాలంటే ఆచారాలంటే బహుకాలం నుంచి ప్రజలలో స్థిరపడిన అలవాట్లు.

### ఆచారాల స్వభావం

**1. ఆచారం ఒక సామాజిక దృగ్విషయం (Social phenomenon):** తరచూ ఆచరించే ఆచరణ పద్ధతులే ఆచారాలు, అవి దైనందిన జీవిత విశేషాలు. ఈ ఆచారాలను సమూహాలు, సంస్థలు, సంఘాలు ఏర్పరుస్తాయి. ఇవి సామాజిక శ్రేయస్సుకు దోహం చేస్తాయి. వాటికి సమాజం ఆమోదం లభిస్తుంది.

**2. తమకు తెలియకుండానే (ఏ ప్రయత్నం లేకుండానే) ఆచారాలను పాటిస్తారు:** మన సమాజం ఏర్పఇచన ఆచారాలను స్వచ్ఛందంగా అనుసరిస్తూ ఉంటామని మెవైవర్, పేజ్ల అభిప్రాయం. దీనికి కారణం ఆ ఆచారాలు

మన సమూహజీవితంలో అంతర్భాగాలుగా ఉండటమే. పిన్నవయసు నుంచే మనం ఎలా ప్రవర్తించాలో నేర్పడం జరుగుతుంది. మానవ శిశువులు అనుకరించడం ద్వారా గానీ ప్రత్యక్ష ఆదేశాల ద్వారాగానీ ఆచారాలను అలవరుచుకొంటారు. మనం ఎదిగే కొద్దీ అవి మన మూర్తిమత్వంలో ఒక భాగాంగా మారిపోతాయి.

3. **ఆచారాలు భిన్న రీతుల్లో ఉంటాయి** (Customs are varieted in nature): ఆచారాలనేవి సార్వజనీనమైనప్పటికీ అవి సమాజం సమాజానికి వేరు వేరుగా ఉంటాయి. ఉదాహరణకు వివాహ సమయం, మరణాలు సంభవించిన సమయాల్లో భిన్న రీతులు ఉండవచ్చు. అట్లాగే తిండి తినడం, దైవారాధన విషయంలో అనుసరించే ప్రవర్తనా తీరులలో కూడా వివిధ సమూహాల మధ్య తేడాలు కనిపిస్తాయి. క్రైస్తవులలో వివాహ సమయంలో ఉంగరాలు మార్చుకొనే ఆచారముంది. హిందువులు వివాహ సందర్భంలో వధువుకు మంగళ సూత్రం (తాళి) కట్టడం ఆచారం.

4. **ఆచారాల మూలం అస్పష్టమైంది** (Origin is obscure): ఆచారాలనేవి ఎట్లా, ఎక్కడనుంచి ఏర్పడ్డాయనేది చెప్పడం కష్టం. అనేక ఆచారాల ప్రయోజనాలు, లక్ష్యాలకు మూలం అతి పురాతన కాలంలోనే ఉంటుందని మెక్‌డోగల్ పేర్కొంటాడు. వీటి మూలానికి సంబంధించి ఏ ఒక్క వివరణ గానీ, సిద్ధాంతాన్ని గానీ ప్రతిపాదించడం సాధ్యం కాదు. మానవునికున్న అనేకానేక కోరికల సంతృప్తికి అనేక ఆచారాలు ఉదయించాయని మాత్రం చెప్పగలం.

5. **ఆచారాలు నాలుగు కాలాలపాటు నిలుస్తాయి**: జానపద రీతులు, ఫ్యాషన్‌లు, వేలం వెర్రి పోకడలు (fads) వంటి వాటితో పోలిస్తే ఆచారాలు నాలుగు కాలాల పాటు ప్రజాదరణ పొందేవిగా ఉంటాయి. ఇవి క్రమంగా ఏర్పడతాయి. సభ్యులు వాటిని స్వచ్ఛందంగా ఆదరించి అనుసరిస్తారు. ఒకసారి ఈ ఆచారాలు స్థిరపడితే అవి క్రమంగా బలోపేతమవుతాయి. వీటి పట్ల సభ్యుల ఆదరణ, మన్నన మొక్కవోనివి. వీటిని పాటించడానికి ముఖ్యమైన కారణం ఇవి చాలా కాలంనుంచి ఆదరించి ఆచరింపబడటమేనని చెప్పవచ్చు.

6. **అన్ని ఆచారాలు హేతువిరుద్ధమైనవి కావు** (All Customs are not irrational): అన్ని ఆచారాలు హేతు విరుద్ధమైనవి కావు. అయితే చాలా ఆచారాలు హేతుబద్ధము, అర్థవంతము అయి ఉండకపోవచ్చు. వాటి ప్రయోజనం అంతగా ఉండకపోవచ్చు. అవి నీతిబాహ్యమైన (అనైతికమైన)వి కావచ్చు. ఆధునిక కాలంలో హేతుబద్ధము, ప్రయోజనకరము, అర్థవంతము అయిన ఆచారాలకే ప్రాధాన్యమివ్వాలనే అభిప్రాయం కనిపిస్తుంది.

7. **సంప్రదాయాలు** (Traditions): ఆచారాలు దీర్ఘకాలం ఆచరణలో ఉండటం వల్ల వాటికి స్థిరత, బలం ఏర్పడి అవి క్రమంగా సంప్రదాయాలుగా మారతాయి. అంటే సంప్రదాయం దీర్ఘకాలం నుంచి ఆచరణలో ఉన్న ఆచారమే.

8. **శిష్టాచారం** (Etiquette) : నాగరిక సమాజంలో ఉన్న కొన్ని ఆచార వ్యవహారాలను శిష్టాచారాలంటారు. ఉదాహరణకు అతిథి కూర్చోనిదే ఇంటి యజమాని కూర్చోవడం మర్యాదకాదు. అట్లాగే అతిథి స్త్రీ అయినప్పుడు ఆమె రాగానే పురుషులు లేచి నుంచోవడం సదాచారం. వాస్తవానికి సంప్రదాయబద్ధమైన సమాజం వివిధ సమయాలలో వ్యక్తుల ప్రవర్తన తీరు ఎలా ఉండాలి అనేది నిర్ధారిస్తుంది. కొన్ని నిర్దిష్ట సమయాలలో లేదా పరిస్థితులలో వ్యక్తులు ఎలా ప్రవర్తించడం సభ్యులతో నిర్ణయించడంద్వారా శిష్టాచారం ఒక సామాజిక ప్రయోజనానికి తోడ్పడుతుందని స్పష్టమవుతుంది. శిష్టాచారం స్థూలంగా ఒక వ్యక్తి సామాజిక స్థాయిని, వర్గాన్ని సూచిస్తుంది.

పైన పేర్కొన్నవన్నీ సంస్కృతిలోని ముఖ్యాంశాలే.

## 9.7 సారాంశం

సమాజశాస్త్రంలో సంస్కృతి ఒక ముఖ్యమైన భావన. ఒక సమాజ అధ్యయనం ఆ సమాజ సంస్కృతి అధ్యయనానికి దారితీస్తుంది.

సంస్కృతి మానవుని విశిష్ట లక్షణం. సంస్కృతి ఎంతో విశాలమైన అర్థం గలది. దీనిలో మన జీవనశైలి, ప్రవర్తన 

BRAOU

ప్రమాణాలు, మన తత్వ చింతన, నైతికత, అలవాట్లు, ఆచారాలు, సంప్రదాయాలు, మన మత, రాజకీయ, ఆర్థిక కార్యకలాపాలు అన్నీ కలిసే ఉంటాయి. మానవుడు ఒక సమాజ సభ్యుడిగా సంపాదించిన అన్ని అంశాలు, అక్షణాలు అతని సంస్కృతిలో చేరి ఉంటాయి. "మానవుడు సమాజ సభ్యుడిగా సంపాదించిన విజ్ఞానం, విశ్వాసం, కళలు, నీతి సూత్రాలు, శాసనం, ఆచారం వంటి అన్ని అంశాల సంక్లిష్ట స్వరూపమే సంస్కృతి" అని ఎడ్వర్డ్ టైలర్ నిర్వచించాడు.

ఈ పాఠంలో మీరు సంస్కృతి లక్షణాలు, సంస్కృతిలోని ముఖ్యాంశాలను గురించి విపులంగా తెలుసుకొన్నారు. సామాజిక విలువలు, లక్ష్యాలు, సామాజిక ప్రమాణాలు, విశ్వాసాలు, జానపదరీతులు, సామాజిక రీతులు, ఆచారాలు, సంప్రదాయాలు, శిష్టాచారాలను గురించి చర్చ ఇందులో ఉంది. దీర్ఘకాలంనుంచి పాటిస్తూ వస్తున్న ఆచారాలే ఒక సమాజ సంప్రదాయాలవుతాయి. వీటిని అధ్యయనం చేయడమంటే సంస్కృతిని అధ్యయ్యనం చేయడమేనని గుర్తుంచుకోవాలి.

## 9.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబుల్వీండి.

1. సంస్కృతిని నిర్వచించి దాని లక్షణాలను చర్చించండి.

2. సంస్కృతి ప్రకార్యాలు ఏవి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబుల్వీండి.

1. సంస్కృతి అంటే ఏమిటి?

2. విలువలు, ప్రమాణాల గురించి క్లుప్తంగా వివరించండి.

## 9.8 చదవదగిన పుస్తకాలు


| | |
|---|---|
| Macgver and Page | : Society - An Intriductiory Analysis. |
| Horton. P.B. and C.L.Hunt | : Sociology |
| Harry. M. Johnson | : Sociology - A systematic Introduction |
| William F. Ogburn | : A Handbook of sociology. |
| Kingsley Davis | : Human society |
| Samuel Koering | : Sociology - An Introduction to the Science of Society |
| P.Gisbert | : Fundamentals of Sociology. |
| Robert Bierstedt | : The Social Order. |
| Green, A.W. | : Sociology. |


BRAOU

# భాగం-10: సంస్కృతి: మూర్తిమత్వం

విషయ క్రమం


10.0 ఉద్దేశాలు

10.1 పరిచయం

10.2 సంస్కృతి - అర్థం

10.3 మూర్తిమత్వం - అర్థం

10.4. మూర్తిమత్వం అభివృద్ధికి దోహదం చేసే అంశాలు

- 10.4.1 జైవిక అనువంశికత, మూర్తిమత్వం
- 10.4.2 భౌతిక పర్యావరణం, మూర్తిమత్వం
- 10.4.3 సంస్కృతి, మూర్తిమత్వం
- 10.4.4 సామూహికానుభవం, మూర్తిమత్వం
- 10.4.5 విశిష్టానుభవం, మూర్తిమత్వం

10.5 మూర్తిమత్వ వికాసంలో సంస్కృతి పాత్ర

10.6 సారాంశం

10.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

10.8 చదవదగిన పుస్తకాలు


## 10.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- మూర్తిమత్వ భావనను అర్థం చేసుకొంటారు.
- వివిధ కారకాంశాలు మూర్తిమత్వం ఏర్పడడంలో, వికాసం చెందడంలో ఏవిధంగా తోడ్పడతాయో వివరించగలుగుతారు.
- జైవిక అనువంశికత, భౌతిక పర్యావరణం మానవ మూర్తిమత్వంపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయో తెలుసుకొంటారు.
- మానవ మూర్తిమత్వ వికాసంలో సంస్కృతి పాత్రను ఎంతో తెలుసుకుంటారు.

## 10.1 పరిచయం

మానవ సమాజం చైతన్యవంతము, గతిశీలమైందే కాదు వైవిధ్యమున్నదికూడా. వివిధ సమాజాల మధ్య తారతమ్యాలుంటాయి. అల్లాగే ఒకే సమాజంలోని సభ్యులు, సముదాయాల మధ్యకూడా తేడాలుండడం సహజం. వాస్తవానికి సమాజం ఈ రకమైన తారతమ్యాల సూత్రంపై ఆధారపడే పనిచేస్తుంది. సమాజంలో వైవిధ్యం ఉండటానికి కారణం ఆ సమాజంలోని సభ్యుల మధ్య వైవిధ్యం, తారతమ్యాలు ఉండటమేనని చెప్పవచ్చు. మానవుల్లో వారి భౌతిక అభివృద్ధి, మానసిక స్థితి, నైతిక అధ్యాత్మిక ప్రవృత్తి, బౌద్ధిక కృషి మొదలైన వాటికి సంబంధించి తేడాలుంటాయి. వారి మనోభావాలు, గుణగణాలు, తెలివితేట ు, శక్తి సామర్థ్యాలు, అభిరుచులు,

### 10.4.1 జైవిక అనువంశికత, మూర్తిమత్వం

మూర్తిమత్వం ఏర్పడటానికి అవసరమైన ముడిపదార్థం అనువంశికత. ఈ ముడి సరుకును వివిధ రూపాలలో మలుచుకోవడానికి వీలుంటుంది. సాధారణ ఆరోగ్యం గల మానవులందరిలో కొన్ని జైవిక సారూప్యాలుంటాయి. అయినా జైవిక అనువంశికత అపూర్వమైందిగానే ఉంటుంది. అంటే కవలలలో తప్ప ఏ ఇద్దరు వ్యక్తులలోని జైవిక, భౌతిక లక్షణాలు అచ్చుగుద్దినట్లు ఒకే విధంగా ఉండవు. ఒక వ్యక్తి మూర్తిమత్వం, ఆ వ్యక్తి తాలూకు జైవిక అనువంశిక లక్షణాల సంపూర్ణ వికాసమే. ఈ రకమైన మూర్తిమత్వ లక్షణాలు - పట్టుదల(perseverance), లాలస (ambition), నిజాయితీ(honesty), నేర ప్రవృత్తి(criminality), తెలివితేటలు, లైంగిక విచలనం(sexdeviation), శారీరక శక్తి(physical energy), ఇతర అన్ని లక్షణాలు అనువంశికంగా సంక్రమించిన పూర్వాభిమానం(predisposition) నుంచే పుట్టుకొస్తాయి. అయితే ఈ అభిప్రాయానికి ఈనాడు అంత మన్నన లభించడంలేదు.

జైవిక అనువంశికత అనేది మానవుని మూర్తిమత్వాన్ని తీర్చి దిద్దడంలోనూ, మానవ ప్రవర్తనను ప్రభావితం చేయడంలోనూ అత్యంత ప్రభావం చూపుతుందనే వాదం ఒకటుంది. అనువంశికతను సమర్థించే మేధావులు - (ఫ్రాన్సిస్ గాల్టన్, కార్ల్ పియర్సన్, విలియం మెక్‌డొగల్, మరికొందరు) ఈ వాదనకు ఎంతో ప్రాచుర్యం కల్పించడానికి ప్రయత్నించాయి.

ఫ్రాన్సిస్ గాల్టన్ (1822-1911)లో రచించిన తన గ్రంథం "Hereditary Genius"లో ఇలా పేర్కొన్నాడు. మానవుల మధ్య ఉన్న తేడాలు అంతర్గతమైన, జన్మతః సిద్ధించినవి. ఔన్నత్యాన్ని సాధించిన వారు సహజంగా శక్తి యుక్తులుగలవారై ఉంటారని అతని అభిప్రాయం. మానవులు ప్రాథమికంగా అనుయాయులని అతను వాదించాడు. ఈ రకమైన అసమానతకు రెండు కారణాలను పేర్కొన్నాడు. అవి: 1. అనువంశికత, 2. పరిసరాలు. ఈరెండింటిలో అనువంశికతే ఎక్కువ ప్రభావం కలదని అతని విశ్వాసం. తన వాదనకు అనుకూలంగా కొన్ని ఆధారాలు చూపించాడు. శక్తి సంపన్నుడైన తండ్రి, శక్తిసంపన్నుడైన కొడుకుకు జన్మనిస్తాడు. అట్లాగే రాచకుటుంబాలు సామాన్యుడితో పోలిస్తే మంచి తెలివితేటలున్న సంతానాన్నే పొందుతాయి. ఒక వ్యక్తి సాధించే విజయాలపై ఆవ్యక్తి ఉంటున్న పర్యావరణ ప్రభావం ఏమీ ఉండదని అతని నిశ్చితాభిప్రాయం. పిల్లలకు తెలివితేటలు అబ్బేది వారి తల్లిదండ్రులు తెలివితేటలు గలవారైనప్పుడేనని ఫ్రాన్సిస్ గాల్టన్ పేర్కొంటాడు. పెంచి పోషించడంపై ప్రకృతి ప్రభావం ఎంతో ఉంటుందని అతని అభిప్రాయం. ఇన్ని చెప్పికూడా అతడు తన వాదనకు ముక్తాయింపుగా ఇలా పేర్కొన్నాడు: "అత్యంత శక్తి సామర్థ్యాలు లేనిదే అత్యున్నత గౌరవ మర్యాదలు, ప్రతిష్ట సంపాదించలేడు."

కార్ల్ పియర్సన్ (1857), ఫ్రాన్సిస్ వాదనను కొనసాగించాడు. పియర్సన్ అతని అనుయాయులు కొన్ని అధ్యయనాలు చేసి ఈ నిర్ణయానికి వచ్చారు. "మానవులలో తారతమ్యాలు ఉంటాయి. ఈ తారతమ్యాలు అనుకూలమైనవి కావచ్చు. అననుకూమైనవైనా కావచ్చు. ఈ లక్షణాలు అనువంశికమైనవి కావనడంలో సందేహంలేదు." ప్రభావశాలి అయినదని నిర్ధారించడానికి అతడు ఎంతో ప్రయత్నించాడు.

అనువంశికత ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పడానికి ప్రయత్నించిన మేధావులు కింద పేర్కొన్న ఆధారాలపై కొనసాగించిన పరిశీలన దృష్ట్యానే చేశారు. అవి: 1. వివిధ వృత్తిపరమైన సమూహాల మధ్య తెలివితేటల స్థాయిల్లో వ్యత్యాసాలుండటం. 2. విభిన్న జాతుల మధ్య తెలివితేటలకు సంబంధించిన అసమానతలుండటం, 3. ప్రఖ్యాతి చెందిన ఎడ్వర్డ్స్ కుటుంబాలను పతనమైన జ్యూక్స్ కుటుంబాల అధ్యయనం.

1. వివిధ వృత్తిపరమైన సమూహాల మధ్య తెలివితేటల స్థాయిల్లో తేడాలు: వివిధ వృత్తిపరమైన వర్గాల పిల్లలో తెలివితేటల స్థాయిల వ్యత్యాసాలను అనువంశికత ప్రభావానికి నిదర్శనంగా పేర్కొంటారు. ఒక అధ్యయనంలో వెల్లడయిన ఫలితాలు ఇలా ఉన్నాయి. వృత్తినైపుణ్యం గల తల్లిదండ్రుల పిల్లలలో ఐ.క్యూ. సగటున 116, సెమీ ప్రొఫెషనల్స్, మానెజిరియల్ తరగతి వారి పిల్లల్లో 112, క్లెరికల్ నైపుణ్యం అవసరమున్న వ్యాపారస్తుల, చిల్లర



BRAOU

తారతమ్యమనవచ్చు.

2. మూర్తిమత్వం మూలం సామాజిక వాతావరణంలో కనిపిస్తుంది. ప్రభావితమయ్యే వయసులో(impressionable) తోటివారితో సహజీవనం సాగించని వారిలో మూర్తిమత్వం ఏర్పడటానికి, వికసించడానికి అవకాశం ఉండదనే అంశాన్ని నిర్ద్వంద్వంగా నిరూపించడం జరిగింది.

### అన్నా ఉదాహరణ

1938లో 'అన్నా' అనే ఆరేళ్ల అమ్మాయిని ఐదవ ఏటనుంచి గదిలోనే ఉంచినట్లు తెలుసుకొన్నారు. ఆ అమ్మాయి బట్టలు, పరుపు చాలా మురికిగా అసహ్యంగా ఉండేవి. మాట్లాడటంగానీ, స్వతంత్రంగా నడవటంగానీ, సంజ్ఞలు చేయడంగానీ ఆ అమ్మాయికి చేతనయ్యేవికాదు. సరైన అహారం లేక బక్కచిక్కి ఉండేది. చీపురుపుల్లలాంటి కాళ్లు, బానపొట్టతో చిక్కి శల్యమైంది. ఆహారం ఏమీ ఇచ్చేవారు కాదు. తల్లి కేవలం కొంచెం ఆవుపాలను పట్టేది. ఆ అమ్మాయి తల్లి ఒక మందబుద్ధి. అన్నా అక్రమ సంబంధం ఫలితంగా పుట్టిన బిడ్డ కావడంతో ఎవరితో కలవకుండా, ఎవరికంటా పడకుండా అమ్మాయి తాతగారు గృహంలో ఏకాకిగా వదిలేసాడు. పనిభారం వల్ల తల్లికి బిడ్డ ఆలనా పాలనా చూసుకొనే తీరిక ఉండేదికాదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఆ బాలికను సంఘసేవకులు కొందరు చూసి ఆపిల్లను ఒక పల్లెటూళ్లో ఇంటికి తరలించారు. అక్కడ ఆ పిల్ల దాదాపు ఏడాదిన్నరపాటు ఉన్నది. నడవటం, స్వంతంగా ఆహారం తీసుకోవడం, ఇతరులు చెప్పే మాటలను అర్థం చేసుకొని వాటికి తగినట్లు ప్రవర్తించడం చేసేదికానీ మాట్లాడగలిగేది కాదు. చివరికి ఆ అమ్మాయిని మానసిక వికలాంగుల హోమ్ (బుద్ధి మాంద్యమున్న పిల్లల సంస్థ)కు మార్చారు. ఆహోమ్‌లో 3 సంవత్సరాలుండి చివరకు కామెర్లతో 1942లో చనిపోయింది. చనిపోయే నాటికి అన్నా పూసలుగుచ్చటం, కొన్ని రంగులను గుర్తించడం, చిన్న చిన్న చెక్క దిమ్మలతో చిన్న చిన్న కట్టడాలు కట్టడం వంటి పనులు చేయగలిగేది. చక్కగా ప్రవర్తించడం, తోటి పిల్లలకు సహాయం చేయడం నేర్చుకొంది. కొన్ని పద సంబంధాలను వాడటం కూడా అలవాటయ్యింది. (-ఆగ్బర్న్, నిమ్‌కాఫ్, పేజీ 66) చిన్న పిల్లను ఏకాంతంలో ఉంచడం వల్ల కలిగే పరిణామాలకు అన్నాను ఉదాహరణగా చెప్పవచ్చు. ఒక వ్యక్తి మూర్తిమత్వం ఏర్పడి వికసించాలంటే సమాజంలోని నలుగురితో సాంగత్యం అవసరమని చెప్పడానికి ఆ అమ్మాయి జీవితం ఒక చక్కని తార్కాణం. ఈ దృష్టితోనే ఫిచ్ ఇలా అన్నాడు. "మనుషుల మధ్య ఉన్నప్పుడే మనిషి మనిషవుతాడు."

3. మానవుడు ఎంచుకొన్న లక్ష్యాల ప్రమేయం లేకుండా అతని మూర్తిమత్వాన్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. కొన్ని జైవిక అవసరాలకు తోడు మనిషి సామాజిక జీవితం కొన్ని అవసరాలను కల్పిస్తుంది. వాటిని తీర్చుకోవడానికి చేసే ప్రయత్నం ఆవ్యక్తి మూర్తిమత్వంపై ప్రభావం చూపుతుంది. మూర్తిమత్వాన్ని మలుస్తుంది. ఒక లక్ష్య సాధన కోసం ప్రయత్నించే వ్యక్తి ప్రవర్తన ఒక విధంగా ఉంటే, మరో రకం లక్ష్యాన్ని సాధించడంలో ఆవ్యక్తి ప్రవర్తన మరో విధంగా ఉంటుంది. అంటే మనం ఎంచుకొన్న లక్ష్యాన్ని బట్టి మన ప్రవర్తనలో వైవిధ్యం ఏర్పడుతుందన్నమాట.

4. మూర్తిమత్వం జైవిక, సామాజిక అంశాల సంఘటిత రూపం. ఈ అంశాలను ఒక వ్యక్తి మూర్తిమత్వం నుంచి వేరు చేయడం సాధ్యం కాదు. మనిషి బాల్యంలో ఆకలి, ఉద్వేగం లాంటి లక్షణాలు అతని ప్రవర్తనను నిర్దేశిస్తుంటాయి. పిల్లవాడు పెరుగుతున్నకొద్దీ విచక్షణాజ్ఞానం కూడా పెరుగుతుంది. వివిధ అంశాలను సమన్వయం చేయడం జరుగూ ఉంటుంది. ఈ రకమైన సమన్వయం, ఏకీకరణ ఎంత ఎక్కువగా జరుగుతుందో అతని సమీకృత మూర్తిమత్వం కూడా అంత త్వరగా వృద్ధి అవుతూ పోతుంది.

## 10.4 మూర్తిమత్వం అభివృద్ధికి దోహదం చేసే అంశాలు

కింద పేర్కొన్న అంశాలు మూర్తిమత్వాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని శాస్త్రజ్ఞులు సాధారణంగా భావిస్తుంటారు. అవి: 1. జైవిక పారంపర్యం(biological inheritance), 2. భౌతిక పరిసరాలు, 3. సంస్కృతి, 4. అనుభవం, 5. అపూర్వఅనుభవం(unique experience), ఇప్పుడు ఈ అంశాలను గురించి వివరంగా తెలుసుకొందాం.

BRAOU

దృక్కోణాలు, ప్రవృత్తి, మానసిక ఆరోగ్యం మొదలైన వాటికి సంబంధించిన తేడాలు కొట్టవచ్చినట్టు కనిపిస్తాయి. వ్యక్తుల మధ్య ఈ రకమైన తేడాలకు కారణం వివిధ రకాలుగా ఉన్న వారి మూర్తిమత్వమేనని చెప్పాలి. వ్యక్తుల మధ్య తేడాలు అనివార్యమనే చెప్పవచ్చు. కారణం వ్యక్తి మూర్తిమత్వం అనేది భౌతిక, మానసిక లక్షణాలు, గుణాల విశిష్ట సమ్మేళనం కావడమే. అలాంటప్పుడు మూర్తిమత్వం తాలూకు భౌతిక, మానసిక లక్షణాలు పెంపొందడానికి దోహదం చేసే కారకాంశాలు ఏవి అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఏ లక్షణాలు వ్యక్తి మూర్తిమత్వం విశిష్టమైనదిగా భాసించడానికి తోడ్పడుతుంది అనేది ప్రముఖంగా ఎదురయ్యే ప్రశ్న. ఈ అంశాలను గురించి కింద చర్చించడం జరుగుతుంది.

## 10.2 సంస్కృతి - అర్థం

సంస్కృతి అనేది ఒక విశాలమైన అర్థమున్న మాట. ఇందులో మానవజీవితంలోని ప్రతి రంగం ప్రవర్తన తీరుతెన్నులు, నైతిక నడవడి, మన చింతనాధోరణులు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, ఆర్థిక సామాజిక, రాజకీయ, మత సంబంధమైన కార్యకలాపాలు అన్నీ చేరి ఉంటాయి. వీటన్నింటి సమాహారమే సంస్కృతి. సంస్కృతిలో మానవుడు తన సామాజిక జీవితంలో సంపాదించిన, అలవరచుకొన్న అన్ని తరహాల ప్రవర్తనా తీరులు రాశీ భూతమై ఉంటాయి. మెకైవర్, పేజ్‌ల మాటల్లో చెప్పాలంటే సంస్కృతిలో జీవనశైలి, విలువలు, ఉద్వేగపూరితమైన అనురక్తి, భౌతిక సాహసకృత్యాలు కలిసి ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మన ఆలోచనా విధానం, మనం ప్రవర్తించే తీరు అంతెందుకు సమాజంలో సభ్యుడిగా మనం నిర్వర్తించే ప్రతిపనీ, నడచుకునే తీరు అన్నింటి సమ్మిశ్రిత సంక్లిష్ట రూపమే అంటే అతిశయోక్తి కాదు.

## 10.3 మూర్తిమత్వం- అర్థం

కింబాల్‌యంగ్ మూర్తిమత్వాన్ని ఈ విధంగా నిర్వచించాడు."సామాజిక సహభాగిత దృష్ట్యా మనిషి వ్యవస్థీకరించుకొన్న భావాలు, ప్రతిబింబాలు, దృక్పథాలు వీటి మొత్తమే మూర్తిమత్వం".

మూర్తిమత్వం అంటే మానవుని సామాజిక - మానసిక ప్రవర్తనల సంఘటిత రూపమని, అతని చర్యలు, అలవాట్లను, అనుభూతులు, దృష్టికోణాలు, అభిప్రాయాలు ప్రాతినిథ్యం వహిస్తాయని చెప్పవచ్చు. అంతేకాక పైన తెలిపిన నిర్వచనం ద్వారా సామాజిక పరిస్థితుల పూర్వరంగంలో మూర్తిమత్వాన్ని నిర్వచించడం జరిగిందని, మూర్తిమత్వం సామాజిక పరస్పర చర్యల ద్వారా అభివ్యక్తమవుతుందని తెలుస్తుంది.

మూర్తిమత్వపు వివిధ కోణాలను స్పష్టంగా తెలియజెప్పడానికి ప్రసిద్ధులైన మనో వైజ్ఞానికులు - ఆల్‌పోర్ట్, వాట్సన్ - అభిప్రాయాలను పరిశీలిద్దాం. ఆల్ పోర్టు మూర్తిమత్వాన్ని ఈ విధంగా నిర్వచించాడు. మూర్తిమత్వం అనేది మానవునిలోని ఒక చైతన్యవంతమైన మానసిక వ్యవస్థ. ఈ లక్షణమే పరిసరాలతో సర్దుకొని పోయే విశిష్ట మానవ స్వభావాన్ని తెలియజేస్తుంది. "మన మూర్తిమత్వం మనం దేనితో ప్రారంభమయ్యామో దాని ఫలితంగా ఏర్పడేది. మనం జీవన వ్యాపారంలో అనుభవిస్తూ వస్తున్నది" ఒక్క మాటలో చెప్పాలంటే అది మన పరస్పర చర్యల సమగ్రరూపం.

పైన తెలిపిన రెండు నిర్వచనాలను విశ్లేషించి చూస్తే మూర్తిమత్వం లక్షణాలు సుస్పష్టమవుతాయి. మూర్తిమత్వ ప్రధాన లక్షణాలను కింది విధంగా పేర్కొనవచ్చు.

1. ఆత్మచేతనత్వం: మూర్తిమత్వం ప్రముఖలక్షణాలలో ఒకటి. ఏ వ్యక్తిలో ఆత్మచైతన్యం కలుగుతుందో ఆ వ్యక్తిలో మూర్తిమత్వం ఉందని స్పష్టమవుతుంది. ఒక శిశువునకు మూర్తిమత్వాన్ని ఆపాదించలేము. దీనికి కారణం ఆ శిశువు ఆలోచనలలో, పరావర్తనలో(reflection), ప్రవర్తన తీరులో సమన్వయం లోపించడమే. ఇలాంటి సమన్వయం ఒక యుక్తవయస్కుడిలోనే ఏర్పడి ఉంటుంది. జంతుజాలంలో మూర్తిమత్వం కనిపించదు. అదే మనుషుల్లో మూర్తిమత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ లక్షణమే మానవునికి పశుపక్ష్యాదులకు ఉన్న విశిష్టమైన



BRAOU

వ్యాపారం చేసేవారి పిల్లల ఐ.క్యూ 107.5గానూ, సెమీ స్కిల్స్ మైనర్ వృత్తుల్లోని వారి వ్యాపారస్తుల పిల్లల ఐ.క్యూ 105గానూ, కొద్దిపాటి నైపుణ్యంగల వారి పిల్లల ఐ.క్యూ 98గానూ, కార్మికులు, నగర, గ్రామీణ రైతుల పిల్లల ఐ.క్యూ 96 గాను ఉన్నట్టు తేలింది. ఐ.కూ.లోని ఈ వ్యత్యాసాలు ప్రధానంగా అనువంశికత మూలంగానే ఏర్పడ్డాయని నిర్ధారించారు.

2. జాతిపరంగా తెలివితేటలలోని అసమానతలు - తెల్లవారు, నీగ్రోలు: అమెరికాలో తెల్లవాళ్లు, నీగ్రోలకు సంబంధించి అనేక మానసిక తెలివితేటల తాలూకు పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ అధ్యయనాలలో నీగ్రోలతో పోలిస్తే తెల్లవాళ్ల తెలివితేటలు మెరుగ్గా ఉన్నట్లు తేలింది. ఉదాహరణకు మొదటి ప్రపంచయుద్ధ సమయంలో సైనికుల నియామకం చేస్తున్నప్పుడు నీగ్రోల మానసిక వయసు (mental age) 10.4 సంవత్సరాలుగానూ, తెల్లవాళ్ల మానసిక వయసు 13.1 సంవత్సరాలుగానూ తేలింది.

3. ఎడ్వర్డ్స్, జ్యూక్స్ కుటుంబాల అధ్యయనం: అనువంశికతకు సంబంధించి ఎడ్వర్డ్స్, జ్యూక్స్ కుటుంబాల విషయంలో నిర్వహించిన అధ్యయనంలో విభ్రాంతి కలిగించే విషయాలు వెల్లడయ్యాయి. 19వ శతాబ్దం చివరిలో అమెరికాలోని జోనథాన్ ఎడ్వర్డ్స్ సంతతి వారిని 1391 మందిని అధ్యయనం చేయడం జరిగింది. వీరిలో 295 మందికిపైగా కాలేజీ పట్టభద్రులు. వీరిలో 13 మంది కాలేజీ ప్రెసిడెంట్స్ లేదా ప్రిన్సిపాల్స్, ఒక అమెరికన్ వైస్ ప్రెసిడెంట్ ఉన్నారు. రికార్డులను పరిశీలిస్తే ఏ ఒక్కరూ నేరం చేసిన దాఖలాలు లేవు.

ఈ విషయాలకు భిన్నంగా 1887లో 1200 మందిని, 1720లో న్యూయార్క్‌లో జన్మించిన జ్యూక్స్ సంతతి వారిని గుర్తించడం జరిగింది. వీరిలో 440 మంది శారీరకంగా వైకల్యం కలవారుగాను, జబ్బుపడ్డవారుగానూ ఉన్నట్టు, 310 మంది నిర్ధనులు(paupers) గానూ,130 మంది నేరానికి శిక్షపడ్డవారుగానూ, 7 మంది హంతకులుగా ముద్రపడ్డవారుగానూ కనుక్కోవడం జరిగింది. ఈవిశేషాల ఆధారంగా అనువంశికత, పర్యావరణాల ప్రభావాలే ఈ రెండు కుటుంబాల సభ్యుల ప్రవర్తనలలోని వైరుధ్యానికి ప్రముఖ కారణమని నిర్ధారించడం జరిగింది.

అనువంశికత సమర్థించేవారు చేసిన నిర్ధారణలు కొంత ఆసక్తిని రేకెత్తించేవిగానే కనబడతాయి. అయితే అవి ఏకపక్షంగా ఉన్నట్లు స్పష్టమవుతుంది. అంతేకాక అవి తప్పుదోవ పట్టించేవిగాను, గోరంతలు కొండంతలు చేసినవిగానూ కనబడతాయనడంలో సందేహంలేదు. పై వాదనను ప్రచారం చేసే మేధావులు రచయితలు పరిసరాల ప్రభావాన్ని గురించి లోతుగా అధ్యయనం చేయడానికి ఏవిధమైన ప్రయత్నం చేసినట్లు కనబడదు. ఇదివరకు తెలిపిన వివిధ వృత్తి సమూహాలు, జాతి సమూహాలు, కుటుంబ సమూహాల సామాజిక వాతావరణం అందుబాటులో ఉన్న అవకాశాలకు సంబంధించి సారూప్యం ఉందా అనే అంశాన్ని పరిశీలించడం చాలా అవసరం. అయితే మేధావులు, రచయితలు ఈ అంశాన్ని పరిశీలించక అలక్ష్యం చేసినట్లు స్పష్టమవుతుంది.

వివిధ వర్గాలవారిపై నిర్వహించిన తెలివితేటల పరీక్షల(Intelligence Tests) విషయంలో కొన్ని సందేహాలున్నాయి. అవి: 1. ఈ రకమైన పరీక్షలు వ్యక్తి జ్ఞానాన్ని పరీక్షించేవే అయినందువల్ల వ్యక్తి మౌలికమైన తెలివితేటకు సంబంధించి సరియైన మూల్యాంకనం(evaluation) చేయడానికి తోడ్పడవు. 2. తెల్లవాళ్ల, నీగ్రోల, వివిధ వృత్తి సమూహాల సంస్కృతిక నేపథ్యంలో ఏకరూపత కనిపించదు. 3. నిర్వహించిన ఇంటలీజెన్స్ పరీక్షలను నిష్పక్షపాతంగా, వియనిష్టతతో నిర్వహించారనడం సందేహాస్పదమైనదే. 4. చివరగా తెలివితేటలనేవి కేవలం అనువంశికత వల్లనే సంక్రమించేవికావు. పరిసరాల ప్రభావం కూడా ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ అధ్యయనాలన్నీ పరిసరాల ప్రభావాన్ని పూర్తిగా అలక్ష్యం చేశాయి.

రెండు భిన్న కుటుంబాలకు సంబంధించి చేసిన అధ్యయనాలలో కూడా కొన్ని లోపాలను గుర్తించడం జరిగింది. అవి:

1. జ్యూక్స్, ఎడ్వర్డ్స్ కుటుంబాల ప్రస్తుత తరానికి 9, 10 తరాల నాటి కుటుంబ లక్షణాలున్నాయని చెప్పడానికి బలమైన సాక్ష్యాధారాలు లేవు. జైవిక అంశాల దృష్ట్యా పరిశీలిస్తే తరవాతి తరం ముందు తరం తాలూకు కార్బన్ కాపీగా ఉండదనేది వాస్తవం.

2. ఇరు పార్శ్వాల సంతతిని అంతటిని అధ్యయనాంశంగా తీసుకోనందువల్ల ఈ అధ్యయనం అసంపూర్ణమైందనవచ్చు.

3. పక్షపాత దృష్టితోనే జ్యూక్స్ సంతతికోసం జైళ్లు, అనాథ శరణాలయాలను, పతనమైన కుటుంబాలను వెదకడం, ఎడ్వర్డ్స్ సంతతివారికోసం ప్రతిష్ఠాత్మక ప్రదేశాలలో వెదకడం జరిగినట్లు కనిపిస్తుంది. ఎడ్వర్డ్స్ కుటుంబానికి సంబంధించి జరిపిన తరవాత పరిశోధనల్లో ఎలిజబెత్ టుట్‌లా, జోనథాన్ ఎడ్వర్డ్స్ అవ్వగారు పరపురుష సంపర్కానికి పాల్పడినట్లు, ఆమె సోదరి తన సొంత కొడుకునే హత్య చేసినట్లు, చివరికి ఆమె తన సొంత కొడుకుచేతిలోనే హతమైనట్లు బైటపడ్డాయి. అనువంశికతను సమర్థించేవారు ఈ సంఘటనలను తగిన విధంగా వివరించలేరు. అనువంశికతను సమర్థించేవారు జ్యూక్స్, ఎడ్వర్డ్స్ కుటుంబాలు పుట్టి పెరిగిన పరిస్థితులను అసలు పట్టించుకోలేదు.

## 10.4.2 భౌతిక పర్యావరణం, మూర్తిమత్వం

పర్యావరణం అంటే ఒక అంశాన్ని, వ్యక్తిని, కుటుంబాన్ని ఆవరించి ఉన్నవాటిపై ప్రభావం చూపే పరిస్థితులు. కింబాల్‌యంగ్ అభిప్రాయంలో పర్యావరణం అంటే "ఒక జీవిని బయటనుంచి ప్రభావితం చేసే శక్తులు, పరిస్థితులు లేదా ప్రేరణలు" పర్యావరణం అటు సమాజాన్ని, ఇటు వ్యక్తి ప్రవర్తనను ప్రభావితం చేయగలిగినంత ప్రభావశీలి.

పరిసరాలు స్థూలంగా రెండు రకాలు. 1. భౌతిక పరిసరాలు, 2. మానవకల్పిత పరిసరాలు(man made environment). భౌతిక పరిసరాలలో జీవితానికి సంబంధించిన భౌతిక పరిస్థితులు ఉంటాయి.మానవ అస్తిత్వంతో ప్రమేయంలేకుండానే కొన్ని భౌతిక పరిస్థితులుంటాయి. వాటిపై మానవునికున్న పట్టుకొన్ని సమయాలలో పరిమితంగాను ,కొన్ని సమయాలలో అసలు లేకుండాను ఉంటుంది.భూమి ఉపరితలం,సహజ వనరులు, భూమి, నీరు,పర్వతాలు, మైదానాలు, సారవంతమైన నేలలు, ఎడారులు, మహాసముద్రాలు, గాలివానలు, తుఫానులు, వాతావరణాంశాలు, ఋతువులు మొదలైనవన్నీ భౌతిక పర్యావరణంలోని భాగాలు. ఇందులో జైవిక పరిస్థితులు వాటివాటి సంక్లిష్టరూపాలలో వృక్ష, జంతు సంపదను కల్పిస్తాయి.

మానవుడు కల్పించిన పరిసరాల్లో సామాజిక సాంస్కృతిక పరిసరమని అంటారు. దీన్ని (1) బాహ్య పరిసరం అని (2)అంత పరిసరమని రెండు ఉపవిభాగాలుగా వర్గీకరించవచ్చు.

శాస్త్రసాంకేతిక అంశాలను ప్రవేశపెట్టడం ద్వారా భౌతికపర్యావరణ పరిస్థితులను మార్చడానికి మానవుడు ప్రయత్నించాడు,ప్రయత్నిస్తున్నాడు.ఇలాంటిదాన్ని బాహ్యపర్యావరణమని అర్థం చేసుకోవాలి. మనం నివసిస్తున్న ఇళ్ళు,నగరాలు, మనం ఉపయోగిస్తున్న రవాణా, కమ్యూనికేషన్ సాధనాలు,మనం అనుభవిస్తున్న వివిధ రకాల సదుపాయాలు, సౌకర్యాలుదీనికి చక్కని ఉదాహరణలు.

సమాజమే అంతః పరిసరమని అర్థం చేసుకోవాలి. సామాజిక వాతావరణం అనేది సమాజం కొనసాగినంత కాలం మనగలుగుతుంది. ఇందులో వివిధ వ్యవస్థలు, నియమనిబంధనలు, సంప్రదాయాలు, సంస్థలు చేరి ఉంటాయి. జానపదరీతులు, ఆచారవ్యవహారాలు ఇందులో అంతర్భాగాలుగా ఉంటాయి.

పైన పేర్కొన్న రెండు రకాల పరిసరాలు- భౌతిక, సామాజిక- సాంస్కృతిక - రెండూ మానవుని మూర్తిమత్వంపై విశేష ప్రభావాన్ని చూపుతాయి. భౌతిక పరిసరం మానవుని వ్యక్తిత్వానికి పరిమితులు విధిస్తుంటుంది. దాని అభివృద్ధికి అవకాశాలు కల్పిస్తుంది కూడా. గతంలో జరిపిన కొన్ని అధ్యయనాలు మానవ ప్రవర్తనలను వాతావరణ, భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా జరిపినట్టువంటివే. సోరోకిన్ (1928), కన్‌ఫ్యూషియస్, అరిస్టాటిల్, హిపోక్రటస్ వంటి మహా మేధావులు మొదలుకొని ఈ నాటి ఎల్స్‌వర్త్ హంటింగ్‌టన్ అనే భూగోళశాస్త్రజ్ఞుడు ప్రతిపాదించిన సిద్ధాంతాల సారంశం అందుబాటులో ఉంది. హంటింగ్‌టన్ ప్రవర్తనకు సంబంధించి వివిధ సమూహాల మధ్య తేడాలు ఆయా సమూహాలుంటున్న వాతావరణం, భూ ఆకృతి (topography), వనరులు మొదలైన వాటి ప్రభావం వల్లనే అని వివరించాడు. ఇలాంటి సిద్ధాంతాలు జాతి కేంద్రక చట్రం (ethnocentric framework)లో చక్కగా

ఇముడుతాయి. ఎందుకంటే భూగోళశాస్త్రం మన జాతీయ సుగుణాలను, ఇతర జాతుల అవగుణాలను నిష్పక్షపాతంగా వివరించడానికి తోడ్పడతాయి కనుక.

అయితే సాంస్కృతిక పరిణామంలో భౌతిక పరిసరం ఒక చిన్న అంశం మాత్రమే. అంతేకాక మూర్తిమత్వ వికాసంలో దీని పాత్ర మరీ అల్పమనే చెప్పాలి. వస్తవానికి ప్రతివాతావరణ పరిస్థితిలోనూ ఏరకమైన మూర్తిమత్వమైనా కనిపించడం సాధ్యం. మూర్తిమత్వంపై పరిసర ప్రభావం కొంతవరకు లేకపోలేదు. అథబాస్కన్స్ అనే వారు సబ్ ఆర్కిటిక్ వాతావరణంలో బతికి బట్టకట్టడానికి అనువైన, కఠినమైన, ప్రభావశీలమైన మూర్తిమత్వాన్ని పెంపొందిచుకోడం జరిగింది. ( బాయర్, 1947). ఆస్ట్రేలియాలోని బుష్మెన్ తన మనుగడకు భీషణ పోరాటం చేయవలసిరాగా, సమావోన్స్ రోజులో ఉన్న కొద్ది సమయంలోనే ఆహారాన్ని సేరకించుకోవలసి వచ్చింది. ఈనాటి ప్రపంచంలో కొన్ని ప్రాంతాలు అతి తక్కువ జనాభాను మాత్రమే పోషించగలిగే స్థితిలో ఉంటున్నాయి. అలాంటి ప్రాంతాలలోని పరిస్థితుల ప్రభావం అక్కడి ప్రజల మూర్తిమత్వ వికాసంపై పడుతుంది. సంప్రదాయ సిద్ధంగా వారికున్న వేట భూములు కోల్పోవడం వల్ల ఉగాండాకు చెందిన ఐక్ లు క్రమంగా ఆకలిబాధలకు గురిఅవుతున్నారు. టర్న్‌బుల్ (1973) పేర్కొన్నట్లు ఆ తెగవారు ఈ మండలంలో అత్యంత స్వార్థపరులు, దోచుకొనేస్వభావం వారుగానూ తయారయ్యారు. వీరిలో దయాదాక్షిణ్యాలు, ఇతరులకు సహాయపడదామనే గుణం, ఆర్థత లోపించి, వారి జీవన పోరాటంలో పిల్లల నోటి దగ్గరి ఆహారాన్ని లాక్కొనే వారుగా తయారయ్యారు. పెరూకు చెందిన కొల్లాలు ప్రపంచంలోకెల్లా అతి హింసాయుత ప్రవృత్తిగలవారని ట్రాటర్ (1973) పేర్కొన్నాడు. ఈ లక్షణాలకు కారణం పోషకాహార లోపం వల్ల ఏర్పడిన హైపోగ్లకీమియా (hypoglycemia)నే అని పేర్కొన్నాడు. ఈ దృష్టాంతాలను బట్టి చూస్తే భౌతిక పరిసరానికి మూర్తిమత్వం స్వరూప లక్షణాలపైన, మానవ ప్రవర్తనపైన గాఢమైన ప్రభావం ఉంటుందని తోస్తుంది. కానీ ఈ యూనిట్లఓ చర్చింఇన యిదు అంశాలలో సామాజిక - సాంస్కృతిక వాతావరణం, సామూహికాను భవం(group experience), లేదా విశిష్టానుభవం వంటి వాటితో పోలిస్తే భౌతిక పరిసరాలకు తక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది.

## 10.4.3 సంస్కృతి, మూర్తిమత్వం

సామాజిక - సాంస్కృతిక పర్యావరణం ప్రభావం మూర్తిమత్వ వికాసంపై ఎంతో ఉంటుంది. సామాజిక - సాంస్కృతిక పరిస్థితులు మూర్తిమత్వ వికాసానికి , అభివ్యక్తికి అనుకూల వాతావరణం కల్పిసా&తయి. కుటుంబం, పాఠశాల, ఇరుగుపొరుగు, స్నేహితులు, వివిద రకాల వ్యక్తులు, సామాజిక ఆచార వ్యవహారాలు, ఆచారణలు, విలువలు మొదలైనవి ఒక వ్యక్తి మూర్తిమత్వంపై ప్రభావం చూపుతాయి. సమాజంలోను, కుటుంబంలోనూ ఒక బాలుడి, యువకుడి, వయో వృద్ధుడి స్థానం ఒకే రకంగా ఉండదు. ఈ వైవిధ్యం, తారతమ్యాల వల్ల ఒక వ్యక్తి ప్రవృత్తి, దృక్పథం, ఆలోచనావిధానం, ప్రవర్తనాభిలాషలు, వ్యక్తిత్వ లక్షణాలు - ఒక్క మాటలో చెప్పాలంటే ఆ వ్యక్తి మూర్తిమత్వం తీవ్ర ప్రభావానికి లోనౌతుంది. అట్లాగే ఒక వ్యక్తికి పాఠశాలలో, ఆఫీసులో,చేస్తున్న వృత్తిలో ఉన్న స్థానం అతని ప్రవర్తనపై ఎంతో ప్రభావం చూపుతుంది.

ఒక వ్యక్తి తొలిదశలోనే అతని మూర్తిమత్వ రూపురేఖలు ఏర్పడతాయని ,ఆతరవాతి జీవితకాలంలో సంతరించుకొన్న లక్షణాలు అభివ్యక్తమవుతాయని ప్రసిద్ధ మనో విశ్లేషకుడు ఫ్రాయిడ్ అభిప్రాయం.ఈనాటి మనో విశ్లేషకులు కూడా కుటుంబ వాతావరణప్రభావం వ్యక్తి గుణగణాలపైన, స్వభావం,మానసిక ఆలోచనా ధోరణులపైన.అలవాట్లు,ప్రవర్తన తీరుపైన పడుతుందనే వాదనను అంగీకరిస్తారు. ఈవాదనలోని వాస్తవాన్ని దృవీకరించడానికి కుటుంబలలోపెరిగిన,పిల్లల ప్రవర్తనను,గుణగణాలను అధ్యయనం చేయడం జరిగింది. బాల్యంలో తల్లిదండ్రుల ప్రేమానురాగాలు పిల్లల ఉద్వేగస్థిరతకు దోహదం చేస్తాయి. అతిగారబం చేయడం వల్ల పిల్లలు చెడిపోవడం కూడా జరగవచ్చునని హెచ్చరించడం కూడా జరుగుతోంది .ఆల్ఫ్రెడ్ ఆడ్లర్ అనే సుప్రసిద్ధ మనో వైజ్ఞానికుడు ఉన్న పిల్లలలో ఒక శిశువు ఎన్నోవాడు (order of birth)అనే అంశం కూడా ఆశిశువు మూర్తిమత్వాన్ని ప్రభావితం చేస్తుందంటాడు. ఒక కుటుంబంలో తండ్రి,తల్లి,భార్య,భర్త,అన్నదమ్ములు,అక్కచెల్లెళ్ళు,ప్రేమ పాత్రుడైన పిల్లవాడు / పిల్ల, అక్కరలేని పిల్లలు (unwanted offsprings)అందరికీ ఆకుటుంబంలో వారివారి స్థానాలుంటాయి.ఇవే వారి మూర్తిమత్వంఏర్పడటాన్ని,వికసించడాన్నిప్రభావితం చేస్తాయి.ఈవిషయాల ఆధారంగా



BRAOU

ఆడ్లర్ వ్యక్తం చేసిన అభిప్రాయాలలోని యదార్థాన్ని అర్థంచేసుకోవచ్చు.

సంస్కృతి లేదా సామాజిక పర్యావరణంమూర్తిమత్వంలో వైవిధ్యానికి దోహదం చేస్తుంది. జునీ ప్రజలు ఉద్వేగం విషయంలో ఎంతో భద్రతగల వారనే విషయం పరిశోధకుల దృష్టికి వచ్చింది. వీరితో పోలిస్తే ఈలోరీస్ ప్రజలలో అభద్రతా భావం కనిపిస్తుందని పరిశోధకులు భావించారు. అంతే కాక జునీ ప్రజలుసహకార తత్వానికి పేరొందినవారు. వీరు నిశ్చలస్వభావులు, హుందాతనమున్నవారు, పోటీతత్వం లేనివారని, ఆనందాతిశయంతోచేయాల్సిన నృత్యాన్ని కూడా ఆత్మనిగ్రహంతోచేస్తారని గమనించడం జరిగింది. దీనికి భిన్నంగా kwakiutl ఇండియన్ (pacific northwest)లలోపోటీతత్వం ప్రస్ఫుటంగా కనిపించే స్వభావ లక్షణం .వీరు గౌరవ మర్యాదలకు, హోదాకు, ఆస్తిపాస్తులకు ప్రాధాన్యం ఇస్తారు. ఈకారణంగానే వారిలో పోటీతత్వంఅధికంగా ఉంటుంది.అట్లాగే ఎస్కిమోలలో నైపుణ్యం, కండబలం ప్రముఖలక్షణాలుగా కనిపిస్తాయి. డకోటాకు చెందిన వారిలో ఉదారస్వభావం, అతిథి పట్ల శ్రద్ధాభక్తులు, ధైర్యసాహసాలు, ధీరోదాత్త గుణాలు ఎక్కువగా ఉంటాయి.

అగ్బర్, నిమ్‌కాఫ్‌లు రష్యన్‌ల గురించి ఇలా పేర్కొన్నారు: ప్రత్యక్ష వైయుక్తిక సంబంధాలకు సంబంధించి రష్యన్‌లలో అత్యంత గాఢమైన, శక్తివంతమైన ప్రతిస్పందన కనిపిస్తుంది. ప్రత్యక్ష వ్యక్తిగత అనుబంధం ఎంతో ఉత్తేజపరిచేదిగా ఉంటుంది. వారిని గురించి ఇతరులకున్న అభిప్రాయాల పట్ల రష్యన్‌లు అంతగా పట్టించుకోరు. దీనికి భిన్నమైన వారు అమెరికన్‌లు. దేన్ని అయినా సాధించడానికే అధిక ప్రాధాన్యమిస్తారేగానీ ఇతరుల అంగీకారానికి, స్వయం ప్రతిపత్తికి కాదు. ఇతరులతో అతి సాన్నిహిత్యం వ్యక్తి స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుందని అమెరికన్‌ల భయం. గుర్తింపు కోసం అమెరికన్‌లు అభిలషిస్తారు, పాకులాడతారు. రష్యన్‌లలో అధిక స్పష్టత, సహజాతోద్వేగాల స్పృహ, ఆ ఉద్వేగాల ప్రభావానికి లోను కావడం, బయటి నియంత్రణలపై అధికంగా ఆధారపడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీరితో పోలిస్తే అమెరికన్‌లు స్వయం నియంత్రణపై అధికంగా ఆధారపడతారు.

వివిధ తరహాల, జాతుల ప్రజల్లో కనిపించే ఈ దృక్పథం భావోద్వేగం, ఆలోచనాధోరణులలోని వైవిధ్యం అనువంశికతతో ముడిపెట్టడం సాధ్యం కాదు. నిజానికి ఈ లక్షణాలన్నీ పర్యావరణ ప్రభావానికి లోనైనటువంటివే. అందులోను సామాజిక లేదా సాంస్కృతిక పర్యావరణ మూలంగా ఏర్పడినవే. వ్యక్తులు వారి వారి సంస్కృతులు నిర్దేశించిన విలువలు, లక్ష్యాలు, ఉద్దేశాల ననుసరించే అభివృద్ధి చేసుకొంటారు.

వైయుక్తిక విభేదాలు వివిధ సమాజాల మధ్యనే కాక ఒకే సమాజంలోని వివిధ భాగాల మూర్తిమత్వాల మధ్య కూడా పొడసూపుతుంటాయి. ఈ వైవిధ్యాలకు తారతమ్యాలకు మూలం ఏది? దీనికి జవాబు 1. నిర్మాణగతమైన లక్షణాలు, 2. కుటుంబ సభ్యుల మధ్య, ఇతర సమూహాల మధ్య సంబంధాల తాలూకు భావావేశం (emotion), 3. కొన్ని విలక్షణ ఉప సంస్కృతులలోని సామాజికీకరణలో లభిస్తుంది.

సంస్కృతి విభేదం కేవలం విభిన్న సమాజాల మధ్య మాత్రమే కాక ఒకే సమాజంలో కూడా కనిపిస్తుంది. సమాజంలోని వివిధ వ్యక్తులను ఏకరూపాలుగా తయారుచేసే మూసకాదు సమాజం. ఈ విషయం గుర్తుంచుకోవాలి. ప్రతి సమాజంలోనూ సామాజిక వర్గీకరణను బట్టి జ్ఞానసముపార్జన భిన్న రీతుల్లో జరుగుతూ ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలి. అన్ని వయోవర్గాలు, ఆడ, మగ ఒక స్థాయి వరకు అందరూ ఒకే రకమైన విషయాలు తెలుసుకోవడంతోబాటు ఆయా లింగభేదాన్ని బట్టి కొన్ని ప్రత్యేక అంశాలు కూడా తెలుసుకొంటారు. వయసువారీ విభజన, లింగాన్ని అనుసరించి వర్గీకరించడమనేది సామాజిక పాత్రలకు సంబంధించిన అతి ముఖ్యమైన వర్గీకరణ. చేస్తున్న వృత్తి, విద్య, ఆదాయం, కుటుంబనేపథ్యం వంటివి ఒక వ్యక్తి ఎలాంటి సంస్కృతి ప్రభావానికి గురవుతాడో నిర్ణయించడంలో ముఖ్యమైన కారణాంశాలు. అన్ని సంస్కృతుల మూర్తిమత్వంలో వైవిధ్యాన్ని, ఏకరూపతను సృష్టించడం సాధ్యమవుతుందనే విషయం గుర్తుంచుకోవాలి. కుటుంబంలో పెద్దల పెత్తనం పెంచడానికి గానీ, తోటివారు కించపరిస్తే నెమ్మదస్తుడైన శిశువు కలహశీలిగా మారడానికి గానీ అవకాశముంటుంది. అంటే వ్యక్తుల మధ్య సంబంధాలు లేదా సమూహకారకాంశాలలో మార్పుల ద్వారా వ్యక్తి మూర్తిమత్వంలో కూడా మార్పులు తేవడం సాధ్యమవుతుంది. తరచు కరువు కాటకాలు సంభవించడం,

BRAOU

క్రూరమృగాలు మీదపడతాయనే నిరంతర భయం - ఇలాంటివి గిరిజన సమూహాలలో సర్వసాధారణం - వంటివి సాధారణంగా దృఢవైఖరి ప్రదర్శించని పిల్లవాడు. పైనన చెప్పిన పర్యావరణ ఒత్తిడుల ఫలితంగా ఎక్కువ చురుకుదనం, దృఢ వైఖరిగల వాడిగా మార్చడం సాధ్యం కావచ్చు. చివరిగా, తర్ఫీదు లేదా సాంస్కృతిక అనుభవం అణకువగలవాడిని దృఢవైఖరి గలవాడిగా పరివర్తనం చెందేట్లు చేయవచ్చు.

## కవలల అధ్యయనం

మూర్తిమత్వంపై పరిసరాల ప్రభావాన్ని ధృవీకరించడానికి మనోవిజ్ఞాన, సామాజిక, జైవిక శాస్త్రజ్ఞులు సారూప్యత, ఏకజనకుల సంతతి వారైన, విభిన్న వాతావరణంలో పెరిగిన కవలలను అధ్యయనం చేశారు. అలాంటి వాటిలో ఒక అధ్యయనాన్ని పరిశీలిద్దాం.

మిల్‌డ్రెడ్, రూత్‌లు ఒకే రకంగా ఉన్న లేదా పోలికలు గల కవలలు (identical twins) . వీరి తల్లి వీరి 3వ నెలలోనే చనిపోయింది. తల్లి చనిపోయిన వెంటనే ఈ కవలలను బంధువలైన రెండు కుటుంబాలవారు దత్తత తీసుకొని పోషణ భారం స్వీకరించారు. బాంకరు, చిన్న నగర మేయరు అయిన వ్యక్తి దగ్గర పెరిగిన మిల్‌డ్రెడ్‌కు బాగా వృద్ధి చెందడానికి అవసరమైన అన్ని సదుపాయాలు లభించాయి. మిల్‌డ్రెడ్ విస్తృతంగా అధ్యయనం చేసింది. సంగీతం నేర్చుకొని స్కూల్ వాద్యబృందంలో వయోలిన్ వాద్యం వాయించింది. అంతే కాక అనేక ఇతర సామాజిక కార్యక్రమాలలో పాలుపంచుకొంది.

రూత్ ఒక ఫోర్‌మెన్ దగ్గర పెరిగింది. అతని చదువు అంతంత మాత్రమే. పెద్ద నగరంలో ఉంటూండేవాడు. అందువల్ల రూత్‌కూడా చెప్పుకోదగ్గ చదువుకోలేదు. రూత్‌ను ఇంటినుంచి బయటకు పంపేవారుకాదు. ఇంట్లో చదువుకోవడానికి ఎలాంటి పుస్తకాలుగానీ, సంగీత సాధనాలుగానీ ఉండేవికావు. మెదడుకు మేత దొరికే అవకాశాలు దాదాపు శూన్యమనే చెప్పాలి.

మిల్‌డ్రెడ్, రూత్‌లకు 15 సంవత్సరాల వయసువచ్చేవరకు వారిద్దరికీ విస్తృతమైన పరీక్షలు నిర్వహించడం జరిగింది. కానీ వారి మూర్తిమత్వంలో చాలా వ్యత్యాసాలు కనిపించాయి.మిల్‌డ్రెడ్ ఆత్మవిశ్వాసమున్న అమ్మాయి.అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేయగలిగేది.ఎదురుబోతు, ముఖకవళికల్లో సంతోషం వ్యక్తం, చేయగలిగేది.అదే రూత్ మూర్తిమత్వం సంకోచం మూర్తీభవించినదిగా ఉండేది-అంటే మౌనంగా,మాటల్లో తడబాటు,దిగాలుగా ఉండటం కనిపించేది.బుద్ధిపరంగా కూడా చాలా వ్యత్యాసం ఉండేది.వీరి ఇద్దరికీ లభించిన విద్యావకాశాలు దాదాపు సమానంగానే ఉన్నా, మిల్‌డ్రెడ్ I.Q స్కోరు-రెండు పరీక్షలను బట్టి చూస్తే-రూత్ I.Q కంటే 15 పాయింట్‌లు అధికంగా ఉన్నట్లు తేలింది.ఒకే పోలికలున్న కవలలైన మిల్‌డ్రెడ్,రూత్‌ల విషయంలో అనువంశిక అంశం సమానంగానే ఉన్నట్లు భావించడం జరిగింది. I.Q స్కోరులో తేడాలను ఇద్దరి మూర్తిమత్వాలలోని తేడాలు ఆఇద్దరి సాంస్కృతిక పూర్వరంగం,వారివారి సామాజిక వాతావరణం విలక్షణతలకు ఆపాదించడం జరిగింది.

ఇంత వరకు జరిగిన అనేక అధ్యయనాలలో ఆనువంశికత, పర్యావరణాలు రెండు మానవుల మూర్తిమత్వ వికాస విషయంలో ప్రముఖపాత్ర వహిస్తాయనే అంశం స్పష్టంగా కనిపిస్తుంది.బౌద్ధిక కారకాలపై పర్యావరణ ప్రభావం గణనీయంగా ఉండగా భౌతిక,శారీరక లక్షణాలు అనువంశికంగా సంక్రమించేవై ఉంటాయి.కేవలం పర్యావరణం ఒక్కటే మూర్తిమత్వాన్ని నిర్ధారించలేదు.అయితే అది వ్యక్తుల ఆత్మ అభివ్యక్తికి expression of self అవసరమైన అవకాశాలు కల్పిస్తుంది,దాని వికాసానికి తోడ్పడుతుంది.వ్యక్తిలో నిగూఢంగా ఉన్న శక్తి సామర్థ్యాలకు ఒక రూపం ఇవ్వడంలో పర్యావరణం ప్రముఖ పాత్ర వహిస్తుంది.అనువంశికంగా సంక్రమించిన శక్తి యుక్తులు బహిర్గతం కావడమనేది అనువైన పర్యావరణ పరిస్థితుల్లోనే సాధ్యమవుతుంది.ఒక వ్యక్తి లక్షణాలు-వివిధాలైన అభిరుచులు,తెలివితేటలు,నైపుణ్యాలు,కౌశలం,దృష్టికోణాలు,విశ్వాసాలు,ఆకాంక్షలు మొదలైనవన్ని కూడా సామాజిక-సాంస్కృతిక పర్యావరణ ప్రభావానికి లోనయ్యేటటువంటివే దాని ప్రభావం వల్లనే ప్రకటితమయ్యేవే.

### 10.4.4 సామూహికానుభవం,మూర్తిమత్వం

జీవితప్రారంభ దశలోఆత్మభావమనేది ఉండదు.కేవలం భౌతిక జీవిగానే గానీ తాను అనే భావం

ఉండదు.18నెలలప్రాయంనుంచి 2 సంవత్సరాలలోపు నేను అనే మాట ఉపయోగించటం మొదలౌతుంది.ఇది స్వయం చేతనత్వానికి (self awareness)-తాను ఒక ప్రత్యేకమైన మానవుడిగా గుర్తెరగటం-స్పష్టమైన సంకేతం. శారీరకంగా ఎదగడం,సామాజికానుభవం సంపాదించడంతో శిశువు తాను ఒక విలక్షణమైన,ప్రత్యేకమైన వ్యక్తిననే భావం కలుగుతుంది.దీన్ని బట్టి చూస్తే వ్యక్తిత్వ వికాసానికి పర్యావరణం అత్యంత ప్రధానమని తెలుస్తుంది.అంతర్గతంగా ఉన్న శక్తియుక్తులు స్వతస్సిద్ధంగా,స్వేచ్ఛందంగా అభివృద్ధి చెందడం మాత్రమే మూర్తిత్వంకాలేదు.మూర్తిమత్వమనేది సామాజికానుభవం,సామాజిక పరస్పర చర్యల ఫలితంగా ఏర్పడుతుంది.అంటే సామూహికానుభవం లేనిదే మూర్తిమత్వవికాసం జరగదన్నమాట.

మానవజీవితంలో వ్యక్తి భావాలకు,ప్రవర్తన ప్రమాణాలకు కొన్ని సమూహాలు ఆదర్శాలుగా,నమూనాలుగా ఉంటూ ఉంటాయి. ఇలాంటి సమూహాలనే ఆదర్శసమూహాలంటారు (reference groups) .ఇలాంటి సమూహాలలో ప్రప్రథమమైంది కుటుంబం.ప్రభావితమయ్యే వయసు అంతా శిశువు కుటుంబ వాతావరణంలోనే గడుపుతాడు కాబట్టి కుటుంబం ఆదర్శ సమూహాలలో మొదటిది.ఒక వ్యక్తి తాలూకు మౌలిక మూర్తిమత్వ లక్షణాలను శిశువు కుటుంబంలో గడిపే తొలిదశలోనే సంక్రమిస్తాయనే విషయాన్ని మేధావులందరూ అంగీకరిస్తారు. ఈదశ తరువాతే సమవయస్కులు, సమానహోదాగలవారితో ఏర్పడే సాంగత్యం ముఖ్యమవుతుంది. ఈదశలో ఈసమూహమే ఆదర్శ సమూహమవుతుంది. బాల్యంలో సమవయస్కుల, అంగీకారాన్నిసంపాదించని శిశువు జీవితాంతం సామాజిక తిరస్కృతిని, వైఫల్యాన్నే అనుభవించవలసి వస్తుంది. బాల్యావస్థలో, యవ్వనదశలో సమవయస్కుల ఆమోదం పొందలేని వ్యక్తి ఉత్తరోత్తర సమర్థతగల, యోగ్యమైన వ్యక్తిగా పరిణతి చెందలేడు,చలామణీ కాలేడు.

యుక్తవయస్కుల సమూహమే ఆదర్శసమూహంగా ఉంటుంది. ఆసమూహప్రభావం వ్యక్తి దృక్పథాన్ని,జీవిత లక్ష్యాలను,ప్రవర్తనా నియమాలను విశేషంగా ప్రభావితం చేస్తుందని అనేక అధ్యయనాల ద్వారా స్పష్టమైంది.

వ్యక్తి పరిణతి చెందుతూ పోయే సమయంలో అనేక ఆదర్శ సమూహాలు ఉద్భవిస్తాయి, కాలక్రమంలో అదృశ్యమవుతూ పోతాయి. హైస్కూల్ లోని సహపాఠకులతోటి జీవితం ముగిసి కళాశాల జీవితం ప్రారంభమవుతుంది. ఈదశలో తోటి విద్యార్థులు విద్యారంగంలో సాధించిన విజయాలతో తాను సాధించిన వాటిని సరిపోల్చుకొంటూ,ఇతరుల కంటే గణనీయమైన ప్రగతి సాధించాలనే తపన, కృషి ప్రారంభమవుతాయి. తమ పర్యవేక్షకుల అభిప్రాయాలకంటే సహాధ్యాయుల అభిప్రాయాలకే ఎక్కువ ప్రాముఖ్యమైన ఆదర్శసమూహంగా తయారవుతుంది. వందలాదిగా ఉన్న ఆదర్శసమూహాలలో కొన్నే ప్రాముఖ్యత సంతరించుకొంటాయి.వాటి అభిప్రాయాలను బట్టే వ్యక్తి విమర్శనాత్మక అభిప్రాయాలను అనుసరించి తన మూర్తిమత్వాన్ని,ఆత్మ స్వరూపాన్ని అనువైన విధంగా నిరంతరాయంగా మలుచుకొంటూ పోవడం జరుగుతుంది.

## 10.4.5 విశిష్టానుభవం,మూర్తిమతం

ఒకే కుటుంబం,ఒకే రకమైన అనుభవాలున్న పిల్లలు భిన్నరీతులలో ఎందుకు తయారవుతారు. వాస్తవానికి వారి అనుభవాలు ఒకే రకమైనవికావు. వారి సామాజికానుభవాలు కొన్ని విషయాలలో ఒకేరకంగాను,కొన్ని సందర్భాలలో భిన్నంగాను ఉంటూ ఉంటాయి. ప్రతి శిశువు ఒక కొత్త కుటుంబ వాతావరణంలో పెరుగుతూ ఉంటాడు. తమ్ముళ్ళు,చెల్లెళ్ళు పుట్టేదాకా ఆశిశువు ఒక్కడే ఆకుటుంబంలో ఉండటం ,మిగతా పిల్లలు పుట్టాక తమ్ముళ్ళు,చెల్లెళ్ళతో పోట్లాడుకోవడం మొదలౌతుంది. తల్లిదండ్రుల దృక్పథంలో కూడా మార్పులు కలుగుతాయి. పిల్లలందరినీ ఒకే రకంగా చూడటం జరగదు.పిల్లలు వేరు వేరు వయోవర్గాలకు చెందినవారితో జతకట్టడం,వేరు వేరు అధ్యాపకుల వద్ద చదువుకోవడం , విభిన్న సంఘటనలను ఎదుర్కొని వాటిని అధిగమించడం జరుగుతూ ఉంటుంది. ఏకరూపతగల కవలల అనువంశికత ఒకే రకంగా ఉంటుంది,వారి అనుభవాలలో కొంత సారూప్యత ఉంటుంది. ఆకవలలు కలిసి ఒక కుటుంబ సభ్యులవ్వడం ఒకే రకమైన సమవయస్కులతో కలవడం,సమాన ఆదరణ లభించడం జరుగవచ్చు. అయినా శిశువుల అనుభవాలు, సంఘటనలు ఒకే రకమైనవి కాకపోవచ్చు. ప్రతివ్యక్తి అనుభవం విశిష్టమైంది,విలక్షణమైంది అయి ఉంటుంది. అంటే ఒకరి అనుభవంమరొకరి అనుభవం



BRAOU

తు.చ.తప్పక ఒకే రకమైనదిగాను ఒక దానికి మరొకటి నకలుగాను ఉండటం సాధ్యం కాదు. ఒకే కుటుంబంలోని పిల్లల దిన చర్య,అనుభవాలను బేరీజు వేసి చూస్తే వైవిధ్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. అందువల్లనే (కవలల విషయం మినహాయిస్తే) ప్రతి శిశువు యొక్క జైవిక అనువంశికత విలక్షణంగా ఉంటుంది, ఇతరుల అనువంశికతకు నకలుగా ఉండదు.

అనుభవాలు ఒకదానికొకటి కలవడమే కాక సమీకృతమవుతాయి కూడా. మూర్తిమత్వం కేవలం అనుభవాల కలయిక మాత్రమే కాదు . ఒక అనుభవం ప్రభావం అంతకు పూర్వ అనుభవాన్ని బట్టి ఉంటుంది. మనో విశ్లేషకుల అభిప్రాయంలో కొన్ని అనుభవాలు అత్యంత కీలకమైనవవుతాయి. కారణం, ఇవి గత అనుభవాలు తరవాతి అనుభవాల విషయంలో అవ్యక్తి స్పందనను ప్రభావితం చేస్తాయి. అంటే ఒక వ్యక్తి అనుభవం లక్షోపలక్షల అనుభవాల సంక్లిష్ట రూపమవుతుందన్నమాట.

ఇంతవరకు ఉదహరించిన అధ్యయనాలు మూర్తిమత్వ వికాసానికి జైవిక అనువంశికత,సామాజిక పర్యావరణాలలో ఏది అధిక ప్రాధాన్యం గలదో తేల్చి చెప్పడంలేదు.అయితే ఆఅధ్యయనాలు అవి ఎందుకు ప్రాముఖ్యంగలవో తెలుపుతున్నాయి. ఈమధ్యకాలంలో నిర్వహించిన అధ్యయనం ఒకటి కలుపుగోలు తనం, నిర్బంధత (compulsiveness), సామాజిక సౌలభ్యత (social ease) అనే వాటిపై ఆనువంశికత ప్రభావం ఎక్కువగా ఉంటుంది, నాయకత్వం, ఉద్వేగాన్ని అదుపు చేయడం, దృక్పథం అసక్తులు మొదలైన లక్షణాలపై సామాజిక పర్యావరణ ప్రభావం అధికమని తెలుపుతోంది. అంటే కొన్ని లక్షణాల విషయంలో ఆనువంశికత ప్రాముఖ్యంగలదని, మరి కొన్నిటి విషయంలో సామాజిక -సాంస్కృతిక పరిసరాలు ప్రధానమైనవని స్పష్టమవుతుందన్నమాట. అంతే కాక ఎలాంటి పరిస్థితులలోనూ వాటి ప్రభావాలను అంచనా వేయడం,ఇంత అని ఇదమిద్ధంగా అంచనా వేయడం సాధ్యం కాదు .అనువంశికంగా సంక్రమించి నిగూఢంగా ఉన్న కొన్ని లక్షణాలు సామాజికానుభవం వల్ల బయల్పడటం,వికసించడం జరుగుతూ ఉంటుంది. పరిసరం అనేది సంక్లిష్టమైనది,నిరంతరం మారుతూ ఉం డేది. అనువంశికతను గురించి పూర్తిగా తెలియదు.అందువల్ల ఈ రెండు కారకాల పరస్పర చర్యలను పరిగణనలోకి తీసుకోవాలేగానీ ఏ ఒక్క కారకపు నిరపేక్ష చర్యను మాత్రమే కాదు.

అనువంశికతతో ఒక కొత్త జీవి ప్రారంభమౌతుంది. పరిసరమనేది ఆ జీవి పోషణ వికాసాలకు దోహదం చేస్తుంది. అందువల్ల ఈ రెండు ప్రధానమైనవిగానే భావించవచ్చు.

BRAOU

మూర్తిమత్వం అటు పరిసరాలు,ఇటు అనువంశికతల ఉమ్మడి ఫలితంగా ఏర్పడుతుంది.అనువంశికత సంభావ్యాంశాలను(potentialities) కల్పిస్తే, పరిసరాలు వాటి కొక నిర్దిష్ట రూపమిస్తుంది అనువంశికంగా సంక్రమించే అన్ని లక్షణాలూ పర్యావరణ పరిస్థితుల్లోనే పుట్టి అభివృద్ధి చెందుతాయి. క్రమపరిణామ అంతిమ ఫలంగా అవతరించిన వారే మానవులు. ఈ కారణంగా ఆజీవిలో సర్దుకుపోయే లక్షణం,పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలుచుకొనే శక్తియుక్తులు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల జైవిక ఆనువంశికత లేదా అనువంశికత,సామాజిక పరిసరం లేదా సామూహిక అనుభవం అనేవి రెండూ మూర్తిమత్వ వికాసానికి ముఖ్యమైనవే.

## 10.5 మూర్తిమత్వ వికాసంలో సంస్కృతి పాత్ర

కొందరు సమాజ శాస్త్రజ్ఞుల దృష్టిలో మూర్తిమత్వ వికాసం, సంస్కృతి లక్షణాల ఆకళింపు అనేవి భిన్నమైన ప్రక్రియలు కాక పోగా ఆరెండూ ఒకే సమపార్శ్వ-మార్గాలు 1937 లో ప్రఖ్యాత సామాజిక మానవ శాస్త్రవేత్త అయిన లింటన్,కార్డినర్ అనే మనో విశ్లేషకుడు నిర్వహించిన అధ్యయనాలలో సంస్కృతి మౌలిక మూర్తిమత్వాన్ని కల్పిస్తుంది,దాని అభివృద్ధికి దోహదం చేస్తుంది అని తేలింది. వారి అభిప్రాయంలో ఒక నిర్దిష్ట సమాజంలో తరచు కనిపించే మూర్తిమత్వం శైశవదశలోని ఒకే రకమైన అనుభవల ఫలితమే కాని,సహజాతాలు లేదా వంశానుగతంగా సంక్రమించే చోదకాలు (drives)కాదు. శూన్యంలో శిశువు మానసిక స్థితిని, అలవాట్లను, దృక్పథాలను అలవాట్లను ప్రభావితం చేస్తుంది.

పైవాదనకు మద్దతుగా కింది దృష్టాంతాలను చూపవచ్చు. సంస్కృతిలో భౌతిక ,అభౌతిక అంశాలు ఉంటాయి.

ఆగ్బర్న్ అభిప్రాయంలో ఈ రెండూ అంశాలు మూర్తిమత్వంపై ప్రభావాన్ని చూపుతాయి. ప్లంబింగ్(plumbing) ప్రభావం పరిశుభ్రత పట్ల వ్యక్తి దృక్పథం, అలవాట్లను,గడియారం ఉండటం వల్ల వ్యక్తులలో సమయపాలన(punctuality) పాటించడం అనే వాటిని భౌతికాంశాలకు ఉదాహరణలుగా పేర్కొవచ్చు.ఈ సందర్భంలో అమెరికన్ ఇండియన్‌ల సంస్కృతిలో గడియారాలు ఉపయోగించడం లేనందువల్లనే వారిలో సమయపాలన లక్షణం లోపించిందని ఆగ్బర్న్ పేర్కొన్నాడు. అట్లాగే కొన్ని సంస్కృతులు పారిశుధ్యానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తాయి. ఈ లక్షణానికి ఆసంస్కృతిలోని సాంకేతిక పద్ధతులు మద్దతునిస్తాయి.

అభౌతిక సాంస్కృతిక లక్షణాలకు, మూర్తిమత్వ వికాసానికి ఉన్న సంబంధాన్ని స్పష్టంగా తెలిపేది మనం మాట్లాడే భాష. ఒక సముదాయపు సంస్కృతి విశేషాలను భాష ద్వారానే తెలుసుకొంటాం. వ్యక్తి మూర్తిమత్వాన్ని తీర్చిదిద్దడంలో బ్భాష ప్రముఖ పాత్ర వహిస్తుంది. మాట్లాడలేని వారి మూర్తిమత్వం సలక్షణంగా ఉండదు.

పై చర్చను, ఉదహారణలను బట్టి చూస్తే ఒక వ్యక్తి మూర్తిమత్వం సాస్కృతికాంశాల ప్రభావానికి గురిఅయి ఉంటుందని తెలుస్తుంది.

వైయుక్తిక విభేదాలకు ప్రాధాన్యమిచ్చే మనోవిజ్ఞాన శాస్త్రం కానీ, సాంస్కృతిక సారూప్యతలకు ప్రాదాన్యమిచ్చే సామాజిక శాస్త్రంకానీ మూర్తిమత్వాన్ని సంపూర్ణంగా వివరించలేవన్న వాస్తవాన్ని గుర్తించాలి. అందువల్ల మూర్తిమత్వం అనేది జీవ - సామాజిక దృగ్విషయం(bio-social phenamenon) గా గుర్తించడమే సముచితం.

## 10.6 సారాంశం

మూర్తిమత్వ భావనను అనేక శాస్త్రజ్ఞులు వివిధ రకాలుగా నిర్వచించారు. కిందాల్ యంగ్ సామాజిక సహభాగిత దృష్ట్యా మనిషి వ్యవస్థీకరించుకున్న భావాలు, ప్రతిబింబాలు, దృక్పథాల సమాహారమే మూర్తిమత్వమని నిర్వచించాడు. సామాజిక పరిస్థితుల పూర్వరంగంతో మూర్తిమత్వాన్ని నిర్వచించడం జరిగింది. మూర్తిమత్వపు వివిధ కోణాలను చూపడానికి ప్రసిద్ధులైన మనోవైజ్ఞానికుల - ముఖ్యంగా ఆల్‌పోర్టు, వాట్‌సన్‌ల అభిప్రాయాలను పరిశీలించడం జరిగింది.

మూర్తిమత్వ అభివృద్ధికి దోహదపడే అంశాలలో ప్రధానమైన జైవిక అనువంశికత, భౌతిక పరిసరాలు, సంస్కృతి. సామూహిక అనుభవం, విశిష్టాలను, భావాలను గురించి వివరంగా చర్చించి మూర్తిమత్వ వికాసానికి సంబంధించి వాటి తులనాత్మక ప్రాధాన్యాన్ని వివరించడం జరిగింది. మూర్తిమత్వవికాసంపై సామాజిక, సాంస్కృతిక అంశాలు, జైవిక అనువంశికత ప్రభావాలను కొన్ని అధ్యయనాల ఆధారంగా వివరించడమైంది.

మూర్తిమత్వం అటుపర్యావరణం, ఇటు అనువంశికతల ఉమ్మడి ఫలితంగా ఏర్పడుతుంది. అనువంశికత సంభావ్యాంశాలను కల్పిస్తే, పర్యావరణం వాటికొక నిర్దిష్ట రూపమిస్తుంది. క్రమ పరిణామం అంతిమ ఫలంగా అవతరించే వాటే మానవుడు.

వైయుక్తిక విభేదాలకు ప్రాధాన్యమిచ్చే మనోవిజ్ఞాన శాస్త్రం కానీ, సాంస్కృతిక సారూప్యతలకు ప్రాధాన్యమిచ్చే సమాజ శాస్త్రంగానీ మూర్తిమత్వాన్ని సంపూర్ణంగా వివరించలేవు. అందువల్ల మూర్తిమత్వాన్ని ఒక జీవ - సామాజిక దృగ్విషయంగా గుర్తించడమే సముచితం.

## 10.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులివ్వండి

1. మూర్తిమత్వాన్ని నిర్వచించి మూర్తిమత్వ లక్షణాలను వివరించండి.

2. మూర్తిమత్వ వికాసానికి దోహదం చేసే కారకాలను వివరంగా చర్చించండి.



B R A O U

II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులివ్వండి.

1. మూర్తిమత్వ వికాసంలో సామాజిక - సాంస్కృతిక పార్యవరణం ప్రాముఖ్యాన్ని క్లుప్తంగా వివరించండి.

2. సంస్కృతి, మూర్తిమత్వానికి మధ్య ఉన్న సంబంధాన్ని క్లుప్తంగా చర్చించండి.

## 10.8 సంప్రదింపు గ్రంథాలు


Paul. B. Horton and Chester . L . Hunt : Sociology

Willian. F. Ogburn and Meyer. F. Nimkoff : A Handbook of Sociology

G.W.Allport: Personality : A Prychological Interpretation.

Mac Iver and Page : Society - An Introductiory Analysis.

Harry M. Johnson : Sociology - A Systematic Introduction

Samuel Koening : Sociology - An Introduction to the Science of Society.

Kimball Young & Raymond. W. Mack : Systematic Sociology - Text and Readings.

Pascual Gisbert : Fundamentals of Sociology.


BRAOU

BRAOU

# ఖండం- IV

## సామాజిక ప్రక్రియ

వ్యక్తి తన వారసత్వాన్ని, పుట్టి పెరిగిన పరిసరాలను, అలవరచుకున్న సంస్కృతిని బట్టి మూర్తిమత్వాన్ని పొందుతాడు. తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని, గుర్తింపునూ పొందుతాడు. సమాజంలో తన స్థానాన్ని నిర్ధారించుకుంటాడు. సమాజంలో దీనంతటికీ సాంఘికీకరణం అనే ప్రక్రియ దోహదం చేస్తుంది. సాంఘికీకరణను బట్టే వ్యక్తిత్వం, గుర్తింపు, సమాజంలో స్థానం దొరుకుతాయి.

ఒక మామూలు శిశువు మనిషిగా నిలదొక్కుకునే ఈ ప్రక్రియ ఎలా సాగుతుందో ఈ ఖండంలో విషదీకరించడం జరిగింది.

ఇందులో వున్న మూడుభాగాలు వ్యక్తి వికాస ప్రక్రియకు అర్థంపడతాయి. అవి:

- సాంఘికీకరణ-సాధనాలు
- సాంఘికీకరణ సిద్ధాంతాలు
- సామాజిక పరస్పర చర్య

BRAOU

# భాగం- 11: సాంఘికీకరణ - సాధనాలు

విషయక్రమం

11.0 ఉద్దేశాలు
11.1 పరిచయం
11.2 సాంఘికీకరణ-భావన
11.3 సాంఘికీకరణ నిర్వచనాలు
11.4 ప్రమాణాలు, విలువల అంతర్గతీకరణ
11.5 సాంఘికీకరణ లక్షణాలు
11.6 సాంఘికీకరణ - వ్యక్తిత్వ రూపకల్పన
11.7 సాంఘికీకరణ సాధనాలు
    11.7.1 కుటుంబము
    11.7.2 పాఠశాల
    11.7.3 సమవయస్కుల సమూహము
    11.7.4 భారీ ప్రచార మాధ్యమాలు
11.8 సారాంశము
11.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు
11.10 చదువదగిన పుస్తకాలు

B R A O U

## 11.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

- సాంఘికీకరణ భావనను, ప్రాధాన్యతను తెలుసుకుంటారు.
- మూర్తిమత్వ రూపకల్పనలో సాంఘికీకరణ ఎలా దోహదపడుతుందో అవగాహన చేసుకుంటారు.
- సాంఘికీకరణ సాధనాల ప్రాధాన్యతను గుర్తిస్తారు.

## 11.1 పరిచయం

మానవుడు సంఘజీవి అంటే కేవలం సామాజిక సంబంధాలు కలిగి వుండడం మాత్రమే కాదు. మనిషికి మిగతా ఏ ప్రాణులకు లేని విధమైన సాంస్కృతిక నేపథ్యం, వారసత్వం ఉన్నాయి. మనిషియొక్క సాంఘిక జీవనం, సాంస్కృతిక నేపథ్యం వారసత్వం వల్లే అతను మిగతా జంతు ప్రపంచానికి భిన్నంగా ఉండగలుగుతున్నాడు. వ్యక్తిత్వం, మూర్తిమత్వాన్ని ఏర్పాటు చేసుకోగలుగుతున్నాడు. ఇది ఆ వ్యక్తి పుట్టి, పెరిగే సమాజాన్ని బట్టి, ఆ సామాజిక వారసత్వాన్ని బట్టి ఉంటుంది. పుట్టిన ప్రతి మనిషికీ ఆ సమాజం ఇచ్చే శిక్షణద్వారా ఈ మూర్తిమత్వం అలవడుతుంది. అంటే సమాజమే ఆ సమాజపు విలువలు, ఆచార వ్యవహారాలు, పద్ధతులు, పట్టింపులు అన్నీ మనిషికి నేర్పిస్తుంది. ఇలా జరిగే సామాజిక శిక్షణనే సాంఘికీకరణ(socialisation) అంటారు. ఇతర జీవరాసుల్లాగే పుట్టిన శిశువు పెరుగుతున్న క్రమంలో సామాజికీకరణ వల్ల తన మూర్తిమత్వాన్ని వృద్ధి చేసుకొని సంపూర్ణమైన వ్యక్తిగా ఎదుగుతాడు. అందుకే మనిషి జీవితంలో సాంఘికీకరణకు అత్యంత ప్రాధాన్యత ఉంది.

## 11.2 సాంఘికీకరణ భావన

పుట్టినప్పుడు పసిబిడ్డ కొన్ని జైవిక అవసరాలు, ప్రేరణలతో ఒక ప్రాణిగా యీ ప్రపంచంలోకి వస్తాడు. అతడికి కుటుంబంలోని పెద్దలు ఆహారం, వస్త్రాలు, వసతి, ప్రకృతి శక్తుల నుండి రక్షణ కలిగించాలి. ఇతర జంతువులవలె అతడి చర్యలకు మార్గదర్శకంగా ఉండే సమాజ జ్ఞానం అతనిలో ఉండదు. జంతువులకూ ఈ గుణం వారసత్వంగా సంక్రమిస్తుంది. నూతనంగా జన్మించిన పసిబిడ్డ తన చుట్టూ ఉన్న సామాజిక సంస్కృతిక పరిసరాలపై పూర్తిగా ఆధారపడి ఉంటాడు. తన తల్లిదండ్రులపై ఆధారపడతాడు. తల్లి తర బిడ్డ సుఖం కొసం ప్రేమతో, గర్వంతో పాటుపడుతుంది. బిడ్డ మనుగడకు ఆహారం, శారీరక రక్షణలతోపాటు ఈ రకమైన మానసిక పర్యవసానాలు కూడా అవసరం. బిడ్డ తన తల్లి చర్యలకు ప్రతిస్పందించడం ప్రారంభిస్తాడు. అతడు అతి ప్రాథమికమైన మానవ పరస్పర చర్యలలో పాల్గొనడం ప్రారంభిస్తాడు. తనపట్ల తల్లి ప్రతిస్పందనలు ఏ విధంగా ఉంటాయో ఊహించగలుగుతాడు. క్రమ క్రమంగా అతడు సంశ్లిష్టమైన భాష మాట్లాడేందుకు అవసరమైన శిక్షణ పొందుతాడు. ఈ విధంగా సమాజం పసిబిడ్డకు అతను ఏది చెయ్యగలడో, ఏది చేసి తీరాలో, ఏది చేయవచ్చునో నేర్పుతుంది.

సాంఘికీకరణ ద్వారా వ్యక్తికి సంస్కృతి అందజేయబడుతుంది. దీని ఫలితంగా వ్యక్తి తను జన్మించిన సమాజం యొక్క ప్రమాణాలు, విలువలను తెలుసుకోగలుగుతాడు. సాంఘికీకరణ ద్వారా వ్యక్తి తన పెరుగుదల, అభివృద్ధికి అవసరమైన స్తోమతలను పెంపొందించుకోగలుగుతాడు. ఈ విధంగా సాంఘికీకరణ ఆ వ్యక్తిని ప్రాణినుండి సంపూర్ణ సాంఘిక జీవిగా మారుస్తుంది. అతడు సువ్యవస్థమైన సామాజిక జీవనంలో పాల్గొనేందుకు తోడ్పడుతుంది.

మనిషి తన మూర్తిమత్వాన్ని పెంపొందించుకోవడం, తమ సమాజపు జీవన విధానాన్ని నేర్చుకోవడం జరిగే ప్రక్రియను సాంఘికీకరణ అంటారు. సమాజానికి వ్యక్తికి మధ్య ఇది అత్యవసరమైన బంధం. సమాజానికి చెందిన మౌలికమైన విజ్ఞానాన్ని వ్యక్తికి సాంఘికీకరణ లభింపజేస్తుంది. దీని సహాయంతో అతడు తన నైపుణ్యాన్ని వివిధ సందర్భాలకు తగిన విధంగా తెలివిగా ఉపయోగింపగలుగుతాడు. ఆదిమానవుడు తన సమాజంలో ఆది దేవతలుగా భావించే దేవుళ్ళను, భూతాలను పూజించడం, తగిన కర్మకాండ ద్వారా వారిని సంతృప్తిపరచడం నేర్చుకొంటాడు. ఆధునిక సమాజంలో పిల్లలు పాఠశాలలో శాస్త్ర విజ్ఞానం, మానవీయ శాస్త్రాలను గూర్చి తెలుసుకుంటారు. తనకు తగిన నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని సంపాదించడం ద్వారా ఒక వ్యక్తి తన సామాజిక వ్యవస్థలో సమర్థవంతమైన సభ్యుడు కాగలుగుతాడు.

BRAOU

## 11.3 సాంఘికీకరణ నిర్వచనాలు

సమాజశాస్త్రంలో అన్ని భావనల్లోలాగే సాంఘికీకరణను కూడా పలువురు శాస్త్రవేత్తలు వివిధ కోణాల్లో వివరించడారు. ఈ నిర్వచనాలు పరిశీలిస్తే మనకు సాంఘికీకరణ భావన మరింత స్పష్టంగా అర్థం అవుతుంది.

డబ్ల్యు.ఎఫ్. అగ్బర్న్(W.F.Ogburn) ప్రకారం ఒక వ్యక్తి సామాజిక ప్రమాణాలను అలరచుకొనే ప్రక్రియనే సాంఘికీకరణ. దీన్నే పీటర్ వెర్స్లే (Peter Wersley) వ్యక్తి ఒక సామాజిక సమూహం యొక్క సంస్కృతి, నియమాలు, ఆచార వ్యవహారాలను అలవరచుకొనే ప్రక్రియగా వివరించాడు. హారీజాన్సన్ (Harry,M.Johnson) ఈ నిర్వచనాలను మరింత విస్తృత పరిచి 'ఒక వ్యక్తి తన సమూహంలో అప్పటికే ఆచరణలో ఉన్న సంస్కృతిని సంస్కృతిని స్వీకరించడం'గా పేర్కొన్నాడు. 'సామాజికంగా వ్యక్తి తన పాత్రను పోషించేందుకు సాంఘికీకరణ ప్రక్రియ దోహదపడుతుందని' ఆయన వివరించారు. 'సాంఘికీకరణను లుండ్ బర్గ్ (Lundberg) నిర్వచనం మరింత విస్తృత పరుస్తుంది. లండ్ బర్గ్ ప్రకారం ఒక సమూహంలో లేదా సముదాయంలో క్రియాశీలకంగా పాల్గొనడానికి అవసరమైన అలవాట్లు, పద్ధతులు, నమ్మకాలు, విశ్వాసాలు, నైపుణ్యాలు, న్యాయనిర్ణయ ప్రమాణాలను అలవరచుకోవడానికి వ్యక్తులు జరిపే సంక్లిష్ట పరస్పర చర్యల సమూహమే సాంఘికీకరణ.

 అంటే మనిషి ఏ సమాజంలోనైతే భాగస్వామి అవ్వాలనుకుంటున్నాడో ఆ సామాజిక విలువలు, ప్రమాణాలు,

పద్ధతులు, ఆచార వ్యవహారాలను ఆకలింపు చేసుకొని, అన్వయించుకొని, అంతర్గతీకరణం చేసుకొని ఆచరించే క్రమమే సాంఘికీకరణ అనవచ్చు.

## 11.4 ప్రమాణాలు, విలువల అంతర్గతీకరణం

అంతర్గతీకరణం ద్వారా మానవ సంస్కృతి వ్యక్తిలో అంతర్భాగమౌతుంది. ఈ ప్రక్రియద్వారా వ్యక్తి తన సంస్కృతికి చెందిన విలువలు, ధోరణులు, నమ్మకాలు, ప్రవర్తనా పద్ధతులలో అధికభాగాన్ని తనలో అంతర్గతం చేసుకుంటాడు. అవి అతని వ్యక్తిత్వంలో భాగం అవుతాయి. ఒక సమూహం విలువలను ఒక పసిబిడ్డ తనలో అంతర్గతం చేసుకునేందుకు అతడికి పెద్దలు తోడ్పడాలి. కుటుంబంలో ఇది మామూలుగా జరుగుతుంది. పిల్లలంతా తమ సమూహంలో ఇమిడిపోవాలని, దాని పద్ధతులు నేర్చుకోవాలనీ కోరుకుంటారు. దొంగతనం నేరమనే విషయాన్ని గ్రహించిన బాలుడు సాధారణంగా దొంగతనం చేసే ఆలోచన కూడా చేయడు. కొత్త అనుభవాలను పొందడం, వాటి అర్థం గ్రహించడంతోనే జీవితమంతా కొనసాగుతుంది. ఒక వ్యక్తి కొత్త పాఠశాలలోనో, ఉద్యోగంలోనో, కొత్త ప్రదేశంలోనో ప్రవేశిస్తున్నాడంటే వివిధమైన భావాలు, ఆశలు కలిగిన కొత్త జీవితంలో ప్రవేశిస్తున్నాడని చెప్పవచ్చు. అతడు కొత్త విషయాలు, కొత్త చర్యలకు పరిచయం చేయబడతాడు. వాటి పర్యవసానాలను (implications) అతడు గ్రహించి, తనలో భాగం చేసుకుంటాడు. బయటివారి ఒత్తిడి లేకుండా మనం అంతర్గతీకరణ ద్వారా సమూహం ప్రమాణాలను, విలువలను తనవిగా చేసుకుంటాడు.

అంతర్గతీకరణ అంటే ఒక సమూహానికి చెందిన ప్రమాణాలను, విలువలను, మన తెలివితేటల ద్వారా మన సొంతం చేసుకోవడం మాత్రమే కాదు. ఒక సమాజశాస్త్ర వేత్త అభిప్రాయంలో ప్రమాణాలకు అనుబద్ధం కావడం విజయవంతమైన సాంఘికీకరణ ఫలితమే. సాంఘికీకరణ ద్వారా ఒక వ్యక్తి సామాజిక ఆత్మభావన పొందుతాడు. ఇతరులతో పరస్పర చర్యల ద్వారా వ్యక్తి తనను గూర్చిన చైతన్యాన్ని, తన వ్యక్తిత్వాన్ని, ఇతర కోణాలను పెంపొందించుకుంటాడు. సంస్కృతిని ప్రసరణం చేస్తున్న సమయంలోనే సాంఘికీకరణ, వ్యక్తిని ఇతరులతో సన్నిహితం చేస్తుంది. ఉదాహరణకు ఆటో మెకానిక్ లేక పాకశాస్త్ర నిపుణుడైన వ్యక్తికి అందుకు అవసరమైన నైపుణ్యం సమాజంలోనే లభిస్తుంది. దీనినతడు పాఠశాలలో నో, యింటి వద్దనో, స్నేహితుని నుండో లేక యీ విషయాలపై లభ్యమవుతున్న పుస్తకాలనుండో నేర్చుకొనివుంటావు. ఈ రంగంలో ప్రత్యేక వ్యక్తిత్వాన్ని పొందుతాడు. మనగురించి మనం గానీ, ఇతరులుగానీ ఆలోచించినప్పుడు మన వ్యక్తిత్వం మన నైపుణ్యంతో విడరాని బంధమౌతుంది. అతడు పేరుపొందిన సర్జన్, ఆమె వంట బాగా చేస్తుంది, అని మనం అనుకున్నప్పుడు వారి వ్యక్తిత్వం వారు కలిగిస్తున్న ప్రత్యేకమైన విజ్ఞానం తోటి వారు అంతర్గతం చేసుకున్న కొన్ని విలువలతోటి సారూప్యం(identical) ఔతుంది. వ్యక్తికి, సమాజానికి మధ్యపరస్పరం ఆధారపడే సంబంధం ఉంటుంది. ఏ వ్యక్తి ఒంటరిగా జీవించలేడు. సమాజంలోనే మనిషి తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకోగలుగుతాడు. వ్యక్తులంతా కలిస్తేనే సమాజం ఏర్పడుతుంది. వ్యక్తుల మధ్య సంబంధాలు లేకపోతే మనం సంఘజీవుల హోదా కోల్పోతాం

## 11.5 సాంఘికీకరణ లక్షణాలు

వివిధ పరిస్థితులలో, పరిసరాలలో సాంఘికీకరణ ప్రక్రియను పరిశీలించే సమయంలో యీ క్రింది మూడు విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి.

### 11.5.1 సాంఘికీకరణ ఒక వ్యక్తి జీవితమంతా అవిచ్ఛిన్నంగా సాగే ప్రక్రియ

ఎ) సాంఘికీకరణ ఎప్పటికీ పూర్తికాదు. అది పుట్టకతో ప్రారంభమై, యవ్వనం వృద్ధాప్యంలో కొనసాగి, మరణం వరకు ఉంటుంది. సమాజ వ్యవస్థ సంశ్లిష్టతపై ఆధారపడి ఉంటుంది. సమాజం ఎంత తరచుగా మార్పులు చెందుతుంది అనే దానిని బట్టి, సాంఘికీకరణయొక్క సాంద్రత స్థాయి వుంటుంది. సాంఘికీకరణ నాలుగు రకాలుగా కనిపిస్తుంది. 1) ప్రాథమిక సాంఘికీకరణ, 2) పూర్వాదాన సాంఘికీకరణ, 3) అభివృద్ధి సాంఘికీకరణ, 4) పునర్ సాంఘికీకరణ. ఒక వ్యక్తి తన జీవితంలో యీ దశలన్నీ ఎదుర్కొంటాడు.



BRAOU

1) ప్రాథమిక సాంఘికీకరణ: వ్యక్తి జీవితపు ప్రారంభ సంవత్సరాలలో జరుగుతుంది. పసిబిడ్డ తన సంస్కృతికి చెంది, సామాజికంగా ఆమోదం పొందిన విలువల ధోరణులను, నమ్మకాలను, ప్రవర్తనా పద్ధతులను అంతర్గతం చేసుకుంటాడు.

2) పూర్వాదాన సాంఘికీకరణ: ఒక వ్యక్తి భవిష్యత్తు పాత్రలకు అవసరమైన విజ్ఞానాన్ని అందించడానికి ఉద్దేశింపబడుతుంది. ఒక సందర్భంలో ఇతరులు ఏ విధంగా ఆలోచిస్తారో, ప్రవర్తిస్తారో ముందుగానే ఊహించుకొని, అందులో తమ పాత్ర ఏమిటో వ్యక్తులు వూహించుకొన్నప్పుడు పూర్వాదాన సాంఘికీకరణ జరుగుతుంది. ఉదాహరణకు, పిల్లలు తమ ఆటలతో తమ తల్లిదండ్రుల స్థానంలో తమను వూహించుకొని, అమ్మానాన్న ఆట ఆడుతారు. గర్భిణీ స్త్రీ తన బిడ్డ జన్మించకముందే తల్లిగా తన పాత్రను అర్థం చేసుకోవడానికి కృషిచేస్తుంది.

3) పునర్ సాంఘికీకరణ: అంటే ఒక వ్యక్తి తన గత జీవితానికి పూర్తిగా భిన్నమైన నూతన ఆలోచనా పద్ధతులు, భావాలు ప్రవర్తనా రీతులు నేర్చుకోవడం అని అర్థం. ఉదాహరణకు, వ్యక్తులు మరొక పద్ధతులు, భావాలు, ప్రవర్తానా రీతులు నేర్చుకోవడం అని అర్థం. ఉదాహరణకు, వ్యక్తులు మరొక మతాన్ని స్వీకరించినప్పుడు, సైన్యంలో చేరినప్పుడు, చెరసాలలో వున్నప్పుడు పునర్ సాంఘికీకరణ జరుగుతుంది.

### 11.5.2 అది ఒక సమూహం నుండి మరొక సమూహానికి స్థాయిలోనూ, రూపంలోనూ మారుతుంది

బి) సాంఘికీకరణ పథకబద్ధమైనది గనుక, అనియత ప్రక్రియలు సమాజలోనైనా సంభవిస్తాయి. గనుక, సాంఘికీకరణ సమూహం నుండి మరొక దానికి మారుతూ ఉంటుంది. సాధారణంగా సాంఘికీకరణం ఒక వ్యక్తికి యిరవై ఏళ్ల వయసు వచ్చేవరకు అతని జీవితంపై గొప్ప ప్రభావం చూపుతుంది. ఈ సమయంలో కుటుంబం, పాఠశాల, మత సంస్థలు, అతనిలో సాంఘికీకరణ కలిగిస్తాయి. ఒక సమూహం నుండి మరొక సమూహానికి వేరుగా ఉండే మౌలిక, నేర్పులను, విజ్ఞానాన్ని, విలువలను వ్యక్తులను అందజేయడంలో ఈ సమూహాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. తోటి బాలురు, ఆట స్థలంలో ఇతర పిల్లలు, స్నేహితులు కూడా యీ సమూహాలలో చేరి ఉంటారు.

### 11.5.3 కొన్ని పరిస్థితులలో విసాంఘికీకరణ, పునర్ సాంఘికీకరణ అవసరం కావచ్చు

ఏ సమూహం పూర్తిగా మరొక సమూహాన్ని పోలి ఉండదు. అందువల్ల మనం కొత్త సమూహంలో చేరినప్పుడు కొత్త సంబంధాలు ఏర్పడుతాయి. ఈ కొత్త సంబంధాలు మనం కొత్త నేర్పులు, విజ్ఞానం పొందవలసిన అవసరం కలుగజేస్తాయి. అవి మనం పొందితే మనం పునర్ సాంఘికీకరణ పొందామని అర్థం. ఈ కొత్త నేర్పులు పాతవాటితో సంఘర్షణ పడినపుడు, మనం విసాంఘికీకరణం పొందాలి. ఒక వ్యక్తి సైన్యంలో చేరినప్పుడు అతనికి కొద్ది కాలంలో కొత్త నేర్పులు బోధిస్తారు. ఇవి అతని విలువలు, నమ్మకాలకు భిన్నంగా ఉంటాయి. అతడు అతి అమానుష, అసౌకర్య పరిస్థితులలో ఇతరులను చంపడం, తనను రక్షించుకోవడం చేయవలసి వస్తుంది. ఈవిధంగా శాంతియుతమైన పౌరుడిని సమర్థవంతమైన సైనికుడిగా తీర్చిదిద్దడానికి సైన్యాధికారులు అతడికి సాంఘికీకరణ చేయవలసి వస్తుంది. అతన్ని తన స్నేహితులు, సహచరులనుండి వేరుచేసి, కఠినమైన క్రమశిక్షణకు, గంటల తరబడి విసుగు పుట్టించే పనులకు గురిచేస్తారు. మనుషులను చంపడం పౌర సమాజంలో నేరంగా పరిగణింపబడుతుంది. కానీ, సైన్యంలో దానికి బహుమతులిస్తారు. వ్యక్తి విసాంఘికీకరణ, పునర్‌సాంఘికీకరణాలకు గురికాకుండా అతని ధోరణిలో మార్పు జరగదు. ఒక ప్రత్యేకమైన పరిస్థితుల్లో, పరిసరంలో సమర్థవంతంగా పాల్గొనేందుకువీలుగా వ్యక్తి అందుకు తగిన నేర్పులను, విలువలను, విజ్ఞానాన్ని అందజేయాలి.

మనం సాధారణంగా మన చుట్టూ ఉన్న సమూహంలో ఇమిడిపోయేందుకు తగిన సాంఘికీకరణను స్వయంగా పొందుతాం. కొన్ని సమయాల్లో వ్యక్తికి ఇష్టంలేని కొత్త జీవన విధానం అతనిపై రుద్దడం జరగవచ్చు. ఈ నిర్బంధాన్ని అతడు వ్యతిరేకిస్తాడు. కొన్ని ఇతర సమయాలలో పునర్ సాంఘికీకరణ స్వచ్ఛందంగా జరుగుతుంది. ఒక వ్యక్తి కొత్త మతాన్ని స్వీకరిస్తే, ఆనూతన వాతావరణానికి అనుగుణంగా తన జీవిత పద్ధతిని మార్చుకుంటాడు. అంతకు ముందు వారు పొందియున్న సాంఘికీకరణ సరిపోదని భావించినప్పుడు వ్యక్తులను ఇతరులు పునర్ సాంఘికీకరణకు గురిచేస్తారు. ఇది ఆ వ్యక్తులకు అసంతృప్తికరంగా ఉంటుంది.



BRAOU

## 11.6 సాంఘికీకరణ- వ్యక్తిత్వ రూపకల్పన

మానవుడు పుట్టిన సమయంలో మానవ స్వభావానికి చెందిన లక్షణాలు కలిగి ఉండవు. అతనికి సామాజిక వారసత్వం పుట్టుకతోనే లభించదు. అతడు పెద్దల సహాయంతో ఆహారం, పోషణ పొందుతాడు. భాష, అనుభవం, అంగ్లామోధాల ద్వారా ఇతరులతో అభిప్రాయ ప్రకటన చేయడం నేర్చుకొంటాడు. సమాజంలోని ఇతరులతో ఉమ్మడి అనుభవాలు పొందుతాడు. ఇతరులతో పరస్పర చర్యల ద్వారా అతను పొందే అనుభవము సాంఘికీకరణ. దీని ఫలితంగా అతనిలో కలిగే మానవ స్వభావమే అతని వ్యక్తిత్వము.

### 11.6.1 మూర్తిమత్వం, అర్థం

వ్యక్తిత్వంలో ఒక వ్యక్తి ప్రవర్తనా లక్షణాలన్నీ చేరి ఉంటాయి. ప్రతీమనిషి ఇతరులతో భిన్నమైన వ్యక్తిత్వం కలిగి ఉంటాడు. వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకునేందుకు, వివిధ వ్యక్తులు వివిధ రకాలైన సామాజిక, సాంస్కృతిక అనుభవాలు కలిగినప్పుడు ఏరకమైన వ్యక్తిత్వాలను పొందుతారో తెలుసుకోవాలి. రూపకల్పనలో జైవిక వారసత్వం, భౌతిక పరిసరాలు, సంస్కృతి, సామూహిక అనుభవం వంటి విషయాలు తోడ్పడతాయి.

సాధారణంగా మానవులందరూ రెండు చేతులు, పంచేంద్రియాలు, జననేంద్రియాలు, సంష్లిష్టమైన మెదడు కలిగి ఉంటారు. ఈ జైవిక పోలికలను బట్టి వ్యక్తుల వ్యక్తిత్వాలలో, ప్రవర్తనలో పోలికలుంటాయి. ప్రతివ్యక్తి తనదైన, ప్రత్యేకమైన జైవిక వారసత్వం కలిగి ఉంటాడు. కవలల్లో మాత్రమే ఈ విషయాలలో సారుప్యత గోచరిస్తుంది. వ్యక్తిత్వానికి చెందిన లక్షణాలన్ని అనుభవం వల్ల ఏర్పడేవేనని గుర్తించారు. అయితే వ్యక్తుల ప్రవర్తనా సామర్థ్యం, విజయాలలో తేడాలు, వారు నివసించే పరిసరాల ప్రభావాల వల్ల కలుగుతాయని కొందరు భావిస్తున్నారు. అందువల్ల వ్యక్తుల జైవిక తేడాలకు ప్రాధాన్యత లేదు. జైవికాంశాలతోపాటు మానవుల ప్రవర్తనపై శీతోష్ణస్థితులు, భౌగోళిక పరిస్థితులు కూడా ప్రభావం చూపుతాయి. కానీ, ఇవికూడా అంత ప్రధానమైనవి కావు. ఎందుకంటే ఒకేరకమైన వాతావరణ పరిస్థితులలో వివిధ రకాల వ్యక్తిత్వాలుగల మనుషులు కనిపిస్తారు. అయినప్పటికీ బాహ్య పరిస్థితులు మనుషుల వ్యక్తిత్వంపై కొంత ప్రభావం కలిగి ఉంటాయని ఒప్పుకోక తప్పదు. వ్యక్తిత్వ వికాసంలో క్రియాశీల పాత్ర పోషించే మరో అంశం సంస్కృతి. అన్ని చోట్ల పసిబిడ్డల పరిరక్షణను పెద్దలు వహిస్తారు. వీరు సమూహాలలో నివసిస్తూ భాషద్వారా పరస్పరం అభిప్రాయ ప్రకటన చేసుకుంటారు. వారు ఆ సమాజంలో ఇతరులవలె కొన్ని ఉమ్మడి అనుభవాలను పొందుతారు. దీని సహాయంతో వ్యక్తి తనదైన వ్యక్తిత్వాన్ని పొందుతాడు. ఈరకమైన వ్యక్తిత్వం ఆ సమాజంలోని ఇతరులు కూడా పొందవచ్చు.

పుట్టుకనుండి తన వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకునేందుకు పసిబిడ్డకు అనేకరకాలుగా శిక్షణనిస్తారు. సమాజానికి, సమాజానికి మారుతూఉండే సంస్కృతినుండి మరొక సంస్కృతికి మారుతాయి. ఒక సమాజంలోని అందరు సభ్యులపై ఈ ప్రభావాలు ఒకే అనుభవాన్ని కలిగిస్తాయి. కొన్ని వ్యక్తిగత లక్షణాలను సమాజం మెచ్చుకొని, సత్కరిస్తుంది. స్నేహం, కలుపుగోలుతనం, సహకారం, అదే సమయంలో పోటీచేయగల సత్తా, అభివృద్ధికరమైన దృక్పథం వంటి లక్షణాలు గల వ్యక్తిత్వానికి మన సంస్కృతిలో విస్తారంగా ఆమోదం లభిస్తున్నది. ఈ వ్యక్తిత్వ లక్షణాలను కొత్త తరాలవారికి నేర్పి, వారిలో పెంపొందిస్తారు. అందువల్ల వ్యక్తిత్వం అభివృద్ధి, సంస్కృతిని గ్రహించడం వేర్వేరు ప్రక్రియలు కావు. రెండు ఒక్కటే. సంస్కృతి వల్ల సాంఘిక నియమాలు, పద్ధతులు, సంఘజీవన ప్రమాణాలు తెలుస్తాయి. వ్యక్తిత్వ వికాసంలో కీలకమైన మరొ అంశం సామాజిక అనుభవం. పసిబిడ్డ మొదట తినడం, నిద్ర పోవడం, నడవడం, మాట్లాడడం, ఏడ్వడం మొదలైన కొన్ని విషయాలను నేర్చుకుంటాడు. తర్వాత తల్లిని, తండ్రిని, ఇతరులను గుర్తించడానికి ప్రయత్నిస్తాడు. వారిని వేరువేరు పేర్లతో పిలుస్తాడు. వారిని గుర్తించడానికి వారిని వేరువేరు అంతస్తులను ఆపాదిస్తాడు. క్రమక్రమంగా, అనేక అనుభవాలను గడించిన తార్వత, తను ఎటువంటి వ్యక్తినో గురిస్తాడు. వ్యక్తిత్వం అభివృద్ధిలో ఆత్మ భావన ఏర్పడటం అతి ముఖ్య ప్రక్రియ. కుటుంబ సమూహం నుండి వేరుగా ఉంచి, నిర్లక్ష్యం చేయబడిన పిల్లల దుష్టంతాలున్నాయి. అటువంటి పిల్లలు సంఘవ్యతిరేకంగా తయారవుతారు. అందువల్ల వ్యక్తిత్వం అభివృద్ధితో సమూహానుభవం అతి ముఖ్య ప్రక్రియ.

## 11.7 సాంఘికీకరణ సాధనాలు

మూర్తిమత్వాన్ని రూపుదిద్దుకోవడం మామూలు విషయం కాదు. దీనికి ఎంతో పరిశీలన, శిక్షణ, అభ్యసనం, అంతర్గతీకరణం అవసరం అవుతాయి. వ్యక్తిత్వం అనేది మనకు రెడీమేడ్‌గా దొరికేదికాదు. సాంఘిక నియమాలకు అనుగుణంగా సాంఘికీకరణ ద్వారా మనల్ని మనం మలచుకొనే తీరునుబట్టి వ్యక్తిత్వం రూపుదిద్దుకొంటుంది. అయితే సాంఘికీకరణ అనేది కేవలం బాల్యంలో జరిగే ప్రక్రియ అనుకుంటే పొరపాటు. ప్రతీ మనిషిలోనూ జీవితకాలమంతా అవిచ్ఛిన్నంగా సాగే ప్రక్రియ ఇది. పుట్టుకతో మొదలయ్యే ఈ ప్రక్రియ జీవితాంతం కొనసాగుతూ ఉంటుంది. మారుతున్న సామాజిక రీతులకు అనుగుణంగా, ధోరణులు, పద్ధతులకు అనుగుణంగా మారుతూ మనిషి తన వ్యక్తిత్వానికి పదును పెట్టుకొంటాడు. ఈ మార్పులు స్వయంసిద్ధంగా మనిషి ప్రమేయం లేకుండా రావు. దీనికి స్వీయ ప్రయత్నంతోపాటు పలు సామాజిక వ్యవస్థలు సాధనాలుగా పనిచేస్తాయి. మనిషికి ఉండే సంబంధ బాంధవ్యాలు, నిరంతరం మనిషి సాగించే పరస్పర చర్యలు ఇందుకు ఉపకరిస్తాయి. సామాజిక జీవనం, సంస్కృతి వ్యవస్థీకృతమైన పరస్పర చర్యలు మనకు సాంఘికీకరణలో దోహదపడతాయి. వీటిలో కుటుంబము, పాఠశాల, సమవయస్కుల సమూహం, ప్రసార మాధ్యమాలు ప్రధానమైనవి.

### 11.7.1 కుటుంబం

ఇప్పటికే కొత్తగా పుట్టిన బిడ్డ ఒక ప్రాణినుంచి సంఘజీవిగా మార్చబడతాడని తెలుసుకున్నాము. పసిబిడ్డయొక్క ప్రాథమిక ధోరణులు, విలువలు, నమ్మకాల పట్ల శ్రద్ధ వహించి అతడు కుటుంబ సభ్యులనుండి నేర్చుకుంటాడు. బాల్యంలో పొందే అనుభవం అతడి తరువాతి జీవితంలో ప్రధానపాత్ర వహిస్తుంది. సాంఘికీకరణపై జరిగిన పరిశోధనలో అధిక భాగం వివిధ రకాల కుటుంబ వ్యవస్థలు, బిడ్డ అభివృద్ధిపై చూపే ప్రభావంపైననే కేంద్రీకరించబడ్డాయి. పసిబిడ్డ అనుభవంలో తల్లిదండ్రులు చూపే ప్రేమ, శ్రద్ధ అతి ముఖ్య భాగంగా ఉంటాయి. సాంఘికీకరణకు అతి ప్రధానమైన సాధనం కుటుంబం. కాబట్టి అది వ్యక్తియొక్క మూర్తిమత్వం అభివృద్ధి చెందడానికి ప్రధాన బాధ్యత వహిస్తుంది. వ్యక్తికి జీవిత పరమార్థాన్ని, జీవితంలో సహాయాన్ని అందించే మొదటి సమూహము కుటుంబమే. కుటుంబం సమాజంచే ఆమోదింపబడి, సమాజంలో నిర్వహించబడే శాశ్వత సమూహం. ఈ సమూహంలో వివాహం ద్వారా లేక దత్తత ద్వారా బంధుత్వం కలిగిన వారు సభ్యులుగా ఉంటారు. వీరు రక్త సంబంధీకులై ఉంటారు. కలిసి జీవిస్తూ, ఆర్థికంగా ఒకరితో ఒకరు సహకరిస్తారు. సోదరులు, అక్కా చెల్లెలు, తల్లిదండ్రులు వంటి కుటుంబ సభ్యులు కొత్తగా పుట్టిన బిడ్డ సంఘజీవిగా రూపొందడానికి సమాజంలో పాల్గొనే శక్తిపొందడానికి తోడ్పడతాడు. బిడ్డకు ఐదు సంవత్సరాల వయసు వచ్చినప్పుడు సాంఘికీకరణలో అతి ప్రధాన సమయం ఆసన్నమవుతుంది. కుటుంబములో చిన్నపిల్లలు సమాజం అంగీకరించిన నిబంధనలు నేర్చుకొని, సమాజంలో ప్రాథమికమైన పాత్రలను అర్థం చేసుకోవడం ప్రారంభిస్తారు. ఈవయస్సులో పసిబిడ్డ తన చుట్టూ ఉన్న భౌతిక, సామాజిక ప్రపంచాన్ని గూర్చి తెలుసుకోవడం, తన ఇష్టాయిష్టాలను గుర్తించడం ప్రారంభిస్తారు.

పసిపిల్లలు కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉండి వారి ప్రేమ, శ్రద్ధలపై పూర్తిగా ఆధారపడి ఉంటారు. తమ ప్రాథమిక అవసరాలకు, మనుగడకు ముఖ్యంగా తల్లిపై ఆధారపడతారు. పసిబిడ్డకు ప్రాథమిక అవసరాలైన ఆహారం, వసతి, ప్రేమాభిమానాలు మొదలైనవి లభించడం మీద ఆధారపడి ఆ బిడ్డ మూర్తిమత్వం మానసికంగానూ, భౌతికంగానూ రూపొందుతుంది. అందువల్ల పసిబిడ్డ కనీసం మూడు సంవత్సరాల వయసు వచ్చేవరకు తల్లియొక్క వ్యక్తిగత సంరక్షణ ప్రేమ పొందాలి. పిల్లలు కుటుంబంలోవారు పొందే ప్రేమానురాగాలవల్ల, పోషణవల్ల ఆరోగ్యవంతంగా రూపొందుతారు. తల్లి సంరక్షణ, ప్రేమలకు నోచుకోని అనాథాశ్రమంలో పెరిగే పిల్లలు ఇతరులతో కలిసిమెలసి తిరగడానికి, ఆడడానికి ఇష్టపడరని కొన్ని పరిశోధనలవల్ల తెలిసివచ్చింది. బాల్యంలో తల్లిదండ్రులతో సన్నిహిత సంబంధం పిల్లల భవిష్యత్‌కు అత్యవసరం. తల్లిదండ్రులతో సన్నిహిత సంబంధంలేని పిల్లలు ప్రాథమికమైన ప్రవర్తనా ధోరణులను, నేర్పులను పొందలేరు. వారు తమ పరిసరాలనుంచి దూరంగా ఉంటూ, సమాజం యొక్క ప్రమాణాలను, విలువలను అంతర్గతం చేసుకోలేరు. తల్లి మాత్రమేగాక మొత్తం కుటుంబము పిల్లలు నేర్పులను, విలువలను నేర్చుకొనడానికి ప్రాథమికమైన సాధనంగా ఉపయోగపడుతుంది. కుటుంబములోనే పిల్లలు తమ భావోద్రేకాలు అదుపులో పెట్టుకోవడానికి వాటిని సరైన మార్గంలో మళ్లించడానికి

BRAOU

తగిన శిక్షణ పొందుతారు. మాతృభాషను ఉపయోగించడం, తమ తల్లిదండ్రుల విలువలను, ధోరణులను అనుకరించి పొందడం నేర్చుకుంటారు.

వ్యక్తులుకొంతవరకు ఆత్మ నిగ్రహం కలిగి ఉండాలని సమాజం కోరుకుంటుంది. పిల్లలకు మలవిసర్జన శిక్షణతో ఆత్మనిగ్రహం నేర్పడం ప్రారంభమవుతుంది. క్రమక్రమంగా ఈ అనుభవాలు ఇతర రకాలైన సామాజిక నిబంధనలకు వారు ప్రతిస్పందించేటట్లు చేస్తాయి. తర్వాత పిల్లలు తమ కోపతాపాలను అదుపుచేసుకోవడం నేర్చుకుంటారు. సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా తమ ప్రవర్తనను సర్దుబాటు చేసుకోవడం పిల్లలు నేర్చుకుంటారు. ఇది జరుగుతున్నప్పుడు పిల్లలకు కొంత నిరాశ, నిస్పృహలు, ఆందోళన కలుగవచ్చును. ఆత్మ నిగ్రహం నేర్పుతున్న సమయంలోనే పిల్లలకు కొన్ని విలువలను నేర్పుతారు. ఉదాహరణకు తమ ఆట బొమ్మలను ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడని పిల్లలకు ఒకరితో ఒకరు సహకరించుకోవడంలోని విలువలను నేర్పడం ద్వారా ఆత్మ నిగ్రహం నేర్పవచ్చు. వారు తమ బొమ్మలను ఇతరులతో పంచుకొంటే ఇతర పిల్లలు కూడా తమ బొమ్మలను తమతో పంచుకొంటారని వారికి తెలియజెప్పాలి. ఇతరులతో సహకరించడం పెద్దలకిష్టమని, ఆ విధంగా సహకరించి తోటి బాలబాలికలకంటే తాను గొప్పవాడినని రుజువుచేసుకోవచ్చునని పిల్లలకు నచ్చచెప్పాలి. సాంఘికీకరణ తర్వాత దశలో జీవితంలో ఉపయోగకరమైన ప్రాథమిక నేర్పులు, పిల్లలకు బోధిస్తారు. స్నానం చేయడం, బట్టలు ధరించడం, స్వయంగా ఆహారం పుచ్చుకోవడం, ఇంట్లో చిన్న చిన్న పనులు చేయడం, పెద్దలను గౌరవించడం పిల్లలు నేర్చుకొంటారు. పుస్తకాలు చదవడం, బొమ్మలు గీయడం, ఆటలు ఆడటం వంటి ఇతర నేర్పులను కూడా తల్లిదండ్రులు పిల్లలకు అలవరుస్తారు. దీనివల్ల వారికి పాఠశాలలో ప్రత్యక్షంగా సహాయం కల్గుతుంది.

కుటుంబంలో పరస్పర చర్యల ద్వారా పిల్లలకు పాత్ర ప్రవర్తన బోధించడం సాంఘికీకరణలో మరొక దశ. కుటుంబంలోని ఇతర సభ్యుల ప్రవర్తనతో తమ ప్రవర్తను పోల్చుకొని ఆత్మ ప్రతిమను అభివృద్ధి చేసుకున్న తర్వాత పిల్లలు కొన్ని రకాలైన ప్రవర్తన కలిగి ఉండవచ్చునని తెలుసుకుంటారు. ఉదాహరణకు ఒక బాలిక తాను బొమ్మలతో ఆడుకోవచ్చునని, తన తండ్రి ఆడకూడదని తెలుసుకొంటుంది. తన అవసరాలపట్ల తన తండ్రి కంటే తల్లి ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తుందని గ్రహిస్తుంది. అప్పుడప్పుడు ఆమె అక్క ఆమెతో ఆడుతుంది. క్రమ క్రమంగా ఆ బాలిక పసిబిడ్డగా, కూతురుగా, సోదరిగా, తన పాత్రను గ్రహిస్తుంది. కానీ సాంఘికీకరణలో అధికభాగం ఇష్టపూర్వకంగా జరగదు. ఉదాహరణకు కుటుంబములో సామాజిక పరస్పర చర్యలపై ఆధారపడి పిల్లలు వేర్వేరు మూర్తిమత్వ లక్షణాలను పొందుతారు. సాంఘికీకరణలో ప్రధాన సాధనమైన కుటుంబము పుట్టుక నుండి వ్యక్తికి ఒక ఆపాదిత అంతస్తును కల్గిస్తుంది. ఈ అంతస్తు కులం, వర్గం, జాతి, మతం ఆధారంగా కల్గుతుంది. వ్యక్తి యొక్క స్వభావం, సాంఘికీకరణపై ఇవన్నీకూడా బలమైన ప్రభావాన్ని చూపుతాయి. పిల్లలు గ్రామీణ ప్రాంతాలలో రైతుల కుటుంబాలకు చెందినవారా లేక నగర ప్రాంతాలలో, ధనవంతమైన ఏదో వృత్తికి చెందిన కుటుంబానికి చెందినవారా అనే దానిపై ఆధారపడి వారు గ్రహించే విలువలు, నమ్మకాలు ఉంటాయి.

ఆధునిక సమాజాలలో సామాజిక వర్గాలలో పిల్లల పెంపకం పద్ధతులు వేర్వేరుగా ఉంటాయి. మధ్యతరగతికి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలపట్ల సరళంగా ప్రవర్తిస్తారని వారిపై కఠినమైన అదుపును కలిగి ఉండరని కొన్ని పరిశోధనవల్ల తెలియవచ్చింది. వారు తమ పిల్లలపట్ల మానసికమైన ఒత్తిడి కలుగజేయరు. తమ పిల్లలు వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, ఆత్మనిగ్రహం కల్గి ఉండాలని అధికార వర్గాలకు లొంగి ఉండరాదని మధ్యతరగతి తల్లిదండ్రులు కోరుకుంటారు. పోటీలలో నెగ్గే విధంగా కృషిచేయవలసిందని పిల్లలను ప్రోత్సహిస్తారు. దీనికి భిన్నంగా కార్మిక కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు పిల్లలపై అధికారాన్ని చెలాయిస్తూ, వారు తమకు విధేయులై వుండాలని, తమ ఇష్టానుసారం ప్రవర్తించాలని కోరుకుంటారు. కొన్ని సమయాలలో పిల్లలపై దండన విధించడంకూడా చేస్తారు.

వివిధ సామాజిక వర్గాలలో పిల్లల పెంపకంలో తేడాలు ఉండడానికి ముఖ్యకారణం తల్లిదండ్రులు కలిగి ఉన్న వృత్తిపరమైన పాత్రలు,మధ్యతరగతి తల్లిదండ్రులు ప్రాధాన్యతనిచ్చే వ్యక్తిత్వం, ఆత్మనిగ్రహం వ్యక్తిగతంగా విజయసాధన మొదలైనవి మధ్యతరగతి వృత్తులకు అనుగుణంగా ఉంటాయి. అదే విధంగా కార్మికుల కుటుంబాలలో తల్లిదండ్రులు ఇతరులకు అణిగిమణిగి వుండే పనులు చేస్తుంటారు. కాబట్టి స్వతంత్రంగా

ఆలోచించలేరు. కాబట్టి తమపిల్లలు కూడా తమ అదుపాజ్ఞలలో ఉండాలని, తమ ఇష్టం ప్రకారమే నడుచుకోవాలని కోరుకుంటారు.

కొన్ని పరిశోధనవల్ల తెలియవచ్చిందేమిటంటే ఒక ప్రత్యేకమైన ప్రవర్తన పసిపిల్లల బాల్యంలోనే నేర్పకపోతే, తర్వాత వారు దానిని నేర్చుకోలేరు. ఒకవేళ నేర్చుకొన్నా అది సమర్థవంతముగా ఉండదు. ఈవిధంగా పసిపిల్లలు భౌతికంగా, సాంఘికంగా, మానసికంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన సన్నిహిత, వ్యక్తిగత సంబంధాలను కుటుంబం కల్గిస్తుంది.

### 11.7.2 పాఠశాల

పిల్లల సాంఘికీకరణలో కొంత బాధ్యత పాఠశాల వహిస్తుంది.పిల్లలకు కొన్ని ప్రత్యేకమైన నేర్పులు, విలువలలో సాంఘికీకరణ చేసే పని కోసం పాఠశాలను సమాజం ఏర్పాటు చేస్తుంది. సమాజంలో తమ పాత్రలను సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన నేర్పులను, ధోరణులను, విజ్ఞానాన్ని పాఠశాల అందజేస్తుంది. ఈవిలువలు ప్రమాణాలు అతి ముఖ్యమైనవి సమాజం భావిస్తుంది. విద్యార్థులు ఉపాధ్యాయులతో కూడిన పాఠశాల కుటుంబం కంటే భిన్నమైన వాతావరణాన్ని కల్గి ఉంటుంది. సంస్కృతి నుండి వారసత్వంగా వచ్చే సాంకేతిక, మేధా సంబంధిత విషయాలను పిల్లలకు బోధించడం జరుగుతుంది. పిల్లలకు సాంకేతికమైన, సాంస్కృతిక పరమైన బోధన జరుగుతుంది.ప్రతి కొత్తతరం పిల్లలు అంతకు ముందు తరాల అనుభవాలనుండి లాభం పొందుతారు. విద్యాబోధన ద్వారా మాత్రమే గాక స్కౌట్స్, గైడ్స్,వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటల పోటీలు మొదలైన ఇతర కార్యక్రమాల ద్వారా కూడా పాఠశాల పిల్లలకు సాంఘికీకరణ కలుగజేస్తుంది. వారి చర్యలు క్రమబద్ధం చేయబడి వారు శుచీ, శుభ్రత, కాలం విలువ తెలుసుకొంటారు. పిల్లల పాత్రల ప్రవర్తన సమాజం అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం జరుగుతుంది. వారు పాఠశాలలో విద్యార్థులుగా, క్రమబద్ధమైన సమూహంలో సభ్యులుగా, దేశ, ప్రపంచ పౌరులుగా శిక్షణ పొందుతారు.

పాఠశాలలో పిల్లలు తమ బంధువులుకానట్టి ఉపాధ్యాయులు, పరిపాలకుల అదుపులో ఉంటారు. వారు తమకంటే ఉన్నతమైన సామాజిక అధికారంగల వ్యక్తుల ఆజ్ఞలను, నియమ నిబంధనలను పాటించటం నేర్చుకుంటారు. ఇదర పిల్లలతో పోల్చి ప్రతి బాలుడు, బాలిక యొక్క విజ్ఞానం పరీక్షిస్తారు. పిల్లల ప్రవర్తనను పరిశీలించి, వారిపట్ల ఆంక్షామోదాలు ప్రదర్శిస్తారు. పాఠశాలలో ప్రతి విద్యార్థి విధేయత, ఆత్మనిగ్రహం, ఇతరులతో సర్దుబాటు నేర్చుకుంటాడు. తన ఉపాధ్యాయులు తన పట్ల ప్రేమను, రక్షణను కలిగించడం వల్ల గాక ఆ పాఠశాలలో ఒక ప్రమాణబద్ధమైన ప్రవర్తన అవసరం కాబట్టి విద్యార్థి వీటిని నేర్చుకుంటాడు.

పాఠశాలలో విద్యార్థి నియమాలకు, అధికారానికి తనను తాను సర్దుబాటు చేసుకోవడం నేర్చుకొంటాడు. ఆధునిక సమాజాలలో సామాజిక జీవనం విజయవంతం కావటానికి ఇటువంటి సర్దుబాటు అత్యవసరం. ప్రతి విద్యార్థి ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా గాక, ఒక క్రమబద్ధమైన సమూహంలో సభ్యుడుగా పరిగణించబడతాడు. అతడు ఇతరుల వలెనే కొన్ని నియమ నిబంధనలకు విధేయుడై ఉంటాడు. పాఠశాల జీవనంలో పాల్గొనడం ద్వారా ఒక బాలుడు తన కుటుంబంపై ఆధారపడటం తగ్గించుకుంటాడు. దాని ద్వారా సమాజంతోటి, దేశంతోటి కొత్త సంబంధ బాంధవ్యాలను పొందుతాడు.

### 11.7.3 సమవయస్కుల సమూహం

కుటుంబంతో పాటు సమాన వయస్కుల కూడా సాంఘికీకరణలో ప్రముఖ పాత్రవహిస్తుంది. ఈసమూహంలో దాదాపు ఒకే వయస్కు గల ఒకే సామాజిక అంతస్తు గల పిల్లలు ఉంటారు. ఈసమూహంలో ఇరుగుపొరుగు ఇళ్ళలోని పిల్లలు లేక పాఠశాలలో సహవిద్యార్థులు, లేక ఆటస్థలంలోకలిసే మిత్రులు చేరి ఉండవచ్చు. ఇటువంటి సమూహానికి దాని స్వంతమైన ప్రమాణాలు, విలువలు, భాష, కార్యక్రమాలు ఉంటాయి. దానిలో సభ్యులు తమపైన నియమ నిబంధనలు కల్గి ఉంటారు. ఈసమూహం పెద్దల సమూహాల నుండి పూర్తిగా వేరుగా ఉంటుంది.



BRAOU

సమ వయస్కుల సమూహం ఆసమూహం యొక్క నిబంధనలను, విలువలు, ప్రమాణాలకు సభ్యులందరూ కట్టుబడి ఉండాలని నియమిస్తుంది. ఆవిధంగా సాంఘికీకరణ తోడ్పడుతుంది. అనేక ఇతర విధాలుగా కూడా పిల్లల సాంఘికీకరణపై ఈసమూహం ప్రభావం చూపిస్తుంది. సమ వయస్కుల సమూహం తోటివారితో సమాన అంతస్తును, సంబంధాలను పిల్లలకు కలుగజేస్తుంది. ప్రతి బాలుడు పెద్ద సంబంధాలలో కనిపించని ఇచ్చిపుచ్చుకునే ధోరణి పెంపొందించుకొంటాడు. తోటివారితో స్నేహం చేయటం, వారిపట్ల సౌజన్యం ప్రదర్శించడం, వారిని తన సమానులుగా భావించడం ఈసమూహంలో నేర్చుకుంటాడు. కష్టాలలో ఉన్న వారికి సహాయం చేయటంకూడా నేర్చుకుంటాడు. ఈసమూహంలో సభ్యులలో ఐక్యత పెంపొందుతుంది.

సమ వయస్కుల సమూహం తమదైన ప్రత్యేక అభినివేశాలు కలిగి ఉంటుంది. కుటుంబం, పాఠశాలకు భిన్నమైన సంబంధ బాంధవ్యాలను పిల్లలు పెంపొందించుకుంటారు. కుటుంబంలోని తల్లిదండ్రులు ఇతర సభ్యులు నుండి పూర్వంకంటే స్వతంత్రం పొందుతారు. సమూహంలో సభ్యులుగా ప్రతి బాలుడు తమను ఆ సమూహం యొక్క ప్రమాణాల దృష్టితో చూచుకొంటాడు.

స్నేహితులు, కలిసి ఆటలు ఆడే మిత్రులు ఒకే వయస్సు కలిగినవారు సభ్యులుగా ఉండే సమ వయస్కుల సమూహం ఒక బాలుని మూర్తిమత్వం, ఆత్మభావం అభివృద్ధి చెందడంలో గొప్ప ప్రభావాన్ని చూపుతుంది. దానిలోని సభ్యులు సన్నిహితమైన, ముఖాముఖి సంబంధాలను కలిగి ఉంటారు. కాబట్టి కుటుంబంవలెనే ఈ సమూహం కూడా ప్రాథమిక సమూహంగా భావించవచ్చు. ఇటువంటి ప్రాథమిక సమూహాలు చిన్నవిగా, సన్నిహితమైనవిగా ఉండటం వల్ల సాంఘికీకరణలో ప్రధానపాత్ర వహించి పిల్లల మూర్తిమత్వం, ప్రవర్తనలపై గొప్ప ప్రభావాన్ని చూపిస్తాయి.

తన సభ్యులలో నూతనమైన స్నేహ సంబంధాలను పెంపొందించడమే గాక సమ వయస్కుల సమూహం పెద్దలపై ఆధారపడే బాల్యానికి ముగింపుకలుగుతుందని కూడా చెప్పవచ్చును. కుటుంబంలోను, పాఠశాలలోను ఆమోదం పొందనటువంటి నూతన సంబంధ బాంధవ్యాలను పెంచుకోవడం ద్వారా ఈసమూహంలోని సభ్యులు తమకు నూతన పాత్రలను, వ్యక్తిత్వాన్ని కల్పించుకొంటారు. సమ వయస్కుల సమూహం అనేది ఒక వ్యక్తి జీవితమంతా కొనసాగుతుంది. ముఖ్యంగా యవ్వనంలో ఇది ప్రభావం చూపుతుంది. కుటుంబం, పాఠశాల ఆమోదించిన విలువలను, ప్రమాణాలను పెంపొందించుకున్నప్పటికీ సమ వయస్కుల సమూహంలోని సభ్యులు సాంఘికీకరణ పొందడం లేదని అనలేము.వారు ఈసమూహం ద్వారా మరొక విధంగా సాంఘికీకరణ పొందుతున్నారు. డేవిడ్ రీస్‌మెన్ అభిప్రాయంలో సమ వయస్కుల సమూహం సామాజిక ప్రవర్తనలో అతి ప్రధాన పాత్ర వహిస్తుంది.

## 11.7.4 భారీ ప్రచార మాధ్యమాలు

రేడియో,టెలివిజన్, పత్రికలు, సినిమాలు, ఇంటర్నెట్ మొదలైనవి భారీ ప్రచాచర సాధనాలలో చేరి ఉన్నాయి. పంపించేవారు అందుకునే వారి మధ్య వ్యక్తిగతమైన సంబంధం లేకుండానే జనాభాలో అధిక భాగానికి అందుబాటులో ఉండే సాంఘికీకరణ సాధనాలుగా వీటిని పేర్కొనవచ్చును. వీటిద్వారా వ్యక్తులు సమాజం యొక్క విలువలను,నమ్మకాలను, సంప్రదాయాలను పొందగలుగుతారు. భారీ ప్రచార సాధనాలు ఏర్పడకముందు బహు కొద్ది మంది మాత్రమే పుస్తకాలు చదవగలిగేవారు. ఈనాడు వార్తలు కొద్ది సెకండ్ల కాలంలో రేడియో,టెలివిజన్ ద్వారా ప్రపంచంలోని అన్ని మూలలకు అందుతున్నాయి. ప్రజలు సంగీతం వినడం, సినిమా చూడటం, టెలివిజన్‌పై నాటకం చూడటం చేయగలుతున్నారు. ఇంటర్నెట్‌లో నిర్విరామంగా సంభాషించుకోగలుగుతున్నారు. అన్నిటికంటే గొప్ప ప్రభావం గల సాధనం టెలివిజన్. ఈసాధనం వివిధ విషయాలపై విజ్ఞానుల అభిప్రాయాలను ప్రపంచం నలుమూలల జరుగుతున్న విషయాలపై వార్తలను,సామాజిక సంఘటనలను సామాజిక మార్పులను, మారిపోతున్న ఫాష్యన్‌లను గూర్చిన సమాచారాన్ని ప్రజలకు అందజేస్తున్నవి.ప్రజలు వివిధ రకాల వ్యక్తులను, జీవిత విధానాలనుచూడడం,వినడం చేయగలుగుతున్నారు.

టెలివిజన్ పిల్లలపై చూపుతున్న ప్రభావం ఇటీవల కొందరి ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నది. వాస్తవిక,

అవాస్తవిక విషయాలను గూర్చి సమాచారాన్ని పిల్లలకు టెలివిజన్ అందజేస్తున్నది. పిల్లలు పెద్దవారి వలె తాము చూస్తున్నదాని ప్రాధన్యతను గ్రహించలేరు. గనుక వారు తప్పు దారి పట్టే ప్రమాదం ఉన్నది. ఉదాహరణకు ఊహాకల్పితమైన పాత్రలను వారు నిజమైనవిగా భావించిసాహసాలు చేస్తున్నారు.

కొన్ని విధాలుగా టెలివిజన్ సాంఘికీకరణ చేసే ఇతర సాధనాలైన కుటుంబం, పాఠశాల, సమ వయస్కుల సమూహంతో సన్నిహితంగా ఉంటుంది. పిల్లలు ఇంటి వద్ద, పాఠశాల వద్ద, తాము నేర్చుకున్న విలువలు, సాంఘికప్రమాణాలు వంటివే టెలివిజన్ కార్యక్రమంలో కూడా కనుగొనవచ్చును. కొన్ని కొన్ని సందర్భాలలో టెలివిజన్ కార్యక్రమాల ద్వారా పిల్లలు నేర్చుకునే అభిప్రాయాలు, విలువలు ఇతర సాంఘికీకరణ సాధనాల ద్వారా నేర్చుకున్న వారికి వ్యతిరేకంగా ఉండవచ్చును. ఉదాహరణకు పిల్లలకు కష్టపడి చదువుకొని, మంచి ఉద్యోగం చేస్తేనే వారి భవిష్యత్ సుఖమయంగా ఉంటుందని ఇంటివద్ద, పాఠశాలలో బోధిస్తారు. కానివారు టెలివిజన్ కార్యక్రమాలలో సుఖమయమైన జీవితం చిన్నవయస్సులోనే పొందవచ్చునని తెలుసుకోవచ్చును.

మానవుల ప్రవర్తన, పరస్పర చర్యల ను గూర్చి పిల్లలు తగినంత సమాచారాన్ని టెలివిజన్ ద్వారా పొందవచ్చు. వారు వివిధ వ్యక్తులు, స్థలాలు, సంఘటనలను గురించి డాక్టర్ లేక లాయర్ లేక పోలీస్ డిటెక్టివ్ చేసే పనులను గురించి తెలుసుకోవచ్చు. ధనాన్ని ఎన్ని విధాలుగా ఉపయోగించ వచ్చునో వారు గ్రహింపవచ్చు. పాఠశాలలో చెప్పినదానికంటే ఎక్కువ విజ్ఞానాన్ని టెలివిజన్ ద్వారా పొందవచ్చు. ఉదాహరణకు భూగోళం పాఠాన్ని లేక ఒక శాస్త్రీయమైన పరిశోధనను టెలివిజన్ ద్వారా చూస్తే విద్యార్థికి బాగా అర్థం కావచ్చు. ఇటీవల కాలంలోపిల్లలు టెలివిజన్‌పై ప్రపంచ జ్ఞానానికి చెందిన కార్యక్రమాలను, తమ సమాజం సాధించిన అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను చూస్తున్నారు.

టెలివిజన్ కార్యక్రమాలను చూసే పిల్లలు వాటిని చూడనివారింటే ఎక్కువ విజ్ఞానం కలిగి ఉంటారనే తెలుస్తుంది. అయినప్పటికీ కొన్ని సమయాలలో టెలివిజన్ అందించే సమాచారం వారిని తప్పుదోవ పట్టించవచ్చు. ఉదాహరణకు ఒక లాయర్ తాను చేపట్టిన కేసులన్నీ గెలవడంగానీ, ఒకడాక్టర్ తాను చేసిన శస్త్ర చికిత్సలన్నింటిలో విజయం సాధించడంగాని జరిగేపని కాదు. కాని టెలివిజన్‌లో అట్లా చూపిస్తారు. పిల్లలు తమ చుట్టూ వుండేవారి ప్రవర్తనను అనుకరించడానికి ప్రయత్నిస్తారని మానసిక శాస్త్రవేత్తలు కనుగొన్నారు. టెలివిజన్‌లో దౌర్జన్యంతో కూడిన దృశ్యాలను చూసిన పిల్లలు ఆచర్యలను అనుకరించడానికి ప్రయత్నిస్తున్నారా అని తెలుసుకోవడానికి అనేక పరిశోధనలు జరిగాయి. వాటి ప్రకారం టెలివిజన్‌లో దౌర్జన్యకరమైన సంఘటనలను తరచుగా చూసే పిల్లలు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిసింది. యువకులలో కూడా ఇటువంటి ప్రభావం కనిపించింది. కాని అందరు శాస్త్రజ్ఞులు ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. టెలివిజన్ శక్తివంతమైన సాంఘికీకరణ సాధనం అయినప్పటికీ దానివల్ల ప్రమాదాలు కూడా ఏర్పడవచ్చు.

## 11.8 సారాంశం

సాంఘికీకరణ ప్రక్రియ ద్వారా వ్యక్తులు సమూహ జీవితంలో పాల్గొనడం నేర్చుకొంటారు. ఈప్రక్రియలో వ్యక్తి తన సమాజంలో క్రియాశీలక సభ్యుడు అయ్యేందుకు తన సమూహానికి చెందిన ప్రమాణాలను, విలువలను అంతర్గతం చేసుకోవడం ప్రధాన విషయం.

కుటుంబంలో పరస్పర చర్య ఫలితంగా పసిబిడ్డ ఆత్మ భావన పొందుతాడు.కుటుంబంలోని ఇతరులను గుర్తిస్తాడు. ఈసాంఘికీకరణ ప్రక్రియ మనుష్యుల వ్యక్తిత్వాలను, వ్యవస్థీకృతమైన ప్రవర్తనను,వ్యక్తి ధోరణులను, నమ్మకాలను రూపొందిస్తుంది.ఒక మనిషి వ్యక్తిత్వం ప్రధానంగా సామాజిక, సాంస్కృతిక శక్తుల ఫలితమే.

అయితే ప్రతి వ్యక్తి వేర్వేరు పరిస్థితులలో పెరగడం వల్ల సాంఘికీకరణ జరిపే వివిధ సాధనాల వల్ల అతను ప్రభావితుడవుతాడు. ప్రతి వ్యక్తి మూర్తిమత్వం, అతను నివసించే పరిసరాలు, సాంఘికీకరణ ప్రధానంగా కుటుంబం, సమాన వయస్కుల సమూహం, పాఠశాల,భారీప్రచార సాధనాల ద్వారా జరుగుతుంది. పిల్లలు తమ ధోరణులు నమ్మకాలు విలువలు కుటుంబాల నుండి, సమాన వయస్కుల సమూహాల నుండి పొందుతారు.



BRAOU

సాంఘికీకరణ బాల్యంలో స్కౌట్లు, గరల్‌గైడ్స్, తరువాతి కాలంలో యువజన సంస్థలు, మత సమూహాలు, మిలిటరీ, సాంఘిక క్లబ్‌లు, మొదలైన వాటి ద్వారా వ్యక్తి సాంఘికీకరణ పొందుతూ ఉంటాడు. తమ సాంస్కృతిక విలువలను ప్రమాణాలను, ధోరణులను, అంతర్గతం చేసుకుంటూ సమాజంలోని సభ్యులు అవిచ్ఛిన్నంగా సామాజికీకరణ పొందుతూ వుంటారు. ఈప్రక్రియద్వారా వ్యక్తి, సమాజం ఒకటిగా రూపొందుతారు.

## 11.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.**

1) సాంఘికీకరణను నిర్వచించి, ఒక వ్యక్తి జీవితమంతా సంభవించే సాంఘికీకరణ ప్రక్రియను చర్చించండి.

2) సాంఘికీకరణ సాధనాలను వివరించండి.

**II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1)ప్రమాణాల, విలువల అంతర్గతీకరణం.

2)సంస్కృతి-మూర్తిమత్వం.

## 11.10 చదవదగిన పుస్తకాలు


Ian Robertson : Sociology.

Harold : Conflict and Consensus. An Introduction to Sociology.

William F. Kendel : Society in Action; Introduction to Sociology.

Jon.M.Shepard : Sociology.

Mercer and Wander : The Study of Society.


B R A O U

# భాగం-12: సాంఘికీకరణ సిద్ధాంతాలు

విషయక్రమం


12.0 ఉద్దేశాలు

12.1 పరిచయం

12.2 సాంఘిక ఆత్మభావన

12.3 కూలే సిద్ధాంతం

12.3.1 బింబ వ్యక్తిత్వం

12.4 మీడ్ సిద్ధాంతం

12.4.1 రెండు భాగాల ఆత్మ భావన

12.4.2 సాధారణీకరణ ఇతరుల భావన

12.4.3 బాల్య క్రీడాదశ, పోటీ ఆటల దశ

12.5 ఫ్రాయిడ్ సిద్ధాంతం

12.5.1 ఇడ్, అహం, అధ్యహం

12.6 పరిస్థితుల నిర్వచన సిద్ధాంతం

12.7 ఉమ్మడి ప్రాతినిధ్య సిద్ధాంతం

12.8 సాంఘికీకరణ ప్రాధాన్యత

12.9 సారాంశం

12.10 మాదిరి పరీక్ష ప్రశ్నలు

12.11 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 12.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు:

- ఆత్మభావన ఎలా ఏర్పడుతుందో తెలుసుకుంటారు.
- వివిధ సాంఘికీకరణ సిద్ధాంతాలను అవగాహన చేసుకుంటారు.
- సాంఘికీకరణ సాధనాలను గుర్తిస్తారు.

## 12.1 పరిచయం

అటు మనిషి వికాసానికి, ఇటు సమాజ మనుగడకు అతి కీలకమైన సాంఘికీకరణను సమాజ శాస్త్రవేత్తలు ఒక ప్రధాన భావనగా పరిగణించారు. సమాజశాస్త్రం, మానవ శాస్త్రంలోనేకాక మరో వైజ్ఞానిక శాస్త్రం, వైద్యశాస్త్రం, నిర్వహణ, పాలనాశాస్త్రాలలో కూడా ఈ భావన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పలువురు శాస్త్రవేత్తలు పరిశోధనలు, అధ్యయనాలు చేసి సాంఘికీకరణను సిద్ధాంతీకరించారు. సాంఘికీకరణ ఎందుకు, ఎలా ఏర్పడుతుంది, సాంఘికీకరణ ఆవశ్యకత ఏమిటి అనే అంశాలను ఈ శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ముఖ్యంగా పిల్లలు తమ మనస్సులను, చర్యలను, ప్రవర్తనను తద్వారా మూర్తిమత్వాన్ని ఏవిధంగా అభివృద్ధి చేసుకుంటారు,

సాంఘికంగా పరిపూర్ణత పొందేలోగా మనిషి ఎటువంటి దశల ద్వారా ప్రయాణిస్తాడో ఈ సిద్ధాంతాలు వివరిస్తాయి. ఈ సిద్ధాంత కర్తల్లో చార్లెస్‌కూలే, జార్జ్‌హెర్బర్ట్ మీడ్, సిగ్మండ్ ఫ్రాయిడ్, దుర్ఖైహైమ్‌లు ముఖ్యులు వారి సిద్ధాంతాలను చర్చిద్దాం.

## 12.2 సాంఘికీకరణ ఆత్మభావన

ఈ సిద్ధాంతాలను గూర్చి తెలుసుకునేముందు ఆత్మభావన ఏర్పడే విషయాలను గూర్చి క్లుప్తంగా తెలుసుకుందాం. సాంఘికీకరణ ద్వారా పొందే అతి ముఖ్యమైన అంశాలలో ఆత్మభావన ఒకటి. ఒక వ్యక్తి తన ఆత్మ ప్రతిమకు మరొక రూపమైన మూర్తిమత్వంలో ఆత్మభావన ఒక భాగం. పుట్టిన కొద్దికాలానికి పసిబిడ్డలు తమ వేళ్లను లేక తల్లి రొమ్ములను ఆటబొమ్మలతో సమానంగా వస్తువులుగా మాత్రమే భావిస్తారు. పసిబిడ్డ పెరుగుతున్న కొద్దీ తన చుట్టూ ఉన్న వస్తువుల పేర్లను, తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, తోటి బాలబాలికలు వస్తువుల పట్ల కలిగి ఉన్న ధోరణులను గ్రహించగల్గుతారు. ఈ ప్రక్రియలోనే పసిబిడ్డ తనపట్ల ఇతరుల ప్రవర్తనను గ్రహిస్తాడు. నిప్పుకు దూరంగా ఉండాలని, అలా చేయడం తన రక్షణకు అవసరమని అతడు తెలుసుకుంటాడు. పిల్లలు క్రమంక్రమంగా ఆత్మ చైతన్యాన్ని పొంది, ఇతరులు తమపట్ల ప్రవర్తిస్తున్న విధానాన్ని బట్టి సాంఘికీకరణమైన ఆత్మభావనను పెంపొందించుకుంటారు. ఆత్మభావన స్పష్టంగా వివరించడానికి వీలుకానిదైనప్పటికీ, మనమందరం మన మెవరో స్పష్టంగా తెలుసుకొని ఉంటాము. సమాజంలో మనం వహించే పాత్రను, మన లక్షణాలనుబట్టి మన ఆత్మభావన ఉంటుంది. ఎవరైనా నీవెవరని ప్రశ్నిస్తే, సమాజంలో పాత్రనుబట్టి నేను విద్యార్థిని అనో, తల్లిని అనో, అధ్యాపకుడిని అనో జవాబిస్తాం. ఆత్మభావన సమాజంలో జీవించడంవల్ల కలుగుతుంది. జీవితమంతటా ఇతరులతో పరస్పర చర్యలవల్ల అది మారుతూ ఉంటుంది.

BRAOU

## 12.3 కూలే సిద్ధాంతం

చార్లెస్ కూలే (1964-1929) అమెరికా దేశానికి చెందిన ఆర్థికవేత్త. కొంత కాలానికి ఆయన సామాజిక మనస్తత్వ శాస్త్రవేత్తగా పేరుపొందాడు. ఆయన తన సిద్ధాంతంలో పొందుపరచిన అనేక విషయాలనుతన పిల్లలు ఆడుకొంటున్నప్పుడు వారిని గమనించి గ్రహించాడు. పిల్లలలో ఆత్మగౌరవం అతి ముఖ్యమైనదని తెలుసుకున్నాడు. పిల్లలలో అది ఏవిధంగా అభివృద్ధి చెందుతుందో చూపడానికి ప్రయత్నించాడు. పిల్లలు ఇతరులను గమనించి తమ పట్ల వారి ప్రతిచర్యలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకుంటారని ఆయన తెలుసుకొన్నారు. ఉదాహరణకు ఇంటికి ఎవరైనా బంధువులు వస్తే, తల్లిదండ్రుల దృష్టి ఇంటికి వచ్చిన బంధువులపైగాక తమపైనే ఉన్నదని తెలుసుకుంటారు. ఇటువంటి సందర్భాలను బట్టి పిల్లలు ఇతరులు మతపట్ల ఎటువంటి భావనకల్గి ఉన్నారో గ్రహించి ఆ విధంగా తమను తాము పరిశీలించుకొంటారు. ఈ ప్రక్రియలోనే వారు తమ మూర్తిమత్వాన్ని పెంపొందించుకొంటారు. ఆత్మభావన సొంతదనంలో మొదట గర్వం ద్వారా ప్రారంభమవుతుందని కూలే వివరించాడు. ఒక బాలుడు తనకలం లేక చెప్పులు, లేక పుస్తకాల పట్ల ప్రత్యేక గౌరవాన్ని కలిగి ఉంటాడు. అవి తన సొంతమని, వాటిపై తనకు పూర్తి అధికారమున్నదని గర్విస్తాడు. ఈ విధంగా సొంతదనం అనే భావననుండి అతడు ఇతర ధోరణులను పెంపొందించుకొంటాడు. తన వస్తువులను అర్థం చేసుకోగల్గినట్లు తనపట్ల ఇతరుల అభిప్రాయాలను అర్థం చేసుకోగల్గుతాడు. క్లాసులో ఒకబాలుడ్ని ఉపాధ్యాయుడు పొగిడితే ఆ బాలుడు చాలా గర్విస్తాడు. ఈ విధంగా బాలుడు తనకు ముఖ్యులైన కుటుంబాలు సభ్యులు ప్రముఖులైన ఇతరుల స్థానంలో తనను ఊహించుకొని, వారి మెప్పుదల పొందడానికి కృషిచేస్తాడు. ఈరకమైన ఆత్మ ప్రతిమను అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఉపాధ్యాయుడు తనను అల్లరి వెధవా అని గోపగిస్తే సిగ్గుపడతాడు. అది తన గౌరవానికి భంగకరమని భావిస్తాడు.

### 12.3.1 బింబ వ్యక్తిత్వం

ప్రతి వ్యక్తి తాను ఇతరులకు ఏవిధంగా కనిపిస్తున్నాడో ఊహించుకొని తన ఆత్మ ప్రతిమను పొందుతాడు. తన ఆత్మభావనను ఏర్పరచుకోవడానికి ఇతరులను అద్దాలుగా ఉపయోగించుకుంటాడు. కూలే దీనిని బింబవ్యక్తితవం అన్నాడు. వ్యక్తితవం మన ప్రవర్తన పట్ల ఇతరుల ప్రతిచర్యలను మనకు స్పష్టం చేస్తుంది. మనం ఏవిధంగా

కన్పిస్తున్నామో ఇతరులు మనల్ని గూర్చి ఏమనుకుంటున్నారో ఈ బింబ వ్యక్తిత్వంలో తెలుస్తుంది. మనపట్ల ఇతరుల భావనలనుబట్టి మనలో గర్వంగానీ, ఆత్మగౌరవంగానీ, అసహ్యంగానీ కలుగుతుంది. మనపట్ల ఇతరుల ప్రవర్తనను గమనించి మనం అందంగా ఉన్నామో, వికారంగా ఉన్నామో, ఇతరులకు అంగీకారంగా ఉన్నామో, అనంగీకారంగా ఉన్నామో తెలుసుకోగలుగుతాము. మనపట్ల ఇతరుల ప్రవర్తనను బట్టే మన వ్యక్తిత్వాన్ని, చర్యలను మంచివో, చెడ్డవో నిర్ణయించగల్గుతాము.

కూలే మనిషి ప్రవర్తనకు సంబంధించి రెండు ఆసక్తికరమైన ప్రతిపాదనలు చేశాడు. అవి: 1) మనసు సాంఘికీకరమైంది, 2) సమాజానికీ మనసుంటుంది. తన 'Social Organisation' గ్రంథంలో ఈ రెండింటినీ వివరించాడు. "ఆత్మ, సమాజం ఈరెండూ కవలపిల్లల్లాంటివి. మనం ఒకదాన్ని చూసిన వెంటనే మరోదాన్ని గమనిస్తాం. అహం అనేది మరెక్కడో వేరుగా స్వతంత్రంగా వుంటుందనుకోవడం భ్రమ" అని ఆయన పేర్కొన్నాడు. కూలే ప్రతిపాదనలు అనేకమంది సామాజిక శాస్త్రవేత్తలను ఆకర్షించాయి.

బింబ వ్యక్తిత్వంలో మూడు దశలుంటాయని కూలే వివరించాడు. మొదటి దశలో ఒక వ్యక్తి తాను ఇతరులకుఏవిధంగా కన్పిస్తున్నాడో ఊహించుకొంటాడు. రెండవ దశలో తన ప్రవర్తనపట్ల ఇతరులు ఏమనుకుంటున్నారో ఊహించుకొంటాడు. మూడవ దశలో ఇతరులు తనను ఏవిధంగా పరిగణిస్తున్నారో దాని ప్రకారంతన చర్యలను మంచివో, చెడ్డవో నిర్ణయించుకుంటాడు. ఈ విధంగా బింబ వ్యక్తిత్వం వల్ల మనగురించి మనం మంచి అభిప్రాయమో, చెడు అభిప్రాయమో కల్గించుకొంటాము. బింబ వ్యక్తిత్వం వల్ల మనం ఇతరులకు మంచిగా కన్పిస్తున్నట్లు వూహించుకొంటే మనపట్ల మనకు గౌరవం కల్గుతుంది. దీని ఫలితంగా మనం అదే ప్రవర్తనను కొనసాగిస్తాము. ఇతరులు మనగురించి చెడ్డగా భావిస్తున్నారని ఊహించుకుంటే మన ఆత్మగౌరవం తగ్గిపోయి మన ప్రవర్తనను మార్చుకొంటాము. ఇది ఇష్టపూర్వకంగా జరిగే ప్రక్రియ కాకపోయినా ప్రతి సాంఘిక సందర్భంలోనూ విజయవంతంగా భావిస్తూ ఉంటుంది.

ఈమూడు దశలను కూలే తన 'Human Nature and the Social Order'లో వివరించాడు. వ్యక్తి తన కుటుంబ సభ్యులు లేదా ప్రాథమిక సమూహ సన్నిహితులతో జరిపే పరస్పర చర్యల్లో మొదటి 'ఆత్మ' భావనను పొందుతాడు. తన ప్రవర్తనపట్ల పరస్పర చర్యలపట్ల ఎదుటివారు ఎలా ప్రతిస్పందిస్తున్నారో గమనిస్తూండడం వల్ల వ్యక్తి తననుతాను అంచనా వేసుకుంటాడు. అంతే ముందు తను ఎలా ఉండాలో, ఎలా ప్రవర్తించాలో ఊహించుకొని, అలా ప్రవర్తిస్తే ఇతరులు ఎలా ప్రతిస్పందిస్తున్నారో గమనించడంవల్ల తనేమిటో అంచనా వేసుకుంటాడు. దీన్నే కూలే 'బింబవ్యక్తిత్వం' అన్నాడు. తాను వూహించుకున్న దానికి, ఇతరులు తనను గుర్తించినదానికి మధ్య ఉన్న తేడాను గమనిస్తూ వ్యక్తి తన ప్రవర్తనను మలచుకుంటాని కూల పేర్కొన్నాడు. ముఖ్యంగా పిల్లల్లో ఈ ప్రవర్తన మనకు స్పష్టంగా కనిపిస్తున్నది. ఎలా ప్రవర్తించడం వల్ల తనుమెప్పును పొందుతున్నాడు. ఎలాంటి ప్రవర్తవల్ల అవమానం పాలవుతున్నాడు అనే విషయం గమనిస్తూ మెప్పుపొందే విధంగా ప్రవర్తించడం అలవర్చుకుంటాడు. అలాగే ఎలా వెండి, ఎలా ప్రవర్తిస్తే ఎల్లవేళలా మంచి వ్యక్తి అనిపించుకుంటాడో నిర్ణయించుకొని అలా వుండే విధంగా తన వ్యక్తిత్వాన్ని రూపొందించుకుంటాడు.

దీన్నిబట్టి సమాజం లేకుండా ఎదుటివ్యక్తి అంచనాలకు సంబంధించిన వ్యూహం లేకుండా మనిషిలో ఆత్మభావన (నేను, నన్ను అనే భావన) లేదని కూలే అంటాడు. ఎదుటి వాళ్లదృష్టిలో ఎలా కనిపించాలి, ఎలా వుండాలి అన్న ముందస్తుభావన మనకు, మన ప్రవర్తనకు అద్దంలా పనిచేస్తుందన్నది వాస్తవం. అందుకే మనిషిని గుర్తించి చెప్పుతూ కూలే "నేను నేననుకొంటున్న నేనుకాదు. నేను నువ్వనుకుంటున్న నేనూ కాదు. నేను నువ్వనుకుంటున్నావని నేననుకొంటున్ననేను" అన్నారు.

ఈరకమైన ఊహ అంతా మనిషి మనస్సులోనే జరుగుతుంది. తన ప్రవర్తన పట్ల ఇతరులు ఏమనుకుంటున్నారో ఊహించుకొనడం వల్లనే బింబ వ్యక్తిత్వం కల్గుతుంది. కొన్ని సమయాలలో మన బింబవ్యక్తిత్వం మన గురించి ఇతరుల నిజమైన భావాలను ప్రతిబింబించకపోవచ్చు. ఉదాహరణకు ఒక బాలుడు తప్పుచేసినప్పుడు తల్లిదండ్రులు శిక్షిస్తారు. కాని ఆ బాలుడు తనను వారు అన్యాయంగా శిక్షించారని అనుకోవచ్చు. నిజానికి ఇది తనపట్ల ఇతరుల



BRAOU

ప్రవర్తనను తప్పుగా అంచనా వేసుకోవడమే కానీ అంతమాత్రంచేత బింబ వ్యక్తిత్వం సరికాదని అనలేం.

అయితే ఒక వ్యక్తి ఆత్మభావన చుట్టూ ఉన్న అందరి ప్రవర్తన వల్ల ప్రభావితం కాకపోవచ్చు. కొంతమంది ఇతరులు తమనుగూర్చి భావించే విధానాన్ని పొరపాటుగా అర్థం చేసుకోవచ్చు. ఈవిధంగా మనగురించి ఇతరుల అభిప్రాయాలు పొరపాటుగా అర్థం చేసుకోవడంవల్ల మనలో ఉన్నత, న్యూనతా ఆత్మభావన కలుగుతుంది. అయినప్పటికీ మనగురించి ఇతరుల అభిప్రాయాలను మనం సరిగా అర్థం చసుకున్నా, చేసుకోకపోయినా, ఆత్మభావన, సాంఘిక పరస్పర చర్యల వల్లే కలుగుతుందనేది కాదనలేము.

## 12.4 మీడ్ సిద్ధాంతం

జార్జ్ హెర్బర్ట్ మీడ్ (George Herbert Mead, 1869-1931) ఆమెరికాలోని చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన మనోవైజ్ఞానిక తత్వవేత్త. సాంఘికీకరణ ప్రక్రియను గురించి ముఖ్యమైన సిద్ధాంతాన్ని మీడ్ ప్రతిపాదించాడు. వ్యక్తి ప్రవర్తనకు మూర్తిమత్వ అభివృద్ధికి ప్రతీకాత్మక పరస్పర చర్యలు ప్రధానంగా దోహదపడతాయని మొట్టమొదటిసారిగా ప్రతిపాదించిన శాస్త్రవేత్త మీడ్. పరస్పర చర్యల ప్రతీకల ద్వారా అంటే వ్యక్తుల మధ్య సైగలు, ముఖంలోని హావభావాల ప్రదర్శన, భాష తదితర వ్యక్తీకరణల ద్వారా జరుగుతాయని ఆయన ప్రతిపాదించడు. పరస్పర చర్యలకు దోహదపడే ఈ ప్రతీకల్లో భాష ముఖ్యమైంది. సమాజంలో వ్యక్తుల మధ్య పరస్పర చర్యలకు అభిప్రాయ ప్రకటనకు భాష అత్యంత ప్రధానమైన సాధనమని, మనం మనస్సుద్వారానే ఇతర ప్రవర్తనను అంచనావేసి తదనుగుణంగా మన ప్రవర్తనను మలచుకుంటామనిమీడ్ పేర్కొన్నాడు.

చార్లెస్ కూలేలాగే మీడ్ కూడా 'ఆత్మ' అనేది సామాజికమైందిగానే భావించాడు. వ్యక్తి ఇతరులతో జరిపే పరస్పర చర్యల ద్వారానే తనగురించి తాను తెలుసుకుంటాడని మీడ్ పేర్కొన్నాడు. అంటే సమాజంలో తాను పోషించే పాత్రను బట్టి వ్యక్తి తనను తాను తెలుసుకుంటాడు.

BRAOU

### 12.4.1 రెండు భాగాల ఆత్మ భావన- నన్ను, నేను

మూర్తిమత్వం అనేది సామాజిక కారణాలవల్లనేగాక, సామాజికేతర కారణాలవల్లకూడా ఏర్పడుతుందని మీడ్ భావించాడు. అతడు ఆత్మభావనలో రెండు భాగాలుంటాయని, అవి నన్ను, నేను అని పేర్కొనవచ్చునని తెలియజేశాడు. వీటిలో నన్ను అనేటటువంటి ఆత్మభావనలో భాగం సాంఘికీకరణద్వారా ఏర్పడుతుంది. అంతర్గతీకరణం చేసుకున్న లోకరివాజులే, ప్రమాణికాలే నన్నుగా రూపొందుతాయి. సాంఘికీకరణవల్ల ఏర్పడుతుంది కాబట్టి నన్ను అనేది వ్యక్తియొక్క భవిష్యత్ ప్రవర్తనను ఖచ్చితంగా తెలుసుకోవడానికి తోడ్పడుతుంది. కానీ మనిషి ప్రవర్తన ఆవేశంతో కూడి ఉండడం వల్ల స్పష్టంగా ఈవిధంగా ఉంటుందని చెప్పడం కష్టం నేను అనేది స్వతంత్ర్యం, చురుకుదనం, చొరవ మొదలైన లక్షణాలను కలిగి సామర్థ్యంతో కూడి ఉంటుంది. వ్యక్తి సామాజిక జీవనంలో పాల్గొంటున్న సమయంలో నేను, నన్ను అనుక్షణం పరస్పర చర్యలను పొందుతూ ఉంటాయి. నీలో ఏదైనా భావం కలిగినప్పుడు, కోరిక కలిగినప్పుడు నేను ఈ విధంగా భావిస్తున్నాను, లేక నాకు ఇది కావాలి అనుకుంటావు. కానీ, నీమనసులోనికి వచ్చిన ఆలోచనలన్నింటిని కార్యరూపంలో పెట్టలేవు. నీవుచేయబోయే పనిపట్ల ఇతరులు ఏవిధంగా ప్రతిస్పందిస్తారో ఊహించుకుని అందుకు అనుగుణంగానే ప్రవర్తిస్తావు. నేను ఈ పనిచేస్తే వారు నాపట్ల కోపం పొందుతారు. లేక నన్ను చూసి నవ్వుతారు అని గ్రహించి ఆపని చేయడం మానుకుంటావు. ఈ రకంగా ఇతరులు నీగురించి ఏమనుకుంటారో అనే నీఊహనీలోని నన్ను కలిగిస్తుంది. ఇతరులు మన ప్రవర్తన పట్ల ఎటువంటి భావాన్ని పొందుతారో ఊహించుకోవడం ద్వారానే మనం మన ప్రవర్తనను అదుపులో పెట్టుకోగలుగుతామని మీడ్ అభిప్రాయం. ఒక వ్యక్తి ఆత్మభావన పెంపొందడంలో నేను, నన్ను రెండూ చేరి ఉంటాయి. ఈ రెండింటి మధ్య జరిగే సంభాషణను మైడ్లింగ్ అని పేరుపెట్టారు.

### 12.4.2 సాధారణీకరణమైన ఇతరుల భావన

సాంఘికీకరణలో అతి ముఖ్యభాగం ఇతరులు మననుండి ఏమి ఆశిస్తారో ముందుగానే ఊహిచుకోవడం, మన

ప్రవర్తనను అదుపులో పెట్టుకోవడం అని మీడ్ తెలియజేశాడు. మన ప్రవర్తనను అంచనావేసుకోవడం, అదుపులో పెట్టుకోవడం అనేది ఇతరుల స్థానంలో మనలను ఊహించుకొని, వారి దృష్టితో మన ప్రవర్తనను గమనించడం ద్వారా పొందుతామని అతని అభిప్రాయం. బాల్యంలో పిల్లలు తమ తల్లిదండ్రుల ప్రవర్తనా పద్ధతులను తమలో అంతర్గతం చేసుకుంటారు. పెరుగుతున్నాకొద్దీ తమచుట్టూ ఉన్న సమాజం తమనుండి ఏమికోరుతుందో తెలుసుకోగలుగుతారు. తల్లిదండ్రులను ప్రముఖులైన ఇతరులు సమాజాన్ని సాధరణీకరమైన ఇతరులు అని మీడ్ వర్ణించాడు. బాలుడు పది లేక 12 సంవత్సరల వయస్సు వచ్చేసరికి ఇతరుల పాత్రలను స్వీకరించడం, వివిధ వ్యక్తుల పాత్రలను పోల్చడం చేయగలుగుతాడు. తనచుట్టూ ఉన్నవారందరూ ఒక విషయంపై ఒకేరకమైన అభిప్రాయాన్ని కలిగి ఉంటే అతడు కూడా దానిని తన అభిప్రాయంగా స్వీకరిస్తాడు. కానీ, ఆవిషయంపై వివిధ వ్యక్తులు వేరువేరు అభిప్రాయాలు కలిగి ఉంటే వాటన్నింటిలో ఏది సాధారణమైనదో గ్రహించడం కష్టం. పిల్లలు సామాన్యంగా తమ చుట్టూఉన్న వారిలో అధిక సంఖ్యాకులు ఏ అభిప్రాయాన్ని కలిగి ఉంటారో తెలుసుకుని దానిని తమ అభిప్రాయం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు.

సాధారణీకరణమైన ఇతరులు కలిగిన అభిప్రాయాన్ని తెలుసుకోగలిగిన వ్యక్తి ఇతరులు తనను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించినా వారి అభిప్రాయాలకు విలువలనివ్వడు. ప్రపంచజ్ఞానం కలిగిన వ్యక్తి ఏ కొత్త పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కోగలుగుతాడు.

### 12.4.3 బాల్యక్రీడాదశ, పోటీ ఆటల దశ

పిల్లలకు జ్ఞానం సంపాదించడంలో ఆటలు చాలా తోడ్పడతాయని మీడ్ తెలియజేశాడు. పిల్లలు బొమ్మలతో ఆడుకునేటప్పుడు తమను తల్లిగానో, ఆయాగానో, వైద్యుడుగానో, ఉపాధ్యాయుడుగానో ఊహించుకుంటారు. మీడ్ రెండు దశలను వర్ణించాడు. అవి బాల క్రీడాదశ, పోటీల ఆటల దశ, బాల్యక్రీడాదశ ముఖ్యమైనవని మీడ్ అభిప్రాయం. ఈదశలో పిల్లలు ఇతరుల పాత్రను వర్ణించి తమ అభిప్రాయమేకాక ఇతరుల అభిప్రాయాలను కూడా గ్రహించగలుగుతారు. ఒక బాలిక తనను తాను తల్లిగా భావించుకుని, తన బొమ్మను తనుగా భావించుకుని పాత్ర ప్రవర్తన పట్ల తన జ్ఞానాన్ని విస్తరింపచేసుకుంది.

బాల్య క్రీడాదశ ఐదు లేక ఆరు సంవత్సరాల వయస్సులో సంభవిస్తుంది. ఆటల్లో పాల్గొనేవారి మధ్య కొంత పరస్పర చర్య ఉంటుంది. ఉదాహరణకు ఒక బాలుడు, అతని చెల్లెలు, వైద్యుడు, నర్సు పాత్ర వహిస్తే వారిద్దరూ తమ పాత్రలను వేరువేరుగా నిర్వహిస్తారేగానీ ఒకరిపై ఒకరు ఆధారపడి పాత్ర నిర్వహణ చేయరు. పిల్లలు పోటీల ఆటల దశ చేరుకున్నప్పుడు తమ పాత్రలలో వైవిధ్యాన్ని గుర్తించగలుగుతారు. తమ తమ పాత్రలను సామర్థ్యంతో నిర్వహించడానికి ప్రయత్నిస్తారు. ఆట ఆడుతున్న అందరిలో తమ ప్రత్యేకపాత్రను గుర్తించడానికి కృషి చస్తారు.తమ పాత్ర ప్రాధాన్యతను ఇతరులకు తెలియజేయడానికి ప్రయత్నిస్తారు.

## 12.5 ఫ్రాయిడ్ సిద్ధాంతం

సిగ్మండ్ ఫ్రాయిడ్ (Sigmund Freud) మానసిక విశ్లేషణా పితామహుడుగా పేర్కొనదగినవారు. గత శతాబ్దంలో అతి ప్రముఖమైన విజ్ఞానిగా గుర్తింపు పొందిన ఫ్రాయిడ్ సిద్ధాంతాలు ఈనాటికీ ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. కూలే, మీడ్ ఆత్మభావనను, సాంఘికీకరణ ఉత్పాదకముగా భావిస్తే, ఫ్రాయిడ్ సాంఘికీకరణ ప్రక్రియలో జైవిక, మానసిక సంబంధమైన విషయాలకు ప్రాధాన్యతనిచ్చాడు. మానవ ప్రవర్తనలో అధికభాగం మనుషులకు తెలియకుండా జరుగుతుందని ఫ్రాయిడ్ వాదించాడు. మానవుడు తన చర్యలపట్ల తగిన అవగాహన కలిగి ఉండడు. బాల్యంలో అనుభవాలు వయస్సు పెరిగకొద్దీ మరుగున పడిపోయినప్పటికీ వ్యక్తియొక్క మూర్తిమత్వం అభివృద్ధి చెందడంలో ఆ అనుభవాలు ప్రముఖపాత్ర వహిస్తాయని అతని అభిప్రాయం. మనుషుల ప్రవర్తనకు మూలమైన శక్తులను వారి కలలు, మాటలలో తొట్రుపాటు, మంచి శిక్షణ పొందిన వైద్యునితో సంభాషణల ద్వారా తెలుసుకోవచ్చుననీ, దీనిని మానసిక విశ్లేషణ అంటారని ఫ్రాయిడ్ తెలియజేశాడు.

ప్రతీవ్యక్తి లైంగికమైన, దౌర్జన్యకరమైన ప్రాథమిక భావాలతో జన్మిస్తాడని, వీటిని అదుపుచేయకపోయినట్టయితే

సమాజంలో శాంతి భద్రతలు అదుపుచేయడం కష్టమని ఫ్రాయిడ్ వ్యక్తపరిచాడు. మనిషికి సమాజానికి మధ్య సంబంధాలలో నిరంతరం ఘర్షణ ఉంటుందని అతడు భావించాడు. అందువల్ల వ్యక్తులు కొన్ని నిబంధనలకు కట్టుబడి ఉండాలని సమాజం కోరుతుంది. తన కట్టుబాట్లకు వ్యక్తిలోబడేట్లు చేస్తుంది. కొన్ని సమయాల్లో ఇటువంటి నిర్భందాలవల్ల వ్యక్తులలో మానసిక ఘర్షణలు, అశాంతి ఏర్పడవచ్చు. లైంగికమైన కోరికను అణచివేయవలసిన ప్రాధాన్యతను నొక్కి చెప్పాడు. పసితనంలోకూడా ఈ కోరిక ఉంటుందని, దీని ఫలితంగానే వ్యక్తికి, సమాజానికి మధ్య ఘర్షణ ఏర్పడుతుందని అతడు తెలియజేశాడు.

### 12.5.1 ఇడ్, అహం, అధ్యహం

ఫ్రాయిడ్ మూర్తిమత్వాన్ని మూడు భాగాలుగా విభజించాడు. అవి ఇడ్, అహం, అధ్యహం. మనిషి పుట్టుకనుండి కనిపిస్తూ జీవితమంతా కొనసాగే శక్తుల కలయికయే ఇడ్. ఇది స్వార్థపరమై, సంఘవ్యతిరేకమై ఉంటుంది. కోరికలను వెంటనే తీర్చుకోవాలని వ్యక్తిపై ఒత్తిడి చేస్తుంది. ఇతరులపై దౌర్జన్యం చేయడం, ఒకరి తల్లిదండ్రుల పట్ల లేక నిషేదింపబడిన దగ్గరిబంధువుల పట్ల లైంగికమైన కోరికలు కలిగి ఉండడం, సంఘవ్యతిరేకమైన చర్యలను ఏ సమాజం అంగీకరించవు. పసిబిడ్డ ఆత్మ పూర్తిగా వీటితో నిండి ఉంటుంది. కానీ, అతడు ఇతరులతో పరస్పర చర్యల ద్వారా దానిని అదుపుచేయడం నేర్చుకుంటాడు.

అహం అనేది సాంఘిక అనుభవం ద్వారా ఏర్పడుతుందని, ఆత్మభావనలో ఇది అతి ఉపయోగమైన, అర్థవంతమైన భాగమని ఫ్రాయిడ్ అభిప్రాయపడ్డాడు. అహం రెండు విధులను నిర్వర్థిస్తుంది. ఒకటి ఇడ్ ద్వారా ఏర్పడే కోర్కెలను ఒకవైపున, అధ్యహనం ద్వారా సమాజానికి అంగీకరమైన కోరికలు మరొక వైపున మనిషిలో ఉంటాయి. ఈ రెండింటి మధ్య అహం రాజీ కుదురుస్తుంది. రెండు, మనిషి వ్యక్తిత్వానికి, అతని చుట్టూ సాంఘిక పరిసరాలకు మధ్యవర్తిగా పనిచేయడానికి ప్రయత్నిస్తుంది. మనిషి మూర్తిమత్వంలోనూ, మూర్తిమత్వం సమాజం మధ్య ప్రశాంతమైన పరిస్థితిని కలిగించుకోగలిగితే మనిషి ఆనందమైన జీవితాన్ని గడుపుతాడు. లేనిపక్షంలో అతని వ్యక్తిత్వంలో తీవ్రమైన విఘాతం ఏర్పడుతుంది.

అధ్యహనం అనేది ఆత్మభావనలో నైతిక భాగం అని చెప్పవచ్చు. ఏది చేయాలో, ఏది చేయవచ్చో అటువంటి ప్రవర్తనా ధోరణులను ఇది అంతర్గతం చేసుకుంటుంది. సమాజంలో అధికభాగం పనిని అధ్యహనం నిర్వర్తిస్తుందని ఫ్రాయిడ్ భావించాడు. అధ్యహనంలో విలువలు, ప్రమాణాలు, నమ్మకాలు, సాంఘికీకరణద్వారా లభించిన ధోరణులు చేరి ఉంటాయి. సమాజం ఆమోదించిన భావాలను మాత్రమే ప్రదర్శించే విధంగా వ్యక్తికి అధ్యహనం దారి చూపిస్తుంది. అదే సమయంలో సంఘవ్యతిరేకమైన ప్రవర్తనను అణచివేస్తుంది. సమాజంలో లైంగిక, దౌర్జన్య పూరితమైన భావాలను అధ్యహనం అదుపు చేస్తుంది కనుక దానికి, ఇడ్‌కు నిరంతర సంఘర్షణ కొనసాగుతుంది. అహం అనేది ఇడ్ అధ్యహన జరిగే మధ్య జరిగే సంఘర్షణలో మధ్యవర్తిగా పనిచేస్తుంది. అది మనిషి ప్రవర్తనను అదుపుచేసి అతడిని అధ్యహనం అదుపులో ఉండేట్లు చూస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి దుకాణంలోని చేతి గడియారాన్ని దొంగిలించాలనే భావన పొందవచ్చు అది సాంఘికంగా నిషేదించిన చర్య అని అతనికి తెలుసు. ఆసందర్భంలో అహం అతనిలో ఉన్న ఇడ్, అధ్యహనం మధ్య జరుగుతున్న సంఘర్షణలో మధ్యవర్తిత్వం వహించి, ఆచర్యవల్ల కలగబోయే పరిణామాలను అతనికి తెలియజేస్తుంది. సమాజంలో మానభంగాలు, హత్యలు, దొంగతనాలు జరగడాన్నిబట్టి ఇడ్ అనేది అందరిలో పూర్తిగా అదుపుచేయబడలేదని తెలుస్తుంది. కొన్ని సమయాల్లో ఇడ్‌ద్వారా జరిగే భావాలను పరోక్షంగా ప్రదర్శించడం జరుగుతుంది. తన శత్రువును చంపితే కలిగే తీవ్ర పరిణామాలు తెలుసుగనుక ఒక మనిషి తన శత్రువును చంపుతానని బెదిరించడం మాత్రమే చేస్తాడు.

అధ్యహనం ఇటువంటి సంఘవ్యతిరేకమైన భావాలను ఎదుర్కొంటుంది. దాని సహాయంతో మనం మన చర్యలను అదుపు చేసుకుంటాము. సమాజం అంగీకరించిన ప్రమాణాల ప్రకారం మనం ఎట్లా ఉండాలో అధ్యహనం సూచిస్తుంది.

మనిషి మెదడు పైనతెలిపిన మూడు విభాగాలుగా ఉంటుందని ఫ్రాయిడ్ అనలేదు. మనిషిలో ఆత్మభావన, మూర్తిమత్వం అభివృద్ధి చెందే పద్ధతిని అర్థం చసుకోవడానికే ఆయన ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కొందరు



BRAOU

మానసిక శాస్త్రవేత్తలు మీడ్ సిద్ధాంతమే ఎక్కువ ఉపయోగకరమైనదని భావిస్తారు.

## 12.6 పరిస్థితుల నిర్వచన సిద్ధాంతం

సాంఘికీకరణను సిద్ధాంతీకరించి విశ్లేషించినవారిలో డబ్ల్యూ.ఐ.థామస్, ఎమిలి, దుర్క్‌హైమ్‌లను కూడా ముఖ్యులుగా పేర్కొనవచ్చు. వీరిలో థామస్ పరిస్థితుల నిర్వచన సిద్ధాంతాని (Definition of the Situation) ప్రతిపాదించగా దుర్క్‌హైమ్ ఉమ్మడి ప్రాతినిధ్య సిద్ధాంతాన్ని (Collective representation) ప్రతిపాదించ్చాడు.

థామస్ సిద్ధాంతం ప్రకారం సాంఘికీకరణలో భాగంగా శిశువు తన కుటుంబం (సమూహం) నిర్ణయించిన విధి విధానాలు, ఆచారవ్యవహారాలకు అనుగుణంగా అంటే తన పరిస్థితులకు అనుగుణంగా తన ప్రవర్తనను మల్చుకుంటాడు. వ్యక్తి పుట్టడానికి ముందే కుటుంబం కొన్ని పద్ధతులను పాటిస్తూ ఉంటుంది. ఏ కుటుంబంలో పుట్టిన శిశువు ఆ కుటుంబ పరిస్థితులు, పద్ధతులు పాటిస్తూ వస్తుంటాడు. తన అభిరుచులు, ఆసక్తులు, ఆకాంక్షలు ఎలా ఉన్నా వ్యక్తి తన ప్రాథమిక సమూహపు పద్ధతులకే ప్రాధాన్యతనిస్తూ తదనుగుణంగా ప్రవర్తిస్తుంటాడు. అంటే తనపై తనకుటుంబమో, మిత్ర బృందమో, అధ్యాపకులో పెట్టుకొన్న నమ్మకాలు, ఆశలు దృష్టిలో ఉంచుకొని వ్యక్తి తన ప్రవర్తనను మలచుకొంటాడు. పద్ధతులను మార్చుకొంటాడు. పద్ధతులు, పట్టింపులు, ప్రవర్తనేకాక క్రమశిక్షణ, త్యాగనిరతి, సేవాభావం వంటివి వ్యక్తిలో పెంపొందడానికి ఈ పరిస్థితులే కారణమని థామస్ వివరించారు. ఆయన తన The unadjusted Girl అనే గ్రంథంలో ఈ సిద్ధాంత విశ్లేషణ చేశారు.

ప్రతీ సమాజంలో కూడా కొన్ని నిర్దిష్ట పద్ధతులు ఆచారాలు ఉంటాయి. అంటే సమాజం కొన్ని పనులను మంచివిగా కొన్నింటిని చెడువిగా గుర్తించి పెడుతుంది. కుటుంబం తల్లిదండ్రులు ఆ మంచి పనులను నిర్ధారించి, నిర్వచించి పిల్లలు వాటినే చేయాలని, పిల్లలు ఆ ప్రమాణాల మేరకే ప్రవర్తించాలని ఆశిస్తారు. అలాగే పిల్లలను ఆదేశిస్తారు. తల్లిదండ్రుల అదేశాలకు అనుగుణంగా పిల్లలు ప్రవర్తనను మలచుకొంటారు. 'అబద్ధమాడరాదు', 'సత్యమునే పలుకవలెను', 'పెద్దలను గౌరవించుము' వంటి నీతి బోధలు ఈ కోవకే చెందుతాయి.

## 12.7 ఉమ్మడి ప్రాతినిధ్య సిద్ధాంతం

ప్రముఖ సామాజిక తత్వవేత్త దుర్గ్‌హైమ్ ప్రతిపాదించిన ఉమ్మడి ప్రాతినిధ్య సిద్ధాంతం (Collective representation) కూడా కొంత వరకు సాంఘికీకరణ ప్రక్రియను వివరించింది. వ్యక్తి తన సమాజపు ప్రవర్తనారీతులను స్వీకరించి తన ప్రవర్తనను పద్ధతులను మార్చుకుని సాంఘికీకరణం పొందుతాడని దుర్గ్‌హైమ్ అంటారు. వ్యక్తి తనకు తెలియకుండానే తన చుట్టూ ఉన్న సమూహంలో సరళీనమైపోతాడాని, ఆసమూహపు పద్ధతులు, ఆలోచనలు, అలవాట్లు, ప్రవర్తన రీతులకు అనుగుణంగా మారిపోతాడని పేర్కొన్నారు. వ్యక్తి ఎప్పుడు సమూహంతో సమ్మిళితమై సమూహాలోచనకు, సమూహ లక్షణాలకు ప్రతినిధిగా మారిపోతాడు. సామాజిక చర్యలు, సామాజిక విలువలు, పద్ధతులు, ధోరణులు, ఆలోచనలు, అలవాట్లు ఇవన్నీ సమాజం ఉమ్మడిగానే ఏర్పాటు చేసుకుంటుంది. వ్యక్తులంతా కలిసి ఆధోరణులకు ఉమ్మడిగా ప్రాతినిధ్యం వహిస్తారు. ఉదాహరణకు జాతీయ పతాకాన్ని తీసుకుందాం.

జాతీయ పతాకం పట్ల అప్పటికే సమాజంలో ఉన్న సమిష్టి భావన వల్ల ప్రజలందరూ ఒకే రకంగా స్పందిస్తారు. లేదా సమాజ భావనకు అనుగుణంగా, అందుకు కట్టుబడి ప్రతిస్పందిస్తారు.అంటే సామాజిక విలువలే వ్యక్తుల ప్రవర్తనాధారణులను మలుస్తాయన్న మాట. దుర్గ్‌హైమ్ ప్రకారం సమూహ ప్రమాణాలను బట్టి (ఇది కుటుంబం, మిత్రబృందం, కులం,మతం ఏదైనా కావచ్చు) వ్యక్తి తన పద్ధతులను మార్చుకుంటాడు. తనలో సమూహ అకాంక్షలకు భిన్నమైన ఆలోచనలు ఏవైనా ఉంటే వాటిని సవరించుకుంటాడు. దీన్నే సంఘటిత చైతన్యం అనీ సమూహం మనస్థత్వం అనీ దుర్గ్‌హైమ్ తన రచనల్లో పేర్కొన్నారు.



BRAOU

## 12.8 సాంఘికీకరణ ప్రాధాన్యత

సిద్ధాంతాలు, విశ్లేషణను విభిన్నంగా ఉన్నా మనిషికి సాంఘికీకరణ అత్యవసరమున్న ప్రాథమిక అవగాహనతో ఎవరికీ ఎలాంటి విబేధాలులేవు. సాంఘికీకరణ మనిషిని ఒక సాధారణ జైవిక దశ నుంచి సాంఘికదశకు చేరుస్తుంది. అలాగే సాంఘికీకరణ వ్యక్తిత్వ రూపకల్పనకు, మూర్తిమత్వాన్ని పెంపొదించడంలో ఉపకరిస్తుంది. వ్యక్తి పొందే సాంఘికీకరణ వల్లే అతనికి వ్యక్తిత్వం అలవడుతుంది. పద్ధతులు, సాంప్రదాయాలు వ్యక్తిలో క్రమశిక్షణను, బాధ్యతలను విజ్ఞాన వికాసాలను, నైపుణ్యాలను పెంపొందిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే సాంఘికీకరణ వల్లే మనిషి మిగితా జంతువులకంటే భిన్నమైన, ప్రత్యేకమైన జాతిగా గుర్తింపు పొందాడు. మనిషి సంఘజీవిగా మారడానికి మూలం ఈసాంఘికీకరణే అనడంలో సందేహంలేదు.

## 12.9 సారంశం

ఒక సాధారణ జీవిగా అవిర్భవించిన వ్యక్తి శిశుదశ నుంచి సంఘజీవిగా ఎదిగే క్రమంలో మనస్సును, చర్యలను, ప్రవర్తనను ప్రతిస్పందనను ఎలా మలచుకొంటాడు, ఎలా తన మూర్తిమత్వాన్ని సామాజిక విలువలకు, సూత్రాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకుంటాడు అనే విషయాలను సాంఘికీకరణ సిద్ధాంత కర్తలు వివరించారు. సాంఘికీకరణ ద్వారా వ్యక్తి మెు సట ఆత్మభావన పొందుతాడు. తద్వారా తన ఆత్మవిశ్వాసానికి అనుగుణమైన పాత్రలను పోషిస్తారు. సమాజ ప్రతిస్పందనను, తనచుట్టూ ఉన్న సమూహ ఆకాంక్షలను, ఆమోదాలను బట్టి తన ప్రవర్తనా రీతిని మలచుకుంటూ'పరిపూర్ణ' మానవుడిగా పరివర్తన చెందుతాడు.

సాంఘికీకరణ సిద్ధాంతకర్తల్లో ప్రధానంగా చార్లెస్ కూలే, హెర్బర్ట్‌మీడ్,సిగ్మండ్ ఫ్రాయిడ్‌లు ముఖ్యులు డబ్ల్యు.ఐ.థామస్, ఎమిలీ దుర్గ్‌హైమ్ వంటి సామాజిక నేత్తలు కూడా సాంఘికీకరణ ప్రక్రియను విశ్లేషించారు. కూలే బింబ వ్యక్తిత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రతి వ్యక్తి తాను ఇతరులకు ఏవిధంగా కనిపిస్తున్నాడో ఊహించుకుని తన ప్రవర్తనను మలచుకొంటాడు. వ్యక్తిలో 'నేను' 'నన్ను' అన్న భావనే 'ఆత్మ' భావనను అంకురింపజేస్తుందని 'నేను ఎలా ఉండాలి' 'నన్ను ఎలా చూస్తున్నారు' అన్న ఆలోచనల్లోనే మనిషి పద్ధతులు, ప్రవర్తనలు అలవరచుకుంటాడని మీడ్ సిద్ధాంతం ప్రతిపాదించింది. ఇందుకు భిన్నంగా ఫ్రాయిడ్ మనిషి ప్రవర్తన మానసిక ప్రతిస్పందనగా విశ్లేషించాడు. ఇడ్, అహం, అధ్యహం అనే మానసిక అంశాలు మనిషి ప్రవర్తనను, ప్రతిస్పందల్ని నియంత్రించి మూర్తిమత్వ వికాసానికి దోహదపడతాయని ఫ్రాయిడ్ వివరించారు.అలాగే మనిషి పరిస్థితులను బట్టి ప్రవర్తనను పెంపొందించుకొండాని థామస్'పరిస్థితులనిర్వచన' సిద్ధాంతాన్ని మనిషి ఎప్పుడూ ఉమ్మడి ఆకాంక్షలకు ప్రతినిధిగానే వ్యవహరిస్తాడని దుర్గ్‌హైమ్ ప్రతిపాదించాడు.

## 12.10 మాదిరి పరీక్షప్రశ్నలు

I. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం వ్రాయండి

1. ఆత్మభావన అంటే ఏమిటి? సాంఘికీకరణలో ఆత్మభావన ప్రాధాన్యత ఏమిటి.

2. మీడ్ ప్రతిపాదించిన సాంఘికీకరణ సిద్ధాంతాన్ని వివరించుము

II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం వ్రాయండి.

1. బింబ వ్యక్తిత్వం

2. నన్ను, నేను

BRAOU

## 12.11. చదవదగిన గ్రంథాలు


| | |
|---|---|
| Ian Robertson | : Sociology. |
| Harold | : Conflict and Consensus. An Introduction to Sociology. |
| William F. Kendel | : Society in Action; Introduction to Sociology. |
| Jon.M.Shepard | : Sociology. |
| Mercer and Wander | :The Study of Society. |


BRAOU

# భాగం - 13: సామాజిక పరస్పర చర్య

## విషయక్రమం


13.0 ఉద్దేశాలు

13.1 పరిచయం

13.2 పరస్పరచర్యలోని మౌలికాంశాలు

13.3 సామాజిక పరస్పర చర్యకు పూర్వ నిబంధనలు

13.4 అనుబంధ ప్రక్రియలు

- 13.4.1 సహకారం
- 13.4.2 సర్దుబాటు
- 13.4.3 విలీనీకరణ

13.5 అననుబంధ ప్రక్రియలు

13.6 సంఘర్షణ

13.7 ముగింపు

13.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

13.9 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 13.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సామాజిక పరస్పర చర్యను నిర్వచించగలరు.
- సామాజిక పరస్పర చర్యలోని ప్రాథమిక అంశాలను వివరించగలరు.
- సామాజిక పరస్పర చర్య ప్రతీకాత్మక మూలాన్ని వివరిస్తారు.
- వివిధ సామాజిక ప్రక్రియలలలో కనిపించే వివిధ రకాల పరస్పర చర్యలను గుర్తించగలుగుతారు.

## 13.1 పరిచయం

పరస్పర చర్య సమాజానికి మూలం. సమాజం సామాజిక సంబంధాల అల్లిక అని ఆ సంబంధాలున్న వ్యక్తుల మధ్య జరిగే చర్య, ప్రతిచర్యల పర్యవసానమే పరస్పర చర్య అని మీకు తెలుసు. సమాజశాస్త్రం సమూహాలు, ఆ సమూహాల్లోని వ్యక్తుల మధ్య సంబంధాలను అధ్యయనం చేస్తుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పర చర్య జరిగినప్పుడు ఒకరినొకరు కేవలం భౌతికంగానే కాకుండా సమాజంలో ఒక వ్యక్తిగా, అంటే వివిధ దృక్పథాలు వివిధ తరహాల ఆశలు ఉన్న వ్యక్తులుగా కూడా గుర్తించడం జరుగుతుంది. ఒక వ్యక్తి చర్య చాలా మట్టుకు అతని మనోభావాలపైన ఆశలు, ఆకాంక్షలపైన, ఇతరుల ప్రతిచర్యలపైన ఆధారపడి ఉంటుంది. ఈ కారణంగానే ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది లేక రెండు సమూహాల మధ్య పరస్పర చర్య జరిగితే వారిమధ్య సామాజిక సంబంధాలు

నెలకొంటాయి. ఇలా ఏర్పడిన సామాజిక సంబందాలు తాత్కాలికమైనవి లేదా కలకాలం నిలిచిఉండేవి వావచ్చు. వీటికి ఉదాహరణగా అపరిచిత వ్యక్తులు కలుసుకున్నప్పుడు పలకరింపులు కాలాంతరంలో రెండు కుటుంబాల మధ్య సంబంధంగా గానీ ఆ ఇద్దరి మధ్య స్నేహ సంబంధంగా గానీ మారవచ్చు. రెండు వర్గాల మధ్య ఏర్పడే సామాజిక సంబంధం స్నేహ పూర్వకమైంది కావచ్చు - అంటే ఒకరినొకరు అంతం చేసుకునేంత శతృత్వం కూడా ఏర్పడవచ్చు. పరస్పరం పోరాడుతున్న రెండు దేశాల సైనికుల మధ్య ఏర్పడే సంబంధం కూడా సామాజిక సంబంధమే.

**సామాజిక పరస్పర చర్య - నిర్వచనం:** వ్యక్తులు తమ తోటివారి చర్యలకు స్పందించి ప్రవర్తించే ప్రక్రియే పరస్పర చర్య. ఉదాహరణకు క్లాసు రూములో పాఠం బోధించే ఉపాధ్యాయుడు, పాఠం వినే విద్యార్థులు, వీధి కుళాయి దగ్గర వాదించుకొనే స్త్రీలు పర్పర చర్యలో పాల్గొంటారు. ఈ రెండు ఉదాహరణల్లో వ్యక్తుల మధ్య ముఖాముఖి చర్యల ద్వారా పరస్పర చర్య జరుగుతుంది. కానీ, పరస్పర చర్య ఎప్పుడూ ముఖాముఖి జరగవలసిన అవసరం లేదు. మీరు ఈ పాఠం చదువుతున్నప్పుడు కూడా పరస్పర చర్య జరగుతున్నదని గుర్తించాలి. రచయితగా నేనుకొన్ని అంశాలను చర్చిస్తున్నాను. వాటి అర్థాన్ని మీరు గ్రహించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి సందర్భంలో కూడా పరస్పర చర్య జరుగుతున్నట్లే భావించాలి. అట్లాగే టి.వి కార్యక్రమాలకు స్పందించడం కూడా పరస్పర చర్యకు ఉదాహరణలు, అందుకే పరస్పర వ్యక్తుల మధ్య పరస్పర ప్రభావం, పరస్పర ఉద్దీపన ప్రతిచర్యగా పేర్కొంటాం. ఇంకో రకంగా చెప్పాలంటే భావ ప్రసారం మాటలద్వారా గానీ, వ్రాతల ద్వారా, సంజ్ఞలు ఇంకా ఇతర మాధ్యమాల ద్వారా జరిగినా పరస్పర చర్య జరుగుతుంది. భావ ప్రసారం ద్వారా ఒక వ్యక్తిని ఇంకొక వ్యక్తి ప్రభావితం చేయడం జరుగుతుంది. భావ స్రారం జరుగుతున్నంతసేపూ, వ్యక్తులు ఒకరినొకరు ప్రభావితం చేసేటంతకాలమూ పరస్పర చర్య కొనసాగుతుంది. వ్యక్తుల మధ్య సంపర్కంలో అంతరాయం ఏర్పడినా, ఆగిపోయినా, వ్యక్తుల ఆసక్తి ఇంకొక విషయానికి మళ్లినా పరస్పర చర్య అంతమవుతుంది. ఉదాహరణకు ఇంటి జమాఖర్చుల గురించి భార్యాభర్త చర్చించుకుంటున్నారనుకోండి. ఆ సమయంలో హఠాత్తుగా ఫోన్ రావడంతో ఆ చర్చ అంతటితో ముగిసి ఫోన్‌లో ఇంకో వ్యక్తితో సంభాషణ మొదలైతే ఒక విషయంలో ఆసక్తినుంచి ఇంకో విషయానికి దృష్టి మరలడం, ఇంకొకరితో పరస్పర చర్య మొదలవడం జరుగుతుంది.

సామాజిక పరస్పర చర్యలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన సంపర్కం. ఈ సంపర్కం వస్తు మాధ్యమంగా గానీ, జ్ఞానేంద్రియాల ద్వారాగానీ జరగవచ్చు. సామాజిక పరస్పర చర్య ఏర్పడాలంటే సామాజిక సంపర్కం ఏర్పడటం తప్పనిసరి. మానవుల సామాజిక ప్రవర్తనలో ఇతరుల చర్యలకు ప్రతిస్పందించడం ప్రధానంగా కనిపిస్తుంది. ఈ పరస్పర చర్య నిరంతరం కొనసాగేటటువంటిది. పరస్పర ప్రతిస్పందన కలిగించేటటువంటిది అయి ఉంటుంది. ఒక సామాజిక వ్యవస్థలో వ్యక్తుల మధ్య జరిగే చైతన్యవంతమైన చర్య, స్పందనలే సామాజిక పరస్పర చర్య. సామాజిక పరస్పర చర్యలోని మౌలికాంశాలను గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

BRAOU

## 13.2 పరస్పరచర్యలోని మౌలికాంశాలు

పరస్పర చర్యలో రెండు మౌలిక అంశాలు ఉన్నాయి. అవి : 1. సామాజిక సంపర్కం, 2. భావ ప్రసారం. పరస్పర చర్య జరగడానికి ఇవి చాలా అవసరం. ఇవి లేకపోతే పరస్పర చర్య జరగదు.

**సామాజిక సంపర్కం:** రెండు ఏకాంశాలు దగ్గర కావడాన్నే సంపర్కం అనవచ్చు. ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని ఢీకొనడం లేదా బస్సులో ఒకే సీటులో ఇద్దరు కూర్చోవడం సంపర్కమే అవుతుంది. కానీ ఈ రెండు సందర్భాలలో భౌతిక సంపర్కం కనబడతుందేకానీ సామాజిక సంపర్కం కనబడదు. పరస్పర స్పృహ(awareness) , పరస్పర స్పందన ఉన్నపుడే సామాజిక సంపర్కం జరుగుతుంది. అంటే సంపర్కంలోని వ్యక్తులు ఒకరి గురించి ఇంకొకరికి స్పృహ ఉండటంతోపాటు ఒకరికనుగుణంగా ఇంకొకరు తమ ప్రవర్తనను సవరించుకోవడం జరుగుతుంది. అలాగే సామాజిక సంపర్కం జరగడానికి భౌతిక సంపర్కం తప్పనిసరి అని అనుకోకూడదు. వ్యక్తుల మధ్య సామాజిక సంపర్కం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా, అంటే రేడియో, వార్తా పత్రికలు, టి.వి, టెలిఫోన్, ఉత్తరాల ద్వారా కూడా

జరగవచ్చు. అయితే భౌతిక సంపర్కం అనేది సామాజిక సంపర్కానికి బలాన్ని చేకూరుస్తుంది. ఏ మాధ్యమం ద్వారా జరిగినా సరే సంపర్కం భావ ప్రసారయుక్త పరస్పర (communicative interaction) చర్యకు దారితీస్తుంది. భావ ప్రసారం లేకుండా పరస్పర చర్య సాధ్యం కాదు. కనుక పరస్పర చర్య ఎప్పుడూ భావ ప్రసార యుక్త పరస్పర చర్యే అవుతుంది.

పరస్పర చర్యలోని రెండవ మౌలిక అంశం భావ ప్రసారం. భావ ప్రసారంలో ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తి వ్యక్తీకరించే భావాలను భాష ద్వారాగానీ, సంజ్ఞలద్వారా గానీ, అర్థం చేసుకొనే ప్రయత్నం చేస్తాడు. అందుకే అతను ప్రతిస్పందించేటప్పుడు పైకి కనబడు ప్రవర్తన కాకుండాదాంట్లో దాగి ఉన్న భావాలకు అనుగుణంగా ప్రవర్తించడం జరుగుతుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తికి ఒక బహుమతి ఇస్తే, బహుమతి వరు, ఎందుకు ఇచ్చారు. అవతలి వ్యక్తి ఉద్దేశ్యం, ఇచ్చిన సందర్భం ఇలా అన్ని విషయాలూ అర్థం చేసుకొని బహుమతి తీసుకొన్న వ్యక్తి ప్రతిస్పందించడం జరుగుతుంది. అటే ఏ పరస్పర చర్యలోనైనా ప్రవర్తన వెనుక దాగి ఉన్న అర్థాన్ని గుర్తించడం, దానికి అవతల వారి ఆకాంక్షమేరకు ప్రతిస్పందించడం జరగుతుంది. ఈ అర్థాలు, ఉద్దేశాలు, ఆకాంక్షలు, పరస్పర స్పృహ ఇవన్నీ పరస్పర చర్యలో నిరంతరం ఉంటాయి. భావ ప్రసారం భాష ద్వారా జరగవచ్చు లేదా భాషేతరం కావచ్చు. భాష ద్వారా జరిగే భావ ప్రసారంలో ఉపయోగించే భాష ఇతరులకు అర్థమయ్యేదిగా ఉండాలి. పరస్పర చ్యలో పాల్గొనే వారికి భాష అర్థం కాకపోతే సామాజిక సంపర్కం ఏర్పడటం, అవతల వారినుంచి ప్రతిస్పందన ఉండవు. ఉదాహరణకు తెలుగు మాత్రమే తెలిసిన ఒక వ్యక్తితో ఫ్రెంచిలో మాట్లాడితే పరస్పర చర్య జరగదు. అర్థం కానిభాషలోనిభావాలకు స్పందన ఉండదు. కనుక అవతలి వ్యక్తి తిట్లనుకూడా చిరునవ్వుతో వినడం జరుగుతుంది. అదే అవతలివ్యక్తి తనను కించపరచి మాట్లాడుతున్నాడని తెలిస్తే దానికి తీవ్ర ప్రతిస్పందన ఉంటుంది. అందుకు భాషద్వారా జరిగే భావ ప్రసారంలో వ్యక్తులందరూ అర్థం చేసుకునే భాషను ఉపయోగిస్తేనే వ్యక్తుల స్పందన అర్థవంతంగా ఉంటుంది.

భాషేతర భావ ప్రసారంలో సంజ్ఞలు, ముఖ కవలికలు, చేతుల ద్వారా లేదా ప్రతీకలను ఉపయోగించడం జరగుతుంది. ఇందులో వ్యక్తులు భాషనుపయోగించి భాషేతర మాధ్యమాల ద్వారా పరస్పర చర్య జరుగుతుంది. ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని చూసి పలకరింపుగా చిరునవ్వు నవ్వితే అందుకు తిరిగి సమాధానంగా అవతలి వ్యక్తికూడా చిరునవ్వు నవ్వుతాడు. చిరునవ్వు అందరికీ అర్థమయ్యే చర్య. అట్లాగే కరచాలనం. భారతీయులు చేతులు జోడించి నమస్కరించడం, 'హలో ఎలా ఉన్నారు?' అని పలకరించడం, ఇవన్నీ అభివాదానికి ఉదాహరణలు. అయితే ఈ అభివాదం తరువాత పరస్పర చర్య ఆయా వ్యక్తులను బట్టి ఉంటుంది.

వ్యక్తుల మధ్య పరస్పర చర్య భారీ ప్రచార సాధనాల ద్వారా లేదా ముఖా ముఖి కూడా జరుగుతుంది. మనం ఇప్పటివరకు పరస్పర చర్యలోని రెండు మౌలికాంశాల గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు సామాజిక సంపర్కం, భావ ప్రసారాల వర్గీకరణ గురించి విపులంగా చర్చిద్దాం. సామాజిక సంపర్కాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. సకారాత్మక లేదా నకారాత్మక సామాజిక సంపర్కం, 2. ప్రాథమిక లేదా గౌణ సామాజిక సంపర్కం.

**1. సకారాత్మక లేదా నకారాత్మక సామాజిక సంపర్కాలు:** సకారాత్మక సామాజిక సంపర్కాలు అనుబంధ పరస్పర చర్యకు దారితీస్తాయి. దీనిలోని చర్య ప్రతిచర్య స్నేహపూరితంగానూ, సహకార స్వభావం గలదిగానూ ఉంటుంది. అదే నకారాత్మక సంపర్కం అననుబంధ పరస్పర చర్యకు దారి తీస్తుంది. లేదా పరస్పర చర్య అసలు జరగపోవచ్చుకూడా.

**2. ప్రాథమిక లేదా గౌణ సంపర్కము:** ముఖాముఖి సంపర్కాలను ప్రాథమిక సంపర్కము అంటారు. ఇందులో వ్యక్తులు వ్యక్తిగతంగా కలుసుకోవడమే కాకుండా వారి అన్ని ఇంద్రియాలు అవతలి వ్యక్తులను అర్థం చేసుకోవడానికి వినియోగిస్తారు. ఇద్దరు స్నేహితులు ఒకరినొకరు పలకరించుకోవడం, చిరునవ్వు నవ్వడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

గౌణసంపర్కాలలో వ్యక్తుల మధ్య సంపర్కాన్ని ఏర్పరిచే మాధ్యమం ఉంటుంది. ఈ మాధ్యమం ఒక వ్యక్తి



BRAOU

కావచ్చు లేదా ఒక సాంస్కృతిక కళారూపం కావచ్చు. ఉదాహరణకు మీ పనివాడిని దుకాణానికి పంపి వస్తువుల ధరలు కనుకున్నారనుకొండి. అప్పుడు మీరు దుకాణం యజమానితో గౌణ సంపర్కం ఏర్పరచుకున్నరన్నమాట. అట్లాగే ఈ పాఠం చదువుతున్నప్పుడు మీ మధ్య, నామధ్య ఏర్పడేది గౌణ సంపర్కం. గౌణ సంపర్కంలో ముఖాముఖి సంబంధం ఉండదు కాబట్టి అవతలి వ్యక్తిని అర్థ చేసుకోవడానికి కొన్ని ఇంద్రియాలనే మనం ఉపయోగించడం జరుగుతుంది. ఫోన్లో మీ స్నేహితుడితో మాట్లాడే మీరు మీ శ్రవణేంద్రియాలను తప్ప ఉపయోగించే వీలులేదు. అట్లాగే ఈపాఠం చదువుతున్నప్పుడు అచ్చయిన వాక్యాలు కనబడతాయేకానీ పాఠం రాసిన నేను కనబడేవీలులేదు. అందుకు గౌణ సంపర్కం ఏర్పరచుకోవడంలో వ్యక్తులు ఎక్కువగా తమ ఊహలపై ఆధారపడడం జరుగుతుంది. ఇటువంటి సంపర్కం ప్రాథమిక సంపర్కం కంటే తక్కువ ఉద్వేగపూరితంగానూ గహనం(depth) లేనిదిగానూ ఉంటుంది.

గౌణ సంపర్కాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు- ప్రత్యక్ష, పరోక్ష సంర్కాలు.

ప్రత్యక్ష గౌణ సంపర్కం: పరస్పర చర్యలో పాల్గొనే వ్యక్తుల మధ్య మధ్యస్థ ఏజన్సీ ద్వారా ప్రత్యక్ష సంపర్కం ఏర్పడితే అది ప్రత్యక్ష గౌణ సంపర్కమౌతుంది. మీ స్నేహితుడి నుండి మీరు ఉత్తరం అందుకుంటే ఆఉత్తరం ద్వారా మీకు, మీ స్నేహితుడుకి మధ్య సంపర్కం ఏర్పడినట్లే. అట్లాగే ఫోన్ సంభాషణ కూడా ఈ కోవకే చెందుతుంది.

**పరోక్ష** గౌణ సంపర్కం: వ్యక్తుల మధ్య మధ్యస్థ ఏజన్సీ ప్రత్యక్ష సంపర్కం ఏర్పరచనప్పుడు దాన్ని పరోక్ష గౌణ సంపర్కం అనవచ్చు. మీరు ఫోన్ చేసినప్పుడు మీ స్నేహితుడు ఇంట్లో లేక పోతే మీరు చెప్పదలచుకున్న విషయాన్ని ఇంకో వ్యక్తి ద్వారా చెప్పించడం పరోక్ష గౌణ సంపర్కానికి ఉదాహరణ.

**భావ ప్రసారం** : వ్యక్తుల చర్య, ప్రతి చర్యలు ఇతరుల ప్రవర్తన వెనుక ఉన్న అర్థాన్ని బట్టి ఉంటాయని ఇది వరకే తెలుసుకొన్నాం. భావ ప్రసారం జరగకుండా సంపర్కం సాధారణంగా జరగదు కానీ అది అసలు జరగదనడానికి వీలు లేదు. ఒక వేళ అట్లా జరిగితే పరస్పర చర్య తొందరగా అంతమవుతుంది. ఉదాహరణకు ఫోన్‌లో మనకు అర్థం గాని భాష అవతలి వ్యక్తులు మాట్లడితే తొందరగా ఫోన్ పెట్టేయడం జరుగుతుంది కదా. భావ ప్రసారం కోసం మానవులు ప్రముఖంగా ఉపయోగించేది భాషే అని మనందరికీ తెలుసు. అయితే భాష మాత్రమే కాకుండా సంజ్ఞలు, శరీరభంగిమలు, ముఖకవళికలు, వస్త్రధారణ, అలంకరణ అన్నీ మన మనోభావాలను తెలుపుతాయి. అందుకే వీటిని భాషేతర భావ ప్రసార సాధనాలంటారు. అయితే ఈసాధనాల అర్థం, వాడకం ఒక సంస్కృతి నుంచి మరో సంస్కృతికి మారుతూ ఉండటం గమనించాలి. ఉదాహరణకు ఇంగ్లాండ్‌లో ఒక వ్యక్తికి ఎవరైనా తెల్ల ఈకను ఇస్తే పరోక్షంగా ఆవ్యక్తిని పిరికివాడు అన్నట్లే. ఇంకో ఉదాహరణ చూద్దాం తెల్ల జెండా చూపించడం అంటే శాంతి కోరుకోవడం అని అర్థం వస్తుంది. అయితే కొన్ని సంజ్ఞలు-చిరునవ్వు లేదా కన్నెర్ర చేయడం వంటివి. అన్ని సంస్కృతుల్లోనూ ఒకే అర్థాన్ని కలిగి ఉంటాయి.

అవగాహణ స్థాయిని బట్టి భావప్రసారాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. 1.సంపూర్ణ భావప్రసారం, 2.అసంపూర్ణ భావప్రసారం.

1.సంపూర్ణ భావప్రసారం: పరస్పర చర్య జరుపుకొనే వ్యక్తులు తమ ప్రవర్తన వెనుక నున్న అర్థాన్ని అవగాహన చేసుకొని దానికి అనుగుణంగా స్పందించినప్పుడు ఆభావప్రసారాన్ని సంపూర్ణమైందిగా భావించవచ్చు.

2.అసంపూర్ణ భావప్రసారం: వ్యక్తులు ఇతరుల ప్రవర్తన వెనుకనున్న అర్థాన్ని గ్రహించలేకపోతే లేదా తప్పుగా అర్థం చేసుకుంటే అది అంసపూర్ణ భావప్రసారమవుతుంది. దీనికి కారణాలు సంస్కృతి పరమైన తేడాలు, మాధ్యమ ఏజన్సీలో లోపం, అనుకూలాలోచన(wishfull thinking) లేదా పరధ్యానం కావచ్చు.

అయితే భావప్రసారాన్ని సంపూర్ణ, అంసపూర్ణ భావప్రసారాలుగా వర్గీకరించడం సరికాదేమో. అవగాహన ఉండటం లేదా అవగాహన లేకపోవడాన్ని బట్టి భావప్రసారం సంపూర్ణ స్థాయి నుంచి అసంపూర్ణ స్థాయి వరకూ

ఉంటుంది అనడం సరియైనది. అయితే సకారాత్మక, నకారాత్మక సంపర్కాలు అనుబంధ, అననుబంధ పరస్పర చర్యలకు దారి తీసినట్లుగా సంపూర్ణ , అసంపూర్ణ భావ ప్రసారాలు అనుబంధ,అననుబంధ పరస్పర చర్యలకు దారి తీయకపోవచ్చు. ఇంతకు ముందు చెప్పిన ఉదాహరణే తీసుకొందాం. ఇంగ్లండ్‌లో వెల్ల ఈక ఇవ్వడంలో అర్థాన్ని గ్రహించని వ్యక్తి దాన్ని మెచ్చుకోలుగా భావించవచ్చు. తద్వారా అనుబంధ చర్యకు దారితీయవచ్చు లేదా అలా ఇవ్వడం వెనుక అర్థాన్ని అతను గ్రహిస్తే అది అననుబంధ చర్యకూ దారి తీయవచ్చు.

సామాజిక సంపర్కం, భావప్రసారాల గురించి విపులంగా చర్చించిన తర్వాత సామాజిక పరస్పర చర్య ముఖ్యంగా ప్రతీకాత్మకమైనదని అర్థం చేసుకోవాలి. పరస్పర చర్య జరుపుకొనే వ్యక్తులు భాషను, భాషేతర సాధనాలను ఉపయోగించి భావప్రసారం చేసుకుంటారు. ఈభాషేతర సాధనాలైన సంజ్ఞలు, ముఖకవళికలు వంటివాటి అర్థం సంస్కృతిని బట్టి మారుతూ ఉంటుంది. అందుకే ఒకే సంస్కృతికి చెందినవారు ఉపయోగించే ప్రతీక శబ్దాలు, సంజ్ఞలు లేదా వస్తువులు-ఒకే భావాన్ని తెలియజేస్తాయి. ఈప్రతీకలు సమాజ ఉమ్మడి వ్యవస్థాపన నుంచి పుట్టినవే. కొన్ని ప్రత్యేక రూపాలు కొన్ని ప్రత్యేక భావాలను వ్యక్తం చేయడానికి ఉద్దేశింపబడి ఉంటాయి. ఇటువంటి రూపాలు ఆమోదించిన ప్రతీకల్‌గా మారడం, సంప్రదాయ సిద్ధ భావప్రసార సాధనాలుగా ఉపయోగించడం జరుగుతుంది. ప్రతీకాత్మక భావప్రసార సాధనాలలో అధిక జనాదరణ పొందినది భాష అని మీరు ఇదివరకే చదివారు. భాషలోని ప్రతిపదం ఏదో ఒక భావాన్ని తెలియజేస్తుంది. భాషేతర సాధనాలలో రంగులు, శబ్దాలు, సంజ్ఞలు మొదలైనవి చేరి ఉంటాయి. పరస్పర చర్యలో పాల్గొనే మానవులు పరస్పరం అర్థమయ్యే ప్రత్యేకమైన ప్రతీకలను ఉపయోగిస్తారు.

## 13.3 సామాజిక పరస్పర చర్యకు పూర్వ నిబంధనలు

పరస్పర చర్య జరగడానికి కొన్ని లక్షణాలు,పూర్వ నిబంధనల అవసరం ఎంతైనా ఉంది. ఆలక్షణాలు, పూర్వ పరిస్థితులు: 1. ఇద్దరు అంత కంటే ఎక్కువ మంది వ్యక్తులు 2.వ్యక్తుల మధ్య ప్రతీకలనుపయోగించి భావప్రసారం జరగడం 3.కాల వ్యవధి లేదా కాల పరిమాణం 4.ఒక లక్ష్యం. ఒక లక్ష్య సాధన కోసం ఇద్దరరు లేదా అంతకంటేఎక్కువ మంది వ్యక్తులు ఒకరినొకరు ప్రభావితం చేసుకోవడాన్నే పరస్పర చర్య అని నిర్వచించవచ్చు.

పరస్పర చర్య వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య జరగవచ్చు. ఒక లక్ష్య సాధనకోసం ఇద్దరు వ్యక్తులు పరస్పర చర్య జరుపుకోవచ్చు. ఇది కాక వ్యక్తికి, సంస్కృతికి మధ్య కూడా పరస్పర చర్య జరగవచ్చు. ప్రతి సమాజంలో సమాజానికి సంబంధించి కొన్ని ఆకాంక్షలుంటాయి. అట్లాగే ప్రతి వ్యక్తీ ఆ ఆకాంక్షలకు తనదైన రీతిలో స్పందిస్తాడు.

ఈ విధంగా భాష ద్వారా గానీ భాషేతర సాధనాల ద్వారా గానీ భావప్రసార యుక్త పరస్పర చర్య జరుగుతుంది. ఒక సామాజిక చర్య ఇంకొక చర్యకు దారి తీయడం, ఒక చర్య ఇంకొక చర్యపై ఆధారపడటం, ప్రభావితం చెయ్యడం జరుగుతుంది. ఇలా ఒక చర్య ఇంకొక చర్యకు దారి తీయడాన్నే సమాజ శాస్త్రజ్ఞులు సామాజిక ప్రక్రియ అంటారు. అంటే వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య జరిగే పరస్పర చర్యలు సామాజిక ప్రక్రియల రూపంలో జరుగుతాయన్నమాట. వ్యక్తులమధ్య సమూహాల మధ్య ఏర్పడే కొన్ని సంబంధాలు విశ్వజననీయమైనవి. పదే పదే కనిపించేవిగా ఉంటాయి. అట్లాగే సామాజిక ప్రక్రియలు ఎన్ని ఉన్నా కొన్నిప్రక్రియలు సమాజంలో పదే పదే దర్శనమిస్తుంటాయి. అటువంటి ప్రక్రియలే అనుబంధప్రక్రియలు, విలీనీకరణలు అనుబంధ ప్రక్రియలుగాను పోటీ సంఘర్షణలను అననుబంధ ప్రక్రియలుగాను పేర్కొనవచ్చు. అయితే ఇన్ని ప్రక్రియల వెనుక ఉన్నది ఒక సాధారణ సామాజిక ప్రక్రియే. అదే సామాజిక పరస్పర చర్య.

ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు కలిసి ఉన్న ప్రతి చోటా ఈ సామాజిక ప్రక్రియలు దర్శనమిస్తూనే ఉంటాయి. ఈప్రక్రియలు ప్రతి సమాజంలో ఉన్న వాటి ప్రాముఖ్యత ప్రతి సమాజానికి, సమూహానికీ వేరు వేరుగా ఉంటుంది. ఉదాహరణకు అమెరికన్ సమాజంలో పోటీ ప్రధాన పాత్ర వహిస్తే, ఆదిమ సమాజంలో సహకారానికి అధిక ప్రాముఖ్యత ఉంటుంది. భారతీయ ఉమ్మడి కుటుంబంలో సహకారం, సర్దుబాట్లు ప్రబలంగా ఉండటం మీరు గమనించవచ్చు.

సామాజిక ప్రక్రియలు అనేక విధాలుగా వ్యక్తీకరింపబడుతాయి. ప్రతి సమాజపు సంస్కృతి ఈప్రక్రియల



BRAOU

నిర్వహణను క్రమబద్ధీకరించి ప్రమాణీకరిస్తుంది. ప్రతి సమాజం, సమూహం పోటీ నిబంధనలను తయారుచేస్తుంది. సంఘర్షణను ఏసమాజమూ అభిలషించదు. అయితే అది ప్రతి సమాజంలోను అనివార్యంగా కనిపిస్తుంది. అందుకే సంఘర్షణ ఏరూపంలో ఉండాలో సమాజమే ప్రమాణీకరిస్తుంది. దీనికి న్యాయస్థానాలు మంచి ఉదాహరణ.

సామాజిక ప్రక్రియలను అధ్యయనం చేస్తున్నప్పుడు మనం కనిపించే చర్యలను మాత్రమే కాకుండా చర్యల వెనుక దాగి ఉన్న ఆలోచనలను, అభిప్రాయాలను కూడా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే పరస్పర చర్యలో వ్యక్తుల ప్రవర్తన అసంకల్పితంగాను, ఇంకా చెప్పాలంటే సమాజంలో చిన్నప్పటి నుంచి మనం నేర్చుకొన్న అలవాట్ల ఆధారంగాను ఉంటుంది.

సామాజిక ప్రక్రియలను గురించి వివరంగా చర్చించే ముందు వ్యక్తుల అభిప్రాయాలను, ప్రవర్తనను నిర్దేశించే అంశాలను గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం. వ్యక్తుల ప్రవర్తనను, అభిప్రాయాలను నిర్దేశించే అంశాల్లో వ్యక్తిగత ప్రేరణలు, సామాజిక ప్రేరణలు ముఖ్యమైనవి

## వ్యక్తిగత ప్రేరణలు

వ్యక్తిగత ప్రేరణలు(igoistic impulses) కలిగిన వ్యక్తులు సమాజం ,సామాజిక కట్టుబాట్లు నిబంధనలకంటే తన వ్యక్తిగత అభిప్రాయాలకు, ఇష్టానిష్టాలకు ప్రాధాన్యతనివ్వడం జరుగుతుంది. ఈరకమైన ప్రేరణ పోటీ, ప్రతికూలన(contravention) సంఘర్షణలకు దారి తీస్తుంది.

## సామాజిక ప్రేరణలు

మానవుడు ఒంటరిగా కాకుండా ఇదరులతో కలిసి జీవించడాన్ని కోరుకుంటాడు. అందుకే సమూహ నిబంధనలకు కట్టుబడి ఉండటం, ఇతరుల బాగుకోరుకోవడం చేస్తాడు. అంటే ఇతరుల అభిప్రాయాలకు విలువనిచ్చి, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తాడు. ఇటువంటి ప్రేరణ ఉన్న చోట సహకారం, సర్దుబాటు, విలీనీకరణం వంటి ప్రక్రియలు మనకు కనిపిస్తాయి. అంటే ఈ పరస్పర విరుద్ధ ప్రేరణలు గల వ్యక్తుల సంఖ్యను బట్టి పరస్పర చర్యలు అనుబంధ చర్యలుగా మారతాయి. అయితే సాధారణంగా వ్యక్తులందరూ వ్యక్తిగత, సామాజిక అవసరాల మధ్య సంతృప్తికరమైన సర్దుబాటు చేసుకుంటారు. ఇట్లా చేయడం సంతులనానికి దారి తీస్తుంది. కానీ కొన్ని మార్పుల కారణంగా ఈ సంతులనం దెబ్బతింటే అననుబంధ ప్రక్రియలు చోటు చేసుకుంటాయి.

చివరగా ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోవాలి. సామాజిక ప్రక్రియలు వాస్తవంలో సంక్లిష్టంగా ఉండటం వల్ల అవి వాటి శుద్ధ రూపంలో తటస్థించడం జరగదు. సంఘర్షణపై పోటి ప్రభావం ఉండవచ్చు లేదా పోటీ క్రమంగా ప్రతికూలానికి దారి తీయవచ్చు. అట్లాగే సహకారం లేదా సర్దుబాటు సంఘర్షణగా మారవచ్చు. అయితే ఈ ప్రక్రియలన్ని అతివ్యాప్తమై ఉన్నా ఇవన్నీ వేరు వేరు ప్రక్రియలే గానీ ఒకటికాదు. ఈ వివిధ రకాలైన ప్రక్రియలను అర్థం చేసుకోవాలంటే వాటిని విడి విడిగా అధ్యయనం చేయవలసిందే.

## 13.3.1 పరస్పర చర్యలు కారకాంశాలు

అధ్యయనార్థం సమాజ శాస్త్రజ్ఞులు పరస్పర చర్యను వివిధ అంశాలతో కూడినదిగా పరగణిస్తారు. ఈ అంశాల ఆధారంగా మానవ పరస్పర చర్యలతో సంబంధం ఉన్న అనేక సంక్లిష్ట కారకాంశాలను అర్థం చేసుకోవచ్చు.

1.ప్రకార్య అంశం ఆధారంగా పరస్పర చర్య వెనుక నున్న ఉద్దేశాలను అర్థం చేసుకోవచ్చు. ఈ ఉద్దేశాల తీవ్రత,స్థిరత మార్పు చెందుతూ ఉంటాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తినిచూసి పలకరింపుగా చిరునవ్వు నవ్వడం, తల్లి బిడ్డల మధ్య జరిగే పరస్పర చర్యల మధ్య తీవ్రత, స్థిరతలలో ఎంత వ్యత్యాసముందో మీరే గమనించండి.

 2.ప్రవర్తనాంశం(behavioural dimension) ఆధారంగా వ్యక్తి ప్రవర్తన తీరును, మాటల ద్వారా గానీ,

చర్యల రూపంలో గానీ, ప్రతీకాత్మకమైనది, ప్రతీకాత్మకం కాని అధ్యయనం చేయడం జరుగుతుంది. ఉత్తరం రాసే వ్యక్తి, సంకేతాలు పంపే వ్యక్తి ప్రవర్తనను ప్రతీకాత్మకమైనదిగానూ, తెడ్డు వేసి పడవ నడిపే వ్యక్తుల పరస్పర చర్యను ప్రతీకాత్మకం కానిది గాను పేర్కొనవచ్చును.

3. సంఖ్యా పరమైన అంశం(numeric dimension) ఆధారంగా పరస్పర చర్యలో పాల్గొనే వ్యక్తుల సంఖ్యను తెలుసుకోవచ్చు. భారీ ప్రచార సాధనాల ద్వారా ప్రపంచంలోని వ్యక్తులందరూ ఒకే ఉద్దీపనకు స్పందిస్తారు.

4. లౌకిక అంశం(temporal dimension) ఆధారంగా పరస్పర చర్యకు సంబంధించిన పరిస్థితులు తాత్కాలికమైనవా లేక ఒక దానితో ఇంకొకటి ముడిపడి ఉన్నవా అన్న విషయాన్ని సమాజ శాస్త్రజ్ఞులు అధ్యయనం చేస్తారు. ఉదాహరణకు వీధిలో తారసపడిన అపరిచితుడిని పలకరించడం తాత్కాలికమైనదిగాను, కుటుంబ సభ్యుల మధ్యసాగే పరస్పర చర్య బహు కాలం కొనసాగే పరస్పర చర్యగాను పరిగణించడం జరుగుతుంది.

5. స్థల సంబంధ అంశం (spacial dimension) ఆధారంగా పరస్పర చర్యలో పాల్గొనే వ్యక్తుల మధ్య దూరాన్ని తెలుసుకోవచ్చు. అంటే ఆవ్యక్తులు ఒకరినొకరు తాకగలరా లేక ఒకరినొకరు చూసుకోగలరా లేదా వంటి విషయాలన్న మాట. అయితే సంపర్కం భౌతికం కావచ్చు లేదా ఏదైనా మాధ్యమం ద్వారా జరగవచ్చునని ఇది వరకే మీరు తెలుసుకొన్నారు కదా.

6. పరిచయాన్ని బట్టి కూడా పరస్పర చర్యను విశ్లేషించవచ్చు. పరస్పర చర్యలో పాల్గొనే వ్యక్తుల మధ్య పరిచయం ఎంత మేరకు ఉందో తెలుసుకోవచ్చు. వ్యక్తులు తమ మధ్య పరిచయాన్ని బట్టే ఇతరులతో చనువుగా ప్రవర్తించడమో, దూరంగా మసలడమో చేస్తారు కదా.

7. అంతస్థు అంశం అధారంగా ఏ పరిస్థితుల్లో ఎవరు నాయకత్వం వహిస్తారో, ఎవరు అనుయాయులుగా వ్యవహరిస్తారో తెలుసుకోవచ్చు. కుటుంబ పెద్ద నాయకత్వం వహిస్తే కుటుంబం సభ్యులు అతని నిర్ణయాలను మన్నించడం దీనికి చక్కని ఉదాహరణ. అయితే ఈ అంతస్థు అంశం అనేది వ్యక్తుల ప్రేరణల పై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత ప్రేరణగల వ్యక్తి నాయకుడిగానూ, సామాజిక ప్రేరణ కలిగిన వ్యక్తులు ఇతరులతో సర్దుబాటు చేసుకోవడం జరుగుతుంది.

BRAOU

ఇంత వరకు పరస్పర చర్యకు సంబంధించిన అన్ని ప్రాథమిక లక్షణాలను, అంశాలను చర్చిండం జరిగింది. ఇప్పుడు పరస్పర చర్య వివిధ సామాజిక ప్రక్రియల రూపంలో జరుగుతుంది కనుక ఆ సామాజిక ప్రక్రియలను ఇప్పుడు విపులంగా చర్చిద్దాం.

## 13.4 అనుబంధ ప్రక్రియలు

అనుబంధ ప్రక్రియలు మూడు రకాలు. అవి: 1. సహకారం, 2. సర్దుబాటు, 3. విలీనీకరణం. ఈ మూడు ప్రక్రియలను కింది వివరంగా చర్చించడం జరిగింది.

### 13.4.1. సహకారం

ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది వ్యక్తులు తమ ఉమ్మడి లక్ష్యసాధనలో కలిసి పనిచేయడాన్ని సహకారంగా నిర్వచించవచ్చు. సమాజ శాస్త్రజ్ఞుల అభిప్రాయంలో సామాజిక ప్రక్రియలన్నిటిలోనూ సహకారం అత్యంత మౌలికమైన ప్రక్రియ. అసలు పరిణామ క్రమం అంతా ఒక జాతికి చెందిన జీవుల పరస్పర సహకారంపైనే ఆధారపడి ఉందంటారు వీరు. వీరి దృష్టిలో యోగ్యతగలవారే జీవించడానికి అర్హులు(survival of the fit test). అంటే అత్యధిక సహకార గుణంగల జీవులే జీవించడానికి వీలుంది.

సహకారం అనేది సహకరించుకునే వ్యక్తుల మధ్య ఉన్న అవగాహననుబట్టి ఉంటుంది. పరస్పర అవగాహన

కలిగిన వ్యక్తులు ఒకరి అవసరాలనొకరు గుర్తించటం అర్థం చేసుకోవడం వల్ల సహకరించుకొనే వీలుంది. ఎన్నో ఏళ్ల తరబడి సహజీవనం చేస్తున్న దంపతుల మధ్య అవగాహన ఉండటం సహజం. వారి ఒకరి అనుభవాలను, ప్రవర్తనను సరిగ్గా అర్థం చేసుకోగలుగుతారు. కనుక వారి మధ్య సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఎ.డబ్ల్యూ.గ్రీన్ అభిప్రాయంలో "ఇద్దరు లేదా ఎక్కువ మంది ఒకే లక్ష్యాన్ని సాధించడానికి కలిసి నిరంతరం కృషి చేయడమే సహకారం" అయితే ఇక్కడ ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకోవాలి. సహకారంతో సాధించే లక్ష్యాల వల్ల సహకరించే వ్యక్తులందరికీ సమానంగా లాభం చేకూరుతుంది అనుకోకూడదు. అందరూ సమానంగా లాభం పొందడం జరగదు. అయినా ఉమ్మడి లాక్ష్యాన్ని సాధించడం కోసం వ్యక్తులు ఇతరులతో సహకరిస్తారు. ఎందుకంటే వ్యక్తి ఎన్ని శక్తియుక్తులు గలవాడైనా తన అవసరాలనన్నింటినీ తానొక్కడే తీర్చుకోవడం సాధ్యం కాదు. ఇతరుల సహకారం లేనిదే వ్యక్తుల అవసరాలు తీరవు కనుక సహకారానికి సిద్ధపడతాడు. ఉదాహరణకు ఒక కుటుంబం జీవితం సాఫీగా సాగాలంటే భార్య, భర్త ఇద్దరూ ఒకరితో ఒకరు సహకరించుకోవలసిందే.

సహకారం రూపాలు: వివిధ సమూహాల వ్యవస్థాపన, వ్యక్తుల అబి&రపాయాలు, అభిరుచులు, అభిలాషలకు మధ్య ఉన్న అంతరం వల్ల సహకారం అనేకరూపాలు సంతరించుకొంటుంది. ఆరూపాలు: 1. ప్రాథమిక సహకారం, 2. గౌణ సహకారం.

ప్రాథమిక సహకారం: ఈ రకమైన సహకారం సదృఢతగల చిన్న సమూహాల్లో కనిపిస్తుంది. ఎందుకంటే ఇటువంటి సమూహాల్లో వ్యక్తిగత ప్రయోజాల మధ్య వైరుధ్యం అతి తక్కువగా ఉండటం, వ్యక్తులందరికీ సమాన ప్రయోజాలుండటం జరుగుతుంది కనుక. ఉదాహరణకు కుటుంబంలోని సభ్యులందరూ సహకారం అందించడం వల్ల వారి జీవితం సాఫీగా సాగిపోతుంది. అట్లాగే ఆదిమ సమాజాలలో కూడా సామాన్య ఆర్థిక వ్యవస్థ ఉండటం వల్ల అంతా కలిసి పంటలు పండించటం, పండించిన ధాన్యాన్ని అంతా కలిసి పంచుకోవడం జరుగుతుంది. దీనినే దుర్‌ఖైమ్ యాంత్రిక సదృఢత అన్నాడు. యాంత్రిక సదృఢత కారణంగానే ఆదిమ సమాజాల్లో వ్యక్తులు వారి వారి శక్తిని బట్టి వారు శ్రమించడం జరుగుతుంది.

గౌణ సహకారం: ప్రతి వ్యక్తి అతని నైపుణ్యం ఆధారంగా తనకు కేటాయించిన ఒక ప్రత్యేకమైన కార్యాన్ని నిర్వహిస్తే దానిని గౌణ సహకార మనవచ్చు. ప్రాథమిక సహకారంలో వ్యక్తులు కలిసి ఒక కార్యాన్ని నిర్వహిస్తే గౌణ సహకారంలో నైపుణ్యంపై ఆధారపడిన శ్రమ విభజన కనిపిస్తుంది. ఒక కార్యాన్ని చిన్న చిన్న భాగాలుగా విడదీసి సమూహంలోని సభ్యులకు పంచడం జరుగుతుంది. అంటే ఒక కార్యం పూర్తి చెయ్యాలంటే చిన్న చిన్న పనులు పూర్తి చేయడం జరగాలి. అందుకే ఒకరితో ఒకరు ఏ మాత్రం పరిచయం లేని ,సంబంధంలేని వ్యక్తులు తమకు తెలియకుండానే ఒక కార్యం జరగడానికి దోహదం చేస్తారు. ఉదాహరణకు ఒక చెప్పుల జత తయారు కావడానికి అనేక మంది కార్మికులు అనేక విధాలుగా, అనేక స్థాయులలో కృషి చెయ్యాలి. చర్మం కత్తిరించడం దగ్గర నుండి తుది మెరుగులు దిద్దేవరకు అనేక మంది కష్టపడాలి. అంటే గౌణ సహకారంలో వ్యక్తులు రకరకాల పనులు చేయడం ద్వారా ఒక ఉమ్మడి లక్ష్యాన్ని సాధిస్తారన్న మాట. ఇటువంటి సహకారంలో కూడా పని చేసిన వ్యక్తులందరికీ సమానంగా ప్రయోజనం చేకూరదు. కానీ అందరూ కృషి చెయ్యకపోతే పని పూర్తి కాదు . అందుకే గౌణ సహకారం వ్యక్తిగతమైనది కాకుండా నియమితమైనదిగా ఉంటుంది. ఇటువంటి సహకారం ఆధునిక సమాజాల్లో దర్శనమిస్తుంది.

### 13.4.2 సర్దుబాటు

సర్దుబాటు(accomidation) అంటే ఒక సంఘర్షణ పరిస్థితుల్లో అనుసరించే స్థితి లేదా ప్రక్రియ.. ఈసందర్భంలో విరోధిభావాలను బాహాటంగా ప్రకటించడాన్ని ఆపి, అల్ప సంఖ్యాక వర్గం ఆర్థిక ,సామాజిక లేదా మానసిక పరి పూరక ప్రయోజనాలను పొందటం జరుగుతుంది(richmund, 1968). ఆండర్ సన్,పార్కర్‌లు సర్దుబాటును ఈవిధంగా నిర్వచిస్తారు: సామాజిక పరిస్థితులలో సామరస్యపూర్వకంగా ప్రవర్తించడానికి అనువైన విధంగా వ్యక్తుల మధ్య సర్దుబాటు ధోరణి ఏర్పరచడం. సర్దుబాటు అనేది పరస్పరం పోటీ పడడం, వ్యక్తుల మధ్య, సమూహాలు, ఇతర మానవ సంబంధాల నిర్మితుల మధ్య సంఘర్షణకు మూలమైన సంబంధాలకు స్వస్తి పలకడం,



BRAOU

ఈ సర్దుబాటు వల్ల సామరస్యవాతావరణం నెలకొని కొన్ని చిన్నచిన్న విభేదాలున్నా కలిసి మెలసి పనిచేయడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది. సంఘర్షణ ఆపివేసి కొత్తగా ఏర్పడిన పరిస్థితులకనుగుణంగా మెలగడమే సర్దుబాటు అని చెప్పవచ్చు. ఇలా పరిస్థితులకనుగుణంగా మెలగడానికి వ్యక్తుల అభిప్రాయాలు, అలవాట్లలో మార్పులు వస్తాయి. అయితే సర్దుబాటు అనేది విశ్వజనీనమైనది, సంఘర్షణ ఫలితంగా సహజంగా ఏర్పడేది. వ్యక్తుల మధ్య భేదాభిప్రాయాలున్నా అవి ఎల్లకాలం కొనసాగాలని లేదు. ఏదో ఒక సమయంలో వారు తమతోటివారి కోసం సర్దుబాటుచేసుకోవచ్చు, తమ అభిప్రాయాలు మార్చుకోనూ వచ్చు. ఉదాహరణకు యాజమాన్యానికి, కార్మికులకు పరస్పర విరుద్ధ ప్రయోజనాలుండవచ్చు. ముఖ్యంగా వేతనాలు, బోనస్‌లు వంటి విషయాలలో మొదట్లో వైరుధ్యం, సంఘర్షణ ఉండవచ్చు. సర్దుబాటు అనేది శాశ్వతమైని కావచ్చు. తాత్కాలికమైనది కావచ్చు. అయితే అది ముఖ్యంగా సహకరించుకొంటున్న వ్యక్తులపై ఆధారపడి ఉంటుంది. సర్దుబాటు ప్రక్రియ వ్యక్తులను సంఘటితపరస్తుంది. కనుక దానిని అనుబంధ ప్రక్రియగా పరిగణిస్తారు.

సర్దుబాటు రూపాలు: సర్దుబాటు రూపాలలో ముఖ్యమైనవి 1. రాజీ, 2. యుద్ధవిరమణ, 3. సహనం, 4. మధ్యవర్తిత్వం, 5. విధేయత.

**1. రాజీ:** తీవ్రమైన సంఘర్షణలున్న పరిస్థితులలో ఇరుపక్షాలవారు రాయితీలు ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సంఘర్షణ విరమించుకొంటే దాన్ని రాజీ అంటారు. సంఘర్షణలున్న పరిస్థితులలో ఇరుపక్షాల వారు రాయితీలు ఇచ్చి పుచ్చుకోవడానికి సంసిద్ధులై ఉండరు. రాజీ పడటంలో ఇరుపక్షాలవారికి కొన్ని లాభాలు, కొన్ని నష్టాలు ఉంటాయి.

**2. యుద్ధ విరమణ లేదా తాత్కాలిక సంధి:** సంఘర్షించుకొనే ఇరుపక్షాల వారు తాత్కాలికంగా సంఘర్షణను ఆపి వేస్తే దాన్ని యుద్ధ విరమణ అంటారు. ఇది ఒక నిర్ణీత కాలంపాటు ఉండవచ్చు లేదా శాశ్వతంగానూ ఉండవచ్చు. ఐతే ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. సంఘర్షణ విరమించుకోవడమేకానీ, ఇది సంఘర్షణ అంతాన్ని సూచించదు. శాంతి నెలకొల్పడానికి ఉన్న అవకాశాలకోసం వెదకడమే యుద్ధ విరమణ ఉద్దేశ్యం. ఉదాహరణకు రెండు దేశాల మధ్య సంఘర్షణ ఆగిపోయినా అది తాత్కాలికమే కావచ్చు. మళ్లీ యుద్ధం మొదలయ్యే అవకాశాలుండవచ్చు, లేదా శాశ్వతంగా శాంతి నెలకొలనవచ్చు.

**3. సహనం:** సామరస్యాన్ని కోరి ఇరుపక్షాలవారు సహనం వహించడంద్వారా కూడా శాంతి నెలకొల్పవచ్చు. అయితే సహనం వహించేవారందరూ సమానస్థాయిలో ఉంటారని, సమాన ప్రయోజనం పొందుతారని, లేదా సమాన కష్టనష్టాలు భరిస్తారని అనుకోకూడదు. ఒక్కోసారి అధిక సంఖ్యాకులు శాంతి సామరస్యం కోసం అల్పసంఖ్యాకులపట్ల సహనం ప్రదర్శించవచ్చు. వివిధ మతస్తులు కలసిమెలసి ఉండడం సహనానికి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

**4. మధ్యవర్తిత్వం:** వైరంగల ఇద్దరు వ్యక్తులు లేదా సమూహాలు తమ మధ్య సంఘర్షణను పరిష్కరించుకోలేనప్పుడు వారు మధ్యవర్తి సహాయాన్ని అర్థించవచ్చు. మధ్యవర్తి ఇరుపక్షాలవారి అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకొని మధ్యేమార్గాన్ని సూచించవచ్చు. యాజమాన్యానికి కార్మికసంఘాలకు మధ్య సంఘర్షణను ఈ రకంగా అదుపుచేస్తారు.

**5. విధేయత:** సంఘర్షించుకునే వ్యక్తులు సమూహాల మధ్యస్థాయిలో శక్తి సామర్థ్యాల విషయంలో తారతమ్యముంటే బలహీనమైనజట్టు బలవంతులకు విధేయులుగా మారడంతో సర్దుబాటు పెరుగుతుంది. భూస్వాములకు కూలీలు విధేయులుగా ఉండటం దీనికి ఉదాహరణ.

ఈపైన చర్చించిన విధంగా సర్దుబాటు అనే ప్రక్రియ సమాజంలోని వ్యక్తులు సమూహాలు సంఘర్షణ మానివేసి సత్సంబంధాలు నెలకొల్పుకుంటారు. సామాజిక జీవనం సాఫీగా సాగడానికి సర్దుబాటు ఎంతగానో తోడ్పడుతుంది.



BRAOU

## 13.4.3 విలీనీకరణం

రెండు విభిన్న సంస్కృతులకు చెందిన వ్యక్తులు కొంత కాలం కలిసి జీవించడంవల్ల ఒక సంస్కృతికి చెందినవారు అవుతారు. అవతలి సంస్కృతికి చెందిన సంప్రదాయాలు, విలువలు, ఆలోచనా ధోరణి, ప్రవర్తనాతీరు అలవర్చుకోవడం జరుగుతుంది. ఈ ప్రక్రియనే విలీనీకరణం అనవచ్చు. వ్యక్తులు సమూహాలు ఇతర సంస్కృతికి చెందిన సంస్కృతులు భావాలను అనుభవాలను పంచుకుంటారు. రెండు సంస్కృతుల మధ్య బేధాలు కాలాంతరాన సమసిపోయి ఒకే సంస్కృతిగా పరిణమించడం జరగుతుంది. ఈ ప్రక్రియలో అన్ని సమూహాలు ప్రభావితం కావడం జరుగుతుంది. ఇక్కడ ఇంకొక భావన గురించి మనం చర్చించవలసి ఉన్నది. అది సంస్కృతి మార్పిడి (acuulturation) భావన. రెండు సంస్కృతులు పరస్పరం కొన్ని ప్రత్యేక సాంస్కృతిక అంశాలు, విలువలు సాంకేతిక పద్ధతులను ఇచ్చిపుచ్చుకోవడాన్ని సంస్కృతిమార్పిడి అని నిర్వచించవచ్చు. అదే విలీనీకరణ ప్రక్రియలో రెండు సంస్కృతులు ఒకదానితో ఒకటి విలీనమవుతాయి. ఒకే సంస్కృతిగా పరిణతి చెందుతాయి. వలస వెళ్లిన వారు అధిక సంఖ్యాకులున్న సంస్కృతిలో విలీనం కావడం మామూలే. ఉదాహరణకు అమెరికన్ సమాజం అనేది విభిన్న సంస్కృతుల విలీనం వల్ల ఉద్భవించిందని చెప్పవచ్చు. అయితే సంపూర్ణ విలీనీకరణ మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే వ్యక్తుల మధ్య సామాజిక, జాతి విబేధాలు పూర్తి విలీనీకరణం జరగకుండా ఆపుతాయి. రెండు జాతులవారు కలిసి జీవించినా వారి మధ్య ఆధిక్యత న్యూనతాభావాలు ఉంటూనే ఉంటాయి. అలాగే ఏ సంస్కృతి అయినాసరే తనకున్న ప్రత్యేక సాంస్కృతిక లక్షణాలను, గుర్తింపును వదులుకోరు. ఎక్కడ ఉన్నా అది తమ విలక్షణతను కాపాడుకోవడానికే ప్రయత్నిస్తుంది. ఈ కారణాలవల్ల పూర్తిగా ఒక సంస్కృతి ఇంకొక సంస్కృతితో విలీనం కావడం జరగదు.

అట్లాగే సంస్కృతి మార్పిడిలో విభిన్న సంస్కృతులు కొన్ని అంశాలను మార్చుకోవడం జరుగుతుంది. రెండు సంస్కృతులలోనూ అనేక మార్పులు వస్తాయి. కలిసి జీవించే విభిన్న సాంస్కృతులలో ఇట్లా మార్పులు రావడం చాలా సహజం.

## 13.5 అననుబంధ ప్రక్రియలు

వ్యక్తులు, సమూహాలు పరస్పర విరుద్ధ ప్రయోజనాన్ని ఆశించి పనిచేసినప్పుడు వారిమధ్య పరస్పర చర్య వారిని విడదీసేదిగా ఉంటుంది. అటువంటి పరిస్థితులలో కనిపించే ప్రక్రియలు పోటీ, సంఘర్షణ.

### 13.5.1 పోటీ

ఒకే లక్ష్యాన్ని ఆశించే ఇద్దరు అంతకన్న ఎక్కువమంది వ్యక్తులు ప్రయత్నిస్తే వారి మధ్య ఏర్పడేదే పోటీ. అంటే ఒక పరిమిత లక్ష్యాన్ని సాధించడం కోసం ఎక్కువమంది ప్రయత్నిస్తున్నారన్నమాట. అత్యధిక మార్కుల కోసం విద్యార్థులు పోటీ పడడం మనం చూస్తూ ఉంటాం. అయితే పోటీలో నెగ్గి అత్యధిక మార్కులు సంపాదించడం మట్టుకు అతి తక్కువ మంది చేయగలరు. అయితే ప్రతిపోటీని నిర్దేశిస్తూ అందరూ పాటించవలసిన కొన్ని నిబంధనలు, వెనుకవాటికి ఊతాన్నిస్తూ సమర్థించే కొన్ని విలువలు ఉంటాయి. ఈ విలువలు స్పర్థాశక్తులకు అతీతంగా ఉంటాయి. పోటీ బలాత్కార రహితంగా ఉంటుంది. కుట్ర చేయకుండా కేవలం ఆమోదించిన పద్ధతులను ఉపయోగించి మాత్రమే లక్ష్యాలను సాధించేందుకు వీలుగా నియమనిబంధనలను రూపొందించడం జరుగుతుంది. ఈ విషయాలను ఉల్లంఘించిన మరుక్షణం పోటీ ప్రక్రియ అంతమవుతుంది. నియమోల్లంఘన ఒక్కొక్కసారి సంఘర్షణకు దారితీస్తుంది. పోటీ అత్యంత చైతన్యవంతమైంది. ఎందుకంటే అది వ్యక్తులను లక్ష్యసాధనవైపు నడిపిస్తుంది. వారి శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తుంది. తాము అందరికంటే వెనుకబడిపోతామేమోనన్న భయం, విజయోత్సాహం వ్యక్తులకు ఉద్దీపన కలిగిస్తాయి. వీటికి తోడుగా పోటీదారులపట్ల వైరం పోటీని ఆసక్తి కరంగా మలుస్తుంది. ఈ కారణాల వల్లనే ఆధునిక సంక్లిష్ట సమాజాలలో పోటీ ప్రక్రియ బలంగా వేళ్లూనుకొంది(డేవిస్ -1981).



BRAOU

పోటీ ఎంతమేరకు జరగాలి అనేది సాంస్కృతిక విలువలు సామాజిక ప్రమాణాలు నిర్ణయిస్తాయి. ఆధునిక సమాజాలలో పోటీ ప్రక్రియకు అత్యున్నత స్థానం కల్పిస్తే ఆదిమ సమాజాలలో పోటీ అంత ప్రాముఖ్యమున్న ప్రక్రియగా కనబడదు. అంటే సాధించిన అంతస్తుకు ఎక్కడ ప్రాముఖ్యం ఉందో అక్కడే పోటీ కూడా అత్యున్నత విలువగా పరిగణింపబడుతుందన్నమాట.

పోటీ అన్ని రకాల సమాజాలలో కనిపించినా అది వివిధ రూపాల్లో ఉండటం గమనించాలి. పోటీ ఉధృతి, రకం, సమాజం సమాజానికీ మారుతూ ఉంటుంది. ఒక రకం పోటీలో కేవలం ఒకే వ్యక్తి మాత్రమే లక్ష్యాన్ని సాధించే వీలు ఉంటుంది. అటువంటి పోటీని నిరాపేక్షపోటీ అంటారు. అయితే ఇంకొక రకం పోటీలో లక్ష్యం ఒక స్థాయిమేరకే సాధించడానికి వీలవుతుంది. ధనం సంపాదించడం దీనికి ఉదాహరణ. ఇటువంటి పోటీని నిరపేక్షపోటీ అనవచ్చు. అయితే ఇక్కడొక విషయం గమనించాలి. పోటీ అనే ప్రక్రియ పూర్తిగా అవధులు లేనిదికాదు. ప్రతి సమాజం పోటీలో సాధించదగ్గ లక్ష్యాలపై, సాధించే విధానాలపై కొన్ని నిర్బంధాలను విధిస్తుంది. చాలా సమాజాలలో పోటీని అనుమతించడం, అదే పనిగా ప్రవేశపెట్టడం జరుగుతుంది. అయితే సమాజం విధించే నిబంధనల వల్ల పోటీ పెచ్చుపెరిగిపోకుండా అదుపులో ఉంటుంది. పోటీ దారులు నియమాలను ఉల్లంఘిస్తే హింస, విధ్వంసకాండ మొదలయ్యే ప్రమాదం ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో వ్యక్తిగత అభిప్రాయాలు ప్రాధాన్యత సంతరించుకోవడంతో పోటీదారుల మధ్య సంఘర్షణ మొదలవుతాయి.

## 13.5.2 సంఘర్షణ

వ్యక్తులు తమ తోటివారిని వ్యతిరేకించడం నిరోధించడం బలవంతం చేయడం జరిగితే దాన్ని సంఘర్షణ అనవచ్చు. వ్యక్తుల ప్రయోజనాల మధ్య సయోధ్య లేనప్పుడు ఎవరికివారు తమ ప్రయోజనాలకు మాత్రమే కాపాడుకోవడానికి ప్రయత్నించడంలో హింసకు పాల్పడడం, నియమాలను ఉల్లంఘించడం చేసేవారు సంఘర్షించుకొంటున్నారనవచ్చు. వ్యక్తుల విలువలు అభిప్రాయాల మధ్య వైరుధ్యం కూడా సంఘర్షణకు కారణమవుతుంది. రెండు మతాలు విశ్వాసాల మధ్య వైరుధ్యం దీనికి ఉదాహరణ. మానవ సంబంధాలలో నిరంతరం కనిపించే లక్షణం సంఘర్షణ. ఇది ఒక స్థాయిలో పరిష్కరింపబడితే ఇంకొక స్థాయిలో తలెత్తవచ్చు. ఒక స్థాయిలో సయోధ్య, ఇంకొక స్థాయిలో సంఘర్షణ ఉంటే అది పాక్షిక సంఘర్షణ అని, ఏ విషయంలోనూ ఒప్పందం కుదరకపోతే సంపూర్ణ సంఘర్షణ అనవచ్చు. సంపూర్ణ సంఘర్షణలో బల ప్రయోగం, చట్టపరమైన వివాదాలు సాధారణంగా ఉంటాయి.

BRAOU

## సంఘర్షణ రూపాలు

1. వ్యక్త, అవ్యక్త సంఘర్షణ: వ్యక్తమైన సంఘర్షణలలో వ్యక్తులు, సమూహాలు ప్రత్యక్షంగా ఒకరితో ఒకరు కలహించుకోవడం జరుగుతుంది. అదే అవ్యక్త సంఘర్షణలో అసంతృప్తి, ఉద్రిక్తతలను ప్రదర్శించకుండా ప్రచ్ఛన్నంగా కొనసాగించవచ్చు.

2. వ్యక్తిగత సంస్థాపరమైన సంఘర్షణ: వ్యక్తిగత సంఘర్షణ ఆస్థి తగాదాల వల్ల జరగవచ్చు. అదే రెండు సంస్థల మధ్య, రెండు కంపెనీల మధ్య, రెండు పార్టీల మధ్య జరుగుతుంది.

సంఘర్షణ రకం ఏదైనా ఇరుపక్షాల మధ్య సయోధ్య లేనపుడు సమాన శక్తులు లుప్తమైనప్పుడు ఒకరినొకరు అడ్డుతొలగించుకోవడం, మరణం, బహిష్కరణ, వైదొలగడం వంటి చర్యల ద్వారా జరిగి ఒకరికి విజయం చేకూరడం ద్వారా మాత్రమే సంఘర్షణ ఆగిపోతుంది (డేవిస్-1981). అందుకే సంఘర్షణ భావోద్వేగాలు, ద్వేశం, విధ్వంసకాండ ద్వారా అనుకొన్న లక్ష్యాన్ని సాధించడం జరుగుతుంది. యుద్ధం ఇటువంటి సంఘర్షణలకు మంచి ఉదాహరణ.

అయితే సంఘర్షణ వల్ల కొన్ని అనుకూల పర్యవసానాలు కూడా ఉంటాయి. సంఘర్షణలో పాల్గొంటున్న సమూహాలలో అంతర్గత సమస్యలు సమసిపోయి ఐకమత్యం, సదృఢత పెరుగుతాయి. అట్లాగే అవ్యక్తంగా ఉన్న అసంతృప్తి బహిర్గతం కావడం జరుగుతుంది. దీని పర్యవసానంగా సామాజిక సంబంధాలలో పునః సర్దుబాటు

జరుగుతుంది. అనేక దేశాలకు స్వతంత్రం రావడం, బానిసత్వం రద్దు ఇవన్నీ సంఘర్షణ వలన వచ్చిన మంచి పరిణామాలే.

సంఘర్షణను అధిగమించడానికి రకరకాల మార్గాలున్నాయి. అందులో హాస్యం ఒకటి. హాస్యం ఉద్రిక్తతలను తొలగించి విధ్వంసకాండ జరగకుండా ఆపివేయగలదు. వైరి సమూహాల మధ్య తమ స్వార్థం కంటే ఒక్కొక్కసారి సయోధ్య కుదరడానికి కారణం. ఒకరిపట్ల ఒకరికి అనుకూల భావాలు ఏర్పడడం. అందుకే సంఘర్షణ అననుబంధ ప్రక్రియ అయినా అది అనుబంధ ప్రక్రియ అయిన సర్దుబాటుకు దారితీయవచ్చు. వ్యక్తులను దగ్గర చేయవచ్చుకూడా. ప్రతీ వ్యవస్థీకృత సమాజం అంతర్గత సంఘర్షణను తొలగించడానికే ప్రయత్నిస్తుంది. ఎందుకంటే సంఘర్షణ సామాజిక జీవనానికి అవసరమైన మేరకు సహకారం ఉండకుండా చేస్తుంది. అయితే పూర్తిగా సంఘర్షణ నిర్మూలించడం కూడా అసాధ్యమే. అందుకే అన్ని సమాజాలు సంపూర్ణ సంఘర్షణను నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నాయి కానీ పాక్షిక సంఘర్షణను మాత్రం నిర్మూలించలేదు.

## 13.6 సారాంశం

ఇప్పటివరకు సమాజంలో అనుబంధ, అననుబంధ ప్రక్రియలుంటాయని తెలుసుకున్నాం కదా. ఈ ప్రక్రియలన్నీ సామాజిక సంబంధాల ద్వారా జరుగుతాయి. ఈ సామాజిక సంబంధాలలో వ్యక్తులు పరస్పరం బద్ధులై ఉంటటం, పరస్పర అంతస్తుల్లో ఉండటం, పరస్పర లక్ష్యాలు, సాధనాలు ఉపయోగించడం జరుగుతుంది. సహకారం అనేది మానవ పరస్పర చర్యలలోనూ అత్యంత ప్రాథమికమైన రూపం. సహకారం ద్వారా మానవులు ఒక లక్ష్యాన్ని ఆశించి కలసి కృషి చేస్తారు. సర్దుబాటు ప్రక్రియలో పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలను కలిగి ఉన్న వ్యక్తులు వివిధ పద్ధతుల్లో సంఘర్షణను ఆపివేస్తారు. విలీనీకరణంలో రెండు విభిన్న సంస్కృతులు ఒక సంస్కృతిగా రూపుదిద్దుకోవడం జరిగితే పోటీలో ఒకే లక్ష్యాన్ని సాధించడంకోసం కొందరు వ్యక్తులు ప్రయత్నించడం జరుగుతుంది. అయితే ఇక్కడ పోటీ దారులకు తమ తోటివారిపైకంటే దృష్టి లక్ష్యం మీదే నిలుస్తుంది. సంఘర్షణలో వ్యక్తులు ఇతరుల ప్రయత్నాలను వమ్ము చేయడం లేదా ఇతరులకు నష్టం కలిగించడం, లేదా నాశనం చేయడానికి పూనుకుంటారు. సహకారం, సర్దుబాటు, విలీనీకరణం వ్యక్తులను జోడిస్తాయి. కనుక వాటిని అనుబంధ ప్రక్రియలుగానూ, పోటీ, సంఘర్షణలు వ్యక్తులను విడదీస్తాయి కావున వాటిని అననుబంధ ప్రక్రియలుగానూ పిలుస్తాము. అయితే ఇప్పుడు చర్చించిన ప్రక్రియలు విడివిడిగా, ప్రత్యేకంగా కనిపిస్తాయి అని అనుకోవడం పొరపాటు. ఈ ప్రక్రియలన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడుతాయి. ఇవి మానవ సంబంధాలన్నింటిలోనూ గోచరిస్తాయి. ఒక్కొక్కసారి ఒక ప్రక్రియ ఇంకొక ప్రక్రియకు దారితీయవచ్చుకూడా. కుటుంబాలలో సహకారమున్న సంఘర్షణకూడా అప్పుడప్పుడు తలెత్తుతుంది. అటువంటి సంఘర్షణను సహనం ప్రదర్శించడం ద్వారా సర్దుబాటు చేసుకోవడం కూడా పరిపాటే. అట్లాగే పోటీలో వ్యక్తిగత భావోద్వేగాలు చోటుచేసుకుంటే సంఘర్షణ తప్పదు.

పరిస్థితులను బట్టి మనుషుల మధ్య సంబంధాలు. పరస్పర చర్య వివిధరూపాలు ధరించడం జరుగుతుంది.

## 13.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులివ్వండి

1. సామాజిక పరస్పర చర్యను నిర్వచించి దాని మౌలికాంశాలను తెలుపండి.

2. సామాజిక సంపర్కం, వర్గీకరణను వివరించండి.

II కింది ప్రశ్నలకు 10 పంక్తులలో జవాబులివ్వండి.

1. సహకారాన్ని నిర్వచించి, ప్రాథమిక, గౌణ సహకారాల లక్షణాలను తెలుపండి.

2. సర్దుబాటు రూపాలను వివరించండి.



BRAOU

## 13.8 చదవదగిన పుస్తకాలు


Davis, K. (1981) : Human Society.

Dressler, D. (1969) : Sociology: The Study of Human Interaction

Gisbert, P. : Introduction to Sociology.

Johnson, H.M. (1960) : Sociology: ASystematic Introduction.

McKee, J.B.(1969) : Introduction to Sociology.


BRAOU

BRAOU

# ఖండం- V

## సామాజిక నిర్మితి

పుట్టి పెరిగిన వాతావరణం, అవకాశాలు, అవసరాలు మనిషిని సంఘంలో సభ్యుడిని చేస్తాయి. మనిషి తన శక్తియుక్తులను బట్టి, వృత్తి వ్యాపారాలను బట్టి, గుణగణాలనుబట్టి, ఆర్థిక, సామాజిక అంతస్తులనుబట్టి సమాజంలో ఇమిడిపోతాడు. అంటే సమాజంలో వుండే అందరికీ ఒకే హోదా, ఒకే గుర్తింపు, ఒకే గౌరవం వుండవు. సామాజిక నిర్మాణంలో మనిషి స్థానం ఎలా నిర్ణయించబడుతుందో ఈ ఖండం వివరిస్తుంది.

ఈ ఖండంలో మొత్తం మూడు భాగాలున్నాయి. అవి:

- సామాజిక నిర్మితి
- సామాజిక స్థరీకరణ, సామాజిక విభేదీకరణ
- సామాజిక స్థరీకరణ ప్రమాణికతలు

BRAOU

BRAOU

# భాగం-14: సామాజిక నిర్మితి

విషయ క్రమం

14.0 ఉద్దేశాలు

14.1 పరిచయం

14.2 సామాజిక నిర్మితి - నిర్వచనము

14.3 సామాజిక నిర్మితి - మూలాంశాలు

14.3.1 సామాజిక అంతస్తు, పాత్ర

14.3.2 విలువలు

14.3.3 సామాజిక ప్రమాణాలు

14.3.4 సామాజిక సంస్థలు

14.4 సారాంశం

14.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

14.6 చదవదగిన పుస్తకాలు

B R A O U

## 14.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సామాజిక నిర్మితి అంటే ఏమిటో నిర్వచించ గలుగుతారు.
- సామాజిక నిర్మితిలోని మూలాంశాలను వివరించగలరు.
- సమాజంలో వీటియొక్క ప్రాధాన్యతను విశ్లేషించగలరు.

## 14.1 పరిచయం

సమాజశాస్త్రం మానవ సమాజాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసే శాస్త్రం. కొంత మంది వ్యక్తుల, సమూహాల, సంఘాల, సముదాయాల కలయికను సమాజంగా చెప్పుకొంటున్నాం. సమాజమనేది ఒక అమూర్తభావన. దానికి ఒక నిర్మితి, కొన్ని ప్రకార్యాలుంటాయి. వీటినిబట్టే మనం సమాజాన్ని అవగాహన చేసికొనవచ్చు. నిర్మితి పరంగా, కొంతమంది వ్యక్తుల, కొన్ని సమూహాల, సంఘాల, సంస్థల, సముదాయాల కలయికను సమాజంగా చెప్పడం జరుగుతంది. అయితే ఈ అంగాలన్నింటికి ఒక నిర్మాణం,స్వరూపం అనేది ఉంటుంది. వేటికి సంబంధించిన ప్రకార్యాలు వాటికి ఉంటాయి. అయితే ఈ అంగాలన్నీ కేవలం ఒక దగ్గర భౌతిక మాత్రంగా కలిసి ఉండటం లేదు. వీటి మధ్య పరస్పర సంబంధాలు ఉంటాయి. ఈ సామాజిక సంబంధాలే సమాజంలోని వివిధ అంగాలను ప్రకార్యపరంగా బంధించి ఉంచుతాయి. కాబట్టి ప్రకార్యపరంగా సమాజమంటే ఒక సామాజిక ప్రక్రియ అని చెప్పవచ్చు. అందువల్లనే సమాజాన్ని సామాజిక సంబంధాలతో ఏర్పడిన సాలెగూడువంటిదని నిర్వచించడం జరిగింది. అయితే ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే సమాజ నిర్మితికి, ప్రకార్యాలకు అవినాభావసంబంధమున్నది. నిర్మితి, ప్రకార్యాలు పరస్పరాధారితాలు. ఎందుకంటే నిర్మితి లేకుండా ప్రకార్యాలనేవి ఉండవు. ప్రకార్యాలు లేకుండా నిర్మితికి గుర్తింపులేదు. ప్రకార్యాల ద్వారానే సామాజిక నిర్మితిని గుర్తించడం

జరుగుతుంది. అందువల్ల సామాజిక నిర్మితి, ప్రకార్యాలు రెండూ పరస్పరాధారితాలు అని చెప్పవచ్చు. అయితే కేవలం నిర్మితి, ప్రకార్యాల కలయికనుబట్టి మాత్రమే మనం సమాజాన్ని అర్థం చేసుకోలేం. సమాజం వీటికంటె కూడా ఉన్నతమైనది, చైతన్యవంతమైనది. సమాజానికి నిర్మితి, ప్రకార్యాలున్నప్పటికీ అవి ఎప్పటికీ స్థిరంగా ఉండవు. వాటిలో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతూ ఉంటాయి. సమాజ సభ్యుల మధ్య ఏర్పడే పరస్పర చర్యలు, సామాజిక సంబంధాలు నిరంతరం గతిశీలంగాను, చైతన్యవంతంగాను ఉంటాయి.

నిర్మాణ ప్రకార్యాలను దృష్టియందుంచుకొని మెకైవర్ అనే సమాజ శాస్త్రవేత్త సమాజాన్ని ఈవిధంగా నిర్వచించినాడు. "సమాజమంటే ప్రమాణాలు, ఆచారాలు, ధర్మాలు, విలువలు మొదలైనవి సమాజంలోని వ్యక్తుల మధ్య, సంఘాల మధ్య, సముదాయాల మధ్య జరిపే పరస్పర చర్యలను, సామాజిక సంబంధాలను పెంపొందిచి వాటిని నియంత్రిస్తుంటాయి. ఇవి మానవులకు స్వేచ్ఛను కల్పించడం ద్వారా పరివర్తనకు అవకాశాలను కలుగజేస్తాయి. సమాజం మానవ నిర్మితమైనప్పటికీ అది సభ్యులకంటే ఉన్నతంగా ఉండి వారికి మార్గదర్శిగా, ఆదర్శప్రాయంగా ఉంటుంది. అయితే సమాజంలోని వ్యక్తులు ఒకే విధమైన అభిప్రాయాలు కలిగి ఉండి సమిష్టి, శ్రేయస్సుకోసం కలిసిమెలిసి పనిచేస్తుంటారు. ఈ విషయాన్ని దృష్టియందుంచుకొని ఎఫ్.హెచ్.గిడ్డింగ్స్ అనే సమాజ శాస్త్రవేత్త సమాజాన్ని ఈవిధంగా నిర్వచించినాడు. "ఒకే రకమైన ఆలోచన సరళి ఉన్న చాలా మంది వ్యక్తులు, ఉమ్మడి జీవన సరళిని గుర్తించడం ద్వారా సమిష్టి ప్రయోజనాల కోసం కలిసికట్టుగా కృషి చేయగలుగుతారు. ఇట్లాంటి వ్యక్తుల కలయికను సమాజమని చెప్పవచ్చు".

సమాజలో సమిష్టి ప్రయోజనాలదృష్ట్యా వ్యక్తుల మధ్య పరస్పర సహకారమనేది ఉండటం సహజమే. అయితే సమాజం అంటే పూర్తిగా సామ్యత కలిగి ఉన్న వ్యక్తుల సమూహం అని చెప్పడానికి వీలులేదు. సమాజంలో సామ్యతతో బాటు భిన్నత్వం కూడా ఉంటుంది. అంటే సామ్యత, భిన్నతా సూత్రాల మీద సమాజం ఆధారపడి ఉంటుంది. సమాజంలో ఒకే రకైన సామ్యత ఉన్నట్లయితే సామాజిక సంబంధాలు సంకుచితమై, పరిమితమై ఉండేవి. సమూహాలు, సంఘాలు అంత ఎక్కువగా ఉండేవికావు. మానవులలో జైవిక, మానసిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలలో భిన్నత్వం కనిపిస్తుంది. అట్లాగే మానవుల అభిరుచులలో, కోరికలలో, శక్తి సామర్థ్యాలలో ఎంతో భిన్నత్వం కనిపిస్తుంది. మానవులలో ఉండే ఈ సహజమైన భిన్నత్వమే వారి విభిన్న ప్రయోజనాలను సంతృప్తి పరచుకోడానికి విభిన్న సంఘాలను ఆవిర్భవించడానికి దారితీస్తుంది.

అయితే సమాజంలో సహకారం మాత్రమే ఉండదని తెలుసుకున్నాం. సమాజంలో అనేక మంది వ్యక్తులు, సమూహాలు, సంఘాలు ఉంటాయి. ఈ సమూహాలకు చెందిన వారి అభిరుచులు, ఆలోచనారీతులు భిన్నంగా ఉండవచ్చు. అట్లాంటి వారు తమ వ్యక్తిగత, సామూహిక ప్రయోజనాలు సాధించుకోవడానికి కొన్ని సందర్భాలలో విభిన్న మార్గాలను, పద్ధతులను అవలంబించవచ్చు. ఇది సమాజంలో సంఘర్షణలకు దారితీయవచ్చు. అయితే మొత్తం సమాజం శ్రేయస్సుకు సంబంధించిన విషయాలలో వారంతా సహకరించుకొంటారు. కాబట్టి సమాజం అంటే సంఘర్షణలతో కూడుకొన్న సహకార వ్యవస్థ అని, భిన్నతవ్వంలో ఏకత్వం ఉన్న వ్యవస్థ అని చెప్పవచ్చు.

క్లుప్తంగా చెప్పాలంటే సమాజం, వ్యక్తులతోనూ, సమూహాలతోనూ, సంస్థలతోనూ, సముదాయాలతోను కూడుకొని ఉంటుంది. ఈ అంగాల మధ్యగల సామాజిక సంబంధాలను ప్రమాణాలు, విలువలు నియంత్రిస్తుంటాయి. సామాజిక సంబంధాలు నిరంతరం పరివతర్తన చెందుతుంటాయి. అయితే సమాజం మాత్రం సమాజ సభ్యుల ప్రయోజనాలను సంతృప్తి పరుస్తూ నిరంతరంగా కొనసాగుతుంటుంది. సమాజం సంశ్లిష్టమైంది కాబట్టి దానిలో ఉండే సామాజిక సంబంధాలు కూడా వివిధ రకాలుగా ఉండి సంకీర్ణంగా ఉంటాయి. ఈవిధమైన లక్షణాలు కలిగియున్న సమాజం యొక్క నిర్మితి గురించి చర్చించడం ఎంతైనా ఆవశ్యకము. కాబట్టి ఇప్పుడు మనం సామాజిక నిర్మితి యొక్క నిర్వచనాన్ని, దాని ప్రాధాన్యతను గురించి చర్చిద్దాం.

## 14.2 సామాజిక నిర్మితి - నిర్వచనము

 సమాజమనేది అనేక మంది వ్యక్తులతోను, సమూహాలతోను, సముదాయాలతోను కూడిన ఒక సంశ్లిష్ట వ్యవస్థ

అని ఇంతకుముందే చెప్పడం జరిగింది. అయితే సామాజిక నిర్మితిని ఈ విధంగా నిర్వచించవచ్చు. "సామాజిక ఉద్దేశ్యాలను సాధించడానికి వ్యక్తులు విభిన్న అంతస్తు, పాత్రలను రూపొందించుకొని, కొన్ని నిర్ణీత ప్రమాణాలు, విలువలకు అనుగుణంగా సామాజిక సంబంధాలు కలిగి యుండి జీవనాన్ని కొనసాగించే సామాజిక సంబంధాల చట్రాన్నే సామాజిక నిర్మితి అని నిర్వచించవచ్చు". సామాజిక నిర్మితిలో అంతస్తు, పాత్ర, విలువలు, ప్రమాణాలు, సంస్థలు అనే మూలాంశాలుంటాయి. కాబట్టి సమాజంలో గల ఈ మూలాంశాల మధ్య ఒక క్రమబద్ధమైన సంబంధాలను కలిగి యుండేటట్లు చేసే సామాజిక ప్రవర్తనా నమూననే సామాజిక నిర్మితిలోగల మూలాంశాలు ఒక నిర్ణీత క్రమంలో అమర్చబడి, క్రమబద్ధీకరించబడి ఉంటాయి. దన్ని బట్టి సామాజిక నిర్మితిలో ఈ క్రింది మూలాంశాలుంటాయని గమనించవచ్చు. అవి:

1. సామాజిక సంబంధాలతో ఉన్న వ్యక్తులు, సమూహాలు.

2. అనేకరకాలైన పాత్రలు, అంతస్తులు,

3. సామాజిక విలువలు.

4. సామాజిక ప్రమాణాలు, ఆమోదాలు.

సామాజిక నిర్మితిని ఒక భావన నిర్మితితో పోల్చి చెప్పవచ్చు. ఉదాహరణకు మనం ఏదైనా ఒక భవనాన్ని చూసినట్టయితే దానిలో మనకు ఇటుకలు, సిమెంట్ కాంక్రీట్, ఇనుప చువ్వలు మొదలైన వాటితో ఏర్పడిన నిర్మితిగా కనబడుతుంది. అంటే వీటన్నింటిని ఒక క్రమ పద్ధతిలో అమర్చడం మూలంగా భవనం అనే నిర్మితి ఏర్పడుతుంది. అదే విధంగా దీనిలో అనేక అంతస్తులు, రకరకాల డిజైన్‌లు వివిధ పరిమాణంలోగల గదులు, తలుపులు, కిటికీలు మొదలైనవి ఉంటాయి. వీటన్నింటి సమగ్ర రూపమే భవన నిర్మితి. అట్లాగే సమాజంలో గల వివిధ అంతస్తులు, పాత్రలు, విలువలు, ప్రమాణాలు, సంస్థలు మున్నగు వాటినన్నింటిని ఒక క్రమ పద్ధతిలో అనుసరిస్తూ జీవనాన్ని గడపడం వల్ల సామాజిక నిర్మితి ఏర్పడుతుంది. ఉదాహరణకు ఒక కుటుంబాన్ని తీసుకొన్నట్లయితే, కుటుంబంలో తల్లి, తండ్రి, భార్య, భర్త, పిల్లలు మొదలయిన వారు వివిధ అంతస్తులను పొంది యుండి, తదనుగుణంగా పాత్రలను పోషిస్తారు. ఈ క్రమంలో వారు కొన్ని నిర్ణీత ప్రమాణాలను, విలువలను పాటిస్తారు. కాబట్టి దీనిని కుటుంబ నిర్మితి అనవచ్చు. కుటుంబ నిర్మితి సామాజిక నిర్మితిలో భాగము. ఎందుకంటే అనేక కుటుంబాలతో కలిసి సమాజమేర్పడుతుంది. ఇట్లాగే విస్తృత సామాజిక వ్యవస్థలో విభిన్న సమూహాలతో కూడిన సామాజిక నిర్మితులు అనేకం ఉంటాయి.

రాడ్‌క్లిఫ్‌బ్రౌన్ అనే సమాజశాస్త్రవేత్త సామాజిక నిర్మితిని ఈవిధంగా నిర్వచించినాడు. "సామాజిక సంబంధాలను కలిగియున్న వ్యక్తులను నిర్దిష్టమైన, క్రమబద్ధమైన నియమాలకు అనుగుణంగా అమర్చే అమరికను సామాజిక నిర్మితి అనవచ్చు". సమాజంలో సభ్యులుగా వ్యక్తులు పొందియున్న నిర్మితిపరమైన రూపాలు ఇందులో భాగంగా ఉంటాయి. ఇవి సమాజం సమన్వయాత్మకంగా నడవడానికి దోహదపడేవిధంగా అమర్చబడి ఉంటాయని రాడ్‌క్లిఫ్ బ్రౌన్ పేర్కొన్నాడు.

టాల్కాట్‌పార్సన్స్ అనే సమాజశాస్త్రవేత్త సామాజిక నిర్మితిని ఈ విధంగా నిర్వచించినాడు. "సమూహ సభ్యులుగా వ్యక్తులు పొందే అంతస్తులు, పాత్రలు,అదే విధంగా పరస్పర సంబంధాన్ని కలిగాయున్నటువంటి సంస్థలు, ఏజన్సీలు,సామాజిక నమూనాలు మున్నగు వాటినన్నింటిని ఒక క్రమ పద్ధతిలో అమర్చే అమరికను సామాజిక నిర్మితి అని నిర్వచించవచ్చు. పార్సన్స్ ప్రకారము సమూహాలు, సంఘాలు, సంస్థలు, విలువలు, ప్రమాణాలు. అంతస్తు, పాత్రలు మున్నగునవన్నీ సామాజిక నిర్మితిలో భాగాలు.

కాబట్టి సామాజిక నిర్మితి అనేది దాని మూలాంశాలు, వాటి మధ్యగల పరస్పరాధారితం, ఐక్యత మున్నగు వాటితో కూడుకొని యుంటుంది. సామాజిక వ్యవస్థ యొక్క మరియు అందులో గల సభ్యుల యొక్క సామాజిక ఉద్దేశ్యాలను సాధించడం అనేది సామాజిక నిర్మితి యొక్క ప్రధానోద్దేశ్యం. కాబట్టి సామాజిక నిర్మితి అనేది



BRAOU

అందులో భాగాలైన అంతస్తు, పాత్ర, వివిధ ప్రకార్యాలను నిర్వర్తిస్తుంది.

## 14.3.సామాజిక నిర్మితి-మూలాంశాలు

సామాజిక నిర్మితిలో వివిధ మూలాంశాలుంటాయని ఇదివరకే చెప్పడం జరిగింది. సామాజిక నిర్మితి యొక్క ప్రధాన మూలాంశాలను ఈ విధంగా చెప్పవచ్చు. అవి-సామాజిక అంతస్తు,పాత్ర,విలువలు, సామాజిక ప్రమాణాలు, సామాజిక సంస్థలు, సమూహాలు. సామాజిక నిర్మితిలోని మూలాంశాల మధ్య పరస్పర చర్యలు జరిగి, సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. ఈ సామాజిక సంబంధాలు,విలువలు, ప్రమాణాలు అన్యోన్యాధారంగా ఉంటాయి. సామాజిక నిర్మితి అనేది ఈ అన్యోన్యాధారం అనే విషయాన్ని నొక్కి చెబుతుంది. అంటే సమాజంలో వివిధ సామాజిక యూనిట్‌లు వేర్వేరుగా కాకుండా పరస్పర సంబంధంతో సమైక్యంగా పని చేస్తుంటాయనే విషయాన్ని సామాజిక నిర్మితి అనే భావన సూచిస్తుంది. సామాజిక నిర్మితిలోని ఈ అంగాలన్ని పరస్పర సంబంధంతో అన్యోన్యాధారితమై ఉమ్మడి లక్ష్యాలను సాధించడానికి సమైక్యంగా పని చేస్తుంటాయి. యిప్పుడు సామాజిక నిర్మితిలోని వివిధ మూలాంశాలను గురించి వివరంగా చర్చిద్దాం.

### 14.3.1. సామాజిక అంతస్తు, పాత్ర

సామాజిక జీవనంలో వ్యక్తులు తమ సామాజిక స్థాయిని బట్టి, తమ శక్తి సామర్థ్యాలను బట్టి విభిన్నమైన పనులు చేస్తుంటారు. వివిధ సామాజిక సందర్భాలలో వ్యక్తులు నిర్వహించే పాత్రలను బట్టి వారి మధ్య సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. వ్యక్తి సామాజిక జీవనంలో చేసే చర్యలను సమాజ శాస్త్ర పరిభాషలో పాత్ర అంటారు. సమాజంలో వ్యక్తి అనేక పాత్రలను నిర్వహిస్తుండటాన్ని మనం గమనించవచ్చు. ఉదాహరణకు తల్లి, తండ్రి, కుమారుడు, కుమార్తె, భార్య, భర్త, విద్యార్థి, ఉపాధ్యాయుడు, కార్మికుడు, యజమాని మొదలైన పాత్రలలో ప్రతి ఒక్కడు ఏవో కొన్నింటిని నిర్వహిస్తూనే ఉంటాడు. అందువల్ల ఒక సమూహానికి చెందిన వారి మధ్య ఏదో రకమైన పాత్ర సంబంధాలు ఏర్పడటం సహజం. అయితే సామాజిక పరస్పర చర్యల పర్యవసానంగా వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య పాత్ర సంబంధాలతో బాటు అంతస్తు సంబంధాలు కూడా ఏర్పడతాయి. సమాజశాస్త్రంలో అంతస్తు అనే పదాన్ని సమాజంలో వ్యక్తి లేదా సమూహం యొక్క స్థాయిని లేదా స్థితిని సూచించడానికి ఉపయోగిస్తారు. వయస్సు,లింగం, వృత్తి, వైవాహికం స్థితి మొదలైన జైవిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలను బట్టి వ్యక్తులు విభిన్న అంతస్తులలో ఉంటారు. ఉదాహరణకు వ్యక్తులు లింగ భేదాన్ని బట్టి స్త్రీలు, పురుషులు అనే అంతస్తునుపొందుతారు. వయస్సును బట్టి శిశువులు, పిల్లలు, యువకులు, పెద్దలు అనే అంతస్తులలో ఉంటారు. వైవాహిక స్థితిని బట్టి వివాహితులు, అవివాహితులు,విధవలు, విడాకులు పొందినవారు మొదలైన అంతస్తులలో ఉండవచ్చు. కుటుంబంలో వారి స్థాయిని బట్టి కుమారుడు, కుమార్తె, భార్య, భర్త, తాత, మనుమడు, సోదరి, సోదరుడు, మొదలైన అంతస్తులను పొందవచ్చు. వృత్తిని బట్టి కార్మికుడు, కర్షకుడు, వ్యాపరస్తుడు, డాక్టరు, ఇంజనీరు,ఉపాధ్యాయుడు,న్యాయవాది తదితర అంతస్తులను పొంది యుండవచ్చు. అదే విధంగా సామాజిక స్థాయిని బట్టి యజమాని, సేవకుడు, అధికారి మొదలైన అంతస్తులను, ఉద్యోగస్థితిని బట్టి ఉద్యోగి, నిరుద్యోగి, కలెక్టర్, ఉపాధ్యాయుడు, ఇంజనీరు, జడ్జి, అటెండర్ తదితర అనేక అంతస్తులను పొందుతారు. ఈ విధంగా సమాజంలో వ్యక్తులు ఆయా వ్యక్తుల జైవిక, సాంఘిక, ఆర్థిక స్థాయులను బట్టి వివిధ అంతస్తులను పొందియుంటారు. ఈ విధంగా అనేక అంతస్తుల యొక్క సమాహార రూపమే సమాజము.

అంతస్తుకు, పాత్రకు చాలా సన్నిహిత సంబంధముంటుంది. ప్రతి అంతస్తుకు అనుబంధంగా పాత్రలుంటాయి. అంటే ఒక అంతస్తును పొందిన వ్యక్తి దానికి అనుబంధంగా ఉన్న పాత్రలను నిర్వహించవలెనని ఆశించడం జరుగుతుంది. ఉదాహరణకు కుటుంబంలో భర్త, భార్య, తండ్రి, తల్లి, అనే అంతస్తులను పొందిన వ్యక్తులు దానికి సంబంధించిన పాత్రలను నిర్వహించవలసి ఉంటుంది. అంటే వారు కుటుంబ సభ్యుల అవసరాలను తెలిసికొని, వాటిని సంతృప్తి పరచడానికి ప్రయత్నించడం, కుటుంబ గౌరవ ప్రతిష్టలను పరిరక్షించడం మొదలైనవి. విద్యార్థి అంతస్తును పొందిన వ్యక్తి విద్యార్జనకు సంబంధించిన పాత్రలను నిర్వహించాలి. ఉపాధ్యాయుని అంతస్తును పొందిన వ్యక్తి విద్య బోధించడానికి సంబంధించిన పాత్రలను నిర్వహించడం జరుగుతుంది. ఈ విధంగా

అంతస్తు,పాత్ర అనేవి పరస్పరం సంబంధం ఉన్న భావనలు. అంతస్తు, పాత్ర అనేవి రెండూ మూర్తిమత్వంలోని అంశాలు. వ్యక్తి సామాజిక వ్యవస్థలో పొందిన స్థితిని అంతస్తుఅని, ఆ అంతస్తును బట్టి ఏ చర్యలు జరుపుతాడో వాటిని పాత్ర అని అంటారు. అంతస్తు యొక్క గతిశీలత రూపమే పాత్ర. అంతస్తు వ్యక్తి పొందిన సామాజిక స్థితి. పాత్రలు ఆశించదగిన చర్యలు. కాబట్టి పాత్ర, అంతస్తు రెండూ అవినాభావసంబంధాన్ని కలిగియున్నటువంటివి. ఒకటి లేకుండా రెండవది ఉండదు.

## పాత్ర సమితి

సామాజిక జీవనంలో వివిధ సందర్భాలలో వ్యక్తుల మధ్య జరిగే పరస్పర చర్యలే వారి మధ్య పాత్ర సంబంధాలు ఏర్పడటానికి దోహదం చేసి, వాటిని స్థిర పరుస్తాయి. ఉదాహరణకు ఒక తరగతిలో విద్యార్థినీ, విద్యార్థులందరూ మొదట్లో ఒకరికొకరు అపరిచితులే. క్రమంగా వారి మధ్య పరస్పర చర్యలు జరిగి కొంత కాలానికి వారిలో కొందరి మధ్య స్నేహ సంబంధాలేర్పడటం, జట్లుగా ఏర్పడటం, నాయకులు-అనుచరులుగా రూపొందడం మనం చూడవచ్చు. అదే విధంగా స్త్రీ, పురుషులు కొన్ని సందర్భాలలో కలుసుకోవడం అది వారి మధ్య ప్రణయంగా మారడం, చివరకు వివాహానికి దారితీసి వారు భార్యభర్తలు కావడం సంభవించవచ్చు. ఈ విధంగా సమాజంలో వివిధ సందర్భాలలో వ్యక్తుల మధ్య జరిగే పరస్పర చర్యలు వారి మధ్య పాత్ర సంబంధాలు ఏర్పడటానికి దోహదం చేస్తుంటాయి. అంతేగాకుండా ఒక పాత్రను పోషించే వ్యక్తికి అనుబంధ పాత్రలను నిర్వహించే వారంతా పాత్ర సహభాగులు అవుతారు. ఉదాహరణకు కుటుంబంలో కుమారుని పాత్ర పోషించే వ్యక్తికి తల్లి,తండ్రి పాత్రలను పోషించే వారు పాత్ర సహభాగులవుతారు. వ్యక్తి ఒక అంతస్తులో ఉండి దానికి అనుబంధ పాత్రలను నిర్వహిస్తున్న సందర్భంలో ఇతర పాత్రలను నిర్వహించే వారితో ఏర్పరచుకొన్న మొత్తం సంబందలను పాత్ర సమితి(Roleset) అంటారు. ఉదాహరనకు కుటుంబంలో ఒక వ్యక్తికి తండ్రి, తల్లి, పిల్లలు, భార్య, సోదరి, సోదరులు మొదలైన వారితో ఏర్పడే పాత్ర సంబంధాలను అతని పాత్ర సమితి అని చెప్పవచ్చు. పాత్ర సమితి అనేది యితర పాత్రలతో ఒక పాత్ర జరిపే మొత్తం పాత్ర పరస్పర చర్యలను సూచిస్తుంది. వ్యక్తి వివిధ సన్నివేశాలలో, వివిధ సంస్థలలో, వివిధ సమయాలలో వివిధపాత్రలను పోషిస్తాడు. పాత్ర నిర్వహణలో వ్యక్తి సంపూర్ణత్వం వ్యక్తం కాదు. తాను నిర్వహిస్తున్న పాత్ర వరకే పరిమితమై అతని మూర్తిమత్వం వ్యక్తమవుతుంది. దీన్ని బట్టి పాత్ర అనేది వ్యక్తి మూర్తిమత్వంలోని ఒక అంశం మాత్రమే అని గమనించవలె. సమాజంలో పరస్పర చర్యలు పాత్రల మధ్య జరుగుతుంటాయి కాని వ్యక్తుల మధ్య కాదని కూడా గుర్తించవలె.

## పాత్ర సంఘర్షణ

వ్యక్తి వివిధ పాత్రలు నిర్వహిస్తున్నప్పుడు వాటి మధ్య కొంత సామరస్యం ఉండటం అవసరం. వ్యక్తి నిర్వహించే వివిధ పాత్రలలో సామరస్యం ఉన్నప్పుడు దాన్ని పాత్ర అనుగుణ్యం అంటారు. పాత్ర అనుగుణ్యం ఉండటం వల్ల వ్యక్తులు ఎలాంటి ప్రకర్షణలు లేకుండా తమ పాత్రలను నిర్వహించగల్గుతారు. సమాజంలో క్రమం ఉంటుంది. అట్లా కాకుండా వ్యక్తి నిర్వహించే వివిధ పాత్రలు పరస్పరం విరుద్ధమైనప్పుడు అతడు తీవ్ర ఒత్తిడులకు, ప్రకర్షణలకు గురి అవుతాడు. ఏ పాత్రను ఎట్లా నిర్వహించవలె? అనే విషయాన్ని సులువుగా తెల్చుకోలేకపోతాడు. అతడు పాత్ర సంఘర్షణను (role conflict) ఎదుర్కొనవలసి వస్తుంది. అంటే వ్యక్తి పరస్పర విరుద్ధాలైన రెండు పాత్రల మధ్య కొట్టుమిట్టాడుతుంటాడు. దానివల్ల వ్యక్తి మూర్తిమత్వంలోను, సామాజిక వ్యవస్థలోను క్లిష్టపరిస్థితులు ఏర్పడుతాయి.

## అంతస్తు రకాలు

అయితే సమాజంలో వ్యక్తులు అంతస్తును రెండు రకాలుగా పొందుతుంటారు. అవి 1. ఆరోపించిన అంతస్తు (ascribed status), 2. సాధించిన అంతస్తు(achieved status).

**1. ఆరోపించిన అంతస్తు:** వ్యక్తికి పుట్టుక ద్వారా సంక్రమించే అంతస్తును ఆరోపిత అంతస్తు అంటారు. వ్యక్తులు లింగం, వయస్సు, జాతి, కులం, మతం మొదలైన జైవిక, సామాజిక అంతస్తులను పుట్టుకద్వారా పొందడం



BRAOU

జరుగుతుంది. పైన తెలిపిన జైవిక, సామాజిక, సాంస్కృతిక లక్షణాలు వ్యక్తులకు ఒక సమూహంలో పుట్టడంద్వారా ఆరోపితమవుతాయి. ఈవిధంగా వ్యక్తికి పుట్టుకనుబట్టి, జైవిక, సామాజిక స్థితినిబట్టి అప్రయత్నంగా సంక్రమించిన అంతస్తును ఆరోపిత, ఆరోపించిన అంతస్తు అంటారు. జీవిత చక్రంలో వ్యక్తి అంచెలవారిగా వేరువేరుఅంతస్తును పొందుతాడు. వయస్సు నుబట్టి సమాజం వ్యక్తులకు విభిన్న అంతస్తును ఆరోపిస్తుంది. అట్లాగే లింగాన్నిబట్టి వ్యక్తులు స్త్రీలు, పురుషులు అనే అంతస్తును పొందుతారు. జాతినిబట్టి తెల్లవారు, నల్లవారు, మంగోలులు అనే అంతస్తులను పొందుతారు. అదేవిధంగా పుట్టుకనుబట్టి వ్యక్తులు వివిధ కులములకు, మతాలకు, భాషలసమూహాలకు చెందినవారుగా పరిగణింపబడతారు. ఈ విధంగా వ్యక్తులు తమ జైవిక లక్షణాలను బట్టి లేదా ఒక సామాజిక - సాంస్కృతి సమూహములో పుట్టడాన్ని బట్టి పొందే అంతస్తును ఆరోపించిన అంతస్తు అంటారు. సంప్రదాయక సమాజాలలో వ్యక్తులు చాలావరకు ఆరోపించిన అంతస్తును పొంది, వాటికి అనుబంధంగా ఉండే పాత్రలను నిర్వహిస్తూ ఉంటారు. ఈ సమాజాలలో అంతస్తు గతిశీలత చాలా తక్కువగా ఉంటుంది. ఒక కులంలో, ఒక మతంలో లేదా ఒక సాంస్కృతిక సమూహంలో పుట్టిన వ్యక్తులు సాంప్రదాయకంగా సమాజం తన సమూహానికి ఆరోపించిన అంతస్తును స్వీకరించి, వాటికి అనుబంధంగా ఉండే పాత్రలను నిర్వహిస్తూ ఉంటాయి.

**2. సాధించిన అంతస్తు:** సమాజంలో కొన్ని సందర్భాలలో వ్యక్తులు తమ ప్రత్యేక గుణాలను బట్టి, శక్తి సామర్థ్యాలను బట్టి, అర్హతలను బట్టి అంతస్తును పొందుతారు. ఈవిధంగా వ్యక్తి తన శక్తి సామర్థ్యాలను బట్టి, తెలివితేటలను బట్టి, తన సాధనద్వారా, స్వయంకృషి ద్వారా సముపార్జించుకున్న అంతస్తును సాధించిన అంతస్తు అంటారు. ఉదాహరణకు ఒక సామాన్య కుటుంబంలో పుట్టిన వ్యక్తి విద్యనార్జించడం, అర్హతలను సముపార్జించుకోవడం వల్ల ఉపాధ్యాయుడు, డాక్టర్, న్యాయవాది, ఇంజనీర్, ఉన్నతాధికారి మొదలైన అంతస్తును పొందవచ్చు. అట్లాగే మామూలు గుమస్తాగా ఉద్యోగంలో చేరిన వ్యక్తి అర్హతలను పెంపొందించుకోవడంద్వారా అధికారి అంతస్తును పొందవచ్చు. ఒక సామాన్య కారకుడు స్వయంకృషితో ఉన్నత అంతస్తును సముపార్జించుకోవచ్చు. సాధించిన అంతస్తు వ్యక్తికి పుట్టుకనుబట్టికాక, స్వయంకృషిద్వారా, సాధనద్వారా, పోటీద్వారా లభిస్తుంది.

కొన్ని సమాజాలలో ఆరోపిత అంతస్తులకు ఎక్కువ గౌరవం, విలువ ఉండవచ్చు. ఆదిమ సంప్రదాయక సమాజంలో ఎన్నో అంతస్తులు ఆరోపించినవిగా ఉండేవి. కానీ ప్రజాస్వామిక, పారిశ్రామిక సమాజాలలో సాధించిన అంతస్తులకే ఎక్కువ గౌరవం, విలువ ఉంటున్నాయి. విద్యార్హతలను సముపార్జించుకొని, పోటీకి తట్టుకొని స్వశక్తి సామర్థ్యాలతో ముందుకుపోతూ స్వయం సముపార్జనద్వారా అంతస్తు సాధించినవారికే ఈనాడు విలువనివ్వడం జరుగుతున్నది. అందువల్లనే ఆధునిక సమాజాలలో అంతస్తు గతిశీలత ఎక్కువగా కనబడుతున్నది. ఇది సామాజిక అభివృద్ధికికూడాదోహదం చేస్తున్నది.

### 14.3.2 విలువలు

ప్రతి సామాజిక వ్యవస్థలో కొన్ని విలువలుంటున్నాయి. విలువ అనే పదాన్ని నిర్వచించడం కష్టసాధ్యమైన పని. నిత్య జీవితంలో మనం కొన్ని విషయాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాం. మరికొన్నింటికి తక్కువ ప్రాధాన్యతనిస్తాం. ఇది వ్యక్తిగతమైన విలువ. అట్లాగే సమాజంలో కొన్ని అంశాలలో ఎక్కువ ప్రాధాన్యమిచ్చినట్టయితే వాటికి ఆ సమాజంలో ఎక్కువ విలువ ఉన్నదన్నమాట. ఇది సామాజిక విలువ. దీన్నిబట్టి సామాజిక విలువను ఈ విధంగా నిర్వచించవచ్చు. విలువ అనేది ఒక భావన లేదా ప్రమాణం. ఈ ప్రమాణం ప్రాతిపదికగా ఒక వస్తువును ఇతర వస్తువుతో పోల్చి, దాన్ని ఆమోదించడం లేదా తిరస్కరించడం జరుగుతుంది. ఈ ప్రమాణం మొత్తం సమాజానికి సంబంధించినప్పుడు దాన్ని సామాజిక విలువ అని చెప్పవచ్చు.

మనం నిత్య జీవితంలో అన్ని విషయాలను మూల్యాంకన చేస్తూ వాటి విలువను నిర్ణయిస్తుంటాం. వస్తువులనే కాకుండా వ్యక్తులను, సమూహాలను, భావాలను, భావనలను, చర్యలను, లక్షణాలను, లక్ష్యాలను, సాధనాలను మొదలైనవాటినన్నింటిని మూల్యాంకన చేసి వాటి విలువ కట్టడం జరుగుతుంది. ఉదాహరణకు కొన్ని సమాజాలలో సహాయ సహకారాలకు విలువనిస్తే, మరికొన్నింటిలో పోటీ, సంఘర్షణలకు విలువనియ్యడం జరుగుతుంది.

అదేవిధంగా కొన్ని సమాజాలలో సర్వమానవ సమానత్వానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యముండగా, మరికొన్నింటిలో జాతి, మత వర్గ తారతమ్యాలకు, నిరంకుశ ఆదిపత్యానికి విలువనియ్యడం జరుగుతుంది. ఇట్లా వివిధ సమాజాలలో విభిన్న విలువలు ఉండవచ్చు.

సామాజిక జీవితంలో వివిధ రంగాలకు సంబంధించి అనేకమైన విలువలుంటాయి. సామాజిక ప్రవర్తనకు సంబంధించి సామాజిక విలువలు, నైతిక ప్రవర్తనకు సంబంధించి నైతిక విలువలు, మత విషయాలకు సంబంధించి ఆధ్యాత్మిక విలువలు, పౌర జీవితానికి సంబంధించి రాజకీయ విలువలు, ఆర్థిక విషయాలకు సంబంధించి ఆర్థిక విలువలు, సౌందర్యాత్మక విషయాలకు సంబంధించి సౌందర్యాత్మక విలువలు ఇట్లా సమాజంలో ఎన్నోరకాలైన విలువలు ఉంటాయి. జీవితంలోని ప్రతీ విషయంలోనూ సామాజిక విలువల ప్రభావం ఉంటుంది. కుటుంబ వ్యవహారంలోను, చదువు సంస్కారంలోను, వృత్తిలోను, స్నేహంలోను, మతంలోనూ ఒక్కటేమిటి అన్ని వ్యవహారాలలోనూ విలువలు ఉండి మానవ జీవితం మీద వాటి ప్రభావాన్ని చూపిస్తుంటాయి. ప్రతి వ్యవస్థలో, సంస్థలో, సమూహాలలో కొన్ని ప్రత్యేక విలువలు ఉంటాయి. అయితే వీటిలో కొన్ని విలువలు చాలా ముఖ్యమైనవిగా భావించడం జరుగుతుంది. ఈ మౌలిక విలువల ప్రభావం మొత్తం సమాజం మీద ఉంటుంది. ఈ విలువలను పోషించడాన్ని, పరిరక్షించడాన్ని సమాజ లక్ష్యంగా భావిస్తారు.

విలువలు సామాజిక అనుభవాలనుంచి ఉత్పన్నమై క్రమంగా స్థిరపడుతాయి. ఈ విలువలు కాలక్రమంగా సంస్కృతిలో కలిసిపోయి దానిలో అంతర్భాగమవుతాయి. అవి సమాజంలోని ప్రతి వ్యక్తిని, సమూహాన్ని ఆవరించి ఉంటాయి. ఈ విలువలు వ్యక్తి ప్రవర్తనను, సామూహిక ప్రవర్తనను నిర్ధారిస్తాయి. సామాజిక పాత్ర, అంతస్తులను నాటికి ప్రమాణాలను, ఆమోదాలను కూడా విలువలు నిర్ధారిస్తాయి.

ఇంతకు ముందు చెప్పినట్టుగా విలువలు సామాజికఅనుభవానుంచి ఉత్పన్నమై సమాజంలో స్థిరపడుతాయి. అయితే విలువలు, ప్రమాణాలు సామాజిక వ్యవస్థలో కొంతవరకు నిలకడగా ఉన్నప్పటికీ అవి అన్ని కాలాలలో ఒకే విధంగా ఉండవు. కొన్ని విలువలు అన్ని కాలాలలో శాశ్వతంగా ఉంటాయి. మరికొన్ని కాలానుగుణంగా మారుతూ ఉంటాయి. ఒక్కొక్కప్పుడు కొన్ని విలువలకు ప్రాభల్యం ఉంటుంది. విలువల్లో మార్పులు కలిగినప్పుడు సమాజంలో అనేక అంశాలలో మార్పులు వస్తాయి. ఉదాహరణకు సాంప్రదాయక సమాజాలలో ఆధ్యాత్మిక విలువలకు, సమిష్టి విలువలకు ప్రాభల్యం ఉండేది. ప్రజలు సమిష్టి కుటుంబాలలో సాముదాయక జీవనం గడుపుతుండేవారు. కుటుంబ పెద్ద చెప్పిన ప్రకారంగా నడుచుకుంటూ సమిష్టి కుటుంబ ప్రమాణాలను పాటిస్తూ ప్రేమానురాగాలతో అన్యోన్యంగా జీవితం గడుపుతుండేవారు. ఆధునిక సమాజాలలో ఆధ్యాత్మిక విలువలకు ప్రాభల్యం తగ్గి, లౌకిక, ఆర్థిక, వైయుక్తిక విలువలకు ప్రాభల్యం హెచ్చింది. అందువల్ల సమిష్టికుటుంబం సమిష్టి జీవన విధానం క్రమంగా సన్నగిల్లి వ్యష్టి జీవనానికి ప్రాధాన్యం పెరిగింది. ఈనాడు మొత్తం సమాజంలో రాజకీయ, ఆర్థిక విలువలకు ప్రాభల్యం పెరిగి, నైతిక, ఆధ్యాత్మికవిలువలకు ప్రాభల్యం తగ్గడంతో సమాజంలో అవ్యవస్థిత పరిస్థితులు ఏర్పడుతున్నాయని చాలామంది భావిస్తున్నారు. అందువల్లనే సమాజంలో ఈ విలువలను పోషించడంద్వారా సమాజాన్ని పునర్నిర్మించడానికి కృషి జరుగుతున్నది.

క్లుప్తంగా చెప్పవలెనంటే సామాజిక వ్యవస్థలో విలువలు మౌలిక స్థానం ఆక్రమించి మొత్తం వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. సామాజిక వ్యవస్థ అంతిమ లక్ష్యాలను, ప్రయోజనాలను ఈవిలువలే సూచిస్తాయి. వ్యక్తులకు, సమూహాలకు విలువలు మార్గదర్శకాలుగా వ్యవహరిస్తాయి. సామాజిక పాత్రల ద్వారా, అంతస్తులద్వారా, ప్రమాణాలద్వారా ఏయే సామాజిక లక్ష్యాలను ఏయే మార్గాలద్వారా సాధించవలెనో నిర్ధారిస్తూ, సరైన ప్రేరణ కలిపిస్తూ సమాజ ప్రకార్య నిర్వహణకు విలువలు తోడ్పడుతుంటాయి.

### 14.3.3 సామాజిక ప్రమాణాలు

సమాజంలో వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేసే నియమనిబంధనలను సమాజ శాస్త్రంలో సామాజిక ప్రమాణాలు అంటారు. ప్రతి అంతస్తు, పాత్రకు అనుబంధంగా కొన్ని ప్రమాణాలు ఉంటాయి. ఆ అంతస్తు, పాత్రను నిర్వహించే వ్యక్తి వాటిని తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. ఉదాహరణకు 'విద్యార్థి' అనే అంతస్తు పాత్ర



BRAOU

నిర్వహించే వ్యక్తి తప్పనిసరిగా సమయానికి తరగతిగదిలో ప్రవేశించడం, తనకు కేటాయించిన స్థలంలో కూర్చుండడం, ఉపాధ్యాయుడు చెప్పిన విషయాలను శ్రద్ధగా వినడం, ఇచ్చిన నిర్దేశాలను పూర్తి చేయడం, తోటి విద్యార్థులతో సహకరించడం, క్రమశిక్షణ పాటించడం మొదలైన విద్యాలయ నిబంధనలకు కట్టుబడి ఉండవలసి ఉంటుంది. ఇట్లాంటి నియమాలు విద్యాలయాలలో చాలా ఉంటాయి. వీటిని విద్యాలయ ప్రమాణాలంటాం. సమాజంలో ఇట్లాంటి ప్రమాణాలు ఎన్నో ఉంటాయి. ఇవన్నీ సమాజ సభ్యులకు, వారి అంతస్తు పాత్రలకు సంబంధించినవి కాబట్టి వీటిని సామాజిక ప్రమాణాలు అంటారు.

సామాజిక వ్యవస్థలో వివిధ అంతస్తు, పాత్రలలో వివిధ సందర్భాలలో ఎట్లా వ్యవహరించవలెనో సామాజిక ప్రమాణాలు నిర్వచిస్తాయి. ఏది ఉచితం, ఏది అనుచితం అనేదికూడా ఈ ప్రమాణాలు తెలుపుతాయి. ప్రమాణాలు వ్యక్తులకు మార్గదర్శకాలుగా ఉండి వారిని సరిఅయిన మార్గాలలో నడిపిస్తాయి. వ్యక్తులు వాటికి కట్టుబడి, ఆచరణలో పెట్టినప్పుడే వారు సరిఅయిన ప్రయోజనాలను పొందుతారు. అప్పుడే సమాజంలో క్రమం, స్థిరత్వం అనేది ఉంటుంది.

సామాజిక అంతస్తు, పాత్రల వలె సామాజిక ప్రమాణాలుకూడా సమాజం నుంచి ఏర్పడినవే. సామాజిక ప్రమాణాలంటే సామాజిక ప్రతీక్షలు. ఒక ఉమ్మడి లక్ష్యాన్ని సాధించే సందర్భంలో వ్యక్తులు లేదా సమూహాల మధ్య పరస్పర చర్యలు జరిగినపుడు ఒకరి ప్రవర్తన గురించి మరొకరు పట్టింపు చేసుకుంటారు. ప్రతీ ఒక్కరూ ఇతరులు ఆకాంక్షించిన రీతిగా ప్రవర్తించడానికి ప్రయత్నిస్తారు. లక్ష్యాలను సాధించడానికిగానూ కొన్ని నియమాలను, నిబంధనలను రూపొందించుకుంటారు. ఇట్లా వారు రూపొందించుకున్న ఆమోద ఆకాంక్షల నమోనాలే సామాజిక ప్రమాణాలు. అంతేకాకుండా సామాజిక జీవనం సాఫీగా సాగడంలో ఈ సాజిక ప్రమాణాలు ఎంతగానో తోడ్పడతాయి. మన నిత్యావసరాలను తృప్తిపరచుకోవడంలో మన ప్రవర్తనకు పరిధులు ఏర్పరచి, మన ప్రవర్తనను ఇతరుల ప్రవర్తనతో జతపరచి, వారి మనోభావాలకు తగినట్లు సమన్వయ పరుస్తాయి. సమాజంలో ఒక క్రమం, నీతి ఉండవలెనంటే ప్రతివ్యక్తి ఈ ప్రమాణాలను పాటించవలె. సమాజంలో పుట్టి పెరిగినవ్యక్తి సమాజంలో అనేక కార్యకలాపాలలో పాల్గొనడం ద్వారా ప్రమాణాలను గురించి తెలిసికొని వాటిని పాటించడానికి అలవాటు పడతాడు. ఇష్టం ఉన్నా లేకపోయినా వ్యక్తి ఈ ప్రమాణాలను ఒప్పుకొని ఆచరణలో పెట్టవలె. వాటికి కట్టుబడి ఉండవలె. అట్లా పాటించడంవల్లనే వ్యక్తికి, సమాజానికి ప్రయోజనం చేకూరుతుంది. అందువల్లనే వ్యక్తులు సర్వసాధారణంగా సామాజిక ప్రమాణాలను పాటిస్తూ ఉంటారు.

వ్యక్తులు సామాజిక ప్రమాణాలను పాటించేటట్లు చేయడానికి సమాజం అనేక మార్గాలను రూపొందించి, అమలు పరుస్తుంది. సామాజిక ప్రమాణాలను అనుసరించే వ్యక్తి నడవడిని సమాజం ఆమోదిస్తుంది. హర్షిస్తుందికూడా. ఆ వ్యక్తికి ఇతరుల సహాయ సహకారాలు లభిస్తాయి. అట్లా కాకుండా సామాజిక ప్రమాణాలను ఉల్లంఘించి ప్రవర్తించినట్టయితే అతని నడవడిని సమాజం గర్హిస్తుంది. సామాజిక ప్రమాణాలను ఉల్లంఘించడం వల్ల వ్యక్తికి తాత్కాలికంగా కొంత ప్రయోజనం కలిగినప్పటికీ అతడు సామజిక ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. వారి ప్రవర్తనను సమాజం విమర్శించి, నిరసించి శిక్షిస్తుంది. అనేక మార్గాల ద్వారా సమాజం వ్యక్తులను సామజిక ప్రమాణాలను ఆమోదించి, పాటించేటట్లు చేస్తుంది. ఇట్లా వ్యక్తులను సామాజిక ప్రమాణాలను ఆమోదించి, పాటించేటట్లు చేసే మార్గాలనే సామాజికా మోదాలు అంటారు. సామాజిక ప్రమాణాలకు అనుబంధంగా సామాజికామోదాలు ఉంటాయి. ప్రమాణాలను పాటించడినవారు సామాజిక సమ్మతిని, ప్రశంసను, ఆమోదాన్ని పొందుతారు. వారికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. సమ్మతి, ప్రశంస, సహాయసహకారాలు, గుర్తింపు మొదలైన వాటిని సహకారాత్మక అమోదాలు(possitive sanctions) అంటారు. సామాజిక ప్రమాణాలను ఉల్లంఘించి ప్రవర్తించినప్పుడు వ్యక్తి పొందే అసమ్మతి, విమర్శ, ఆగ్రహం, బహిష్కరణ, శిక్ష మొదలైనవాటిని నకారాత్మక ఆమోదాలు (negative sanctions) అంటారు.

సామాజిక ప్రమాణాలను సమాజ శాస్త్రవేత్తలు పలు రకాలుగా వర్గీకరించినారు. డబ్ల్యూ.జి.సమ్నర్ (W.G.Sumner) అనే సామాజిక శాస్త్రవేత్త సామాజిక ప్రమాణాలను రెండు వర్గాలుగా విభజించినాడు. అవి 1. జానపదరీతులు(folk ways), 2. సామాజిక రీతులు(mores). సమాజంలో సాధారణంగా అలవాటుగా పాటించే

ప్రమాణాలను జానపదరీతులు అంటారు. వీటిని అంత ఖచ్చితంగా పాటించకపోయినా అంతగా పట్టించుకోరు. అయితే ఇవికాక కొన్ని సామాజిక ప్రమాణాలు సామాజిక జీవనానికి అనివార్యంగా భావించడం జరుగుతుంది. వీటిని ఖచ్చితంగా, తప్పనిసరిగా పాటించవలెనని నిర్దేశించడం జరుగుతుంది. అట్లా పాటించనివారు సామాజిక విమర్శకు, ఆగ్రహానికి గురవుతారు. వీటినే సామాజిక రీతులు అంటారు. బీర్‌స్టెడ్ అనే సమాజ శాస్త్రవేత్త సామాజిక ప్రమాణాలను ఈ విధంగా వర్గీకరించినాడు. 1. మర్యాదలు, 2. నిషేధాలు, 3. సంప్రదాయాలు, 4. ఆచారాలు, 5. నియమాలు, 6. నిబంధనలు, 7. జానపదరీతులు, 8. సామాజిక రీతులు, 9. చట్టాలు.

మెకైవర్ (Maciver) అనే సమాజ శాస్త్రవేత్త ప్రమాణాలను ప్రధానంగా నాలుగు వర్గాలుగా విభజించినాడు. అవి. 1. సామాజిక సంహితాలు, 2. నైతిక సంహితాలు, 3. మత సంహితాలు, 4. న్యాయసంహితాలు. నిత్య సామాజిక జీవనంలో వ్యక్తులు తమ కుటుంబంలోను, సముదాయంలోను పాటించే నియమ నిబంధనలు, జానపదరీతులు, సామాజికరీతులు, ఆచారాలు, సంప్రదాయాలు, మర్యాదలు మొదలైనవి సామాజిక సంహితలు. నీతి, నిజాయితీకి సంబంధించిన ప్రమాణాలనునైతిక సంహితలుగాను, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన ప్రమాణాలను, ఆచార సంప్రదాయాలను మత సంహితలుగాను, రాజ్యానికి, పౌరజీవనానికి సంబంధించిన ప్రమాణాలను చట్టన్యాయసంహితలుగానూ పేర్కొనడం జరుగుతుంది.

### 14.3.4 సామాజిక సంస్థలు

సామాజిక ప్రమాణాలు, నియమ నిబంధనలపై ఆధారపడి వ్యవస్థీకృతమైన సమూహాలనే సామాజిక సంస్థలు అంటారు. కొన్ని విలువలు, పద్ధతులు కలిగిన సమాజ ప్రాథమిక అవసరాలు తీర్చే వ్యవస్థీకృత సామాజిక సంబంధాలనే సంస్థ అని పి.బి. హార్టన్ (Hartton), సి.ఎల్. హంట్ (Hunt)లు పేర్కొన్నారు. ప్రతీ సమూహానికి చెందిన సభ్యులు కొన్ని ప్రమాణాలకు అనుగుణంగా పరస్పర సంబంధాలతో ఉంటారు. సామాజిక సంస్థలు సమాజంలో వ్యక్తుల ప్రాథమిక అవసరాలను సక్రమంగా తీర్చడానికి సమాజం కొన్ని ప్రమాణాలను, విలువలను, నియమాలను రూపొందిస్తుంది.

సమాజంలో ముఖ్యంగా ఐదు రంగాలకు సంబంధించిన సంస్థలు ఉంటాయి. అవి: 1. కుటుంబ, వివాహ, బంధుత్వ వ్యవస్థ, 2. ఆర్థిక వ్యవస్థ, 3. రాజకీయ వ్యవస్థ, 4. విద్యావ్యవస్థ, 5. మతవ్యవస్థ. ఈ ఐదు వ్యవస్థలు వ్యక్తుల యొక్క ప్రాథమిక అవసరాలను తీర్చడానికి కృషిచేస్తాయి. ఈ వ్యవస్థలలో ప్రతి దానిలోనూ అనేక సామాజిక నిర్మితులు, ప్రమాణాలు, విలువలు ఉంటాయి. ఇవన్నీ కొన్ని మౌలిక విలువల మీద ఆధారపడి రూపొంది, సామాజిక ప్రకార్యాలను నిర్వహిస్తుంటాయి. మొత్తం సమాజాన్ని ఒక సామాజిక వ్యవస్థగా భావించినప్పుడు పైన పేర్కొన్న సామాజిక సంస్థలను ఉప వ్యవస్థలుగా పరిగణించడం జరుగుతుంది. ఈ ఉప వ్యవస్థలన్నీ పరస్పర సంబంధాలతో అన్యోన్యాధారితమై ఉమ్మడి సామాజిక లక్ష్యాలను, ప్రయోజనాలనుసాధించడానికి తోడ్పడతాయి.

### 14.3.5 సమూహాలు

సమాజశాస్త్రంలో 'సమూహం' అనే పదానిన చాలా తరచుగా వాడడం జరుగుతుంది. వ్యావహారిక భాషలో సమూహమంటే 'ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది వ్యక్తుల కలయిక' అని చెప్పుకోవడం జరుగుతుంది. కానీ ఈ వ్యక్తుల మధ్య పరస్పర సాంఘిక సంబంధాలు కలిగి ఉన్నప్పుడే దానిని సమాజశాస్త్ర దృష్టిలో సమూహంగా పిలువబడుతుంది. అంటే సామాజిక సంబంధాలను, సామూహిక భావన కలిగి ఉన్న వ్యక్తుల కలయికను సమూహం అని అనవచ్చునని సమాజశాస్త్రవేత్తల అభిప్రాయం. ప్రతి వ్యక్తి ఏదో ఒక సమూహంలో సభ్యుడుగా ఉంటాడు. మానవుడు ఒకే కాలంలో చాలా సమూహాలలో కూడా సభ్యత్వాన్ని కలిగి ఉండవచ్చు. సమూహాన్ని వివిధ సమాజ శాస్త్రవేత్తలు వివిధ రకాలుగా నిర్వచించినారు. వాటిలో కొన్ని ముఖ్యమూన నిర్వచనాలను ఇక్కడ పరిశీలిద్దాం.

మెకైవర్ అనే సమాజశాస్త్రవేత్త "పరస్పరం సాంఘిక సంబంధాలు కలిగి ఉన్న ఏ కొద్ది మంది వ్యక్తుల కలయిక



BRAOU

అయినా సామాజిక సమూహమని" నిర్వచించినాడు.

పార్క్ మరియు బర్జెస్(Park & Burgess) అనే సమాజ శాస్త్రవేత్తలు "సామాజిక సమూహం ఒక ఉమ్మడి లక్ష్యాన్నిగాని లేదా ధేయాన్నిగాని కలిగి ఉండి చైతన్యంతోగానీ, చైతన్యరహితంగా గానీ ఒకే రీతిలో నిశ్చలమైన చర్యకు అర్హమైన వ్యక్తుల కలయిక" అని నిర్వచించినారు.

సామ్యూల్ కొయినిగ్ (sammuel koenig) అనే సమాజశాస్త్రవేత్త దృష్టిలో "కొందరు వ్యక్తుల సమూహం వ్యవస్థాపితమై కనీస క్రమశిక్షణకు కొన్ని సాధనాలను కలిగి యుండి కేంద్రీకృతమైయున్నదే సమూహం".

కింబాల్‌యంగ్ అనే సమాజ మనోవిజ్ఞానశాస్త్రవేత్త సమూహమంటే "సాంఘిక ప్రతిచర్యాస్థితిలో ఉండే ఇద్దరు వ్యక్తులను లేదా చాలా మంది వ్యక్తులను సమూహమని" నిర్వచించినాడు.

కాబట్టి సమూహమంటే కేవలం వ్యక్తుల కలయికగా భావించరాదు. పై నిర్వచనాలను బట్టి మనకు గోచరించేదేమిటంటే సాంఘిక సంబంధాలను కలిగి యుండి పరస్పరము సహకరించుకొని ఉమ్మడి అభిరుచులను పెంపొందించుకుంటూ ఒక లక్ష్య సిద్ధికోసం పాటుపడుతూ, క్రమశిక్షణకలిగి వ్యవస్థీకృతమై, సాంఘిక ప్రతిచర్యాస్థితిలో ఉండే వ్యక్తుల కలయికను సమూహంగా చెప్పవచ్చు. అంతేకాక సమూహ సభ్యుల మధ్య భౌతిక సంబంధాలు కాకుండా మానసికమైన పరోక్ష సంబంధాలు ఉన్నా సమూహమని పేర్కొనవచ్చు.

కాబట్టి సామాజిక సమూహం యొక్క ముఖ్యలక్షణాలలో భావప్రసారం ప్రధానమైనది. భావ ప్రసారమంటే సమూహంలోని సభ్యులు తమ భాష ద్వారా తమ భావాలను, ఉద్దేశాలను ఒకరికొకరు తెలియపరచుకోవడం అని చెప్పుకోవచ్చు. ప్రతి సమూహం ఒక ఉమ్మడి లక్ష్యాన్ని, కొన్ని అభిరుచులను కలిగి ఉంటుంది. దాని ద్వారా సమూహసభ్యులు సన్నిహితులవుతారు. సమూహంలోని సభ్యులు కలిసి మెలసి సహకారంతో పనిచేస్తారు. కనుక సమూహం యొక్కస్థిరత్వం, ఆ సమూహంలోని సభ్యుల మధ్య ఉన్న సహకారం మీద ఆధారపడి ఉంటుంది. సహకారం కనుక లోపించినట్టయితే సమూహం యొక్క విచ్ఛిన్నతికి దారితీస్తుంది. ప్రతి సమూహం కొన్ని రకాలపై ప్రమాణాలను రూపొందించుకొని,వాటిని అమలు పరచుకోవడానికి ప్రయత్నిస్తుంది. సమూహంలోని వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడానికి ఈ ప్రమాణాలు తోడ్పడతాయి. ప్రతి సమూహంలో 'మేము', 'మనము' అనే భావన ఉంటుంది. దీనినే సజాతి చేతనత అని పేర్కొనడము జరిగింది.

సమాజ శాస్త్రవేత్తలు సమూహాలను వివిధ రకాలుగా వర్గీకరించినారు. సమూహాలలోని ప్రధాన రకాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చు. సమూహాలను వాటియొక్క పరిమాణం, వాటిలోగల సాంఘిక సంబంధాలు, కాల వ్యవధిని బట్టి వర్గీకరించడం జరిగింది.

సి.హెచ్.కూలే అనే సమాజశాస్త్రవేత్త సమూహాలను రెండు రకాలుగా వర్గీకరించినాడు. అవి, 1. ప్రాథమిక సమూహాలు, 2. గౌణ సమూహాలు. ప్రాథమిక సమూహాలు చిన్నచిన్నవిగా ఉండి, సభ్యులందరి మధ్య సన్నిహిత సంబంధ, బాంధవ్యాలు ఎక్కువగా ఉంటాయి. ఉదహారణకు కుటుంబము, క్రీడా సమూహాలు, ఇరుగుపొరుగు మొదలయినవి. గౌణ సమూహాలు పరిమాణపరంగా పెద్దవి. గౌణ సమూహాలలో వ్యక్తుల మధ్య సంబంధాలు పరోక్షంగాను, యాంత్రికంగాను ఉంటాయి. గౌణ సమూహాలలోని సభ్యులు ఒక లక్ష్యసాధనకు సమావేశమై ఆ లక్ష్యం పూర్తికాగానే విడిపోతారు. ముఖాముఖి సంబంధాలుగాని, సన్నిహిత సంబంధ బాంధవ్యాలుగానీ అంత హెచ్చుగా ఉండవు. ఉదాహరణకు కార్మిక సంఘాలు, వ్యాపార సంఘాలు, విద్యార్థి సంఘాలు మొదలైన వాటిని పేర్కొనవచ్చు.

డబ్ల్యూ.జి.సమ్నర్ అనే సమాజశాస్త్రవేత్త సమూహాలను అంతః సమూహాలు, బాహ్య సమూహాలు అని వర్గీకరించినాడు. ఏ సమూహాలలో అయితే వ్యక్తి సభ్యత్వం కలిగి ఉంటాడో ఆ సమూహాన్ని అంతః సమూహమని, ఆవ్యక్తి సభ్యత్వం లేనటువంటి సమూహాన్ని బాహ్య సమూహమని పిలుస్తారు. అంటే ఒక సమూహం ఒక వ్యక్తికి అంతః సమూహమయితే, అదే సమూహం మరో వ్యక్తికి బాహ్య సమూహం కావచ్చు.



BRAOU

పిటిరిమ్.ఎ.సోరోకిన్ అనే సమాజశాస్త్రవేత్త సమూహాలను విషమస్తరీయ సమూహాలు, సమస్తరీయ సమూహాలుగా వర్గీకరించినాడు. విషమస్తరీయ సమూహాలు పరిమిత స్థాయిలో చిన్నవిగా ఉంటాయి. ఇవి ప్రతి వ్యక్తికి అంతస్తును, పాత్రలను అందజేస్తాయి. ఉదాహరణకు క్రీడా సమూహాలు, వృత్తి సంఘాలు, కుల సమూహాలు మొదలైన వాటిని పేర్కొనవచ్చు. ఇక సమస&తరీయ సమూహాలు అపరిమిత స్థాయిలో పెద్దవిగా ఉంటాయి. ఇవి చాలా ఎక్కువ మంది వ్యక్తుల అవసరాలను తీర్చగలుగుతాయి. ఉదాహరణకు రాజకీయ పార్టీలు, మతం, జాతి మొదలైనవి.

డి.శాండర్సన్ అనే సమాజశాస్త్రవేత్త సమూహాలను అనైచ్ఛిక, స్వచ్ఛంద, ప్రాతినిధ్య సమూహాలుగా వర్గీకరించినాడు. అనైచ్ఛిక సమూహాలలో సభ్యత్వం వ్యక్తి ఇష్టంపై ఆధారపడి ఉండదు. ఇందుకు ఉదాహరణ కుటుంబం, కులం, జాతి మొదలయినవి. స్వచ్ఛంద సమూహాలలో వ్యక్తి తన యొక్క అభిరుచులకు, అవసరాలకు అనుగుణంగా ఇష్టపడి సభ్యత్వాన్ని పొందవచ్చు. ఇందుకు ఉదాహరణ ఆటల జట్టు, రాజకీయపార్టీ, వర్తక సమూహాలు. ప్రాతినిధ్య సమూహమంటే ఒక ప్రత్యేక వర్గానికి గానీ, లేదా ప్రయోజనానికిగానీ ప్రాతినిధ్యం వహించే ఉద్దేశ్యంతో వ్యక్తులందరూ కలుసుకొని ఏర్పాటు చేసుకొన్న సమూహం. ఇందుకు ఉదాహరణ కార్మిక సంఘాలు, పార్లమెంటు, అసెంబ్లీ మొదలైనవి.

## 14.4 సారాంశం

సమాజశాస్త్ర పరిభాషలో కొంతమంది వ్యక్తుల, సమూహాల, సంఘాల, సముదాయాల కలయికను సమాజంగా చెప్పవచ్చు. సమాజమనేది ఒక అమూర్తభావన. దానికి ఒక నిర్మితి, కొన్ని ప్రకార్యాలుంటాయి. కాబట్టి సమాజమనేది అనేక మంది వ్యక్తులతోను, సమూహాలతను, సముదాయాలతోను కూడిన ఒక సంశ్లిష్ట వ్యవస్థ అని చెప్పవచ్చు. సామాజిక నిర్మితిలో అంతస్తు, పాత్ర, విలువలు, ప్రమాణాలు, సంస్థలు, సమూహాలు అనే మూలాంశాలుంటాయి. కాబట్టి సమాజంలో గల ఈ మూలాంశాల మధ్య ఒక క్రమబద్ధమైన సంబంధాలను కలిగి యుండేటట్లు చేసే సామాజిక ప్రవర్తనా నమూనానే సామాజిక నిర్మితి అని చెప్పవచ్చు. సామాజిక నిర్మితిలోని మూలాంశాల మధ్య పరస్పర చర్యలు జరిగి సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. ఈ సామాజిక సంబంధాలు, విలువలు, ప్రమాణాలు అన్యోన్యాధారంగా ఉంటాయి. సామాజిక నిర్మితి అనేది ఈ అన్యోన్యాధారం అనే విషయాన్ని నొక్కి చెబుతుంది. సామాజిక నిర్మితిలోని ఈ అంగాలన్నీ పరస్పర సంబంధంతో అన్యోన్యాధారితమై ఉమ్మడి లక్ష్యాలను సాధించడానికి సమైక్యంగా పనిచేస్తుంటాయి.

సామాజిక నిర్మితిలో అంతస్తు, పాత్ర విలువలు, ప్రమాణాలు, సామాజిక సంస్థలు, సమూహాలు అనే మూలాంశాలుంటాయని ఇదివరకే చెప్పడం జరిగింది. సమాజశాస్త్రంలో అంతస్తు అనే పదాన్ని సమాజంలో వ్యక్తి లేదా సమూహం యొక్క స్థాయిని లేదా స్థితిని సూచించడానికి ఉపయోగిస్తారు. వయస్సు, లింగం, వృత్తి, వైవాహిక స్థితి మొదలైన జైవిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలను బట్టి వ్యక్తులు విభిన్న అంతస్తులలో ఉంటారు. ప్రతి అంతస్తుకు అనుబంధంగా పాత్రలుంటాయి. అంతస్తుకు, పాత్రకు చాలా సన్నిహిత సంబంధముంటుంది. అంటే ఒక అంతస్తుకు, పాత్రకు చాలా సన్నిహిత సంబంధముంటుంది. అంటే ఒక అంతస్తు పొందిన వ్యక్తి దానికి అనుబంధంగా ఉన్న పాత్రలను నిర్వహించవలెనని ఆశించడం జరుగుతుంది. సామాజిక జీవనంలో వివిధ సందర్భాలలో వ్యక్తులమధ్య జరిగే పరస్పర చర్యలే వారి మధ్య పాత్ర సంబంధాలు ఏర్పడడానికి దోహదం చేసి, వాటినిస్థిరపరుస్తాయి. అయితే సమాజంలో వ్యక్తులు అంతస్తును రెండు రకాలుగా పొందుతారు. అవి, 1. ఆరోపిత అంతస్తు, 2. సాధించిన అంతస్తు. వ్యక్తి పుట్టుకద్వారా సంక్రమించే అంతస్తును ఆరోపిత అంతస్తు అంటారు. సమాజంలో కొన్ని సందర్భాలలో వ్యక్తులు తమ ప్రత్యేక గుణాలను బట్టి, శక్తి సామర్థ్యాలనుబట్టి, అర్హతలను బట్టి పొందే అంతస్తును సాధించిన అంతస్తు అంటారు.

ప్రతి సామాజికవ్యవస్థలో కొన్ని విలువలు, ప్రమాణాలు ఉంటాయి. విలువల అనేది ఒక భావన లేదా ప్రమాణం. సామాజిక జీవితంలో వివిధ రంగాలకు సంబంధించి అనేకమైన విలువలు ఉంటాయి. సామాజిక ప్రవర్తనకు సంబంధించి సామాజిక విలువలు, నైతిక ప్రవర్తనకు సంబంధించి నైతిక విలువలు, మత విషయాలకు సంబంధించి



BRAOU

ఆధ్యాత్మిక విలువలు, పౌరజీవితానికి సంబంధించి రాజకీయ విలువలు, ఆర్థిక విషయాలకు సంబంధించి ఆర్థిక విలువలు ఇట్లా సమాజంలో ఎన్నో రకాలయిన విలువలు ఉంటాయి. విలువలు సామాజిక అనుభవాల నుంచి ఉత్పన్నమై క్రమంగా స్థిరపడతాయి. విలువలతో పాటు సమాజంలో వ్యక్తుల ప్రవర్తనను క్రమద్ధీకరించడానికి ప్రమాణాలు కూడా ఉంటాయి. ప్రతి అంతస్తు, పాత్రకు అనుబంధంగా కొన్ని ప్రమాణాలు కూడా ఉంటాయి. ప్రతి అంతస్తు, పాత్రకు అనుబంధంగా కొన్ని ప్రమాణాలు ఉంటాయి. ఆ అంతస్తు, పాత్రను నిర్వహించేవ్యక్తి వాటిని తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది. సమాజంలో ఏది ఉచితం, ఏది అనుచితం అనే విషయాలను ప్రమాణాలు తెలుపుతాయి. ప్రమాణాలు వ్యక్తులకు మార్గదర్శకాలుగా ఉండి, వారిని సరియయిన మార్గాలలో నడిపిస్తాయి.

సమాజంలో విలువలు, ప్రమాణాలతో పాటు సామాజిక సంస్థలు కూడా ఉంటాయి. కొన్ని విలువలు, పద్ధతులు కలిగి సమాజ ప్రాథమిక అవసరాలను తీర్చే వ్యవస్థీకృత సామాజిక సంబంధాలనే సామాజిక సంస్థ అని అంటారు. సమాజంలో ముఖ్యంగా ఐదు రంగాలకు సంబంధించిన సంస్థలు ఉంటాయి. అవి: 1. కుటుంబం, వివాహ, బంధుత్వ వ్యవస్థ, 2. ఆర్థిక వ్యవస్థ, 3. రాజకీయ వ్యవస్థ, 4. విద్యావ్యవస్థ, 5. మత వ్యవస్థ.

సామాజిక నిర్మితిలో విలువలు, ప్రమాణాలు, సామాజిక సంస్థలతోపాటు సామాజిక సమూహాలు కూడా ప్రధానమూలాంశాలుగా ఉంటాయి. సామాజిక సంబంధాలు, సామూహిక భావన కలిగియున్న వ్యక్తుల కలయికను సమూహం అంటారు. సమాజశాస్త్రవేత్తలు సమూహాలను వివిధ రకాలుగా వర్గీకరించారు. సి.హెచ్.కూలే అనే సమాజశాస్త్రవేత్త సమూహాలను ప్రాథమిక సమూహాలు, గౌణ సమూహాలు అని, డబ్ల్యూ.జి.సమ్నర్ అనే సమాజశాస్త్రవేత్త అంతః సమూహాలు, బాహ్య సమూహాలు అని, పిటిరిమ్, ఎ. సొరోకిన్ అనే సమాజశాస్త్రవేత్త విషమస్తరీయ, సమస్తరీయ సమూహాలు అని, డి.శాండర్సన్ అనే సమాజ శాస్త్రవేత్త అనైచ్ఛిక, స్వచ్ఛంద, ప్రాతినిథ్య సమూహాలు అని వర్గీకరించినాడు.

ఈవిధంగా సామాజిక నిర్మితి అనేది ఒక అమూర్త భావన. ఇందులో సామాజిక అంతస్తు, పాత్రలు, విలువలు, ప్రమాణాలు, సామాజిక సంస్థలు, సమూహాలు అనే మూలాంశాలుంటాయి. వీటి ద్వారా మనం సామాజిక నిర్మితిని గురించి అవగాహన చేసుకోవచ్చు.

BRAOU

## 14.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. సామాజిక నిర్మితి అంటే ఏమిటో నిర్వచించుము.

2. సామాజిక నిర్మితియందుగల ప్రధాన మూలాంశాలేవి?

II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. సామాజిక విలువలు అంటే ఏమిటి?

2. సామాజిక ప్రమాణాలు అంటే ఏమిటి?

## 14.6 చదువదగిన పుస్తకాలు

Harry, M. Johnson : Sociology -A Systematic Intriduction.

Smelser, N.J. : Sociology - An Introduction.

Kingsley Davis : Human Society.

Kimball Young and Raymond, W. Mack : Systematic Sociology - Text and Readings.

Pascual Gisbert : Fundamentals of Sociology.

P.B.Horton and C.L. Hunt. : Sociology.

Shankar Rao, C.N. : Sociology.

BRAOU

# భాగం-15: సామాజిక స్తరీకరణ-సామాజిక విభేదీకరణ

విషయక్రమం


15.0 ఉద్దేశాలు

15.1 పరిచయం

15.2 సామాజిక స్తరీకరణ

15.2.1 సామాజిక స్తరీకరణ-నిర్వచనము

15.2.2 సామాజిక స్తరీకరణ-లక్షణాలు

15.2.3 సామాజిక స్తరీకరణ-రూపాలు

15.2.3.1 కులవ్యవస్థ

15.2.3.2 వర్గవ్యవస్థ

15.2.3.2 సంస్థాన వ్యవస్థ

15.3 సామాజిక విభేదీకరణ-కారణాలు

15.3.1 సామాజిక విభేదీకరణ-ప్రాతిపదికలు

15.3.2 సామాజిక విభేదీకరణ-లింగవిభేదాలు

15.3.3 సామాజిక విభేదీకరణ-వయస్సు

15.3.4 సామాజిక విభేదీకరణ-అంతస్తు

15.3.5 సామాజిక విభేదీకరణ-వృత్తి

15.3.6 సామాజిక విభేదీకరణ-సంపద, అధికారము

15.3.7 సామాజిక విభేదీకరణ-మతం

15.4 సారాంశం

15.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

15.6 చదువదగిన పుస్తకాలు


## 15.0 ఉద్దేశాలు

ఈ భాగాన్ని చదివిన తరువాత మీరు

- సామాజిక స్తరీకరణ అంటే ఏమిటో నిర్వచించగలరు



BRAOU

- సామాజిక స్తరీకరణ యొక్క లక్షణాలను, రూపాలను వివరించగలరు
- సామాజిక విభేదీకరణ అంటే ఏమిటో నిర్వచించగలరు
- సామాజిక విభేదీకరణకు గల ప్రాతిపదికలను వివరించగలరు

## 15.1 పరిచయం

మానవులందరూ జన్మత: సమానులు అని గతంలోను, సమకాలీన సమజంలో చెప్పినప్పటికీ వాస్తవికంగా మన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలించినట్లయితే సమాజంలో అనేక అసమానతలు ఉన్నట్లు తెలుస్తుంది. అసనమానత అనేది మానవ సమాజంలో స్వాభావికంగానే ఉన్నట్లు గోచరిస్తుంది. మానవ సమాజంలోని వ్యక్తులందరూ ప్రకృతిసిద్ధమైన జైవిక విభేదాల కారణంగా గానీ లేదా సామాజిక, ఆర్థిక విభేదాల కారణంగాగానీ విభేదీకరణను పొందియున్నారని చెప్పవచ్చు. కాబట్టి మానవ సమాజంలో ప్రకృతిసిద్ధమైన విభేదాలతోబాటు, సామాజిక విబేదాలు కూడా ఉన్నాయని చెప్పవచ్చు. అందువల్లనే సమాజంలో స్త్రీలు, పురుషులు; పేదవారు, ధనవంతులు; భూస్వాములు-బానిసలు మున్నగు అనేక రకాల వ్యక్తులు, వ్యక్తుల సమూహాలు ఉండడాన్ని మనం గమనించవచ్చు. అందువల్లనే అసమానత అనే ప్రాతిపదికపై ఆధారపడి సమాజం సాంఘిక, ఆర్థిక రాజకీయ మతపరమైన అనేక వర్గాలుగా విభజింపబడి ఉండడం కనిపిస్తుంది. కనుక సమాజం ఎన్నో రకాలైన సమస్తరీయ మరియు విషమస్తరీయ పొరలతో కూడి ఉంటుంది. ఈ రకమైన పొరలనే స్తరాలు అని పేర్కొనవచ్చు. ఈ స్తరాలు ఎక్కువ, తక్కువ లేదా అసమానత అనే ప్రాతిపదికపై ఆధారపడి ఏర్పడతాయి. లింగ ప్రాతిపదికపై స్త్రీలు, పురుషులు అని, ఆదాయం ప్రాతిపదికపై ధనికులు, మధ్యతరగతివారు, పేదవారు అని మతం ప్రాతిపదికపై హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు అని, కుల ప్రాతిపదికపై ఉన్నత కులస్థులు, నిమ్న కులస్థులు అని వివిధ రకాల స్తరాలకు చెందిన వారుగా పేర్కొవచ్చు. సొరోకిన్ అనే సమాజశాస్త్రవేత్త చెప్పినట్లుగా సమాజ సభ్యులందరి మధ్య వాస్తవికమైన సమానత ఉండి స్తరీకరింపబడని సమాజమనేది ఒక మిథ్య. యిటువంటి సమాజం మానవ చరిత్రలో ఎప్పుడూ లేదు. కాబట్టి సంపూర్ణ సమానతను కలిగిన సమాజమనేది ఎప్పుడూ లేదనే చెప్పవచ్చు. ప్రతి సమాజంలోను, అన్ని కాలాలలో అసమానత ప్రాతిపదికగా సమాజం స్తరీకకరింపబడి యున్నదని చెప్పవచ్చు. కనుక స్తరీకరణ చెందని సమాజమంటూ నేటి వరకూ లేదనే చెప్పవచ్చు.

ప్రకృతిసిద్ధంగా కూడా సమజంలో వ్యక్తులందరూ జైవికంగా ఒకే రీతిగా ఉండరు. అయితే అంత మాత్రాన సభ్యులందరి మధ్య విభేదాలుంటాయని కూడా భావించగూడదు. కొందరి మధ్య భేదాలుంటే, మరికొందరి మధ్య పోలికలు కూడా ఉండవచ్చు. ఈ భేదాలు, పోలికలే సాంఘిక విభేదీకరణానికి ఆధార భూతాలు. ఈ తేడాలు, పోలికలు జైవికమైనవి కావచ్చు, లేదా సాంస్కృతికమైనవి కావచ్చు. ఉదాహరణకు ఒక విధమైన జైవిక సామ్యమున్నవారంతా ఒక వర్గంగా ఏర్పడవచ్చు. లేదా తాము ఒకే వర్గంలో సభ్యులమని వారు భావించుకోవచ్చు. అట్లా భావిస్తే, సమజంలో స్త్రీలందరూ ఒక వర్గం, పురుషులందరూ మరొక వర్గం అవుతారు. స్త్రీ-పురుష విభేదాలు జైవికమైనవి. ప్రతి సమాజంలోనూ కొన్ని జైవికమైన భేదాలకు కొంత సాంఘిక ప్రాతినిధ్యం ఉంటుంది. అట్లాగే కొన్ని సాంస్కృతిక పరమైన భేదాలకు కూడా సాంఘిక ప్రతినిధ్యముంటుంది. లింగము, వయస్సు, జాతి - ఈ మూడు జైవికమైన విభేదాలు. ఈ మూడింటికి ప్రతి సమజంలోనూ కొంత ప్రతినిధ్యమున్నది. ఐశ్వర్యం, భాష, మతం, వృత్తి మొదలైనవి సాంస్కృతిక పరమైన విభేదాలు . వీటికి కూడా సాంఘిక ప్రతినిధ్యమున్నది. ఇటువంటి విభేదాలననుసరించే ప్రతి సమాజంలోనూ వర్గాలేర్పడతాయి. సాంఘిక ప్రాతినిధ్యమున్న విభేదాలననుసరించి వర్గాలను ఏర్పరచడాన్ని సామాజిక విబేదీకరణమని అంటారు. సమాజమిచ్చిన ప్రాతినిధ్యాన్ని ఈ విభేదాలు సామాజిక విభేదీకరణానికే కాక యింకా యితర పర్యవసానాలకు కూడా దారితీస్తుంటాయి. సాంఘిక సంబంధాలు, సాంఘిక పరస్పర చర్యలు ఈ విభేదాల మీద ఆధారపడి మారుతుంటాయి. ఒక్కొక్కప్పుడు ఈ విభేదాలే సామాజిక స్తరీకరణానికి కారణాలవుతుంటాయి. కాబట్టి సాంఘిక సంబంధాలను అర్థం చేసుకోవలన్నా, స్తరీకరణాన్ని తెలుసుకోవాలన్నా, సామాజిక నిర్మితిని అవగాహన చేసుకోవాలన్నా ఈ విభేదాలను, వాటివల్ల వచ్చే సాంఘిక వర్గాలను విధిగా పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది. కాబట్టి యిప్పుడు సామాజిక స్తరీకరణ దాని లక్షణాలు, అదేవిధంగా

B R A O U

సామాజిక విభేదీకరణ, దానికి గల కారణాలు ప్రాతిపదికలు తదితర విషయాలను గురించి వివరంగా చర్చిద్దాం.

## 15.2 సామాజిక స్తరీకరణ

మానవ సమాజం జైవికంగాను, ప్రకార్య పరంగాను, సాంస్కృతికంగాను పలురకాల వ్యక్తులతోను, సమూహాలతోనూ కూడి వుంటుంది. మన చుట్టూ ఉన్న సమాజాన్ని గనక క్షుణ్ణంగా పరిశీలించినట్లయితే సహజంగానే సమాజంలో వైధర్మ్యం లేదా అసమానతలు ఉన్నట్లు తెలుస్తుంది. ధనికులు, పేదవారు; భూస్వాములు, శ్రామికులు; పెట్టుబడిదారులు, కార్మికులు మున్నగు అనేక రకాల వ్యక్తులు సమాజంలో ఉంటారు. సమాజం సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మతపరమైన అనేక వర్గాలుగా విభజింపబడి ఉండడం కనిపిస్తుంది. కనుక మానవ సమజంలో ఎన్నో రకాలైన సమస్తరీయ పొరలతో కూడుకొని ఉంటుంది. ఈ పొరలతోనే స్తరాలు (stratas) అని పేర్కొనవచ్చు. లింగ ప్రాతిపదికపై స్త్రీలు, పురుషులు అని, మతం ప్రాతిపదికపై హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అని; సామాజిక ప్రాతిపదికపై అగ్రకులస్తులు, నిమ్న కులస్తులు అని వివిధ రకాల స్తరాలకు చెందిన వారుగా పేర్కొనవచ్చు. కనుక స్తరీకరణ చెందని సమాజమంటూ నేటివరకు మనకు ఎక్కడా అగుపడదు.

వివిధ రకాల స్తరాలు వివిధ అంతస్తులతో ఉంటాయని చెప్పుకోవచ్చు. స్తరాలకు ఉన్న అంతుస్తులే ఆ స్తరాలలో ఉన్నటు వంటి వివిధ రకాల వ్యక్తులకు వర్తిస్తాయి. స్తరాల అంతస్తులు ఆయా స్తరాలకు ఆపాదింపబడిన సామాజిక విలువల మీద ఆధారపడి ఉంటాయి. సామాజిక విలువలను ఆధారంగా చేసుకొని స్తరాలను కొలిచే కొలమానమే అంతస్తు. ఈ అంతస్తు అనే కొలమానాన్ని బట్టి కొన్నింటిని ఉన్నత స్తరాలుగాను, మరి కొన్నింటిని నిమ్నస్తరాలుగాను పేర్కొనడం జరగుతుంది. ఈ స్తరాల మధ్య వ్యత్యాసాలు సామాజిక విలువలలోని శ్రేణీ పరంపరల మీద ఆధారపడి ఉంటాయి. అంటే విలువలు స్తరాలను ఒక క్రమశ్రేణిలో ఉంచుతాయి. అట్లాంటి క్రమశ్రేణిలో అమర్చిన స్తరాలు పై స్థాయి నుంచి, క్రింది స్థాయికి వస్తున్న కొద్దీ ఖ్యాతి, కీర్తి, అధికారము, ధనము మొదలైనవి తగ్గుతుంటాయి. ఒక్క సామాజిక విలువల ద్వారానే కాకుండా ధనము, విద్య, శక్తి, అంతస్తు, హోదా, అధికారము మొదలైన వాటివల్ల కూడా క్రమశ్రేణి ఏర్పడుతుంది.

స్తరీకరణ అనేది ఏ విధంగా, ఏ ప్రాతిపదికపై సమాజంలో ఉద్భవించిందో అనే విషయంపై వివిధ సమాజ శాస్త్రవేత్తలు వివిధ రకాలైన అభిప్రాయాలను వెల్లడించారు. పిటిరిమ్. ఎ. సోరోకిన్ అనే సమాజ శాస్త్రవేత్త అనువంశిక లక్షణాలైన శరీరచ్ఛాయ, తెలివితేటలు, కంఠస్వరంగు, లింగభేదము మున్నగునవి వ్యక్తుల మధ్య వ్యత్యాసాలకు దారితీస్తాయని దాని ద్వారా సమాజంలో వారు వివిధ రకాలైన గౌరవ మర్యాదలు పొందుతారని, ఆ విధంగా సామాజిక స్తరీకరణ ఏర్పడుతుందని అభిప్రాయపడినాడు. థరస్టీన్ వెబ్లెన్ అనే సమాజశాస్త్రవేత్త సామాజిక విలువలు ఆపాదించిన వృత్తి తారతమ్యాలే సామాజిక స్తరీకరణకు ఆధారమని పేర్కొన్నాడు. కారల్ మార్క్స్ అనే సామాజిక శాస్త్రవేత్త సమాజంలోని ఆర్థిక వ్యవస్థను ఆధారం చేసుకొని వ్యక్తులలో ఏర్పడిన అసమానతలే స్తరీకరణకు మూలమని పేర్కొన్నాడు. మాక్స్ వెబర్ అనే సమాజశాస్త్రవేత్త ఆర్థిక అసమానతలు, శక్తి, అధికారాల వల్ల సామాజిక స్తరీకరణ ఏర్పడుతుందని పేర్కొన్నాడు. అవి- 1) ఆర్థిక పరిస్థితిని బట్టి స్తరీకరణ 2) అంతస్తును బట్టి స్తరీకరణ 3) శక్తి, అధికారాన్ని బట్టి స్తరీకరణ. అయితే పై అభిప్రాయాలను గమనించినట్లయితే, సామాజిక స్తరీకరణ అనేది ప్రధానంగా సామాజిక, ఆర్థిక వ్యత్యాసాల ఫలితంగా ఏర్పడుతుందని చెప్పవచ్చు.

ఇప్పుడు సామాజిక స్తరీకరణకు సంబంధించిన కొన్ని నిర్వచనాలను పరిశీలిద్దాం.

### 15.2.1 సామాజిక స్తరీకరణ-నిర్వచనం

సామాజిక స్తరీకరణను వివిధ సమాజ శాస్త్రవేత్తలు వివిధ రకాలుగా నిర్వచించినారు. అందులో ప్రధానమైన కొన్ని నిర్వచనాలను యిక్కడ పరిశీలిద్దాం.

1)పాస్కల్ గిస్బర్ట్ అనే సమాజశాస్త్రవేత్త ప్రకారం "సమాజం శాశ్వతమైన సమూహాలు లేదా వర్గాలుగా విభజింపబడి, ఆధిక్యత, విధేయత అనే సంబంధ బాంధవ్యాలతో ఒక దానితో మరొకటి ముడిపడి ఉండే దానిని సామాజిక

స్తరీకరణ అంటారు.

2) కుర్ట్. బి. మేయర్ (Kurt B. Mayer)అనే సమాజశాస్త్రవేత్త "ప్రధాన సామాజికాంశాలలో ఒక క్రమశ్రేణిలో అమర్చిన సాంఘిక స్థానాలను అక్రమించి అనుభవించే వారిలో ఒకరికొకరు తమకంటే ఉన్నతులుగానో, సమానులుగానే, తక్కువారుగానో భావించడం వల్ల ఏర్పడిన విభేదీకరణ వ్యవస్థే సామాజీకరణగా", నిర్వచించినాడు.

3) ముర్రే అనే సమాజశాస్త్రవేత్త "సమాజం యొక్క సమస్తరీయమైన విభజనలో ఉన్నతమైన, అధమమైన సాంఘిక అంశకాలే సామాజిక స్తరీకరణ" అని తెలిపినాడు.

పైన పేర్కొన్న నిర్వచనాలను బట్టి సామాజిక స్తరీకరణ అనేది సమజంలో చాలా సహజమైన దృగ్విషయం. సమాజం సమూహాలుగాను, వర్గాలుగాను విభజింపబడి ఆధిక్యత, విధేయత అనే సమసంబంధ బాంధవ్యాలతో కూడుకొని ఉంటుంది. వ్యక్తులలో కొందరు ఉన్నతులుగాను, సమానులుగాను, తక్కువ వారుగాను ఏర్పడిన విభేదాలను, సమాజాన్ని సమస్తరీయంగా విభజనచేసి ఉన్నతమైన, అధమమైన సాంఘిక అంశకాలుగా ఏర్పడిన విషయ పరిజ్ఞానాన్ని సామాజిక స్తరీకరణగా చెప్పవచ్చు.

దాదాపు అన్ని సమాజాలు కొద్దిగానో, గొప్పగానో స్తరీకరణంతో కూడి ఉంటాయి. నాగరక సమాజాలలోను ఆదిమవాసుల సమాజాలలోను కూడా స్తరీకరణ కనబడుతుంది. ఆధునిక, పారిశ్రామిక, నాగరకతా, సంశ్లిష్ట సమాజాలలో స్తరీకరణ అనేక రూపాలను పొంది ఉంటుంది. ఎందుకంటే ఈరకపు సమాజాల మితిమీరిన వైధర్మ్యం గల ప్రజలతో కూడుకొని ఉంటాయి. పైగా వారు శ్రమవిభజన ద్వారా ఎన్నో రకాలైన ప్రకార్యాలను నెరవేరుస్తుంటారు. అంతేకాదు, ఈ సంశ్లిష్ట సమాజాలలో ధనంలోను, ఆదాయంలోను, చదువులోను, అవకాశాలలోను గొప్ప వ్యత్యాసాలున్నాయి. అందుచేత సమాజం సంశ్లిష్టమైన కొద్దీ, స్తరీకరణ కూడా అధికమవుతుంది. శ్రమవిభజన, విశిష్టీకరణ అనే ప్రక్రియలతో సమాజము వివిధ సంవర్గాలుగా, వివిధ సమూహాలుగా విడిపోవడం వల్ల, వ్యక్తులతో ఏర్పడే తారతమ్యాలే స్తరీకరణ ప్రక్రియకు ముఖ్య కారణాలవుతున్నాయి. కాబట్టి తామతమ్యాల వల్ల వచ్చే విభేదీకరణను అంతస్తుతో జోడించి క్రమశ్రేణిలో అమరిస్తే అదే స్తరీకరణ అవుతుంది.

### 15.2.2 సామాజిక స్తరీకరణ-లక్షణాలు

B R A O U

వివిధ సమాజశాస్త్రవేత్తలు సామాజిక స్తరీకరణకు సంబంధించిన వివిధ లక్షణాలను వివరించడం జరిగింది. ఆయా లక్షణాలన్నింటిని ఒక క్రమ పద్ధతిలో ఒక చోట చేర్చినట్లయితే స్తరీకరణ లక్షణాలేమిటో మనకు అవగతమవుతాయి. కాబట్టి సామాజిక స్తరీకరణ ముఖ్య లక్షణాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చు. అవి:

**1) స్తరీకరణ సామాజికమైనది:** స్తరీకరణ సామాజిక స్వభావం కలది. అంటే యిది సమాజంలో గల అసమానతలను ప్రాతిపదికగా తీసుకొని సమాజాన్ని వివిధ స్తరాలుగా విభజిస్తుంది. సామాజిక స్తరీకరణ సామాజిక, సాంస్కృతిక ఆర్థికపరమైన వ్యత్యాసాలను గురించి చర్చిస్తుంది.

**2) స్తరీకరణ విశ్వజనీనమైనది:** స్తరీకరణ విశ్వజనీనమైనది, సర్వవ్యాపకమైనది అని చెప్పవచ్చు. అన్ని సమాజాలలో స్తరీకరణను ఏదో ఒకరూపంలో చూడవచ్చు. నాగరిక, అనాగరిక, ఆదిమ, ఆధునిక, పారిశ్రామిక సమాజాలన్నింటిలోనూ స్తరీకరణ కనబడుతుంది.

**3)స్తరీకరణ వ్యవస్థీకృత ప్రజా నిర్మితి:** స్తరీకరణ వ్యవస్థ సువిశాలమూ, సమస్తరీయమూ అయిన పొరలు, పొరలుగా ఏర్పడిన వివిధ ప్రజా సంవర్గాలతోను, ప్రజా సమూహాలతోను ఉంటుంది. స్తరీకరణం చెందిన ప్రజా నిర్మితి అనేకమైన వ్యత్యాసాలతో కూడిన పొరలతో లేదా స్తరాలతో కూడి ఉంటుంది. ప్రతి స్తరంలోనూ అన్ని వయస్సులకు చెందిన స్త్రీలు, పురుషులు వుంటారు. క్రింది నుంచి పై పొరలకు వెళ్ళే కొద్దీ పై స్తరాలతో ప్రజలు తక్కువగా ఉంటారు. ఇట్లాంటి స్తరీకరణ యించుమించు అన్ని సమూహాలలోనూ, సమాజాలలోనూ ఏదో ఒక రూపంలో ఉంటుంది.

4) విలువల నిర్మితి: స్తరీకరణ పొందిన వ్యవస్థలో ప్రతి స్తరానికి కొన్ని సామాజిక విలువలు, ప్రమాణాలు ఉంటాయి. అయితే ఒక స్తరానికి యింకొక స్తరానికి ప్రమాణాలలో, విలువలలో వ్యత్యాసాలుంటాయి. ఈ విలువల వ్యవస్థ ప్రజలను ఎక్కువ వారని, తక్కువ వారని రెండు సంవర్గాలుగా విభజిస్తుంది. పై స్తరాలలో ఉండేవారు అధికులు, క్రింది స్తరాలలో ఉండేవారు అల్పులు అనే భావముంటుంది. పైగా ఈ విలువలు, ఆచారాలను, సంప్రదాయాలలోను యిమిడి సంస్థాగతమవుతాయి. స్తరానికి, స్తరానికి మధ్య ఈ విధంగా వ్యత్యాసమేర్పడుతుంది.

5) స్తరీకరణ పర్యవసాన పరమైనది: స్తరీకరణ మూలంగా హోదా, సదుపాయాలు, విధుల నిర్మితి ఏర్పడుతుంది. పైన చెప్పిన విలువల వ్యవస్థ హోదా వ్యవస్థను కూడా ఏర్పరుస్తుంది. విలువల శ్రేణిని బట్టి హోదాలో క్రమశ్రేణి ఏర్పడుతుంది. హోదాలోను, గౌరవంలోను, సదుపాయాలలోను సమాజం విభజన చెందుతుంది. అంటే వేర్వేరు స్థాయిలలో ఉన్నవారు వేర్వేరు హోదాలను, అంతస్తులను, సదుపాయాలను పొందుతారు. ఈ హోదా అంతస్తు అనేవి పై స్తరాలలో ఉన్నవారికి ఎక్కువగా ఉండి, క్రింది స్తరాల వారికి రాను రాను తగ్గి పోతుంటాయి. హోదాలోను, గౌరవంలోను తేడాలున్నప్పుడే అవకాశాలలోను, హక్కులలోను, విధులలోను వ్యత్యాసాలు వస్తాయి. చివరకు ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాలలో కూడా మానవులలో వ్యత్యాసాలు రూపొందుతాయి.

6)శక్తి, అధికారము, నియంత్రణా వ్యవస్థ: స్తరీకరణ వ్యవస్థకు ప్రమాణాలు కూడా ఉంటాయి. ఈ ప్రమాణాల వల్లనే స్తరాలలోని వ్యక్తులు అదుపులో ఉంటారు. అంతేకాదు, శక్తి, అధికారము మొదలైనవి కూడా స్తరీకరణ చెందుతాయి. అంటే వివిధ స్తరాలకు వేర్వేరు రకాలైన శక్తి, అధికారాలు కేటాయించడం జరుగుతుంది. శక్తి, అధికారము పై స్తరం నుంచి క్రింది స్తరానికి వస్తున్న కొద్దీ తగ్గుతూ ఉంటాయి. అందువల్లనే పై స్తరంలోని వ్యక్తులు, సమూహాలు తమక్రింద ఉన్న వ్యక్తుల మీద, సమూహాల మీద అధికారాన్ని చెలాయిస్తారు. దీనినుంచి ప్రాబల్యము, విధేయత అనే ద్వంద్వ ప్రక్రియలు ఏర్పడతాయి. అధికారం ద్వారా విలువలను ఏర్పరచడం తీర్పులివ్వడం, ఆజ్ఞలను జారీ చేయడం, నిర్ణయాలను తీసుకోవడం మొదలైనవి జరపవచ్చు. శక్తి, అధికారాల వల్ల ఏర్పడే ప్రాబల్యము, విధేయతా ప్రక్రియ ద్వారానే సామాజిక వ్యవస్థలో నియంత్రణ ఏర్పడుతుంది. దీనికితోడు నెలకొల్పిన ప్రమాణాలు, పాత్రలు, పాత్రధారులు చేసే పనులను మరింతగా క్రమపరచి, అదుపులోకి తెస్తుంటాయి. అంతే గాకుండా పై స్తరాలలోని వ్యక్తులను మాత్రమే అదుపులోకి తెచ్చే పాత్రలు, కార్యాలయాలు, ప్రకార్యాలు కేటాయించడం జరుగుతుంది. దీనివల్ల కూడా క్రింద ఉన్న స్తరాలలోని సమూహము, వ్యక్తులు నియంత్రణలోకి వస్తారు.

BRAOU

7) స్తరము ఒక ఉప సంస్కృతి, ఒక ఉప సమాజము: స్తరీకరణ వ్యవస్థకున్న చివరి లక్షణమేమంటే, సమాజ స్తరీకరణంలోని ప్రతి స్తరము ఒక ఉపసంస్కృతిగాను, ఒక ఉప సమాజంగాను కనబడుతుంది. స్తరాలు ఒకదానికొకటి సబంధం లేకుండా విడిపోవడమే కాక, ఒక స్తరంలోని వ్యక్తులందరూ ఒకే రకమైన విలువలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, ప్రమాణాలు పద్ధతులు, వైఖరులు, ధర్మాలు, విధులు, అధికారాలు, అంతస్తులు మొదలైన వాటితో ఉంటారు. కాబట్టి చూసేవారికి ఒక్కొక్క స్తరము ఒక్కొక్క ఉప సంస్కృతిగాను, లేదా ఉప సమాజంగాను కనిపిస్తుంది.

పైన పేర్కొన్న ప్రధాన లక్షణాలు ప్రతి స్తరీకరణ వ్యవస్థలోను మనకు గోచరిస్తాయి. యింతవరకు మనం సామాజిక స్తరీకరణ లక్షణాలేమిటో తెలుసుకొన్నాం. యిప్పుడు సామాజిక స్తరీకరణ రూపాలను గురించి తెలుసుకొందాం.

### 15.2.3 సామాజిక స్తరీకరణ-రూపాలు

సామాజిక స్తరీకరణ ప్రధానంగా మూడు రూపాలలో ఉంటుంది. అవి: 1) కులము(Caste) 2) సామాజిక వర్గం(Social Class) 3) ఎస్టేట్(Estate). పాశ్చాత్య సమాజాల చరిత్రలో మనకు ప్రధానంగా సామాజిక వర్గం, ఎస్టేట్ వ్యవస్థ అనేవి కనిపిస్తాయి. అయితే భారతీయ సమజంలో ప్రధానంగా కులవ్యవస్థ వర్గవ్యవస్థ అనేవి కనిపిస్తాయి. ప్రస్తుత ఆధునిక కాలంలో దాదాపు అన్ని సామాజాలలోను కనిపించే స్తరీకరణ రూపం వర్గవ్యవస్థ, కులం మరియు ఎస్టేట్ వ్యవస్థ అనేవి ఆరోపిత అంతస్తు ఆధారంగా ఏర్పడేవి కాగా, వర్గ వ్యవస్థ అనేది సాధించిన అంతస్తు ప్రాతిపదికగా ఏర్పడుతుంది.

ఇప్పుడు స్తరీకరణ ప్రధాన రూపాలయిన కుల వ్యవస్థ, వర్గ వ్యవస్థ, ఎస్టేట్ వ్యవస్థలను గురించి చర్చిద్దాం.

## 15.2.3.1 కుల వ్యవస్థ

భారతీయ సమాజం దృష్ట్యా, సామాజిక స్తరీకరణ రూపాలలో కుల వ్యవస్థ అనేది ప్రధానమైనది. భారతీయ సమాజం యొక్క ప్రత్యేక లక్షణాలలో కుల వ్యవస్థ ప్రధానమైనది. భారతీయ సమాజంలో కుల వ్యవస్థకు ఒక ప్రత్యేక స్థానం వుంది. కులం అనే పదం స్పానిష్ భాషలోని "కాస్టా" (casta)అనే పదం నుంచి ఉద్భవించినదని తెలుస్తున్నది. కాస్టా అనగా జాతి అని లేదా సంక్లిష్టమైన వారసత్వపు లక్షణాలని చెప్పవచ్చు. ఈ కులం అనే పదాన్ని పోర్చుగీసువారు భారత దేశంలోని ప్రజా సమూహాలకు ఆపాదించడం జరగింది. కాబట్టి ఇంగ్లీషు పదమైన "caste" అనేది స్పానిష్ భాషలోని "casta" అనే పదానికి అనువాదమని చెప్పవచ్చు. భాతీయ సమాజంలో తప్ప మరి ఏ యితర సమాజాలలోను యింత జటిలమైన కులవ్యవస్థ మనకు కనిపించదు. ప్రతి హిందువుకు కులం పుట్టుకతోనే ఏర్పడుతుంది. వ్యక్తి జీవిత పర్యంతం కులమనేది ఉంటూ ఒక కులం నుంచి వేరొక కులానికి మారటానికి వీలుపడని వ్యవస్థ. కులం ప్రాతిపదికపై ప్రతి వ్యక్తికి ఒక రకమైన గౌరవం, హోదా, విలువ మున్నగునవి ఆపాదించబడతాయి.

కులం అనే భావనను సమాజ శాస్త్రవేత్తలు వివిధ రకాలుగా నిర్వచించడం జరిగింది. ప్రముఖ భారతీయ సమాజశాస్త్రవేత్త ఎమ్. ఎన్. శ్రీనివాస్ " వారసత్వమైన, అంతర్ వివాహ సమూహం, సాంప్రదాయ సిద్ధమైన వృత్తి సంబంధాలు కలిగి ఉండి స్థానిక సముదాయ క్రమశ్రేణిలో ఒక ప్రత్యేకమైన అంతస్తు కలిగి ఉండే అంశాన్ని కులం"గా నిర్వచించినాడు.

కేట్కర్ అనే సమాజశాస్త్రవేత్త ప్రకారం "కులం అనగా ప్రధానంగా రెండు లక్షణాలను కలిగివున్న సామాజిక సమూహం. ఆ రెండు లక్షణాలు: 1)కుల సభ్యత్వం, ఆ కులంలో పుట్టిన లేదా పుట్టబోయే వ్యక్తులకు మాత్రమే వర్తిస్తుంది. 2) ఒక కులంలోని సభ్యులు వేరొక కులంలోని సభ్యులతో పొరపాటునైనా వివాహం చేసుకోకూడదనే సామాజిక శాసనం".

ప్రముఖ సమాజ శాస్త్రవేత్త సి.హెచ్. కూలే " ఎప్పుడైతే ఒక తరగతి వ్యవస్థ వారసత్వపు విధానంపై పూర్తిగా ఆధారపడుతుందో దానిని కులం అనవచ్చునని" తెలిపినాడు.

డి.ఎన్. మజుందార్, టి.ఎన్.మదన్ అనే సామాజిక మానవ శాస్త్రవేత్తల ప్రకారం "కుల వ్యవస్థ అనేది ఒక పరిధీకృత వ్యవస్థ".

రిస్లే అనే సమాజ శాస్త్రవేత్త ప్రకారం కొన్ని సమూహాలు లేదా కుటుంబాలు కలిసి ఒకే ఇంటి పేరుతోను, ఒకే విధమైన వంశానుక్రమంతోను ఉండి, వంశపారంపర్యంగా ఒకే విధమైన పేరుతో వ్యవహృతమవుతూ, అందరూ సాధర్మ్యంతో ఉన్నట్లయితే దానికి కులం అంటారు.

ఒకసారి వ్యక్తి ఒక కుంలో పుట్టి తద్వారా దానిలో సభ్యుడైతే అతడు చనిపోయేవరకు దానిలోనే సభ్యుడిగా ఉంటాడని హట్టన్ అనే సమాజశాస్త్రవేత్త చెప్పాడు. ధనంగాని, పేదరికంగాని, విజయం గాని, ఓటమిగాని అతని కులాన్ని మార్చలేవు. కాని వ్యక్తి తన కుల ప్రమాణాలను, ప్రవర్తన పద్ధతులను అతిక్రమించి ప్రవర్తిస్తే మాత్రం అతనిని తాత్కాలికంగాని, శాశ్వతంగాగాని ఆ కులం నుంచి వెలివేస్తారు.

జి.ఎస్. ఘుర్యే (Ghurye)అనే ప్రసిద్ధ భారతీయ సమాజశాస్త్రవేత్త కుల వ్యవస్థపై విశేషమైన అధ్యయనం చేసి "భారతదేశంలో కులము, వర్గము" (Caste and Class in India)అనే తన గ్రంథంలో కులం యొక్క ప్రధాన లక్షణాలను వివరించినాడు. అవి:

**1) సమాజాన్ని విభిన్న అంతస్తు సమూహాలుగా విభజించారు:** సమాజాన్ని కుల వ్యవస్థ విభిన్న అంతస్తు సమూహాలుగా విభజిస్తుంది. కుల వ్యవస్థలో వ్యక్తుల సభ్యత్వం అంతస్తు ఆరోపించిందేగాని, సముపార్జించింది కాదు. కాలాన్ని

BRAOU

బట్టి సాంప్రదాయికమైన వృత్తులు నిర్ణయింపబడతాయి. ఆయా వ్యక్తులకు జన్మసిద్ధంగా కుల అంతస్తు ఆపాదితమవుతుంది. ఈ అంతస్తులను బట్టి విభిన్న కుల సమూహాలు ఏర్పడతాయి. వివిధ కులాల మధ్య సాంస్కృతిక వ్యత్యాసాలు కూడా ఉంటాయి. దేవతారాధనలోను, ఆచార వ్యవహారాలలోను, క్రతువుల లోను భేదాలు మనకు గోచరిస్తాయి. కుల వ్యవస్థ హిందూమత వర్ణాశ్రమ ధర్మాలపై ఆధారపడి ఉంటూ వ్యక్తులకు కొన్ని ధర్మాలను, విధులను కట్టుబాట్లను నిర్దేశిస్తున్నది. హిందూ మతం ప్రతి వ్యక్తిని తన కులం యొక్క విధులను, ధర్మాలను నిర్వర్తించాలని బోధిస్తుంది.

2) క్రమానుగత శ్రేణి: కుల వ్యవస్థలో ఉన్నతం-అధమం అనే ప్రాతిపదికపై కులాలలను క్రమశ్రేణిలో వర్గీకరించడం జరిగింది. క్రమానుగత శ్రేణిలో ఒక్కొక్క స్తరంలో ఒక్కొక్క కులాన్ని వాటి అంతస్తును బట్టి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రమశ్రేణి విధానం అంతస్తుతోను, చాతుర్వర్ణ వ్యవస్థ వెలుపల ఉన్న కులస్తులు నిమ్న అంతస్తుతోను ఉన్నారు. కాని మధ్య కులాల అంతస్తు అంత స్పష్టంగా గోచరించదు.

3)కులం అతర్వివాహ సమూహం: కులం అంతర్వివాహ సమూహం. కుల వ్యవస్థలో ఏ కులం వారు ఆ కుల సభ్యులనే వివాహమాడవలెననే నిర్బంధం ఉంది. అదే విధంగా కులాలు ఉపకులాలుగా విభజింపబడ్డాయి. ఏ ఉపకులం వారు,  ఆ ఉపకులంలోని వారినే వివాహమాడాలని ఆంక్షలు ఉన్నాయి. కులాంతర వివాహాలు నిషిద్ధం.

4) శాశ్వతంగా నిర్ణయించబడిన కుల వృత్తులు: ప్రతి కులానికి వంశపారంపర్యంగా కుల వృత్తులనేవి ఉంటాయి. ప్రతి కులానికి తప్పకుండా ఒక కుల వృత్తి ఉంటుంది. కుల వ్యవస్థలో వ్యక్తులు తమ తమ కుల వృత్తులను మార్చుకోవడానికి వీలుండదు. అట్లా ప్రయత్నించినా సాంప్రదాయం ఒప్పుకోదు. అయితే ఆయా కులవృత్తులకు ఉన్న ప్రాధాన్యతను బట్టి వృత్తులను పరిశుద్ధమైన వృత్తులని, అపరిశుద్ధమైన వృత్తులని రెండు రకాలుగా విభజించడం జరిగింది. ఉన్నత కులస్తుల వృత్తులను పరిశుద్ధమైన వృత్తులని, నిమ్న కులస్తుల వృత్తులను అపరిశుద్ధమైన వృత్తులని భావించడం జరిగేది. అయితే వృత్తి విశిష్టీకరణం వల్ల సమాజంలో అన్ని కులాలవారి అవసరాలు నెరవేరేవి.

5) ఆహార పానీయాలకు సంబంధించిన కట్టుబాట్లు: వివిధ కులల ప్రజలకు వారి ఆహారపు అలవాట్లను గురించి కొన్ని నియమాలుంటాయి. బ్రాహ్మణులు యితర కులాల వారి నుంచి ఆహారాన్ని స్వీకరించకూడదు. బ్రాహ్మణుల నుంచి ఆహారాన్ని తక్కువ కులస్తులందరూ స్వీకరిస్తారు. అందరికంటే నిమ్నకులస్తుల నుంచి ఏ కులస్తులు ఆహార పానీయాలు స్వీకరించరు. పూర్వకాలంలో ఈ నియమ నిబంధనలు ఎక్కువగా ఆచరణలో ఉండేవి. అయితే ఇప్పుడు ఇందులో చాలా మార్పులు వచ్చినాయి.

6) విధి నిషేధాలు: భారతీయ సమాజంలో కుల వ్యవస్థకు సంబంధించి కొన్ని విధి నిషేధాలున్నాయి. వీటిని బట్టి కొన్ని కులాలకు ప్రత్యేక అర్హతలు, మరికొన్ని కులాలకు అనర్హతలు కనిపిస్తుంటాయి. దక్షిణాది రాష్ట్రాలలో కులాలను బట్టి వీధులు ఏర్పడ్డాయి. అస్పృశ్యులు ఉన్నత కులస్తులకు దగ్గరగాను, గ్రామం మధ్యలోను యిండ్లు కట్టకోరాదనే నియమ నిబంధనలు పూర్వం ఉండేవి. అందువల్లనే అస్పృశ్యులు గ్రామానికి చివర నివసించడం జరిగేది. గ్రామాలలో ఉన్నత కులస్తుల బావుల నుంచి నిమ్న కులస్తులు నీరు తోడుకోరాదని, ఉన్నత కులలవారి వీధులలో నడవరాదని పూర్వం నిషేధాలుండేవి. అదే విధంగా యిల్లు కట్టుకోవడానికి సంబంధించిన విషయాలలోను, వస్త్రధారణ విషయంలోను, సాంఘిక, ఆర్థిక జీవన విధానం విషయంలోను ఎన్నో ఆంక్షలు ఉండేవి. అయితే పైన పేర్కొన్న నియమనిబంధనలు, అర్హతలు, అనర్హతలు చాలా వరకు తొలగిపోయినాయి. అయితే గ్రామాలలో యింకా ఈ విధి నిషేధాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అమలులో ఉన్నాయి.

ఇంతవరకు మనం కుల వ్యవస్థ యొక్క లక్షణాలను గురించి వివరంగా తెలుసుకొన్నాం. అయితే అనేక కారణాల వల్ల సాంప్రదాయిక కుల వ్యవస్థలో చాలా మార్పులు సంభవించినాయి. ముఖ్యంగా ఈనాడు చాలా మంది వారి వారి కుల వృత్తులను పాటించడం లేదు. ఎవరికి అనువుగా ఉన్న వృత్తిని వారు చేపడుతున్నారు. ఆహారపానీయాలకు సంబంధించిన నిషేధాలను కూడా ఈనాడు కుల వ్యవస్థలో సభ్యులు పాటించడం లేదు.

అంతేకాకుండా వివిధ కులాలకు చెందిన సభ్యులు కులాంతర వివాహాలు జరుపుకొంటున్నారు. రాను రాను మతం తన ప్రాబల్యాన్ని, ప్రభావాన్ని కులం మీద చూపెట్టలేకపోతోంది. ఈనాడు అన్ని కులాల వారు కలిపి మెలసి తిరుగుతున్నారు. కలిసి చదువుతున్నారు. కలిసి జీవిస్తున్నారు. కలిసి కట్టుగా ఉద్యోగాలు చేస్తున్నారు. సూక్ష్మంగా చెప్పవలెనంటే స్వాతంత్ర్యానంతరం కుల వ్యవస్థలో చాలా మార్పులు సంభవించాయి. పారిశ్రామికీకరణ, నగరీకరణ కులవ్యవస్థలో ఎన్నెన్నో మార్పులకు కారణాలైనాయి. వీటివల్ల ఉమ్మడి కుటుంబం యొక్క నిర్మితి, రూపం మారిపోయి, తద్వారా కులవృత్తి ప్రమాణం వీగిపోయింది. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమై, కుల సభ్యులు కుల వృత్తిని విడనాడటంతో ఆర్థిక పరంగా వృత్తి పరంగా కుల వ్యవస్థ బలహీనపడింది. అయితే ఆధునిక సమాజంలో కులం అనేది రాజకీయంగా వ్యవస్థీకృతమై, ఒక రాజకీయ శక్తిగా బలపడుతున్నది. అయితే యిక్కడ చెప్పవలసిన విషయమేమిటంటే పారిశ్రామికీకరణ, నగరీకరణ, ఆధునీకరణ శాస్త్రసాంకేతికాభివృద్ధి, రవాణా సౌకర్యాల అభివృద్ధి, వలస, ఆధునిక విద్య సంఘ సంస్కరణలు, ప్రభుత్వ శాసనాలు తదితర కారణాల ఫలితంగా కుల వ్యవస్థలో చాలా మార్పులు ఏర్పడినాయని చెప్పవచ్చు. అయినప్పటికీ ఇంకా కొన్ని చోట్ల కులఘర్షణలు, దళితుల విషయంలో వివక్ష అంటరానితనం కొనసాగుతూనే ఉన్నాయి.

## 15.2.3.2 వర్గ వ్యవస్థ

ప్రతి సమాజంలోను ప్రజలు ఆర్థిక ప్రాతిపదికన విభిన్న వర్గాలుగా విభజన చెంది ఉంటారు. ఏ సమాజంగాని, సముదాయం గాని వర్గ విభేదాలు లేకుండా ఉండదు. సంస్థాగత అంతస్తుతో విడిపడిన కొంతమంది వ్యక్తుల, కుటుంబాల సమస్తరీయ సంవర్గాన్నే సామాజిక వర్గమని అనవచ్చు. ప్రతి వర్గానికి అంతస్తు క్రమశ్రేణిలో ఒక స్థానమివ్వడం జరగుతుంది. అంటే ఒక వర్గం వారు అధికులని, మరొక వర్గం వారు అల్పులలని భావిస్తారు. వర్గవ్యవస్థ స్వేచ్ఛాపరమైన వ్యవస్థ. వివిధ వర్గాలు విలువలలోను, అంతస్తులలోను, లక్ష్యాలలోను, సంస్కృతిలోను, ప్రవర్తన లోను విభిన్నంగా ఉంటాయి. ఏ వర్గానికి చెందిన వ్యక్తి అయినా అటుపై వర్గంలోకి వెళ్ళవచ్చు. లేదా కొన్ని పరిస్థితుల ప్రభావం వల్ల క్రింది వర్గంలోకి రావచ్చు. అందుచేతనే వర్గ వ్యవస్థలో స్వేచ్ఛ అధికంగా ఉంటుంది. వర్గ వ్యవస్థ అనేది ఒక సామాజిక అంతస్తును కలిగిన సమూహము. ప్రతి వర్గంలో ఉన్నవారు వారి వర్గం వారంటే అభిమానాన్ని కలిగి ఉంటారు. ప్రతి వర్గం వారికి కొన్ని ప్రత్యేకమైన అధికారాలు, ప్రతిష్ట, సదుపాయాలు ఉండడం జరుగుతుంది.

అయితే, వర్గం అనే పదాన్ని వివిధ సమాజశాస్త్రవేత్తలు వివిధ రకాలుగా నిర్వచించినారు. వాటిలో ప్రధానమైనవి: 1) ఆర్. ఎమ్. మెకైవర్ అనే సమాజశాస్త్రవేత్త ప్రకారం " ఒక సమూహంలో కొంత భాగం సాంఘిక అంతస్తును కలిగి తక్కిన సముదాయానికి దూరంగా ఉండేది సామాజిక వర్గం". 2)ఆగ్‌బర్న్, నిమ్‌కాఫ్ అనే సమాజశాస్త్రవేత్త ప్రకారం " ఒక నిర్దిష్ట సమాజంలో ఒకే రకమైన సామాజిక అంతస్తును కలిగి వున్న వ్యక్తుల సంఘాన్ని సామాజిక వర్గం"గా నిర్వచించవచ్చు.

పైన పేర్కొన్న నిర్వచనాలను బట్టి సమజంలో కొంతమంది వ్యక్తుల సముదాయం ఒక విధమైన సాంఘిక అతస్తును కలిగి ఉంటూ మిగిలిన సముదాయానికి దూరంగా ఉండేదానిని సామాజిక వర్గం అని చెప్పవచ్చు.

సామాజిక వర్గానికి కొన్ని ప్రత్యేక లక్షణాలుంటాయి. వాటిని ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

1) సామాజిక గతిశీలత ఏర్పాటు: కొన్ని సమాజాలలో వ్యక్తులు పుట్టుకతోనే ఒక వర్గానికి చెంది దానిలో జీవితం గడుపుతారు. అంటే సమాజంలో వర్గమనేది తల్లిదండ్రుల ద్వారా పుట్టుకతో సంక్రమించేది. అయితే ఈ వర్గ వ్యవస్థ స్వేచ్ఛాయుతమైనది. ఒక వర్గం నుంచి మరియొక వర్గంలోకి ధనం ద్వారా గానీ, వృత్తి ద్వారా గాని, ఆదాయం తదితరమైన వాటి ద్వారాగాని మారటానికి అవకాశం ఉంటుంది. తక్కువ అంతస్తు గల వర్గంలో నుంచి ఉన్నత అంతస్తుగల వర్గంలోకి, ఉన్నత అంతస్తుగల వర్గం నుంచి తక్కువ అంతస్తు అంతస్తుల వర్గంలోకి వ్యక్తి తన ప్రతిభ, తెలివి తేటలు, అవకాశం, శక్తి సామర్థ్యాలు పొందడం ద్వారా గాని లేదా వాటిని కోల్పోవడం ద్వారా గాని ఎప్పటికప్పుడు మారడానికి అవకాశాలు ఉంటాయి. కనుక వర్గ వ్యవస్థలో గతిశీలతకు ఏర్పటు, అవకాశం ఎక్కువగా

ఉంటుంది. కాబట్టి సామాజిక గతిశీలత అనేది వర్గ వ్యవస్థ యొక్క ప్రధాన లక్షణమని చెప్పవచ్చు.

2) బహిర్వివాహము: వర్గవ్యవస్థలో అంతర్వివాహంతో బాటు, బహిర్వివాహం కూడా చేసుకొనడానికి అవకాశముంటుంది. వర్గ వ్యవస్థలో ఒక వర్గానికి చెందిన పురుషుడుగాని లేదా స్త్రీగాని వేరొక వర్గానికి చెందిన స్త్రీని గానీ లేదా పురుషున్నిగాని వివాహం చేసునవచ్చు. కాబట్టి వర్గ వ్యవస్థలో అంతర్వివాహంతోబాటు బహిర్వివాహాలు చేసుకోవడానికి హెచ్చు అవకాశముంది.

3) అంతస్తు, హోదాల నిర్ణయ ప్రమాణాలు: సామాజిక వర్గాలకు వివిధ రకాల అంతస్తులు, హోదాలు యివ్వడం జరుగుతంది. యివి ప్రధానంగా ఆర్థిక ప్రమాణాల ద్వారా యివ్వడం జరుగుతుంది. అయితే ఏ వర్గానికి ఎంతో హోదా, ఎంత అంతస్తు యివ్వవలెనో నిర్ణయించే ప్రమాణాలు ఎన్నెన్నో ఉన్నాయి. వాటిని గురించి ఈ క్రింద వివరించడం జరిగింది.

4) సామాజిక, ఆర్థిక ప్రమాణాలు: ప్రధానంగా సామాజిక, ఆర్థిక ప్రమాణాలే వర్గాల అంతస్తు, హోదాలను నిర్ణయిస్తాయి. వ్యక్తి యొక్క సొంత ఆస్తి, సొంత వృత్తి, జీవన స్థితిగతులు కలిసి సామాజిక, ఆర్థిక ప్రమాణాలుగా ఏర్పడి వర్గాల యొక్క అంతస్తు హోదాలను నిర్ణయిస్తాయి.

5) సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ప్రమాణాలు: సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ప్రమాణాలు అనేవి విద్య, ప్రజ్ఞ, సంస్కృతి, సంస్కారం, రాజకీయ పార్టీలలో సభ్యత్వం, ఆచార వ్యవహారాలు, అలవాట్లు మొదలైన రూపాలలో ప్రతిబింబించి వర్గం యొక్క అంతస్తు, హోదాను నిర్ణయిస్తాయి.

6) కుటుంబ గౌరవం, బంధుత్వ సంబంధాలు: వర్గం యొక్క అంతస్తు, కుంటుంబ గౌరవం, కుటుంబం యొక్క పేరు, ప్రఖ్యాతులు, బంధుత్వ సంబంధాలపై ఆధారపడి ఉంటుంది. అంటే మంచి గౌరవప్రమైన కుటుంబంతోగాని, మంచి పేరు ప్రఖ్యాతులు గల వంశంలో గాని, జన్మించినట్లయితే లేదా పేరు ప్రఖ్యాతులు గల బంధుజనం ఉన్నట్లయితే ఆ వ్యక్తి ఉన్నత వర్గానికి చెందిన వాడవుతాడు.

7) సామాజిక కార్యకలాపాలు: వ్యక్తి యొక్క అంతస్తు లేదా వర్గం, ఆ వ్యక్తి సమాజంలో చేసే పనులను బట్టి, అతని స్నేహితులను బట్టి, అతడు సభ్యత్వం పొందే సంఘాలు, క్లబ్బును బట్టి, అతడు చేసే సాంఘిక కార్యక్రమాలను బట్టి నిర్ణయింపబడుతుంది.

BRAOU

8) జీవన సరళులు, జీవితావకాశాలు: వ్యక్తి యొక్క జీవన సరళులు, జీవితావకాశాలు ఆ వ్యక్తికి సభ్యత్వం గల వర్గం నిర్ణయిస్తుంది. వర్గ సభ్యత్వాన్ని బట్టి వ్యక్తుల జీవన సరళి ఏర్పడుతుంది. ఉన్నత వర్గానికి చెందిన వ్యక్తుల జీవన సరళి ఉన్నతంగాను, అన్ని వసతులతోను ఉంటుంది. నిమ్నవర్గానికి చెందిన వ్యక్తుల జీవన సరళి సామాన్యంగా ఉంటుంది.

9) జాతి, ప్రాంతీయతలు: సామాజిక వర్గ అంతస్తు, జాతిని, ప్రాంతీయతను బట్టి కూడా నిర్ణయింపబడుతుంది. ఉదాహరణకు అమెరికా దేశంలోని తెల్లవారందరూ ఒక వర్గంగాను, నీగ్రోలు ఒక వర్గంగాను, అమెరికన్ ఇండియన్లు మరొక వర్గంగాను ఇటలీకి చెందినవారు వేరొక వర్గానికి చెందినవారుగాను పరిగణింపబడుతున్నారు. అందరిలోను తెల్లవారు ఉన్నత వర్గానికి చెంది మిగిలిన వారు యితర వర్గాలకు చెందిన వారుగా భావించడం జరుగుతుంది. కాబట్టి జాతి ప్రాంతీయతలు కూడా వర్గానికి, అంతస్తుకు ప్రమాణాలుగా నిర్ణయింపబడుతున్నాయని చెప్పవచ్చు.

ఈ విధంగా వర్గవ్యవస్థ పైన పేర్కొన్న లక్షణాలను కలిగి వుంటుంది. యిప్పుడు సామాజిక వర్గానికి సంబంధించిన వర్గీకరణను పరిశీలిద్దాం.

సామాజిక వర్గాలను వివిధ సమాజ శాస్త్రవేత్తలు మూడు రకాలుగా విభజించారు. అవి: 1)ఉన్నతవర్గం 2) మధ్యవర్గం 3) దిగువ వర్గం. కారల్ మార్క్స్ అనే సామాజిక శాస్త్రవేత్త సామాజిక వర్గాలను రెండు రకాలుగా వర్గీకరించినాడు. అవి: ఎ) బూర్జువాలు (పెట్టుబడిదారులు) బి) ప్రోలిటేరియన్లు (శ్రామికులు). వార్నర్ అనే సామాజిక

శాస్త్రవేత్త సామాజిక వర్గాలను ఆరు రకాలుగా వర్గీకరించినాడు. అవి: ఎ) ఉన్నతోన్నత వర్గం బి) దిగువ ఉన్నత వర్గం సి) ఉన్నత మధ్య వర్గం డి) దిగువ మధ్య వర్గం ఇ) ఉన్నత దిగువ వర్గం ఎఫ్) దిగువ దిగువ వర్గం. ఈ విధంగా సామాజిక వర్గాన్ని రకరకాలుగా వర్గీకరించడం జరిగింది.

### 15.2.3.3 సంస్థాన వ్యవస్థ

సంస్థాన వ్యవస్థ ప్రధానంగా యూరోపు దేశాలలో కనబడుతుంది. రోమన్ సామ్రాజ్య పతనానంతరం సంస్థాన వ్యవస్థ అనబడే ఒక విభిన్న వ్యవస్థ ఏర్పడింది. రోమ్ సమాజం యొక్క కొన్ని ముఖ్యాంశాలైన పట్టణ సంస్కృతి, పట్టణ ప్రాతిపదిక గల వ్యాపారం, రవాణా అదృశ్యమైపోయి, భూమి ప్రధానంగా కలిగియుండడంపై ఆధారపడిన ఒక సరికొత్త గ్రామీణ సామాజిక వ్యవస్థ నెలకొన్నది. సంస్థాన వ్యవస్థ యొక్క ప్రధానాంశాలు 1) సమాజానికి వ్యవసాయం మూలాధారం 2) చట్టబద్ధంగా నిర్దేశించిన స్థాయి, ఆస్తి, రాజకీయ హక్కులు, బాధ్యతలు 3) వారసత్వపు సభ్యత్వం హక్కులు.

మధ్యయుగపు ఐరోపా భూస్వామ్య సమాజాలు-సంస్థాన వ్యవస్థ మూలంగా అత్యధికంగా అభివృద్ధి సాధించాయి. సంస్థాన వ్యవస్థలో మూడు సంస్థానాలున్నాయి. అవి: ఎ) ఉన్నత వర్గం బి) మతాధికారులు 3) గ్రామీణ శ్రామికులు. ప్రతి సంస్థానానికి కొన్ని విశేష హక్కులు, అధికారాలు, నదుపాయాలుంటాయి. ప్రతి సంస్థానానికి ఒక ఉప సంస్కృతి ఉంటుంది. సమాజంలో ఉన్నత వర్గం వారు అత్యున్నత స్థాయి అంతస్తు అనుభవిస్తుండేవారు. ఉన్నత వర్గానికి చెందిన ప్రతి ఒక్కరికి విస్తృతంగా భూమి ఉండేది. మతాధికారులకు కూడా చాలా భూమి ఉండేది. వారు మతపరమైన కార్యకలాపాలు నిర్వహిస్తుండేవారు. సమాజంలో దాదాపు అందరిపై మతాధికారులకు ఆజమాయిషీ ఉండేది. గ్రామీణ శ్రామికులు వ్యవసాయం చేయడం, వ్యవసాయోత్పత్తులు అందరికీ సరిపోయే విధంగా భూమిని సాగుచేయడం జరిగేది. అంటే ఉన్నత వర్గానికి, మతాధికారులకు, గ్రామీణ శ్రామికులందరికీ కావలసిన ధాన్యాన్ని పండించి, వినిమయం చేసే బాధ్యత గ్రామీణ శ్రామికులది. వీరికి భూమిపై చట్టబద్ధమైన అజమాయిషీ ఉండేది.

సంస్థాన వ్యవస్థ అనేది కొన్ని ఐరోపా దేశాలలో మరొక విధంగా ఉండేది. ఉదాహరణకు స్వీడన్‌లో సంస్థాన వ్యవస్థలో నాలుగు సంస్థానాలుండేవి. అవి: ఎ)ధనిక వర్గము బి) మతాధికారులు సి) నగర పౌరులు డి) గ్రామీణులు. అదే విధంగా పోలెండ్‌లో రెండు సంస్థానాలు మాత్రమే ఉండేవి. అవి: ఎ) స్లైచ్చా(szlatcha) బి) మతాధికారులు.

ఈ విధంగా సంస్థాన వ్యవస్థను సామాజిక స్తరీకరణ యొక్క ఒక రూపంగా చెప్పవచ్చు.

## 15.3 సామాజిక విభేదీకరణ-అర్థం, కారణాలు

ఒక సమాజంలో వ్యక్తులు, సమూహాలను సామాజిక గుణ విశేషాలను బట్టి వర్గాలుగా విభజించే ప్రక్రియను సామాజిక విభేదీకరణ అని చెప్పవచ్చు. సమాజంలో వ్యక్తులందరూ ఒకేరీతిగా ఉండరు. అంతమాత్రాన సభ్యులందరి మధ్య విభేదాలుంటాయని కూడా భావించగూడదు. కొందరి మధ్య విభేదాలుంటే, మరికొందరి మధ్య పోలికలుంటాయి. ఈ భేదాలు, పోలికలే సామాజిక విభేదీకరణానికి అధార భూతాలు.ఈ తేడాలు, పోలికలు జైవికమైనవి కావచ్చు, లేదా సంస్కృతికమైనవి కావచ్చు. ఉదాహరణకు ఒక విధమైన జైవిక సామ్యం ఉన్నవారంతా ఒక వర్గంగా ఏర్పడవచ్చు. లేదా తాము ఒకే వర్గంలో సభ్యులన్నని వారు భావించుకోవచ్చు. అట్లా భావిస్తే సమాజంలో స్త్రీలందరూ ఒక వర్గం, పురుషులందరూ మరొక వర్గం అవుతారు. స్త్రీ, పురుష విభేదాలకు కొంత సాంఘిక ప్రాతినిధ్యం ఉంటుంది. అట్లాగే కొన్ని సాంస్కృతికమైన భేదాలకు కూడా సాంఘిక ప్రతినిధ్యమున్నది. లింగము, వయస్సు, జాతి ఈ మూడు జైవికమైన విభేదాలు. ఈ మూడింటికి ప్రతి సమాజంలోను కొంత ప్రతినిధ్యమున్నది. ధనము, భాష, మతము, వృత్తి మొదలైనవి సాంస్కృతిక విభేదాలు. ఇటువంటి విభేదాలననుసరించే ప్రతి సమాజంలోను వర్గాలేర్పడతాయి. సాంఘిక ప్రతినిధ్యమున్న విభేదాలననుసరించి వర్గాలను ఏర్పరచడాన్ని సాంఘిక విభేదీకరణమని అంటారు. వ్యక్తులకు, వర్గాలకు సాంఘిక స్థానాలను నిర్ణయించడంలో సామాజిక విభేదీకరణం తోడ్పడుతుంది. వ్యక్తుల, వర్గాలు, తమకు సంక్రమించిన సాంఘిక స్థానాన్ని అనుసరించి విహితమైన పాత్రలను నిర్వహిస్తూ వుంటారు.

తద్వారా సమాజమే ఒక సమగ్రమైన, పరిపూర్ణమైన వ్యవస్థగా వ్యవహరించగలుగుతుంది.

ఆదిమ సమాజాలలో, సామాన్య సమాజాలలో విభేదీకరణము అంతగా సంశ్లిష్టతను పొందలేదు. అయినప్పటికీ ఆ సమాజాలలో వయస్సముహాలు, లింగ విభాగాలు, వృత్తి విభాగాలు, అధికార వ్యత్యాసాలు మొదలైన సంవర్గాలు ఉంటూ ఉండేవి. అంటే కొన్ని రంగాల వరకే యిది పరిమితమై ఉండేది. కాని ఆధునిక సంశ్లిష్ట సమాజాలలో విభేదీకరణ అన్ని రంగాలలోను హద్దు, పరిమితి లేకుండా వ్యాపించి పోతున్నది. దీనికి ముఖ్యకారణం అపారంగా పెరిగిపోతున్న శ్రమవిభజన, శ్రమలలో ఉన్న ప్రత్యేకతల ఆవశ్యకతల ద్వారా వృత్తి విభజన, సాంస్కృతిక, నరవర్గ విభేదాలు, ధనంలోను, రాబడిలోను వ్యత్యాసాలు, ప్రజలలో వ్యత్యాసాలు, సామర్థ్యాలలో తారతమ్యాలు మొదలైనవి విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటన్నిటివల్ల సమాజ వ్యవస్థాపన భారం ఎక్కువయిపోయి చివరకు వ్యవస్థాపన కూడా పెరిగిపోయి, విభేదీకరణం పొందుతుంది. అయితే ఇక్కడ మనం విభేదీకరణకు దారితీసే ముఖ్య కారణాలేమిటో తెలుసుకోవడం చాలా అవసరం. కాబట్టి సామాజిక విభేదీకరణకు దారితీసే కారణాలను క్లుప్తంగా ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1) మానవులలో గల విస్తృత విభిన్నతలు, వైవిధ్యాలు: మానవ సమాజంలోని సభ్యులలో కొన్ని అంశాలలో తప్ప మిగతావన్నింటింటోను విస్తృత విభిన్నతలు, వైవిధ్యతలు కనిపిస్తాయి. సామాజిక వారసత్వంగా సంక్రమించే సంస్కృతి తదితర అంశాలలో తప్ప మిగతా వాటిన్నింటిలో వ్యత్యాసాలే కాని పోలికలు కనిపించవు. మొట్టమొదట జైవిక వైధర్మ్యము సంప్రాప్తమవుతుంది. ఆ తరువాత శారీరక సౌష్టవంలోను, ఆరోగ్యంలోను, శక్తి సామర్థ్యాలలోను, ప్రజ్ఞాపాటవాలలోను, ధనంలోను, ఆర్థిక స్థితిలోను మానవులలో వ్యత్యాసాలు శారీరకంగా బలహీనంగా ఉన్న వ్యక్తి చేయలేడు. అదే విధంగా మేధాశక్తి అవసరమైన పనులను ప్రజ్ఞాపాటవాలు లేని వ్యక్తి చేయలేడు. అందుచేత అన్నింటిలోను మానవులలో వ్యత్యాసాలు కనబడతాయి. అదే విధంగా లింగాన్ని బట్టి మానవులు రెండు సంవర్గాలుగా విభజితమయినారు. ఎ) స్త్రీలు బి) పురుషులు. ఈ విభజన సహజంగా, జైవికంగా ఏర్పడినటువంటిదే. సమాజంలో పురుషుడు చేసే కొన్ని పనులను స్త్రీలు చేయలేరు. అదే విధంగా స్త్రీలు చేసే కొన్ని పనులను పురుషులు చేయలేరు. ఆ విధంగానే వయస్సును బట్టి కూడా వ్యక్తులు నిర్వర్తించే పనులలో వ్యత్యాసాలు కనపడతాయి. యువకులు చేయగలిగే పనులను వృద్ధులు చేయలేరు. అదేవిధంగా మతం దృష్ట్యా, కులం దృష్ట్యా సమాజంలో అనేక విభాగాలు ఏర్పడుతున్నాయి. అదే రీతిగా గ్రామీణులకు పట్టణ వాసులకు, ఒక ప్రాంతానికి చెందిన వారికి, మరొక ప్రాంతం వారికి మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తాయి.

2) ప్రకార్యమైన వ్యత్యాసము: సమాజంలో వ్యక్తులు నిర్వర్తించే వివిధ రకాలైన ప్రకార్యాల పరంగా కూడా విభేదీకరణ ఏర్పడుతుంది. అంతేగాకుండా విభేదీకరణం చెందిన సమాజం అనేకమైన, వేర్వేరు రకాలైన ప్రకార్యాలను నెరవేర్చవలె. అవి: ఎ) ఆర్థికపరమైనవి బి) సాంకేతిక పరమైనవి సి) కుటుంబ సంస్థకు సంబంధించినవి డి) మత సంస్థకు సంబంధించినవి ఇ) భావ ప్రసారానికి సంబంధించినవి. ఈ విధమైన పలురకాల ప్రకార్యాలను నెరవేర్చడానికి విభిన్న వ్యక్తులు కావలసి వస్తారు. పలు రకాలైన వనరులు, పాత్రలు, వ్యవస్థాపనలు, సంస్థలు అవసరమవుతాయి. కాబట్టి విభేదీకరణ అనేది అనివార్యంగా ఏర్పడుతుంది.

3) విభేదీకరణం యొక్క మూలావసరము: ఏ సమాజానికైనా విభేదీకరణ అనేది తప్పనిసరిగా అవసరం. సమాజం మనుగడను సాగించవలెనంటే, ఎన్నో రకాలైన ప్రకార్యాలను దానిలోని వివిధ విభాగాలతో చేయించవలె. ఈ వివిధ విభాగాలు ఒక్కొక్క రకమైన ప్రత్యేకీకరణను కలిగియుండి సమాజ అభివృద్ధికి, మనుగడకు తోడ్పడుతాయి. అయితే సమాజంలోని ఈ వివిధ విభాగాలు కలసికట్టుగా వుంటేనే తప్ప ఆ ప్రకార్యాలను నెరవేర్చలేవు. అంటే సమాజంలో ప్రకార్య విభేదీకరణ, ఐక్యత అనేవి ఉండడం అవసరమని చెప్పవచ్చు. కాబట్టి సమాజంలో విభేదీకరణ అవసరము. ఆ విభేదీకరణం లోనే సహకారం ఉండడం అంతకంటే అవసరం. కాబట్టి సమాజంలో విభేదీకరణ, సమైక్యత అనే రెండు ప్రక్రియలు కలిసి కొనసాగుతుంటాయి.

### 15.3.1 సామాజిక విభేదీకరణ-ప్రాతిపదికలు

 సామాజిక విభేదీకరణ ప్రధానంగా కొన్ని ప్రాతిపదికల ఆధారంగా ఏర్పడుతుంది. అందులో ప్రధానమైనవి: 1)

లింగము(Sex) 2) వయస్సు(Age) 3) వృత్తి(Occupation) 4) అంతస్తు(Status) 5) సంపద(wealth) 6)మతం(Religion). అయితే ఇక్కడ లింగము, వయస్సు అనేవి జైవిక పరమైన కారకాలు కాగా, వృత్తి, అంతస్తు సంపద, మతం అనేవి ఆర్థిక, సాంఘిక కారకాలు. వీటి ప్రాతిపదికన సమాజంలో వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య విభేదీకరణ ఏర్పడుతుంది. యిప్పుడు వీటిని గురించి విపులంగా చర్చిద్దాం.

### 15.3.2 సామాజిక విభేదీకరణ-లింగ విభేదాలు

మానవులలో ఆదినుంచీ గుర్తిస్తూ వస్తున్న వ్యత్యాసాలలో లైంగిక వ్యత్యాసమొకటి. యిది స్త్రీ పురుషుల మధ్య గల జైవిక పరమైన వ్యత్యాసాన్ని సూచిస్తుంది. లింగాన్ని బట్టి సమాజ సభ్యులను రెండు వర్గాలుగా విభజించడం జరుగుతుంది. అవి 1) పురుషుడు 2) స్త్రీలు. లైంగిక వ్యత్యాసం సహజంగా, జైవికంగా పుట్టుకతో వస్తుంది. సంతానోత్పత్తి అనే జైవిక ప్రక్రియలో స్త్రీపురుషులు వేర్వేరు పాత్రలను నిర్వహిస్తూంటారు. స్త్రీ పురుషుల శారీరక లక్షణాలల్లో విభిన్నతలుంటాయి. ఉదాహరణకు పురుషులు, స్త్రీలకంటే ఎక్కువ శారీరక దారుఢ్యంతోను, బలంతోను ఉంటారు. శారీరకంగా, సామాజికంగాను, ఆర్థిక పరంగాను స్త్రీ పురుషులు నిర్వర్తించే పనులలో కూడా వ్యత్యాసాలు కనబడతాయి. పాత్రలను పోషించడంలోను, ప్రకార్యాలలోను, లక్షణాలలోను కూడా స్త్రీ పురుషులలో విభేదాలున్నాయి. శిశువును కనిపెంచడంలో స్త్రీ ప్రధాన పాత్ర పోషిస్తుంది. పురుషుడు కుటుంబ సంరక్షణ, ఆర్థికావసరాలను తీర్చడం తదితర ప్రకార్యాలను నిర్వర్తిస్తాడు. అయితే కొన్ని జైవిక కారణాల రీత్యా స్త్రీ పురుషుని పైన ఆధారపడవలసిన సందర్భాలు ఏర్పడతాయి. దీని మూలంగా పురుషుడు స్త్రీ పైన అధికారాన్ని చెలాయించే పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా సమాజం పురుషాధిక్యత గల సమాజంగా మారిపోయింది. అదే విధంగా స్త్రీ పురుషులకు మధ్య సాంఘిక, సాంస్కృతిక వ్యత్యాసాలు కూడా ఉన్నాయి. శిరోధారణలోను, వేష, వస్త్రధారణలోను, యితరులతో సంభాషించడం విషయంలోను, నిత్య జీవన విధానంలోను స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసాలు కనబడతాయి. ఈ విధంగా జైవికమైన విభేదాన్ని అనుసరించి స్త్రీ పురుషులకు వేర్వేరు ప్రతినిధ్యాలున్న స్థానాలు, అంతస్తులు యివ్వడం జరుగుతంది.

### 15.3.3 సామాజిక విభేదీకరణ-వయస్సు

అన్ని సమాజాలలోను వ్యక్తులను వయస్సును బట్టి సమూహాలుగా విభజించడం జరుగుతుంది. ఈ వయస్సమూహాల విభజన వ్యక్తుల జీవితకాల చక్రంలోని వివిధ దశల మీద ఆధారపడి చేయడం జరుగుతుంది. యిది జైవికంగా వచ్చేది. వయస్సు అనేది కూడా జైవిక ప్రక్రియ. సామర్థ్యంలోను ప్రకార్యాలలోను, వివిధ వయస్సులలో ఉన్నవారు భిన్నరీతులుగా ఉంటారు. వ్యక్తి జీవిత దశలు వరుసగా ఎ) శైశవము(Infancy) బి) బ్యాలము(Child hood) సి)యౌవనము(Youth) డి) వయోజనత్వము(Adult hood) ఇ) వృద్ధాప్యము(Old Age). ఒక్కొక్క దశలో ఒక్కొక్క అంతస్తును, పాత్రను, విలువలను వ్యక్తులు చేపడతారు. సామాజిక పరస్పర చర్యలు, సంబధాలు కూడా వయస్సును బట్టి మారతాయి. వయస్సును బట్టి హక్కులు, బాధ్యతలు కూడా మారుతుంటాయి. విద్యాసంస్థలలో ప్రవేశానికి, వృత్తిలో చేరడానికి, ఆ వృత్తి నుంచి విరమించడానికి, వివాహానికి, ఓటు వేయడానికి ఈ విధంగా ఎన్నో ప్రకార్యాలను నిర్వర్తించడానికి వయస్సు మూలాధారము. అంతే కాకుండా, వయస్సును బట్టి ప్రమాణాలు, ప్రకార్యాలు కూడా మారుతుంటాయి. వ్యక్తి వయోజనుడు అయిన తరువాతనే పూర్తి పరిపక్వతను పొందినవాడవుతాడు. ఆ దశలోనే అతనికి భౌతిక, మానసిక సామర్థ్యాలు ఎక్కువగా ఉంటాయి. ఆ వయస్సులో అతడు ఏదైనా సాధించగలడు. ఏ బాధ్యతాయుతమైన పనినైనా ఆ వ్యక్తికి అప్పజెప్పవచ్చు. ఇక వృద్ధాప్యం వచ్చే సరికి వ్యక్తి తనకున్న మానసిక, శారీరక శక్తులను క్రమంగా కోల్పోతాడు. జ్ఞాపకశక్తి క్రమంగా తగ్గిపోతుంది. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా ఇంకొకరి మీద అధారపడవలసి వస్తుంది. కాబట్టి ప్రతి వయస్సమూహానికి విభిన్నమైన పాత్రలు, భాద్యతలు, హోదాలు, అధికారాలు నిర్ణయించడం జరుగుతుంది.

### 15.3.4 సామాజిక విభేదీకరణ-అంతస్తు

ఒక సామాజిక వ్యవస్థలో ఉన్న వ్యక్తులకు సమూహాలకు వివిధ సామాజిక అంతస్తులుంటాయి. ఎప్పుడు ఈ స్థితులకు, స్థానాలకు అంతస్తు అనే హెచ్చుతగ్గులు జోడించడం జరుగుతుందో, అప్పుడే సామాజిక వ్యవస్థలో స్తరీకరణ ఏర్పడుతుంది. అంతస్తు అనే కొలబద్ధ ఆధారంగా వ్యక్తులను కానీ, సమూహాలనుగానీ ఒక క్రమంలో



BRAOU

అమర్చి, వారికి ప్రత్యేకమైన అంతస్తును ప్రతిపాదించే ప్రక్రియనే స్తరీకరణ అంటారు. అయితే ఈ స్తరీకరణకు ప్రాతిపాదిక సామాజిక విభేదీకరణ. సామాజిక అసమానత. ఈ సామాజిక అసమానత ప్రాతిపాదికన సమాజంలో వ్యక్తులు అనేక స్తరాలుగా విడిపోతారు. అయితే ఒక స్తరంలోని వ్యక్తులు యింకొక స్తరంలోని వ్యక్తుల కంటే ఎక్కువ స్థానంలోనో, తక్కువ స్థానంలోనో ఉంటారు. అసలు ఏ వర్గానికి ఆ వర్గమే ప్రత్యేకంగా గొప్పది అని తలపోస్తే స్తరీకరణ అనేది లేదు. అట్లాగే వృత్తి వర్గాలలోని వ్యక్తులు తమ మధ్య అంతస్తులో హెచ్చుతగ్గులు లేవని తలపోస్తే స్తరీకరణ అనేది ఉండనే ఉండదు. కాబట్టి సామాజిక విభేదీకరణ ద్వారా ఏర్పడే వివిధ వర్గాలను అంతస్తు అనే వలయంలో బిగించినప్పుడు, అంతస్తు అనే కోణంలో చూసినప్పుడు స్తరీకరణ ప్రక్రియ ఏర్పడుతున్నట్లుగా కనిపిస్తున్నది. కాబట్టి అంతస్తు వ్యత్యాసాల మూలంగా కూడా సామాజిక విభేదీకరణ ఏర్పడుతుందని చెప్పవచ్చు.

## 15.3.5 సామాజిక విభేదీకరణ - వృత్తి

సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విభేదాలలో వృత్తి విభేదీకరణ అనేది చాలా ప్రధానమైనది. వృత్తిని ఆధారంగా తీసుకొని వ్యక్తులు వర్గాలుగా ఏర్పడడమే కాకుండా ఈ వర్గాలకు అంతస్తులు కూడా జతపరచడం జరుగుతుంది. అంటే వృత్తి అనేది సామాజిక విభేదీకరణకు ప్రాతిపదిక మాత్రమే గాక స్తరీకరణకు కూడా ప్రాతిపదిక. సమాజంలో వివిధ వ్యక్తులకు వివిధ ప్రకార్యాలను, విధులను, హక్కులను కేటాయించడం జరుగుతుంది. కాబట్టి సమాజంలో వ్యక్తుల వృత్తులను విభేదీకరణ చేయడం ఎంతైనా అవసరం. సమాజంలో ఏ వ్యక్తి అయినా జీవించవలెనంటే ఏదో ఒక వృత్తిని చేపట్టడం అవసరం. అయితే వ్యక్తులు తమకు అభిరుచులను బట్టి, తెలివి తేటలను బట్టి, సామర్థ్యాన్ని బట్టి వయస్సును బట్టి, లింగాన్ని బట్టి వృత్తేకతలపే ఎన్నుకొంటారు. అందుచేత వృత్తులలో భేదాలు ఏర్పడుతున్నాయి. వృత్తిని బట్టే సమాజంలో వ్యక్తి గౌరవము, అంతస్తు, అధికారము, లభిస్తాయి. కొన్ని వృత్తులకు శారీరక శక్తి, మరికొన్నింటికి మేధాశక్తి అవసరము, స్త్రీలకు కొన్ని వృత్తులు. పురుషులకు కొన్ని వృత్తులు కేటాయించడం జరుగుతుంది. కొన్ని వృత్తులకు విద్యార్హతలు అవసరం లేదు. మరికొన్నింటికి ఉన్నత విద్యార్హతలు కావలె. కొన్ని వృత్తులకు వ్యక్తుల నిపుణత్వం, నేర్పు అవసరమైతే, మరి కొన్నింటికి ఇవి అవసరం ఉండదు. కొన్ని వృత్తుల ద్వారా దాయం ఎక్కువగా వస్తే, మరికొన్నింటి ద్వారా తక్కువ ఆదాయం వస్తుంది. ఈ విధంగా వృత్తులను విభజించి తద్వారా వాటిని చేపట్టే వ్యక్తులు విభిన్న వర్గాలుగా ఏర్పడుతుండడం వల్లనే వృత్తి ద్వారా సమాజంలో విభేదీకరణం జరుగుతుందని చెప్పవచ్చు.

## 15.3.6 సామాజిక విభేదీకరణ - సంపద, అధికారం

సంపదను, అధికారాన్ని కలిగియుండడం అనే ప్రాతిపదికపై కూడా వ్యక్తులు అనేక వర్గాలుగా విడిపోవడం జరుగుతంది. అధిక సంపదను కలిగియున్న వారు, అధిక అధికారాన్ని కూడా కలిగియుండి విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు. సంపదలేని వారు పేదరికంలో మ్రగ్గుతుంటారు. దీన్నిబట్టి సమాజంలో ధనవంతులు, మధ్య తరగతి ప్రజలు, పేదవారు, అనే వర్గాలుగా ప్రజలు విభేదీకరణం చెందం జరుగుతుంది.

## 15.3.7 సామాజిక విభేదీకరణ- మతము

సమాజంలోని వ్యక్తులు మత ప్రాతిపదికగా కూడా అనేక సంవర్గాలుగా విడిపోవచ్చు. ఉదాహరణకు హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, బౌద్ధులు, జైనులు, పారశీలు మొదలైనవారు. మత ప్రాతిపదికగా ఏరఏపడిన సామాజిక సంవర్గాలు. ఈ మత ప్రాతిపదికన ఏర్పడిన సామాజిక సంవర్గాలు సాంస్కృతికంగా కూడా వేరు వేరుగా ఉంటాయి.అంటే వారి ఆచార వ్యవహారాలు, భోజన అలవాట్లు, వస్త్రధారణ, నమ్మకాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలు, విలువలు, ప్రమాణాలు మొదలైనవి వివిధ మత సమూహాలలో వివిధ రూపాలుగా ఉంటాయి. ఈ విధంగా మతపరమైన ప్రజలు విలువలు, విశ్వాసాల ఆధారంగా కూడా సమాజంలో ప్రజలు విభేదీకరణ చెందియుంటారు.

ఈ విధంగా పైన పేర్కొన్న వివిధ ప్రాతిపదికల ఆధారంగా వ్యక్తులు వివిధ సామాజిక సంవర్గాలుగా విడిపోవడం సంభవిస్తున్నది. ఏది ఏమయినప్పటికినీ ఆధునిక, సంశ్లిష్ట, నాగరికతా సమాజంలో సామాజిక విభేదీకరణ

అతివేగంగాను, విస్తృతంగాను జరుగుతున్నదని చెప్పవచ్చు. ఈ విభేదీకరణం ఎక్కువవుతున్న కొద్దీ, సమాజంలో అస్థిరత ఎక్కువై సమాజం తన సంసక్తిని, స్థిరత్వాన్ని, సుదృఢతను కోల్పోవడానికి అవకాశమున్నది. కాబట్టి విభేదీకరణం కొంతవరకు సమాజంలో అవసరమైనప్పటికీ అది హద్దులను దాటిపోతే మాత్రం సమాజ నిర్మితిలో తీవ్ర పరివర్తన కలిగి సమాజం అవ్యవస్థకు గురియయ్యే ప్రమాదం ఏర్పడుతుంది.

## 15.4 సారాంశం

ప్రతి సమాజం అసమానత అనే ప్రాతిపదికపై ఆధారపడి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మతపరమైన అనేక వర్గాలుగా విభజింపబడి ఉండటం కనిపిస్తుంది. కాబట్టి సమాజం ఎన్నో రకాలైన సమస్తరీయ, విషమస్తరీయ పొరలతో కూడి ఉంటుంది. ప్రతి సమాజంలో వ్యక్తుల మధ్య కొన్ని ప్రాతిపదికల ఆధారంగా విభేదీకరణ అనేది ఏర్పడుతుంది. ఒక సమాజంలో వ్యక్తులు సమూహాలను సామాజిక గుణ విశేషాలను బట్టి వర్గాలుగా విభజించే ప్రక్రియను సామాజిక విభేదీకరణ అని చెప్పవచ్చు. సమాజంలోని వ్యక్తులు ప్రధానంగా ఈ ప్రాతిపదికల ఆధారంగా విభేదీకరణ చెందుతారు. అవి: 1) లింగము 2) వయస్సు 3) వృత్తి 4)అంతస్తు 5) సంపద 6) మతము మున్నగునవి. సామాజిక విభేదీకరణ అనేది సామాన్య సమాజాలలోను, ఆధునిక సమాజాలలోను, పారిశ్రామిక సమాజాలలోను అన్నింటిలోనూ ఉంటుంది. అయితే సమాజం సంశ్లిష్టమైన కొద్దీ ఈ విభేదీకరణ అధికమవుతుంది.

సామాజిక విభేదీకరణ అనేది అంతస్తు ప్రాతిపదికన జరిగినప్పుడు సమాజంలో వ్యక్తులను వివిధ అంతస్తులు సమూహాలుగా విభజించడం జరుగుతుంది. తద్వారా సమాజంలో సామాజిక స్తరీకరణ ఏర్పడుతుంది. స్తరీకరణలో వ్యక్తులను వారివారి అంతస్తుల ఆధారంగా ఉన్నత స్థితిలోనో లేదా నిమ్న స్థితిలోనో ఉంచడం జరుగుతుంది. సామాజిక స్తరీకరణ కొన్ని ముఖ్య లక్షణాలను కలిగి యుంటుంది. అవి: 1) స్తరీకరణ సామాజికమైంది. 2) స్తరీకరణ విశ్వజనీనమైనది 3) స్తరీకరణ ఒక వ్యవస్థాపితమైన నిర్మితిని కలిగి యుంటుంది. 4) స్తరీకరణ విలువల నిర్మితిని కలిగి యుంటుంది 5) స్తరీకరణ పర్యవసానమైనది 6) శక్తి, అధికారము, నియంత్రణ వ్యవస్థాపన 7) స్తరము ఒక ఉప సంస్కృతి, ఒక ఉప సమాజము. సామాజిక స్తరీకరణ ప్రధానంగా మూడు రూపాలలో ఉంటుంది. అవి: ఎ) కుల వ్యవస్థ బి) వర్గ వ్యవస్థ సి) సంస్థాన వ్యవస్థ. కుల వ్యవస్థ ప్రధానంగా భారతీయ సమాజంలో కనబడుతుంది. అయితే సంస్థాన వ్యవస్థ కేవలం యూరోపు దేశాలలో మాత్రమే కనబడుతుంది. ఏది ఏమైనప్పటికీ దాదాపు అన్ని సమాజాలలో విభేదీకరణ, సామాజిక స్తరీకరణ అనేది ఉందని చెప్పవచ్చు.

BRAOU

## 15.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి:**

1. సామాజిక విభేదీకరణను నిర్వచించి, దాని యొక్క ప్రాతిపదిక ఏమిటో వివరింపుము

2. సామాజిక స్తరీకరణ అంటే ఏమిటి? సామాజిక స్తరీకరణ లక్షణాలను వివరింపుము.

**II. ఈ కింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి:**

1. సామాజిక స్తరీకరణ రూపాలేవి?

2. కుల వ్యవస్థ లక్షణాలను గురించి చర్చింపుము

## 15.6 చదువదగిన గ్రంథాలు


1. Melvin M. Tumin — Social Stratification

2. Dipankar Gupta — Social Stratification

| | |
|---|---|
| 3. C. N. Shankar Rao | Sociology |
| 4. Yogendra Singh | Social Stratification and Social Change in India |
| 5. K. L. Sharma | Social Stratification in India |
| 6. Ghurye G.S. | Caste, Class and Occupation |

BRAOU

# భాగం- 16: సామాజిక స్తరీకరణ - ప్రమాణికతలు

విషయక్రమం


16.0 ఉద్దేశాలు

16.1 పరిచయం

16.2 సామాజిక స్తరీకరణ ప్రమాణికతలు

- 16.2.1 సంపద, ఆస్తి, ఆదాయము
- 16.2.2 కుటుంబము, బంధుత్వము
- 16.2.3 నివాస ప్రాంతము
- 16.2.4 నివాస కాలము
- 16.2.5 వృత్తి
- 16.2.6 విద్య ప్రజ్ఞ
- 16.2.7 శక్తి, అధికారము

16.3 సారాంశం

16.4 మాదిరి పరీక్షా ప్రశ్నలు

16.5 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 16.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు:

- సామాజిక స్తరీకరణ అంటే ఏమిటో వివరించగలుగుతారు.
- సామాజిక స్తరీకరణ ఏ ప్రమాణికతల ఆధారంగా ఏర్పడుతుందో వివరించగలుగుతారు.

## 16.1 పరిచయం

మానవ సమాజమంటే కొన్ని మానవ సమూహాల సంకీర్ణము. వ్యక్తులు పరస్పర చర్యలు, సంబంధాలు ఏర్పరచుకొంటూ, సమాజంలో అనేక వర్గాలుగా విడిపోతూ ఉంటారు. సమాజాన్ని జాగ్రత్తగా పరిశీలించినట్లయితే సమాజంలో వైధర్మ్యం (heterogenity) లేదా అసమానతలు ఉన్నట్లు తెలుస్తుంది. సమాజం సాంఘిక, ఆర్థిక, రాజకీయ మతపరమైన అనేక వర్గాలుగా విభజింపబడి ఉండడం కనిపిస్తుంది. కనుక సమాజం అసమానత ప్రాతిపాదికన ఎన్నో రకాలైన సమస్తరీయ పొరలతో కూడి ఉంటుంది. ఈ రకమైన పొరలనే స్తరాలు అని పేర్కొనవచ్చు. వివిధ రకాల స్తరాలు వివిధ అంతస్తులలో ఉంటాయి. స్తరాలకు ఉన్న అంతస్తులే ఆ స్తరాలలో ఉన్నటువంటి వివిధ రకాల వ్యక్తులకు వర్తిస్తాయి. స్తరాల అంతస్తులు ఆయా స్తరాలకు ఆపాదింపబడిన సామాజిక విలువల మీద ఆధారపడి ఉంటాయి. సామాజిక విలువలను ఆధారంగా చేసుకొని స్తరాలను కొలిచే కొలమానమే అంతస్తు. ఈ అంతస్తు అనే కొలమానాన్ని బట్టే కొన్నింటిని ఉన్నత స్తరాలుగాను, మరికొన్నింటిని నిమ్నస్తరాలుగానూ

పెర్కొనడం జరుగుతుంది.

స్తరీకరణ సామాజిక నిర్మితికి అనుబంధంగా ఉంటుంది. మానవసమాజం జైవికంగానూ, ప్రకార్యపరంగాను, సాంస్కృతికంగాను, పలురకాల వ్యక్తులతోను సమూహాలతోను కూడి ఉంటుంది. అయితే అంతకు ముందే చెప్పినట్లుగా, వ్యక్తులు వివిధ స్తరాలలో ఉండి, ఆయా స్తరం యొక్క అంతస్తును పొంది ఉంటారు. అయితే ఈ స్తరాల మధ్య వ్యత్యాసముంటుంది. ఈ స్తరాల మధ్య వ్యత్యాసాలు సామాజిక విలువలలోని శ్రేణి పరంపరల మీద ఆధారపడి ఉంటాయి. అంటే విలువలు స్తరాలను ఒక క్రమశ్రేణిలో ఉంచుతాయి. అయితే ఇక్కడ చర్చించవలసిన విషయమేమిటంటే సామాజిక స్తరీకరణ అనేది ఏ ప్రమాణికతలపై ఆధారపడి ఏర్పడుతుంది? ఆ ప్రమాణికతలు ఏవి? సమాజంలోని వివిధ వర్గాలకు వివిధ అంతస్తులను ఏ ప్రాతిపాదికన ఇవ్వడం జరుగుతుంది? ఏ వర్గానికి ఎంత హోదా, ఎంత అంతస్తు ఇవ్వవలెె? మొదలుగు విషయాలన్నింటి గురించి ఈ క్రింది భాగంలో చర్చించడం జరిగింది.

## 16.2 సామాజిక స్తరీకరణ - ప్రమాణికతలు

సమాజంలోని వివిధ సంవర్గాలకు, వర్గాలకు, హోదాలు, అంతస్తులు ఇవ్వడం జరుగుతుంది. సామాజిక స్తరీకరణాన్ని గురించి అధ్యనం చేసిన వారిలో ప్రముఖ సమాజశాస్త్రవేత్త లయిన డబ్ల్యూ.ఎల్.వార్నర్ ఒక వ్యక్తి ఏ వర్గానికి చెందుతాడో సూచించడానికి ఆరు చరరాశులను ఏర్కొన్నాడు. అవి 1. వృత్తి, 2. ఆదాయం, 3. ఆదాయపు వనరులు, 4. ఇల్లు, 5. నివసిస్తున్న పరిసరాలు, 6. విద్య. అయితే సమాజంలో ఏ వర్గానికి ఎంత హోదా, ఏ అంతస్తు ఇవ్వవలెనో నిర్ణయించే ప్రమాణికతలు ఎన్నెన్నో ఉన్నాయి. అందులో ప్రధానమైనవి 1. సామాజిక, ఆర్థిక ప్రమాణికతలు, అంటే సంపద, ఆస్తి, ఆదాయము, సామాజిక స్థితిగతులు మున్నగునవి. ఇందులోకి వస్తాయి. 2. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ప్రమాణికతలు. అంటే విద్య, ప్రజ్ఞ, సంస్కృతి, శక్తి, అధికారము మొదలగునవి ఇందులోకి వస్తాయి. 3. కుటుంబము, బంధుత్వము. 4. నివాసప్రాంతము, 5. నివాస కాలము, 6. శక్తి, అధికారము, 7. సామాజిక కార్యకలాపాలు మొదలుగునవి. ఈ ప్రమాణికతల ఆధారంగా సమాజంలో స్తరీకరణ ఏవిధంగా ఏర్పడుతున్నదో వివరించవచ్చు. వాస్తవికంగా ఈ ప్రమాణికతలే సామాజిక స్తరీకరణకు మూలాధారాలు. ఇప్పుడు వీటిని గురించి విపులంగా చర్చిద్దాం.

### 16.2.1 సంపద, ఆస్తి, ఆదాయము

సంపద, ఆస్తి, ఆదాయము మూడింటిని కలిపి ఆర్థిక ప్రమాణికతలుగా చెప్పవచ్చు. వీటికి తోడు వ్యక్తి జీవన స్థితిగతులు, జీవన శైలి సరళి కనుక కలిపినట్టయితే అప్పుడు వాటిని సామాజిక, ఆర్థిక ప్రమాణికతలుగా చెప్పవచ్చు. ప్రధానంగా ఈ సామాజిక, ఆర్థిక ప్రమాణికతలే వ్యక్తుల, సమూహాల, వర్గాల అంతస్తు, హోదాలను నిర్ణయిస్తాయి. వ్యక్తి యొక్క స్వంత ఆస్తి, స్వంత వృత్తి, ఆదాయము, జీవన స్థితిగతులు కలిసి సామాజిక, ఆర్థిక ప్రమాణికతలుగా ఏర్పడి వ్యక్తుల యొక్క అంతస్తు, హోదాలను నిర్ణయిస్తాయి. ఈ ప్రమాణికతల ఆధారంగానే సమాజంలో వ్యక్తులు వివిధ అంతస్తు సమూహాలుగా విభజింపబడతారు. సమాజంలో సంపద, సంపద యొక్క పంపిణీ, ఆ పంపిణీలోగల వ్యత్యాసాలు సమాజాఇన్ని ఆర్థిక పరంగా స్తరీకరిస్తుంది. అధిక సంపదను కలిగి ఉన్నవాళ్లఉ ఉన్న స్తరంలోను, సంపదలేనివాల్లు నిమ్న స్తరంలోను ఉంటారు. సంపద అనేది వ్యక్తి యొక్క జీవన ప్రమాణాన్ని, జీవన సరళిని, జీవితావకాశాలను నిర్ధారిస్తుంది. అంటే వ్యక్తి యొక్క జీవన ప్రమాణం, జీవన సరళి వ్యక్తి ఇష్టాయిష్టాలో ప్రమేయం లేకుండా సంపద అనేది నిర్ధారిస్తుంది. సంపద లేనట్లయితే వ్యక్తి జీవన ప్రమాణం పెరిగే అవకాశమేలేదు. అంతేకాకుండా సంపద, ఆస్తి, ఆదాయం అనేవి సమాజంలో వ్యక్తి యొక్క భౌతిక విజయానికి (material success) సూచికలాంటివి. ఎందుకంటే భౌతికపరమైన అవసరాలన్నీ వ్యక్తి యొక్క ఆస్తి, ఆదాయము వల్లనే తీర్చబడతాయి. సంపద, ఆస్తి, ఆదాయము అనేవి వ్యక్తి భౌతిక జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. దీనిని బట్టి వ్యక్తి ఏ స్తరానికి చెందినవాడో చెప్పవచ్చు. అయితే మరొక అంశమేమిటంటే, వ్యక్తి యొక్క సంపద అనేది ముఖ్యమైనదయినప్పటికీ దానిని అతడు ఏ పద్ధతుల ద్వారా సంపాదించినాడు అనే దానిని బట్టి వ్యక్తికి, అతని సంపదకు గౌరవం లభిస్తుంది. వ్యక్తి న్యాబద్ధమైన పద్ధతులద్వారా సంపదను, ఆస్తిని



BRAOU

సమకూర్చుకున్నట్టయితే లేదా వారసత్వంగా ఆస్తి సంక్రమించినట్టయితే అటువంటప్పుడు వ్యక్తి ఉన్నత స్థాయి గౌరవాన్ని పొందుతాడు. అలాకాకుండా వ్యక్తి అన్యాయమైన పద్ధతుల ద్వారా, నేరపూరిత పద్ధతుల ద్వారా గక సంపదను సమకూర్చుకున్నట్టయితే అతనికి అంతగౌరవం లభించదు. ఈ విధంగా సమాజం వ్యక్తి యొక్క సంపదను, ఆస్తిని, ఆదాయాన్ని రెండు కోణాలలో చూస్తుంది. అందులో సమాజంలో అందరికీ సమ్మతమైన, న్యాయబద్ధమైన కోణంలో సంపదను చూడడం జరుగుతుంది. తద్వారా సంపదకు, వ్యక్తికి గౌరవం లభిస్తుంది. అయితే దీనిని నిర్ధారించడం అంత సులభమైన విషయం కాదు. అది సమాజంలో గల వ్యక్తుల దృష్టిని బట్టి ఉంటుంది. అందుకే సాపేక్షమైన అంశం. కొందరికి సరియైన పద్ధతి మరికొందరికి సరియైనది కాకపోవచ్చు. ఏది ఏమైనప్పటికీ సంపద, ఆస్తి, ఆదాయం అనే సమాజంలో వ్యక్తుల ఆర్థిక అంతస్తును నిర్ధారించి స్థిరీకరిస్తుందని చెప్పవచ్చు.

### 16.2.2 కుటుంబము, బంధుత్వము

కుటుంబ గౌరవము, కుటుంబ ఖ్యాతి కుటుంబము యొక్క పేరు ప్రఖ్యాతులు, బంధుత్వ సంబంధాలు అనేవి కలిసి వ్యక్తుల యొక్క, సమూహాల యొక్క లేదా వర్గాల యొక్క అంతస్తులను నిర్ణయిస్తాయి. అంటే మంచి గౌరవం గల కుటుంబములోగాని, మంచి పేరు ప్రఖ్యాతులుగల వంశంలోగానీ, జన్మించినట్టయితే లేదా, పేరుప్రఖ్యాతులు గల బంధువులు ఉన్నట్టయితే, లేదా వ్యక్తి బంధువులలో ఎవరైనా మంచి పేరుగలవాడు ఉన్నత స్థితిలో ఉన్నవాడు ఉన్నట్టయితే తద్వారా ఆ వ్యక్తి కూడా ఉన్నత వర్గానికి, ఉన్నత అంతస్తుకు చెందిన వ్యక్తిగా గుర్తించబడతాడు. అవి లేనట్టయితే వ్యక్తి సాధారణ అంతస్తుకు లేదా నిమ్న అంతస్తుకు చెందినవాడవుతాడు.

### 16.2.3 నివాస ప్రాంతము

వ్యక్తియొక్క నివాస ప్రాంతాన్నిబట్టి కూడా ఆ వ్యక్తి ఏవర్గం, అంతస్తుకు చెందిన వ్యక్తో చెప్పవచ్చు. ఎందుకంటే సమాజంలో వ్యక్తులు ఆవరణ పరంగా వేర్పాటు చెంది ఉంటారు. ముఖ్యంగా నగర ప్రాంతాలను తీసుకున్నట్టయితే వ్యక్తులు ఆయా వ్యక్తుల ఆర్థిక స్థితినిబట్టి తమ నివాస ప్రాంతాలను ఎంపిక చేసుకుంటారు. ఆవిధంగా వ్యక్తి ఏప్రాంతంలో నివసిస్తున్నాడో ఆ ప్రాంతం యొక్క అంతస్తును ఆ వ్యక్తికి ఆపాదించడం జరుగుతుంది. అదేవిధంగా గ్రామీణ సమాజాలలో, ముఖ్యంగా భారత దేశంలో వ్యక్తులు కుల అంతస్తు ప్రాతిపాదికన తమ నివాస ప్రాంతాలను ఏర్పరచుకుంటారు. తద్వారా వ్యక్తుల అంతస్తు నిర్ణయించబడుతుంది. కాబట్టి వ్యక్తుల నివాస ప్రాంతాన్ని బట్టి ఆవ్యక్తి యొక్క అంతస్తును నిర్ణయించడంజరుగుతుంది. అయితే వ్యక్తి యొక్క ఆర్థిక స్థితిలో మార్పు వచ్చినట్టయితే వ్యక్తియొక్క నివాస ప్రాంతం కూడా మారే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ఒకప్పుడు సాధారణ వ్యక్తిగా ఉన్న వ్యక్తి ధనవంతుడుగా మారినట్టయితే అతడు అంతకు మునుపున్న సాధారణ మధ్యతరగతి నివాస ప్రాంతం నుంచి ధనవంతులు నివసించే ఉన్నత తరగతి నివాస ప్రాంతానికి తన నివాసాన్ని మార్చడానికి ప్రయత్నిస్తాడు. అంటే తద్వారా అతడు ఉన్నత అంతస్తును పొందడానికి ప్రయత్నిస్తాడు. అంటే దీనిని బట్టి అర్థమయ్యేదేమిటంటే, నివాస ప్రాంతానికి, వ్యక్తి అంతస్తుకు సహసంబంధమున్నదన్నమాట. అదేవిధంగా మనం మురికివాడలను గనక చూసినట్టయితే అక్కడ నివసించే వ్యక్తుల అంతస్తు తక్కువగా ఉంటుంది. ఈవిధంగా వ్యక్తుల అంతస్తు అనేది వ్యక్తుల నివాస ప్రాంతాన్నిబట్టి కూడా నిర్ణయించడం జరుగుతుంది.

### 16.2.4 నివాసకాలము

ఒక నివాస ప్రాంతంలో ఎంతకాలం వ్యక్తి నివసిస్తున్నాడనే దానిని బట్టికూడా వ్యక్తి అంతస్తును నిర్ణయిచడం జరుగుతుంది. ఏ వ్యక్తికూడా ఉన్నత ఆర్థిక స్తితిని అంత త్వరగా సంపాదించలేడు. అది దానికంతకు అదే వచ్చేది కూడా కాదు. కాబట్టి వ్యక్తి తన ఆర్థిక స్థితినిబట్టి ఏదో ఒక ప్రాంతంలో చాలాకాలం వరకు నివసించవచ్చు. కాబట్టి ఆ నివాస ప్రాంతానికున్న అంతస్తునే అవ్యక్తికి ఆపాదించడం జరుగుతుంది. అయితే వ్యక్తి ఒక నివాస ప్రాంతం నుంచి మరొక స్థాయి నివాస ప్రాంతానికి మారినప్పుడు అతని అంతస్తులో కూడా మార్పు ఏర్పడుతుంది. ఎందుకంటే ఒక నివాస ప్రాంతస్థాయి అనేది వ్యక్తియొక్క అంతస్తును నిర్ధారిస్తుంది కాబట్టి. ఈవిధంగా ఒక వ్యక్తి ఒక నివాస ప్రాంతంలో ఎంత కాలంగా నివశిస్తున్నాడన్నదానిని బట్టి కూడా అవ్యక్తి అంతస్తు నిర్ధారిత మవుతుందని చెప్పవచ్చు.

## 16.2.5 వృత్తి

ప్రతి సమాజంలో వ్యక్తి జీవించడానికి, వారి అవసరాలను తీర్చుకొనడానికి వృత్తి అనేది అవసరం. కాబట్టి సమాజంలో వివిధ వ్యక్తులు వివిధ రకాల వృత్తులను చేపట్టడం జరుగుతుంది. అయితే వ్యక్తులు చేపట్టే వృత్తులను అనుసరించి, సమాజంలో ఆ వృత్తికున్న గౌరవం, హోదాను అనుసరించి వాటిని చేపట్టే వ్యక్తులకు అదేరకమైన గౌరవం, హోదా లభ్యమవుతాయి. ఒక వృత్తికి సమాజంలో ఉన్నతస్థాయి గౌరవం ఉన్నట్టయితే, ఆవృత్తిని చేపట్టిన వ్యక్తులందరికీ ఉన్నత హోదా, గౌరవం లభిస్తుంది. అంటే సమాజంలో వ్యక్తియొక్క అంతస్తు, హోదా అనేవి వ్యక్తులు చేపట్టే వృత్తి నిర్ధారిస్తుందని చెప్పవచ్చు. అయితే ఒక వృత్తికి గల గౌరవం, హోదాను ఒక్కొక్క సమాజంలో ఒక్కొక్క రకంగా మూల్యాంకనం చేయడం జరుగుతుంది. ఉదాహరణకు భారతీయ సమాజంలో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ఎక్కువ ప్రాధాన్యత, గౌరవం, హోదా ఇస్తే, బ్లూకాలర్ ఉద్యోగాలకు తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. అట్లా కాకుండా కొన్ని సమాజాలలో ఎక్కువ డబ్బును ఏవృత్తిద్వారా అయితే ఆర్జించడానికి అవకాశం ఉంటుందో అటువంటి వృత్తులకు అధిక ప్రాధాన్యత, గౌరవం ఇవ్వడం జరుగుతుంది. ఇంకా కొన్ని సమాజాలలో వృత్తిద్వారా సంక్రమించే గౌరవం, హోదా, అధికారం, సదుపాయాలను బట్టి వృత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. కొన్ని వృత్తులద్వారా అధిక డబ్బును సంపాదించే అవకాశమున్నా వాటికి అంత ప్రాధాన్యత, గౌరవం ఇవ్వడం జరుగదు. అంటే ఇక్కడ డబ్బుకంటే వృత్తికున్న గౌరవం ప్రధానమైనది. ఈ విధంగా వ్యక్తి చేపట్టే వృత్తి ననుసరించి - సమాజంలో వ్యక్తుల యొక్క అంతస్తు, హోదా నిర్ధారితమవుతుంది. కాబట్టి వృత్తి అనేది సమాజ స్తరీకరణకు ఒక ప్రమాణికత అని చెప్పవచ్చు.

## 16.2.6 విద్య, ప్రజ్ఞ

విద్య అనేది వ్యక్తియొక్క వ్యక్తిత్వ వికాసానికి, విజ్ఞానాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. సమాజంలో సాంస్కృతిక, సామాజిక ప్రమాణాలు విద్య, ప్రజ్ఞ, సంస్కారాలు ఇత్యాధి రూపాలలో ప్రతిబింబించి ఆ వర్గానికి చెందిన వ్యక్తుల అంతస్తును వర్గ అంతస్తును నిర్ణయిస్తాయి. విద్య, ప్రజ్ఞ అనేవి వ్యక్తుల నియత సాంఘికీకరణ ప్రక్రియద్వారా అందజేయడం జరుగుతుంది. ఈ రెండూ సమాజంలో వ్యక్తికి గుర్తింపు, గౌరవం ఉన్నత హోదా, అంతస్తులను సంక్రమింపజేస్తాయి. కాబట్టి విద్యాస్థాయిని బట్టి, ప్రజ్ఞాపాటవాల స్థాయినిబట్టి కూడా సమాజం వివిధ అంతస్తు సమూహాలుగా విభజింపబడుతుంది.

## 16.2.7 శక్తి, అధికారము

శక్తి, అధికాము అనేది కూడా సమాజాన్ని వివిధ అంతస్తు సమూహాలుగా విభజిస్తాయి. శక్తి, అధికారాన్ని కలిగియున్న వ్యక్తులు సమాజంలో ఉన్నత అంతస్తును, హోదాను పొందుతారు. అదేవిధంగా శక్తి, అధికారం లేనివారు సమాజంలో నిమ్న అంతస్తును, హోదాను కలిగి ఉంటారు. అయితే కొన్ని సందర్భాలలో ఆర్థికస్థితికి, అధికారానికి మధ్య అవినాభావ సంబంధముంటుంది. ఉన్నత ఆర్థిక స్థితిలో ఉన్నవారు అత్యధిక రాజకీయాధికారాన్ని పొందే అవకాశముంటుంది. అదే విధంగా ఆర్థిక స్థోమత లేనివారు రాజకీయాధికారాన్ని పొందడం కష్టతరమైన విషయం. కాబట్టి శక్తి, అధికారం అనేవి కూడా సమాజాన్ని వివిధ అంతస్తు సమూహాలుగా విభజిస్తుందని చెప్పవచ్చు.

## 16.2.8 సామాజిక కార్యకలాపాలు

వ్యక్తి ఏయే సమూహాలలో సభ్యత్వాన్ని పొంది ఉన్నాడు? ఏయే వ్యవస్థాపనలలో పాల్గొంటున్నాడు? ఏయే సంఘాలను స్థాపించినాడు లేదా ఏ సంఘాలలో సభ్యత్వాన్ని పొంది ఉన్నాడు? ఏయే క్లబ్బులకు పోతున్నాడు? ఎట్లాంటి స్నేహితులతో కూడి ఉన్నాడు? ఎటువంటి సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటున్నాడు? మొదలైనవన్నీ వ్యక్తియొక్క అంతస్తు సమూహాన్ని, లేదా వర్గాన్ని, అంతస్తును నిర్ణయిస్తాయి.

## 16.3 సారాంశం

సమాజంలోని వివిధ సమూహాలకు, వర్గాలకు వివిధ హోదాలు, అంతస్తులు ఇవ్వడం జరుగుతుంది. అయితే ఏ వర్గానికి ఎంత హోదా, ఎంత అంతస్తు ఇవ్వవలెనో నిర్ణయించే ప్రమాణికతలు ఎన్నెన్నో ఉన్నాయి. ఈ ప్రమాణికతల ప్రాతిపాదికగా సమాజాన్ని స్తరీకరించడం జరుగుతుంది. సమాజాన్ని స్తరీకరించడానికి ప్రాతిపాదికగా తీసుకొనే ప్రమాణికతలలో అతి ముఖ్యమైనవి ఎనిమిది. అవి. 1. సంపద, ఆస్తి, ఆదాయము, 2. కుటుంబము, బంధుత్వము, 3. నివాసప్రాంతము, 4. నివాసకాలము, 5. వృత్తి, 6. విద్య, ప్రజ్ఞ, 7. శక్తి, అధికారము, 8. సామాజిక కార్యకలాపాలు. వీటి ఆధారంగానే ఒక వ్యక్తి యొక్క, సమూహం యొక్క, వర్గం యొక్క అంతస్తు నిర్ణయింపబడుతుంది. కాబట్టి వీటిని సామాజిక స్తరీకరణకు ప్రాతిపాదికలుగా చెప్పవచ్చు.

## 16.4 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానం రాయండి.

1. సామాజిక స్తరీకరణ యొక్క ప్రమాణికతలు ఏమిటి?

2. సంపద, వృత్తి, విద్యలను సామాజిక స్తరీకరణ ప్రమాణాలుగా చర్చింపుము.

I. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానం రాయండి.

1. స్తరీకరణలో ఆస్తి ఎలా ప్రామాణికమవుతుంది.

2.శక్తి, అధికారం గురించి చర్చింపుము.

## 16.5 చదవదగిన పుస్తకాలు


Melvin Tumin : Social Stratification

Dipankar Gupta : Social Stratification

C.N. Shanker Rao : Sociology

T.B.Bottomore : Sociology

Kingsley Davis : Human Society

Haralambos : Sociology- Themes and Perspectives


B R A O U

BRAOU

# ఖండం- VI

## సామాజిక సంస్థలు

మనిషి సంఘజీవిగా మారడం వెనుక, మనిషి 'జంతు' స్థితినుంచి ఒక వ్యక్తిత్వం, హోదా గౌరవం గల 'వ్యక్తి'గా తీర్చిదిద్ది సామాజిక స్థాయిని కల్పించడం వెనుక అనేక సంస్థలు, వ్యవస్థలుంటాయి. ముఖ్యంగా కుటుంబం, ఆకుటుంబం ఇచ్చే శిక్షణ, విద్య, తద్వారా అలవడే వివేకం, మతం, రాజ్యవ్యవస్థలు అందించే నీతి, నియమపాలన ఇవన్నీ మనిషిని నడిపిస్తుంటాయి. ఇలా మనిషిని సామాజిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే సంస్థల గురించి వివరించడం ఈ ఖండం ప్రధాన లక్ష్యం. ఇందులో ఏడు ప్రధానభాగాలున్నాయి. అవి:

- కుటుంబం
- వివాహం
- బంధుత్వం
- మతం, రాజ్యం
- విద్య-ఆర్థిక వ్యవస్థ
- సామాజిక నియంత్రణ
- సామాజిక నియంత్రణ, సాధనోపకరణాలు

B R A O U

BRAOU

# భాగం - 17: కుటుంబం

విషయక్రమం


17.0 ఉద్దేశాలు

17.1 పరిచయం

17.2 కుటుంబము - అర్థం, నిర్వచనము

17.3 కుటుంబము - లక్షణాలు

17.4 కుటుంబము - ప్రకార్యాలు

17.5 కుటుంబము - రకాలు

17.5.1 వంశానుక్రమాన్ని బట్టి వర్గీకరణ

17.5.2 కుటుంబ పరిమాణాన్ని బట్టి వర్గీకరణ

17.5.3 కుటుంబముపై యాజమాన్యాన్ని బట్టి వర్గీకరణ

17.5.4 దంపతుల నివాసాన్ని బట్టి వర్గీకరణ

17.5.5 వారసత్వ సంక్రమణాన్ని బట్టి వర్గీకరణ

17.5.6 వివాహరూపాన్నిబట్టి వర్గీకరణ

17.6 భారతీయ సమాజంలోగల ప్రధాన కుటుంబ రూపాలు.

17.6.1 మాతృస్వామిక కుటుంబము

17.6.2 పితృస్వామిక కుటుంబము

17.6.3 ప్రాథమిక కుటుంబము

17.6.4 సమిష్టి కుటుంబము

17.7 ఆధునిక యుగంలో కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు

17.8 సారాంశం

17.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

17.10 చదవదగిన పుస్తకాలు


## 17.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు :

- కుటుంబము యొక్క అర్థాన్ని వివరించగలుగుతారు.
- కుటుంబ లక్షణాలను, ప్రకార్యాలను వివరించగలుగుతారు.
- కుటుంబ రకాలను గురించి చర్చించగలుగుతారు.
- కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులను గురించి చర్చించగలుగుతారు.



BRAOU

## 17.1 పరిచయం

సమాజంలో గల వివిధ సామాజిక సంస్థలన్నింటిలో కుటుంబం అతి ప్రధానమైన సామాజిక సంస్థ. సామాజిక జీవనంలో కుటుంబ అతి ముఖ్యమైన పాత్రను నిర్వహిస్తుంది. సామాజిక జీవనానికి కుటుంబం మూలస్థంబమని చెప్పవలె. సమాజం నిర్వహించే అనేక ప్రకార్యాలను కుటుంబ నిర్వహిస్తుంది. సమాజంలోని ప్రతీ వ్యక్తి కుటుంబంలో జన్మించి, పెరిగి పెద్దవాడయి, శిక్షణపొంది, కుటుంబ సభ్యుడు అయి చివరకు సమాజ సభ్యుడవుతాడు. కుటుంబము ద్వారానే వ్యక్తి సమాజంలో ప్రవేశిస్తాడు. కుటుంబములోని క్రమశిక్షణ, ప్రవర్తనా విధానంపైన ఆధారపడి వ్యక్తి సామాజిక జీవనం ఉంటుంది. వ్యక్తి సామాజిక ప్రమాణాలను కుటుంబం ద్వారా తెలుసుకొని, వాటికి అనుగుణంగా సమాజంలో ప్రవర్తిస్తూ ఉంటాడు. కాబట్టి కుటుంబ జీవన విధానానికి, సామాజిక జీవన విధానానికి అత్యంత అవినాభావ సంబంధం ఉన్నది. వ్యక్తి యొక్క దైనందిన అవసరాలైన తిండి, గుడ్డ, నివాసం, లైంగిక సంబంధాలు మున్నగునవి కుటుంబ వ్యవస్థలోనే పరితృప్తి పరచబడతాయి. వ్యక్తి ప్రవర్తన కూడా కుటుంబ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటుంది. కుటుంబం సక్రమంగా పనిచేస్తున్నట్టయితే వ్యక్తులు కూడా సక్రమంగానే ఉంటారు. కుటుంబం సక్రమంగా పనిచేయకపోయినట్టయితే వ్యక్తుల ప్రవర్తన కూడా సరిగా ఉండదు. తద్వారా సమాజ జీవన విధానాల అభివృద్ధి సరిగా ఉండక సామాజిక అవ్యవస్థకు దారితీస్తుంది. కాబట్టి కుటుంబము వ్యవస్థీకృతమైనట్లయితే సమాజం కూడా వ్యవస్థీకృతమై ఉంటుంది. కాబట్టి కుటుంబ వ్యవస్థపైననే సామాజిక వ్యవస్థకూడా ఆధారపడి ఉంటుందనడంలో సందేహంలేదు.

అయితే కుటుంబము అన్ని సమాజాలలోనూ అన్ని కాలలలోనూ ఉన్నప్పటికీ అది ఒకే రూపంలో లేదు. వివిధ సమాజాలలో వివిధ రూపాలతో ఉన్నది. కాలానుగుణంగా సమాజం మారుతున్నట్లే కుటుంబ వ్యవస్థ కూడా మార్పు చెందుతుంది. ఆదిమ వాసుల కుటుంబ వ్యవస్థకు, ఆధునిక మానవుల కుటుంబ వ్యవస్థకు అనేక లక్షణాలలో తేడా కనబడుతుంది. ప్రాచీన హిందూ సమాజంలో ఉన్న కుటుంబ వ్యవస్థకు, ఆధునిక భారతీయ సమాజంలో ఉన్న కుటుంబ వ్యవస్థకు అనేక వ్యత్యాసాలు ఉన్నాయి. పారిశ్రామికీకరణ, నగరీకరణ, ఆధునికీకరణ ప్రక్రియల ప్రభావం వల్ల కుటుంబ వ్యవస్థ అనేక మార్పులకు లోనయింది.

పై అంశాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు కుటుంబం యొక్క అర్థం, లక్షణాలు, ప్రకార్యాలు, కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు మున్నగు విషయాలను గురించి కూలంకుషంగా చర్చిద్దాం.

BRAOU

## 17.2 కుటుంబం- అర్థం, నిర్వచనం

కుటుంబం అనే పదం ఇంగ్లీషు భాషలోని ఫ్యామిలి (family) అనే పదం, రోమన్ పదం అయిన ఫేములస్ (famulus) అనే పదాన్నుంచి తీసుకోబడిందని సమాజ శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. ఫేములస్ అంటే సేవకుడు(servent) అనే అర్థం స్ఫురిస్తుంది. మరికొందరు సమాజ శాస్త్రజ్ఞులు ఇంగ్లీషు భాషలో వాడే ఫ్యామిలి (family) అనే పదం ఫేమిలియా(familia) అనే లాటిన్ పదాన్నుంచి గ్రహించబడిందని భావిస్తున్నారు. అయితే ఫేమిలియా అంటే కుటుంబం అని, అది సేవకులు, బానిసలు, కుటుంబ సభ్యులు తదితరులతో కలిసి ఉండేదని తెలుస్తుంది. అయితే ప్రస్తుతం ఈ పదాన్ని పైన చెప్పిఇన రీతిలో కాకుండా మరోవిధంగా ఉపయోగించడం జరుగుతున్నది. వైవాహిక మరియు రక్త సంబంధం ద్వారా బంధుత్వాన్ని కలిగియుండి, ఒకే గృహంలో నివసించే వ్యక్తుల సమూహాన్ని కుటుంబం అని సమాజశాస్త్రవేత్తలు చెప్పడం జరుగుతున్నది. అంటే కుటుంబమనేది వైవాహిక, రక్త బంధుత్వాన్ని కలిగియున్న వ్యక్తుల సమూహమని చెప్పవచ్చు.

### నిర్వచనం

ఆర్.ఎమ్.మెకైవర్ అనే సమాజశాస్త్రవేత్త కుటుంబాన్ని ఈవిధంగా నిర్వచించినాడు. "కుటుంబము ఒక సమూహము. ఆ సమూహము లైంగిక సంబంధాలతో ఉండి చాలినంతవరకు సరిపడేవిధంగా పిల్లలనుకని, పెంచడం కోసం శాశ్వతముగా ఏర్పడినదే కుటుంబము"

ఇ.డబ్ల్యూ. బర్జెస్, హెచ్.జె.లాక్ అనే ఇద్దరు సమాజశాస్త్రజ్ఞులు కుటుంబము అనే పదాన్ని ఈ విధంగా నిర్వచించారు. "కుటుంబము కొందరు వ్యక్తుల సమూహము. ఇది వివాహ సంబంధముద్వారాకానీ, రక్త సంబంధం ద్వారాకానీ, దత్తతద్వారా కానీ ఒకే గృహాన్ని ఏర్పాటు చేసుకొని వారు ఒకరికొకరు తమ సాంఘికపాత్రల ద్వారా పరస్పర అంతః క్రియలు, పరస్పర భావ ప్రకటనల ద్వారా భార్య, భర్త, తల్లి, తండ్రి, అన్న, చెల్లెలుగా, కొడుకు, కుమార్తెగా ఏర్పడి ఒక ఉమ్మడి సంస్కృతిని నిర్మాణం చేసుకుంటారు." పైనిర్వచనాలను అనుసరించి, కుటుంబము అంటే వివాహ బంధముద్వారాకానీ లేదా రక్త సంబంధము ద్వారాకానీ, బంధుత్వాన్ని కలిగి ఉండి ఒకే గృహములో నివాసముండే వ్యక్తుల సమూహము. కుటుంబ సభ్యుల మధ్య శాశ్వత బంధుత్వ సంబంధాలుంటాయి. ప్రతివ్యక్తి కుటుంబములో సభ్యుడుగా ఉండి వివిధ పాత్రలను పోషించడం జరుగుతంది.

## 17.3 కుటుంబము - లక్షణాలు

కుటుంబ వ్యవస్థ కొన్ని ప్రత్యేక లక్షణాలను కలిగియున్నది. సుదీర్ఘ పరిణామ క్రమంలో కుటుంబ వ్యవస్థ కొన్ని ప్రత్యేక లక్షణాలను సంతరించుకొన్నది. అయితే ఈ లక్షణాలను గురించి చర్చించేముందు కుటుంబ వ్యవస్థ ఏవిధంగా ఆవిర్భవించిందో, అది ప్రస్తుత స్థితికి ఏవిధంగా వచ్చిందో తెలుసుకోవడం చాలా అవసరం. కుటుంబం పుట్టుపూర్వోత్తరాల గురించి అనేక పరిశోధనలు జరిపి వివిధ శాస్త్రవేత్తలు రకరకాల అభిప్రాయాలను వెలిబుచ్చడం జరిగింది. సమాజంలో మానవుడు పుట్టిన మొట్టమొదటి రోజుల్లో కుటుంబ వ్యవస్థ అనేది ఉండేది కాదని, ఆనాడు స్త్రీ, పురుషులు జంతువుల వలె లైంగిక విశృంఖలత్వముతో మెలగి చిన్న చిన్న గుంపులుగా నివసించేవారని ఎల్.హెచ్.మోర్గాన్ అనే శాస్త్రవేత్త తెలియపరిచినాడు. మోర్గాన్ ప్రకారం మొట్టమొదట స్వైరతుండేదని, తర్వాత సమాజంలో చాలా మార్పులతో, స్త్రీ సాంఘిక, మానసిక, ఆర్థిక సహాయాన్ని కోరుకొని పురుషునితో క్రమబద్ధమైన లైంగిక సంబంధాన్ని ఏర్పరచుకోవడం ద్వారా కుటుంబ వ్యవస్థ అనేది ఉద్భవించిందని తెలిపినాడు. ఈ క్రమంలో మొట్ట మొదట మాతృస్వామిక కుటుంబవ్యవస్థ ఆవిర్భవించిందని, ఆతర్వాత కొంత కాలానికి పితృస్వామిక కుటుంబ వ్యవస్థగా మారి అభివృద్ధి చెందినదని మోర్గాన్ తెలిపినాడు.

మానవుడు లైంగిక వాంఛలను క్రమబద్ధం చేసుకొని, పిల్లలను కని, పెంచి, పెద్దవాళ్లనుచేని, తమ వంశాన్ని, జాతిని అభివృద్ధి చేయవలెననే కోరిక ఏర్పడిన నాటినుంచి కుటుంబం అనేది ఉద్భవించిందనికొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం. అంతేగాక, స్త్రీ, పురుషులలో శారీరకముగా తేడాలు ఉండడం వల్ల పురుషుడు వ్యవసాయపు పనులు, వృత్తి విద్యలను చేపట్టడం, స్త్రీ పిల్లలను కని పెంచడంవల్లను, సాంఘిక ఆర్థిక అవసరాలను తీర్చుకోవడం కోసం కుటుంబ వ్యవస్థ ఏర్పడిందని మరికొందరి అభిప్రాయం. ఏది ఏమైనప్పటికిని, కుటుంబ వ్యవస్థ అనేది ఒక్కసారిగా, హటాత్తుగా ఉద్భవించిందికాదు. ఇది మానవజాతి చరిత్రలో సమాజపరిణామ వికాసాల క్రమాభివృద్ధిలో ఏర్పడిన వ్యవస్థారూపం. మానవునకు పుట్టినది మొదలుకొని చనిపోయేవరకు కుటుంబము యొక్క అవసరం, ఆదారం, ఆదరణ మున్నగునవి అన్ని అత్యంత అవసరం. అంతేకాక మానవుడు పుట్టుకతో కుటుంబ సభ్యుడు అయి సాంఘీకరణ ప్రక్రియద్వారా సంఘజీవి అవుతాడు. వ్యక్తి వ్యక్తిత్వాన్ని, మూర్తిమత్వాన్ని అభివృద్ధి పరచి, జీవితాన్ని తీర్చిదిద్దేది కుటుంబమేనని చెప్పక తప్పదు. కాబట్టి కుటుంబ వ్యవస్థ అనేది కాలక్రమంలో వివిధ దశలుగా పరిణామం చెందుతూ ఏర్పడిన వ్యవస్థ అని చెప్పవచ్చు.

ఇప్పుడు కుటుంబం యొక్క లక్షణాలను గురించి చర్చిద్దాం. కుటుంబం యొక్క ప్రధాన లక్షణాలను ఈ క్రిందివిధంగా వివరించవచ్చు. అవి:

### 1. వివాహం (marriage)

వివాహం కుటుంబానికి పునాది. వివాహ వ్యవస్థ మూలంగానే కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుంది. వివాహ బంధమే భార్యాభర్తలను ఇద్దరినీ దగ్గరికి చేర్చి మిథున సంబంధాలకు సామాజిక ఆమోదం, అనుజ్ఞ లభింపజేస్తుంది. వివాహ వ్యవస్థ విశ్వజనీనమైనది. అయితే వివిధ సమాజాలలో వివాహ రూపాలు వివిధ రకాలుగా ఉంటాయి. కాబట్టి వివాహ రూపాలలో సమాజానికి, సమాజానికి మధ్య తేడాలుంటాయి. వివిధ సమాజాలలో



BRAOU

వివాహం అనేక నియమాలపై ఆధారపడి ఉంటుంది. కొన్ని సమాజాలలో ఏక వివాహ పద్ధతి అనగా ఒక స్త్రీ ఒక పురుషున్ని మాత్రమే, లేదా ఒక పురుషుడు ఒక స్త్రీని మాత్రమే వివాహం చేసుకోవడం అనేది ఉంటుంది. మరికొన్ని సమాజాలలో బహుభార్యత్వంగానీ, బహుభర్తృత్వంగానీ ఆచారంలో ఉంది. బహుభార్యత్వ పద్ధతి అంటే ఒక పురుషుడు ఒకరికంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకోవడం ఆచారం. అదే విధంగా బహు భర్తృత్వం పద్ధతి అంటే ఒక స్త్రీ ఒకరికంటే ఎక్కువమంది పురుషులను వివాహం చేసుకోవడం ఆచారం. అయితే నేటి ఆధునిక నాగరికతా సమాజంలో హెచ్చుగా ఏకవివాహ పద్ధతి అమలులో ఉంది. అంతేకాక వివాహం నిర్ణయించడంలోనూ, వివాహం జరిగే పద్ధతిలోనూ, సమాజానికి, సమాజానికి మధ్య బేధాలు ఉంటాయి. కొన్ని సమాజాలలో తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలు, బంధువులు కలిసి వధువు వరులను నిర్ణయించి వివాహం చేయడం జరుగుతుంది. మరికొన్ని సమాజాలలో వివాహం కాబోయే యువతీ యువకులకే వివాహ నిర్ణయం వదిలివేస్తారు. కొన్ని సమాజాలలో వరకట్న పద్ధతి ఉంటే మరికొన్ని సమాజాలలో కన్యాశుల్కం పద్ధతి అమలులో ఉంది. కొన్ని సమాజాలలో యువతీయువకులు ప్రేమించి పెళ్లిచేసుకుంటే, మరికొన్ని సమాజాలలో వివాహం అయిన తర్వాత అనురాగాన్ని పెంపొందించుకొని జీవితాన్ని కొనసాగిస్తారు. కొన్ని సమాజాలలో వివాహం అనేది శాశ్వతమైన పవిత్ర బంధంగా భావిస్తే మరికొన్ని సమాజాలలో అది భార్యాభర్తల మధ్యగల తాత్కాలిక ఒప్పందంగా భావిస్తారు. ఈవిధంగా వివాహం అనేది వేర్వేరు రూపాలలో ఉండి, వివిధ రకాలైన పద్ధతులను, ఆచారాలను పాటించడం జరుగుతున్నది.

## 2. మైథున సంబంధం

కుటుంబ లక్షణాలలో మరొక ముఖ్యలక్షణం స్త్రీ, పురుషుల మధ్య గల జైవిక సాంగత్యం. ఈ జైవిక సాంగత్యమనేదానికి వివాహం ద్వారా సామాజికామోదం లభిస్తుంది. మిథున సంబంధం ద్వారా భార్యాభర్తలిద్దరూ అనురాగ బంధాలను కలిగి జీవితాంతం కలిసిమెలసి ఉండటానికి అవకాశం ఉంది. అయితే మిథున సంబంధాల ద్వారా దంపతులు పిల్లలను కని, పెంచి సమాజం నిరంతరం కొనసాగడానికి తోడ్పడడం జరుగుతుంది. ఎందుకంటే సమాజంలో వ్యక్తి తాత్కాలికం. సమాజం శాశ్వతమైంది. సమాజం శాశ్వతంగా కొనసాగాలంటే జనాభా పూరణం అవసరం. ఈజనాభా పూరణం ప్రాకార్యాన్ని దంపతులు సామాజికామోదమైన పద్ధతుల ద్వారా పరిపూర్ణం చేయడం జరుగుతుంది. అయితే ఈ మిథున సంబంధాలనేవి ఆయా సంబంధాల ఆచారాలు, నియమ నిబంధనలు, పద్ధతులను అనుసరించి శాశ్వత ప్రాతిపాదికపై జీవితాంతం ఉండవచ్చు లేదా తాత్కాలిక ప్రాతిపాదికపై కొంత పరిమితకాలం మాత్రమే ఉండవచ్చు. ఏదేమైనా స్త్రీ, పురుషుల మధ్యగల ఈ జైవిక సంబంధం అనేది సమాజశాశ్వతానికి చాలా అవసరమైనది. అయితే దీనిని సమాజ నియమాలకు అనుగుణంగా క్రమబద్ధీకరించడం కూడా అంతే అవసరమని చెప్పవచ్చు.

## 3. నామకరణ పద్ధతి

నామకరణ పద్ధతి అనేది దాదాపు అన్ని సమాజాలలో ఉంటుంది. ప్రతి కుటుంబానికి ఒక పేరు అనేది ఉంటుంది. అంటే ఒక కుటుంబాన్ని, ఆ కుటుంబానికి చెందిన వ్యక్తులను, బంధువులను, ప్లిలలను గుర్తుపట్టడానికి వీలుగా ఒక కుటుంబ నామం లేదా పేరు అనేది ఉంటుంది. ఈ కుటుంబ నామం ద్వారా ఒక వ్యక్తి ఏ కుటుంబానికి లేదా ఏ వంశానికి చెందిన వాడో గుర్తించడం జరుగుతుంది. సాధారణంగా ఈ నామకరణం అనేది పితృస్వామ్య లేదా మాతృస్వామ్య పద్ధతులతో సంబంధాన్ని కలిగి యుంటుంది. పితృస్వామిక కుటుంబాలో భార్య, ప్లిలలు, భర్త, కుటుంబం పేరుతో వ్యవహరించడం జరుగుతుంది. అదేవిధంగా మాతృస్వామిక కుటుంబాలలో పురుషుడు వివాహానంతరం తన భార్య కుటుంబం పేరుతో వ్యవహరింపబడతాడు.

## 4. ఆర్థికపరమైన రక్షణ

కుటుంబ వ్యవస్థ అనేది కుటుంబ సభ్యులందరికీ ఆర్థికపరమైన, సామాజిక పరమైన రక్షణను కల్పిస్తుంది. కుటుంబంలోని వ్యక్తుల అవసరాలను తీర్చడానికి కుటుంబానికి కొన్ని ఆర్థిక సదుపాయాలు, తద్వారా ఆర్థికపరమైన రక్షణలు ఉంటాయి. కుటుంబ పోషణకు కుటుంబ పెద్ద భూవసతితోగానీ, వ్యాపారం చేస్తూగానీ,

ఉద్యోగం చేస్తూగానీ కొంత ఆదాయాన్ని సమకూర్చుకొని కుటుంబ సభ్యుల అవసరాలను తీర్చడం జరుగుతుంది. అయితే ఒక్కొక్క కుటుంబం ఒక్కొక్క రకంగా, ఒక్కొక్క స్థాయిలో ఆర్థిక సదుపాయాలను, స్థితిగతులను కలిగియుంటాయి. అన్ని కుటుంబాల ఆర్థిక స్థితిగతుల మధ్య చాలా వ్యత్యాసాలుంటాయి. అయితే సమాజంలో అన్ని కుటుంబాలకు ఆర్థిక పరమైన వసతి, రక్షణ అనేది చాలా అవసరం. ఆయా కుటుంబాలలో గల వ్యక్తులు వారి వారి సామర్థ్యాలను, మేధాశక్తిని బట్టి ఆర్థిక పరమైన సదుపాయాలను సమకూర్చుకోవడం జరుగుతుంది.

### 5. ఉమ్మడి నివాసం

సాధారణంగా ఒక కుటుంబానికి చెందిన సభ్యులందరూ ఒకే గృహంలో నివాసముంటారు. కుటుంబ సభ్యులందరు నివసించడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, దైనందిన కార్యక్రమాలకు ఒక ఉమ్మడి నివాసం చాలా అవసరం. ఉమ్మడి నివాసం లేనట్లయితే పిల్లలను కని, పెంచి, పెద్దవాళ్లను చేయడానికి వీలుండదు. అందువల్ల ప్రతి సమాజంలో ఒక కుటుంబానికి చెందిన సభ్యులందరికీ ఒకే ఉమ్మడి నివాసం తప్పనిసరిగా ఉంటుంది. ఈవిధంగా కుటుంబ వ్యవస్థ పైన పేర్కొన్న ప్రధాన లక్షణాలను కలిగి ఉంటుంది. ఇప్పుడు కుటుంబ ప్రకార్యాలను చర్చిద్దాం.

## 17.4 కుటుంబం ప్రకార్యాలు

వివిధ సమాజ శాస్త్రవేత్తల ప్రకారం కుటుంబం కొన్ని ప్రధాన ప్రకార్యాలను నిర్వర్తిస్తుంది. అయితే కుటుంబం నిర్వర్తించే ప్రకార్యాలన్నింటినీ సమీకరించి, కొన్ని ప్రధాన రకాలుగా వర్గీకరించడం జరిగింది. ఆగ్‌బర్న్, నిమ్‌కాఫ్ తదితర సమాజశాస్త్రవేత్తల ప్రకారం కుటుంబం యొక్క ప్రకార్యాలను ఈక్రింది విధంగా వివరించవచ్చు. అవి:

1. జైవిక ప్రకార్యము (Biological Function)
2. ఆర్థిక ప్రకార్యము (Economic Function)
3. సామాజిక ప్రకార్యము (Social Function)
4. మతపరమైన ప్రకార్యము (Religious Function)
5. విద్యాపరమైన ప్రకార్యము (Educational Function)
6. మానసిక పరమైన ప్రకార్యము (Psychological Function)

పైన పేర్కొన్న ప్రకార్యాలను గురించి ఈ క్రింద వివరంగా చర్చిద్దాం.

### 17.4.1 జైవిక ప్రకార్యము

కుటుంబ ప్రకార్యాలలో జైవిక ప్రకార్యము అతి ప్రధానమైనది. వాస్తవికంగా ఈ ప్రకార్యం ద్వారానే మానవజాతి నిరంతరం కొనసాగుతుంది. కుటుంబ వ్యవస్థ మానవుడని లైంగిక వాంఛలను తీర్చుకోవడానికి, వివాహ పద్ధతి ద్వారా సంతానోత్పత్తికి దోహదం చేస్తుంది. దీనిద్వారా మానవ జాతి పెంపొందడానికి వీలుపడుతుంది. సహజమైన సంతాన వాంఛను స్త్రీ, పురుషులిద్దరూ కుటుంబ సంస్థద్వారా తీర్చుకుంటారు. కుటుంబ వ్యవస్థ అనేది స్త్రీ, పురుషుల మధ్యగల లైంగిక సంబంధాలకు సామాజికామోదాన్ని కల్పిస్తూ ఆయా సంబంధాలను క్రమబద్ధీకరిస్తుంది. కుటుంబ వ్యవస్థయొక్క నియమాలననుసరిస్తూ స్త్రీ, పురుషులు దాంపత్యజీవనాన్ని గడపవలసి ఉంటుంది.

### 17.4.2 ఆర్థిక ప్రకార్యము

కుటుంబం అనేది ఒక ఆర్థికపరమైన యూనిట్. అది ఉత్పత్తిపరమైన, వినియోగపరమైన ప్రకార్యాలను

నిర్వరిస్తుఉంది. కాబట్టి కుటుంబం ఒక నిర్మాణాత్మక క్రమం అయినప్పటికీ అందులో ఉన్న సభ్యులను పోషించడం అనేది ఒక ప్రధాన ప్రకార్యం. వ్యక్తుల భౌతిక, ఆర్థిక అవసరాలు తీర్చే బాధ్యత కుటుంబంపైననే ఉంటుంది. ముఖ్యంగా కుటుంబ పెద్దలు ఇతర కుటుంబ సభ్యుల అవసరాలను తీర్చడానికి కృషిచేయడం జరుగుతుంది. అయితే సాధారణంగా వ్యక్తుల అవసరాలను తీర్చడంలో కుటుంబ సభ్యులందరూ కలిసి మెలసి తమ శక్తికి తగినట్లు పనిచేస్తారు. కుటుంబంలో శ్రమవిభజన అనేది వయస్సును, లింగాన్నిబట్టి పంపిణీ చేయబడి ఉంటుంది. అంటే కుటుంబ సభ్యుల శక్తి, సామర్థ్యం, బలం, బలహీనతలు, వయస్సు, ఆరోగ్యస్థితి మున్నగువాటిని పరిగణలోకి తీసుకొని పని విభజన చేయడం జరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, అశక్తతలకు గురిఅయినవారు, రోగగ్రస్తులు మున్నగువారియొక్క పోషణ భారం పూర్తిగా కుటుంబ సంస్థపైననే ఆధారపడి ఉంటుంది. సాధారణంగా కుటుంబ సభ్యులందరూ వారి వారి శక్తియుక్తులను బట్టి ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనడం జరుగుతుంది. అయితే భారతీయ వ్యవస్థలో కుటుంబ ఆస్తిపైన కుటుంబంలోని పెద్దలు మాత్రమే అజమాయిషీని కలిగి ఉంటారు.

### 17.4.3 సామాజిక ప్రకార్యము

ఇంతకుముందే చెప్పినట్లుగా సమాజంలోని ప్రతీవ్యక్తి ఏదో ఒక కుటుంబంలో సభ్యుడు. కుటుంబంద్వారా వ్యక్తులకు సాంఘిక, ఆర్థిక అంతస్తు, హోదా సంక్రమిస్తుంది. అంతేగాక వ్యక్తులకు కుటుంబసభ్యులుగా కుటుంబ వారసత్వం సంక్రమిస్తుంది. వారసత్వంగా పొందిన అంతస్తును, హోదాను పరిరక్షించుకోవడానికి వ్యక్తులు కృషి సల్పడం జరుగుతుంది. అయితే కుటుంబం యొక్క సామాజిక ప్రకార్యాలలో అతి ముఖ్యమైనది సాంఘికీకరణ. సమాజంలో పుట్టిన ప్రతీ శిశువు అనేక అనుభవాలను పొంది, సామాజిక పరంగా, వ్యక్తిగా నిలబడి పనిచేయడానికి వీలైన ప్రక్రియనే సాంఘికీకరణ అంటారు. ఈ సాంఘికీకరణ ప్రక్రియ వల్లనే జైవికపరమైన శిశువు, సామాజిక పరమైన వ్యక్తిగా రూపొందడం జరుగుతుంది. సాంఘికీకరణ ప్రక్రియ మూలంగానే వ్యక్తి మానసిక వికాసాన్ని పొంది సంపూర్ణ మానవుడుగా రూపొందడం జరుగుతుంది. సాంఘికీకరణ ప్రక్రియ అనేది వ్యక్తిత పుట్టుకతో ప్రారంభమై చనిపోయేవరకు నిరంతరం కొనసాగుతుంది. సమాజంలో గల అనేక ప్రమాణాలు, విలువలు, ఆచారవ్యవహారాలు మొదలైన సాంస్కృతిక విషయాలను తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పుతారు. సాధారణంగా అన్ని విషయాలలోనూ పిల్లలు, పెద్దలను అనుసరిస్తారు. కనుక పెద్దలు పిల్లలకు అనిన వివషయాలలో ఆదర్శప్రాయులుగా ఉండాలి. పిల్లల ప్రవర్తన, మూర్తిమత్వాభివృద్ధి కుటుంబ సభ్యులు ఇచ్చే శిక్షణపైననే ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా వ్యక్తియొక్క సాంఘికీకరణ ప్రక్రియలో కుటుంబం ప్రధాన పాత్రను వహిస్తుంది. అసలు వ్యక్తి మూర్తిమత్వాభివృద్ధి అనేది కుటుంబంనుండే ప్రారంభమవుతుంది. సాంఘికీకరణతోపాటు కుటుంబం సామాజిక నియంత్రణా సాధనంగా కూడా పనిచేస్తుంది. వ్యక్తి సామాజిక విలువలకు, ప్రమాణాలకు అనుగుణంగా ప్రవర్తించకపోయినట్లయితే కుటుంబ సభ్యులు ఆ వ్యక్తియొక్క ప్రవర్తనను నియంత్రించి, సరిచేయడం జరుగుతుంది. కాబట్టి కుటుంబం అనియత నియంత్రణా సాధనంగా కూడా పనిచేస్తుందని చెప్పవచ్చు.

### 17.4.4 మతపరమైన ప్రకార్యము

కుటుంబం మతపరమైన విలువలను, ప్రమాణాలను, ఆచారాలను, సంప్రదాయాలను కుటుంబ సభ్యులకు అందజేస్తుంది. ఈ మతపరమైన విలువల మూలంగా సమాజసభ్యులలో నైతిక విలువలు పెంపొందుతాయి. దీనికి కుటుంబం ఎంతగానో దోహదపడుతుంది. అంటే కుటుంబ సభ్యులలో నైతిక ప్రవర్తనను పెంపొందించడానికి కుటుంబ సంస్థ కృషి సల్పుతుందని చెప్పవచ్చు.

### 17.4.5 విద్యాపరమైన ప్రకార్యము

కుటుంబం మొదటి పాఠశాల అని సమాజశాస్త్రజ్ఞుల భావన. కుటుంబం పిల్లలకు ఎన్నోరకాలయిన విషయాలను నేర్పుతుంది. సాంఘికీకరణ ప్రక్రియలో భాగంగా కుటుంబ సభ్యులు పిల్లలకు సమాజానికి సంబంధించిన ఎన్నో విషయాలను వివరంగా చెప్పడం జరుగుతుంది. అందువల్ల కుటుంబాన్ని అనియత పాఠశాల అని చెప్పవచ్చు. కుటుంబం ద్వారానే పిల్లలు సామాజిక విలువలు, ప్రమాణాలు, సంప్రదాయాలు మున్నగువాటిని



BRAOU

అంర్గతీకరణం చేసుకోవడం జరుగుతుంది.

### 17.4.6 మానసిక పరమైన ప్రకార్యము

మానవునికి జైవిక, సామాజిక, ఆర్థికావసరాలతో పాటు మానసిక పరమైన అవసరాలు కూడా ఉంటాయి. మానవుని సామాజిక అవసరాలన్నింటిలోను అనురాగము, ప్రేమ ప్రధానమైనవిగా చాలామంది భావిసా&తరు. ప్రేమకు, ఆదరణకు, అనురాగానికి నోచుకోని వ్యక్తులు చాలా మానసిక సమస్యలకు గురిఅవుతారని అనేక మనోవిజ్ఞాన పరిశోధనలు చెబుతున్నాయి. అటువంటి అనురాగము, ప్రేమ, ఆదరణలను వ్యక్తి కుటుంబలోనే హెచ్చుగా పొందడానికి అవకాశముంటుంది. కుటుంబ పెద్దలు తమ పిల్లల మీద ప్రేమానురాగాలను చూపిస్తారు. అనురాగం పొందవలెనన్నా, అనురాగం చూపవలెనన్నా కుటుంబలోనే వీలవుతుంది. తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు దూరమైన పిల్లలు విచలిత ప్రవర్తనను కలిగి బాలనేరస్తులుగా తయారయ్యే అవకాశాలుంటాయని వివిధ సమాజశాస్త్ర పరిశోధనలు సూచిస్తున్నాయి. కాబట్టి సమాజంలో ప్రతివ్యక్తికి ప్రేమానురాగాలనేవి తప్పనిసరి. అప్పుడే వ్యక్తికి మానసిక స్థిరత్వం కలుగుతుంది. లేనట్లయితే వ్యక్తి వైయుక్తిక అసమాయోజనకు గురవుతాడు.

ఈవిధంగా కుటుంబం జైవిక, సామాజిక, ఆర్థిక, మతపరమైన, విద్యాపరమైన, మానసిక పరమైన ప్రకార్యాలను నిర్వర్తిస్తుంది.

## 17.5 కుటుంబము - రకాలు

ప్రతి సమాజంలోను కుటుంబం ముఖ్యమైన ప్రాథమిక సమూహం. ఇది సమాజంలో గల మౌలిక సంస్థ. అయితే సమాజానికి, సమాజానికి మధ్య కుటుంబ పద్ధతులలో, స్వరూప స్వభావాలలో వ్యత్యాసాలు కనిపిస్తాయి. ఒక్కొక్క సమాజంలో ఒక్కొక్క రకమైన కుటుంబ వ్యవస్థ కనబడుతుంది. అయితే సమాజానికి, సమాజానికి కుటుంబ రకాలలో తేడాలున్నప్పటికీ, కుటుంబ వ్యవస్థ అనేది ఏదో ఒకరూపంలో అన్ని సమాజాలలోను ఉన్నది. అయితే కుటుంబ స్వరూప స్వభావలను బట్టి కుటుంబాలను వివిధ రకాలుగా విభజించడం జరిగింది. ఇప్పుడు కుటుంబ రకాలను గురించి వివరంగా చర్చిద్దాం.

### 17.5.1 వంశానుక్రమాన్ని బట్టి వర్గీకరణ

వంశానుక్రమాన్ని బట్టి కుటుంబాన్ని మూడురకాలుగా వర్గీకరించవచ్చు.

1. మాతృవంశీయ కుటుంబం (Matrilineal family)

2. పితృవంశీయ కుటుంబం (Patrilineal family)

3. పితృ-మాతృవంశీయ కటుంబం (Patri-marilineal family or Bilateral descent family)

తల్లిని మూలజననిగా లేదా వంశకర్తగా పరిగణించి, ప్రతివ్యక్తి తన తల్లిద్వారానే తన వంశాను&రకమాన్ని గ్రహిస్తే దానినిన మాతృవంశీయ కుటుంబం అంటారు.

తండ్రిని మూలజనకునిగా లేదా వంశకర్తగా పరిగణించి, ప్రతివ్యక్తి తండ్రి ద్వారానే తన వంశానుక్రమాన్ని గ్రహిస్తే దానిని పితృవంశీయ కుటుంబం అంటారు.

ఒక వ్యక్తి తన మాతృబంధువర్గం వారితోను, పితృబంధువర్గం వారితోను బంధుత్వాన్ని కలిగియుండి, ఆరెండు పక్షాల వారిని మూల పురుషులుగా భావిస్తే ఆవిధానాన్ని పితృ-మాతృ వంశీయ కుటుంబం లేదా ద్వంద్వ వంశానుక్రమం అంటారు.

### 17.5.2 కుటుంబ పరిణామాన్ని బట్టి వర్గీకరణ

కుటుంబ పరిమాణాన్నిబట్టి కుటుంబాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

1. ప్రాథమిక కుటుంబం లేదా వ్యష్టి కుటుంబం (Nuclear Family)

2. సమిష్టి కుటుంబం (Joint Family)

భార్య భర్తలు,వారి అవివాహిత సంతానం ఒక కుటుంబ సభ్యులైతే అటువంటి కుటుంబాన్ని ప్రాథమిక కుటుంబం లేదా వ్యష్టి కుటుంబం అంటారు.

తల్లి దండ్రులు, వివాహితులైన బిడ్డలు, వారి పిల్లలు, ఇతర రక్తబంధువులు, ఈవిధంగా రెండు, మూడు తరాలకు చెందిన బంధు వర్గం సమిష్టిగా ఒకే గృహంలో నివసిస్తూ, ఉమ్మడి ఆస్తిని కలిగియుండి, సమిష్టి జీవనం గడుపుతున్నట్లయితే దానిని సమిష్టి కుటుంబం అంటారు.

### 17.5.3 కుటుంబంపై యాజమాన్యాన్ని బట్టి వర్గీకరణ

కుటుంబంపై యామాన్యాన్ని బట్టి కుటుంబాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు:

1.పితృ స్వామిక కుటుంబం

2.మాతృ స్వామిక కుటుంబం

కుటుంబంపై యామాన్యం, అధికారం పురుషుని చేతిలో ఉంటే ఆకుటుంబాన్ని పితృ స్వామిక కుటుంబం అంటారు. అలాగే కుటుంబంపై అధికారం,యామాన్యం స్త్రీ చేతిలో ఉంంటే ఆకుటుంబాన్ని మాతృస్వామిక కుటుంబం అంటారు.

### 17.5.4. దంపతుల నివాసాన్ని బట్టి వర్గీకరణ

దంపతుల నివాసాన్ని బట్టి కుటుంబాన్ని ఐదు రకాలుగా వర్గీకరించవచ్చు:

1.పితృ స్థానిక కుటుంబం

2.మాతృ స్థానిక కుటుంబం

3.ద్విస్థానిక కుటుంబం

4.మాతుల స్థానిక కుటుంబం

5.నూతన స్థానిక కుటుంబం

వివాహానంతరం భార్యభర్తలు భర్త గృహంలోనే కాపురం చేస్తుంటే దానిని పితృ స్థానిక కుటుంబం లేదా పతి స్థానిక నివాస కుటుంబం అంటారు. వివాహానంతరం భార్య భర్తలు భార్య గృహంలో కాపురం చేస్తుంటే దానిని మాతృ స్థానిక కుటుంబం లేదా పత్నీ స్థానిక నివాస కుటుంబం అంటారు. ఈనివాస స్థల నిర్ణయం సమాజ ఆచారం ప్రకారం జరుగుతుంది. వివాహనంతరం భార్య భర్తలు భర్త పుట్టింటిలోను, భార్య పుంట్టిటిలోను కాపురం చేస్తే దానిని ద్విస్థానిక కుటుంబం అంటారు. వివాహనంతరం భర్త తన భార్యతో కలిసి తన తల్లి సోదరుని అంటే మేనమామ ఇంటిలో నివాస మేర్పరచుకుంటే దానిని మాతుల స్థానిక నివాస కుటుంబం అంటారు. ఈఆచారం కొన్ని ఆదిమ తెగలలోఉన్నది. వివాహానంతరం భార్య భర్తలు ఎవరి ఇంటిలోను కాపురం ఉండక నూతనంగా వారొక చోట కాపురం ఉంటే దానిని నూత్న లేదా నూతన స్థానిక కుటుంబం అంటారు.

### 17.5.5.వారసత్వ సంక్రమణాన్ని బట్టి వర్గీకరణ

వారసత్వ సంక్రమణాన్ని బట్టి కుటుంబాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు:



BRAOU

1.మాతృ వారసత్వ సక్రమణ కుటుంబము.

2.పితృ వారసత్వ సంక్రమణ కుటుంబము.

కుటుంబ యామాన్యము తల్లి వహిస్తూ, ఆస్తి వారసత్వం తల్లి నుంచి కుమార్తెలకు సంక్రమిస్తే దానిని మాతృ వారసత్వ సంక్రమణ కుటుంబం అంటారు. కుటుంబ యాజమాన్యం తండ్రి వహిస్తూ, ఆస్తి వారసత్వం తండ్రి నుండి కుమారునకు సంక్రమిస్తే దానిని పితృ వారసత్వ సంక్రమణ కుటుంబం అంటారు.

### 17.5.6. వివాహ రూపాన్ని బట్టి వర్గీకరణ

వివాహ రూపాన్ని బట్టి కుటుంబాన్ని రెండు రకాలుగా వర్గీకరించడం జరిగింది.

1. ఏక వివాహ కుటుంబము

2. బహువివాహ కుటుంబము

బహువివాహ కుటుంబాన్ని మళ్లీ రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: బహుభార్యత్వ కుటుంబము (Polygenous family), 2. బహు భర్తృత్వ కుటుంబము(Polyandrous family).

ఒక వ్యక్తి ఒకరిని మాత్రమే వివాహం చేసుకొని కాపురం చేసే&త దానిని ఏక వివాహ కుటుంబము అంటారు. ఒక వ్యక్తి ఒకరికంటే ఎక్కువ మంది భార్యలను గానీ, లేక భర్తలను గాని కలిగి యున్నట్లయితే అటువంటి కుటుంబాన్ని బహు వివాహ కుటుంబము అంటారు. ఒక పురుషుడు ఒకరికంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకొని కాపురం చేస్తే అటువంటి కుటుంబాన్ని బహుభార్యత్వ కుటుంబము అంటారు. అదే విధంగా ఒక స్త్రీ ఒకరికంటే ఎక్కువ మంది పురుషులను వివాహం చేసుకొని కాపురం చేస్తే అటువంటి కుటుంబాన్ని బహు భర్తృత్వ కుటుంమము అంటారు. బహు భార్యత్వ కుటుంబాలు ఎక్కువగా ముస్లింలలోనూ, భహు భర్తృత్వ కుటుంబాలు తోడా తెగలలోనూ కనబడుతాయి.

## 17.6 భారతీయ సమాజంలో గల ప్రధాన కుటుంబ రూపాలు

ఇప్పుడు భారతీయ సమాజంలో కనబడే ప్రధాన కుటుంబ రూపాలను గురించి తెలుసుకుందాం. భారతీయ సమాజంలో ప్రధానంగా నాలుగు రకాల కుటుంబ వ్యవస్థలు కనబడతాయి. అవి: 1. మాతృస్వామిక కుటుంబము, 2. పితృస్వామిక కుటుంబము, 3. ప్రాథమిక కుటుంబము, 4. సమిష్టి కుటుంబము. ఇప్పుడు వీటిని గురించి వివరంగా చర్చిద్దాం.

### 17.6.1 మాతృస్వామిక కుటుంబము

భారతీయ సమాజంలోని కొన్ని తెగలలో మాతృస్వామిక కుటుంబ వ్యవస్థ ఆచరణలో ఉన్నది. మాతృస్వామిక కుటుంబ వ్యవస్థలో సర్వాధికారం స్త్రీల చేతిలో ఉంటుంది. స్త్రీయే ఇంటికి యజమానురాలు. కుటుం నిర్వహణకు, ఆస్థికి సర్వాధికారిణి స్త్రీయే. పురుషుడు అన్ని విషయాలలోను స్త్రీకి విధేయుడై ఉంటాడు. ఈ కుటుంబ విధానం ఆదిమ సమాజాలలో అక్కడక్కడ మనకు గోచరిస్తుంది. భారతదేశంలో మాతృస్వామిక కుటుంబ విధానమనేది కేరళలోని నాయర్ కుటుంబాలలో, మేఘాలయలోని ఖాసీలలో హెచ్చుగా కనబడుతుంది. మాతృస్వామిక కుటుంబాలలో ప్రధానమైన హక్కులు పిల్లలకు తల్లి ద్వారా సంక్రమిస్తాయి. మాతృస్వామిక కుటుంబ వ్యవస్థ ఈ క్రింది ప్రధాన లక్షణాలు కలిగి యుంటుంది.

1. కుటుంబంపై అధికారం స్త్రీకి ఉంటుంది.

2. వారసత్వపు హక్కులు పిల్లలకు తల్లిద్వారా సంక్రమిస్తాయి.

3. పిల్లల పెంపకం స్త్రీ లేదా భార్య పర్యవేక్షణలో, భార్య ఇంటిలో జరుగుతుంది.

4. కుటుంబ అధికారం భార్యకుగానీ, ఆమె ప్రతినిధికిగానీ ఉంటుంది.

5. స్త్రీకి ఆస్తిమీద సంపూర్ణ హక్కు ఉంటుంది. తల్లి ద్వారానే ఆడపిల్లలకు ఆస్తి సంక్రమిస్తుంది. పురుషసంతానానికి ఆస్తిపై హక్కుఉండదు.

6. మాతృస్వామిక కుటుంబాలలో భర్త లేదా పురుషునికి అధికారంలోగానీ, కుటుంబ రక్షణ, పిల్లల బాధ్యత విషయంలోగానీ గౌణ ప్రాముఖ్యం ఉంటుంది.

## 17.6.2 పితృస్వామిక కుటుంబము

భారత దేశంలో ఉన్న కుటుంబాలన్నీ చాలావరకు పితృస్వామిక కుటుంబాలే. పితృస్వామిక కుటుంబ వ్యవస్థలో సర్వాధికారం పురుషుని చేతిలో ఉంటుంది. పురుషుడే ఇంటికి యజమాని. కుటుంబ నిర్వహణకు, ఆస్తికి సర్వాధికారి పురుషుడే. స్త్రీ అన్ని విషయాలలోనూ పురుషునికి విధేయురాలు అయి ఉంటుంది. ఈ కుటుంబ విధానం మన దేశంలో వేదకాలం నుంచి హెచ్చుగా ఆచరణలో ఉంది.

పితృస్వామిక కుటుంబ లక్షణాలలో ప్రధానమైన వాటిని ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

1. కుటుంబముపై అధికారము పురుషునికి ఉంటుంది.

2. వారసత్వపు హక్కులు, ఆస్తిపాస్తులు తండ్రినుంచి కుమారులకు సంక్రమిస్తాయి.

3. వివాహానంతరం భార్య భర్త ఇంటికి వస్తుంది. అంతేకాక భర్త ఇంటిపేరు భార్యకు సంక్రమిస్తుంది. అంటే వివాహానంతరం స్త్రీలు భర్త ఇంటిపేరుతో గుర్తింపబడతారు.

4. తండ్రి లేదా గృహ యజమాని కుటుంబ బాధ్యతలు, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు చూస్తూ మత సంబంధమైన విధులు, కార్యకలాపాలు కూడా నిర్వహిస్తారు.

5. ఈ విధానంలో భార్య లేదా స్త్రీకి అధికారంలోగానీ, కుటుంబ రక్షణ, ఆర్థిక విషయాలలోగానీ గౌణ ప్రాముఖ్యత ఉంటుంది.

BRAOU

## 17.6.3 ప్రాథమిక కుటుంబము, వ్యష్టి కుటుంబము

భారతీయ సమాజంలో కలిగిన ఎన్నో మార్పులు, పారిశ్రామికీకరణ, నగరీకరణ, విద్యావ్యాప్తి, వలసలు, ఉత్పత్తి విధానంలో మార్పులు, నూతన ఆలోచనలు మున్నగువాటి ఫలితంగా ప్రాథమిక లేదా వ్యష్టి కుటుంబాల సంఖ్య చాలా పెరిగింది. భార్య తన భర్త, వారి అవివాహిత సంతానం కలిసి ఒకచోట నివసిస్తే దానిని ప్రాథమిక కుటుంబము లేదా వ్యష్టి కుటుంబము అంటారు. ఈ వ్యష్టి కుటుంబాలలో భార్యా భర్తలు సంపూర్ణ స్వేచ్ఛను కలిగి ఉంటారు. అయితే వీటిలో కూడా పురుషాధిపత్యమే అధికంగా ఉంటుంది.

## 17.6.4 సమిష్టి కుటుంబము

భారతీయ సామాజిక వ్యవస్థలోగల ఒక విలక్షణ వ్యవస్థ సమిష్టి కుటుంబ వ్యవస్థ. భారతీయ సామాజిక వ్యవస్థలో సమిష్టి కుటుంబము ప్రముఖ పాత్ర వహిస్తుంది. సమిష్టి కుటుంబము అనగా భార్య భర్తలు, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, తాతముత్తాతలు, మనుమలు, మనుమరాండ్రు, మేనత్త, మేనమామలు, విధవలు, అనాదలు తదితర రక్త సంబంధీకులు అందరూ ఒకే గృహంలో నివసిస్తూ ఒకే చోట భోజన పదార్థాలను తయారుచేసుకుని తింటూ ఆస్తిపాస్తులను సమిష్టిగా నిర్వహించుకొంటారు. సమిష్టిగా ఆదాయ వ్యవయాలను వినియోగించుకొని, ఆరోగ్య సౌభాగ్యాలను సమిష్టిగా చూసుకొంటారు. వివాహ, మత కార్యాలను సమిష్టిగా నిర్వహించుకొంటారు. తీరిక సమయాలను సమిష్టిగా సద్వినియోగపరచుకొని, సమిష్టి అభివృద్ధిని కాంక్షించే కుటుంబాన్ని సమిష్టి కుటుంబముగా పేర్కొనవచ్చు.

## సమిష్టి ప్రధాన కుటుంబ లక్షణాలు ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

1. సమిష్టి కుటుంబము ఆస్థిపాస్తులు, వివాహాది నిర్ణయాలు తదితర వ్యవహారాలలో కుటుంబ పెద్దగా ఉన్న తండ్రిగానీ, పెద్ద కుమారుడుగానీ పెత్తనం చేస్తూ ఉంటారు. మిగిలిన సభ్యులు కుటుంబ యజమాని చెప్పిన విధంగా నడుచుకుంటారు.

2. సమిష్టి కుటుంబములో ఆస్తి యావత్తు సమిష్టిగానే ఉంటుంది. సభ్యులు అవసరం నిమిత్తం అయ్యే ఖర్చులు వాడుకోగా మిగిలిన ధనాన్ని కుటుంబయజమాని లేదా కుటుంబ పెద్ద నిలువ ఉంచుతాడు.

3. సమిష్టి కుటుంబములో సభ్యులు అందరుఒకే వంటశాలలో భుజిస్తూ జీవనయాత్ర చేస్తారు. వివాహ, మతాది కార్యాలను సమిష్టిగానే నిర్వహిస్తూ ఉంటారు.

4. సమిష్టి కుటుంబములో సభ్యులు శక్తి కొలది కష్టించి పనిచేసి తమ అవసరాలను సమిష్టిగా నెరవేర్చుకుంటూ సమిష్టి అభివృద్ధిని కాంక్షించడం దీని ప్రత్యేకత.

5. ఆర్థికపరమైన కార్యకలాపాలలో సభ్యులందరూ సమిష్టిగా పాల్గొంటారు.

అయితే సమిష్టి కుటుంబము వల్ల చాలా ప్రయోజనాలున్నప్పటికినీ దానిలో కొన్ని లోపాలుకూడా ఉన్నాయి. కాబట్టి సమిష్టి కుటుంబ ప్రయోజనాలు, లోపాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చు. మొదట సమిష్టి కుటుంబ ప్రయోజనాలను, ఆతర్వాత దానిలోగల లోపాలను గురించి చర్చిద్దాం.

## సమిష్టి కుటుంబాల ప్రయోజనాలు, లోపాలు

1. సమిష్టి కుటుంబములో సభ్యులందరి ప్రాథమిక అవసరాలు సక్రమంగా తీరడానికి అవకాశాలుంటాయి. సభ్యులకు ఆరోగ్యం సరిగా లేకపోయినా, పనిచేయగలిగినవారైనా కాకపోయినా, సమిష్టి కుటుంబం వారినందరినీ ఆదరిస్తుంది.

2. సమిష్టి కుటుంబంలో పనివిభజన సక్రమంగా జరుగుతుంది. ఎవరికి చేతనైన పనిని వారు చేస్తుంటారు. వివిధ కార్యకలాపాలు సమిష్టిగా కొనసాగుతుంటాయి.

3. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆధాయం తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుంది.

4. సహజీవనం, త్యాగం, ప్రేమ, సేవ మొదలైన ధార్మిక గుణాలు సభ్యులందరికీ అలవడుతాయి.

5. ఆస్తి విభజన, భూమి విభజన ఉండదు. అంతా ఉమ్మడిగానే ఉంటుంది. తత్ఫలితంగా ఉత్పత్తి ఎక్కువ కావడానికి వీలుంటుంది.

6. సమిష్టి కుటుంబము సభ్యులందరికీ సామాజిక రక్షణను కల్పిస్తుంది. ముఖ్యంగా పిల్లలకు, వయసు మల్లినవారికి తమను విచారించే, తమను చూచుకొనే అప్తులున్నారన్న సంతృప్తి ఉంటుంది. సమిష్టి కుటుంబము పిల్లలకు మంచి ఆదరణను, సాంఘికీకరణను కల్పిస్తుంది.

అయితే సమిష్టి కుటుంబము వల్ల ప్రయోజనాలతోపాటు అందులో కొన్ని లోపాలుకూడా ఉన్నాయని ఇంతకు ముందే చెప్పడం జరిగింది. సమిష్టి కుటుంబములో గల లోపాలను ఈ క్రింది విధంగాపేర్కొనవచ్చు.

1. సమిష్టి కుటుంబములో కొందరు కృషి చేయకుండా బద్ధకముగా జఢత్వముతో జీవితాన్ని వెళ్లబుచ్చుతారు. ఎట్లాగైనా గడుస్తుందిగదా అనే దృష్టితో కొందరు మనస్ఫూర్తిగా పనిచేయరు. కొంతమంది మాత్రమే శ్రమపడవలసి వస్తుంది.

2. సమిష్టి కుటుంబములో కుటుంబ పెద్ద నిర్ణయమే అంతిమ నిర్ణయం అవుతుంది. కొన్ని సందర్భాలలో కుటుంబపెద్ద తన అభిప్రాయాలను మిగిలిన సభ్యుల మీద రుద్దడం కూడా జరుగుతుంది. కుటుంబ సభ్యులకు కొంత స్వేచ్ఛ తగ్గడమేకాక వారి వ్యక్తిత్వం, సృజనాత్మక శక్తులు ఎక్కువగా అభివృద్ధి చెందవు.

3. కుటుంబ సభ్యులకు మధ్య లేనిపోని అపార్థాలు పెరిగి తగాదాలు ఏర్పడతాయి. ఈ తగాదాలకు ద్వేశము, ఓర్వలేని తనము కారణాలవుతాయి. సమిష్టి కుటుంబములో నూతన వధూవరులకు వివాహమైన మొదటి దశలో తగినంత స్వేచ్ఛ ఉండదు. ముఖ్యంగా చిన్నవాళ్లు ఎల్లప్పుడు పెద్దవాళ్ల అభిప్రాయాలకే విలువ ఇవ్వవలసి ఉంటుంది. కాబట్టి వాళ్ల అభిప్రాయాలకు విలువనివ్వడం లేదనే న్యూనతాభావం చిన్నవాళ్లలో ఏర్పడే అవకాశం ఉంది.

సమిష్టికుటుంబ వ్యవస్థలో కొన్ని లోపాలున్నప్పటికినీ గ్రామీణ ప్రాంతాలలో ఈనాటికికూడా సమిష్టి కుటుంబాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే సమాజంలో ఏర్పడుతున్న ఎన్నో మార్పుల కారణంగా సమిష్టి కుటుంబ వ్యవస్థ క్షీణిస్తూ పూర్వపు రోజులలోపలె అంత పటిష్టముగా పనిచేయడంలేదు. దీని స్థానంలో వ్యష్టి కుటుంబాలు రూపొందుతున్నాయి.

## 17.7 ఆధునిక కాలంలో కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు

పారిశ్రామికీకరణ, నగరీకరణ, ఆధునీకరణ, ఆధునిక విద్యావ్యాప్తి, వలసలు, వ్యవసాయేతర వృత్తుల పట్ల మోజు పెరగడం మున్నగు కారణాల ప్రభావ ఫలితంగా ఆధునిక యుగంలో కుటుంబ వ్యవస్థలో చాలా మార్పులు వచ్చినాయి. పారిశ్రామికవిప్లవం ఫలితంగా భారత దేశంలో ఆర్థిక, సాంఘిక విధానాలలో, సాంస్కృతిక, విద్యావిధానంలో, ప్రజాస్వామ్య విధానంలో విప్లవాత్మక మార్పులు రావడం మూలంగా సంప్రదాయాక సిద్ధమైన సమిష్టి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతున్నది. సమిష్టి కుటుంబము చేస్తున్న సాంఘిక, ఆర్థిక మతపరమైన ప్రకార్యాలను ఈనాడు సమాజంలో ఉన్న ఇతర సంస్థలు చేపడుతున్నాయి. కుటుంబము నిర్వహించే ఆవశ్యకమైన ప్రాకార్యాలను కూడా నేడు కొన్ని స్వచ్ఛంద, ప్రభుత్వ సంస్థలు నిర్వహిస్తున్నాయి. ఆసంస్థలు ప్రసూతి కేంద్రాలు, మహిళావైద్యశాలలు, శిశు గృహాలు, పిల్లల చికిత్సాలయాలు, కిండర్‌గార్డెన్ పాఠశాలలు, హోటళ్లు మున్నగునవి. క్లబ్బులు, టెలివిజన్లు, సినిమాలు విశ్రాంతి కేంద్రాలు మొదలైన వాటిమూలంగా కుటుంబ జీవన విధానంలో చాలా మార్పులు వచ్చినాయి.

పూర్వం కుటుంబ సంస్థ నిర్వహించే ఆర్థిక ప్రాకార్యాలను ఈనాడు విద్యా సంస్థల, పారిశ్రామిక సంస్థల, ప్రభుత్వ ధన సహాయంతో నడిచే సంస్థలు మొదలైన అనేక సంస్థలు నిర్వహిస్తున్నాయి. తద్వారా ఆధునిక కాలంలో కుటుం ఆర్థిక ప్రాకార్యాల ప్రాముఖ్యంలో తగ్గుదల కనిపిస్తుంది.

కుటుంబము నిర్వహిస్తున్న ఇతర కార్యకలాపాలను అనేకమైన ఇతర సంస్థలుచేపట్టడం జరుగుతున్నది. పిల్లల పెంపకం కుటుంబానికి బదులు శిశుగృహాలు, శిశుసంరక్షణ కేంద్రాలు, నర్సరీలు, కిండర్ గార్డెన్ పాఠశాలలు మొదలైన పాఠశాలలు నిర్వహిస్తున్నాయి. అదేవిధంగా భోజనం తదితర ఆహార పదార్థాలను హోటళ్లు, రెస్టారెంట్లు తయారు చేసి వేలాది కుటుంబాలకు సరఫరా చేస్తున్నాయి.

వివాహం తదితర సామాజిక సంబంధాలలో గల కాఠిన్యత నేటి ఆధునిక కుటుంబాలలో తగ్గుముఖం పట్టింది. యువతీ యువకులు తమ ఇష్టానుసారం సంప్రదాయానికి అతీతముగా వివాహాలను చేసుకొంటున్నారు.

ఆధునిక యుగంలో స్త్రీ పురుష సంబంధాలలోకూడా చాలా మార్పు వచ్చింది. స్త్రీ పురుషునికి బానిసగా ఉండాలనే మనస్తత్వంలో హెచ్చుగా మార్పు వచ్చింది. స్త్రీ పురుషునితో సమాన గౌరవం, హోదాను పొందగలిగి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తుంది. ఆర్థికంగా స్త్రీ తన కాళ్లపై తాను నిలబడగలిగి అన్ని రంగాలలోనూ పురుషునితో సమానంగా పోటీ పడుతున్నది. విద్యావకాశాలు పెరగడం, స్త్రీలు విద్యాధికులు కావడం మూలంగా స్త్రీలు కూడా ఉన్నత స్థానాలను అలంకరించడం జరుగుతున్నది.

నేడు సమిష్టి కుటుంబాలు విచ్ఛిన్నమై ఆధునిక లేదా వ్యష్టి కుటుంబాలుగా మార్పు చెందుతున్నాయి. పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ, నగరీకరణ, వ్యక్తివాదం, నూతన విద్యావిధానం వంటి కారణాల వల్ల హెచ్చుశాతం ప్రజలు ఆధునిక, వ్యష్టి కుటుంబాలలో నివసించడానికి ఇష్టపడుతున్నారు. ఆధునిక కాలంలో ప్రజలు ఎక్కువ శాతం ప్రభుత్వ ప్రోత్సాహంతో చిన్న కుటుంబమే చింతలేని కుటుంబముగా భావించడం జరుగుతున్నది. అంతేకాక నేటి ఆర్థిక, సాంఘిక పరిస్థితులు అతి తక్కువ పిల్లలతో కుటుంబ జీవనం గడపడనికి దోహదం చేస్తున్నాయి. వీటితోపాటు ఆధునిక సమాజంలో శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, విద్య, సాంస్కృతిక, తదితర రంగాలలో విపరీతంగా వచ్చిన మార్పులు కూడా సమిష్టి కుటుంబము అంతరించి వ్యష్టి కుటుంబాలు ఏర్పడటానికి దోహదం చేస్తున్నాయి.

ఆధునిక కుటుంబ వ్యవస్థ ఎదుర్కొంటున్న మరికొన్ని ప్రధాన సమస్యలు - వివాహ విచ్ఛిన్నత, తరాల అంతరం, సామాజిక నియంత్రణా సాధనంగా కుటుంబము బలహీనపడడం మున్నగునవి. ఈనాడు అనేక కారణాలవల్ల వివాహాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. తత్ఫలితంగా విడాకుల రేటు పెరుగుతున్నది. మన దేశంలో ఒకప్పుడు వివాహం ఒక పవిత్ర బంధముగా భావింపబడుతుండేది. కానీ ఈనాడు వివాహం ఒక సాంఘిక ఒప్పందంగా మారింది. నేటి వివాహం ప్రేమానురాగాలకంటే లైంగికానందానికి, ఆర్థిక స్థితికి హెచ్చు ప్రాధాన్యతనివ్వడం వల్ల వివాహాలు సులువుగా విచ్ఛిన్నమవడానికి అవకాశం ఉంది. దీని పర్యవసానంగా విడాకులు తీసుకునేవారి సంఖ్య పెరుగుతూ ఉంది. అంతేకాకుండా నేడు తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య అభిప్రాయాలలో చాలా అంతరం ఏర్పడుతున్నది. పిల్లల అభీష్టానికి అనుగుణంగానే తల్లిదండ్రులు నిర్ణయాలు తీసుకొనవలసి వస్తున్నది. తత్పర్యవసానంగా స్వేచ్ఛ అనేదానిని నేట యువతరం దుర్వినియోగం చేయడం జరుగుతున్నది. ఇది సమాజంలో ఎన్నో రకాల సమస్యలకు దారితీస్తున్నది. దీని వల్ల కుటుంబ వ్యవస్థ అనేది కుటుంబ సభ్యుల మీద నియంత్రణను కోల్పోతున్నది. కుటుంబ సభ్యులు ఎవరి ఇష్టానుసారంగా వాళ్ల జీవితాన్ని గడిపే పరిస్థితులు ఏర్పడి అది సమాజ అవ్యవస్థాపనకు దారితీస్తున్నది.

నేటి కుటుంబ సభ్యులపట్ల కుటుంబము యొక్క ప్రభావం, నియంత్రణ పెద్దలపట్ల గౌరవ మర్యాదలు రానురాను సన్నగిల్లుతున్నాయి. అందుకు ఆధునిక సామాజిక జీవన విధానాలు, మారుతున్న జీవన వైఖరులు, సాంఘిక, ఆర్థిక, వ్యక్తిగత విలువలు ధోహదం చేస్తున్నాయి. నేటి కుటుంబాలలో సభ్యులలో ఒకరిపట్ల మరిఒకరికి నమ్మకం, ప్రేమానురాగాలు, వాత్సల్యం, గౌరవ మర్యాదలు తగ్గిపోతున్నాయి. దీనివల్ల గృహజీవనంలో అశాంతి, స్పర్థలు, కలహాలు చెలరేగి కుటుంబ సమస్యలకు, కుటుంబ విచ్ఛిత్తికి దారితీయడం జరుగుతున్నది.

అయితే భారతీయ సమాజంలో కుటుంబ వ్యవస్థ అనేది మార్పులకు గురి అయినప్పటికీ, పాశ్చాత్య సమాజాలతో పోల్చి చూసినట్లయితే ఇంకా పటిష్టంగానే ఉన్నదనిచెప్పవచ్చు. ఇక్కడ కుటుంబ వ్యవస్థ అనేది మరీ సంపూర్ణంగా అసమయోజనకు గురికాలేదని చెప్పవచ్చు. కాకపోతే కుటుంబ వ్యవస్థ ఇంతకు ముందున్నంత పటిష్టంగా ఇప్పుడు లేదని చెప్పవచ్చు.

## 17.6 సారాంశం

సామాజిక సంస్థలన్నింటిలో కుటుంబ వ్యవస్థ ప్రధానమైందని సమాజ శాస్త్రజ్ఞుల భావన. కుటుంబము యొక్క ప్రధాన లక్షణాలు 1. వివాహం, 2. మిథున సంబంధం, 3. నామకరణ పద్ధతి, 4. ఆర్థిక పరమైన రక్షణ, 5. ఉమ్మడి నివాసం మున్నగునవి. కుటుంబము ప్రధానంగా ఆరు రకాలయిన ప్రకార్యాలను నిర్వర్తిస్తుంది. అవి: 1. జైవిక ప్రకార్యము, 2. ఆర్థిక ప్రకార్యము, 3. సామాజిక ప్రకార్యము, 4. మతపరమైన ప్రకార్యము, 5. విద్యా పరమైన ప్రకార్యము, 6. మానసిక పరమైన ప్రకార్యము. అయితే కుటుంబ స్వరూప, స్వభావాన్ని బట్టి కుటుంబాలను రకరకాలుగా వర్గీకరించడం జరిగింది. వాటిలో ప్రధానమైనవి: 1. కుటుంబముపై యాజమాన్యాన్ని బట్టి కుటుంబము రెండు రకాలు అవి: ఎ. పితృస్వామిక కుటుంబము, బి. మాతృస్వామిక కుటుంబము. 2. వంశానుక్రమాన్ని బట్టి కుటుంబము మూడు రకాలు అవి: ఎ. మాతృవంశీయ కుటుంబము, బి. పితృవంశీయ కుటుంబము, సి. పితృ-మాతృ వంశీయ కుటుంబము. 3. కుటుంబ పరిమాణాన్ని బట్టి కుటుంబము రెండు రకాలు

ఎ. ప్రాథమిక కుటుంబము లేదా వ్యష్టి కుటుంబము, బి. సమిష్టి కుటుంబము. 4. దంపతుల నివాసాన్ని బట్టి కుటుంబము ఐదు రకాలు ఎ. పితృస్థానిక కుటుంబము, బి. మాతృ కుటుంబము, సి. ద్విస్థానిక కుటుంబము, డి. మాతుల స్థానిక కుటుంబము, ఇ. నూతన స్థానిక కుటుంబము. 5. వారసత్వ సంక్రమణాన్ని బట్టి కుటుంబాలు రెండు రకాలు అవి: ఎ. మాతృవారసత్వ సంక్రమణ కుటుంబము, బి. పితృవారసత్వ సంక్రమణ కుటుంబము. 6. వివాహ రూపాన్ని బట్టి కుటుంబము రెండు రకాలు అవి: ఎ. ఏకవివాహ కుటుంబము, బి. బహు వివాహ కుటుంబము. బహు వివాహ కుటుంబాన్ని తిరిగి రెండు రకాలుగా విభజించవచ్చు. 1. బహు భార్యత్వ కుటుంబము, 2. బహు భర్తృత్వ కుటుంబము. ఐతే భారతీయ సమాజంలో కనబడే ప్రధాన కుటుంబ రూపాలు నాలుగు అవి: 1. ప్రాథమిక కుటుంబము లేదా వ్యష్టి కుటుంబము, 2. మాతృస్వామిక కుటుంబము, 3. పితృ స్వామిక కుటుంబము, 4. సమిష్టి కుటుంబము.

ఆధునిక సమాజంలో శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక, విద్య, సాంస్కృతిక రంగాలలో వచ్చిన మార్పులు మరియూ పారిశ్రామికీకరణ, నగరీకరణ, ఆధునికీకరణల ఫలితంగా కుటుంబ వ్యవస్థలో చాలా మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా సమిష్టి కుటుంబ వ్యవస్థ అంతరించి వ్యష్టి కుటుంబ వ్యవస్థ ఏర్పడుతున్నది. పూర్వము కుటుంబము నిర్వహించే సామాజిక, ఆర్థిక, మానసిక ప్రకార్యాలను ఈనాడు విద్యాసంస్థలు, శిశు సంరక్షణ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు మున్నగునవి నిర్వహిస్తున్నాయి. ఆధునిక యుగంలో స్త్రీ, పురుష సంబంధాలలో కూడా చాలా మార్పు వచ్చింది. నేటి సమాజంలో కొన్ని కుటుంబాలు వివాహ విచ్ఛిన్నత సమస్యలు ఎదుర్కొంటున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య స్పర్థలు, కలహాలు, మానసిక అశాంతి ఎక్కువవుతున్నాయి. అందుకు ఆధునిక సామాజిక జీవన విధానాలు, ఆలోచనావైఖరులు, మారుతున్న సాంఘిక, ఆర్థిక వ్యక్తిగత విలువలు దోహదం చేస్తున్నాయి. దీని పర్యవసానంగా ఆధునికసమాజంలో విడాకుల రేటు చాలా పెరిగింది.

## 17.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయుండి.**

1. కుటుంబము అంటే ఏమిటో నిర్వచించి కుటుంబ లక్షణాలను వివరింపుము.

2. కుటుంబ ప్రకార్యాలను వివరింపుము.

**II. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.**

3. కుటంబాల వర్గీకరణ గురించి చర్చింపుము.

4. ఆధునిక యుగంలో కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులను గురించి చర్చింపుము.

## 17.10 చదవదగిన పుస్తకాలు


| | |
|---|---|
| Ram Ahuja, 1993 | : Indian Social System. |
| Alex Thio | : Sociology - An Introduction. |
| Kapadia, K.M; 1966 | : Marriage and Family in India. |
| David, G.Mandelbaum | : Society in India. |
| Kingsley, Davis. | : Human Society. |
| Ogburn & Nimkoff | : A Handbook of Sociology. |
| C.N.Shankar Rao | : Sociology. |


BRAOU

# భాగం-18 : వివాహం

## విషయక్రమం


18.0 ఉద్దేశాలు

18.1 పరిచయం

18.2 వివాహం - నిర్వచనం

18.3 వివాహ నియమాలు

18.3.1 అంతర్వివాహము

18.3.2 బహిర్వివాహము

18.3.3 అధిగణన వివాహము

18.3.3.1 సమాంతర పితృీయ సంతతి వివాహము

18.3.3.2 మేనరిక వివాహము

18.3.3.3 దేవరన్యాయం

18.3.3.4 భార్యాభగినీ న్యాయం

18.4 వివాహము - లక్షణాలు

18.4.1 విశ్వజనీనత

18.4.2 వివాహ నియమావళి

18.4.3 జీవిత భాగస్వామి ఎంపిక

18.4.4 ఆర్థిక వ్యవహారాలు

18.4.5 నిర్థిష్ట వివాహనియమాలు, నిబంధనలు

18.4.6 నివాస పద్ధతులు

18.4.7 అధికారము

18.4.8 వైవాహిక స్థిరత్వం

18.5 వివాహము - ప్రకార్యాలు

18.5.1 జైవిక ప్రకార్యాలు

18.5.2 ఆర్థిక ప్రకార్యాలు

18.5.3 సామాజిక ప్రకార్యాలు

18.5.4 విద్యా ప్రకార్యాలు

18.5.5 మానసిక ప్రకార్యాలు

18.6 వివాహము - రకాలు


BRAOU

18.6.1 ఏకవివాహము

18.6.2 బహువివాహము

18.6.2.1 బహుభార్యత్వము

18.6.2.2 బహు భర్తృత్వము

18.7 సారాంశం

18.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

18.9 చదవదగిన పుస్తకాలు

## 18.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- వివాహం అంటే ఏమిటో నిర్వచించగలుగుతారు.
- వివాహ నియమాలను వివరించగలుగుతారు.
- వివాహ లక్షణాలను, ప్రకార్యాలను వివరించగలుగుతారు.
- వివాహ రకాలను వివరించగలుగుతారు.

BRAOU

## 18.1 పరిచయం

వివాహం కుటుంబ సంస్థకు మూలాధారం. వివాహం ఆధారంగానే కుటుంబాలు ఏర్పడతాయి. వాస్తవికంగా వివాహం అంటే ఇద్దరు స్త్రీ, పురుషుల కలయిక మాత్రమేగాక, ఆ స్త్రీ పురుషులిద్దరికీ సంబంధమైన రెండు కుటుంబాల కలయిక అని చెప్పుకోవాలి. కనుక వివాహం కుటుంబ స్థాపనకు, అభివృద్ధికి దోహదం చేస్తుంది. వివాహం, కుటుంబ వ్యవస్థలు రెండూ కూడా భార్యా భర్తల సంబంధం, సంతానోత్పత్తి, ఆర్థిక సహకారం మొదలయిన వాటిపై ఆధారపడి ఉన్నాయి. అన్ని సమాజాలలోనూ దాంపత్య ంబధాలను క్రమబద్ధం చేస్తూ కొన్ని రకాలైన ఆంక్షలను విధించడం జరిగింది. అట్టి ఆంక్షలకు ప్రతిరూపమే విహం అని చెప్పుకోవచ్చు. ఈనాటికి కూడా సమాజాలన్నింటిలోను వైవాహిక పద్ధతిలో జరిగే మిధున సంబంధాలకే సమాజం అంగీకారం లభిస్తుంది. వైవాహిక పరిధికి లోబడిన మిధున సంబంధాలకు సామాజికామోదం లభించదు. అంతే కాని నివాహ వ్యవస్థ లేకుండా ఏ సమాజం కూడా సంతానాన్ని పొందడానికి అంగీకరించదు. కుటుంబం, వివాహ వ్యవస్థ ద్వారా సంతానోత్పత్తిని కలుగ జేసి దాని ద్వారా కుటుంబం మనుగడ, పమాజం మనుగడలకు దోహదపడుతుంది. కనుక వివాహ వ్యవస్థకు సమాజంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్నదనటంలో సందేహంలేదు.

## 18.2. వివాహం -నిర్వచనం

వివాహ వ్యవస్తకు సంబంధించి వివిద సమాజవాస్త్రవేత్తలు, మానవ శాస్త్రవేత్తలు రకరకాల నిర్వచనాలను రూపొందించడం జరిగింది. ఒక్కొక్క సమాజ శాస్త్రవేత్త ఒక్కొక్క అంశాన్ని దృష్టి యందుంచుకొని వివాహాన్ని నిర్వచించడం జరిగింది. ఆయా నిర్వచనాలన్నింటిని ఒక చోట చేర్చి పరిశీలించినట్లయితే వివాహంఅంటే ఏమిటో అర్థం అవుతుంది. ఇప్పుడు వివాహానికి సంబంధించిన వివిధ సమాజ శాస్త్రవేత్తల నిర్వచనాలను పరిశీలిద్దాం.

ఎడ్వర్ వెస్టర్ మార్క్ అనే ప్రపంచ ప్రఖ్యాత సమాజ శాస్త్రవేత్త "మానవ వివాహ చరిత్ర" (History of Human

marriage) అనే ప్రసిద్ధిగాంచిన తన గ్రంథంలో వివాహాన్ని ఈ విధంగా నిర్వచించాడు- "ఒక పురుషుడు లేదా ఒకరి కంటే ఎక్కువ మంది పురుషులు, ఒక స్త్రీతో లేదా ఎక్కువమంది స్త్రీలతో ఆచారం చేతగానీ లేదా చట్టం చేతగానీ గుర్తింపబడి, కొంత లాంఛనప్రాయంతో కూడుకొని ఉండి, ఇంచుమించుగా కొంతకాలంపాటు నిలకడగా ఉండే కలయిక లేదా సంబంధమై వివాహం".

రాబర్ట్.హెచ్.లూయీ అనే ప్రముఖ మానవ సమాజ శాస్త్రవేత్త వివాహాన్ని "స్త్రీ, పురుషుల మధ్యగల సాపేక్షమైన శాశ్వత బంధం" అని నిర్వచించినాడు.

ముర్డక్(Mardak) అనే మానవ శాస్త్రవేత్త వివాహాన్ని ఈ విధంగా నిర్వచించినాడు. "ఒక నిర్దిష్ట ప్రదేశంలో స్త్రీ, పురుషులిద్దరూ కలిసి నివసించడం, వ్యష్టి కుటుంబాన్ని రూపొందించడం మొదలైన అంశాలతో కూడుకొని యున్న విశ్వవ్యాపిత సంస్థనే వివాహం".

సెలిగ్మన్ (seligman) అనే మానవ శాస్త్రవేత్త ప్రకారం "వివాహమనేది స్త్రీ, పురుషుల మధ్య గల సంయోగం. ఈ సంయోగం ద్వారా స్త్రీకి జన్మించే సంతానాన్ని ఆ దంపతుల చట్టబద్ధమై సంతానంగా ఆమోదించడం జరుగుతుంది".

కథలీన్‌గఫ్ (Kathleen gaugh) అనే మానవశాస్త్రవేత్త నిర్వచనం ప్రకారం "వివాహమనేది ఒక స్త్రీ మరియు ఒకరుగానీ లేదా అంతకంటే ఎక్కువ మంది పురుషుల మధ్య ఉండే సంబంధం. అయితే ఆ సంబంధం నిబంధనల్ని అతిక్రమించకుండా ఆస్త్రీకి పుట్టే సంతానానికి వారు నివసించే సమాజం లేదా సమాజ సభ్యులు సర్వసాధారణంగా జన్మతః సంక్రమింపజేసుకునే గౌరవాన్ని, హక్కుల్నీ ఆ సంబంధం ఆ సంతానానికి కలుగజేస్తుంది".

విలియం స్టీఫన్స్ (William Stephens) నిర్వచనం ప్రకారం "వివాహం అనేది సమాజం న్యాయబద్ధంగా ఆమోదించిన లైంగిక సంయోగం. ఇది స్త్రీ, పురుషుల మధ్య బహిరంగ తీర్మాణంతో ప్రారంభమయి, శాశ్వత సంబంధాన్ని కొనసాగించడానికి కృత నిశ్చయంతో ఉండి దంపతులు, వారి భావి సంతానం మధ్య పరస్పర ఆర్థిక బాధ్యతలను, స్పష్టమైన కొన్ని వైవాహిక బాధ్యతలను తెలియపరిచే న్యాయబద్ధమైన లైంగిక సంయోగమే వివాహం".

ఈ విధంగా వివిధ మానవ సమాజశాస్త్రవేత్తలు వివాహాన్ని రకరకాలుగా నిర్వచించడం జరిగింది. పై నిర్వచనాలను జాగ్రత్తగా పరిశీలించినట్టయితే, వివాహం అంటే స్త్రీ, పురుషుల మధ్య చట్టబద్ధంగానూ, సహజామోదయోగ్యంగాను గల శాశ్వత లైంగిక సంబంధం అని చెప్పవచ్చు. వివాహం అనేది స్త్రీ, పురుషుల సంయోగం ద్వారా జన్మించే సంతానానికి చట్టబద్ధతను, గౌరవాన్ని, సామాజిక అంతస్తును సంక్రమింపజేస్తుంది. కాబట్టి స్త్రీ, పురుషుల మధ్య దాదాపు శాశ్వతంగా ఉండే సంబంధాన్ని ఏర్పరచేదే వివాహం అని చెప్పవచ్చు.

పై నిర్వచనాలేగాక మానవ శాస్త్రవేత్తలు సమాజంలో వివాహ వ్యవస్థ పరిణామాన్ని, ప్రాముఖ్యతను గురించి కూడా వివరించారు.

ఎల్.హెచ్.మోర్గాన్, సమ్నర్, కెల్లర్, టైలర్ వంటి పరిణామ వాదులు వివాహవ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలను ప్రస్తావిస్తూ, మొట్టమొదట మానవజాతిలో స్త్రీ, పురుషులు నావి వరుసలు లేకుండా విచ్చలవిడిగా సంపర్కం పొందుతూ ఉండేవారని తెలియపరిచారు. ఇట్టి స్వేచ్ఛా సంపర్కాన్నే స్వైరితం లేదా స్వేచ్ఛారతి అని అన్నారు. స్వైరితం క్రమంగా కొంత కాలానికి సామూహిక వివాహంగా అంటే కొందరు పురుషులు, కొందరు స్త్రీలను సామూహికంగా వివాహడే పద్ధతిగా మారిందని, కాలానుక్రమంగా సామూహిక వివాహం బహు వివాహంగామారి, తరువాత ఏక వివాహ పద్ధతిగా ఏర్పడిందని వీరి అభిప్రాయం. మానవ సంస్కృతి వికాసాల పరిణామంతో బాటు వివాహ వ్యవస్థకూడా పరిణామం చెందిందని వీరి భావన.

## 18.3 వివాహ నియమాలు

ఏ సామాజి వ్యవస్థలోనైనా వివాహ వ్యవస్థ అనేది చాలా ముఖ్యమైనది. దాదాపు అన్ని సమాజాలలో వివాహ

వ్యవస్థ ఏదో ఒక రూపంలో ఖచ్చితంగా ఉన్నది. అయితే వివాహ వ్యవస్థ కొన్ని క్రమబద్ధమైన కొన్ని ఆచారవ్యవహారాలకు కట్టుబడి ఉంటుంది. ప్రతి సమాజంలోను వివాహ విషయంలో కొన్ని కట్టుబాట్లు, ఆంక్షలు విధించబడ్డాయి. ప్రత్యేకించి మన భారతీయ సమాజంలో ఉన్న వివాహపు కట్టుబాట్లు, ఆంక్షలు మరే ఇతర సమాజంలో లేవు. భారతీయ సమాజంలో వివాహేతర లైంగిక సంబంధం నిషేధం. అంతే గాకుండా వివాహానికి సంబంధించి విభిన్న సమాజాలలో వివిధ వివాహ నిబంధనలు, వివాహ పద్ధతులు ఉన్నాయి. దీని దృష్ట్యా ఇప్పుడు వివాహానికి సంబంధించిన నియమాలేమిటో చర్చిద్దాం.

### 18.3.1 అంతర్వివాహము

ఒక సమాజానికి చెందిన వ్యక్తి భార్యనుగాని లేదా భర్తను గాని తమ సమూహం నుంచి మాత్రమే వివాహం చేసుకొనే పద్ధతిని అంతర్వివాహం అంటారు. వివాహ సంబంధాలు ఆ సమూహానికి మాత్రమే పరిమితమై ఉంటే అది అంతర్వివాహ సమూహంగా వ్యవహరింపబడుతుంది. ఉదాహరణకు హిందూ సమాజంలో కులము అంతర్వివాహ సమూహం. హిందూ సమాజంలో ప్రి ఒక్కరూ తప్పని సరిగా తమ కులస్థులనే వివాహం చేసుకొనవలె. వివాహ విషయంలో వారి వారి కులాల పరిధులను దాటి పోగూడదు. హిందూ సమాజంలో గోత్రం బహిర్వివాహ సమూహమైతే, కులం అంతర్వివాహ సమూహం. సామాన్యంగా అన్ని తెగలలోను, మత సమూహాలలోను అంతర్వివాహ పద్ధతి ఆచరణలో ఉన్నది.

### 18.3.2. బహిర్వివాహము

ఒక సమూహానికి చెందిన స్త్రీ లేదా పురుషుడు తన భర్తను గాని లేదా భార్యనుగాని అదే అదే సమూహంనుంచి కాక వేరొక సమూహం నుంచి వివాహం చేసుకొనే పద్ధతిని బహిర్వివాహము(exogamy) అంటారు. ఉదాహరణకు హిందూ సమాజిక వ్యవస్థలో సగోత్ర వివాహాలు నిషిద్ధం. అంటే హిందూ సమాజంలో ఎవ్వరూ సగోత్రులను వివాహం చేసుకోరాదు. వేరొక గోత్రములోని వారిని మాత్రమే వివాహం చేసుకొవలె. కాబట్టి హిందూ సమాజంలో గోత్రం విషయంలో బహిర్వివాహం, కులం విషయంలో అంతర్వివాహం ఆచరణలో ఉన్నాయని చెప్పవచ్చు.

BRAOU

### 18.3.3. అధిగణన వివాహాలు

అధిగణన వివాహాలు హిందూ ఢమాజజంలోను, అనేక ఇతర సమాజాలలోను ఆచరణలో ఉన్నాయి. అధిగణన వివాహ నియమం ప్రకారం ఒక వ్యక్తికి ప్రత్యేకించి కొందరు బంధువుల్ని వావిహం చేసుకొనే హక్కు ఉంటుంది. సమాంతర పిత్రీయ సంతతి వివాహం(parallel cousin marriage) మేనరిక వివాహం(cross cousin marriage), మేనమామ మేనకోడలు వివాహం(uncle-niece marriage), దేవర న్యాయము(Levirate), భార్యాభగినీ న్యాయం(sororate) మున్నగునవి అధిగణన వివాహాలకు ఉదాహరణలు. ఇప్పుడు వీటిని గురించి సంక్షిప్తంగా చర్చిద్దాం.

### 183.3.1 సమాంతర ప్రితీయ సంతతి వివాహం

ఇద్దరు అన్నదమ్ముల సంతానం మధ్య జరిగే వివాహన్ని లేదా ఇద్దరు అక్క చెల్లెళ్లసంతానం మధ్య జరిగే వివాహాన్ని సమాంతర ప్రితీయ సంతతి వివాహం అని పిలుస్తారు. కొన్ని సమాజాలలో ఇటువంటి బంధువలను వివాహం చేసుకోవడాన్ని ఒక హక్కుగా భావిస్తారు. ఇటువంటి వైవాహిక సంబంధాలకు ప్రాధాన్యతనిస్తారు. కొన్ని అరబ్ దేశాలలోను, భారత దేశంలోని కొంతమంది ముస్లింలలోను సమాంత ప్రితీయ సంతతి వివాహం ఆచరణలో ఉన్నది.

### 18.3.3.2 మేనరిక వివాహము

ఒక వ్యక్తి తన తండ్రి సోదరి కుమార్తెనుగానీ, తన తల్లి సోదరుడి కుమార్తెను గానీ వివాహమాడితే ఆ వివాహన్ని మేనరిక వివాహం అని పిలుస్తారు. అదే విధంగా ఒక వ్యక్తి తన సోదరియొక్క కుమార్తెను వివాహం ఆడితే

మేనమామ- మేనకోడలు వివాహం అని పిలుస్తారు.

దక్షిణభారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో మేనరిక వివాహాలు ఆచరణలో ఉన్నాయి. మేనమామ మేనకోడలు వివాహం ప్రధానంగా దక్షిణభారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో ఎక్కువగా ఆచరణలో ఉన్నది.

### 18.3.3.3. దేవరన్యాయం

ఒకవ్యక్తి యొక్క సోదరుడు గనుక చనిపోయినట్లయితే, చనిపోయిన తన సోదరుని భార్యను వివాహమాడటాన్ని దేవర న్యాయం అంటారు. దేవరన్యాయం రెండు విధాలుగా ఉంటుంది. మొదటిది, ఒక వ్యక్తి తన అన్నగారి మరణానంతరం అతని యొక్క భార్యను అంటే వదినెను వివాహమాడటం. ఈ ఆచారాన్ని కనిష్ట దేవరన్యాయం అంటారు. రెండవది, ఒక వ్యక్తియొక్క తమ్ముడు చనిపోయినట్లయితే అతని యొక్క భార్యను, అంటే మరదలిని వివాహం చేసుకోవడం. ఈ ఆచారాన్ని జేష్ట దేవరన్యాయము అంటారు. భారత దేశంలోని ఒరావన్, సంతాల్, గోండు, భిల్, ఖాసా, తోడా మున్నగు ఆదిమ తెగలు దేవరన్యాయాన్ని పాటిస్తాయి.

### 18.3.3.4 భార్యా భగినీ న్యాయము

ఒక వ్యక్తి యొక్క భార్య చనిపోయినప్పుడు, తన చనిపోయిన భార్యయొక్క అవివాహిత సోదరిని వివాహం చేసుకోవడాన్ని భార్యాభగినీ న్యాయం అంటారు. భారత దేశంలోని చాలా సమాజాలు భార్యాభగినీ న్యాఆన్ని పాటిస్తాయి.

ఈవిధంగా దాదాపు అన్ని సమాజాలలో వివాహానికి సంబంధించి పైన తెలిపిన నియమాలలో ఏదైనా ఒకదానిని లేదా కొన్నింటిని తప్పకుండా పాటిస్తారు.

## 18.4 వివాహము - లక్షణాలు

వివాహ వ్యవస్థ ప్రధానంగా ఈ క్రింది లక్షణాలను కలిగి యుంటుంది. అవి:

### 18.4.1 విశ్వజనీనత

వివాహం విశ్వజనీనమైనది ప్రపంచంలోని దాదాపు అన్ని సమాజాలలో వివాహవ్యవవస్థ అనేది ఉన్నది. అయితే దాని రూపం ఒక్కొక్క సమాజంలో ఒక్కొక్క రకంగా ఉండవచ్చు. స్వైరిత స్థితినుంచి పరిణామ క్రమంలో వివాహ వ్యవస్థ అనేది ఏర్పడిన నాటినుంచి విశ్వవ్యాప్తంగా ఈ వ్యవస్థ పటిష్టంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా స్త్రీ, పురుషుల మధ్య కలయికకు వివాహం ఒక ఆవశ్యక వ్యవస్థగా కొనసాగుతున్నది.

### 18.4.2 వివాహనియమావళి

వివాహవ్యవస్థకు ఒక నియమావళి అనేది ఉంటుంది. వివాహం వ్యవస్థ అనేది ఎందుకు, ఏవిధంగా ఏర్పడింది? దాని లక్ష్యం ఏమిటి? దాని ఆవశ్యకత ఏమిటి? మున్నగు విషయాలను గురించి వివాహ నియమావళి విశదీకరిస్తుంది. అయితే ఒక సమాజంలో ఉండే వివాహ నియమావళి మరొక సమాజంలో ఉండే వివాహనియమావళికి భిన్నంగా ఉంటుంది. కొన్ని సమాజాలలో వివాహాన్ని దైవసృష్టిగా భావిస్తే, మరికొన్ని సమాజాలలో వివాహం అనేది సమాజక్రమబద్ధతకోసం, ప్రాచీన వ్యక్తులు సృష్టించుకొన్న ఒక వ్యవస్థగా భావించడం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికీ వవాహమనేది స్త్రీ, పురుషుల మధ్యగల సంబంధాలను క్రమబద్ధీకరించడానికి దోహదపడే వ్యవస్థ అని చెప్పవచ్చు. అదేవిధంగా వివాహ వ్యవస్థకు కొన్ని లక్ష్యాలు ఉంటాయి. ఈ లక్ష్యాలు ఒక సమాజానికి, మొరక సమాజానికి మారుతూ ఉంటాయి. కొన్ని సమాజాలలో స్త్రీ, పురుషుల మధ్య సన్నిహిత సంబంధాన్ని నెలకొల్పడమే వివాహ లక్ష్యంగా భావించడం జరుగుతుంది. మరికొన్ని సమాజాలలో సంతానోత్పత్తిని గావించి వంశాన్ని శాశ్వతంగా కొనసాగేటట్లు చేయడం వివాహ లక్ష్యంగా భావించడం జరుగుతుంది. అయితే స్త్రీ,



BRAOU

పురుషులు సంపూర్ణ జీవనాన్ని కొనసాగించడానికి అవశ్యకమైన లైంగిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పరితృప్త పరిచే కార్యకలాపాలతో కూడుకొని యుండి, సమాజం ఆమోదించిన స్త్రీ, పురుషుల సన్నిహిత సంబంధం అనేది దాదాపు అన్ని మానవ సమాజాలు అంగీకరించే వివాహలక్ష్యంగా చెప్పవచ్చు. కాబట్టి వివాహానికి ప్రధానంగా రెండు లక్ష్యాలుంటాయని చెప్పవచ్చు. అవి: కుటుంబ స్థాపన, దైనందిన జీవితానికి కావలసిన సహకారాన్ని, భద్రతను పరస్పరం కల్పించుకోవడం. వివాహ నియమావళి తెలియజేసే ప్రాథమికాంశాలేమిటంటే లైంగిక సాన్నిహిత్యం, వంశాభివృద్ధి, శ్రమ విభజన, బాంధవ్యాలు, విస్తృత సాంఘిక సంబంధాలు మున్నగునవి.

## 18.4.3 జీవిత భాగస్వామి ఎంపిక

జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడం అనేది వివాహం యొక్క మరొక ప్రధాన లక్షణం. స్త్రీ, పురుషులు తమ కామవాంఛనుతీర్చుకోవడానికి, సంతానాన్ని పొందడానికి, జీవితాన్ని సుఖమయంగా గడపడానిని సమాజ నియమాలకనుగుణంగా జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడం జరుగుతుంది. అయితే కొన్ని సమాజాలలో వ్యక్తులు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడానికి స్వేచ్ఛను కలిగి యుంటారు. మరికొన్ని సమాజాలలో వ్యక్తులకు ఈవిషయంలో స్వేచ్ఛ ఉండదు. వివాహానికి అర్హులైన యువతీయువకులకు వివాహానిన తల్లిదండ్రులు కానీ, వారి బంధువులుగానీ ఏర్పాటు చేస్తూ ఉంటారు. సమాజ సంప్రదాయాలు, ఆచారాలు, నియమాలకనుగుణంగా వధూవరుల ఎంపిక, వివాహం జరుగుతుంది. వయో పరిమితులు, వ్యక్తిగత లక్షణాలు కూడా జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలో ముఖ్యపాత్ర వహిస్తాయి. స్త్రీలు ఏవయస్సులో వివాహమాడాలి, పురుషులు ఏవయస్సులో వివాహమాడాలి అనే విషయాలు ఒక సమాజానికి, మరొక సమాజానికి మారుతూ ఉంటాయి. కొన్ని సమాజాలలో వధూవరులిద్దరూ సమాన వయస్కులై ఉండడానికి ప్రాధాన్యతనిస్తే, మరికొన్ని సమాజాలలో వధూవరులల్లో ఒకరు మరొకరి కన్నా కొంత పెద్దవారై ఉండడానికి ప్రాధ్యాత నివ్వడం జరుగుతుంది. సాధారణంగా సమాజాలలో వధూవరుల ఎంపిక విషయంలో చక్కని శరీరసౌష్టవం, కష్టించి పనిచేయడం, నిజాయితీ, వినయం, శీలం అనే వాటికి ప్రాధాన్యత నివ్వడం జరుగుతుంది.

## 18.4.4. ఆర్థిక వ్యవహారాలు

వివాహ సంస్థలో ఆర్థిక వ్యవహారాలు కూడా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలకు వివాహ వ్యవస్థలో చాలా ప్రాధాన్యత ఉంటుంది. వరకట్నం, కన్యాశుల్కం, బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం మున్నగు రూపాలలో ఆర్థిక వ్యవహారాలు చోటు చేసుకుంటాయి. ముఖ్యంగా భారతీయ సమాజంలో వివాహ సమయంలో వరకట్నమనేది చాలా ప్రధాన పాత్ర వహిస్తుంది. వివాహ సమయంలో వధువు తల్లిదండ్రులు వరునికి గాని, వరుని తల్లిదండ్రులకు గాని కొంత ధనాన్ని వరకట్నంగా ఇవ్వడం జరుగుతుంది. ధనంతో పాటు కొన్ని విలువైన వస్తువులను కూడా బహుమానాల రూపంలో ఇవ్వడం జరుగుతుంది. అదే విధంగా కొన్ని ఆదిమ సమాజాలలో వరుడు, వధువు తల్లిదండ్రులకు కొంత ధనాన్ని కన్యాశుల్కంగా ఇవ్వడం జరుగుతుంది. ఈవిధంగా వివాహ సంస్థలో ఆర్థిక వ్యవహారాలు ఏదో ఒక రూపంలో ఉంటాయి.

## 18.4.5. నిర్దిష్ట వివాహ నియమాలు, నిబంధనలు

ప్రతి సమాజంలో వివాహానికి సంబంధించి కొన్ని నిర్దిష్ట నియమాలు, నిబంధనలు, ఆచారాలు ఉంటాయి. వివాహనియమాలు నిర్దిష్టంగాను, అధిగణనంగాను ఉంటాయి. నిర్దిష్ట నియమాలు ఎవరు ఏ వ్యక్తిని వివాహమాడాలో చెపుతాయి. అధిగణన నియమాలు ఒక వ్యక్తి తాను ఎవరిని వివాహం చేసుకోవడానికి ప్రత్యేక హక్కును కలిగి యుంటాడో తెలియజేస్తాయి. వివాహానికి సంబంధించి కొన్ని నిషిద్ధ నియమాలు కూడా ఉంటాయి. నిషిద్ధనియమాలు అగమ్య గమనంపై విధింపబడే ఆంక్షల రూపంలో ఉంటాయి. అగమ్యగమన నిషేధ నియమం ప్రకారం రక్తబంధువుల మధ్య లైంగిక సంబంధంగాని, వైవాహిక సంబంధంగాని నిషిద్ధం. సాంప్రదాయకంగా వివాహ నియమాలు మూడు రకాలుగా ఉంటాయి. అవి:- 1.అంతర్వివాహము 2. బహిర్వివాహము 3.అధిగణన వివాహాలు. అంతర్వివాహ నియమం ప్రకారం ఒక వ్యక్తి తన సమూహానికి చెందిన వ్యక్తిని మాత్రమే వివాహం చేసుకోవలె. ఉదాహరణకు ఒక కులానికి చెందిన వ్యక్తి అదే కులానికి చెందిన వ్యక్తిని మాత్రమే వివాహం చేసుకోవలెననేది



BRAOU

అంతర్వివాహ నియమం. అయితే ఒక వ్యక్తి తన జీవిత భాగస్వామిని తన బంధువర్గం నుండి గాకుండా ఇతర సమూహాల నుండి ఎంపిక చేసుకొననే నియమాన్ని బహిర్వివాహం అని పిలుస్తారు. ఈనియమం ప్రకారం ఒక వ్యక్తి తన వంశానికిగాని, గోత్రానికి గాని, గోత్రకూటమికి గాని, చెందిన వ్యక్తులను వివాహమాడరాదు. అయితే కొన్ని సమాజాలలో అధిగణన వివాహ నియమాలను పాటించడం జరుగుతుంది. ఈనియమం ప్రకారం ఒక వ్యక్తికి ప్రత్యేకించి కొందరు బంధువుల్ని వివాహం చేసుకొనే హక్కు ఉంటుంది. మేనరిక వివాహాలు, సమాంతర పిత్రీయ సంతతి వివాహాలు వీటికి ఉదాహరణలు. వివాహ నియమాలతో పాటు వివిధ సమాజాలలో వివిధ వివాహ ఆచారాలు విభిన్న రూపాలలో ఉంటాయి. వివాహ ఆచారాలను కొన్నింటిని వివాహానికి ముందు, మరికొన్నింటిని వివాహానంతరం పాటించడం జరుగుతుంది. మతపరమైన ఆచరణలు, పూజలు పునస్కారాలు, ఉపవాసాలు, పాటలు, నృత్యాలు, ఊరేగింపులు, ఉంగరాలు మార్చుకోవడం, మాంగల్యధారణ, సప్తపది, బహుమానాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం మున్నగు ఆచారాలను వివాహ సమయంలో పాటించడం జరుగుతుంది. ఆవివాహ ఆచారాలు ఒక దాని తరువాత మరొకటి కొన్ని రోజుల నుండి కొన్ని నెలల వరకు ఆచరించడం జరుగుతుంది.

## 18.4.6. నివాస పద్ధతులు

వివాహానంతరం దంపతులు ఎక్కడ నివసించాలనే విషయాన్ని కూడా వివాహ పద్ధతులు తెలియజేస్తాయి. వివాహ నియమాలు దంపతుల నివాస నియమాలను కూడా తెలుపుతాయి. సమాజ నియమాలను అనుసరించి కొత్తగా వివాహంచేసుకున్న దంపతులు ఎక్కడ నివాసముండవలెననే విషయాన్ని నిర్ధారించడం జరుగుతుంది. ఈనివాస నియమాలు ఒక్కొక్క సమాజంలో ఒక్కొక్కరకంగా ఉంటాయి. ఈ నివాసాలు ప్రధానంగా మాతృ స్థానికం, పితృస్థానికం, ద్విస్థానికం, మాతుల స్థానికం, నూత్న స్థానికంగా ఉంటాయి. వీటిలో ఒక్కొక్క సమాజం ఒక్కొక్క పద్ధతిని అనుసరించడం జరుగుతుంది.

మాతృస్థానిక నివాస పద్ధతి ప్రకారం వివాహనంతరం భార్యాభర్తలు భార్య పుట్టింట్లో నివాసముంటారు. పితృస్థానిక నివాస పద్ధతి ప్రకారం వివాహనంతరం భార్యభర్తలు, భర్త ఇంటిలో నివాసముంటారు. ద్విస్థానిక పద్ధతి ప్రకారం వివాహనంతరం భార్యభర్తలు అటు భర్త ఇంటిలోను, ఇటు భార్యపుట్టింటిలోను నివాసముండవచ్చు. మాతులస్థానిక నివాస పద్ధతి ప్రకారం వివాహనంతరం భార్యా భర్తలు, భర్త యొక్క మేనమామ ఇంటిలో నివాసముండవలె. నూత్న స్థానిక నివాస పద్ధతి ప్రకారం వివాహనంతరం భార్యాభర్తలు అటు భర్త ఇంటిలోగానీ, ఇటు భార్యఇంటిలోగానీ నివాసముండకుండా, తమకు తాము వేరేచోట నూతనంగా ఏర్పాటు చేసుకొన్న ఇంటిలో నివాసముంటారు. ఈవిధంగా వివాహనియమాలను బట్టి ఒక్కొక్క రకమైన నివాసపద్ధతులుంటాయి.

## 18.4.7 అధికారం

వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య (స్త్రీ, పురుషుల) బంధానేర్పరుస్తుంది. ఈ బంధం కొత్త కొత్త పాత్రలనేర్పరుస్తుంది. ఈ పాత్రలకు సమాజం కొన్ని అధికారాలను ఇవ్వడం జరిగింది. కాబట్టి ఈ అధికారం ఎవరి చేతిలో ఉండవలెననే విషయం ఒక్కొక్క సమాజంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది. కొన్ని సమాజాలలో అధికారం స్త్రీ చేతిలో ఉంటుంది. పితృస్వామ్య సమాజాలలో అధికారం భర్త చేతిలో గానీ, భర్త తండ్రి చేతిలోగానీ ఉంటుంది. మాతృస్వామ్య కుటుంబంలో సమాజంలోని అధికారం భార్యచేతిలోగానీ, లేక భార్య తల్లిచేతిలోగానీ ఉంటుంది.

## 18.4.8 వైవాహిక స్థిరత్వం

దాదాపు అన్ని సమాజాలలో వైవాహిక బంధం అనేది శాశ్వతమైనది. కానీ కొన్ని సమాజాలలో అది శాశ్వతంగా ఉండవలసిన అవసరం లేదు. అంటే అటువంటి సమాజాలలో వివాహం అనేది ఒక ఒప్పందంలాంటిది. ఈ ఒప్పందం నుంచి ఎప్పుడైనా విడిపోవచ్చు. వైవాహిక సంబంధాలనేవి విడాకుల ద్వారా రద్దవుతూ ఉంటాయి. అయితే సాంప్రదాయక సమాజాలలో వివాహం అనేది చాలావరకు స్థిరంగా ఉంటుంది. ఆధునిక, పాశ్చాత్య సమాజాలలో వివాహం స్థిరత్వాన్ని కోల్పోతున్నదనే వాదనలు ఇటీవలికాలంలో బలంగా వినిపిస్తున్నాయి. ఈ విధంగా చూస్తే కొన్ని సమాజాలలో వివాహ సంబంధాలు ఎక్కువ స్థిరంగానూ, మరికొన్ని సమాజాలలో తక్కువ స్థిరంగానూ



BRAOU

ఉంటాయి.

ఈవిధంగా వివాహ వ్యవస్థ పైన పేర్కొన్న ప్రధాన లక్షణాలను కలిగి ఉంటుంది. ఇవి దాదాపు అన్ని సమాజాలలోనూ అగుపించే లక్షణాలు. అయితే కొన్ని సమాజాలలో పైన పేర్కొన్న సాధారణ లక్షణాలతోపాటు ఇతర లక్షణాలు కూడా ఉండవచ్చు.

## 18.5 వివాహము-ప్రకార్యాలు

వివాహ వ్యవస్థ కొన్ని నిర్దిష్ట ప్రకార్యాలను నిర్వర్తిస్తుంది. అవి: 1. జైవిక ప్రకార్యాలు, 2. ఆర్థిక ప్రకార్యాలు, 3. సామాజిక ప్రకార్యాలు, 4. విద్యా ప్రకార్యాలు, 5. మానసిక ప్రకార్యాలు. ఇప్పుడు వీటిని గురించి వివరంగా చర్చిద్దాం.

### 18.5.1 జైవిక ప్రకార్యాలు

వివాహ వ్యవస్థద్వారా స్త్రీ, పురుషులు భార్య, భర్తలుగా గుర్తింపబడి, తమ లైంగిక వాంఛలను తీర్చుకోవడం జరుగుతుంది. సమాజంలో వ్యక్తుల మధ్యగల లైంగికవాంఛ వివాహం ద్వారా క్రమబద్ధీకరింపబడుతుంది. మానవులు తమ జాతి నిరంతరం కొనసాగడానికి విధిగా లైంగిక సంబంధాలను ఏర్పరచుకొని ప్రత్యుత్పత్తి ప్రకార్యాన్ని నిర్వర్తించడం జరుగుతుంది. అయితే మానవులలో ఈ లైంగిక సంబంధం అనేది జంతువుల వలె విచ్చలవిడిగా కాకుండా ఒక క్రమపద్ధతి ప్రకారం ఉంటుంది. అంతేకాకుండా ఈ లైంగిక సంబంధం మానవులలో దాదాపు శాశ్వతంగా కొనసాగుతూ ఉంటుంది. అయితే స్త్రీ, పురుషుల మధ్య లైంగిక సంబంధం ఉన్నంత మాత్రాన దానిని వివాహంగా భావించడానికి వీలులేదు. వివాహం అనేది అన్ని నియమాలను అనుసరిస్తూ ఏర్పడ్డ శాశ్వత సంబంధం. ఈ నియమాలను సమాజాలే ఏర్పాటు చేస్తాయి. వివాహ వ్యవస్థ వివాహానికి ముందుగానీ, వివాహానంతరం వివాహేతర, అక్రమ లైంగిక సంబంధాలను నిషేధిస్తుంది. వివాహానంతరం దంపతులు తమ లైంగికవాంఛలను తీర్చుకోవడానికి ఒకరిపైన మరొకరికి కొన్ని హక్కులను వివాహ వ్యవస్థ సంక్రమింపజేస్తుంది. సమాజంలో వ్యక్తుల మధ్య లైంగిక కార్యకలాపాలను క్రమబద్ధంచేయడానికి వివాహం ఒక సాధనంగా తోడ్పడుతుంది. దీర్ఘకాలం ఉండేది, న్యాయసమ్మతం అయినది ఐన స్త్రీ, పురుషుల లైంగిక సంబంధాన్ని వివాహ వ్యవస్థ క్రమబద్ధం చేస్తుంది. అదేవిధంగా దంపతుల లైంగిక అవసరాలను తృప్తి పరచడానికి, సంతానం పెంపొందడానికి వివాహం అనేది ఒక అత్యుత్తమ సాధనంగా తోడ్పడుతుంది. ప్రత్యుత్పత్తివల్ల మానవజాతి అభివృద్ధి చెంది సమాజం శాశ్వతంగా కొనసాగుతుంది. ఈవిధంగా సమాజం నిరంతరం కొనసాగడానికి, మానవజాతి అభివృద్ధి చెందడానికి స్త్రీ, పురుషుల మధ్య జైవిక ప్రకార్యమనేది చాలా అవసరమని చెప్పవచ్చు.

### 18.5.2 ఆర్థిక ప్రకార్యాలు

మానవ జీవితంలో ఆర్థిక కార్య కలాపాలు అనేవి అత్యంత ప్రధానమైనవి. వ్యక్తి జీవించడానికి, తన దైనందిన అవసరాలను తీర్చుకోవడానికి తప్పకుండా కొన్ని ఆర్థిక ప్రకార్యాలను నిర్వహించవలసి ఉంటుంది. వివాహ వ్యవస్థ స్త్రీ, పురుషులమధ్య శ్రమవిభజనను ఏర్పరుస్తుంది. తద్వారా, స్త్రీ, పురుషులు ఇరువురు తమ తమ శక్తి సామర్థ్యాలను బట్టి వివిధ ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటూ, పరస్పరం సహకరించుకుంటూ తమ అవసరాలను తీర్చుకోవడం జరుగుతుంది. స్త్రీ, పురుషుల మధ్య ఆర్థిక సహకారాన్ని ఏర్పాటుచేసి తద్వారా సమాజంలో వ్యక్తులు తమ మనుగడ కొనసాగించడానికి తగిన సౌకర్యాలను కలుగజేయడం ద్వారా వివాహ వ్యవస్థ ఆర్థిక ప్రకార్యాలను నెరవేరుస్తుంది. అంతేకాకుండా తమ పిల్లలను పెంచి పోషించాల్సిన బాధ్యతను కూడా తల్లి దండ్రులకు వివాహం నిర్దేశిస్తుంది. తల్లి దండ్రులు నిర్వహించవలసిన కర్తవ్యాలను వివాహ వ్యవస్థ తెలియజేస్తుంది. కాబట్టి వివాహ వ్యవస్థ అనేది వ్యక్తులు నిర్వహించవలసిన ఆర్థిక కార్యకలాపాలను సూచిస్తూ, తద్వారా వ్యక్తుల అవసరాలను తీర్చడానికి దోహదం చేస్తుంది.

### 18.5.3 సామాజిక ప్రకార్యాలు

వివాహం కుటుంబ రూపకల్పనకు మూలాధారం. వివాహవ్యవస్థ, కుటుంబ వ్యవస్థ ద్వారా ఒక మౌలిక సాంఘిక



BRAOU

వ్యవస్థ ఏర్పడుతుంది. వివాహం అనేది సమాజంలో పుట్టిన బిడ్డకు ఒక సుస్థిర స్థానాన్ని, అంతస్తును కల్పిస్తుంది. ఈ సాంఘిక అంతస్తు ద్వారానే శిశువు ఇతర వ్యక్తులతో సంబంధాలను ఏర్పరచుకోవడం జరుగుతుంది. వివాహం ద్వారానే వ్యక్తి తన వంశాన్ని కొనసాగించుకోవడం జరుగుతుంది. అంతేకాకుండా వివాహం అంటే కేవలం స్త్రీ, పురుషుల కలయిక మాత్రమేకాదు. అది ఇరుకుటుంబాల కలయిక. కొత్తకొత్త బంధువులను సంపాదించుకోవడంలో వివాహం విశిష్టమైన పాత్రను నిర్వహిస్తుంది. వివాహానంతరం కుటుంబ వ్యవస్థ ఏర్పడడం అది శాశ్వతంగా కొనసాగేటట్లు చేయడం ఒక బంధువర్గాన్ని, మరొక బంధువర్గంతో సంధానపరచడం మున్నగు విషయాలన్ని వివాహ వ్యవస్థ మూలంగానే రూపొందుతాయి. వివాహ వ్యవస్థ సమాజంలో వ్యక్తులు పాటించ వలసిన విలువలు, ప్రమాణాలు, నైతిక విలువలు, సంప్రదాయాలు, ఆచారాలను, తెలియజేస్తాయి. ఈ విధంగా వివాహ వ్యవస్థ అనేది సామాజిక విధులను నిర్వర్తిస్తుంది.

### 18.5.4 విద్యాప్రకార్యాలు

వివాహ సంస్థ ద్వారా కుటుంబ సంస్థ ఏర్పడుతుంది. కుటుంబసంస్థ వ్యక్తి జీవితంలో మొదటి పాఠశాల. కుటుంబంలోనే పిల్లలు సమాజానిక సంబంధించిన విలునలు, ప్రమాణాలు, సంప్రదాయాలు, సంస్కృతిని అలవరచుకోవడం జరుగుతుంది. పిల్లలు సరైన రీతిలో సాంఘికీకరణ పొందేటట్లు చూసే బాధ్యత తల్లిదండ్రులది. తల్లిదండ్రులు మొదట తాము సాంస్కృతిక శిక్షణను పొంది తదనంతరం వారి పిల్లలు సంస్కృతిని సముపార్జన చేసుకొని సామాజిక కార్యకలాపాలను సక్రమంగా నిర్వర్తించేటట్లు చేయాలి. ఒక తరం నుండి మరొక తరానికి సంస్కృతిని అందించే బాధ్యత వివాహ సంస్థ, కుటుంబ సంస్థల ద్వారా తల్లిదండ్రులపై ఉంచడం జరిగింది. విద్యా, సాంస్కృతిక శిక్షణ లేకపోతే మానవ సంస్కృతికి మనుగడనే లేదు. వ్యక్తి తన జీవితాన్ని సక్రమంగా కొనసాగించడానికి, సంస్కృతి తరతరాలుగా సజీవంగా కొనసాగడానికి వీలుకల్పించానికి వివాహ సంస్థ విద్యాపరమైన ప్రకార్యాలను నిర్వర్తిస్తుంది. ఈవిద్యా పరమైన ప్రకార్యాలద్వారా వివాహ సంస్థ, కుటుంబ సంస్థ వ్యక్తులలో క్రమశిక్షణను పెంపొందింపజేస్తుంది. విద్యాపరమైన ప్రకార్యాలద్వారానే వ్యక్తి సంపూర్ణ సామాజిక మానవునిగా రూపుదిద్దుకోవడంజరుగుతుంది.

### 18.5.5 మానసిక ప్రకార్యాలు

వివాహ సంస్థ, కుటుంబ సంస్థ రెండూ దంపతులు, వారి సంతానం మధ్య అన్యోన్య అనురాగాలు, ప్రేమబంధాలను నెలకొల్పుతుంది. వ్యక్తులు మానసిక ప్రశాంతతతో, ప్రేమానురాగాలతో జీవితాన్ని గడపడానికి వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ ఎంతో దోహదం చేస్తాయి. మానసిక సంతృప్తి అనేది వ్యక్తికి కుటుంబ వ్యవస్థలోనే లభ్యమవుతుంది. వివాహ, కుటుంబ వ్యవస్థలకు అవతల వ్యక్తికి మానసిక ప్రశాంతత, ప్రేమానురాగాలు లభ్యమయ్యే అవకాశమే లేదు. కాబట్టి వ్యక్తియొక్క మానసిక అవసరాలను వివాహ, కుటుంబ సంస్థలు పరితృప్తి పరుస్తాయని చెప్పవచ్చు. ఈవిధంగా వివాహ సంస్థ జైవిక, ఆర్థి, సామాజిక, విద్యా మానసిక పరమైన ప్రకార్యాలను నిర్వర్తిస్తుంది.

## 18.6 వివాహము - రకాలు

వివాహరకాలనేవి ఆయా సమాజాల సాంఘిక పరిస్థితులపై, సంస్కృతుల వికాసాలపైనా ఆధారపడి ఉన్నాయి. వివాహాన్ని ప్రధానంగా రెండు రకాలుగా పేర్కొనవచ్చును. అవి: 1. ఏకవివాహం, 2. బహు వివాహం . బహువివాహం రెండు రకాలు 1. బహుభార్యత్వం, 2. బహుభర్తృత్వం.

### 18.6.1 ఏకవివాహం

ఏకవివాహ పద్ధతి అంటే ఒక పురుషుడు ఒక స్త్రీని మాత్రమే వివాహమాడడం. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు చాలా సమాజాలలో ఏకవివాహ పద్ధతి అమలులో ఉన్నది. భారతదేశంలో కూడా పూర్వకాలంనుంచి అధిక సంఖ్యాకులు ఏకవివాహ పద్ధతినే అనుసరిస్తూ వస్తున్నారు. వాస్తవికంగా ఏకవివాహ పద్ధతి అన్ని వివాహ పద్ధతులలోకెల్ల



BRAOU

ఉత్తమమైనదని భావించడం జరుగుతుంది. ఏకవివాహాన్ని అనుసరించే కుటుంబాలలో భార్యభర్తల మధ్య ఎక్కువ ప్రేమ అనురాగాలు ఉంటాయి. నేటి ఆధునిక, సాంఘిక, ఆర్థిక వ్యవస్థలలో ఏకవివాహం పటిష్టమైనదిగాను, లాభదాయకమైనదిగాను, సర్వజనామోదితమైనదిగానూ బావింప బడుతున్నది. అందువల్లనే నేటి ఆధునిక సమాజాలన్నీ ఏక వివాహ పద్ధతిని అనుసరిస్తున్నాయి.

## 18.6.2 బహు వివాహము

ఒక పురుషుడు ఒకరికంటే ఎక్కువమంది స్త్రీలను వివాహమాడడం గానీ, లేదా ఒక స్త్రీ ఒకరికంటే ఎక్కువమంది పురుషులను వివాహం ఆడడంకానీ జరిగితే అటువంటి వివాహాన్ని బహువివాహం అంటారు. బహు వివాహం రెండు రకాలు, అవి: 1. బహుభార్యత్వం, 2. బహు భర్తృత్వము.

ఇప్పుడు వాటిని గురించి చర్చిద్దాము.

### 18.6.2.1 బహుభార్యత్వం

బహుభార్యత్వం అంటే ఒక పురుషుడు ఒకరికంటే ఎక్కువమంది స్త్రీలను వివాహమాడే పద్ధతి అని చెప్పవచ్చు. ప్రపంచంలోని కొన్ని సమాజాలలో బహుభార్యత్వ పద్ధతి అమలులో ఉన్నది. భారత దేశంలో వేదకాలంనుంచి ఆధునిక కాలం వరకు బహుభార్యత్వ పద్ధతిని రాజ్యాధినేతలు, ధనవంతులు తదితరులు అనుసరించడం జరుగుతుంది. అంతేకాక ఈ వివాహ పద్ధతి మన దేశంలో నివసిస్తున్న ఆదిమ తెగలలోనూ, ముస్లింలలోనూ హెచ్చుగా కనబడుతుంది. మనదేశంలోని ఆదిమ తెగలైన నాగాలు, గోండుల, బైగాలు బహుభార్యత్వాన్ని పాటిస్తున్నాయి. ఈ బహుభార్యత్వాన్ని పాటించడానికి సమాజ శాస్త్రవేత్తలు అనేక కారణాలను చెబుతున్నారు. సమాజంలో స్త్రీల సంఖ్య పురుషుల సంఖ్యకంటే హెచ్చుగా ఉండడం, ఎక్కువమంది భార్యలు ఉండడాన్ని ఒక హోదాగా పరిగణించడం, ఆస్థి పాస్తులను కాపాడుకోవడం కోసం, వారసుల నిమిత్తం, పురుషునికి అనేకమంది స్త్రీల పట్ల లైంగిక ఆసక్తి, స్త్రీ ఆర్థికాభివృద్ధికి సహాయకారిగా ఉండటం మున్నగువాటిని ప్రధాన కారణాలుగా పేర్కొనవచ్చు. మన దేశంలో 1955వ సంవత్సరంలో భారత ప్రభుత్వం హిందూ వివాహచట్టాన్ని అమలు పరిచి బహుభార్యత్వాన్ని నిషేదించడం జరిగింది. కానీ, ఈ చట్టం ఇస్లాం మతస్తులకు వర్తించదు. అయితే బహుభార్యత్వాన్ని చాలా సమాజాలలో ప్రజలు ఆమోదించకపోవడంవల్ల ఇది అంతగా ఆచరణలో లేదు.

### 18.6.2.2 బహుభర్తృత్వము

ఒక స్త్రీ ఒకరికంటే ఎక్కువ మంది పురుషులను వివాహమాడే పద్ధతిని బహుభర్తృత్వము అంటారు. బహుభర్తృత్వము అనేది కొన్ని ఆదిమ తెగలలో కనబడుతుంది. అయితే ఆధునిక నాగరిక సమాజాలలో బహుభర్తృత్వ వివాహ పద్ధతి అమలులోలేదు. బహుభర్తృత్వము రెండు రకాలు. అవి: 1. సోదర బహుభర్తృత్వము, 2. సోదరేతర బహుభర్తృత్వము. ఒక స్త్రీని సోదరులందరూ వివాహం చేసుకొని ఆస్త్రీకి భర్తలుగా ఉన్నట్లయితే దానిని సోదర బహుభర్తృత్వము అంటారు. అలా కాకుండా ఒక స్త్రీ యొక్క భర్తలందరూ సోదరులు కానట్లయితే దానిని సోదరేతర బహుభర్తృత్వము అంటారు. అంటే ఒక స్త్రీ వివిధ కుటుంబాలకు చెందిన పురుషులను వివాహం చేసుకోవడమన్నమాట. ఉదాహరణకు దక్షణభారత దేశంలోని నీలగిరి కొండలలో నివసించే తోడాలు, ఈశాన్య ప్రాంతాలలో నివసిస్తున్న ఖాసా వంటి ఆదిమ తెగలవారు ఈనాటికీ బహుభర్తృత్వ వివాహ పద్ధతిని పాటిస్తున్నారు. పురుషుల సంఖ్య స్త్రీల సంఖ్య కంటే ఎక్కువ ఉండడమే బహుభర్తృత్వానికి ప్రధానకారణమని చెప్పడం జరుగుతుంది. స్త్రీని కూడా పోషించలేని ఆర్థిక స్థితిగతులు, జనాభాను తగ్గించుకునే ఉద్ధేశము మొదలైనవికూడా ఈ వివాహ పద్ధతికి కారణాలుగా చెప్పబడుతున్నది.

## 18.7 సారాంశము

సమాజంలోగల వివిధ సామాజిక సంస్థలలో వివాహ సంస్థ ప్రధానమైనది. వివాహం అంటే స్త్రీ, పురుషుల మధ్య

చట్టంగానూ, సమాజామోదిత యోగ్యంగాను గల శాశ్వత లైంగిక సంబంధం అని చెప్పవచ్చు. వివాహానికి సంబంధించి కొన్ని వివాహ నియమాలుంటాయి. అవి 1. అంతర్వివాహము, 2. బహిర్వివాహము, 3. అధిగణన వివాహము. అదిగణన వివాహ నియమాలు ప్రధానంగా నాలుగు. అవి 1. సమాంత పిత్రీయ సంతతి వివాహము, 2. మేనరిక వివాహము, 3. దేవరన్యాయము, 4. భార్యభగినీ న్యాయము.

వివాహ వ్యవస్థకు కొన్ని ప్రధాన లక్షణాలు ఉంటాయి. అవి 1. విశ్వజనీనత, 2. వివాహనియమావళి, 3. జీవిత భాగస్వామి ఎంపిక, 4. ఆర్థికవ్యవహారాలు, 5. నిర్దిష్ట వివాహ నియమాలు, నిబంధనలు, ఆచారాలు, 6. నివాస పద్ధతులు, 7. అధికారం, 8. వైవాహిక స్థిరత్వం.

వివాహ వ్యవస్థ ప్రధానంగా ఐదు ప్రకర్యాలను నిర్వర్తిస్తుంది. అవి 1. జైవిక ప్రకర్యాలు, 2. ఆర్థిక ప్రకర్యాలు, 3. సామాజిక ప్రకర్యాలు, 4. విద్యా ప్రకర్యాలు, 5. మానసిక ప్రకర్యాలు.

ఆయా సమాజాల సాంఘిక పరిస్థితులను అనుసరించి వివాహాన్ని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించడం జరిగింది. అవి 1. ఏకవివాహము, 2. బహువివాహము. బహు వివాహాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1. బహుభార్యత్వము, 2. బహుభర్తృత్వము.

## 18.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. వివాహానిన నిర్వచించి దానియొక్క లక్షణాలను వివరింపుము.

2. వివాహ వ్యవస్థయొక్క ప్రధాన ప్రకర్యాలేమిటి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. వివాహ నియమాలను వివరింపుము.

2. వివాహ రకాలను వివరింపుము

## 18.9 చదవదగిన పుస్తకాలు


Alex Thio :Sociology -An Introduction.

C.N.Shanker Rao : Sociology.

Ladia, K.M. 1966 : Marriage and Family in India.

Ram Ahuja, 1993 : Indian Social System.

Kingsley Davis : Human Society.

Ogburn & Nimkoff : A Handbook of Sociology.




B R A O U

# భాగం-19: బంధుత్వము

విషయక్రమం


19.0 ఉద్దేశాలు

19.1 పరిచయం

19.2 బంధుత్వము- అర్థం, నిర్వచనం

19.3 బంధుత్వ స్థాయి

19.3.1 ప్రాథమిక బంధుత్వము

19.3.2 గౌణ బంధుత్వము

19.3.3 తృతీయ బంధుత్వము

19.4 బంధుత్వ పరిభాష - వర్గీకరణ

19.4.1 ఉపయోగించే విధానాన్నిబట్టి వర్గీకరణ

19.4.2 భాషానిర్మితిని బట్టి వర్గీకరణ

19.4.3 అనుబంధ పరిధిని బట్టి వర్గీకరణ

19.5 బంధుత్వ ప్రమాణాలు

19.6 బంధుత్వ ఆచరణలు

19.6.1 పరిహాస సంబంధాలు

19.6.2 వైదొలగు నడవడి

19.6.3 మాతులాధికారము

19.6.4 పితృష్వాధికారము

19.6.5 కుహనా ప్రసూతి

19.6.6 సాంకేతిక బోధన

19.7 బంధుత్వ సమూహాలు

19.7.1 నివాస బంధు సమూహాలు

19.7.2 ఏకరక్త బంధు సమూహాలు

19.8 బంధుత్వ సమూహాల రకాలు

19.8.1 వంశం

19.8.2 గోత్రం

19.8.3 గోత్రకూటమి

19.8.4 దిశాఖ

19.9 సారాంశం

19.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

19.11 చదవదగిన పుస్తకాలు


## 19.0 ఉద్దేశాలు



ఈ భాగం చదివిన తరువాత మీరు:

BRAOU

- బంధుత్వం యొక్క అర్థం, నిర్వచనాన్ని వివరించగలుగుతారు.
- ప్రాథమిక, గౌణ తృతీయ బంధువులెవరో గుర్తించగలుగుతారు.
- బంధుత్వ పరిభాష వర్గీకరణను వివరించడగలుగుతారు.
- బంధుత్వ ప్రమాణాలను విశ్లేషించగలుగుతారు.
- వంశం, గోత్రం, గోత్ర కూటమి, ద్విశాఖ మున్నగు బంధు సమూహాలను లక్షణాలను వివరించగలుగుతారు.

## 19.1 పరిచయం

ప్రపంచంలోని అన్ని సమాజాలలో వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, బంధుత్వ వ్యవస్థ అనేవి ఉంటాయి. ఇవి విశ్వజనీనమైనవి. అయితే ఈమూడు వ్యవస్థలు ఒకదానితే మరొకటి అవినాభావ సంబంధాన్ని కలిగియున్న వ్యవస్థలు. వివాహం, కుటుంబం, బంధుత్వం అనేది అన్ని సమాజాలలో ఏదో ఒక రూపంలో తప్ప కుండా ఉంటాయి. బంధుత్వ వ్యవస్థ వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాలను, ప్రేమానురాగాలను పెంపొందింప జేసి, సమాజంలో ప్రజలంతా కలిసికట్టుగా ఉండడానికి దోహదం చేస్తుంది.

## 19.2. బంధుత్వము-అర్థం, నిర్వచనం

రక్త బంధం వల్లగాని, వైవాహిక బంధం వల్ల గానీ యిరువ్యక్తుల మధ్య ఏర్పడే సంబంధాన్ని బంధుత్వం అంటారు. బంధుత్వమనేది వాస్తవికమైన రక్త బాంధవ్యం మీద గానీ, కల్పిత రక్త బాంధవ్యం మీద గానీ ఆధారపడిన సామాజిక సంబంధం. సమకాలిక సమాజంలో ఒకే పూర్వీకుని వంశంలో పుట్టిన వాళ్లు బంధువులుగా లెక్కింపబడతారు. బంధుత్వం రెండు రకాలు-1) వైవాహిక బంధుత్వము 2) రక్త బంధుత్వము. వివాహం ద్వారా వైవాహిక బంధుత్వం ఏర్పడుతుంది. ఒక పురుషుడు ఒక స్త్రీని వివాహమాడినప్పుడు అది ఇద్దరు సభ్యుల సంయోగం మాత్రమే గాక, అది రెండు కుటుంబాల సంయోగం అవుతుంది. అందువల్ల ఒక వివాహం జరిగిన వెంటనే రెండు కుటుంబాల మధ్య బంధుత్వం ఏర్పడుతుంది. ఒక కుటుంబంలో వివాహం ద్వారా బయటి నుండి కుటుంబంలోకి తేబడిన సభ్యులు తప్ప తక్కిన వాళ్ళందరూ రక్త బంధువులు అవుతారు. అంటే దంపతులు వారి యొక్క సంతానానికి మధ్య గల సంబంధం రక్త బంధుత్వం అవుతుంది. అంటే భార్యభర్తల మధ్య గల సంబంధం అనేది వైవాహిక బంధుత్వమైతే, తల్లిదండ్రులు వారి పిల్లల మధ్య మరియు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, అన్న చెల్లెళ్ళు మున్నగు వారి మధ్య గల సంబంధం రక్త బంధుత్వమవుతుంది. అయితే ఒక వంశానుక్రమంలో జన్మించిన వ్యక్తులందరూ రక్త బంధువులుగా పరిగణింపబడతారు. వీరినే సజాతీయ బంధువులుగా పరిగణింపబడతారు. అయితే ఈసజాతీయ బంధువులు తమ వంశకర్త పురుషుడని భావించినప్పుడు, ఆవంశానుక్రమం పురుషుని ద్వారా గుర్తింపబడుతూ ఆబంధుత్వాన్ని పితృ వంశ బంధుత్వమని అనడం జరుగుతుంది. అదే విధంగా తమ వంశకర్త స్త్రీ అని భావించినప్పుడు,ఆవంశానుక్రమాన్ని స్త్రీ ద్వారా గుర్తింపబడుతూ ఆబంధుత్వాన్ని మాతృ వంశ బంధుత్వం అని పిలుస్తారు. అయితే చాలా సమాజాలలో పితృ వంశ బంధుత్వాన్ని పాటిస్తారు. కొన్ని సమాజాలలో మాతృ వంశ బంధుత్వాన్ని కూడా పాటించడం జరుగుతున్నది. అంటే ఇక్కడ ఒక వంశానుక్రమంలో గల ముత్తాత, తాత, తండ్రి, కుమారుడు, మనవడు మున్నగు వారంతా రక్త బంధువులు.

కాబట్టి వ్యక్తుల మధ్య వివాహం ద్వారా ఏర్పడే సంబంధాన్ని వైవాహిక బంధుత్వమని, రక్త సంబంధం ద్వారా, వంశానుక్రమం ఆధారంగా ఏర్పడే సంబంధాన్ని రక్త బంధుత్వమని చెప్పవచ్చు. అయితే రక్త బంధుత్వంలో ఏక రక్త బంధువులు అని రెండు రకాల బంధువులుంటారు. ఒకే వంశ కర్త యొక్క వంశానికి చెందిన వారందరినీ రక్త బంధువులు అని పిలుస్తారు. అయితే తల్లిదండ్రులు వారి సంతానం, సోదరులు, సోదరీమణులు, సోదర సోదరీమణుల మధ్య గల సంబంధాన్ని ఏక రక్త బంధుత్వం అని అంటారు. ఇంతకు ముందే చెప్పినట్లు, వివాహం ద్వారా ఏర్పడే బంధువుల్ని వైవాహిక బంధులు అని పిలుస్తారు. ఒక వ్యక్తి యొక్క భార్య, అత్త మామలు,

బావమరిది, మరదలు మున్నగు వారందరూ వైవాహిక బంధువులవుతారు.

## 19.3. బంధుత్వ స్థాయి

బంధుత్వ స్థాయి ఆధారంగా బంధుత్వాన్ని ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు-1) ప్రాథమిక బంధుత్వము 2) గౌణ బంధుత్వము 3) తృతీయ బంధుత్వము. ఈబంధుత్వ ప్రాతిపదికన ఏర్పడే బంధువులను ప్రాథమిక బంధువులు, గౌణ బంధువులు లేదా ద్వాతీయ బంధువులు, తృతీయ బంధువులు అని వర్గీకరించవచ్చు. యిప్పుడు వీటిని గురించి వివరంగా చర్చిద్దాం.

### 19.3.1 ప్రాథమిక బంధుత్వము

రక్తసంబంధం ద్వారాకానీ, వైవాహిక సంబంధం ద్వారా కానీ ఒక వ్యక్తికి మరొక వ్యక్తికి ప్రత్యక్షమైన బంధుత్వము ఉన్నట్లయితే వారిద్దరి మధ్యగల బంధుత్వాన్ని ప్రాథమిక బంధుత్వము అంటారు. ఇటువంటి బంధువులను ప్రాథమిక బంధువులు అంటారు. ప్రతివ్యక్తికి ఏడుగురు ఏడుగురు ప్రాథమిక బంధువులు ఉంటారు. ఒక ప్రాథమిక కుటుంబాన్ని తీసుకున్నట్లయితే అందులో ప్రధానంగా భార్య-భర్త, తల్లి కూతురు, అక్క-చెల్లెలు, అన్న-చెల్లెలు, అక్క-తమ్ముడు అనే తొమ్మిది రకాల ప్రాథమిక బంధుత్వ సంబంధాలను క్రింది పటం ద్వారా వివరించవచ్చు.




ఎ మరియు బి మధ్య గల బంధుత్వం ప్రాథమిక వైవాహిక బంధుత్వం. కాబట్టి ఎ, బిలు ప్రాథమిక వైవాహిక బంధువులు. ఎ మరియు సి మధ్యగల బంధుత్వం ఏక రక్త బంధుత్వం. కాబట్టి ఎ, సిలు ఏకరక్త బంధువులు అదేవిధంగా సి మరియు డి మధ్య గల సంబంధం రక్త బంధుత్వం. అదేవిధంగా బి మరియు డి మధ్య గల సంబంధం రక్త బంధుత్వం కాబట్టి పై పటంలో చూపిన ఎ,బి,సి,డి అనే వ్యక్తులు ప్రాథమిక బంధువులు.

BRAOU

### 19.3.2 గౌణ బంధుత్వము

ఒక వ్యక్తి యొక్క ప్రాథమిక బంధువుల యొక్క ప్రాథమిక బంధువులు. ఆవ్యక్తి యొక్క గౌణ బంధువులు లేదా ద్వితీయ బంధువులు అవుతారు. వారి మధ్యగల సంబంధాన్ని గౌణ బంధుత్వం అంటారు. ఒక వ్యక్తికి మొత్తంమీద 33 మంది ద్వితీయ బంధువులుంటారు. ఉదాహరణకు ఒక కుటుంబంలో తాత-మనవడు, మామ-కోడలు, అత్త-కోడలు, మామ-అల్లుడు మున్నగు బంధుత్వ సంబంధాలన్నింటిని గౌణ బంధుత్వ సంబంధాలంటారు. దీనిని ఈ క్రింది పటం ద్వారా కూడా చూపవచ్చు.




పై పటం ప్రకారం ఎ, సి ప్రాథమిక రక్త బంధువులు. సి.ఇలు కూడా ప్రాథమిక రక్త బంధువులు. అయితే ఇ అనే వ్యక్తి ఎ యొక్క ప్రాథమిక బంధువు. సి యొక్క ప్రాథమిక బంధువు. కాబట్టి ఎ మరియు ఇ మధ్య గల బంధుత్వం గౌణ బంధుత్వం. అదేవిధంగా సి, డిలు ప్రాథమిక వైవాహిక బంధువులు. కాబట్టి ఎ మరియు డి మధ్య గల సంబంధం గౌణ బంధుత్వాన్ని సూచిస్తుంది.

### 19.3.3 తృతీయ బంధుత్వము

ఒక వ్యక్తి యొక్క ద్వితీయ బంధువుల యొక్క ప్రాథమిక బంధువులు ఆ వ్యక్తికి తృతీయ బంధువుల యొక్క ప్రాథమిక బంధువులు ఆ వ్యక్తికి తృతీయ బంధువులవుతారు. అదేవిధంగా ఒక వ్యక్తి యొక్క ప్రాథమిక బంధువు యొక్క ద్వితీయ బంధువులు తృతీయ బంధువులవుతుంటారు. అదేవిధంగా వారి మధ్య గల సంబంధాన్ని తృతీయ బంధుత్వము అంటారు. ప్రతి వ్యక్తికి మొత్తం మీద 151 మంది తృతీయ బంధువులుంటారు. ఉదాహరణకు తాత-మనవడిభార్య, తాత-మునిమనవడు, తాత-మునిమనవరాలు మున్నగు బంధుత్వ సంబంధాలను తృతీయ బంధుత్వము అంటారు. దీనిని ఈ క్రింది పటం ద్వారా వివరించవచ్చు.




పై పటం ప్రకారం ఎ, సిలు ప్రాథమిక బంధువులు. సి, ఇ లుప్రాథమిక బంధువులు. ఎ. ఇలు గౌణ బంధువులు, ఇ, జిలు ప్రాథమిక బంధువులు. సి, జిలు గౌణ బంధువులు. సి, హెచ్‌లు గౌణ బంధువులు, సి, ఎఫ్‌లు గౌణ బంధువులు. కాబట్టి ఎ జిలు, ఎ హెచ్‌లు మరియు ఎ ఎఫ్‌ల మధ్యగల సంబంధం తృతీయ బంధుత్వం. కాబట్టి వీరు తృతీయ బంధువులవుతారు.

BRAOU

## 19.4 బంధుత్వ పరిభాష- వర్గీకరణ

సమాజంలో ప్రతి వ్యక్తికి బంధువర్గ ముంటుంది. ఒక్కొక్క బంధువతో ఒక్కొక్క రకమైన బంధుత్వ సంబంధముంటుంది. అతడు ఒక్కొక్క బంధువును ఒక్కొక్క పదంతో సంబోధిస్తాడు. అది వారిద్దరి మధ్య గల బంధుత్వ సంబంధాన్ని సూచిస్తుంది. ఈ విధంగా వ్యక్తుల మధ్యగల బంధుత్వ సంబంధాన్ని సూచించే పదజాలాన్ని బంధుత్వ పరిభాష (kinship terminology) అంటారు. ఈ బంధుత్వ పదజాలం వ్యక్తుల మధ్యగల బంధుత్వ సంబంధాల స్వభావాన్ని వ్యక్తీకరిస్తుంది.

బంధుత్వ పదజాలాన్ని జార్జి పీటర్ మర్డక్ అనే మానవశాస్త్రవేత్త మూడు రకాలుగా వర్గీకరించాడు. అవి:

1. ఉపయోగించే విధానాన్ని బట్టి వర్గీకరణ(mode of use)

2. భాషానిర్మితిని బట్టి వర్గీకరణ(linguistic structure)

3. అనుబంధ పరిధిని బట్టి వర్గీకరణ (range of application) ఇప్పుడు వీటిని గురించివివరంగా చర్చిద్దాం.

### 19.4.1 ఉపయోగించే విధానాన్నిబట్టి బంధుత్వ వర్గీకరణ

ఉపయోగించే విధానాన్నిబట్టి బంధుత్వ పదాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1. సంబోధన పదము (term of address), 2. అన్వయ పదము (term of reference).

ఒక బంధువు మరొక బంధువుతో ప్రత్యక్షంగా మాట్లాడుతున్నప్పుడు ఉపయోగించే పదాన్ని సంబోధన పదం అంటారు. ఒక బంధువు వేరొక బంధువును గురించి మూడవ వ్యక్తితో మాట్లాడుతున్నప్పుడు ఆ బంధువుకు సంబంధించి ఉపయోగించే పదాన్ని అన్వయ పదం అంటారు. ఒక వ్యక్తి యొక్క బంధుత్వ హోదాను తెలియజేసేటప్పుడు ఈ పదాన్ని ఉపయోగించడం జరుగుతుంది. అమ్మ, నాన్న, అన్న, అక్క, అత్త అనేవి సంబోధన పదాలు. అయితే సంబోధన పదం కన్నా అన్వయ పదం నిశ్చితమైన సంబంధాన్ని సూచిస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి మరొక వ్యక్తితో మాట్లాడుతూ అమ్మ, నాన్న, మేనత్త అని ఉదహరిస్తే ఈది తన స్వంత తల్లి, తండ్రి, మేనత్తలకే వర్తిస్తుంది. అయితే ప్రత్యక్షంగా మాట్లాడేటప్పుడు అమ్మ అనే పదంతో కన్నతల్లినే కాక ఇతర పెద్ద స్త్రీలను కూడా సంబోధించవచ్చు. అదే విధంగా అత్త, అక్క, అన్న అనే పదాలను తన స్వంతబంధువులకే కాకుండా ఇతరులకు కూడా అన్వయించి మాట్లాడడం జరుగుతుంది. అయితే కొందరు బంధువుల విషయంలో సంబోధన పదం, అన్వయ పదం ఒకటే అవుతుంది.

### 19.4.2 భాషా నిర్మితిని బట్టి వర్గీకరణ

భాషా నిర్మితిని బట్టి మార్డక్ బంధుత్వ పదాలను మూడురకాలుగా వర్గీకరించినాడు. అవి, 1. వర్గీకృత పదజాలము(classificatory terms), 2. వివరణాత్మక పదజాలము(descriptive terms), 3. ఉత్పన్న పదజాలము (derivative terms).

వర్గీకృత పదజాలము సమాజంలోని విభిన్న వ్యక్తులను రక్త బంధువులుగానీ లేదా వైవాహిక బంధువులుగానీ ఒకే బంధుత్వ పదంతో విభిన్న అర్థాలు స్ఫురించేటట్టుగా సూచిస్తుంది. ఉదాహరణకు ఇంగ్లీషులో అంకుల్ (uncle) అనే పదం వర్గీకృత పదం. ఈ పదాన్ని ఉపయోగించి మామను, చిన్నాన్నను మరియు ఇతర బంధువులను కూడా పిలువవచ్చు. అంటే ఈ పదం అన్ని రకాల బంధువులకు వర్తిస్తుంది. అదే విధంగా తాత అనే పదం తల్లియొక్క తండ్రికి, తండ్రియొక్క తండ్రికి కూడా వర్తిస్తుంది.

వివరణాత్మక పదం సంభాషణ జరిపే ఇరు వ్యక్తుల మధ్యగల ఖచ్చితమైన బంధుత్వాన్ని సూచిస్తుంది. ఉదాహరణకు అమ్మ, నాన్న అనే పదాలు వివరణాత్మక బంధుత్వ పదాలు. ఈ పదాలు ఖచ్చితమైన బంధుత్వాన్ని సూచిస్తాయి. వీటినే ప్రాథమిక బంధుత్వ పదాలు అంటారు. ఎందువల్లనంటే ఈ పదాలను అర్థయుక్తంగా విభజించలేము.

B R A O U

ఉత్పన్న పదం రెండు ప్రాథమిక పదాలకలయికవల్ల ఏర్పడుతుంది. రెండు బంధుత్వ పదాల కలయికవల్ల మరో అర్థాన్ని సూచించే బంధుత్వ పదం ఉత్పన్న మవుతుంది. అలాకాకుండా కొన్ని సందర్భాలలో బంధుత్వాన్ని సూచించే ప్రాథమిక పదము, బంధుత్వాన్ని సూచించని పదము కలిసి ఒక పదంగా ఏర్పడుతుంది. ఇటువంటి పదాలను ఉత్పన్న పదజాలము అంటారు. ఉదాహరణకు కొన్ని ఆదిమ సమాజాలలో ఫార్‌బ్రోర్ (farbror) అనే పదంతో తండ్రి ఫార్ అంటే ఫాదర్, బ్రోర్ అంటే బ్రదర్ అనే రెండు పదాల వల్ల చిన్నాన్న లేదా పెద్దనాన్న అనే బంధుత్వ పదం ఏర్పడుతుంది. తెలుగుభాషలో పినతల్లి, పినతండ్రి అనేవి ఉత్పన్నపదాలు.

### 19.4.3 అనుబంధ పరిధిని బట్టి వర్గీకరణ

ఒక్కొక్క బంధుత్వ పదం ఎంతమంది బంధువులకు వర్తిస్తుందో తెలియజేసే దానిని అనుబంధ పరిధి అనిపిసలాతరు. అనుబంధ పరిధిని ప్రాతిపాదికగా తీసుకొని బంధుత్వ పదాలను మర్డక్ రెండు రకాలుగా వర్గీకరించినాడు. అవి: 1. సూచిక పదం, 2. వర్గాత్మక పదం.

ఒకే బంధుత్వ పదంతో తరము(generation), లింగభేదము (sex), వంశావళి (geneological)సంబంధము అనే మూడు అంశాల దృష్ట్యా ఒకే తరగతికి చెందిన బంధువులను పిలిస్తే దానిని సూచిక పదము అని పిలుస్తారు. తల్లి, తండ్రి, భార్య, భర్త అనేవి సూచిక పదాలు ఈ పదాలు దేనికదే ఒక్కొక్క వ్యక్తికి మాత్రమే వర్తిస్తాయి.

తరం, లింగభేదం, వంశావళి అనే అంశాలను దృష్టిలో పెట్టుకొని ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువ మంది బంధువులకు ఉపయోగించే పదాన్ని వర్గాత్మక పదం అని పిలుస్తారు. ఉదాహరణకు పిన్ని, తాత, బావ, మామ అనే

పదాలను ఒకరికంటే ఎక్కువమంది బంధువులను పిలవడానికి ఉపయోగిస్తారు. పిన్ని అనే పదాన్ని తల్లి సోదరికి, తండ్రి తమ్ముని భార్యకు కూడా ఉపయోగిస్తారు. తాత అనే పదాన్ని తల్లి తండ్రికి, తండ్రి తండ్రికి కూడా ఉపయోగిస్తారు. మామ అనే పదాన్ని తల్లి సోదరునికి, తండ్రి సోదరి భర్తకు కూడా ఉపయోగిస్తారు.

అయితే ఒక బంధుత్వ పరిభాషలో వర్గాత్మక పదాలకన్నా సూచక పదాలు ఎక్కువగా ఉంటే దానిని సంకుచిత పరిధి(narrow range) అని, అట్లాకాకుండా సూచక పదాలకన్నా వర్గాత్మక పదాలు ఎక్కువగా ఉంటే దానిని బృహత్ పరిధి(broad range) అని అంటారు.

## 19.5 బంధుత్వ ప్రమాణాలు

జార్జ్ పీటర్ మర్డక్, క్రోబర్, లూయీ అనే ప్రఖ్యాత మానవశాస్త్రవేత్తలు బంధుత్వానికి సంబంధించి జరిపిన పరిశోధనల ఆధారంగా తొమ్మిది రకాల బంధుత్వ ప్రమాణాలను రూపొందించడం జరిగింది. అవి:

1. తరప్రమాణము(criterion of kinship)
2. లింగనిర్ణయప్రమాణము(criterion of sex)
3. వైవాహిక బాంధవ్య ప్రమాణము(criterion of affinity)
4. జ్ఞాతిబాంధవ్య ప్రమాణము (criterion of collaterality)
5. ద్వీధాకరణ ప్రమాణము (criterion of bifurication)
6. ధ్రువత్వ ప్రమాణము (critarion of polarity)
7. సాపేక్ష వయః ప్రమాణము(critarion of relative age)
8. వక్తృలింగ ప్రమాణము (critarion of decedence)
9. మృత బాంధవ్య సూచికా ప్రమాణము (croteropm pf decedemce)

ఇప్పుడు పైన తెలిపిన బంధుత్వ ప్రమాణాలను గురించి వివరంగా చర్చిద్దాం.

**1. తర ప్రమాణము:** తర ప్రమాణాన్ని ఆధారంగా చేసుకొని వివిధ తరాలకు చెందిన బంధువుల్ని గుర్తించడం జరుగుతుంది. తరమనే ప్రమాణాన్ని బట్టి ఒక్కొక్క తరంలోని బంధువులకు ఒక్కొక్క రకమైన బంధుత్వ పదాలను ఉపయోగిస్తారు. ఒక వ్యక్తిని తీసుకొన్నట్టయితే అతని తరంలో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఉంటారు. అతని పైతరంలో తల్లి దండ్రులుంటారు. ఆపైతరంలో తాతలు, ముత్తాతలుంటారు. తన క్రింది తరంలో కొడుకులు, కూతుళ్లు ఉంటారు. ఈ విధంగా కొక్కొక్క తరానికి చెందిన బంధువులను కొన్ని ప్రత్యేక బంధుత్వ పదాలతో గుర్తించడం జరుగుతుంది.

**2. లింగ నిర్ణయ ప్రమాణము:** లింగ భేదం ఆధారంగా వివిధ బంధువలును వివిధ బంధుత్వ పదాలతో పిలువడం జరుగుతుంది. చాలా సమాజాలలో లింగనిర్ణయ ప్రమాణం ఆధారంగా ఆడ, మగ తేడాలను తెలిపే బంధుత్వ పదాలను ఉపయోగిస్తారు. ఈ బంధుత్వ పదాలు స్త్రీ, పురుష లింగ భేదాన్ని సూచిస్తాయి. తల్లి, తండ్రి, భార్య, భర్త, కూతురు, కుమారుడు మున్నగు బంధుత్వ పదాలన్నీ వారియొక్క బంధుత్వ సంబంధంతో పాటు వారియొక్క లింగాన్ని కూడా సూచిస్తాయి.

**3. వైవాహిక బాంధవ్య ప్రమాణము:** సమాజంలో ప్రతివ్యక్తికి చాలావరకు ఏకరక్త బంధువులు, వైవాహిక బంధువులుంటారు. అయితే ఎవరు ఏకరక్త బంధువులో, ఎవరు వైవాహిక బంధువులో సమాజనే నిర్ణయిస్తుంది. అందువల్ల చాలా సమాజాలు ఎవరు రక్త బంధువులో, ఎవరు వైవాహిక బంధువులో నిర్ణయించే పరిభాషను రూపొందించాయి.



BRAOU

4.జ్ఞాతి బాంధవ్య ప్రమాణము: ఏకరక్త బంధువర్గంలోని ఒకే తరానికి చెందిన వారిలో ఒక వ్యక్తికి కొందరు దగ్గరి బంధువులవుతారు. మరికొందరు దూరపు బంధువులవుతారు. అనే వాస్తవంపైన ఈ ప్రమాణం ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి యొక్క పిన తండ్రి, పెద తండ్రి, మేనమామములు మరియు వారియొక్క సంతానం కన్నా అవ్యక్తికి తన తల్లిదండ్రులు, సోదరి, సోదరులు దగ్గరి బంధువులవుతారు. మిగతా వారంతా దూరపు బంధువులవుతారు. ఉదాహరణకు దంపతులకు బిడ్డ పుట్టినట్లయితే ఆ బిడ్డ వారిద్దరికీ వంశానుక్రమమనే సంబంధం ద్వారా రక్త బంధువవుతుంది. వంశానుగత సంబంధాల వల్ల ఒక వ్యక్తికి బంధువైన వాడు అవ్యక్తి వంశజ్ఞుడు అవుతాడు. వారికి రెండవ బిడ్డ పుట్టినట్లయితే వంశానుక్రమానికి సంబంధించి కొత్త సంబంధాలేర్పడతాయి. ఎందుకంటే మొదటి బిడ్డకు, రెండవ బిడ్డకు బంధుత్వమేర్పడుతుంది. ఈ బంధుత్వాన్ని జ్ఞాతీయత అంటారు. వీరు వంశానుక్రమాన్ని పంచుకొని పుట్టారు. వారిద్దరు ఒకరికొకరు వంశానుగత బంధువులు కారు. ఎందువల్లనంటే ఒకరినుంచి మరొకరు ఉద్భవించలేదు. వారిద్దరూ ఒకే దంపతుల రక్తాన్ని పంచుకొని పుట్టినారు. అందువల్ల వారు జ్ఞాతులు. అయితే జ్ఞాతులు, వంశానుగత బంధువులు కూడా ఏకరక్త బంధువులే. అయితే కొన్ని సమాజాలు ఇటువంటి భేదాన్ని పాటించవు. అందువల్ల జ్ఞాతులను, వంశానుగత బంధువులను కలిపి ఒకే బంధుత్వ పదంతో పిలుస్తారు. ఈ విధంగా బంధువులను కలపడాన్ని ఏకీకరణ అంటారు. ఉదాహరణకు తల్లిని, తల్లి సోదరిని, తండ్రి సోదరిని ఒకే బంధుత్వ పదంతో పిలుస్తారు. అలాగే కొన్ని సమాజాలలో ఒక వ్యక్తి బిడ్డలకు, అవ్యక్తి సోదరి, సోదరుల సంతానానికి ఒకే బంధుత్వ పదాన్ని ఉపయోగిస్తారు.

5. ద్విదాకరణ ప్రమాణము: ఒక వ్యక్తికి పురుషునిద్వారాకానీ, స్త్రీద్వారాకానీ బంధుత్వం ఏర్పడుతుందన్న వాస్తవంపైన ఈ ప్రమాణం ఆధారపడి ఉంది. ఈ ప్రమాణం ద్వితీయ బంధువులకు, తృతీయ బంధువులకు సంబంధించి ఉంటుంది. ఈ ద్విదాకరణ ప్రమాణం ప్రకారం ఒక వ్యక్తి మరొక వ్యక్తికి పురుషునిద్వారా బంధుత్వమయితే, ఒక బంధుత్వ పదాన్ని, స్త్రీ ద్వారా బంధువయితే మరొక బంధుత్వ పదాన్ని ఉపయోగిస్తారు. అలాకాకుండా ఆరెండు విధాలుగా బంధువలైనవారందరినీ ఒకే పదంతో ఉదహరిస్తే అది వర్గాత్మక బంధుత్వ పదమవుతుంది. ఉదాహరణకు తాత అనే పదం తండ్రియొక్క తండ్రికి, తల్లియొక్క తండ్రికి వర్తిస్తుంది. అలాగే మనవడు అనే పదము కొడుకు కొడుకుకి, కుమార్తె కొడుకుకి కూడా వర్తిస్తుంది. అందువల్ల తాత, మనవడు అనే పదాలు వర్గాత్మక పదాలయినాయి.

6 ధృవత్వ ప్రమాణము: ఒక సామాజిక సంబంధం ఏర్పడడానికి కనీసం ఇద్దరు వ్యక్తులు, వారిమధ్య పరస్పర చర్యలు అవసరమనే వాస్తవంపైన ఈ ప్రమాణం ఆధారపడి ఉంటుంది. ఇద్దరు బంధువులు ఒకరినొకరు సంబోధించుకునేటపుడు ఒక్కొక్కరు ఒక్కొక్క బంధుత్వ పదాన్ని ఉపయోగిస్తారు. ఈవిధంగా బంధుత్వ పదాన్ని ఉపయోగించడాన్ని ధృవత్వ ప్రమాణము అని అంటారు. అన్నదమ్ములు మాట్లాడుకేనేప్పుడు అందులో ఒక వ్యక్తి 'అన్న' అని సంబోధిస్తే, రెండో వ్యక్తి 'తమ్ముడు' అని సంబోధిస్తాడు. ఆ విధంగానే అక్కా చెల్లెల్లు, భార్య భర్తలు మొదలైనవారు ఒకరినొకరు వేరువేరు పదాలతో సంబోధించుకుంటారు.

7. సాపేక్షవయః ప్రమాణము: ఒకే తరానికి చెందిన వారందరూ సాధారణంగా ఒకే వయస్సు కలిగి ఉండరనే వాస్తవం పైన ఈ ప్రమాణము ఆధారపడి ఉంటుంది. వయస్సును బట్టి ఇద్దరు బంధువులలో ఒక వ్యక్తి రెండవ వ్యక్తికన్నా చిన్నవాడుగా కానీ లేదా పెద్దవాడుగా కానీ అయి ఉండవచ్చు. ఈ ప్రమాణము ఆధారంగా ఇద్దరు సోదరులలో పెద్దవానిని అన్న అని, చిన్నవాడిని తమ్ముడు అని రెండు వేరువేరు బంధుత్వ పదములను బట్టి పిలువడము జరుగుతుంది.

8. వక్రలింగ ప్రమాణము: ఈ ప్రమాణాన్ని కొన్ని సమాజాలలో మాత్రమే అనుసరిస్తూ ఉంటారు. ఈ ప్రమాణము ప్రకారం తండ్రిని కుమారుడు ఒక బంధుత్వ పదముతో, కుమార్తె మరొక బంధుత్వ పదముతో సంబోధిస్తారు.

9. మృత బాంధవ్య సూచిక ప్రమాణము: ఈ ప్రమాణాన్ని కూడా కొన్ని సమాజాలలో మాత్రమే అనుసరిస్తూ ఉంటారు. కొన్ని సమాజాలలో ఒక వ్యక్తిని అతడు జీవించి ఉన్నప్పుడు ఒక బంధుత్వ పదముతో, అతడు చనిపోయిన తరువాత మరొక బంధుత్వ పదముతో పిలుస్తారు.

## 19.6 బంధుత్వ ఆచరణలు

బంధు సమూహాలలోని వ్యక్తుల మధ్య వివిధ రకాలైన బంధుత్వ సంబంధాలుంటాయి. ఒక్కొక్క రకమైన బంధుత్వ సంబంధము ఒక్కొక్క రకమైన ప్రవర్తనను నిర్దేశిస్తూ ఉంటుంది. అవిధంగా సమాజం మొత్తంమీద చూసినట్టయితే బంధు సమూహాలలోని వ్యక్తుల మధ్య కొన్ని నిర్దిష్టమైన ప్రవర్తనలు కనిపిస్తాయి. వాటినే బంధుత్వ ఆచరణలు అంటారు. ఈ బంధుత్వ ఆచరణలు ప్రధానంగా ఆరు రకాలుగా ఉంటాయి. అవి 1. పరిహాస సంబంధాలు, 2. వైదొలగునడవడి, 3. మాతులాధికారము, 4. పితృస్వాధికారము, 5. కుహనా ప్రసూతి, 6. సాంకేతిక సంబోధన. ఇప్పుడు వీటిని గురించి వివరంగా చర్చిద్దాం.

### 19.6.1 పరిహాస సంబంధము

సమాజంలో కొంతమంది బంధువుల మధ్య పరిహాస సంబంధాలు కనిపిస్తాయి. వీటికి సమాజ ఆమోదం ఉంటుంది. ఈ పరిహాస సంబంధాలలో ఒకరినొకరు హేలన చేసుకోవడం, ఆస్థిని నిష్టపరచుకోవడం మొదలైన ఎన్నోరకాల చనువులు తీసుకోవడం జరుగుతుంది. పరిహాస సంబంధాలలో ఎవరూ చిన్నబుచ్చుకోరాదు. పరిహాస సంబంధాలు రెండు విధాలుగా ఉంటాయి. అవి: 1. ఇద్దరు బంధువులు ఒకరినిఒకరు సమానంగా పరిహసించుకోవడం. దీనిని సాష్టవ పరిహాసమంటారు. 2. ఇద్దరు బంధువులలో ఒకరికి మరొకరిని పరిహసించే స్వేచ్ఛ ఉంటుంది. కానీ, రెండవ వ్యక్తి తిరిగి మొదటి వ్యక్తిని పరిహసించరాదు. దీనిని అసాష్టవ పరిహాసమంటారు. ఈ పరిహాస సంబంధాలు బావా మరదళ్ల మధ్య, బావ బామ్మరుదుల మధ్య, తాతా మనవల మధ్య సామాన్యంగా కనిపిస్తాయి.

### 19.6.2 వైదొలగు నడవడి

కొన్ని సమాజాలలో సాంప్రదాయకంగా కొందరు బంధువుల మధ్య సన్నిహిత సంబంధాలు ఉండడానికి వీలులేదు. ఒక బంధువు మరొక బంధువుతో అతి సన్నిహితముగా ఉండడానికి ముఖాముఖి మాట్లాడుకోవడం గానీ నిషేదము. ఇటువంటి ప్రవర్తనను వైదొలగు నడవడి అంటారు. కోడలు అత్త, మామలను తప్పించుకొని మసలవలెననే సాంప్రదాయము చాలా సమాజాలలో కనిపిస్తుంది. కోడలు ముఖ్యముంగా మామకు కనిపించకపోవడం, ముఖాముఖి వారితో మాట్లాడకపోవడం, ఎక్కువ పరిచయము పెట్టుకోకపోవడం మొదలైనవన్నీ వైదొలగు నడవడిలో ఇమిడి ఉన్నాయి. అదేవిధంగా కొన్ని సమాజాలలో అల్లుడు, అత్తల మధ్యకూడా వైదొలగు నడవడి కనిపిస్తుంది. అలా సంప్రదాయకముగా కొందరు బంధువులమధ్య సన్నిహిత సంబంధాలు పెంపొందనీయకపోవడానికి గల కారణమేమిటంటే అల్లునికి, అత్తగారికి మధ్య, కోడలికి, మామగారికి మధ్య ఏవిధమైన పరిచయమున్నప్పటికీ అది వారిమధ్య అక్రమ సంబంధాలకు దారితీసి కుటుంబ వాతావరణాన్ని కలుషితం చేయవచ్చుననే బయంతో వారిమధ్య పరిచయాన్ని నిషేదించడం జరుగుతుందని మానవశాస్త్రవేత్తల అభిప్రాయం.

అత్త వారింటికి కాపురానికి వచ్చిన కోడలు యొక్క అచారాలు మరియొక ఇంటికి చెందినవి కావడం చేత, అత్తవారింట్లో ఉండే వ్యక్తులందరూ ఆమెకు కొత్తగా ఉంటారు. ఆమె ప్రభావం ఇంట్లో వ్యక్తులమీద ప్రసరించి వారు చలించకుండా చూడడం కోసం ఆమెతో పరిచయం ఆమె భర్తకు మాత్రమే పరిమితం చేయబడి ఉంటుందని రాబర్ట్. హెచ్ లెవి చెప్పినాడు.

ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధము ఏర్పడితే వారిలో సహకారముగానీ, వ్యతిరేకతగానీ ఏర్పడే అవకాశము ఉంటుంది. అయితే కుటుంబమనే సహకార సంస్థలో ప్రాతికుల్య భావాలుండడం శ్రేయస్కరము కాదు. అటువంటి విరుద్ధ భావమెప్పుడూ ఏర్పడకుండా ఉండవలెనన్న దృష్టితో చాలా సమాజాలలో కోడలు, మామ మధ్య , అల్లుడు అత్త మధ్య సంబంధాలను వైదొలగే నడవడిద్వారా అదుపులో ఉంచుతారని రాడ్క్లిఫ్ బ్రౌన్ అభిప్రాయపడినాడు.

### 19.6.3 మాతులాధికారము

కొన్ని సమాజాలలో ఒక వ్యక్తియొక్క జీవిత విశేషాలన్నింటికి అతని తల్లి సోదరుడు అంటే మేనమామ బాధ్యత



BRAOU

వహిస్తు ఉంటాడు. ఆ వ్యక్తికి తండ్రికంటే మేనమామనే ముఖ్యము. మాతులస్థానీయ నివాసము కలిగి ఉండటము, మేనమామనుంచి ఆస్తి పొందడము వంటి ముఖ్యమైన ఆచారాలు కలిగి ఉన్న ఈ విధానాన్ని మాతులాధికారము అని పేర్కొంటారు.

### 19.6.4 పితృష్వాధికారము

మాతులాధికారము ఉన్న సమాజాలలో మేనమామ నిర్వర్తించే పాత్రలన్నీ కొన్ని సమాజాలలో పితృష్వ అంటే మేనత్త నిర్వరిస్తుంది. ఒక వ్యక్తి యొక్క జీవిత విశేషాలపై మేనత్త బాధ్యత వహించే పద్ధతిని పితృష్వాధికారము అంటారు. మేనమామ ప్రభావము మాతృ వంశీయ సమాజాలలోనూ, మేనత్త ప్రభావము పితృ వంశీయ సమాజాలలోనూ ఎక్కువగా కనిపిస్తుంది.

### 19.6.5 కుహనప్రసూతి

కొన్ని ఆదిమ సమాజాలల్లో భార్య ప్రసవించేటప్పుడు ఒక వ్యాధి గ్రస్తునివలె నటించాలి. ఆ సమయంలో అతను అనేక నిషేదాలకు గురిఅవుతాడు. సామాన్యమైన అవసరాలన్నీ తగ్గించుకొని రోగి తీసుకోవలసిన ఆహారము మాత్రమే అతను తీసుకోవాలి. తోడ, ఖాసీ మొదలైన సమాజాలలో ఈ ఆచారాలు కనిపిస్తాయి. భార్య కష్ట సమయాలలో ఉన్నప్పుడు భర్తకూడా ఆమెతో సమానంగా కష్టపడుతు తమ దాంపత్య జీవితాన్ని పటిష్టము చేసుకోవడానికి ఉద్దేశించినదే కుహన ప్రసూతి అని బ్రౌనిస్లా మలినోవస్కీ అభిప్రాయపడినారు. భార్య బాధ పడుతున్నప్పుడు భర్తకూడా బాధపడుతుంటే అది భార్యకు మానసికంగా కొంచెం విశ్రాంతికలుగజేయవచ్చుననే భ్రాంతితో అటువంటి ఆచారాన్ని పాటిస్తారని కొందరు అభిప్రాయపడినారు. ప్రసవసమయంలోని మలినము గృహవాతావరణాన్ని కలుషితం చేయడం వల్ల ఆ ఇంట్లో నివసించే ఆమె భర్తకు నిజంగానే అనారోగ్యం కలుగవచ్చు. అటువంటి అనారోగ్యాన్ని ఊహిస్తూ ముందు జాగ్రత్తకోసం ఈ విధంగా భర్త కొన్ని నిషేదాలను పాటిస్తాడని కొంతమంది మానవ శాస్త్రవేత్తలు తెలిపారు.

### 19.6.6 సంకేతిక సంబోధన

కొన్ని సమాజాలో బంధువులను పేరుపెట్టి పిలుస్తారు. కొందరు బంధుత్వ పదముతో పిలుస్తారు. ఈ రెండు విధాలుగా కాకుండా మరికొందరు బంధువును 'ఫలానావారి తండ్రి' లేదా 'ఫలానావారి తల్లి' అని పిలుస్తారు. అలా పిలిచే బంధుత్వ ఆచారాన్ని 'సంకేతిక సంబోధన' అంటారు. ఉదాహరణకు భార్య భర్తను సంబోధించేటప్పుటు తన కుమారుని లేదా కుమార్తె యొక్క తండ్రిగా సంబోదిస్తుంది. తన కుమారుని పేరు సన్ని అయితే సన్ని నాన్న అని, కూతురుపేరు విన్ని అయితే విన్ని నాన్న అని పిలుస్తుంది. అలాగే కొందరు భర్తలు కూడా భార్యలను పిలిచేటప్పుడు ఇలాంటి సంకేతిక సంభోధనలు వాడుతారు.

## 19.7 బంధుత్వ సమూహాలు

బంధుత్వాన్ని నెలకొల్పుకున్న వ్యక్తుల సమూహాన్ని బంధుత్వ సమూహం అంటారు. ఈ బంధుత్వ సమూహాలు ప్రధానముగా మూడు సూత్రాల మీద ఆధారపడి ఏర్పడతాయి. అవి 1. వంశానుక్రమన విధానము, 2. నివాస విధానము, 3. వారసత్వ సంక్రమణ విధానం.

వంశాను క్రమాన్ని బట్టి బంధు సమూహాలు ఏర్పడతాయి. వంశానుక్రమాన్నిబట్టి ఏక వంశానుక్రమము అని, దానిని అవలంభించడం వల్ల ఏర్పడే బంధు సమూహాన్నే ఏకపక్ష బంధు సమూహము అని అంటారు. వంశము, గోత్రము అనేవి ఏక వంశాను క్రమాన్ని అనుసరించి ఏర్పడిన బంధు సమూహాలు. ఈ సమూహాలలోని వారందరూ ఒకే గృహంలో నివసించరు. ఒక కుటుంబానికి చెందినవారు మాత్రమే ఒక గృహంలో నివసించడం జరుగుతుంది. నివాస విధానంపై ఆధారపడి ఏర్పడే బంధు సమూహము కుటుంబము. వారసత్వ సంక్రమణ విధానముపై ఆధారపడి ఏర్పడే బంధుత్వ సమూహాలు వంశము, గోత్రము, గోత్ర కూటమి, ద్విశాఖ మున్నగునవి.

బంధుత్వ సమూహాలు రెండు ప్రధాన సమూహాలుగా ఉంటాయి. అవి: 1. నివాస బంధు సమూహాలు, 2. ఏకరక్త బంధు సమూహాలు. ఇప్పుడు వీటిని గురించి సంక్షిప్తంగా చర్చిద్దాము.

### 19.7.1 నివాస బంధు సమూహాలు

కొందరు బంధువులు ఒకే గృహంలో కలిసి నివశిస్తూ ఉన్నట్టయితే దానిని నివాస బంధు సమూహము అంటారు. కుటుంబము నివాస బంధు సముహానికి ఉదాహరణ. ఇందులో వైవాహిక బంధువులు, ఏకరక్త బంధువులు ఉంటారు. లైంగిక సంతృప్తిని కలిగించడం, ప్రత్యుత్పత్తి, బిడ్డల పోషణ, సాంస్కృతిక శిక్షణ అనే విధులను ఈ సమూహం నిర్వహిస్తుంది. వ్యష్టి కుటుంబాలు, సమిష్టి కుటుంబాలు, బహుభార్యత్వ కుటుంబాలు, బహుభర్తృత్వ కుటుంబాలు మున్నగువాటిని కూడా నివాస బంధు సమూహాలకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

### 19.7.2 ఏకరక్త బందు సమూహాలు

ఇవి వంశానుక్రమము, వారసత్వ సంక్రమణ విధానముపై ఆధారపడి ఏర్పడే బంధు సమూహాలు. వీరంతా ఒకే పూర్వికుని వంశస్తులై ఉంటారు. ఈ పూర్వికుడు స్త్రీగానీ, పురుషుడుగానీ కావచ్చు. వీరంతా ఒకేచోట నివసించరు. ఈ సమూహాలలో ఒక కుటుంబానికి చెందినవారు మాత్రమే ఒక చోట నివసిస్తారు. అంటే ఈ ఏకరక్త బంధు సముహాలలో అనేక కుటుంబాలు ఉంటాయి. దీనిలోని బంధువులంతా ఒకే వంశ కర్త సంతతిగి చెందినవారమనే భావనను కలిగి ఉంటారు. దీనిలో మాతృ వంశాను క్రమము, పితృ వంవాను క్రమమనే రెండు వంశానుక్రమ బంధు సమూహాలు ఉంటాయి. ఈ బంధు సమూహాలు ప్రధానంగా నాలుగ రూపాలలో ఉంటాయి. అవి: 1. వంశము, 2. గోత్రము, 3. గోత్రకూటమి, 4. ద్విశాఖి. వీటిని గురించి ఈ క్రింద వివరంగా చర్చించడం జరిగింది.

## 19.8 బంధు సమూహాలు

బంధు సమూహాలు ప్రధానంగా నాలుగ రూపాలలో ఉంటాయి. అవి: 1. వంశము, 2. గోత్రము, 3. గోత్రకూటమి, 4. ద్విశాఖి. వీటిని గురించి ఈ క్రింద వివరంగా చర్చించడం జరిగింది.

### 19.8.1 వంశము

ఒకే పూర్వికుని నుంచి ఉద్భవిచినామనే భావన కలిగి యున్న వ్యక్తుల సమూహాన్ని వంశము అంటారు. ఒక వంశానికి చెంధిన వ్యక్తులందరూ తామంతా ఒకే వంశకర్తయొక్క సంతతి అని భావిస్తారు. కాబట్టి ఏక వంశానుక్రమాన్ని అవలంభించే బంధువుల సమూహం వంశము అవుతుంది. ఇది ఏకరక్త బంధు సమూహము. వంశాను క్రమాన్ని స్త్రీద్వారాగానీ, పురుషునిద్వారాగానీ గుర్తించడం జరుగుతుంది. వంశకర్త పురుషుడని భావిస్తే దానిని పితృ వంశమని, అలాకాకుండా వంశకర్త స్త్రీ అని భావిస్తే దానిని మాతృ వంశమని పిలుస్తారు.

వంశానికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. వాటిని ఈ విధంగా చెప్పవచ్చు. ప్రతీ వంశానికి ఒక పేరు ఉంటుంది. ప్రతీ వంశము అంతర్వివాహ సమూహం. ఎందుకంటే ఒక వంశానికి చెందిన వారంతా ఏకరక్త బంధువులు. చాలా సమాజాలలో ఏకరక్త బంధువల మధ్య వివాహము నిషిద్ధము కాబట్టి ఒక వంశానికి చెందినవారు. మరొక వంశానికి చెందినవారిని వివాహము ఆడాలి. వంశమనేది దాదపు అన్ని సమాజాలలో ఈ పద్ధతిద్వారా వివాహాన్ని, లైంగిక సంబంధాలను క్రమబద్ధం చేస్తూ ఉంటుంది. ప్రతీ వంశము కొన్ని సమిష్టి మతాచారాలను కలిగి ఉంటుంది. వంశ సభ్యులు తమ వంశపూర్వికులను పూజిస్తారు. కొన్ని సమాజాలలో వంశానికి సమిష్టి ఆస్థి ఉంటుంది. అయితే చాలా సమాజాలలో వంశములోని కుటుంబాలే ఆస్థిని కలిగి ఉంటాయి. సమిష్టి కృషి, పరస్పర సహకారము ప్రతీ వంశంలోనూ ఉంటాయి. వంశము సామాజిక నియంత్రణా సాధనంగా కూడా పనిచేస్తుంది. వ్యక్తులు సామాజిక సామాజిక సంప్రదాయాలను, ఆచారాలను, చట్టాలను అతిక్రమించకుండా వంశము వ్యక్తుల ప్రవర్తనను నియంత్రిస్తుంది. వీటిని అతిక్రమించిన వారిని వంశము శిక్షిస్తుంది.

### 19.8.2 గోత్రము

గోత్రము అనేది ఏక వంశానుక్రమ సమూహము. తామంతా ఒకే పూర్వికుని సంతతి వారమని భావిస్తూ, ఆ పూర్వికునికి తమకు గల సంబంధాన్ని రుజువుపరచలేని ఏక వంశానుక్రమ సమూహాన్ని సూచించేది గోత్రము.



BRAOU

దీనిలో అసంఖ్యాకమైన తరాలకు చెందిన అనేకమంది సభ్యులు ఉంటారు. పూర్వికులతో తమకు గల సంబంధాన్ని వీరు వివరించలేరు. ఇది ఒక ఊహాపరమైన వంశ క్రమము. అంటే ఈ వంశానుక్రమ సమూహానికి అతి ప్రాచీన కాలానికి చెందిన పితృదేవత ఉంటాడు. ఒక గోత్రంలోని వారంతా ఒకే సంతతికి చెందిన వారమనే నమ్మకం కలిగి ఉండడం చేత వారిలో వారికి ఎటువంటి వివాహ సంబంధాలు ఉండవు. అయితే, గోత్రము యొక్క పితృదేవత మనిషే కానవసరము లేదు. ఈ పితృదేవత జంతువుగానీ, చెట్టుగానీ, జీవిగానీ, అజీవిగానీ కావచ్చు. ఏకవంశానుక్రమం ఆధారంగా గోత్రాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1. పితృ వంశగోత్రాలు. 2. మాతృ వంశ గోత్రాలు. తమ గోత్రం యొక్క పితృదేవత పురుషుడని భావిస్తే దానిని పితృ వంశ గోత్రమని, అట్లాగాక తమ గోత్రం యొక్క పితృదేవత స్త్రీ అని భావిస్తే అటువంటి గోత్రాన్ని స్త్రీ వంశగోత్రమని పిలుస్తారు.

గోత్రము ప్రధానంగా ఈ క్రింది లక్షణాలను కలిగి ఉంటుంది. అవి:

1. గోత్రము ఉభయలక్షణ బంధు సమూహము, అది ఏక వంశానుక్రమాన్ని కలిగియుంటి నివాస ఏకత్వాన్ని పొంది ఉంటుంది. గోత్రములోని వారందరు రక్త బంధువులుగా భావింపబడతారు. అయితే గోత్రములోని వారంతా మాతృవంశానుక్రమానికో, పితృ వంశానుక్రమానికో చెంది ఉంటారు. 2. గోత్రాలకు ఉప గోత్ర సమూహాలు కూడా ఉండవచ్చు.

3. ప్రతీ గోత్రానికి ఒక పేరు ఉంటుంది. ఆ గోత్ర నామముతోనే గోత్ర సభ్యులను గుర్తించడం జరుగుతుంది.

4. గోత్రము బహిర్వివాహ సమూహము. ఒక గోత్రానికి చెందిన వ్యక్తి అదే గోత్రానికి చెందిన వ్యక్తిని వివాహమాడరాదు. ఎందుకంటే గోత్ర సభ్యులందరినీ రక్త బంధువులుగా పరిగణించడం జరుగుతుంది. కాబట్టి సగోత్ర వివాహాలు నిషిద్ధం.

5. ప్రతి గోత్రానికి కొన్ని సమిష్టి మతాచారాలు, సంప్రదాయాలు, విశ్వాసాలు ఉంటాయి. వాటిని గోత్ర సభ్యులు తప్పకుండా ఆచరించవలె.

6. కొన్ని సమాజాలలో , ముఖ్యంగా ఆదిమ సమాజాలలో గోత్రానికి టోటెమ్ అనేది చిహ్నంగా ఉంటుంది. గోత్రం యొక్క పూర్వికున్ని టోటెమ్‌గా భావించడం జరుగుతుంది. టోటెమ్ అనేది ఒక వ్యక్తిగానీ, జీవిగానీ, అజీవిగానీ, ఒక జంతువుగానీ, ఒక చెట్టుగానీ, పక్షిగానీ, పురాణ పురుషుడుగానీ, సూర్యుడుగానీ, చంద్రుడుగానీ ఏదైనా కావచ్చు. తమ గోత్రానికి చిహ్నంగా దేనినైతే పరిగణిస్తారో అందులోనుండే తామంతా ఉద్భవించామనే భావనను గోత్ర సభ్యులు కలిగి యుండి, దానిని ప్రఘాడముగా విశ్వసిస్తారు. కొన్ని సమాజాలలో టోటెమ్‌ను చిహ్నముగా దరించడముగానీ, టోటెమ్ రూపాలను చెక్కిన కొయ్యలను నెలకొల్పుకొనడం గానీ చేస్తారు. ఒక గోత్రం వారు వారికి సంబంధించిన టోటెమ్‌ను చంపడముగానీ, దానిని అవమాన పరచడం గానీ చేయరు. దానిని పూజిస్తారు.

7. ప్రతీ గోత్రానికి గోత్ర మూలకర్తలుంటారు. మాతృవంశీయ గోత్రమైతే స్త్రీలు, పితృవంశీయ గోత్రమైతే పురుషులు గోత్ర మూలకర్తలుగా ఉంటారు.

8. గోత్రాలు సమిష్టి సమూహాలు. కొన్ని సమాజాలలో ఒక్కొక్క గోత్రం వారు పవిత్ర స్థలాలను, దేవాలయాలను సమిష్టిగా కలిగి ఉంటారు. అంతేగాకుండా వారు కొంత విలువైన భూమిని సమిష్టి ఆస్తిగా కలిగి ఉంటారు.

9. గోత్ర సభ్యుల మధ్య పరస్పర సహకారము, ఆప్యాయత, అతిథి మర్యాదలు ఉంటాయి.

### 19.8.3 గోత్ర కూటమి

రెండుగానీ, అంతకన్నా ఎక్కువగానీ గోత్రాలను కలిగి ఉన్న ఏక వంశానుక్రమ సమూహాన్ని గోత్ర కూటమి అని నిర్వచించవచ్చు. ఒక్కొక్క గోత్రము వారు తమ గోత్ర కూటమిలో ఉండే ఇతర గోత్రాల వారితో సన్నిహిత సంబంధాలను కలిగి ఉంటారు. గోత్ర కూటమిలు రెండు రకాలుగా ఉంటాయి. అవి: 1. మాతృవంశీయ గోత్ర కూటమి, 2. పితృ వంశీయ గోత్ర కూటమి. గోత్ర కూటమి ప్రధానంగా ఈ క్రింది లక్షణాలను కలిగి ఉంటుంది.



BRAOU

1. కొన్ని సమాజాలలో గోత్ర నామముతో పాటు గోత్ర కూటమికి కూడా ఒక పేరు ఉటుంది. మరికొన్ని సమాజాలలో గోత్రకూటములకు పేర్లు ఉండవు.

2. కొన్ని సమాజాలలో గోత్ర కూటమిలో బహిర్వివాహ పద్ధతిని పాటిస్తారు. అయితే మరికొన్ని సమాజాలలో గోత్రకూటాలలో బహిర్వివాహ పద్ధతిని పాటించరు. అంటే ఇట్లాంటి గోత్ర కూటమిలో అంతర్వివాహ పద్ధతిని పాటిస్తారు. అయితే ఇందులో వ్యక్తి తన గోత్రము వారిని కాకుండా గోత్ర కూటమిలోని మరొక గోత్రానికి చెందిన వ్యక్తిని వివాహమాడడం జరగుతుంది.

3. గోత్ర కూటమికి కూడా కొన్ని సమిష్టి మతాచారాలు, సంప్రదాయాలు ఉంటాయి.

4. కొన్ని ఆదిమ సమాజాలలో గోత్ర కూటమి ఒక ప్రముఖ రాజకీయ వ్యవస్థగా పనిచేస్తుంది. కాబట్టి గోత్ర కూటమి అనేది ఒక సంఘటిత సమూహమని చెప్పవచ్చు.

5. కొన్ని సమాజాలలో ముఖ్యంగా ఆదిమ సమాజాలలో గోత్ర కూటమికి కూడా టోటెమ్ ఉంటుంది. టోటెమ్ ఉన్న గోత్ర కూటమి సభ్యులు టోటెమ్‌ను తినడం గానీ, చంపడం గానీ చెయ్యరు. దానిని పూజిస్తారు.

### 19.8.4 ద్విశాఖి

ఒక సమాజము రెండు బంధు సమూహాలుగా విభజితమై ఉంటే అందులో ఒక్కొక్క దానిని ద్విశాఖి అంటారు. ఈవిధమైన విభజనను ద్వివిధ వ్యవస్థాపన అంటారు. కొన్ని సమాజాలలో రెండు, మూడు గోత్ర కూటమిలు కలిసి ద్విశాఖిగా ఏర్పడతాయి. అయితే కొన్ని సమాజాలలో సమాజం మొత్తానికి రెండే రెండు గోత్రాలుండి, ఒక్కొక్క గోత్రం ఒక్కొక్క ద్విశాఖిగా ఏర్పడుతుంది. ద్విశాఖి సాధారణముగా ఈక్రింది లక్షణాలను కలిగి ఉంటుంది.అవి.

1) ద్విశాఖికి ఒక పేరు ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు.

2) ద్విశాఖిల్లు అంతర్వివాహాన్ని పాటించవచ్చు లేదా పాటించకపోవచ్చు.సాధారణంగా ద్విశాఖిలు బహిర్వివాహ పద్ధతిని పాటిస్తాయి. కేవలం గోత్రాలే ద్విశాఖిలుగా ఏర్పడిన సమాజాలలో అవి ఖచ్చితంగా బహిర్వివాహ పద్ధతినే అనుసరిస్తాయి.కాని అంతర్వివాహ పద్ధతిని అనుసరించవు.

3) ద్విశాఖలకు టోటెమ్ అనేది చిహ్నంగా ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు.

4) ద్విశాఖ అనేది ద్వివిధ వ్యవస్థాపనను కలిగి యుంటుంది. ద్వివిధ వ్యవస్థాపన ఉన్న సమాజాలలో ఒక ద్విశాఖ మరొక ద్విశాఖతో సన్నిహిత సంబంధాన్ని కలిగి యుంటుంది. ఈసంబంధాలు ఒక ద్విశాఖకు మరొక ద్విశాఖ అందించే సేవల రూపంలో ఉంటుంది. ద్వివిధ వ్యవస్థాపన ఉన్న సమాజాలలోని రెండు ద్విశాఖల వారు పరస్పర విరుద్ధమైన సంకేతాలను కలిగి ఉంటారు.

ఈవిధంగా బంధుత్వ సమూహాలు నాలుగు రకాలుగా ఉండి, వివిధ లక్షణాలను కలిగి ఉంటాయి. అయితే ఈనాలుగు రకాల బంధుత్వ సమూహాలు అన్ని సమాజాలలో కొన్ని రకాలైన బంధుత్వ సమూహాలుండవచ్చు.

## 19.9. సారాంశం

ఇంతకు ముందే చర్చించినట్లుగా బంధుత్వమనేది ప్రపంచంలోని అన్ని సమాజాలలో ఉన్నది. రక్త సంబంధం వల్లగానీ, వైవాహిక సంబంధం వల్లగానీ యిరువ్యక్తుల మధ్య ఏర్పడే సంబంధాన్ని బంధుత్వం అంటారు. బంధుత్వం రెండు రకాలు-1) వైవాహిక బంధుత్వం 2) రక్త బంధుత్వం. బంధుత్వ స్థాయిని ఆధారంగా బంధుత్వాన్ని ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి-1) ప్రాథమిక బంధుత్వము 2)గౌణ బంధుత్వము 3) తృతీయ బంధుత్వము.

ప్రతి సమాజంలో బంధు వర్గాన్ని సంబోధించడానికి బంధుత్వ పరిభాష అనేది ఉంటుంది. బంధుత్వ పరిభాషను జార్జిపీటర్ మర్డక్ అనే మానవ శాస్త్రవేత్త మూడు ప్రాతిపదికల ఆధారంగా వర్గీకరించినాడు. అవి-1)



B R A O U

ఉపయోగించే విధానాన్ని బట్టి బంధుత్వ పదాలను రెండు రకాలుగా వర్గీకరించడం జరిగింది. ఎ) సంబోధన పదము బి) అన్వయపదము 2)భాషా నిర్మితిని బట్టి బంధుత్వ పదాలను చూడు రకాలుగా వర్గీకరించడం జరిగింది.- ఎ) వర్గీకృత పదజాలము బి) వివరణాత్మక పదజాలము సి) ఉత్పన్న పదజాలము. 3) అనుబంధ పరిధిని బట్టి బంధుత్వ పదాలను రెండు రకాలుగా వర్గీకరించడం జరిగింది. అవి-ఎ) సూచక పదము బి) వర్ణాత్మక పదము. వీటితో పాటు బంధుత్వానికి సంబంధించి తొమ్మిది రకాల బంధుత్వ ప్రమాణాలు కూడా ఉన్నాయి. చాలా సమాజాలలో వివిధ వ్యక్తుల మధ్య వివిధ రకాల బంధుత్వ ఆచరణలు ఉంటాయి. ఈబంధుత్వ ఆచరణలు ప్రధానంగా ఆరు రకాలుగా ఉంటాయి. అవి- 1) పరిహాస సంబంధాలు 2) పైదొలగు నడవడి 3) మాతులాధికారము. 4)పితృస్వాధికారము. 5) కుహనప్రసూతి 6) సంకేతిక సంబోధన.

వంశానుక్రమ విధానం, నివాసవిధానం, వారసత్వ సంక్రమణ విధానం అనే సూత్రాలపై ఆధారపడి సమాజంలో ప్రధానంగా నాలుగు రకాల బంధుత్వ సమూహాలు కనబడుతాయి. అవి-1) వంశము 2)గోత్రము 3)గోత్ర కూటమి 4)ద్విశాఖ.

## 19.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

II. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. బంధుత్వ పరిభాషకు సంబంధించిన వర్గీకరణను వివరింపుము.
2. బంధుత్వ ప్రమాణాలేమిటో తెలుపుము.

II. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. బంధుత్వ ఆచరణలను గురించి చర్చింపుము.
2. బంధుత్వ సమూహాల రకాలను గురించి చర్చింపుము.

## 19.11 చదవదగిన పుస్తకాలు


C.N.shanker Rao. : sociology.

Madan.G.R.and Majumdar.T.N. : An Introductionto social Anthropology.

Piddington.R. : An Introduction to social Anthropology.


BRAOU

# యూనిట్ - 20: మతం, రాజ్యం

విషయక్రమం


20.1 ఉద్దేశాలు

20.2 పరిచయం

20.3 మతభావన

20.4 మతంలోని వివిధ మౌలికాంశాలు

20.5 మత ఆవిర్భావం తాలూకు సిద్ధాంతాలు

20.6 మతం విషయంలో దుర్‌ఖైమ్, మలినోస్కీ, కార్ల్‌మార్క్స్‌ల అభిప్రాయాలు

20.7 మతం : నిర్మితీయ సంబంధాలు

20.8 మతం ప్రకార్యాలు

20.9 రాజ్యభావన

20.10 రాజ్యం : అత్యావశ్యక లక్షణాలు

20.11 రాజ్యావతరణ అభివృద్ధి

20.12 రాజ్యం ప్రకార్యాలు

20.13 రాజకీయ వ్యవస్థల వర్గీకరణ

20.14 ప్రజాస్వామ్యం

20.15 నియంతృత్వ వ్యవస్థ

20.16 సంక్షేమరాజ్యం

20.17. ఆధునిక ప్రభుత్వ విధులు - ప్రస్తుత ధోరణులు

20.18 సారాంశం

20.19 మాదిరి పరీక్షా ప్రశ్నలు

20.20 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 20.1 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు కింది అంశాలను తెలుసుకొంటారు:

- మతం భావన
- మతంలోని మౌలికాంశాలు

- మతం ఆవిర్భావానికి సంబంధించిన సిద్ధాంతాలు
- మతం గురించి డర్‌ఖైమ్, మాలినోస్కీ, కార్ల్‌మార్క్స్‌ల సామాజిక దృక్పథాలు
- మత నిర్మితీయ, ప్రకార్య అంశాలు
- సమాజశాస్త్రంలో రాజ్యం భావన
- రాజ్యం మౌలిక లక్షణాలు
- రాజ్యం ఆవిర్భావం, వికాసం
- రాజ్యం ప్రకార్యాలు
- రాజకీయ వ్యవస్థల వర్గీకరణ
- ప్రజాస్వామ్యం మౌలిక లక్షణాలు, రూపాలు, నియంతృత్వం
- సంక్షేమరాజ్య భావన, సంక్షేమరాజ్య ప్రకార్యాలు

## 20.2 పరిచయం

మానవుడు సంఘజీవిమాత్రమే కాకుండా మత, ఆధ్యాత్మిక జీవికూడా. మనవునికి ఆసక్తి ఉన్న విషయాలలో మతం ప్రధానమైనది. మతాసక్తి ఎంతో గహనము, పురాతనము అయిన ఆసక్తులలో ఒకటి. మతం సార్వజనీనమైంది, శాశ్వతమైంది, నిరంతరాసక్తిని రేకెత్తించే అంశం. మనిషికి జైవిక, ఆర్థిక, సామాజికావసరాలతోపాటు మతపరమైన అవసరాలు కూడా ఉంటాయి. మనవుని భౌతికావసరాలు తీరినా మతపరమైన అన్వేషణ మానవుడిలో వ్యాకులతను రేకెత్తిస్తూనే వుంటుంది.

మతమనేది ఈనాడు ఉద్భవించిన దృగ్విషయం కాదు. దాని పుట్టుపూర్వోత్తరాలు తెలియవు. మతం అనాది. నియాండ్రతల్ మానవుడు ఆచరించిన ఖననం తాలూకు అలవాట్లకు సంబంధించి లభించిన కొన్ని వస్తు శకలాలు, అవశేషాలను బట్టి మానవుడు చరిత్ర పూర్వ యుగం నుంచే మత విశ్వాసాలు, ఆచారాలున్న వ్యక్తిగా స్పష్టమవుతోంది. మతమనే సంస్థ సార్వజనీనమైనటువంటిది. ఇది అన్ని సమాజాలలో - గతకాలపు, వర్తమాన సమాజాలలో - కనిపిస్తుంది. అయితే మత ఆచారాలు, విశ్వాసాలు, విధివిధానాలకు (Practices) సంబంధించిన ఏకరూపత కనిపించదు. నియమనిబంధనలు, ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు, ఫ్యాషన్‌లు మాత్రమే సామాజిక నియంత్రణ సాధనాలు కావు. వీటన్నింటినీ మించి మతం, నైతికత అనేవి వాటికి ఒక రూపం కల్పిస్తాయి. అవి శక్తిమంతమైన సామాజిక నియంత్రణ సాధనాలే కాకుండా, మనవుల ప్రవర్తనకు మార్గదర్శకాలుగా కూడా ఉపకరిస్తాయి. మనవుని ఆర్థిక రాజకీయ, తాత్విక, శాస్త్రీయ జీవితమేకాక దానికి మతపరమైన రూపం కూడా వుంటుంది. మతం అనాదిగా ఉంటూ ఉండడమేకాక మానవ సంస్థలను అధికాధికంగా ప్రభావితం చేస్తూనే వస్తున్నది. మత విశ్వాసాలు మానవుని ఆర్థిక కృషిని, రాజకీయ ఉద్యమాలను, ఆస్తి తాలూకు వ్యవహారాలను, విద్యావిషయక బాధ్యతలను, లక్ష్యాల తీవ్రత, ఉత్సుకతలను, శాస్త్ర ఆవిష్కరణలను, కళావికాసాన్ని ప్రభావితం చేస్తూనే వస్తున్నాయి. మానవుని సాంస్కృతిక అవసరాలపై ఆధారపడిన మతం మానవుని జీవితానికి, దాని వికాసానికి ఒక కొత్త రూపం, అర్థం కల్పించింది.

మానవుడు సంఘజీవేకాక ఒక రాజకీయ జీవికూడా. మతంతోపాటు మానవుని మనుగడకు రాజ్యం కూడా ప్రధానమైందే. ప్రతి మనిషి రాజ్యంలో సభ్యుడే. అయితే రాజ్యం అనే పదానికి సరిఅయిన అర్థం ఏది? దీన్ని తెలుసుకోవడానికి రాజ్యం స్వరూప స్వభావాలు, ప్రాముఖ్యం గురించి తెలుసుకోవడం అవసరం.

'రాజ్యం' అనేమాట ఆధునికమైంది. ఈ మాట 16వ శతాబ్దంలో వ్యవహారంలోకి వచ్చింది. ఇటలీదేశపు రాజనీతి శాస్త్ర కోవిదుడైన నికోలో మాకియవెల్లీ మొట్టమొదటిసారిగా తన గ్రంథం "The Prince" లో ఉపయోగించడంతో ప్రారంభమైందని చెప్పవచ్చు.



BRAOU

## 20.5.5. ప్రకార్య సిద్ధాంతం

అశాస్త్రీయమైన సామాజిక దృగ్విషయాలైన విశ్వాసాల అర్థాన్ని వివరించడానికి సమాజశాస్త్రవేత్తలు కొంత ప్రయత్నించారు. ఈ ప్రయత్నాల ఫలితంగా వారు మతం తాలూకు సామాజిక ప్రాతిపదికలకు సంబంధించి కొన్ని సిద్ధాంతాల ప్రతిపాదన జరిగింది. ఇలాంటి సిద్ధాంతాల ప్రతిపాదన చేసిన వారిలో ప్రముఖులు విలియమ్ రాబర్ట్సన్ స్మిత్, దుర్ఖైమ్, ఎ.ఆర్.రాడ్‌క్లిఫ్ బ్రౌన్, మలినోస్కీ, మాక్స్‌వెబర్, టాల్‌కోట్ పార్సన్స్, వారి అనుయాయులు.

సమాజానికి సంబంధించి మతానికున్న విధులు చారిత్రకంగా చూసినప్పుడు చాలా ముఖ్యమైనవిగా పరిగణిస్తారు. కొందరి అభిప్రాయంలో మతం సామాజిక సదృఢతకు(Social solidarity) ఎంతో తోడ్పడుతుంది. కొందరు సమాజంలో కనిపించే అసమానతలకు మూలం మతమని భావిస్తారు. వాస్తవానికి ఆస్తి పంపకంలోని అసమానతలను మతం సమర్థిస్తున్నట్లు కనిపిస్తుంది. కానీ మానవ సంక్షేమానికి, వ్యక్తి మానసిక వికాసానికి, శాంతికి మతం తోడ్పడుతుందనే వాస్తవాన్ని మరువలేం. సమాజం పట్ల, వ్యక్తి పట్ల మతం విధులు ప్రశ్నార్థకమై, సామాజిక శాస్త్రవేత్తలను, మానవ శాస్త్రవేత్తలను ఎంతగానో ఉత్తేజపరుస్తూనే ఉంటాయి.

సామాజిక నియంత్రణకు మతం ఒక సాధనమనే వాదాన్నిదుర్ఖైమ్ ప్రారంభించాడు. మతానికి, ఉత్సవాది ఆచారాలకు సంబంధించిన నాలుగు ప్రధాన సామాజిక విధులను ఆయన గుర్తించాడు. అవి (1) క్రమశిక్షణకు, సన్నాహాలకు తోడ్పడుతుంది. (2)ఉత్సవాది కర్మకాండలు సదృఢాత్మక విధిని నిర్వర్తిస్తాయి. (3)పునఃచైతన్య కారకంగా మతం తోడ్పడుతుంది (4)సుసంగతమైన సామాజిక వ్యక్తి జీవితానికి సంబంధించిన ఉల్లాసభావనల వ్యవస్థాపనకు మతం తోడ్పడుతుంది.

అమెరికాకు చెందిన టాల్‌కోట్ పార్సన్స్ అనే సమాజ శాస్త్రవేత్త మతం అనేది సామాజిక సదృఢతను అభివృద్ధి చేస్తుందనే దుర్ఖైమ్ వాదనను ఖండిస్తూ సమకాలీన ప్రపంచం రానురాను సంఘటితం కావడం తగ్గుతూ ఉందంటాడు. వైయక్తికమైందిగా పరిణతి చెందుతూ ఉండటమే అందుకు కారణంగా పేర్కొంటాడు. అయితే అటు సాంప్రదాయిక సమాజంలోను, ఇటు సమకాలీన సమాజంలోను మతం సామాజిక నియంత్రణకు ఉపయోగపడుతున్నట్లు పార్సన్స్ పేర్కొంటాడు. సామాజిక నియంత్రణ అనేది సమకాలీన సమాజంలో సామాజిక సదృఢత ద్వారా కాకుండా వ్యక్తి ద్వారా, వ్యక్తికున్న నైతిక బాధ్యత ద్వారానే జరుగుతుందని పార్సన్స్ అభిప్రాయం.

కింగ్‌స్లే డేవిస్ సామాజిక సదృఢతను ప్రోత్సహించడంలో ప్రముఖ పాత్ర వహిస్తుందని పేర్కొన్నాడు. మతం సమాజంలో ఒకానొక భాగం అయి ఉండటమే దీనికి కారణం. అంతేకాక ఆచారవ్యవహారాలను పాటించడం జరగడం, ఉమ్మడి లక్ష్యాలను జోడించడం జరుగుతుంది కూడా అని డేవిస్ అభిప్రాయం.

రాబర్‌సన్ స్మిత్‌ను కూడా మత సిద్ధాంత ప్రదిపాదకులలో ప్రముఖుడుగా పరిగణిస్తారు. "The Religion of Semites" (1894)లో తెలిపిన వివరాలు ఉత్తరోత్తర ప్రదిపాదించిన సిద్ధాంతాలకు దోహదం చేశాయి. ప్రకార్యవాదాన్ని మతానికి కూడా అనువర్తించిన ఖ్యాతి దుర్ఖైమ్ ప్రతిపాదించిన సిద్ధాంతం వివరాలను 1912లో అతడు రాసిన "The Elementary Forms of Religious Life" అనే గ్రంథంలో పొందుపరచడం జరిగింది. మతపరమైన పూజాపునస్కారాలు ప్రజలు చేస్తున్నారంటే వాటిని సమాజానికి చేస్తున్నట్లుగానే భావించాలి. ఎందుకంటే మతం, సమాజం అనేవి విడదీయడానికి వీలులేనివి కాబట్టి అని దుర్ఖైమ్ అభిప్రాయం. దైవత్వం అనేది సమాజపు రూపాంతరం, ప్రతీకాత్మక భావన అని అతని అభిప్రాయం.

సమాజం ఏకత, సదృఢతలు వివిధ ఆచార వ్యవహారాలను పాటించడం, కర్మకాండలను నిర్వహించడం వల్ల ఏర్పడి పటిష్ఠమవుతాయి. వీటిని సామూహికంగా నిర్వహించడం వల్ల సామాజిక సమైక్యతకు దోహదం చేస్తాయని సమాజశాస్త్రవేత్తలు పేర్కొంటారు. అంతేకాక అవి ఒక సమాజం తాలూకు సాంస్కృతిక విలువలను ఒక తరం నుంచి మరోతరానికి నిరాటంకంగా అందివ్వడానికి తోడ్పడతాయి. మతం కొన్ని పనులను నిషేధిస్తుంది. ఆ నియమాలను ఉల్లంఘించిన వారిని శిక్షిస్తుంది. దీనివల్ల మత నియమాలు సదృఢతకు తోడ్పడుతుంది.

ఆధునిక సమాజంలో ఎదురయ్యే అనైక్యత స్పర్థ, ఘర్షణలకు మతనియమాల పట్ల ఏర్పడిన నిరాదరణ, నిరాసక్తతలే 

మెళకువలను పేర్కొన్నాడు. ఇంద్రజాలం, మతాల మధ్య విభేదాన్ని పేర్కొన్నాడు. ఇంద్రజాలం లక్ష్యాల దృష్ట్యా ఆచరణీయమైందని, మతం ఆత్మసంతృప్తి కోసం (self-fulfilling) ఏర్పచరుకొనే ఆచారవ్యవహారాలు కర్మకాండ అని అతడు పేర్కొన్నాడు.

మానవజీవితంలో ఏర్పడే సంక్షోభాలు - జననం, యుక్తవయసు రావడం, వివాహం, మరణం - అన్నింటికి సంబంధించిన వివిధ మతకర్మకాండలు ఏర్పరచుకోవడం జరిగిందని మలినోస్కీ అభిప్రాయం. ఈ సంక్షోభాలు ఉద్వేగాన్ని, అశాంతిని కలిగించే సంఘటనలు. వీటిని నివారించడానికి మతం కొన్ని విధివిధానాలను నిర్దేశిస్తుంది. పైన పేర్కొన్న అన్ని సంక్షోభాల్లోను మరణం తీవ్రసంతాపానికి కారణమవుతుంది. చనిపోయిన వ్యక్తి విషయంలో నిర్వహించే కర్మకాండ అమరత్వం పట్ల విశ్వానం ప్రకటించేట్లుగా ఉంటుంది. ఈ విధంగా భావించడం వల్ల మరణించిన వ్యక్తి తాలూకు ఆప్తులకు కొంత ఊరట, దు:ఖోపశమనం కలుగుతాయి. ఈ విషాద సమయంలో బంధు మిత్రులు కర్మకాండ చేస్తున్న వారికి తోడుగా నిలిచి అవసరమైన సహాయసహకారాలు అందివ్వడమే కాక వారి ద:ఖంలో పాలుపంచుకొంటారు కూడా. ఇలా చేయడం వల్ల పుట్టెడు ద:ఖంలో ఉన్న వారికి మానసికమైన ప్రశాంతత లభిస్తుంది. సమాజం అల్లకల్లోలంలో పడకుండా నివారించడం జరుగుతుంది. ఈ సందర్భంలోనే మలినోస్కీ మరణాన్ని "సామాజికంగా విచ్ఛిన్నదాయకమైనది(Scoially disruptive)" అని పేర్కొన్నాడు. బంధుమిత్రులు అందించే సహాయ సహకారాల ద్వారా ఏర్పడే సామాజిక సదృఢత సమాజాన్ని పునరేకీకరణను ఏర్పరుస్తుంది (Social solidarity reintegrates society) అని మలినోస్కీ భావించాడు.

పైన చర్చించిన విషయాలతోబాటు మలినోస్కీ ట్రోబ్రియాండ్ ద్వీపవాసులు చేపల వేట సందర్భంలో అనుభవించే మానసిక ఒత్తిడులు, అనిశ్చితత్వాలను గురించి, ఆ సందర్భంలో ఉపశమనం కోసం వారు అనుసరించే వివిధ ఆచార వ్యవహారాలు, కర్మకాండలను గురించి కూడా పేర్కొనాడు. ట్రోబ్రియాండ్ ద్వీప వాసులు సముద్రంలోతట్టు ప్రాంతాలలో వేటకు వెళ్ళేముందు కొన్ని పూజాపునస్కారాలు చేస్తారు. వీటిని మలినోస్కీ ఇంద్రజాలం (Magic) అని భావించినా కొందరు ఈ విధివిధానాలు మతపరమైనవిగా భావిస్తారు. ఈ కర్మకాండలు చేయడం వల్ల మనోస్థైర్యం కలుగుతుంది. ప్రమాదాలకు కారకులైన శక్తులను అదుపుచేయగలుగుతారని భావిస్తారు. ఈ ద్వీపవాసులు చేపలవేటకు ఉపక్రమించేటప్పుడు చేసే విధానం ఒక సామాజిక వ్యవహారంగానే భావించడం జరుగుతుంది. అందువల్ల ఆ సమూహం సమైక్యత వర్ధిల్లడానికి అనుకూల పరిస్థితి ఏర్పడుతుందని మలినోస్కీ భావించాడు.

BRAOU

## 20.6.3 మతం : కార్ల్‌మార్క్స్ అభిప్రాయం

కార్ల్‌మార్క్స్ దృష్టిలో మతం అనేది ఒక భ్రమ లేదా భ్రాంతి. పెట్టుబడిదారీ సమాజంలో ఎదురయ్యే కష్టనష్టాల వల్ల కలిగే బాధనుంచి కొంత ఉపశమనం పొందడానికి తోడ్పడేదే మతం. అందుకే మతాన్ని "ప్రజలకు నల్లమందులాంటిది(Opium of the people) " అని మార్క్స్ అంటాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో దోచుకొనేవారు, దోపిడీకి గురి అయ్యేవారు ఉండడం వల్ల పీడితులు తాడితులు భయాందోళనలకు గురి అవడం అనివార్యం. అలాంటి సందర్భాలలో మతమనేది ఈ భయాందోళన నుంచి ఊరట పొందడానికి ఒక మత్తు మందు(నల్లమందు)గా పనికివస్తుంది. అయితే కమ్యూనిస్టు వ్యవస్థలో దోపిడీదారులు, పీడితులు అనేవారు ఉండరు, కమ్యూనిస్టు సమాజంలో వర్గవిభజన ఉండదు. కాబట్టి మతం అనంతమైన విషయమై పూర్తిగా కనుమరుగవుతుందని మార్క్స్ విశ్వసిస్తాడు. మతాన్ని ప్రోత్సహించే సామాజిక పరిస్థితులు కమ్యూనిస్టు వ్యవస్థలో అసలుండవు కాబట్టి ఆ వ్యవస్థలో మతం అవసరముండదు, మతానికి స్థానం ఉండదు అనేది మార్క్స్ విశ్వాసం.

మానసిక ఒత్తిడుల నుంచి మతం ఎట్లా ఉపశమనం కలిగిస్తుందో కింద క్లుప్తంగా చర్చించడం జరిగింది.

(1) మరణాంతర కాలంలో శాశ్వత ప్రశాంతతను మతం కల్పిస్తుందనే భరోసా ఉంటుంది. ఇలాంటి హామీలవల్ల ఎంతటి కష్టాలనైనా సహించగలిగే శక్తి వస్తుంది.

(2) కొన్ని మతాలు పేదరికపు సుగుణాలను ప్రస్తుతిస్తాయి, అణచివేతకలిగే బాధలను ప్రశంసిస్తాయి. దీనికి ఉదాహరణగా బైబిల్‌లో పేర్కొన్న ఒక ఉదంతాన్ని చూపవచ్చు. "It is easier for a camel to pass through the

ఆ తరువాత అనేకమంది రచయితలు రాజ్యమనే మాటను ఉపయోగించారు. రాజనీతిశాస్త్ర పితామహుడైన అరిస్టాటిల్ ఇలా అన్నాడు: "మానవుడు సహజంగా సామాజిక, రాజకీయ జీవి." రాజ్యంలో ఉండటం, మానవుడిగా పరిగణించడం అనేవి తుల్యమైన భావనలుగా అరిస్టాటిల్ పరిగణించాడు. ఎందుకంటే రాజ్యానికి చెందని వ్యక్తి దేవుడైనా అయి వుండాలి లేదా మృగప్రాయుడైనా అయి వుండాలి. అరిస్టాటిల్ దృష్టిలో "రాజ్యం అనేది మనవుని జీవితావసరాల వల్ల ఉద్భవిస్తుంది, మంచి జీవితం కొనసాగడానికి సునుతుంది." అంటే మానవుని ఆర్థికావసరాల పరితృప్తికోసమే రాజ్యావతరణ జరిగిందని అరిస్టాటిల్ అభిప్రాయమన్నది స్పష్టమవుతుంది.

రాజ్యం కొనసాగడం మంచి జీవితానికి అత్యావశ్యకము, అనివార్యము అయిన అంశం. అంటే సంతోషదాయకమైన సౌజన్యవంతమైన జీవితానికి రాజ్యం అవసరం. అన్ని సామాజిక సంస్థలలో రాజ్యమనేది సార్వజనీనమూ, అత్యంత శక్తి మంతమూ అయిన సంస్థ. మానవులు కలిసి జీవితం సాగిస్తున్న అన్ని సందర్భాలలోనూ ఒక వ్యవస్థ, ఆ వ్యవస్థకు అధికారం ఉండడం అనేది సర్వసాధారణంగా కనిపిస్తాయి, అక్కడే రాజ్యం కూడా ఉంటుంది. శాంతి, సౌభాగ్యాల కోసం రాజ్యమనే సంస్థను అత్యంత ప్రధానమైన సంస్థగా గుర్తించడం జరిగింది.

## 20.3 మతం భావన

మతం సార్వజనీనమైన దృగ్విషయమే అయినా ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా అర్థం చేసుకొని ఆచరించారు. సమాజశాస్త్రవేత్తలు కూడా వివిధ రకాల నిర్వచనాలిచ్చారేగానీ ఏకాభిప్రాయం వ్యక్తం కావడం అననేది లేదు. కొందరు ప్రముఖ సమాజశాస్త్రవేత్తలు ఇచ్చిన నిర్వచనాలను పరిశీలిద్దాం.

"మతజీవవితపు ప్రాథమిక రూపాలు" అనే గ్రంథంలో దుర్‌ఖైమ్ మతాన్ని ఈ విధంగా నిర్వచించాడు: "మతమనేది పవిత్ర విషయాలకు సంబంధించిన విశ్వాసాలు, ఆచారాలు, వాటిని పాటించే వాళ్ళనందరినీ మతసంస్థ అనే ఏకైక నైతిక సమాజంగా ఏకం చేస్తాయో, ఆ విశ్వాసాలు, ఆచారాల సమైక్య సమాహారం." జేమ్స్ ఫ్రేసర్ ప్రకారం " ప్రగతి గతిని మానవ జీవిత గతిని నియంత్రించి నడిపించే మానవాతీత శక్తులు ఉన్నాయనుకొని, వాటిని నమ్మడం మతం." అమెరికన్ మానవశాస్త్రవేత్త ఎడ్వర్డ్ సపిర్(Edward Sapir) మతాన్ని కింది విధంగా నిర్వచించాడు: "దైనందిన జీవితంలో ఎదురయ్యే ప్రమాదాల నుంచి బయటపడడానికి ఆధ్యాత్మిక ప్రశాంతతకు మార్గం అన్వేషించడానికి మానవుడు చేసే నిరంతర కృషే మతం." మెకైవర్, పేజ్‌లు మతానికిచ్చిన నిర్వచనం ఇట్లా వుంది:

" మానవుల మధ్య వుండే సంబంధమేకాక మానవునికి అత్యున్నత శక్తికి మధ్య వుండే సంబంధానికి చెందినదే మతం." ఆగ్‌బర్న్ అభిప్రాయంలో, " మానవాతీత శక్తుల పట్ల మానవుడి చిత్తవృత్తే మతం." ప్రకార్యవాది అయిన థామస్ ఎఫ్. ఒడియా (Thomas F. O Dea) అనుభవాతీత లక్ష్యాల సాధనకు అనుభవేతర లేదా అనుభవాతీత సాధనాలను ఉపయోగించడమే మతం." అని నిర్వచించాడు. అనుభవాతీత వాస్తవాలలో సంబంధం ఏర్పరచుకోవడం - ఆ శక్తులను దైవమని లేదా ఇతర పేర్లతోగానీ పిలవడం జరగవచ్చునని మరికొంత వివరించాడు.

## 20.4 మతంలోని వివిధ మౌలికాంశాలు

### మానవాతీత శక్తుల పట్ల విశ్వాసం

ఈలాంటి శక్తులను నమ్మేవారిని బహుదేవతారాధకులు(Ploytheists) అంటారు. వీరు అనేక మానవాతీత వ్యక్తులను నమ్ముతారు. మరికొందరు ఒకే ఒక్క శక్తిని నమ్ముతారు. ఆ శక్తే దైవం లేదా సర్వశక్తిమంతుడు. ఆ దైవం నిరాకారుడు, సర్వాంతర్యామి. దైవాన్ని అనేక రూపాల్లో కొలుస్తారు. వీరిని ఏకేశ్వరారాధకులు(Monotheists) అంటారు.

### మానవతీతశక్తులతో సర్దుబాటు చేసుకోవడం

ఈశక్తుల దయాదాక్షిణ్యాలపై వారి మనుగడ ఆధారపడి ఉందని విశ్వసిస్తారు. ఆ శక్తులను ప్రసన్నం చేసుకోవడానికి పూజా పునస్కారాలు నిర్వహించి, ప్రార్థనలు చేస్తారు. ఈ శక్తులకు ఆగ్రహం కలిగిస్తే తమకు



BRAOU

వినాశనం తప్పదని భావిస్తారు. ఇటువంటి భయం వల్ల వారు నిరంతరం అతీతశక్తులకు అధీనులుగా భయభక్తులతో మెలగడానికే ప్రయత్నిస్తారు. అలాగే సర్దుబాటు చేసుకొంటూ ఉంటారు.

## పవిత్ర, అపవిత్ర భావనలు

మానవుని చర్యలను పవిత్రము, అపవిత్రము, ధర్మబద్ధము, నీతిమంతము, ధర్మవిరుద్ధము, అవినీతిమంతము అని విభజించడం జరుగుతుంది. మంచిపనులు ధర్మబద్ధంగా చేసే పనుల వల్లనే మనిషికి శుభం పవిత్రత కలుగుతఉందని భావించి సత్ప్రవర్తనను ప్రోత్సహించడం, దుష్ప్రవర్తనను నిరసించడం ప్రతిమతంలోనూ కనిపిస్తుంది. అన్ని సమాజాలలోను మానవుని చర్యలను పవిత్రమైనవి, అపవిత్రమైనవిగా వర్గీకరించడం కనిపిస్తుందని దర్‌ఖైమ్ పేర్కొంటాడు. మంచి చెడ్డల ఆధారంగానే స్వర్గనరకాలను ఊహించడం జరిగింది.

## ముక్తికి కొన్ని మార్గాలు

ప్రతిమతం మానవుడికి ఇహబంధాల నుంచి ముక్తి లభించే మార్గాలను పేర్కొంటుంది. బౌద్ధులు నిర్వాణం(Nirvana) వల్లనే మనిషి భగవంతునిలో లీనమయ్యేందుకు వీలుంటుందని భావిస్తే హిందువులు జననమరణాల నుంచి విముక్తులు కావడాన్ని మోక్షమని, ముక్తి అని భావిస్తారు. మోక్ష సాధనకు నాలుగు మార్గాలను - యోగమార్గం, జ్ఞానమార్గం, భక్తిమార్గం, కర్మమార్గం - సూచిస్తారు.

మతానికి ఆధారం విశ్వాసం. పవిత్రము, అపవిత్రము అనే భావాలు వ్యక్తి చిత్తవృత్తి, దృక్పథం బట్టి ఉంటాయి. అంటే మంచి, చెడు కాక వాటిని చూసే వ్యక్తి దృష్టిని బట్టి అతని అవగాహనను బట్టి ఉంటాయన్నమాట. మరో మాటలో చెప్పాలంటే మంచి, చెడులు అనేవి ఆత్మాశ్రయాంశాలే కాని వస్తుపరమైనవి కావు. అందువల్లనే వ్యక్తిగతమైన ఈ భావాల ప్రకటనకు విశ్వాసం, కర్మకాండలు (belief and rituals) అనేవి మాధ్యమాలుగా రూపొందాయి.

ప్రతి మతానికి కొన్ని విశ్వాసాలుంటాయి. మతమనేది ఈ విశాల విశ్వాన్ని గురించి, సృష్టి, స్థితి లయలను గురించి, ఇహపరాలను గురించి, భవిష్యత్తులో ఈ భూప్రపంచం ఏమవుతుందో అనే విషయం గురించి, అనేక ఇతర సున్నితమైన సూక్ష్మమైన విషయాలను గురించి మతానుయాయులకు తెలియజేస్తుంది. అంటే మతం లోకాతీతం, అనుభవాతీతమైన విషయాలను సభ్యులకు తెలియచెప్పడానికి ప్రయత్నిస్తుంది. పవిత్రత, అపవిత్రత అనే గుణాలు వ్యక్తి దృక్కోణం ఫలితంగా ఏర్పడతాయి. గోవును పవిత్రమైన ప్రాణిగా హిందువులు భావించడాన్ని ఉదాహరణగా చెప్పవచ్చు, అవు కూడా ఇతర జంతువుల లాంటిదే. అయితే మనం దానికి పవిత్రతను ఆపాదించి పూజించడం జరుగుతోంది.

మతాచారాలు వాస్తవ వ్యవహారంలో కనిపించే ప్రక్రియ. ఎం. డగ్లస్ (M. Douglas) తన గ్రంథం "Purity and Danger" (1966)లో చెప్పినట్లు మతాచారాలు అనేవి పవిత్రమైన దానికి సంబంధించిన ప్రతీకలు.

ఆచారాలనేవి అనుభవాతీతమైన, పవిత్రమైన విషయాల విషయంలో మానవ ప్రవర్తనా తీరునే ఆచారాలని కింగ్‌స్లే డేవిస్ (Kingsley Davis) పేర్కొంటాడు. అగోచర శక్తులకు సంబంధించి మానవుని అంతర్గత భావాల ప్రకటిత ప్రతీకలే మతం అని అతని అభిప్రాయం (internal attitude symbolic of the unseen powers). ఈ ప్రవర్తన వివిధ రూపాలలో కనిపిస్తుంది. ప్రత్యేక దుస్తులు ధరించడం, మంత్రాలు చదవడం, పవిత్రనదుల్లో స్నానం చేయడం మొదలైనవి. అట్లాగే పాట పాడటం, నాట్యం చేయ్యడం, రోదించడం, సార్లుదండాలు పెట్టడం, విందులు చేయడం, పవిత్ర గ్రంథాలు చదవడం వంటివి కూడా మాతాచారాలలో కనిపిస్తాయి. ఈ ప్రవర్తనా తీరు ఇతర సందర్భాలలో అతి సాధారణమైనవిగానే కనిపించినా, మతపరమైన వేడుకలు జరుపుతున్నప్పుడు వాటికి పవిత్రత ఆపాదించడం జరుగుతుంది.

మతాచారాలు సభ్యుల మధ్య ఐక్యతకు బాగా తోడ్పడతాయి. తామంటున్న ప్రపంచాన్ని, ఈ సృష్టినంతటినీ అర్థం చేసుకొని దానిపట్ల విశ్వాసం పెంచుకోవడానికి తోడ్పడుతాయి. ముస్లింలలో మసీదులో చేసే 'నమాజ్', క్రైస్తవులు చర్చిలో జరిపే ప్రార్థనా సమావేశాలు, హిందువులు దేవాలయాలలో నిర్వహించే భజన కార్యక్రమాలు



BRAOU

అయా మతాలవారి సమైక్యత పెంపుదలకు దోహదం చేసేటటువంటివే. ఈ కారణంగానే దుర్ఖైమ్ సామూహికంగా జరిపే మతాచారాల వల్ల సమాజం మరింత సంఘటితమై సభ్యులతో భావసమైక్యత ఏర్పడుతుందని పేర్కొంటాడు. ఒక గోత్రం దేవుడు, ఆ గోత్రం భిన్నమైనవి కావు. ఆ రెండూ సదృశాలే అని దుర్ఖైమ్ అభిప్రాయం.

సామాజిక వ్యవస్థగా మతాన్ని అర్థం చేసుకోవడం విశ్వాసాలు, మతాచారాలను అర్థం చేసుకోవడంపై ఆధారపడి వుంటుంది. కొందరు మేధావులు మతాన్ని గురించి మాత్రమే తీవ్రంగా చర్చించారు గాని మతాచారాలకు అంత ప్రాముఖ్యం ఇవ్వలేదు. మతాచారాలు శాస్త్ర పరీక్షకు నిలవలేక పోవచ్చు, నిజనిర్ధారణకు బలమైన ఆధారాలు చూపలేకపోవచ్చు. అయినా దాని సామాజిక ప్రయోజనం ఏ మాత్రం తగ్గలేదు. మతాచారాలు పాటించడం సడలలేదు.

## 20.5 మత ఆవిర్భావం తాలూకు సిద్ధాంతాలు

ఎప్పుడు, ఎక్కడ, ఎట్లా మతం ఆవిర్భవించిందో చెప్పడం కష్టం. ఇది ఒక అంతు తెలియని ప్రశ్న. అయినా కొందరు మేధావులు మత ఆవిర్భావం గురించి కొన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఆ సిద్ధాంతాల సారాంశాన్ని తెలుసుకొందాం.

### 20.5.1 భయ సిద్ధాంతం

మానవునిలోని భయభావమే మతం అవతరించడానికి మూలమని కొందరు భావిస్తారు. ఈ భావం గ్రీకు, రోమన్‌ల కలం నాటి నుంచే ఉన్నట్టు కనిపిస్తుంది. రోమన్ తత్వవేత్త, కవి అయిన లేక్రేటియస్(Lecretius) దేవుడిపై విశ్వాసానికి ఆధారం భ్రాంతి అని, భయమే మతానికి మూలమని భావించాడు.

18వ శతాబ్దానికిచెందిన డేవిడ్ హ్యూమ్ అనే బ్రిటిష్ తత్వవేత్త "Natural History of Origin" అనే గ్రంథంలో ప్రకృతిశక్తుల వల్ల కలిగిన భయమే, ఆ శక్తులను అదుపుచేసి నడిపించగల దేవుడంటే భయభక్తులు కలిగాయంటాడు. ఇలాంటి అభిప్రాయాన్నే జర్మన్ తత్వవేత్త మాక్స్‌ముల్లర్ కూడా వ్యక్తం చేశాడు. ఆచార్య గిడ్డింగ్స్ "మహాభయానకమైన (Great Dreadful) దానిపట్ల మనిషిలో కలిగిన భయోత్పాత భావం వల్లనే మతం అవతరించిందని అభిప్రాయపడ్డాడు.

B R A O U

### 20.5.2 సర్వాత్మవాద సిద్ధాంతం

ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఇ.బి. టైలర్. దీన్ని గురించి ప్రస్తావన 1871లో ప్రచురితమైన Primitive Culture గ్రంథంలో కనిపిస్తుంది. సర్‌జాన్ లుబాక్, హెర్బర్ట్ స్పెన్సర్‌లు కూడా ఈ సిద్ధాంతాన్ని బలపరిచి విపులీకరించిన వారిలో ప్రముఖులుగా పేర్కొనవచ్చు. మరణించిన వారి ఆత్మ పట్ల విశ్వాసమే ఈ సర్వాత్మవాదమని టైలర్ స్పష్టం చేశారు. మానవచరిత్ర తొలిదశలలో మనిషికి వచ్చే కలలు , నీడలు, విభవాలు(hallucinations), నిద్ర, మరణం వంటి వాటిని వివరించడం అవసరమైంది. ఈ దృగ్విషయాలను అర్థం చేసుకోవలసిన అవసరం ఏర్పడడమే ఆత్మ ఉందనే నమ్మకానికి దారి తీసిందని టైలర్ వివరించాడు. సర్వాత్మవాదంలో ప్రాణభూతమైన అంశం ఆత్మ, ఆత్మ స్థల, కాలాలకు అతీతంగా సంచరిస్తుంది. ఆ విధంగా చనిపోయిన వాళ్ళ ఆత్మలు ఉంటాయని అది నమ్ముతుంది. ఆదిమ మానవునిలో ఇలాంటి అభిప్రాయం వేళ్ళూనాక ఈ విశ్వాసాన్ని ఇతర సజీవమైన జంతుజాలానికి, నిర్జీవమైన రాయిరప్పకు, చెట్టు, పుట్టకు విస్తరించాడు. ఈ విధంగా ఈ సర్వాత్మవాదమనేది మతానికి ప్రాతిపదిక అయిందని టైలర్ అభిప్రాయం.

స్పెన్సర్, టైలర్ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవించడు. తన గ్రంథంలో మతమనేది దయ్యాలు భూతాలంటే కలిగే భయం వల్లనే ఏర్పడిందని అభిప్రాయపడ్డాడు. భూతాలకు మానవాతీత శక్తులుంటాయి, ఆ శక్తుల మూలంగానే అటు ప్రకృతి శక్తులను, ఇటు మానవులను తమ గుప్పిట్లో ఉంచుకొని ఆడిస్తాయని, అందువల్లనే ఆదిమానవుడు భూత ప్రేతాలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించాడని తెలియపరిచాడు. ఈ విశ్వాసం మూలంగానే ఆదిమానవులు తమ పూర్వీకుల ఆత్మలను పూజించడం ప్రారంభమైందని స్పెన్సర్ నిర్ధారించాడు. మరణించినవారి ఆత్మలను తృప్తి పరచడానికి ఈ నాటికీ హిందువులు శ్రాద్ధకర్మను జరుపుతూనే ఉన్నారు.

మానవశాస్త్రవేత్తలలో చాలా మంది అనిమిజమ్, అనిమాటిజమ్ అనేవి అన్ని మతాలకు మూలాధారలని నమ్ముతారు.

### 20.5.3 సంకేతారాధన

ఒక మనిషి దగ్గర ఒక వస్తువు ఉన్నా, ఉపయోగించినా ఆ వస్తువు అతను కోరిన ఫలితాలు ఇస్తుందని నమ్మినప్పుడు ఆ వస్తువును సంకేతమంటారు. ఈ సంకేతాలకు తరచుగా సర్వాత్మవాదంతో సంబంధం ఉంటుంది. ఈ సంకేతాలను ఆరాధించే మతాన్ని సంకేతారాధన అటారు. అసాధారణంగా కనిపించే ఆకునుగానీ, రాతిని గానీ - దానికి రహస్య శక్తులున్నాయనే నమ్మకంతో - ఆరాధించవచ్చు. లిపి పుట్టక పూర్వం ఉండిన జనంలో ఈ మతం బాగా వ్యాప్తిలో ఉండేది. Leslie Larson, జర్మన్లు ఈ అభిప్రాయాన్ని బలపరిచారు.

కొన్ని నిర్జీవ పదార్థాలకు మార్మిక శక్తులుంటాయని ఆదిమనవులు నమ్ముతారు. వాటిని 'మాన' అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదట ఉపయోగించిన వారు మానవశాస్త్రవేత్త అయిన ఆర్. హెచ్. కాడ్రింగ్టన్ (R.H. Codrington). ఈ రకమైన సంకేతారాధన ఆదిమ తెగలలో చాలా వాటిలో కనిపిస్తుంది.

సంకేతారాధన లేదా 'అనిమాటిజమ్' అనేవి కేవలం వ్యక్తిగతమైన మత రూపాలే. మిగతా ఇతర మతాలు సామూహిక రూపమున్నటువంటివి. సంకేతారాధన సమీపంలో లభించే నిర్జీవ వస్తువుల రూపంలో ఉండగా ఇతర మతాలు సజీవ పదార్థాలను ఆరాధ్య శక్తులుగా భావిస్తాయి. కుందేలు పాదం అదృష్టదాయకమని అమెరికన్లు భావించడం సంకేతారాధనకు బలమైన నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

### 20.5.4 టోటెమిజమ్

టోటెమిజమ్ అనేది సంకేతారాధన విస్తృత రూపమే అనవచ్చు. Dictionary of Sociologyలో టోటెమ్ అంటే ఒక గణంతో గాని, ఒక వంశంతోగానీ, ఇతర సామాజిక బృందంతోగానీ ప్రత్యేక సంబంధం ఉన్నట్టు పరిగణించే ఒక వర్గం వస్తువులకు - సాధారణంగా ఒక జాతి జంతువులకు; ఒక్కొక్కసారి ఒక జాతి చెట్లకు, నిర్జీవ వస్తువులకు వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక గిరిజన తండాకు ఒక టోటెమ్‌తో సంబంధం ఉన్నప్పుడు ఆ తండా దాన్ని భక్తి భావంతో చూస్తుంది. ఆ తండా ఆ టోటెమ్ పేరు పెట్టుకొని, దాన్ని పూజిస్తుంది. టోటెమ్ అనేది వివిధ గిరిజన సమూహాల ప్రత్యేకతను సూచించే చిహ్నంగా పరిగణితమవుతుంది.

జేమ్స్ ఫ్రేజర్ కూడా టోటెమ్‌ను గురించి ఇలా పేర్కొన్నాడు. "ఒక అనాగరిక తెగకు చెందినవారు టోటెమ్ పట్ల మూఢనమ్మకం, ఆరాధనాభావం ప్రదర్శిస్తారు. సాధారణంగా టోటెమ్ ఒక జంతువు అయి ఉంటుంది, అరుదుగా చెట్లను టోటెమ్‌గా భావించడం జరుగుతూ ఉంటుంది."

టోటెమిజమ్ అనే మాటకు సంతృప్తికరమైన నిర్వచనం ఇవ్వడంలో శాస్త్రవేత్తలు విఫలమయ్యారనే చెప్పాలి. తూర్పు ఆస్ట్రేలియాలోని ఆదిమ తెగలవారు పాటించే 500 టోటెమ్‌లలో దాదాపు 460 జంతువులకు, చెట్లకు సంబంధించినవేనని, కేవలం 40 మాత్రమే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్ని, పొగ, నీరు వంటివాటికి చెందినవని దుర్‌ఖైమ్ కనుక్కొన్నాడు.

గిరిజన తెగలు వారి వారి టోటెమ్‌లకు అతిలోక శక్తులుంటాయని విశ్వసిస్తాయి. ఈ టోటెమ్ పేరుతోనే తెగ గుర్తింపు పొందుతుంది. టోటెమ్ అనుసరించే సమాజాలలో దీనికి ఎంతో ప్రాముఖ్యమున్నట్టు పరిశీలకులు కనుగొన్నారు. దీనికి గిరిజన తెగలలో పాటించే బహిర్వివాహ వ్యవస్థతో సన్నిహిత సంబంధం వుందని పరిశీలకులు కనుగొన్నారు. టోటెమ్‌కు దానికి సంబంధించిన సభ్యుల మధ్య సంబంధం రక్త సంబంధంగా పరిగణించడం వంశానుక్రమాన్ని ఈ టోటెమ్ ఆధారంగానే నిర్ణయించడం జరుగుతుంది. టోటెమ్ అనేది సర్వత్రా కనిపించినా దానిలో ఎంతో వైవిధ్యం గోచరిస్తుంది. కొన్ని సమాజాలలో ముఖ్యంగా సిలోన్‌కు చెందిన వెడ్డాస్, బోర్నియోకు చెందిన పున్నన్(Punnan) అండమాన్ ద్వీపవాసులలోను, కాంగో పిగ్మీలలోను, దక్షిణాఫ్రికా బుష్‌మెన్‌లలోను టోటెమిజమ్ కనిపించదు.



BRAOU

eye of a needle than for a rich man to enter the Kingdom of Heaven" అంటే ధనవంతులకు స్వర్గ ప్రవేశం దుర్లభం అని నొక్కి చెప్పడం జరిగింది.

(3) ఈ భూమిపై మానవుడు ఎదుర్కొనే సమస్యలను మానవాతీత శక్తులు పరిష్కరిస్తాయని, భయపడవలసిన అవసరంలేదని మతం మానవులకు భరోసా ఇస్తుంది. వాటిపట్ల విశ్వాసం పెంచుకోమని ప్రోత్సహిస్తుంది.

(4) అన్యాయాన్ని సహించమని, సామాజిక వ్యవస్థను అంగీకరించమని మతం హితవు చెబుతుంది. హిందూ మతం, ఇతర అనేక మతాలు మనిషి వుంటున్న సామాజిక వ్యవస్థ - రకరకాలైన అసమానతలకు నిలయమైన సామాజిక స్తరీకరణ (Social satisfaction ) - అనేది దైవ ప్రసాదితమైందని ప్రబోధిస్తాయి. ఈ దృష్ట్యా చూస్తే సామాజిక వ్యవస్థ స్వరూప స్వభావాలు పరివర్తన లేనివని (immutable), దైవ నిర్మితమైందువల్ల అనుల్లంఘనీయము, ఆమోదయోగ్యము అయినవని భావించాలి. ఈ పరిస్థితుల్లో మానవులు ఈ సామాజిక క్రమాన్ని అంగీకరించడం. అసమానతలను, అన్యాయాలను మౌనంగా సహించడం మినహా చేయగలిగేది లేదనిపిస్తుంది.

మార్క్స్ దృష్టిలో మతం అనేకానేక పౌరాణిక, కాల్పనికాలను సృష్టించడానికి తోడ్పడుతుంది. సమాజంలోని అన్యాయాలను, సమానతలను, దోపిడీని సమర్థించడం, హేతబద్ధతను ఆపాదించడం చేస్తుంది. అది దమననీతికి ఒక సాధనంగా కూడా పనిచేస్తుంది. ప్రపంచ దేశాల చరిత్రలను పరిశీలిస్తే అన్ని దేశాలలోని పాలకులు మతాన్ని పెంచి పోషించినట్లుగా స్పష్టమవుతుంది. మతగురువులు, ప్రచారకులు సామాజిక అత్యాచారాలు, అసమానతల పైనుంచి ప్రజల దృష్టిని మళ్ళించి అంతా విధిలిఖితమని ప్రజలకు బోధించడం ద్వారా పలకులకు పరిపాలనలో తోడ్పాటు, పాలకుల కొమ్ముకాయడం జరుగుతూనే ఉన్నట్లు తెలుస్తుంది. సువ్యవస్థీకృతమైన అన్ని మతాలూ ఈ విధంగానే ప్రవర్తించినట్లు చరిత్ర సుస్పష్టం చేస్తుంది. అయితే ఏ విధమైన దమనకాండ, దోపిడీ లేని వ్యవస్థల్లో మతం పూర్తిగా అదృశ్యమవుతుందా, అసలు దానికి స్థానమే ఉండగా అనే ప్రశ్న ఎదురవుతుంది. మానవ జీవితకాలంలో ఊహకందని అనేక సమస్యలు సంఘటనలు ఎదురవుతుంటాయి. మరణాన్ని మించిన దుస్సంఘటన మరొకటి ఉండదు. అది మానవుడి జీవితంలో శూన్యాన్ని సృష్టిస్తుంది. ఇలాంటి సమయంలో ఇతరుల ఓదార్పు, ఆసరా ఎంతో అవసరమవుతాయి. కోల్పోయిన ధైర్యాన్ని పొందడానికి, స్వాంతన చేకూరడానికి ఇతరుల ఓదార్పు వచనాలు ఎంతో అవసరం. మరణం వల్ల ఏర్పడే ఈ రకమైన మానసిక కలకలాన్ని ఏ తర్కం వల్ల ఉపశమింపచేయడం సాధ్యం కాదు. ఇలాంటి సంకట పరిస్థితుల్లో మతం మనిషికి కింత ఊరట కలిగిస్తుంది. జననమరణ రహస్యాలను, పరమార్థాలను బోధిస్తుంది. మతం మనిషికి ఆ సమయంలో అవసరమైన భద్రతను, ఊతాన్ని కల్పిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో సైనికులు కుటుంబ సభ్యులు దేశంలోని చర్చిల్లో సైనికుల శ్రేయస్సు కోరుతూ ప్రార్థనలు చేశారు. 1947-57 మధ్యకాలంలో రష్యాలో బాప్తిస్మము పొందిన సంప్రదాయ క్రైస్తవులు (Religion batized orthodox Christians) 90మిలియన్లు ఉన్నట్టు, ఈ సంఖ్య 1914 సంఖ్యకు దాదాపు సమానంగా ఉన్నట్టు కొన్ని అంచనాలు తెలుపుతున్నాయి. దీనిని బట్టి మతం అంటే కేవలం కొన్ని ఆచారవ్యవహారాలు మాత్రమే కాదని, వీటిని మించి మతం ప్రయోజనం ఉందని స్పష్టమవుతుంది.

## 20.7 మతం : నిర్మితీయ సంబంధాంశాలు

ఒక సామాజిక సంస్థగా మతానికి సంబంధించిన రెండు ప్రధాన అంశాలను గుర్తుపెట్టుకోవాలి: 1) నిర్మితి సంబంధమైనది (2) ప్రకార్య సంబంధమైనది. నిర్మితికి సంబంధించిన దానిలో ధర్మశాస్త్రం(Theology), సంప్రదాయం లేదా మత విశ్వాసం(Creed), ఆచరణలు, విధివిధానాలు, శాఖలు(Sects), ప్రతీకలు(symbols) ఉంటాయి.

### (1)ధర్మశాస్త్రం, మత విశ్వాసాలు

ప్రతి మతానికి ఒక ధర్మ శాస్త్రం ఉంటుంది. సృష్టి రహస్యం గురించి, భగవంతునికి మానవునికి, విశ్వానికి ఉన్న సంబంధాన్ని గురించి, విశ్వాసాలు, సిద్ధాంతాలు అందులో నిర్దేశితమై వుంటాయి. వీటిన్నిటిని ఒక క్రమ పద్ధతిలో ఏర్పరచి విశ్వాసాలుగా ప్రబోధించడం జరుగుతుంది. హిందూ ధర్మశాస్త్రం సృష్టి, స్థితి, లయ కారకులైన త్రిమూర్తులను గురించి వివరిస్తుంది. ధర్మశాస్త్రం మత విశ్వాసాలకు, సిద్ధాంతాలకు ప్రతీక. లిఖిత రూపంలోఉన్న



BRAOU

ప్రతిమాట పవిత్ర గ్రంథంగా రూపొందుతుంది.

### (2) విధివిధానాలు లేదా ఆచార వ్యవహారాలు

ఇవి పవిత్రమైన వాటికి సంబంధించిన ప్రతీకాత్మక చర్యలు(symbolic actions). వివిధ సందర్భాలలో నిర్వహించే విధివిధానాలు మానవాతీత శక్తులతో ప్రత్యక్ష సంబంధం ఏర్పరుచుకోవడానికి అనుసరించే మార్గాలుగా భావించడం జరుగుతుంది. ఈ రకమైన విధివిధానాలు ప్రతిమతంలో ఉంటాయి. వాటి రూపాలకు భిన్నంగా ఉండవచ్చు. అయినా ఆచారవ్యవహారాలు కేవలం మతానికే పరిమితమై ఉంటాయనుకోకూడదు.

### (3)ప్రతీకాత్మకత

ప్రతీకలు ప్రతిమతంలోనూ కనిపిస్తాయి. అవి శాబ్దికమైనవి (Verbal) లేదా వస్తురూపంలోనివి అయి ఉండవచ్చు. ఒక ప్రతీక ఆ మతానుయాయులందరినీ సమైక్య పరుస్తుంది. మొత్తం సమూహ సంస్కృతికి సంకేతాలుగా నిలుస్తాయి. [illegible](crescent), క్రైస్తవులకు శిలువ మత ప్రతీకలు. ఈ ప్రతీకలు ఉద్వేగ పూరితాలుగా భావించడం జరుగుతుంది.

### (4) మత నియమనిబంధనలు

ప్రతిమతం ఆయా మతానుయాయుల ప్రవర్తనకు సంబంధించిన నియమావళిని నిర్దేశిస్తుంది. సత్ప్రవర్తన వల్లనే మనిషికి కైవల్యం సిద్ధిస్తుందని మతనియమాలు చాటుతాయి. బౌద్ధమతం అష్టమార్గాల(Eight-fold-path)ను సూచిస్తే జైనులు త్రిరత్నాలను (Trirants), ఇస్లాం షరియత్(Shariat)ను, హిందూమతం మనుస్మృతిని, క్రైస్తవ మతం 'టెన్ కమాండ్‌మెంట్స్'ను సత్ప్రవర్తనకు మోక్షప్రాప్తికి మార్గాలుగా సూచిస్తున్నాయి.

### (5) శాఖలు

శాఖ అంటే ఒకేరకమైన మతవిశ్వాసాలు దృక్పథాలు, ఆసక్తులున్న వ్యక్తుల సమూహమని అర్థం. మూలమతం నిర్దేశించే ఆచార వ్యవహారాలను గాని, విశ్వాసాలను గానీ కొందరు వ్యతిరేకించి నూతన భావాలతో ఒక శాఖగా ఏర్పడి తమకంటూ కొన్ని ప్రత్యేక ఆదర్శాలు, విశ్వాసాలను ఏర్పరచుకొంటారు. క్రైస్తవులలో కాథలిక్కులు, లుథేరియన్‌లు, కాల్వినిస్టులు అనే చిన్న శాఖలున్నాయి. అట్లాగే బౌద్ధులలో మహాయాన, హీనయాన శాఖలు, జైనులలో శ్వేతాంబరులు, దిగంబరులు, మహమ్మదీయులలో షియాలు, సున్నీలు, హిందువులలో శైవులు, వైష్ణవులు, శాక్తేయులు అనే శాఖలున్నాయి. వీరేగాక ద్వైతులు, అద్వైతులు, విశిష్టాద్వైతులు అనే ఇతర శాఖలు కూడా ఉన్నాయి.

### (6) పండుగలు, వేడుకలు

ప్రతిమతానికి కొన్ని పండుగలు, వేడుకలు ఉంటాయి. మతపరమైన పండుగలంటే అందరూ కలసి ప్రార్థనలు చేయడం, ఊరేగింపులు నిర్వహించడం, విందులు, ఉపవాసాలు చేయడం, వేదమంత్రాలు పఠించడం, భక్తిపాటలు పాడటం వంటివి చేస్తారు. ఈలాంటి వేడుకలు సామూహికంగా నిర్వహించేవి కాబట్టి సామాజిక సమైక్యతను ప్రోత్సహిస్తాయి, సమాజంలో సామరస్యపూరితమైన వాతావరణం నెలకొంటుంది. పండుగలు పబ్బాల సమయంలో గృహస్తులు కుటుంబ సభ్యులు నూతన వస్త్రాలు ధరించడం, ప్రత్యేక వంటకాలు చేసుకోవడం పరిపాటి. హిందువులకు ముఖ్యమైన పర్వదినాలు ఉగాది, సంక్రాంతి, నవరాత్రులు, విజయదశమి, రామనవమి, కృష్ణాష్టమి, దీపావళి, వినాయకచవితి, గౌరీపూజ, రుషి పంచమి, శివరాత్రి, హోళీ మొదలైనవి. ఇట్లాగే ప్రతి మతంలోనూ పర్వదినాలుంటాయి.

### (7)పవిత్ర సాహిత్యం

 ధర్మశాస్త్ర విశేషాలు లిఖిత రూపంలో వుంటే అవి పవిత్ర గ్రంథాలవుతాయి. ప్రతి మతంలోనూ కొన్ని గ్రంథాలను

పవిత్ర గ్రంథాలుగా పరిగణించి భక్తి ప్రపత్తులతో పఠనం చేయడం జరుగుతూ ఉంటుంది.

వేదాలు లేదా శృతులు, ఉపనిశత్తులు లేదా స్మృతులు, భగవద్గీత, ఇతిహాసాలు హిందువులకు పవిత్ర గ్రంథాలు. అట్లాగే క్రైస్తవులకు బైబిల్, ముస్లింలకు ఖురాన్, బౌద్ధులకు త్రిపీటకాలు, జైనులకు ఆగమసిద్ధాంతం, జొరాస్ట్రియన్‌లకు జెండ్ అవెస్తాలు పవిత్ర గ్రంథాలు.

## (8)కల్పిత కథలు లేదా పౌరాణికాలు

కల్పిత కథలు దేవుళ్ళకు, వీరులకు సంబంధించిన కల్పనలు. వీటిని ఆదిమ తత్వవిచారమని, ఆనాటి వారి భావాల అతి సాధారణ వ్యక్తీకరణ అని, ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, జనన మరణాలను, విధి లిఖితాన్ని, ప్రకృతిని, దైవాన్ని, మతవిధానాన్ని అర్థం చేసుకోవడానికి చేసే ప్రయత్నం అని ఇ. బెతి(E. Bethe) అంటాడు. ఈ కల్పిత కథలు వాస్తవాల కథనమని, విశ్వాసాల ఫలితాంశమని మలినోస్కి పేర్కొంటాడు. ఈ కల్పిత కథల మాధ్యమంగానే మనుషులు తమ పరిసరాలతో అనుబంధం ఏర్పరుచుకోవడం, పరలోకంతో సాన్నిహిత్యం కుదుర్చుకోవడం జరగుతుందని థామస్. ఎఫ్. ఒ. డియా(Thomas F O Dea) అంటాడు.

## (9) మార్మికత

పరమాత్మునితో ప్రత్యక్ష సంబంధ ఏర్పరచుకొనే అలవాటు లేదా ధోరణినే మార్మికత అంటారు. మాతభావపారవశ్యంలో భగవంతునితో ప్రత్యక్ష సంబంధం ఏర్పరుచుకొనే, ఏర్పరుచుకోవడానికి ప్రయత్నించే వ్యక్తులనే మార్మికులు అంటారు. ఇలాంటి వారు ప్రతిమతంలోనూ కనిపిస్తారు. మార్మికవాదం బుద్ధి జీవులను ఉన్నత సంస్కృతికి చెందిన వారిని విశేషంగా ఆకర్షిస్తుంది. ఇది ఒక విధంగా సున్నితంగా ప్రకటించే అనమ్మతికి నిదర్శనంగాను భావించవచ్చు. సామాన్య ఆరాధనా విధానానికి భిన్నంగాను, భావాలకు వ్యతిరేకంగానూ సాగే విధానం. 14వ శతాబ్దంలో శాస్త్రరంగంలో అనేక మార్పులు ఏర్పడటంతో బాటు మార్మికవాదం కూడా బహుళ ప్రచారంలోకి వచ్చింది.

## 20.8 మతం ప్రకార్యాలు

మతం యొక్క సార్వజనీయత అందులోని ఆచారవ్యవహారాలు, విశ్వాసాలపైననే ఆధారపడి వుండదు. అది నిర్వహించే సామాజిక విధులపై ప్రధానంగా ఆధారపడి వుంటుంది. ఆ ప్రకార్యాలు లేదా విధులను కింద చర్చించడం జరిగింది.

(1) మతపరమైన అనుభవం అందిస్తుంది: ప్రార్థన, ఆరాధన ధ్యానం అనేవి మతపరమైన అనుభవాలు. వీటి ద్వారానే మానవుడు సర్వేశ్వరుని పట్ల భక్తి విశ్వాసాలను, వినమ్రతను, కృతజ్ఞతను తెలియజేయడం జరుగుతుంది. ప్రార్థన, ఆరాధన, ధ్యానం వంటి వాటి ద్వారా వ్యక్తి అలౌకికానందం, అనుభూతి పొందుతాడు. మతపరమైన ఇలాంటి అనుభూతి వల్ల మానవకోరికలు ఉదాత్తమైనవి కావడం, ఉన్నత ఆదర్శాలు, విలువలు ఏర్పరుచుకోవడానికి ఉవ్విళ్ళూరడం జరుగుతుంది. వ్యక్తి మూర్తిమత్వం వికసించడానికే కాక అతనిలో కలువుగొలు తనాన్ని సృజనాత్మక శక్తిని పెపొందిస్తుంది.

(2) మతం మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తుంది: మనిషికి ఎదురయ్యే సంకట పరిస్థితులను, సంక్షోభాలలో మనశ్శాంతి కలిగించి ఊరడిస్తుంది. అనిశ్చితి, అభద్రత, భయాందోళనలు అధికంగా ఉన్న ఈనాటి పరిస్థితులలో భద్రత కలిగించగలిగే సాధనం ఒకటి అవసరం. జీవితంలో ఎదురయ్యే ఈ సమస్యల నుంచి మనిషిని కాపాడి మనోనిబ్బరం కలిగించడానికి మతం ఎంతో ఉపయోగపడుతూనే ఉంది. మతం స్ఫూర్తిదాయకమైనది, అవిశ్వాసాలను పారదోలి, ధైర్య స్థైర్యాలను కలిగిస్తుంది.

(3) సామాజిక సంఘీభావానికి ఊతమిస్తుంది: సంప్రదాయిక జీవిత విధాన్ని ప్రామాణికమైందిగా నిర్ధారిస్తుంది. ఒకేరకమైన విశ్వాసాలు, భావాలు, విలువలు, పూజావిధానం అనేవి సామాజిక సమైక్యతకు అత్యంత అవశ్యకమైన అంశాలు. మతపరమైన కార్యక్రమాలలో పాల్గొనడం, శుభాశుభాలు కలిగినప్పుడు మతం నిర్దేశించిన విధి విధానాలు 

పాటించడం అనేవి మనుషులలో ఏకతా భావాన్ని కలిగిస్తుంది. గతకాలపు విలువలు, ఆచారాలను అనుసరించడం ద్వారా అనంత భవిష్యత్తుకు మార్గం సుగమమవుతుంది. మానవ సంస్కృతి నిరంతరాయంగా కొనసాగడానికి తోడ్పడుతుంది. శీఘ్రగతిలో సాగుతున్న సామాజిక మార్పులు పెద్ద ఎత్తున సాగుతున్న సామాజిక గతిశీలత (social mobility)లున్నా ఈ నాటి పరిస్థితుల్లో కొన్ని నిర్దిష్ట విలువలకు కట్టుబడి వుండటమనే భావనను మతం కలిగిస్తుందనడం సత్యదూరం కాదు, అని థామస్ ఎఫ్. ఒ డియా అభిప్రాయం. ఎ. డబ్ల్యూ. గ్రీన్ అన్నట్టు మానవ సమాజంలో సమీకృతం చేసే, సమైక్య పరిచే సాధనాలలో మతం అత్యున్నత స్థానం ఆక్రమిస్తుంది.

(4) జీవిత విలువలను పరిరక్షిస్తుంది: మతం జీవితపు విలువను నిర్వహిస్తుంది, దేశకాల పరిస్థితులలో ఏర్పడే మార్పుల దృష్ట్యా వాటిని పున: నిర్వచిస్తూ (redefining) ఉంటుంది. నైతిక, పారమార్థిక సామాజిక విలువలకు మతం ఎంతో ఊతమిస్తుంది. యువకుల ప్రవర్తనపై మంచి ప్రభావం చూపుతూ సన్మార్గ వర్తనులుగా చేస్తుంది. వ్యక్తుల సహజాతోద్వేగాల(individual impulses) కంటే సామూహిక విలువలు ప్రధానమని చాటుతుంది మతం అంటాడు థామస్ ఎఫ్. ఒడియా.

(5) సామాజిక నియంత్రణ సాధనంగా ఉపకరిస్తుంది: మతం అనేది ఒక అనియత సామాజిక నియంత్రణా సాధనం (informal means of social control). అది మానవుల ప్రవర్తనా నియమాలను నిర్దేశిస్తుంది. భూత ప్రేతాలు, నిషిద్ధాలు(taboos), ఆత్మలు, ధర్మసూత్రాలు, ప్రవచనాలు, మొదలైన వాటి ద్వారా మానవ ప్రవర్తనను అదుపు చేస్తుంది. క్రమశిక్షణను నెలకొల్పుతుంది. స్వర్గనరకాలు అనేవి మానవ నడవడికపై ఎక్కువ గా ప్రభావం చూపుతూ వానిని సన్మార్గులుగా, ఋజువర్తనులుగా చేస్తాయి. ఈ విధంగా క్రమ శిక్షణకు మతం మూలమౌతుంది.

(6) సామాజిక స్థిరతకు దోహదం చేస్తుంది: మత ఆచార వ్యవహారాలు, విధి విధానాలకు సంబంధించి పౌరోహిత్యం వహించడం ద్వారా సామాజిక స్థిరతకు, క్రమబద్ధతకు దోహదం చేస్తుంది. వివిధ విశ్వాసాలను, పూజా విధానాలను సాధికారికంగా ప్రబోధించడం ద్వారా భావాలలో ఏకరూపతను సాధించడమే కాక సామాజిక సంఘర్షణలను నివారిస్తుంది.

(7) సంక్షేమాన్ని ప్రోత్సహిస్తుంది: తోటి మానవుల పట్ల దయా దాక్షిణ్యం, సానుభూతి, సహకార భావం ప్రదర్శించాలని మతం ప్రబోధించడం ద్వారా సామాజిక సంక్షేమానికి తోడ్పడుతుంది. ప్రజలలో దాతృత్వ గుణం పెంచి, పతితులకు, బాధితులకు అవసరమైన సహాయం అందిచేట్లు కలవారిని ప్రోత్సహిస్తుంది. కళ, సంస్కృతులను పోషిస్తుంది, సన్మార్గంలో ప్రజలు నడిచేట్లు కూడా ప్రోత్సహిస్తుంది. ప్రముఖ మత, ధార్మిక సంస్థలు - విశ్వహిందూ పరిషత్, ఆర్యసమాజ్, బ్రహ్మసమాజ్, దిసొసైటీ ఆఫ్ జీసస్ వంటివి - అనేక సామాజిక విద్యావిషయక, సాంస్కృతిక రంగాలలో గణనీయమైన కృషిచేయడం, పౌర సంబంధమైన వైద్య ఆరోగ్య సంబంధమైన అనేక పథకాలు చేపట్టి ప్రజాసేవ చేయడం చూస్తూనే ఉన్నాం.

(8) మనోరంజన చేస్తుంది: హరికథలు, పురాణ కాలక్షేపాలు, నృత్య సంగీత కార్యక్రమాలు ప్రజలకు మనోరంజనంగా ఉంటాయి. వివిధ పర్వదినాలలో వేడుకలలో ఏర్పాటు చేసే కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని మనోల్లాసం పొందడమే కాక తామందరం ఒక్కటే అనే భావంతో మెలగడం కనిపిస్తుంది. మానసికంగా కలత చెందిన వ్యక్తులకు ఈ వేడుకలు, ధార్మిక ఉపన్యాసాలు, పురాణ కాలక్షేపాలు, హరికథలు కొంత సేదతీరుస్తాయి. కోల్పోయిన ఉత్సాహాన్ని అందిస్తాయి.

ఆత్మ, పరమాత్మల అనుబంధాన్ని గురించి మతం తెలియజేస్తుంది. పరమాత్మతో ఐక్యం కావడం వల్ల అది ఉత్కృష్టము, ఉన్నతము అవుతుందని మతం ప్రబోధిస్తుంది. మానవుడు జీవులన్నింటిలోకి ఉత్కృష్టుడని, తాను పరమాత్మలో ఐక్యమవుతాడనే విశ్వాసం కలిగిస్తుంది. ఇలాంటి భావన అతని ఆత్మ ఉత్తమము, సమున్నతము అయిందనే భావం మనిషిలో ఏర్పడుతుంది.

మానవ నాగరకతలను, భౌతిక జీవశాస్త్రాలలో సాధించిన ప్రగతి వల్ల, హేతువాదోద్యమ (rationalism) ప్రభావం వల్ల ఈనాడు మతం కొంత దెబ్బతిన్నదనే భావం కలుగుతోంది. అయినా మత విశ్వాసాలు ప్రజలలో లోతుగా

నాటుకొన్నాయి. వాటి ప్రభావం చిరకాలం ఉంటుందనే నమ్మకం చాలామందిలో ఉంది. నైతిక, పారమార్థిక ప్రమాణాలు లేని సమాజం ఎంతో కాలం మనలేదు. మత సంస్థలకు ఎన్ని ప్రమాదాలు ఎదురైనా, సమాజంలో శాస్త్రసాంకేతిక ప్రగతి ప్రభావం ఎంత విస్తృతమవుతున్నా మతం నిర్వహించాల్సిన పాత్రకు ఎటువంటి ప్రమాదం వాటిల్లదనే విశ్వాసం ప్రకటితమవుతూనే ఉంది. దేశకాల పరిస్థితుల సవాళ్ళను ఎదుర్కొనే సత్తా మత సంస్థలకు ఉందని చాలా మంది నమ్మకం.

## 20.9 రాజ్య భావన

రాజ్యమనేది ఒక సార్వజనీనమైన సామాజిక సంస్థ. కానీ రాజ్యం తాలూకు నిర్వచనం విషయంలో శాస్త్రజ్ఞుల మధ్య ఏకీభావం ఉన్నట్లు కనిపించదు. ఈ రకమైన భిన్నత్వానికి మూలకారణం రాజ్యం ఆవశ్యక అంశాల పట్ల ఆయా శాస్త్రవేత్తలు దృష్టిలోని తేడాలేనని చెప్పాలి. వివిధ మేధావులు ప్రతిపాదించిన నిర్వచనాలను తులనాత్మకంగా పరిశీలిస్తే రాజ్యానికి అవసరమైన అంశాలను గురించి తెలుసుకోవడం సులభమవుతుంది. ఇప్పుడు కొందరు రాజ్యానికిచ్చిన నిర్వచనాలను పరిశీలిద్దాం.

బ్లంట్ షెల్లీ దృష్టిలో రాజ్యమంటే ప్రభుత్వం, పాలకుల రూపంలోని వ్యక్తుల సమూహాల సమ్మేళనమని, దానికి నిర్దిష్ట ప్రాంతం ఉంటుందని, నైతికంగా వ్యవస్థీకృతమైన పురుష, మూర్తిమత్వం. క్లుప్తంగా చెప్పాలంటే ఒక నిర్దిష్ట ప్రాంతంలో ప్రజలను రాజకీయంగా వ్యవస్థీకరించడాన్నే రాజ్యమంటారు.

జాన్ డబ్ల్యూ. బర్గెస్ అభిప్రాయంలో మానవజాతిని ఒక వ్యవస్థీకృత వ్యవస్థగా చూడడమే రాజ్యం. హాలండ్ ఈ విధంగా నిర్వచించాడు: అనేక మానవుల సమ్మేళనమని, వారు ఒక నిర్దిష్ట ప్రాంతానికి పరిమితమై ఉంటారు. వారిలో అధిక సంఖ్యాకుల మాట ప్రకారమే కార్యక్రమాలు కొనసాగుతాయి. కానీ ఈ నిర్వచనాలలో కొన్ని స్పష్టమైన ముఖ్యమైన లోపాలు కనిపిస్తాయి. ప్రజలు సమైక్యమై రాజకీయ యూనిట్‌గా ఏర్పడినంత మాత్రాన దాన్ని ఒక రాజ్యమనలేము. ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలుండడం ముఖ్యం.

ఆచార్య గార్నర్ రాజ్యానికి ఒక స్పష్టమైన నిర్వచనం ఇచ్చారు. రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ చట్టం, తాలూకు భావనగా, రాజ్యమంటే వ్యక్తుల సముదాయం. ఇలాంటి వ్యక్తులు అధిక సంఖ్యలో ఉంటారు. వీరు కొత నిర్దిష్టమైన భౌగోళిక ప్రాంతంలో స్థిరనివాసమేర్పరుచుకొని ఉంటారు. వారు దాదాపు స్వతంత్రుంగా ఉంటారు. ఒక సువ్యవస్థితమైన ప్రభుత్వానికి విధేయత చూపుతారు. ఈ నిర్వచనంలో ప్రజలు ఒక భౌగోళిక ప్రాంతంలో స్థిరనివాసులై ఉండడం, బయటి శక్తుల ప్రాబల్యానికి గురికాకుండా స్వతంత్రులుగా వుండడం, సువ్యవస్థితమైన ప్రభుత్వం ఉంటూ దానికి తామంతా విధేయులుగా వ్యవహరించడం అనే అంశాలున్నాయి. లాస్కీ ప్రకారం రాజ్యమనేది ఒక ప్రాంతీయ సమాజం. ఇది ప్రభుత్వం, ప్రజలు అని విభజితమై, ఆ నిర్దిష్ట ప్రాంతంలోని ఇతర అన్ని సంస్థల కంటే అత్యున్నతాధికారం కలిగి వుంటుంది.

అమెరికా సంయుక్త రాష్ట్రాల సుప్రీం కోర్టు రాజ్యానికిచ్చిన నిర్వచనం ఇలా వుంది: స్వతంత్రులైన పౌరుల రాజకీయ సముదాయం. ఈ సముదాయం కొన్ని నిర్దిష్ట సరిహద్దులున్న భౌగోళిక ప్రాంతంలో నివశిస్తూ, ప్రభుత్వానుమతితో , లిఖిత రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులకు లోబడి వ్యవస్థీకృతమై ఉంటుంది.

ఆధునిక రాజ్యానికి సరిపోయే నిర్వచనాన్ని ఇచ్చినవారు ఫలిమోర్ అనే ఇంగ్లీషు న్యాయవాది. అతనిచ్చిన నిర్వచనంలో రాజ్యలక్షణాలైన ప్రజలు, భౌగోళిక ప్రాంతం, ప్రభుత్వం, దాని పట్ల ప్రజల విధేయత, సార్వభౌమాధికారంతో పాటు అంతర్జాతీయ ఒప్పందాలు కుదుర్చుకునే అధికారం, యుద్ధం, శాంతి, వంటి వాటికి సంబంధించి నిర్ణయం చేసే అధికారం వంటి ప్రధాన అంశాలను కూడా చేర్చడం జరిగింది. ఇంతవరకు తెలిసిన నిర్వచనాలను దృష్టిలో ఉంచుకొని రాజ్యం ప్రధాన లక్షణాలను పరిశీలిద్దాం.

## 20.10 రాజ్యం : అత్యావశ్యక లక్షణాలు

ఇంతవరకు పేర్కొన్న నిర్వచనాలను పరిశీలిస్తే రాజ్యం తాలూకు అత్యావశ్యక లక్షణాలు ఏవో అర్థమవుతుంది.



BRAOU

అవి : 1) జనాభా 2) భౌగోళిక ప్రాంతం 3) ప్రభుత్వం 4) సార్వభౌమాధికారం ఈ నాలుగు లక్షణాలను గురించి కొంత వివరంగా తెలుసుకొందాం.

**1) జనాభా (Population):** రాజ్యం ప్రధానంగా మానవ సంస్థ కాబట్టి జనాభా అత్యావశ్యకం. ప్రజలు లేని రాజ్యాన్ని ఊహించడమే కష్టమవుతుంది. ప్రాంతం, ప్రజలు లేని రాజ్యమంటూ ఉండదు. ప్రజలు రాజ్యం ముఖ్యలక్షణమని అందరు రాజనీతి శాస్త్రవేత్తలు అంగీకరిస్తారు. అయితే ఎంతమంది ప్రజలుంటే రాజ్యం అవుతుంది అనే విషయంలో శాస్త్రజ్ఞుల మధ్య ఏకాభిప్రాయం కనిపించదు.

ప్రాచీన కాలంలో అతి తక్కువ జనాభాతో నగర రాజ్యాలు (City of states), గిరిజన రాజ్యాలుండేవి. గ్రీకు తత్వవేత్తలను అధికంగా ప్రభావితం చేసిన ఏథెన్స్, స్పార్టాలు అతిచిన్నవేకాదు, మరీ పెద్దవీ కాదు. ప్లేటో(Plato) తనగ్రంథం "Laws" లో రాజ్యానికి ఆదర్శప్రాయమైన జనాభాను 50-40గా పేర్కొన్నాడు. అట్లాగే చిన్ని చిన్న గణతంత్రాలను, ప్రత్యక్ష ప్రజా స్వామ్యాన్ని ఆకాక్షించే రూసో (Rousseau) ఒక రాజ్యానికి పదివేల జనాభాను ఆదర్శప్రాయమైనదిగా పేర్కొన్నాడు.

ఆధునిక యుగంలో సమాఖ్య రాజ్యాలు(Federal Republics), జాతీయ భావం, సామ్రాజ్యవాదాలు ప్రబలంగా ఉండడం వల్ల రాజ్యాల పరిమాణం పూర్వపు రాజ్యాలకంటే పెద్దవిగా ఉండడం గమనించవచ్చు. ఈనాడు 180 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 5000 జనాభా ఉన్న అండోరా (Andorra) రాజ్యమూ ఉంది, ప్రపంచంలోకెల్లా అతి పెద్ద దేశాలైన చైనా, భారతదేశాలున్నాయి. అందువల్ల జనాభాకు సంబంధించిన పరిమాణం విషయంలో ఇథమిత్థంగా ఏదీ నిర్ధారించడానికి వీలుకాదు.

**2)భౌగోళిక ప్రాంతం లేదా భూభాగం (Territory):** భూభాగం రాజ్యం యొక్క రెండో ప్రధాన లక్షణం. కానీ భూభాగం అంత ముఖ్యమైంది కాదని డూగ్యుఎట్(ఈతివీతిరిశి), సర్ జాన్ సీలీలు భావిస్తారు. సీలీ అభిప్రాయంలో ప్రభుత్వం ఒక సమాజాన్ని సమైక్యంగా ఉంచగలిగితే దాన్ని రాజ్యమనవచ్చు. కానీ ఈనాడు నిర్దిష్ట భూభాగంపై పరిపాలనాధికారం లేనిదే దాన్ని ఒక ప్రత్యేక రాజ్యంగా గుర్తించడం సాధ్యం కావడం లేదు.

ప్రాచీన కాలంలో అనేక గిరిజన సమూహాలు సంఘటితంగా ఉంటున్నా ఒక నిర్ణీత ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పరచుకోకుండా సంచార జీవులుగా ఉండేవారు. అట్లాంటి వారున్న గుంపులను రాజ్యాలుగా భావించడం జరగదు. ఎందుకంటే సంచార రాజ్యం (Migrating State) వుండడం అసంభవం. అట్లాగే మహాసముద్రాలలో పయనించే పెద్ద స్టీమర్లను ప్రత్యేక రాజ్యంగా గుర్తించలేము. మరో ఉదాహరణ యూదులు. 1948 వరకు వారికి తమదంటూ ఒక రాజ్యం వుండేది కాదు. యూదులు ప్రపంచమంతటా వ్యాపించి ఉండేవారు. ఈనాడు వారికి ఒక భౌగోళిక ప్రాంతంలో స్థిరపడి తమకు ఒక ప్రత్యేక రాజ్యాన్ని స్థాపించుకోగలిగారు. దీన్నిబట్టి చూస్తే ఆధునిక రాజ్యానికి భూభాగం అత్యంత ఆవశ్యకమైందని స్పష్టమవుతుంది. ఒక ప్రత్యేక ప్రాంతం తమది అని భావించినప్పుడే అక్కడి ప్రజలలో దేశాభిమానం, దేశభక్తి ఏర్పడతాయి. భూభాగం విస్తీర్ణం విషయంలో ఎలాంటి పరిమితులు లేవు. చిన్నచిన్న దేశాలు (మోనాకో - 368 ఎకరాల విస్తీర్ణం), చైనా, భారత దేశం వంటి అతివిశాలమైన దేశాలు వుంటున్నాయి.

అయితే ప్లేటో, అరిస్టాటిల్, మాంటెస్క్యూ వంటి వారు చిన్న చిన్న రాజ్యాల పట్ల ఎక్కువ ఆసక్తి కనబరిచారు. చిన్న రాజ్యాలు స్వయం సమృద్ధికి, స్వావలంబనకు, సమర్థమైన పాలనకు అనువుగా ఉంటాయని వారి విశ్వాసం. అరిస్టాటిల్ అన్నట్లు రాజ్యం మరీ చిన్నదయితే స్వయం సమృద్ధత సాధ్యం కాదు. మరీ పెద్దదైతే రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవడం వీలుపడదు.

కానీ మరీ చిన్న రాజ్యాల మనుగడ సమస్యా పూరితమైంది అవుతుందనే భావం ఈనాడు ప్రబలంగా వుంది. రెండో ప్రపంచయుద్ధ సమయంలో జర్మనీ చిన్ని చిన్న ఐరోపా రాజ్యాలను అతి సులభంగా జయించి ఆక్రమించుకోగగిందే గానీ పెద్ద రాజ్యాలైన రష్యా, అమెరికాల విషయంలో విఫలమైందనే వాస్తవాన్ని గుర్తించాలి. అతిపెద్ద రాజ్యాలైన అమెరికా, రష్యాలు పుష్కలంగా లభ్యమవుతున్న వనరుల సహాయంతో అగ్రరాజ్యాలుగా ఎదిగాయి. అయినా ఈ మధ్య కాలంలో అనేక కారణాల వల్ల రష్యా చిన్నచిన్న స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాయి.



BRAOU

3)ప్రభుత్వం (Government): రాజ్యానికి సంబంధించి ప్రభుత్వం మూడో అత్యావశ్యక లక్షణం. ప్రభుత్వమంటే ఒక రాజకీయ వ్యవస్థ. దీన్ని ప్రజల కార్యకలాపాలను క్రమబద్ధం చేయడానికి, నియంత్రించడానికి ఉపయోగిస్తారు. ఇలా చేసినప్పుడే ప్రజలు సామరస్యంతో, సృజనాత్మకంగా, సమర్థవంతంగా జీవితం గడపడానికి, వారి సమస్యలను పరిష్కరించుకోవడానికి వీలవుతుంది. కలిసికట్టుగా జీవించాలని ప్రజలు నిర్ణయించుకోవడంలో ప్రధాన ఆశయం ప్రజలు సువ్యవస్థితమై, ప్రవర్తనా నియమాలకు కట్టుబడి ఉండడానికి అంగీకరించినప్పుడే సాధ్యమవుతుంది. ఇలాంటి నియమనిబంధనలను రూపొందించి అమలుచేసే వ్యవస్థే ప్రభుత్వం. ప్రభుత్వం లేని ప్రజా సమూహం దారీతెన్నూలేక, అయోమయము, అస్తవ్యస్తము అయిన పరిస్థితిలో పడిపోవడం, అసంబద్ధంగా ప్రవర్తించడం జరుగుతూ వుంటుంది. ఉమ్మడి కార్యాచరణకు ప్రభుత్వం ఒక చక్కటి సాధనం. బ్లింట్‌షెల్లీ అన్నట్టు అధికారం లేనివారు, నియమాలను పాటించలేనివారు లేని సందర్భంలోనూ అరాచకం తాండవిస్తుంది, రాజ్యం అంతరిస్తుంది. ప్రపంచదేశాల చరిత్ర పరిశీలిస్తే ప్రభుత్వం లేని రాజ్యమనేది అసలు కనిపించదు. ప్రభుత్వం రాజ్యం మనుగడకు ప్రాణ సమానమైంది.

ప్రభుత్వం ప్రజాస్వామ్య ప్రభుత్వమా, నియంతృత్వ ప్రభుత్వమా అనేది ఆయాదేశాల(రాజ్యాల)లో నెలకొని వున్న రాజకీయ పరిస్థితులను బట్టి ఉంటుంది. ప్రభుత్వాధికారాలను శాసననిర్మాణం (Legislative), కార్యనిర్వహణ(Executive), న్యాయపాలనలుగా విభజించడం పరిపాటి. రాచరికం ఏకాధికార పాలనలో పాలనాధికారం, శాసననిర్మాణం, న్యాయపాలనాధికారం ఒకేవ్యక్తి చేతుల్లో కేంద్రీకృతమై ఉంటాయి. అదే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ మూడు అధికారాలు మూడు ప్రత్యేక విభాగాల అధీనంలో ఉంటాయి. రాజకీయధికారం ప్రజల చేతుల్లో ఉంటుంది. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ. మంచి పాలన అందివ్వడం ప్రభుత్వ కర్తవ్యంగా ఉంటుంది.

4) సార్వభౌమాధికారం (Sovereignity): ఇది రాజ్యం యొక్క నాలుగో ముఖ్య లక్షణం. ఈ లక్షణమే రాజ్యానికి ఇతర వ్యవస్థలకు ఉన్న ప్రధాన వ్యత్యాసాన్ని తెలియజేస్తుంది. ఈ లక్షణం ఒక్క రాజ్యానికే ఉంటుంది. ప్రజలు, భూభాగం వుండి, ప్రభుత్వం పాలనాబాధ్యతలు నిర్వహిస్తున్నా సార్వభౌమాధికారం లేకుంటే ఆ వ్యవస్థ రాజ్యమనిపించుకోదు.

సార్వభౌమాధికారమంటే అత్యున్నతాధికారం. ఇలాంటి ఉన్నతాధికారం ఒక్క రాజ్యానికే ఉంటుంది. ఆచార్య బర్గస్ రాజ్యమనేది సర్వసమగ్రము, ప్రత్యేకము, శాశ్వతము అయిన వ్యవస్థ అని, సార్వభౌమాధికారం దాని అత్యావశక్య లక్షణమని అంటాడు. ప్రత్యేకము అంటే ఏ ఇతర వ్యవస్థకు లేని లక్షణం సార్వభౌమాధికారం. ఈ సార్వబౌమాధికారం ఉండడం వల్లనే దేశ అంతరంగిక వ్యవహారాల విషయంలో స్వేచ్ఛా స్వాంతత్ర్యాలు ఉండటం, అదుపు తప్పుతున్న వ్యవహారాలకు పగ్గం వేయగలగడం సాధ్యమవుతుంది. అంతే కాక ఈ అధికారం వల్ల బయటి శక్తుల నుంచి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించుకొనే, దేశ సమగ్రతను కాపాడుకొనే అధికారం లభిస్తుంది. ఒక దేశం పరదేశానికి అధీనదేశమైతే దాని సార్వభౌమాధికారం కోల్పోయినట్లే అవుతుంది. సార్వభౌమాధికారం వల్ల ఇతర దేశాలతో సంబంధాలు ఏర్పరచుకొనే స్వాతంత్ర్యం లభిస్తుంది. స్వతంత్ర పాలన, స్వయం పాలన అనేవి సార్వభౌమత్వం వల్లనే సాధ్యమవుతాయి. ఒక రాజ్య అస్తిత్వానికి సార్వభౌమాధికారం కీలకమైనదవుతుంది.

## 20.11 రాజ్యావతరణ, అభివృద్ధి

సామాజిక సంస్థల ఆవిర్భాం గురించి కచ్చితంగా తేల్చిచెప్పడం కష్టసాధ్యమైన విషయం. అయినా వాటి ఆవిర్భాం గురించి బుద్ధిజీవులు నిరంతరం ఆలోచిస్తూనే ఉన్నారు. నూతన సిద్ధాంతాలు ఏది సంపూర్ణమైనవి, సమగ్రమైనవి అని చెప్పడం కష్టమైనా, అవి వాస్తవానికి సమీపంలోనే ఉన్నట్టు స్పష్టమవుతుంది. రాజ్యావిర్భావం గురించి వితర్కించిన వారిలో రాజనీతి శాస్త్రజ్ఞులతో పాటు కొందరు సమాజశాస్త్రవేత్తలు కూడా ఉన్నారు. అలాంటి వారిలో ప్రముఖంగా పేర్కొనదగ్గరవారు ఆంగ్లేయ సమాజశాస్త్రవేత్త వాల్టర్ బేగ్‌హాట్ (Walter Begehot) సిద్ధాంతాలతో చర్చ ప్రారంభిద్దాం.

రాజ్యావతరణ అనేది ఇతర సామాజిక వ్యవస్థల మాదిరిగానే స్వల్పాతి స్వల్పమైన, అతి సామాన్యమైన వ్యవస్థలుగా ప్రారంభమై కొన్ని నిర్దిష్ట దశలు దాటి అత్యున్నత స్థాయికి ఎదిగిందని బేగ్‌హాట్ పేర్కొంటాడు. ఈ నిర్దిష్ట దశలు దాటి అత్యున్నత స్థాయికి ఎదిగిందని బేగ్‌హాట్ పేర్కొంటాడు. ఈ నిర్దిష్ట దశలు:

**20.11.1 ఆచారాల నిర్ధారణ** (Custom fixing): ఈ దశలో రాజ్యమనేది అసలే ఉండనటువంటిది. 2) విభిన్న జానపదరీతులు, సామాజిక ప్రమాణాలు అనుసరిస్తున్న సమూహాలు బలహీనమైన వాటిని ఓడించి, ఆధిపత్యం ప్రాబల్యం సంపాదించిన దశ. ఈ దశలోనే రాజ్యావతరణకు అంకురార్పణ జరుగుతుంది. 3) చర్చల దశ (the stage of discussion): చర్చలు రకరకాల సర్దుబాట్ల ఫలితంగా ఒక ప్రభుత్వ వ్యవస్థ ఏర్పడి క్రమంగా బలం పుంజుకొని ఒక ఉన్నత వికాసానికి మూల మైంది.

స్పెన్సర్ అనే సమాజ శాస్త్రవేత్త సామాజిక శాస్త్ర సిద్ధాంతాలను రాజ్యవ్యవస్థ క్రమపరిణామానికి అనువర్తించి, బేగ్‌హాట్ ప్రతిపాదించిన సిద్ధాంతం తరహా సిద్ధాంతాన్నే ప్రతిపాదించాడు. ఈ సిద్ధాంతం కూడా రాజ్యవ్యవస్థ చరిత్రలో మూడు ఘట్టాలను పేర్కొంటుంది. అవి : 1) గిరిజన సమూహాలు. ఈ సమూహాలు సువ్యవస్థితమైనవి కావు, అప్పుడు ప్రభుత్వమనేది ఉండేది కాదు. 2) సైనికవర్గం ఆధిపత్యం వున్న దశ. ఈ దశలో ఇతర సమూహాలను జయించి, వాటిపై అధికారం చలాయించడం జరిగింది. ఈ సందర్భంలోనే ఒక శక్తిమంతుడైన నాయకుని నేతృత్వంలో అధికార యంత్రాంగం ఏర్పడి చివరికి వంశపారంపర్య రాజరికపు వ్యవస్థ అవతరించింది. 3)పారిశ్రామిక దశ. ఈ దశలో సైనిక చర్యల స్థానంలో ఆర్థిక వ్యవహారాల ప్రాబల్యం అధికమవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొనాలంటే యుద్ధభయం, దురాక్రమణ లేకుండా సైనిక ప్రాబల్యం స్థానంలో పారిశ్రామిక వహించాలని స్పెన్సర్ అభిప్రాయం. బేగ్‌హాట్ , స్పెన్సర్‌లు ఇద్దరూ రాజ్యం కూడా ఇతర సామాజిక సంస్థల మాదిరిగానే చిన్న చిన్న సంస్థలుగా ప్రారంభమై క్రమపరిణామం చెందుతూ ఈనాటి పటిష్టమైన, శక్తివంతమైన రాజ్యంగా అవతరించిందని భావించినట్టు పై చర్చల వల్ల స్పష్టమవుతుంది.

ఇతర సమాజశాస్త్రవేత్తలు కూడా స్పెన్సర్, బేగ్‌హాట్‌ల మాదిరిగానే రాజ్యం కొన్ని నిర్దిష్ట దశలు దాటి ప్రస్తుత స్థాయికి ఎదిగిందని భావించారు. ఆధునిక సమాజ శాస్త్రవేత్తలలో ఒకరైనా గిడ్డింగ్స్ రాజ్యవ్యవస్థ వికాస చరిత్రలోని ప్రధాన దశలను ఈ విధంగా పేర్కొంటాడు : 1) మిలిటరీ మతపరమైన దశ 2) ఉదార - చట్టపరమైన దశ (Liberal-Legal) 3) ఆర్థిక-నైతిక దశ(Economic-Ethical) హాబ్‌హౌస్ ప్రభుత్వ చరిత్రను 1) బంధుత్వం 2) అధికారం 3) పౌరసత్వం అనే మూడు దశలుగా విభజించాడు.

~Œ[¼=¼=‹ ÉÒž ‹ Θ| OkŒz # ÆÞ> °,,½} Ìþ° ‹ ^¥ß`Œ#° ...ÕÓ Lowie), అతని గ్రంథం "The Origin of State" లో విమర్శించాడు. రాజ్యవ్యవస్థ అతి సాధారణ రూపంలో ప్రారంభమై క్రమంగా సంక్లిష్ట రూపం దాల్చిందని భావించాడు. ఈనాటికి అది వివిధ వికాస దశలలో వివిధ ప్రాంతాలలో ఉంటూండడం గమనించవచ్చని లోయీ వాదిస్తాడు.

హెన్రీ సమ్మర్ మెయిన్, రాజ్యం కుటుంబ వ్యవస్థ - ముఖ్యంగా పితృ స్వామిక వ్యవస్థ - నుంచి క్రమపరిణామం చెందిందని భావిస్తాడు. ఈ వాదనకు బలమైన ఆధారాలు లేవని పురాతన సంప్రదాయ సమాజాలకు మాత్రమే వర్తిస్తుందని విమర్శించడం జరిగింది. జె.ఆర్. కామన్స్ అనే అమెరికా దేశపు సమాజ శాస్త్రవేత్త రాజ్యం మూలం ప్రైవేటు ఆస్తిపై నియంత్రణ కోసం వివిధ వర్గాల మధ్య తలెత్తిన సంఘర్షణలలో కనిపిస్తుందని అంటాడు. రాజ్యం తాలూకు మూలం మాతృస్వామిక వ్యవస్థలలో కనిపిస్తాయని ప్రముఖ మానవ శాస్త్రవేత్త ఎల్. హెచ్. మోర్గాన్ పేర్కొంటాడు. స్పెన్సర్, బేగ్‌హాట్‌లు కూడా ఘర్షణల వల్లే రాజ్యం అవతరించినట్లు పేర్కొంటారు. ఈ భావం క్రీస్తుపూర్వం 6వ శతాబ్దానికి చెందిన హెర్క్యులిటస్ వాదనలో కనిపిస్తుంది. మధ్యయుగాలకు చెందిన అర్బ్ చరిత్రకారుడు, తత్వవేత్త అయిన ఇబన్ ఖల్దున్(Ibn Khaldun) కూడా స్థిరనివాసులకు, సంచార తెగలకు మధ్య జరిగిన ఘర్షణల ఫలితంగా రాజ్యం ఏర్పడిందని వాదిస్తాడు.

**20.11.2 సంఘర్షణ సిద్ధాంతం:** రాజ్యావిర్భావానికి సంబంధించిన సంఘర్షణ సిద్ధాంతం ఛాయలు ఆధునిక యుగపు ప్రారంభ దశలలోని సమాజశాస్త్రవేత్తల సిద్ధాంతంలో కూడా కనిపిస్తాయి. మాకియావెల్లి దృష్టిలో రాజ్యం యుద్ధం వల్ల ఇతర సమూహాలను పాదాక్రాంతం చేసుకొని అధికార విస్తరణ చేయడలోనే రాజ్యావిర్భావానికి మూలముంది. ఈ ధోరణిలోనే జీన్ బోడిన్ కూడా సంఘర్షణే రాజ్యావతరణకు మూలమని భావించాడు.

ఈ సంఘర్షణ సిద్ధాంత ప్రతిపాదకులలో ప్రముఖులుగా థామస్ హాబ్స్, డేవిడ్ హ్యూమ్, గంప్లోవిజ్, రాట్‌జన్



BRAOU

హూపర్, ఓపెన్ హైమర్ ఆలోచన మార్క్స్ ఆలోచన పంథాలోనే నడిచినట్లు కనిపిస్తుంది. వివిధ సమూహాల మధ్య తలెత్తే సంఘర్షణల ఫలితంగా ఒక వ్యవస్థ ఏర్పడి చివరికి ఆ సమూహాల మధ్య సమైక్యత నెలకొంటుంది. ఈ సమైక్యత సామాజిక క్రమ పరిణామ ఫలితమని వీరు వాదిస్తారు.

గంప్లోవిజ్ సంఘర్షణ సిద్ధాంతం సమాజ శాస్త్ర సిద్ధాంతాలన్నింటిలో బహుజనామోదం పొందింది. అయినా సంఘర్షణ లక్షణానికే పెద్దపీట వేయడాన్ని కొందరు ఆమోదించలేదు. డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని యథాతథంగా రాజ్యావతరణకు అనువర్తించాడనే విమర్శ ప్రముఖమైంది.

ఆస్ట్రియా దేశస్థుడైన రాట్‌జన్ హూపర్ సంఘర్షణ అనేది సమూహాల మధ్య కాక వ్యక్తుల మధ్య తలెత్తినదే రాజ్యావతరణకు మూలమైందని స్పష్టంగా తెలిపాడు. వ్యక్తిగత ప్రయోజనాలెప్పుడూ సంఘర్షిస్తూనే ఉంటాయి. అయితే ప్రతివ్యక్తి ఒక సమూహాన్ని తనదిగా గుర్తించి దాని అస్థిత్వానికి, ప్రత్యేక పరిరక్షణకు పోరాడుతూనే ఉంటాడు. వ్యక్తుల మధ్య ప్రారంభమైన ఇట్లాంటి సంఘర్షణ సమూహాల మధ్య ఘర్షణగా మారుతుంది. ఈ సమూహాలు తమ ప్రత్యేకత పరిరక్షించుకోవడమే కాక ఇతర సమూహాలపై ఆధిపత్యం నెలకొల్పుకోవడానికి ప్రయత్నిస్తాయి. ఈ సంఘర్షణ కొనసాగుతూ విభిన్న ఆసక్తులు, ప్రయోజనాలున్న సమూహాల మధ్య సామరస్యం నెలకొనడంతో సమసిపోయి శాంతియుత సమాజం ప్రావిర్భవిస్తుంది. ఇదే 'సంస్కృతి రాజ్యం' (Culture State) అని రాట్‌జన్ హూపర్ అంటాడు.

జర్మన్ సమాజ శాస్త్రవేత్త ఫ్రాన్ ఓపెన్ హైమర్ కూడా సంఘర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అయితే ఇది ఇతర సరఘర్షణ సిద్ధాంతాలకు భిన్నమైంది. సంఘర్షణలు నరవర్గ (జాతి) పరమైనవి(Ethnic) కాక ఆర్థికమైనవి అయి ఉంటాయి. విజేత,పరాజితుణ్ణి దోచుకొని తన సంపదను, శక్తియుక్తులను పెంపొందించు కోవడానికి తోడ్పడే యంత్రాంగాన్ని ఏర్పరుచుకోవడం జరుగుతుంది. ఇదే రాజ్యం దీని ఆధారంగా విజేత తన ప్రాబల్యాన్ని, అధికారాన్ని నిరవధికంగా కొనసాగించుకోగలడు. అతని మాటల సారాంశాన్ని ఈ విధంగా చెప్పవచ్చు: "చరిత్రలోని ప్రతిరాజ్యం వర్గాల సమ్మేళనంగా ఉండేది, ఇప్పటికీ ఉంటూనే ఉంది. ఈ రాజ్యంలో హోదానుబట్టిగాని, ఆస్తిపాస్తులనుబట్టిగాని ఉన్నతులు, అల్పులు అనే వర్గాలుంటుంటాయి. ఈలాంటి వ్యవస్థే రాజ్యం.

సంఘర్షణ సిద్ధాంతం రాజ్యావతరణకు మూలాన్ని సూచిస్తుందనడాన్ని అందరూ అంగీకరించినా పరస్పర సహాయసహకారాలు, సహకారం అవసరం. నాయకత్వం వ్యాపారం వంటివి సంఘర్షణ, యుద్ధం వంటి వాటితో కలిసి రాజ్యాన్ని ఏర్పరుస్తాయేనది మరోవాదం. ఈ వాదంతో కెమ్స్ ఏకీభవిస్తాడు. మానవుని సహజమైన కలుపుగోలుతనం (Sociability), శాంతికారకాలు కలిసి శక్తివంతమైన శక్తిగా ఏర్పడి రాజ్యాన్ని సృష్టిస్తాయని కోమ్స్ అభిప్రాయం. ఇలాంటి అభిప్రాయాన్నే జాకోబ్ నోవికోవ్ (Jacob Novicow), ఫ్రాంక్లిన్. హెచ్. గిడ్డింగ్స్, ఆల్‌బిన్ డబ్ల్యూ. స్మాల్, ఇని హైన్‌లు కూడా వెలిబుచ్చారు. ఆదిమ సంచార తెగలలో కూడా ఆర్థిక, కుటుంబపరమైన వేడుకలు, ఆచారాల క్రమబద్ధీకరణ, నియంత్రణలు అనేవి యుద్ధం, బానిస వ్యవస్థల కంటే ఎక్కువగానే ప్రభుత్వ వ్యవస్థ ఏర్పడటానికి దోహదం చేశాయని పైన పేర్కొన్న సమాజశాస్త్రవేత్తలు భావించారు. రాజ్యావిర్భావం తాలూకు సిద్ధాంతాలలో సహకారానికి అధిక ప్రాముఖ్యమిచ్చిన వారిలో ప్రముఖుడిగా చెప్పదగినవాడు రష్యాకు చెందిన పీటర్ క్రోపోట్‌కిన్. అల్పాతిఅల్పమైన జంతుజాలాలలో కూడా పరస్పర సహకారం ఉంటుందని, ఈ లక్షణమే మానవ సమాజ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహిస్తుందని ఇతని విశ్వాసం. ఈ మధ్య కాలంలో అమెరికా దేశపు మానవశాస్త్రవేత్త యాష్లీ మాంటేగ్ (Ashley Montague) వివిధ జాతుల చరిత్రను పరిశీలిస్తే స్పర్థ (competition) కంటే సహకారమే ప్రముఖ భూమిక నిర్వహించినట్టు స్పష్టమవుతుందంటాడు.

సమాజశాస్త్రవేత్తలు రాజ్యాన్ని మానవుడు సృష్టించిన (లేదా కల్పించిన) వ్యవస్థగా భావించారు. అది మార్మికమైనది లేదా మానవాతీత శక్తులు నిర్మించినది కాదని వారి విశ్వాసం. అయితే జర్మన్ తత్వవేత్త హెగెల్ మాత్రం రాజ్యం ఒకానొక "సంపూర్ణ, స్వతంత్ర వాస్తవం" (Completely Independent Reality) అని ఈ భూతలంపై భగవదాగమమని (the march of God in the World) భావిస్తాడు. జర్మన్ తత్వవేత్తల దృష్టిలో రాజ్యం ఒక సచేతనమైన, శక్తివంతమైన, మానవ పరిమితులకు అతీతమైన, ఉదాత్తమైనదని భావిస్తారు. కానీ ఇలాంటి వ్యవస్థ ఎక్కడా కనబడదని, ఇది

కేవలం అమూర్త భావన (Obstraction) మాత్రమేనని రాజ్యమంటే 'మనమందరం' (All-of-us) అని సమ్నర్ తన "What Social Classes Owe to Each Other" అనే గ్రంథంలో పేర్కొన్నాడు. అధిక సంఖ్యాకులు ఒక అల్ప సంఖ్య వర్గానికి పాలించే హక్కును దత్తం చేయడం వల్లే రాజ్యం అవతరించిందని సమ్నర్ అభిప్రాయం.

రాజ్యం కూడా క్రమపరిణామానికి గురి అయి వివిధ దశలు అధిగమించి- సాధారణ దశ నుంచి సంక్లిష్ట దశకు - వికాసం చెందుతూ వస్తున్న వ్యవస్థ అని, దీని వికాస చరిత్రకు ఇతర సామాజిక వ్యవస్థ వికాస చరిత్రకు సామ్యముందని భావించడం జరుగుతోంది. రాజ్యవ్యవస్థ విభిన్న సంస్కృతులు, భౌతిక పరిస్థితుల ప్రభావానికి లోనై ఏర్పడే వ్యవస్థ అని, ఈ వ్యవస్థ వివిధ రూపాలలో కనిపిస్తుందని, వివిధ విధులు నిర్వర్తిస్తూ ఉండటం కనిపిస్తుంది.

రాజ్యం ఏఏ రూపాలలో దర్శనమిస్తుందో శాస్త్రవేత్తలు స్పష్టపరిచారు. అవి: 1)రాచరికాలు 2)కులీన పాలన 3) ప్రజాస్వామ్య వ్యవస్థ. ఈ మూడే రాజ్యం యొక్క స్థూల రూపాలు వీటిని రకరకాల ఉపవిభాగాలుగా వర్గీకరించడం జరిగింది. సమాజశాస్త్రవేత్తలు చేసిన వర్గీకరణ కొంత భిన్నంగా ఉంటుంది. కోమ్టే భగవంతుడే సర్వాధికారిగా ఎన్నుకొన్న వ్యవస్థ (Theocracy) అని, సమాజశ్రేయస్సు కోసం ఏర్పడిన వ్యవస్థ (Sociocracy) అని వర్గీకరిస్తే, స్పెన్సర్ సైనికపరమైన, పారిశ్రామిక రాజ్యాలుగా విభజిస్తాడు. రాజ్యం నిర్వర్తించే ప్రకార్యాల గురించి తెలుసుకొన్నాక వివిధ తరహాల రాజ్య వ్యవస్థల స్వరూప స్వభావాలను గురించి చర్చిద్దాం.

## 20.12 రాజ్యం ప్రకార్యాలు

ప్రజల మధ్య సంబంధాలను క్రమబద్ధం చేయడం, దేశీయ దురాక్రమణ నుంచి దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడడం అనేవే రాజ్యం ప్రధాన కర్తవ్యాలైనా, అది అనేక ఇతర రకాలుగా సేవలు చేస్తూ ఉంటుంది. రాజ్యం నిర్వహించే ప్రకార్యాలు ఆయా దేశాల ప్రభుత్వాన్ని బట్టి కాలానుగుణంగా మారుతూ ఉంటాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలలో కూడా గతంలో ప్రభుత్వాలు నిర్వహించిన విధులతో పోలిస్తే ఈనాటి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు చేస్తున్న సేవలు ఎంతో భిన్నంగా ఉంటున్నట్లు తెలుసుకోవచ్చు.

ప్రభుత్వం అవసరం గురించి గానీ, అది నిర్వహించవలసిన విధుల గురించి గాని సమాజశాస్త్రవేత్తల మధ్య అభిప్రాయ భేదాలున్నాయి. కోమ్టే, వార్డ్, గిడ్డింగ్స్, పారెటో, హాబ్ హౌస్ లాంటి శాస్త్రవేత్తలు రాజ్యం తప్పనిసరిగా ఉండాల్సిన వ్యవస్థ అని, సంక్లిష్ట సమాజంలో సభ్యుల మధ్య సంబంధాలను క్రమబద్ధం చేయడానికి అనువైన ఏకైక సాధనమని, సభ్యుల ప్రయోజనాలు కాపాడడానికి అత్యావశ్యకమైన వ్యవస్థ అని భావిస్తారు. మరికొందరు - ముఖ్యంగా జర్మన్ తత్వవేత్తలు రాజ్యం దైవదత్తమైందని, దానికి దివ్య శక్తులున్నాయని భావిస్తారు. ఈ రకంగా ప్రస్తుతించడం నాజీలు రాజ్యం అత్యంత శక్తివంతమైందని భావించడానికి ఆధారమైందని కొందరు భావిస్తారు. ఇతర సమాజశాస్త్రవేత్తలు - ప్రధానంగా మెకైవర్, ప్రజా సంబంధాల క్రమబద్ధీకరణకు సంబంధించి రాజ్యం ముఖ్యమైన ఏజెన్సీ అయినా అనేక ఏజెన్సీలలో ఇది ఒకటి మాత్రమేనని, దానికి కొన్ని పరిమితులున్నాయని భావించారు. మరికొందరు శాస్త్రవేత్తలు రాజ్యమనేది శాంతి భద్రతలు కాపాడడానికి అవసరమైన 'ఆవశ్యక అరిష్టం' (necessary evil) అని భావిస్తారు. ఇలా భావించిన వారిలో ప్రముఖులు స్పెన్సర్, నోవికోవ్, సమ్నర్, దుర్ఖైమ్‌లున్నారు.

స్వేచ్ఛావాదాన్ని (Laissez Faire) అంగీకరించిన స్పెన్సర్, సమ్నర్‌లు సమాజ ప్రయోజనాలు, వ్యక్తుల ప్రయోజనాలకు తోడ్పడడమనేది ప్రజల సమాజ జీవితంలో ఎక్కువగా జోక్యం చేసుకొనప్పుడే అని భావిస్తారు. ప్రజల సంక్షేమాన్ని పెంపొందించడం పట్ల ప్రభుత్వం ఎక్కువ ఆసక్తిని చూపకూడదని సమ్నర్ పేర్కొంటాడు. అతను రచించిన "What Classes Owe to Each Other"లో ఇలా రాశాడు : "వ్యక్తుల సంక్షేమం పెంచడానికి తమ సౌఖ్యాన్ని, ఆనందమయ జీవితాన్ని ఏర్పరుచుకోవడానికి తమకు నచ్చిన పద్ధతుల్లో సాధించుకోవాలి.

రాజ్యం అవసరం ఎంత మాత్రం లేకపోగా అది ఉండడం వల్ల ప్రజల ప్రయోజనాలకు ప్రమాదం ఏర్పడుతుందనే విపరీత ధోరణిలో ఆలోచించిన వారు మార్క్స్, హెగెల్, వారి అనుయాయులు. సమాజంలో వివిధ వర్గాల మధ్య ఏర్పడిన అంతరాల ఫలితంగానే రాజ్యం ఏర్పడిందని ఈ వర్గాలు అంతరించగానే రాజ్యం కూడా అంతరిస్తుందని,

BRAOU

ఇలాంటి పరిణామం సమసమాజ స్థాపనతో ఏర్పడుతుందని మార్క్స్ వాదిస్తాడు. సమసమాజ స్థాపన జరగడంతో రాజ్యాన్ని పురాతన వస్తువులైన రాట్నం, కంచుగొడ్డలి సరసన చేర్చడం జరుగుతుందని ఏంగిల్స్ "The Origins of the Family, Private Property and the State " గ్రంథంలో పేర్కొన్నాడు.

స్కాఫర్, వార్డ్‌లు మార్క్స్ వాదానికి పూర్తిగా భిన్నమైన వాదాన్ని లేవనెత్తారు. మానవుల పురోభివృద్ధికి రాజ్యం అవసరమని, ఆర్థిక ప్రగతి సాధించడానికి ఉద్దేశపూర్వకమైన విజ్ఞాన వంతమైన ప్రణాళికా రచన అవసరమని (దీనినే అతడు టెలిసిస్ - శిలిజిలిరిరిరి అంటాడు ) పేర్కొంటారు. దేశపౌరులందరి సంక్షేమానికి కృషి చేసే రాజ్యం అవసరమని, ఇలాంటి రాజ్యవ్యవస్థను నెలకొల్పడానికి ప్రభుత్వం దేశంలో నిరక్షరాస్యత నిర్మూలన, శాస్త్రీయ పరిజ్ఞాన విస్తరణ, శ్రామికుల పనితనాన్ని పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి. ఇలా చేయడం ద్వారా ప్రజల ఆదాయాలు పెరుగుతాయి, ఆర్థిక దురన్యాయాలు సమసిపోతాయి అని వీరు భావిస్తారు.

## 20.13 రాజకీయ వ్యవస్థల వర్గీకరణ

శాస్త్రజ్ఞులు రాజకీయవ్యవస్థలను వివిధ రకాలుగా వర్గీకరించారు. అరిస్టాటిల్ ఆరు రకాల రాజ్యవ్యవస్థలను పేర్కొన్నాడు : 1) రాచరికం (Monarchy) 2) నిరంకుశపాలన లేదా నియంతృత్వం 3) కులీన పాలన(aristocracy) 4) స్వల్పజన పాలన (అంటే కొద్ది మంది పాలన - Oligarchy) 5) పాలిటీ 6) ప్రజాస్వామ్యం (బహుజన పాలన -Democracy )

మాక్స్ వెబర్ ప్రకారం రాజ్యవ్యవస్థ స్వరూప స్వభావాలు దాని చట్టబద్ధత (Legitimacy) పై ఆధారపడి ఉంటాయి. ఈ చట్టబద్ధత మూడు ప్రధానాంశాలపై ఆధారపడి వుంటుంది. అవి: 1) సంప్రదాయ (tradition) 2) సమ్మోహన శక్తిగల మూర్తిమత్వం లేదా విశిష్ట వ్యక్తిగత లక్షణాలు 3) చట్టబద్ధత (Legality)

టి.బి. బొటొమోర్ మూడు రకాలైన రాజకీయ వ్యవస్థలను గురించి ప్రస్తావించాడు. అవి : 1) నెమ్మదిగా ఆధునికము, పారిశ్రామికము అవుతున్న గిరిజన సమూజాలు. 2) పారిశ్రామికీకరణ చెందని పురాతన నాగరకతలు, వలస పాలన నుంచి విముక్తమై స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాక పారిశ్రామికీకరణ చెందుతున్న ఆసియా, మధ్య ప్రాచ్యదేశాలు, కొన్ని లాటిన్ అమెరికాన్ దేశాలు 3) పారిశ్రామిక సమూజాలలోని రాజకీయ వ్యవస్థ. దీనిలో రెండు రకాల వ్యవస్థలున్నట్టు గుర్తించడం జరిగింది. ఎ) ప్రజాస్వామిక, పెట్టుబడిదారీ లేదా ప్రజాస్వామిక సోషలిస్టు వ్యవస్థ బి) కమ్యూనిస్టు నియంతృత్వ వ్యవస్థ - ఇతర రకాలైన నియంతృత్వ వ్యవస్థలతో సహా.

## 20.14 ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్య ప్రభుత్వం ఈనాడు బహురాజ్యాల ఆదరణ పొందుతున్న రాజకీయ వ్యవస్థ. ఈ తరహా ప్రభుత్వం అత్యుత్తమము, అత్యున్నత నాగరకతా లక్షణాలున్న వ్యవస్థగా పరిగణించడం జరుగుతోంది. ప్రజాస్వామ్యం అనే మాటకు అనేక అర్థాలు, ఉద్వేగ ఛాయలు ఉన్న పదమని బర్న్స్ (Burns) అంటాడు. అంతేకాక ప్రజాస్వామ్యమనే పదం అందరికీ అన్నీ అందించగల వ్యవస్థగా భావించడం జరుగుతోందనే అభిప్రాయాన్ని బర్న్స్ వ్యక్తీకరించాడు.

### ప్రజాస్వామ్యం : నిర్వచనం

ఈ పదాన్ని గ్రీకు పదాలైన డెమోస్ (Demos), క్రటియా (Kratia) అనే వాటి నుంచి వచ్చింది. డెమోస్ అంటే ప్రజలని, క్రటియా అంటే అధికారం (Power) అని అర్థం. అంటే ప్రజాస్వామ్యం అంటే ప్రజలకే అంతిమ అధికారమున్న వ్యవస్థ అని నిర్వచించవచ్చు. కొందరు ప్రముఖులు ప్రజాస్వామ్యానికిచ్చిన నిర్వచనాలను పరిశీలిద్దాం.

1) గెటెల్ నిర్వచనం : సార్వభౌమాధికారాన్ని పంచుకోవడంలో జనబాహుళ్యానికి అధికారమున్న ప్రభుత్వ రూపం అన్నాడు గెటెల్.

2) మెకైవర్ : ప్రజాస్వామ్యమంటే అధిక సంఖ్యాకుల పరిపాలన లేక మరో రకమైన పరిపాలనా విధానమని కాక,

ఎవరు పరిపాలించాలో, ఏలక్ష్యాల సాధనకు పరిపాలించాలో నిర్ణయించే పద్ధతి.

3)పనిక్కర్ (ప్రసిద్ధ చరిత్రకారుడు): ప్రజాస్వామ్యం కేవలం ఒక ప్రభుత్వ రూపం మాత్రమే కాదు. అది సామాజిక, ఆర్థిక, రాజకీయ కారకాల సంక్లిష్ట రూపం. ఈ వ్యవస్థలో ప్రజలు, రాజ్యం మధ్య సంబంధాలు ప్రభావితమవుతాయి. అత్యవసరమైన స్వాంతత్ర్యాలను హామీ ఇస్తుంది, వ్యక్తిగత స్వేచ్ఛ, అభిప్రాయాల వ్యక్తీకరణ స్వేచ్ఛ, సంస్థల ఏర్పరుచుకొనే స్వేచ్ఛ, వివిధ కార్యకలాపాల నిర్వహణ స్వేచ్ఛ ఉన్నటువంటి వ్యవస్థ.

4) అబ్రహాం లింకన్ : లింకన్ దృష్టిలో ప్రజాస్వామ్యమంటే ప్రజలను ప్రజలే పరిపాలించే, ప్రజలకోసమే పనిచేసే వ్యవస్థ. (Government of the people, by the people and for the people)

## ప్రజాస్వామ్యం : మౌళిక సూత్రాలు

ప్రజాస్వామ్య మౌళిక సూత్రాలను కింద పొందుపరిచాం:

1) వాక్ స్వాతంత్ర్యం, ఇతరులను విమర్శించే హక్కు, ఇతరులతో ఏకీభవించే లేదా విభేదించే హక్కు, ప్రతివ్యక్తికి వుంటుంది. 2) ఒక వ్యక్తిపై అధికారం చెలాయించడం, బలాత్కార పద్ధతులను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తుంది. 3) సహనం, శాంతియుత మార్గంలో ఇతరులను ఒప్పించడానికి ప్రాధాన్యమిస్తుంది. 4) వ్యక్తి గౌరవాన్ని పరిరక్షించడానికి హామీ ఇస్తుంది. 5) వాక్ స్వాతంత్ర్యం, ప్రకటన స్వాతంత్ర్యం, సభలు, సమావేశాలు జరుపుకొనే స్వేచ్ఛలకు హామీ ఇస్తుంది. 6) స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం అనే సూత్రాల ప్రాతిపదికపై ఇది నిర్మితమై ఉంటుంది. 7) ప్రజాస్వామ్యంలో సార్వభౌమాధికారం ప్రజలకే ఉంటుంది. 8) ప్రజాస్వామ్యం అంటే అల్పసంఖ్యాకులకు పూర్తి రక్షణ ఉన్న అధిక సంఖ్యాకుల పాలన 9) సార్వజనీన ఓటు హక్కుగల ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులు ఏర్పడినదే ప్రజాస్వామ్య ప్రభుత్వం. 10) ప్రజాస్వామ్య ప్రభుత్వం లిఖిత లేదా అలిఖిత రాజ్యాంగ సూత్రాలననుసరించి పనిచేస్తుంది. 11) దేశ ప్రజలందరికీ తగిన అవకాశాలు ఇస్తుంది. అందరికీ న్యాయం చేకూరుస్తుంది. 12) ప్రజాస్వామ్య ప్రభుత్వం అధిక సంఖ్యాకుల ప్రభుత్వమే అయినా అందరి సంక్షేమమే దాని లక్ష్యమై ఉంటుంది. 13) రాజ్యాంగబద్ధమైన మార్గాలలో ప్రభుత్వాన్ని మార్చడానికి వీలు కల్పిస్తుంది.

## ప్రజాస్వామ్య రూపాలు

ప్రజాస్వామ్యం రెండు రకాలు (1)ప్రత్యక్ష ప్రజాస్వామ్యం (Direct Democracy) (2) పరోక్ష ప్రజాస్వామ్యం (Indirect democracy)

**(1)ప్రత్యక్ష ప్రజాస్వామ్యం:** దీనిలో ప్రజలు ప్రత్యక్షంగా రాజ్యవ్యవహారాలలో పాలుపంచుకొంటారు-చట్టాలు చేయడం, నిర్వహణ బాధ్యతలు వహించడం వంటివి. ఇలాంటి ప్రజాస్వామ్యం చిన్న చిన్న రాజ్యాలలోనే సాధ్యమవుతుంది. ఇలాంటి రాజ్యాలలో ప్రజలు ప్రత్యక్షంగా ప్రభుత్వ నిర్వహణలో పాలుపంచుకొనే వీలుకలుగుతుంది. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం పురాతన గ్రీకు నగర రాజ్యాలలో కనిపించేది. అయినా స్విట్జర్‌లాండ్‌లోని చిన్న చిన్న క్యాంటన్స్‌లో(Cantons)ఈ నాటికీ కనిపిస్తూనే ఉన్నాయి. ఆధునిక సంక్లిష్ట సమాజాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం కష్ట సాధ్యమనే విషయాన్ని మరువకూడదు.

**(2) పరోక్ష ప్రజాస్వామ్యం లేదా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం** (Indirect democracy or Representative Democracy): ఆధునిక రాజ్యాలు విస్తరణ, జనాభాల విషయంలో చాలా పెద్దవిగా ఉంటాయి. అందువల్ల ప్రత్యక్ష ప్రజాస్వామ్యం దుర్లభమవుతోంది. ఇలాంటి రాజ్యాలలో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం మాత్రమే సాధ్యమవుతోంది. జనాభా అంతాగాని, లేదా కొంతమంది గాని ఒక నిర్దిష్ట కాలానికి ఎన్నుకున్న ప్రతినిధులు రాజ్యాధికారం చేపట్టి ప్రభుత్వం నడుపుతారు. ఇదే ప్రాతినిధ్య ప్రభుత్వమవుతుందని జె.ఎస్.మిల్ వివరిస్తాడు. ప్రతినిధుల గుణదోషాలను వారు పనిచేసే తీరును బట్టి ప్రజలు ప్రతినిధులను నిర్ణయిస్తారు. ప్రతినిధుల తీరు సంతృప్తికరంగా లేదని భావించినప్పుడు వారి స్థానంలో కొత్తవారిని తమ ప్రతినిధులుగా ఎన్నుకోవడం జరుగుతుంది. ఎన్నికయ్యాక ప్రజాప్రతినిధులపై ప్రజలకు ఎలాంటి అధికారం ఉండదు. కొన్ని ప్రజాస్వామ్య రాజ్యాలు ప్రతినిధులపై అదుపు

సాధించడానికి కొన్ని ప్రత్యక్ష ప్రజాస్వామిక నియంత్రణలను(Direct Democratic Checks)లను ప్రవేశపెట్టాయి. అవి:(1) రెఫరెండమ్ (2) రీకాల్ మొదలైనవి. భారతదేశం, యు.ఎస్.ఎ, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జపాన్, ఆస్ట్రియా దేశాలలో పరోక్ష ప్రజాస్వామ్యం అమలులో ఉంది.

## 20.15 నియంతృత్వ వ్యవస్థ

ఈ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి ప్రత్యర్థి వ్యవస్థ. ఈ వ్యవస్థలో అధికారమంతా ఒక వ్యక్తి చేతిలో గాని, ఒక పార్టీ చేతిలోనే కేంద్రీకృతమై ఉంటుంది. దీన్ని సర్వసాధారణంగా నియంతృత్వ వ్యవస్థ అంటారు. ప్రజాస్వామ్యం స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను సమర్థిస్తే నియంతృత్వం వాటిని అణిచివేస్తుంది. న్యూమన్ అన్నట్లు నియంతృత్వ వ్యవస్థ ఒక వ్యక్తికిగాని ఒక పార్టీకి గానీ సర్వాధికారం దత్తం చేస్తుంది. ఏ అడ్డు అదుపు లేకుండా అధికారం చెలాయించడం జరుగుతుంది. నియంత తన చిత్తం వచ్చినట్లు ఆజ్ఞలు జారీ చేసి నిరంకుశంగా వాటిని అమలు చేస్తాడు. తన అధికారం బలోపేతం చేసుకోవడానికి అనుకూలమైన చట్టాలు చేస్తాడు. రాజ్యయంత్రాంగాన్ని ఉపయోగిస్తాడు. తన పాలనను విమర్శించే ప్రత్యర్థి వర్గాన్ని అణగదొక్కుతాడు. ప్రజాస్వామ్యం సమ్మతి పై ఆధారపడి పనిచేస్తే నియంతృత్వం బలప్రయోగంపై ఆధారపడి పనిచేస్తుంది.

సమాజంలో క్రమం లోపించినప్పుడు, లేదా విచ్ఛిన్నమైనప్పుడు, సంక్షోభం తలెత్తినప్పుడు నియంత అధికారాన్ని హస్తగతం చేసుకొని నిరంకుశపాలన ప్రారంభిస్తాడు. అతని మాటే ప్రజలకు శిరోధార్యమవుతుంది. అధికార ధిక్కారాన్ని తీవ్రంగా అణిచివేయడం జరుగుతుంది. నియంతృత్వం, చట్టబద్ధతల మధ్య ప్రతివాదాన్ని(anti-thesis)గ్రీకుల నగర రాజ్యాల కాలంలోనే గుర్తించడం జరిగింది.

నియంతృత్వం అనేది హఠాత్తుగా తలెత్తే వ్యవస్థ. ఇది సంప్రదాయం నుంచి వైదొలగిన దానికి ప్రతీక. సమాజం సంక్షోభంలో చిక్కుకొన్నప్పుడు పరస్పరం వ్యతిరేకిస్తున్న, ఘర్షణ పడుతున్న నరవర్గాలు(ethnic groups), మత సమూహాల మధ్య సామరస్యం కరువై, క్రమబద్ధత సాధ్యం కాదు. అలాంటి కల్లోల సమయంలోనే నియంతృత్వ పాలనకు అంకురార్పణ జరుగుతుంది. బ్రిటీష్ రాజ్య రాజకీయ చరిత్రలో ఒకానొక సమయంలో సంప్రదాయానికి తిలోదకాలిచ్చిన సమయంలో ఆలివర్ క్రామ్‌వెల్ అనే నియంత అధికారం హస్తగతం చేసుకొన్నట్లుచరిత్ర తెలుపుతుంది. అట్లాగే చారిత్రాత్మక ఫ్రెంచ్ విప్లవ కాలంలో రోబస్పియర్ అనే నియంత అధికారం చేజిక్కించుకున్నాడు. విప్లవానంతర కాలంలో ప్రభుత్వం పగ్గాలు నెపోలియన్ చేతుల్లో చిక్కాయి. అయితే నెపోలియన్ తన నియంతృత్వ పాలనకు రాజ్యాంగ బద్ధత కల్పించాడనే విషయం గుర్తుంచుకోదగ్గ విశేషం. సాధారణంగా ప్రతి నియంత రాజ్యాంగ విరుద్ధంగానే అధికారం చెలాయిస్తాడు. తన మాటే శాసనం. దానిని వ్యతిరేకించే వారికి ఈ వ్యవస్థలో స్థానముండదు.

### నియంతృత్వంలో రకాలు

ఆధునిక నియంతృత్వాన్ని మూడు ప్రధాన రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: (1) ఫాసిస్టు, నాజీ నియంతృత్వం. రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వం ఇటలీ, జర్మనీ దేశాలలో ఈ రకమైన నియంతృత్వం రాజ్యం చేసింది. (2) కమ్యూనిస్టు నియంతృత్వం. ఈ రకపు నియంతృత్వం రష్యా, చైనా దేశాలలో నెలకొంది. (3) మిలటరీ నియంతృత్వం. ఈ తరహా నియంతృత్వం ఇండోనేషియా, పాకిస్తాన్, ఈజిప్టు, బంగ్లాదేశ్, ఇరాన్, ఇరాక్ దేశాలలో ఏర్పడింది. 1919-1939 మధ్య కాలంలో ఇటలీ, జర్మనీ, స్పెయిన్, టర్కీ, సోవియట్ రష్యా, మరికొన్ని ఇతర దేశాలలో ప్రారంభమయింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం చైనా, ఇండోనేషియా, పాకిస్థాన్, బర్మా, సుడాన్, ఈజిప్టు, ఇరాక్ మరికొన్ని దేశాలలో నెలకొన్నాయి.

### నియంతృత్వం తాలూకు ఆవశ్యక లక్షణాలు

నియంతృత్వ వ్యవస్థ యావత్తు ఒక వ్యక్తి లేదా ఒక పార్టీ అధీనంలోనే ఉండటం, సర్వాధికారాలు వారి చేతిలోనే కేంద్రీకృతమై ఉంటాయి. ఇలాంటి వ్యవస్థలలో కొట్టవచ్చినట్లు కనిపించే లక్షణాలు:



BRAOU

(1) వ్యక్తి స్వాతంత్ర్యం ఉండదు. (2) పత్రికా స్వాతంత్ర్యం శూన్యం (3) రాజ్యం, ప్రభుత్వాల మధ్య ఎలాంటి తేడా చూపడం జరగదు. నియంతే ఈ రెండు వ్యవస్థలకు ప్రతినిధిగా ఉంటాడు. రాజ్యం కోసం వ్యక్తి త్యాగం చేస్తాడు. హిట్లర్ నియంత దృష్టిలో పౌరుల విధిగా సేవ చేయడం (4) నియంతృత్వ వ్యవస్థ అంతర్జాతీయ తత్వానికి విరుద్ధం. వ్యక్తి ప్రస్తుతీకరణకు, స్వోత్కర్షకే ప్రాధాన్యమివ్వడం జరుగుతుంది.

## 20.16 సంక్షేమ రాజ్యం

డి.ఎల్.హాచ్ మ్యాన్ సంక్షేమ రాజ్యాన్ని ఈ విధంగా నిర్వచించాడు. కమ్యూనిజం, పట్టపగ్గాలు లేని వ్యక్తి వాదం అనే రెండు తీవ్ర రాజకీయ వ్యవస్థ రూపాల సామరస్య రూపమే సంక్షేమ రాజ్యం.

సంక్షేమ రాజ్యం అంటే వ్యక్తులు తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి, తమ శక్తియుక్తులకు తగిన గుర్తింపు, పారితోషికం లభించడం, ఆకలి బాధలు లేకుండా తమ సుఖసంతోషాల కోసం స్వేచ్ఛగా కృషి చేసుకోవడానికి వీలుండటం, జాతి, వర్ణ, తెగ వివక్ష ఆధారంగా అణిచివేతకు గురికాకుండా ఉండటం సాధ్యమయ్యే రాజ్యవ్యవస్థ సంక్షేమ రాజ్యమని హెర్బర్ట్ హెచ్. లేహ్‌మాన్ అంటాడు. పౌరులందరికీ కనీస జీవన ప్రమాణానికి హామీ ఉన్న, అవకాశాలున్న సమాజమే సంక్షేమ రాజ్యమని జి.డి.హెచ్.కోల్ భావిస్తాడు. రాజ్యంలోని పౌరులందరికీ ఒక నిర్దిష్ట స్థాయి ఉద్యోగిత, ఆదాయం, విద్య, వైద్య సదుపాయాలు, సామాజిక భద్రత, గృహవసతి కల్పించ సంకల్పించిన రాజ్యమే సంక్షేమ రాజ్యమవుతుందని ఆర్థర్‌షెల్ సింగర్ అభిప్రాయపడ్డాడు.

పై నిర్వచనాలు పరిశీలిస్తే ప్రజల సుఖశాంతుల అభివృద్ధి ధ్యేయంగా పెట్టుకొన్న రాజ్య వ్యవస్థయే సంక్షేమ రాజ్యమని స్పష్టమవుతుంది. గిన్‌బర్ట్ పేర్కొన్నట్లు ప్రజలకు సామాజిక సేవలు అందించడానికి ముఖ్యమైన పరిశ్రమలను ప్రభుత్వ అధీనంలోకి తేవడం ప్రయివేట్ పరిశ్రమలపై కొన్ని నియంత్రణలు విధించడం, జాతీయ స్థాయిలో దేశాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడం వంటి బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధపడే ప్రభుత్వ విధానమే సంక్షేమ రాజ్యమవుతుంది. సంక్షేమ రాజ్య లక్షణాలు ప్రధానంగా ఆర్థిక రంగానికి పరిమితమై ఉంటాయి. సమాజంలోని అభాగ్యులకు, అల్పాదాయ వర్గాలకు తగినంత ఆదాయం సమకూర్చడానికి ఆదాయ సంపదల పున: పంపిణీ చేయాల్సిన వస్తువులు, రాజ్యంలోని ఆదాయ అసమానతలను పన్నుల విధానం ద్వారా తగ్గించి జాతీయ ఉత్పత్తిని పెంచడానికి రాజ్యం ప్రయత్నిస్తుంది.

BRAOU

### సంక్షేమరాజ్య విధులు

ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలు కావచ్చు, నియంతృత్వం కావచ్చు, కమ్యూనిస్టు లేదా సోషలిస్టు వ్యవస్థలు కావచ్చు, రాజరికం లేదా స్వల్పజనపాలన కావచ్చు - అన్నింటి లక్ష్యం ప్రజాసంక్షేమంగానే ఉంటున్నది. అవి సంక్షేమ రాజ్యాలుగానే ప్రకటించుకుంటున్నాయి. ఆధునిక రాజ్యాలన్నీ ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచడానికి, శాంతి సౌభాగ్యాలు ప్రజలకు కల్పించడానికి కృషి చేయడానికి కంకణం కట్టుకొంటున్నాయి. సంక్షేమరాజ్య విధులను కింద పేర్కొనడం జరిగింది: 1) దేశంలో శాంతి భద్రతలు కాపాడడం 2) ప్రజల హక్కులు కాపాడడం, న్యాయం చేకూర్చడం 3) జాతీయ వనరులు పరిరక్షించడం 4) ప్రజలందరికీ విద్యావకాశాలు కల్పించడం 5) ప్రజోపయోగ సేవలు ప్రజలందరికీ కల్పించడం 6) వ్యాపార వాణిజ్యాలను ప్రోత్సహించడం 7) శ్రామిక వర్గాన్ని వ్యవస్థీకరించడం 8) పేదలు, వయోవృద్ధులు, వికలాంగులను పరిరక్షించడం 9) ప్రజారోగ్యం విషయంలో అవసరమైన నిరోధక చర్యలు వైద్య సౌకర్యాలు కల్పించడం 10) ప్రజల విజ్ఞాన వినోదాల కోసం తగిన ఏర్పాట్లు - సినిమాలు, సంగీతం, గ్రంథాలయాలు, ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, బుద్ధి వికాసాల కోసం పోటీలు నిర్వహించడం 11) సమాజంలో సామరస్య వాతావరణం నెలకొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం. సమాజంలోని వివిధ సామాజిక - మత సంస్థలకు చెందిన వారి మధ్య సుహృద్భావం కలిగేట్లు చర్యలు తీసుకోవడం. పైన పేర్కొన్న బాధ్యతలు, విధులను బట్టి చూస్తే సంక్షేమరాజ్యం బాధ్యతలు కేవలం పరిపాలనకే పరిమితం కాక సంక్షేమం, అభివృద్ధి విషయాల సమైక్యతకు కూడా విస్తరించినట్లు అర్థమవుతుంది.

## 20.17 ఆధునిక ప్రభుత్వ విధులు - ప్రస్తుత ధోరణులు

ప్రభుత్వ విధులకు సంబంధించి సమాజశాస్త్రవేత్తలు రెండు విరుద్ధ వాదనలు చేస్తున్నట్టు స్పష్టమవుతుంది. 1) సంపూర్ణ స్వేచ్ఛా విధానం (Laissez-faire) 2) ప్రభుత్వం జోక్యం చేసుకోవడం తప్పనిసరి అనేవాదం. ప్రభుత్వం ప్రజా జీవితంలో ఏ మేరకు జోక్యం చేసుకోవచ్చు అనేదాన్ని ఖచ్చితంగా, ఏక పక్షంగా నిర్ణయించడం కష్టమని సమాజశాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రభుత్వ జోక్యమనేది ఆయా దేశాల సామాజిక సాంస్కృతిక పరిస్థితులను బట్టి నిర్ణయించాలని వారు భావిస్తున్నారు. సంపూర్ణ స్వేచ్ఛా విధానంగానీ, జోక్యం కలిగించుకొనే విధానం గానీ పూర్తి మంచివని, ఏరకం పరిస్థితుల్లో నైనా అవి అవాంఛనీయమైనవని చెప్పడం సరియైనది కాదు. దేశా కాల పరిస్థితులను బట్టి, చేపట్టే కార్యక్రమాలను బట్టి, బహుజన ప్రయోజనం దృష్ట్యా వాటి తులనాత్మక ప్రయోజనాన్ని గుర్తించారు. ఈ అభిప్రాయాలు ప్రముఖ సమాజశాస్త్రవేత్తల రచనల్లో వెల్లడి చేయడం గమనించవచ్చు.

ఆగ్బర్న్ దృష్టిలో సంపూర్ణ స్వేచ్ఛా విధానాన్ని అటు నిరపేక్షంగా సమర్థనీయమైన విధానమనిగాని, అవాంఛనీయమైనదనిగానీ చెప్పడం కష్టం. కూలీ ప్రకారం రాజ్యవిధులను తులనాత్మకంగా పరిశీలించి సరైన విధానాన్ని అనుసరించాలి. సమకాలీన సమాజశాస్త్రవేత్తలనే చాలా మంది ఈనాటి సమాజం ప్రభుత్వం అటు ఆర్థిక రంగంలోనూ, ఇటు సామాజిక రంగంలోనూ జోక్యం చేసుకోవడం అనివార్యమైనంతగా ఎదిగిందని భావిస్తారు. ఈ ధోరణి మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాతకాలం నుంచి ప్రారంభమైంది. ఈ ధోరణి కేవలం ప్రజాస్వామ్య దేశాలకే పరిమితం కాలేదు. నిజానికి ప్రజాస్వామ్య దేశాలు కాని వాటిలోనే నూతన ప్రజాహిత కార్యక్రమాలు ప్రభుత్వాలు చేపట్టినట్టు చరిత్ర స్పష్టం చేస్తున్నది. ఉదాహరణకు సామాజిక బీమా (ఖిళిబీరిఖిజ ıదీరీతిజిఖిదీబీలి) విధానాన్ని మొట్ట మొదట ప్రవేశపెట్టింది సామ్రాజ్యవాద దేశమైన జర్మనీలోనే. అయితే సంక్షేమ ప్రజాస్వామ్య వ్యవస్థలు, నియంతృత్వ వ్యవస్థలలో అమలు తీరు భిన్నంగా ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కోరిక మేరకు అమలు చేయడం జరిగితే - దీన్నే సమ్నర్ "మనందరికోసం" - నియతృత్వాలలో నియంత అధికారాన్ని బలోపేతం చేసుకోవడానికే వీటిని చేపట్టడం జరుగుతుంది.

ఆగ్బర్న్, నిమ్‌కాఫ్‌ల దృష్టిలో ఈనాటి ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను చేపట్టడం ఉన్న యంత్రాగానికే అప్పజెప్పడం ద్వారా గానీ, కొత్త పథకాలకు కొత్త యంత్రాగాన్ని సృష్టించడం ద్వారాగానీ చేయవచ్చు. 1930 నాటి ఆర్థిక సంక్షోభం (Economic Depression) ఫలితంగా ప్రభుత్వ జోక్యం అధికమయ్యింది. సంక్షోభం నుంచి ఆర్థిక వ్యవస్థలను ఉద్ధరించడానికి, దిగజారుతున్న ప్రజా జీవితాలను పునరుద్ధరించడానికి ప్రభుత్వాలు పెద్దఎత్తున జోక్యం చేసుకొని ప్రజాహిత కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఆర్థిక పునరుజ్జీవనకు సంబంధించిన నిర్ణయాధికారం ప్రభుత్వం చేతుల్లోనే కేంద్రీకృతమైంది. ఈ కేంద్రీకరణ అధికమవడం ఆనాటి నుంచే మొదలైందని చెప్పవచ్చు. యుద్ధాలు, ఆర్థిక సంక్షోభం వంటివి ప్రభుత్వ బాధ్యతలను ఎంతో పెంచాయి, ప్రజా జీవితంలో ప్రభుత్వ జోక్యాన్ని అధికం చేశాయనడం నిర్వివాదాంశం.

ప్రభుత్వం పాత్ర తీవ్రం కావడాన్ని - ముఖ్యంగా అమెరికా ఇంగ్లండ్ దేశాలలో - " The Rise of the Common Man " లో సి. ఆర్. ఫిష్, " Social Control Through Law " లో రాస్కో పౌండ్‌లు వివరించారు. ప్రజా జీవితంలో ప్రభుత్వం ఎంత తక్కువగా జోక్యం చేసుకుంటే ఆ ప్రభుత్వం అంత మంచి ప్రభుత్వంగా గుర్తించడం జరుగుతుందనే వాదన (the government is the best which governs least) బలంగా ఉన్నా అమెరికా ప్రభుత్వం ఆధునిక ప్రజావసరాల విషయంలో మిన్నకుండటం లేదు. అమెరికా మాజీ అధ్యక్షుడు హెర్బర్ట్ వలావర్ కోరిక మేరకు అమెరికాలో ఒక నిపుణుల సంఘం ఒక సర్వే నిర్వహించింది. అది : " Recent Trends in the United States" దీనిలో అనేకమంది సమాజశాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం సంక్షేమ విధులు చేపట్టడంలో ప్రజా జీవితంలో ప్రభుత్వం జోక్యం అధికమవుతుంది. ఇలాంటి ధోరణినే సమాజశాస్త్రవేత్తలు, 'సామాజికీకరణ' అన్నారు. ఈ ధోరణి ఏ అవరోధాలు లేకుండా సాగుతూనే వుంది. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఈ ధోరణి ఇంగ్లండ్ లో తీవ్రత మరింత అధికమైందనే చెప్పాలి. ఈ పరిణామాన్ని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జరిగిన పరిణామమని స్వేచ్ఛా విధానాన్ని సమర్థించే సమ్నర్ పేర్కొంటాడు.

BRAOU

ఈనాడు సోషలిజమ్ వైపే అనేక పశ్చిమ దేశాలు మొగ్గు చూపుతూ ఉండడం (ముఖ్యంగా స్వీడన్ మిశ్రమ ఆర్థిక వ్యవస్థను నెలకొల్పుకోవడం), కమ్యూనిస్టు సోవియట్ యూనియన్‌లో - పెట్టుబడి దారీ విధాన ధోరణులు కూడా కనిపించడం గమనించదగ్గ విషయం.

## 20.18 సారాంశం

ఈ పాఠంలో మత భావన గురించి వివిధ సమాజ శాస్త్రవేత్తల నిర్వచనాలను, మత ఆవిర్భావం తాలూకు సిద్ధాంతాలను వివరంగా పరిశీలించడం జరిగింది. మతం యొక్క నిర్మితీయ అంశాలను, ఈ మధ్య కాలంలో మతానికి సంబంధించిన విభిన్న ధోరణులను తెలుసుకొన్నారు.

రాజ్యభావన ఎంత పురాతనమైందో తెలుసుకొన్న తరువాత రాజ్యలక్షణాలను, రాజ్యావతరణ అభివృద్ధుల తీరును తెలుసుకొని, రాజ్యం విధులను అవగాహన చేసుకోవడానికి వివిధ విధులను విపులంగా చర్చించడం జరిగింది. రాజ్యవ్యవస్థ ఏఏ రూపాలలో ఉంటుంది తెలుసుకొన్నాక వివిధ తరహాల రాజ్యవ్యవస్థల - ముఖ్యంగా ప్రజాస్వామ్యం నియంతృత్వం - తులనాత్మక పరిశీలన చేసి ఆధునిక రాజ్యాలు సంక్షేమ రాజ్యాలుగా రూపు దాల్చడం గమనించారు. రెండు ప్రపంచ యుద్ధాలు, ఆర్థిక మాంద్యం సంక్షేమరాజ్యం ఏర్పడడానికి దారితీసిన విషయం, కేవలం శాంతిభద్రతలు కాపాడటమే రాజ్యం యొక్క ఏకైక లక్ష్యంగా ఉన్న పురాతన భావం, ప్రజా సంక్షేమం - ఆర్థిక, సామాజిక రంగాలలో ఆధునిక రాజ్యల లక్ష్యంగా ఎలా మారింది తెలుసుకొన్నారు.

## 20.19 నమూనా పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులివ్వండి.

1) మతాన్ని నిర్వచించి మతంలోని మౌలికాంశాలను పేర్కొనండి.

2) మత ఆవిర్భావానికి సంబంధించిన ప్రకార్య సిద్ధాంతాన్ని వివరించండి.

II కింది ప్రశ్నలకు 10 పంక్తులలో జవాబులివ్వండి.

1) ఎలియేటరీ అంశం సిద్ధాంతాన్ని క్లుప్తంగా వివరించండి.

2) మతం నిర్మితీయ అంశాలలో ప్రతీకాత్మకత గురించి వివరించండి.

BRAOU


1. William F. Ogburn and Meyer F. Nimkoff — A Hand book of Sociology
2. Paul B. Haurton and Chester L. Hunt — Sociology
3. MacIver and Page — Society - An Introductory Analysis
4. Kimball Young and Raymond W. Mack — Systematic Sociology
5. Samuel Koenig — Sociology -An Introduction to the Science of Society
6. Harry M. Johnson — Sociology - A Systematic Introduction
7. P. Gisbert — Fundamentals of Sociology
8. T.K. Oommen and C.N. Venugopal — Sociology
9. Michael Haralambos — Sociology - Themes and Perspecitves

# భాగం - 21: విద్య-ఆర్థిక వ్యవస్థ

విషయక్రమం

21.0 ఉద్దేశాలు

21.1 పరిచయం

21.2 విద్య అంటే?

21.3 విద్యా ప్రయోజనం: ప్రకార్యవాదం, సంఘర్షణ వాదం

21.4 భారతదేశంలో విద్యావిధానం

21.5 ఆర్థిక కార్యకలాపాలు, రకాలు

21.6 ఆర్థిక వ్యవస్థ-చారిత్రక పరిణామం

21.7 విద్య- ఆర్థికాభివృద్ధి

21.8 సారాంశం

21.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

21.10 చదవదగిన పుస్తకాలు

## 21.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు కింది విషయాలను అవగాహన చేసుకొంటారు.

- భారత దేశంలో విద్యావిధానం తీరు ఎట్లా ఉంది.
- ఆర్థి కార్యకలాపాలు అంటే ఏమిటి? వాటిలో రకాలు ఏమిటి?
- ఆర్థిక వ్యవస్థలోని రకాలతో బాటు విద్య, ఆర్థికాభివృద్ధికున్న సంబంధం.

## 21.1 పరిచయం

ఏ వ్యక్తి అయినా తన బాల్యం, యవ్వన దశలలో దాదాపు 15,000 గంటల కాలం విద్యాలయంలోను గడుపుతాడని నిపుణులు తేల్చారు. ఔపచారిక విద్యా విధానం (formal education system) సామాజికీకరణలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. సామాజికీకరణ నిరంతరాయంగా సాగే ప్రక్రియే అయినా వ్యక్తి వికాసంలో విద్య బోధన, జ్ఞాన సముపార్జన నియత విధానంలో కొనసాగడమనేది సామాజికీకరణ ప్రక్రియలో ఒక ముఖ్యమైన అంతర్భాగంగా గుర్తించడం జరుగుతుంది. పాఠశాల వెలుపల-కుటుంబంలో, పనిచేస్తున్న స్థలంలో, విశాల సమాజంలో-సామాజికీకరణ కొనసాగుతూనే ఉంటుంది. అయితే నియత విద్య విధానంలో సామాజికీకరణ ప్రణాళికా బద్ధంగాను, ప్రమాణీకరించిన పద్ధతిలోను పాఠశాల వాతావరణంలో సాగుతూ ఉంటుంది. విద్యా విధానాన్ని దేశ ఆర్థిక అభివృద్ధికి అవసరమైన మానవ మూలధనాన్ని (human capital) సమకూర్చే ఒక ప్రముఖ వ్యవస్థగా గుర్తించవచ్చు. ఆర్థికాభివృద్ధికి-ముఖ్యంగా పారిశ్రామికీకరణ చెందిన, చెందుతున్న సమాజంలో-విద్య అనేది ఒక ప్రధానమైన ఇన్ పుట్ లేదా ఉత్పాదకం (input). ఇంతటి ప్రాముఖ్యమున్న విద్యను గురించి మేధావులు క్షుణ్ణంగా పరిశీలించి పరిశోధించి విద్యా ప్రాశస్త్యాన్ని, వ్యక్తి, సమాజాల వికాసానికి విద్య ఆవశ్యకతను గురించి అనేక సిద్ధాంత ప్రతిపాదనలు చేశారు. విద్యకు సంబంధించి రెండు ప్రధానమైన దృక్పథాలు ఉన్నట్లు తెలుస్తుంది. 1) ప్రకార్యవాదం 2)సంఘర్షణవాదం ఈమధ్య కాలంలో వెలుగులోకి వచ్చిన మరో వాదం మెరిటోక్రసీ (Meritocracy). ఈపాఠంలో ఈమూడు సిద్ధాంతాల వివరణతో పాటు పారిశ్రామికీకరణ పూర్వం అనంతర కాలంలో విద్య విధానంలో చోటు

చేసుకున్న, చేసుకొంటున్న వివిధ రకాల మార్పులను చర్చించడంతో పాటు మన దేశంలో విద్య విధానం గురించి కూడా చర్చించడం జరుగుతుంది. విద్య విధానానికి, దేశ ఆర్థిక ప్రగతికి ఉన్న సన్నిహిత సంబంధాన్ని గురించి కూడా ఇందులో చర్చించడం జరుగుతుంది.

## 21.2 విద్య అంటే?

విద్య(Education )అనే మాటకు Educature అనే లాటిన్ పదం మూలం. Educature అంటే పెంచి పోషించడం (bringup). లాటిన్ రచయిత వరో Varro విద్యను, విద్యవేత్తలను గురించి మాట్లాడుతూ ఈవిధంగా అన్నాడు. మంత్రసాని శిశువును ప్రపంచంలోకి తీసుకొని వస్తుంది, నర్స్ శిశువును పెంచి పోషిస్తుంది, ట్యూటర్ శిక్షణ ఇస్తాడు, మాస్టర్ బోధిస్తాడు. అలాగే విద్యార్థి ఇన్ని విధాలుగా జ్ఞాన సముపార్జన చేసి సంపూర్ణ వ్యక్తిత్వం పొందుతాడు. సుశిక్షితుడైన వ్యక్తిగా సమాజంలో తన వంతు పాత్ర నిర్వహించడానికి విద్య ద్వారా యోగ్యత సంపాదిస్తాడు. విద్య అనేది ఒక సమాజ సంస్కృతిని అర్థం చేసుకోవడానికి, పరిరక్షించడానికి పనికి వచ్చే సాధనమే కాక దేశ ఆర్థిక ప్రగతి ప్రక్రియలో సముచిత పాత్ర నిర్వహించడానికి అవసరమైన శిక్షణ కూడా అందిస్తుంది. వ్యక్తి సంపూర్ణ వికాసానికి తోడ్పడేదే విద్య. ఒక వ్యక్తిలో నిగూఢంగా ఉన్న శక్తి యుక్తులను వెలికి తీయడానికి తోడ్పడే సాధనమే విద్య. మనో వికాసం చెందినప్పుడే మానవుడు ఉదాత్త జీవిగా ఉన్నత ఆశయాలతో మానవ జాతి అభివృద్ధికి తోడ్పడమే కాక సృష్టి రహస్యాలను తెలుసుకోగలడు, దాని సౌందర్యాన్ని దర్శించగలడు. ఇంతటి మహత్తర శక్తి గలది విద్య. అందుకే విద్యా విధానంలో ఎప్పటికప్పుడు దేశ కాల పరిస్థితులను బట్టి మార్పులు చేర్పులు జరుగుతున్నాయి, జరుగుతూ ఉంటాయి కూడా.

ఆధునిక కాలంలో విద్యకు ప్రతి దేశంలోను అపారమైన ప్రాముఖ్యం లభిస్తోంది. విద్య అంటే నైపుణ్యం గల అధ్యాపకులు జ్ఞానాన్ని, నైపుణ్యాలను ఒక క్రమబద్ధీకరించిన నియత ప్రక్రియ ద్వారా అందించడం అని థామ్సన్ ఎ.సలివాన్, కెండ్రిక్. ఎస్. థామ్సన్ నిర్వచించారు. 'వారి జీవిత ఆదర్శాలకు అనుగుణంగా భావితరాల వారిని తీర్చిదిద్దడానికి సమాజంలోని పెద్దలు చేసే ప్రయత్నమే విద్యఅని జేమ్స్ వెల్టన్ (James welton)ఎన్సైక్లోపీడియా బ్రిటానికాలో నిర్వచించారు. ఇలాంటి ప్రయత్నం అక్షరాస్య పూర్వ సమాజాలలో(preliterate society) ను నాగరిక సమాజాలలోను కనిపిస్తుందని వెల్టన్ పేర్కొన్నాడు. విద్యా తాలూకు నిర్వచనాలను పరిశీలించిన తరువాత విద్య ద్వారా సమకూర్చే ప్రయోజనాలను గురించి, సమాజం, దేశ ఆర్థికాభివృద్ధి, సమాజిక సమత (social equality) సమాకూర్చడంలో విద్య నిర్వహించే పాత్రను నిపుణులు లోతుగా పరిశీలించి కొన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఇవి స్థూలంగా రెండు రకాలు: 1)ప్రకార్యవాదం, 2)సంఘర్షణ వాదం. ఈరెండు వాదాలను వివరంగా పరిశీలించి ఈరెండింటిని తులనాత్మకంగా, విమర్శనాత్మకంగా వివరించడానికి ప్రయత్నిద్దాం.

## 21.3 విద్య: ప్రకార్యవాదం దృక్పథం

సరియైన జ్ఞానాన్ని అందివ్వడం సార్థకమైన ఆర్థికాభివృద్ధికి, మెరిటోక్రటిక్ సమాజ ఆవిర్భావానికి నియత విద్యవిధానం (formal schooling)అత్యంత కీలకమైంది. పారిశ్రామిక వాదంలో వచ్చిన మార్పుల ఫలితంగా సమాజానికి కొన్ని ప్రకార్యాలు నిర్వహించడం తప్పనిసరైంది. వీటిని నిర్వహించినప్పుడే సమాజం బతికి బట్టకడుతుంది, ముందుకు సాగుతుంది. విద్య విధానం ఈ సందర్భంలో కొన్ని కీలక విధులను నిర్వహిస్తుంది. పారిశ్రామిక దేశానికి అవసరమైన మానవ వనరులను అభివృద్ధి చేయడానికి ఉపకరించే సాధనమే విద్య. పారిశ్రామికీకరణ ముందున్న సమాజాలలో వృత్తులు పరిమిత సంఖ్యలో ఉండేవి, కొత్తగా వృత్తి చేపట్టేవారు వారి పెద్దలతో కలసి పనిచేయడం ద్వారా గాని వృత్తి నైపుణ్యం దగ్గర శిక్షణ పొందడం ద్వారా గానీ ఆవృత్తిలోని మెళకువలను తెలుసుకోగలిగే వారు. అయితే పారిశ్రామిక విప్లవం తరువాత వృత్తుల తాలూకు వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటు చేసుకోన్నాయి. అత్యంత నైపుణ్యం అవసరమున్న అనేక వృత్తులు ఏర్పడటం, యాంత్రికీకరణ వల్ల, నూతన సాంకేతిక పద్ధతుల వల్ల వృత్తి బాధ్యతలు నిర్వహించేవారు అత్యంత నైపుణ్యం గలవారై, సమయానుకూలమైన నిర్ణయాలు చేయగల శక్తి మంతులై ఉండవలసిన అవసరం అధికమైంది. ఈపరిణామాలకు తోడు వైట్ కాలర్ White Coller ఉద్యోగాలు, సాంకేతిక, యాజమాన్య బాధ్యతలు

నిర్వహించగల వ్యక్తుల అవసరం ఏర్పడింది. ఈమార్పులకు ప్రతిస్పందనగా విద్యా విధానంలో- పాఠశాల విద్య, ఉన్నత విద్యారంగాలలో- అనేక మార్పులు జరిగాయి. మారిన పరిస్థితుల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పద్ధతులకు సంబంధించిన సంపూర్ణ జ్ఞానాన్ని కల్పించడానికి విద్య ప్రణాళికలను తయారు చేయడం, అధ్యయనానంతరం సాంకేతిక శిక్షణ వసతులు కల్పించడం మొదలైంది. ఈవిధానంలో శిక్షణ పొందినవారు సంక్లిష్ట ఉత్పత్తి పద్ధతులను అతి సులువుగా అవగాహన చేసుకొని అనుసరించగలిగే స్థితికి ఎదిగారు. ఒక మాటలో చెప్పాలంటే పారిశ్రామిక ఉత్పత్తికి అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను సమకూర్చగల విద్య విధానమే సరియైన పద్ధతని భావించడం జరుగుతోంది. మారుతున్న పరిస్థితులకు ప్రతిస్పందనగా రూపొందినదే ఆధునిక విద్యా విధానం.

**ఎంపిక, కేటాయింపు:** ఏవృత్తికి ఎలాంటి శక్తి యుక్తులు కావాలో అటువంటి లక్షణాలున్న వ్యక్తులెవరో గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి బాధ్యతలు నిర్వహించడానికి సమాయాత్త పరచడం విద్య విధానం నిర్వహించే ఒకానొక కీలకమైన పాత్ర. ప్రతిభాపాటవాలున్న వ్యక్తుల ఎంపికకు సంబంధించి విద్య విధానంలో అవపరమైన ఏర్పాట్లు ఉంటాయి. ఉదాహరణకు వివిధ రకాల పోటీ పరీక్షలు- I.A.S., I.P.S. మొదలైనవి. సాంకేతిక శిక్షణా కోర్సులకు విద్యార్థులను ఎంపిక చేయడానికి నిర్వహించే పరీక్షల వంటివి. వివిధ వృత్తి విద్యలలో విద్యార్థులు సాధించిన స్కోరుల ఆధారంగా సంస్థల యజమానులు ఎంపిక చేసుకోవడం సర్వసాధారణం. ఈవిధమైన ఎంపిక పద్ధతి సమాజంలో అసమానతలు ఏర్పడటానికి దోహదం చేస్తుందనే వాదం ఒకటుంది. కాని ఉన్నత ప్రతిభాపాటవాలున్న వారిని సముచితంగా ప్రోత్సహించడం సమాజ బాధ్యతే కాక విధి ఇటువంటి వారిని ప్రోత్సహించడం వల్ల వ్యక్తి, సమాజం రెండు ప్రగతి సాధించడానికి వీలు కలుగుతుంది. ఈపద్ధతిని అనుసరించడం వల్ల ఉద్యోగానికి తగిన వ్యక్తిని ఎంపిక చేయడం సాధ్యమవుతుంది.

**భావితరాలకు విజ్ఞానాన్ని అందించడం:** నూతన తరానికి సమాజపు మౌలిక విలువలకు సంబంధించిన సంపూర్ణ జ్ఞానాన్ని అందివ్వడంలో పాఠశాల అధ్యయనానికి కీలక పాత్ర ఉంది. ప్రమాణీకరించిన విద్యా ప్రణాళికను అనుసరించడం వల్ల విద్యార్థులందరికీ- ఏప్రాంతం వర్గంతో నిమిత్తం లేకుండా- విద్యాదానం చేయడానికి అవకాశం ఉంటుంది.విద్యార్థులందరికీ సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజెప్పే అవకాశముటుంది. భావితరాల వారికి సరియైన జ్ఞానాన్ని అందివ్వగలిగినప్పుడే ఉత్తమ పౌరులుగా వారిని తీర్చిదిద్దడం సాధ్యమౌతుంది. జ్ఞానసముపార్జన అనంతమైంది. జ్ఞానం అపరిమితం గతకాలంలో జరిగిన సంఘటనలు, నిర్వహించిన ఉద్యమాలు, ఉద్యమాలు నడిపిన నాయకులను గురించి సంపూర్ణంగా తెలుసుకొన్నప్పుడే భవిష్యత్ కార్యక్రమాలను సరియైన విధంగా రూపొందించడానికి వీలవుతుంది. గత చరిత్ర భావితరాలకు దిశా నిర్దేశం చేస్తుంది. సమాజ ప్రగతికి అవసరమైన జ్ఞానాన్ని అందివ్వడం పాలకుల విధి. సమాజపు ప్రస్తుత అవసరాలకు, భవిష్యదవసరాలకు అనుగుణమైన జ్ఞాన సంపత్తిని సమకూర్చినప్పుడే యావత్ సమాజం సర్వతో ముఖంగా అభివృద్ధి చెందగలదు. నూతన ఆవిష్కరణకు తోడ్పడే పరిశోధనలు నిర్వహించడాన్ని ప్రోత్సహించే విధంగా విద్యా విధానం ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యంకావడం, ఉజ్జ్వల భవిష్యత్తు ఏర్పరుచుకోవడం జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే విద్య అనేది మహత్తర శక్తిని ప్రసాదిస్తుంది. అందుకే Knowledge is Power అన్నారు.

**సమానావకాశాలు:** జ్ఞాన సముపార్జనాభిలాష ఉన్న ప్రతి ఒక్కరికీ సమానావకాశాలు కలిపించడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం. సమాజంలోని ప్రతి వ్యక్తికీ తన శక్తి సామర్థ్యాలను బట్టి ప్రయోజనం పొంది ప్రగతి సాధించే అవకాశాలు కల్పించడం సమాజం విధి. విద్యార్జన చేసేవారు సాధించిన ఫలితాలు భిన్నముగా ఉండవచ్చు. దీనికి కారణం వారి శక్తి సామర్థ్యాలలో ఉన్న తేడాయే కానీ అవకాశాల లోపం కాదు అని ప్రకార్యవాదులంటారు. సామాజిక గతిశీలతకు, సామాజిక సమానత్వానికి విద్య అనేది ఒక మంచి సాధనం అని వారి అభిప్రాయం.

**ఇతర ప్రకార్యాలు:** ఇది వరకు పేర్కొన్న ప్రకార్యాలే కాక విద్యలయాలు సంరక్షక ప్రకార్యాన్ని(custodial function) కూడా నిర్వహిస్తాయి. పిల్లలు రోజులో దాదాపు 6-7 గంటల కాలం పాఠశాలలోనే గడుపుతారు. ఈసమయంలో విద్యాధికురాలైన తల్లి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి కుటుంబ ఆదాయానికి తోడ్పడటానికి అవకాశముంటుంది. ఈసందర్భంలోనే డేకేర్ సెంటర్‌ల అవసరాన్ని ఎక్కువగా గుర్తిస్తున్నారు.విద్యాలయాలలో

విద్యార్థులు సామాజికీకరణకు సాధనాలుగా కూడా వ్యవహరించడానికి వీలుంటుంది. పిల్లలు నలుగురితో కలిసి మెలిసి 6-7 గంటలు గడపడం ద్వారా అనేక విషయాలు తెలుసుకొనే అవకాశం, ఒకరి అనుభవాలనుంచి మరొకరు ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. అంతే గాక వివిధ కులాలకు, మతాలకు, వర్గాలకు, దేశాలకు చెందినవారు ఒకచోట కలిసిమెలిసి గడపడం వల్ల వివిధ సంస్కృతుల భాషల పట్ల అవగాహన పెంచుకోవడమే కాక సహనశీలతను కూడా అలవరుచుకొనే అవకాశముంటుంది.

విమర్శ: ప్రకార్యావాదాన్ని అనేక కోణాల నుంచీ విమర్శనాత్మకంగా పరిశీలించడం జరిగింది. ఈవాదానికి ఆధారభూతమైన ప్రమేయాలు(assumptions) అనేక సమస్యలకు మూలమని భావించడం జరుగుతోంది. విద్యార్థి విద్యాలయంలో ఆర్జించిన జ్ఞానానికి, భవిష్యత్తులో చేపట్టే వృత్తికి ఏవిధమైన సంబంధము లేని ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. తాను పొందిన సాంకేతిక పరిజ్ఞానం తాను చేస్తున్న పనిలో ఏమాత్రం తోడ్పడకపోవచ్చు. ఉన్నత విద్యార్హతలున్న వ్యక్తి ఒక కార్మాగారంలో పనిచేయడానికి నియమితుడైనప్పుడు అతని ఉత్పత్తి సామర్థ్యం కూడా ఉన్నతంగా ఉంటుందని చెప్పలేము. ఎందుకంటే అతను చదివిన చదువుకు చేస్తున్న ఉద్యోగానికి ఎలాంటి పొంతన లేకపోవడమే. ఉదాహరణకు ఇంజనీరింగ్‌లో పట్టా తీసుకొన్న అభ్యర్థి ప్రభుత్వ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరడం.

ప్రజ్ఞతను బట్టీ వ్యక్తులను ఆయాపదవులకు ఎంపిక చేయడం జరుగుతున్న సందర్భాలలో కూడా ఇతర అర్హతల వల్లే- జాతి, లింగ విభేదాలను బట్టీ- నియామకం జరుగుతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి సందర్భంలో కేవలం విద్యార్హతలే కాక ఇతర అంశాల ప్రాముఖ్యం అధికంగా ఉంటుందనే విమర్శ ఒకటుంది. విద్యాలయాలు అందించే విజ్ఞానం సమాజంలో కొన్ని వర్గాల వారికే అందుబాటులో ఉండటం కూడా ఈనాటి సామాజిక పరిస్థితులలో కనిపిస్తుంది. ప్రస్తుతం విద్యావిధానం కొన్ని అంశాలకే ఇస్తున్న ప్రాముఖ్యం దృష్ట్యా చూస్తే సమాజ సంస్కృతికి సంబంధించిన మౌలికాంశాలను విస్మరించినట్లే కనిపిస్తుంది. నేటి ప్రత్యేకీకరణ వాదం సామాజిక సమస్యలపట్ల, మౌలిక సంస్కృతి పట్ల నిర్లక్ష్య భావాన్ని పెంపొందిస్తుందని విమర్శకులంటారు. ఉదాహరణకు సాంకేతిక విద్యనభ్యసించేవారికి సమాజం గురించి, సమాజిక సమస్యలను గురించి అవగాహన కలిగించడానికి ఏవిధమైన అవకాశాలు లేవనేది విమర్శ కూడా ఉంది.

ప్రస్తుత విద్యా విధానంలో పథుాయిష్టంగా ఉండి యువకులలో నిరుద్యోగితకు మరింత దోహదం చేస్తోందనే విమర్శ ఈనాటి పరిస్థితులను చక్కగా ప్రతిబింబిస్తుంది. దేశ అవసరాలేమిటి వాటి దృష్ట్యా ఎలాంటి శిక్షణ ఇవ్వాల అనే విషయానికి సంబంధించి సక్రమమైన ప్రణాళిక లేదు. అసలే కొరతగా ఉన్న అవసరాలు వ్యర్థమవుతున్నాయని విమర్శకులు అంటారు. ఈమధ్య కాలంలో ఏర్పరచిన అనేక ఇంజనీరింగ్ కళాశాలల్లో పట్టభద్రులైన వారికి తగిన ఉద్యోగావకాశాలు చూపే స్థితిలో సమాజం లేదు అనేది అందరికి తెలిసిన వాస్తవం. అంతర్జాతీయ పరిస్థితులలో ఏర్పడిన విపరీత పరిణామాల ప్రభావం కొన్ని కోర్సులపై స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యంగా కంప్యూటర్ రంగంలో ఇది మరింత స్పష్టంగా కనబడుతుంది.

## విద్య: సంఘర్షణ దృక్పథం

సంఘర్షణావాద దృక్పథం ఆలోచనాధోరణి సంతృప్తికరంగా లేదని విద్య ఆర్థిక వ్యవస్థ, సమాజాల మధ్య ఉన్న సంబధాన్ని ప్రకార్య వాదం సమర్థవంతంగా వివరించలేదు భావించి ప్రత్యామ్నాయ వాదం పట్ల మొగ్గు చూపడం మొదలైంది. ఈవాదమే సంఘర్షణ వాదం. సంఘర్షణవాదం తాలుకూ ప్రసిద్ధమైన నమూనా బవెల్స్, గింటిస్‌లు తమ 'Schooling in Capitalist America' అనే గ్రంథంలో ప్రతిపాదించారు. వీరు కూడా ప్రకార్యవాదుల మాదిరిగానే విద్యా బోధనకు, ఆర్థిక వ్యవస్థకు సన్నిహిత సంబంధం ఉన్నట్లు భావించారు. అయితే పారిశ్రామిక అవసరాలతోనే విద్య విధానానికి సన్నిహిత సంబంధమున్నట్లు వీరు పేర్కొన్నారు. ఆవిధమైన సంబంధమే విద్యా వ్యవస్థ స్వభావ స్వరూపాలను నిర్దేశిస్తుంది.



పెట్టుబడి దారి ఆర్థిక వ్యవస్థలోని సామాజిక సంబంధాల లక్షణం అధికార క్రమానుగతశ్రేణి(hierarchey) ని

అనుసరించి వాటాదార్లు, డైరెక్టర్లు ఒక వర్గంగాను, మేనేజర్లు, ప్రొఫెషనల్, టెక్నికల్ సిబ్బంది, వైట్ కాలర్ వర్కర్లు, మాన్యువల్ ఉద్యోగులు ఒక వర్గంగాను ఉంటారు. అంతేగాక ఈ వ్యవస్థలో నిర్వహించవలసిన బాధ్యతలు విఘటీకరణ (fragmantation) చెందుతాయి. మేనేజర్లు, ప్రొఫెనల్ టెక్నికల్ సిబ్బంది తక్కువ సంఖ్యలోను, మాన్యువల్ వర్కర్లు అధిక సంఖ్యలోను ఉంటారు. ఈ కార్మికులపై ఎక్కువ అదుపు సాధించడం ద్వారా పెట్టుబడిదారు తన లాభాలను అధికం చేసుకోగలడు. ఈ పరిస్థితుల దృష్ట్యానే బవెల్, గింటిస్‌లు ఇలా పేర్కొన్నారు. 'విద్యా వ్యవస్థ పెట్టుబడిదారీ సమాజంలోని ఉత్పత్తి వ్యవస్థను ప్రతిబింబిస్తుంది'. ఉదాహరణకు పారిశ్రామిక ఉత్పత్తి అవసరాల దృష్ట్యానే విద్యా ప్రణాళికను వివిధ ప్యాకేజిలలో అందివ్వడం, విద్యార్థులు జ్ఞానసముపార్జన దృష్టితోకాక గ్రేడులు సంపాదించే దృష్టితోనే విద్యాభ్యాసం చేస్తారు. అందువల్లనే బవెల్స్, గిటిన్‌లు పెట్టుబడిదారీ సమాజంలో పని స్వభావానికి, విద్యాబోధనకు దగ్గరి సంబంధం ఉన్నట్టు పేర్కొంటారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని విద్యావిధానం విద్యార్థుల సృజనాత్మక శక్తిని, విమర్శనాదృష్టిని ప్రోత్సహించడానికి తోడ్పడకపోగా వివిధ వర్గాల విద్యార్థులకు భిన్న రీతులలో విద్యాబోధన జరపడాన్ని ప్రోత్సహిస్తుంది. అమెరికాలోని విద్యాలయాలు, భిన్నవర్గాలకు, ఈ తరహాలకు చెందిన విద్యార్థులకు భిన్నరీతులలో విద్యాబోధన జరుపుతూ ఉండటం గమనించదగ్గ విషయం. అంటే బాలురను, బాలికలను, నల్లజాతివారిని, తెల్ల జాతివారిని, ధనికులను, పేదలను భేదభావంతో, వివక్షతో చూడడం, విద్యాబోధన చేయడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితే మనదేశంలోకూడా కనిపిస్తుంది. సంపన్నకుటుంబాల బాలబాలికలకు ప్రత్యేకించి ఏర్పాటు చేసిన డూన్ పబ్లిక్ స్కూల్ లాంటివాటికి గ్రామీణప్రాంతంలోని పాఠశాలలకు హస్తిమశికరమంత బేధమున్నది. విద్యార్థుల విషయంలో వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని విద్యావిధానం బవెల్స్, గిటిన్‌లు వివరించినట్టుగా సామాజిక అసమానతలకు దారితీస్తుంది. ఇది పెట్టుబడిదారి వ్యవస్థ ప్రధానలక్షణంగా గుర్తించడం జరిగింది. సామ్యవాద వ్యవస్థలో అసమానతలు తొలగించడానికి - సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు తొలగించే లక్ష్యంతోనే విద్యావిధానంలోనూ, విద్యావకాశాలు అందించడంలోను అన్ని వర్గాల వారికి సమానావకాశాలు కల్పించడానికి ప్రయత్నించడం గమనించవచ్చు. ఉదాహరణకు మనే దేశంలో వెనకబడిన కులాలలకు, తెగలకు చెందిన విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పించడం జరుగుతోంది. సామ్యవాద వ్యవస్థలో అందరినీ సమానంగా చూడడం అనేది అతి ముఖ్యమైన విధానం. లక్ష్యం.

B R A O U

విమర్శ: ఇంతవరకు వివరించిన రెండు వాదాలు ఎన్నో విమర్శలకు గురిఅయ్యాయి. ఈ రెండు వాదాలు కూడా రెండు విభిన్న దృక్పథాలతో పెట్టుబడిదారీ వ్యవస్థలోని సామాజిక సంబంధాల ప్రాతిపాదిక, సామ్యవాద సమాజాల సమతాభావం ప్రాతిపదికగా - వివరించాయి. విద్యావిధానానికి సామాజిక సమతకు, ఆర్థిక వ్యవస్థకు ఉన్న సంబంధాన్ని ఈ రెండు వాదాలు సమగ్రంగా వివరించలేకపోయాయనే విమర్శ ఉంది. ప్రకార్యవాదులు విద్యావిధానం వ్యక్తులకు గతిశీలత పెంచుకొనే అవకాశాన్ని కల్పిస్తుందని భావించగా, సంఘర్షణ వాదులు నిర్మితీయ సామాజిక అసమానతలు పెంచి పోషించడానికి దోహదం చేస్తుందని భావిస్తారు. ఈవిషయాలను కారబెల్, హాల్‌సే లు తమ గ్రంథం 'Power and Ideology in Education', 1977లో సమగ్రంగా చర్చించారు.

## మెరిటోక్రసీ

విద్యావిధానానికి సంబంధించి కాలానుగతంగా వెలువడిన రెండు ప్రధాన దృక్పథాలను - ప్రకార్య సంఘర్షణవాదాలు -గురించి తెలుసుకొన్నాక ఈ మధ్యకాలంలో ప్రాచుర్యంలోకి వస్తున్న వాదాలలో ముఖ్యమైనది. మెరిటోక్రసీ లేదా ప్రతిభావాదం (meritocracy). ఈ వాదంలో ప్రకార్యవాదులు అభిప్రాయాలను పొందుపరిచినా ప్రతిభకు పట్టం కట్టడం స్పష్టంగా కనిపిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం నాటివరకూ సామాజిక గతిశీలత విషయంలో విద్యకున్న ప్రాముఖ్యం పరిమితమే అనేది నిపుణుల అభిప్రాయం. విద్యాసంస్కర్తలు, సమాజశాస్త్రవేత్తలు వివృత సమాజానికి(open society) విద్యారంగంలో అందరికీ సమానావకాశాలు కల్పించడం అత్యంత కీలకమైనదని భావంచడం ప్రారంభమైంది. ఈ ఆలోచనాధోరణి ఫలితంగా ప్రతిపాదితమైందే ప్రతిభావాదం. ఏ సమాజమైనా ప్రతిభకు ప్రాధాన్యమిచ్చే సమాజంగా గుర్తింపు పొందాలంటే ఆ సమాజానికి రెండు

ప్రధానమైన లక్షణాలుండలి. అవి: 1. వృత్తిపరమైన అంతస్తు: వృత్తిపరంగా లభించే పారితోషికాలు ఒక వ్యక్తి విద్యార్హతల ఆధారంగా జరగాలేకానీ వ్యక్తి తాలూకు ఆపాదిత లక్షణాల -లింగం, కులం, వర్గం, జాతి - ఆధరంగా కాదు. 2. విద్యావిషకంగా సాధించిన విజాయాలన్నీ ప్రతిభపైనే ఆధారపడి ఉండలి. విద్య విషయంలో సమానావకాశాలు ఉండాలి. సమాన ప్రతిభగల ఏ వర్గం వారినైనా సమాన ఆధరణకు, పురస్కారానికి అర్హులుగా భావించాలి.

ప్రతిభావాదం, విజయవంతమైందా కాదా అనే అంశాన్ని పరిశీలించడానికి ముందు ప్రతిభావాదానికి సమానావకాశాల వాదానికి ఉన్న సంబంధాన్ని కొంత పరిశీలించాల్సి ఉంటుంది. ప్రతిభావాదం కూడా సామాజిక అసమానత అనివార్యమని గుర్తిస్తుంది. ఈ అసమానత వ్యక్తి ప్రతిభలో కనబడుతుంది. పారిశ్రామిక సమాజాలకలో ప్రతిభకు అదనపు ప్రోత్సాహకాలు అందివ్వడం సహజం. ఈ వాదాన్ని హెరిన్‌స్టీన్ (Herrin stein -1973) తన 'I.Q in the meritoquacy' లో విపులంగా చర్చించాడు. ప్రకార్యవాదం ప్రతిపాదించే స్తరీకరణ సిద్ధాంతాన్నే మెరిటోక్రసీకూడా కొంతవరకు బలపరుస్తుంది. అయితే ఈ వాదం కూడా వృత్తిపరమైన ప్రతిభకే అధిక ప్రాముఖ్య ఇస్తున్నట్టు కనబడుతుందే కానీ సంపద పంపిణీ వల్ల వచ్చే అసమానతలను విస్మరిస్తుంది. ప్రతిభావాదం కూడా నిర్మితీయ సామాజిక అసమానతలను విస్మరిస్తుంది. ప్రతిభావాదం కూడా నిర్మితీయ సామాజిక అసమానతను (structured social inequality) గుర్తిస్తుంది. ఈ వాదం ప్రముఖంగా తెలిపేదల్లా పారితోషికం కోసం జరిగేపోటీలో సమానావకాశాలు కల్పించడమే. పోటీలో పాల్గొనడానికి కల్పించే అవకాశాలలో సమానత కనిపిస్తుందే కానీ పారితోషికం విషయంలో ప్రతిభకే ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది.

సామాజిక అసమానతలు తీవ్రంగా ఉన్న సమాజాలకు సంబంధించి ఈ వాదం అంత అభిలషణీయం కాకపోవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో తరతరాలుగా సామాజిక అణిచివేతకు, వివక్షకు గురి అయిన వర్గాలకు, ప్రత్యేక సదుపాయాలు కల్పించవలసిన సామాజిక బాధ్యత ప్రజాప్రభుత్వాలకు ఉంది. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన కులాల సముద్ధరణ విషయంలో ప్రతిభకే అధిక ప్రాధాన్యం ఇవ్వకుండా వెనుకబడిన తనానికి అధిక ప్రాధాన్యమిచ్చి ప్రత్యేక విద్యా, ఉద్యోగావకాశాలు కల్పించడం తప్పనిసరి అవుతోంది. భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామాజిక అసమానత ఒక చారిత్రక అంశం. ఈ అసమానతను తొలగించడానికి ప్రత్యేక అవకాశాలు కల్పించడం అనివార్యం అవుతోంది. కేవలం సమానావకాశాలు కల్పించడం ద్వారానే ఈ అసమానతలు తొలగించడం సాధ్యపడదు. సమానావకాశాలు కల్పించడంతోపాటు విద్య, ఉద్యోగాలలో కొన్ని మినహాయింపులు, కొన్ని ప్రోత్సాహకాలు కల్పించడం తప్పనిసరి. సామాజిక న్యాయం చేకూర్చాలంటే ఈ విధానం అనుసరించక తప్పదు. అంతమాత్రాన ప్రతిభకు గుర్తింపు లేదని భావించకూడదు.

## 21.4 భారత దేశంలో విద్యావిధానం

భారత దేశంలో వేద ఉపనిషత్‌కాలలనుంచీ విద్యాబోధనకు తగిన ప్రాముఖ్యం ఉంటూనే ఉంది.గురు శిష్యుల సంబంధాలను అతి పవిత్రమైన సంబంధాలుగా పరిగణించి గురుకులాలలో విద్యనభ్యసించేవారు. ఇంతటి చరిత్ర ఉన్న భారతదేశంలో విద్యావిధానంలో అనేక మార్పులు జరుగుతూ వచ్చాయి. బ్రిటిష్ పాలన భారతదేశవిద్యావిధానంలో ఒక ముఖ్యఘటాన్ని సూచిస్తుంది. బ్రిటిష్ పాలకులు తమ పరిపాలనావసరాలను దృష్టిలో ఉంచుకొని భారతీయ విద్యావిధానంలో అనేక మార్పులు చేశారు. ఈ మార్పులకు ఆద్యుడు మెకాలే. భారతీయులను కేవలం కార్యాలాలలో గుమాస్తాలుగా తయారుచేయడమే ఆనాటి బ్రిటిష్ పాలకుల ముఖ్య ఉద్దేశ్యం. ఈ విద్యావిధానం దాదాపు 200 సంవత్సరాలు సాగింది. దేశం స్వతంత్రమయిన తరువాత మారిన అవసరాల దృష్ట్యా విద్యా వ్యవస్థను పునర్నిర్మించే ప్రయత్నం జరిగింది. మారుతున్న పరిస్థితుల దృష్ట్యాను, విద్యావిధానంలో ఎదురవుతున్న సమస్యల దృష్ట్యా అనేక అధ్యయనాలుసంఘాలను నియమించడం జరుగుతూ వసోఉతంది: ఇలాంటి అధ్యయన సంఘాలలో ముఖ్యమైనవి 'University Education Commission, 1948, The Secondary Education Commission 1953, The Education Commission 1962-64' ఈ అధ్యయన బృందాలు అమలులో. ఉన్న విద్యావిధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అందులో ఉన్న లోపాలను

గుర్తించడమే కాక వాటికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తాయి. వీటి సూచనలను ఆయా పంచవర్ష ప్రణాళికల
అమలు చేయడం జరుగూ వచ్చింది.

ప్రభుత్వం నియమించిన వివిధ సంఘాలు, కమిషన్‌లు చేసిన సూచనలలో ముఖ్యమైనవి:

1. ప్రాథమిక విద్యావిధానానికి అధిక ప్రాముఖ్యం ఇవ్వడం.

2. బేసిక్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం

3. సెకండరీస్థాయి విద్యలో సమగ్రమైన మార్పులు చేసి మల్టీపర్పస్ (బహుళార్థ సాధక) పాఠశాలలను నెలకొల్పడం

4. ఉపాధ్యాయులకు తగిన శిక్షణనివ్వడం.

5. కళాశాల, విశ్వవిద్యాలయ విద్యా ప్రమాణాలను పెంచడం

6. మహిళావిద్యకు ప్రాధాన్యమివ్వడం.

7. సాంకేతిక, వృత్తి విద్యా సౌకర్యాలను పెంచడం.

8. గ్రామీణ సంస్థలను, వ్యవసాయ విశ్వవిద్యాలయాలను నెలకొల్పడం.

9. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహించడం.

10. అధ్యాపకుల జీతభత్యాలను, సర్వీసు నిబంధనలను మెరుగుపరచడం.

11. వయోజనవిద్యకు సంబంధించి వివిధ పథకాలను ప్రారంభించడం.

12. 5-14 సంవత్సరాల బాలబాలికలకు నిర్బంధ ప్రాథమిక విద్యావిధానాన్ని అమలుచేయడం.

ఈ మార్పుల వల్ల వయోజన విద్యావ్యాప్తికి అధిక ప్రాధాన&యం లభించడమేకాక విద్యావిధానంలో సమూలమైన మార్పులు రావడం జరిగింది. వెనుకబడిన కులాలకు, వర్గాలకు తగిన ప్రోత్సాహమిస్తూ విస్తృతమైన అవకాశాలను కల్పించడం జరిగింది. దేశాభివృద్ధి కార్యక్రమాల అమలులో విద్యకున్న ప్రాధాన్యాన్ని గురి&ంచి భారత ప్రభుత్వం జాతీయ విద్యావిధానాన్ని ప్రకటించింది. ఈ విద్యావిధానం 1968లో అమలులోకి వచ్చింది. ఈ విధానంలో శాస్త్ర సాంకేతిక రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఈ విధానానికి సంబంధించిన తీర్మానం ఇలా ఉంది.

'సామర్థ్యం, గుణశీలాలు ఉన్న, జాతిసేవ, జాతి అభివృద్ధికి తోడ్పగలిగే యువతీయువకులను తయారుచేయడమే ఈ విద్యావిధాన లక్ష్యం.'

21వ శతాబ్దానికి సంబంధించిన అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి 7వ పంచవర్ష ప్రణాళికలలో పునర్వ్యవస్థీకరించిన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రణాళికలో పేర్కొన్న ముఖ్యమైన అంశాలు ఎ) సార్వజనీనప్రాథమిక విద్య లక్ష్యాలను సాధించడం, బి) 15-35 సంవత్సరాల మధ్య వయస్సులలో నిరక్షరాస్యతను నిర్మూలించడం, సి) వివిధ స్థాయిలలో వృత్తి నైపుణ్యాలను, శిక్షణ సదుపాయాలను పెంపొందించడం, సి) అన్ని స్థాయిలలో విద్యా ప్రమాణాలను పెంచడానికి ప్రయత్నించడం, డి) సాంకేతిక విద్యను ఆధునీకరించడం మొదలైన మార్పులను పొందు పరచడం జరిగింది.

ప్రతీ దేశం తన విశిష్ట సామాజిక- సాంస్కృతిక ప్రత్యేకతను కాపడుకోవడానికి, కాలం విసిరే సవాళ్లను ఎదుర్కోవడానికి అనువైన విద్యావిధానాన్ని రూపొందించుకుంటూనే ఉంటుంది. గత కాలపు అభివృద్ధి ప్రక్రియకు ఒక నూతన దిశానిర్దేశం చేయడం ఎంతైనా అవసరం. వర్తమానపు అవసరాలు, సవాళ్ళకు తగిన విద్యావిధానం అవసరాన్ని గుర్తించే మన జాతీయ ప్రభుత్వం 1986లో ఒక నూతన విద్యావిధానాన్ని రూపొందించింది. ఈనాడు మన దేశం ఆర్థిక, సాంకేతికాభివృద్ధికి సంబంధించి ఒక నిర్దిష్ట దశ చేరుకొంది. మనం ఏర్పరచుకొన్న సాధనా సంపత్తి



BRAOU

ద్వారా లభించే ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేట్లు చూడాల్సిన అవసరముంది. 1986 వరకు ఉన్న విద్యావ్యవస్థను - అన్ని స్థాయిల్లోని వ్యవస్థను - విమర్శనాదృష్టితో సమీక్షించి, వర్తమాన అవసరాల దృష్టితో ఈ విధానాన్ని రూపొందించారు. ఈ నూతన విద్యావిధానంలోని ప్రధానాంశాలు:

1. భారత రాజ్యాంగంలో పేర్కొన్న విలువల ప్రాతిపదికపై నూతన విద్యావ్యవస్థను పునర్నిర్మించడం.

2. ఉన్నత విలువల విషయంలో వ్యక్తులలో నిబద్ధత కలిగేట్టు చేయడానికి, సంపూర్ణ వ్యక్తిని తయారు చేయడానికి సంకల్పించడం.

3. విద్యను దేశాభివృద్ధితో ముడిపెట్టి అవసరమైన విద్యా ప్రణాళికను సిద్ధం చేయడం.

ఈ విద్యావిధానాన్ని గురించి అప్పటి విద్యాశాఖా మాత్యులు ఇలా అన్నారు. "1986 నూతన విద్యావిధానంలో ప్రస్తుత పరిస్థితులు, భవిష్యదవసరాల దృష్ట్యా నూతన భావాలను పొందుపరచడం జరిగింది." ఈ విధానాన్ని సమర్థించిన వారు దీన్ని ఒక నూతన యుగ ఆవిర్భావానికి తీసుకొన్న చరకియగా అభివర్ణించారు. అయితే ఈ విద్యావిధానాన్ని విమర్శించినవారూ లేకపోలేదు.

భారత దేశ రాజకీయలలో ఈ మధ్యకాలంలో చోటుచేసుకొన్న పరిణామాల ప్రభావం విద్యావిధానంపై కూడా పడుతోంది. సాంస్కృతిక జాతీయవాదం 'Cultural Nationalism' ప్రభావం క్రమంగా స్పష్టమవుతోంది. భారతదేశ చరిత్రను తిరగరాయడానికి, చారిత్రక సంఘటనలకు కొత్త భాష్యం చెప్పడానికి ప్రయత్నాలకు గురికావడం, కొన్ని సందర్భాలలో వివాదాస్పదంగా మరడం కూడా జరుగుతోంది.

## 21.5 ఆర్థిక కార్యకలాపాలు - రకాలు

ఏ సమాజమైనా మనగలగడానికి తిండి, బట్ట, నీడ అనేవి అత్యం అవసరం వీటిని ఉత్పత్తి చేసి సమాసమాజ సభ్యుల అవసరాలకు తగ్గట్టు పంపిణీ చేయడం జరుగుతూ ఉంటుంది. ఈ విధమైన ఉత్పత్తి, పంపిణీలకు సంబంధించి ప్రతి సమాజం కొన్ని నియమనిబంధనలను రూపొందించుకొంటుంది. ఉత్పత్తి, పంపిణీల సమాహారమే ఒక సమాజపు ఆర్థిక వ్యవస్థ అవుతుంది. సమాజంలోని వివిధ సంస్థల ద్వారా ఈ కార్యకలాపాలు కొనసాగుతూ ఉంటాయి. ఈ సంస్థలు ఆయా సమాజాల లక్షణాలను బట్టి వివిధ రూపాల్లో ఉండవచ్చు. ఉదాహరణకు కొన్ని సమాజాలలో సమాజానికంతటికీ సంబంధించిన వనరులలో తమ భాగాన్ని అనుభవించడానికి ప్రతీ సామాజికుడికీ హక్కు ఉండవచ్చు. ఇలాంటి సమాజాలో ప్రతీ వ్యక్తి కష్టించి పనిచేయవలసి ఉంటుంది. ఇలా చేయలేని వారిని సమాజం చిన్న చూపు చూడడం కానీ, వెలివేయడంగానీ జరుగుతూ ఉండవచ్చు. అదనపు ఉత్పత్తి సాధించినవారు తాము పండించిన, లేదా ఉత్పత్తి చేసిన దానిని ఇతరులతో పంచుకోవలసిన అవసరం ఉంటుంది. ఇలాంటి సమాజాలలో ద్రవ్యం (money) ఎలాంటి పాత్రా నిర్వహించదు. ఇలాంటి పరస్పర వినిమయ విధానం (reciprocal exchange) మనం ఉంటున్న ఆధునిక ఆర్థిక వ్యవస్థలకు పూర్తిగా భిన్నమైనది. ఆధునిక వ్యవస్థ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ (market economy) ఈ వ్యవస్థలో ద్రవ్యం వినిమయ మాధ్యమం. అంటే ఒక వ్యక్తి తన శ్రమను కొంత ద్రవ్యానికి విక్రయిస్తాడన్నమాట. ఇలా వచ్చిన ద్రవ్యంతో తనకవసరమైన వస్తువులను కొంటాడు. ఈవిధమైన వినిమయ ప్రక్రియ సాగే ఆర్థిక వ్యవస్థల ప్రాతిపాదిక ఒకటే అయినా ఇది వివిధ రూపాలలో కనిపిస్తుంటుంది. ముఖ్యంగా పెట్టుబడిదారీ వ్యవస్థ (capitalist economy), సామ్యవాద ఆర్థిక వ్యవస్థ(socialist economy), మిశ్రమ ఆర్థిక వ్యవస్థ(mixed economy). ఈ మూడు తరహాల ఆర్థిక వ్యవస్థల స్వభావ స్వరూపాలను గురించి విపులంగా తెలుసుకొందాం. ఈ వ్యవస్థల గురించి తెలుసుకునే ముందు ఆర్థిక వ్యవస్థ చారిత్రక పరిణామాన్ని గురించి కొంత తెలుసుకోవడం అవసరం.

## 21.6 ఆర్థిక వ్యవస్థ - చారిత్రక పరిణామం

 మానవ జాతి చరిత్ర తొలి దశే ఆహారసేకరణదశ (food gathering stage). ఈ దశలో ప్రకృతిలో

సహజసిద్ధంగా లభించే వస్తువులను ఏవిధమైన మార్పులూ చేయకుండా సొంత వినియోగానికి ఉపయోగించుకొనేవారు. ఉదాహరణకు తొలిమానవుడు ప్రకృతి అందించే ఫలాలు, జంతు మాంసం వంటి వాటిని ఆహారంగానూ, గుహలు, చెట్టుచేయలను ఆవాసాలుగానూ లేదా బహిరంగ ప్రాంతాలనే నివాసస్థలాలుగాను ఉపయోగించేవాడు. క్రమంగా వీటిని తన అవసరాలకు తగిన విధంగా మార్పులు చేర్పులు చేసి వినియోగించడం మొదలైంది. చిన్న చిన్న ఉపకరణాలను రూపొందించుకొని జంతువులను వేటాడటం, వేటాడిన వాటిని తినడం, భూములను సాగుచేయడం, పండించిన పంటలను ఇతరులతో కలిసి అనుభవించడం జరుగుతూ వచ్చింది. కాలగమనంలో ఉత్పత్తి ప్రక్రియను మరింత అభివృద్ధి పరుచుకొని అవసరాలకు మించిన మిగులును సాధించగలిగిన స్థితికి మానవుడు ఎదిగాడు. ఈ దశలోనే తాను ఉత్పత్తి చేసిన మిగులును తన కవసరమైన వస్తుసేవలను సమకూర్చుకోవడానికి వస్తువులనేవినిమయ మాధ్యమంగా వాడుకోవడం మొదలు పెట్టాడు. ఈ వ్యవస్థనే వస్తుమార్పిడి వ్యవస్థ (barter economy) అని అంటారు. నాగరికత అభివృద్ధి చెందిన కొద్దీ ఆర్థిక వ్యవస్థలో కూడా అనేక మార్పులు చేర్పులు చోటు చేసుకొన్నాయి. వస్తుమార్పిడి పద్ధతి వల్ల అనేక సమస్యలు ఎదురయ్యాయి. వీటి ఫలితంగా ప్రత్యమ్నాయ మార్పిడి విధానాన్ని గురించి ఆలోచించవలసి వచ్చింది. ఈ సమయంలో ప్రవేశించిందే ద్రవ్యం. ద్రవ్యాన్ని వినిమయ మాధ్యమంగా వాడటం ద్వారా తనకవసరమైన వస్తుసేవలను సమకూర్చుకోగలగడం సాధ్యమైంది. ఆర్థిక కార్యకలాపాలు సంక్లిష్టమవుతున్న కొద్దీ ఆర్థిక వ్యవస్థ వివిధ రూపాలు ధరించవలసి వచ్చింది. ఇలా ఆవిర్భవించినవే మూడు ప్రధానమైన ఆర్థిక వ్యవస్థలు - పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ, సామ్యవాద ఆర్థిక వ్యవస్థ, మిశ్రమ ఆర్థిక వ్యవస్థ.

## పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ

ఈ వ్యవస్థలో మూడు ప్రధానమైన లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలే ఇతర ఆర్థిక వ్యవస్థలనుంచీ దానిని వేరుపరుస్తాయి. అవి: 1. ఉత్పత్తి, పంపిణీ సాధనాలన్నీ ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉంటాయి. 2. ప్రజల ఆర్థిక ప్రవర్తనకు మూలం లాభార్జనే అయి ఉంటుంది. 3. ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య సంపూర్ణమైన, స్వేచ్ఛాయుతమైన పోటీ ఉంటుంది. ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంగ్లండ్, పశ్చిమైరోపాదేశాలలో పారిశ్రామిక విప్లవకాలంలో ఉద్భవించింది. ఈ తరహా ఆర్థి వ్యవస్థలో వినియోగదారులకు వస్తుసేవల పరిమాణం, నాణ్యత, ధరలపై నియంత్రణశక్తి ఉంటుంది. సంపూర్ణ స్పర్థ, లాభోద్దేశం వంటి లక్షణాలు నవకల్పనలు (innovations) ప్రవేశపెట్టడానికి ఉద్యమదారులకు (enterpreneurs) అవసరమైన ప్రేరణ కల్పించడమే కాక వారిలోని సృజనాత్మక శక్తిని వెలికి తీస్తుంది. లాభోద్దేశం, స్పర్థ (copitation)ల కలయికను ఆడమ్‌స్మిత్ మార్కెట్ శక్తుల రూపంలోని అగోచరహస్తం (invisible hand)గా అభివర్ణించాడు. ఈ వ్యవస్థలో వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు లభిస్తాయి. ఉద్యమదారులు తాము ఉత్పత్తి చేసిన వస్తువులకు మంచి మార్కెట్ లభించేట్లు వస్తునాణ్యతపైనే దృష్టి కేంద్రీకరిస్తారు.

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను సమర్థించే వారు ప్రభుత్వ జోక్యం ఉండరాదని, మార్కెట్ శక్తులు స్వేచ్ఛగా పనిచేయడానికి వీలుగా ప్రభుత్వజోక్యం కనీసంగా ఉండాలని భావిస్తారు. ప్రభుత్వాలు శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కావాలని వీరి ప్రతిపాదన. అంటే స్వేచ్ఛాయుత మార్కెట్ పెట్టుబడి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ప్రముఖ లక్షణమన్నమాట. ఇలాటి వ్యవస్థలు గుత్తాధిపత్య సంస్థలు(monopolicies) నెలకొనడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. ఈనాడు ప్రముఖ పెట్టుబడిదారీ వ్యవస్థగా పేరుపొందిన అమెరికాకూడా గుత్తాదిపత్య సమస్యలు ఎదుర్కోవలసి వచ్చింది. ఈ కారణంగానే ఏకస్వామ్య సంస్థలను నియంత్రించడానికి అమెరికా ప్రభుత్వం కొన్ని శాసనాలను చేయాల్సి వచ్చింది. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడానికి సబ్సిడీలు, గిట్టుబాటు ధరలు వంటి సదుపాయాలు కల్పించడమే కాక కనీస వేతనాలు, అనెంప్లాయిమెంట్ ఇన్సూరెన్స్, పారిశ్రామిక వివాదాలకు సంబంధించి మధ్యవర్తుల చట్టం వంటి అనేక చర్యలు తీసుకోవలసి వచ్చింది. ఇన్ని ప్రభుత్వ నిబంధనలున్నా అమెరికా ఆర్థిక వ్యవస్థ ఈనాడు ఒక ప్రముఖ పెట్టుబడిదారీ వ్యవస్థగా గుర్తింపు పొందుతుంది.

## సామ్యవాద ఆర్థిక వ్యవస్థ

పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థకు భిన్నమైన, ప్రత్యామ్నాయమైన మరో ఆర్థిక వ్యవస్థ సామ్యవాద ఆర్థిక వ్యవస్థ. ఈ



BRAOU

వ్యవస్థలో ఉత్పత్తి, పంపిణీలను ఉమ్మడిగా - ప్రభుత్వం, ప్రజలు - నిర్వహించడం జరుగుతుంది. ఉత్పత్తి అయిన వస్తువులకు వినియోగదారుల అవసరాల దృష్ట్యా సమానంగా పంపిణీ చేయడం జరుగుతుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి యావత్ 'ఆర్థిక డిమాండ్' (economic demand)పై ఆధారపడి ఉండగా, సామ్యవాద వ్యవస్థలో మానవ అవసరాలపై(human demand) ఆధారపడి ఉంటుంది. ప్రజలకు వస్తుసేవల అవసరం ఉంది కాబట్టే వాటిని ఉత్పత్తి చేయడం జరుగుతుంది. కానీ, లాభోద్దేశంతో కాదు. సామ్యవాదుల దృష్టిలో ఒకరి లాభం మరొకరికి నష్టంగా పరిణమిస్తుంది. అంతేకక లాభోద్దేశం ఒకరిని ఒకరు దోచుకోవడాన్ని ( exploitation) ప్రోత్సహిస్తుంది. ఉదాహరణకు లాభాలు పెంచుకోవడానికి ఉత్పత్తిదారు వేతనాలు తగ్గించడానికి ప్రయత్నిస్తాడు. దీనివల్ల కార్మికుడు నష్టపోతాడు. పారిశ్రామికీకరణ తొలిదశల్లో ఆవిర్భవించిందే సామ్యవాద భావజాలం. ఈ కాలంలో కార్మిక వేతనాలు కనిష్టంగా ఉండేవి. పనిగంటలు అధికంగా ఉండేవి. ప్రమాద పరిస్థితుల్లో, తక్కువవేతనాలకే పిల్లలు పెద్దలు పనిచేయవలసి వచ్చింది. ఇలా పెట్టుబడిదారుల దోపిడీకి సరిఅయిన వారి స్థితిగతులను మెరుగుపరచడానికి ఏర్పడిందే సామ్యవాద ఆర్థిక వ్యవస్థ.

సామ్యవాద భావజాలాన్ని మరింత శాస్త్రీయంగా అభివృద్ధి చేసి కమ్యూనిస్టు వ్యవస్థను ఒకదానిని కార్ల్‌మార్క్స్ రూపొందించాడు. ఈ భావజాలం (ideology)పై ఆధారపడి ఏర్పడిందే ఒకనాటి సోవియట్ యూనియన్, ఇతర తూర్పుయూరప్ దేశాలు. ఈ వ్యవస్థ దాదాపు 70 సంవత్సరాలు పనిచేసింది. చైనా ఇప్పటికీ అతిపెద్ద కమ్యూనిస్టు దేశంగానే కొనసాగుతోంది.

సామ్యవాద వ్యవస్థలో ఏవి ఉత్పత్తి చేయాలి, ఎలా పంపిణీ చేయాలి అనే అంశాలను జాతీయ స్థాయిలోని అధికారులే నిర్ణయిస్తారు. లాభోద్దేశం, వినియోగదారుల డిమాండ్‌లే కీలకమైన అంశాలుగా ఉండినందువల్ల సమాజ ప్రయోజనాల దృష్ట్యానే వస్తుసేవల ఉత్పత్తి పంపిణీలు జరుగుతూ ఉంటాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి అన్ని నిర్ణయాలను సామాజిక విస్తృత ప్రయోజనాల దృష్ట్యానే చేయడం జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఉత్పత్తి, పంపిణీ సాధనాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి. సమాజ సంక్షేమమే జాతీయ ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంటుంది.

## మిశ్రమ ఆర్థిక వ్యవస్థ

ఇంతవరకు చర్చించిన రెండు తరహాల ఆర్థి వ్యవస్థలూ శుద్ధ పెట్టుబడిదారీ (pure capitalism)లేదా శుద్ధ సామ్యవాద (pure socialist) వ్యవస్థలను గురించే తెలియజేస్తాయి. ఈ రెండు వ్యవస్థలలోని లక్షణాలున్న మరో వ్యవస్థ మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. ఈ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలు కొంతవరకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నా అధిక భాగం ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యంలోనే కొనసాగుతాయి. దేశ భద్రత దృష్ట్యా కొన్ని కీలక పరిశ్రమలను ప్రభుత్వమే నిర్వహిస్తుంది. ఉదాహరణకు రక్షణావసరాలు, రవాణా కమ్యూనికేషన్‌లు వంటివి. ఈ వ్యవస్థలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెంటూ ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటాయి. ఏరంగం ఎంత మేరకు పాల్గొనాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. దేశకాల పరిస్థితులను బట్టి ఈరెండింటి వాటాల్లో అనేక మార్పులు జరుగుతూ వస్తున్నాయి. దీనికి భారతదేశమే ఒక చక్కటి ఉదాహరణ. ఒకనాటి ప్రభుత్వ ఆదిపత్యం ఉన్న పరిశ్రమలను ఈనాడు ప్రైవేటు పరం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయినా ప్రైవేటు రంగాన్ని నియంత్రించడానికి, క్రమబద్ధం చేయడానికి ప్రభుత్వానికి నిరపేక్షమైన అధికారం (absolute power) ఎప్పుడూ ఉంటుంది. ప్రభుత్వ లక్ష్యం సమాజ సంక్షేమమే అయి ఉంటుంది. పన్నుల వ్యవస్థ ద్వారా జాతీయ లక్ష్యాలను సాధించడం, జాతీయ వనరులను న్యాయబద్ధమైన రీతిలో పంపిణీ యేయడం ప్రభుత్వ ఆశయాలను సాధించడం జరుగుతుంది. ఈ యంత్రాంగం ద్వారా సమాజంలో అసమానాతలను తొలగించడానికి, సాంఘిక న్యాయం చేకూర్చడానికి వీలుంటుంది. గుత్తాధిపత్య ధోరణులను అదుపు చేయడానికి శాసనపరమైన చర్యలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం చేపడుతూనే ఉంటుంది.

## 21.7 విద్య - ఆర్థికాభివృద్ధి

ఏదేశమైనా అభివృద్ధి సాధించాలంటే ఆదేశ ప్రజలలో అధిక సంఖ్యాకులు విద్యావంతులై ఉండటం అవసరం.



BRAOU

ఆధునిక విజ్ఞానాన్ని దేశాభివృద్ధికి - పరిశ్రమలు, వ్యవసాయం, శాస్త్రసాంకేతిక పరిశోధన వంటి వాటి అభివృద్ధికి అవసరమైన సాంకేంతిక పరిజ్ఞానం, నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలి. ఈ కారణంగానే అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రాథమిక విద్య మొదలుకొని ఉన్నతవిద్య, సాంకేతిక విద్యారంగాల విషయంలో అధిక శ్రద్ధ తీసుకోవడం, ఈ రంగం అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలను సమీక్షిస్తూ, కాలానుగుణంగా మార్పులు చేర్పులు చేస్తూ ఉండటాన్ని గుర్తించవచ్చు.

భారతదేశం పారిశ్రామిక రంగంలో పురోగతి సాధించడానికి శాస్త్ర సాంకేతిక విద్య అవసరం. మన పరిశ్రమలు నడవాలన్నా, కొత్తవాటిని స్థాపించాలన్నా సాంకేతిక నైపుణ్యంగల సిబ్బంది అవసరం అవుతుంది. ఈ సాంకేతిక విద్యను అందించడానికి సాంకేతిక సంస్థలను, విశ్వవిద్యాలయాలను ఏర్పరచి విద్యార్థులను సుశిక్షితులు చేసి భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేవిధంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. పారిశ్రామికాభివృద్ధి రంగంలో స్వావలంబన సాధించాలంటే ఆయా పరిశ్రమలను నడుపగల సాంకేతిక నైపుణ్యం ఉన్న సిబ్బందం అవసరం. ఇందుకు దేశంలోనే సాంకేతిక శిక్షణ ఇవ్వగల సంస్థలు నెలకొల్పడం అత్యంత ఆవశ్యకం. స్వాతంత్ర్యం తర్వాత ప్రణాళికాబద్ధమైన ఆర్థిక అభివృద్ధి విధానాన్ని చేపట్టిన తర్వాత - అంటే పంచవర్ష ప్రణాళికలు ప్రారంభించాక - మన దేశంలో శాస్త్ర, సాంకేతిక విద్యకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుంది. వృత్తివిద్యావ్యాప్తికి నేడు మనం విద్యావిధానంలో ఇస్తున్న ప్రాధాన్యతే ఇందుకు తార్కానం. అయితే మన దేశంలో సుశిక్షితులైన వారికి సరైన ఉపాధి అవకాశాలుగానీ, ప్రోత్సాహంగానీ లేకపోవడంతో విదేశాలకు వెళ్లి అక్కడ ఆయా రంగాలలో కృషి చస్తున్నారు. శాస్త్ర విజ్ఞానాభివృద్ధిని కృషికి ఉపయోగించడంద్వారా శీఘ్రంగా ప్రగతి సాధించవచ్చు. అయితే మన దేశంలో ఆ ప్రయత్నం సంపూర్ణంగా జరగడం లేదని, మానవ వనరులను ఉపయోగించుకోవలసిన స్థాయిలో ఉపయోగించుకోవడం లేదని మాత్రం చెప్పక తప్పదు.

భారత దేశం వ్యవసాయక దేశం. నిన్నమొన్నటి వరకు సంప్రదాయ పద్ధతులనే అనుసరిస్తూ వ్యవసాయం చేస్తూ వస్తున్నారు మన రైతులు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టడం, నూతన ఉత్పాదకాలను (Inputs) - రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు మొదలైన వాటిని ప్రవేశపెట్టడంతో ఈ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. స్వల్పకాలపు పంటలు, సంకరజాతి విత్తనాలు తయారుచేయడం, పంట చీడ, పీడలకు సంబంధించి, క్షేత్ర యాజమాన్య పద్ధతుల గురించి నిరంతరం పరిశోధనలు జరుపుతూండడం జరుగుతుంది. నూతన యాజమాన్య పద్ధతులు, రసాయన ఎరువులు, మేలురకం విత్తనాల వంటి వాటిని రైతులోకానికి అందించి వ్యవసాయ ఉత్పత్తుల పరిమాణాన్ని, నాణ్యతను పెంచడానికి కృషి జరుగుతుంది. ఒకనాడు ఆహారధాన్యాల విషయంలో ఇతర దేశాలపై ఆధారపడిన మన దేశం ఈరోజు ఆహార ధాన్యల విషయంలో స్వయం సమృద్ధి సాధించడమే కాక కొంతవరకు విదేశాలకు ఎగుమతి చేయగలిగిన స్థితికి చేరుకొంది. ఈ రంగంలో సాధించిన ప్రగతి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయరంగానికి అన్వయించడం వల్లనే సాధ్యమయింది. వ్యవసాయ విద్యను ఆధునికీకరించడం, శాస్త్ర పరిశోధనకు ప్రోత్సహించడం, పరిశోధనాక్షేత్రాలలో సాధించిన ఫలితాలను రైతులకు తెలియజేయానికి సంబంధించి ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధే కారణం.పారిశ్రామిక, వ్యవసాయ రంగాల అభివృద్ధి, దేశ సమగ్రాభివృద్ధికి విద్యారంగంలో ప్రవేశపెట్టిన మార్పులే ముఖ్య కారణం. ఒక్క మాటలో చెప్పాలంటే దేశ ప్రగతికి విద్య వెన్నెముక వంటిది.

## 21.8 సారాంశం

విద్య అనేది ఒక సమాజ సంస్కృతిని అర్థం చేసుకోవడానికి, దానిని పరిరక్షించడానికి పనికివచ్చే సాధనం. అంతేగాక ఒక దేశ ఆర్థిక ప్రగతి ప్రక్రియలో సముచిత పాత్ర నిర్వహించడానికి అవసరమైన శిక్షణను కూడా అందిస్తుంది. వ్యక్తి సంపూర్ణ వికాసానికి తోడ్పడటంతో పాటు అతనిలోని నిగూఢ శక్తిని వెలికి తీసేందుకు తోడ్పడే సాధనంగా కూడా ఉపయోగపడుతుందని మనం ఈ పాఠం ద్వారా తెలుసుకున్నాము. ఇంతటి ప్రాముఖ్యమున్న విద్యకు, దాని ప్రయోజనాలకు సంబంధించి రెండు వాదాలు ప్రముఖంగా కనిపిస్తాయి. అవి 1. ప్రకార్యవాదం, 2. సంఘర్షణ వాదం. ఈ రెండు వాదాలలోని వాస్తవికతను, వాటిపై వచ్చిన విమర్శలను కూడా ఈ యూనిట్‌లో



BRAOU

చర్చించడం జరిగింది. అలాగే మన దేశంలో విద్యావిధానంలోని ప్రముఖ అంశాలను గురించి కూడా తెలుసుకోవలసిన అవసరమున్నందున వాటిపై కూడా దృష్టిని సారించడం జరిగింది. సమాజం మనుగడకు అత్యంతావశ్యకమైనది ఆర్థిక కార్యకలాపం. ఇది సమాజము, కాలము, సాంకేతికతను బట్టి వివిధ రూపాలలో ఉండడం సరుగుతూ ఉంటుంది. ఆహారసేకరణతో ప్రారంభమైన మానవుడి ప్రయత్నం నేడు పెట్టుబడిదారీ విధానం వరకూ సాగింది. ఆ క్రమాన్నే ఈ యూనిట్లలో పొందుపరిచాము. వివిధ తరహాల ఆర్థిక వ్యవస్థలను గురించి చర్చించడంతోపాటు విద్యకు ఆర్థికాభివృద్ధికి గల సంబంధాన్ని కూడా క్లుప్తంగా చర్చించడం జరిగింది.

## 21.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.

1. విద్యా ప్రయోజనాలకు సంబంధించి వెలువడిన వాదాలను గురించి చర్చించండి.

2. మెరిటోక్రసీని గురించి విమర్శనాత్మకంగా చర్చించండి.

II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.

1. భారతదేశంలో విద్యావిధానం.

2. విద్య - ఆర్థికాభివృద్ధి

## 21.10 చదవదగిన పుస్తకాలు


Bilton, Tony etal : Introductory Sociology, Mac Millan Press Ltd, London, 1987.

Pascual Gisbert, S.J.: Fundamentals of Sociology, Orient Longman, Mumbai, 1999.

J.C.Aggarwal &

S.P.Aggarwal : National Policy on Education - Agenda for India 2001, Concept Publishing Company, New Delhi, 1989.


BRAOU

# భాగం- 22: సామాజిక నియంత్రణ

విషయ క్రమం

22.0 ఉద్దేశాలు
22.1 పరిచయం
22.2 సామాజిక నియంత్రణ నిర్వచనాలు
22.3 సామాజిక నియంత్రణ - ఏజెన్సీలు
22.3.1 కుటుంబం
22.3.2 విద్య
22.3.3 మతం
22.3.4 ప్రభుత్వం
22.4 సామాజిక నియంత్రణ- మారుతున్న స్థితిగతులు
22.5 సారాంశం
22.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
22.7 చదవదగిన పుస్తకాలు

## 22.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సామాజిక నియంత్రణ అంటే ఏమిటో తెలుసుకుంటారు.
- సామాజిక నియంత్రణ కోసం పనిచేసే వివిధ ఏజెన్సీలను పరిశీలిస్తారు.
- సామాజిక నియంత్రణ మారుతున్న స్థితిగతులను తెలుసుకుంటారు.

BRAOU

## 22.1 పరిచయం

సమాజంలోని వ్యక్తుల ప్రవర్తనను సంపూర్ణంగా అర్థం చేసుకోవలెనంటే సామాజిక నియంత్రణనుగురించిఇ తెలుసుకోవడం చాలా అవసరం. సామాజిక నియంత్రణ గురించిఇ తెలుసుకోకుంటే ఏ సామాజిక వ్యవస్థనైనా కూలంకశంగా అర్థం చేసుకోవడం సాధ్యపడదు. సహజమై ప్రకృతి పరిస్థితుల మాదిరిగానే సాంస్కృతిక పరిస్థితులకు కూడా మానవుడు అనుగుణంగా మారుతూ సర్దుబాటు చేసుకోవలె. అట్లా చేసుకోలేకపోతే మనిషి మనుగడ కష్టంగా రూపొందుతుంది. సంస్కృతి మానవునికి మధ్య ఏర్పడిన అసమయోజనమే. చరిత్రలో అనేక యుద్ధాలకు నాంది అయి కోటానుకోట్ల మానవుల మరణానికి కారణమైంది. అయినప్పటికీ మానవజాతి ప్రకృతి సహజాలైన సంస్కృతికమైన పరిస్థితులను జయించి మనుగడ సాగిస్తూనే ఉంది. దీనికి కారణం మానవునిలో జీవితేచ్ఛ ప్రభలంగా ఉండడమే. జీవిత పోరాటంలో విజయానుభూతుడు కావడానికి తన శరీరబలాన్ని బుద్ధి చాతుర్యాన్ని ఉపయోగించినాడు. మానవుడు ద్వేషాన్ని, ఈర్ష్యను, మోసాన్ని, కరడుగట్టిన స్వార్థాన్ని ఎలా తనలో పెంచుకున్నాడో అట్లాగే సానుభూతి, స్నేహము, పరస్పర సహకారము అన్న గుణాలను కూడా కలిగి ఉన్నాడు. మానవునిలో సక్రమమైనటువంటి ప్రవర్తనను పెంపొందించడానికి ఈ గుణాలు ఎంతో సహకరిస్తాయి. మానవుల ప్రవర్తనను క్రమమైనటువంటి మార్గములో ఉంచడానికి సామాజిక నియంత్రణ ఎంతైనా తోడ్పడుతుంది. సమాజం స్తబ్ధంగా, చలనం లేకుండా ఉండదనేది చారిత్రక సత్యం ప్రకృతిలో మార్పు వచ్చినట్లుగానే సమాజంలో కూడా మార్పులు

రావడం సహజమే. కానీ సమాజంలో సంభవించే మార్పుల వల్ల దాని సమతుల్య స్థితికి భంగం వాటిల్లకుండా ఉండటానికి సామాజిక నియంత్రణ ఎంతైనా అవసరము. సామాజిక నియంత్రణ గురించి అర్థం చేసుకోకుండా ఏ సామాజిక వ్యవస్థనైనా కూలంకషంగా అర్థం చేసుకోలేము. ఆధునిక కాలంలో సామాజిక నియంత్రణ గురించి అర్థం చేసుకోవలసిన అవసరము, ప్రాముఖ్యత ఎంతైనా ఉన్నది. సామాజిక నియంత్రణ సమాజపరంగా జరుగుతుంది. మానవ సమాజంలో వ్యక్తుల చర్యలకు సామాజిక నియంత్రణ హద్దులు లేకపోతే సమాజానికి అనేక నష్టాలు వాటిల్లడం తథ్యం. వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడంలో సమాజం చేసే ఒత్తిడిని సామాజిక నియంత్రణగా పరిగణించవచ్చును.

సమాజ అభివృద్ధి జరుగవలెనంటే, వ్యక్తులు సుఖంగా తమ మనుగడ సాగించుకోవలెనంటే సమాజంలో శాంతితోబాటు క్రమత ఉండడం ఎంతో అవసరం. అనాదినుంచి సమాజంలో ఒక క్రమాన్ని పెంపొందించడానికి అనేక పద్ధతుల ద్వారా కృషి చేస్తూనే వచ్చినారు. వ్యక్తులు భిన్నమైన ప్రవృత్తులను కలిగి ఉంటారు. వ్యక్తులు ఎవరికి తోచిన విధంగా వారు ప్రవర్తిస్తే సమాజంలో సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుంది. కాబట్టి సామాజికంగా వ్యక్తుల ప్రపవర్తన క్రమబద్ధం చేయవలె. దీని కొరకు సమాజం అనేక మార్గాలను అనుసరించి వ్యక్తులను హద్దులలో ఉంచి క్రమబద్ధ జీవన విధానాన్ని పెంపొందిస్తుంది. దీనినే సామాజిక నియంత్రణ అంటారు. సామాజిక నియంత్రణ అనాది నుండి నేటివరకు మానవ సమాజాలలో కొనసాగినప్పటికీ, అది సాటిలేని ప్రాముఖ్యాన్ని వహిస్తూ మార్పులకు లోనవుతూ ఉంది. సాంప్రదాయక సమాజాంలో ఆచారాలు, నమ్మకాలు, విలువలు, మత విశ్వాసాలు సామాజిక నియంత్రణకు సాధనాలుగా పనిచేసేవి. ఆధునిక సమాజంలో జనాబా పెరుగుదల నగరాభివృద్ధి, పారిశ్రామికీకరణ కారణంగా పూర్వపు సామాజిక నియంత్రణ పద్ధతులు సామాజిక క్రమాన్ని సాధించలేవు. అందుచేత ఆచార వ్యవహారాలు, ప్రమాణాలు, సామాజిక విలువలు, ప్రజాభిప్రాయము, మతము మొదలైన సామాజిక నియంత్రణ విధానాలతో బాటు ఆధునిక కాలంలో చట్టాలు, శాసనాలు, న్యాయస్థానాలు, పోలీసుశాఖలు కూడా సామాజిక నియంత్రణ సాధనాలైనాయి.

సామాజిక నియంత్రణకు సంబంధించి విశేషమైన కృషి ఇ.ఎ.రాస్‌తో ప్రారంభమైంది. అయితే అంతకుపూర్వం 1894లో స్మాల్ (Small) మరియు విన్సెంట్ (Wincent)లు తమ "ఇంట్రడక్షన్ టుది స్టడీ ఆఫ్ సొసైటీ" (Introduction to the Study of Society) లో సామాజిక నియంత్రణ (Social Control) అనే పదాన్ని ఉపయోగించినారు. వీరితోబాటు పార్సన్స్, హోమన్స్, నేట్, నాడల్, స్కిన్నర్ మొదలైన వాళ్లు కూడా సామాజిక నియంత్రణ గురించి తమ అభిప్రాయాలను వెల్లడించినాడు. ఇ.ఎ.రాస్ (E.A.Ross) అభిప్రాయం ప్రకారం ప్రతి వ్యక్తిలో స్వతఃసిద్ధంగా కొన్ని మనోభావాలుంటాయి. ఉదాహరణకు అనుభూతి కలిగి ఉండడం., కలిసి మెలసి ఉండటం మొదలైనవి. వీటి వలన వ్యక్తి మిగిలిన వ్యక్తులతో కలిసి మెలసి ఉంటూ తక్కిన వారి సంక్షేమాన్ని కూడా ఆలోచిస్తూ ఉంటాడు. కొన్ని కొన్ని సందర్భాలలో వ్యక్తికి స్వలాబపరమైన ఆలోచనలు, కోరికలు ఏర్పడి పైన చెప్పిన సానుభూతి, కలిసి మెలసి ఉండటం, న్యాయ విచక్షణ మొదలైన భావాలు కలిగి ఆ వ్యక్తి కార్యకలాపాలను నియంత్రణ చేయలేవు. అందువలన సమాజమే కొన్ని మార్గాల ద్వారా వ్యక్తుల ప్రవర్తనకు నియంత్రణ చేసి సమాజంలో క్రమశిక్షణ పెంపొందిచడానికి కృషి చేస్తుంది. యుగ యుగాలుగా సమాజం ఉపయోగించిన నియంత్రన పద్ధతులను రాస్ కింది విధంగా పేర్కొన్నాడు. అవి: 1. ప్రజాభిప్రాయము, 2. నమ్మకము, 3. ఆశయాలు, 4. సామాజిక విలువలు, 5. సామాజిక భ్రాంతులు, 6. సామాజిక ప్రతీకలు, 7. గొప్ప వ్యక్తులు, 8. కళలు, 9. జ్ఞానాభివృద్ధి, 10. మతము, 11. క్రియాకాండ, 12. చట్టము.

## 22.2 సామాజిక నియంత్రణ-నిర్వచనాలు

ఆగ్‌బర్న్, నిమ్‌కాఫ్‌ల (Ogbeem & Nimkoff) ప్రకారంసమాజంలో శ్యాంతిని, వ్యష్ఠి నియమాలను నిర్వహించడానికి సమాజం ఉమపయోగించే ఒత్తిడుల తరహాలే సామాజిక నియంత్రణ

కార్ల్ మార్న్‌హిమ్ రెండు విధాలైన సామాజిక నియంత్రణలను శాంతులను నొక్కి చెప్పారు. ఆయన ప్రకారం సమాజం ఒక క్రమాన్ని కొనసాగించేందుకు అనువుగా మానవ ప్రవర్తనను ప్రభావితం చేసే ప్రయత్నంలో



BRAOU

ఉపయోగించే కొన్ని పద్ధతుల సారాంశమే నియంత్రణ.

మెసివర్ అండ్ పేజ్ సామాజిక క్రమము పొందికతో నిలచి, మనుగడ సాగించడానికి ఉపయుక్తమయ్యే విధానమే సామాజిక నియంత్రణ అని భావించినారు. ఇ.ఎ.రాస్ ప్రకారం సామాజిక నియంత్రణ ఒక సాధనాల వ&యవస్థ. అక్కడ సమాజం తన సభ్యుల్ని ఆమోదింపబడిన ప్రవర్తనా స్థాయిలకు బద్ధులుగా ఉండేటట్లు చూస్తుంది. కింబల్ యంగ్ సామాజిక నియంత్రణను ఒక సమాజం మరొక సమూహం మీదకానీ లేదా సమూహం దాని సభ్యులపైగానీ కొంత మంది వ్యక్తులు ఇతరులపైగానీ క్రీడలకు సంబంధించిన నిర్దేశిత నియమాలను, బలప్రయోగం, బలగం, అవరోధం, సలహా ద్వారా అమలు పరచడం అని నిర్వచించినాడు.

ఇ.సి హేస్ సామాజిక నియమంత్రణ పద్ధతులను రెండు ప్రదా భాగాలుగా విభజించినారు.

1. అధికార పూర్వకంగా ఉండే నియంత్రణ పద్ధతులు. 2. అనుకరణ పూర్వకంగా ప్రతీకాత్మకంగా ఉండే నియంత్రణ పద్ధతులు.

అధికారయుక్తంగా శిక్షించుకోవడం, మెచ్చుకోవడం ద్వారా చేసే పద్ధతికంటే ప్రతీకల ద్వారా అనుకరణ పూర్వకంగా జరిగే నియంత్రణ పద్ధతులే ఉత్తమమైనవని హస్రస్ అభిప్రాయపడినాడు. అతని ఉద్దేశంలో విద్య అన్నినియంత్రణ పద్ధతులకన్నా మిన్నయైనదిగా గుర్తించినాడు. నియంత్రణ పద్ధతులు కుటుంబ సంస్థ ద్వారా బాగా అమలు పరచవచ్చునని అతడు భావించినాడు.

ఫ్రెడరిక్ ఇ. లూమ్లీ నియంత్రణ విధానాలను రెండు తరహాలుగా విభజించినాడు. అవి: 1. బలప్రయోగ పద్ధతి, 2. ప్రతీక పూర్వక పద్ధతి. బల ప్రయోగ పద్ధతులు సమాజంలో సామాజిక నియంత్రణను సాధించడానికి ఉపకరించినప్పటికీ అవే పరమార్థ కారాదని ఇతడు భావిస్తున్నాడు. కేవలం బల ప్రయోగ పద్ధతుల ద్వారానే సమాజంలో క్రమము పెంపొందించడం కష్టసాధ్యమైన విషయం. అందుచేత మానవ సమాజాలు వాటికంటే తక్కువ ఖర్చుతో కూడుకున్నవి, తేలికైనవి, ఉపయోగకరమైనవి అయిన ప్రతీక పరమైన నియంత్రణ పద్ధతులను అభివృద్ధి చేసినాయి.

ప్రతీకపరమైన నియంత్రణ పద్ధతులను లూమ్లే రెండు రకాలుగా విభజించినాడు. మొదటి తరగతిలో బహుమానాలు, ప్రోత్సాహకాలు, మెచ్చుకోవడం, మొదలైనవి ఉన్నాయి. రెండో తరగతిలో విమర్శ, ప్రచారము, భయపెట్టడము మోదలైనవి ఉన్నాయి. ఆలోచనాపరంగా అనాలోచితంగా సమాజం క్రమాభివృద్ధిలో అనేక నియంత్రణ పద్ధతులు అభివృద్ధి చెందినాయని ఇతని అభి&రపాయము. లూథర్, ఎల్. బెర్నార్డ్ సామాజిక నియంత్రణ పద్ధతులను చేతన మార్గాలుగాను, అచేన మార్గాలుగానూ విభజించినారు. అచేతన పద్ధతులలో ఆచారవ్యవహారాలు మొదలైనవి వస్తాయి. చేతన పద్ధతులు సమాజంలో ప్రయత్నపూర్వకంగా అభివృద్ధి చెందినవి. ఉదాహరణకు కోర్టులు, శాసనాలు మొదలైనవి. చేతన పద్ధతులకన్న అచేతన పద్ధతులే ఎక్కువ శక్తివంతమయినవని అతడు అభిప్రాయపడ్డాడు. ఇతడు ఈ నియంత్రణ పద్ధతులను నకారాత్మకము, సకారాత్మకకు అని రెండు తరగతులుగా విభజించినాడు. పోలీసులు, కోర్టులు ప్రయోగించేవి మొదటి తరగతిలోకి, బహుమానాలు, మన్ననలు రెండో తరగతిలోకి వస్తాయి. ఏ పద్ధతుల ద్వారా వ్యక్తులు సామాజిక జీవితం విలువలను అలవాట్లను అనుసరించేటట్లు నేర్పుతారో ఆ పద్ధతుల మొత్తాన్ని సామాజిక నియంత్రణ అని రోసక్ అభిప్రాయపడ్డాడు. 1. ఒక సమూహం మరొక సమూహాన్ని నియంత్రణ చేయడం, 2. సమూహం వ్యక్తులను నియంత్రణ యేయడం, 3. కొందరు వ్యక్తులు మరికొందరు వ్యక్తులను నియంత్రణ చేయడం లే మూడు స్థానాలలో నియంత్రణ జరుగుతూ ఉంటుందని రోసక్ అభిప్రాయపడినాడు.

సామాజిక నియంత్రణ అన్ని సమాజాలలోను, అన్ని కాలలలోను ఏదో ఒక విధంగా కొనసాగుతుంటుంది. అయితే వినియోగింపబడే సాధనాలు సమాజ సంస్కృతిని బట్టి మార్పు చెందుతాయి. సమాజంలో నియంత్రణను సాధించడంలో కొన్ని సంస్థలు ప్రముఖ పాత్ర వహిస్తుంటాయి. వీటిలో కొన్నింటిని సాధనోపకరణలుగాను, కొన్నింటిని ఏజెన్సీలుగాను విభజించవచ్చు. ఏజెన్సీలకు ఉదాహరణలుగా కుటుంబము, విద్య, మతము,



BRAOU

ప్రభుత్వము మొదలైనవాటిని పేర్కొనవచ్చును. సాధనోపకరణలకు ఉదాహరణలుగా సమూహ నియంత్రణ, వ్యవస్థానియంత్రణ, నాయకత్వం, స్థానగత నాయకత్వము, వ్యక్తిగత నాయకత్వము, ప్రచారం, జానపద రీతులు, సామాజిక రీతులు, చట్టాలు లేదా శాసనాలు, తాత్విక సిద్ధాంతాలు, నీతి సూత్రాలు, ఫ్యాషన్లు, సంస్కారాలు, మర్యాదలు, ప్రజాభిప్రాయం, కళ, సాహిత్యం మొదలైన వాటిని పేర్కొనవచ్చు.

## 22.3 సామాజిక నియంత్రణ - ఏజెన్సీలు

మానవుడు సంఘజీవి. తొలుత కుటుంబ సభ్యుడై ఆతరువాత ఇతర సంఘ సభ్యులతో కలిసి జీవించడానికి ఆసక్తి కనబరుస్తాడు. సమాజమేర్పరచిన కట్టుబాట్లకులోనై జీవిస్తాడు. కానీ కొన్ని సందర్భాలలో అతను సంఘ వ్యతిరేక చర్యలకు పూనుకుంటాడు. అటువంటి ప్రవర్తనను నియంత్రించడానికి, వ్యక్తి ప్రవర్తనను సమాజానికి అనుగుణంగా క్రమబద్ధం చేయడానికి అనేక ఏజెన్సీలు ఉన్నాయి. వాటిని గురించి తెలుసుకుందాము.

మానవుని జీవితం ఆటవికుడుగా ప్రారంభించి నేడు క్రమబద్ధం చేయబడిన కుటుంబ సభ్యుడుగా, పౌరుడుగా సంఘ జీవనాన్ని కొనసాగించే వరకు అనేక సాంఘిక, రాజకీయ, భౌగోళిక, ఆర్థి, వైజ్ఞానికమైన మార్పులకు లోనయ్యాడు. అతని వ్యక్తిగత సామాజిక నియంత్రణలో అనేకమైన మార్పులు ఏర్పడినాయి. ఈ మార్పులకు కొంత కారణభూతమైన కుటుంబము, విద్య, మతము, ప్రభుత్వమును, సామాజిక నియంత్రణ ఏజెన్సీలుగా పేర్కొనవచ్చును. వీటిగురించి ఈ క్రింద విపులంగా చర్చిద్దాము.

### 22.3.1 కుటుంబం

మానవుడు పుడుతూనే సంస్కృతిని వెంటబెట్టుకుని రాడు. తాను పుట్టి పెరుగుతున్నప్పుడు సమాజం నుంచి క్రమేపీ దానిని అతను గ్రహిస్తాడు. దీనినే మరొక విధంగా చెప్పవలెనంటే సమాజమే పసివానిని పుట్టినప్పటినుంచి తగిన రీతిలో మలిచి వారికి సంస్కృతిని అందజేస్తుంది. ఇట్లా చేసే ప్రక్రియనే సాంఘికీకరణఅంటారు. సాంఘికీకరణ ద్వారా ప్రసరించిన సంస్కృతి వ్యక్తి నడవడికలో అంతర్భాగమై ఉంటుంది. దీనికి కుటుంబము అత్యధిక ప్రాధాన్యతను నిర్వహిస్తుంది. వ్యక్తి వివిధ రకాలైన జీవన పద్ధతులను, ప్రవర్తన, సంభాషణ లేదా మాట్లాడటం మొదలైన అనేక అంశాలను కుటుంబంలోనే నేర్చుకుంటాడు. కుటుంబము అతనిలో మంచి, చెడులకు సంబంధించిన విచక్షణా జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. సమాజానికి సంబంధించిన ఆదర్శాలు, విలువలు, ప్రమాణాలు మొదలైనవి కుటుంబము ద్వారా నేర్చుకుంటాడు. ఈవిధంగా సామాజిక నియంత్రణా పద్ధతులను వ్యక్తి అంగీకరించి, పాటనిఇన అనుసరించడం నేర్చుకుంటాడు.

వ్యక్తి తన కుటుంబ గౌరవానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడు. కాబట్టి అది వ్యక్తిని ఎల్లవేళలా ఆలోచించేటట్లు చేసి ఎన్నో అవాంఛనీయ, ఆమోదయోగ్యం కాని చర్యలకు లోనుగాకుండా చేస్తుంది. ఈవిధంగా కుటుంబము సామాజిక నియంత్రణలో ఒక ముఖ్యమైన ఏజెన్సీగా పనిచేస్తుందని చెప్పవచ్చు. గొప్ప గొప్ప వ్యక్తులు కుటుంబ సభ్యుల ద్వారానే ప్రభావితులౌతారు. ఉదాహరణకు శివాజీ తన తల్లి జిజియాబాయి వద్ద ఎన్నో వీరగాధలు విని తెలుసికొని ప్రభావితుడై గొప్ప వీరుడిగా వెలుగొందాడు. మహాత్మాగాంధీ తన తల్లి దగ్గర ఎన్నో నీతిసూత్రాలను నేర్చుకొని ఆర్శంగా పాటించి తన జీవితంలో మహోన్నతుడై విశ్వవిఖ్యాతి గాంచినాడు.

ప్రతీ వ్యక్తి కుటుంబములో శిక్షణ ద్వారా సమాజంలో ఎట్లా మెలగవలెనో తెలుసుకుంటాడు. తన బాధ్యతలనెట్లా నిర్వర్తించవలసి ఉన్నదీ, తన కోర్కెలనే విధంగా తీర్చుకోవలసి ఉన్నదీ, జీవితంలో జరిగే వివిధ సంఘటనల సందర్భంలో ఎట్లా ప్రవర్తించవలసినదీ కుటుంబం ద్వారా వ్యక్తి నేర్చుకుంటాడు. అనాది నుంచి నేటి వరకు కుటుంబ సంస్థ సమాజంలో నియంత్రణ సాధనంగా మానవ సమాజాలలో ప్రముఖ పాత్ర వహిస్తున్నది. కుటుంబ సంస్థ లేకుంటే సమాజంలో సామాజిక నియంత్రణ సాధించడం సాధ్యపడదు. ఆధునిక సంశ్లిష్ట సమాజంలో కుటుంబ వ్యవస్థ అనేక మార్పులకు లోనవుతూ ఉన్నప్పటికీ కుటుంబ సంస్థ నియంత్రణ సాధనంగా పని చేస్తూనే ఉంది.

BRAOU

### 22.3.2 విద్య

రస్కిన్ ప్రకారం "ప్రజలను సంస్కారవంతులు, వినయ విధేయతలు కలవారిగా చేయడానికి ఉపయోగపడేది విద్య అనబడుతుంది". దుర్క్‌హైమ్ విద్యను ఈవిధంగా నిర్వచించాడు. "సామాజిక జీవనానికి ఇంకా సంసిద్ధులు కాని వారి (పసి పిల్లలు) పై గత తరాల వారు అమలు పరిచే చర్య. ఆచర్య ఉద్దేశం ఏమిటంటే మొత్తంగా సమాజం అతడి (ఆబిడ్డ) నుంచి ఆశించే, ఇంకా అతడు ప్రత్యేకంగా ఏమి కావాలని అతడి ప్రత్యేక పరిసరం ఆశించిందో అలా రావడానికి వీలుగా అవసరమయ్యే శారీరక, మానసిక, నైతిక శక్తులను ఆ బిడ్డలో మేల్కొల్పి పెంపొందించడం".

ప్రాచీన సమాజాలలో విద్యను ఒక ప్రత్యేక సామాజిక నియంత్రణ ఏజన్సీగా పరిగణించలేదు గానీ ఆధునిక సమాజాలలో విద్య ఒక ప్రబలమైన ఏజంటు గానే పరిగణింపబడుతుంది. ప్రాచీన మాజాలలో విద్య "జీవన విధానాన్ని" అందిస్తే ఆధునిక సమాజాలలో విద్య నూతన తరానికి నూతన భావాలను, శాస్త్రీయ పద్ధతులను అందిస్తోంది. ఆధునిక సమాజంలో విద్యను సామాజిక నియంత్రణ ఏజన్సీగా గుర్తించారు కనుకనే గత యాభై సంవత్సరాల కాలంలో ప్రపంచం అంతటా విద్యా వ్యాప్తి జరిగింది. మానవుడు కుటుంబంలో , పాఠశాలలో, సంఘంలో, తన కార్యాలయంలో మొదలైన అన్ని చోట్ల విద్య నేర్చుకుంటాడు. వ్యక్తి గుణగణాలు, వ్యక్తిత్వ వికాసం, సంస్కృతి ఆలోచనలు, వ్యవహారిక జ్ఞానం, మెళకువలు, అలవాట్లు ఇంకా ఇతర ప్రాముఖ్యతలేని దైనందిన విషయాలు అన్నీ అతని చదువు మీద ఆధారపడి ఉంటాయి.

ఊహాశక్తిని, ఆలోచనాశక్తిని అభివృద్ధి పరచడమే విద్య ముఖ్య ఉద్దేశం. హెర్బర్ట్ అభిప్రాయం లో నుంచి నడవడిని అలవర్చుకోవడాన్ని మించిన విద్య లేదు. వ్యక్తి బ్రతకడానికి, పెండ్లి చేసుకోవడానికి, పిల్లలను కని పెంచడానికి , సమాజంలో తన బాధ్యత ,విధులు, ధర్మాలు సక్రమంగా నిర్వర్తించడానికి విద్య దోహదం చేస్తుంది.

మానవునికి ప్రకృతి సిద్ధంగా సంక్రమించిన తెలివితేటలు, సామర్థ్యం విద్య ద్వారా ప్రభావితమౌతాయి. అందుచేతనే విద్య వలన మానవుడు సమాజానికి తగిన విధంగా తీర్చిదిద్దబడతాడు. విద్యా ప్రక్రియ సక్రమంగా పని చేయనపుడు సామాజిక నియంత్రణను సామాన్యమైనదిగా ఒక స్వయం నియంత్రణగా తయారు చేస్తుంది.

B R A O U

### 22.3.3 మతము

మానవ సమాజాలలో మతం వ్యక్తుల ప్రవర్తనను నియంత్రణ చేయడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. ఒక మతము మీద నమ్మకమున్న వ్యక్తులు తమ మత సంబంధమైన ఆశయాలను, సిద్ధాంతాలను నమ్ముతూ ఒకే విధంగా ప్రవర్తిస్తారు. ప్రతి మతమూ కొన్ని సిద్ధాంతాలను కలిగి వాటికి కట్టుబడి ఉంటుంది. ఒక మత సిద్ధాంతాలకు మరొక మత సిద్ధాంతాలకే పోలికలు, తేడాలు కూడా ఉంటాయి.

"సామాజిక నియంత్రణలో మతానికి గల ప్రభావం మూలంగా, మానవ సంస్కృతిలో దానికి అధిక ప్రాధాన్యం ఉంది. మతం ముఖ్యమైన ప్రక్రియ యధాస్థితిని బలపరచడం. సమాజాన్ని దాని ఆనవాయితీలనూ అస్తవ్యస్తం చేయబోయే వారిలో దైవభీతి, పాపభీతి కలిగించడం" అని పాల్.ఎచ్.లాండిస్ అన్నాడు. వ్యక్తులు నిజాయితీగా ,సజ్జనులుగా ఉండాలనీ, కోరికలు తగ్గించుకోవాలని, అబద్ధాలు చెప్పకూడదనీ, మోసం చేయకూడదనీ చెప్పే మత బోధనలు మనిషి ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. మతం వల్ల ఆస్తికులు ఉదారులూ, పరోపకారులు, సత్యవాక్కులూ అవుతారు.

ఒక మతాన్ని అనుసరించే వారు ఆమత సిద్ధాంతాలను నమ్ముతారు. భగవంతుడున్నాడని, పాపపుణ్యాల ఫలితాన్ని వ్యక్తి అనుభవించవలసి ఉంటుందని ,స్వర్గ నరకాలున్నాయని నమ్ముతారు. ఈ నమ్మకాల ప్రభావం వ్యక్తుల ప్రవర్తన మీద ఎంతగానో ఉంటుంది. మానవ జాతి క్రమాభివృద్ధి అన్ని దశలలోనూ మతము వ్యక్తుల ప్రవర్తనను తీర్చి దిద్దుతూ వస్తుంది. సమాజంలో గల అన్ని మతాలవారు, వారివారి మత సిద్ధాంతాలను, సూత్రాలను పద్ధతులను నిత్యమూ అనుసరించి ఆచరిస్తూంటారు. ఒక మతాన్ని నమ్మిన వాడు సాధ్యమైనంత

వరకు ఆ మత ఆచారాలకు, నియమావళికి వ్యతిరేకంగా ప్రవర్తించడు. భగవంతుడు శిక్షిస్తాడు, నరకానికి పోవలసి ఉంటుంది. అనే భయం నిత్యమూ వ్యక్తిని మత ఆశయాలకు అనుకూలంగా ప్రవర్తింపజేస్తుంది. కాబట్టి ప్రభుత్వ నియంత్రణ సాధించలేని సందర్భాలలో కూడా మతము నియంత్రణను సాధిస్తుంది.

### 22.3.4 ప్రభుత్వము

ప్రజా జీవితంలో ప్రభుత్వం వహించే పాత్ర చాలా ముఖ్యమైనది. కొన్ని రంగాలలో కుటుంబం, మతము జానపద రీతులు, సామాజిక రీతులు తదితర మార్గాల ద్వారా సాధించలేని సామాజిక నియంత్రణను ప్రభుత్వం సాధిస్తుంది. అనాది నుంచి ప్రభుత్వం సామాజిక నియంత్రణకు ఉపకరిస్తుంది. ప్రభుత్వం పాత్ర ప్రధానంగా సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పి సుస్థిరతను పరిరక్షించడం వరకు పరిమితమై ఉండేది. ఆధునిక యుగంలో రాజకీయ స్థితిగతులలో అనేక మార్పులు సంభవించాయి. ఆధునిక ప్రజాప్రభుత్వాలు సమాజంలో శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా ప్రజల సామాజిక ఆశయాలకు అనుగుణంగా సామాజికాభివృద్ధికి కృషి చేస్తుంటాయి. సమాజంలో అరాచక పరిస్థితులు సంభవించినప్పుడు సమాజాభివృద్ధి జరగదు. అరాచక పరిస్థితులను అరికట్టి పౌర హక్కులను కాపడటంలో సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పడంలో పౌరులు తమ మనుగడను సాగించుకోవడంలో ప్రభుత్వం తోడ్పడుతుంది. మానవ జాతి చరిత్రలో అనేక రకాలైన ప్రభుత్వ వ్యవస్థలు విలసిల్లుతూ వచ్చినాయి. రాచరిక, నియంతృత్వ ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడుతూ వచ్చినాయి. ఏప్రభుత్వమైనా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నియంత్రణ సాధించడానికి కృషి చేస్తుంది. వ్యక్తులు ఎవరి ఇష్ట ప్రకారం వారు ప్రవర్తించిన, సామాజిక వ్యవస్థలు క్షీణించి సామాజిక అవ్యవస్థ ఏర్పడుతుంది. అట్లా ఏర్పడకుండా ప్రభుత్వం శాంతి భద్రతలను నెలకొల్పడానికి కృషి చేస్తుంది. ఆధునిక సమాజంలో ప్రభుత్వం వివిధ రంగాల ద్వారా వ్యక్తుల సంక్షేమం కోసం కృషి చేస్తుంది. పూర్వం నియంత్రణ సాధనకు బాగా ఉపయోగపడిన జానపదరీతులు మొదలైన వాటి ప్రభావితం తగ్గిపోతున్న ఈ రోజులలో ప్రభుత్వం పోలీసు శాఖల ద్వారా, న్యాయస్థానాల ద్వారా క్రమబద్ధ జీవితాన్ని పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర వహిస్తున్నది. అందుచేత ఆధునిక కాలంలో ప్రభుత్వం సామాజిక నియంత్రణను ఏజన్సీగా ఉపయోగపడుతున్నది.

## 22.4 సామాజిక నియంత్రణ: మారుతున్న స్థితిగతులు

పూర్వం మన దేశంలో ఎక్కువ మంది ప్రజలు గ్రామాలలో నివసిస్తూ వ్యవసాయం మీద ఆధారపడి ఉండేవాళ్ళు. ఆనాడు గ్రామాలలో వ్యక్తులకు కావలసిన అన్ని నిత్యావసర వస్తువులను ఇంచుమించు ఉత్పత్తి చేసేవారు. సమిష్టి కుటుంబ వ్యవస్థ బాగా వ్యాప్తిలో ఉండేది. ప్రజలలో కొన్ని నిర్దిష్టమైన మతాభిప్రాయాలు, విలువలు, ఆశయాలు ఉండేవి. అవి వ్యక్తుల ప్రవర్తనను నియంత్రించడంలో చాలా సహాయపడినాయి.

ఈనాడు సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. నగరాల అభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి, రవాణా భావ ప్రసారాల పెరుగుదల మొదలైన వాటిలో గణనీయమైన మార్పులు వచ్చినాయి. సమిష్టి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైనది. జనాభా పెరుగుదల కారణంగా ప్రజలు గ్రామ ప్రాంతాలను వదిలిపెట్టి ఉద్యోగాల కోసం, వ్యాపర నిమిత్తం, ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగ సంస్థలలో పనుల కోసం పట్టణాలకు వెళుతున్నారు. పల్లె ప్రజలు నాగరికతకు అధికంగా లోనౌతున్నారు. గ్రామీణ ప్రజల మధ్య గల సంబంధాలలో విశేషమైన మార్పులు ఏర్పడినాయి. అందుచేత గ్రామాలలో పూర్వం సామాజిక నియంత్రణకు ఉపయోగపడిన పద్ధతులు ఈనాడు ఉపయోగం కావు. పూర్వం రోజులలో గ్రామంలో ఎవరైనా తప్పు చేసిన గ్రామ పెద్దలు పంచాయితీ జరిపి జరిమానా విధించడమో,లేదా శిక్షించడమో జరిగేది. ఈనాడు గ్రామ పెద్దల పాత్ర దాదాపు లేదనవచ్చు. వెనుకటి రోజులలో పని చేసిన సామాజిక నియంత్రణ పద్ధతులు ఈనాడు పని చేయలేకపోతున్నాయి. కేవలం ప్రజాభిప్రాయమే పూర్వ సమాజంలో ప్రముఖమైన పాత్ర వహిస్తూ ఉండేది. సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధమైన మార్పులనేకం గ్రామీణ వ్యవస్థలో సంభవిస్తున్నాయి. తత్ఫలితంగా గ్రామీణ ప్రజల ప్రవర్తన రీతులలో అనేకమైన మార్పులు సంభవించడంలో ఆశ్చర్యమేమి లేదు. అందువల్లనే ఆధునిక కాలంలో చట్టాల ప్రాబల్యం పెరుగుతున్నది. ఈనాడు మన దేశంలో ఉన్న కోర్టులు,శాసనాలు బ్రిటిష్ ప్రభుత్వంలో రూపొందించినవే. శాసనాల ద్వారా నియంత్రణ బాగా



B R A O U

సాధించవలెనంటే ప్రజాభిప్రాయము వాటికి అనుకూలంగా ఉండటమే కాక కోర్టులు వాటికి సంబంధించిన కార్యకలాపాలు సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండవలె.

ఆధునిక కాలంలో సామాజిక సంస్థలన్నిటిలో మార్పులు వచ్చినాయి. పూర్వం మత ఆశయాలననుసరించి ప్రవర్తిస్తుండేవారు. ధర్మార్థకామమోక్షాలనేవి జీవిత పరమార్థాలుగా ఉండేవి. ఆధునిక కాలంలో మతం నియంత్రణను పెంపొందించే స్థితిలో లేదు. శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందే కొద్దీ పూర్వాచార వ్యవహారాలు మటుమాయమవుతున్నాయి. ఆర్థిక, సామాజిక స్థితిగతులు కూడా వ్యక్తుల ప్రవర్తనను ప్రభావితం చేస్తున్నాయి. నూతన దృక్పథాలు వ్యక్తుల ప్రవర్తనను మార్చివేస్తున్నాయి. అనేక నూతన స్థితి గతుల ప్రభావ ఫలితంగా సమాజంలో వ్యక్తుల ప్రవర్తన మారింది. వర్తమాన జీవితం జటిలమై వ్యక్తి అనేక సంఘర్షణలను ఎదుర్కొవలసి వస్తున్నది. పూర్వం బాగా పని చేసిన సామాజిక నియంత్రణ ఈనాడు అంతగా పని చేయడం లేదు.

## 22.5 సారాంశం

సమాజంలో వ్యక్తి ప్రవర్తనను క్రమబద్ధీకరించే పద్ధతిని సామాజిక నియంత్రణ అంటారు. ఈ నియంత్రణ ద్వారా వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య ఘర్షణలను తొలగించి అన్యోన్యతను పెంచుతుంది. కుటుంబం, విద్య, మతము, ప్రభుత్వము మొదలగు ఏజన్సీల ద్వారా సామాజిక నియంత్రణ కొనసాగించబడుతుంది.

## 22.6 మాదిరి పరీక్ష ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.**

1. సామాజిక నియంత్రణ ఏజన్సీల గురించి విపులీకృతంగా వ్రాయండి.
2. కుటుంబం మరియు మతము ఏజన్సీలుగా ఏవిధంగా వ్యక్తి ప్రవర్తనను నియంత్రిస్తాయో విశదీకరించండి.

**II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. సాంఘీక నియంత్రణను నిర్వచించి స్వభావాన్ని పేర్కొనండి.
2. వ్యక్తి ప్రవర్తన నియంత్రణలో ప్రభుత్వ పాత్ర గురించి వ్రాయండి.

BRAOU

## 22.7 చదువదగిన పుస్తకాలు


Ginsberg : Sociology

Ogburn & Nimkoff : A Handbook of Sociology

Murdock, G.P. : Social Structure

James.B.McKee : Introduction to Sociology.

Gillin & Gillin : Cultural Sociology

సమాజశాస్త్రం - పరిచయం- సూత్రాలు: యస్.వి.సురేష్, టి.సుబ్బారెడ్డి, ఎస్.కోటేశ్వరమ్మ, ఎ.శ్రీదేవి., తెలుగు అకాడమీ 1991.

సమాజము- పరివర్తన, ప్రణాళికలు : ఇ.వి.రత్నయ్య, టి.సుబ్బారెడ్డి, తెలుగు అకాడమి, 1982.

భారతీయ సామాజిక వ్యవస్థ : ఆదినారాయణ శర్మ, కె.సింగయ్య, తెలుగు అకాడమి, 1982.

# భాగం- 23: సామాజిక నియంత్రణ, సాధనోపకరణాలు

విషయక్రమం


23.1 ఉద్దేశాలు

23.2 పరిచయం

23.3 నియంత్రణ సాధనాలు

23.4 నాయకత్వం

23.5 ప్రచారం

23.6 చట్టాలు - శాసనాలు

23.7 తాత్విక సిద్ధాంతాలు

23.4 సారాంశం

23.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

23.6 చదవదగిన పుస్తకాలు


## 23.1 ఉద్దేశాలు

ఈ పాఠ్యాంశం చదివిన తర్వాత మీరు

- సామాజిక నియంత్రణా సాధనాల గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటారు.
- సామాజిక నియంత్రణకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడే కారకాలగురించి అధ్యయనం చేస్తారు.
- సామాజిక నియంత్రణపై కళలు, సాహిత్యం ప్రభావాన్ని చర్చిస్తారు.

B R A O U

## 23.2 పరిచయం

సమాజంలో వ్యక్తి ప్రవర్తనను గానీ సమూహాల ప్రవర్తననుగానీ సమాజం నియమాలకు అనుగుణంగా ఉండునట్లు నియంత్రించవలసిన అవసరం ఉంది. దీనిని రెండు విధాలుగా సాధించవచ్చు. అవి నియంత్రణ సలహాలు మరియు నియంత్రణ ఏజెన్సీలు

## 23.3 నియంత్రణ సాధనాలు

సమాజంలో నియంత్రణ సాధించడంలో కొన్ని సంస్థలు ప్రముఖ పాత్ర వహిస్తుంటాయి. వీటిలో కొన్నింటిని సాధనోపకరణలుగాను, కొన్నింటిని ఏజెన్సీలుగానీ విభజించవచ్చు. ఏజెన్సీలకు ఉదాహరణలుగా కుటుంబము, విద్య, మతము, ప్రభుత్వము మొదలైనవాటిని పేర్కొనవచ్చు. సాధనోపకరణాలకు ఉదాహరణముగా సామాజిక రీతులు, నీతి సూత్రాలు, ప్రజాభిప్రాయాలు, మర్యాదలు, ప్రమాణాలు మొదలైన వాటిని పేర్కొనవచ్చు.

సమూహ నియంత్రణ: సమాజంలోని ప్రతి సమూహము తన సభ్యులు సమాజ నియమాలకు అనుగుణంగా ఉండేటట్లు చేయడానికి ఆ సభ్యుల మీద నియంత్రణను అమలు పరుస్తుంది. కానీ సర్దుబాటు స్థాయి ఒక సమూహంలో ఉన్నట్లు మరొక సమూహంలోను, ఒక సమాజంలో ఉన్నట్లు మరొక సమాజంలోను, ఒక కాలంలో ఉన్నట్లు మరొక కాలంలోనూ ఉండదు. ఉదాహరణకు ప్రాథమిక సమూహమైన కుటుంబానికి గౌణ సమూహమైన కార్మిక సమూహానికి నియమాల పట్ల ఎక్కువ వ్యత్యాసం ఉంటుంది. కుటుంబం నందు సామాజిక నియంత్రణ సర్వవ్యాప్తిగా ఉండి మనిషి యొక్క వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తుంది. కానీ కార్మిక సమూహం నందు వ్యక్తుల

యొక్క వేళ పాలల పట్ల సంస్థలో వ్యక్తుల కార్యక్రమ నిర్వహణ పట్ల ఎక్కు శ్రద్ధ వహిస్తుంది. అదే విధంగా కుటుంబము, మతము, తమ సభ్యుల మీద అమెరికాలో కంటే భారత దేశంలో ఎక్కువ నియంత్రణను ప్రయోగిస్తాయి. రాజకీయ సమూహాలు ప్రజాతంత్ర రాజ్యాలలో కంటే రష్యా, చైనా లాంటి నిరంకుశ రాజ్యాలలో ఎక్కువ నియంత్రణను ఉపయోగిస్తాయి. ప్రాథమిక సమూహాలు లాంఛన రహితంగా ఉండగా, గౌణ సమూహాలు లాంఛనాయుతంగా ఉంటాయి. వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడంలో రెండు రకాల సమూహాలు తోడ్పడతాయి.

వ్యవస్థానియంత్రణ: వ్యవస్థలు ఇతర సామాజిక నియంత్రణ సాధనాలకంటే స్థిరమైనవి. అవి సభ్యుల దినచర్యలను నెలకొల్పుతాయి. ఇవి వ్యక్తుల మీద సుస్థిర ప్రవర్తనా పద్ధతులను అమలు పరుస్తాయి. వ్యవస్థానియంత్రణయొక్క ఫలదాయకత్వం ఒక సమాజంలో ఉన్నట్లు మరొక సమాజంలోను, ఒక కాలంలో ఉన్నట్లు మరొక కాలంలోను ఉండదు.

సమూహాలకు, సామాజిక వ్యవస్థలకూ మధ్య గల భేదం ఏమిటంటే మొదటిది సామాజిక సంబంధాలు, సామూహిక భావనను సూచించగా, రెండవది వ్యక్తుల మీద సమాజం విధించిన సుస్థిర ప్రవర్తన పద్ధతులను సూచిస్తుంది. ఉదాహరణకు మనం కుటుంబాన్ని ఒక సమూహముగా భావించినప్పుడు వ్యక్తులు మన మనస్సులో మెదులుతారు. కానీ కుటుంబాన్ని ఒక వ్యవస్థగా భావించిన్పుడు మనం సుస్థిరమైన సంస్కృతిక ప్రవర్తన పద్ధతులను ఉద్దేశిస్తాము. ఆ విధంగా అన్ని సమూహాలకు సమాజంలో వ్యవస్థలు ఉన్నాయి. వ్యవస్థలు ఇతర సామాజిక నియంత్రణ సాధనాలకంటే స్థిరమైనవి. అవి ప్రవర్తన దిన చర్యలను నెలకొల్పుతాయి. ఆవిధంగా వ్యక్తులు కొన్ని పనులు నిర్వహిస్తారు. సమూహ నియంత్రణ, వ్యవస్థా నియంత్రణా ఎప్పుడూ కలసి ఉంటాయని జ్ఞాపకం పెట్టుకోవాలి.

సమాజం అనుసరించే పద్ధతులు సహజమైనవనీ, సరైనదనీ వ్యక్తులు నమ్మేటట్లు వ్యవస్థలు వారి మీద ఒత్తిడి తెస్తాయి. ప్రతి సమాజంలోనూ ఒక వ్యవస్థను 'కీలక వ్యవస్థ'అంటారు. ఉదాహరణకు భారతదేశంలో కుట వ్యవస్థ ఇతర వ్యవస్థలన్నిటి మీదా ప్రాబల్యం వహించే కీలక వ్యవస్థగా పరిగణింపబడేది. వ్యవస్థా నియంత్రణ ఒక సమాజంలో ఉన్నట్లు మరొక సమాజంలోను, ఒక కాలంలో ఉన్నట్లు మరొక కాలంలోనూ ఉండదు. అలాగే యుద్ధ సమయంలో సైనిక, రాజకీయ వ్యవస్థలకు ఇతర వ్యవస్థల కంటే ఎక్కువ ప్రాముఖ్యం ఉంటుంది.

**ప్రత్యక్ష సామాజిక నియంత్రణ:** వ్యక్తి తల్లిదండ్రులు, ఇరుగుపొరుగువారు, బంధుమిత్రులు, సహుద్యోగుల అభిప్రాయాలు, భావాలు వ్యక్తిపై గాఢమైన ముద్ర వేస్తాయి. వారు చేయు విమర్శలు, పొగడ్తలు, అభిప్రాయాలు మున్నగువాటి ద్వారా అతని ప్రవర్తన నియంత్రించ బడుతుంది. దీనినే ప్రత్యక్ష సామాజిక నియంత్రణ అంటారు.

పరోక్ష సామాజిక నియంత్రణ: గౌణ సమూహాలచే వ్యక్తి ప్రవర్తనను నియంత్రించబడుటను పరోక్ష సామాజిక నియంత్రణ అంటారు. ఉదాహరణకు ప్రజాభిప్రాయం, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు మొదలగునవి పరోక్షముగా వ్యక్తి ప్రవర్తనను నియంత్రించును.

సకారాత్మక సామాజిక నియంత్రణ: కింబాల్ యంగ్ ప్రకారం సమాజంలో అధిక భాగం సమాజంచే సత్కరించబడాలని కోరుకుంటారు. అందుకని వారు సమాజంచే అంగీకరించబడిన ఆచార వ్యవహారాలు, విలువలు, రీతులను అనుసరించుటకు ప్రయత్నం చేస్తుంటారు. దానికి ప్రతి ఫలంగా వారు సమాజంలో ప్రత్యేక గుర్తింపు గౌరవ మర్యాదలు పొందుతుంటారు.

నకారాత్మక సామాజిక నియంత్రణ: సమాజ వ్యక్తులు అనానుకూల పనులను చేయకుండుటకు సమాజం కొన్ని నిబంధనలతో వ్యక్తిని నియంత్రిస్తుంటుంది. ఉదాహరణకు నిబంధనలను అతిక్రమించిన వారికి కఠిన శారీరక దండన మొదలగు శిక్షలు విధించి భయభ్రాంతులను చేస్తుంది. అందువలన వ్యక్తులు సమాజ నీతి నియమాలను అతిక్రమించడానికి సాహసించరు.

అంగీకారంచే నియంత్రణ: హేయిన్ ప్రకారం నియంత్రణ రెండు విధాలుగా ఉంటుంది. సమాజంలో వ్యక్తి సత్ప్రవర్తనకు సత్కరించడం మరియు దన్ ప్రవర్తనకు దండించడం ద్వారా వ్యక్తి యొక్క ప్రవర్తనను నియంత్రిస్తారు.



BRAOU

సాంఘీకరణము, విద్యల ద్వారా నియంత్రణ: వ్యక్తిని సంఘ జీవిగా తీర్చిదిద్ది విద్యా బోధన ద్వారా వ్యక్తికి విలువలను బోధించి తద్వారా సామాజిక నియంత్రణ అమలు చేయబడుతుంది.

## 23.4 నాయకత్వం

నాయకత్వ ప్రక్రియలో సమూహ లక్ష్యాయల కొరకు సమూహ కార్యాకలపాలను సమన్వయ పరచడం జరుగుతుంది. ఒక వ్యక్తి సామాజిక నియంత్రణను అమలు పరచడాన్ని అనుమతించే సన్నివేశ ప్రక్రియ అది. సామాజిక నియమాలను అంగీకరిచేటట్లు ప్రమాణాలకు అనుగుణంగా నడుచు కొనేటట్లు వ్యక్తులను నాయకుడు ప్రభావితం చేస్తాడు. మానవ సమాజంలో నాయకత్వం మూడు రకాలుగా కొనసాగుతుంది. అవి స్థానగత నాయకత్వం, వ్యక్తిగత నాయకత్వం, నిర్వహణాధికారి గత నాయకత్వం. వాటిని గురించి తెలుసుకుందాం.

ఎ. స్థాన గత నాయకత్వం: ఈ నాయకత్వము నందు వ్యక్తి సమాజంలో ఉన్నత స్థాయి గల కుటుంబానికి చెందిన వాడైనందు వల్ల అతడు నాయకుడుగా పరిగణింపబడతాడు. కుటుంబం రాజ కుటుంబం కావచ్చు, లేదా రాజకీయ కుటుంబమో, ప్రముఖ పారిశ్రామిక కుటుంబమో, ధనిక కుటుంబమో కావచ్చు. ఈరకమైన నాయకత్వం వ్యక్తికి గల ఎలాంటి ప్రత్యేక సామర్థ్యం మీద గానీ నైపుణ్యం మీద గాని ఆధారపడదు. సాధారణంగా ఇలాంటి నాయకత్వం సాంప్రదాయిత సమాజాలలో కనిపిస్తుంది.

బి. వ్యక్తి గత నాయకత్వం: ఒక వ్యక్తికి గల గుణగణాల వల్ల అతను నాయకుడుగా పరిగణింపబడతాడు. ఈ నాయకత్వాన్ని నిపుణ నాయకత్వం, ఆకర్షక నాయకత్వం, నిర్వహణాధికారిత నాయకత్వం అని మళ్ళీ వర్గీకరించవచ్చు. అణుశాస్త్రజ్ఞుడు, ప్రముఖ నాడీ శాస్త్రజ్ఞుడు, ప్రముఖ న్యాయవాది, సినిమా తార, బహుగ్రంథ రచయిత నిపుణ నాయక వర్గంలోకి వస్తారు. వారు తమ తమ రంగాలలో నాయకులుగా ఉండి ఇతరులను ప్రభావితం చేస్తారు. ఆవిధంగా వారు ఇతరుల ఆలోచననూ,చర్యలను పరోక్షంగా ప్రభవితం చేస్తారు. ఉదాహరణకు సాంప్రదాయక సమాజాలలో మత నాయకుల అభిప్రాయాలను అందరూ అంగీకరిస్తారు.

ఆకర్షక నాయకుడు ఇతరులకు లేని గుణగణాలు తనకు ఉన్నాయని భావిస్తాడు. అందుచేత ఇతరులు తనకు విధేయులై ఉండాలని కోరుకుంటాడు. ఉదాహరణకు మహాత్మాగాంధీ ఒక ఆకర్షక నాయకుడు. అతని అనచరులు ఆయనను ఎంతో గాఢంగా నమ్మినారు. ఆకర్షక ననాయకులు కొన్ని గొప్ప ప్రయోజనాలను సాధించడానికి తాము పుట్టినట్లుగా అనుకుంటారు.

ప్రభుత్వంలోను, ఇతర వ్యవస్థలలోను కనిపించే మరొక రకమైన నాయకత్వం నిర్వహణాధివారికి గల నాయకత్వ. తన స్థానంలో తాను చేయవలసిన నిర్ణయాలు అతను చేస్తాడు. తన చర్యలకు తాను బాధ్యత వహిస్తాడు. అవసరమైనప్పుడు తనకు బదులుగా వ్యవహరించడానికి ఇతరులకు అధికారం ఇస్తాడు. సంస్థ యొక్క లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తాడు.

## 23.5 ప్రచారం

ప్రచారం అంటే వ్యక్తుల అనుభూతులను, వైఖరులను ప్రభావితం చేసే పద్ధతులను ఉపయోగించి వారి ప్రవర్తనను, సామాజిక సంబంధాలను నియంత్రించడానికి చేసే ఉద్దేశపూర్వకమైన ప్రయత్నం.

ప్రజల ప్రవర్తనను, వైఖరులను నియంత్రించడానికి ప్రచారం అత్యంత సమర్థవంతమైన సాధనం. రేడియో,టెలివిజన్,వార్తాపత్రికలు మొదలైనటువంటి సామాజిక భావప్రసార సాధానాలు మాటలకు గల శక్తిని అపారంగా పెంచినాయి. అవి వ్యక్తులు ఏమి చేయవలసినది తెలియజేస్తాయి.

విలువలు: విలువలు విశ్వజనీయమైనటువంటిది. సామాజిక వ్యవస్థాపనలో విలువలు అత్యంత కీలకమైన పాత్ర వహిస్తాయి. విలువలు సామాజిక అనుభాలనుంచి ఉద్భవించి స్థిరపడుతాయి. ఒక సమాజానికి మరొక సమాజానికి విలువలలో తేడా ఉంటుంది. విలువలు సామాజిక శ్రేయస్సుకు, సౌలభ్యానికి సామాజిక పరిస్థితులకు తగిన



BRAOU

విధంగా మానవులు ఏర్పరచుకొంటారు.

ఒకసారి విలువలు రూపొందిన తరువాత సమాజంలో స్థిరపడి అది సంస్కృతిలో విలీనమై, కాలక్రమేణా సంస్కృతిలో అంతర్భాగమైపోతాయి. విలువలు మానవుల చర్యలకు ఒక అర్థాని ప్రయోజనాన్ని సమకూరుస్తాయి. విలువలు సమాజంలోని వ్యక్తులకు మార్గదర్శకాలుగా పని చేస్తాయి. ఏయే పనులు ఎప్పుడు ఏవిధంగా చేయాలో విలువలు వ్యక్తులకు తెలియజేసి సరైనా మార్గాలను చూపిస్తాయి.

ప్రమాణాలు: వ్యక్తులు సమాజంలో కొన్ని ప్రమాణాలకు కట్టుబడి ఉంటారు. ఏసమాజంలోనైనా ప్రమాణాలు లేకపోతే ఆసమాజం అవ్యవస్థ చెందుతుంది. అందుచేత సామాజిక ప్రమాణాలు అవసరం. సమాజం నందు సామాజిక విలువలు లక్ష్యాలైతే ప్రమాణాలు లక్ష్యాలను సాధించడానికి రూపొందించుకొన్న సాధనాలు, ప్రమాణాలు సమాజంలోని వివిధ వ్యక్తులతో వివిధ సందర్భాలలో ఏవిధంగాప్రవర్తించాలో తెలియజేస్తాయి. అందువలన ప్రమాణాలను ప్రవర్తనా నియమాలుగా పేర్కొనవచ్చును. మనకు గల సామాజిక అవసరాలను తీర్చుకొనడంలో వ్యక్తుల ప్రవర్తనకు కొన్ని పరిధులను ఏర్పరచి మన ప్రవర్తనకు సమాజంలోని ఇతర సభ్యుల ప్రవర్తనతో సమన్వయం ఏర్పరచడంలో ప్రమాణాలు ఎంతో సహాయపడుతాయి. ప్రమాణాలు సమాజానికి సుస్థిరతను చేకూర్చి క్రమ పద్ధతిలో నడిపిస్తాయి.

జానపదరీతులు: విలియమ్ గ్రహమ్ సమ్నర్ అనే అమెరికన్ సమాజ శాస్త్రవేత్త మొట్టమొదటి సారిగా 'జానపద రీతులు' అనే గ్రంధాన్ని రచించి ఈ మాటకు సమాజ శాస్త్రములో అత్యంత ప్రాధాన్యాన్ని కల్పించినాడు. ప్రజలు తమ అవసరాలను తీర్చుకోవడానికి ఒకరితో ఒకరు సంబంధాలను కలిగి ఉండడానికి తమ జీవితానికి మార్గదర్శకంగా ఏర్పరచుకొన్న విధానాలనే జానపదరీతులని చెప్పవచ్చు. లేదా సమాజపరంగా ఉండే కొన్ని అలవాట్లనే జానపదరీతులనవచ్చు. ఇవి వారి సామాజిక చర్యల నుండి ఉత్పన్నమై ప్రమాణాలుగా రూపొంది ఒక తరం నుండి మరొక తరం వారికి సాంఘికీకరణం ద్వారా సంక్రమిస్తాయి. జానపపదరీతులు సమాజానికి, సమాజానికి భిన్న భిన్నంగా ఉంటాయి. ప్రతి సంస్కృతికి ఈజానపదరీతులు మూలాధారం. ఏప్రభుత్వము, కోర్టు వీటిని ఆచరించవలెనని ఒత్తిడి చేయవు. అంతేగాక సమాజంలోని ఏప్రత్యేక వ్యవస్థ కుడా వీటిని అమలు చేయడం లేదు. వీటిని ఉల్లంఘిస్తే శిక్ష పడదు. కాని సమాజంలోని ప్రజలు వీటిని అనుసరించడంలో అశ్రద్ధ చేస్తే సమాజ నిరాదరణకు, పరిహాసానికి గురి అవుతారు. అందుచేతనే వీటిని సంప్రదాయకంగా, కట్టుబాటుగా మనం వీటికి తలొగ్గుతాము. వ్యక్తుల ప్రవర్తనను క్రమబద్ధం చేయడంలో జానపదరీతులు ఎంతో ఉపయోగపడుతాయి. ప్రతి సమాజంలోనూ కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు ఉంటాయి. ఏదైనా పండుగ సందర్భంలో కొత్త బట్టలు వేసుకోవడం, పెద్దలను గౌరవించడం, ఆహార విహారాలలో అనుసరించవలసిన విధానాలు, దేవాలయంలోనికి గాని,ప్రార్థనా మందిరంలోకి గాని పాదరక్షలు విడిచి వెళ్ళడం, విద్యాసంస్థలు, కుటుంబాలు మొదలైన సంస్థలలో ప్రవర్తించవలసిన రీతులు అన్నీ జానపదరీతులే. ఈ జానపదరీతులు ఆదిమ, ఫ్యూడల్, ఆధునిక సమాజాలలో ఎల్లప్పుడు ఉంటు వచ్చినాయి. మానవ జాతి ఉన్నంత వరకు ఇవి ఉంటూనే ఉంటాయి. ఇది రాత ప్రతుల ద్వారా గాక, సామాజిక వారసత్వం ద్వారా క్రింది తరాల వారికి అందించబడతాయి. జానపదరీతులు వ్యక్తుల ప్రవర్తనను క్రమమైన మార్గంలో ఉంచుతాయి.

సామాజిక రీతులు: సామాజిక రీతులు అనే భావన 'మోరల్' అనే ఆంగ్ల భాషా పదం నుండి వచ్చింది. అందుచేత 'నీతులు' అనే అర్థాన్ని తెలియజేస్తుంది. సామాజిక సంక్షేమానికి ఉపయోగపడే అన్ని ఆచార సాంప్రదాయాలను సామాజిక రీతులుగా పిలవచ్చునని సమ్నర్ పేర్కొన్నాడు. సమాజంలోని వ్యక్తి సాంఘికీకరణ ద్వారా రీతిరివాజులను క్రమంగా తెలుసుకొంటాడు ప్రతి సమాజమునందు రీతి, రివాజులుంటాయి. ఈరీతి రివాజులు వ్యక్తుల ప్రవర్తనను తీర్చిదిద్దుతాయి. ఉచితాలు, అనుచితాలు అని భావించే ప్రవర్తనా రీతులను సామాజిక రీతి అని చెప్పవచ్చును. అన్ని కాలాలలోను రీతి రివాజులు సామాజిక సంక్షేమంతో ముడిపడి ఉంటాయి. రామాయణ కాలం నుండి పురుషుడు ఏక పత్ని వ్రతుడై ఉండవలెననే సామాజిక రీతులు మన దేశంలో ఉంటూ వచ్చినాయి. అనేక రంగాలలో సామాజిక రీతులు సమాజంలో వ్యక్తుల ప్రవర్తనను తీర్చిదిద్దుతాయి. తండ్రి చనిపోయిన తర్వాత కుటుంబంలో పెద్ద కుమారుడు ఇంటి బాధ్యతలు స్వీకరించవలసి ఉంటుంది. సమాజంలో వ్యక్తులు ఏవిధంగా ప్రవర్తించవలెనో చెప్పడమే గాకుండా, ఏయే విధాలుగా వ్యక్తి సమాజంలో ప్రవర్తించకూడదో ఆ విషయాన్ని కూడా



BRAOU

ఈ రీతి రివాజులు తెలియజేస్తాయి. సామాజంలోని వ్యక్తులు సామాజిక రీతులను పాటించకపోతే ఆ సమాజంలో అవినీతి పెరిగి సమాజ సంక్షేమానికి ముప్పు వాటిల్లుతుంది.

చిన్న సమాజాలలో వైవిధ్యం చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి సామాజిక రీతులు అందరికీ ఒకే విధంగా ఉంటాయి. ఆధునిక సమాజంలో సామాజిక రీతులు వర్గాన్ని బట్టి, వృత్తిని బట్టి, ఉప సంస్కృతిని బట్టి వేరు వేరుగా ఉంటాయి. సామాజికరీతులు వ్యక్తులను మంచి మార్గంలో నడిపిస్తూ అన్ని కాలాలలోను మార్గదర్శకాలుగా పని చేస్తాయి.

సామాజికరీతులు నిశ్చలంగా ఉండక సామాజిక పరిస్థితులతో బాటు మారుతూ ఉంటాయి. ఒకచర్య కొన్ని సామాజిక పరిస్థితులలో సామాజిక రీతులకు వ్యతిరేకంగా కనిపిస్తే, అదే చర్య మరి కొన్ని సామాజిక పరిస్థితులలో సామాజిక రీతుల అనుగుణంగానే ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి మరొక వ్యక్తిని చంపటం నేరం. కాని యుద్ధంలో శత్రువులను చంపితే అది వీరత్వానికి చిహ్నంగా భావించబడుతుంది. అందు చేతనే సామాజిక రీతులు ప్రవర్తన నమూనాలకు నైతిక బలాన్ని, గొప్ప తనాన్ని ఆపాదిస్తాయని సమ్నర్ చెప్పాడు. సామాజిక రీతుల ఆధారంగా వ్యక్తి ప్రవర్తనలోని మంచి చెడులను నిర్ణయించవచ్చు.

రీతిరివాజులు లిఖిత పూర్వకంగా లేకపోయినప్పటికీ అన్ని వర్గాల వారు వీటిని పాటిస్తారు. కొన్ని సమయాలలో ఈసామాజిక రీతులు, జానపదరీతులు మిళితమై ఉంటాయి. గ్రామంలోని రైతులందరూ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఒకేసారి ఏరువాక సాగించడం అనేది ఇందుకు చక్కని ఉదాహరణగా పేర్కొనవచ్చు. రీతిరివాజులు వ్యక్తుల ప్రవర్తనను నియమబద్ధం చేస్తాయి.

## 23.6 చట్టాలు లేదా శాసనాలు

సమాజంలో సామాజిక అభివృద్ధి కొనసాగడానికి సామాజిక అవ్యవస్థ సంభవించకుండా ఉండటానికి శాసనాలు అవసరము. అభివృద్ధి చెందిన ఆధునిక సంక్లిష్ట సమాజాలలో చట్టాలు సామాజిక రీతుల నుండే రూపొందుతాయి. చట్టాలను రాజకీయ వ్యవస్థ ప్రవేశపెడుతుంది. చట్టాలు న్యాయస్థానాల చేత గుర్తించబడి అన్ని వర్గాల ప్రజల చేత చర్చించబడి, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా రూపొందిన ప్రమాణాలు, చట్టాలు నియమబద్ధమైనటువంటివి. సమాజంలో ఉపయోగకరంగా ఉన్న రీతిరివాజులు శాసనాలుగా రూపొందుతాయి. వీటిని పోలీసుల ద్వారా, కోర్టుల ద్వారా అమలు పరుస్తారు. సుమారు క్రీ. పూ.1000 సంవత్సరాల నుండి క్రీ.శ. 1000 సంవత్సరాల వరకు మన దేశంలో సామాజిక ప్రవర్తనను స్మృతులు అనుశాసించాయి. బ్రిటిష్ ప్రభుత్వం అమలు పరచిన పౌరచట్టాన్ని స్మృతుల ప్రాతిపదిక మీద నిర్మించారు. చట్టం సమాజంలోని వ్యక్తుల ప్రవర్తనను నియంత్రణ చేయటమే గాక వారికి కొన్ని హక్కులను, రక్షణలను కలిగిస్తాయి.

## 23.7 తాత్విక సిద్ధాంతాలు

మానవ జాతి క్రమాభివృద్ధిలో ప్రజాస్వామ్యము మార్క్సిజమ్ మొదలైన తాత్విక సిద్ధాంతాలు మానవులను ఎన్నో విధాల ప్రభావితం చేస్తున్నాయి. సాంస్కృతిక అంశాలలో ప్రధానంగా తాత్విక సిద్ధాంతాలు సామాజిక పరివర్తనకు ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. మానవ సమాజాలలో తాత్విక సిద్ధాంతాల మూలంగా మానవుల భావాలలో, దృక్పధాలలో, విలువలలో మార్పు కలిగి సామాజికాభివృద్ధి జరుగుతుందని చెప్పడానికి ఎన్నో దృష్టాంతాలున్నాయి. రష్యా, చైనా మొదలైన దేశాలలో కమ్యూనిస్టు విప్లవం రావడానికి సాంకేతిక, ఆర్థిక విధానాలకంటే మార్క్స్ తాత్విక సిద్ధాంత ప్రభావమే ప్రధాన కారణమని చెప్పవలె. అట్లాగే అమెరికా, ఫ్రెంచి విప్లవాలు ప్రజ్వరిల్లడంలో జాన్‌లాక్, రూసోవాల్టేరు వంటి మేధావుల రచనలు ఎంతో దోహదం చేసినాయి.

నీతి సూత్రాలు: అన్ని సమాజాలలోను నీతి, అవినీతులకు సంబంధించిన నిర్దిష్ట అభిప్రాయాలుంటాయి. ఒక సమాజంలో నీతి అనేది మరొక సమాజంలో నీతి కాకపోవచ్చు. ఈనీతి సూత్రాలు వ్యక్తుల ప్రవర్తనను నియమబద్ధం చేస్తాయి. అమలులో ఉన్న నీతి సూత్రానికి విరుద్ధంగా ప్రవర్తించిన వ్యక్తి అనేక విమర్శలకు అవహేళనకు



BRAOU

గురికావలసి వస్తుంది.

ఫాషన్‌లు: మానవుడు సంఘజీవి. తోటి మానవుల వలె ఉండవలెనని అభిలషిస్తాడు. అయితే తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవలెనని కూడా ఉబలాటపడుతాడు. ఈకోరికను ఫాషన్‌ల ద్వారా తీర్చుకుంటాడు. వస్త్రాలు ధరించడం, ఆభరణాలు అలంకరించుకోవడం, కళలు, సాహిత్యం మొదలైన వాటిలో వ్యక్తుల మీద ఫాషన్ ప్రభావం ఉంటుంది. ఈ షోకులు అతిత్వరగా బాధ్యతా రహితంగా మారినప్పుడు వాటిని ఫాడ్ అనవచ్చు.

సంస్కారాలు: సంస్కారాలు వ్యక్తులకు నిండుదనాన్ని, ప్రత్యేకతను, సంతోషాన్ని, తృప్తిని కలిగిస్తాయి. వ్యక్తి ఒక వయస్సు నుండి మరొక వయస్సుకు చేరినప్పుడు చేసే ఉత్సవాన్ని ప్రవేశ సంస్కారాలు అనవచ్చు. బాల్య దశనుంచి యౌవన దశకు చేరే స్నాతకోత్సవాలు మొదలైన వాటిని సంస్కారాలకు ఉదాహరణగా పేర్కొనవచ్చు ఉత్తమమైన ఘనకార్యాలు సాధించిన వ్యక్తిని సత్కరించడం, నూతన సంవత్సర వేడుకలు మొదలైనవి సంస్కారాలకు చక్కని ఉదాహరణలు.

మర్యాదలు: మర్యాద పూర్వకంగా ఆదరించే ప్రవర్తనను మర్యాదలనవచ్చు. పెండ్లికి హాజరైనప్పుడు వధూవరులకు బహుమానాలివ్వడం సందర్భాన్ని అనుసరించి తగిన దుస్తులతో హాజరు కావడం మొదలైనవన్నీ మర్యాదలకు ఉదాహరణలుగా చెప్పవచ్చును.

ప్రజాభిప్రాయం: సామాజిక నియంత్రణలో ముఖ్యంగా ప్రజాతంత్ర దేశాలలో ప్రజాభిప్రాయమొక శక్తివంతమైన సాధనం. అనేక జాతీయ విధానాలకుఅది ప్రమాద రహితమైన మర్గదర్శిగా పరిగణించబడుతుంది. సామాజిక నియంత్రణ సాధనంగా ప్రజాభిప్రాయం నిర్వహించే పాత్ర గ్రామీణ సమాజాలలో ఎక్కువగా కనిపిస్తుంది. గ్రామాలలో వ్యక్తుల మధ్య సన్నిహిత సంబంధాలుండుటచే ప్రజాభిప్రాయాన్ని వ్యతిరేకించడం గ్రామస్తునికి కష్ట సాధ్యమౌతుంది. అతను ప్రజాభిప్రపాయానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ప్రజల విమర్శకు అవహేళకూ గురి కావలసి వస్తుంది. అందుచేత గ్రామీణులు సమాజ వ్యతిరేక కార్యకలాపాలకు పూనుకోరు. వారు సామాజిక నియమాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. వ్యక్తుల ప్రవర్తనకు సక్రమంగా నియమ బద్ధంగా ఉండేటట్లు చేయడంలో ప్రజాభిప్రాయం చాలా తోడ్పడుతుంది. ఆధునిక కాలంలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడానికి అనేక సంస్థలు అన్ని దేశాలలోను ఏర్పడినాయి.

కళ, సాహిత్యం: శిల్పం,చిత్ర లేఖనం, సంగీతం, నృత్యం మొదలైన అనేక రూపాలలో కళ వ్యక్తమౌతుంది. కవిత్వం, నాటకం, కథ, నవల కలిసి సాహిత్యమౌతుంది సాహిత్య కళకు, సామాజిక నియంత్రణకు సన్నిహిత సంబంధముంది. ఏకళారూపమైనా సామాజిక నియంత్రణ సాధనం కాగలదు. పాత రాతియుగపు అద్భుతమైన గుహ చిత్రాలకు ఏదో మత ప్రయోజనం ఉండినట్లు అవి తెలుపుతాయి. కళ నాగరిక సమాజంలో ఉపయోగపడినట్లు అనాగరిక సమాజాలలో కూడా ముఖ్యమైన పాత్ర నిర్వహించింది. అధికంగా పారిశ్రామికీకరణ ప్రభావానికి లోనైనా దేశాలకంటే తక్కువ నాగరికత గల బృందాలు కళాత్మక అలంకరణ పట్ల ఎక్కువ శ్రద్ధ వహిస్తాయి. బుట్టలు, వర్ణచిత్రాలు, దుప్పట్లు, వెండినగలు, ఈకల అలంకారాలు, పూసల అలంకారాలు మొదలైనటువంటి వాటికి అధిక ప్రాధాన్యతనిస్తారు. ఒక యుగానికి చెందిన కళకు ఆజాతి జీవితానికి ఎప్పుడూ గాఢమైన సంబంధం ఉంటుంది.

సమాజంలోని సభ్యులను కళ రెండు రకాలుగా నియంత్రిస్తుంది. మొదటిది అనుభూతికి సంబంధించినది. అది ప్రేమ , భయం, ద్వేషం, సంతోషం లాంటిఅనుభూతులను ఉపయోగించుకుంటుంది. రెండవది కళ సామాజిక సంకేతాలను పవిత్ర పరచి సమ్మోహనకరం చేస్తుంది. జాతీయ గీతాలకు ఆవేశపరచే సంగీతం ఉంటుంది. జండాలకు మనోహరమైన రంగులూ, రూపాలు ఉంటాయి. సైనిక సంగీతం, భరత నాట్యం మనలో మన సంస్కృతి పట్ల అభిమానాన్ని పెంపొందిస్తుంది. బుద్ధ విగ్రహం మనకు బౌద్ధమతంలోని ప్రధాన సూత్రాలను బోధిస్తుంది.

పూర్వం ఎన్నడూ లేనంతగా ఈనాడు చాలా మంది సాహిత్యాన్ని సామాజిక నియంత్రణ సాధనంగా పరిగణిస్తున్నారు. ఉదాహరణకు స్వర్గనరకాలను గురించి సర్వత్రా అంగీకరింపబడిన భావాలు మిల్టన్ రచించిన పారడైజ్ లాస్ట్‌లోని వర్ణన నుండి ప్రత్యేక్షంగా గానీ, పరోక్షంగా గానీ గ్రహింపబడినట్లు కనిపిస్తుంది. అలాగే డెకెన్స్ డేవిడ్ 'కాఫర్ ఫీల్డ్' అనే నవల వ్రాయడం ద్వారా బ్రిటన్‌లోని మొత్తం పాఠశాల వ్యవస్థను మార్చివేసినాడు.

ఉన్నతమైన కుటుంబ వ్యవస్థకు నిర్దిష్టమైన మార్గాలను చూపి నేటికి ఆదర్శప్రాయంగా నిల్చిన వాల్మీకి రామాయణం ఇక్కడ పేర్కొనదగినది. పోతన గారి భాగవతం ఆంధ్ర దేశంలో ప్రజల జీవన వ్యవస్థపై ఎంతో ప్రభావాన్ని చూపి వారిని ఆదర్శ మార్గాల నడిపించడం నేటికీ కానవస్తుంది.

## 23.8 సారాంశం

సామాజిక నియంత్రణ అనేది వ్యక్తి గత క్రమశిక్షణ. దీని ద్వారా మానవుని సంఘజీవిగా చేస్తుంది. అతనిని సంఘ విద్రోహ చర్యలకు పాల్పడకుండా నియంత్రిస్తుంది.జానపదరీతులు, ప్రజాభిప్రాయం, చట్టాలు, శాసనాలు, విలువలు, ప్రచారాలు మొదలగు సాధానాల ద్వారా సామాజిక నియంత్రణ అమలు పరచబడుచున్నది.

## 23.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.**

1. సామాజిక నియంత్రణ సాధనాల గురించి వ్యాసం వ్రాయండి.

2. సకారాత్మక సామాజిక నియంత్రణ మరియు నకారాత్మక సామాజిక నియంత్రణ గురించి వ్రాయుము.

**II. ఈక్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. జానపద రీతులు మరియు నీతి సూత్రాలు వ్యక్తి ప్రవర్తనను ఎలా నియంత్రిస్తాయో వివరించండి.

2. ప్రజాభిప్రాయం సామాజిక నియంత్రణ సాధనంగా ఎలా పనిచేస్తుందో వివరించండి.

## 23.10 చదవదగిన పుస్తకాలు


GinsBerg : Society
Ogbwm & Nimkoff : A Handbook of Sociology
James.B. McKee : Introdution to Sociology.
Gingsberg & Morris : Psychology of Society.
Kuppu Swamy, B : An Introduction to Social Psychology
Lepiere, R.T : Sociology


B R A O U

# ఖండం- VII

## సామాజిక మార్పు

ఏసమాజం స్థిరంగా వుండదు. చరిత్రలో ఏ సంఘం కూడా స్థిరంగాలేదు. మార్పు లేదా పరివర్తన సమాజపు ప్రధాన లక్షణం. మార్పు, పరివర్తన, వికాసం, పరిణామం పేరు ఏదైనా ఇవన్నీ ఒక స్థితినుంచి ఇంకొక స్థితికి చేరుకోవడాన్నే సూచిస్తున్నాయి. దిమ్మరిగా అడవుల్లో తిరిగి, రాతి యుగం దాటి ఇవాల్టి హైటెక్, సమాచార సాంకేతిక యుగందాకా మనిషి ఎన్నో దశల్ని దాటుతూ వచ్చాడు. తను మారుతూ సమాజాన్ని మార్చుతూ వచ్చాడు. ఈ మార్పు ప్రక్రియల్ని, కారణాల్ని ఈ ఖండం వివరిస్తుంది.

ఇందులో మూడు భాగాలున్నాయి. అవి:

- సామాజిక పరివర్తన
- సామాజిక పరివర్తన-కారకాలు
- సాంస్కృతికభిన్నత్వం, సాంస్కృతిక మార్పు, సాంస్కృతిక విలంబన

BRAOU

BRAOU

# భాగం- 24: సామాజిక పరివర్తన

## విషయక్రమం


24.0 ఉద్దేశాలు

24.1 పరిచయం

24.2 సామాజికపరివర్తన: అర్థం, నిర్వచనము

24.3 సామాజిక పరివర్తన: స్వభావము, లక్షణాలు

24.4 సామాజిక పరివర్తన

24.4.1 సామాజిక పరివర్తన: కారణాలు

24.4.2 పరివర్తన ప్రకలతా ధర్మం

24.4.3 సామాజిక పరివర్తన: సామాజిక చలనము

24.5 సామాజిక పరిణామము

24.5.1 సామాజిక పరిణామము: అర్థం, భావన

24.5.2 సామాజిక పరిణామము: సూత్రాలు,నిర్వచనము

24.5.3 సామాజిక పరిణామము ప్రక్రియ

24.6 అభివృద్ధి

24.7 సారాంశం

24.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

24.9 చదవదగిన పుస్తకాలు


B R A O U

## 24.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు:

- సామాజిక పరివర్తన భావనను అర్థం చేసుకొంటారు.
- సామాజిక పరివర్తన ఏవిధంగా జరుగుతుందో వివరించగలుతారు.
- సామాజిక పరివర్తన ప్రక్రియను, పరిణామాన్ని వివరించగలుగుతారు.
- సామాజిక పరివర్తన వలన అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందో పరిశీలించగలుగుతారు.

## 24.1 పరిచయం

పరివర్తన లేదా మార్పు భావన కొత్తది కాదు. మన చుట్టూ చోటు చేసుకొంటున్న అనేక మార్పులను మనం గమనిస్తూనే ఉంటాం. మార్పు ప్రకృతిలో ఒక భాగం. మార్పు జరగడానికి అనేక కారణాలు ఉంటాయి. ఒక వ్యవస్థలో ఉంటే సామాజిక సంస్థల, సంఘాల నిర్మాణము, వాటి విధులను మార్చడానికి సామాజిక మార్పు ప్రయత్నిస్తుంది. సామాజిక నిర్మితిలో మార్పు రాకుండా సామాజిక మార్పు సాధ్యపడదు. కాని ఇక్కడ గుర్తించుకోవలసిన విషయం ఏమిటంటే సామాజిక నిర్మితిలో మార్పు సర్వసాధారణం కాదు. కొన్ని సమయాలలో విజ్ఞానం పెరడం వలన సామాజిక ఘర్షణలవలన సామాజిక పరివర్తన వస్తుంది. దీన్నే సామాజిక పరివర్తన అంటున్నాం. అన్ని సమాజాలు, సంస్కృతులు మార్పుకు లోను కావలసిందే. సామాజిక పరస్పర చర్యలలో పరస్పర

సంబంధాలలో వచ్చే మార్పును కూడా సామాజిక మార్పుగా పరిగణించవచ్చు. సామాజిక మార్పు అత్యంత సాధారణ విషయం కాదు. అది ప్రతిక్రియల పరంపంను సృష్టిస్తుంది. అంటే ఒక మార్పు మరియొక మార్పును ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు నగరీకరణ అనే ప్రక్రియ రావడంతో విధ్యలలోను,వృత్తులలోను, ఆదాలోను, రవాణా సౌకర్యాలలోను, కుటుంబ విధానాలలోను, సమాజంలో స్త్రీ స్థానములలోను ఇంకా అనేక విషయాలలో మార్పులు సంభవించాయి. మార్పుతో పాటు దాని దిశ కూడా ముఖ్యమైనది. అది కొన్ని సార్లు సక్రమ మార్గంలో ప్రయాణిస్తే మరికొన్ని సార్లు వక్ర మార్గంలో ప్రయాణిస్తుంది. కొన్ని సామాజిక మార్పులు ఆకస్మికంగా సంభవిస్తే, మరికొన్ని ప్రణాళికా బద్ధంగా సంభవిస్తాయి. సామాజిక మార్పు యొక్క పర్యవసానం సామాజిక చలనము.

తరుచుగా సమాజాలు సామాజిక, సాంస్కృతిక మార్పుల వలన సమస్యలను ఎదుర్కొంటుంటాయి. సమాజము నిర్మాణంలో కాని, పని తీరులో కాని, నమూనా పాత్రలలోకాని, సంబంధాలలో వచ్చే మార్పును సామాజిక మార్పు అంటారు. ఈమార్పు ఎప్పుడు పరిపూర్ణంగా జరగదు. సాధారణంగా ప్రణాళికా బద్ధ మార్పు కొన్ని నిర్దిష్ట, సంఘటిత ఆదర్శాలను సాధించడానికై ఉంటుంది. సామాజిక మార్పు విషయంలో సమాజశాస్త్రవేత్త అయిన అగస్ట్ కొమ్టె కాలం నుండి సమాజ శాస్త్రవేత్తలు రెండు విషమ సమస్యలను ఎదుర్కొంటున్నారు. అవి 1.సామాజిక సుస్థిరత సామాజిక గమనాత్మక శక్తులు సమాజశాస్త్రవేత్తలు సమాజం యొక్క నిర్మాణంను వివరించడం ద్వారా సంతృప్తి చెందక, వారు సంఘటనలకు కారణాలను తెలుసుకోవడానికి ఎక్కువ ఇష్టపడుతున్నారు. లూక్రిటియుజ్ అనే రోమన్ కవి ఇలా అంటాడు. "సంతోషము అంటే జరిగే సంఘటనలకు కారణాలను తెలుసుకొంటుండటం".

## 24.2 సామాజిక పరివర్తన: అర్థం, నిర్వచనము

BRAOU

ఏదైనా ఒక సందర్భంలో, ఒక లక్ష్యంలో జరిగే విభిన్న తను గాని, రూపాంతరాన్ని గాని సామాజిక మార్పు లేదాపరివర్తనగా చెప్పుకోవచ్చు. సామాజిక మార్పు అనే పదాన్ని మానవ పరస్పర చర్యలలో లేక మానవ పరస్పర సంబంధాలలో వచ్చే మార్పును తెలియజేయడానికి కూడా వాడతారు. అందువలన సామాజిక మార్పును సామాజిక సంబంధాలలో మార్పుగా కూడా అనుకోవచ్చు. మార్పు వ్యవస్థలలో కూడా వస్తుంది. ఉదాహరణకు ఆధునికీకరణభావనకు పూర్వం కుటుంబ వ్యవస్థ ప్రాథమిక, గౌణ విధులను నిర్వహించేది. కాని నేడు అది ప్రాథమిక విధులను మాత్రమే నిర్వహిస్తుంది. గౌణవిధులను విద్యా, వైద్య, మతం మొదలగు సంస్థలకు బదలాయించింది.

సామాజిక ప్రక్రియ, సామాజిక పరస్పర చర్యలు, సామాజిక నిర్మాణం అనే వాటిని అర్థం చేసుకోవడం ద్వారా సామాజిక సంబంధాలను అర్థం చేసుకోవచ్చు. అందువలన సామాజిక మార్పు అనే దృక్పదాన్ని సామాజిక పరస్పర చర్యలలో, సామాజిక ప్రక్రియలో, సామాజిక నిర్మాణంలో వచ్చే వైవిధ్యాలను తెలియజేయడానికి ఉపయోగించవచ్చు.

సామాజిక మార్పు ప్రక్రియను అర్తం చేసుకోవడం కొంచెం కష్ట సాధ్యమే. ఎందువలనంటే ఇప్పటికీ కొన్ని ప్రశ్నలకు సరియైన సమాధానాలు తెలిసికోవలసి ఉంది. అవి ఎ) సామాజిక మార్పు యొక్క చలన దిశ ఏది? బి) సామాజిక మార్పు యొక్క రూపం ఏమిటి? సి) సామాజిక మార్పుకు ఆధారం ఏమిటి? డి) సామాజిక మార్పుకు కారణాలు ఏమిటి? ఇ) సామాజిక మార్పును నియంత్రించవలసిన అవసరం ఉందా? ఈప్రశ్నలకు కూలం కుషంగా చర్చించే ముందు సామాజిక మార్పు దృక్పదాన్ని కొన్నీ నిర్వచనాల ద్వారా అర్థం చేసుకొందాం.

సామాజిక మార్పు నిర్వచనం: కింగ్స్లే డేవిస్ అనే రచయిత సామాజిక మార్పును ఈవిధంగా వివరించాడు. "సామాజిక మార్పు అంటే "సామాజిక వ్యవస్థ నిర్మితి మరియు విధులలో వచ్చే మార్పు". లండ్ బర్గ్ ప్రకారం సామాజిక మార్పు ఏకాలంలో అయినా సామాజిక ప్రక్రియలో పరిశీలించదగ్గా మార్పు. గిన్స్ బెర్గ్ ప్రకారం "సామాజిక నిర్మితి, దృక్పదాలు, నమ్మకాలలో వచ్చే మార్పులను సామాజిక మార్పు" అనవచ్చు. ఎమ్.ఇ. జోన్స్ సామాజిక మార్పును నిర్వహిస్తూ, "సామాజిక క్రమం, సామాజిక రీతి, సామాజిక పరస్పర చర్య, సామాజిక నిర్మాణంలో వచ్చే మార్పే" సామాజిక మార్పు అన్నాడు.

ఎచ్.టి మజుందార్ ప్రకారం "ప్రజల జీవన విధానంలోకాని, సమాజ పని విధానంలోకాని పాత విధానాలను తొలగించి కొత్త విధానాలను ప్రవేశ పెట్టే పద్ధతే" సామాజిక మార్పు.

## 24.3 సామాజిక పరివర్తన: స్వభావము లక్షణములు

పైభాగంలో మనం సామాజిక పరివర్తన భావన, అర్థం, నిర్వచనము గురించి తెలుసుకొన్నాము. ఈభాగంలో సామాజిక మార్పు స్వభావము, లక్షణములను గురించి తెలుసుకొందాము.

**1. సామాజిక పరివర్తన ఒక నిరంతర ప్రక్రియ:** సమాజము ఎప్పుడు మారుతుంటుంది. ఈమార్పును ఆపడం సాధ్యంకాదు. సమాజం వస్తుప్రదర్శనశాలలో పెట్టే వస్తువు కాదు. చరిత్ర ప్రారంభమైన రోజు నుండి ఇప్పటివరకు సమాజము మార్పుకు లోను అవుతూనే ఉంది. కాని పరిమాణంలో హెచ్చు తగ్గులుంటాయి. ఉదాహరణకు, నగర ప్రాంతాలలో మార్పు త్వరితగతిన వస్తే గ్రామీణ ప్రాంతాలలో మార్పు నెమ్మదిగా వస్తుంది.

**2. సామాజిక పరివర్తన లౌకికమైనది:** మార్పు ఎప్పుడు జరుగుతూనే ఉంటుంది. అది శాస్వతం కాదు. ఒక మార్పు తరువాత మరియొక మార్పు వస్తుంది. అందుకనే మెక్ ఐవర్ ఇలా అంటాడు, "సామాజిక మార్పు ఒక క్రమం మాత్రమే, ఫలితం కాదు. అది జరుగుతూనే ఉంటుంది నిలిచిపోదు."కాలానికి అనుగుణంగా పాత అలవాట్లు మారడం గాని, లేదా పాత వాటి స్థానంలో కొత్తవి రావడానికి కొంత కాలం పడుతుంది. కొత్త వస్తువులు వచ్చినప్పుడు పాతవి మరుగున పడటం సహజం. ఫ్యాషన్స్ కూడా మారుతుంటాయి. సమాజంలో ఏది స్థిరంగా ఉండదు. ఈనాడు చాలా భారతీయ కుటుంబాలలో సాంప్రదాయంగా వస్తున్న అల్పాహారానికి బదులుగా రొట్టె( ) వాడబడుతున్నది. ఈనిరంతర సంఘర్షిత ప్రపంచంలో ప్రతి ఒక్కరు మిగిలిన వారితో పోటీ పడటం కోసం మారక తప్పదు.

**3.సామాజిక పరివర్తన పరస్పర ప్రభావం:** సాంస్కృతిక నేపథ్యంలో మార్పు తప్పని సరిగా ఒక నిర్ణీత ప్రదేశంలో మాత్రమే జరుగుతుంది. ఈసంస్కృతి, నిర్ణీత ప్రదేశంలో మార్పు రెండు మానవుని జీవితంపై ఇంకా నిశితంగా చెప్పాలంటే మానవుని స్వభావంపై చాలా ప్రభావాన్ని చూపిస్తాయి. మార్పు అవసరం ఎందుకంటే ప్రజలు మార్పును తీసుకురావడమే కాకుండా ఆమార్పుకు వారు ప్రభావితులౌతారు. ఉదాహరణకు వస్త్రధారణ గ్రామీణ ప్రాంతాలలో కంటే పట్టణ ప్రాంతాలలో ఎక్కువగా మార్పుకు లోనౌతుంది. దీనికి పాశ్చాత్యీకరణ, విద్య, వృత్తిలో మార్పు మొదలగునవి కారణాలుగా చెప్పుకోవచ్చు.

**4. సామాజిక పరివర్తన వ్యక్తులలో వచ్చే మార్పు:** సామాజిక మార్పు అంటే ఏమిటి? సమాజంలో వచ్చే మార్పునే సామాజిక మార్పు అంటారు. సమాజం మనుష్యులతో కూడుకొని ఉన్నది. అంటే సమాజంలో మార్పు అంటే ఆసమాజంలో ఉండే మనష్యులలో వచ్చిన మార్పు సాధ్యంకాదు. కాకపోతే ప్రదేశాలలో ఉండే వైవిద్యాన్ని బట్టి మార్పు జరిగే తీవ్రతలో హెచ్చు తగ్గులు ఉంటాయి.

**5. వివిధ కారకాల పరస్పర చర్యల ప్రతిరూపం:** సామాజిక మార్పుకు ఏదో ఒక కారకము వలన కాకుండా కొన్ని కారకాల సమూహం తోడ్పడుతుంది. భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన, సాంకేతిక, సాంస్కృతిక కారకాలు సామాజిక మార్పుకు దోహదపడుతుంటాయి. ఉదాహరణగా మన ఇంటిలో ఉండే వంటగదిని పేర్కొనవచ్చు. ఈరోజులలో వంట చెయ్యడానికి స్త్రీలు ఎక్కువగా కష్ట పడవలసిన అవసరం అంతగా లేదు. గ్యాస్ స్టౌవ్ అన్ని తరగతుల వారికి సర్వ సాధారణం అయిపోయింది. గ్యాస్ స్టౌవ్ పురాతనంగా వస్తున్న కట్టె పొయ్యిలను, కిరోసిన్ పొయ్యిలను కనుమరుగు చేసింది. గ్యాస్ స్టౌవ్ రావడానికి సాంకేతిక రంగంలో జరిగిన కృషే కాకుండా కుటుంబము యొక్క కొనుగోలు శక్తి పెరగటం, నేటి సమాజంలో మారుతున్న స్త్రీ పాత్ర మొదలగునవి దోహదం చేసాయి.

**6. సామాజిక పరివర్తన ప్రతిక్రియల పరంపరను సృష్టిస్తుంది:** మన సమాజాన్ని పరిశీలిస్తే మనకు ఒక విషయం అర్థమౌతుంది. అది ఒక రంగంలో వచ్చిన మార్పు మిగిలిన రంగాలను ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు స్త్రీ స్థానంలో మార్పు రావడంతో కుటుంబ సంబంధాలలో, కుటుంబ వ్యవహారాలలో చాలా మార్పులు వచ్చాయి. అంతకు ముందు స్త్రీ నిర్వహించే కొన్ని విధులను, విద్యా, వైద్య, శిశుసంక్షేమ సంస్థలకు బదలే చేయడం జరిగింది.



BRAOU

ఇంకా నిశితంగా చెప్పాలంటే స్త్రీ చదుకోవడం వలన ఉద్యోగాలలోను, కుటుంబ నిర్వహణలోను వచ్చిన మార్పులు మరియు స్త్రీ తన హక్కులను తెలుసుకోవడం వలన సమాజంలో స్త్రీ స్థానం పూర్తిగా మార్పుకు లోనయ్యింది.

7. ఒక చలన దిశ కలిగి ఉంటుంది: మార్పుకు ఒక చలన దిశ ఉంటుంది. అది కొన్ని సార్లు మంచికి, మరికొన్ని సార్లు చెడుకు, కొన్ని సార్లు తిరోగమన పథంలోను ప్రయాణిస్తుంది. ఈమార్పును నిర్దేశించడానికి అంతర్జాతీయ చట్టాలు లేవు. అంతే గాక ఈమార్పు కూడా ఎప్పుడూ ఒకే లాగ జరగదు. అది కాలానికి, కాలానికి సమాజానికి, సమాజానికి మారుతుంటుంది. ఈమార్పు తీవ్రత పట్టణ ప్రాంతాలలో ఎక్కువగాను, గ్రామీణ ప్రాంతాలలో తక్కువగాను ఉంటుంది. అంతే గాక ప్రణాళికా బద్ద మార్పు చలన దిశ ఎప్పుడూ అభివృద్ధి పథం వైపు ఉంటుంది.

8. నియమ బద్దత: సామాజిక మార్పు యొక్క చలన దిశను నియంత్రించడానికి మనం పథకాలను, ప్రణాళికను రూపొందిస్తుంటాము. సాధారణంగా సామాజిక మార్పు యొక్క చలన దిశను మనం విజ్ఞానంతో నియంత్రిస్తుంటాము. ప్రణాళికాబద్దం కాని మార్పులు ఉపద్రవాల వల్ల సంభవిస్తుంటాయి. ప్రణాళికా బద్ద మార్పు ఎప్పుడు సమాజాన్ని అభివృద్ధి చేయడానికే నిర్దేశించబడుతుంది. మనం నిశితంగా పరిశీలించడం ద్వారా ఈప్రణాళికా బద్ద, ప్రణాళికా బద్దం కాని మార్పులను గమనించవచ్చు.

9.కాలపరిమితి: కొన్ని సామాజిక మార్పుల ఫలితాలు వెంటనే కనిపిస్తే, మరికొన్ని సామాజిక మార్పుల ఫలితాలు కొన్ని సంవత్సరాలకు కాని కనిపించవు. అంతే కాక ఈరోజు చాలా ముఖ్యమైనదిగా భావించబడే మార్పు కొంత కాలం తరువాత సాధారణమైన మార్పుగా కనిపిస్తుంది. అందువలననే చరిత్ర కారులు ఇలా అంటారు, " సంఘటనల ప్రాముఖ్యాన్ని కాలమే నిర్ణయిస్తుంది. కొన్ని సంవత్సరాల క్రిందట వితంతు వివాహాలను సామాజికంగా తప్పుగా భావించేవారు. కాని ఈనాడు వితంతు వివాహాలు సాధారణం అయినాయి.

10.ఒక లక్ష్యం ఉంటుంది: సామాజిక మార్పుకు తారతమ్య విచక్షణ ఉండదు. సామాజిక శాస్త్రవేత్తలకు సామాజిక మార్పు ప్రక్రియ నైతికమా, అనైతికమా అనే విషయం అప్రస్తుతం. సామాజిక మార్పు తటస్థంగా ఉంటుంది. ఇది ఊహాజనితమైనది కాదు. ఎప్పుడు ఒక లక్ష్యాన్ని కలిగి ఉంటుంది.

అంతర్గత లేదా బహిర్గత చర్యల వలన లేదా కొన్ని సందర్భాలలో ఆరెండింటి కలయిక వలన కూడా సామాజిక మార్పు సంభవిస్తుంది. అది సమాజంలో ఏదో ఒక మూల ప్రారంభమై మొత్తం సమాజం అంతా వ్యాపిస్తుంది. కొన్ని సందర్భాలలో సమాజ నిర్మాణం యొక్క మార్పుకు కూడా దోహదపడుతుంది. ఉత్పత్తి పద్ధతులలో మార్పు రావడం వలన లేదా ఉత్పత్తి సంబంధాలు విఫలం కావడం వలన కూడా మార్పు సంభవిస్తుందని మార్క్సిస్టులు భావిస్తారు. ప్రస్తుత సమాజం తన విధులను నిర్వహించడంలో విఫలమైనా కూడా మార్పు వస్తుంది. సామాజిక మార్పును వివరిస్తూ మెక్ ఐవర్ మరియు పేజ్‌లు ఇలా అన్నారు. "ఒక సమాజ నిర్మాణాన్ని మరియొక సమాజ నిర్మాణంతో పోల్చి వాటి మధ్య ఉన్న భేధాలను కొలవడం ద్వారా సామాజిక మార్పును అర్థం చేసుకోవచ్చు". ఇదే విషయాన్ని గురించి చెపుతూ మెక్ లంగ్ లే సామాజిక పరిస్థితులలు వచ్చే మౌలిక మార్పులను సామాజిక మార్పుగా భావించకూడదు. సామాజిక సంస్థలు, సంఘాల నిర్మాణంలోను, విధులలోను వచ్చే మార్పులనే సామాజిక మార్పుగా భావించాలి.

సమాజిక నిర్మాణంలో వచ్చే మార్పును సామాజిక మార్పు అనవచ్చు. ఈమార్పు రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి సమాజ నిర్మాణంలో మార్పు రావడం, రెండు సమాజ నిర్మాణమే మార్పు చెందడం. సాధారణంగా సామాజిక మార్పు సమాజ నిర్మాణంలో మార్పు రావడం ద్వారానే జరుగుతుంది. ఎందుకంటే ఈవిధమైన మార్పు వలన సామాజిక వ్యవస్థ అనిశ్చిత స్థితికి గురి అవ్వదు. చిన్న చిన్న సమూహాలు గ్రామాలుగా గ్రామాలు పట్టణాలుగా , పట్టణాలు నగరాలుగా మార్పు చెందడం ఈమార్పు వలన. పని విభజనలో మార్పు రావడం కొత్త సామాజిక ఉద్భవించడం జరుగుతుంది. కొత్త పాత్రలు రావడం తో అప్పటి వరకూ ఉన్న పాత్రలు ఒక్క సారిగా తొలగిపోవు. కొన్ని సందర్భాలలో పాతవి, కొత్తవి రెండు కలిసి ఒకే సమాజంలో ఉంటుంటాయి. నగరాలు పెరుగుతుండుట వలన కొత్త సంస్థలు వస్తుంటాయి. ఈమార్పులు అన్నీ సమాజ నిర్మాణంలో వచ్చే మార్పులే. సమాజ నిర్మాణం

BRAOU

మొత్తంగా మారడం సాధారణంగా జరగదు. విప్లవం రావడం ద్వారా మాత్రమే అది సాధ్యమౌతుంది. కమ్యూనిస్టులు విప్లవం ద్వారానే పాత వ్యవస్థలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త వాటిని తీసుకొని వచ్చారు.

## 24.4 సామాజిక మార్పు కారణాలు

సామాజిక మార్పు ఎందుకు వస్తుంది అనే విషయం వివరించడం చాలా కష్టమైనది. సామాజిక మార్పుకు చాలా కారకాలు దోహదపడతాయి. ఈకారకాలను కూలంకషంగా విశ్లేషించి గిన్స్ బెర్గ్ వాటిని 8 రకాలుగా విభజించాడు. అవి.

ఎ) మానవునికి కోరికలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. వాటిని తీర్చుకోవడానికి అతడు ఎప్పుడు నిర్ణయాలు తీసుకొంటూనే ఉంటాడు.

బి) మారుతున్న పరిస్థితులు తమకు అనుగుణంగా మారడానికి మానవులు ప్రయత్నిస్తుంటారు.

సి) ఉత్పత్తి కారకాలలో వచ్చే మార్పులు, సమాజ నిర్మాణంలో మార్పులు తెస్తాయి.

డి) విదేశాల ప్రభావం వలన సామాజిక మార్పు వస్తుంది.

ఇ) సామాజిక మతము మొదలగు వాటి వలన సామాజిక మార్పు వస్తుంది.

ఎఫ్) విప్లవాల ద్వారా సామాజిక మార్పు వస్తుంది.

జి) ఒక్కొక్క సారి ఆకస్మికంగా పరిణమించే మార్పులు.

ఎచ్) సమాజంలో అందరికి ఉపయోగపడే సామాన్య ప్రయోజనాలు కూడా సామాజిక మార్పుకు దోహదపడుతాయి.

విజ్ఞానం పెరగడం, సామాజిక కలహాలు కూడా సామాజిక మార్పుకు దోహదం చేస్తాయి. ఆధునిక కాలంతో విజ్ఞానం, వివిధ సంస్కృతుల కలయిక సామాజిక మార్పుకు కీలకమైన పాత్రను వహిస్తున్నాయి. కలహాల వలన సమాజంలో ఉద్రిక్తత ఏర్పడుతుంది. సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడటం ద్వారా సామాజిక మార్పు సంభవిస్తుంది. ఇదే కాకుండా సామాజిక మార్పుకు ఆర్థిక పరిస్థితులు, సాంకేతిక విజ్ఞానం, సిద్ధాంతాలు, ఉద్యమాలు మొదలగునవి కూడా తోడ్పడతాయి.

BRAOU

ప్రకృతిలో ఎప్పుడూ మార్పులు వస్తుంటాయి. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారుతూ ఉంటాయి. మన సమాజం ప్రకృతిలో భాగం. అందువలన అది స్తబ్దంగా ఉండక ఎప్పుడు మారుతూ ఉంటుంది. సామాజిక మార్పు అన్ని సమాజాలలోను, అన్ని కాలాలలోను జరుగుతూనే ఉంటుంది. అన్ని సంస్కృతులు, సంప్రదాయాలు కూడా మారుతూనే ఉంటాయి. నిజానికి మానవ సమాజం యొక్క అంతర్గత లక్షణం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారుతుండటం. పోటీ పూరిత ప్రపంచ వాతావరణంలో మార్పు తప్పని సరి.

సామజిక మార్పు సామాజిక చలనానికి దారి తీస్తుంది. అది స్వచ్ఛందంగా వస్తుంది. సమాజంలో సమాజ నిర్మాణంలో మార్పు రావడం ద్వారా వచ్చే ఈ సామాజిక చలనాన్ని నటాలే రోగోఫ్ సామాజిక దూర చలనము మరియు కోరిక చలనముగా పేర్కొన్నాడు. దీనిని గురించి ఎప్పుడు మనం ఆలోచించడమో, చర్చించుకోవటమో చేస్తు ఉంటాము. ఉదాహరణకు తల్లిదండ్రులు ఈనాడు తమ పిల్లలకు ఉన్న అవకాశాలు, సదుపాయాలు తమ కాలంలో లేవని అనుకొంటుంటారు. దీనిని మనం రెండు విధాలుగా చూడవచ్చు. ఒకటి, సామాజిక పాత్రలను నిర్వహించడానికి కావలసిన శిక్షణ, నైపుణ్యాలలో మార్పులు రావటం. లిప్ సెట్ మరియు జెన్‌డిక్స్ ల ప్రకారం సంక్లిష్ట సమాజాలలో సామాజిక మార్పు వలన వివిధ పదవులను నిర్వహించడానికి కావలసిన అర్హతలలో మార్పు వస్తుంది. ఈమార్పుకి కారణం పారిశ్రామికీకరణం వలన పని విభజనలో నిపుణుల అవశ్యకత పెరగడము.

పారిశ్రామికీకరణము ఉన్నత వర్గంలో చలనము అనే విషయంపై అధ్యయనం చేసిన రాబర్ట్ పారిశ్రామికీకరణ సామాజిక చలనాన్ని పెంచుతుంది అని సిద్దాంతీకరించాడు. అంతే కాకుండా పారిశ్రామికీకరణం వలన వైట్‌కాలర్

ఉద్యోగాల శాతం పెరుగుతుందని, వ్యవసాయక వృత్తుల శాతం తగ్గుతుందని పేర్కొన్నాడు.

రెండు వలస పోవటవలన సంతానోత్పత్తి, మరణాలలో మార్పులు రావడం వలన జనాభా సమూహాలలో మార్పు వస్తుంది. దీని వలన జనాభా వర్గీకరణ కార్మికుల పంపిణీ, వృత్తుల క్రమానుగతశ్రేణిలలో మార్పులు వస్తాయి. సంతానోత్పత్తి రెండు రకాలుగా ఉంటుంది. ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలు, తక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలు. ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలు చనిపోవడం వలన కాళీ అయిన ఉద్యోగాలను సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వలన మరియు పారిశ్రామికీకరణ వలన కొత్తగా పెరిగిన ఉద్యోగాలను చేయడం వలన సామాజిక చలనానికి తోడ్పడతాయి. తక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలు పైపద్ధతుల ద్వారా ఏర్పడిన ఉద్యోగాలను చేస్తూండటంతో పాటు, ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాల సేవలను పొందడం ద్వారా సామాజిక చలనానికి తోడ్పడతాయి. కుటుంబ పరంగా సామాజిక చలనాన్ని అధ్యయనం చేయాలంటే, ఆకుటుంబం తమ పిల్లల అభివృద్ధికి అందించే అవకాశాలు, సదుపాయాలను పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఈవిషయాన్ని విశ్లేషించి సామ్యూల్ హెచ్. ప్రెస్టన్ ఈవిధంగా అభిప్రాయపడ్డారు. తక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలలో తమకున్న వనరులలో ఎక్కువ శాతం తమ పిల్లల అభివృద్ధికై ఉపయోగిస్తున్నారు.

## 24.5 సామాజిక పరిణామము

పరిణామము అనే పదాన్ని ఆంగ్లంలో Evolution అంటారు. Evolution అనే పదం లాటిన్ భాషలో Evolure అనే పదం నుండి గ్రహించబడింది. దీని అర్థం అభివృద్ధి చెందుట విశదీకరించు వెల్లడిచేయుట సాధారణంగా అంతర్గతంగా జరిగే మార్పును పరిణామము అంటారు. ఇది మానవ సంబంధ వ్యవస్థలో అంతర్గతంగా నిరంతరం జరిగే అభివృద్ధిని సూచిస్తుంది. సామాజిక పద్ధతులలో, ఆచార వ్యవహారాలలో, నమ్మకాలలో, సంస్థలు, సంఘాలలో వచ్చే అంతర్గత అభివృద్ధిని సామాజిక పరిణామము అంటారు.

అయితే ఇక్కడ గుర్తించుకోవలసిన విషయం ఏమిటి అంటే క్రమ బద్ధతలో సంభవించే మార్పులను తెలియజేయడానికి మాత్రమే పరిణామము అనే పదాన్ని వాడతారు.

### 24.5.1 సామాజిక పరిణామము-అర్థము-భావన

పరిణామము అనే పదము జీవ శాస్త్రము నుండి సమాజ శాస్త్రములోకి తీసుకోబడింది. జీవ శాస్త్రములోని జీవ పరిణామము పదాన్ని సమాజ శాస్త్రములో సామాజిక పరిణామముగా అనువదించారు. జీవ పరిణామ సిద్ధాంతం జీవుల పుట్టుక వాటి అభివృద్ధిని తెలియజేస్తే సామాజిక పరిణామ సిద్ధాంతం మానవ సమాజ పరిణామాన్ని మానవ సంబంధాల అభివృద్ధి గురించి తెలియజేస్తుంది. సమాజ శాస్త్రవేత్తలు జీవ పరిణామ సిద్ధాంతంతో బాగా ప్రభావితులై దానిని సామాజిక ప్రపంచానికి విపరించడానికి విరివిగా ఉపయోగించారు. అందువలన ఇది సమాజశాస్త్రములో బాగా ప్రాచుర్యాన్ని పొందింది.

సామాజిక పరిణామ భావన ముఖ్యముగా రెండు విషయాల చుట్టూ పరిభ్రమిస్తుంది. అవి.1. సమాజం ఏవిధంగా ఏర్పడింది. 2. మానవ నాగరికత ఏవిధంగా మార్పు చెందుతూనేటి స్థితిలో ఉంది. సమాజాన్ని ఏర్పరచింది మానవులే ఇక్కడ సమాజాన్ని సామాజిక ప్రవర్తన పరంగా అర్థం చేసుకోవాలి. సామాజిక ప్రపంచంలో పరిణామము చెందేది మానవుడు అతనితో పాటు అతడు జీవించే సమాజం కాని మానవ శాస్త్రజ్ఞులు మారుతున్నది సమాజం కాదు సంస్కృతి భావిస్తున్నారు. దీనితో పరిణామ భావన ఉద్భవించింది. ఈసాంస్కృతిక పరిణామ భావన కు వృద్ధి చేయడం కనిపెట్టడం, వ్యాపింపచేయడం సర్దుబాటు చేసుకోవడం అనే నాలుగు అంశాలు తోడ్పడతాయి. సమాజంలో వచ్చే మార్పులను అర్థం చేసుకోవడానికి సామాజిక పరిణామ భావన ఉపయోగపడుతుంది. ఉదాహరణకు కుటుంబ పరిణామములో మార్పు కుటుంబం నిర్వహించే కొన్ని విధులను ఇతర సంస్థలకు బదలాయించడం మొదలగునవి.



పరిణామాన్ని గురించి మొట్ట మొదటిగా చెప్పిన వ్యక్తి జర్మనీకి చెందిన వాన్ బేర్ కాని ఈ భావనను అభివృద్ధి

BRAOU

పరిచింది డార్విన్. స్పెన్సర్స్ మొదలగు వారు. మొదటిలో ఒక సాధారణ తెగ నుండి నాగరిక దేశం వరకు వాటి నిర్మాణంలో, విధులలో విభేదాలు ఉంటాయి. కాలక్రమేణా అవి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారుతూ స్థిరత్వాన్ని సంతరించుకొంటాయి. సమాజ నిర్మాణం కూడా ప్రారంభంలో చాలా అనిశ్చితంగా ఉండేది. కాలక్రమేణా అది స్థిరత్వాన్ని పొందింది. ఆచార వ్యవహారాలు , సంప్రదాయాలు చట్టాలుగా మారాయి. సమాజాలు నిర్వహించవలసిన విధులలో మార్పులు వచ్చాయి. అవసరాలను బట్టి కొన్ని సమాజాలు విడిపోవడమే కాక వాటి నిర్మాణంలో మార్పులు చోటు చేసుకొన్నాయి. ఇవి అన్నీ కూడా పరిణామ భావన క్రిందకే వస్తాయి.

## 24.5.2 సూత్రాలు నిర్వచనము

స్పెన్సర్స్ ప్రకారం పరిణామానికి 4 సూత్రాలు కలవు. అవి :

1. విశ్వ పరిణామ భావనలో సామాజిక పరిణామము ఒక సాంస్కృతిక లేక మానవ సంబంధ చట్టము.

2. విశ్వ పరిణామము జరిగినట్లుగానే సామాజిక పరిణామము కూడా జరుగుతుంది.

3. సామాజిక పరిణామము నెమ్మదిగా వస్తుంది.

4.సామాజిక పరిణామము అభివృద్ధి పథంగా ఉంటుంది.

మానవులు పాత అలవాట్లు, పద్ధతులను వదలి కొత్త నాటికి మారడాన్ని సామాజిక పరిణామముగా నిర్వచించారు. ఇ.హెచ్ హాన్ ప్రకారం "సంస్కృతిలో, సామాజిక సంబంధాలలో, సామాజిక పరస్పర చర్యలలో వచ్చే యోజిత, అనియోజిత అభివృద్ధే సామాజిక పరిణామము".

## 24.5.3 పరిణామ ప్రక్రియ

సామాజాలు అన్నీ సాధారణ స్థితి నుండి సంక్లిష్ట స్థితికి చేరే దారిలో అనేక దశలను దాటవలసి ఉంటుంది. ఉదాహరణకు సెయింట్ సైమన్ పరిణామాన్నిగురించి చెపుతూ మానవులందరు పరిణామ ప్రక్రియలో కొన్ని దశలను దాటవలసి ఉంటుంది అని చెప్పాడు. అతను మానసిక చైతన్యాన్ని ఊహాజనితమైనది, misconjuctural మరియు సునిశ్చితమైనదిఅనే మూడు దశలుగా వివరించాడు. కామ్టే ప్రకారం సమాజాలు అన్నీ మతధర్మ దశ, అధిభౌతిక దశ, సాంకేతిక దశ అనే 3 దశల ద్వారా ప్రయాణించాలి. స్పెన్సర్ తన అనే గ్రంథంలో సామాజిక జీవనం సాధారణ స్థితి నుండి సంక్లిష్ట స్థితికి, స్వజాతీయత నుండి విజాతీయతకు ఏవిధంగా మారేది వివరించాడు.

19వ శతాబ్దంలో చాలా మంది శాస్త్రజ్ఞులు సామాజిక పరిణామాన్ని విభిన్న దృక్కోణాల నుండి అధ్యయనం చేసారు. వారిలో ముఖ్యులు సర్ హెన్రీ మైనే, ఎల్.హెచ్. మోర్గాన్, ఇ.బి.టైలర్ మొదలగు వారు. హెన్రీ మైనే తన (1861) గ్రంథంలో వ్యవస్థీకృత రూపాల నుండి సమాజాలు ఏర్పడ్డాయని, ఆసమాజాలలో సంబంధాలు స్థాయిని బట్టి ఉంటాయని వివరించాడు. మోర్గాన్ తన (1878) గ్రంథంలో ఆదిమ తెగల నుండి కుటుంబ వ్యవస్థ క్రమబద్ధంగా లేని స్త్రీ, పురుష కలయిక స్థితి నుండి పెళ్ళి వ్యవస్థ మొదలగునవి ఏవిధంగా ఏర్పడయో వివరించడమే కాకుండా మత వ్యవస్థ ఏవిధంగా అభివృద్ధి చెందిందో వివరించాడు.

ఈవిధంగా పరిణామ సిద్ధాంతం మానవ సమాజం ఏవిధంగా పరిణామం చెందిందో వివరించింది. కాని ఈ సిద్ధాంతాన్ని 20వ శతాబ్దంలో పూర్తిగా తిరస్కరించారు. తరువాతి కాలంలో నిర్మాణీకృత వ్యవస్థను విశ్లేషించడం ద్వారా తిరిగి ఈసిద్ధాంతానికి జీవం పోసారు. సమాజ మానవ శాస్త్రంలో ఈవిషయాన్ని మనం చూడవచ్చు. సమాజ శాస్త్రంలో పరిణామ భావనకు మార్పులు చేసి సాంకేతికతను చేకూర్చారు.

సామాజిక పరిణామము ప్రక్రియలు: సమాజాలు ప్రస్తుతం ఉన్నట్టుగా ఆధునిక సమాజాలుగా మార్పు చెందడంలో 4 ప్రక్రియలు ఉపయోగపడ్డాయి. అవి:



1. పారిశ్రామికీకరణము

BRAOU

2.నగరీకరణము

3.ఉద్యోగికరణము

4. కేంద్రీకరణము

వీటిని లోతుగా పరిశీలించిన అవి ఒక దానితో మరియొకటి దూరంగా ఉండే ప్రక్రియలుగా మనం గుర్తించవచ్చు. కాని చారిత్రక నేపధ్యంలో చూస్తే అవి ఒక దానితో మరియొకటి పరస్పర సంబంధం కలవిగా మనం గుర్తిస్తాము. దీనిని బట్టి ఒక ప్రక్రియలో వచ్చే అభివృద్ధి మరియొక ప్రక్రియపై ప్రభావం చూపుతుందని మనం అర్థం చేసుకోవచ్చు. ఈ నాలుగు ప్రక్రియలే సమాజాలు ఆధునికంగా మార్పు చెందడానికి దోహదపడ్డాయి, పడుతున్నాయి. వీటిని గురించి విపులంగా పరిశీలిద్దాం.

పారిశ్రామికీకరణము: నేటి ఆధునిక సమాజాలలో పారిశ్రామికీకరణము, నగరీకరణము, ఉద్యోగీకరనము, కేంద్రీకరణములకు చాలా ప్రాధాన్యత ఉంది. వీటిలో పారిశ్రామికీకరణము భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించడానికి ఎక్కువగా తోడ్పడింది. పారిశ్రామికీకరణానికి ముందు వస్తువుల ఉత్పత్తి చేతి వృత్తుల ద్వారా అవుతుండేది. చేతివృత్తుల స్థానంలో యంత్రాలను ప్రవేశ పెట్టుట వలన ఉత్పత్తి విధానంలో చాలా మార్పు వచ్చింది. దీని ఫలితంగా సమాజం మొత్తంగా మార్పుకు గురి అయ్యింది. అంటే పారిశ్రామికీకరణానికి ముందు సమాజాలు ఎప్పుడు మార్పుకు లోను కాలేదని మనం అర్థం చేసుకోకూడదు. సమాజాలు ఎప్పుడు మార్పుకు గురి అవుతూనే ఉంటాయి. కాని అప్పటి సామాజిక క్రమం, సంస్కృతులలో మార్పు చాలా నెమ్మదిగా వస్తుండేది.

సాధారణంగా భూస్వామ్య సమాజాలు బయట నుండి మార్పులు ప్రవేశ పెడితే తప్ప మారవు. అంతేగాక, సామాజిక మార్పు మొత్తంగా సమాజం అంతటా ఒకే సారి రాదు. అలానే భూస్వామ్య సమాజంలో పారిశ్రామికీకరణను ఒక వర్గం వారు ప్రారంభించారు. దానితో సమాజంపై అధికారం భూమి ఉన్నవారికి కాక, పరిశ్రమలు ఉన్నవారి చేతిలోకి మారింది. సమాజంలో ఒక కొత్తవర్గం పుట్టింది. పారిశ్రామికీకరణను విస్తృతంగా సాధించాలంటే వస్తుపరిజ్ఞానం, రాజకీయ ఐక్యత, వ్యవసాయ ఉత్పత్తులు, సామాజిక పరిజ్ఞానం, వ్యాపార విలువలు కావాలి. ఎక్కువ స్థాయిలో యంత్రాలను ఉపయోగించడానికి సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం. మనం యంత్రాలను తయారుచేయడం ద్వారాకానీ లేదా దిగుమతి చేసుకోవడం ద్వారాగానీ పారిశ్రామికీకరణను సాధించాలి. సూక్ష్మంగా చెప్పాలంటే పారిశ్రామికీకరణను సామాజిక పరిజ్ఞానం వస్తు పరిజ్ఞానంపై ఎక్కువ ఆధారపడి ఉంది. 20వ శతాబ్దం ప్రారంభంలో మాక్స్ వెబర్ ఇలా అన్నాడు. పారిశ్రామికీకరణకు ఆర్థిక, సామాజిక, రాజకీయ అవసరాలతోపాటు సాంస్కృతిక విలువలు ప్రమాణాలు కూడా అవరసము. వీటిని ఇతడు నిరసననేతి () అని అన్నాడు. ఇవి మానవుని అంతర్గత వికాసానికి దోహదపడుతాయని వివరించడారు. మార్క్స్ సామాజిక ప్రతితపాదనలను గురించి చెప్పుతూ సమాజం ఎక్కువగా ఆర్థిక శక్తిపై ఆధారపడుతుందని అన్నాడు. దానిని ఎవరు నియంత్రిస్తుంటారో వారు సమాజంపై ఆదిపత్యాన్ని వహిస్తారని అంటాడు. మార్క్స్ ప్రకారం సమాజంలో రెండు వర్గాలు ఉంటాయి. అవి 1. బూర్జువాలు, 2. శ్రామికులు. బూర్జువాలు వ్యక్తిగతంగా మంచివారైనా పెట్టుబడిదారులే చట్టాల వలన వారు శ్రామికుల శక్తిని దోచుకుంటారు అని మార్క్స్ అభిప్రాయం.

నగరీకరణము: నగరీకరణములో భాగంగా సమాజంలో కొన్ని వర్గాలు వాటి సంఖ్యను పెంచుకోవడంద్వారా ఆ సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. నగరీకరణ పెరుగుతున్న కొలది సమాజంలోని సామాజిక జీవనం దాని ప్రభావానికి లోనవుతుంది. ముందుగా మనం నగరీకరణ అంటే ఏమిటో తెలుసుకుందా. దీనికి సాధారణంగా పరిగణలోకి తీసుకునేది జనాభాసంఖ్య అమెరికా గణాంకశాఖ నిర్వచనం ప్రకారం 2500 మంది ఉండే సమాజంను నగరం అంటారు. కొన్ని చోట్ల ఈ సంఖ్య 50000గాను, కొన్ని చోట్ల లక్షగానూ ఉంది. దీన్ని బట్టి అన్ని చోట్ల ఒకే నియమాన్ని పాటించడంలేదని, ప్రదేశ ప్రదేశానికి మారుతుందని మనకు తెలుస్తుంది.

పారిశ్రామిక అభివృద్ధి నగరీకరణ పెరుగుదలపై ఆధారపడి ఉంది. వ్యవసాయరంగంలో ఉపాదికోల్పోయినవారు పరిశ్రమలో స్థిరపడ్డారు. నగరజీవనంలో నిపుణత, అవశ్యకత పెరగడంతో వార్తా సౌకర్యాలలోనూ, రవాణాసౌకర్యాలలోనూ చాలా మార్పులు వచ్చాయి. నగర ప్రజలు ఉత్పత్తి చేసిన వస్తువులను ఎగుమతి చేయుటకు, వారికి కావలసిన నిత్యావసర వస్తువులను దిగుమతి చేసుకొనుటకు నగరాల మధ్య వార్త,

రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయవలసిన అవసరం ఏర్పడింది. నగరాలలో రద్దీ పెరిగిన కొలది ప్రజలు నగర శివార్లకు వెళ్లడం మొదలవుతుంది. దీనినే ఉప నగరీకరణం అంటారు. ప్రజలతోపాటు కొత్త పరిశ్రమలుకూడా నగర శివార్లకు తరలించబడుతుంది. ఈవిధంగా నగరాలు పెరిగి, ఒకదానితో ఒకటి కలిసి మెట్రోపాలిసెస్, మెగా పొలిసెస్‌లు ఏర్పడతాయి.

**ఉద్యోగికీకరణము:** మనం సమాజాన్ని నిర్మించుకొన్నది మన జీవితం సుఖవంతంగా సాగిపోవడానికి. దీనిలో భాగంగా కొన్ని సామూహిక కార్యక్రమాలను నిర్వహించుకోవలసి ఉంటుంది. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ ఉద్యోగ వ్యవస్థ. సాధారణంగా ఉద్యోగికీకరణం అంటే సామూహిక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, సమాజనిర్మాణాన్ని అర్థవంతం చేయడం. ఇవే కాకుండా గమ్యాలను నిర్ణయించడం, సంబంధిత సమాచారం సేకరించడం, ఉపయోగించడం, హేతుబద్ధంగా పరిశీలించడం, నిర్ణయాలు చేయడం, సామాజిక ప్రణాళికలను రూపొందించడం మొదలైనవికూడా ఇమిడి ఉన్నాయి. సాధారణంగా ఉద్యోగస్వామ్యం అంటే ఆలస్యానికి మారుపేరని, అసమర్థత, చట్టాలు ఖచ్చితంగా ఉంటాయని ప్రజలు భావిస్తారు. కానీ, వీటిని సమాజం శాస్త్రజ్ఞులు పరిగణలోకి తీసుకోరు. వారు సమాజాలు పెద్దవిగానూ, సంక్లిష్టంగా మారడాన్ని ఉద్యోగికీకరణగా భావిస్తారు. సమాజ నిర్మాణాన్ని హేతుబద్ధంగా వివరించి దాని గమ్యాన్ని సమర్థవంతంగా చేరడానికి తోడ్పడేదే ఉద్యోగికీకరణము.

చారిత్రకంగా, పారిశ్రామికీకరణము, నగరీకరణముల పెరుగుదల ఉద్యోగికరణము పెరుగుదలకు దారి తీస్తుంది. పారిశ్రామికీకరణము, నగరీకరణము రెండూ సమాజంలో ఒకచోటికి చేరి, సమాజ లక్ష్యాలను సాధించడంలో ఉద్యోగులను సహాయపడేట్లు చేస్తాయి. మనం గుర్తించుకోవలసిన విషయం ఏమిటంటే సమాజాలు చిన్నవయితే ఉద్యోగికీకరణ ఆవశ్యకత అంతగా ఉండదు. వెబర్ ఉద్యోగిస్వామ్య లక్షణాలను గురించి శాస్త్రీయంగా వివరించాడు. బాగా అభివృద్ధి చెందిన సమాజంలో ఉద్యోగుల పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగుల అధికారం, క్రమానుగత శ్రేణి ఆ సమాజంలో పిరమిడ్ ఆకారం పోలి ఉంటుంది.

**కేంద్రీకరణము:** ప్రస్తుత సమాజంలో కేంద్రీకీకరణ భావన కొత్తది. దీనిపై శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధనలు జరుపుతూనే ఉన్నారు. సమాజంలో అధికారం ఒకవర్గం చేతిలో కేంద్రీకృతమై ఉంటుంది. వారే అన్ని సామూహిక కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంటారు. కేంద్రీకీకరణ ఒక సామాజిక చలన ప్రక్రియ. నిరంకుశ అధికార వ్యవస్థలో అధికారం పైనుండి కిందకు పయనిస్తుంది. ప్రస్తుత సమాజంలో ఈ కేంద్రీకరణ సమాజ నిర్మాణంతో సంబంధంలేకుండా జరగడం మనం గమనించవచ్చు.

వ్యవస్థీకృత నిర్మాణంలో మనము ఈ కేంద్రీకరణ భావనను చూడవచ్చు. వ్యవస్థలో నిర్ణయాలు చేయడం, దాని పనితీరును నియంత్రించడం మొదలగు కార్యకలాపాలను నిర్వచించేదానిని కార్యనిర్వాహక వర్గం అంటారు. ఆ వ్యవస్థలో అధికారం ఆ వర్గం చేతిలో కేంద్రీకృతమై ఉంటుంది. ఈ కేంద్రీకరణ భావనకు బాగా తోడ్పడినది పారిశ్రామికీకరణము, నగరీకరణము, ఉద్యోగికరణములు. మొదట పారిశ్రామికీకరణము వలన ఎక్కువ సంఖ్యలో ఉత్పాదకత పెరిగి సమాజంలో కొత్త వనరులు ఏర్పడటానికి దారి తీసింది. దానితో ప్రజలు ఒకప్పుడు సాధ్యం కాదనుకొన్న లక్ష్యాలను సాధించడానికి వీలు పడింది. నగరీకరణము వలన ప్రజలందరూ ఒకచోటకు చేరే అవకాశం ఏర్పడింది. దానితో వారంతా ఒక శక్తిగా ఏర్పడి, వారందరికి ఉన్న సమస్యలను ఉమ్మడిగా ఎదుర్కొని విజయం సాధించారు. ఉద్యోగికీకరణము వలన కేంద్రీకృత వ్యవస్థ ఏర్పడింది. ఇవి అన్ని అధికార కేంద్రీకరణలకు దారితీసాయి.

## 24.6 అభివృద్ధి

సమాజ అభివృద్ధి సిద్ధాంతాల మధ్య ఉద్దేశ్యము మానవ అభివృద్ధిని విశదీకరించడమే. మానవ అభివృద్ధి అంటే మానవుడు వ్యక్తిగతంగా కానీ, ఉమ్మడిగా కానీ, శక్తిని పొంది దానిని తనకు తానుగా కానీ, ప్రకృతిని కానీ జయించడానికి ఉపయోగించడము. ఇదే విషయాన్ని వివరిస్తూ బాటోమార్ అనే శాస్త్రవేత్త అభివృద్ధి అనే పదాన్ని



BRAOU

రెండు సామాజిక ప్రక్రియలతో ఉపయోగించవచ్చునని అంటాడు. అవి1. విజ్ఞాన పెరుగుదల, 2. ప్రకృతిపై మానవుని నియంత్రణలో పెరుగుదల. ఇవి మానవుడు ఆర్థిక సాంకేతిక రంగాలలో అభివృద్ధిని సాధించడంలో సాధ్యపడుతుంది.

అభివృద్ధి సమాజం యొక్క సాధారణ లక్షణం అయినా అది పరిశోధకులను ఎక్కువగా ఆకర్షించింది. ప్రపంచ యుద్ధాల తర్వాత అభివృద్ధిలో చాలా మార్పు వచ్చింది. ఈనాడు ఒక దేశం అభివృద్ధి చెందని దేశం అంటే అది ఆర్థికంగా, సాంకేతికంగా వెనుకబడి ఉన్నట్లు అర్థం చేసుకోవాలి. ఇలాంటి దేశాలు ప్రణాళికల ద్వారా వాటి ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకొని, పేదరికాన్ని నిర్మూలించడం ద్వారా అభివృద్ధి సాధించడానికి ప్రయత్నిస్తుంటాయి. కొందరు అభివృద్ధి వలన పెరుగుదల సాధ్యపడుతుందని నిర్వచిస్తే మరికొందరు. పెరుగుదల వలన అభివృద్ధి సాధ్యపడుతుందని నిర్వచించారు. అభివృద్ధి భావనలో నిర్మాణాత్మక మార్పులు కూడా కలిసి ఉంటాయి. ఇంకొందరు అభివృద్ధిని పెరుగుదలతో కలిపి చూడాలని భావించారు. ఈ భావనలో నిర్మాణాత్మక మార్పు, ఉత్పత్తి పెరుగుదల ఉంటాయి. మరొక దృక్పథం ప్రకారం నిర్మాణాత్మక మార్పు ఉపసిద్ధాంతమే అభివృద్ధి. ఎందుకంటే అభివృద్ధి భావనలో ఆదాయం పంపిణీకూడా ఒక అంశం. అనేక మంది రచయితలు వాక్యానించింది ఏమిటంటే, అభివృద్ధి అంటే ఉత్పాదకతను పెంచడంతోపాటు దానిని సమాజంలో అందరికీ సమానంగా పంపిణీ చేయడం కూడా. మైర్ కూడా అభివృద్ధి అంటే పెరుగుదల, మార్పుల కలయిక అని నిర్వచించాడు.

అభివృద్ధి భావన ఒక విధమైన సామాజిక మార్పు. అది 16వ శతాబ్దములో యూరప్ ఖండములో పుట్టింది. మనం సామాజిక మార్పు భావనను విశ్లేషిస్తే భూస్వామ్య వ్యవస్థ నుండి నేటి స్థితికి సమాజం ఎలా మార్పు చెందిందో మనకు అర్థమవుతుంది.నేటి సమాజంలో అభివృద్ధి అంటే సాంప్రదాయ లేదా అభివృద్ధి చెందని దేశాలు ఆర్థికంగా ఎలా ప్రగతిని సాధిస్తున్నాయో సూచిస్తుంది. డాస్ సాంతోస్ మాటల్లో చెప్పాలంటే ఆధునిక ప్రపంచంలో మానవునికి, సమాజానికి అవసరమైన కొన్ని ముఖ్యమైన లక్ష్యాలను సాధించడమే అభివృద్ధి. అభివృద్ధి, పరిణామము, ప్రగతిలు మార్పుకి వివిధ మార్గాలు. సామాజిక మార్పును గురించి మాట్లాడేటప్పుడు పై అన్నింటిలో వచ్చే మార్పు, దాని వలన సమాజ ప్రక్రియ పని విధానంలో వచ్చే మార్పు గురించి అయ్యి ఉంటుంది. అభివృద్ధి అంటే ఒక వ్యవస్థలో లాంచనంగాను మరియు నిర్మాణంలోను వచ్చే మార్పు. జీవనం ఏవిధంగా పెరిగి సాధారణ స్థితి నుండి, సంక్లిష్ట స్థితికి మారుతుందో అలానే సమాజం కూడా వివిధ అంగాల మధ్య సామరస్యతను, సారూప్యతను సాధించడానికి మార్పు చెందుతూ ఉంటుంది.

BRAOU

## 24.7 సారాంశం

మనచుట్టూ ఉన్నది ఏదీ నిశ్చలంగా ఉండదు. అన్నీ మార్పులకు గురి కావలసిందే. ఎందుకంటే మార్పు ప్రకృతిలో ఒక భాగం. ఏవ్యవస్థలోనైనా సామాజిక మార్పు దాని నిర్మాణంలోను మార్పును తీసుకొని వస్తుంది. ఈసామాజిక మార్పు సాధారణమైనదికాదు. ఒక దానిలో వచ్చిన మార్పు మిగిలిన వాటిని ప్రభావితం చేస్తుంది. కొన్ని సామాజిక మార్పులు ఆకస్మికంగా వస్తే, మరికొన్ని ప్రణాళికా బద్ధంగా వస్తాయి. వస్తు ఉత్పత్తి పద్ధతులలో మార్పు రావటం ద్వారా మార్పు వస్తుందని మార్క్స్ అభిప్రాయపడ్డాయి. ఈ మార్పు వలన పనిధానాలలో మార్పులు రావడం, కొత్తగా సామాజిక పాత్రలు ఉద్భవించడం కూడా జరుగుతుంది. సామాజిక వర్గాల మధ్య ఘర్షణల వలన కూడా మార్పు సంభవిస్తుంది. విజ్ఞానం పెరుగుట వలన, సామాజిక ఘర్షణల వలన కూడా సామాజిక మార్పు వస్తుంది. పరస్పర సంస్కృతుల కలయిక వలన సామాజిక సంబంధాలలో మార్పు రావడం వలన సామాజిక మార్పు వస్తుంది.

నిరంతర ప్రక్రియ, లౌకికత, వ్యక్తులలో మార్పు పరంపరత, చలనదిశ, ప్రణాళికా జస్థత మొదలగునవి సామాజిక మార్పు లక్ష్యాణాలు. సామాజిక చలనము సామాజిక మార్పు ఫలితము. తరాలు మారుతున్న కొలది ప్రజలలో చలన వేగం పెరుగుతుందని, దాని వలన సామాజిక మార్పు వేగం కూడా పెరుగుతుందని ఒక పరిశోధనలో వెల్లడియ్యింది.

పరిణామము అంటే క్రమంగా జరిగే మార్పు. ఈభావనలో సమాజం ఎలా పరిణామము చెందినవి? మన నాగరికత నేటి స్థితికి ఎలా మారింది? అనే ప్రశ్నలు ఉన్నాయి. పరిణామ భావాన్ని అధ్యయనం చెయ్యడం ద్వారా సామాజిక నిర్మాణంలో ఏమి జరుగుతుందో మనం తెలుసుకొన వచ్చును.

సామాజిక పరిణామ భావన ప్రకారం సమాజాలు అన్నీ స్వజాతీయత నుండి విజాతీయత, సాధారణ స్థితి నుండి సంక్లిష్ట స్థితి మొదలగు కొన్ని స్థాయిలను దాటవలసి ఉంటుంది. ఈభావనను రెండు పద్ధతుల ద్వారా అధ్యయనం చేయవచ్చు. మొదటిది, చారిత్రకంగా పారిశ్రామికీకరణము, నగరీకరణము ఉద్యోగీకరణము, కేంద్రీకరణము ఒకదానిపై మరియొకటి ఆధారపడి ఉంటాయి. సమాజంలో ఒకసారి పారిశ్రామికీకరణము ప్రారంభమైతే మిగిలినవి వాటంతటవే అవే చోటు చేసుకుంటాయి. ఇవి అన్నీ మానవుని నియంత్రణలోనే ఉంటాయి. మానవుడు తన అవసరాన్ని బట్టి వాటి దిశలను మారుస్తుంటాడు. రెండవది, పారిశ్రామికీకరణము, నగరీకరణము, ఉద్యోగీకరణము, కేంద్రీకరణములలో వచ్చే మార్పులు సామాజిక జీవితంలో పెద్ద పెట్టున మార్పులు తీసుకువస్తాయి. కుటుంబము, విద్య, మతం, సామాజిక వర్గీకరణ, జాతి, చట్టము, ప్రభుత్వము మొదలగునవి పరిణామాత్మక మార్పు వలన ఎక్కువగా ప్రభావితం అవుతున్నాయి. అందువలన అభివృద్ధి, పరిణామము, ప్రగతి భావనలను మార్పుకు భిన్న రీతులుగా భావించవచ్చు.

## 24.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు

I ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.

1. సామాజిక మార్పులపై ఒక వ్యాసం వ్రాయుము.
2. సామాజిక మార్పును నిర్వచించి, దానిని తగు ఉదహరణలతో వర్ణింపుము.

II ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.

1. సామాజిక మార్పు లక్షణాలను వివరింపుము.
2. అభివృద్ధిపై ఒక వ్యాసము వ్రాయండి.

BRAOU

## 24.9 చదవదగిన పుస్తకాలు


Shah, A.M : Bavisker, B.S and Pamaswamy, E.A- Social Structure and Change

Marvin E. Olsen : The Process of Social Organisation

Rajesh Gill : Social Change in Urban Periphery

Srinivas .M.N : Social Change in Modern India

Srinivas M.N :Dimensions of Social Change in India

Smelson : Sociology an Introduction

Robert W. Stern : Changing India.

Yogendra Singh : Modernization of India Tradition

Yogendra Singh : Social Change in India.

# భాగం-25: సామాజిక పరివర్తన - కారకాలు

విషయక్రమం


25.0 లక్ష్యాలు, ఉద్దేశ్యాలు

25.1 ఉపోద్ఘాతం

25.2 సామాజిక పరివర్తన - భౌగోళిక లేక భౌతిక కారకాలు

25.3 సామాజిక పరివర్తన - జైవిక కారకాలు

25.3.1 ప్రకృతి ఎంపిక/వరణం

25.3.2 సామాజిక ఎంపిక/వరణం

25.4 సామాజిక పరివర్తన - సాంస్కృతిక కారాలు

25.4.1 సాంస్కృతిక విలంబన

25.5 సామాజిక పరివర్తన - మానసిక కారకాలు

25.6 సామాజిక పరివర్తన - సాంకేతిక కారకాలు

25.6.1 సాంకేతిక ప్రభావం

25.7 సారాంశం

25.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

25.9 చదవదగిన పుస్తకాలు


BRAOU

## 25.0 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు కింది విషయాలను అర్థం చేసుకోగలుగుతారు:

- సామాజిక పరివర్తనలకు దారితీసే భౌగోళిక లేదా భౌతిక కారకాలను వివరించగలరు.
- జైవిక కారాకాలు ఎలా సామాజిక పరివర్తనకు కారణం అవుతాయో తెలుసుకోగలరు.
- కాలానుగుణంగా సాంస్కృతిక కారకాలు ఎలా మార్పు చెందుతాయో తెలుసుకోగలరు.
- సామాజిక పరివర్తనలో మానసిక కారకాల పాత్ర ఎలాంటిదో అర్థం చేసుకోగలుగుతారు.
- సాంకేతికత అనేది సామాజిక పరివర్తనను ఎలా ప్రభావితం చేస్తుందోననే అవగాహన ఏర్పడుతుంది.

## 25.1 నిర్వచనం

సామాజిక పరివర్తనకు దారితీసే కారకాలను గురించిన ఈ చర్చలో ముఖ్యమైన కారకాలైన భౌగోళిక, జైవిక, సాంస్కృతిక, సాంకేతిక కారకాలను గురించి వివరించడం జరుగుతుంది. భౌగోళిక కారకాలు సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో, సామాజిక పరివర్తనను ఎలా నిర్ణయిస్తాయో వివరిస్తాయి. భౌతిక కారకాలు కూడా ఒక సమాజపు సాంస్కృతికాభివృద్ధికి గణనీయంగానే తోడ్పడతాయి. జైవికాంశాలకు సంబంధించిన - ముఖ్యంగా మానవేతర వాతావరణం లేదా పర్యావరణం అంటే మొక్కలు, పశుపక్ష్యాదులు - అనువంశికతను, జనాభా స్వరూపాన్ని, ఫల సామర్థ్యాన్ని(fertility), మర్త్యత్వాన్ని(mortality), వలసతత్వాన్ని ప్రభావితం చేయడం ద్వారా సామాజిక పరివర్తన పై ప్రభావం చూపుతాయి. జైవిక కారకాల వల్ల కలిగే సామాజిక మార్పులను సులభంగా అంచనా వేయవచ్చు. ఎందుకంటే వీటిని నిర్దిష్టంగా పరిశీలించడానికి వీలుంటుంది. మరణాల రేటు వైద్య సదుపాయాలను సూచించడమేకాక భౌతిక పరిస్థితులను కూడా స్పష్టంచేస్తుంది. సాధారణంగా ప్రజలు దూరదేశాలకు ఉద్యోగాన్వేషణలో వలసపోవడం జరుగుతూ ఉంటుంది. ఇలాంటిది స్వదేశంలో వారు అనుభవిస్తున్న దారిద్ర్యం వల్ల గానీ, అణచివేతవల్ల కానీ జరుగుతూ ఉండవచ్చు. అంతేకాక విదేశాలకు ఉద్యోగాల వేటలో వెళ్ళేవారు విదేశాలకు తమ శక్తి సామర్థ్యాలను సమర్పిస్తుంటారు. మి చుట్టూ ఉన్న సంస్కృతి స్వచ్ఛమైనది కాదు. కాలగమనంతో పాటు దీనిలో కూడా మార్పులు చోటు చేసుకొంటూ ఉంటాయి. సంస్కృతి అంటే మన జీవనవిధానము, ఆలోచనా తీరు, అలవాట్లు, ఆచారాలే. వేషభాషలు, ఆవాసాలు మొదలైన వాటి సమాహారమే. మన ప్రవర్తనను నిర్దేశించేది మన సంస్కృతే. సామాజిక పరివర్తనలో సాంస్కృతిక కారకాల పాత్ర ప్రముఖమైంది. మానసిక ఆలోచనా తీరును, మనోప్రవృత్తి(mentality)ను, మానవ సంకల్పం(human will), సహజస్వభావాల ముద్ర సామాజిక వ్యవస్థపై పడుతుంది. సాంకేతికాభివృద్ధి ఒక సమాజ సాంస్కృతిక జీవితంపై చూపుతూ ఉండటం మనకు స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. సాంకేతిక సమాజాన్ని, సాంస్కృతిక లక్షణాలను రూపొందిస్తూ ఉంటుంది. శాస్త్ర సాంకేతిక రంగంలో మానవుడు సాధిస్తున్న ప్రగతి ప్రతి దశా సమాజంలో అనేక మార్పులకు కారణమౌతుంది. ఫ్యాక్టరీ వ్యవస్థ వస్తువుల ధరలను గణనీయంగా తగ్గించింది.

పై పరిణామాలను పరిశీలిస్తే మన చుట్టూ ఎన్నో మార్పులు చోటు చేసుకొంటున్నట్లు గమనించవచ్చు. అంటే ఈ మార్పులు ప్రకృతి నియమాలలోనే కాక జీవన విధానాలలో కూడా వస్తోందన్న మాట.

సమాజం నిరంతర పరిణామాలకు గురి అవుతూనే ఉంది. ఈ మార్పులకు అంతర్గత,బాహిర ప్రభావాలు దోహదం చేస్తుంటాయి. అందువల్ల నిరంతర మార్పులు చోటు చేసుకొంటూ ఉంటాయి. సామాజిక పరివర్తనకు కారణభూతమైన అంశాలలో, భౌతిక, జైవిక, సాంస్కృతిక, సాంకేతిక అంశాలు ముఖ్యమైనవి. ఇవేకాక అనేక ఇతర అంశాలు కూడా సామాజిక పరివర్తనకు మూలమవుతున్నాయి. పైన పేర్కొన్న పరిణామ కారకాలను లాపియర్(Lapier) ఇంటర్‌వీనింగ్ వేరియబుల్స్‌గా పేర్కొన్నారు.

ఇప్పుడు పరివర్తన కారకాలను పరిశీలిద్దాం. పరివర్తన కారకాలలో ముఖ్యమైనవి:

## 25.2 సామాజిక పరివర్తన-భౌతిక కారకాలు

ఈ కారకాలలోని అంశాలు భూమి ఉపరితలం, వాతావరణం, వర్షపాతం నదులు, కొండలు, చెట్లు చేమలు, అడవులు, పశుపక్ష్యాదులు, ఖనిజాలు మొదలైనవి. మానవ సమాజంపై వీటిప్రభావం ప్రగాఢంగా ఉంటుంది. భౌతిక పరిసరాలు సామాజిక మార్పుతీరును, దిశను నిర్దేశిస్తాయి. భూఉపరితలం ఎప్పుడూ స్తబ్దంగా ఉండదు. తుఫానులు, క్షామం,వరదలు, పెనుగాలులు, భూకంపాల రూపంలో విక్షోభాలు(convalsions) భూ ఉపరితలంపై అప్పుడప్పుడూ సంభవిస్తుంటాయి. ఇవన్నీ సామాజిక మార్పులకు కారణమవుతూ ఉంటాయి. ప్రకృతిలో సంభవించే ఈ మార్పులకు మానవ చర్యలు ఎంతమాత్రం కారణం కావు. 1923లో యోకహామాలో సంభవించిన అతిపెద్ద

అగ్నిపర్వత విస్ఫోటం జపాన్‌లో ఒక నూతన ఆర్కిటెక్ట్ అవతరణకు మూలమైంది. చెడువాతావరణం ప్రభావం వల్ల ఈజిప్ట్, మెసపటోమియా, సింధులోయ నాగరకతలు అంతమయ్యాయి. పర్యావరణంలో ఏర్పడే కొన్ని మార్పులకు మానవచర్యలే కారణంకావచ్చు. దక్షిణ ఇటలీ, గ్రీస్, పాలస్తీనా, ఈజిప్ట్,మొరాకోలలో భూసారం క్షీణించడాన్ని ఒక ఉదాహరణగా చూపవచ్చు. భూగర్భంలోని ఖనిజాలను పూర్తిగా వాడుకోవడం, అడవులను నాశనం చేయడం, భూమిని విధ్వంసం చేయడం, వన్యమృగాలను హతమార్చడం వంటి చర్యల ఫలితంగా పర్యావరణ సంతులనం(ecological balance)దెబ్బతిన్నది. సామాజిక సంస్థలు, సంస్కృతి తీరు తెన్నులు యావత్తూ విపరీత పరిణామానికి గురి అయ్యాయి.

మానవుడి వాతావరణం అంటే కేవలం భౌగోళికమైంది మాత్రమే కాదు. అది ఒక సమగ్రమైనది. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిసరాల సమాహారమే అవుతుంది. ఏ సమాజం ప్రగతి విషయంలోనైనా భౌతిక పరిస్థితులు ప్రాధాన్యం వహిస్తాయి. మానవుడు సాంస్కృతికంగా ఎదిగినప్పుడు తన చుట్టూ ఉన్న భౌతిక పరిసరాలను సానుకూలంగా ఎండెట్లు మార్చుకొంటూనే ఉంటాడు. ఆవాసాలు ఏర్పరచుకోవడం సహజ పరిణామంగా కనిపిస్తుంది. మానవ నాగరికత సాంస్కృతిక లక్షణాలు భౌగోళికపరిస్థితులను తగిన విధంగా మార్పులు చేర్పులు చేసుకోవడం జరుగుతుంది. ప్రక్రియ దృశ్యం స్థానంలో (land scape)సాంస్కృతిక దృశ్యం చోటుచేసుకుంటుంది. ఇలాంటి పరిణామం కేవలం నగరాలు, పట్టణాల్లోనే కాక పల్లెపట్టుల్లో కూడా ఏర్పడుతూ ఉంటుంది. సాంస్కృతిక ప్రకృతి దృశ్యం పంటకాలువలు, సరస్సులు, నీటి పారుదల విధానాలు, రహదారులు, రైలు మార్గాలు వంటి వాటి రూపంలో దర్శనమిస్తాయి. ఇవన్నీ మానవకల్పితాలే. సాంస్కృతిక దృశ్యం శీఘ్రగతిలో మారుతూ ఉండగా భూమి ప్రకృతి దృశ్యంలో ఏర్పడే మార్పులు అతి నెమ్మదిగా వందల సంవత్సరాలకు గాని కంటికి కనినించేంత నిర్దిష్టంగా ఉండవు. ఇతర దేశాలతో పోలిస్తే ఐరోపా దేశాలు అతి శీఘ్రకాలంలో ప్రగతి సాధించాయని చెప్పవచ్చు. దీనికి కారణం ఆ దేశాలు సమశీతోష్ణమండలంలో ఉండటం వల్లే కాదు. ఆ దేశాలలో ఏర్పడిన పారిశ్రామికక విప్లవం ప్రభావం వల్లనే అనవచ్చు. ఇతర దేశాలలో కంటే ఐరోపా ఖండంలోని దేశాలలోనే పారిశ్రామిక విప్లవం ముందుగా ప్రారంభం కావడమేనని చెప్పవచ్చు. భౌతిక పరిస్థితులను పరిశీలిస్తే అధిక శీతోష్ణ పరిస్థితులు ఒక ప్రాంతంలో జనసమర్థం అధికంగా ఉండటానికి అనుకూలంగా మలచుకోవడానికి ప్రయత్నించడం సహజంగా జరుగుతూ ఉంటుంది. నదీనదాల వల్ల సారవంతమైన భూభాగాలున్న ప్రాంతాలలోని వారు సుగమమైన, చీకూచింతలు లేని జీవితాలు గడుపుతుంటారు. తక్కువ మానవ శ్రమకే ప్రకృతి అపారమైన ప్రతిఫలం పొందగలిగే బెంగాల్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు. అదే పర్వత ప్రాంతాలలోని వారు, ఎడారి ప్రాంతవాసులు అననుకూలమైన ప్రకృతిని ఎదుర్కొని, అధికంగా శ్రమిస్తేనే గాని జీవితం సాఫీగా సాగే అవకాశం లేదు. ఈ కారణాల వల్లనే వివిధ ప్రాంతాల విభిన్న తరహాల సంస్కృతులకు మూలమవుతుంటాయి. అట్లాగే జీవనవిధానంలో కూడా స్పష్టమైన మార్పులకు కారణమవుతూ ఉంటాయి. మానవుని భౌతిక ప్రాంతంలో దర్శనమిచ్చే సాంస్కృతిక విశేషాలను పరిగణించకుండా ఉండటం సాధ్యంకాదు. ఎందుకంటే ఉన్నత సాంస్కృతిక స్థాయిని సాధించిన ప్రతిచోటా మానవుడుతన భౌగోళిక, భౌతిక ఆవాసాలలో మెరుగైన పరిస్థితులను కల్పించుకొంటూనే ఉండటం గమనించవచ్చు.

ఈనాడు శాస్త్ర సాంకేతిక రంగంలో ఏర్పడుతున్న పెనుమార్పులు మానవుని పరిసరాలను ఎంతగానో మార్చివేస్తున్నాయి. సామాజిక సంస్థల స్వరూప స్వభావాలలో గణనీయమైన మార్పులకు దోహదం చేస్తున్నాయి. సామాజిక సంబంధాలకు అసలైన ప్రాతిపదిక ఉత్పత్తి చేయాలనే ఆకాంక్షేనని, దీని వల్లనే ఉత్పత్తి, ప్రక్రియలలో మానవులందరు ఏకమవుతారని మార్క్స్ పేర్కొన్నాడు. ఉత్పత్తికి సంబంధించి మానవుల మధ్య ఏర్పడే పరస్పర చర్యలు సామాజిక మార్పులకు దారితీస్తాయని మార్క్స్, ఏంగిల్స్‌ల అభిప్రాయం. కింగ్స్‌లీ అభిప్రాయం మరో విధంగా ఉంటుంది. సామాజిక సంబంధాలకు సంబంధించి మార్క్స్ ప్రతిపాదించిన విశ్లేషణ పూర్తిగా ఖచ్చితమైంది కాదని కింగ్స్‌లీ డేవిస్ అభిప్రాయం. ఆర్థిక నిర్మితే సామాజిక మార్పులను తెస్తుందని చెప్పడం అతి సామాన్యంగా చెప్పడమే అవుతుందని, సామాజిక మార్పులకు అనేక ఇతర కారకాలు కూడా ఉన్నాయని డేవిస్ పేర్కొన్నాడు. సమాజం లో ఏర్పడే మార్పులకు ఏదో ఒకానొక కారకమే కారణమని నిర్ధారణగా చెప్పడం సాధ్యం కాదు. సామాజిక

BRAOU

మార్పు ప్రక్రియకు అనేక అంశాలు తోడ్పడుతూనే ఉండటం వాస్తవానికి అతి దగ్గరగా ఉంటుంది.

పర్యావరణ శాస్త్రవేత్తలు, భూగోళ శాస్త్రవేత్తలు సామాజిక మార్పుకు భౌగోళిక పరిస్థితుల ప్రభావాన్ని పూర్తిగా కొట్టి పారేయలేము. అవి అంత నిర్ణాయకాలు కావనీ చెప్పలేము. అవి పరిమితం చేస్తాయే కానీ నిర్ధారించలేవు అని మాత్రం చెప్పగలం. బెర్‌స్టీడ్(Biersted) అభిప్రాయం ఇలా ఉంది. సమాజంలో ఎలాంటి మార్పులు వస్తాయో చెప్పగలవే గాని ఎలాంటి మార్పులు రావు అని మాత్రం చెప్పలేవు. వాస్తవంగా ఉన్న పరిస్థితులకు ఇవే కారణమని చెప్పడానికి వీలు లేదు. సాధారణంగా సమాజం సంక్లిష్టమయ్యే కొద్దీ, సంస్కృతి వికాసం చెందే కొద్దీ భౌగోళికకారకాల ప్రభావం తగ్గుతూ వస్తుంది. బెర్‌స్టీడ్ అన్నట్లు "భౌగోళిక శాస్త్రం సంభావ్యతాలను నిర్ధారిస్తుందే కాని, వాస్తవాలను కాదు." చరిత్ర కేవలం ఒక విధికాదు(function), కొక ఆవాసస్థలం కాదు. అట్లాగే సాంస్కృతిక వాతావరణం కాదు. రుతువులు నైతికతను నిర్ధారించలేవు, భూమి సమాజాన్ని నిర్ణయించలేదు.

## 25.3 సామాజిక పరివర్తన - జైవిక కారకాలు

సామాజిక పరివర్తనకు కారణాలుగా భౌగోళికాంశాలే కాక ఇతర అనేక అంశాలు-జైవిక,సాంస్కృతిక, సాంకేతిక కారకాలు కూడా ఉన్నట్లు గుర్తించడం జరిగింది.

ఇప్పుడు సామాజిక పరివర్తనకు జైవిక కారకాలు ఎంతవరకు కారణమవుతాయో పరిశీలించడం జరుగుతుంది. జైవిక దృష్ట్యా చూస్తే జనాభాకు, సామాజిక మార్పులకు సన్నిహిత సంబంధంఉంటుంది. ఒక దేశపు సామాజిక పరిస్థితులను బట్టి జనాభా తీరు తెన్నులుంటాయని చెప్పవచ్చు.

సమాజం తాలూకు స్వరూప నిర్మితులు జైవిక కారకాలు నిర్ధారిస్తాయి. మానవుని చుట్టూ ఉన్న జంతుజాలం, చెట్టు చేమలు మానవేతరమైన వాతావరణంగా గుర్తించవచ్చు. ఇలాంటి వాతావరణం కూడా మానవునిపై ప్రభావం చూపుతుంది. పరిసరాలను తనకు అనుకూలంగా, తన అవసరాలు తీర్చే విధంగా మానవుడు మార్చుకొంటాడు. ఈ విధంగా మనిషికి, ప్రాకృతిక పరిస్థితులకు మధ్య గాఢమైన సంబంధం-జైవిక,సాంస్కృతిక కారకాల మధ్య ఏర్పడుతుంది. మనం ఒక పార్కుకు లేదా ఉద్యానవనానికి వెళ్ళినప్పుడు వివిధ జంతువుల ఆకారాలలో ఏనుగు, కుందేలు, జింకా వంటివి-పొదలను తీర్చిదిద్దినట్లు కనిపిస్తుంది. ఆ మొక్కలను సహజంగా పెరగనివ్వరు. తమకు ఆహ్లాదకరంగా కనిపించే విధంగా మార్చుకొనడం కనిపిస్తుంది. అంటే పరిసరాలను తనకు అనుకూలంగా మనిషి మార్చుకొనడం కనిపిస్తుంది. ఆదిమ సామాజికులు కూడా తమ సమీపంలోని చెట్టు చేమలను, జంతుజాలాన్ని తమ ప్రాథమిక అవసరాలు కూడు, గూడు, గుడ్డలు- తీర్చుకోవడానికి వాడుకోవడం కనిపిస్తుంది. నిజానికి మానవుడు ప్రకృతి సిద్ధంగా లభించే వాటిపై అధికంగా ఆధారపడటం ఏనాటి నుండో వస్తున్న అలవాటు. జైవికాంశాలు జనన మరణాల రేట్లను, ఫలదీకరణ రేటులు, అనువంశిక లక్షణాలను ప్రభావితం చేస్తాయి. వైవిధ్యానికి అనువంశికత కొంతవరకు కారణం కావచ్చు. వాస్తవానికి వైవిధ్యానికి అనువంశికత ఒకానొక ఏజన్సీ అవుతుంది. అనువంశికత అనేది తల్లిదండ్రులు, పిల్లల లక్షణాలకు సంబంధించి వైవిధ్యానికి మూలమవుతుంది. ప్రతిజీవిలో వివిధ లక్షణాలు నిగూఢమైన శక్తి సామర్థ్యాలు భిన్నంగా ఉంటాయి.

సామాజిక మార్పుకు జనాభా స్థితిగతులు, జనాభాస్వరూపం అనేవి కారణమవుతాయి. ఏ దేశ జనాభా స్వరూపమైనా(composition) ఆ దేశంలోని సామాజిక పరిస్థితులను అనుసరించి మారుతూ ఉంటుంటాయి. ఉదాహరణకు, 19 వ శతాబ్దంలో ఏర్పడిన పారిశ్రామిక విప్లవ ఫలితంగా పాశ్చాత్యదేశాల జనాభా పెరిగి చివరి 50 సంవత్సరాలలో స్థిరపడింది. దీని వల్ల ఈనాడు ఆ దేశాలలోని జనన మరణాల రేటుకు మాత్రమే పరిమితమయి ఉండవు. ఈ కారకాల ప్రభావం జనం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస పోయే ధోరణికి కూడా మూలం అవుతుంది. దీన్నే సాంకేతికంగా'మైగ్రేషన్' (వలసపోవడం) అంటారు. వలస పోవడం అనే చర్యలు-ఇలా జరగడానికి ఆర్థిక కారణాలు కానీ మరే ఇతర కారణాలు కాని అయి ఉండవచ్చు. కొంత కాలానికి ఆయా దేశాల జనాభా స్వరూప లక్షణాల పై ప్రభావం చూపుతాయి. దీనివల్ల అనేక నూతన సామాజిక సమస్యలకు, ప్రజల దృక్పథాలలో

BRAOU

మార్పులు చోటు చేసుకుంటాయి.

### 25.3.1 సహజ, సామాజిక వరణం

సాధారణంగా వరణం(Selection)అంటే ఒక చర్య లేదా ప్రక్రియ. ఒక నిర్దిష్ట ప్రమాణం లేదా లక్ష్యాన్ని అనుసరించి సమాజం లో కొన్ని లక్షణాలను అట్టి పెట్టుకోవడంటగాని, మరికొన్నింటిని విసర్జించడం గానీ జరుగుతూ ఉంటుంది. వరణం అనేది ఒక ప్రత్యేకాభిమానం(Preference). "సామాజిక మార్పు" అనే అంశానికి సంబంధించి "ఇతరుల రచనల కంటే ఎం.ఎన్.శ్రీనివాసన్ రచనంటేనే నాకు ఎంతో ప్రత్యేక అభిమానం. అనేది ఒక చక్కని ఉదాహరణ.

### సహజ వరణం

సహజ వరణం అనేది కొత్తదేమీ కాదు. అతి పురాతనమైనదే. హెర్బర్ట్ స్పెన్సర్ రచనలతో దీని ప్రాముఖ్యం మరింతగా పెరిగింది. స్పెన్సర్ తన ఈ భావనను డార్విన్ సిద్ధాంతమైన "జీవన పోరాటం" (Struggle for existence)స్ఫూర్తితో ప్రవేశపెట్టాడు. ప్రకృతిలో జీవన పోరాటం అనేది సాగుతూ ఉంటుంది. ఈ పోరాటంలో నెగ్గగలిగిన ప్రాణే బతికి బట్ట కడుతుంది. స్పెన్సర్ ఈ సిద్ధాంతాన్నే మానవ సమాజానికి కూడా అనువర్తించి సమాజంలో ఇమడగలిగినవాడే మనగలుగుతాడని, ప్రాకృతిక పరిస్థితులకు అనుకూలంగా మసలగలిగినప్పుడే జీవించగలడని లేదంటే ప్రకృతితో రాజీ పడలేనివాడు, సర్దుకుపోవడంలో వైఫల్యం చెందినవాడు మనలేడు, అతన్ని ప్రకృతే కబళించివేస్తుంది. సామాజిక క్రమ పరిణామానికి అత్యంత కీలకమైన అంశం సహజ వరణమేనని స్పెన్సర్ దృఢంగా విశ్వసిస్తాడు. ప్రతి వ్యక్తి తన చుట్టూ ఉన్న పరిసరాలకు అనుకూలంగా మసలాల్సిన అవసరం ఉంది. దీన్నే సాంకేతికంగా పర్యావరణం (environment) అంటారు. నిర్మితీయ మార్పుల ద్వారా(structural changes) సర్దుబాటును సాధించవచ్చు. అందువల్ల మనగలిగిన్న వ్యవస్థలను ఎంచుకోవడమే భౌతిక పర్యావరణం నిర్వహించాల్సిన పాత్ర అవుతుంది. అట్లాగే మనగలిగే శక్తి లేనివాటిని తొలగించడం కూడా పర్యావరణం నిర్వహించే పాత్రలో ముఖ్యమైన అంశంగా కూడా ఉంటుంది.

జైవికంగా (శారీరకంగా) కానీ, సర్దుబాటు చేసుకోవడంతో కాని తగినంత శక్తి సామర్థ్యాలు లేని బలహీనులను ప్రకృతే తొలగిస్తుంది. శారీరకంగా బలహీనులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి రక్షణ కల్పించడానికి జరిగే పోరాటం వల్ల, జైవికంగా అసమర్థులు, అనర్హులు కొనసాగుతూనే ఉంటారు. అందువల్ల సహజవరణం ద్వారా తెలిసేదేమంటే అపౌష్టికాహారం, వ్యాధి, నికృష్టమైన గృహవసతి, కాయకష్టం వంటివి మానవ జాతికి 'మంచి'వేనని.

సహజవరణం రెండు రకాలు - తొలగింపు, విలీనం (elimination and absorption). ప్రకృతికి అనుకూలంగా సర్దుకొని పోలేని వాటినన్నింటిని ప్రకృతే తొలగిస్తుంది (నాశనం చేస్తుంది), సర్దుకొని పోగల శక్తి ఉన్నవాటిని తనలో విలీనం చేసుకొంటుంది.

పియర్‌సన్ (Pearson) సహజవరణానికి నాలుగు ఆధార అంశాలను (Premises) గుర్తించాడు. అవి:

(1) గుణాలు చలాంకాలు (Qualities are variables)

(2) గుణాలు జన్మత: సిద్ధించేవి / సంక్రమించేవి

(3)మరణం ద్వారా ప్రకృతి పనిచేస్తుంది.

(4)మరణాల రేటు విశిష్టమైంది (Deathrate is selective)

సహజవరణం (ప్రకృతివరణం) సూత్రం ఎంతో విమర్శకు గురి అయింది. పర్యావరణాన్ని బట్టే యోగ్యత (fitness) వుంటుంది. (1) ఎన్నో సంభావ్య(శక్య) పర్యావరణాలుంటాయి. అట్లాగే వాటికి అనుగుణంగా సర్దుకొని పోవడానికి మార్గాలు కూడా అనేకముంటాయి. (2) జీవన పోరాటంలో సాఫల్యం పొందడానికి తగిన యోగ్యత

BRAOU

ఉన్న వ్యక్తులలో నైతిక, సామాజిక, బౌద్ధిక లక్షణాలు కొరవడి ఉండవచ్చు. జైవిక యోగ్యత స్థానంలో మానవ అర్హతను ఉంచాలి. (3) పోరాటం, తొలగింపుల ద్వారా మనగలగడం అనే లక్షణాలు జంతు ప్రపంచంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. అట్లాగే సహకారం, శాంతియుత జీవనం అనేవి కూడా మనగలగడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. మానవులకు సంబంధించినంతవరకు మానవ సమాజంలో సహకారం అనివార్యమైన అంశంగా వుంటుంది. దీని వల్లనే సమాజం సజీవంగా ఉండడం సాధ్యమవుతోంది. (4) ప్రకృతిక పర్యావరణ పరిస్థితులతో సర్దుకుపోవడంలో మానవుడు కేవలం నిష్క్రియా శీలేడుగానే ఉండడు. వాస్తవానికి చక్కటి ఆరోగ్యం గల మానవుడు ప్రకృతిక స్పర్థవల్లనే మనగలగక, సామాజిక రక్షణ కారణంగానే మనగలుగుతున్నాడు. (5) సహజవరణం అనేది మానవులు, జంతువుల కంటే భిన్నమైన వారనే అంశాన్ని విస్మరిస్తుంది. అట్లాగే జంతువుల సమాజంకంటే మానవసమాజం భిన్నమైందనే అంశాన్ని గుర్తించక రెండింటిని ఒకేగాట కడుతుంది. ఈ కారణంగానే సహజవరణ అనేది నాగరకతా మానవ పరిణామ చరిత్రలో ప్రాముఖ్యం కోల్పోతూ వస్తున్నది.

## సామాజిక వరణం

మానవసమాజంలో ఉత్పన్నమై, సామాజిక సంబంధాల ద్వారా పనిచేస్తూ జనాభా ప్రజననం (reproduction) బతికి వుండడం అనేవాటిని ప్రభావితం చేయడం - మొత్తం జనాభాను కానీ, కొన్ని సమూహాలలో వివిధ రకాలుగా కానీ - అనే ప్రక్రియనే సామాజికవరణం అనవచ్చునని మెకైవర్ అంటాడు. సంస్కృతి, నాగరకత శక్తులు సామాజిక వరణం విషయంలో మానవునికి సహాయపడతాయి. మానవ నాగరకత పురోగమించడంతో ప్రకృతి పై మానవుని నియంత్రణ పెరుగుతూ ఉంది, మానవుల జీవితాలలో సహజవరణం (ప్రకృతివరణం) పాత్ర క్రమంగా క్షీణిస్తూ సామాజిక వరణం ప్రాముఖ్యం అధికమవుతూ ఉంటుంది. మానవుడు ఎంతో వివేకంతో పార్యవరణ పరిస్థితులను ఎదురొంటూ, అతని విజ్ఞానంతో దాన్ని మచ్చికచేసుకొంటాడు. సామాజికవరణంలో అది నిర్వహించే పాత్ర సహజవరణానికి భిన్నంగా ఉంటుంది. మెకైవర్ ప్రకారం సహజవరణం మరణాల రేటు ద్వారా పనిచేస్తుంది. సామాజిక వరణం కూడా మరణాల రేటుపై పనిచేస్తుంది. కానీ అది సహజంగా జననాల రేటుపైన అధికంగా పనిచేస్తుంది. సహజవరణం మరణానికి లేదా అనురణానికి ప్రత్యామ్నాయంగానే పనిచేస్తుంది. అదే సామాజిక వరణం అనేక ప్రత్యామ్నాయాలను అందిస్తుంది. అది కేవలం తొలగించడానికే కాక కొంతవరకు నివారించడానికి కూడా తోడ్పడుతుంది, కొంతవరకు సృజనాత్మకమైంది కూడా - అంటే ఎవరు జన్మించాలి, ఉండాలి, ఎంతవరకు ఎలా సర్దుబాటు చేసుకొని బతకాలి అనే దానికి సంబంధించిందే సహజవరణం. అయితే సామాజికవరణం ఒక సమాజం కట్టుబాట్ల దృష్ట్యా ఎలా మెలగాలో సూచిస్తుంది. సహజవరణంలో మనిషి నిష్క్రియగా ఉంటే సామాజికవరణంలో విలువలు నిర్ణయించడంలో క్రియాశీల పాత్ర నిర్వహిస్తాడు. శారీరకంగా బలహీనుడు బతకడానికి అనర్హుడని భావించదు. అలాంటి బలహీనుడు కూడా తన బుద్ధి కౌశల్యం, నైతికతల వల్ల సమాజంలో ప్రముఖ సభ్యుడు కావడానికి వీలుంటుంది. వాస్తవానికి ప్రకృతి ఎలాంటి వరణం చేయదు.

సహజవరణం, సామాజిక వరణాల మధ్య ఉన్న తేడాలను కింది విధంగా పేర్కొనవచ్చు:

(1) సహజవరణం మరణాల రేటు ద్వారానే పనిచేయగా, సామాజిక వరణం జననాల రేటుకు అధిక ప్రాధాన్యమిస్తుంది.

(2) సహజవరణం విషయంలో మనిషి ప్రకృతినే అనుసరించాల్సి వుంటుంది - దీన్ని అతడు మార్చవచ్చు - అదే సామాజిక వరణం మానవ ప్రయత్నం ఫలితంగా సాధ్యమవుతుంది.

(3) సహజవరణం స్పర్థ, సంఘర్షణల రూపంలో ఉంటే సామాజికవరణం సహకారం, ఔదార్యాల రూపంలో ఉంటుంది.

(4)సహజవరణానికి సంబంధించి మనిషి ఒకానొక పర్యావరణానికి అనుగుణంగా తనను తాను మార్చుకోవలసి వుంటుంది. సామాజిక వాతావరణం విషయంలో అనేక పర్యావరణ పరిస్థితులుంటాయి.

BRAOU

(5) సహజవరణం సహజసిద్ధమైన పరిస్థితులపై ఆధారపడి ఉంటే సామాజికవరణం సామాజిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

## సామాజికవరణం-పద్ధతులు

సామాజికవరణం రెండు విధాలుగా పనిచేస్తుందని మెకైవర్ అంటాడు. అవి: (ఎ) పరిస్థితుల క్రమానుగతి. ఇది పరోక్షమార్గం. (బి) సామాజిక ప్రణాళికల ఫలితంగా ఏర్పడే ప్రత్యక్ష ప్రభావం.

## పరోక్ష మార్గం

ఏ విధమైన ఫలితం ఆశించకుండా కొన్ని కొన్ని సమయాలలో సమాజం ప్రజననం, జీవించడానికి ఉన్న సంతులనాన్ని మార్చవచ్చు. ఫ్యాక్టరీలలోని అధ్వాన్న పరిస్థితులు శ్రామిక జనం మరణాల రేటును పెంచడానికి మూలం కావచ్చు. మురికి వాడలలో నివసించడం వల్ల క్షయవంటి వ్యాధి బారిన పడి మరణాల రేటు పెరగవచ్చు. సరి అయిన పౌష్టికాహారం, పారిశుధ్యం,మెరుగైన వైద్యసేవల ద్వారా మరణాల రేటును అదుపు చేయడానికి వీలుంది. ఇలాంటి సందర్భాలలో ప్రకృతి పరిస్థితులను సమాజం సృష్టించిన పరిస్థితుల ద్వారా అదుపు చేయడం జరుగుతుంది. ఆర్థిక ఉపాధి, పనిగంటలు పెంచడం, సాంకేతిక మర్పులననుసరించి వృత్తి పరమైన విభజన వంటి వాటిని నియమనిబంధనల ద్వారా మార్చడానికి వీలవుతుంది. అట్లాగే ఫ్యాక్టరీలోని పని పరిస్థితులను కూడా మార్చే వీలుంటుంది.

ప్రత్యక్ష పద్ధతి:

సమాజం ప్రకృతి శక్తులను ప్రత్యక్షంగా నియంత్రిస్తుంది. అందువల్ల పారిశుధ్యానికి సంబంధించిన నియమాలను రూపొందిస్తుంది. వైద్య సౌకర్యాలు కల్పిస్తుంది. ప్రమాదాల బారిన పడకుండా ఉండడానికి అనువైన పరిస్థితులను కల్పిస్తుంది. శిశు హత్యలు, నరహత్య (homicide), గర్భస్రావం వంటి వాటికి శిక్షలు నిర్ణయిస్తుంది. వివాహ వయస్సును నిర్ణయించడం ద్వారా బాల్య వివాహాలను అదుపు చేయడం, బహుభార్యత్వాన్ని నిషేధించడం, విడాకులను నిరాకరించడం, వివాహానికి పూర్వమే ఆరోగ్యానికి సంబంధించిన సర్టిఫికెట్‌ను కోరడం వలంటి చర్యల ద్వారా వివాహాలను నియంత్రించడం జరుగుతుంది. కుటుంబ నియంత్రణకు సంబంధించిన సమాచారాన్ని అందరికీ తెలియజెయ్యడం, జననాలను అదుపు చేయడాన్ని ప్రోత్సహించడం, ఇతర విధాలుగా కుటుంబ పరిమాణాన్ని తగ్గించడం వంటివి కూడా చేయడానికి వీలుంది. అంటే ప్రజననం రేటును, జీవనకాలం రేటును సమాజం కొంతవరకు నియంత్రిస్తుందని దీని వల్ల తెలుస్తుంది.

సామాజికవరణం వివిధ రూపాలలో ఉండవచ్చు:

(1) మిలటరీ సామాజిక వరణం: యుద్ధమనేది వరణానికి సంబంధించిన ప్రముఖ పరోక్షమార్గం. మంచి దేహ దారుఢ్యం, ఆరోగ్యం ఉన్న వారినే సైన్యంలోకి తీసుకోవడం వల్ల సమాజం వీరిని కోల్పోతుంది. యుద్ధంలో వీరిలో కొదరు మరణించవచ్చు కూడా. అందువల్ల సమాజంలో వితంతువుల సంఖ్య పెరుగుతంది. తమ కుటుంబాల నుంచి దూరంగా ఉండడం వల్ల సైనిక కుటుంబాలలో జననాల రేటు కూడా దెబ్బతింటుంది.

(2) రాజకీయ రూపం: ఒక దేశంలోని అంతర్యుద్ధం, స్వాతంత్ర్యోద్యమాలలో తెలివితేటలున్న వారు నిజాయితీ పరులైన వారు ఎందరో మరణించవచ్చు. ఉదాహరణకు లాలా లజపతిరాయ్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ లాంటి వారు స్వాతంత్ర్యోద్యమంలో మరణించారు.

(3) మతరూపం: కొన్ని మతాలు బ్రహ్మచర్యానికే అధిక ప్రాధాన్యమివ్వటం వల్ల కొందరు మతనాయకులు అవివాహితులుగానే ఉండిపోతారు. ఫలితంగా జననాల రేటు ప్రభావితమవుతుంది. ఒక రకంగా తెలివైన వారిని సమాజం కోల్పోవలసి వస్తుంది. ఫలితంగా సమాజానికి నష్టం వాటిల్లుతుంది.

BRAOU

(4) సామాజిక వరణం : సామాజిక వరణంలో జానపద రీతులు (folkways), సామాజిక రీతులు, ఆచార వ్యవహారాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. సమాజంపై ప్రభావం చూపే సామాజిక ఆచారాలు ఎన్నో వున్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది పరదా పద్ధతి, బాల్యవివాహాలు, మద్యనిషేధం, వితంతుపునర్వివాహాలు మొదలైనవి.

(5) న్యాయపరమైన ఆర్థిక పరమైన రూపాలు: న్యాయ విధానం కూడా సామాజిక వరణాన్ని ప్రభావితం చేస్తుంది. నేరస్తులు - ముఖ్యంగా హత్యలు చేసిన వారికి ఉరిశిక్ష విధించడం జరుగుతుంది. దీని వల్ల జననాల రేటు పడిపోతుంది. కొన్ని సందర్భాలలో న్యాయవ్యవస్థ కొన్ని వ్యవస్థలకు రక్షణ కల్పిస్తుంది. ఉదాహరణకు, విడాకులు, కుటుంబ నియంత్రణ, గర్భస్రావం వంటివి. పేలుడు పదార్థాలు తయారు చేసే పరిశ్రమలలో పనిచేస్తున్న బాలకార్మికులు, ఇతర కార్మికులు ఎన్నో ప్రమాదాలు ఎదుర్కోవలసి ఉంటుంది. మరణాలు సంభవించే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. మరణావకాశాలుండడం వల్ల జననాల రేటు కూడా దెబ్బతినే అవకాశముంది. ఏ నైపుణ్యం లేని శ్రామికులే వైట్‌కాలర్ ఉద్యోగుల కంటే ఎక్కువ సంఖ్యలో కనడం కనిపిస్తుంది.

(6) నగర రూపం: నగరాలలోని వారికి, పల్లె ప్రాంతాలలోని వారికంటే తక్కువ సంతానం ఉంటుంది. అదే మరణాల రేటు విషయంలో నగారాలలలోనే పల్లెల్లో కంటే ఎక్కువగా ఉంటుంది. కారణం నగరాలలో మురికివాడలు, అపరిశుభ్ర పరిస్థితులు, స్వచ్ఛమైన గాలి, నీరు లభించక పోవడమే. నగర వాసులలో అధిక సంఖ్యాకులు కుటుంబ నియంత్రణ పద్ధతులను అనుసరించి కుటుంబ పరిమాణాన్ని పరిమితం చేసుకోవడదానికి చర్యలు తీసుకొంటారు.

జైవికాంశాలు కూడా సామాజిక మార్పు తెస్తాయి. ఉదాహరణకు, వయసువారీ జనాభా, జనభా పరిమాణం వంటివి. 19వ శతాబ్దంలో జరిగిన అధిక జనాభా వృద్ధి అనేక సామాజిక మార్పులకు మూలమైంది. అంతేకాదు ఆహార సమస్య గృహ వసతి సమస్య, నిరుద్యోగం దిగజరుతున్న ఆరోగ్య పరిస్థితులలు, పేదరికం, అల్పజీవనస్థాయి వంటి అనేక సమస్యలు కూడాతెచ్చిపెట్టింది. కొన్ని దేశాల జనాభా క్షీణించడం జరిగింది. దీని వల్ల యు.ఎస్.ఏ, యు. ఎస్. ఎస్. ఆర్., స్వీడన్ వంటి దేశాలు అనేక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. కొన్ని దేశాలలో జాతి ఆత్మహత్యలు (race suicide) ఎదురవుతున్నాయి. యు.కె, యు. ఎస్. ఏ., స్వీడన్ వంటి దేశాల జనాభాలో పిన్న వయస్కుల నిష్పత్తి తగ్గుతోంది. అందువల్ల వయస్సు మళ్ళిన వారి సంఖ్య అధికంగా వుంటోంది. అంతర్వివాహాలను నిషేధించడం, వివాహ వస్సుకు సంబంధించిన ఆచారాలను గౌరవించడం, అల్ప సంఖ్యాకులను వేధించడం వంటివి జైవిక నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. జనాభా తగ్గిపోవడం, జనాభాలో స్త్రీ, పురుష నిష్పత్తి మారడం, జనన మరణాల రేటులో మార్పులు ఏర్పడటం వంటి అనేక అంశాలు మన సామాజిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. మానవుడు సమాజాలకు చారిత్రక పర్యావరణానికి ఉన్న సబంధాలు ఎంతో చలనాత్మకమైనవి. అంతర్గతంగా అస్థిరమైన జైవిక పర్యావరణం మానవుడి ఉపయోగ దురుపయోగాలకు ప్రతిస్పందిస్తుందేగాని లొంగిపోదు. వాస్తవానికి అంది ఎంతో సున్నితమైంది. అందువల్ల మనిషి వివిధ వ్యాధులతో, హానికరమైన బాక్టీరియా, కలుపు మొక్కలు, క్రూర మృగాలతో నిరంతరం పోరాడవలసి వస్తోంది.

అధిక జనాభా లేదా జాతి ఆత్మహత్యల తాలూకు సమస్యలు కేవలం ఆర్థిక లేదా రాజకీయ నాయకలకు సంబంధజంచినవ సమస్య మాత్రమే కాదు. సమాజశాస్త్రవేత్తలకు కూడా జనాభా పెరుగుదల వల్ల వారు చేసిన పరికల్పనలలో వివిధ బావనలలో మారు&పలు కలగడం అనేది ఒక సమస్యగా పరిణమిస్తుంది. జైవిక కారకాల వల్ల ఏర్పడే సామాజిక పరిణామాలను సులభంగా అంచనావేయడానికి వీలవుతుంది. ఆ పరిణామాలు స్పష్టంగా కంటికి కనిపించేవిగా ఉండడమే ఇందుకు కారణం.

జననాల రేటులో కలిగే మార్పులు ఇతర సామాజిక పరిస్థితులు ప్రభుత్వం అనుసరిస్తున్న వివిధ రకాల ఆర్థిక విధానాలు పశ్చిమ ఐరోపా దేశాలలో అధిక ప్రభావం చూపుతున్నాయి. అక్కడ ఆమోదం పొందిన విధానం పరిమిత కుటుంబం. ఈ విధానం జాతి ఆత్మహత్యల ప్రమాదాన్ని తెచ్చిపెట్టేదిగా ఉంటోంది. అదే మనదేశంలో పరిమిత కుటుంబం ప్రయోజనవాన్ని ప్రజలకు తెలియజేసి వారిని ఒప్పించడానికి సకల ప్రయత్నాలు చేయాల్సి వస్తోంది. దీనికి కొన్ని కుటుంబ నియంత్రణ పద్ధతులను అనుసరించాలని ప్రజలకు నచ్చచెప్పడం, ప్రోత్సహించడం జాతీయ

BRAOU

ప్రయోజనాల దృష్ట్యా పరిమిత కుటుంబం ఆవశ్యకతను గురించి ప్రబోధించడం జరుగుతూ ఉంది. ఇలాంటి చ్యలు ప్రజలు చేపట్టి జనాభా పెరుగుదలకు అడ్డుకట్ట వేయకుంటే ఎదురయ్యే విపత్తిని గురించి ప్రజలకు తెలియజెప్పడం జరుగుతోంది. కుటుంబ నియంత్రణ విధానా పట్ల మతపరమైన అడ్డంకులు, పరిమిత కుటుంబాల ఆవశ్యకత అనేవి మన సమాజాన్ని ఎంతాగానో ప్రభావితం చేస్తాయి. మన దేశంలో ముఖ్యంగా ముస్లిమ్‌లు కుటుంబ నియంత్రణను వ్యతిరేకిస్తున్నారు. దేశంలోని మరణాల రేట్లు సామాజిక పరిస్థితులకు అద్దం పడతాయి. అధ్వాన్నంగా ఉన్న పారిశుధ్య పరిస్థితులు, ప్రజారోగ్యం, పౌష్టికాహార లోపం, కొరతగా ఉన్న వైద్య సౌకర్యాల వంటివి మరణాల రేటు అధికంగా ఉండడానికి ముఖ్యకారణాలుగా పేర్కొనవచ్చు. థామస్ మాల్థస్ ప్రకారం జనభా గుణోత్తర శ్రేణిలో (Geometrical progression) పెరుగుతూ వుంటే ఆహారోత్పత్తి అంకశ్రేణిలో పెరుగుతూ ఉంటుంది. దీనివల్ల ఆహారం కొరత, దుర్భిక్ష పరిస్థితులు, వీటి వల్ల ప్రజలకు పౌష్టికాహారం లోపించడం, ఫలితంగా ప్రజల జీవన ప్రమాణం తగ్గడం వంటి దుష్ఫలితాలు కలుగుతాయి. మరణాలరేటు తక్కువగా ఉందంటే సమాజంలో వృద్ధుల సంఖ్య అధికంగా ఉంటుందన్న మాట. జననాల రేటు పడిపోతున్నప్పుడు సమాజంలో యువజనుల సంఖ్య తగ్గుతూ ఉంటుంది. దీని పర్యవసానంగా జనాభా ఆధారత నిష్పత్తి (Dependency ratio)లో మార్పులు ఏర&పడతాయి. మొత్తం జనాభాలో పనిచేయగల సామర్థ్యం వున్నవారు, వీరిపై ఆధారపడే పిల్లలు, ముసలివారి నిష్పత్తిని బట్టి అంచనావేయవచ్చు. దీనికి మొత్తం జనాభాను మూడు వయోవర్గాలుగా (Age groups) వర్గీకరించడం జరగుతుంది. (1) 14 సంవత్సరాల లోపు ఉన్నవారు. (2) 15-64 సంవత్సరాల మధ్య వయస్సున్నవారు - వీరే పనిచేయగల సామర్థ్యమున్నవర్గం. (3) చివరి గ్రూపులో 65 సంవత్సరాల పైబడిన వారుంటారు. వీరు ఇతరులపై ఆధారపడేవారు. మరణాల సంఖ్య పడిపోవడం సమాజంలోని భౌతిక వసతులుండటాన్ని సూచిస్తుంది. ఉదాహరణకు మరణానికి సంబంధించిన జనాభా సంధికాలం (Demographic transition) వైద్య సదుపాయాలు మెరుగుపడటాన్ని సూచిస్తుంది. తగ్గుతున్న జననాల రేటు ప్రజల దృక్పథాలలోని మార్పుకు సూచికగా పరిగణించవచ్చు. సామాజిక ప్రభావాలు సామాజిక పర్యావరణాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ ప్రభావాలు వివిధ సమాజాలకు విస్తరించడం కూడా సమాజమే. 1923లో ప్రచురించిన ఇంగ్లాండ్, వేల్స్‌ల జనాభా లెక్కలు - వివాహాల ఫలన సామర్థ్యానికి సంబంధించిన నివేదిక (Fertility of Marriage), ఒక కుటుంబ వృత్తి, కుటుంబ సభ్యుల సంఖ్యలు సహసంబంధంగల అంశాలుగా పేర్కొంటుంది. ఈలాంటి అధ్యయనాల ద్వారా కింద పేర్కొన్న విషయాలు వెలువడ్డాయి.

(1) భార్యలు ఉద్యోగినులైన కుటుంబాలలో స్త్రీల ఫలసామర్థ్యం (fertility) తకు&కవగాను, కుటుంబ పరిమాణం అల్పంగాను ఉంటుంది.

(2) భార్యభర్తల ఉద్యోగాల దృష్ట్యా, వారిలో ఒకరుగానీ, ఇద్దరూగానీ వేరువేరు ప్రాంతాలకు వెళ్ళాల్సివచ్చినప్పుడు కూడా ఫలసామర్థ్యం తక్కువగా వుంటుంది.

(3)భార్యాభర్తలు చేపట్టే వృత్తికి సంబంధించి దీర్ఘకాల శిక్షణ అవసరమైనప్పుడు కూడా ఫలన సామర్థ్యం తక్కువగా ఉంటుంది.

(4) భార్యాభర్తలు చేసే పనిలో శారీరకశ్రమ అధికంగా వున్న కుటుంబాలలో ఫలనసామర్థ్యం అధికంగా వుంటుంది. కాయకష్టం చేసే శ్రామికుల కుటుంబాల పరిమాణం ఎక్కువగా వుంటుంది.

(5)ఉన్నత వర్గాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవడానికి అవకాశం వున్న వారిలో ఫలన సామర్థ్యం తక్కువగా వుండడానికి అవకాశాలు అధికంగా వుంటాయి.

(6) సామాజిక రీతుల (Mores) విషయంలో భర్త జన్మస్థలం ప్రభావమే, భార్య జన్మస్థలం ప్రభావం కుటుంబ పరిమాణంపై అధికంగా వుంటుంది.

జనాభా నిర్మాణాన్ని నియంత్రించే మరో అంశం వలస పోవడం. పురాతన కాలం నుంచీ కూడా జనం తమ స్వస్థలం వదిలి ఇతర ప్రాంతాలకు వలసవెళ్ళుతూనే ఉన్నారు. ఆనాడు ఇలాంటి వలసలకు కారణం రాజకీయ

B R A O U

వేధింపులు. కొన్ని సందర్భాలలో మత విభేదాల కారణంగా కూడా ప్రజలు ఇతర దేశాలకు వలసవెళ్ళేవారు పేదరికంతో బాధపడుతున్న వెనకబడిన దేశాలు లేదా రాజకీయ అస్థిరత ఉన్న దేశాల ప్రజలు అధిక సంఖ్యలో ఇతర దేశ్యాలకు వెడుతున్నారని ప్రపంచ కార్మిక సంఘాల ఫెడరేసన్ తన నివేదికలో పేర్కొంది. భారతదేశ ప్రజలు కూడా మెరుగైన ఉద్యోగావకాశాల కోసం ఏటా విదేశాలకు తలివెళ్ళడం కనిపిస్తుంది. ఆకర్షణీయమైన జీతాల కోసం వృత్తిపరమైన నైపుణ్యం గలవారు విద్యావంతులు విదేశాలకు వలస వెళ్ళడం ఈ మధ్య కాలంలో అధికమైంది. ఇలాంటి మేధావుల వలస మన దేశం "బ్రైయన్‌డ్రైన్" - మేధావుల వలస- సమ్యను ఎదుర్కోవలసి వస్తోంది. గతంలో కంటే ప్రస్తుతం ప్రజలలో గమనశీలత బాగా ఎక్కువైందనే వాస్తవాన్ని మరచి పోకూడదు. జాతి స్వచ్ఛత (racial purity) కి సంబంధించి ఈనాటి ప్రజలలో ఉదారవైఖరి గోచరిస్తూ ఉంది. విభిన్న సముదాయాలు, భిన్న జాతుల మధ్య వైవాహిక సంబంధాలు ఆమోదయోగ్యమవుతున్నాయి. ఈ రకంగా వివిధ తరహాల ప్రజల సంగమం సమాజ శాస్త్రవేత్తలకు ఎంతో ఆసక్తి కలిగించే ప్రముఖమైన సామాజిక పరిణామాలు. వివిధ భాషలు విభిన్న ఆచారాలు అనుసరించే ప్రజలు ఒకటి కావడం వల్ల సామాజిక మార్పు సులభతరమైంది.

## 25.4 సామాజిక పరివర్తన : సాంస్కృతిక కారకాలు

సమాజంలోని ప్రజలు అనుసరించే ప్రమాణాలు, ఆచారవ్యవహారాలు, వారికున్న విశ్వాసాలు ఆ సమాజం యొక్క సంస్కృతిగా చెప్పవచ్చు. మనిషికి జంతువుకు ఉన్న తేడా సంస్కృతే. మనిషికి కొన్ని విలువలు, ప్రమాణాలు ఉంటాయి. జంతువులలో ఇవి కనిపించవు. విభిన్న మానవ సముదాయాలు వివిధ తరహాల సంస్కృతులను అనుసరిస్తూ ఉంటాయి. ఈ కారణంగానే సమాజం తాలూకు సాంస్కృతిక అంశాలకు ప్రధాన్యత లభిస్తూ ఉంటుంది. వివిధ సమాజాలు మధ్య కేవలం ప్రంతం, కాలం వంటి వాటికి సంబంధఉంచే తేడా ఉండదు. కాలానుగుణంగా సమాజాల ప్రమాణాలు, విశ్వాసాలు, మార్పుకు లోనవుతూ ఉంటాయి. భారత దేశ ఆధ్యాత్మిక దేశంగా ఉతన్నంత కాలం భౌతిక అంశాలకు సంబంధించిన ప్రగతికి అంత ప్రముఖ్యం, ప్రాధాన్యం ఉండేది కాదు. సాంస్కృతిక పురోభివృద్ధి సామాజిక ననిర్మితిలో మార్పులను నూచిస్తుంది. ఇలాంటి ప్రగతి ప్రధానంగా అభౌతిక అంశాలలో ఉండాల్సిన అవసరముంటుంది.

ఐlogy), నైతికత, అసవాట్లు, ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు మరి ఇతర అనేక సంస్థలుంటాయి. భావాలు, భావజాలాలు, తత్వాలు అంతర్గతమైన మార్పులకు లోనవుతుంటాయి. అవి కాలంతోబాటు మారుతూ సామాజిక క్రమంలో కూడా మార్పులు కలిగిస్తూ ఉంటాయి. స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం వంటి భావాలు కొన్ని సమయాలలో ఉండడం కనిపిస్తుంది. మన విశ్వాసాలకు, సంస్థకు సన్నిహిత సంబంధం ఉంటుంది. అట్లాగే వాటిపట్ల మన అంచనాలకు, సామాజిక సంబంధాలకు సాన్నిహిత్యముంటుంది. సంస్కృతిలోని మార్పులు సామాజిక మార్పు కూడా అంతర్నిహితమై ఉంటుంది. నిజానికి అవి దగ్గరి సంబంధం ఉన్నటువంటివి. రాబర్ట్ బెన్‌స్టెడ్ అన్నట్లు ప్రజలు అనుకోనేదే వారు ఏమి చేస్తారో, వారికి ఏమి కావాలో అనేవాటిని నిర్ణయిస్తుంది.

సంస్కృతి సామాజిక మార్పుకు వేగాన్ని పెంచడమే గాక, దానికి దిశా నిర్దేశం కూడా చేస్తుంది. సంస్కృతిక మార్పుతో పోలిస్తే సామాజిక మార్పు ఎంతో పరిమితంగా ఉంటుంది. మనం ప్రవర్తించే తీరు, జీవించే పద్ధతి ఆలోచించే విధానం, పనిచేసే పద్ధతి అన్నీ కూడా సామాజిక విలువల ప్రభావానికి లోనవుతూ ఉంటాయి. ఉదాహరణకు, ఇతరకులకు అభివాదం తెలిపే విధానంలో వచ్చిన మార్పు, గతంలో 'నమస్తే' అని అంటే అభివాదం తెలిపేవారు ఈనాడు 'హల్లో'గా, 'హాయ్'గాను మారింది. సామాజిక విలువలలో కనిపించే మార్పుల కొన్ని ప్రభావాల కరణంగానే ఏర్పడ్డాయి. అయితే ఇవి సాంకేతిక కారకాల ప్రభావం వల్లనే నిర్ధారితమయినవి కావు.

సంస్కృతి అనేది స్తబ్దమైంది కాదు. అది నిరంతరం మారుతూనే ఉంటుంది. వలస, విదేశా దండయాత్ర, అంతర్జాతీయ వర్తకం, సంబంధం, సాంస్కృతి బృందాల రాకపోకలు, విదేశీ పాలన వంటివి సంస్కృతిలో మార్పులు తీసుకొని వస్తూ వుండవచ్చు. ఉదాహరణకు బ్రిటిష్ వారి పాలన కొనసాగడం ఎల్ల, పాశ్చాత్యదేశాల ప్రభావ ఫలితంగా

మనవేషభాషలలో వచ్చిన మార్పు కొట్టవచ్చినట్టుగా ఉంటోంది. సంస్కృతి కేవలం బయటి ప్రభావాలకే కాదు లోనుకాదు. సంస్కృతే సామాజిక మార్పులకు దిశానిర్దేశం చేస్తుంది. సంస్కృతే మన ప్రవర్తన తీరు తెన్నులకు నిర్ధారిస్తుంది. కొన్ని కొన్ని సమాయాలలో నూతన భావజాలం సమూహపీపన విధానంలో చెప్పుకోదగ్గ మార్పులు కలిగిస్తూ ఉంటుంది. ప్రపంచాన్ని శాసించేది భావజాలమే. ఉదాహరణకు మార్క్స్ సిద్ధాంతాలు ప్రపంచంలోని 1/3 దేశాలను ప్రభావితం చేశాయి. హిందూమతం, బౌద్ధం, క్రిస్టియానిటీలు అనేక సామాజిక సంస్థలను గణనీయంగా ప్రభావితం చేశాయి. ఒక మానవ సముదాయానికి సబంధించిన ఆర్థిక వ్యవస్థను ఆ సముదాయం అనుసరించే నైతికత, మతవిశ్వాసాలు ప్రభావితం చేస్తాయని మాక్స్‌వెబర్ తన " Sociology of Religion " గ్రంథంలో పేర్కొన్నాడు. అట్లాడే పాశ్చాత్య పెట్టుబడి దారీ విధానంపై ప్రొటెస్టాంటిజమ్ ప్రభావం గణనీయంగా ఉండిందని పేర్కొన్నాడు.

ఈ మధ్య కాలంలో సాంకేతిక ప్రగతి గుణోత్తర శ్రేఢిలో సాగింది. కానీ సాంకేతికత ఒక్కటే సామాజిక మార్పును తీసుకొని రాలేదు. బ్రిటిష్ పాలనాకాలంలో భారతదేశం ఎన్నో సాంకేతిక నవకల్పనలను వ్యతిరేకించింది, సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన వస్తువులను నిరాకరించింది. 18, 19 శాతాబ్దాలలో అమెరికా అన్ని రకాల సాంకేతిక ఆవిష్కరణలను ఆహ్వానించి అనుసరించడం జరిగింది. సాంకేతిక, సామాజిక విలువలు సమాహారం మరింత సాంకేతిక మార్పులకు అనువైన వాతావరణాన్ని సృష్టిస్తుంది.

మతం, విశ్వాసాలు, ఆచరణాల విషయంలో ప్రజల దృక్పథాలలోని మార్పుకు వారి ఆర్థిక ప్రవర్తనకు చక్కటి సహసంబంధం ఉంటుందని, మాక్స్ వెబర్ తన "The protestant Ethic and the spirit of capitalism"లో వివరించడానికి ప్రయత్నించాడు. ఆచరణాత్మక మైన నైతికత కలిగిన ప్రొటెస్టాంటిజమ్ పశ్చిమదేశాలలో పెట్టుబడి దారీ వ్యవస్థ వృద్ధి చెందడాన్ని ప్రోత్సహించిందని, దీని ద్వారానే పారిశ్రామిక, అర్థిక ప్రగతి సాధ్యమయ్యాయని మాక్స్‌వెబర్ వివరించాడు. సాంకేతిక మార్పులు తీసుకొని రావడంతో సాంస్కృతికాంశాలు అనుకూల, ప్రతికూల పాత్రలు నిర్వహిస్తాయి. అలవాట్లు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, సాంప్రదాయక విలువలు సంరక్షణ వంటి సాంస్కృతికాంశాలు, సాంకేతిక నవకల్పనలను అడ్డుకోవచ్చు. సామాజిక విలువలు విచ్ఛిన్నం కావడం, సామాజిక సంస్థల వివిధీకరణ (diversification) నూతన భావాలను సంప్రదాయాలను తెలుసుకోవాలనే, అనుసరించాలనే తపన వంటివి సాంకేతిక నవకల్పనలకు అనువైన పరిస్థితులు అవుతాయి. సాంకేతిక మానవ సృష్టే మనిషి భావాలు, విలువలు, విశ్వాసాలు, నైతికకతలు, తత్వ చింతన వంటి సాంస్కృతికాంశాల ప్రబ్యానికి లోనవుతూ ఉంటాయి.

BRAOU

సమాజం మారుతూ ఉంది. ఈనాడు మనిషి భౌతిక వస్తువరమైన వాంఛలకు గురి అవుతున్నాడు, అనంతదాయకమైన జీవనాన్నే కోరుకొంటున్నాడు. అందువల్లనే తన అనందాన్ని విశ్రాంతి సమయాన్ని పెంచుకోవడానికే కృషి చేస్తున్నాడు. శారిరక శ్రమ అత్యంత స్వల్పంగా ఉండేందుకుగాను ప్రత్యామ్నాయంగా యంత్రాలను కనిపెట్టడం, వాటినే ఉపయోగించడం జరుగుతోంది. మన సంస్కృతి స్థాయిల్లో మార్పుకు వివిధ రకాల విద్యుత్ పరికరాలు, బాయిలర్లు, ఎలక్ట్రిక్ హీటర్‌లు, ఎలక్ట్రిక్ ఐరన్, రిఫ్రిజిరేటర్లు, గ్రైండర్లు, టేప్‌రికార్డర్లు, ఫోన్లు వంటి వాటినే ప్రధాన కారణాలుగా కనిపిస్తాయి.

సంస్కృతి రెండు రకాలు: (1) భౌతిక లేదా వస్తువర సంస్కృతి (material) (2) అభౌతిక సంస్కృతి(non-material). భౌతిక సంస్కృతి అలవాట్లు, నడవడికలు, మొదలైన వాటికి సంబంధించినది. భౌతిక సంస్కృతిలోని మార్పులు అభౌతిక సంస్కృతిలోని మార్పులకు కారణం కావచ్చు. ఇలాంటి దాని వల్ల ఏర్పడేదాన్నే సంస్కృతిక మార్పు (cultural shift) అంటారు. నూతన ఆవిష్కరణ ఫలితంగా మానవజీవాలలో వస్తుపరమైన సంస్కృతి అనూహ్యంగా మారిపోయింది. శ్రమ విభజనను వ్యక్తీకృతం చేయడం, పనిలో ప్రత్యేకీకరణల రూపంలో సామాజిక మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈనాడు ఇలాంటి పరిణామాల కారణంగా మానవుడి విశ్వాసాలు, దృక్పథాలు, అలవాట్లు (value judgements)లో తీవ్రమైన మార్పులు ఏర్పడుతున్నాయి. వాస్తవానికి భౌతిక, అభౌతిక

సంస్కృతులలోని మార్పుల ప్రభావం సమాజంపూజ పడినప్పుడు, ఆ రెండింటి మధ్య సమతూకం లోపించినప్పుడు ఏర్పడే పరిస్థితినే సమాజ శాస్త్రవేత్తలు సాంస్కృతిక పశ్చత (cultural lag) అని అంటారు. అయితే సామాజిక మార్పులు జరుగుతున్న పరిస్థితుల్లో ఈ సాంస్కృతిక పశ్చత కొంతవరకు అలజడి కలిగించే కారకంగా ఉండవచ్చు. ఎందుకంటే సాంస్కృతిక ఘర్షణ ఏర్పడడం జరగవచ్చు. ఎందుకంటే ఇలాంటి ఘర్షణ పరిస్థితులకు సాంస్కృతిక పశ్చతకు సంబంధం ఉండదని భావించలేము కాబట్టి.

సాంకేతికత సంస్కృతిపై ప్రభావం చూపినట్లే సంస్కృతి కూడా సాంకేతికతను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల నైతికత మార్పుకు లోనుకావడం, పరిమితం కావడం లేదా ప్రయోజనాల కల్పనకే యంత్రాలు పనిచేయడం పరిమితం కావడం జరుగుతుంది.

### 25.4.1 సాంస్కృతిక విలంబన

ఈ భావనను మొదటిసారిగా డబ్ల్యు. ఎఫ్. ఆగ్‌బర్న్ తన గ్రంథం " Social Change "లో ప్రవేశపెట్టాడు. ఈ గ్రంథాన్ని 1922లో ప్రచురించడం జరిగింది. పరస్పర సంబంధం వున్న అంశాలతో ఏర్పడిన ఒకానొక అమరికనే (pattern) సంస్కృతి అనవచ్చు. సంస్కృతి ఒక భాగంలోని మార్పులు ఇతర సంబంధిత భాగాలలోని కొంత సంచలనం సృష్టిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో సమారస్యం కోసం వివిధ భాగాల మధ్య సర్దుబాటు చేయాల్సి వుంటుంది. ఇలా చేయడానికి కొంత సమయం పట్టం సహజం. ఈ సమయాన్నే సాంస్కృతిక విలంబన లేదా పశ్చత (cultural lag) అంటారు. ఈనాడు సాంకేతికలే మార్పులకు ప్రధాన కారణమవుతోంది, మార్పుల వేగాన్ని నిర్ధారిస్తోంది. మారుతున్న పరిస్థితులను గురించి ఆగ్‌బర్న్ ఈ విధంగా వివరించాడు: " సాంకేతికాభివృద్ధి మన భౌతిక సంస్కృతిలో శీఘ్రగతి మారుపలను కలిగిస్తోంది. అయితే అభౌతిక సాంస్కృతిక అంశాలు ఈ మార్పులకు అనుగుణంగా అంతవేంగాగాను సర్దుకొని పోలేకపోతున్నాయి. సర్దుకొని పోవడం జరిగినా చాలా సమయం తరువాతనే ఇది సాధ్యమవుతోంది. ఈ కాల విలంబన అనివార్య మవుతోంది. దీని ఫలితంగా అనేక సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.'' ఉదాహరణకు అవసరాలకు ముందే ఆటోమొబైల్స్‌ని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కారణంగానే భౌతిక సాంస్కృక అంశాలైన ఆటోమొబైల్స్‌కు అభౌతిక సాంస్కృతిక అంశాలపైన వెడల్పాటి రోడ్లు, ట్రాఫిక్ నిబంధనలకు ఘర్షణ తలెత్తుతోంది.

## 25.5 సామాజిక పరివర్తన - మానసిక కారణాలు

మానవ సంకల్పం (will) లేదా మనశ్శక్తి, మనః ప్రవృత్తి (mentality), ప్రవృత్తుల ప్రభావం ఇటు ప్రజాస్వామ్య వ్యవస్థలపైన అటు నిరంకుశ పాలనా వ్యవస్థలపైన కూడా ఉంటుంది. సమాజంలో మారుతున్న ఏకీభవనం విషయంలో మానసిక కారకాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. మార్పులనేవి జీవితంలో నూతనాంశాలను ప్రవేపెడతాయి. స్తబ్దమైన లేదా చైతన్యరహితమైన కారకాలు మానవ అకాంక్షలు ఎప్పటికీ తీరకుండానే మిగిలిపోతాయి. ఈ ఏకీభవనాలు కాలగమనంతో మార్పులకు లోనవుతూనే ఉంటాయి. సర్దుకొనిపోవడం (accommodation), సహకారం, విలీనీకరణం (assimilation) వంటి సహజచిత దృక్పథాలు తద్భిన్నమైన దృక్పథాల మాదిరిగానే సమజంలో ముఖ్యమైన మార్పులు కలిగిస్తూ ఉంటాయి. ఇతరులతో సర్దుకొని పోవడం, నేర్చుకోవడంతో విభిన్న సమూహాలలో ఒక నూతన సామాజిక క్రమం ఏర్పడుతుంది. ఇలాంటివి సహకారం, పాత భావాలు ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, పూర్వాభిమానాలు వంటి వాటి విషయంలో అనుకూలంగా స్పందించడం గానీ, వ్యతిరేకించడం గానీ జరగవచ్చు. అయితే సంఘ సంస్కర్తల బోధనలు, ఉపదేశాలు మనిషి మనిషికి మధ్య ఉన్న అపోమలను, అడ్డుగోడలలను తొలగించగలంత శక్తిమంతంగా వుంటాయి. మానవుల మధ్య నెలకొని వున్న అడ్డంకులను తొలగించడం అసంభవమేమీ కాదు. సహచరితకు వ్యతిరేకమైన దృక్పథాలు, మనోభావాలు కూడా సమాజంలో మార్పులు తేగలవు. ఉదాహరణకు సంఘర్షణ, స్పర్థ వంటివి సామాజిక మార్పునకు దోహదం చేస్తాయి. ఒకరి ఆధిపత్యాన్ని నెలకొల్పే లక్ష్యంతో అభివృద్ధిని ప్రోత్సహిస్తాయి. స్పర్థ ఫలితంగా ఏర్పడినటువంటిదే ఆధునిక సాంకేతికాభివృద్ధి. సంఘర్షణలు,

BRAOU

భావాలు, పురోగతికి కొంతవరకు దోహదం చేసిన అంశాలేనని చెప్పవచ్చు. ఇవి ప్రయత్నం-దోషాల పద్ధతికి అనుకూలిస్తాయి. ప్లెబియన్‌లు, సెర్ఫ్‌లు, అస్పృశ్యులు మొదలైనవారు ఇందుకు మంచి ఉదాహరణలు. వీరి మధ్య నెలకొన్న సంఘర్షణ, పగ, ద్వేషాలే నూతన వ్యవస్థ ఆవిర్భావానికి ఆధారమయ్యాయని చెప్పవచ్చు.

సామాజిక విలువలు స్థిరమైనవి, ఎలాంటి మార్పు చెందక స్తబ్దమైనవి కావు. సామాజిక విలువలలో మార్పుల వల్ల ఏర్పడే పరిస్థితులకు సర్దుకొని పోయేది ప్రతి సమాజంలోనూ జరుగుతూనే ఉంటుంది. పురాతన కాలంలో నిరడంబర జీవితం గడపడం, ఉన్నతంగా ఆలోచించడం అనేవి భారతీయుల ఆదర్శాలుగా, దృక్పథంగా ఉండేది. ఇలాంటి సమాజం భౌతిక భోగభాగ్యాల కోసం ప్రయత్నించే మనస్తత్వాన్ని కూడా సహించడం, దాని కోసం ప్రయత్నించడం వంటి మార్పులతో సర్దుబాటు చేసుకోవడం జరిగింది. ఈనాడు వాసి కంటే రాశికే అధిక ప్రాముఖ్యమిచ్చే విలువలకే ఆదరణ, ఆమోదం లభిస్తున్నాయి. రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో సమాజంలో పెనుమార్పులు చోటుచేసుకొంటున్నాయి. మార్పుల వేగం కూడా పెరుగుతోంది. జీవిత మౌలికతత్వం ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు. ఈ విషయంలో మానవుల ఆలోచనా ధోరణి సాముదాయకత నుంచి సామ్యవాదానికి లేదా వ్యక్తి వాదానికి మారింది. కొన్ని కొన్ని సమయాలలో మనిషి కంటే సమాజమే ఉన్నతమైందని భావించడం జరిగింది. వ్యక్తివాదాన్ని విశ్వసించేవారు సాముదాయక లక్షణం గల సమాజానికంటే వ్యక్తికే అధిక ప్రాధాన్యం ఇస్తారు. వ్యక్తివాదం ప్రచారంలో ఉన్న తొలిదశల్లో కుటుంబ వ్యవస్థ గణనీయంగా ప్రభావితమైంది. ఆ తరువాత సమాజంలోని వివిధ సంఘాలు, సమూహాల పనితీరులో చెప్పుకోదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి. సాముదాయక ఆలోచన ఉన్నతమైందా వ్యక్తివాదం ఉన్నమైందా తేల్చిచెప్పడం కష్టం.

సౌందర్యం పట్ల మానవుడి సహజ ప్రకృతి కాలక్రమంలో కలిగే మార్పులు వల్ల సమాజాన్ని, వ్యక్తులకు ఈ మార్పులకు అనుకూలంగా ప్రతిస్పందించేట్లు చేస్తాయి. తాము అనుసరిస్తున్న జీవన విధానాలను కాలక్రమంలో సమీక్షించుకుంటూ, దేశకాల పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన మార్పులు చేర్పులు చేసుకొంటూ పోవడం మానవుల కున్న సహజ లక్షణంగా పేర్కొనవచ్చు. ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు సుందరమైన, నైతికంగా ఉన్నతమైన వాటిని పరిరక్షించుకొంటూ సౌందర్య రహితమైన వాటిని, అనైతికమైన వాటిని విడనాడుతూ ఉండడం సహజంగా జరుగుతూనే ఉంటుంది.

## 25.6 సామాజిక పరివర్తన - సాంకేతిక కారకాలు

ఏ సమాజంలోనైనా సాంస్కృతిక జీవితం సాంకేతికత ప్రభావానికి గురి అవుతూనే ఉంటుంది. సమాజంలో మార్పులకు దోహదం చేసే కారకాలలో సాంకేతికత ఒక ప్రముఖమైన కారకంగా గుర్తించవచ్చు. సాంకేతికత, యంత్రీకరణలు సామాజిక విలువలను అనూహ్యమైన విధంగా మార్చి వేశాయి. దీని ఫలితంగా ఈనాటి మానవుడు వాసికంటే రాశికే అధిక ప్రాముఖ్యమిస్తున్నాడు. అతని ఆలోచనా ధోరణిలో ఈ పెనుమార్పు సుస్పష్టం అవుతోంది. ప్రతిదానికీ భౌతికాంశాలే కొలమానంగా ఉంటోందే తప్ప, ఆనందానుభూతికి స్థానమే లేకుండా పోతోంది ఈనాడు. సాంకేతిక కారకాలు మానవుడు సృష్టించినవే. సమాజంపై వ్యక్తుల జీవితాలపై వీటి ప్రభ్యావం తీ&రవంగా ఉంటోంది. తన వాంఛల పరితృప్తికి తన అవసరాలు తీర్చుకోవడానికి, తన జీవితం మరింత సుఖప్రదము, ఆనందదాయకము చేసుకోవడానికే మానవుడు నాగరకతను సృష్టించుకొంటాడు. వాస్తవానికి నాగరకత సాంకేతికత ఏర్పడిన ఫలితాంశమే. సాంకేతికత అంటే మానవుల జీవిత సమస్యల పరిష్కారానికి శాస్త్ర పరిజ్ఞానాన్ని ఒక ఉపకరణంగా వినియోగించుకొనే పద్ధతినే సాంకేతికత అనవచ్చు. సువ్యవస్థితమైన జ్ఞానాన్ని ఆచరణలో పెట్టడాన్నే సాంకేతికతగా చెప్పవచ్చు. వివిధ పరికరాలను ఉపయోగించడం, మానవ అవసరాల కోసం రకరకాల యంత్రాలను వాడటం వంటివే సాంకేతికతగా చెప్పుకోవచ్చు. వ్యవసాయరంగంలో పంటకోయడానికి కుప్ప నూర్పుకు యంత్రాలనే విరివిగా వాడుతున్నారు ఈనాడు. దీనితో మానవుల శ్రమ కొంత తగ్గింది, సౌకర్యం హెచ్చింది. యంత్రాలుపయోగించడం ద్వారా పరిమిత సమయంలోనే పనిపూర్తిచేసే అవకాశం లభిస్తోంది. శాస్త్ర పరిజ్ఞానం, సాంకేతికతలు రెండు పెనవేసుకొని పెరుగుతున్నాయి. సాంకేతికత మరింత వేగం పుంచుకొంటోంది. అందుకే ప్రస్తుత యుగాన్ని యాంత్రిక యుగమని

లేదా సాంకతిక యుగమని అంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన వస్తువులను ఉపయోగించడం ద్వారా సామాజిక మార్పులు కలుగుతాయి. సామాజిక సంబంధాలు, ఆలోచనలు, దృక్పథాలు కూడా సాంకేతికతపైనే ఆధారపడి ఉంటాయని కార్ల్‌మార్క్స్ అటాడు. వెబ్లిన్, మార్క్స్ మొదలైన వారందరు సామాజిక మార్పును సాంకేతిక రూపంలో వివరించవచ్చునని పేర్కొంటారు. ఆగ్‌బర్న్ మాటల్లో చెప్పాలంటే: " మనచుట్టూ ఉన్న పర్యావరణాన్ని మార్చడం ద్వారా సాంకేతిక సమాజాన్నే మార్చి వేస్తుంది. ఇలా మారిన సమాజానికి - చెందినదే అయి వుంటుంది. ఇలాంటి దానికి అనుగుణంగా సర్దుకొని పోవడం మన ఆచారవ్యవహారాలు, సామాజిక సంస్థలలో మార్పులు కలిగిస్తాయి."

ఒక నూతన ఆవిష్కరణ వల్ల ఏర్పడే సామాజిక పరిణామాలు అనేకం. ఉదాహరణకు, టి.వి. మన వినోదాన్ని, విద్య, రాజకీయాలు, క్రీడలు, సాహిత్యం, దృక్పథాలు విజ్ఞానం మనదృష్టికోణం మొదలైన వాటిని ఎన్నింటినో ప్రభావితం చేసింది.

అన్ని సమాజాల్లోని సామాజిక మార్పులకు సాంకేతికత సహాయపడింది, ప్రోత్సహించింది. అన్ని సమాజాలు మార్పులకు నిరంతర మార్పుకు గురి అవతూనే ఉంటాయి. కాలాంతరంలో ఈ మార్పులన్నింటి ఉమ్మడి ప్రభావం లేదా సంచిత ప్రభావం వల్ల పూర్వపు సామాజిక నిర్మితే పరివర్తనకు లోనవడం జరుగుతూ ఉంటుంది. ఏర్పడే ఈ మార్పులన్నీ కేవలం క్రమ పరిణామాత్మకమైనవి కావు. సమాజం తాలూకు నిర్మితీయ మార్పులన్నీ సాధారణంగా సాంకేతికత వల్లే ఏర్పడుతూ ఉంటాయి. మానవుడు కనుగొన్న అన్ని సాంకేతిక పరికరాలు అతడు చేస్తున్న వివిధ కార్యకలాపాలకు తోడ్పడేవే. ఆదిమ మానవుడు రాతి పనిముట్లను ఉపయోగించడం మొదలుపెట్టి క్రమంగా బాగా సానబట్టిన పరికరాలను వాడడం జరిగింది. ఇనుము కనుక్కోవడంతో ఆదిమ మానవుడు గొడ్డలిని ఉపయోగించడం ప్రారంభించాడు. దీనితో మనిషి యొక్క సాంకేతికత కౌశలం పెద్ద ముందడుగే వేసింది. దీని తరువాత గిలక, లివర్, చక్రం వంటి వాటిని ఉపయోగించడం మొదలుపెట్టాడు. వాటి వాడకం పరిసరాలతో ప్రతిక్రియ సాధ్యమై పరిసరాలను తన అవసరాలు తీర్చేవిధంగా మలచుకోగలిగాడు.

18వ శతాబ్దానికి ముందు మానవుడి సాంకేతిక నైపుణ్యాలలో పెద్దగా మార్పులేవీ కలగలేదు. అయితే 18వ శతాబ&దంలో అనేక ఆవిష్కరణలు ఏర్పడడం, నవకల్పనలు చేయడం వల్ల ప్రకృతిని తనకు అనుకూలంగా మార్చుకోవడం సాధ్యమైంది. 18వ శతాబ్దంలో ఏర్పడిన పారిశ్రామిక విప్లవంతో ఎన్నో మార్పులు కలిగాయి. అవి మానవ జీవితాన్నే పూర్తిగా మార్చివేశాయి. అంతటితో సాంకేతికత లోని మార్పులు ఆగిపోలేదు. అనేక ఇతర మార్పులకు ఇవి నాంది పలికాయి. సమాజాలు క్రమంగా నగరీకరణం చెందడం, కుటుంబ వ్యవస్థలో మార్పులు చోటు చేసుకోవడం, సామాజీకీకరణ ప్రక్రియలో కుటుంబ స్థానం క్రమంగా తగ్గిపోవడం వంటి అనేక మార్పులు ఏర్పడ్డాయి. ఇంతేకాక నూతన సామాజిక సముదాయాలు, వినూత్న సామాజిక ప్రతిక్రయలు జరగడమే కాక, అంతర్జాతీయ సంబంధాలకు అంకురార్పణ జరిగింది. సంప్రదాయ సిద్ధమైన సామాజిక నియంత్రణా సాధనాలైన మతం, నైతికత,సంప్రదాయం వంటి వాటి ప్రాముఖ్యం సన్నగిల్లింది. పారిశ్రామిక విప్లవం ఉధృతి ఎంత తీవ్రంగా ఉందంటే భవిష్యత్తులో మానవ సమాజం రూపురేఖలు ఎలా ఉంటాయో ఊహించడానికి వీలు లేనంతగా ఉంది. పారిశ్రామిక విప్లవపు రెండోదశ-సాంకేతికాభివృద్ధి దశ-ప్రారంభమైంది. దీనిప్రభావం మానవజీవతం అంతటా వ్యాపించింది,వ్యాపిస్తోంది. శాస్త్ర, సాంకేతిక రంగంలో మానవుడు వేసే ప్రతి ముందడుగు మానవ సమాజాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తోంది. నూతన పరిణామాలకు కారణమవుతోంది.

ఈనాడు విద్యుత్ అయస్కాంత కెరటాలు ఏవీసా నిబంధనలకు లొంగక అతీతంగా ఉంటున్నాయి. సందేశాలు, విజ్ఞాన,వినోద ప్రసారాలు ప్రపంచంలో ఏ మూల మొదలైనా దశదిశల వ్యాపిస్తున్నాయి ఈనాడు. వీటన్నింటికి తోడు రవాణా సదుపాయాలలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి కూడా.

సమాజం తాలూకు మౌలిక వ్యవస్థ అయిన కుటుంబవ్యవస్థ ప్రపంచ వ్యాప్తంగా క్రమంగా క్షీణిస్తోంది, కుంచించుకొని పోతోంది. కేంద్రక కుటుంబాలే(Nuclear family)ఈనాడు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. విద్యుచ్ఛక్తి ప్రతి ఇంటా

ప్రవేశించింది: రకరకాల విద్యుత్ ఉపకరణాలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటి వాడకం పెరిగిపోతూనే ఉంది. ఇవన్నీ మహిళల కార్యకలాపాలలోని అలసట, విసుగుదలలను బాగా తగ్గించివేస్తున్నాయి. ఫలితంగా ఈవర్గానికి కావలసినంత తీరిక సమయం దొరుకుతోంది, సౌకర్యం పెరిగింది. కుటుంబ సంస్కృతిని ప్రచారం ఈనాడు రేడియోలు, టీవీల ద్వారానే జరుగుతోంది. భారీఎత్తున నగరీకరణ జరగడం సాంకేతికాభివృద్ధి ప్రభావాలలో మరో ముఖ్యమైన ప్రభావం. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తుంది. మానవులు, సమాజాల మధ్య ప్రతి చర్యలు, పరస్పర సంబంధాలు పెనుమార్పులకు గురి అవుతున్నాయి. ఈనాడు సాముదాయక సమావేశాల భావనతోనే ఆలోచించడానికి వీలు లేనంతగా మారిపోయింది పరిస్థితి.

విరామ సమయం బాగా పెరగడమే ఈనాడు కొట్టవచ్చినట్లు కనినించే మార్పు. ఇది సాంకేతికాభివృద్ధి ఫలితంగా ఏర్పడిన పరిణామమేనని చెప్పక తప్పదు. ప్రతిపనిలో కంప్యూటర్‌ల వినియోగం పెరిగి కాలం ఆదాకావడమే కాక, నాణ్యత కూడా పెరగడం గమనించదగ్గ పరిణామాలు. ఈ యుగాన్ని కంప్యూటర్ యుగం అంటే అతిశయోక్తి కాదు. వీటన్నిటి ప్రభావం వల్ల వృత్తుల తీరులో(Occupational pattern) అనూహ్యమైన మార్పులు కలుగుతున్నాయి. కంప్యూటర్‌లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడకంతో మానవుల విరామసమయం బాగా పెరిగింది.

సాంకేతికత అనేది ఈ మధ్యకాలంలో మానవుడు సాధించిన నైపుణ్యం. నూతన పరిజ్ఞానం అని, ఇది మానవుల సామాజిక విలువలలో ఏర్పడిన మార్పు ఫలితంగా ఏర్పడిన పరిణామమని కింగ్స్‌లీ డేవిడ్ పేర్కొన్నాడు. స్పర్థ, సామాజిక గమనశీలతను ప్రోత్సహించే సమాజాలలోనే సాంకేతిక ప్రగతి సాధ్యమవుతోంది. శాస్త్రీయ శ్రమ విభజన (Scientific division of labour) ప్రత్యేకీకరణలపై ఆధారపడిన సమాజాలు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువగా ఉపయోగించుకొనే అవకాశముంటుంది. ఆగ్‌బర్న్ దృష్టిలో సాంకేతిక ఆవిష్కరణలు భౌతిక సంస్కృతిని పెంపొందిస్తాయి. ఉదాహరణకు మిక్సీలు మహిళల శ్రమను, సమయాన్ని ఆదా చేసుకొనేందుకు ఉపకరిస్తాయి. అంతేకాక వాటి వాడకం వల్ల అధునాతన పద్ధతులను వాడుతున్న తృప్తి కూడా కలుగుతుంది. సాంకేతికాభివృద్ధి కొన్ని కొన్ని సమయాల్లో సామాజిక మార్పులకు దోహదం చేస్తుందని ఆగ్‌బర్న్ అభిప్రాయం. ఇది ప్రధానంగా మూడురకాలుగా ఉంటుంది (1) వ్యాప్తి(dispersion). ప్రతి శాస్త్రీయ ఆవిష్కరణ ప్రభావం సమాజంపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఉంటుంది. ఉదాహరణకు విద్యుచ్ఛక్తిని కనుగొనడం మారుమూల గ్రామాల ను విద్యుదీకరించడానికి తోడ్పడటమేకాక చిన్న పరిశ్రమల వివిధీకరణ(diversification) కు కూడా సహాయపడింది. దీని ఫలితంగా లౌకికీరణ,జీవన ప్రమాణం పెరుగుదల జరిగాయి. (2) వివిధ రకాల యంత్రాలను, యంత్ర పరికరాలను ప్రవేశపెట్టడం వంటి సాంకేతిక మార్పులు సమాజంలో సంచితమైన మార్పుల(cumulative changes)కు దారి తీశాయి. సమాజంలో ఏర్పడిన ఈ రకమైన పరిణామ ప్రక్రియను ఆగ్‌బర్న్ అభిసరణ(convergence)గా పేర్కొన్నాడు. (3) మెరుగైన సాంకేతిక పద్ధతులు కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుదలకు దోహదం చేసింది. సామాజిక మార్పులకు సంబంధించి ప్రధానమైన సాంకేతికతను ఆగ్‌బర్న్ 'సైరల్' లేదా సర్పిలం అని అన్నాడు. దీనినే ఇతర సమాజశాస్త్రవేత్తలు సర్క్యులర్ క్యుములేటివ్ ఏక్సిలరేటింగ్ ప్రోసెస్ అని అన్నారు. సాంకేతికాభావృద్ధి వల్ల ఏర్పడిన నూతన సదుపాయాలను వెనుకబడిన సమాజానికి కూడా అందించినప్పుడు ఏర్పడిన అభివృద్ధినే స్పైరల్ డెవలప్‌మెంట్ అంటారు. ప్రారంభదశల్లో విద్యను సులభతరం చేయడం, సార్వత్రికం చేయడం జరుగుతుంది. మెరుగైన విద్యావకాశాల వల్ల మెరుగైన ఉపాధి అవకాశాలు అధికం కావడమే కాక అనేక ఇతర సత్ఫలితాలు కూడా కలుగుతాయి.

మార్క్స్ సమాజం భౌతికాంశాల ప్రాతిపదికపైనే నిర్మితమైందని సహజంగానే భావిస్తాడు. ఇతని దృష్టిలో సామాజిక సంబంధాలు ఆర్థిక సంబంధాలకు ఏ మాత్రం భిన్నమైనవి కావు. అతని దృష్టిలో భౌతిక ఉత్పత్తి శక్తులలో మార్పులు ఏర్పడినప్పుడు ఆ మార్పులు సమాజంలోని ఆర్థిక సంబంధాలలో కూడా మార్పులు తెస్తాయి, సామాజిక నిర్మిత మార్పులకు లోనౌతుంది. సమాజంలో ఆర్థిక నిర్ధారణను సాధించే వరకూ వర్గ పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయి.

మానవజీవితాన్ని నడిపించేవి వ్యక్తుల అలవాట్లు, వారు చేస్తున్న పనే అని అమెరికన్ రచయిత థర్స్ స్టైన్ వెబ్లెన్(Thurstein Veblen) అభిప్రాయం. వీటికి బట్టే వ్యకుల మనస్తత్వం ఏర్పడతాయి. వ్యక్తి చేసే పనిని బట్టే

BRAOU

అతని ఆలోచనలు, సంస్థలు,సాంస్కృతిక, మానవ సంబంధాలుంటాయి.

సామాజిక మార్పులను సాంకేతిక మార్పుల నేపథ్యంలో చూస్తున్నామంటే సాంస్కృతిక మార్పులనే చూస్తున్నామని అర్థం. బెర్నెర్డ్, పెల్టో(Bernerd, Pelto)ల దృష్టిలో సంస్కృతి అంటే కేవలం విశ్వాసాలు, విలువలు, ప్రమాణాల సమాహారమే కాక ప్రజాజీవితానికి దోహదపడే భౌతిక వస్తువులు, సాంకేతిక పద్ధతులు కూడా. ఉదాహరణకు ఆటోమొబైల్‌ను కనుగొనడంతో అంతర్జాతీయ వ్యాపార రంగంలో నూతన ఉత్పత్తుల అవసరం ఏర్పడింది. అయితే అన్ని మార్పులూ హర్షదాయకం కాకపోవచ్చు. కొన్ని మార్పులు సంస్కృతిని తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు. ఉదాహరణకు గతంలో పూజాసమయంలో ప్రమిదలను వెలిగించేవారు. శాస్త్ర సాంకేతికాభివృద్ధి ఫలితంగా సాంప్రదాయక పద్ధతుల స్థానంలో విద్యుద్దీపాలు వెలిగించడం జరుగుతుంది.

వర్తమాన ప్రపంచంలో సామాజిక మార్పులతో ఎక్కువ వాటిని ప్రణాళికాబద్ధంగా తీసుకొని రావడం జరుగుతోంది. అయితే ఈనాటి సామాజిక మార్పులన్నీ ప్రణాళికాబద్ధంగా ఏర్పరచినవేనని చెప్పలేము.

## సాంకేతికత ప్రభావాలు

ఇంతవరకూ మనం సామాజిక మార్పులకు సంబంధించి సాంకేతిక కారకాలను పరిశీలించాం. ఇప్పుడు సమాజంపై నూతన సాంకేతికత ప్రభావం ఎంత వరకూ ఉందో పరిశీలిద్దాం.

### 1. పారిశ్రామికీకరణ

సాంకేతిక పద్ధతులు పరిశ్రమె వృద్ధికి లేదా పారిశ్రామికీకరణ ప్రక్రియకు గణనీయంగా తోడ్పడ్డాయి. ఇంగ్లండులో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం అనేక పరిశ్రమల వృద్ధికి ఎంతగానో తోడ్పడింది. పారిశ్రామికీకరణ ఫ్యాక్టరీ వ్యవస్థలో ముడిపడి ఉంది. ఫ్యాక్టరీల్లో భారీ ఎత్తున వస్తువుల ఉత్పత్తి జరుగుతుంది. ఫ్యాక్టరీ వ్యవస్థ వల్ల వస్తువుల ఉత్పత్తి రేటు,నాణ్యతలు పెరిగాయి, వస్తువుల ధరలు తగ్గాయి. ఈ ఫలితాలు లభించినా పారిశ్రామికీకరణ ఫలితంగా ఎందరో చేతివృత్తుల వారు ఉపాధి కోల్పోవడం, వ్యక్తుల స్థానంలో యంత్రాలు ప్రవేశించడం వంటి దుష్ఫలితాలు కూడా కనిపించాయి.

BRAOU

### 2. నగరీకరణ

పారిశ్రామికీకరణ నగరాల వృద్ధికి ఎంతగానో తోడ్పడ్డాయి. ఈనాడు నగరీకరణ ప్రపంచ వ్యాప్తమైన అంశంగా మారింది. క్రీ.శ. 1800 లో ప్రపంచమంతటికీ లక్ష జనాభాగల 21 నగరాలు మాత్రమే ఉండేవి. ఆ తరువాత కాలంలో అనేక పెద్ద నగరాలలో అభివృద్ధి అత్యధిక స్థాయిలో జరిగింది. ఇలాంటి నగరాలలో ముఖ్యమైనవి - మనదేశానికి సంబంధించినంత వరకూ- బెంగుళూరు, దుర్గాపూర్, కాన్పూర్, బొంబాయి, కలకత్తాలు. వీటిని అధిక నగరీకరణ చెందిన పట్టణాలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. ప్రణాళికా బద్ధంగా సాగని ఈ నగరాల పెరుగుదల జనసమ్మర్ధానికి, అపారిశుధ్యానికి, నీరు, విద్యుచ్ఛక్తి వంటి వాటి కొరత లాంటి అనేక సమస్యలకు మూలమైంది. ఇలాంటి సమస్యలే కాక నగరాలు నేరాలు, విచలిత ప్రవర్తన, జూదం, పడుపువృత్తి, తాగుడు, భిక్షాటన, బాలకార్మికులు,మాదక ద్రవ్యాల సేవనం వంటి సామాజిక, ఆర్థిక సమస్యలకు కూడా కారణమైంది.

### 3. రవాణా కమ్యూనికేషన్ సదుపాయాల వృద్ధి

రవాణా, కమ్యూనికేషన్ సదుపాయాల వల్ల జాతీయ, అంతర్జాతీయ వర్తక వ్యాపారాలు బాగా పెరిగాయి. శాస్త్ర సాంకేతికాభివృద్ధి ఫలితంగా తంతి తాపాలా, రేడియో, టి.వి., వైర్‌లెస్ సదుపాయాలు పుష్కలంగా లభించాయి. వీటన్నింటికీ తోడు ఉపగ్రహాలను ప్రయోగించడం కూడా ప్రారంభమైంది. వివిధ దేశాల వ్యక్తుల మధ్య సన్నిహిత సంబంధాలు ఏర్పడడం వల్ల అదివరకటి అపోహలు, వ్యతిరేక భావాలు చాలావరకు తగ్గిపోయాయి. ఒక్క మాటలో చెప్పాలంటే శాస్త్ర సాంకేతిక అభివృద్ధి సహాయంతో ఈ నాటి మానవుడు కాలాన్ని, దూరాన్ని జయించాడనే

చెప్పవచ్చు. మానవ జీవితం సుఖప్రదం కావడమే కాక విలాసవంతంగా కూడా మారింది.

## 4. ఆధునీకరణ

శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని, ఆహారపుటలవాట్లను, వేషభాషలను అనూహ్యమైన రీతిలో మార్చివేసింది. మొత్తం సమాజం అధునాతన రీతిలో రూపొందుతోంది. దీనికంతటికీ కారణం శాస్త్రసాంకేతిక రంగాలలో మానవుడు సాధించిన పురోభివృద్ధే అని చెప్పడం తప్పదు. మానవ సామాజిక సంబంధాలలో పెనుమార్పులు చోటుచేసుకొన్నాయి. సామాజిక నిర్మితిలో ఏర్పడిన నూతన పరిణామాల పాత్ర విభేదీకరణలో మార్పులకు కూడా కారణమయ్యాయి. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం ఈ మార్పు ప్రక్రియను వేగవంతం చేసింది.

## 5. ఆర్థిక వ్యవస్థలో మార్పులు, నూతన సామాజిక వర్గాల ఆవిర్భావం

ఫ్యాక్టరీ వ్యవస్థలో జరుగుతున్న ఉత్పత్తి విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థ పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థగా మారిపోయింది. దీన్నే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అంటారు. ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలలో ఏర&పడి ఈ మార్పులు సామాజిక వ్యవస్థలో రెండు ప్రధాన వర్గాలు ఏర్పడడానికి కారణమైంది. అవి పెట్టుబడి దారీ వర్గం, కార్మికవర్గం. ఈ రెండు వర్గాల ప్రయోజనాలు, ఆశలు, ఆకాంక్షలు భిన్నమైనవి కావడం వల్ల వీటి మధ్య నిరంతరం పోరాటం సాగుతూనే ఉంటుంది. కాలగమనంలో మధ్యతరగతి అనే ఒక నూతన వర్గం బయలుదేరింది. సమాజంలోని వైట్‌కాలర్ ఉద్యోగులలో చాలా మటుకు ఈ తరగతికి చెందిన వారే.

## 6. నిరుద్యోగిత

శాస్త్రసాంకేతికాభివృద్ధితో ముడివడి ఉన్న ప్రధాన సమస్య నిరుద్యోగ సమస్య. యంత్రాలు శ్రమను ఆదాచేసే ఉత&పత్తి పరికరాలు కావడం వల్ల అనేకమంది కార్మికులు తమ ఉద్యోగాలు కోల్పోవడం అనివార్యమైంధి. W...ÌO\ ÷x~ ˆ Ëy` Ç^ ÌÕHuH x~ ˆ Ëy` Ç(Technical unemployment) అంటారు. నిరుద్యోగిత సమాజంలో కొన్ని దుష్పరిణామాలకు - నేరం, వేశ్యావృత్తి, భిక్షాటన మొదలైన వాటికి - కారణమవుతుంది.

## 7. సాంకేతికత - యుద్ధం

ఈనాటి యుద్ధం తీరే మారిపోయింది. మనుషులకు బదులు శతఘ్నులు, బాంబులు వంటివే యుద్ధంలో విరివిగా ఉపయోగించడం జరుగుతోంది. అణుబాంబు, హైడ్రోజన్ బాంబు వంటి మారణాయుధాలనే కాక ఆధునిక కాలంలో యుద్ధ తంత్రం జైవిక, రసాయన ఆయుధాల ఉపయోగం వరకూ సాగింది. శాస్త్ర సాంకేతికత పరిజ్ఞానాన్ని మానవ కళ్యాణానికి, మానవ వినాశనానికి కూడా ఉపయోగించవచ్చు. ఇది రెండు వైపులా పదునున్న కత్తి.

BRAOU

## 8. విలువల్లో మార్పు

ఈ మధ్య కాలంలో జీవిత విలువలలో విపరీతమైన మార్పులు ఏర్పడ్డాయి. వీటికి మూలకారణం పారిశ్రామికీకరణ, నగరీకరణ, రవాణా కమ్యూనికేషన్ సదుపాయాల పెరుగుదల, ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతంగా సాగడం, లౌకిక విద్యా వ్యాప్తి, నూతన రాజకీయ భావజాలం మొదలైనవన్నీ విశ్వాసాలు, విలువలు, భావాలు మొదలైన వాటిపై ప్రగాఢమైన ప్రభావాన్ని చూపాయి. ఆధునిక కాలంలో మానవుడు నిష్క్రియాపరుడుగా మారడమేకాక మానవ జీవితం యాంత్రికంగా మారింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మానవుడి హస్తానికంటే, మస్తిష్కానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తోంది. వ్యక్తివాదం ఒక మహా ఉద్యమంగా మారింది.

## 9. సామాజిక సంస్థలలో మార్పు

పారిశ్రామికీకరణ, నగరీకరణల వల్ల సామాజిక సంస్థలైన కుటుంబం, మతం, నైతికత, వివాహవ్యవస్థ, రాజ్యం, ఆస్తిపాస్తులు మొదలైన అనేకం ప్రభావితమయ్యాయి. ఒకనాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఈనాడు కనిపించదు. వివక్షకు గురైన మహిళ ఈనాడు పురుషునితో సమానంగా సామాజిక, ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటోంది. ఈ

మంచి పరిణామానికి తోడు కొన్ని దుష్పలితాలను కూడా గుర్తించవచ్చు. సామాజిక కౌటుంబిక (familial), వైయక్తిక అవ్యవస్థలు, వ్యక్తుల మధ్య పరస్పర సంబంధాలు తీవ్రమైన ఒత్తిడులకు గురికావడం వంటివి కూడా చోటుచేసుకొంటున్నాయి. మతానికి సంబంధించినంతవరకు మత ప్రమేయంలేని లౌకిక రాజ్యాన్ని కాంక్షించడం సర్వత్రా కనిపిస్తుంది. ఆధునిక కాలంలో రాజ్యకార్యకలాపాల విస్తృతి ప్రముఖంగా కనిపించడమే కాక రాజ్యం సంక్షేమ ప్రధానమైందిగా మారడం గమనించదగ్గ మార్పు.

ఆధునిక కాలంలో ముఖ్యంగా గమనించదగిన మార్పు ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన మార్పు. ఆధునిక పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు జీవనశైలిలో కూడా అనూహ్యమైన మార్పులు వస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలో ఆదాయ సంపదలకు సంబంధించి తీవ్రమైన వ్యత్యాసాలు కూడా చోటుచేసుకొంటున్నాయి. వీటివల్ల లేనివారు ఉన్నవారిని ద్వేషించడం, ఘర్షణ పడటం జరుగుతోంది. ఫలితంగా సమాజంలో అశాంతి పెరుగుతోంది.

జి. ఎమ్. ఫాస్టర్ అన్నట్లు: సాంకేతికాభివృద్ధి అనేది వాస్తవానికి ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. కేవలం బహిరంగంగా కనిపించే సాంకేతిక మార్పులను ఆమోదించడమే కాదు. ఈ ప్రక్రియ సాంస్కృతిక, సామాజిక, మానసిక ప్రకియ కూడా. ఈ కారణంగానే కొందరు ఈనాటి మార్పుల పర్యవసనాన్ని సామాజిక సాంకేతికాభివృద్ధిగా వర్ణిస్తారు.

మాక్స్‌వెబర్ తన రచన " "లో ప్రముఖ విలువలకు, ఆ విలువలున్న వ్యక్తులు నిర్వహించే ఉద్యమత్వ పాత్రకున్న సంబంధాన్ని గురించి సుదీర్ఘంగా చర్చించాడు. ఇతని విశ్లేషణే యంత్రాల ఉపయోగానికి కూడా అన్వయించవచ్చు. యంత్రాల పూర్తి వినియోగానికి వాటితో పనిచేసే వ్యక్తుల దృక్పథాలు ఉండడంతోబాటు నూతన భావాలు, పద్ధతుల పట్ల ఆసక్తి ఉండడం కూడా అవసరం.

భౌతిక సంస్కృతిలో చోటుచేసుకొన్న మార్పుల తీరు తెన్నులను ఆగ్బర్న్ సుదీర్ఘంగా అధ్యయనం చేశాడు.

1, యాంత్రిక ఆవిష్కరణలు క్రమంగా పోగవుతాయి. ఫలితంగా భౌతిక సంస్కృతి విస్తృతమవుతుంది. ఈ ప్రక్రియను ఆగ్బర్న్ కింది విధంగా వివరించాడు. "రాతి ఉపయోగానికి ఎముకల ఉపయోగాన్ని జోడించాడు. అట్లాగే రాగికి కంచుని జతచేసి ఉపయోగించాడు. తరవాతి దశలో ఇనుముకు కంచు ఉపయోగంతో జనపరిచాడు. దీనితో భౌతిక సంస్కృతి ప్రవాహం క్రమంగా పెద్దదైంది.

2. యాంత్రిక ఆవిష్కరణలు కాలాంతరంలో వివిధీకరణ చెందుతాయి. అందువల్ల వాటిని సవిస్తరంగా ఉపయోగించడానికి వీలవుతుంది. మౌలికమైన ఆవిష్కరణల వల్ల వివిధ శాస్త్ర సిద్ధాంతాలను సూత్రాల అన్వయం సాధ్యమవుతుంది. ఉదాహరణకు ఇంటర్నల్ కంబశ్చన్ ఇంజన్ వల్ల ఎన్నో రకాల యంత్రాల తయారీ సాధ్యమైంది.

ఇంతవరకూ చర్చించిన దానిని బట్టి చూస్తే ఆధునిక జీవితాన్ని తీర్చి దిద్దుతున్నది సాంకేతిక అభివృద్ధే అని స్పష్టమవుతుంది. యాంత్రీకరణ మానవుల జీవనశైలినే కాక అనేక సామాజిక సంస్థలను కూడా ప్రభావితం చేస్తుంది. సాంకేతికత ఇంతగా అభివృద్ధి చెందని పక్షంలో ఆధునిక నాగరకత ఇంతగా విలసిల్లేది కాదు. ఇంతటి మహత్తర అభివృద్ధికి మూలమైన సాంకేతిక ప్రగతి అనేక సమస్యలను కూడా సృష్టించిందని చెప్పక తప్పదు. అణుశక్తి అభివృద్ధి మానవాళి అనుభవిస్తున్న దారిద్ర్యాన్ని నిర్మూలించడంలో తోడ్పడుతున్నా మానవ వినాశకారిగా కూడా పరిణమిస్తోంది. సాంకేతికాభివృద్ధి ద్వారా సాంప్రదాయిక వ్యవసాయ పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన శాస్త్రీయ పద్ధతులను అనుసరించి ఆహారోత్పత్తి చేయడం సాధ్యమవుతోంది. సాంకేతికాభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగానే పెరిగాయని చెప్పవచ్చు.

ముక్తాయింపుగా సామాజిక పరిణామానికి భౌగోళిక, జైవిక, సాంస్కృతిక, మానసిక, సాంకేతిక కారకాలు ప్రభావశీలమైన కారకాలని చెప్పవచ్చు.

BRAOU

## 25.7 సారాంశం

ఈ పాఠంలో సామాజిక మార్పులకున్న కారకాలను గురించి చర్చించడం జరిగింది. సమాజం నిరంతరం మార్పు చెందుతూనే ఉంది. ఈ మార్పులకు కారణం భౌతిక, జైవిక, సాంస్కృతిక, మానసిక, సాంకేతిక కారకాలే. వాతావరణం, వర్షపాతం, జంతుజాలం వంటి భౌతిక కాకరాలు సమజంలో ఏర్పడే మార్పులకు కొంతవరకు కూడా కారణమవుతాయి. మానవుడు సాంస్కృతికంగా ఎదిగిన కొద్దీ తన చుట్టూ ఉన్న భౌతిక పరిసరాలను మార్చడానికి ప్రయత్నిస్తాడు. అలాగే సమాజాల స్వరూపం, నిర్మితులను జైవిక కారకాలు నిర్ధారిస్తాయి. జననాల రేటు, మరణాల రేటు తగ్గుముఖం పట్టడం, జనాభా పెరుగుదలను ప్రభావితం చేస్తోంది. ఈ సందర్భంగా ఈ పాఠంలో ప్రకృతి, సామాజిక వరణాలను గురించి చర్చించడం జరిగింది. ప్రకృతి వరణం అనే ప్రక్రియలో కొన్ని జీవులు అంతరించడం జరుగుతుంది. సమాజంలో కూడా ఇటువంటి ఎంపిక జరుగుతుంది. అయితే ప్రకృతి వరణం మరణాల రేటు రూపంలోనూ, సామాజికవరణం జననాల రేటు రూపంలోనూ జరుగుతుంది. జనాభా నిర్మితిని నిర్ధారించే మరో అంశం వలస. విద్యావంతులు, వివిధ వృత్తుల వారు ఇతర దేశాలకు వలస వెళ్ళడం జరుగుతూ ఉంటుంది. అయితే ఇది వాస్తవానికి మేధావుల వలసే.

సాంస్కృతిక కారకాలు కూడా సమాజంలో మార్పులు తెస్తాయి. విలువలు, విశ్వాసాలు, ఆలోచనలు, భావజాలం, నీతినియమాలు సంప్రదాయాలు వంటివన్నీ సామాజిక పరిణామాలకు దోహదం చేస్తాయి. సంస్కృతి నిరంతరం మారుతూ ఉండడమే కాక సాంకేతికతను ప్రభావితం చేస్తుంది. ఇలా ఈ రెండు కారకాలు పరస్పరం ప్రభావానికి లోనవుతూ ఉంటాయి.

సాంకేతికత సమాజం మారడానికి తోడ్పడుతుంది. పారిశ్రామికీకరణ, నగరీకరణ, రవాణా సౌకర్యాలు మెరుగుపడడం, ఆధునీకరణ, విలువలలో మార్పులు సామాజిక సంస్థల్లో మార్పులు ఇవన్నీ సాంకేతిక రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా ఏర్పడినవే. మన జీవితాన్ని మలచడంలోనూ, మార్పులను తేవడంలోనూ సాంకేతికత ప్రముఖ పాత్ర వహిస్తుంది. జీవన ప్రమాణాలు పెరగడానికి జీవించే పరిస్థితులు మారడానికి కారణం సాంకేతికతే.

BRAOU

## 25.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులలో సమాధానాలు రాయండి:**

1. సామాజిక పరివర్తనకున్న భౌగోళిక కారకాలను గురించి వివరించండి.

2. ప్రకృతి, సామాజిక వరణాలంటే ఏమిటి? అవి సామాజిక మార్పులకు ఎలా దారితీస్తాయి?I

**II. ఈ కింది ప్రశ్నలకు 15 పంక్తులలో సమాధానాలు రాయండి:**

1. సమాజంపై సాంకేతిక ప్రభావాన్ని గురించి చర్చించండి.

2. సామాజిక పరివర్తనకున్న మానసిక కారకాలను గురించి వివరించండి.

## 25.9 చదవదగిన పుస్తకాలు


Rajesh Gill — Social Change in urban periphery

Srinivas, M.N — Social change in Modern India

| | |
|---|---|
| Robert W. Stren | Changing India |
| Yogendra Singh | Modernization of Indian Tradition |
| Yogendra Singh | Social change in India |


BRAOU

# భాగం- 26: సాంస్కృతిక భిన్నత్వం, సాంస్కృతిక మార్పు, సాంస్కృతిక విలంబన

విషయక్రమం


26.0 ఉద్దేశాలు

26.1 పరిచయం

26.3 సాంస్కృతిక భిన్నత్వం

26.3 సాంస్కృతిక భిన్నత్వం కారకాలు

26.3.1 జాతి, సంస్కృతి

26.3.2 వాతావరణ, భౌగోళిక కారకాలు- సంస్కృతి

26.4 సాంస్కృతిక విలంభన

26.5 సాంస్కృతిక మార్పుకు కారణాలు

26.6 సాంస్కృతి విలంబన భావన

26.7 సారాంశం

26.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

26.9 చదవదగిన పుస్తకాలు


## 26.1 ఉద్దేశాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు కింది విషయాలు తెలుసుకోగలరు.

- సమాజ శాస్త్రంలో వివరించినట్లు సాంస్కృతిక భిన్నత్వం అర్థం
- సాంస్కృతిక భిన్నత్వానికి కారణాలు
- సాంస్కృతిక మార్పు అర్థం
- సాంస్కృతిక విలంబన అర్థం, ఆగ్బర్న్ సాంస్కృతిక విలంభన సిద్ధాంతం

BRAOU

## 26.2 పరిచయం

ప్రతీ సమాజానికి ఒక సంస్కృతి ఉంటుంది. ఒక సమాజ సంస్కృతి మరో సమాజ సంస్కృతి కి భిన్నంగా ఉంటుంది. సంస్కృతి ఒక్కొక్క సమాజానికి ఒక్కొక్క రకంగా ఉండటం దని ప్రత్యేక విశిష్ట లక్షణం. సంస్కృతులలో ఏకరూపత కనిపించదు. సాంస్కృతి క అంశాలైన ఆచారాలు, సంప్రదాయాలు, నీతి సూత్రాలు, ఆదర్శాలు, సిద్ధాంతాలు, విశ్వాసాలు, ఆచరణల తీరు, తత్వచింతనలు అన్నవి అన్ని సమాజాల్లోనూ ఒకే రకంగా ఉండవు. మానవజాతిలో కనిపించే లక్షణాలలోనే కాకుండా మాట్లాడే భాషలు, మత విశ్వాసాలు, ఆచారాలు, సంప్రదాయాలు, విధివిధానాలు, సంస్కారాలలో కూడా భిన్నత్వం స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. సంస్కృతి కాలానుగుణంగా మారుతూ కూడా ఉంటుంది. ఏ సంస్కృతి కూడా నిలకడగా, ఏమార్పులు, చేర్పులు లేకుండా ఉండదు.

సంస్కృతిలో స్థిరత ఉంటుందే కానీ అది స్తబ్ధమైంది కాదు. దానిలో కలిగే మార్పులు నెమ్మదిగా కలుగుతాయి. ఆ మార్పులు నిలకడగానే ఉంటాయి. ప్రస్తుత భారతీయ సంస్కృతిలో అద్భుతమైన మార్పులు కనిపిస్తాయి. గత

కాలపు వైదిక సంస్కృతితో పోలిస్తే ఈనాటి సంస్కృతి ఎన్నో మార్పులకులోనై ఒక నూతన రూపం పొందినట్లు కనబడుతుంది. ఈ భౌతిక ప్రపంచంలోని మారుతున్న పరిస్థితులను బట్టి సంస్కృతి కూడా మార్పుకు లోనవుతూ కొత్త లక్షణాలను సంతరించుకొంటూ ఉంటుంది.

## 26.3 సాంస్కృతిక భిన్నత్వం

ప్రతి సమాజానికి ఒక సంస్కృతి అనేది ఉంటుంది. ప్రతి సమాజానికి కొన్ని సార్వజనీనాలు, ప్రత్యామ్నాయాలు, ప్రత్యేకతలు ఉంటాయి. అయితే ఒక సమాజంలో సార్వజనీనమైనవి మరో సంస్కృతిలో ప్రత్యమ్నాయాలు కావచ్చు లేదా మూడో సంస్కృతిలో అవి అసలే కనిపించకపోవచ్చు. మానవుని మౌలిక అవసరాలను తీర్చడం, వాటిని క్రమబద్ధీకరించడం సంస్కృతి చేస్తుంది. ఈ అవసరాలను తీర్చే పద్ధతుల్లో వైవిధ్యం కనిపిస్తుంది. మానవ సముదాయాలు, సంఘాలు పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకొంటూ ఉంటాయి. సార్వజనీనమైన సాంస్కృతిక లక్షణాల అభివ్యక్తిలో - మతం, భాష, సాంకేతిక పద్ధతి, కళలు, నైతిక మొదలైన వాటిలో - కూడా వైవిధ్యం కొట్టవచ్చినట్లుంటుంది. అంటే సంస్కృతి స్వరూప స్వభావాలలో కనిపించే అనంతమైన వైవిధ్యాన్నే సాంస్కృతిక భిన్నత్వం (cultural variability) అంటారు.

సాంస్కృతిక భిన్నత్వాన్ని కొన్ని ఉదహారణలతో మరికొంత విపులీకరించవచ్చు. ఉదాహరణకు హిందువులు గొడ్డుమాంసం తినడానికి నిరాకరిస్తారు. అదే క్రైస్తవులకు, ముస్లిములకు నిషిద్ధ పదార్థం కాదు. ఒక సమూహానికి సర్వ సాధారణము, సంప్రదాయబద్ధము అయిన అంశం మరో సముదాయానికి అభ్యంతరకరమైనది అవుతుందన్నమాట. ఉదాహరణకు అండమాన్ వాసులు రాత్రి సమయంలో ఈల వేయరు. కారణం ఆ శబ్దానికి దయ్యాలు(spirits) వస్తాయని వారి నమ్మకం. అదే మరో ప్రాంతం వారు ఈ పరిస్థితుల్లో భిన్నంగా ప్రవర్తిస్తారు. మనలనే తీసుకొండి స్మశాన ప్రాంతాలలో పోతున్నప్పుడు శబ్దం చేసుకొంటూ పోవడం మనకు అలవాటు. ఈ శబ్దానికి దయ్యాలు దూరంగా వెళ్లిపోతాయని మనం నమ్ముతాము. ఒకే సమాజంలోని సమూహాలలో దృక్పథంలోను, ప్రవర్తనతీరులోను భిన్నత్వం కనిపించవచ్చు. ఉదాహరణకు గ్రామీణులు, నగరవాసులలో ఈ లక్షణాలు వేరు వేరుగా ఉంటాయి.

శవసంస్కారాల విషయంలో వివిధ మానవ సముదాయాల మధ్య ఎంత తేడా కనిపిస్తుంది. యాదులు, క్రైస్తవులు, ముస్లిములు మొదలైన అనేక ఇతర మతాల వారు శవాలను ఖననం చేస్తారు. హిందువులలో శవాలను దహనం చేయడం సంప్రదాయం. భారత దేశంలోని పార్శీలు మృతదేహాలను రాబందులకు వేయడం ఆచారం. పురాతన ఈజిప్టు రాజులు, రాణులు, ఇతర ప్రముఖుల పార్థివశరీరాలను వాసనకట్టి ఉంచడం ఆచారంగా ఉండేది. భారతదేశంలో శవాలను గంగానదిలో పారవేసే ఆచారం కూడా ఉంది. ఈ రకమైన పద్దతులే కాక ప్రపంచంలోని వివిధ ప్రాతాలలోని సముదాయాలు అనుసరించే పద్ధతులలో వవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది. మరికొన్ని ఉదాహరణలుగా sea-fold ఖననం, శవాలను వదిలివేయడం, శరీరభాగాలను విడివిడిగా తీసివేయం, దోనెల్లో వదిలిపెట్టడం వంటివి వాటిని పేర్కొవచ్చు. ఆదిమానవులు ప్రకృతి అంశాలు, దృగ్విషయాలు - చెట్లు, నదులు, నక్షత్రాలు అనేవాటికి కూడా ఆత్మలుంటాయని విశ్వసిసాఃతరు. దీన్ని సర్వాత్మ వాదం(animism) అంటారు. కొందరు టోటెమిజమ్ (kangaroo)ను నమ్ముతారు. దీనిలో కొన్ని జాతుల మృగాలు, చెట్లు ఉంటాయి. వీటిని తమ పూర్వికులుగా భావించి పూజిస్తారు. ఆస్ట్రేలియా ఆదిమ జాతులు తాము కంగారు వంశజులమని నమ్ముతారు. హిందు మతాన్ని పరిశీలిస్తే భగవంతుడిని అనేక రూపాలలో కొలచడం కనిపిస్తుంది. దీనికి కారణం భగవంతుడు సరాఃంతర్యామి అనే విశ్వాసం. ఏకేశ్వర మతాలైన(monotheistic religion) జుడాయిజమ్, ఇస్లామ్‌లలో సర్వోన్నత దైవాన్నే సృష్టికర్త అని సర్వ విశ్వాసాన్ని అతడే సృష్టించాడని విశ్వసిసాఃతరు. బౌద్ధులకు సర్వోన్నత భగవంతుడనే భావన లేదు.

## 26.4 సాంస్కృతిక భిన్నత్వానికి కారణాలు

వివిధ సంస్కృతులలోని ఏకరూపతను భిన్నత్వం కంటే సులభంగావివరించవచ్చు. అన్ని సంస్కృతులలోని

సాదృశ్యత అనేది ప్రపంచంలోని అందరిలోనూ కనిపించే మౌలిక, జైవిక లక్షణాల వల్లే అని అర్థం చేసుకోవచ్చు. ఈ జైవిక లక్షణాలు బతికి బట్టకట్టడానికి అవసరమైన కొన్ని సర్వసాధారణమైన లక్షణాలు వారి ప్రవర్తనలలో కనిపిస్తాయి. ఈ కారణం వల్లనే ఆహార సేకరణలోను, వినియోగంలోనే కొన్ని స్పష్టమైన విధానాలు ఉంటాయి. కానీ వీటి తీరుతెన్నులలో దేశకా పరిస్థితులననుసరించి కొన్ని మార్పులు చోటుచేసుకోవడం కూడా జరుగుతూ ఉంటుంది. ఒక సమాజంగా మనగలగడానికి అన్ని మానవ సమాజాలు ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవలసి వస్తుంది. అయితే ఎవరికి సంతానం ఉండాలి, ఎంతమంది ఉండాలి, ఎలాంటి పరిస్థితులలో ఉండాలి అనే వాటికి సంబంధించిన నియమనిబంధనలు ఒక సంస్కృతికి మరో సంస్కృతికి మారుతూ ఉండవచ్చు.

సాంస్కృతిక భిన్నత్వానికి కారణభూతమైన అంశాలు: 1. జాతి, 2. వాతావరణం, భౌగోళిక కారణాలు. కొందరు రచయితులు సాంస్కృతిక భిన్నత్వాన్ని జాతి విభేదాల ఆధారంగా గుర్తిస్తే మరికొందరు భౌగోళిక, వాతావరణాలలోని వైవిధ్యం ఆధారంగా నిర్ధారించారు.

## 26.4.1 జాతి - సంస్కృతి

జాతి లక్షణాల ఆధారంగా సంస్కృతిలోని వైవిధ్యాన్ని, భిన్నత్వాన్ని నిర్ధారించేవారు భౌతిక లక్షణాలైన తల ఆకారం, కేశాల రంగు, కళ్ళు, చర్మంరంగు, ఎత్తు, శరీర నిర్మాణం మదలైన వాటికీ మనుషుల ప్రవర్తన తీరుకు నిర్దిష్టమైన సంబంధం ఉంటుందని, వారి సంస్కృతి లక్షణాలు స్పష్టంగా, భిన్నమైనవిగా ఉంటాయని భావిస్తారు. ఈ దృక్పథాన్ని అనుసరించి ఆస్ట్రలాయిడ్‌లు(australoids), మంగోలాయిడ్‌లు(mongoloids), కాకేసియన్‌లు (caucasions), నీగ్రోలు(negroids) జాతుల వారి సంస్కృతు వేరువేరుగా ఉంటాయని, ఈ విభేదాలు వారి సంస్కృతుల భిన్నత్వానికి కారణమని పేర్కొంటారు. దీనినిబట్టి చూస్తే సంస్కృతి స్వరూప స్వభావాలు జాతిని బట్టి మారుతూ ఉంటాయని స్పష్టమవుతుంది.

కానీఈ అభిప్రాయం అనేక కారణాల వల్ల అంగీకార యోగ్యం కాదు. జవిక అంశాల దృష్ట్యా చూస్తే వివిధ జాతులకు చెందిన మానవులందరూ ఒకే కాండం నుంచి జన్మించినవారే. 1. జాతికి చెందిన సమస్యలను అధ్యయనం చేయడానికి ఏర్పరచిన నిపుణుల సంఘం ఈ వాదాన్ని బలపరుస్తుంది. 2. మనుషులు, పూర్వీకులలో కలగలుపుగా ఉన్న జాతిలక్షణాలు ఉంటాయి. అందువల్ల సమాజ శాస్త్రాలకు సంబంధించి జాతి భావన విశ్వసనీయత సందేహాస్పదమవుతుంది. 3. ఒక వ్యక్తి అలవరుచుకొనే సంస్కృతి విషయంలో వంశపారంపర్యత(heredity) అసంగతమని ఈ శాస్త్ర రంగంలో జరిగిన అనేక అధ్యయనాలు ధృవపరుస్తున్నాయి. 4. విభిన్న భౌతిక లక్షణాలున్నవారి విషయంలో కూడా సంస్కృతి విషయంలో ఎంతో సామ్యముంటుందనడానికి గట్టి సాక్ష్యాధారాలు లభ్యమవుతున్నాయి. భిన్న భౌతిక లక్షణాలున్న వారిలో సాంస్కృతిక సాదృశ్యాలుండటం, జాతి లక్షనాలలో ఏమార్పులూ లేకున్నా సంస్కృతిలో మార్పులు ఏర్పడవచ్చు అనే వాస్తవాన్ని రుజువు చేయడానికి బలమైన సాక్ష్యాలు లభ్యమవుతున్నాయి.

## 26.4.2 వాతావరణ, భౌగోళిక కారకాలు - సంస్కృతి

ఒక ప్రాంతంలో పరిసరాలు అందించే వస్తువులలో వైవిధ్యాలు,ఆప్రాంతం భూమి, వాతావరణాలకు అక్కడి మనుషులపై ఉండే ప్రభావం అనేవి సాంస్కృతిక భిన్నత్వాన్ని వివరించడానికి తోడ్పడుతుంది. భౌతిక పార్యవరణ ప్రభావం, గంట గంటకు, రోజు రోజుకూ, రుతువులను బట్టి మారుతున్నా మానవునిపై వాటి ప్రభావం ఎంతో ఉంటుందన్న వాస్తవం తిరుగలేనిది. శీతాకాలం అతిశీతల వాతావరణ పరిస్థితుల్లో వస్త్రాల అవసరం ఎక్కువగా ఉండటం, వెచ్చటి గృహవాతావరణ అవసరం ఎంతైనా ఉంటుంది. ఈ సౌకర్యాలు కల్పించే ఇళ్లుకట్టుకోవడానికి అక్కడి మనుషులు స్థానికంగా లభించే సామగ్రితోనే కట్టుకోవడం జరుగుతుంది. కొన్ని ప్రాంతాలలో మట్టితోను, కొన్ని చోట్లు రాతితోను, మరికొన్ని ప్రదేశాలలో కలపతోను ఇళ్లు కట్టుకొంటారు. అట్లాగే సారవంతమైన నేలలు, చాలినంత వర్షపాతం ఉన్న ప్రదేశాలలో పరిస్థితుల సామాజికి ప్రభావాలకు సారవంతం కాని నేలలు, వర్షపాతం లేని ప్రాంతాలు, పెనుగాలులు వీచే ఎడారులు, ఉష్ణ మండలాలలో ఉన్న సామాజిక పరిస్థితులకు తేడా ఉంటుంది.

పైన తెలిపిన రుతు ప్రభావాలు - వాతావరణం, నీటి సరఫరా, నేలల రకం అనేవాటి ప్రభావం తప్పనిసరిగా నిర్దిష్టంగా ఉంటుంది. ఇలాంటి పార్యావరణ పరిస్థితుల్లో మానవుని ఆలోచన, ఆచరణలపై భౌగోళిక పరిస్థితుల ప్రభావానికి సంబంధించి జనామోదం పొందిన ఒక్కొక్కప్పుడు భ్రమ పూరితమైన జానపదరీతులు, కుహానశాస్త్ర సిద్ధాంతాలు వెలువడ్డాయి. ఉదాహరణకు, ఉష్ణమండలంలో నివసించే లాటిన్‌లలో వేడిరక్తం ఉంటుందని, ఊరికే కోపం కలుగుతుందని, లైంగిక వాంఛ అధికమని, జనం వాదోపవాదాలు చేసుకోవడం తెలిసిందే. దీనికి భిన్నంగా చలిప్రాంతాలలో ఉంటున్న ఫిన్‌లు, స్వీడ్‌లు, మందబుద్ధులు, చురుకుదనం లేనివారు అయి ఉంటారనే వాదం ఉంది.

అయితే జాతి సిద్ధాంతాన్ని అవాస్తవమని రుజువు చేయడానికి ఉపయోగించిన ఆధారాలతోనే సంస్కృతిపై వాతావరణం, భౌగోళిక ప్రభావాల నిర్ణాయకతను కూడా అవాస్తవమని నిరూపించడం జరిగింది. భిన్న వాతావరణ భౌగోళిక పరిస్థితిలో ఒకే రకమైన సంస్కృతి ఉండవచ్చు. ఐరోపా జీవన విధానాలనే ఆ ఖండం వెలుపలి దేశాలు, అమెరికా దేశాలు అనుసరిస్తుండాన్ని ఈ సందర్భంలో ఉదాహరణగా పేర్కొనవచ్చు. ప్రపంచంలో పెద్ద పెద్ద నగరవాసుల జీవనశైలి స్థూలంగా ఏకరూపతగలదనే చెప్పవచ్చు. అట్లాగే ఒకేరకమైన వాతావరణ పరిస్థితుల్లోని జీవన విధానం భిన్నంగా ఉండటాన్ని కూడా గమనించవచ్చు. ఇందుకు భారతదేశం చక్కని దృష్టాంతం. దేశం ఒక్కటే అయినా దేశంలోని వివిధ ప్రాంతాలలో వైవిధ్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

అయితే వాతావరణం భౌగోళిక పరిస్థితులకు సంస్కృతిపై ప్రభావం అసలుండదనడానికి వీలులేదు. పైన జరిపిన చర్చను బట్టిచూస్తే పైరెండింటి ప్రభావం సంపూర్ణ నిర్ధారకమైనది కాదనే విషయం స్పష్టమవుతుంది. అయితే వాతావరణం భౌగోళిక పరిస్థితులను ఒక సమస్యగా పరిగణించి ఆయా పరిస్థితులలో అక్కడి ప్రజలు ఎలా తమ జీవితాన్ని గడుపుకుంటారో ఆపరిస్థితులను ఎదుర్కొవడానికి వారు ఎలాంటి చర్యలు తీసుకుంటారో పరిశీలించాల్సి ఉంటుంది. అతి ఊష్ణ మండలంలోని జనం పగలంతా ఇళ్లు కదలకుండా నిద్రపోవడం ఆప్రాంతాలలోని కొందరు విద్యుత్ పంకాలను ఉపయోగించి మరికొందరు ఏయిర్ కూలర్‌లను వాడి వేడిని పారద్రోలగలుగుతుంటారు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న జనం జీవితాలపై పరిస్థితుల ప్రభావం ఉండటం తథ్యం. ఇది వారి జీవితాలలో ప్రముఖ విధానంగా రూపొందడం అనివార్యం.

BRAOU

## 26.5 సాంస్కృతిక మార్పు

కింగ్‌స్లే డేవిస్ దృష్టిలో సాంస్కృతిక మార్పు అంటే "సంస్కృతికి చెందిన అన్ని శాఖలలో - కళలు, శాస్త్రం, టెక్నాలజీ, తత్వ చింతన మొదలైనవి - ను, సామాజిక వ్యవస్థ తాలూకు అన్ని రూపాలు, నియమనిబంధనలలోనూ కలిగే మార్పులు". డేవిడ్ డ్రెస్లర్, డోనాల్డ్‌కార్న్స్ అభిప్రాయాలలో "సాంస్కృతిక మార్పు అంటే గత కాలంనుంచి వస్తున్న కాలపరీక్షకు నిలువగలిగిన విధానాలను సవరించడం, లేదా వాటి ఆచరణకు స్వస్తి చెప్పడం, వాటి స్థానంలో కొత్త విధానాలను, ఆచరణ పద్ధతులను ప్రవేశపెట్టడం".

క్లుప్తంగా చెప్పాలంటే సంస్కృతిక రంగంలో జరిగే ఏమార్పునైనా సాంస్కృతిక మార్పు అనవచ్చు. సంస్కృతి అనేది స్థబ్ధమైంది కాక చలనశీలత గలది. సంస్కృతికూడా మార్పులకు గురి అవుతుంది. ఉదాహరణకు ఆటోమొబైల్స్ కనిపెట్టడం, సాంకేతికత ఆస్థికి సంబంధించిన భావనలలో మార్పు, నైతికత విషయంలో భావ పరివర్తన, సంగీతంలో నూతన పోకడలు, కళలు, నృత్యం, వాస్తు శిల్పరీతులు, నూతన వ్యాకరణ సూత్రాలు, స్త్రీ పురుషుల మధ్య సమానత్వం ఉండాలనే భావం మొదలైనవన్నీ సాంస్కృతిక మార్పులకు నిదర్శనాలు. దాదాపు అన్ని ముఖ్యమైన మార్పులు సామాజిక, సాంస్కృతిక, భౌతిక, అభౌతిక రంగాలకు వర్తిస్తాయి.

అన్ని సంస్కృతులు మార్పులకు లోనవుతాయి. కాకపోతే వాటిలో కలిగే మార్పుల స్వభావం, మారే వేగంలో తేడాలుండవచ్చు. సంస్కృతి సాధారణంగా సంప్రదాయ బద్ధమైంది - ముఖ్యంగా అభౌతిక లక్షణా - అంటారు. ఉదాహరణకు, ప్రజలెంతో కాలం నుంచి అనుసరిస్తూ, గౌరవిస్తూ వస్తున్న విలువలను విడనాడడానికి సుముఖంగా ఉండరు. తరతరాలనుంచి వస్తున్న ఆచారాలు, విశ్వాసాలను వదిలి నూతన ఆచారాలను అనుసరించడానికి,

నూతన విశ్వాసాలను స్వీకరించడానికి ఇష్టపడరు. ఒక సాంస్కృతిక అశంలో వచ్చిన మార్పుల ప్రభావం ఇతర అంశాలకు వ్యాపించడంగానీ, మొత్తం సంస్కృతిలోనే మార్పులు రావడంగానీ జరుగుతుంది. ఇలా జరుగడానికి కారణం సంస్కృతి అనేది సుసంగటిత మైనదికావడమే ఒక మార్పు మారో మార్పుకు దారితీయవచ్చు. కొన్ని మౌలికమైన మార్పులు - ఉదాహరణకు ఒక సమాజం జీవనానికి అవసరమైన ఆదాయాన్ని ఏవిధంగా ఆర్జిస్తుంది, ఆర్థిక కార్యకలాపాలను ఏవిధంగా నిర్వహిస్తుంది, ప్రకృతినుంచి తనకు అవసరమైన వాటిని ఎలా సంపాదించడానికి ప్రయత్నిస్తుంది అన్న అంశాలు సంస్కృతిలోని అన్ని ఇతర అంశాలను ప్రభావితం చేస్తాయి.

## 26.6 సాంస్కృతిక మార్పుకు కారణాలు

సాంస్కృతిక మార్పులకున్న కారణాలను గురించి డేవిడ్ డ్రెస్‌లర్, డోనాల్డ్ కార్న్‌లు ఈవిధంగా అన్నారు: 1. ఒక సమాజంలోని సభ్యులు తాము అనుసరించడానికి సంసిద్ధులుగా ఉన్న ఆచారాలకు భిన్నమైన ఆచారాలు ఎదురవుతూ ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో కొత్త ఆచారాలను స్వీకరిస్తూ, పాతవాటిని నిరాకరిస్తూ ఉండటం లేదా సవరించిన రూపంలో స్వీకరించడం జరుగుతూ ఉంటుంది. దాన్ని సాంస్కృతిక ఎంపిక (cultural electicism) వాదం అనవచ్చు. 2. కొత్త ఆచారాలను, వ్యవహారాలను రెండు రకాల పద్ధతుల్లో అనుసరించడానికి సంసిద్ధులవుతూ ఉంటారు. (ఎ) నూతన ఆచారాలు సామాజికంగా అభిలషణీయమైనవి, ప్రయోజనకరమైనవి అయినపుడు, (బి) అవి ఇంతకు పూర్వం ఉన్న, ఈనాటి ప్రజల మన్నన పొందుతున్న వాటిలో సంఘర్షణ పడనివి అయినప్పుడు. 3. జనం నూతన ఆచార వ్యవహారాలు పాటించడానికి సిద్ధపడిని పరిస్థితుల్లోకూడా పూర్వ సంస్కృతిని సంపూర్ణంగా విడనాడడానికి ఇష్టపడరు. 4. సంస్కృతిలో వచ్చే మార్పులు సర్వసాధారణంగా పైనుంచి విధించినవే (superimposed) - ముఖ్యంగా సంస్కృతి సంపర్కము (cultural contact) జరిగే సమయంలో - అయి ఉంటాయి. 5. సంస్కృతిలో ఏర్పడే మార్పులు సర్వసాధారణంగా ప్రత్యమ్నాయమైనటువంటివి. 'మారిన సంస్కృతి' అనేది ఉండదు. ఉండేదల్లా 'మారుతున్న సంస్కృతి' మాత్రమే. 6. అన్ని సాంస్కృతిక మార్పులు సమాన ప్రాముఖ్యం గలవి కావు. మానవ మనుగడకు అవసరమని భావించిన కొన్నింటిని ప్రవేశపెట్టడం జరుగుతూ ఉంటుంది. మనుగడకు అంతగా అవసరం లేకపోయినా అలవర్చుకొన్న సామాజిక అవసరాలను తీర్చుకోవడానికి కొన్ని మార్పులను ఆమోదించడం జరుగుతూ ఉంటుంది. 7. కానీ, సాంస్కృతిక మార్పులు స్వయంగా "మనుగడకు అవసరమైన అవసరాలను" గానీ, అలవర్చుకొన్న అవసరాలకు గానీ సరిపోవు. ఉదాహరణకు శవసంస్కారంలోనూ కొత్త పద్ధతులు. 8. సంక్షోభం అనేది సంస్కృతిలో మార్పులు తేవడం, మార్పులను వేగవంతం చేయడం జరుగుతూ ఉండటం సాధారణంగా కనిపించే విషయం. సంక్షోభ సమయంలో అనుసరించడానికి అంగీకరించిన మార్పులు, తరువాతి కాలంలో కూడా కొనసాగుతాయి. ఉదాహరణకు రెండో ప్రపంచయుద్ధ సమయంలో రక్షణదళాలలో మహిళలకు స్థానం కల్పించడం జరిగింది. ఈ ధోరణి ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. 9. సంస్కృతిక మార్పుకు సంచిత ప్రభావం ఉంటుంది. ఇందులో చేరేది ఎంతో ఉంటుంది. అయితే సంస్కృతిలోనుంచి తొలగించేది మాత్రం కొంతే ఉంటుంది. సంస్కృతి వికాసాన్ని ఒక చెట్టు పెరుగుదలతో పోల్చవచ్చు. చెట్టు పెరుగుదల నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుంది. కాకపోతే కాలగమనంలో ఆకులు కోల్పోవడం, కొన్ని సమయాల్లో కొమ్మలు కోల్పోవడం జరుగవచ్చు. 10. సాంస్కృతిక మార్పు గొలుసుకట్టు ప్రతిచర్యకు దారితీయవచ్చు. సంస్కృతిలో ఒక మార్పును చేర్చి దాన్ని సామాజిక అవసరంగా నిర్వచించినప్పుడు నూతన అవసరాలు తలెత్తుతాయి. అవి నూతన పోలికలను సృష్టిస్తాయి. వాటిని తీర్చడానికి పాతవాటికి అధనంగా మరిన్ని మార్పులు అవసరమవుతాయి.

## 26.7 సాంస్కృతిక విలంబన భావన

ఆగ్బర్న్ తన గ్రంథం 'social change'లో మొట్టమొదటి సారిగా 'సాంస్కృతిక విలంబన' భావనను ప్రవేశపెట్టాడు. ఈసిద్ధాం ప్రకారం ఏ సమాజ సంస్కృతిలోనైనా పరస్పర సంబంధంగల అంశాల ప్రతిరూపం (pattern of integrated elements) ఉంటుంది. సంస్కృతికి సంబంధించిన అన్ని అంశాలుఒకే రేటులో, ఏకకాలం మారుతున్నట్టు మనకు కనిపించదు. అందువల్ల ఒక భాగంలోకలిగే మార్పులు సంబంధిత భాగాలలో కొంత సంచలనానికి, ఒత్తిడులకు కారణమవుతూ ఉంటాయి. సంస్కృతిలో సామరస్యాన్ని కాపాడడానికి చివరికి వివిధ భాగాల మధ్య సర్దుబాటు చేయడం అనివార్యమవుతుంది. అయితే ఈ సర్దుబాటు చేయడానికి కాలవ్యవధి

అవసరమవుతుంది. ఈ కాలవ్యవధినే కాలవిలంబన అంటారు.

ఆధునిక సమాజాలలో సాంకేతిక రంగంలోని మార్పులే మార్పుల వేగాన్ని నిర్ణయిస్తాయి. ఆగ్బర్న్ అభిప్రాయంలో "మన సంస్కృతి యొక్క భౌతిక లక్షణాలలో శీఘ్రపరిణామాలకు సాంకేతిక మార్పులే ప్రధాన కారణమవుతాయి. అయితే అభౌతిక అంశాలు జరుగుతున్న మార్పులకు అనుగుణంగా మారవు. లేదా దీర్ఘకాలం తరువాతగానీ అందులో మార్పులు రావు. దాని ఫలితంగా అవేచిక్కు సమస్యలు సమాజంలో తలెత్తుతాయి". ఉదాహరణకు మన రవాణ రహదారులను అవసరమైనంత వెడెల్పు చేయడానికి ఎంతో ముందుగానే ఆటోమొబైల్స్ ప్రవేశించాయి. ఆటోమొబైల్స్ ప్రవేశించడానికి ముందు ఆరహదారులు కేవలం గుర్రపు బగ్గీలు నడపడానికి, ఎడ్లబండ్లు పోవడానికి మాత్రమే అనుకూలంగా ఉండేవి. ఇలాంటి సందర్భాలలో రోడ్డుప్రమాదాలు నివారించడానికి ట్రాఫిక్ నియమాలు ప్రవేశపెడితే వాటిని సక్రమంగా అమలు చేయడం కష్టమవుతుంది. అంటే భౌతిక సంస్కృతి అంశాలకు, అభౌతిక సంస్కృతి అంశాలకు మధ్య ఎంతో అంతరం ఉందన్నమాట. ఇక్కడ ఆటో మొబైల్స్‌ను భౌతిక సంస్కృతికి చిహ్నంగానూ, వెడెల్పాటి రోడ్లు, ట్రాఫిక్ నిబంధనలను అభౌతిక అంశాలుగానూ పరిగణించడం జరుగుతుందన్నమాట. అట్లాగే మానవుని వివేకం మారణాయుధాలు తయారుచేయగల శక్తికంటే వెనుకబడి ఉందని మనం అంటున్నప్పుడు ఒక రకమైన సాంస్కృతిక విలంబన గురించే ప్రస్తావిస్తున్నాము. ఈనాటి అణుయుగంలో ఇలాంటి విలంబన నానాటికీ పెరుగుతూ పోతూ ఉంటుంది.

పైన పేర్కొన్న అన్ని ఉదాహరణలు సాంకేతిక నవకల్పనలు, సామాజిక నవకల్పనల కంటే వేగంగా జరుగుతున్నప్పుడు సాంస్కృతిక విలంబన ఏర్పడడం అనివార్యమనే వాస్తవాన్ని సూచిస్తాయి. అయితే సాంస్కృతిక మార్పులకు దారితీసేది సామాజిక మార్పులే - అటు రాజకీయమైనది గానీ, ఇటు సామాజిక - మానసికమైనదిగానీ అయి ఉంటుంది. ఒక దేశం పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్య వ్యవస్థద్వారా రాజకీయ కార్యకలాపాలు సాగించాలని నిర్ణయించవచ్చు. అయితే ప్రారంభంలో ఈ రకమైన ప్రభుత్వం అంత ప్రభావశీలి అయింది కాకపోవచ్చు. కారణం, ఆ వ్యవస్థలోని ప్రజలు తమ ఆలోచన శక్తిని, దృష్టికోణాలను, స్వభావలక్షణాలను అభివృద్ధి చేసుకొని ఉండకపోవచ్చు. ఇలాంటి అభివృద్ధి ఈ యంత్రాంగం విజయవంతంగా పనిచేయడానికి ఎంతో అవసరం. ఆఫ్రికా, ఆసియా ఖండాలలో కొత్తగా స్వతంత్ర దేశాలుగా అవతరించిన వాటిలో మొదట్లో ప్రజాస్వామ్య వ్యవస్థలు కొంత అపజయాన్ని చవిచూశాయి. ఈ పరిస్థితికి కారణం పైన పేర్కొన మార్పులలోని అంతరమే అన్నది స్పష్టం.

BRAOU

### 26.7.1 విలంబన విమర్శ

కొందరు సమాజ శాస్త్రవేత్తలు సాంస్కృతిక విలంబన భావనను వ్యతిరేకించారు.

1. ముందు సంస్కృతి తాలుకు భౌతిక అంశాలలో మార్పులు కలిగిన తరువాతే అభౌతికాంశాలలో మార్పులు వస్తాయి అనేది సరికాదు అనే విమర్శ ఒకటుంది. ఈ రెండు సాంస్కృతికాంశాల మధ్య నిరంతరం పరస్పర చర్య జరుగుతూనే ఉంటుంది. చివరికి సాంకేతిక పురోగమనం చాలామట్టుకు కొన్ని అభౌతికాంశాలపై ఆధారపడి ఉంటుంది - సామాజిక దృక్పథం వంటిది. ఉదాహరణకు అన్ని సాంస్కృతిక భౌతిక అంశాలు మానవుని మస్తిష్కంలోనేరూపుదాలుస్తాయి. వాటిని ఆచరణలో పెట్టడం, వాటి ప్రయోజనం అనేవి సామాజిక, సాంస్కృతిక వాతావరణంలోనే సాధ్యమవుతుంది. జీవన ప్రమాణాన్ని మెరుగుపరచుకోవాలనే భావనను ముందు ప్రజల మనస్సుల్లో నాటుకొనేటట్లు చేయాలి. ఇది ప్రజలు సాంకేతిక పద్ధతిని, పారిశ్రామిక జీవన విధానాన్ని స్వీకరించడానికి ముందే జరగాల్సి ఉంటుంది. భౌతిక వస్తు సముదాయం ఉత్పత్తిలో శీఘ్రపురోగతి సాధించిన ఈనాటి సమాజంలో కూడా ఈ పరిణామం గతకాలంటి మానవ మేధస్సులో ఆలోచనల్లో ఇతర అభౌతికాంశాలలో కలిగిన మార్పుల ప్రత్యక్ష ఫలితమేనన్న వాస్తవాన్ని మరిచిపోకూడదు.

2. మార్పులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోవడం అనేది ఏది అభిలషణీయమైన సర్దుబాటు అని నిర్ణయించడం కష్టం అన్నది మరో విమర్శ. ఇంతకు ముందు చర్చించిన ఉదాహరణనే తీసుకొందాం. రవాణాకు సంబంధించిన, సాధించిన సాంకేతిక పురోగతి కాలం, దేశాల మధ్య దూరాలను అధిగమించగలిగేట్లు చేసింది. దీని

BRAOU

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజికశాస్త్రాల విభాగం

### సమాజశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేట్ కార్యక్రమం

### కోర్సు- I : సామాజశాస్త్ర సూత్రాలు

## మాదిరి పరీక్షా పత్రం

సమయం : 3 గంటలు

గరిష్ఠ మార్కులు: 70

భాగం-ఎ 10×4=40

సూచన: ఈ క్రిందివాటిలో ఏవేని నాలుగు ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబు రాయండి.

1 సమాజశాస్త్రం అంటే ఏమిటి. ఈ శాస్త్ర స్వభావాన్ని, పరిధిని వివరించండి.

2 సమాజాన్ని నిర్వచించి సమాజ ఆవిర్భావ సిద్ధాంతాలను వివరించండి.

3 సముదాయం అంటే ఏమిటి? సముదాయక చరిత్ర గురించి క్లుప్తంగా రాయండి.

4 సంస్కృతిని నిర్వచించి దాని లక్షణాలను చర్చించండి.

5 ఆత్మభావన అంటే ఏమిటి? సాంఘికీకరణలో ఆత్మభావన ప్రభావం ఎట్టిది.

6 బందుత్వ పరిభాషకు సంబంధించిన వర్గీకరణను వివరింపుము.

7 మతం ఆవిర్భావానికి సంబంధించిన సిద్ధాంతాల గురించి క్లుప్తంగా చర్చించండి.

8 సామాజిక పరివర్తనకున్న భౌగోళిక కారకాలను వివరించండి.

B R A O U

భాగం -బి 6×5=30

సూచన: ఈ క్రింది ఏవేని ఐదు ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబు రాయండి.

9 సమాజశాస్త్రం ఆవిర్భావానికి పారిశ్రామిక విప్లవం ఏవిధంగా దోహదం చేసింది.

10 "సమాజశాస్త్రం, మానవశాస్త్రం కవలపిల్లల వంటివి" వివరించండి.

11 ప్రాథమిక, గౌణ సమూహాలకు గల తేడాలను వివరించండి.

12 గెమైన్‌షాఫ్ట్, గెసెల్‌షాఫ్ట్ లక్షణాలను తెలుపండి.

13 సంస్కృతి అంటే ఏమిటి.

14 అనువంశికత లక్షణాలను గురించి రాయండి.

15 మూర్తిమత్వం అంటే ఏమిటో వివరించండి.

16 సర్దుబాటు రూపాలను వివరించండి.

17 సామాజిక మార్పు లక్షణాలను వివరించండి.

18 సాంస్కృతిక విలంభన అంటే ఏమిటి.

BRAOU

# రచయితల వివరాలు

## సంపాదకులు

ప్రొ॥ వై.సి. సింహాద్రి : వైస్ ఛాన్సలర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖ పట్నం.

ప్రొ॥ జి. సత్యనారాయణ : సమాజశాస్త్ర శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

## సహ సంపాదకుడు

డా॥ ఘంటా చక్రపాణి : సమాజశాస్త్ర శాఖ
డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, జూబిలీ హిల్స్, హైదరాబాద్.

## రచయితలు

ప్రొ॥ ఎస్. భాస్కర్ : సమాజశాస్త్ర శాస్త్ర
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ప్రొ॥ పి. కమలారావు : సమాజశాస్త్ర శాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

డా॥ సి. గణేష్ : సమాజశాస్త్ర శాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

డా॥ పుష్పామేరి రాణి : సమాజశాస్త్ర శాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

డా॥ టి.శ్రీనివాస్ : సమాజశాస్త్ర శాస్త్ర,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ఎ. ఉషా : సమాజశాస్త్ర పరిశోధకులు మరియు అకాడమిక్ కౌన్సిలర్
డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

BRAOU

BRAOU

BRAOU

BRAOU